సమగ్ర ఆంధ్ర సాహిత్యం

మూడవ సంపుటి



ఆరుద్ర

తెలుగు అకాడమి

తెలుగు అకాడమి ప్రచురణ - 32
సంప్రదింపు గ్రంథావళి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

మూడవ సంపుటి

రచన
ఆరుద్ర

తెలుగు అకాడమి
హైదరాబాదు

***samagra aandhra saahityam,* muuDava sampuTi; Author :** Arudra;
Reprint : 2012 pp. xxii + 658 + iv.

First Edition : 2004
Reprint :2012
Copies : 1000

Published by TELUGU AKADEMI, Hyderabad- 500 029 (Andhra Pradesh) under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Goverment of India in the Ministry of Human Resource Development, New Delhi.

Price : Rs. 200=00

Printed in India
Laser Typeset at Sri Maruthy Laser Printers, Chennai - 600 014
Printed at M/s. Abhyudaya Printers, Hyderabad
Andhra Pradesh.

భూమిక

1968లో తెలుగు అకాడమి స్థాపన జరిగిన నాటి నుంచీ ఉన్నత స్థాయిలో బోధనభాషగా తెలుగు స్థిరపడటానికి అకాడమి నిర్వహిస్తున్న కృషి అందరికీ తెలిసిన విషయమే. తెలుగు అకాడమి ఇంటర్మీడియట్ స్థాయి నుంచి స్నాతకోత్తర స్థాయివరకు పాఠ్యపఠనీయ గ్రంథాలను, అనువాద, సంప్రదింపు గ్రంథాలను, శాస్త్ర నిఘంటువులను, జనరంజక గ్రంథాలను, మోనోగ్రాఫ్‌లను, వృత్తివిద్యాకోర్సులకు సంబంధించిన గ్రంథాలను ప్రచురిస్తున్నది. అంతేకాకుండా తెలుగు అకాడమి ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగు మాధ్యమంలోనేగాక ఆంగ్ల మాధ్యమంలో కూడా పాఠ్యగ్రంథాలను ప్రచురించి విద్యారంగానికి సముచితమైన సేవ చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రముక సాహితీవేత్త ఆచార్య ఆరుద్ర రచించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యం గ్రంథం సర్వహక్కులను, ప్రచురణ బాధ్యతను తెలుగు అకాడమికి అప్పగించడంతో ఆ గ్రంథ ప్రచురణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

గతంలో 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' 13 సంపుటాలుగా వెలువడి సాహిత్యాభిమానుల ఆదరణ పొందింది. దీనిలో ఆరుద్రగారు జీవించి ఉండగానే, వారే పలు మార్పులూ, చేర్పులూ చేసుకున్నారు. ఆ సవరణలన్నింటినీ పొందుపరచి, దీనిని మళ్ళీ 4 సంపుటాలుగా తెలుగు అకాడమి ప్రచురించింది. ఆ నాలుగు భాగాలలో ఇది మూడోది. గతంలోలాగే ఈ గ్రంథం కూడా సాహిత్యాభిమానుల ఆదరణ పొందుతుందనడంలో సందేహం లేదు.

ఈ గ్రంథ ప్రచురణకు సహకరించిన శ్రీమతి రామలక్ష్మి ఆరుద్రగారికి కృతజ్ఞతలు. ఈ గ్రంథం సాహిత్యాన్ని అధ్యయనం చేసే విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు, సాహిత్యాభిమానులకు, విమర్శకులకు, అత్యంత ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నాం.

ఆచార్య కె. యాదగిరి
సంచాలకులు

మనవి మాటలు

సాహిత్యాభిలాష గల సాధారణ పాఠకులు ఆంధ్ర సాహిత్యం గురించి సంపూర్ణంగా తెలుసుకోవాలనుకుంటే, వాళ్ళకు ఉపయోగించే పుస్తకాలు నేడు అందుబాటులో లేవు. నన్నయభట్టునుండి చిన్నయసూరిదాకా మాత్రమేకాక సాతవాహనుల కాలం నుండీ సాహితీ సమితి దాకా ఆంధ్ర సాహిత్యం అనేక విధాలుగా, బహుముఖాలుగా సాగింది. ప్రజ్ఞావంతులైన తెలుగుకవులు రచించిన గ్రంథాలు అన్నీ అచ్చుపడి వెలుగు చూడలేదు. అచ్చయిన పుస్తకాలు కూడా అన్నీ అందరికీ లభించడంలేదు. లభించిన పుస్తకాలైనా అన్నీ సాధారణ పాఠకులకు బోధపడే వివరణలతో లేవు. ఈకొరతను తొలగించవలసిన బాధ్యత నేటి సాహితీపరులపై వుంది.

పన్నెండు సంపుటాలలో సమగ్ర ఆంధ్ర సాహిత్యం ప్రజానీకానికి పరిచయం చేద్దామనే సంకల్పం కొన్నేళ్ళ కిందట నాకు కలిగింది.

సమగ్రత ఆశయం. దీన్ని సాధించడానికి ఇది ప్రయత్నం. పూజ్యులు కందుకూరి వీరేశలింగంగారు ప్రామాణిక సాహిత్యరచనకు పునాదులు వేశారు. శ్రీయుతులు మానవల్లి రామకృష్ణకవిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, చిలుకూరి వీరభద్రరావుగారు, కొమర్రాజు లక్ష్మణరావుగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు మొదలైన మహనీయులు సాహిత్యంతోపాటు దేశ చరిత్రను కూడా విశదం చేశారు. సురవరం ప్రతాపరెడ్డిగారు మన సాంఘిక చరిత్రకు శ్రీకారం చుట్టి కొత్త కోణాలను చూపెట్టారు. వీరి రచనలను ఆధారం చేసుకొని తమ ప్రతిభతో కొత్త ఆకరాలను గుర్తించి, నూతన సిద్ధాంతాలను ప్రతిపాదించి సాహిత్య చరిత్రను అనేకమంది విద్వాంసులు, విమర్శకులు, విఖ్యాత పత్రికలలో, వివిధ గ్రంథాలలో వివరిస్తున్నారు. ఈ అమూల్య రచనలన్నింటిని నా దృక్పథంతో సమన్వయం చేయడానికి ఈ రచనలో యత్నించాను.

ఒక భాష మాట్లాడే ప్రజల దేశ చరిత్ర, సాంఘిక చరిత్ర, సాహిత్య చరిత్ర ఒకదానితో ఒకటి పెనవేసుకొని వుంటాయి. రాజకీయాలవల్ల వివిధ రంగాలలో పరిణామాలు ఏర్పడుతూ వుంటాయి. విభిన్న సంఘటనలే జరిగినా అవి ఒక చారిత్రక క్రమంలోనే వుంటాయి. రాజకీయ ప్రభావాలకు లోనుకాని యుగం వుండదు. రాజవంశాల పేరుమీదుగా యుగాలను పేర్కొనడం రివాజే.

సాంఘిక చరిత్రకు పనికివచ్చే సాహిత్య గ్రంథాలనే ఎన్నుకొనడంవల్ల సురవరం ప్రతాపరెడ్డిగారి యుగవిభజన వారి ప్రయోజనాలకు అనుకూలమైంది. సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో విస్తీర్ణతను దృష్టిలో పెట్టుకొని నేను యుగాల అంకెను, ఆయా రాజవంశాల ప్రాముఖ్యాలను బట్టి పెంచవలసి వచ్చింది. ఆదిలో నేను వేసుకొన్న ప్రణాళికలో యుగవిభజన చేసుకొన్నాను. కాని పుస్తక ప్రచురణను ప్రారంభించడానికి ముందే ప్రతిసంపుటిలో పుటల పరిమితిని, సంపుటాల సంఖ్యను, ఒక్కొక్క సంపుటం వెలనూ, పన్నెండు సంపుటాలకు మొత్తం పూర్తిగా ముందే చెల్లించే పక్షంలో సెట్టువెల, అందువల్ల

లభించే లాభసాటి సదుపాయాలూ ప్రకాశకులు ప్రకటించారు. ఎందరో ఈ ప్రణాళికకు స్వాగతం చెప్పారు. చందాదారులుగా చేరారు.

1965 జనవరి నెలనుండి ఈ సంపుటాల రచనకు ఉపక్రమించాను. ప్రతి సంపుటిలోని పుటల పరిమితి ముందుగానే నిర్ణయం కావడంవల్ల ప్రతి ప్రకరణలో తెలిసిన ఏ ఒక్కటీ వదిలిపెట్టకుండా విరివిగానే రాసినా చివరకు కుదించడం తప్పనిసరి అయింది. సమగ్రత దెబ్బతినకూడదని సంపుటాల సంఖ్యను పెంచి అదనపు యుగాలనూ, ఉపయుగాలను చేర్చవలసి వచ్చింది. ప్రచురణకు ముందే ప్రజలకిచ్చిన వాగ్దానానికి భంగం లేకుండా పన్నెండు సంపుటాలనూ వరుసగా ప్రచురించడం జరిగింది.

1965 ఏప్రియల్ నెల నుండి నవంబరు నెల దాకా ఎనిమిది నెలలు క్రమం తప్పకుండా ఆసాంతం రచనచేసి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' సంపుటాలను అచ్చుకివ్వడంలో నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. టెన్షన్‌వల్ల రావలసిన అన్ని రుగ్మతలూ వచ్చాయి. అయినా ప్రజలకు ప్రకాశకులతోపాటు వాగ్దానం చేసినది పన్నెండు సంపుటాలు కనుక ఆ సంఖ్యను పూర్తిచేయాలని నిశ్చయించాను. అది 1968 ఫిబ్రవరి నాటికిగాని పూర్తిచేయలేక పోయాను. ఈ పన్నెండు సంపుటాలు వెలువడుతున్నప్పుడు ఆసక్తితో చదివి, సహృదయంతో విమర్శించి, ప్రోత్సహించిన వాళ్ళెందరో ఉన్నారు. చెల్లాచెదురుగా ఉన్న ఆకారాలను ఒక్కచేత్తో క్రోడీకరించి విశ్లేషణ చేస్తున్నప్పుడు రచనలో తప్పులు దొర్లడం తప్పదు. వీటికి తోడు సాపు వ్రాస్తున్నప్పుడో, ప్రూపు దిద్దుతున్నప్పుడో మరికొన్ని పొరపాట్లు చేరుకున్నాయి. నా అంతట నేను గుర్తించిన తప్పులతోబాటు విమర్శకులు సూచించే లోపాలూ, కొందరి కోపాలూ రెండవ ముద్రణలో సర్దుకొంటానని అప్పుడే సవినయంగా విన్నవించుకొన్నాను. మొదటి ముద్రణ సంపుటాలన్నీ ఏనాడో చెల్లుబడి అయిపోయాయి. రెండవ ముద్రణకోసం ఎందరో ఎదురుచూస్తున్నారు. కొందరు ఒత్తిడి చేస్తున్నారు. గత సంవత్సరం నా రెండు కళ్ళ కేటరాక్టులకూ ఆపరేషన్ విజయవంతంగా జరగడంవల్ల గ్రంథ పఠనానికి, రచన కార్యక్రమానికి వీలు కలిగింది.

సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో కొరతగా మిగిలిపోయిన సంపుటాలను పూర్తిచేయడమేగాక, తొలి పన్నెండు సంపుటాలను కొత్త వైనాలు చేర్చి తిరగరాసి ప్రచురించాలని నిశ్చయించాను. 'ప్రజాశక్తి బుక్ హౌస్' వారు పునర్ముద్రణ ప్రచురణ ప్రారంభిస్తున్నారు. ఒక వ్యక్తి సమాజంలో ఏదైనా సాధించగలిగాడంటే దానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఎందరి సహాయ సహకారాలో ఉంటాయి. నా కృషిలో నాకు తోడ్పడిన వారందరికీ నా కృతజ్ఞతలు. ఈ పరమార్థాన్ని సాధింప చేస్తున్న నా ఉత్తమార్థం రామలక్ష్మికి నా అభినందనలు.

1988 సంక్రాంతి
మదరాసు - 600 017

ఆరుద్ర

సమగ్ర ఆంధ్ర సాహిత్యం - నా మాట

తెలుగు సాహిత్యం ప్రసక్తి వస్తూన్నన్ని రోజులు ఆరుద్ర జీవించి ఉంటాడు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం అతణ్ణి చిరంజీవిని చేసింది. దీనిలో అసత్యం లేదు. అతిశయోక్తి లేదు. అప్పట్లో ''తెలుగు సాహిత్యంపై విస్తృతంగా పరిశోధనచేస్తూన్న మీరు ధన్యజీవులు'' అన్నారు వావిళ్ల రామస్వామిశాస్త్రులుగారు 'ఈ సమగ్ర ఆంధ్ర సాహిత్యం ద్వారా చక్కని వాడుక భాష ఎలా రాయాలన్నది జాతికి తెలిపిన మొదటివాడు, సాహిత్య చరిత్ర ఆ భాషలో రాసి మెప్పించినవాడూ ఆరుద్రే'' అన్నారు మిత్రులు జి. కృష్ణ. ''మీ వ్యవహారిక భాష చాలా ఉత్సాహాన్ని కల్గిస్తూంది సామాన్యులకిది సుబోధకంగా, కుతూహలాన్ని రేకెత్తించేదిగా వుంది' అని మెచ్చారు ఎ.ఎస్.గుప్తగారు. 'మీ రచన విలక్షణంగా వుంది - సాహిత్య నిర్వచనాన్ని లక్ష్యంగా వుంచుకుంటూనే అనేకానేక నూతన అంశాలు సవిస్తరంగా హృద్యమమైన శైలిలో ప్రసక్తం కావడం - యీ రచనలోని విశేషాంశం. ఇంపుసొంపులతో ముద్దులు మూటకడుతూ, ఆంధ్ర ప్రజానీకాన్ని మురిపిస్తున్న మీ కృషి అజరామరమైనది'' అని సాహిత్యభూషణ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లుగారు భావించారు. ''మీరు అపూర్వమైన ఇన్ఫర్మేషన్ ఆంధ్ర సాహిత్యాన్ని గురించి సంపాదిస్తూ మాకానందం కలుగ చేస్తున్నారు'' అని అభిమానం ప్రకటించారు కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు. ''ఆరుద్రగారి గ్రంథ రచనా పద్ధతి - అతి రుచికరంగా వుండి, అక్కడక్కడి వారి చెణుకులు లెనిన్‌గ్రాడ్ మంచు సోనల్లా చనవులునెరపి చక్కలిగింతలు పెడుతాయి చదువరిని'' అని లెనిన్‌గ్రాడ్ నుంచి ఎస్.వి.జోగారావుగారు భావించారు. ''అవసరం అయిన చోట వివరణ అనవసరమైన చోట సవరణ సరసమైన తీర్పు, హృద్యమైన మార్పు, పఠితలను ఆసక్తి కల్గిస్తూంది అన్నది సత్యోక్తి'' అన్నారు శ్రీ కొమండూరి రామానుజాచార్యులుగారు. ''సామాన్య పాఠకులకు మొట్టమొదటిసారిగా సాహిత్య చరిత్రలో పరిచయం ఏర్పరచుకొనే అవకాశం కల్గించింది. ఎప్పుడైనా ఎక్కడైనా చదువుకుపోడానికి వీలైనది - మీ సజీవమైన భాష మీ అద్భుత రచనా చాతుర్యం!' ఎస్.వి.సూర్యనారాయణ అభిప్రాయపడ్డారు. ''వజ్రాలు ఏరడం, రాళ్లు ఏరడం కూడా మనకు ఉపయోగమే. ఆ రాలు ఏరినవాడు మనం కోరకుండానే వరాలు ఇచ్చినవారే.'' వేలూరి వారి ఉవాచ. ''ఈ సంపుటాలలో నువ్వు తెలుగు ప్రపంచంలో చిరంజీవివి అవుతున్నావు'' అంటూ దీవించారు తాపీవారు.

ఇలా ఎందరెందరో పెద్దలు, ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం మెచ్చారు. ఆరుద్ర భుజం తట్టారు. ''పూర్తిచేసిగాని ఆగకు'' అని హెచ్చరించారు. ఈ హెచ్చరికకు కారణం వుంది. ఇప్పటిదాకా ఎందరెందరో తెలుగు సాహిత్య చరిత్రను ప్రారంభించినా కొనసాగించిన దాఖలాల్లేవు. ఆరుద్ర ఈ సంపుటాలలో పోనుపోను ఆధునిక కాలపు యువతరానికి అందని, తెలియని - ఎన్నో విషయాలను అందించారనీ, ఈ రీత్యా పోనుపోను సంపుటాలు అపారమైన విలువను సంతరించుకున్నాయనీ - పెద్దలు భావించారు, భావిస్తున్నారు.

ఆరుద్ర చాలా పట్టుదల గల వ్యక్తి. కువిమర్శకుల ధోరణికి కృంగిపోయే **తత్వంగాని, పొగడ్తలకు పొంగిపోయే బలహీనతగాని లేని వ్యక్తిత్వం అతనిది. తను**

వేసుకున్న ప్రణాళిక ప్రకారం – శ్రమించి రాసుకుంటూపోయాడేగాని, ప్రచురణకర్తలు ఏం చేస్తున్నారన్నదాన్ని గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. శ్రమదోపిడీని సహించలేని యీ సామ్యవాదిని – ఎలా దోచుకున్నారో, దోచుకోబడ్డాడో పదుగురు చెప్పినా పట్టించుకోలేదు. ఫలితం తొలిముద్రణ మాకే రుణభారాన్ని మిగిల్చింది. రెండవ ముద్రణ అతి నిర్లక్ష్యంగా ప్రచురణ అయి అతని మనసును బాగా కృంగదీసింది.

కవి, భావుకుడు, వ్యాపారం తెలియనివాడు, స్నేహానికి ప్రాణం పెట్టే తత్వమున్న వాడు యింత దారుణంగా కృంగిపోవడం నేను కళ్లారా చూశాను. ఈ దేశంలో సాహిత్యం బువ్వపెట్టదు. ఏదో వృత్తి వుండి పక్కన సాహిత్య వ్యాపారం చేసుకుంటే ఏమోగాని లేకుంటే బ్రతుకు భారమే మిగులుతుంది.

ఆరుద్ర పోయాక నేనో నిర్ణయానికి వచ్చాను. యువకుడు, ఉత్సాహవంతుడు అయిన మన ముఖ్యమంత్రి చంద్రబాబుగారిని ''ఈ సాహిత్య సంపుటాల సర్వహక్కులు స్వీకరించండి. వాటి విలువ సాటిలేనిది'' అని కోరాను. వారు ప్రభుత్వం తరఫున స్వీకరించి ఆ హక్కులు, ప్రచురించే బాధ్యతలను – తెలుగు అకాడమీ వారి చేతుల్లో పెట్టారు. చక్కని అవగాహన, సాహిత్యం పట్ల ఎంతో అభిమానం గల డాక్టర్ ఎ. మంజులతగారు ఈ కార్యక్రమానికి ఎంతో సంతోషంగా శ్రీకారం చుట్టి ''ఇకమీదే ఆలస్యం'' అని అన్నప్పుడు – ఆమె అభిమానాన్ని నేను కొలవలేను. పదమూడు సంపుటాలను – నాల్గు సంపుటాలుగా రూపొందించాలని నిర్ణయించాను. సంస్కరించి ప్రచురణకు తొలి సంపుటానికి నాంది పల్కాను. ఈ విషయంలో నాకు అన్నివిధాలా వెన్నుదన్నుగా డా॥ మేడిపల్లి రవికుమార్ (ఎస్.వి.యూనివర్సిటీ, తెలుగుశాఖ) నిలబడ్డాడు. ఆరుద్ర తను చేద్దామనుకొన్న మార్పులూ, చేర్పులు, తీసేయాలనో, తగ్గించాలనో అనుకున్నవి – అన్నీ అన్ని సంపుటాలలో నోట్ చేసి పెట్టారు. నేను వాటిని అనుసరించి అమల్లో పెడుతూనే, అవసరమైన చోట్ల కుదిస్తూ – తొలి సంపుటి సిద్ధం చేశాను. ఆగస్టు 31, ఆరుద్ర జన్మదినం నాటికి దీనిని వెలువరిస్తానని – బాధ్యత సంతోషంగా డాక్టర్ మంజులత స్వీకరించారు. ఇది నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మళ్లీ ముఖచిత్రం రాసి యిచ్చారు బాపు – ఎప్పటికీ ఆరుద్ర అభిమాని ఆయన; 'నేను వేయడమేమిటి? ఆయన వేయించుకున్నారు'' అన్నారు.

ఉత్సాహంతో ప్రచురణ భారం స్వీకరించిన తెలుగు అకాడమీ డైరక్టర్ డాక్టర్ ఎ. మంజులతకు, హక్కులు స్వీకరించి నాకు మనశ్శాంతిని చేకూర్చిన ప్రియతమ చంద్రబాబుగారికీ నేను శాశ్వతంగా రుణపడి వున్నాను.

నా భావనలో ఆరుద్ర అభిరుచికి దీటైనది – యీ తెలుగు అకాడమీ వారి ప్రచురణే. ఇదే నాకు తొలి ప్రచురణేమో అనిపిస్తోంది.

30–7–2002
చెన్నయ్

కె. రామలక్ష్మి

ఈ సంపుటి ప్రత్యేకత

తెలుగు అకాడమీ విశిష్ట ప్రచురణ, ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఇది మూడవ సంపుటి - కుంఫిణీ యుగం.

కుంఫిణీయుగం ప్రత్యేక సంపుటిగా తీసుకురావడంలోని ముఖ్యమైన ఉద్దేశం - దాని ప్రాముఖ్యతే.

ఇప్పటివరకు తెలుగు సాహిత్య చరిత్రలు రాసిన, రాస్తూన్న ఏ సాహితీపరుడూ - కుంఫిణీయుగం గురించి ఇంత విస్తృతమైన, విపులమైన వివరాలను అందించలేదు అనడం సత్యదూరం కాదు. ఈ యుగపు సాహితీపరుల, సాహితీపిపాసువుల అమూల్యమైన వివరాలను ఆరుద్ర యిందులో పొందుపరిచారు.

అంతేకాదు; అచ్చుపడకుండా, అసంఖ్యాకంగా వుండిపోయిన కావ్యాల, రచనల 'ఆర్' నెంబర్లు, 'డి' నెంబర్లూ ఇతర ముఖ్య సంఖ్యలూ అందించారు. వీటిని ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో వెతకడంలో జిజ్ఞాసువులు తమ అమూల్యమైన కాలాన్ని వృథా చేసుకోవలసిన పని తప్పుతుంది. ఇదే చాలా శ్రమతో కూడిన పని! సంఖ్యనుపట్టి పుస్తకం తీసుకోవడం, చూసుకోవడం సులభం అవుతుంది. విద్యార్థులూ, పరిశోధక విద్యార్థులూ వీటివల్ల కొత్త 'విషయసేకరణ' కూడా చేసుకోవడం సులువవుతుంది. ఈ సంఖ్యలు ఈ సౌలభ్యాన్ని కల్గిస్తాయి.

ప్రభువుల ప్రాపకంలోనుండి కవులు యజమానుల ప్రాపకంలోకి అడుగుపెట్టినది ఈ కుంఫిణీ యుగంలోనే. అందుకే కవుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా వుండడంలో వింత లేదు. ఈ కారణంగానే విషయసూచికను కాస్త విపులంగా ఇవ్వడం జరిగింది. ఇది చదువరుల సౌకర్యం కోసమే. ఈ కవుల వివరాలు ఇదివరలో ఎక్కువగా వెలుగు చూడలేదు.

ఈ సంపుటిని కూడా పాఠకలోకం ఉత్సాహంగా స్వీకరించి ఆదరిస్తుందని నమ్ముతున్నాను.

నవంబరు 2003
చెన్నయ్

విషయసూచిక

4. కాకరపర్తి కృష్ణయ్య
5. కామనూరి కృష్ణయ్య
6. కమలాపురం కృష్ణయ్య
7. ఆలూరి కుప్పన
8. చక్రప్పగారి కోటయ్య
9. వద్దిపర్తి కోనమరాజు
10. తిమ్మయ్యగారి తిమ్మయ్య
11. కొప్పర్తి నరసన్న
12. వల్లూరి నరసింహం
13. వానపాల నరసింహరాజు
14. మాడభూషి నరసింహాచార్యులు
15. సింగరాజు నాగభూషణం
16. బైరు నారాయణ
17. పెద్దాడ నాగరాజు
18. నల్లాని నరసింహాచార్యులు
19. మండపాక పేరయ్య
20. పోడూరి పెదరామయ్య
21. కాణాదం పెద్దన
22. కాకరపర్తి బుచ్చిపాత్రయ్య
23. పంతుల బ్రహ్మదేవయ్య
24. కైప మాయన్న
25. ఉన్నవ యోగానందం
26. అల్లమరాజు రామకృష్ణయ్య
27. తూము రామచంద్రారెడ్డి
28. రాయరఘునాథ తొండమాను
29. పిండిప్రోలు లక్ష్మన్న
30. వీణం లక్ష్మీపతి
31. కాళ్ళకూరి లక్ష్మీపతి
32. తక్కిళ్ళపాటి లింగన్న
33. చాగంటి వెంకటకృష్ణయ్య
34. పులిఖండం వెంకట కృష్ణయ్య

17. అక్కినప్రగడ పిచ్చయ్య
18. శేషం రంగాచార్యుడు
19. పండితారాధ్యుల వీరన
20. కృష్ణపాటి వీరరాఘవయ్య
21. ఎరగుడిపాటి వెంకట కవి
22. పెనుమర్తి వెంకట కవి
23. సరసకవి వెంకటకృష్ణమాచార్యులు
24. పోడూరి వెంకటరాజు
25. బండి వెంకటస్వామి
26. శ్రేష్ఠలూరి వెంకటాచార్యులు
27. ధర్మపురి విశ్వేశ్వరుడు
28. చదువుల సోమలింగం
29. నల్లిందిఘళు అప్పలాచార్యులు
30. మేడూరి అప్పన్న
31. మాచిరాజు కామరాజు
32. కుమార శరణయ్య
33. వెనవెళ్ళ గంగాధరం
34. శ్రీనివాసాచారి గారి చినవెంకటాచార్యులు
35. గరికిపాటి తమ్మయ్య
36. రుద్రరాజు తిరుమలరాజు
37. కోవెల తిరువెంగళరాజు
38. బొమ్మకంటి నరసింహం
39. కొత్తలంక మృత్యుంజయుడు
40. బాపన్నగారి యాదవయ్య
41. బంగారు రంగప్ప
42. హర్యపరాజు రంగశాయి
43. శేషం రఘునాథాచార్యులు
44. ముకుందపురి రామకవి
45. నాగుల రామకవి
46. బెహరా రామకృష్ణయ్య
47. కోదండరామయ్యగారి రామచంద్రయ్య

కుంఫిణీ యుగం

ఇది చాలా విలక్షణమైన సంధియుగం. శ్రీలు పొంగిన జీవగడ్డ పరపీడన వల్ల ఒక్క నూరేళ్లలో చేవచచ్చి ఎలాగ దౌర్భాగ్య దేశం కాగలదో ఈ యుగ చరిత్ర నిరూపిస్తుంది. అయితే తరతరాలుగా నిద్రాణమైన ఒకజాతి పరదేశీయుల సాంగత్యం వల్ల ఎలాగ జాగృతం కాగలదో కూడా ఈ యుగ చరిత్రే రుజువు చేస్తుంది.

సాహిత్య ప్రపంచంలో ఆకురాలు కాలం గడిచిపోయి ఆమని ఛాయలు పొడచూపినది ఈ యుగంలోనే. ప్రాచీన కావ్య పత్రాలు పతనమై కాలగర్భంలో కలసిపోకుండా ఒక్కచోట సంకలనమైనది ఈ యుగంలోనే.

నేడు నాగరికతకు ముఖ్య చిహ్నాలయిన విద్యాలయాలు, అచ్చుకూటాలు, పుస్తక ప్రచురణలు, పఠన మందిరాలు, గ్రంథాలయాలు, సారస్వత సంఘాలు, ప్రాచీన వస్తు ప్రదర్శనశాలలు మొదలైన వివిధ సంస్కృతీ సంస్థలు ఈ యుగంలోనే మొలకెత్తి పెరిగి మొగ్గ తొడిగాయి. ఈ విద్యావికాసానికి తెల్ల దొరలు చాలా తోడ్పడ్డారు. వాళ్ళలో చాలామంది తూర్పు ఇండియా కుంఫిణీవారి ఉద్యోగులే. అందుకే ఈ యుగానికి కుంఫిణీ యుగమని పేరు పెట్టుకున్నాం.

మన భారతదేశానికి వర్తకం చేయడానికి ఇంగ్లండులోని కొంతమంది వ్యాపారస్థులు ఒక వాణిజ్య సంఘంగా ఏర్పడ్డారు. తమ దేశపు రాజు అనుమతి పొంది ఓడ వ్యాపారం మొదలుపెట్టారు. మన దేశంలోని వివిధ ప్రాంతాల ఏలికల అనుమతిని పొంది రేవు పట్టణాలలో గిడ్డంగులు కట్టుకొన్నారు. అవి క్రమేణా కోటలుగా మారాయి.

ఈ తెల్లవాళ్ళకు భాషాంతరాలు చేయడానికి దుబాషీలు, బేరాలు కుదర్చడానికి దళారీలు, పద్దులు వ్రాయడానికి గుమస్తాలు, నౌకర్లు, చాకర్లు, వంటచేసే కుశిణీవాళ్ళు, చాకళ్ళు, మంగళ్ళు, పల్లకీ బోయీలు ఒకరేమిటి - జీవిత సౌకర్యాలకు కావలసిన పరివారమంతా వచ్చి చేరారు. తెల్లవాళ్ళ కోటలను ఆనుకొని నల్లపేటలు కట్టుకొన్నారు. క్రీ.శ. 1744 నాటికి ఒక్క మద్రాసులోనే రెండున్నర లక్షల దేశీయ జనాభా ఉండేది.

ఆదిలో తెల్లవాళ్ళకు భారతీయ భాషలు తెలియవు. మన వాళ్ళకు ఇంగ్లీషు రాదు. రేవు పట్టణాలలో పోర్చుగీసు పదాలతో మిళితమైన సంకర భాషనే వ్యాపార భాషగా అందరూ వాడేవారు. తెల్లవాళ్లలో వివిధ జాతుల వాళ్ళు ఉన్నారని మనవాళ్ళకు తెలియదు. అందుచేత ఏ తెల్లవాడినైనా 'ఫరంగి' అని పిలిచేవారు. భారతీయుల పదజాలంలో 'ఫరంగి' అంటే పోర్చుగీసువాడు. మనవాళ్ళకు తెల్లవాళ్ళ భేదాలు తెలియనట్టే, వాళ్ళకు కూడా భారతదేశంలోని జాతి భేదాలు తెలియవు. ఇక్కడ రెండే రెండు జాతులున్నాయి. ఒకటి మహమ్మదీయులు, రెండు హిందువులు. సీమదొరలందరూ మహమ్మదీయుణ్ణి 'మూరు' అంటారు. హిందువును 'జెంటూ' అని పిలిచేవారు. జెంటూ అంటే అన్యమతస్థుడు, క్రైస్తవేతరుడని అర్థం. ముస్లిములు కాని నల్లవాళ్ళందరినీ

జెంటూలని ఆదిలో దొరలు పిలిచినా ఉత్తరోత్తరా జెంటూలంటే తెలుగువాళ్ళనే అర్థం స్థిరపడిపోయింది.

మొట్టమొదట్లో ఇంగ్లీషువాళ్ళ వ్యాపారాలు ఎక్కువగా తెలుగువాళ్ళతోనే జరిగేవి. క్రీ.శ. 1639 ప్రాంతాలలో చెన్న పట్టణం పరిసరాలు తెలుగు రాజుల ఏలుబడిలో ఉండేవి. ఇంగ్లీషు వాళ్ళ తొలి గిడ్డంగులు తూర్పు కోస్తాలోనే అభివృద్ధి చెందాయి. అందుకే జెంటూలు అనే మాట తెలుగువాళ్ళకు పర్యాయపదం అయింది. చెన్న పట్టణం ప్రాంతాలలో అరవవాళ్ళు కూడా ఉన్నారని, వీళ్ళు తెలుగువాళ్ళ కన్నా విభిన్నమైన భాష మాట్లాడుతారని తెలిశాక వాళ్ళను 'మలబారులు' అని తెల్లవాళ్ళు పిలిచేవారు. కేరళ దేశీయులకు, తమిళులకు గల తేడా సీమదొరలకు తెలియని రోజులవి.

తొలిరోజులలో ఎలాగ వున్నా ఆంగ్లేయుల ప్రాబల్యం రానురాను హెచ్చింది. ఇతర పాశ్చాత్యులతో పోటీపడి భారతదేశంలో తమ స్థావరాలను పెంచుకొని వాటిని రాజ్యాలుగా మార్చుకొన్నారు. తమ నాణాలను తాము ముద్రించుకొనే హక్కులను పొందారు. తమ ఏలుబడిలోని ప్రజలను శిక్షించే అధికారాలను చేపట్టారు. నల్లవాళ్ళను తమ సిబ్బందిలో చేర్చుకొని సైనిక శిక్షణ యివ్వసాగారు. కొన్నాళ్ళకు తెల్లవాళ్ల పటాలాలనే సీమనుండి తెప్పించుకొని భారతదేశపు రాజకీయ సమరాలలో జోక్యం కలిపించుకొన్నారు. ఆర్కాటు నవాబుకు జాగీరుదారులయ్యారు. నిజాముకు రక్షకులయ్యారు. మొగలు చక్రవర్తికి దివానులయ్యారు. భారతీయులకు పాలకులయ్యారు. క్రమేణా సర్వతంత్రస్వతంత్ర సార్వభౌమాధికారాలను ఆంగ్లేయులు ప్రకటించుకొన్నారు. క్రీ.శ.1800 నాటికి ఇంగ్లండు దేశంలోని తూర్పు ఇండియా కుంఫిణీలో వున్న 2,163 వాటాదార్లకు భారతీయులు బానిసయ్యారు.[1] వాళ్ళ ఆదేశాల ప్రకారం యిక్కడ పరిపాలన సాగేది.

ఇంగ్లండులోని కుంఫిణీ వాటాదార్లకు తమ లాభాలేకాని భారతీయుల సుఖదుఃఖాలతో సంబంధం లేదు. బతుకు తెరువులు చూపించే ప్రభుత్వాలను శ్లాఘించడమే వందిమాగధుల వంటి కవులకు చేతనైన విద్య. కుంఫిణీ వారిని కుంభినీ అని కూడా కవులు పేర్కొనేవారు. ఒక చాటుకవి ఈ క్రింది పద్యం చెప్పాడు.[2]

'కుంభిని వంటి ప్రభుత్వము
రంభా భోగమ్ము వంటి రతిసౌఖ్యంబున్,
జంభారి వంటి విభవము,
శంభో! వినుకొండ వంటి షహరున్ గలదే!' (4-154)

కవులు ఎంత పొగడినా కాలం కళ్ళు తెరిపిస్తుంది. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధం మొదలుకొని 1857లో ప్రారంభమైన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం దాకా కుంఫిణీవారు మన దేశాన్ని ఏలుకొన్నారు. ఈ నూరేళ్ళ యుగ చరిత్రలో వచ్చిన వివిధ పరిణామాలను విశ్లేషణ చేద్దాం.

1. The East India Company - C.H. Philips Oxford University Press, 1961-P.2, F.Note.
2. చాటుపద్య రత్నాకరము - దీపాల పిచ్చయ్యశాస్త్రి (సంపా.), 3వ కూర్పు, నెల్లూరు, 1961-పు.290

దుబాషీలూ, వకీళ్ళూ, వర్తకులు

విదేశాలతో వాణిజ్య సంబంధాలు పెరుగుతున్నప్పుడు వివిధ సంస్కృతుల మధ్య పరస్పర ప్రభావాలు క్రమేణా కనబడతాయి. ఆదాన ప్రదానాలు ఏర్పడుతాయి. పాశ్చాత్య దేశాలవారు భారతదేశంలో వర్తక వ్యాపారాలు చేయడం అనాదినుంచీ వున్నదే. క్రీ.శ. 1498లో వాస్కోడిగామా ఆఫ్రికా ఖండం చివరనున్న గుడ్‌హోప్ అగ్రాన్ని చుట్టి పశ్చిమ తీరాన వున్న కోజికోడ్ రేవులో అడుగుపెట్టిన నాటినుంచీ మన దేశంలో పోర్చుగీసువారికి మొదట వర్తక సంబంధాలూ, ఉత్తరోత్తరా రాజకీయ ప్రలోభాలూ బలపడ్డాయి. పోర్చుగీసువారిని పురతకీసు, బుడతకీచులని, ఫరంగీలని భారతీయులు వ్యవహరించేవారు.

బుడతకీచులు ప్రాథమికంగా పశ్చిమ తీరంలోని గోవా, డయ్యూ, డామన్, సాల్సెట్టి, మంగుళూరు, కోజికోడ్ మొదలైన రేవులలోనే స్థావరాలు ఏర్పరచుకొన్నారు. విజయనగరం సామ్రాజ్యంతో ఎన్నోరకాల సంబంధాలు పెట్టుకొన్నారు. అశ్వికదళాల పెంపుదలకు తోడ్పడ్డారు. అళియ రామరాయల కాలంలో తూర్పు కోస్తాలో కూడా బుడతకీచులు గిడ్డంగులు కట్టుకొనడానికి అనుమతి లభించింది. క్రీ.శ. 1522లో మైలాపూర్ వద్దనున్న ఒక రేవులో గిడ్డంగినీ, కోటను కట్టుకొని బుడతకీచులు దానికి 'శాంతోము' అని పేరుపెట్టుకొన్నారు. తూర్పు తీరాలలోని తూత్తుకుడి, నాగపట్నం మొదలైన చోట్ల కూడా బుడతకీచులు గిడ్డంగులు కట్టుకొన్నారు. తూర్పున వున్న శాంతోమునుంచి, పడమట వున్న గోవా దాకా సుమారు అయిదు వందల మైళ్ళ మార్గంలో రాకపోకల జరుగుతూ వుండేవి.

ఆనాటి దక్షిణ భారత రాజకీయాలలో బుడతకీచులది కీలకస్థానం. అందుచేత వారితో సంబంధమున్న భారతీయులు, ముఖ్యంగా రాజకీయోద్యోగులు బుడతకీచు భాషను విధిగా నేర్చుకోవలసి వచ్చింది. అరబ్బీ, పారశీ భాషలతోపాటు దీనిని కూడా అధ్యయనం చేసేవారు. బుడతకీచు భాషను నేర్చుకొన్న దేశీయ క్రైస్తవులకే దుబాషీ పదవులను యివ్వవలసిందని 1571లోనే పోర్చుగీసు చక్రవర్తి భారతదేశంలోని బుడతకీచు అధికారులకు శ్రీముఖం పంపాడు.[1] భారతదేశంలో తర్వాత తర్వాత సంబంధం పెట్టుకొన్న యితర పాశ్చాత్య దేశీయులు సైతం ఆదిలో మన దేశీయులతో వ్యవహారాలు జరుపుకోడానికి బుడతకీచు భాషే శరణ్యమయింది.

విభిన్న పాశ్చాత్య దేశాలవారు మన దేశంతో వర్తక సంబంధాలు ఏర్పరచుకొని కోస్తాలలో గిడ్డంగులు కట్టుకొన్నారు. ఉత్తరోత్తరా భారతదేశంపై ఒక్క బ్రిటీషువారికే ఆధిపత్యం వచ్చినా ఆదిలో చాలామంది పాశ్చాత్య దేశాలవారు వర్తక సంఘాలను స్థాపించుకొని మన దేశానికి వచ్చారు. ఒకరిని చూసి యింకొకరు పోటీకి సిద్ధపడ్డారు.

క్రీ.శ. 1600లో ఇంగ్లండులోని తూర్పిండియా కుంఫిణీవారు భారతదేశంతో వర్తకం చేయడానికి తమ ప్రభుత్వం వల్ల గుత్తాధిపత్యం పొందారు.

---

1. తూమాటి దొణప్ప – ''భాషా చారిత్రక వ్యాసావళి''లో 'తెలుగులో బుడతకీచు నుడులు' పుట.236

క్రీ.శ. 1602లో డచ్చివారు యునైటెడ్ ఈస్టిండియా కుంఫిణీని స్థాపించారు.

క్రీ.శ. 1616లో డెన్మార్కు దేశీయులు మన దేశానికి వర్తకం కోసం వచ్చారు.

క్రీ.శ. 1664లో ఫ్రెంచివారు వర్తక సంఘాన్ని నెలకొల్పి మన దేశంలో వాణిజ్యం ప్రారంభించారు.

బహుశా యిదేకాలంలో బెల్జియం దేశంలోని ఫ్లాండర్సు నగరపు వర్తకులు ఆస్టండ్ కుంఫిణీని నెలకొల్పారు.

క్రీ.శ. 1712లో స్వీడన్ దేశీయులూ ఒక తూర్పిండియా కుంఫిణీని ప్రారంభించారు.

ఇన్ని దేశాలవారు పోటాపోటీల మీద మన దేశంతో వర్తక సంబంధాలు పెట్టుకొన్నాక వాళ్ళలో వాళ్ళకు తగాదాలు, చిన్న కయ్యాలు, సాయుధ కలహాలు తప్పనిసరి. 'వైరములు వాణిజ్యమందే' కదా! రానురాను ఈ కుంఫిణీలు స్వతంత్ర రాజ్యాలుగా తమ తమ స్థావరాలలో వ్యవహరించేవి. అయితే బ్రిటీషువారి ధాటీకి, పోటీకి తట్టుకోలేక డచ్చి, ఫ్రెంచి కుంఫిణీలు తప్ప తక్కినవన్నీ అయిపులేకుండా పోయాయి. డచ్చివారు కూడా ఒక వెలుగు వెలిగి, తర్వాత ఇండోనేషియాపై తమ సర్వశక్తులూ కేంద్రీకరించారు. బుడతకీచులు వున్నవాటితో సంతృప్తిపడ్డారు. వాటిని దక్కించుకొందుకే కృషి చేశారు. ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు మాత్రమే భారతదేశంలో కాళ్ళు నిలదొక్కు కున్నారు. వేళ్ళూనాక రాజ్య విస్తరణను ప్రారంభించారు. పరస్పర సమరాలతోపాటు భారతదేశపు రాజకీయాలలో జోక్యం కలిగించుకొని రాజ్యాధిపతులయ్యారు.

వివిధ పాశ్చాత్య వాణిజ్య సంఘాలు తూర్పు కోస్తాలలో, ముఖ్యంగా తెలుగు తీరాలలో ఏయే కాలాలలో స్థిరపడినదీ గమనించదగ్గ చారిత్రకావసరం.

క్రీ.శ. 1611లో మొట్టమొదటిసారిగా ఇంగ్లీషువారు మచిలీపట్నంలో స్థావరాన్ని ఏర్పరచుకున్నారు. అప్పటికే ఆ రేవులో బుడతకీచులూ, ఒళందవారూ వ్యాపారాలు చేస్తున్నారు.

క్రీ.శ. 1618 నాటికి మాథ్యూ డ్యూక్ అనే ఇంగ్లీషు కుంఫిణీ వర్తకుడు పెద్దపల్లి (నిజాంపట్నం) పరిసరాలలో నేతబట్టల గురించి, స్థానిక వర్తకుల గురించి ఆరాలు తీసి ఇంగ్లండులోని అధిపతులకు లేఖ రాశాడు.

క్రీ.శ. 1619లో నీలపల్లినుండి ఇద్దరు ఇంగ్లీషువారు మచిలీపట్నానికి వచ్చారు.

క్రీ.శ. 1620లో కార్టురైట్ అనే వ్యక్తిని డచ్చి నౌకలో మచిలీపట్నానికి ఇంగ్లీషువారు పంపారు. ఇతన్ని బందరులోని వర్తకులలో ద్వితీయ స్థానాన్నీ, ఫ్యాక్టరీ పద్దుల వ్యవహారాలనూ చూసుకోడానికి నియమించారు.

క్రీ.శ. 1623లో మచిలీపట్నంలో విలియం మాత్వాల్ట్, మాథ్యూ డ్యూక్, ఫ్రాన్సిస్ ఫట్టర్ అనే ఇంగ్లీషు కుంఫిణీ వర్తకులు వుండేవారు. వీరిపై పశ్చిమ తీరంలో వున్న సూరత్‌లోని కుంఫిణీ వారికి ఆధిపత్యం వుండేది.

క్రీ.శ. 1622 నాటికి ప్రళయకావేరిలోని డచ్చివారు బానిస వ్యాపారం కూడా చేసేవారు. నాలుగైదు వందలమంది బానిసలు సిద్ధంగా వున్నారనీ, వారిని ఎక్కించుకొని

పుదుచ్చేరికి న్యూజిలాండ్ అనే ఓడ వెళ్ళబోతున్నదనీ అక్కడ అదే సంఖ్యా ప్రమాణంలో బానిసలను ఎక్కించుకొని బటేవియాకు తీసుకుపోతారనీ ప్రళయకావేరిలో మకాం చేసిన థామస్ మిల్ అనే ఇంగ్లీషు వర్తకుడు బందరులోని తన పై అధికారులకు తెలియచేశాడు.

క్రీ.శ. 1628 నాటికి బందరులో డచ్చివాళ్ళ పోటీని తట్టుకోలేక ఇంగ్లీషువారు తూర్పు కోస్తాలోనే యింకా దక్షిణాన మంచి రేవు దొరుకుతుందేమో అన్న ఆశతో గాలించసాగారు. నౌకలమీద నెల్లూరు సీమలోని దుగరాజపట్నం రేవు దగ్గర లంగరు వేసి కుంఫిణీ మనుషులు ఓడ దిగారు. దుగరాజపట్నాన్ని అప్పుడు గురవానాయుడు పాలించేవాడు. ఆయననూ, పట్టణ స్వాములు ఆర్ముగ మొదలియారును కలుసుకొని ఈ స్థలాన్ని బాగుపరచి కోటకట్టుకొంటామని ఇంగ్లీషువారు మనవి చేశారు. ఆ ఇద్దరూ అంగీకరించిన మీదట గ్రామానికి తూర్పున కోట కట్టి ఫిరంగులు నిలిపారు. ఒక ఫిరంగిని పేల్చితే గుండువెళ్ళి వెంకటగిరి జమీందారుగారి సీమలో పడింది! అంతమేరదాకా విస్తరించాలని కుంఫిణీవారు అక్కడ కూడా కోట కట్టుకోవాలని తలిచారు. అయితే వెంకటగిరి ప్రభువు బంగారు యాచమనాయుడుగారు అనుమతించలేదు. అప్పుడు గురవానాయుడుగారూ, ఆర్ముగ మొదలియారుగారూ ఇంగ్లీషువారిని దామెర్ల చెన్నప్పనాయుడుగారి వద్దకు తీసుకువెళ్ళి దర్శనం చేయించి స్థలం యిప్పిస్తామని వాగ్దానం చేశారు. ఉత్తరోత్తరా మైలాపురానికి ఉత్తరాన వున్న చెన్నకుప్పం యిప్పించారు. తమకోసం యింత పాటుపడిన గురవానాయుడుగారిని, ఆర్ముగం గారిని కుంఫిణీ వారు చాలా మెచ్చుకొన్నారు. దుగరాజపట్నానికి ఆర్ముగంగారి పేరు పెట్టారు. గురవానాయుడుగారిని దళవాయిగాను, ఆర్ముగంగారిని స్థల కరణాన్ని చేశారు.

క్రీ.శ. 1638లో పెద్దపల్లిలో ఒకే ఒక్క ఇంగ్లీషు కుంఫిణీ వర్తకుడు వుండేవాడు. అతని పేరు థామస్ గ్రోవు. అతనికి యిచ్చిన సిబ్బంది ఒక పోర్టరు, ఒక వంట పుట్టి ఒక సైసు, ఇద్దరు తోటమాలీలు, ఇద్దరు సిపాయిలు, అతని సొంత నౌకరు, వీళ్ళుకాక కుంఫిణీ భవనంలోనే కనిపెట్టుకొని వున్న చాకలీ, అతని కుటుంబం. ఇద్దరు వ్రాయసకాళ్ళు (నాగయ్యా, పేరయ్యా); బహుశా వీరు దుబాషీలు.

గ్రోవుకు యిద్దరు నౌకర్లకన్నా ఎక్కువ మందిని మంజూరు చేయలేమని కుంఫిణీవాళ్ళు చెప్పారు. అత్రాచారి, బరైదొర అనేవాళ్ళు ఆ నౌకర్లు.

ఇదేకాలంలో పెద్దపల్లిలోని డచ్చివాళ్ళకు యిద్దరు గొడుగులు పట్టేవాళ్ళు, ఇద్దరు కాగడాలు పట్టేవాళ్ళు, 60 మంది ప్యూన్లు, రెండు గుర్రాలు, రెండు పల్లకీలు వుండేవి. డచ్చివాళ్ళను చూసి ఇంగ్లీషువాళ్ళు కూడా ఆర్భాటంగా బతకసాగారు.

క్రీ.శ. 1639లో బందరులోని కుంఫిణీవారు చాలా దుబారాగా బతికేవాళ్ళు. పది గుర్రాలూ, ఒక జత ఎడ్లు, రెండు పల్లకీలు, ఒకప్పుడు 40 లేక 60, మరొకప్పుడు 80 మంది నౌకర్లు వుండేవారు. ఫ్రిన్సన్ అనే పై అధికారి థామస్ క్లార్కుతో కలసి బయటకు వెళితే (ఈ వెళ్ళడం సర్వసామాన్యం) వాళ్ళముందు ఒక బూరావాడు వెళ్ళేవాడు. రెండు

బావుటాలను పట్టుకొని ఇద్దరు నౌకర్లు ముందు నడవాలి. దొరలు ఎక్కిన పల్లకీ ముందు ఒక విచ్చుకత్తివాడు దూసిన కత్తితో నడవాలి. పల్లకీల పక్కన భూచక్ర గొడుగులు కదలాలి. వెనుక గుర్రపు రౌతులు, కాల్బంటులు, తెల్ల, నల్ల సిబ్బంది సాగాలి. ఈ హంగామా అంతా వాళ్ళు వ్యాహ్యాళికి వెళ్ళేటప్పుడు. థామస్ క్లార్క్ చేతికింద 20 మంది చాకర్లు, బానిసలు వుండేవారు. వాళ్ళ ఖర్చులు సగం కుంఫిణీమీద పులిమేవాడు. ఆయనకో సొంత ఇల్లు కూడా వుండేది. దాని సంరక్షణకు ఒక పోర్టరు, మరి ముగ్గురు వెట్టివాళ్ళు వుండేవారు.

క్రీ.శ. 1639 నాటికి దుగరాజపట్నం గిడ్డంగి వల్ల నష్టమేకాని లాభం లేదని తేలింది. ఫ్రాన్సిస్ డే అనే కుంఫిణీ ఉద్యోగిని యింకా దక్షిణాదిని ఇమ్ముగా వుండే స్థలం చూడమని పంపారు. అతడు మద్రాసు పట్నం చూశాడు. ఇది శాంతోముకు ఉత్తరాన వుంది. పరిసరాలలో చక్కటి నేతబట్టలు చౌకగా దొరుకుతాయని తెలుసుకొన్నాడు. కొత్త చోట కొత్త కోట కట్టుకొని దానినే ముఖ్యమైన స్థావరంగా వృద్ధి చేయాలని మచిలీపట్నంలోని కుంఫిణీ ఉద్యోగులు సీమకు రాశారు.[2]

క్రీ.శ. 1639 ఆగస్టు 22వ తేదీనాడు మద్రాసులో కోట కట్టుకోడానికి దామెర్లవారు అనుమతి ఇచ్చారు.

క్రీ.శ. 1640 ఫిబ్రవరి 20వ తేదీనాడు ఫ్రాన్సిస్ డే మద్రాసు పట్నంలో గిడ్డంగిని ప్రారంభించాడు.

ప్రళయకావేరిలో ఒళందవారి గిడ్డంగి చాలా చురుకుగా వ్యాపారం చేసేది. మగదల కృష్ణయ్య ఈ డచ్చివారి దుబాషీ. ఇతడు ఆంధ్ర సాహిత్య పోషకుడు. ధరణి దేవుల రామయ్య రాసిన దశావతార చరిత్రను అంకితం పుచ్చుకొన్నాడు. మగదల కృష్ణయ్య ప్రశస్తిని ఈ గ్రంథం అవతారికలో చూడవచ్చు.

ఇంగ్లీషువారుగానీ, ఫ్రెంచివారుగానీ, ఒళందవారుగానీ బుడతకీచు భాషపైనే ఆదిలో ఆధారపడ్డారు. పరిశోధకులు ఈ విషయం యిలా స్పష్టం చేశారు.[3]

''చెన్నపట్టణంలో ఇంగిలీసు కుంఫిణీ దొరతనం నెలకొనిన క్రొత్తలో కుంఫిణీ పాలకులు స్థాపించిన కొత్వాలు చావడుల-తొలి న్యాయస్థానముల (1678-1726)లో బుడతకీచు భాషయే వ్యవహారమున నుండినది. దినసరి వక్కాణలు, వాది ప్రతివాదుల అభియోగములు, ధర్మాసనము వారి తీర్పులు బుడతకీచు భాషలో లిఖితములగు చుండినవి. ఆస్తిపాస్తుల క్రయవిక్రయములును, అన్యాక్రాంతములును, దాన ధర్మాదుల వివరములను తెలుగు, బుడతకీచు బాసలలో సంగ్రథితములగుచుండినట్లు (1670-1681) నాటి ఇంగిలీసు కుంఫిణీ రికార్డులును సాక్ష్యమిచ్చుచున్నవి. బానిసల వ్యాపారమును నిషేధించుచు కుంఫిణీ దొరతనంవారు 1682లో చేసిన శాసనం ఇంగ్లీషు, తెలుగు, బుడతకీచు భాషలలో ప్రకటితమైనది. 1687లో సీమనుండి ఇంగిలీసు కుంఫిణీ

2. Williams Foster: 'The English Factories in India' (1631-1645). Oxford, 1912.

3. తూమాటి దొణప్ప - 'భాషాచారిత్రక వ్యాసావళి' పుటలు 236-7.

నిర్వాహకులు చెన్న పట్టణంలోని ఫోర్టు అధికారులకు పంపిన ఆజ్ఞాపత్రిక మేరకు మేయరు కోర్టు చెన్న పట్టణములో స్థాపితమయినది. ఈ కోర్టులోని ప్రధాన లేఖకుడు (Town clerk)ను నగర వ్యవహారదర్శి (Recorder)యును ఇంగ్లీషు జాతీయులయి, తెలుగు, బుడతకీచు భాషాజ్ఞానము కలవారయి యుండవలయునని విధించిన నిబంధన నిర్వాహమగుటచే బుడతకీచు భాషకు గల వ్యవహారబలము సుప్రతిష్ఠితమగును.''

1640లో మదరాసు పట్టణంలో కోట కట్టాక దుగరాజపట్నంలోని గిడ్డంగిని మూసేశారు.

చెన్నపట్టణం అనే పేరుతో మదరాసు పట్నంవద్ద ఇంగ్లీషువారు కోట కట్టుకున్న వెంటనే వారి కొలువులో దుగరాజపట్నం నుంచి బేరి తిమ్మన్న, నాగభట్టూ వచ్చిచేరారు. పోర్టోనోవో వర్తకుడు శేషాద్రి చెట్టి కుంఫిణీవారికి వర్తకునిగా, దళారిగా వుంటూ వచ్చాడు. చెన్న పట్నంలో స్థిరపడటానికి ఎన్నో కుటుంబాలను శేషాద్రి చెట్టి రప్పించాడు. బురుజులు కట్టించడానికి సొమ్ము వసూలు చేశాడు. ధాన్యపు బజారు కట్టించారు.

దుగరాజపట్నం నుంచి బేరి తిమ్మన్న కుంఫిణీవారి తరఫున నేటివులతో వ్యవహారాలు నడిపే వర్తకులలో ప్రధానుడు. కొన్ని పత్రాలలో ఈయనను 'కెప్టెన్ ఆఫ్ మద్రాసు' అని పేర్కొన్నారు (ఇతని వంశంలోనివారు కూడా తర్వాత తరాలలో కుంఫిణీ కొలువు చేశారు.) బేరి తిమ్మన్నకు ఎన్నో తరంలోనివాడోగాని బండ్ల రామస్వామినాయుడు 1820లో రెవెన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగి. 'మద్రాసు రెవిన్యూ విధానం'పై ఒక మహాజరు రాశాడు.

బేరి తిమ్మనతోపాటు వచ్చిన నాగభట్టు తుపాకీ మందు తయారుచేసే వ్యక్తి. కుంఫిణీ కొలువులోనే వున్నాడు.

1644లో హెన్రీ గ్రీన్‌హిల్ చెన్నపట్నంలో ఏజెంటుగా వచ్చాడు. 1648 దాకా వున్నాడు. వెంకటపతి పంతులు యితని దుబాషీ. గోల్కొండ రాజకీయోద్యోగులతో కుంఫిణీవారి తరఫున సంప్రదింపులు చేసేవాడు. లిటిల్‌టన్ అనే కుంఫిణీ ఉద్యోగితోపాటు మీర్ జుమ్లా వద్దకు రాయబారిగా వెంకటపతిని గండికోటకు పంపించారు. ఇతని తమ్ముడు కన్నప్ప కూడా కుంఫిణీ కొలువులో వున్నాడు. నల్లవాళ్ళ టౌనుకు మేజిస్ట్రేట్ అధికారిగా వుండేవాడు.

వెంకటపతి కన్నప్పల తండ్రికూడా కుంఫిణీవారి దుబాషీగా 1614 నుంచీ వుండేవాడట. బహుశా ఉత్తరాదిని తెలుగు ప్రాంతాలలో వున్న గిడ్డంగులలో అయి వుంటుంది. ఈ అన్నదమ్ములు చాలా పలుకుబడి కలవాళ్ళు. వెంకటపతి గోల్కొండలో కుంఫిణీవారి రాయబారిగా చాలాకాలం వున్నాడు. ఇవ్వవలసిన వాళ్ళకు లంచాలు మేపి 1671లో నెక్‌నామ్ ఖాన్ వద్దనుంచి కుంఫిణీ వారికి కౌలును సంపాదించాడు.

వెంకటపతి తమ్ముడు కన్నప్ప చెన్నపట్నపు అధికారిగా వున్నప్పుడు గుంజవలసిన అన్ని సందర్భాలలో డబ్బు గుంజడం, యివ్వవలసిన లంచాలు యివ్వడంలో ఆరితేరాడు.

ఎత్తుకొచ్చిన పిల్లకాయలను బానిసలుగా అమ్మడానికి అనుమతించాడు. కుంఫిణీ తెల్లదొరలలో కొందరి అనుగ్రహానికి వెంకటపతీ, అతని తమ్ముడూ నోచుకొంటే కొందరి ఆగ్రహాలకు కూడా లోనయ్యారు. బార్కరు వీరిని ఆదరిస్తే, గ్రీన్‌హిల్ పగపట్టాడు. అధికార దుర్వినియోగం చేశారని ఈ అన్నదమ్ములను గ్రీన్‌హిల్ ఖైదు చేయించాడు. గ్రీన్‌హిల్ చేసిన అక్రమాలను వెల్లడిచేసినందుకే ఈ సోదరులు కష్టాలు పడుతున్నారని బార్కరు అభిప్రాయపడ్డాడు. కుంఫిణీకి పెట్టుకొన్న అర్జీలో వెంకటపతీ, కన్నప్ప ''మేము కుంఫిణీ సేవకులం. మా తండ్రిగారు నలభై సంవత్సరాలు తమ సేవ చేసుకొని మమ్ములను తమ అధీనులను చేశారు'' అని మనవి చేసుకొన్నారు.

బేరి తిమ్మప్ప అన్నా, కుంఫిణీ వారికి మందుగుండు తయారుచేసే నాగభట్టన్నా ఈ సోదరులకు పడదు. ఈ ఇద్దరూ విపరీతమైన ధరలు విధిస్తున్నారని సోదరులు అభియోగం తెచ్చారు. శేషాద్రి అంటే కూడా వీళ్ళకు గిట్టదు. 1654లో చెన్న పట్నంలోని నేతగాళ్ళు ఈ సోదరులపై ఒక మహాజరు పెట్టుకొన్నారు. కోటలోని దుబాషీలు కావడం వల్లా, గ్రామానికి అధికారులు కావడం వల్లా, తలారి కచ్చేరి గుప్పిట్లో వుండడం వల్లా ఈ బ్రాహ్మణ సోదరులలో ఎవరో ఒకరు నిత్యం కోటలోనే వుంటూ తాము తప్ప ఏ ఒక్కరూ ఏ సందర్భంలోనూ ఏజెంటుతో మాట్లాడకుండా చూసేవారు. ఒకరి ఉద్యోగం, యింకొకరి పలుకుబడి లాభిస్తున్నందువల్ల ఏజెంటు తమతోగాని, సర్కారువారితోగాని, తలారి కచ్చేరి వారితోగాని సంభాషించే సందర్భం లేనందువల్ల ఈ అర్జీ పెట్టుకొన్నామని విజ్ఞప్తి చేశారు.

మచిలీపట్నంలో డచ్చివారు, ఇంగ్లీషువారు వ్యాపారం చేస్తూండడం చూసి ఫ్రెంచివాళ్ళు కూడా అక్కడ స్థావరం ఏర్పరచుకొన్నారు. క్రీ.శ. 1669లో పన్నులు లేకుండా అక్కడ వ్యాపారం చేసుకొనేందుకు ఫ్రెంచివారు గోల్కొండ సుల్తాను దగ్గర ఫర్మానా పొందారు. బందరులో ఫ్రెంచిపేట ఒకటి ఏర్పడింది. వీరి దుబాషీల వివరాలు కొద్దిగానే తెలుస్తున్నాయి. మంగళగిరి ఆనందయ్య చేత వేదాంతరసాయనం చెప్పించిన నిడిమామిళ్ళవారు ఫ్రెంచి దుబాషీలుగా వుండేవారు.

ఫ్రెంచివారు తూర్పు కోస్తాలో స్థావరాలు ఏర్పరచుకొన్నాక 1701లో పుదుచ్చేరిపై సర్వశక్తులు కేంద్రీకరించారు. పెరంబూరి తిరువెంగళ పిళ్ళై ప్రాంసు హెంగ్లీజు యోలందా, పురతకేశు మొదలైన జాతిభాషా విశేషాలు తెలిసినవాడు ఆయా జాతుల వాళ్ళ పాదిరీలకు తెలియని గూఢార్థాలు యితనికి తెలుసునట.[4] సకల భాషలు మాటాడ, చదువ, వ్రాయ నేర్చినవాడు. ఫ్రెంచివారి దుబాషీగా వున్నాడు. ఈ తిరువెంగళ పిళ్ళై కుమారుడే ఆనందరంగ పిళ్ళై. ఇతడు ఉత్తరోత్తరా పుదుచ్చేరిలో డూప్లేకు దుబాషీ అయ్యాడు.

ఒక్క చెన్నపట్నంలోనేకాక ఇంగ్లీషు కుంఫిణీవారి గిడ్డంగులున్న అన్ని చోట్లా దుబాషీల యిష్టారాజ్యం కొంతవరకూ సాగింది. దొరికిపోయాక శిక్షలు అనుభవించారు. పెద్దపల్లిలో గురవరాజు, అతని సోదరుడు నారాయణ 1632 నుంచి దుబాషీలుగా

4. కస్తూరి రంగకవి - ఆనంద రంగరాట్ఛందం, పీఠిక.58

వుండేవారు. కొల్లా వెంకటాద్రి దుబాషీగా వుండి కొన్ని చిక్కుల్లో పడ్డాడు. 1679లో గోల్కొండ సుల్తానుకు బహుమతులు యివ్వడానికి బందరు కుంఫిణీవారు జాన్ ఫీల్డ్ అనే ఉద్యోగిని పంపారు. అతనికి ఇంటర్ ప్రీటర్‌గా కుంఫిణీ హిజీబు బ్రాహ్మణుడు వెళ్ళాలిగాని అతడు ఏ కారణాల చేతనో వెళ్ళలేకపోయాడు. కొల్లా వెంకటాద్రిని ఆ పనికి అప్పగించారు. బెజవాడలో గొల్కొండ వారిని కలుసుకొని బహుమతులు అందచేశారు. కొల్లా వెంకటాద్రిని గొల్కొండ దాకా తమతో రమ్మని మాదన్నగారు ఆజ్ఞాపించారు. డచ్చివారి దుబాషీ గోబా నరసయ్యను కూడా రమ్మన్నారు. దారిలో ఈ దుబాషులు కొంత భూవసతిని దానంగా పుచ్చుకొని ఫర్మానాలు వ్రాయించుకొన్నారు. బందరుకు వచ్చాక కొల్లా వెంకటాద్రి స్వార్థం చూసుకొన్నాడు గాని కుంఫిణీ వారిని విశ్వాసంగా కొలుచుకోలేదన్న అభియోగం వచ్చింది. విచారణ చేశారు. తనకు యిచ్చిన భూమిని సాగులోనికి తేవాలంటే చాలా ఖర్చు కనుక దానిని వదులుకొంటున్నాననీ డచ్చివారి దుబాషీకి సుక్షేత్రం లభించిందని కొల్లా వెంకటాద్రి మనవి చేసుకొన్నాడు. కుంఫిణీవారు మన్నించారు.[5]

అయితే మళ్ళా యిదే నేరం యింకోసారి విచారణకు వచ్చింది. 1679లో చెన్నపట్నం నుంచి ఏజెంటు, స్ట్రేయిన్‌షాం మాస్టర్సు బందరు పరిశీలనకు వచ్చాడు. కొల్లా వెంకటాద్రిని పిలిపించి విచారణ కోసం ఖైదులో పెట్టారు. పెద్దపల్లి నుంచి వచ్చిన నేటివు వర్తకులు బందరు వర్తకులకన్నా తక్కువ ధరకు వస్త్రాలు సప్లయి చేస్తామని సముఖంలో చెప్పుకొన్నారు. మీ విన్నపం ఆలోచిస్తామని ఏజెంటు చెప్పాడు. ''మచిలీపట్నం వర్తకులు తమ ధరలను తగ్గించుకొనేటట్లు చేస్తాను నన్ను విడుదల చేసి మాట్లాడనివ్వండి'' అని కొల్లా వెంకటాద్రి విన్నవించుకొన్నాడు. చెప్పినట్టే చేసి బందరు వర్తకులు నూటికి ఆరుశాతం ధర తగ్గించుకొనేటట్టు చేశాడు. ఏజెంటు మాస్టర్సు వెంకటాద్రికి విమోచనం కలిగించాడు.[6]

క్రీ.శ. 1679లో పదకొండు మంది ప్రముఖ వర్తకులు మచిలీపట్నంలో యితరులను కలుపుకొని, 84 వాటాలు వేసుకొని 11 రకాల నేతబట్టలు ఖోర్జు (20 తానుల మొత్తాన్ని ఖోర్జు అంటారు). ఒక్కొంటికి 6 1/2 వరహాల నుంచి 25 వరహాల రేటు చొప్పున సప్లయి చేయడానికి ఒప్పందం కుదుర్చుకొని, అయిదువేల వరహాలు అడ్వాన్సు పుచ్చుకొన్నారు. ఆ ప్రముఖ వర్తకుల పేర్లు యివి:

1. మాడల కందప్ప
2. మాడల ముత్యాలు
3. రేకపల్లి కోటప్ప
4. ఆకుల ఎల్లప్ప
5. రేకపల్లి అచ్చన్న
6. చుండూరు అచ్చన్న
7. గౌండ్ల వెంకటాద్రి
8. వెనవెళ్ళి వెంకటపతి
9. నాళం వెంకన్న
10. కోల నరసు
11. ఆళపోతన్న

5. Rechard Temple (ED): The Dairies of Streynsham Masters (1675-1680) and the Contemporary Papers relating to India record series 1917-p.141. Foot note.
6. Gordon Mackenzie - Manual of Krishna Distrist-1883. P.133.

ఈ వర్తకులు కుంఫిణీ బ్రాహ్మణునికి దుబాషీకి వాడుకగా యిచ్చే 'దస్తూరి' నూటికి ఒకటిన్నర శాతం కన్న ఎక్కువ కాకూడదని ఒప్పందంలో వుంది. ఈ దస్తూరి పైకాన్ని వారిద్దరూ సరి సమానంగా పంచుకోవాలి.

కుంఫిణీవారి దుబాషీగా పనిచేసిన వెంకటపతి కుమారుడు వీరరాఘవులు కూడా 1675నుంచీ ఆ పదవిలో వున్నాడు. దుబాషీ వకీలుగా పూనమల్లి నవాబు తరఫున పాలిస్తున్న పాదిలి లింగప్పతో చాలా సఖ్యంగా వుండేవాడు. ఈ కారణం చేత ఇతణ్ణి గవర్నరు మాస్టర్సు బర్తరఫ్ చేశాడుగాని మళ్ళా ఉద్యోగం యివ్వక తప్పలేదు. కుంఫిణీవారి వకీలుగా వీరరాఘవులు గోల్కొండలో చాలా రాచకార్యాలు నెరవేర్చాడు. ఎన్నో పత్రాలలో యితని పేరు కుంఫిణీ 'డిస్పాచెస్'లో కనబడుతుంది.

క్రీ.శ. 1676లో బందరులోవున్న కుంఫిణీ దొరలందరూ పోర్చుగీసు భాషను అభ్యసించాలనీ, అందు నిమిత్తం ఆర్నెల్లపాటు టూటర్లను కుంఫిణీ ఏర్పాటుచేసి ఖర్చులు పెట్టుకొంటుందని, కుంఫిణీ ఆడిటరు మేజరు విలియం సూచించాడు. అరబ్బీ, పారశీక భాషలు కూడా నేర్చుకోవాలని చెప్పాడు. 17వ శతాబ్దంలో పూర్తిగా బుడతకీచు భాషపైనే కుంఫిణీవారు ఆధారపడ్డారని చెప్పవచ్చు.

క్రీ.శ. 1698-1709 ప్రాంతాలలో పిట్టు చెన్నపట్నం గవర్నరుగా వుండేవాడు. అతని కాలంలో ఒక పాపయ్య పంతులు ముఖ్య దుబాషీగా వుండేవాడు. పెర్షియన్, తెలుగు భాషల నుండి అనువాదం చేసేవాడు. ఇతడు 1709లో ముఖ్య దుబాషీ అయ్యాక ఈయనకు ఛత్ర మర్యాదలు యిచ్చారు. ఎక్కడకు వెళ్ళినా వెనక ఒక గొడుగు పట్టేవాడు వుండితీరాలి. 1717లో ఎడమ-కుడి పైట కులాల వివాదాలలో యితడు వహించిన పాత్రకూ, ఉప్పు వ్యాపారంలో సొమ్ము చేసుకొన్నందుకూ కుంఫిణీవారు ఇతణ్ని తొలగించారు. కాని 1720లో మళ్ళా పూర్వ వైభవాలను దఖలుపర్చారు. కర్నాటక నవాబు వద్దకు రాయసం పాపయ్య సుంకురామ చెట్టితో కలసి కుంఫిణీ వకీలుగా 1725లో వెళ్ళాడు. ఇతను గుర్రపు స్వారీ చేసేవాడు.

క్రీ.శ. 1717లో మొగలు చక్రవర్తి ఫర్మానా కుంఫిణీవారికి లభించింది. దానిని ఊరేగించారు. పెద్ది నాయకుడు గుర్రమెక్కి తన తలారులతో, మంగళ వాద్యాలతో ముందు సాగితే, తెల్ల సోల్జర్ల దళమొకటి యిద్దరు ట్రంపెట్ వాద్యగాళ్ళతో అనుసరించింది. తర్వాత అశ్వారూఢుడైన ముఖ్య దుబాషీ, అతని తర్వాత ఆరుగురు సార్జెంటులు కాపలా కాస్తూ రాగా ఫర్మానా వుంచిన పల్లకీ సాగింది. దానివెంట కుంఫిణీ తెల్ల వర్తకులు సాగారు.

క్రీ.శ. 1725-30ల మధ్య మెక్రీ చెన్నపట్టణం గవర్నరుగా వుండేవాడు. గూడా అంకన్న అతనికి దుబాషీగా, దళారీగా వుండేవాడు. ఇరవై సంవత్సరాల సర్వీసు తర్వాత పింఛను పుచ్చుకొన్నాడు. పదవీ విరమణ చేశాక అంకన్నపై చాలా ఫిర్యాదులు వచ్చాయి. వ్యతిరేకంగా ఎన్నో మహజర్లు ఎందరో పెట్టుకొన్నారు. తప్పుడు మార్గాలలో డబ్బు గుంజేవాడనీ, ధాన్యం వ్యాపారంలో కృత్రిమాలు చేసేవాడనీ అభియోగాలు. ఇవి చాలావరకు నిరాధారాలని తేలాయి.

1731 నుండి తంబుచెట్టి కుంఫిణీ వారి ప్రధాన వర్తకుడయ్యాడు. ఇతను కూడా చాలా ప్రముఖుడు. ఇతని పేర నేటికీ చెన్నపట్టణం జార్జి టౌనులో ఒక చాలా పొడుగాటి వీధి వుంది (ఆంధ్రపత్రిక ఆఫీసు ఈ వీధిలోనే వుండేది. 20వ శతాబ్దపు సాహిత్య రాజధానిగా ఈ వీధి చలామణీ అయ్యేది).

బందరులోనే 1679లో కన్నప్ప పంతులు కుంఫిణీ బ్రాహ్మణునిగా వుండేవాడు. ఇతడు తన కొడుకులు మంగరాజు గంగరాజులతో కలసి కుంఫిణీ వారిని దుర్భాషలాడి ఏజెంటును అగౌరవ పర్చాడు. తండ్రీ కొడుకులను ఖైదులో పెట్టారు. 'మాకు బుద్ధొచ్చింది. ఐదువందల వరహాలు జుల్మానా కట్టుకొంటాం. మమ్మల్ని విడుదల చేయండని' కన్నప్పా, కొడుకులు ప్రార్థించారు. ఆ సొమ్మును పుచ్చుకొని మళ్ళా ఫ్యాక్టరీ ప్రాంగణంలో అడుగుపెట్టవద్దనీ, అతిక్రమించిన ప్రతిసారీ అయిదేసి వందల వరహాలు జుల్మానా విధిస్తామని కుంఫిణీవారు హెచ్చరించారు.

ఇంగ్లీషు కుంఫిణీవారిని చాలాకాలం నుంచీ సేవించుకొంటున్న గురవరాజును కుంఫిణీ బ్రాహ్మణునిగాను, అతని తమ్ముడు నారాయణను ఖర్చులు చూసే బ్రాహ్మణునిగానూ నియమించారు. గురవరాజు నెలసరి రెండు వరహాలు జీతాన్నీ, నారాయణకు నెలసరి ఒక వరహా జీతాన్నీ మంజూరు చేశారు.[7] ఆ రోజుల్లో ప్రతి ఫ్యాక్టరీకి ఒక బ్రాహ్మణుడు అవసరం. దుబాషులు వేరే వుండేవారు.

1675 నాటికి బందరులో 16 మంది తెల్లవాళ్ళు కుంఫిణీ ఉద్యోగులుగా వుండేవారు. ముగ్గురు సీనియర్ మర్చెంట్లు - ఒక్కొక్కరికి 40 చొప్పున జీతం.

ఇద్దరు మర్చెంట్లు ఒక్కొక్కరికి	30 చొప్పున జీతం
ఒక ఫాక్టరు	ఇతనికి 20 జీతం
ఎనమండుగురు రైటర్లు	ఒక్కొక్కరికి 10 చొప్పున జీతం
ఒక చాప్లిన్ (పురోహితుడు)	50 జీతం, 30 బహుమాన పారితోషికం
ఒక సర్జను	27 జీతం

ఈ జీతాలు సాలీనా పౌండ్ల ద్రవ్యరూపంలో యిచ్చేవారు. భత్యాలు వేరే వుండేవి.

1754లో కుంఫిణీ గిడ్డంగులలో పనిచేసే తెల్లవారికి సాలీనా 1098 వరహాలు ఖర్చుపెడితే గౌరవనీయంగా బతకగలిగేవారు. వాళ్ళ ఖర్చు వివరాలు యివి :

పల్లకీ-గుర్రం	132 వరహాలు
చాకలి-మంగలి	36 వరహాలు
దుబాషు-వంటవాడు	30 వరహాలు
ఇంటి ఖర్చు వెచ్చాలు	480 వరహాలు
దుస్తులు	150 వరహాలు
చుట్టలు	90 వరహాలు
ఇంటద్దె	180 వరహాలు

7. Gordon Mackenzie పుస్తకంలో పుట 146.

ఈ ఖర్చుల వివరాలు జూనియర్ సర్వెంట్లకు మాత్రమే బొటా బొటీ సౌకర్యాలకు సరిపోతాయి. జీతాలు భత్యాలు పెంచమని కుంఫిణీ ఉద్యోగులు అర్జీ పెట్టుకొన్నారు.[8]

కుంఫిణీ వారికి ఫ్యాక్టరీ బ్రాహ్మణుడు, దుబాషు మాత్రమేకాక వేగులవారు కూడా వుండేవారు. కడపలో, ఆర్కాటులో, చెంజిలో రావినూతల ఆదియప్ప అనే వ్యక్తి కుంఫిణీ వేగులవానిగా పనిచేశాడు. 1740లో చెంజిలో కుంఫిణీ వకీలుగా స్థిరపడ్డాడు. పుదుచ్చేరికి కూడా యితను వెళ్ళాడు.[9] ఆదియప్ప మాత్రమే కాక, ఓరుగంటి రామయ్యా అనే వేగులవాడు కూడా కుంఫిణీవారికి వుండేవాడు.[10]

తూర్పు కోస్తాలో మద్రాసులోని కౌన్సిల్ పాలనకు కట్టుబడ్డ స్థావరాలుగా దక్షిణాదిని ఫోర్టుసెంట్ డేవిడ్, కడలూరు, ఉత్తరాన ఇంజరం, మాధవాయి పాలెం, విశాఖపట్నాలు ఉండేవి. మద్రాసు, పోర్ట్ సెంట్ డేవిడ్, విశాఖపట్నాలలో గిడ్డంగులతోపాటు పటాలాలు కూడా వుండేవి. బందోబస్తు చాలా గట్టిగా వుండేది. ఇంజరం, మాధవాయి పాలెములలో ఉత్త గిడ్డంగులు మాత్రమే వుండేవి. పటాలాలుగాని, ఫిరంగులుగాని వుండేవి కావు.

ఈ కాలంలో డచ్చివారికి తూర్పు కోస్తాలో 9 స్థావరాలు వుండేవి.

1. ప్రళయ కావేరి	6. నరసాపురం
2. మచిలీపట్నం	7. సద్రాసుపట్నం
3. గోల్కొండ	3. దాక్షారం (తిగ్నపట్టణం)
4. పాలకొల్లు	9. భీమునిపట్టణం
5. నాగలవంచ	

డచ్చివారు పాలకొల్లును సాలీనా వెయ్యి వరహాలకు కౌలు తీసుకొన్నారు. సాలీనా 70 లేక 80 వేల వరహాల పెట్టుబడితో వ్యాపారం చేసేవారు. నాగలవంచలో ఇనుము కొని నరసాపురానికి పంపేవారు. ఈ తొమ్మిది కేంద్రాలలో డచ్చివారు స్థానిక నేటివు వర్తకులకు చాలా రుణపడ్డారు. ఇంగ్లీషువారికి విశాఖపట్నం నేటివు వర్తకులు తమ ఓడలతో సహాయం చేసేవారు. అన్నపూర్ణ, వెంకటలక్ష్మి, లక్ష్మీ ప్రసాదం, మహమ్మద్ బక్షి, వెంకటేశం అనేవి కొన్ని ఓడల పేర్లు. 1740 ఫిబ్రవరి 25వ తేదీనాడు భీముని పట్నం నుండి గునుపూడి తమ్మయ్యా అనే వర్తకుడు ఒక ఉత్తరం రాశాడు.

''నిరుడు శానా నష్టపోయాము. ఈ ఏడు వ్యాపారం మెరుగుగా వుంది. చెన్న పట్టణానికి ఓడలు పంపుతున్నాము. అజామత్‌ఖాను నుండి రాబట్టడానికి సహాయం కోరుతున్నాము'' అని అందులో వుంది.[11]

8. H. Dodwell - A Calender of Madras Despatches. 1744-1755. Madras Govt. Press, 1920. p.245
9. H. Dodwell - A Calender of Madras Records. (1740-1774), Madras Govt. Press - 1917, pages 24, 42, 68 and 77.
10. పై పుస్తకంలో పుట.112
11. Dodwell - Madras Records, p.25

చెన్న పట్టణంలో బేరి తిమ్మన్న తరువాత క్రీ.శ. 1672లో కుంఫిణీవారు కాశీ వీరప్పను తమ ముఖ్య వర్తకునిగా నియమించారు. ఈయన గోల్కొండ దర్బారుకు కుంఫిణీవారి వకీలుగా కూడా వెళ్ళేవాడు. మద్రాసులో 'కాశీ వీరన్న అండ్ కంపెనీ' అనే సంస్థ వుండేది. ఈయన క్రీ.శ. 1680లో మరణించాడు. ఆనాడు మద్రాసులోని ప్రముఖ వర్తకులు కొందరి పేర్లు చూద్దాం.

1. పెద్ద వెంకటాద్రి
2. ముద్దు వీరన్న
3. అలంగద పిళ్ళ
4. సూర వెంకన్న
5. అరియప్ప చెట్టి బాలచెట్టి
6. ముద్దు చెట్టి
7. పసుమర్తి కాశయ్య
8. గుట్టి కాల్
9. రంగాచెట్టి
10. చిట్టి ప్రేతో (?)
11. చిన్న వెంకటాద్రి

ఈ వర్తకులు పరిసర పరగణాలలోని నేతగాళ్ళ వద్దనుండి వస్త్రాలు కొని తెచ్చి కుంఫిణీ వారికి సప్లయి చేసేవారు. కమీషను తీసుకొనేవారు. మద్రాసులో ఆనాడు బేరిచెట్లు, ఆర్మీనియన్లు, గుజరాతీలు, కంసాలులు, కోమట్లు, కరణాలు, బలిజలు వుండేవారు. బేరి తిమ్మన్న సోదరుడు చిన వెంకటాద్రి 1695లో కుంఫిణీ వారికి గిండీ పార్కును బహూకరించాడు.

క్రీ.శ. 1711లో సుంకురామ చెట్టి కుంఫిణీవారి ముఖ్య వర్తకుడయ్యాడు. ఇతని పేర నేటికీ చెన్న పట్టణం జార్జిటౌన్‌లో ఒక పెద్ద వీధి వుంది (ఒక సుంకురామ చెట్టి 1751లో రాబర్ట్ ఆర్మ్ అనే మద్రాసు కౌన్సిల్ సభ్యునికి దుబాషీగా వుండేవాడు).

క్రీ.శ. 1755-63 మధ్య పిగాట్ చెన్నపట్నం గవర్నరుగా వుండేవాడు. ఇతని వద్ద మణలి ముద్దుకృష్ణ మొదలి దుబాషీగా వుండేవాడు. ఫ్రెంచివాళ్ళ ముట్టడిలో చెన్న పట్టణంలోని దేవాలయం పడిపోతే ఈయన 1760లో కొత్త దేవాలయాన్ని సొంత నిధులతోనూ, చందాలతోనూ, కుంఫిణీవారు యిచ్చిన ముదరా పైకంతోనూ కట్టించాడు. కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరైన ముత్తుస్వామిదీక్షితులవారి చిన్న తమ్ముడు బాలస్వామి దీక్షితులు (1786-1857) ఒక మణలి చిన్నయా మొదలియారు మన్ననలకు చిన్నప్పుడే పాత్రుడయ్యాడు. ఈ మణలి మొదలియారే బాలస్వామి దీక్షితుల వారికి ఆంగ్లేయ సంగీత విద్వాంసుని వద్ద ఫిడేలు వాద్యం నేర్పించాడు. దుబాషి ముద్దుకృష్ణ మొదలారికి ఈ చిన్నయా మొదలారికి ఏమిటి బంధుత్వమో ప్రస్తుతం తెలియదు.

వారన్ హేస్టింగ్స్ (1769-1772) మద్రాసులోని కౌన్సిల్‌లో ద్వితీయ సభ్యునిగా అధికారానికి వచ్చాక కుంఫిణీవారి నేటివు వర్తకుల కచ్చేరీలను రద్దు చేశాడు. వర్తకుల రూపంలో దళారీలు అనవసరమని, గుమాస్తాలు ఈ పని చేయగలరని హేస్టింగ్స్ భావించాడు. వర్తకుల ప్రభ చాలావరకు తగ్గిందిగాని దుబాషులకు జోరు మరీ హెచ్చింది. న్యాయస్థానాలలోని జడ్జీలకన్నా, చెన్నపట్టణంలోని తెల్లవాళ్ళకన్నా, మేయరు కోర్టులో లాయర్ల, దుబాషీలకన్నా, జడ్జీల దుబాషీలే ఎక్కువ పూజాపునస్కారాలు

పొందేవారు. బాధాకరమైన విషయాలలో అక్రమంగా, అన్యాయంగా దుబాషీలు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసుకొనేవారు.

ఈ దుబాషీగిరీని నిర్మూలించాలని స్టీఫెన్ పాప్హెమ్ అనే సొలిసిటర్ చాలా ప్రయత్నించాడు. పోలీసు రెగ్యులేషన్స్ కోసం 1782లో కృషి చేశాడు. అయితే దుబాషుల ప్రభ తగ్గలేదు.

హాలెండ్ సోదరులు (1790-92) గవర్నర్లుగా ఒకరి తర్వాత ఒకరు పనిచేశాక వీరివద్ద దుబాషీగా వుండే అవధానం పాపయ్యా చాలా కేసుల్లో చిక్కుకొన్నాడు. పిట్టు (1698-1709) కాలంలో వున్న రాయసం పాపయ్యా, అవధానం పాపయ్యా విభిన్నమని భావించాలి. ఈయనకు లంగరు పాపయ్య అనే పేరు కూడా వుంది. కౌటిల్యంలో ఎంతటి నిపుణుడో సాహిత్యంలో అంతటి చతురుడు. స్కాంధ పురాణంలో శంకర సంహితను అనువదించాడు.

చెన్నపట్టణంలోనూ, యితర తెలుగు ప్రాంతాలలోను వుండే దుబాషులు కాలక్రమేణా జమీందారులయ్యారు. మచిలీపట్నంలో కుంఫిణీవారి దుబాషీగా వున్న కాంద్రేగుల జోగిపంతులు (1763 ప్రాంతాలు) ఉత్తర సర్కారులు కుంఫిణీవారికి సంక్రమింప చేయడంలో ప్రధాన పాత్ర వహించాడు. కృతజ్ఞతా సూచకంగా ఆయనకు కుంఫిణీవారు దివిలంక జమీందారీని యిచ్చారు. 1853 దాకా ఈ జమీందారీ కాంద్రేగులవారి వంశంలోనే వుంది.

మచిలీపట్నంలో ఫ్యాక్టరీకి 1759లో, 1761లో ఛీఫుగా వున్న ఆంద్రూస్ వద్ద గోడే జగ్గారావుగారు దుబాషుగా వుండేవారు. విశాఖ ప్రాంతాలకు ఆంద్రూస్‌తో వెళ్ళి, అక్కడ జమీందారీని కొని ఉత్తరోత్తరా 'మహారాజా' అనే బిరుదును కూడా సంపాదించాడు.

1747లో ఫ్రెంచివారి సర్వాధికారి అయిన డూప్లే, ఆనందరంగ పిళ్ళైను తన ముఖ్య దుబాషీగా పుదుచ్చేరిలో నియమించుకొన్నాడు. సాహిత్య పోషకునిగా ఆనందరంగ పిళ్ళై తెలుగు సాహిత్యంలో ఓ స్థానం ఏర్పరచుకొన్నాడు.

1750 ప్రాంతాలలో లక్ష్మన్న, బుస్సీదొర దగ్గర ముఖ్య దుబాషుగా చేరాడు. బొబ్బిలి యుద్ధం పాటలో దుబాషు లక్ష్మన్న ప్రసక్తి చాలాసార్లు వినబడుతుంది. జానపదులు పాడుకొనే పాటలోనికి లక్ష్మన్న ఎక్కి, సజీవుడయ్యాడు.

సీమ నుంచి భారతదేశానికి కుంఫిణీ ఉద్యోగులుగా వచ్చే తెల్ల దొరల ఓడలు యింకా రేవులోనికి వస్తూ వుండగానే కట్టు మ్రానుల మీద దుబాషులు వెళ్ళి, ఓడలో కొత్త దొరలను పరిచయం చేసుకొనేవాళ్ళు. పోటాపోటీల మీద 'వీరు నాదొరగారు' అని హక్కు ప్రకటించుకొనేవారు.

ఏ తెల్లదొరకైనా దుబాషీ తప్పనిసరి లంపటం. హమేషా కనిపెట్టుకొని వుండే సేవకుడు నీడలా వెన్నంటి వుంటాడు. తాను పనిచేయవలసిన ఊళ్ళో ఏ ఒక్కరూ

తెలియకపోతే నూతనంగా వచ్చిన తెల్లదొర ఏం భయపడనక్కరలేదు. దుబాషుకు అందరూ తెలుసు. అన్ని విషయాలూ చెప్పగలడు. దొర ఉద్యోగం మీదగాని విలాసం కోసంగాని ఎక్కడెక్కడికి వెళ్ళాడో దుబాషుకు తెలుసు. ముఖ్యులను పరిచయం చేయగలడు. పనులు చేసిపెడతారు. బేరాలు దళారీగా ఫాక్టు పరుస్తాడు. తన జీతం గురించి ఏమీ షరతులు పెట్టడు. దొరగారి దయాదాక్షిణ్యాలు చాలు. తాను చెప్పిన దుకాణాలలోనే దొరగారు సరుకులు కొంటే మహామంచిది. దొరగారి దగ్గర నగదు లేకపోతేనేం, దుబాషీ ఎంత మొత్తమైనా అప్పుగా యిస్తాడు. దొరగారు పెద్ద ప్రభుత్వానికి వచ్చినపుడు నిమ్మళంగా తీర్చవచ్చు.

ఏరికోరి ఎవ్వరైనా యిలా బానిసలుగా కొలుచుకొనడం ప్రారంభిస్తే చండశాసనుడిగా దొర మారడం విడ్డూరం కాదు అని ఒక ఆంగ్లేయుడు రాశాడు.[12]

క్రీ.శ.1600 తూర్పిండియా కుంఫిణీ స్థాపన కాలం నుంచి 1759 మే నెలలో మచిలీపట్నంతో సహా ఎనిమిది పరగణాలను సలాబత్ జంగ్ ఇంగ్లీషు వాళ్ళకు ఇనాంగా ఇచ్చేదాకా కుంఫిణీవారు కేవలం వ్యాపార దృక్పథంతోనే ప్రవర్తించారు. తర్వాత క్రమేణా పాలకులయ్యారు.

ఆదిలో వుండే దుబాషీలు, వకీళ్ళు, వర్తకులు మొదలైన వారి స్థానంలో గుమాస్తాలు, మున్షీలు, పండితులు అనే హోదాలలో భారతీయులు తెల్ల దొరల దగ్గర కొలువు చేశారు. వీళ్ళలో చాలామంది విద్యావంతులు, లోకజ్ఞులు, గ్రంథకర్తలు. 19వ శతాబ్దంలో వీరివల్ల మన ఆలోచనాసరణి క్రమంగా మారడం ప్రారంభమైంది. ఇది కుంఫిణీ యుగంలోని సాహిత్యానికి నేపథ్యం.

12. A visit to Madras - being a sketch of the Local and Characteristic Peculiarities of the Presidency - Printed for Sir Richard Philips and Co., London, 1821.

తెల్లవాళ్ళు - తెలుగు భాష

తెల్లవాళ్ళ వల్ల మన దేశానికి రాజకీయంగా ఎన్నో అనర్థాలు వచ్చినా, సాహిత్య సాంస్కృతిక రంగాలలో చాలా మేళ్ళు కలిగాయి. ఒక్కొక్క దేశ భాషకు కొందరు కొందరు తెల్లవాళ్ళు మళ్ళా ప్రాణం పోశారు. నిఘంటువులు, వ్యాకరణాలు, వాచకాలు వ్రాశారు, వ్రాయించారు. అచ్చుకూటాలు నెలకొల్పారు. మూల మూలలలో వుండే వ్రాతప్రతులను ఒక దగ్గర సమీకరించారు. గ్రంథాలను ప్రచురించారు. గ్రంథాలయాలను స్థాపించారు. మన పాత చరిత్రను అక్షరాలా తవ్వి పైకి తెచ్చారు. పురాతన శిల్పాలను కనిపెట్టారు. ప్రపంచానికి మన భాషల గురించీ, సంస్కృతి గురించీ చాటి చెప్పారు.

తెలుగు భాషతోనూ, తెలుగు దేశంతోనూ సంబంధం వున్న తెల్లవాళ్ళ గురించి యిప్పటిదాకా సమగ్రంగా ఎవరూ వ్రాయలేదు. నేను సేకరించిన విషయాలను సవిస్తరంగా చారిత్రక క్రమంలో మనవి చేస్తాను.

జేమ్సు గ్రాంటు: తెల్లవాళ్ళకు లభించిన మొదటి తెలుగు ప్రాంతాలు - ఉత్తర సర్కారులు. వీటి సంక్షిప్త రాజకీయ చరిత్రనూ, విపులమైన రెవెన్యూ చరిత్రను వ్రాసిన ప్రథమ ఆంగ్లేయుడు జేమ్సు గ్రాంటు. ఈయన నిజాము దర్బారులో బ్రిటీషు వాళ్ళ రాయబారిగా వుండేవాడు. ఆ హోదాలో ఎన్నో భోగట్టాలు సేకరించి ఉత్తర సర్కారుల వైనాన్ని రహస్యంగా వారన్ హేస్టింగ్స్‌కు లేఖా మూలంగా పంపాడు. ఇతడు 20-12-1784వ తేదీన వ్రాసిన సుదీర్ఘ నివేదికను బెంగాలు ప్రభుత్వం రెండేళ్ళ తరువాత లండను అధికారులకు పంపింది.

ఈ నివేదిక వల్ల ఆనాడు ఉత్తర సర్కారుల జనాభా 24 లక్షలనీ, 70 మంది జమీందార్ల ఏలుబడిలో వీళ్ళు వుండేవారనీ తెలుస్తోంది. ఉత్తర సర్కారులలో ఈ కొస నుంచి ఆ కొస దాకా రాజులమనీ, జమీందారులమనీ చెప్పుకొనే వాళ్ళలో ఏ ఒక్కడికీ వాస్తవానికి ఒక అంగుళం మేర భూమి మీద న్యాయబద్ధమైన హక్కులు లేవని జేమ్సు గ్రాంటు నిరూపించాడు. వీళ్ళందరూ ప్రజల నుండి పన్నులు వసూలుచేసి నిజాముకు చెల్లించవలసిన దళారీలే అని ఖాయపర్చారు. ఈ జమీందారీల సన్నదులలో విశ్వసనీయమైనవి తక్కువ. ఫోర్జరీలు సర్వ సాధారణం. ఇరవై రూపాయలకు దొంగ మొహరు ముద్ర లభించేదట! ఉత్తర సర్కారులోని రాజ్యాంగ సంస్కరణలను ఎలా చేయాలో జేమ్సు గ్రాంటు సూచించాడు. దేశీయ విద్యలు మూలపడ్డాయనీ, వాటిని ఉద్ధరించాలని కూడా చెప్పాడు. సింహాచలంలో ఒక హిందూ విద్యాలయాన్నీ, చికాకోలులో ముస్లిం మద్రసాను స్థాపించమని సిఫార్సు చేశాడు. వీటి నిమిత్తం సాలీనా ఒక లక్ష రూపాయాలను కేటాయించమని సలహా యిచ్చాడు.[1] అయితే ఈ సూచనలను ప్రభుత్వం పాటించినట్టు లేదు. వీటినే అమలు జరిపి వుంటే జేమ్సు గ్రాంటు పేరు చెప్పుకొని చాలామంది బాగుపడేవారు.

---

1. 5th Report - Appendix.13, p.97

ఛార్లెస్ వైట్: దేశీయ విద్యలను ఉద్ధరించాలని జేమ్సు గ్రాంటు సిఫార్సు చేస్తే, దేశ భాషలను తెల్లవాళ్ళు నేర్చుకోవాలని ఛార్లెసు వైట్ హెచ్చరిక చేశాడు. ఈయన సెంట్‌జార్జి కోటలో చాలా ప్రముఖమైన హోదాలో వుండేవాడు. క్రీ.శ. 1793లో రెవెన్యూ బోర్డులో సభ్యునిగా వుంటూ ఎన్నో యాదస్తులు వ్రాశాడు. ఉత్తర సర్కారులలో పరిపాలన సక్రమంగా సాగకపోవడానికి ముఖ్య కారణం తెల్లవాళ్ళకు తెలుగు రాకపోవడమే అని చెప్పాడు. అంతా దుబాషీల ద్వారా జరిగేది. ''సర్కార్లను స్వాధీనపరచుకొన్నాక ప్రొవిన్షియల్ కౌన్సిళ్ళలోని పెద్ద మనుషులలో ఏ ఒక్కడూ తెలుగులో ప్రావీణ్యం సంపాదించినట్టు నాకు జ్ఞాపకం లేదు. పోనీ పనికొచ్చే ఏ పథకాన్నయినా రూపొందించలేదు'' అని ఛార్లెస్ వైట్ వ్రాశాడు. ప్రాంతీయ భాషలు రానివాళ్ళకు రెవెన్యూ పదవులు యివ్వకూడదని సిఫార్సు చేశాడు. న్యాయస్థానాలను స్థాపించగానే తెల్లదొరలకు భారతీయ భాషల జ్ఞానం అనివార్యమైన అవసరమవుతోందని 1793లోనే హెచ్చరిక చేశాడు.

వీటన్నిటికన్నా ఛార్లెస్ వైట్ చేసిన సూచనలలో ముఖ్యమైనది యింకొకటి వుంది. భారతీయ భాషలు నేర్చుకొనడానికి అవసరమైన గ్రంథాలూ, నిఘంటువులు అప్పటికి తయారు కాలేదు. తెలుగు భాషలో సక్రమమైన నిఘంటువు లేదని వైట్ గుర్తించాడు. అందుకే చక్కని నిఘంటువు వ్రాసిన వాళ్ళకు మంచి బహుమానం యిస్తామని ప్రకటించమన్నాడు.[2] తెలుగు నేర్చుకొనేవాళ్ళకు ఉపయోగపడే ప్రాథమిక గ్రంథాలను వ్రాయించమని సూచించాడు. బహుశా ఛార్లెస్ వైట్ చేసిన ఈ సిఫార్సు వల్లనే సెంట్ జార్జికోట దొరతనం వారు మామిడి వెంకయ్యగారి ఆంధ్రదీపికను కొన్నారని భావించవచ్చును. ఏమైనా తెలుగు నిఘంటు రచనకు అంకురార్పణ చేసిన తెల్లవాళ్ళలో ఛార్లెస్ వైట్ ప్రథముడు.

సర్ థామస్ మన్రో: తెలుగు నేర్చుకొన్న తెల్లవాళ్ళలో సర్ థామస్ మన్రో సుప్రసిద్ధుడు. ఈయన తన పంధొమ్మిదో ఏట 1780లో మద్రాసుకు సైనిక విద్యార్థిగా వచ్చాడు. తన 66వ ఏట మద్రాసు గవర్నరుగా భారతదేశంలోనే చనిపోయాడు. ఈ మధ్యకాలంలో రెండుమార్లు యూరపుకు వెళ్లి మొత్తం పదేళ్ళు వున్నాడుగాని మిగతా జీవిత కాలాన్ని భారతదేశంలోనే భారతదేశం కొరకు వెచ్చించాడు. రాయలసీమ తెల్లవాళ్ళ చేతికి రాగానే దాని పాలకునిగా మన్రోని నియమించారు. దత్త మండలాలలో వుండే 80 మంది పాలెగాళ్ళను అదుపులోనికి తెచ్చి రైతులకు ఉపకారం చేశాడు. అందుకే మొన్నమొన్నటిదాకా రైతులు తమ బిడ్డలకు 'మన్రోలప్ప' అని కృతజ్ఞతా సూచకంగా పేర్లు పెట్టుకొనేవారు. భారతీయ గ్రామీణ జనుల నిజాయతీని, నిరాడంబరాన్ని మన్రో చాలా మెచ్చుకొన్నాడు. తెల్లవాళ్ళతో సరిసమానమైన ఉన్నత పదవులను భారతీయులకు యివ్వాలని పట్టుపట్టిన వాళ్ళలో మన్రో ప్రముఖుడు. పెద్ద ఉద్యోగాలలో రాణించడానికి భారతీయులు విద్యావంతులు కావాలని గుర్తించి చెన్న రాజ్యంలోని విద్యావిధానం గురించి తాను గవర్నరు కాగానే దర్యాప్తు చేయించాడు. పాఠశాలలు నెలకొల్పడానికీ,

2. 5th Report - Appendix.14, p.140

పరీక్షలు జరిపించడానికీ ఎన్నో పథకాలు వేశాడు. అయితే అవి నెరవేరకముందే మరణించాడు. మన్రో పథకాలు అమలు జరిపి వుంటే తెలుగు విద్యా విధానం శోభించేది. ఏమైనా మన్రోకు రాయలసీమ అంటే ప్రాణం. అక్కడే తన ప్రాణాలు కూడా విడిచాడు.

విలియం బ్రౌన్: మన్రోలాగే భారతదేశంలో ప్రాణాలు విడిచిన మరొక తెల్లదొర విలియం బ్రౌన్. ఈయన కూడా మన్రోలాగే తొలిరోజుల్లో భారతదేశానికి వచ్చాడు. 1783లో రైటరుగా మద్రాసుకు వచ్చాడు. ఏభై సంవత్సరాల సర్వీసు చేసి 1837లో మద్రాసు శాంథోమ్‌లో మరణించాడు. ఈ దీర్ఘకాలంలో యితడు ఉత్తర సర్కార్లలో మచిలీపట్టణం, విజయనగరం, విశాఖపట్టణం, కళింకోట, గంజాం మొదలైన ఊళ్ళలో వున్నాడు. హైదరాబాదులో కూడా నాలుగేళ్ళు పే మాస్టరుగా పనిచేశాడు. ఉత్తర సర్కార్లలో కలెక్టరుగా, జడ్జీగా ఉద్యోగం చేశాడు. వాడుక భాషను బాగా నేర్చుకొన్నాడు. 1786లో మచిలీపట్టణంలో వున్నప్పుడు మామిడి వెంకయ్య, గుండుమళ్ళ పురుషోత్తం వంటి విద్యావంతుల సహాయంతో తెలుగు వ్యాకరణాన్నీ, అంక పద సూచికను ఇంగ్లీషులో రచించడం మొదలుపెట్టాడు. ఇతని తెలుగు వ్యాకరణం చాలా విలక్షణమైనది. ఆంధ్ర భాషలో నిజానికి ఇరవై రెండు అక్షరాలే వున్నాయని యితని వాదం. 'ఇ ఈ, ఉ ఊ, ఋ, ౠ, (ఌ, ౡ), ఎ ఏ ఐ, ఒ ఓ ఔ అనే అక్షరాలు ప్రచారంలో లేవనీ, మరుగున పడ్డాయనీ చెప్పాడు. వీటి బదులు 'యి యీ, వు వూ, రు రూ, లు లూ, యె యే, అయి, వొ వో అవు' అనే అక్షరాలే వాడుతున్నారని చెప్పాడు. తాను కూడా యిలాగే తన రచనలలో వాడాడు. ఇంగ్లీషు వర్ణక్రమం ప్రకారం తెలుగు అక్షరాలను విలియం బ్రౌన్ యిలా వర్గీకరించాడు:

బ భ	b;	డ ఢ, ద ధ	d;
చ ఛ	c or ch soft	ఫ	f or ph
గ ఘ	g;	ప	p;
హ	h; hard	ర	r;
జ	j or z	స	s;
క ఖ	k; q; also c hard		
ల ళ	l;	ట, ఠ, త, థ	t;
మ	m;	వ	v; and w
న ణ	n;		also 'o'
		య	y and i sound e, u

ఖ కు బదులు క్ష; శ - ష లు అదనం.

ఇది ఇంగ్లీషువాళ్ళు తెలుగు నేర్చుకొనడానికి ఉపయోగపడుతుంది. తన గ్రంథాన్ని ఎవరి కోసం ఉద్దేశించాడో వాళ్ళ సౌకర్యాలనే విలియం బ్రౌన్ మనసులో పెట్టుకొన్నాడు. చెప్పవలసినవి చాలా నిర్మోహమాటంగా చెప్పాడు. తెలుగు పామరులు మాట్లాడే భాష తమిళ శిష్టుల భాషకన్నా శ్రావ్యంగా వుంటుందన్నాడు. భావ ప్రకటనలో గంభీరంగానూ వినడానికి కమ్మగానూ తెలుగు వుంటుందని ప్రకటించాడు. ఆంధ్రులను అతడు

జెంటూలనే పిలుస్తాడు. అయితే తెలుగువాళ్ల పట్ల ఆయనకి అమితమైన అభిమానం. విజయనగరం ప్రాంతాలలోని రాచవారి భాషనే అతడు శిష్ట భాషగా గుర్తించాడు. వాళ్ళ మర్యాదలను మెచ్చుకొన్నాడు. బ్రాహ్మణులు ఉత్త పుస్తకాల పురుగులనీ, భాషాడంబరాన్ని ప్రదర్శించుతారనీ చెప్పాడు. రాచవారు కూడా సంస్కృత పదాలు, పదబంధాలు, పారసీక శబ్దాలు ఎంచి వాడుతారని నేరారోపణ చేశాడు. భాషకివి అనవసరమని అతని వాదన. తెలుగు దేశంలోని గ్రామీణులు ఈ మాటలను తిరస్కరించారనీ, వాళ్ళ మర్యాదా మప్పితాల గురించి శంకించనక్కర్లేదని సమర్థించాడు.

సంస్కృత పదాలు విరివిగా ఉన్నంత మాత్రాన తెలుగు భాషకు సంస్కృతమే తల్లి అని చెప్పకూడదని కచ్చితంగా ప్రకటించాడు. పారసీక భాషలో యిప్పుడు కోకొల్లలుగా అరేబియన్ పదాలు వున్నాయిగాని ఫిరదౌసి షానామా వ్రాసిననాడు ఫార్సీ స్వచ్ఛమైనది కాదా? తెలుగు కూడా ఒకప్పుడు అంతే అని విలియం బ్రౌన్ వాదించాడు.[3] అరబ్బీ కత్తి పారసీక భాషను ఎలాగ పాదాక్రాంతం చేసుకొందో సంస్కృతం కూడా తెలుగును అలాగే బానిసను చేసుకుందని విలియం బ్రౌన్ సానుభూతి ప్రకటించాడు. మహమ్మద్ ప్రవక్త చేతిలోని పట్టాకత్తిల్లాగే బ్రాహ్మణుల శక్తి ప్రజల భాషను మార్చేసిందని వాపోయాడు.

దేశవాళీ తెలుగును యింతగా ప్రేమించే విలియం బ్రౌన్ తన వ్యాకరణాన్ని 1817లో ప్రకటించాడు. తనకన్నా ముందు తెలుగు వ్యాకరణాలను వ్రాసిన వాళ్ళను స్మరించాడు. ఫ్రెంచి భాషలో ఒక తెలుగు వ్యాకరణాన్ని ఎవరో వ్రాశారనీ, గుంటూరులోని మిషనరీల ద్వారా దానిని సంపాదించాననీ చెప్పాడు, ఇది మిడిమిడి జ్ఞానంతో వ్రాసినదీ, ఎందుకూ పనికిరానిదనీ తేల్చాడు. తన సమకాలికుడూ, కలకత్తా సీరాంపురంలో వున్న మిషనరీ విలియం కేరీ ప్రచురించిన తెలుగు వ్యాకరణం కూడా నిరుపయోగం అని చెప్పాడు. విలియం బ్రౌన్ వ్రాసిన ఈ వ్యాకరణం నిరుపయోగమని అనంతర వ్యాకర్తలు అన్నారు. అది వాస్తవమే కావచ్చుగాని అతని చిత్తశుద్ధిని ఎవరూ కాదనలేరు. తెలుగులో పరిపాలన చెయ్యడానికి, తెల్లదొరలను తర్ఫీదు చేయడానికి ఈ వ్యాకరణాన్ని అతడు వ్రాశాడు. ఆ దృష్టితోనే 'వొకాబులరీ' అనే పద సంకలనాన్ని కూడా తయారు చేశాడు. ఇది నిఘంటువు కాదని విలియం బ్రౌన్ చెప్పాడు. నిఘంటువు అంటే భాషలోని ఏ ఒక్క పదాన్నీ వదలి వెయ్యకూడదు. ఒక్కొక్క మాట ఎక్కడ నుండి వచ్చినదీ వివరించాలి. ఇదంతా దండగ అని అతని వుద్దేశం.

వాస్తవానికి తెలుగు సాహిత్య పఠనం కూడా దండుగే అని విలియం బ్రౌన్ వుద్దేశం. తెలుగు సాహిత్యం చాలా స్వల్పమే అనీ, ప్రామాణిక కవులు లేరనీ, అందుచేత తన 'వొకాబులరీ'లోని పదాలకు జనుల వాడుక నుంచే ప్రయోగాలు యిచ్చాననీ చెప్పాడు. తెల్లవాళ్ళు తెలుగు సాహిత్యం గురించి మృగ్యమైన పరిశోధనలూ, శుష్క ప్రయత్నాలు చేస్తే వచ్చిన ఫలితాల వల్ల వ్యయ ప్రయాసలు గిట్టుబాటు అవుతాయని ఎవరైనా చెప్పగలరా!

3. విలియం బ్రౌను పారసీక పండితుడు కూడా. 1835 నుండి మరణించేదాకా అతడు సర్కారు వారి పారసీక భాషానువాదకునిగా పనిచేశాడు.

అని విలియం బ్రౌన్ సవాలు చేశాడు. అయితే అందరూ ఇతనిలాటి వాళ్ళేకాదు. తెలుగు భాషకు మంచి సాహిత్యముందనీ, పరిశోధనలు చేయాలనీ మిగతా తెల్లదొరలు భావించారు. ప్రయత్నాలు చేశారు. విలియం బ్రౌన్ తాత్కాలిక ప్రయోజనాలు చూసుకొన్నాడు. పని గడిస్తే చాలు అనుకొన్నాడు. అందుకే లోతుగా తరచి చూడలేదు. తనకన్నా యితరులు ముందుగా తెలుగు వ్యాకరణాలు ప్రచురించేస్తున్నారని తొందరపడి తన గ్రంథాలను ప్రకటించాడు. తన వ్యాకరణాన్ని 1809లోనే పూర్తి చేశానని ప్రకటించాడు. అయితే 1816లో ఎ.డి. కాంబెల్ ఒక తెలుగు వ్యాకరణం ఇంగ్లీషులో ప్రచురించాడు. అందుకు నొచ్చుకొని విలియం బ్రౌన్ తన వ్యాకరణాన్ని 1817లో ప్రచురించాడు. మరుసటి సంవత్సరం 'వొకాబులరీ' ప్రచురించాడు. వీటివల్ల సమకాలికులకు ఎంత లాభించిందో చెప్పలేంగాని ఆనాటి శిష్టభాష ఎలా వుండేదో తెలుసుకొనేందుకు యివి చాలా ఉపయోగపడతాయి. ఆనాటి సాంఘిక చరిత్రను కూడా 'వొకాబులరీ' వల్ల తెలుసుకోవచ్చును. ఉదాహరణకు 'పుర్రె' అనే పదం దగ్గర 'కాటకం చేత ఆ వూరి దగ్గర శానా పుర్రెలు అగుపడ్డవి' అని వ్రాశాడు. 'పాతర' అనే పదంకింద యిలా వ్రాశాడు. 'ప్రజలు కిస్తీ పైకం యివ్వనందున వారి తాలూకు గల్లా జప్తుచేసి పాతళ్ళు వేసినారు' అని ఉదాహరణ యిచ్చాడు. 'ఉద్యోగం' కింద 'కుంఫిణీ ఉద్యోగం విడిచిపెట్టి రాజు దగ్గిరకు వెళ్ళినాడు' అని వ్రాశాడు. ఇటువంటి పదాలవల్ల ఆనాటి పరిస్థితులను తెలుసుకోవచ్చును. చిన్నచిన్న వాక్యాల వల్ల విలియం బ్రౌన్ శైలి తెలుస్తున్నా అతడు తన వ్యాకరణంలో చెప్పిన ఒక కథని కొంచెం విపులంగా చదివితే అది ఎంత శిష్ట వ్యావహారికమో తెలుస్తుంది. చూడండి:

'వోయి రాజా నేను వొక కథ మనస్సు సంతోషపడేటట్టు చెప్పుతాను. నిమ్మళముగా విను'. కాళింది అనే నది యొక్క దరిని బ్రహ్మస్థలమనే పేరుగల వొక అగ్రహారం వున్నది. అందులోను మహాపుణ్యాత్ముడైనటువంటిన్ని, వేదశాస్త్రములు తెలిసినటువంటిన్ని, శ్రేష్టుడైనటువంటిన్ని యజ్ఞస్వామి అనే పేరుగల శరీరము గల బ్రాహ్మణుడు వున్నాడు. ఆయనకు పారిజాత పుష్పముల వలె మృదువైన శరీరము గల మందారవతి అనే పేరుగల కూతురు గలదు. ఆమె మహాయోగ్యమైన చక్కదనమూ, వంశతీరూ, మంచి నడవడీ గలదని వినకరిని పొంది వున్నది. గనుక భూమిలోపల తగిన బ్రాహ్మణోత్తములు ఆ కన్యను తమ కొడుకులకు అడగవలెనని కోరి ఆమె తండ్రి వద్దకు వత్తురు.'

ఈ వచన భాగం వల్ల విలియం బ్రౌను నాటి శిష్టుల భాషనే సొంతం ప్రామాణికంగా స్వీకరించాడని స్పష్టమవుతుంది. అయితే అతని గ్రంథాలను సెంట్‌జార్జి కోటలోని కాలేజీ అధికారులు ప్రామాణికంగా ఎంచలేదు. వాళ్ళు ఎ.డి. కాంబెల్‌గారి వ్యాకరణాన్ని ఆదరించారు.

అలెగ్జాండర్ డంకన్ కాంబెల్: 'ఏదైనా నేర్చుకొంటే క్షుణ్ణంగా నేర్చుకోవాలి. ఆ విషయంపై ప్రముఖ, ప్రామాణిక గ్రంథాన్ని గట్టిగా చదువుకోవాలి' అన్న నియమాలతో కాంబెల్ తెలుగు వ్యాకరణం నేర్చుకొన్నాడు. ఈయన 1807లో రైటరుగా చెన్న పట్టణానికి వచ్చాడు. ఉదయగిరి నారాయణయ్యగారి వద్ద ఆంధ్ర శబ్ద చింతామణిని

ఆమూలాగ్రం చదువుకొన్నాడు. విపులంగా నోట్సు తీసుకొన్నాడు. ఆంధ్ర కౌముది, అహోబలపండితీయం, మామిడి వెంకయ్యగారి ఆంధ్ర దీపిక పీఠిక మొదలైనవి పదేళ్లపాటు చాలా కూలంకషంగా పరిశీంచాడు. తను తీసుకున్న నోట్సు తోటివాళ్ళకు ఉపయోగపడాలని ఆరు ప్రకరణాలలో 519 సూత్రాలతో ఆంధ్ర వ్యాకరణాన్ని ఇంగ్లీషులో వ్రాశాడు. 'వాడుక భాషకూ, కావ్య భాషకూ చాలా తేడా వుంది. నిత్య వ్యవహారానికి పనికిరాకపోయినా ఒక భాషలోని వ్యాకరణ సూత్రాలను ఆ భాషావేత్తలు ఎలా చెప్తారో అలాగ విశదపరచి విపర్యాలు ఏమైనా వుంటే వాటిని చూపించడమే తన విధి' అని కాంబెల్ భావించాడు. అనుమానాలు వచ్చిన చోట పట్టాభిరామ శాస్త్రులవారి సలహాలు తీసుకొన్నాడు. ఇంగ్లీషు భాషలో వ్రాసిన తెలుగు వ్యాకరణాలలోనికల్లా యిదే అప్పటికి ప్రామాణికమైనది.

అంత సాధికారమైన రచన కనుకనే కాంబెల్ వ్యాకరణం కాపీ రైటును కాలేజి బోర్డువారు కొనుక్కున్నారు. 1816లో కాలేజీ ప్రెస్సులో అచ్చువేశారు. కాంబెల్ దొరకు తొలి దగ్గర్నుంచీ కాలేజీ బోర్డుతో సంబంధముంది. 1812 నుండీ అతడు దేశభాషల అధ్యయన సంఘానికి కార్యదర్శి, ఇదే తరువాత కాలేజీ బోర్డు అయింది. ఈ బోర్డుకు కార్యదర్శిగా, పరీక్షాధికారిగా 1812 నుండి 1820 దాకా ఎనిమిదేళ్ళు కాంబెల్ పనిచేశాడు. విద్యార్థుల కష్టసుఖాలు తెలుసుకొని వాళ్ళకి ఉపయోగపడేటట్టు వ్యాకరణ రచన చేశాడు.

కాంబెల్ ప్రతిభా విశేషాలు గుర్తించిన కాలేజి బోర్డువారు అతణ్ణి ఒక నిఘంటువు కూడా రచించమని పురమాయించారు. 1820లో కాంబెల్ దొర బళ్ళారిలో కలెక్టరుగా, మేజిస్ట్రేటుగా వుండేవాడు. అక్కడ వుంటూనే నిఘంటు రచన చేయడానికి కావలసిన సదుపాయాలను సర్కారువారు కలిగించారు. మామిడి వెంకయ్యగారి ఆంధ్ర దీపికను ప్రాతిపదిక చేసుకొని కొత్త పదాలను కలుపుకొంటూ, తెలుగు భాషకు ఇంగ్లీషు అర్థాలను యిస్తూ కాంబెల్ తన నిఘంటువును పూర్తి చేశాడు. ఇది 1821లో తొలిసారి అచ్చుపడింది. కాలేజీ ప్రెస్సులోనే ముద్రించారు. క్వార్టో సైజులో 601 పుటలు వున్నాయి (గోవా కాగితాలపై అచ్చువేసిన ప్రతి ఆ రోజుల్లో 15 రూపాయలకు అమ్మేవారు. చీనా కాగితాల ప్రతి ధర 6 రూపాయలు). ఈ నిఘంటువు 1848లో మరొక ముద్రణ పొందింది. చాలాకాలం వరకూ విద్యార్థులకు ఈ నిఘంటువు చాలా ఉపయోగపడింది.

మద్రాసు రాష్ట్రం విద్యాభివృద్ధికి కాంబెల్ చాలా సేవ చేశాడు. 1820లో బళ్ళారిలో వుండేటప్పుడు ఆయన తెలుగు విద్యా విధానంపై చాలా విపులమైన దర్యాప్తు చేశాడు. సర్ థామస్ మన్రోగారికి చాలా సుదీర్ఘమైన నివేదికను పంపాడు.[4] ఆనాటి విద్యాచరిత్రకు ఈ లేఖ చాలా ఉపయోగపడుతుంది. జిల్లా కేంద్రాలలో ఉద్యోగాలు చేసి రాజధాని నగరానికి చేరుకొనగానే కాంబెల్ మళ్ళా 1827 నుండి కాలేజీ బోర్డు సభ్యుడయ్యాడు. స్కూలు బుక్కు సొసైటీ సభ్యునిగా పనిచేశాడు. రెండేళ్ళపాటు సర్కారువారి తెలుగు ట్రాన్స్‌లేటరుగా కూడా విధులు నిర్వర్తించాడు. సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనేవాడు (మదరాసు లిటరరీ సొసైటీ ప్రారంభం నుంచీ అతడు సభ్యుడు. తొలి రోజుల్లో కార్య నిర్వాహక సంఘంలో కూడా వుండేవాడు).

4. Selections from Educational Records, 1840-1859, Ed. by J.A. Richey, Part-II, 1922.

దక్షిణాది భాషలలో పరిశోధనలు చేసే యితర పాశ్చాత్యులతో కాంబెల్ మంచి సంబంధాలు పెట్టుకొనేవాడు. తన వ్యాకరణ గ్రంథంలో ఎల్లిస్ దొరగారి చేత ద్రావిడ భాషలపై విపులమైన పీఠికను వ్రాయించి ప్రకటించిన సహృదయుడు. ఇతడంటే తోటి తెల్లవాళ్ళేకాక తెలుగు పండితులు కూడా చాలా గౌరవించేవారు. రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు ఒక తెలుగు వ్యాకరణాన్ని కాంబెల్ దొర ఉత్తర్వుపై రచించారు. అందులో అతణ్ణి 'తెలుగుభాష యందు బూర్ణ ప్రజ్ఞ కలిగి సకల దేశములందు బ్రసిద్ధి కెక్కియున్న'వాడని ప్రశంసించారు.

అరవై మంది సభ్యులతో చెన్నపట్నంలో క్రీ.శ. 1834లో సంస్థాపించిన హిందూ లిటరరీ సొసైటీ గురించి వివరాలు మద్రాసు నుండి వెలువడే అసైలమ్ మద్రాసు ఆల్‌మనాక్ 1835వ సంవత్సరం సంపుటంలో ఉన్నాయి. ఈ సంస్థలో నల్లవాళ్ళతోపాటు తెల్లవాళ్లు కూడా కరస్పాండింగు మెంబర్లుగా ఉండడం ఆనాటి సాహిత్య సాంస్కృతిక జీవనంలోని సౌమ్య సంబంధాల నిదర్శనం. ఇంతమంది విద్యావంతుల మధ్య ప్రెసిడెంటుగా మన్ననలు పొందిన కావలి వెంకట లక్ష్మయ్యగారి ఔన్నత్యం శ్లాఘనీయం.

సమకాలికుల ప్రశంసలకే కాక మన ధన్యవాదాలకు కూడా కాంబెల్ అర్హుడు. అతని వ్యాకరణంగాని, నిఘంటువుగాని ఇవాళ మనకు అట్టే ఉపయోగపడకపోవచ్చు. అయినా తన వ్యాకరణానికి ఆయన వ్రాసిన ప్రవేశిక చాలా గొప్పది. ఆంధ్ర భాషా చరిత్రను, ఆంధ్ర దేశీయ చరిత్రను సంక్షిప్తంగానే కావచ్చుగాని, సప్రామాణికంగా కాంబెల్ రచించాడు. బహుశా ఆంధ్ర చరిత్రను రచించిన వాళ్ళలో కాంబెల్ మొదటివాడు కావచ్చును. తన గ్రంథంలో త్రిలింగ శబ్దానికి విపులమైన వ్యాఖ్యను వ్రాశాడు. మూడు లింగాలను గుర్తించడానికి చాలా పరిశోధనలు చేశాడు. ప్రాచీన పాశ్చాత్య చరిత్రకారులు ఆంధ్రదేశం గురించి భావించినవన్నీ ఉదాహరించాడు. వివిధ భారతీయ పురాణాలలో ఆంధ్ర ప్రసక్తి వున్న ఘట్టాలను క్రోడీకరించాడు. మెకంజీ దొరగారు సేకరించిన వ్రాత గ్రంథాలనూ, శాసనాలనూ ఉపయోగించుకొని విజయనగర సామ్రాజ్య పాలకుల జాబితాను పొందుపరిచాడు. తన కాలంనాటికి అందుబాటులో వున్న తాజా భోగట్టాలను ఉపయోగించుకొనడంలోనే పరిశోధకుడి ప్రజ్ఞ కనబడుతోంది. కాంబెల్ దొరకే కాక దక్షిణాదిలో వుండే చాలామంది పరిశోధకులకు పనికి వచ్చే ఆకరాలను సేకరించిన ఘనత మెకంజీ దొరకు చెందుతుంది. అతడు దక్షిణ భారత చరిత్ర రచనకు పూర్వరంగాన్ని ఆయత్తపరిచాడు. మెకంజీలాగే ఆనాటి ఆంగ్లేయులు కొందరు దేశ భాషలపై చాలా ఆసక్తిని ప్రదర్శించారు.

ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ (?-1819): 1796లో కుంఫిణీవారి కొలువులో రైటరుగా చేరిన ఈ సివిల్ సర్వెంట్ ప్రాచ్యభాషలలో ఉద్దండ పండితుడయ్యాడు. 1806లో మచిలీపట్నం జిల్లా జడ్జిగా పనిచేసిన ఈయన తెలుగు భాషను తెలుసుకొన్నాడు. తమిళ, సంస్కృత భాషలలో అసమాన ప్రావీణ్యం గల ఎల్లిస్ దొరగారు ఈ భాషలతో తెలుగును తులనాత్మకంగా పరిశీలించి ద్రావిడ భాషావాదానికి అంకురార్పణ చేశాడు.

1816లో తిరువళ్ళువర్ తమిళంలో చెప్పిన 'తిరుక్కురళ్'లోని భాగాలను ఎల్లిస్ ఆంగ్లీకరించాడు. భారత దేశీయుల సాంఘిక పరిస్థితుల పట్లా, చరిత్ర గురించీ ఈయన

చాలా శ్రద్ధగా అధ్యయనం చేశాడు. ఆ విషయాలపై ఆయన ప్రామాణిక రచనలు చేశారు. రెవిన్యూ శాఖలో ఉత్పన్నమైన సమస్యలను తీసుకొని అధికారులు వేసిన 17 ప్రశ్నలకు సుదీర్ఘమైన సమాధానాలు ఎల్లిస్ దొరగారు 1814లో రచించారు. ఈ జవాబులే మిరాసీస్వామ్యానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథమైంది. దీనిని ఉత్తరోత్తరా సి.పి. బ్రౌన్ దొరగారు ఉపయోగించుకొన్నారు.

ఎల్లిస్ దొరగారు సాహిత్య ఫోర్జరీల బండారాన్ని బయటపెట్టారు. 1778లో 'యజుర్వేదం' అనే పేరిట ఒక పుస్తకాన్ని జెసూటు పాదిరీ సృష్టించి అచ్చువేశారు. రోమాపురి బ్రాహ్మణులు చాలా ప్రాచీనులని, బ్రహ్మ నుండి జనించారని చెప్పే దొంగ వేదాలను పుట్టించారు. అచ్చుపడ్డ యజుర్వేదాన్ని ఎల్లిస్ దొరగారు చీల్చి చెండాడారు. దీనిని ఎవరో బెంగాలులో సృష్టించారనీ, సాధారణ సంస్కృత పదాలకు బెంగాలీ స్పెల్లింగులకూ గల విభేదాలను డాక్టర్ కారీగారి బెంగాలీ వ్యాకరణం ఆధారం చేసుకొని వివరించారు. "An Account of a discovery of a modern imitation of the Vedas with remarks on the Genune works' అనే వ్యాసాన్ని ఎల్లిస్ దొరగారు రాశారు. దీనిని ఏషియాటిక్ సొసైటీవారు ఉత్తరోత్తరా ప్రచురించారు (సంపుటి 14-1822).

వివిధ ప్రామాణిక గ్రంథాలను ఆధారం చేసుకొని ఎల్లిస్ దొరగారు ద్రావిడ భాషల సామ్యాల గురించి ఒక సుదీర్ఘమైన నోటును రచించి కేంబెల్ దొరగారి తెలుగు వ్యాకరణంలో చేర్చారు. ఇది ద్రావిడ భాషావాదానికి ప్రాతిపదికగా ప్రామాణికమైన రచన.

డాక్టర్ విలియం కేరీ, డాక్టర్ విల్కిన్స్, మేస్టర్ కోల్ బ్రూక్ వంటి విద్వాంసులందరూ 'తల్లి సంస్కృతంబె ఎల్ల భాషలకు' అనే వాదం ప్రచారం చేసినవారు. అయితే తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలూ, వాటి తోబుట్టువులూ సంస్కృతం నుంచి జనించలేదని ఎల్లిస్‌గారు నిరూపించారు. పట్టాభి రామశాస్త్రులవారి ధాతుమాల నుంచి అకార, కకార, పకార, వకారాలతో మొదలయ్యే పది ధాతువులనూ తీసుకొని సంస్కృత పదాలతో తైపారు చేశారు. తెలుగు, తమిళ, కన్నడ పదాలను సదర్ అదాలతు నిఘంటువుల సాయంతో తులనాత్మకంగా పరిశీలించారు. మామిడి వెంకయ్యగారి ఆంధ్ర దీపిక ఉపోద్ఘాతంలో చెప్పిన తత్సమ తద్భవాది విభాగాలను చర్చించారు. లక్ష్మీధరుని షడ్భాషా చంద్రికను ఉటంకించారు. భాషాష్టకోత్పత్తి విషయంలో అప్పకవి 'భారతీదేవి శైశవ భాషితంబు ప్రాకృతంబు' (1-72) అని చెప్పిన సంగతిని గుర్తు చేశారు. వాక్య నిర్మాణ పద్ధతిలో దక్షిణాది భాషలు సంస్కృతంతో ఎలా విభేదించేదీ రుజువు చేశారు. 31 పుటలలో ఎల్లిస్‌గారు రచించిన ఈ నోటు భాషాశాస్త్ర చరిత్రలో చోటు చేసుకోతగ్గది.

దక్షిణ దేశ భాషలపై సప్రామాణికమైన తీర్పు చెప్పగలిగిన ఈ సంస్కృత పండితుడు 1819లో కలరా వ్యాధివల్ల మరణించడం దురదృష్టకరం. అయితే చనిపోవడానికి ముందే ఎల్లిస్ దొరగారు తమ భాషాశాస్త్ర పరిశోధనల పత్రాలన్నింటినీ సర్ వాల్టర్ ఎలియట్‌గారికి అందచేశారు. ఆయన వాటిని డాక్టర్ పోపుగారికి యిచ్చి ఆక్స్‌ఫర్డులోని బోదిలియన్ గ్రంథాలయంలో భద్రపరిచేటట్లు చేశారు.

బెంజిమన్ బ్రాన్ఫిల్: ఈయన క్రీ.శ. 1781లో కుంఫిణీ ఉద్యోగంలో చేరాడు. పదేళ్ళలో కలెక్టర్ హోదా లభించింది. 1791లో నెల్లూరు కలెక్టరయ్యాడు. 1793లో నూజివీడు కమిటీలో రెండో మెంబరుగా వున్నాడు. ఈ కాలంలోనే ఈయనకు తెలుగు భాషపై అభిమానం కలిగినట్టుంది. 1793వ సంవత్సరం జూన్ 7వ తారీఖున ఒక నిఘంటువు వ్రాయను ఆరంభించాడు. పేర్ మోటల్ అనే ఫ్రెంచి పాదరీ కూర్చిన కోశాన్ని యితడు కాపీ చేసుకున్నాడు. ఇది ఫ్రెంచి అక్షరాల క్రమంలో నిర్మించిన నిఘంటువు. తెలుగు మాటలకు ఇంగ్లీషులో అర్థాలు వున్నాయి. ఊతకు 'వూంత' అనీ, ఊటను 'వూంటు' అనీ మోటల్ పాదరీ లిఖించాడు. ఇది 823 పుటల గ్రంథం.

ఈ గ్రంథాన్ని కాపీ చేసుకొన్న బెంజిమన్ బ్రాన్ఫిల్ తొలిపుట మీద 'చదివి చద్వుకొండా' అని ఒక్క ముక్కలో హితోపదేశం చేశాడు. చాలామంది దీనిని చదివి చదువుకొన్నారు. ఎ.డి. కాంబెల్ దొరగారు దీనిని తమ నిఘంటువు పీఠికలో పేర్కొన్నారు. సి.పి. బ్రౌన్‌దొరగారు దీనిని తమ నిఘంటువు పీఠికలో పేర్కొన్నారు. సి.పి. బ్రౌన్‌దొరగారు ఈ వ్రాతప్రతిమీద కొన్ని రిమార్కులు వ్రాశారు. దీని నిర్మాతకు తెలుగు భాషా జ్ఞానం అత్యల్పం అని సంభాషణలలో తన అజ్ఞానాన్ని సర్వత్రా చాటుకొన్నాడని బ్రౌన్ దొరగారు వ్రాశారు.[5]

అయితే చెట్లులేని ప్రదేశంలో ఆముదం మొక్కలాగ ఈ పదకోశం పచ్చగా కళ్లకు విందు చేసేది. దీనిని బెంజిమన్ బ్రాన్ఫిల్ దొర కాపీ చేసుకొన్న రోజుల్లో తెలుగు నిఘంటువులు ఆధునిక అకారాది క్రమంలో లేవు. అసలు ఇంగ్లీషు అర్థాలు చెప్పేవి లేనే లేవు. 1793లోనే ఇంతటి కోశం నిర్మించారంటే ఆ రచయితల ఆంధ్ర భాషాభిమానాన్ని ప్రశంసించాలి.

బ్రాన్ఫిల్ దొర యింకే తెలుగు గ్రంథాలు వ్రాసుకొన్నాడో తెలియదు. 1794లో నూజివీడు జమీందారీపై సూపరెంటుగా వున్నాడు. ఆయేడే మచిలీపట్నం జిల్లా మూడవ డివిజన్ కలెక్టర్‌గా పనిచేశాడు. 1804లో ఇంగ్లండుకు వెళ్ళిపోయాడు.[6]

జాన్ సి. మారిస్ (1798-1858): జాన్ మారిస్ దొరకు కాలేజీ బోర్డు వారి ఆదరణ దొరకడంలో ఆశ్చర్యం లేదు. 1818లో ఆయన రైటరుగా చెన్నపట్నానికి వచ్చాడు. కోటలోని కళాశాల పరీక్షలో ఉత్తీర్ణుడై సర్కారువారి ప్రధాన కార్యదర్శి దగ్గర సహాయకునిగా పనిచేశాడు. సర్కారువారి తెలుగు ట్రాన్సులేటరుగా, కాలేజీ బోర్డు కార్యదర్శిగా నియమితుడయ్యాడు. విద్యార్థుల కోసం 'తెలుగు సెలక్షన్స్' అనే పాఠ్యగ్రంథాన్ని రచించాడు. పలుకుబడి వుండడం వల్ల మారిస్ దొరగారి నిఘంటువును కాలేజీ బోర్డువారు కొని ప్రచురించారు. దీని ప్రచురణ కాలానికి, అంటే 1835 నాటికి కాలేజీ బోర్డువారి ఆశయాలు మారాయి. పూర్వం తెల్లవాళ్లకు తెలుగు నేర్పడమే వాళ్ళ వుద్దేశం. ఇప్పుడు తెలుగువాళ్లకు ఇంగ్లీషు నేర్పడం కూడా అవసరమే. అందుకే సులభంగా వున్న మారిస్ దొర నిఘంటువును ఆమోదించారు. ఇందులో కేవలం యూరోపియన్

---

5. D. 1384 రెండు సంపుటాలు, తొలి సంపుటం ముఖపత్రంపై ఈ రిమార్కులు ఉన్నాయి.
6. Alphabetical List of Madras Civil Servants by Dodwell and Mils (839) - pp. 30-31.

దేశాలకు సంబంధించిన ఫల, వృక్షనామాలు, ఇతర శాస్త్రీయ శబ్దాలు వదలి వేశారు. అందువల్ల సంఖ్యలోగాని, గుణంలోగాని మోసం లేదని జాన్ మారిస్ దొర భావించారు. మారిస్ నిఘంటువు ఆ రోజుల్లోనే చాలా ఖరీదైనది. 1842వ సంవత్సరంలో ఒక తెలుగు పత్రికా ప్రకటనలో 'మారిస్ ఇంగ్లీషున్ను' తెలుగున్ను వుండే రెండువాలాల డిక్షనరీ- కట్టినది 35 రూపాయలని ప్రకటించారు. కట్టనిది 32-8-0. కట్టిన పుస్తకం అంటే అచ్చు కూటంలోనే బైండు చేసినది. కట్టనిది అంటే పుస్తకం ఫారాలు మాత్రమే అమ్ముతారు. కొనుక్కొన్న వాళ్లే బైండు చేయించుకోవాలి.

జాన్ మారిస్ నిఘంటువు, వాచకాలు వ్రాశాడుగాని వ్యాకరణం వ్రాయలేదు. ఆ పని హెన్రీ మారిస్ చేశాడు. 1890లో హెన్రీ మారిస్ ఇంగ్లీషులో వ్రాసిన తెలుగు వ్యాకరణం అచ్చుపడింది. అయితే ఈయన 1878లోనే గోదావరి జిల్లా చరిత్రను ఇంగ్లీషులో రాశాడు. ఆంధ్ర దేశ చరిత్రలో జిల్లాలవారీగా చాలామంది ఆంగ్లేయులు వ్రాశారుగాని మొట్టమొదటిసారిగా సంగ్రహాంధ్ర చరిత్రను తలపెట్టిన ఘనత కాంబెల్ దొరగారికే చెందుతుంది.

సివిలు సర్వెంటుల చదువులు

కుంఫిణీ కొలువులో భారతదేశంలో పనిచేసే తెల్ల దొరలను సివిలు సర్వెంటులంటారు. క్రీ.శ. 1600 డిసెంబరు 31 తేదీనాడు ఇంగ్లండులో ఆ దేశపు రాణీ ఒక వర్తక సంఘానికి ప్రాచ్య దేశాలతో వాణిజ్యం చేసుకొనడానికి గుత్తాధికారాన్ని యిచ్చింది. ఆ వర్తక సంఘమే తూర్పు ఇండియా కుంఫిణీ. క్రీ.శ. 1607లో సూరత్‌లో విలియం హాకిన్స్ దిగి వ్యాపార కార్యకలాపాల కోసం మొగలు దర్బారులో పడిగాపులు పడ్డనాటి నుంచి కుంఫిణీ వారికి మన దేశంతో సంబంధం ఏర్పడింది. క్రీ.శ. 1615 నాటికి భారతదేశంలో కుంఫిణీ వారికి నాలుగు గిడ్డంగులు వుండేవి. అందులో 32 మంది పాశ్చాత్యులు ఉద్యోగులుగా వర్తక విధులు నిర్వహించేవారు. క్రీ.శ. 1647 నాటికి గిడ్డంగుల సంఖ్య 23 దాకా, అంటే రమారమి ఆరు రెట్లు పెరిగింది. వీటిలో 90 మంది తెల్లవాళ్ళు ఉద్యోగాలు చేసేవారు. వీరికి దుబాషులు, తైనాతీలు, సిబ్బంది మొదలైన పటాటోపం చాలా వుండేది.

భారతదేశపు గిడ్డంగులలో పనిచేసే సివిలు సర్వెంటులను క్రీ.శ. 1674లో నాలుగు వర్గాలుగా పరిగణించేవారు. అట్టడుగున కూటికి గుడ్డకు ఉండి పని నేర్చుకొనే అప్రెంటిస్సులు ఉండేవారు. అనుభవం వచ్చాక అయిదేళ్లలోనో లేక ఆ పిమ్మటో ఈ అప్రెంటిస్ చిన్నవాండ్లు రైటర్లుగా ప్రమోటు అయ్యేవారు. మరి కొన్నేళ్ళకు జూనియరు ఫాక్టర్‌గా, ఉత్తరోత్తరా సీనియర్ ఫాక్టర్‌గా స్థిరపడేవారు. అప్రెంటీసుకు తొలి అయిదేళ్లు సాలీనా అయిదు ఇంగ్లీషు పౌండ్ల జీతం ఇచ్చేవారు. సీనియరు ఫాక్టరు మెట్టుకు చేరుకొన్న వ్యక్తికి తొలి ఏడేళ్లు పాటు పడ్డాక సైతం సాలీనా 40 పౌండ్ల జీతమే ముట్టేది. కుంఫిణీ వారు తమ అప్రెంటిసులనూ, రైటర్లనూ ఇంగ్లండులోని 'క్రీస్తు హాస్పిటల్' అనే అనాథ శరణాలయం తాలూకు ధర్మబడి నుంచి రిక్రూట్ చేసుకొనేవారు. ఈ బడిలో వ్యాపార

సంబంధమైన పద్దులు రాయడం మొదలైన విద్యలు నేర్పేవారు. తమ సర్వెంట్లకు ఇంతకన్నా ఎక్కువ చదువులు కుంఫిణీ వారికి ఆ కాలంలో అక్కరలేకపోయింది. ఇచ్చే జీతాలకు హెచ్చు చదువుల వాళ్లు రారని కుంఫిణీ వారికి తెలుసు. ఈ చాలీచాలని వేతనాలతో తృప్తిపడక భారతదేశంలోని తమ వర్తకులు ప్రైవేటు వ్యాపారాలు చేసుకొని లాభం పొందడానికి కుంఫిణీ డైరెక్టర్లు అభ్యంతరం పెట్టేవారు కాదు.

క్రీ.శ. 1740 దాకా మన దేశంలోని కుంఫిణీ వారు తమ తమ స్థావరాలలో వర్తకానికి అవసరమైన రాజకీయపు లావాదేవీలలో ఆరితేరారు. తమ గిడ్డంగులు కట్టుకొన్న భూభాగాలలో తప్పనిసరి పరిపాలనా విధానాలు చేపట్టారు. ఫ్రెంచి వారితో వున్న వాణిజ్య వైరాల కారణంచేత భారతదేశపు రాజకీయాలలో కూడా వారితో ఇంగ్లీషువారు పోటీపడి రాజ్యాలు సంపాదించడం ప్రారంభించారు. 1759 డిసెంబరు నుంచి క్రీ.శ.1800 లోపున విశాల భూభాగాలకు పాలకులయ్యారు. ఏయే తేదీలలో ఏ ప్రాంతాలను చేత చిక్కించుకొన్నారో చూడండి.

కుంఫిణీ కైవసం చేసుకొన్న భూభాగాలు

వరుస నెం.	సంధి తేదీ	జిల్లాలు	వైశాల్యం (మైళ్ళలో)	ఎవరి నుంచి
1.	1759 డిసెంబరు 20	ఇరవైనాలుగు పరగణాలు	4,882	బెంగాలు నవాబు
2.	1759 మే 14	మచిలీపట్నం	5,000	నిజాం
3.	1760 సెప్టెంబరు 27	బర్ద్వాన్, మిడ్నపూర్, చిట్టగాంగు	13,240	బెంగాలు నవాబు
4.	1765 ఆగస్టు 12	బెంగాలు, బీహారు వగైరా	1,16,850	మొగలు చక్రవర్తి
5.	1765 ఆగస్టు 30	మద్రాసు పరిసరాలు కుంఫిణీ జాగీరు	3,000	ఆర్కాటునవాబు
6.	1766 నవంబరు 12	ఉత్తర సర్కారులు	27,750	నిజాం
7.	1775 మే 21	బెనారసు జమిందారీ	12,000	అయోధ్య వజీరు
8.	1776 మే 22	సాల్సెట్టి ద్వీపం	–	మరాఠీలు
9.	1778 జూన్ 17	నాగూరు	–	తంజావూరు
10.	1778 సెప్టెంబరు 18	గుంటూరు సర్కారు	4,900	నిజాం
11.	1786 –	పూలు పెనాంగు	160	ఖేరా రాజు
12.	1792 మార్చి 17	మలబార్, దిండిగల్లు, సేలం, బారామహల్	24,000	టిప్పు సుల్తాన్
13.	1799 జూలై 13	కోయంబత్తూరు కనరా, వైనాడు	20,000	గెలుపు

14.	1799 ఆగస్టు 25	తంజావూరు	4,000	తంజావూరు రాజు
15.	1800 ఆగస్టు 12	దత్తమండలాలు	25,950	నిజాం
16.	1801 జూలై31	కర్నాటకం	17,250	ఆర్కాటు నవాబు

వర్తక వ్యాపారాలు చేసుకొనే వాళ్లు రాజ్య పాలకులయ్యారు. సరుకులు కొని ఎగుమతి చేసేవారు పన్నులు వసూలు చేయవలసిన సుంకరులయ్యారు. తమలో తమకు ఉన్న తగాదాలలో తీర్పు చెప్పేవారు విశాల భూభాగంలో న్యాయ విచారణ చేయవలసిన ధర్మమూర్తులు కావలసి వచ్చింది. ఆదిలో సీనియర్ ఫాక్టరుకు సాలీనా 40 పౌండ్ల జీతం ముట్టచెప్పడం గగనమైతే, క్రీ.శ. 1793 నాటికి ఏడాదికి 4,000, అంతకు మించిన జీతాలు ఇచ్చే పదవులు ఏర్పడ్డాయి. ఆదిలో 'క్రీస్తు హాస్పిటల్' శరణాలయం ధర్మబడిలో అంతంత మాత్రం చదువులు చదువుకొన్నవాళ్ళనే సర్వీసులో చేర్చుకొంటే, సామ్రాజ్యస్థాపన తర్వాత కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యలు అభ్యసించిన వాళ్లు సుప్రీంకోర్టు జడ్జీలుగా, ఇతర పదవులలో పాలకులుగా రావడం మొదలుపెట్టారు. అయితే అట్టడుగు స్థాయిలోని రైటర్లు మాత్రం చూసిరాత రాసే రాయసగాండ్రే.

క్రీ.శ. 1772లో బెంగాలు గవర్నరుగా వచ్చిన వారన్ హేస్టింగ్సు ఈ రైటర్ల గురించి ఒక స్నేహితునికి రాసిన ఉత్తరంలో వాస్తవాన్ని చెప్పాడు. "నువ్వు నమ్ముతావో లేదోగాని కుంఫిణీ కొలువులో ఉన్న ఈ కుర్రవాళ్లు సూపర్‌వైజర్లు, కలెక్టర్లు, న్యాయాన్ని నిర్ణయించవలసిన అధికారులు, పాలకులు, మహా ప్రభువులు అనే అర్థంలేని హోదా, బిరుదులతో ఈ దేశ ప్రజలపై సార్వభౌమాధికారాలు కల ఏలికలయ్యారు. ఈ కుర్రవాళ్ళ దుబాషులు నిజంగా వీళ్ళమీద పెత్తనం చలాయించే సూపర్‌వైజర్లు. ఇంగ్లండు ప్రభుత్వంవారి పేరును, ఆయుధ బలాన్నీ ఈ దోపిడీకి పీడనకు సాధనాలుగా వాడుకుంటున్నారు."[1]

ఈ వారన్ హేస్టింగ్సే కుంఫిణీ వారికోసం నేటివు రాజ్యాలవారిని దోపిడీకి, పీడనకు గురిచేశాడు. తన దేశంలోనే పార్లమెంటులో 'ద్రోహి' అనే దోషారోపణకు గురై ఏడేళ్ల ఇంపీచ్‌మెంటు విచారణకు గురి అయ్యాడు. అతడూ అతడిలాంటి కుంఫిణీ ప్రభువులూ చేసిన నేరాలన్నీ రుజువైనా శిక్ష తప్పించుకొన్నాడు. విడుదల పొందాడు. శిక్షపడితే నిజంగా కుంఫిణీ వారిని బాధ్యులను చేసినట్టే!

కుంఫిణీ రైటర్ల గురించి వారన్ హేస్టింగ్స్ చెప్పినవన్నీ నిజమైనా క్రీ.శ. 1790లో గవర్నరు జనరల్‌గా ఇండియాకు వచ్చి 1805 దాకా ఆ పదవిలో పాలించిన వెల్లస్లీ కాలంలో తప్ప ఆ కుర్రవాళ్ళ చదువుల పట్ల తీసుకోవలసిన చర్యలు ఎవరూ ఆలోచించలేదు. అయితే ఒక నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. హేస్టింగ్స్ తర్వాత క్రీ.శ. 1786లో గవర్నర్ జనరల్‌గా భారతదేశానికి వచ్చిన కారన్‌వాలీసు

1. Woodruff Philip - 'The Men who ruled India' - Vol.I, Jonathan Cape, 30, Bedford Square, London - reprinted, 1965.

హయాంలో కుంఫిణీ సర్వీసులో రైటర్లుగా చేరడానికి సీమలోని యువకులు ఉవ్విళ్లూరడం మొదలుపెట్టారు. తమకు కావలసిన వాళ్ళకే ఉద్యోగాలు వేయించడానికి కుంఫిణి వాటాదార్లలో అందరూ ప్రయత్నాలు చేశారు. ఇంగ్లండు దేశపు మహారాణియే ఒక కుర్రవాడికి ఉద్యోగం ఇవ్వమని సిఫార్సు చేస్తూ పంపింది. ఇవ్వడం ఇష్టం లేకపోయినా రాణీగారిని కాదనలేక ఆ కుర్రాడికి నెలకు రెండు వందలు, రెండు వందల యాభై రూపాయల ఉద్యోగాన్ని కారన్‌వాలీసు ఇవ్వక తప్పలేదు.[2] ఇంకోసారి బ్రిటన్ యువరాజు ఇటువంటి సిఫార్సు చేస్తే కారన్‌వాలీసు సవినయంగా ఒక స్నేహితుని ద్వారా విన్నపాన్ని పంపించాడు. ఆ లేఖలోని భావాలు ఇలా అనువదించవచ్చు. ''ప్రభుత్వ శ్రేయస్సుకు విఘాతాన్ని, సామ్రాజ్యానికి వినాశనాన్ని తెచ్చే దుష్కార్యాలు మళ్ళా చేపట్టి లోకం వేలెత్తి చూపే చెడ్డవ్యక్తిగా మారడం నాకు అంగీకారం కాదు కనుక కొత్త ఉద్యోగాలను సృష్టించలేనని యువరాజుగారికి సగౌరవంగానే గట్టిగా చెప్పగోరుతాను.''

దేశమేలే మహారాణీ, ఆమె కుమారుడు యువరాజు ఈ ఉద్యోగాలు వేయించాలని వాంఛించారంటే దానికి కారణం లేకపోలేదు. క్రీ.శ. 1757లో ప్లాసీ యుద్ధం తర్వాత సిరాజుద్దౌలాను తొలగించి మీర్ జాఫర్ని బెంగాలు నవాబుగా ప్రతిష్ఠించినందుకు రాబర్టు క్లైవు తన సొంతానికి 2,34,100 పౌండ్ల విలువచేసే సంపదను కైవసం చేసుకొనడమే కాక, ఇరవైనాలుగు పరగణాల జమీందారీ అనుభవిస్తున్నందుకు కుంఫిణీవారు మీర్ జాఫర్‌కు ఏటేటా చెల్లించవలసిన మొత్తంలో సాలీనా 30,000 పౌండ్ల రొక్కాన్ని తనకు ఇచ్చేటట్టు పత్రాలు రాయించుకొన్నాడు. ముక్కుపచ్చలారని వయసులో కుంఫిణీ కొలువులో రైటరుగా చేరిన క్లైవు ఇంతటి మహదైశ్వర్యాన్ని పొంది, స్వదేశానికి వెళ్ళి మహారాజ భోగాలకు సరితూగే ఆస్తులూ, అంతస్తూ సంపాదించి ఆ దేశపు కుర్రవాళ్ళకూ, వాళ్ళ పెద్దవాళ్ళకూ ఒక ఆదర్శప్రాయుడయ్యాడు.

భారతదేశంలో వరహాల చెట్టుంది. అక్కడకు వెళ్ళి దాన్ని దులుపుకొని మోయగలిగినంత పట్టుకొని స్వదేశానికి వచ్చెయ్యవచ్చుననే ఆశ ఎవరికైనా కలగడం సహజం. రెండుమూడు తరాలు కుంఫిణీ కొలువులో భారతదేశంలో నివసించి వచ్చినవారు తమ పిల్లలనూ, బంధువులనూ రైటర్లుగా పంపాలనుకోవడం కూడా సహజమే. ఏమంటే ఈ పాత సర్వెంట్లలో చాలామంది కుంఫిణీవారు ఇచ్చే చాలీచాలని జీతాలతో బతకలేదు. భారతదేశంలో ప్రైవేటు వర్తకం చేసి లాభాలు గడించి సీమకు వచ్చినవాళ్ళే తమ వారసులు తమలాగే బాగుపడాలని కోరుకొన్నారు.

అయితే కుంఫిణీవారు 1765లో క్లైవును సీమనుండి మళ్ళా ఇండియాకు గవర్నర్ జనరల్‌గా సర్వసైన్యాధిపతిగా పంపారు. పరిపాలనా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టమన్నారు. క్లైవు చేసిన ఘనకార్యాలలో మొట్టమొదటిది కుంఫిణీ కొలువులో ఉన్న ఏ ఒక్కరూ ఇకమీదట ప్రైవేటు వ్యాపారం చేయకూడదు. సొంతలాభం వ్యవహారాలు సొంతం కట్టిపెట్టాలి. కుంఫిణీ సర్వెంట్లందరూ ఈ షరతులకు అంగీకరిస్తున్నట్టు పూచీకత్తు

2. Cohan.S. Bernard - ''An Anthropologist among the Historians' - Oxford Newyork, 1987. p.507.

రాసి ఇవ్వాలని క్లైవు ఆదేశించాడు. వాళ్లు రాసి ఇచ్చారు. నాటి నుంచి కుంఫిణీ కొలువులోని వారందరూ 'కవనెంటెడ్ సర్వెంట్సు' లేక ఒడంబడిక ఉద్యోగులయ్యారు.

క్లైవు ప్రవేశపెట్టిన ద్వంద్వ ప్రభుత్వ విధానాన్ని ఆరేళ్ళ తర్వాత గవర్నర్ జనరల్‌గా వచ్చిన వారన్ హేస్టింగ్స్ రద్దు చేశాడు. రెవెన్యూ వసూళ్ళు కుంఫిణీ ఉద్యోగులే చేయాలన్నాడు. రెవెన్యూ బోర్డును స్థాపించాడు. కలెక్టర్ల వ్యవస్థను ప్రారంభించాడు. సదర్ దివానీ అదాలత్, సదర్ నిజామత్ అదాలత్ అనే సివిలు, క్రిమినల్ అప్పీలు కోర్టులను నెలకొల్పాడు. పోలీసు, మిలటరీ వ్యవస్థలను కొత్త పద్ధతులతో రూపొందించాడు. భారతదేశంలోని ప్రభువులపట్ల సద్భావం లేకపోయినా ప్రజలపట్లా, పండితుల విషయంలో ప్రేమాభిమానాలు ఉన్నాయి.

వారన్ హేస్టింగ్స్ చాలా కుశాగ్రబుద్ధి; వెస్టుమినిస్టర్ విద్యాశాలలో చదువుకొని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. పాలితుల ఆచార వ్యవహారాలపట్లా, సంస్కృతి పట్లా శ్రద్ధ లేకపోతే దేశకాల పరిస్థితులు అర్థం కావు. ప్రజల గురించి అవగాహన లేకపోతే ప్రభువుల పరిపాలనా సౌధాలు పేకమేడలయిపోతాయి. భారతదేశంలో శతాబ్దాలపాటు న్యాయ వ్యవస్థ ఉంది. దాని స్వరూప స్వభావాలను తెలుసుకోవాలి. అందుకే ఒక పండితుల సంఘాన్ని ఏర్పాటుచేసి వారిచేత హిందూస్మృతి సారాన్ని సంస్కృతంలోనే రాయమన్నాడు. దానిని పారసీకంలోనికి తర్జుమా చేయించి తద్వారా ఆంగ్లానువాదాన్ని రూపొందింప చేశాడు (హాల్‌హెడ్ ఈ కార్యాన్ని నెరవేర్చాడు. 1776లో ఈ ఆంగ్లానువాదం ఇంగ్లండులో అచ్చుపడింది). ఆంగ్లేయులు ప్రభువులయినంత మాత్రాన ఆంగ్ల న్యాయశాస్త్రం ప్రకారం భారతీయుల వ్యాజ్యాలను పరిష్కరించకూడదని హేస్టింగ్స్ భావించాడు. కుంఫిణీ కొలువులో చేరే ప్రతి కుర్రవాడికీ సముచిత పరిపాలనా విధానాలలో శిక్షణ ఇవ్వడం అవసరం అని కూడా నిర్ణయించాడు.

హేస్టింగ్సు తరువాత గవర్నర్ జనరల్‌గా వచ్చిన కారన్‌వాలీసుకు భారతీయులంటే సద్భావం లేదు. అన్ని ఉన్నతోద్యోగాలలో ఆంగ్లేయులే ఉండాలి. నేటివులు దొరల కింద తక్కువ జీతాలకు పనిచేయాలి. కుంఫిణీ కొలువులోని తెల్లదొరలకు పెద్దమొత్తాలు జీతాలుగా ముట్టచెప్పాలి. ఈ సంస్కరణలను కారన్‌వాలీసు ఒక చట్టాల సంహితగా కాగితాల మీద పెట్టారు. దీనిని 'కారన్‌వాలీసు కోడ్' అంటారు. దీనిని ఆధారం చేసుకొనే 'బెంగాలు సివిలు సర్వీసు' ఏర్పడింది. అదే ఉత్తరోత్తరా 'ఇండియన్' సివిలు సర్వీసు (ఐ.సి.యస్.) సూత్రాలకు ప్రాతిపదిక అయింది. కుంఫిణీ ఉద్యోగుల జీతాలు పెంచాడు గాని కారన్ వాలీసు వాళ్ళ విద్యా ప్రమాణాలను పెంచలేదు. అది తర్వాత వచ్చిన వెల్లస్లీ తన బాధ్యతగా భావించాడు. కొంతవరకు నెరవేర్చాడు.

క్రీ.శ. 1800లో వెల్లస్లీ సీమలోని కుంఫిణీ డైరెక్టర్లకు ఒక లేఖ వ్రాశాడు. దానిలో ఇలా చెప్పాడు. ''మన కచ్చేరీలలోని ఉద్యోగులలో గుమాస్తాలలో ఉన్న శక్తి సామర్థ్యాలతోపాటు రాజనీతి నిపుణుల బుద్ధి కౌశలాలు కూడా నేను చూశాను. అయితే వారి యోగ్యతలన్నీ వారు స్వయంకృషివల్ల సాధించుకొన్నవే. ఈ కుంఫిణీ రైటర్ల

విద్యాభ్యాసం కొనసాగవలసిన వయసులోనే ఆపివేసి కొద్ది మాసాలపాటు వాణిజ్య వ్యవస్థలలో ఉత్త 'చూచివ్రాత' రాయసకాండ్రగా శిక్షణ పొందడానికి నీచమైన పనికిరాని బండచాకిరీ పనులకు పంపించడం జరుగుతోంది. సామ్రాజ్యం పవిత్రమైన గురుతర బాధ్యత, నిరంతర సంపద. దీనిని ఆషామాషీగా ఏలుకొనడం మన ధర్మమూ కాదు, పద్ధతీ కాదు, గౌరవమూ కాదు.''

వెల్లస్లీకి బాగా తెలుసు : వివిధ భాషలూ, విభిన్న కులాచార వ్యవహారాలూ, విలక్షణమైన మతవిశ్వాసాలు ఉన్న కోట్లాది ప్రజలకు న్యాయం చేకూర్చాలంటే యూరోపులోని స్వతంత్ర రాజ్యాలలో ఏ ఒక్క దానికీ ఈషణ్మాత్రం తీసిపోనంత వైశాల్యం గల జిల్లాలలో రకరకాల ఆర్థిక విధానాలను అనుసరించి పాలించాలంటే, ప్రపంచంలో అత్యంత సంకీర్ణమైన జనసందోహంతో, అందులోనూ చీటికి మాటికి రచ్చకెక్కే ప్రజానీకంతో కిటకిటలాడే ప్రాంతాలలో కట్టుదిట్టమైన రాజ్యం చేయాలంటే కుంఫిణీ ఉద్యోగులు ఇకమీదట ఉత్తమ గుమాస్తాలుగా, వ్యాపారపు కొనుగోలు అమ్మకాల దళారీలుగా ప్రవర్తించకూడదు. పాలకులుగా పరిపాలించాలి. యూరోపులోని విద్యావంతులు అభ్యసించవలసిన కనీసపు సారస్వత, శాస్త్రజ్ఞానంతోపాటు కుంఫిణీ ఉద్యోగులు తాము పాలించవలసిన ప్రజల చరిత్ర, భాషలూ, ఆచార వ్యవహారాలు, హిందూ మహమ్మదీయ మత సూత్రాలు, ధర్మశాస్త్రాలు మొదలైన వాటితో ముఖపరిచయమైనా కలిగి ఉండాలి. వాళ్ళకు ఆ విద్యావిధానం భారతదేశంలో అడుగుపెట్టిన వెంటనే ప్రారంభించాలి. అప్పుడే ఫలంపాటు ఉంటుంది.

క్రీ.శ. 1800 ఏప్రిల్ మాసంలో కలకత్తా ఫోర్టు విలియం ప్రాంగణంలో వెల్లస్లీ ఒక కాలేజీని సంస్థాపించాడు. కుంఫిణీ కొలువులో రైటర్లుగా నమోదు అయి భారతదేశానికి వచ్చిన ప్రతి యువకుడూ ఈ కాలేజీలో మూడేళ్ళపాటు విద్యాభ్యాసం కొనసాగించాలి. సర్వసాధారణంగా ఏ సరికొత్త ఉద్యోగికయినా పనులు నేర్చుకొని విధులు చేపట్టడానికి ఇంతకాలం పూర్వం పట్టేది. ఇప్పుడు కూడా అంతటి కాలపరిమితిలోనే పరిపాలనకు అవసరమైన విద్యలు కూడా నేర్చుకొంటారు. కాలేజీలో బోధించడానికి నిష్ణాతులైన విద్యావేత్తలు ఆనాడు కలకత్తాలోనే లభ్యమయ్యారు.

కుంఫిణీ వారి సీనియర్ చాప్లిన్ (పురోహితుడు), రివరెండు డేవిడ్ బ్రౌన్‌ను కాలేజీ ప్రొవోస్టు అధికారిగా నియమించాడు. ఈయన హీబ్రూ, సిరియన్ భాషల్లో ప్రవీణుడై క్రైస్తవ మత గ్రంథాలపై ప్రామాణికమైన విజ్ఞానిగా పేరు పొందాడు. 'చర్చి ఆఫ్ ఇంగ్లండు' అనే శాఖకు చెందినవాడైనా డేవిడ్ బ్రౌనుకు ఆనాడు కలకత్తా పరిసరాల్లో ఉన్న అన్ని క్రైస్తవ శాఖలతో సత్సంబంధాలు ఉన్నాయి. క్లాడియస్ బుకనెన్ అనే మరొక క్రైస్తవ బోధకుని వైస్ ప్రొవోస్టుగా నిర్ణయించారు. ఈయన విద్యార్థులకు గ్రీకు, లాటిన్, ఇంగ్లీషు సారస్వతంలో మహాకావ్యాలను బోధించేవాడు. వెల్లస్లీ ఈ కాలేజీకి పేట్రన్‌గా, విజిటర్‌గా తన్ను తాను నియమించుకొని వివిధ విషయాలను బోధించే ఆచార్యులను కూడా నిర్ణయించి, ఆ బాధ్యతలు వారికి అప్పగించాడు.

హెన్రీ థామస్ కోల్‌బ్రూక్ (1765-1837): హిందూ న్యాయశాస్త్రం, సంస్కృతం బోధించేవాడు. గణితశాస్త్ర పరిశోధనల కోసం సంస్కృతం అభ్యసించి అందులో ఉద్దండ పండితుడయ్యాడు.

జాన్ బెయిలీ: అరబ్బీ, పర్షియన్ భాషలు, ముస్లిం న్యాయశాస్త్రాన్నీ బోధించే ఆచార్యుడు.

జె.బి. గిల్‌క్రిస్టు (1759-1841): హిందూస్థానీ భాషకు ఆచార్యుడు, ఆ భాషకు ఈయన ఒక నిఘంటువు, వ్యాకరణం రచించాడు.

విలియం కేరీ (1761-1834): ఈయన బాప్టిస్టు మిషనరీ. కుంఫిణీ వారు ఇతర క్రైస్తవ శాఖలకు ఆదిలో మత ప్రచారం చేసుకొనడానికి అనుమతి ఇవ్వనందున ఈయన కలకత్తా సమీపంలో ఉన్న శ్రీరామ్‌పురం అనే డచ్చివారి స్థావరంలో నివసిస్తూ మత బోధ చేశాడు. సంస్కృతం, బెంగాలీ, మరాఠీ భాషలలో ప్రవీణుడు. కుంఫిణీ కాలేజీలో బెంగాలీ బోధించేవాడు.

జార్జి బార్లో: కుంఫిణీవారి రెగ్యులేషన్లను విద్యార్థులకు బోధించేవాడు.

ఇంతమంది విద్వాంసులతో, తత్వవేత్తలతో కాలేజీ సంస్థాపించిన తర్వాత వెల్లస్లీ తాను చేసిన ఘనకార్యాన్ని సీమలోని డైరెక్టర్లకు తెలియజేశాడు. తమ అనుమతి లేకుండా ఇది చేసినందుకు డైరెక్టర్లు నొచ్చుకున్నారు. అయినా చేసినది మంచిపని కాబట్టి సమ్మతించేవారు గాని వెల్లస్లీ కుంఫిణీ వారిలో చాలామంది వాటాదార్లకు విరోధుడయ్యాడు. భారతదేశంలో నిర్మించిన ఓడలు సరకుల రవాణాకు సీమదాకా రాగల పటిష్ఠమైనవే కాబట్టి వాటిని ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల కుంఫిణీ డైరెక్టర్లలో ఓడ వర్తక వర్గాల వాళ్లు కోపగించుకొన్నారు. వెల్లస్లీ స్థాపించిన కాలేజీ విషయంలో అభ్యంతరాలు చెప్పారు.

కుంఫిణీ సర్వీసులో చేరిన యువకులకు సముచితమైన పాశ్చాత్య విద్యలు నేర్పాలి. అయితే అవి నేర్పడానికి తగిన స్థలం ఇంగ్లండ్ అని నిర్ణయించారు. కుంఫిణీ డైరెక్టరుకు మరో భయం కూడా లేకపోలేదు. అంతమంది విద్వాంసులూ, తత్వవేత్తలు ఒకచోట చేరితే వాళ్లు ఫ్రెంచి విప్లవానికి దోహదం చేసిన జాకోబినిజం వంటి సిద్ధాంతాన్ని భారతదేశంలో ప్రచారం చేస్తారేమో. ఆ సైతాన్ సిద్ధాంతాన్ని అరికట్టాలి.[3] అప్పటికే బెంగాలులో భావ వికాసం ప్రారంభమై వ్యాపిస్తోంది. ఈ 'బెంగాల్ స్పిరిట్'ను మిగతా రాజధానులైన మద్రాసు, బొంబాయిల్లో విస్తరింప చేయాలని వెల్లస్లీ భావిస్తున్నట్లు కుంఫిణీ డైరెక్టర్లకు తెలుసు. సంస్కృతి విభేదాల వల్ల ఆ రెండు రాజధానులలో వేరే కాలేజీలు స్థాపించి ప్రాంతీయ భాషలను మాత్రం అక్కడ పనిచేయడానికి ఎన్నిక చేసిన రైటర్లకు నేర్పాలి. కలకత్తాలో ఒక్క బెంగాలు రాష్ట్రానికి చెందిన భాషలే నేర్పాలి అని కుంఫిణీ డైరెక్టర్లు తమ నిర్ణయాన్ని ప్రకటించారు.

---

3. Philips C.H. "The East India Company' (1784-1834) - Oxford University Press-1961.p.125 Foot note.

ఓడ వర్తకుల వర్గాన్ని సంతోష పెట్టడానికి ఒక చక్కని కాలేజీ పథకాన్ని కలకత్తాలో సాగనివ్వకపోయినా, కుంఫిణీవారు, వెల్లస్లీ క్రీ.శ. 1800లో అంకురార్పణ చేసి కొన్ని విజయాలు సాధించిన ఆరేళ్ల తర్వాత క్రీ.శ. 1806లో 'ఈస్టిండియా కాలేజీ'ని సీమలో లండన్‌కు ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న హెర్ట్‌ఫోర్డు అనే చోట స్థాపించారు. 1809లో దీనిని రెండు మైళ్ళ దూరంలో ఉన్న హెయిల్‌బరీ అనే ప్రదేశానికి మార్చారు. ఒక అర్ధ శతాబ్దంపాటు అక్కడ కుంఫిణీ వారి కాలేజి సివిలు సర్వెంట్లను తయారుచేసే నిర్మాణ సంస్థగా పనిచేసింది.

హెయిల్‌బరీలో కలకత్తాలోని ప్రణాళికనే అమలుపర్చారు. బోధించవలసిన విషయాలను 'యూరోపియన్, ఓరియంటల్' అనే రెండు వర్గాలుగా విభాగించారు. ఆనాడు ఆంగ్ల విద్యార్థులు చదవవలసిన గ్రీకు, లాటిన్ వంటి సబ్జెక్టులన్నీ యూరోపియన్ విభాగంలో ఉన్నాయి. కుంఫిణీ కొలువుకు కావలసిన ప్రాచ్య భాషలూ, హిందూ మహమ్మదీయ న్యాయశాస్త్రాలు ఓరియంటల్ శాఖలో చేర్చారు. జొనాథన్ స్కాట్ అనే పండితుణ్ణి ప్రాచ్య శాఖకు ఆచార్యుణ్ణి చేశారు. సంస్కృతం, పారసీకం, అరబ్బీ, హిందూస్థానీ, బెంగాలీ భాషలు ఆదిలో బోధించేవారు. పూర్వం కుంఫిణీ కొలువులో వివిధ ప్రాంతాలలో, వివిధ భాషలు నేర్చుకొని ఉద్యోగ విరమణ తర్వాత సీమకు వచ్చి స్థిరపడ్డ వ్యక్తులలో పాండిత్యం గలవారిని ఆయా భాషల ఆచార్యులుగా రప్పించారు. మీర్ అబ్దుల్ ఆలీ, మీర్జా ఖలీల్, గులాం హైదర్, మీర్ హుస్సేన్ ఆలీ వంటి ముస్లిం విద్యావేత్తలను బెంగాలు నుండి రప్పించి ఆచార్యులను చేశారు. వీరిలో కొందరు బ్రిటిష్ వనితలను వివాహం చేసుకొన్నారు. ఫ్రాన్సిస్ జాన్సన్ అనే వ్యక్తి 1825-34 సంవత్సరాలలో సంస్కృతం, బెంగాలీ భాషలతో పాటు తెలుగును కూడా హెయిల్ బరీలో నేర్పేవాడు.

సీమలోని కుంఫిణీవారి కాలేజీలో పదిహేను ఏళ్ళకు తక్కువ కాని వాళ్ళనూ, ఇరవై రెండేళ్ళకు మించని వాళ్లను విద్యార్థులుగా తీసుకునేవారు. వీళ్ళలో నాలుగవ భాగం పూర్వపు భారతదేశంలో పనిచేసి రిటైరయిన వాళ్ళ కుటుంబాలలోని వాళ్లే. ఈ విద్యార్థులు రెండేళ్ళు సీమలో చదువుకొని ఉత్తీర్ణులయ్యాక వారిని బెంగాలు, కలకత్తా, మద్రాసు, బొంబాయి సర్వీసులకు కేటాయించి, కలకత్తా, మద్రాసు, బొంబాయి నగరాలలో విద్యను పూర్తిచేసుకొనడానికి పంపేవారు.

మద్రాసులో కుంఫిణీ కాలేజీని సంస్థాపించమని సీమలోని డైరెక్టర్లు క్రీ.శ. 1807 మే 29వ తేదీనాడు సెంటు జార్జి కోట గవర్నరుకు తాఖీదు పంపారు. అయితే ఇది సైన్యంలోని జూనియర్ ఆఫీసర్లకు సంబంధించిన విషయం. వారికి ప్రాంతీయ భాషలలో ప్రవేశం కలిగించాలని ఈ ప్రణాళిక వేశారు. సివిలు సర్వెంట్ల విద్యకోసం కొన్ని సూచనలు చేశారు. ఆ రోజుల్లో ఇంగ్లీషు బాగా వచ్చిన నేటివులను తమ ప్రైవేటు మున్షీలుగా కుంఫిణీ సర్వీసులోని దొరలు నియమించుకొని, తమ భాషా ప్రావీణ్యాలను మెరుగుపరుచుకొనేవారు. ఉత్తరోత్తరా సర్కారు వారి తెలుగు ట్రాన్స్‌లేటరుగా పనిచేసిన మెక్కిరల్ దొర వెన్నెలకంటి సుబ్బారావుగారిని తమ ప్రైవేటు మున్షీగా 1808

నవంబరులో నెలకు పన్నెండు పూల వరహాల జీతం మీద కుదుర్చుకొని తెలుగు భాషను నేర్చుకొన్నారు. ఆ మరుసటి సంవత్సరం ఫిబ్రవరి మాసారంభంలో మద్రాసులో అధికారుల ముందు పరీక్షకు హాజరయ్యారు. అందులో ఉత్తీర్ణుడైన మేస్తర్ మెక్కిరల్ దొరకు కుంఫిణీ వారు వెయ్యి పూల వరహాలు, రూల్సు ప్రకారం ప్రకటించిన పారితోషికం బహూకరించారు. వెన్నెలకంటి సుబ్బారావు గారికి కన్నడం కూడా బాగా వచ్చును గనుక ఆయన సహాయంతో మేస్తర్ మెక్కిరల్ ఒక కన్నడ వ్యాకరణాన్ని రచించదలచాడు. పని ఒత్తిడులవల్లా, అనారోగ్య కారణాల వల్లా ఇది జరగలేదు. మెక్కిరల్ దొరలాగే చాలామంది ప్రైవేట్ మున్షీల ద్వారా తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, పారసీక, హిందూస్థానీ భాషలు నేర్చుకొనే ఆరోజుల్లో కుంఫిణీ కాలేజీ అవసరం సర్కారు వారు బాగా అవగాహన చేసుకొన్నారు.

సంకల్పాలు సఫలం కావాలంటే సరైన సాధనాలు కావాలి. ఫోర్టు విలియం కాలేజీని సంస్థాపించుకొన్నప్పుడు వెల్లస్లీ చాలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి మరీ ప్రారంభించారు. యూరోపియన్ల అజమాయిషీలోనే భాషలను బోధించవలసిన వచ్చినా ప్రఖ్యాతులైన విద్వాంసుల చేత పాఠ్య గ్రంథాలను తయారు చేయమని పారశీక భాషా విభాగంలో 33 మంది మున్షీలకు హిందూస్థానీ శాఖలో అనువాదకులను కూడా కలుపుకొని 40 మందినీ, బెంగాలీ భాషకు 14గురు, అరబ్బీ విభాగంలో నలుగురు మౌల్వీలు, సంస్కృత శాఖలో ఐదుగురు పండితులు ఉండటం భావ్యమని నిర్ణయించాడు. ప్రాచ్య భాషలను ప్రోత్సహించడానికి 40,000 రూపాయలను కేటాయించారు. నేటివులలో ప్రతి శాఖలో హెడ్డుకు నెలకు 300, సహాయకులకు నెలకు వంద రూపాయలు జీతాలు మంజూరు చేశారు. తెలుగు, తమిళ, కన్నడ, మరాఠీ భాషలు నేర్పగలిగిన వాళ్ళు మద్రాసులో ఉంటే తెలియచేయమనీ, పంపమనీ సెంటు జార్జి కోటకు ఉత్తరం రాశాడు. వచ్చినవాళ్లు సంతృప్తికరమైన టీచర్లు కానందున వాళ్ళను వాపసు పంపించేశాడు. 1802లో దక్షిణ ప్రాంతీయ భాషలు నేర్పడానికి ఫోర్టు విలియంలో ఆస్కారం లేకపోయినా చేపట్టిన ఇతర భాషలలో పుస్తక ప్రచురణా, వాటి బోధనా సాగింది. ప్రతి పుస్తకం వంద ప్రతులు కొని నలబై సీమకు పంపేవారు. మద్రాసుకు పాతిక ప్రతులు పంపించేవారు.

క్రీ.శ. 1813 నాటికి కలకత్తా కాలేజీ వారు కొన్ని వేల రూపాయల విలువ చేసే 11 వందల సంపుటాల ముద్రిత గ్రంథాలను మద్రాసుకు పంపారు. హిందూస్థానీ-ఇంగ్లీషు నిఘంటువూ, కేరీగారి మరాఠీ నిఘంటువూ, ఒక పారశీక నిఘంటువూ, సంస్కృత మూలంతోనూ, ఇంగ్లీషు వ్యాఖ్యానంతోనూ వున్న అమరకోశము, పర్షియన్-అరబ్బీ, నిఘంటువు వంటి డిక్షనరీలు వున్నాయి. అరబ్బీ, పారశీక, హిందూస్థానీ, పంజాబీ సామెతల పుస్తకం; అరబ్బీ, పారశీక, హిందూస్థానీ, మరాఠీ, సంస్కృత, ఒరియా, ఉర్దూ భాషల వొకాబులరీలు వంటి సంకలన గ్రంథాలూ, కోల్‌బ్రూక్ గారి సంస్కృత వ్యాకరణం. వారిదే హిందూ ధర్మశాస్త్రం, విల్సన్‌గారి మేఘదూత అనువాదం, భగవద్గీత, గీత గోవిందం, సిద్ధాంత కౌముది వంటి సంస్కృత గ్రంథాలు, వాటి అనువాదాలూ,

తోతాకహానీ (శుకసప్తతి) బాగ్ బహార్, గులేబకావళి వంటి హిందూస్థానీ వాక్య గ్రంథాలూ, బూస్తవునీ, గులిస్థాన్ వంటి పారశీక వాక్య గ్రంథాలూ, బెంగాలీ మహాభారతం, తులసీ రామాయణం వంటి కావ్యాలూ, స్ట్రేంజరు దొరగారి ఈస్టిండియా గైడు, రెండు సంపుటాలలో వెలువడిన బ్రిటిషు ఈస్టిండియా మోనిటర్ వంటి సమాచార సంపుటాలు ఎన్నో కలకత్తా నుంచి మద్రాసుకు వచ్చాయి.

ఇలాగే వైవిధ్యం గల ఉపయుక్త గ్రంథ ప్రచురణ విరివిగా జరగడం వల్ల కలకత్తాలో కుంఫిణీ కాలేజీని నిర్వహించగల అవకాశాలు వృద్ధి చెందాయి. క్రీ.శ. 1812లో సెంటు జార్జి కోట సర్కారువారు మద్రాసులో కుంఫిణీ కాలేజీ స్థాపించాలని నిర్ణయించిన నాటికి నేటివు విద్యాభివృద్ధి గురించి గట్టి ప్రయత్నాలు జరుగలేదు. తమ మాతృభాషలలో వ్యాకరణ జ్ఞానంగల పాండిత్యంతోపాటు ఇంగ్లీషులో ప్రవేశము, పాఠాలు చెప్పగలిగే నైపుణ్యాంగల నేటివు టీచర్లూ, పాఠ్యపుస్తకాలు వడ్డించిన విస్తరిలాగ అమరకపోవడం వల్ల ముందు ఆ వ్యక్తుల కోసం, కనీస పరికరాల కోసం గాలించవలసి వచ్చింది. అయితే దేశం గొడ్డుపోలేదు గనుక వెతగ్గానే ఉదయగిరి వెంకటనారాయణ, బి. శంకరయ్య; రామరాజు వంటి తెలుగు వారిని హెడ్ ఇంగ్లీషుమాస్టర్లుగా వినియోగించుకొనవచ్చునని సర్కారువారు భావించారు. ఇటువంటివారే ఇతర ప్రాంతీయ భాషలలో కూడా మాస్టర్లుగా లభించారు. ఈ అయ్యవార్ల ఎంపికా, కాలేజీ నిర్వహణ బాధ్యతా ప్రభుత్వం ఒక కమిటీ వారికి అప్పగించింది. దానిలో సభ్యులు తెల్లదొరలే.

1. F.W. Ellis
2. E.C. Greenway
3. F. Gallagan
4. Rev. J. Mosley
5. Wlliam Oliver
6. John Babington
7. A.D. Campbell - Secretary

కాలేజీ బోర్డువారు విద్యార్థుల నిమిత్తం రూల్సును తయారుచేశారు.

ప్రతి జూనియర్ సివిలు సర్వెంటూ ప్రవేశించిన పిమ్మట ఈ క్రింది అయిదు భాషలలో ఒకటి అభ్యసించాలి.

తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, మరాఠీ.

బోర్డువారు తమ విచక్షణను అనుసరించి సదరు విద్యార్థులు అదనంగా సంస్కృతం, హిందూస్థానీ, పారశీకం, అరబ్బీ భాషలు అధ్యయనం చేయడానికి అనుమతి ఇస్తారు.

ఏ జూనియర్ సివిల్ సర్వెంటయినా తను ఎంచుకొన్న భాషను అధ్యయనం చేయడం మధ్యలో మానివేసి మరొక భాషకు మారకూడదు. ప్రత్యేక కారణాల వల్ల బోర్డువారి అనుమతిని ముందుగా పొందితే ఈ రూలు వర్తించదు.

హెడ్ నేటివ్ మాస్టర్లు విద్యార్థులను సముచిత సమయాల్లో పరీక్షించడానికి కమిటీ వారితో సహకరించాలి.

బోర్డువారు అనుమతించని ఇతర నేటివు టీచర్లు సివిలు సర్వెంట్లకు విద్యలు నేర్పకూడదు.

ప్రతి జూనియర్ సివిల్ సర్వెంటూ విధిగా రెండేళ్లు కుంఫిణీ కాలేజీలో చదవాలి.

నేటివు భాషల విద్యాబోధన నిమిత్తం కమిటీ ఏర్పడ్డాక కాలేజీకి ఒక ముద్రాక్షరశాల, డిపో, గ్రంథాలయం ఏర్పరిచారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ భాషలలో ప్రాథమిక పాఠ్యగ్రంథాలూ, ఆ భాషల నిఘంటువులూ, వ్యాకరణాలూ, వాక్యగ్రంథాలూ సంపాదించడానికి ప్రయత్నాలు చేశారు. పదిహేడో శతాబ్దంలోనూ, పద్దెనిమిదో శతాబ్దంలోనూ చాలామంది తెల్లవాళ్లు దక్షిణ దేశీయ భాషలలో కొంత గ్రంథ రచన, ప్రచురణ చేశారు. వాటి ప్రతులు గ్రంథాలయాలలో కుంఫిణీ వారు భద్రం చేశారు కూడా. అందుకే జెసూటు ఫాదిరీలు, బుడతకీచు పరంగీలు, తరంగంబాడి డేనిష్ మిషనరీలు మొదలైన ప్రాచీనులు నిక్షిప్తం చేసిన వాటిని బయటకు తీశారు.

రచనాకాలం సరిగ్గా తెలియని ఒక ఇంగ్లీషు తమిళ నిఘంటువు (బహుశా 1650–1750 మధ్య) ఒకటి ముఖపత్రం లేనిది లభించింది (ఇది ఇప్పుడు అడయారు లైబ్రరీలో ఉంది).

1713లోనే బుడతకీచు - తమిళ నిఘంటువు ఒకటి అచ్చుపడింది (ఆ రోజుల్లో వ్యవహారాలన్నీ పరంగీల ద్వారా బుడతకీచు భాషలోనే కుంఫిణీవారు జరిపించేవారు). ఈ గ్రంథం తరంగంబాడిలో ప్రచురితం అయినది కావచ్చు.

1767లో గ్రెగ్ షార్ప్ 47 తెలుగు పదాలు సేకరించి థామస్ హైడ్‌గారి గ్రంథంలో అనుబంధంగా చేర్చాడు.

1780లోనే మద్రాసులోని రెవెన్యూ బోర్డు వారు వ్యవహారంలో ఉన్న దేశీయ పదాల పట్టికలను తయారుచేసి పంపమని తమ గిడ్డంగులున్న స్థావరాలలోని ఛీపులకూ, ఏజెంట్లకూ తాఖీదు పంపారు. ఈ పదసేకరణలు రాజధానిలో క్రోడీకరించే ఉంటారు.

1812లో 'తెలుగు వొకాబులరీ అండ్ గ్రామర్' అనే పేరుతో 'ఆంధ్రభాషామంజరి' అనే గ్రంథాన్ని ఆంగ్లంలోనికి అనువదించారు. ఇది తెలుగు ఇంగ్లీషు లిపులలో ఉంది. మొత్తం 439 పుటలు (పేజీ సైజు 15½ x 9½ అంగుళాలు). దీనిని మొదట లాటిన్ భాషలో జెసూటు ఫాదిరీలు తయారు చేశారని, ఉత్తరోత్తరా 1845లో బ్రౌను దొరగారు భావించారు. (D.1331)

మచిలీపట్నం వాస్తవ్యులు మామిడి వెంకయ్య (1764–1834) గారు 1806 మే 7వ తేదీ నాటికే 'ఆంధ్ర దీపిక' అనే అకారాది నిఘంటువును రచించారు. ఇది సంస్కృతాంధ్ర పదాలకు అర్థాలను తెలుగులోనే ఇస్తుంది. ''ఆంధ్రంబున సకలశబ్దంబుల సంకేత రూపంబులుగాగూర్చి యేకార్థ నానార్థంబులేర్పడునట్టుగా'' దీనిని రెండు సంపుటాలలో రచించాడు. మొదటి సంపుటంలో 650, రెండవదానిలో 795 పుటలు ఉన్నాయి.[4] ఈ గ్రంథాన్ని కాలేజీ బోర్డువారు వెయ్యి పూల వరహాలు ఇచ్చి కాపీరైటుతో కొనుక్కున్నారు (మామిడి వెంకయ్యగారి గురించీ, వారి రచనల గురించీ వేరే ప్రకరణంలో వివరాలున్నాయి).

---

4. ఈ సంపుటాల ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. D.1332.

కొన్ని నిఘంటువులైనా పని గడవడానికి దొరికాయి కనుక కాలేజీవారు వ్యాకరణాల కోసం అన్వేషించారు.

ప్రారంభ దశలలోని విద్యార్థుల అక్షరాభ్యాసం కోసం తెలుగు లిపిని నేర్పే పూర్వకాలపు సంప్రదాయంతో 'అక్షర గుచ్ఛము' అనే పేరుతో 14 పుటల గ్రంథం ఒకటి తయారు చేయించారు. ఇది అసమగ్రం. (D.1222)

కాలేజీ స్థాపించగానే అందులో హెడ్ సంస్కృత పండితులుగా ఉంటున్న వేదం పట్టాభి రామశాస్త్రిగారి చేత 'ఆంధ్ర ధాతుమాల' అనే గ్రంథాన్ని రచింపచేశారు (దీనిని కాంబెల్ దొరగారి వ్యాకరణంలో ఎల్లిస్ దొరగారు మూడు నాలుగు చోట్ల ఉదాహరించారు). చాలాకాలం ఇది వ్రాతప్రతిగానే ఉంది. 'ఆంధ్ర ధాతుపాఠము' అనే పేరుతో దీని కాపీ ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో భద్రపరిచారు (D.1227). దీనిని ఆంధ్ర సారస్వత పరిషత్ (కాకినాడ) వారు చిన్నయసూరి రచనగా 1930లో ప్రచురించారు (గ్రంథ సంఖ్య 23). ఈ ఘోరమైన పొరపాటును వావిళ్ళవారు 1951లో పట్టాభిరామశాస్త్రిగారి ఇంకొక గ్రంథం ప్రచురిస్తున్నప్పుడు బయటపెట్టి సవరించారు.

కుంఫిణీవారి కాలేజీలో ప్రాచీన ఫరంగీ విద్యావేత్తలు సమకూర్చిన వ్యాకరణ గ్రంథాల ప్రతులు లభ్యమవుతూనే వుండాలి. క్రీ.శ.1619లో స్టీఫెన్సు ఫాదిరి ఒక కన్నడ వ్యాకరణాన్ని రచించాడు. ఇది 1640లో రాచోల్‌లోని సెంట్ ఇగ్నేషియస్ కాలేజీవారు అచ్చువేశారు. స్టీఫెన్సు ఫాదిరి తెలుగులో క్రైస్తవ పురాణాలు కూడా రచించాడు. దీనిని మెకంజీ సంచాలకులు గుర్తించారు.

క్రీ.శ. 1713లో తరంగంబాడిలో ఒక తమిళ వ్యాకరణం అచ్చుపడింది.

క్రీ.శ. 1799లో డాక్టర్ రాబర్ట్ డ్రమ్మండ్ ఒక 'మలబారీ' వ్యాకరణాన్ని రచించాడు, ముద్రించాడు. ఆ రోజుల్లో తమిళాన్ని 'మలబారీ' అని, తెలుగును 'జెంటూ' అని పిలిచేవారు. ఇది కొందరు పరిశోధకులు భావిస్తున్నట్టు మలయాళ వ్యాకరణం కాదు.

"W.B.' అనే పొడి అక్షరాలు గల ఒక ఆంగ్లేయుడు రచించిన ఒక తెలుగు వ్యాకరణం 1807లో మద్రాసులోని కమర్షియల్ ప్రెస్‌లో అచ్చుపడిందని గ్రియర్సన్‌గారు తమ 'లింగ్విస్టిక్ సర్వే' సంపుటాలలో తెలుగు గ్రంథాలను పేర్కొంటున్నప్పుడు చెప్పారు. "W.B.' విలియం బ్రౌన్ కాదా అనే సందేహం ప్రస్తుతం లభించే ఆకరాల వల్ల తేలడం కష్టం. ఈయన రచించిన వ్యాకరణం 1817లోగాని అచ్చుపడలేదు. అయితే దీని రచన 1807 నాటికి జరిగి ఉండవచ్చు. విలియం బ్రౌను దొరగారు 1783 నుంచీ చెన్న రాజధాని కుంఫిణీ కొలువులో ఉన్నారు. 1796 నుంచి కళింగ రాజ్యంలో కలెక్టరుగా పనిచేశారు. 1802 నుంచీ సర్క్యూట్ అప్పీల్ కోర్టులో మూడవ, రెండవ జడ్జిగా ఉన్నారు. 1810లో సీమకు సెలవు మీద వెళ్ళి 1816లోగాని ఇండియాకు తిరిగి రాలేదు.[5] మద్రాసులో కాలేజీ స్థాపన జరిగాక పుస్తక ప్రచురణ కార్యక్రమాన్ని చేపడుతున్న కాలంలో ఆయన స్వదేశంలో ఉన్నారుగాని భారతదేశంలో ఉన్నప్పుడే 1807 ప్రాంతాలలో ఒక వొకాబులరీని, వ్యాకరణాన్ని రచించడానికి ఆస్కారం లేకపోలేదు. సీమ నుంచి తిరిగి

5. Dodwell and Miles - 'Alphabetical List of Madras Civil Servants', (1839)

రాగానే ఇంకొక ఆంగ్లేయుని తెలుగు వ్యాకరణ గ్రంథం ఇంగ్లీషులో కాలేజీ బోర్డువారే అచ్చువేశారని తెలుసుకొని మొదట తన వ్యాకరణాన్ని 1817లోనూ, వొకాబులరీని 1818లోనూ అచ్చువేశారు. ఈ గ్రంథాలను మచిలీపట్నంలోని ఆకుల మన్నాటి నరసయ్య వాస్తవానికి రచించాడని సి.పి. బ్రౌను దొరగారు చెప్తున్నారు.[6] మద్రాసులోనూ, కలకత్తాలోనూ చాలామంది భారతీయులు నిఘంటు రచనకు సహాయకులుగానో, స్వయంగానో పూనుకొన్నారు.

1814లో కలకత్తా సమీపంలో ఉన్న శ్రీరాంపురం విలియం కేరీగారు రచించిన తెలుగు వ్యాకరణానికి ఒక సుబ్బాశాస్త్రిగారు సహాయం చేశారు. ఈ వ్యాకరణం అచ్చుపడింది. కొన్ని ప్రతులను మదరాసుకు పంపారు.

కలకత్తాలోని ఫోర్టు విలియం కళాశాలలో ఒక వరదయ్య పంతులు తెలుగు నిఘంటువు రచించాడని చెప్పుకొంటారు. మద్రాసు కాలేజీవారు దానికోసం కలకత్తాకు రాస్తే గ్రంథకర్త తయారుచేసిన ప్రతిని 1813లోనే పంపారు. అయితే అది ఏమైందో తెలియదు.[7] వరదయ్యగారు రచించినది నిఘంటువేనా? ఒక వ్యాకరణ గ్రంథం కూడా తయారు చేశారేమో! అయ్యా వెంకటాచార్యులు, వరద వేదాంతాచార్యులు అనే ఇద్దరు పండితులు ఒక సంస్కృత వ్యాకరణాన్ని తెలుగు లిపిలో రచించారు. దీని పేరు శబ్దతత్త్వ వివేకము. 319 పుటల గ్రంథం. ఆంగ్లేయ భాషాభ్యాస సంప్రదాయాన్ని అనుసరించి బాలబోధిని రూపంలో రచించారు. ఈ ఇద్దరు గ్రంథకర్తలలో వరద వేదాంతాచార్యులు గారే ఫోర్టు విలియం కళాశాలలో పనిచేసిన వరదయ్య పంతులా? భావి పరిశోధన వల్ల తేలాలి.

కుంఫిణి సివిలు సర్వెంట్లు తెలుగు భాషను నేర్చుకొంటున్నా దాని వ్యాకరణం ఇంగ్లీషు భాషలో ఉంటే లాభసాటిగా ఉంటుంది. అందుచేత కాలేజీ బోర్డు సెక్రటరీగా ఉంటున్న కాంబెల్ దొరగారినే ఒక వ్యాకరణ గ్రంథాన్ని ఇంగ్లీషులో రచించమన్నారు. కుంఫిణీ వారి కాలేజీలోనే హెడ్ ఇంగ్లీషు మాష్టరుగా పనిచేసిన ఉదయగిరి వెంకటనారాయణయ్యగారు కాంబెల్ దొరగారికి తెలుగు నేర్పిన గురువు. వ్యాకరణ రచనకు కాంబెల్ పూనుకొన్న సంవత్సరానికి ఉదయగిరి వారు సుప్రీంకోర్టులో ఇంటర్ ప్రీటర్‌గా ఉంటున్నారు. అయినా తన శిష్యుని వ్యాకరణ రచనకు తోడ్పడ్డారు. కాలేజీలో హెడ్ సంస్కృతాంధ్ర భాషల ఆచార్యునిగా కొనసాగుతున్న వేదం పట్టాభిరామ శాస్త్రులవారి సలహాలు కూడా కాంబెల్ దొర తీసుకొంటూ రచన చేశారు. దీనిని 1816లో కాలేజి బోర్డు వారు కాపీరైటుకొని ప్రచురించారు.

వ్యాకరణ ప్రచురణ కాగానే కాంబెల్ దొరగారు నిఘంటు రచనకు పూనుకొన్నారు. మామిడి వెంకయ్యగారి ఆంధ్ర దీపికను ప్రాతిపదికగా తీసుకొని తెలుగు మాటలకు ఇంగ్లీషు అర్థాలను ఇచ్చే కోశాన్ని ప్రారంభించారు. మద్రాసు కుంఫిణీ వారు ఆయనకు ఎన్నో సదుపాయాలూ, సహాయాలు సమకూర్చారు. వెంకయ్యగారి పుస్తకాన్ని

6. C.P. Brown -Literary Autobiography p.70
7. J.Mangamma - Book Printing in India - pp. 107-8.

కొంటున్నప్పుడే ఉత్తరోత్తరా వచ్చే తెలుగు-ఇంగ్లీషు నిఘంటువుకు ఉపయోగపడు తుందన్న ఉద్దేశం కుంఫిణీ వారికి ఉంది. ఆంధ్ర దీపికను అచ్చువేయకుండా తిరగేసి రాయడానికి కాంబెల్ దొరగారిని కాలేజీ నియమించింది. ఒక్క 'ఆంధ్ర దీపిక' మాత్రమేకాక మరికొన్ని కోశాలు కాంబెల్ దొరగారికి ఉపయోగించాయి. అవి:

1) మేస్తర్ సి.ఎం. లష్టింగ్‌టన్ దొరగారు ఇచ్చిన పదకోశం.

2) మేస్తర్ డబ్ల్యు. కేరింగ్‌టన్ దొరగారు పంపిన పదకోశం. ఇది పై దాని పుత్రికే.

3) పుదుచ్చేరిలోని పేర్ మోటెల్ (Pere Mottel) ఇచ్చిన ఫ్రెంచి వర్ణక్రమాల వరుసలోని పదకోశం.

4) మేస్తర్ డేనియల్ డ్యూస్‌గారు మద్రాసు కుంఫిణీ వారికి ఎన్నడో దఖలుపరిచిన జెసూటు ఫాదిరీలు తయారుచేసిన మాటల జాబితా.

పై నాలుగూ ఒకే గ్రంథానికి పుత్రికలు అని భావించవచ్చు. ఫ్రెంచి వారు సిద్ధపరచిన ఈ తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు వ్రాతప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో వుంది (D.1394). తొలి పేజీలో ఇలా ఒక ప్రకటన చేశారు.

''ఈ పుస్తకం మేస్తర్ బెంజిమన్ బ్రాన్ ఫిల్ వారిది. 1793 సంవత్సరం జూన్ నెల 7వ తేదీన వ్రాయను ఆరంభించినది. పేర్ మోటెల్ చదివి చదువొకుండా.''

మేస్తర్ బ్రాన్‌ఫిల్ కుంఫిణీ కొలువులోని వాడే. 1781లో సర్వీసులో చేరాడు. 1791లో నెల్లూరు కలెక్టర్. 1794లో నూజివీడు కమిటీలో రెండో మెంబరు. 1794లో నూజివీడు జమీందారీ పై సూపర్నెంట్. 1794లోనే మచిలీపట్నం జిల్లా మూడవ డివిజన్ కలెక్టర్. 1804లో ఇంగ్లాండు వెళ్ళిపోయాడు. స్వదేశానికి ప్రయాణం చేసే ముందు తన కాగితాలు కుంఫిణీ వారికి యిచ్చి వుంటాడు. ఈయన రాయించుకొన్న పేర్ మోటెల్ తెలుగు-ఇంగ్లీషు నిఘంటువుకు చాలా పుత్రికలను వివిధ కాలాలలో కుంఫిణీ సర్వెంట్లు తయారు చేయించుకొని ఉంటారు. నిఘంటువులు లేని రోజుల్లో వ్రాత ప్రతులు అక్కర తీరుస్తాయి.

జాన్ మెక్కిరల్ దొరగారు ఒక ఇంగ్లీషు-తెలుగు వొకాబులరీని తయారుచేసి కాలేజీ బోర్డువారికి సమర్పించారు. దీనిని 1815లోనే ప్రచురించాలని కుంఫిణీ వారు నిశ్చయించారు. అయితే అచ్చుపని మొదలు పెట్టలేదు. కొన్ని సవరణలు చేయమని చెప్పారు. మెక్కిరల్ ఆ మేరకు గ్రంథాన్ని తిరగ రాశాడు. 1816లో ముద్రణకు సిఫార్సు జరిగినా పని ఆగిపోయింది.

కాలేజీ బోర్డువారితో పెట్టుకొంటే లాభం లేదని విలియం బ్రౌను తన వొకాబులరీని ఒక ప్రయివేట్ ప్రెస్‌లో 1818లోనే ప్రకటించారు. ఇది తెలుగు మాటలకు ఇంగ్లీషు అర్థాలను చెప్పే గ్రంథం. దీనికి విపర్యయంగా ఆంగ్ల పదాలకు తెలుగు వివరణలు ఇచ్చే మరొక కోశాన్ని రచించాలని ఆయన సంకల్పించాడు.

కాంబెల్ దొరగారి నిఘంటువు వెలుగు చూడడానికి ముందే వ్రాతప్రతులలో వరదయ్యా పంతులుగారిదొకటీ, వెంకయ్యగారిదొకటీ, మెక్కిరల్ దొరగారిదొకటి మొత్తం

మూడు అచ్చుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే 1821లో తమ గ్రంథం ప్రచురితమయ్యేదాకా ఇతరుల నిఘంటువులు బయటకు రాకుండా కాంబెల్‌గారు అడ్డుపడ్డారని పరిశోధకులు భావిస్తున్నారు.[8] ఇంతకూ తమ నిఘంటువుకు, కాంబెల్ దొరగారు ఉత్త ప్రచురణ కర్తకన్నా పిసరంత మిన్న అని సి.పి. బ్రౌను దొరగారు అభిప్రాయపడ్డారు.[9] తమ ఆంధ్ర గీర్వాణచ్ఛందం అనే పుస్తకాన్ని కాంబెల్ దొరగారికే అంకితమిచ్చినా బ్రౌన్ దొరగారికి ఉత్తరోత్తరా సదభిప్రాయం సన్నగిల్లింది.

లండన్‌లోని ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో ఉన్న కాంబెల్ దొరగారి వ్యాకరణం రెండవ ముద్రణ ప్రతిలో బ్రౌను దొరగారి దస్తూరితో రిమార్కులు ఉన్నాయి. వాటి అనువాదం ఇలా చేయవచ్చు.

''కాంబెల్ దొరగారిని ఎరిగినవారు ఆయన ఉత్త అనుమానపు అసూయాగ్రస్తుడనీ, కలవరపాటు మనిషనీ, తెలుగు రాయడం, చదవడం సరిగ్గా రాదనీ చెప్పుకొంటారు.''

1811 డిసెంబరు 10వ తేదీ నుంచి కాలేజీ బోర్డు సెక్రటరీగా కాంబెల్ దొరగారు నియమితులయ్యారు. 1820 దాకా ఆ హోదాలో ఆయన ఉన్నారు. (1821లో మార్టులాక్ సెక్రటరీ అయ్యారు). 1827 నుంచి 1841 దాకా కాంబెల్ దొరగారు కాలేజీ బోర్డులో సభ్యునిగానే ఉన్నారు (1831లో స్వదేశానికి వెళ్ళి 1833లో తిరిగి వచ్చారు). కాలేజీ బోర్డు స్థాపన జరిగిన కాలం నుంచి అందులో ప్రముఖ స్థానంలో ఉంటూ అధికార పుస్తకాల ప్రచురణ విషయంలో ఆయన మాట చెల్లుతూ ఉండడం వల్ల చాలామందికి ఆయనంటే కష్టం కలిగి ఉండవచ్చు. అయితే కాలేజీ బోర్డు వారికి ప్రచురణార్థం గ్రంథకర్తలు పంపించే పుస్తకాలను ఒక నేటివు పండితుల కమిటీ చూసి నివేదిక సమర్పించాలి. వారి తీర్పుకు విలువ ఇచ్చేవారు.

కాలేజీలో నేటివ్ ఉపాధ్యాయ వర్గంలో మొట్టమొదట ఉదయగిరి నారాయణయ్య, బి. శంకరయ్య, రామరాజు అనే వ్యక్తులు హెడ్ ఇంగ్లీషు మాస్టర్లుగా ఉండేవారని ఇంతకు ముందే గమనించాం. వీరి దగ్గర విద్య నేర్చుకొన్న తెల్లదొరలకు ప్రభుత్వం రాగానే తమ గురువులకు పెద్ద హోదా గల ఉద్యోగాలు వేయించారు. ఉదయగిరి వెంకట నారాయణయ్యగారు సుప్రీంకోర్టులో ఇంటర్‌ప్రీటర్‌గానూ, శంకరయ్యగారు మద్రాసు కలెక్టరుకు శిరస్తాదార్‌గానూ, రామరాజుగారు మైసూర్‌లో నేటివు జడ్జిగానూ నియమితులయ్యారు. వీరి స్థానంలో ఇతర ఉపాధ్యాయులకు కాలేజీలో ఉద్యోగాలు ఇచ్చారు. 1827 నాటికి ఈ క్రిందివారు తెలుగు శాఖలో ఉన్నారు.

రావిపాటి గురుమూర్తిశాస్త్రిగారు	-	ఆంధ్ర ప్రధాన పండితులు
అహోబలాచార్యులు	-	తెలుగు పండితులు
ముద్దు రామశాస్త్రి	-	తెలుగు పండితులు
భీమసేనాచార్యులు	-	తెలుగు పండితులు

8. J. Mangamma p.161

9. Literary Autobiography. p.71.

కాలేజీ బోర్డువారు ప్రచురించవలసిన తెలుగు గ్రంథాలలో అబద్ధములు లేకుండా శోధించి నిర్ణయం తెలుపడం వీరి వంతు.

సంస్కృత విభాగంలో ఆది నుంచీ వేదం పట్టాభిరామ శాస్త్రిగారు ఉన్నారు. వీరుకాక విశ్వంభరశాస్త్రిగారు కూడా ఈ శాఖలో ఉన్నారు. ఈయన హెన్రీ హార్క్‌నెస్ దొరగారితో కలసి సంస్కృత బాలబోధ గ్రంథం రచించారు. అదాలత్ పండితులు వెంకట రామశాస్త్రిగారు అక్షర గుచ్ఛము మొదలైన గ్రంథాలపైన తీర్పు చెప్పారు.

ప్రధానోపాధ్యాయులేకాక తదితర స్థాయిల్లో ఉపాధ్యాయులు, పండితులు కాలేజీ బోర్డు అనుమతించిన ప్రైవేట్ మున్షీలు తెల్లదొరలకు పాఠాలు చెప్తూ ఉండేవారు. వెలగపూడి కోదండరామయ్య, చదలవాడ (పుదూరు) సీతారామ శాస్త్రి, పాటూరి రామస్వామి, అడక్కి సుబ్బారావు, బొడ్డపాటి సుబ్బన్న, బేతపూడి సుందరరావు, కర్లపాలెం సీతారామయ్య మొదలైన నేటివులు మున్షీలుగా కాలేజీ సివిలు సర్వెంటులను కనిపెట్టుకొని ఉండేవారు. దొరలకు అన్నివిధాలా సహాయం చేసేవారు. వారి యజమానులు కూడా ఈ పండితులకు తగిన రీతిలో సత్కారం చేశారు.

వెలగపూడి కోదండరామయ్య సి.పి. బ్రౌను దొరగారికి అక్షరాభ్యాసం చేయించిన తొలి టీచరు. అందుకు కృతజ్ఞతగా ఉత్తరోత్తరా ఆ శిష్యుడు గురువుగారికి హెడ్ అమీన్ పదవిని ఇప్పించారు.

పుదూరు ద్రావిడులైన చదలవాడ సీతారామ శాస్త్రిగారు కుళులో (క్లూలో) దొర ప్రోత్సాహంవల్ల ప్రశ్నోత్తర రత్నమాల అనే పేరుతో 1830లో ఆంధ్ర వ్యాకరణాన్ని రచించారు. 1832లో బాలశిక్ష అనే గ్రంథాన్ని తయారు చేశారు. ఇదే పెరిగి పెరిగి పెద్ద బాలశిక్షగా రూపొదింది. ఎన్నెన్నో ముద్రణలు పొంది నేటికీ ప్రప్రథమ ప్రాథమిక గ్రంథాలలో ప్రఖ్యాతమైంది. దీనిని ఆదర్శంగా తీసుకొని వేర్వేరు రచయితలు వేరు వేరు సంవత్సరాలలో బాలబోధ (1856), బాలవివేక చింతామణి (1868), బాలికా హితబోధిని (1869) వంటి గ్రంథాలు వెలువరించారు. విదుషీ రంగమ్మ అనే మహిళ బాలబోధ వ్యాకరణం (1874) రచించడం గమనించదగ్గ విషయం (ఈ పేర్కొన్న గ్రంథాలన్నీ లండన్‌లోని ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో ఉన్నాయి).

పాటూరి రామస్వామి, మారిస్ దొరగారి మున్షీ. ఈయనకు నరసింహ శాస్త్రి, రంగా శాస్త్రులు అనే ఇద్దరు సోదరులున్నారు. ఈ అన్నదమ్ములు ముగ్గురూ వాక్య గ్రంథాలుగా శుకసప్తతి (1840), హరిశ్చంద్ర కథ (1840), విజయ విలాసం (1841) వరుసగా రచించారు.

అడక్కి సుబ్బారావు కూడా మారిస్ దొరగారి కొలువులో ఉన్నవాడే. ఆయన పేర అచ్చుపడిన సెలక్షన్ అనే కుర్ర తరహా రచనను వాస్తవానికి సుబ్బారావు రచించాడని బ్రౌన్ దొరగారు వెల్లడి చేశారు. ఈ పుస్తక రచనకు మారిస్ దొరకు 1,750 రూపాయలను కాలేజీ బోర్డు వారు ముట్టచెప్పారట.

బొడ్డపాటి సుబ్బన్న కాంబెల్ దొరగారి కోసం మొదట ఆంధ్ర శబ్ద చింతామణి వ్రాతప్రతిని తయారు చేశాడు. దీనిని ఆధారం చేసుకొనే కాంబెల్ దొరగారు రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారి సహాయంతో తన వ్యాకరణాన్ని ఆంగ్లంలో రచించారు.

బేతపూడి సుందరరావు ఓగ్విలీ, ఆర్.ఎస్. ఎల్లిస్ మొదలైన దొరల మనిషి. తెల్లదొరలు వేసవిలో నీలగిరి వెళ్ళి అక్కడ ఉన్నప్పుడు వాళ్లతో పాటు ఇతడూ వెళ్ళాడు. నీలగిరి చరిత్ర అనే వాక్య గ్రంథం రచించాడు. ఇందులోని మూడు ప్రకరణాల వ్రాత ప్రతి ఇంగ్లాండులోని హెయిల్‌బరీ కాలేజీలో ఒక సంపుటంలో కనబడుతుంది. లండన్‌లోని దొరలు కూడా దీనిని పాఠ్యగ్రంథంగా చదువుకొన్నారన్నమాట (TEL D.4).

కర్లపాలెం సీతారామయ్యనే తెలుగు ఉపాధ్యాయుడు సీమ నుంచి వచ్చే చాలామంది సివిలు సర్వెంట్లకు పాఠాలు చెప్పాడు. ఇంగ్లాండులోని హెయిల్‌బరీ కాలేజీలో తెలుగు బోధించే ఎఫ్. జాన్సన్‌గారితో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరిపేవాడు. ఆ దొరగారికీ, వారి విద్యార్థులకూ ఉపయోగపడేటట్టు, నానావిధాల అర్జీల సంకలనం గ్రంథం సమకూర్చి సీమకు పంపించాడు (దీని ప్రతి ఈస్టు ఇండియా కాలేజీ లైబ్రరీ వ్రాత ప్రతుల విభాగంలో ఉంది. TEL D.6, D.7.) సివిలు సర్వెంటులు నేటివుల అర్జీలను ఆ భాషలలోనే చదవగలగాలి కనుక ఈ అర్జీల సంకలనంలో కొన్ని కాగితాలు గుండ్రక్షరములతో నున్ను, కొన్ని జిలుగు అక్షరాలతోనున్ను సిద్ధం చేయించమని జాన్సన్‌గారు ఉత్తరువు చేశారు. కర్లపాలెం సీతారామయ్య అలాగునే సిద్ధం చేసి పంపించాడు. కొన్ని ఇంగ్లీషు లిపిలో ఉన్న తెలుగు లేఖలు.

పైన వివరాలు ఇచ్చిన పండితులేకాక సైదాపేట మీనాక్షయ్య, పెరుంబూదూరు కృష్ణమాచార్యులు, రావిపాటి గురవయ్య అనే పండితులు కూడా కాలేజీ సంస్కృతాంధ్ర పండితులుగా ఉండేవారు. వీరిలో చివరి వారు ప్రఖ్యాతులైన రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారి కుమారుడు.

వేదం పట్టాభిరామ శాస్త్రిగారు (1760-1820) ఉద్దండ పండితులు. వేదశాస్త్ర పారంగతులు. తర్కాలంకారవాగీశ బిరుదాకింతులైన రామరుద్ర భట్టాచార్యుల వారిని జయించారు. అనేక తర్కశాస్త్ర గ్రంథాలు రచించారు. కాలేజీలో హెడ్ సంస్కృత-తెలుగు మాస్టరుగా పండిత మునసబీ పదవుల కోసం చదివే నేటివు న్యాయశాస్త్ర విద్యార్థులకు తర్క, వ్యాకరణ, ధర్మశాస్త్రాలు బోధించేవారు. తెలుగు, సంస్కృతం అభ్యసిస్తున్న జూనియర్ సివిలు సర్వెంట్లకు కూడా శిక్షణ ఇచ్చేవారు. 1820 నాటికి వీరి జీతం నెలకు 175 రూపాయలు ఆ సంవత్సరమే ఆయన మరణించారు. వీరి స్థానాన్ని భర్తీ చేయడానికి అర్హతలున్న పండితులు అర్జీలు పెట్టుకోమని కాలేజీ బోర్డువారు గెజిట్ ప్రకటన చేశారు.

తెలుగు సంస్కృత శాఖలలో ఉన్నట్టే ఇతర ప్రాంతీయ భాషా విభాగాలలో సమర్థులైన పండితులుండేవారు. సీమలో హెయిల్‌బరీ కాలేజీ చదువు ముగించుకొని మద్రాసు సర్వీసుకు వచ్చే తెల్లదొరలకు పాఠాలు చెప్పేవారు. తెలుగు నేర్చుకొనడానికి 1813వ సంవత్సరం సెప్టెంబరు 2వ తేదీనాడు చేరిన మొదటి జూనియర్ సివిల్ సర్వెంటు

పేరు జె. హిట్. 1814 మే నెలలో ఎ. సింక్లయిర్ అనే విద్యార్థి తెలుగు నేర్చుకొనడానికి చేరాడు. 1817 నుంచి కొంతవరకు పాఠాలు చదివి తెలుగు పరీక్షలకు కూర్చొన్న వారి పేర్లు 14 దాకా తెలుస్తున్నాయి (1819లో మొత్తం 26 మంది విద్యార్థులున్నారు).

1. Brown	8. Fullerton
2. Bruce	9. Grant
3. Clarke	10. Graham
4. Clulow	11. Hudderston
5. Davidson	12. Moris J.C.
6. Elliot	13. Thomson
7. Featherstone	14. Willock

ఈ పధ్నాలుగు మంది సివిలు సర్వెంట్లలో కనీసం ముగ్గురు (బ్రౌను, క్లూలో, మారిస్) ఉత్తరోత్తరా తెలుగు గ్రంథ రచనలలో ప్రముఖ పాత్ర వహించారు. అయితే వీరు చదువుకొంటున్నప్పుడు వీరికి తెలుగు పాఠ్య గ్రంథాలు చాలా తక్కువ. కాలేజీలో ఆంధ్ర ప్రధానోపాధ్యాయులైన రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు రచించిన విక్రమార్కుని కథలు (1818), పంచతంత్రం (1834) పాఠ్య గ్రంథాలుగా ఉండేవి. వీటిని కాలేజీ బోర్డువారు తమ ముద్రాక్షరశాలలో అచ్చువేశారు. కాంబెల్ దొరగారు రచించిన ఇంగ్లీషులోని తెలుగు వ్యాకరణం, నిఘంటువు అధికారిక గ్రంథాలు. ఉపయుక్త గ్రంథాల కోసం గ్రంథకర్తలను బోర్డువారు ప్రోత్సహించేవారు. మారిస్ దొరగారు 1833లో తెలుగు సెలక్షన్లు సంకలనం చేసి ఇచ్చారు. దీనిని అచ్చు వేస్తూ బోర్డువారు ఆయనకు 1,750 రూపాయలు ఇచ్చారు. 1825లో ఇంగ్లీషు, తెలుగు నిఘంటువు గావించమని మారిస్ దొరగారికి 15,000 రూపాయలు చెల్లించారు. ఈ నిఘంటు రచన 1836లోగాని పూర్తికాలేదు.

సివిలు సర్వెంట్లు చాలామంది నిఘంటువులు రచించి కుంఫిణీ వారి నగదు బహుమతులు పొందాలని ఆశించారు. ఎవరెవరు ప్రయత్నాలు చేశారో బ్రౌను దొరగారు ఒక యాదస్తులో రాశారు. దానిని చూడండి.

''1821 సంవత్సరాంతంలో మచిలీపట్నం జిల్లా కోర్టులో నన్ను రిజిష్టారుగా నియమించారు. కాంబెల్ దొరగారి నిఘంటువుతో పరిచయం ఏర్పడడంతో దాన్ని తిరగేసి విపర్య నిఘంటువు ఇంగ్లీషు-తెలుగుకోశం నిర్మించాలనుకొన్నాను. మూడు నెలలు ఈ పని చేశాను. గిల్ క్రిస్ట్ తన ఇంగ్లీషు-హిందీ నిఘంటువులో చూపిన ప్రణాళికనే అనుసరించాను. నిండా అభినివేశం, సూక్ష్మబుద్ధిగల బ్రాహ్మణుడొకడు సహాయకునిగా లభించినాడు. సహాయకుడేమిటి, సహశ్రామికుడనాలి. నా నిఘంటు నిర్మాణం విజయవంతమవుతుందన్న విశ్వాసం విస్తారంగా కుదిరింది. 1823 మధ్యలో మద్రాసు వెళ్ళాను. మొట్టమొదట మేస్తర్ బాయిలీను కూడా ఇలా నిఘంటు నిర్మాణంలో ఉన్నారని విన్నాను. రెండోది, మార్పులాక్ కూడా ఈ కృషిలో ఉండడమేకాక రచన రమారమీ పూర్తి చేశాడని విన్నాను. ఈయన కాంబెల్ నిఘంటువును సొంతం తిరగవేసి రాశాడు.

అయితే పూర్తిచేగలననే నమ్మకం చాలక తన కాగితాలన్నీ నాకు అప్పగిస్తానని దయతో చెప్పాడు. ఆ సమయంలోనే బాయిలీను కూడా తాను మొదలు పెట్టిన రచన తాలూకు కాగితాలు నాకు ఇస్తానన్నాడు. ఈ ప్రతిపాదనల గురించి ఏం చేయాలన్న ఆలోచనలో ఉన్నప్పుడు మారిస్ కూడా ఇలాంటి కృషిలోనే ఉన్నారని ఎవరో చెప్పారు. ఒక్క కార్యాన్ని నలుగురు తలపెట్టినట్లు తేలింది....'' (D.1391)

కాలేజీ బోర్డువారు మారిస్ దొరగారి వైపు మొగ్గు చూపడం చేత ఆయన నిఘంటువే మొదట వెలువడింది. తెలుగు భాష గురించి ఇంగ్లీషులో తెలుసుకొని దాన్ని నేర్చుకొనడానికి తగిన పుస్తకాలు క్రమేణా వెలువడసాగాయి. కాలేజీ బోర్డు వారు స్థాపించిన దేశీయ భాషల అధ్యయన సంఘంలో సభ్యులుగా వివిధ కాలాలలో పనిచేసిన తెల్లదొరలు ఈ కార్యక్రమాన్ని జరిపించారు. ఆ దొరల కొందరి పేర్లు చూడండి.

F.W. Ellis	1812 నుంచి 1817 దాకా సభ్యుడు
E.C. Greenway	1812 నుంచి 1821 దాకా సభ్యుడు
Rev. J. Mosley	1812 నుంచి 1817 దాకా సభ్యుడు
William Oliver	1812 నుంచి 1827 దాకా సభ్యుడు
A.D. Campbell	1812 నుంచి 1820 దాకా సెక్రటరీ
	1827 నుంచి 1838 దాకా సభ్యుడు
H. Mortlock	1821 నుంచి 1823 దాకా సెక్రటరీ
J.C. Morris	1825 నుంచి 1827 దాకా సెక్రటరీ
	1832 నుంచి 1838 దాకా సభ్యుడు
J.M. Kerrell	1816 నుంచి 1827 దాకా సభ్యుడు
Capt. Harkness	1827 నుంచి జాయింట్ సెక్రటరీ
	1832లో సెక్రటరీ

1836లో మద్రాసులోని కాలేజీ బోర్డుకూ, పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ కమిటీకి గల సంబంధాలు రద్దు చేశారు. జూనియర్ సివిల్ సర్వెంట్లు ప్రాంతీయ భాషల అధ్యయనానికి మున్షీలను మాత్రమే నియమించారు. 1854లో కాలేజీ బోర్డునే రద్దు చేసి, ఎగ్జామినర్ల బోర్డును ఏర్పాటు చేశారు. రూల్సును పదేపదే మారుస్తూ వచ్చారు.

వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా పద్ధతులు మార్చుకొనడం దక్షత గలవారి లక్షణం. ఆదిలో వర్తక సంఘంగా ఉన్న కాలం నుంచి క్రమేణా రాజ్యపాలకులయిన కాలం దాకా కుంఫిణీ వారు ఒకటి మాత్రం పాటిస్తూ వచ్చారు. భారతదేశంలోని తమ నౌకర్లు ఏ ముఖ్యమైన చర్య తీసుకొన్నా దానిని సీమలోని అధికారులకు వ్రాతమూలకంగా తెలియచేయాలి. ఈ నిబంధన వల్ల ఇండియా ఆఫీసులో గుట్టలకు గుట్టలుగా దస్త్రాలు వచ్చి చేరాయి. వాటిలో వివిధ భారతీయ భాషలలోని పదజాలం చోటు చేసుకొంది. ప్రాచ్య భాషలలోని జుడిషియల్, రెవెన్యూ పారిభాషిక పదాలు కోకొల్లలుగా సీమలోని వారు తెలుసుకొనవలసి వచ్చింది. భారతదేశంలో పనిచేయ

వలసిన సివిలు సర్వెంట్లకు ఆ భాషల పదజాలాన్ని విస్పష్టార్థాలతో వివరించవలసి వచ్చింది.

కలకత్తాలోని ఫోర్టు విలియం ప్రాంగణంలో తెల్లదొరలకు భారతీయ న్యాయశాస్త్ర విషయాలను నేర్పాలని వెల్లస్లీ 1800లో సంకల్పించడానికి హేతువు ఏదో ఇంతకు ముందు గమనించాం. 1759 నుంచి 1809 దాకా తెల్లవాళ్ళు ఆక్రమించుకొని పాలించ వలసిన భూభాగాల పట్టికను చూశాం. ఫోర్టు విలియం, హెయిల్‌బరీ, సెయింట్ జార్జి కోట కాలేజీలలో తెల్లదొరలకు పరిమిత భాషలలో విద్యలు నేర్పుతున్న కాలంలోనే ఇంగ్లీషువారు భారతదేశంలో మరికొన్ని భూభాగాలను స్వాధీనం చేసుకొన్నారు. వాటిపై ఆయా ప్రాంతీయ భాషలలో పరిపాలన చేయవలసి వచ్చింది. 1801 నుండి 1834 దాకా కుంఫిణీవారు హస్తగతం చేసుకొన్న రాజ్యాలను చూడండి.

వరుస సం.	సంధి తేదీ	జిల్లాలు	వైశాల్యం (చ॥మైళ్ళలో)	ఎవరినుండి
1.	1801 నవంబరు 10	గోరక్‌పూర్ దిగువ దో-ఆబ్ బరేల్లీ	32,000	అయోధ్య వజీరు
2.	1802 డిసెంబరు 31	బొందిలీఖండం	4,685	పీష్వా
3.	1803 డిసెంబరు 17	కటకం, బాలసూరు	10,000	బీరారు రాజు
4.	1803 డిసెంబరు 30	ఎగువ దో-ఆబ్ ఢిల్లీ ప్రాంతాలు	22,000	దేలతరువు సింధియా
5.	1805 ఏప్రిల్ 21	గుజరాత్‌లో జిల్లాలు	6,000	గయక్వాడు
6.	1815 డిసెంబరు 2	కుమాన్ తెరాయ్‌లో భాగం	10,000	నేపాల్ రాజు
7.	1817 జూన్ 13	సౌగార్, హట్టాధార్వార్	10,000	పీష్వా
8.	1817 నవంబరు 6	అహమ్మదాబాద్ మాగాణి	4,600	గయక్వాడు
9.	1818 –	అజ్మీర్ నగరం		దౌలత్‌రావు సింధియా
10.	1818	పూనా, కొంకణం, మహారాష్ట్రం	20,000	పీష్వాను గెలిచి
11.	1818	నర్మదా జిల్లాలు సంబల్‌పురం, పాట్నా న॥	85,700	బీరార్ రాజా
12.	1820 డిసెంబరు 17	దక్షిణ కొంకణభూములు	6,700	సావంత వాడి రాజు
13.	1822 డిసెంబరు 12	బిజాపురం, అహమ్మదు నగరు జిల్లాలు	5,000	నిజాం

14.	1824 ఆగస్టు 2	సింగపూరు	337	జోహారు రాజు
15.	1825 ఏప్రిల్, 9	మలక్కా	800	డచ్చివారు
16.	1826 ఫిబ్రవరి, 24	అస్సాం, ఆరకానుతవాయి తెనాసరం	77,000	ఆవారాజు
17.	1834 -	కూర్గు	-	కూర్గురాజు

తమ రాజ్యంలో కొత్త భూభాగాలు చేరాక పరిపాలన మరికొన్ని కొత్త భాషలతో చేయవలసి వచ్చింది. ఇప్పుడు సివిల్ సర్వెంట్లు అరబ్బీ, పారశీకం, హిందూస్తానీ, సంస్కృతం, హిందీ, బెంగాలీ, ఒరియా, మరాఠీ, గుజరాతీ, తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం అనే పదమూడు భాషల్లో వ్యవహారిక పదజాలాన్ని అవగాహన చేసుకొనవలసిన అవసరం ఏర్పడింది. ఈ భాషలన్నిటిలో వ్యాకరణాలు, నిఘంటువులు, పదకోశాలూ వివిధ కాలాలలో వివిధ పాశ్చాత్యులు తయారు చేశారు. తెలుగులో కృషి చేసినవారి గురించి తెలుసుకొన్నాం. ఇతర భాషలకు సేవచేసిన తెల్లదొరల పేర్లను కూడా మచ్చుకు చూద్దాం.

పారశీకం	-	రిచర్డ్సన్
సంస్కృతం	-	కోల్‌బ్రూక్, ఎల్లిస్, సదర్‌లాండ్, మెక్‌నాటన్
హిందూస్థానీ	-	డాక్టర్ గిల్‌క్రిస్ట్, షేక్స్పియర్
బెంగాలీ	-	డాక్టర్ కేరీ, ప్రొఫెసర్ హీటన్
తమిళం	-	బెషీ (1728) రోట్లర్, ఆండర్సన్
తెలుగు	-	కాంబెల్, మారిస్, బ్రౌన్
మలయాళం	-	బెయిలీ
కన్నడం	-	మెక్కిరల్, రీల్స్
మరాఠీ	-	మేజర్ మ్యోల్స్‌వర్త్
ఒరియా	-	మేస్టర్ సట్టన్
గుజరాతీ	-	డ్రమ్మండ్

ఎందరెందరో ఇతరులు కూడా పై భాషలలో కృషి చేయకపోలేదు. హిందీలోనే భోజపురీ, మైథిలీ, మాగధీ, బ్రిజ్‌భాష వంటి మాండలికాలను గుర్తించారు. 1855 నాటికి తొమ్మిది ముఖ్యమైన లిపులలో, పదమూడు భారతీయ భాషలలోని జుడిషియల్, రెవెన్యూ పారిభాషిక పదాల గ్లాసరీని హెచ్.హెచ్. విల్సన్ తయారు చేశాడు.

విశాల రాజ్యాలను పాలించాలంటే ఒక్క సివిలు సర్వీసు మాత్రమేకాక మిలటరీ సర్వీసు కూడా అవసరం. కుంఫిణీ కొలువులో కచ్చేరీ ఉద్యోగాలకు రైటర్లను తీసుకొన్నట్లే దండు ఉద్యోగంలో ప్రవేశించడానికి కేడెట్లను తీసుకొనేవారు. ఇంజనీర్లుగా, ఫిరంగుల విభాగంలోని సాయుధ సైనికులుగా, గుర్రపు సేనలోనూ, పదాది దళాలలోనూ కేడెట్లుగా, వైద్యశాఖలో అసిస్టెంటు సర్జన్లుగా, పౌరోహిత్యానికి చాప్లిన్లుగా చిన్నవాండ్లను సీమలోనే తమ కొలువులో చేర్చుకొనేవారు.

1802 నుంచి 1833 దాకా 1190 మంది రైటర్లను భారతదేశంలోని మూడు ప్రెసిడెన్సీలకూ పంపారు. 1814లో ఏడాదికి 7గురును పంపితే, 1828 నాటికి ఏడాదికి 69 మందిని పంపారు. ఇదే కాలంలో 7727 మంది మిలటరీ కేడెట్లను, ఏడాదికి సగటున 258 మందిని భర్తీ చేసుకొన్నారు. కుంఫిణీ డైరెక్టర్లు ఒక్కొక్కరూ 11మంది చిన్నవాండ్లను సర్వీసులకు నమోదు చేసి నియమించవచ్చు. డైరెక్టరు హోదా రావాలంటే దానికి పెట్టుబడి చాలా ఉండాలి.

తూర్పు ఇండియా కుంఫిణీలో పెట్టుబడి పెట్టిన వాటాదార్లను ప్రొప్రయిటర్లని అంటారు. 600 పౌన్ల స్టాకు గల హోల్డరుకు ఒక ఓటు ఉంటుంది. రెండువేల పౌన్ల వాటా ఉన్నవాడే డైరెక్టరు హోదాకు అర్హుడు. ఏటా ఏప్రిల్ మాసంలో రెండో బుధవారం నాడు డైరెక్టర్ల ఎన్నికలు జరగాలి. 24 మంది నాలుగేళ్ళపాటు డైరెక్టర్లుగా ఉండవచ్చు. తరువాత ఒక ఏడాదిపాటు డైరెక్టరుగా ఉండకూడదు. వాస్తవానికి 30 మందిలో ఈ పదవి పంపకం అయ్యేది. 1784 నుంచి 1834 దాకా 110 మంది విభిన్న వ్యక్తులు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఇందులో 44 మంది పూర్వం భారతదేశంలో కుంఫిణీ వ్యవహారాలు చేసి లాభాలు ఆర్జించి ధనవంతులై ప్రొప్రైటర్లుగా ఎన్నిక అయిన వారే.[10] భారతదేశ పరిపాలన ఈ 110 మంది డైరెక్టర్ల 'ఇష్టారాజ్యంగా'నే చట్టానికి లోబడి జరిగేది.

కుంఫిణీ సివిలు సర్వీసులో చేర్చుకొనే చిన్నవాండ్లను కొన్ని ప్రత్యేక తరగతుల నుండి ఎన్నుకొనేవారు. స్నేహితుల పిల్లలు, బంధువుల కుర్రవాండ్లు, వ్యాపార సంబంధం గల వారి కుటుంబంలోనివాళ్ళు, బోర్డువారు సిఫార్సు చేసిన వాళ్లు సివిల్ సర్వెంట్లుగా నమోదు అయేవారు. లండన్ నుంచే ఎక్కువ మందిని చేర్చుకొనేవారు. చాలామంది కుర్రవాళ్ళ తల్లిదండ్రులు హెయిల్‌బరీ కాలేజీ చదువు వ్యర్థమనీ, కాలహరణమనీ భావించేవారు. పైగా ఖర్చుతో కూడుకొన్నది. 1805 నుంచి 1830 దాకా 3,63,000 పౌండ్లను ఈ కాలేజీ నిమిత్తం కుంఫిణీ ఖర్చు చేసింది. అంటే ఒక్కొక్క రైటర్‌మీద 267 పౌండ్ల మదుపు పెట్టారన్నమాట.

హెయిల్‌బరీ కాలేజీని స్థాపించిన నాటి నుంచీ ఇంగ్లాండులో గొప్ప సాంఘిక, సాంస్కృతిక పరివర్తనలు జరుగుతూ వచ్చాయి. నెపోలియన్ యుద్ధాలకాలంలో ఈ కాలేజీని స్థాపించారు. అప్పుడు ఇంగ్లాండు, వేల్సు జనాభా పది మిలియన్లకన్నా తక్కువ. 1861లో ఈ సంఖ్య ఇనుమడించింది. క్రమేణా పారిశ్రామిక విప్లవం వల్ల రాజకీయ, సాంఘిక, ఆర్థిక జీవనశైలులు మారాయి. ఈ మార్పులు కుంఫిణీ సివిలు సర్వీసు శిక్షణలో కనబడలేదు. భారతదేశ పరిపాలనలో జుడిషియల్, రెవెన్యూ శాఖల వారేకాక పబ్లిక్ వర్క్స్, రైలు రోడ్లు, కాలువలు, ఆనకట్టలు, రహదారులు, ఆరోగ్యం, కరువు నివారణ సర్వీసులు ఒక పరిమిత వర్గానికి హక్కు భుక్తం కాకూడదని బ్రిటీష్ పార్లమెంటు తలచింది.

1853లో బ్రిటీష్ పార్లమెంటు ఆమోదించిన ఇండియా యాక్టు ప్రకారం సివిల్ సర్వీసులో ప్రవేశానికి అర్జీదారులు పోటీ పరీక్షలో పాల్గొని ఉత్తీర్ణులవాలి. తమ ఇష్టులను

10. C.H. Philips - The East India Company (1784-1834) - p.337

నామినేట్ చేసే హక్కు పోయాక కుంఫిణీవారు 1856 నుంచి హెయిల్‌బరీ కాలేజీలోనికి రైటర్లను తీసుకొనడం నిలుపుదల చేశారు. ఆ మరుసటి సంవత్సరం 1857లో కాలేజీనే మూసివేశారు. ఇది భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగిన 1857 కావడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. 1809 నుండి 1850 దాకా మొత్తం 426 మంది ఈ సంస్థ నుండి వచ్చి మనకు పాలకులు కావడం, పెత్తనం చలాయించడంలో కొన్ని మేళ్ళు, చాలా కీళ్ళు, గొప్ప మార్పులు జరిగాయి. భారతీయులలో భావ విప్లవ బీజాలు ఈ కాలంలోనే నాటుకొనడం జరిగింది.

కథలూ-కమామీషులు

అనగా అనగా మన తెలుగు కథలన్నీ సాగి సాగి చిట్ట చివర ముగియగానే ''కథ కంచికీ, మనమింటికి'' వస్తాము. అయితే బౌద్ధుల జాతక కథలన్నీ కాశీలో మొదలవుతాయి. కథలన్నవి బుద్ధుని కన్నా చాలా ప్రాచీనమైనవి. మానవ సంఘాలు తరతరాల విజ్ఞానాంశాలను కథల రూపంలో చెప్పుకుంటూనే వస్తున్నాయి. కథకు కాళ్ళూ, ముంతకు చెవులూ లేకపోయినా కథకులకు నోళ్ళూ, వినే వాళ్ళకు చేటలంత చెవులూ ఉన్నంత కాలం కథలకు కామాలేకాని ఫుల్‌స్టాపులు ఉండవు. ఏ భాషనైనా నేర్చుకొనేవాళ్ళకు పనికట్టుకొని వ్యాకరణం, వాక్య నిర్మాణ పద్ధతులూ బోధపరిచినా, భాష బాగా పట్టుపడాలన్నా, భావం బాగా గుండెలకు హత్తుకోవాలన్నా కథలలో చెప్తేనే కార్యాలు సానుకూలం అవుతాయి. అందుకే కుంఫిణీ యుగంలో పాత కథలన్నింటికీ కొత్త గిరాకీ వచ్చింది.

కలకత్తాలో పోర్టు విలియం కళాశాల స్థాపించాక తెల్లవాళ్ళు ప్రాచ్యభాషలు చదువుకోడానికి పారశీకంలో గులిస్థాన్, ఉర్దూలో సికిందర్‌నామా, పూరబి హిందీలో తులసి రామాయణం, బెంగాలీ మహాభారతం, విల్కిన్స్ సంస్కృతం నుండి ఆంగ్లీకరించిన హితోపదేశం, తోతీనామా, బాగ్‌బహార్, గులేబకావళి మొదలైన కథలు కమామీషులు బాగా ఉపయోగపడ్డాయి. గ్రేవ్స్ సి. హూటన్ అనే ప్రాచ్య భాషల ఆచార్యుడు మొదట కలకత్తాలోనూ, తర్వాత ఇంగ్లండులోని హెయిల్‌బరీ కాలేజీలో పాఠాలు చెప్పాడు. ఈయన విక్రమాదిత్యుని కథలు అనువదించాడు.[1] అవి చాలా మనోరంజకంగా ఉండేవి. కలకత్తా కాలేజి ఒరవడిలో మద్రాసులో సెంటు జార్జి కోట కాలేజీని స్థాపించాక తెలుగులో తెల్లదొరలు చదువుకొనడానికి వీలుగా రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు ఓం ప్రథమం విక్రమార్కుని కథలను రచించారు (1819). దీనిని కాలేజీ బోర్డువారు ప్రచురించారు. ఇంగ్లండులో తెలుగు చదువుకొనే సివిల్ సర్వెంటు యువకులకు ఇది పాఠ్యగ్రంథమైంది. ఈ పుస్తక ప్రచురణతో ఆధునిక కాలంలో కథాసాహిత్యానికి నాంది ఆలపించడం జరిగింది.

1. Cohan Bernard S. p. 350

గురుమూర్తి శాస్త్రిగారు ''విక్రమార్కుని కథలు'' రచించాక, మరో పదిహేను సంవత్సరాలు దాటాక 1834లో ''పంచతంత్ర కథలు'' రచించారు. ఈ మధ్యకాలంలో కాలేజీ బోర్డు వారు కొన్ని కథలను అనువదింపచేశారు. సదర్ అదాలత్‌లో ట్రాన్సులేటర్‌గానూ, ఇంటర్‌ప్రిటర్‌గానూ ఉన్న వెన్నెలకంటి సుబ్బారావుగారు ''ప్లీజింగ్ టేల్స్'' అనే ఇంగ్లీషు పుస్తకాన్ని 1828లో తెనిగించారు. దీని మాతృక ఎవరు రాశారో తెలియదు. వివిధ ప్రాంతాలలో ఉన్న సివిల్ సర్వెంట్లు తమ దగ్గిర మునిషీలుగా ఉండే తెలుగువారి చేత కొన్ని కుద్యకావ్యాలను వచన రూపంలో చెప్పించారు. 1810లో చెన్న రాజధాని సర్కారు వారి తెలుగు ట్రాన్సులేటరుగా ఉన్న విలియం శాండల్స్ తన మునిషీ పైడిపాటి పాపయ్యా చేత రంగనాథ రామాయణం వచన గ్రంథంగా చెప్పించాడు. దీనిని సాంద్రీసు రామాయణమంటారు.

1823 నుండీ గవర్నమెంటు తెలుగు ట్రాన్స్‌లేటర్‌గా ఉంటూ సెలక్షన్స్ (1823) నిఘంటువు (1835) రచించిన జె.సి. మారిస్ దొరగారి దగ్గర చాలామంది మునిషీలు ఉండేవారు. వీరిలో అడక్కి సుబ్బారావు, పాటూరి సోదరులూ ముఖ్యులు. మారిస్‌గారి సెలక్షన్స్ అడక్కి సుబ్బారావు రచించాడని బ్రౌన్ దొరగారి సాక్ష్యం ఉంది.[2] 1851లో అడక్కి సుబ్బారావు రచనగా ఒక తెలుగు ప్రిమియర్ అచ్చుపడింది. ముఖపత్రం మీద ఆయన గురించి ''గవర్నమెంటు ట్రాన్స్‌లేటర్‌గారి కచ్చేరీలో లేటు మున్షీ'' అని ఇంగ్లీషులో తెలియచేశారు.

మారిస్ దొరగారి కొలువులో ఉన్న పాటూరి సోదరులు ముగ్గురూ తెలుగు పుస్తక రచనలు వ్యావహారిక భాషలో చేసినవారు. పాటూరి రామస్వామి శాస్త్రులు 1846లో బ్రౌన్ దొరగారికి రాసిన ఉత్తరంలో ఈ సోదరుల కృషి ఏ నేపథ్యంలో జరిగినదీ విశదమవుతుంది.

''మహారాజశ్రీ ఆంధ్రభాషా ప్రవీణులైన సి.పి. బ్రౌను దొరవారి సముఖమునకు ''పాటూరి రామస్వామి శాస్త్రులు'' మిక్కిలి వినయంతో వ్రాసుకొనే మనవి యేమంటే -

లోగడ మా పెద్దన్నగారయిన నరసింహ శాస్త్రులవారునూ, చిన్నన్నగారయిన రంగ శాస్త్రులవారునూ ఈ వుభయులు కాలేజీ తెనుగు మునిషి పనిలో నుండినప్పుడు వారు అనేకమంది దొరలకు చదువు చెప్పి వారిని ఆంధ్రభాషయందు ఘటికులను చేసియుండిరి. ఇలా వుండగా మా పెద్దన్నగారయిన నరసింహ శాస్త్రులవారు తెనుగు డిప్‌టీ పనిలో వుండి వారున్నూ చనిపోయిరి. ఆ సమయమందు మహారాజశ్రీ జీ.సీ. మారిస్ దొరగారు నన్ను పరీక్షించి నాకు తెనుగు అసిస్టెంటు పని దయచేసి యుండిరి. ఆ పనిలో నేను ఉండగా కాలేజీ బోర్డువారు గవర్నమెంటు వారి ఆర్డరు చొప్పున మా పనులను నిలుపుదల చేసినది మొదలుకొని నేను గొప్ప కుటుంబము కలవాణ్ణి గనుక అన్నవస్త్రానికి శ్రమపడుతూ వుండగా సదరహీ మారిస్ దొరగారు నన్ను తన వద్ద అడిషనల్ మునిషీ

2. Literary Autobiography of C.P. Brown,p.79

నుంచుకొని, కాలేజీ వుంచినది మొదలుకొని కాలేజీలో దొరలను పరీక్షించిన కథలలో పెక్కండ్రు యింగ్రీజు కథలనున్ను, రికార్డు కథలన్ను యేర్పరచి వ్రాయమని వుత్తర్వు చేసినందున వారి యుత్తరువు ప్రకారము నేను **దరోబస్తు కథలను** యేర్పరచి వ్రాసి యిచ్చిన పిమ్మట - ఆ దొరవారు లోగడ జాన్‌వాన్ దొరవారి యుత్తర్వు ప్రకారము మా పెద్దన్న గారయిన నరసింహ శాస్త్రుల వారిచేత రచింపబడిన వచనరూపమగు హరిశ్చంద్రుని కథ మిక్కిలి శిథిలమై యుండ సదరహీ కథను యేర్పరచి వ్రాయమని వుత్తరువు చేసినందున నేను ఆ కథను వ్రాస్తూ వుండగా ఆ దొరవారి తావున ప్రబలులుగా వున్నవారు తమరు వినగా మరియొకరు అచ్చట ప్రబలముగా నుండవచ్చునా యనే తాత్పర్యముచేత, నేను వ్రాస్తూ వున్న కథను వ్రాయకుండా చేసి రామాయణపు కథలను యేర్పరచి వ్రాయించమని ఆ దొరవారి గుండా చెప్పినందున నేను ఆ రామాయణ కథలను యేర్పరచి వ్రాస్తుండగా నామీద లోలోపల తంటాలు చేసి నన్ను ఆ పనిలో నుంచి తీసివేయించినారు. మరికొన్ని దినములకు వారు నా విషయమై గావించిన కృత్రిమమును ఆ దొరవారు తెలుసుకొన్న వారయి మళ్ళీ నా పనిని నాకు దయచేసి మా చిన్నన్నగారైన రంగ శాస్త్రుల వారిచేత నూతనముగ రచింపబడిన విజయ విలాసమనే గ్రంథమును వ్రాసేలాగున నన్ను వుత్తరువు చేసినందున యుత్తరవు ప్రకారము నేను వ్రాస్తూ వుండగా, నా దురదృష్టము వల్ల ఆ దొరవారు సీమకు ప్రయాణమైనందున అదివరలో నేను యేర్పరచి వ్రాసివున్న శుకసప్తతి కథలనున్ను, వచన రూపమగు విజయ విలాసమునున్ను వ్రాసి వారికి నివ్వగా వారు కాలేజీ సెక్రటరీ మహారాజ రాజశ్రీ రౌలాంస్ దొరవారికి ఒక సిఫారసు కాగితమును దయచేసి యుండిరి. నేను ఆ కాగితమును తెచ్చి రౌలాండ్ దొరవారికి నివ్వగా వారు మాకు యింగ్లీషు రానందున అడిషనల్ మునిషీ పని అయినా యివ్వడానికి లేదనన్ని యెక్కడనైనా టౌకినీ మునిషీ పని తటస్థమయితే యిప్పిస్తున్నామనిన్ని చెప్పినందున నేను మళ్ళీ మారిస్ దొరగారి తావుకు పోయి ఆ సంగతి వారికి తెలియచేసి వేరే ఎవరినైనా దొరలకు ఒక సిఫారసు కాగితమును దయచేమని అడిగినందున వారు మంచిదని శెలవిచ్చి యుండిరి. యింతలో నాకు దేహము అశక్తముగా నుండి వారి దర్శనమునకు పొయ్యేటందుకు లేక వారు ప్రయాణమై పొయ్యేనాడు నేను పోయి వారి దర్శన్నము చేసుకోగా వారు నాకు వ్రాయడానికి సావకాశము లేదని చెప్పి ప్రయాణమైపోయిరి.

ఈ సమయమందు నన్ను రక్షించగల ప్రభువులు ఎవ్వరు ఇచ్చట లేనందున నేను అన్నవస్త్రానికి లేక పిల్లలతో యిక్కడ నానాశ్రమలు పడుతూ వుండడము వల్ల యేలా తోచక అనేక కుటుంబ సంరక్షకులయిన తమ దర్శనము చేసుకొని తమ సమక్షములో నా విద్యమానము యావత్తు శ్రుతపరచుకొన్నట్టు అయితే తమరు నా గొప్ప కుటుంబంలో కూడా నన్ను సంరక్షణ చేతురని యెంచి సముఖమునకు యీ మనవి వ్రాసుకొన్నాను. అయితే సపితాయస్తు పోషకః - అనే ధర్మశాస్త్ర వచనము యున్నందున సకల న్యాయాధిపతులయిన తమరు నాయందు కటాక్షము వుంచి నన్ను పోషించి ఆ కీర్తిని చెందవలసినదని తమ శ్రేయస్సును వేడుకొంటున్నాను.

లోగడ మా చిన్నన్నగారయిన రంగ శాస్త్రుల వారి పేరిట తమరు వ్రాయించిన వుత్తరము యిందులో మలపూఫ్ చేసి సముఖములో యిచ్చుకొన్నాను. అది తమరు చిత్తగించగా నేను ఫలానివాడని తమ చిత్తానికి విశదము కావచ్చును. సకలము తెలిసిన ధర్మప్రభువులకు, నేను తరచు వ్రాయశక్తుణ్ణి కాను. యింతే నా మనవి'' 19-9-1846 (M.419 pp.129-132)

ఈ ఉత్తరం 1846లో మారిస్ దొర సీమకు వెళ్లిపోయాక రాసినదైనా 1840 ప్రాంతాలలో పాటూరి సోదరుల వచన గ్రంథాలు ముద్రితమయ్యాయి.

పాటూరి నరసింహ శాస్త్రులు - హరిశ్చంద్ర కథ - 1840
పాటూరి రంగశాస్త్రులు - విజయవిలాస వచనం - 1841
పాటూరి రామస్వామి శాస్త్రులు - శుకసప్తతి వచనం - 1840

కుంఫిణీ యుగంలో 1840 చాలా ప్రాముఖ్యం గల సంవత్సరం. ఆ యేడాది నుంచి తెలుగు కథా వాఙ్మయం అభివృద్ధి చెందసాగింది. పైన చెప్పిన పాటూరి సోదరుల వచన రచనలే కాక ఈ క్రింది పుస్తకాలు కూడా వెలుగు చూశాయి.

సింగరాజు దత్తాత్రేయులు
వెంకటసుబ్బయ్యసంయుక్త రచన - రామాయణ వచనం 1840
పైడి పాపయ్య - రంగనాథ రామాయణ వచనం - 1840

తెలుగు పద్య కావ్యాలకు వచన రూపాలేకాక పరదేశ భాషలలోని కథా వాఙ్మయాన్ని తెల్లదొరలూ, తెలుగువారూ తెనిగించారు. వుస్టలర్ దొరగారు చేసిన తెలుగు అరేబియన్ నైట్స్ గ్రంథం (కట్టినది) 13 రూపాయలకు కాలేజీలో లభిస్తుందని వర్తమాన తరంగిణి 1842లో ప్రకటించింది. ఇంతకు ముందే పురాణం కృష్ణ శాస్త్రులుగారు అరేబియన్ నైట్సు తెనిగించారని, అది 1840లోనే అచ్చుపడిందని పరిశోధకులు చెప్తున్నారు.[3] అయితే 1840లో కంచీవరం రామశాస్త్రిగారు ''యవన యామినీ వినోదములు'' అనే పేరుతో అరేబియన్ నైట్సును అనువదించారు. ఇవి రెండు సంపుటాలు. ఈ రెండూ లండన్ ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో ఉన్నాయి. (TEL-C.131, 132) పురాణం కృష్ణ శాస్త్రిగారు నిజంగా అనువదిస్తే ఆ పుస్తకాల వైనాల గురించి ఆకరాలు ఏమీ పరిశోధకులు చెప్పలేదు.

పాటూరి రామస్వామి శాస్త్రులు 1840లో శుకసప్తతి కథలను వచనంగా రచిస్తే ఇంకెవరో 1842లో ''కీరబహత్తరి తోతీనామా లేక చిలుక కథలు'' అనే గ్రంథం రచించి ప్రచురించారు. ఇది పార్సీ తోతీనామాకు అనువాదం. పారశీకపు పేర్లు తరచుగా కనబడుతూ ఉంటాయి. ఇందులో ఉన్న 52 కథలూ, కథా విధానం, ఉపోద్ఘాత రచన వ్యావహారిక భాషలో చక్కగా ఉందని పరిశోధకులు చెప్తున్నారు. 1842లోనే ధూర్జటి లక్ష్మీపతి ''హంస వింశతి'' కథలను వచనరూపంగా రచించారు. ఇది వర్తమాన తరంగిణీ ముద్రాక్షరశాలలో అచ్చుపడింది. 1865లో పునర్ముద్రణ జరిగింది.

---

3. నిడుదవోలు వెంకటరావు - ఆంధ్ర వచన వాఙ్మయం (1977) p. 59

1843లో ''దివారామకథ'' అనే గ్రంథం వెలువడింది. దివారామ ఢిల్లీ పాచ్చాగారి కుమార్తె. ఈమె అమరావతి పట్టణపు రాకుమారుని పెళ్ళాడుతుంది. ఈ కథలో దశకుమార చరిత్రలోలాగ రాకుమారులు, మంత్రికుమారులు దేశాటనం చేస్తారు. తన ప్రజ్ఞావిశేషాల చేత మంత్రికుమారుడు రాకుమారుని చాలాసార్లు రక్షిస్తాడు. చమత్కార జనకమైన ఈ కథ సుఖాంతమని పరిశోధకులు చెప్తున్నారు.

భారతీయ కథా వాఙ్మయంలో విక్రమార్కుని వంటి కథా నాయకుని కథలు ఎందరు ఎన్ని విధాలుగా చెప్పినా జనం వింటారు, చదువుకొంటారు.

రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు విక్రమార్కుని కథలు రాసిన తర్వాత, అవి నాలుగు ముద్రణలు పొందాక 1847లో వాద్రేవు వెంకయ్య అనే రచయిత 'బత్తీసు పుత్రి కథలు'' అనే పేరుతో 32 బొమ్మలు చెప్పిన విక్రమార్కుని కథలను మళ్ళా వాడుక భాషలో కథనం చేశాడు.

పట్టు విడువని విక్రమార్కుడికి బేతాళుడు చెప్పిన కథలు కూడా మన కథా వాఙ్మయంలో ఇప్పటికీ జనరంజకంగా వుంటున్నాయి. ఆధునిక బాలవాఙ్మయ పత్రికలో బేతాళుని పేరుతో ఎన్నో కల్పిత కథలు వస్తున్నాయి. గాని ఆదిలో అవి అక్షరాలా ఇరవై అయిదు మాత్రమే. 1848లో 'బేతాళ పంచవింశతి కథలు' అనే వచన గ్రంథం వెలువడింది.

కుంఫిణీ యుగం ప్రథమ పాదంలో పారశీకం చాలా ప్రముఖ స్థానంలో వుండేది. ఆ భాషలోనే వ్యవహారాలు జరిగేవి. పారశీక భాషలోని కథలు కమామీషులు యితర భాషలలోనికి పరివర్తన చెందడం సహజం. తోతీనామా (1842) తెనిగించినప్పుడు పారశీక పదాలు అందులో విస్తారంగా వున్నట్టు యింతకు ముందు చూశాం.

1856లో ఎర్రమిల్లి మల్లికార్జునుడు అనే ఆయన 'చార్ దర్వేషు' కథలను తెలుగులో చెప్పారు. పారశీక భాషలో ఫకీరును దర్వేషు అంటారు. ఇవి జనరంజకంగా వుండడం వల్ల 1856లో పునర్ముద్రణం పొందింది. ఆ తర్వాత వావిళ్ళవారు ఈ శతాబ్దిలో మళ్ళా అచ్చువేశారు. నేను ఈ ముద్రణలోనే ఆ కథలను చదివాను.

తెలుగులో 'కథ, కమామీషు' అన్న పదాలు జంట మాటలుగా ప్రచారంలో వున్నాయి. కథకు వేరే అర్థం చెప్పక్కర్లేదుగాని కుంఫిణీ యుగంలో ఏ వచన రచనైనా కథ కిందే చలామణి అయిందని భావించాలి. సి.పి. బ్రౌన్ దొరగారి దగ్గర తాతాచార్యులు అనే హాస్య చతురుడు, సంస్కృత పండితుడు వుండేవాడు. ప్రసంగవశాత్తూ ఎన్నో కబుర్లను ఆయన చెప్పేవాడు. వాటిని దొరగారు కాగితం మీదకు ఎక్కించి ఆ కమామీషులను కథలుగా జమకట్టి 'తాతాచార్యుల కథలు' అనే సంకలనంగా 1856లో ప్రచురించారు. ఇందులో అన్నీ తాతాచార్లు చెప్పినవేకాక కృష్ణమాచార్యులు చెప్పినవీ, తాను హైదరు చరిత్రలో చేసిన అనువాదాలూ కూడా బ్రౌన్ దొరగారు చేర్చారు.

'తాతాచార్యుల కథలు'' 1974లో ఎం. శేషాచలం అండ్ కో వారు బంగోరె సంపాదకత్వంలో, అతని వ్యాఖ్యానాలతో అచ్చువేశారు. 'బ్రౌన్ ఈ కథలను ఎందుకు సేకరించినట్టు?' అని సంపాదకుడు ప్రశ్నిస్తూ 'ఏదో రెండో తరగతి పిల్లకాయలకు రీడర్

వంటి దానిని ప్రసాదించి పోవాలనే ధోరణి మినహా మరేమీ లేదని మళ్ళీ ఎవరైనా అంటే అంతకంటే శుద్ధ పొరపాటు ఇంకొకటి వుండదని నా విశ్వాసం' అని బంగోరె రాశాడు.[4] తాతాచార్యుల కథలను అచ్చువేస్తూ బ్రౌన్ తన వుద్దేశాన్ని స్పష్టంగానే చెప్పాడు.[5]

'These tales may supersede the prose abridgements, which are still read under the names of Pancha Tantra, and tales of Vicramarca. These two are excellent composition: but the abridgements are written in a pedantic style different from the Telugu in daily use'.

తాతాచార్యుల కథలు పాఠ్యగ్రంథాలుగా ఉపయోగపడాలనీ బ్రౌన్ తాపత్రయం. దీనిని ప్రకటించిన తేదీ 17 ఏప్రిల్ 1855 అని గుర్తుంచుకోవాలి. అంతకు రెండేళ్ల ముందు 1853లో[6] చిన్నయసూరి నీతిచంద్రికను ప్రచురించి మద్రాసు యూనివర్సిటీ సెక్రటరీ అయిన ఆర్బత్‌నాట్ దొరగారికి అంకితమిచ్చారు. బ్రౌన్ శుద్ధ వ్యావహారిక భాషావాది. తెలుగులో అవాంఛనీయమైన గ్రాంథికశైలి జొరబడిందని గుర్తించారు. నిత్యజీవితంలో ఉపయోగించే భాషకూ, పాఠ్యగ్రంథాలయిన పంచతంత్ర విక్రమార్కుని కథల శైలికీ తేడాలున్నాయి. ఆ పాఠ్య గ్రంథాలను ఈ 'తాతాచార్యులకథలు' వెనక్కుతోసి ప్రాచుర్యం చెందుతుందని బ్రౌను ఆకాంక్ష.

సామాన్య పాఠకులకు అర్థంకాని భాషా చమత్కారాలను 'తాతాచార్యుల కథలు' సంకలనంలో చేర్చడం బ్రౌనుకు యిష్టంలేదు. అందుకే 'బహువ్రీహి' అనే కథను "Too difficult. Not worth Printed' ఇది వొద్దు - సున్న'' అని బ్రౌను రిమార్కు రాయడంలో వుద్దేశం స్పష్టమవుతోంది. 'గిరిన్మయూరే' అన్న కథను కూడా 'యిది వొద్దు' అని బ్రౌన్ ఆదిలో తిరస్కరించినదే. జీవద్భాషలో రచించిన వాటిలోంచి ఎన్నో సామాజిక చరిత్రాంశాలు దొరుకుతాయి. అది వేరే సంగతి, కుంఫిణీ యుగంలో కథలూ కమామీషులూ హాయిగా చదువుకోడానికేకాక బళ్ళో అధ్యయనం చేయడానికి కూడా వుద్దేశించినవే.

ఏ యుగంలోని రచనలలోనైనా వర్గ స్వభావాలూ, వర్గ ప్రయోజనాలు ప్రస్ఫుటంగా కనబడతాయి. రచయితలు ఎవరు అన్నది ముందు తేల్చుకోవలసిన విషయం. కుంఫిణీ యుగంలో కథలు కమామీషులు[6] రాయించి, రచించి అచ్చువేసిన వారు ఏ ప్రయోజనం ఆశించి అలా చేశారో గుర్తుంచుకోవాలి. బ్రౌను దొరగారే ఒక కథను 'నిరాడంబర శైలి'లో వ్రాస్తున్నాను అని ఒకచోట రాసి పెట్టారు.

---

4. 'సి.పి.బ్రౌన్ తాతాచార్యుల కథలు' - సంశోధన బంగోరె - యం. శేషాచలం అండ్ కో, మద్రాసు, 1974, పుట 25
5. అందులోనే - పుట. 222
6. కమామీషు అన్న పదానికి అర్థం రెవెన్యూ రూకం సేకరణ, సాహిత్య విషయాల్లో 'కథలు-కమామీషులు' అన్నప్పుడు కథలూ, సంకలనాలు అని అర్థం చెప్పుకోవచ్చు.

''పల్లెటూరి వానికిన్ని పులికిన్ని జరిగిన ముచ్చట - పల్లెటూరి వాడు పులితో కూడా దారినపోతూ మనిషి జాతి ఘనమా పులిజాతి ఘనమా అని ఒకరు ఒకరితో ముచ్చటిస్తూ వుండగా నొక గోడమీద పులిని మనిషి చంపిన చిత్రపు పని కనపడినందున మనిషి ఆ పులితో అరే చూస్తి గెల్చినది మేమే అని గర్వించి మాట్లాడగా యీ మాటకు పులి చెప్పినది యేమంటే; చిత్తరువు వ్రాసినది మనిషే గనుక గెలిచినది మనిషే సరి! మా పులి చిత్తరువు వ్రాశినట్టయితే వేట వాణ్ని పులి చంపినట్టుగా వ్రాసును అని చెప్పెను.

కావ్యంలో స్త్రీ దూషణ కలదు సరి ఆ కావ్యము చెప్పినది మగవాడు. ఆడమనిషి కావ్యం చెప్పేనాడు పురుష దూషణ కావ్యమునందు ప్రసిద్ధం కాగలదని యీ కథ వల్ల తెలుసుకోగలమని పురుషులు చెప్పిన దూషణ కన్న పది యిబ్బళ్ళుగా చెప్పుదురు. (M 425, p.p.449). రచయితల వర్గ స్వభావాలను బట్టి రచనలు వెలువడుతాయన్న సత్యానికి యిది అతికినట్టు నప్పే ఉదాహరణ.

పురుషాధిక్యత గల సంఘంలో స్త్రీలకు ప్రాప్తించే న్యూనతలను వేలెత్తి చూపిస్తూ స్త్రీ పురుష దృక్పథాల వల్ల కూడా రచనలలోని ఆలోచనల ధోరణులు మారుతాయని పందొమ్మిదో శతాబ్దంలోనే ఉద్ఘాటించిన బ్రౌన్ ప్రశంసనీయుడు.

విద్యావంతులు - భావ చైతన్యం

కుంఫిణీ వారి సివిల్ సర్వెంట్ల దగ్గర మిలటరీ రెజిమెంట్లలోనూ, వివిధ శాఖలకు చెందిన కచ్చేరీలలోనూ, అదాలతులలోనూ అతి చిన్న ఉద్యోగంతో ప్రారంభించి అత్యున్నత స్థానానికి చేరుకొన్న వివిధ నేటివు పెద్ద మనుషులు స్వయంకృషి చేత విద్యావంతులయ్యారు. ఏదో ఒక గ్రంథ రచన చేసినవారు వీరిలో కొందరు లేకపోలేదు. ఆ గ్రంథాల వల్ల కొద్దిగానో గొప్పగానో నాటి సాంఘిక చరిత్ర తెలియవస్తుంది. వీరి జీవిత చరిత్రలు కూడా కొంత కొంత తెలుస్తున్నాయి.

వెన్నెలకంటి సుబ్బారావు (1784-1832)

ఇంగ్లీషు భాషలో స్వీయ చరిత్రను రచించిన తెలుగువారిలో వెన్నెలకంటి సుబ్బారావు గారిని మొదట లెక్కించాలి. వీరి ఆత్మకథవల్ల పద్ధెనిమిదో శతాబ్దం చివరి రోజుల్లోనూ, పందొమ్మిదవ శతాబ్దంలోనూ తెలుగు దేశంలోని విద్యా విధానం ఆనాటి కుర్రవాళ్ళలో చదువుల పట్లగల శ్రద్ధ, కచ్చేరీలలో చేరి పనులు నేర్చుకొనడం, చిన్న హోదాలు సంపాదించుకొనడం, దేశాలు పట్టిపోవడం, పెద్ద పదవులలో ప్రవేశించడం మొదలైన విషయాలు తెలుస్తాయి.

నెల ఒక్కింటికి ఒక్క పూల వరహామీద 1799 మే నెలలో మిలటరీ పే మాష్టరు కచ్చేరీలలో ఉద్యోగం ప్రారంభించిన సుబ్బారావుగారు 1829 నాటికి నెలకు 95 వరహాల

జీతం పుచ్చుకొనే హోదాకు ఎదిగారు. 1802లో ఇంగ్లీషు రైటరుగా స్థిరపడ్డారు. 1808లో హెడ్ రైటరుగా, ట్రాన్సులేటరుగా ఉత్తర కనరా జిల్లా కోర్టులో పనిచేశారు. అప్పుడే మద్రాసులోని సదర్ అదాలత్ కోర్టులో ట్రాన్స్‌లేటరుగా ఇంటర్‌ప్రెటర్‌గా ఉద్యోగంలో చేరారు. 26 సంవత్సరాలు కుంఫిణీ ఉద్యోగంలో వున్నారు. మెక్కిరల్, ఆలివర్, ఎ.డి.కాంబెల్ మొదలైన సివిల్ సర్వెంట్లందరూ వీరికి బాగా తెలుసు.

వీరిని సెంట్ జార్జి కోట కాలేజీ బోర్డువారి స్కూలు బుక్ సొసైటీలో సభ్యునిగా నియమించారు.

ఆనాటి విద్యావిధానం మీద సుబ్బారావుగారు బోర్డువారికి రాసిన లేఖను అధికారులందరూ మెచ్చుకొనడమేకాక 'ది ఫస్టు రిపోర్టు ఆఫ్ ది స్కూల్ బుక్ సొసైటీ ఫర్ ది ఇయర్ 1823' అనే నివేదికలో అచ్చువేశారు (దీని అనువాదాన్ని ఈ సంపుటంలోనే విద్యావిధానం అనే ప్రకరణంలో చూడవచ్చు). సుబ్బారావుగారు కాలేజీ బోర్డు వారికోసం 'ది ప్లీజింగ్ టేల్స్' అనే గ్రంథాన్ని తెలుగులోనికి అనువదించారు. ఇది రెండుసార్లు ముద్రణ పొందింది. దీని ప్రతులు ప్రస్తుతం లభ్యం కావు.

సుబ్బారావుగారి ఇంగ్లీషు రచనే తప్ప తెలుగు రచన ఎలా వుంటుందో మచ్చుకైనా నేడు దొరకదు.

సుబ్బారావుగారు మరణించిన 41 సంవత్సరాల తర్వాత 1873లో వారి కుమారుడు గోపాలరావు ఉరఫ్ ఆదిశేషయ్య తండ్రిగారి ఆత్మకథను ప్రచురించాడు.

సుబ్బారావుగారికి తెలుగు, ఇంగ్లీషు, కన్నడం, తమిళం, మరాఠీ, పారశీకం, హిందుస్థానీ భాషలు క్షుణ్ణంగా వచ్చు. సదర్ అదాలత్ కోర్టులో తెలుగు, తమిళ, కన్నడ భాషల ట్రాన్సులేటరుగా ఇంటర్‌ప్రీటర్‌గా ఎన్నో తర్జుమాలు ఇంగ్లీషులోకి చేశారు. ఒక నాయిబ్, ఒక మద్దతుగార్, ఒక రైటరు సహాయం లేకుండా 1217 కోర్టు కేసులను అనువదించారు. కొన్ని కేసుల పత్రాలు 15 ఫుల్‌స్కేపు పుటలకు తక్కువ లేవు. కొన్ని 60 పేజీలు కూడా వుండేవి.

సుబ్బారావుగారు కావలి వెంకటలక్ష్మయ్యగారికి, ఏనుగుల వీరాస్వామిగారికి బంధువే కాక మంచి మిత్రుడు. కాశీయాత్ర చేసినప్పుడు కలకత్తాలో వెంకట లక్ష్మయ్యగారి ఇంట 1823లో బసచేశారు.

సుబ్బారావుగారి మూడవ భార్య మగబిడ్డను కని చనిపోయినప్పుడు ఏనుగుల వీరాస్వామయ్యగారు సంతాపాన్నీ, సంతోషాన్నీ ఏకకాలంలో వెలిబుచ్చవలసినప్పుడు రాసిన సానుభూతి ఉత్తరం సుబ్బారావుగారికి ధైర్యం ఇచ్చింది. సుబ్బారావు తమ తీర్థయాత్రల గురించి విపులంగా రాయలేదుగాని వీరాస్వామయ్యగారు తెలుగులో తమ అనుభవాలు రచించారు.

ఏనుగుల వీరాస్వామయ్యగారు (1780–1836)

వెన్నెలకంటి సుబ్బారావుగారికి, ఏనుగుల వీరాస్వామయ్యగారికి బంధుత్వం - స్నేహంతోపాటు పోలికలు కూడా ఉన్నాయి. ఇద్దరికీ చిన్నప్పుడే (ఒకరికి తొమ్మిదో ఏట, ఇంకొకరికి పదోయేట) పితృ వియోగం కలిగింది.

ఇద్దరూ వీధి బళ్ళలో చదువుకొని స్వయం కృషితో ఇంగ్లీషులో ప్రావీణ్యం సంపాదించి తెల్లదొరలతో సరిసమానమైన శైలిలో కచ్చేరి పత్రాలు రాయగల ప్రజ్ఞను అలవర్చుకున్నారు. ఇద్దరూ శిఖరాగ్రాలను చేరుకొని మద్రాసులోని సదర్ ఫౌజుదారీ అదాలత్ కోర్టులలో ట్రాన్సులేటర్, ఇంటర్‌ప్రిటర్ హోదాలో పనిచేశారు. వీరాస్వామయ్యగారు సుప్రీంకోర్టులో హెడ్ ఇంటర్‌ప్రిటర్ అయ్యారు.

వీరాస్వామయ్యగారికి తెలుగు, తమిళం, ఇంగ్లీషు భాషలలోనేకాక సంస్కృతంలో కూడా మంచి ప్రవేశముంది. శ్రుతి, స్మృతి, పురాణాల అవగాహన, ధర్మశాస్త్రాల వ్యాఖ్యానాలు బాగా తెలిసినవారు. పండిత సభలలో సైతం వాదించి తమ సిద్ధాంతాలను ప్రతిష్ఠించుకోగల పాటవం గలవారు.

వీరాస్వామయ్యగారు 1830 మే మాసం 18వ తేదీనాడు బయలుదేరి కాశీయాత్ర ప్రారంభించారు. మార్గంలో వారికి కలిగే అనుభవాలనూ, చూసిన ప్రదేశాలను, అక్కడ విశేషాలను వివరిస్తూ తమకు లేఖల ద్వారా తెలియచేయవలసిందని మిత్రులు కోరారు. వీరాస్వామయ్యగారు సవిస్తరంగా అన్ని విషయాలను క్రమంగా రాసి పంపించారు. తమవలె యాత్ర పోవువారు మార్గంలో పూర్వంగానే జాగ్రత్త పెట్టుకోవలసిన విషయాలు కూడా పొందుపరిచారు. ఈ లేఖలను మిత్రులు ఒక పుస్తకంగా తయారు చేశారు. దానికి ఎన్ని ప్రతికలు పుట్టాయో తెలియదు. ఇది తెలుగులో అచ్చుపడడానికి పూర్వమే వెంకు మొదలియారుగారు తమిళంలోనికి తర్జుమా చేశారు. నాగపూరు వీరాస్వామి మొదలియారుగారు మహారాష్ట్ర భాషలోనికి అనువాదం చేశారు. నాగపూరు 'రెసిడెంట్'గారు ఇంగ్లీషులోనికి తర్జుమా చేద్దామనుకొని అనుమతి కోసం రాస్తే గ్రంథకర్తగా తానే భాషాంతరం చేసి పంపిస్తానని వీరాస్వామయ్యగారు జవాబు రాశారు. కొంతవరకు ఆంగ్లీకరించారు.

ఏ మిత్రుల ప్రోద్బలంవల్ల 'కాశీయాత్ర చరిత్ర'ను ఈయన రచించారో ఆ మిత్రులలో ప్రముఖులు కోమలేశ్వరపురం శ్రీనివాస పిళ్లెగారు. ఈ గ్రంథాన్ని వీరాస్వామయ్యగారు పోయాక 1838 నాటికి పుస్తకరూపంలో అచ్చువేశారు. పుదూరి నారాయణ శాస్త్రిగారు లేఖక ప్రమాదాలు దిద్ది ముద్రణ పనులు చూశారు. ఈ పుస్తకాన్ని కుంఫిణీ సర్కారువారు మెచ్చుకొన్నారు. ఇది బహుళార్థ సాధకం కనుక 1869లో మళ్ళా అచ్చు వేయించారు. 'కాశీయాత్ర చరిత్ర' పందొమ్మిదో శతాబ్దపు సాంఘిక చరిత్రకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకే ఆ శతాబ్దపు చరిత్రను 'స్పెషలైజ్' చేసిన దిగవల్లి వెంకట శివరావుగారు వివరణలతో పాదసూచికలతో ఈ పుస్తకాన్ని 1941లో మూడోసారి ముద్రించారు.

వీరాస్వామయ్యగారు ఇతర గ్రంథ రచనలు కూడా చేసినట్టున్నారు. 'స్మృతి చంద్రిక'ను అనువదించారు. అది ఏమైందో తెలియదు. తత్త్వశాస్త్ర విషయాల గురించి 'కాశీయాత్ర చరిత్ర'లో చాలాచోట్ల వివరణాత్మకమైన విశ్లేషణలు ఉన్నాయి. ఉదాహరణకు నాస్తికుల గురించి వారు రాసింది చూడండి.[1]

''నాస్తికుల పూర్వోత్తరము విచారించగా వారి తత్వము యీశ్వరుడని వొకడు లేడనిన్ని స్వభావ ప్రభావము చేత యీ ప్రపంచము యీ రీతిని జరుగుచున్నదనిన్ని నిశ్చయించి వున్నారు. ఆ చొప్పున యీశ్వరుడు లేడనుకోవడము చేత కమర్ఠులకు నాస్తికులు దూష్యులయినారు. గాని జ్ఞానులకు వారు దూష్యులు కారని తోచుచున్నది. యెందువల్లనంటే జ్ఞానదృష్టి కలవారికిన్ని యీశ్వరుడు అనే పుల్లింగ పదాథర్ఠము గాని ఈశ్వరి అనే స్త్రీ లింగ పతాథర్ఠముగాని వొకటి భిన్నముగా నామరూపగుణములు గల పదాథర్ఠము లేదు గనుక సమస్త జగదాధారమయిన వస్తువు అవాఙ్మానస గోచరమై శుద్ధ శూన్యముగా ధ్యానించబడివున్నది. గనుక నున్ను నాస్తికులు ప్రపంచము యే స్వభావము చేత జరుగుచున్నదని అంటారో ఆ స్వభావాన్నే జ్ఞానులు పరతత్వమని అంటారు. స్వభావమనే వాచకము పరతత్వమనే వాచకమునకు భిన్నమేగాని వస్తుభేదము వుభయుల తాత్పర్యములోనున్ను లేనట్టు తోచబడుచున్నది. గనుక నాస్తికులున్ను జ్ఞానులకు సహపాఠులే గాని వేరుకాదు.'' దుష్ట శిక్షణ గురించి ఇలా రాశారు. ''యింగిలీసు వారి న్యాయమేమంటే, పదిమంది దొంగలు శిక్షలేక తప్పిపోవడము మంచిదిగాని సందేహము మీద వొక గృహస్థుడు దండనకు లోబడడము యుక్తము కాదని లలితముగా న్యాయవిచారణ చేస్తారు. యీ దేశములో చూస్తే వొక దుష్టుణ్ణి రక్షిస్తే వేయిమంది శిష్టులను శిక్షించినట్టు అనే మాట ప్రత్యక్షముగా వున్నది. యెట్లా నడిస్తే మంచిదో, యెట్లా నడిస్తే చెడ్డదో యీ దమర్ఠసూక్ష్మము తెలియడానకు ఈశ్వరుడు సమధుర్ఠడు గాని ఈశ్వరజ్యోతి దీప్తిగా ప్రకాశించే ప్రకృతి జనులు శక్తులు కారు.'' (పు.326)

శ్రామికుల గురించి వీరాస్వామయ్యగారు గమనించిన విషయాలు కూడా ఉన్నాయి. విశాఖపట్నం దగ్గరనున్న ఉప్పాడ బోయీల గురించి ఇలా రాశారు.

''నేను కన్యాకుమారి మొదలుగా కాశ్మీరము వరకు సంచరించిన ప్రదేశములలో వుప్పాడ బోయీలకు సమానమైన మోతగాండ్లు చూపలుర్ఠ, బలాఢ్యులు, అలంకారప్రియులు, ప్రయాసకు వోచర్ఠ గలవారు, బంట్రౌతు మానాగా ఆయుధధారణ ప్రియులు యెక్కడా వున్నట్లు తోచలేదు. అయితే దేశము కాని కొన్ని దేశములకు వస్తే యీ వుప్పాడ బోయీలకు దేహదార్ఢ్యర్ఠము తప్పి రోగిష్ఠులవుతారు. వారిని జాగ్రత్తగా కాపాడుచూ వారి దేహములు నొచ్చిన కాలమందు ఆయా దేశస్థులయిన బోయీలతో పని గడిపి వీరిని తీసుకొని వస్తే యీ వుప్పాడ బోయీలతో భూగోళ సంచారము యావత్తూ చేయవచ్చునని తోచుచున్నది. పాలకీలు మోసే వృత్తికి యీ వుప్పాడ దేశస్థులనే ఈశ్వరుడు తగిన వారినిగానే నియమించినట్టు తోచబడుచున్నది. అయితే వీరు మాంస, మద్య, మత్స్యప్రియులు మిక్కిలి అయినందున వీరు తాగినప్పుడు తమలో తాము పోట్లాడితే పోట్లాటలు ఖామందుల మనసున నిండా నొప్పి చేస్తున్నది.'' (పుట 331-2).

1. కాశీయాత్ర చరిత్ర - పుటలు.265-6.

కాశీయాత్ర చరిత్ర వల్ల ఎన్నెన్నో విషయాలు తెలిసినట్టే మా పూర్వీకుల సంగతి కూడా కొంత తెలుస్తుంది. మా తాతగారి తరంలో వారు వీరాస్వామయ్య గారికి ఆతిథ్యం ఇచ్చారు. ఆయన 'యలమంచలి' చేరుకొన్న తరువాత జరిగిన విషయాలు ఇలా రాశాడు.

''నేటి మధ్యాహ్నము దారిలో వ్యాఘ్రభయాలు కూడా కద్దు. యిది మజిలీవూరు అయినప్పటికిన్ని దారి వొత్తి కొక కోసు దూరములో వుండే దివ్వల అనే గ్రామనివాసియయిన భాగవతుల కీత్తన్న యెదురుగా వచ్చి తన వూరికి రమ్మని ప్రార్థించినందున ఆ వూరు 7 గంటలకు ప్రవేశించి ఆ రాత్రి ఆ మరునాడు శుక్రవారము వర్ష ప్రతిబంధము చేత నిలిచినాను. యీ వూరు 100 యిండ్ల అగ్రహారము. అందరు ఉపపన్నులు అయినప్పటికిన్ని వొక యతిశాపము చేత పెంకుటిండ్లు కట్టక పూరిండ్లలో కాపురము చేయుచున్నారు. యీ వూళ్లో వుండే బ్రాహ్మణులందరు వేద పారంగతులు. కిత్తయ్యయనే వారు జమీన్‌దారుడున్ను మంచి సాంప్రదాయికుడున్ను. యీ వూళ్లో అంగళ్లు కలవు. అన్ని పదార్థాలు దొరుకును'' (పు. 334)

మా తాతగారి పేరు కిత్తయ్య పంతులుగారు. బహుశా వారి తాతగారైన కిత్తయ్యగారు వీరాస్వామిగారికి ఆతిథ్యం ఇచ్చి ఉంటారు.

తాను వెళ్ళిన ప్రతి ఊళ్లో ముఖ్యుల గురించి వీరాస్వామయ్యగారు రాశారు. బందరు వెళ్ళినప్పుడు ఈయన బ్రౌను దొరగారిని చూశారట. అయితే ఆ సంగతిని గ్రంథంలో రాయలేదు. ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉన్న బ్రౌను దొరగారి సొంత ప్రతి కాశీయాత్ర చరిత్రలో దొరగారు "Masuli patnam The Author visited me here but does not mention this' అని కోడు చేశారు. (D.1407- పుట 456)

బ్రౌను దొరగారు మచిలీపట్నంలో ఉన్నప్పుడు వీరాస్వామయ్యగారు కలుసుకొన్నారు. అప్పుడు అవధానం పాపయ్యగారి పుస్తకాల ప్రసక్తి వచ్చి వుంటుంది. చెన్నపట్నం వెళ్ళి వాకబు చేస్తానని చెప్పి వెళ్ళాక వీరాస్వామయ్యగారు దొరగారికి ఆ సంగతి ఉత్తరం రాశారు. పనిలో పనిగా తాము రచించిన కాశీయాత్ర చరిత్రను ముద్రిస్తారా అని కూడా అడిగారు. బ్రౌను దొరగారు అప్పుడు ప్రెస్సు పెట్టే యోచనలో ఉన్నారు. 'ఈ పుస్తకాన్ని ప్రకటించడానికి యింకా సిద్ధంగా లేమని' దొరగారు 1832లో జవాబు రాశారు. అయితే వీరాస్వామయ్యగారు పంపిన వ్రాత ప్రతిని కూలంకషంగా చదివి పదప్రయోగాలు నోటు చేసుకొన్నారుగానీ వీరాస్వామయ్యగారి ఆచార వ్యవహారాలను తీవ్ర పదజాలంతో నిందించారు.

అల్లాడి రామచంద్రయ్య (1836 ప్రాంతాలు)

ఆధునిక విజ్ఞానాన్ని అధ్యయనం చేస్తున్నా, అనూచానంగా వస్తున్న ఆచార వ్యవహారాలను త్యజించడం సాధ్యం కాదు; తెల్లదొరల సంపర్కం వల్ల, వారి శాస్త్రగ్రంథాల అవలోకనం వల్ల తెలియవచ్చే విషయాలపై తర్కించి సిద్ధాంతాలు చేయడం సులభసాధ్యం కాదు: ఈ కష్టమైన పనిని అల్లాడి రామచంద్రయ్య తన సిద్ధాంత శిరోమణి' అనే గ్రంథంలో 1836లోనే చేశాడు.

రామచంద్రయ్యగారు తన గురించి ఇలా రాసుకున్నారు.

''నేను ప్రథమం కించిత్ శాస్త్రము కావ్యకోశ ధర్మ శాస్త్రములను జ్యోతిష్య ఫలితాదికము అధ్యయనం చేసి అంతలోనే సమానోక్తిమత్వం పొందినట్టువలె'' ఉండే రోజుల్లో మేస్తర్ రాస్సిల్ విల్కిన్‌సన్ దొరగారు చంద్రపురం కలెక్టరు సూప్రిటెంటు అయి వచ్చి 'తాను విద్వాంసుడు గనుక' ఆ ఊళ్ళోని విద్వజ్జన పరిశీలన చేశారు. అందరూ ఆయన వద్దకు పోతూ వస్తూ ఉండేవారు: రామచంద్రయ్య కూడా అదే చేశారు.

ఆ దొరగారు 'అన్నోదక ఋణానుబంధం' చేత రామచంద్రయ్యను తనవద్ద పెట్టుకొని యాజ్ఞవల్క్య స్మృతివ్యాఖ్యా, విజ్ఞానేశ్వరకృత మితాక్షరీ వ్యవహారకాండ, వ్యవహారమయూఖం మొదలైనవి చెప్పించుకొనేవారు. రామచంద్రయ్యకు ఏమని తోచిందంటే ''వీరు ప్రత్యాంతవాసులు. వీరియందు విద్య లేకుండా ఉండవలెను గనుకనే మన వద్ద నుండి సంగ్రహించుచున్నారు.'' ఆ దొరగారి భూగోళ, ఖగోళ విషయాలలో ఆధునిక విషయాలను చెప్తే రామచంద్రయ్య నమ్మలేదు. భాగవతంలో చెప్పినదే సత్యమని ఆరేళ్ల వాదిస్తూ వచ్చాడు. విల్కిన్‌సన్ దొరగారికి హిందువుల సూర్యసిద్ధాంతం గురించి తెలుసు. శాస్త్రాలు చదివిన రామకృష్ణ సిద్ధాంతి అనే పండితుణ్ణి పిలిపించారు. ఉదయపురం, జయపురం మొదలైన నగరాలకు ఆ పండితులతో వెళ్ళారు. అక్కడ సవై జయసింగు పూర్వసిద్ధాంతులు జత చేసిన నాళికా యంత్రాదులు చేయించి ఉంచారు. ఆ సంబంధపు సిద్ధాంతి ఒకరు యిత్తడి భూగోళం తురీయ యంత్రాదులు చేసి యిచ్చాడు. అది చూసుట వల్ల సాహేబుకు తోచెగదా వీరియందును జ్యోతిష్య విద్య వున్నది గాని సర్వత్ర ప్రసరించలేదు. యీ శాస్త్రములు సంపాదించి తెలిసినంతలో వీరు నమ్మేరు.''

విల్కిన్‌సన్ దొరగారు ఉద్యోగ పురస్సరంగా ద్రవ్య వ్యయం చేసి బ్రహ్మసిద్ధాంత, రోమక సిద్ధాంత, ఆర్యభట సిద్ధాంత, లీలావతీ బీజగణిత, సిద్ధాంత శిరోమణి-గ్రహలాఘువ వ్యాఖ్య, మళ్లా యీ గ్రంథాలు తెప్పించారు. రామచంద్రయ్య వాటిని చదివాడు. ''అవి చూచేవరకు యీ సిద్ధాంతముల మతం సాహెబు లోకుల మతం వొక్క ప్రకారం గణితంచాత ప్రత్యక్షమైనట్టు తోచును గనుక ఇది సత్యమని నమ్మితిని. అప్పుడు సాహెబు లోకుల విద్యా బుద్ధియూ; యీ సాహెబు విద్యావొహి ప్రకారం'' అని దొరగారి సౌజన్య ధ్యానానకు వచ్చాక ''యథాకించిత్ జ్ఞోహం'' అని భర్తృహరి సుభాషితాన్ని గుర్తుచేసుకొన్నాడు.

దొరగారు అనునయించి హూణ సిద్ధాంతాలు చెప్పారు. రామచంద్రయ్య 'ముఖ్యాధ్యయనం' చేశాడు. ''సిద్ధాంత పురాణ, హూణ మతములలో యక్కడ యేది సత్యమో యేది మిథ్యో తెలుసుకొని' యెవరి ముఖబిడియం వుంచక వాస్తవార్థ నిర్ణయం వ్రాస్తే అందరికిన్ని తెలిసి బహూపయోగం అయ్యేని - చదివిన చదువుకు సార్థకం యిదె'' అని 'సిద్ధాంత శిరోమణి ప్రకాశిక' అనే గ్రంథాన్ని మొదట మహారాష్ట్ర భాషలో రాసి దొరగారికి నజరు ఇచ్చాడు.

ఆ గ్రంథాన్ని బొంబాయిలో దొరగారు అచ్చు వేయించారు. కాశి, అవంతి, సాగర నాగపురం పూనా, కలకత్తా, బొంబాయి వార్డు సాహెబుల వద్దకి, సంస్థానీకుల వద్దకి, పండితుల వద్దకి ప్రతులు పంపించారు. అక్కడి పండితులు అవలోకనం చేసి సంతోషించి కృషి చేత గ్రహించారు. ఆ తర్వాత ఆంధ్ర భాషను వ్రాయమని ఆజ్ఞ చేశారు. కనుక ఈ గ్రంథాన్ని రచించాడు.

''యీ దేశమందున నడత యీలాగున వున్నది గదా - ప్రాచీన వచనము ప్రత్యక్ష విరుద్ధముగా వున్నాగాని అది సత్యమని నమ్ముతారు... సాహెబు జనులు ఇటీవలనే బుద్ధిమంతులై విమర్శ చేసిరి. అవి యిప్పటికీ నడుచుచునే యున్నవి... సాహెబు జనాలు లెస్సగా విచారించి యేది సత్యమో అదే చెప్పుదురుగాని యసత్యమును బుద్ధిచేత కల్పించి చెప్పరు. తెలియని విషయము అజ్ఞాతమనే వ్రాయుచున్నారు'' అని రామచంద్రయ్య గ్రహించాడు. ''కావ్యనాటకాది చమత్కార వర్ణనము యథార్థమని నమ్మరాదు'' అని తేల్చుకొన్నాడు.

''పురాణములలో శ్రీ మద్భాగవతము ముఖ్య గ్రంథము గదా. దానియందు భగవద్భక్తి, వైరాగ్య జ్ఞానాది ధర్మములు యేమి చెప్పిరో అవి మిక్కిలి యుక్తముగా యున్నవి. ఆ ప్రసంగమునందు భగవద్విలాస వర్ణన చేసేకొరకు భూస్థితిని, ఆకాశ స్థితిని చెప్పిరి. అది మిక్కిలి ఆశ్చర్యకరముగా నున్నది. భగవంతుడు చేయవలెనంటె ఆ ప్రకారముగా కానేరదని లేదుగాని సాంప్రతము ప్రత్యక్షముగా చూయడ నాప్రకారముగా నగుపడలేదు'' అంటూ సవినయముగా సత్యాన్ని చాటసాగాడు. భూగోళ గోళ విషయాలకు మహాభారత భాగవత పురాణాదుల రాశారు. ''అంతా వ్యాసకృతం, బహుధా వక్కతీరె వున్నది. దీనికి కించిత్తు విరుద్ధం భాస్కరాచార్యులు చేసిన సిద్ధాంత శిరోమణి యందు వున్నది. యీ రెంటిలో పురాణం కేవలం గణిత నిమిత్తం కాదు. సిద్ధాంత కేవల గణిత నిమిత్తమై వున్నది. గనుక జ్యోతిష్య విషయమందు సిద్ధాంతం ప్రబలం.

యీ రెంటిమీద యిటీవల సాహిబు జనులు బహుశ్రమ చేసి ప్రయత్న పూర్వకముగా వివేచన చేసి గణితం చేసినారు. భూగోళ, ఖగోళ చిత్రమున్ను వ్రాసినారు. యిది ఆధునికం ప్రత్యక్షం చూచినది.''

రామచంద్రయ్య ఆధునిక విజ్ఞానాన్ని మొగమాటం లేకుండా స్పష్టం చేశాడు. ఇతని 'సిద్ధాంత శిరోమణి' 1837లో మద్రాసులోని చర్చిమిషన్ ప్రెస్‌లో అచ్చువేశారు.

రామచంద్రయ్య అల్లాడి సుబ్బాజిగారి కుమారుడు. అందుచేత సుబ్బాజి బాపు అనే పేరు కూడా ఈయనకు ఉంది. ఆ పేరుతోనే పుస్తకం అచ్చుపడింది.

తులనాత్మక పరిశీలనతో రెండు సంస్కృతులను అధ్యయనం చేస్తే భావనా సరళిలో మార్పు వస్తే మార్పు వస్తుందనడానికి అల్లాడి రామచంద్రయ్య నిదర్శనం.

భావాలలో మార్పులు వచ్చాక కట్టుబొట్టు కూడా మారడానికి అట్టేకాలం పట్టదు. దానికి కాలమూరు వీరవల్లి రంగనాథం తార్కాణం.

కాలమూరు వీరవల్లి రంగనాథం (1819-1881)

విద్యను సముపార్జించుకొనడం ప్రారంభిస్తే దానికి అంతం అన్నది వుండదు. జీవితమంతా జ్ఞానాభివృద్ధికే అంకితం చేసిన వ్యక్తులు చాలా అరుదుగా కనబడతారు. కుంఫిణీ యుగంలో ఒక తెలుగువాడు తాను పధ్నాలుగు భాషలు నేర్చుకొనడమే కాక చదువుకొనదలచినవారికి విద్యాభివృద్ధి సౌకర్యాలు కలిగించాడు. ఆయన కాలమూరు వీరవల్లి రంగనాథం. ఆయన జీవితం ఒక ఉత్తమ గ్రంథం లాంటిది.

చిత్తూరు వద్దనున్న ఒక కుగ్రామంలో జననం. క్రీ.శ. 1819. తండ్రి పేదవాడేగాని ఉద్దండ సంస్కృత పండితుడు. రంగనాథానికి మామూలుగా, సాంప్రదాయిక విద్య నేర్పించారు. ఎనిమిదో ఏటనే సంస్కృతంలో నిర్దుష్టంగా రంగనాథం మాట్లాడగలిగేవాడు. పదోయేట ఎంత పెద్ద గోడలైనా, చెట్లైనా సునాయాసంగా ఎక్కేసేవాడు.

పన్నెండోయేట రంగనాథంగారి తండ్రి కొన్ని భూములు ఇజారాకు తీసుకొన్నాడు, పంటలు చెడిపోయాయి. పన్ను కట్టలేకపోయాడు. కుంఫిణీ సర్కారువారు ఆయన్ని సివిల్ జైలులో పెట్టారు. చెరలో ఉండగా ఆయన ఒక తద్దినం పెట్టాల్సి వచ్చింది. ఏం చేయాలో తోచక తల్లి ఏడుస్తూ ఉంది. రంగనాథం చిత్తూరుకు వెళ్ళి తండ్రిని విడిపించుకొని వస్తానన్నాడు. జిల్లా జడ్జి మెస్తర్ కాష్ మేజరు దొరగారి ఇంటికి వెళ్ళి దర్శనం చేసుకొన్నాడు. ఎవరేనా జామీను ఉంటేగాని విడుదల చేయనన్నాడు. రంగనాథం తన తండ్రికి మారుగా తానే జైలులో ఉంటానన్నాడు. పన్నెండేళ్ళ కుర్రాడు ఇలాగ సిద్ధపడేసరికి జడ్జి ఆశ్చర్యపోయాడు. విడుదలకు ఉత్తర్వు వ్రాసి కుర్రాడికి ఇచ్చాడు. తండ్రితోపాటు ఇంటికి వెళ్ళమన్నాడు. మర్నాడు వచ్చి తనను చూడమన్నాడు. స్వయంగా ఆర్డరు కాగితాలను పట్టుకొని జైలుకు వెళ్ళి తండ్రిని విడిపించుకొని రంగనాథం సగర్వంగా ఇంటికి వెళ్లాడు. పితృకార్యం నిర్విఘ్నంగా జరిగింది.

తరువాత కుర్రవాడు దొరవారిని దర్శించుకొన్నాడు. ఆయన ఆ పిల్లాడి కుటుంబ పరిస్థితులన్నీ వాకబు చేశాడు. ఇంగ్లీషు చదువుకొంటావా అని అడిగాడు. ఖర్చులన్నీ నేను పెట్టుకొంటానన్నాడు, మా పెద్దవాళ్ళనడగాలి అన్నాడు కుర్రాడు. దొరగారు పెద్దవాళ్ళతో మాట్లాడారు. మర్నాడు తామే స్వయంగా కుర్రాడికి ఏబీసీడీలు నేర్పారు. ఆర్నెల్లలో ఇంగ్లీషు చదవడం రంగనాథం నేర్చుకొన్నాడు. తరువాత చిత్తూరులోనే మెస్తరు గ్రోవ్సు అనే మిషనరీ వద్ద రంగనాథం ఇంగ్లీషు చదువుకొన్నాడు. ఆ మిషనరీగారి భార్య కూడా రంగనాథాన్ని బాగా ఆదరించింది. రోజూ అయిదు మైళ్ళు నడిచి వెళ్ళి కుర్రాడు చదువుకొనేవాడు. పరగడుపున కుర్రాడు ఇంత బాధపడుతున్నాడని తెలిసి మిషనరీ దొరసాని రోజూ అర్ధశేరు పాలు పోయమని పాలవాడికి చెప్పింది. రంగనాథం గణితశాస్త్రం అభ్యసించాడు. రెండేళ్ళలో Conic Sections పూర్తిచేసి ఖగోళ శాస్త్రం మొదలుపెట్టాడు. చిత్తూరులో ఉన్నత విద్యకు అవకాశాలు లేకపోయాయి. మెస్తర్ కాష్ మేజరుగారు అబ్బాయిని చెన్నపట్నం పంపదలిచారు. తల్లిదండ్రులను ఒప్పించారు. బిషప్పు కొర్రీగారి గ్రామరు బడిలో చేరడానికి 1836లో రంగనాథం వెళ్ళాడు. మెస్తర్ కేర్‌గారికి సిపార్సు ఉత్తరం పట్టుకొని వెళ్ళాడు; ఆయన ఆ బడికి కులపతి.

మెస్తర్ కేర్ ఆ కుర్రాడి ప్రావీణ్యాన్ని మెచ్చుకొన్నాడు. ఇద్దరూ కలసి ఇంగ్లీషు పుస్తకాలు చదివేవారు. Smith's Wealth of Nations: Lockis Essays on the understanding and palcy's Natural theology. కుర్రాడు యూరోపు దేశాలలోని ఏ ఒక్క విద్యార్థికీ మేధాసంపత్తిలో తీసిపోడు. పైగా నిజాయతీ విశ్వాసాలు ఉన్నవాడు.

"Edomestic life of the Nations of India by Kerr ఈ గ్రంథాన్ని కూడా అధ్యయనం చేశారు.

రంగనాథానికి మద్రాసులో కావలసిన పుస్తకాలు సరఫరా చేయమని మేస్తర్ కాష్ మేజర్ చెప్పాడు. ఎన్సైక్లోపీడియాలు, డిక్షనేరీలు కొని ఇమ్మన్నాడు. అయితే అవి సొంతానికి ఇచ్చినవని ముందే చెప్పవద్దన్నాడు. విద్యాభ్యాసం పూర్తికాగానే వాటిని ఇచ్చివేయమన్నాడు.

1839లో మేస్తర్ కేర్‌కు కలకత్తాకు బదిలీ అయింది. రంగనాథాన్ని మేస్తర్ ఏవర్ దొరగారి హైస్కూల్లో చేర్పించారు. రంగనాథం క్రింది తరగతులకు లెక్కలు చెప్తూ పై చదువులు చదువుకొన్నాడు (రాజా టి. మాధవరావు రంగనాథ శాస్త్రి శిష్యుడే).

1842లో ప్రొఫిషెంటు పట్టా పరీక్షలో శ్లాఘనీయంగా ఉత్తీర్ణుడయ్యాడు. ఆ యేడు అతడొక్కడే పరీక్షకు వచ్చినాడు (ప్రెసిడెన్సీ కాలేజి కాలండర్‌లో రంగనాథశాస్త్రి పేరు మొట్టమొదటి ప్రొఫిషెంటుగా కనబడుతుంది). పెట్టబోయే యూనివర్సిటీ ప్రొఫెసరుగా పనిచెయ్యాలని రంగనాథశాస్త్రి ఆశయం, బొంబాయిలోని గంగాధర శాస్త్రిగారిలాగా ప్రొఫెసరు కావాలని ఆశ. అయితే ఇంజనీరింగు కళాశాలను సర్కారువారు పెట్టలేదు. మేస్తరు కేర్‌కు వ్రాసిన ఉత్తరాలు "During the first two years of my countinuance at the High School, I had made up my mind to prosecute my studies in Mathematics and procure the situation of teacher in the projected Engineering College and had even the Versity to fancy that I might become a professor in the same way as Gangadhara Sastri of Bombay'

యూనివర్సిటీ కమిటీకి ప్రెసిడెంటుగా జార్జి నార్టన్: మేస్తరు పవల్, మెస్తర్ కాష్ మేజరు ఆ ఉద్యోగానికి సిఫార్సు చేశారు. కాని ప్రభుత్వంవారు ఇంజనీరింగు కాలేజి స్థాపించదలుచుకోలేదు. హైస్కూలు పట్ల ప్రభుత్వానికి సద్భావం లేకపోగా విరోధం. అందుచే రంగనాథ శాస్త్రికి ఉద్యోగం దొరుకుతుందనే ఆశలు నీరయిపోయాయి.

తండ్రి మంచం పట్టాడు. రంగనాథం చిత్తూరు వెళ్ళాడు. చిత్తూరులోనే ఉద్యోగం. సబార్డినేటు జడ్జిగారి కచ్చేరిలో హెడ్డుక్లార్కు పని. రు. 70ల జీతం. బోలెడంత విశ్రాంతి విజ్ఞానాభివృద్ధికి అవకాశం, తెలుగు, హిందూస్థానీ, పారశీకం, కన్నడం నేర్చుకొన్నాడు. కోర్టు రికార్డులన్నీ రంగనాథం ఒక్కచేతిమీదుగా ట్రాన్స్‌లేట్ చేశాడు.

తండ్రి పోయాడు. సుప్రీంకోర్టులో ఇంటర్‌ప్రీటర్ ఉద్యోగం ఖాళీ అయింది. దరఖాస్తులు పెట్టుకొన్నవాళ్ళను పరీక్షించారు. రంగనాథం అర్జీ పెట్టుకొన్నాడు. తమిళం, తెలుగు, మరాఠీ, కన్నడం, హిందూస్థానీ, పారశీకం, ఇంగ్లీషు భాషలలో ఉత్తీర్ణుడయ్యాడు. దక్షిణ భారత భాషలు అన్నీ అయిపోయాక యూరోపు దేశ భాషలు అభ్యసించాడు.

ఫ్రెంచి, లాటిన్ సాహిత్యాలు చదివాడు. ఒకసారి కోర్టులో ఒక ఫ్రెంచి దుబాషీ కావలసి వచ్చింది. రంగనాథశాస్త్రి ముందుకొచ్చాడు. జడ్జీ Mr. Gambier ఆశ్చర్యపోయాడు. ఒక తప్పు లేకుండా అనువదించాడు.

జడ్జీల నేస్తమయ్యాడు. ఇళ్ళకు వెళ్ళి చాలా విషయాలు చర్చించేవాడు. ఆ రోజుల్లో చీఫ్ ఇంటర్‌ప్రీటరు ఉద్యోగం చాలా ఘరానా హోదా గలది. కమీషన్ లెక్కచొప్పున డబ్బులు ముట్టచెప్పేవారు. రంగనాథం ఆ రోజుల్లో నెలకు 2,000 నుంచి 2,500 దాకా ఆర్జించేవారు. సంస్కృతంలో నిష్ణాతుడు. ధర్మశాస్త్రాలలోని సూక్ష్మాంశాలను స్పష్టంగా వ్యాఖ్యానించేవాడు.

1859లో సర్ ఛార్లెస్ ట్రివిలియని మదరాసు గవర్నరుగా వచ్చాడు. రంగనాథ శాస్త్రిని పరిచయం చేశారు. గవర్నరుగారు చాలాసార్లు ఆయన్ను ప్రభుత్వ భవనానికి పిలిపించుకొని చాలా విషయాలు చర్చించేవారు.

1859 ఏప్రిల్‌లో స్మాలుక్లాజు కోర్టులో ఒక జడ్జి పదవి ఖాళీ అయింది. చాలామంది ప్రతికూలించినా గవర్నరు ఆ పదవిని రంగనాథ శాస్త్రికి ఇచ్చాడు. 1862 దాకా ఆ పనిలో ఆక్టింగుగా ఉన్నారు. 1863 ఫిబ్రవరిలో స్థిరపరిచారు. జడ్జి అయ్యాక అరబ్బీ భాష అధ్యయనం చేశాడు. హాఫీజు, సాదీల పద్యాలు కంఠతా పెట్టేవాడు.

1867లో పచ్చయప్ప ఛారిటీల ధర్మకర్త. 1877లో ఢిల్లీ దర్బారుకు ఆహ్వానం. వైస్రాయి ఒక పతకాన్ని, సర్టిఫికెట్టును ఇచ్చాడు. 1880లో పింఛనుమీద రిటైరు అయ్యాడు. మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలులో అనధికార సభ్యుడు. 1880 జూలైలో సాలార్‌జంగ్ తన ప్రయివేటు కార్యదర్శి ఉద్యోగాన్ని ఇచ్చాడు. నెలకు రు. 2,500 జీతం. కాని నిరాకరించాడు. జీవనసంధ్యా సమయంలో తన పుస్తకాల మధ్య, మనుమల మధ్యా తన కాలాన్ని వెళ్ళబుచ్చడం తన అభిమతం కనుక ఈ గౌరవాన్ని స్వీకరించలేదు (5-7-1881లో మరణం).

ప్రతిరోజూ ఉదయం 4-5 మధ్య కసరత్తు, 5 నుంచి 7 దాకా గుర్రపు స్వారీ. సాయంత్రాలు చాలాదూరం షికార్లు. రోజుకు ఆరు గంటలు చేదువు. ప్రాణాలు విడుస్తున్నప్పుడు చేతిలో పుస్తకం పట్టుకొని కన్నుమూసిన భారతీయుడు ఈయనే అని చెప్పాలి.

ఈయన గ్రంథాలయంలో వేలాది పుస్తకాలు ఉండేవి. కొన్న ప్రతి గ్రంథం చదివిన దాఖలాలు ఉన్నాయి. ఒక పుస్తకానికి ఇంకో పుస్తకంతో పోలికలు ఉంటే ఆ సంగతి మార్జిన్‌లో రాసుకొనేవారు. రమారమి ఆయన పుస్తకాలన్నింటిలో ఈ విధమైన నోట్సు ఉండేది. ప్రాచీన రచయితల గ్రంథాలు చదివేవారు. సిసీరో, వర్జిల్, ప్లాటో, అరిస్టాటిల్ వారి అభిమాన రచయితలు.

సిసీరో ఉపన్యాసాలను అప్పచెప్పేవాడు ఒకసారి చదివితే అర్థం చేసుకోవాలి. రెండుసార్లు చదివితే అప్పచెప్పాలి. మూడుసార్లు చదివితే శాశ్వతంగా జ్ఞాపకం

పెట్టుకోవాలి. బాగా చదువుకొన్న మౌల్వీలకు ఏమాత్రం తీసిపోనట్టు అరబ్బీ, పర్షియన్ భాషలు మాట్లాడగలిగేవాడు. ఇంగ్లీషు కవిత్వమంటేను అంత ఇష్టం లేదు. ప్రాచ్య దేశాలలోనే మహా కవులున్నారని అతడి విశ్వాసం.

చనిపోయే నాటికి ఆయన పధ్నాలుగు భాషలలో ప్రవీణుడు 1.తమిళం, 2. తెలుగు, 3. మలయాళం, 4. కన్నడం, 5. మరాఠీ, 6. హిందూస్థానీ, 7. పార్సీ, 8. అరబ్బీ, 9. సంస్కృతం, 10. లాటిన్, 11. గ్రీకు, 12. ఫ్రెంచి, 13. జర్మన్, చనిపోయేముందు హీబ్రూ అధ్యయనం.

సంస్కృతంలో ఉన్న గ్రంథాలన్నీ తెప్పించాడు. బోలెడంత డబ్బుపెట్టి తాళపత్రాలు కొన్నాడు. ఇతరులకు చెప్పడం కూడా సరదా. 'నేర్పు లేక నేర్చుకో' అన్నది ఆశయం. వివిధ భాషల పండితులతో తరుచుగా గోష్ఠులు. ఫ్రెంచి నేర్చుకోడానికి పాండిచ్చేరి నుంచి ఒక ఫ్రెంచి పండితుణ్ణి పిలిపించి, బంగళాలో పెట్టుకొని నెలకు నూరు రూపాయలు ఇచ్చేవాడు. సంస్కృత పండితులలో కొందరికి అయిదేసి వందల రూపాయల దాకా బహుమతులు ఇచ్చేవాడు.

ఇంట్లో ఎప్పుడూ అరడజను మంది విద్యార్థులుంటూ చదువుకొనేవాళ్ళు. వాళ్ళకు సొంత ఖర్చులపై తిండి, బట్టలు ఏర్పాటు చేశాడు. సంఘ సంస్కర్త. అర్థంలేని మూఢ సంప్రదాయాలకు కట్టుబడడం వల్ల హిందూ సంఘం అధోగతిలో ఉందని నమ్మకం.

మద్రాసులో మొదటిసారిగా బూట్లు, పాంట్లు ధరించిన వాళ్ళలో రంగనాథంగారే ప్రథముడు. అది చిన్న విషయం కాదు. దేశీయులు వెక్కిరించారు. అయితే వజ్రసంకల్పుడు కనుక రంగనాథశాస్త్రి లక్ష్యపెట్టలేదు; మానలేదు.

స్త్రీ విద్యలో నమ్మకం ఉన్నవాడు. తన ఏక పుత్రికకు సంస్కృతం, తెలుగు, తమిళం నేర్పించాడు.

ఇతడు ఆధునిక పాశ్చాత్య భావాలు ఉన్నా హిందూ ధర్మానుసారుడే. బైబిల్, ఖురాన్, వేదాలు తెలుసు. క్రైస్తవంలో చేరిన ఒక కుర్రాడికి మళ్ళీ హిందూ మతం ఇప్పించాడు. కులతత్త్వాలు పనికిరావు. కర్మ సిద్ధాంతంలో నమ్మకం గలవాడు. మితభాషి. చాలా తక్కువ మందితో కలిసిమెలిసి ఉండేవాడు.

తెల్లవాళ్ళ సహవాసంతో చెన్నపట్నంలో పెరిగిన రంగనాథానికి స్వాతంత్ర్యాభిలాష ఎక్కువ. వినయ సంపన్నుడేగాని 1881 జూలై అయిదో తేదీనాడు మరణించేదాకా ఎవరికీ ఎన్నడూ తలవంచి ఎరగడు.

అతడు మదరాసు హైస్కూలులో మొదటి ప్రొఫెషెంటు.

మదరాసు యూనివర్సిటీ మొదటి ఫెలో.

మదరాసు స్మాలుకాజు కోర్టులో మొదటి నేటివ్ జడ్జి.

మదరాసులో పధ్నాలు భాషలు వచ్చిన మొదటివాడు.

గాజుల లక్ష్మీనరసు చెట్టి (1806-1868)

విద్య తన ఒక్కనిలోనే భావ చైతన్యం తీసుకొని వస్తే చాలదు. ఆ నూతన తేజస్సును ప్రజలందరిలో కలిగించి వారి బతుకులు బాగు చేయాలి. సమాజంలో ఆర్థికాభివృద్ధికి రాజకీయ సంస్కారం కావాలి. పరిపాలనలో సైతం ఉద్యమాలు సాధించలేనిది ఉండదు. దీనికి గాజుల లక్ష్మీనరసుగారి జీవితం ఆదర్శప్రాయం. ఆయన చెన్నపట్నంలోని సంపన్న వర్తక కుటుంబంలో పందొమ్మిదో శతాబ్దం తొలి దశకంలోనే పుట్టారు. మంచి వాతావరణంలో పెరిగారు. మదరాసులోని పెరియమెట్టులో జన్మించిన ఈయన ఆ నగరంలోని నేటివు ఎస్సోసియేషన్ సొసైటీవారి బళ్ళో వ్రాయడం, చదవడం - లెక్కలు నేర్చుకొన్నారు. చిన్నప్పటి నుంచి నిర్భయంగా, స్వతంత్రంగా మెలిగేవారు. బాల్యం నుండి డిబేటింగు సొసైటీలలో చేరి అక్కడ చర్చించే రాజకీయ విషయాలను అవగాహన చేసుకొన్నారు.

చదువు పూర్తయ్యాక తండ్రిగారి దగ్గర వర్తకం నేర్చుకొన్నాడు. ఆయన వ్యాపార రహస్యాలన్నీ చెప్పాడు. 'సిద్ధులు చెట్టి అండు కో'లో లక్ష్మీనరసు ముఖ్య భాగస్వామి. ఆ కంపెనీ ఆనాడు చీటీ గుడ్డల వ్యాపారం చేసింది. సిద్ధుల చెట్టి చనిపోయాక లక్ష్మీనరసే అన్నీ చూసుకోవలసి వచ్చింది. ఆ రోజుల్లోనే అమెరికాలో అంతర్యుద్ధాలు జరుగుతున్నాయి. అందుచేత భారతదేశంలో పత్తి వ్యాపారానికి గిరాకీ హెచ్చింది. లక్ష్మీనరసు ఈ అవకాశాన్ని బాగా వినియోగించుకొని లక్షలు ఆర్జించాడు.

పుష్కలంగా ధనమార్జించాక లక్ష్మీనరసుకు వ్యాపారాలంటే మొహం మొత్తింది. నేటివులకు రాజకీయ స్వామ్యాలు ఇతోధికంగా కలిగించడానికి ఆయన మనస్ఫూర్తిగా ప్రయత్నించసాగాడు. ఇంగ్లీషు విద్య లేకపోవడంవల్ల ఆనాటి నేటివులకు తాము ఎటువంటి ప్రభుత్వానికి కట్టుబడినదీ తెలియదు. అజ్ఞానంతో బాధలు పడుతున్న హిందువుల కళ్ళకు చెన్నపట్నంలో ఉన్న ఉద్యోగులే సర్వాధికారులుగా కనిపించారు. వీళ్ళపైన అంకుశంలాగ పనిచేసే ఒక బోర్డు ఇంగ్లండులో ఉందనీ, వాళ్ళకు మహజర్లు పెట్టుకొని కష్టాలు నివారించుకోవచ్చనీ హిందువులకు తెలియదు.

లక్ష్మీనరసుగారు మాత్రం రాజకీయ పరిజ్ఞానం సంపాదించారు. అందుకే ప్రజల ఈతి బాధలు, ఇబ్బందులూ, చట్టరీత్యా ప్రభువులకు తెలియచేయడానికి మదరాసు నేటివు సంఘాన్ని స్థాపించాడు. ధనవంతులైన వర్తకులు, ఉద్యోగస్థులు కాని పెద్ద మనుషులు అందులో సభ్యులై చాలా ప్రయోజనకరమైన సేవ చేశారు. తరచుగా సమావేశాలు జరిగేవి. ప్రజల కష్టాల గురించి చర్చించేవారు. ఇంగ్లండుకు మహజర్లు పంపించేవారు.

లక్ష్మీనరసుగారి మొదటి రాజకీయ సమరం మిషనరీల గురించి. ప్రభుత్వం వారి ప్రకటనలో తాము హిందువుల మతం జోలికి రామని ఉంది. అయితే తెల్ల ఉద్యోగులు మాత్రం మిషనరీలకు మద్దతు ఇచ్చేవారు. నౌఖరీలు కావలసిన నల్లవాళ్లందరూ ఇంగ్లీషు చదువుకోవాలి. పరీక్షల్లో కిరస్తానం గురించి ప్రశ్నించేవారు. ఆ మత గ్రంథాలు చదవక తప్పదు. కోర్టులో తెల్ల జడ్జీలు కొందరు మతప్రచారం చేసేవారు. ఈ అక్రమాలను ప్రతిఘటించాలని లక్ష్మీనరసుగారు నిశ్చయించారు. దానికి ప్రచార సాధనాలు కావాలి.

అప్పటికి చెన్నపట్నంలో 'నేటివు సర్క్యులేటరు' అనే ఇంగ్లీషు పత్రిక ఉండేది. దానికి నారాయణస్వామి నాయుడు అనే ఆయన సంపాదకుడు. ఆ పత్రికను, దాని ప్రెస్సునూ లక్ష్మీనరసుగారు కొనేశారు. 'క్రిసెంటు' అనే పేరుతో ఆ పత్రికను నడిపేవారు. హార్లే అనే తెల్లదొరనే తీసుకొచ్చి ఎడిటరుగా నియమించారు. 1844వ సంవత్సరం అక్టోబరు 2వ తేదీన మొదటి సంచిక వెలువడింది. 'రికార్డరు' అనే పత్రికను మిషనరీలు నడిపేవారు. దానిలో పడే వ్యాసాలకు, చేసే ఆరోపణలకు జవాబులు క్రిసెంటులో ప్రచురించేవారు. అధికారుల అక్రమాలను చాలా ఘాటుగా ఖండించేవారు. అందుచేత క్రిసెంటు అంటే ప్రభుత్వానికి ఒళ్ళుమండింది. ఇతర పత్రికలకు చేసిపెట్టే ఉపకారాలను ఈ పత్రికకు చేయలేదు.

మతం మార్చుకొన్నా, వారసత్వపు హక్కులు పోకుండా ఉండే సదుపాయాలను ఏర్పరిచే చట్టాన్ని ప్రభుత్వం తలపెట్టింది. దీనిని నిరోధించడానికి లక్ష్మీనరసుగారు 9-4-1845 నాడు నేటివుల సమావేశాన్ని ఏర్పరిచారు. చాలామంది పాల్గొన్నారు. సుప్రీము ప్రభుత్వము వారికి మహజరును పెట్టుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మహజరువల్ల ఆ చట్టాన్ని నిలిపివేశారు.

తరువాత యూనివర్సిటీ పరీక్షలో క్రైస్తవ మత విషయాలపై ప్రశ్నల గురించి ఆందోళన 7-10-1846లో పచ్చయప్ప విద్యా సంస్థలో సమావేశం. 'ఆనరబుల్ కోర్టు ఆఫ్ డైరెక్టర్ల'కు స్థానిక ప్రభుత్వం ద్వారా మహజరు పంపించారు. దీనిపై లోకలు అధికారులు వ్రాసిన రిమార్కులు చూసి డైరెక్టర్ల కోర్టువారు మహజరును ఉపేక్షించారు.

1852లో బ్రిటిష్ పార్లమెంటు సభ్యుడు డాన్ బీసీమొన్ మన దేశానికి వచ్చాడు. ఆయన్ను కలుసుకొని లక్ష్మీనరసుగారు దేశ పరిస్థితులు వివరించారు. ఆయన్ను వెంటబెట్టుకొని ప్రత్యక్షంగా ప్రజలు పడుతున్న కష్టాలను చూపించారు. ఆ పార్లమెంటు సభ్యుడు నివ్వెరపోయాడు. తాలూకా కచ్చేరీల పరిసరాలలో పన్నులు కట్టని వాళ్ళను చెట్లకు తలకిందుగా వేలాడదీయడం చూశాడు. చిత్రహింసలకు ఉపయోగించే పరికరాలను సాక్ష్యంగా తీసుకొని వెళ్ళాడు. 1854 జూలైలో కామన్సు సభలో ఆయన ఈ హింసల గురించి చెప్పి ఖండించారు.

1852లో లక్ష్మీనరసుగారు నేటివు సభ చేత ఒక మహజరు పెట్టించారు. కట్టలేని పన్నులు వేధించి అవి రాబట్టడానికి తట్టుకోలేని బాధలు పెట్టడం, కోర్టులలో సౌకర్యాలు లేకపోవడం, ఆలస్యాలు, రోడ్లు, వంతెనలు, నీటి వనరులు లేకపోవడం, విద్యాభివృద్ధి, ప్రభుత్వ సాయంలో పొదుపు, ప్రజల యోగక్షేమాలు చూసే స్థానిక పరిపాలన మొదలైనవి చర్చించారు. పరిపాలనా పద్ధతులలో సంస్కరణలు, ప్రభుత్వంలో మార్పులు కావాలని కోరారు. లార్డుల సభలో ఎల్లెన్‌బరో ఈ పిటిషను ప్రవేశపెట్టారు (25-2-1853). పార్లమెంటు వారు ఒక విచారణ సంఘాన్ని నియమిస్తే చాలా ఫిర్యాదులు దానిముందు ప్రజలు చేస్తారని లక్ష్మీనరసుగారు వ్రాశారు.

1855లో 14 వేల మందిచేత సంతకాలు పెట్టించి మహజరు పంపారు. ఈ ఆందోళనల ఫలితంగా కామన్సు సభవారు చర్య తీసుకోక తప్పలేదు.

1854లో లక్ష్మీనరసుగారు పచ్చయప్ప విద్యా సంస్థలలో ధర్మకర్త అయ్యారు.

సిపాయిల పితూరీ తరువాత వచ్చిన మార్పులలో లక్ష్మీనరసుగారిపై అధికారులకు సద్భావం కలిగింది. వారి నిస్వార్థ త్యాగాన్ని మెచ్చుకొన్నారు. 1861లో C.S.I. బిరుదు. 1863లో మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులు.

1864 నాటికి సెట్టిగారి ఆస్తి హరించుకుపోయింది. వ్యాపారాన్ని కొడుకు చేతిలో పెడితే అతగాడు దివాలా తీయించాడు. డబ్బులేక క్రిసెంటు ఆగిపోయింది. 1868లో సెట్టిగారు మరణించారు.

సంఘసంస్కరణలో అభిమానం గలవాడు. సొంత డబ్బుతో బాలికల పాఠశాల పెట్టారు. స్త్రీ పునర్వివాహం మంచిదని చెప్పేవారు. ఎప్పుడూ విద్యావంతుల సాంగత్యం కోరేవాడు. తెలుగు, తమిళ పండితులకు సహాయాలు చేసేవారు. జీవితమంతా దేశీయుల సాంఘిక, రాజకీయ పరిస్థితులను బాగుపరచడానికే కృషి చేశాడు. నిస్వార్థపరులు తలపెట్టిన నిజమైన సంస్కారాలు నిష్ప్రయోజనమవలేవు. విద్యావంతులు భావ చైతన్యంతో ప్రారంభించిన ఉద్యమాల ప్రభావం వారున్న ఊరికే పరిమితం కాదు. మధ్యతరగతి వారికి అందుబాటులో ఉన్న పత్రికలమూలంగా ఒక చోట జరిగే మంచి కార్యక్రమాల వైనాలు ఇతర ప్రాంతాలకు చేరుతాయి. లక్ష్మీనరసుగారు ఆంగ్ల పత్రికల ద్వారా చట్టబద్ధమైన పోరాటం సాగించితే వారి భావాలు తెలుగు పత్రికలలో కూడా చోటు చేసుకొన్నాయి. ఆనాటి ప్రముఖ పత్రిక వర్తమాన తరంగిణిలో ఇలా రాశారు.

''ప్రకృత మీస్టిండ్యా కంపినివారి దేశస్థుల విషయమై జరిగింపుచున్న యనేక యక్రమములను గురించి హౌసు ఆఫ్ కామన్సు వారికి మన్విచేసికొనడమునకు ముందు యీ చెన్నపట్టణమునందు వాసము చేయుచున్న హిందూలలో నాయకుల పెద్దలు తమతమ కులమువారిని పిలిపించి మిషినేరి పాఠశాలలకు మీ చిన్నవాండ్రను బంపకూడదనియు నాలాగున పంపిన యెడల కులకట్టుబాటుకు వెలిబడుదురనియు తగిన సమాఖ్యల నేర్పరుచుటయేగాక యీ పట్టణములో నుపకంఠ గ్రామములలో దగిన స్థలములయందు సంస్కృతాంధ్ర ద్రవిడ కన్నడ మహారాష్ట్ర హూణవిద్యలతో జేరిన పాఠశాలలను స్థాపించి యచ్చటి హిందూ బాలురను చదివించే లాగునచేసి వాటికి తగులుబడియయ్యే కర్చులనిమిత్తము - సదరు కులపెద్దలు తమ తమ వగయిరావారిలో బ్రతియింటికి - అణీకు తక్కువ లేకుండ వారి వారి శక్త్యనుసారము ప్రతిమాసము చందా యిచ్చేలాగు నిష్కర్ష చేసినట్టయిన యాప్రకారము వసూలుకాబడే ద్రవ్యముపై పాఠశాలల కర్చులను కొరతపడకుండుటయేగాక స్వాతంత్ర్యములను కాపాడుకొనే విషయమును గురించి సర్వాధికారులకు జేసుకోబడెడి మన్వి వగయిరా కర్చుల కుపయోగముగా నుండును -

ఇంగిలీషువారు ప్రథమతః ఈ దేశమునకు వచ్చినప్పుడు హిందూ ప్రభువులచే సన్మానింపబడితిరి. తమకు చేష్టలను గనుపరచగానే యౌమానమును జెందిరి. హిందూ ప్రభుత్వంయొక్క బలపరాక్రమములను దెలిసికొని కరటకదమనక తంత్రములచేత తిరిగి వారి సన్మానమును బొందిరి. నిష్కపటులయిన యాకాలపు ప్రభువులు దీర్ఘ క్రోధవర్జితులుగా నుండుటచే నీ యింగిలీషువారి యభివృద్ధికి హేతుభూతలములయిన

కార్యములను జేయుటకు బూర్ణాభిప్రాయముగలవారై యుండిరి. మీరు చేయు ప్రసంగములు ప్రజలు నిజముగా నమ్మియుండుటచేత పై వారి ప్రవేశమీ దేశమునందు స్థిరపడెను. అది మొదలుకొని ఈ దేశ ప్రభుత్వము తమ వశము చేసికొనవలయునని తలచి యందుకు తగిన యనేక తంత్రములు చేసి వారి యభీష్టము నెరవేర్చుకొనుటయే గాక యాలాగున లభించిన ప్రభుత్వము స్థిరపరచికొనుటకు దమమత మీ దేశమునందు విశేషముగా వ్యాపింపజేయవలసినది ముఖ్యమని తలచియున్నారు. కాబట్టి యీ విషయమును హిందువులు ముఖ్యముగా నాలోచించి మిషినేరీ పాఠశాలలకు తమ చిన్నవాండ్రను బంపకుండుటయేగాక స్వదేశ భాషలతో చేరిన పాఠశాలల నేర్పరచుటకు తగిన కృషి చేయడమందు మిక్కిలి త్వరితపడవలయునని కోరెదము.''

విద్యవల్ల ఉద్యమాలు విజయవంతమవుతాయని కుంఫిణీ యుగంలో 'బుద్ధిమంతులు' గ్రహించారు. అందుకు అవసరమైన కార్యాచరణకు పూనుకున్నారు. భావచైతన్యం బహుముఖాల ప్రకాశించసాగింది. ఆ వెలుగులలో తెలుగువారి కిరణావళి తక్కువది కాదు.

విద్యావిధానం - ఉద్యోగాలు

కూటికోసమే కోటి విద్యలన్న సూక్తిలో నిరంతర సత్యం ఉంది. బతుకు తెరువుకు పనికి వచ్చే విద్యే విద్య. పాటుపడకుండా జీవితం గడిచిపోయే వర్గాల విద్యలు ఏవిధంగా ఉన్నా రెక్కాడితేగాని డొక్కాడని వాళ్ళ చదువులు ఉదర పోషణార్థమే. కుల విద్య కూడు పెడుతుంది - అందుకే

వెలివిద్య లెన్ని యైనను
కుల విద్యకు సాటిరావు కుంభిని లోనన్
వెలకాంత లెందరున్నను
కులకాంతకు సాటిరారు గువ్వల చెన్నా!

ఈ పద్యం కుల ధర్మాలు సక్రమంగా అనుసరిస్తున్న సంఘంలోనే తప్ప పరపాలన, పరసంస్కృతి పెత్తనం చేస్తున్నప్పుడు కొంతమంది జీవితాలకు వర్తించదు. కుంఫిణీ వారి వ్యాపారం విస్తరించాకా, అధికారం అల్లుకుపోతున్నప్పుడు కొన్ని వర్గాల వారు వెలివిద్యలు నేర్చుకొని ఉద్యోగాలు చేయవలసి వచ్చింది. పరభాషలు అభ్యసించి పరుల కొలువులో చేరవలసి వచ్చింది.

మద్రాసు పట్టణంలో ఇంగ్లీషు వాళ్ళు క్రీ.శ. 1640లో కోట కట్టుకొన్నాక విద్యకోసం ప్రత్యేకంగా ఏ ఏర్పాట్లూ చేయలేదు. ఫాదరు ఎఫ్రయమ్ అనే ఫ్రెంచి మిషనరీ ఒకాయన ఆ రోజుల్లో అక్కడ ఉండేవాడు. అతడు పోర్చుగీసు వాళ్ల కుర్రవాళ్ళకు, మైలాపురం నుంచి వచ్చే వర్ణసంకరపు బుడతకీచు నల్ల కుర్రవాళ్ళకు చదువు చెప్పేవాడు.

కొన్నాళ్ళకు స్థలం చాలక ఇప్పుడు ఆర్మీనియన్ వీధిలోని రోమన్ కేథలిక్కు చర్చి ఉన్న ప్రదేశంలోని ఒక భవనంలో బడిపెట్టారు.[1]

ముప్ఫయి సంవత్సరాల దాకా కుంఫిణీ వారు చదువుల విషయంలో ఏమీ పట్టించుకోలేదు. మేస్తర్ పేట్రిక్ వార్నరు అనే కుంఫిణీ చాప్లిన్ (క్రైస్తవ పురోహితుడు) చెన్నపట్టణానికి వచ్చాడు. ఇతడు కుంఫిణీ మనిషి కనుక ప్రొటెస్టంట్. కేథలిక్కులు విద్యావిషయంలో కృషి చేస్తున్నారే మనమెందుకు అలా చేయకూడదు? అని భావించాడు. చాలా పట్టుపట్టి ఇంగ్లండులోని కుంఫిణీ డైరెక్టర్లకు పెద్ద పెద్ద ఉత్తరాలు వ్రాసి చివరకు మద్రాసులో కుంఫిణీ తరపున స్కూలు మాస్టరును నియమించేటట్టు చేశాడు. మేస్తర్ రాల్ఫ్ ఓర్డ్ అనే ఆయన 1677లో వచ్చాడు. ఇంగ్లీషు వాళ్ళ పిల్లలకేకాక పోర్చుగీసు కుర్రాళ్ళకు, తెలుగు పిల్లకాయలకు కూడా ఉచితంగా రాయడం, చదవడం, లెక్కలు చేయడం మొదలైనవి ప్రొటెస్టంట్ మత ధర్మాలతోపాటు నేర్పించేవాడు.

క్రీ.శ. 1688లో మద్రాసు నగరంలో కార్పొరేషను స్థాపించారు. నల్లపేటలో దేశీయుల కోసం బడి పెట్టాలన్నది కార్పొరేషన్ ఆశయాలలో ఒకటి. ఇంగ్లీషు భాషను మాట్లాడడం, రాయడం, చదవడం, లెక్కలు చేయడం, పద్దులు రాయడం నల్లవాళ్ళ చిన్నవాండ్లకు నేర్పాలని కుంఫిణీవారు భావించారు. అయితే దేశీయుల కోసం మున్సిపల్ స్కూలన్నది కార్యరూపం దాల్చలేదు. తెల్లవాళ్ళ కోసం సెంట్ మేరీస్ స్కూలును స్థాపించి కోటలోని బడితో కలిపేశారు (దీనినే మేల్ అసైలమ్ అనేవారు). ఇది విద్యార్థులు హాస్పిటల్లో ఉండి చదువుకొనే వసతి బడి. దీనివల్ల నల్లవాళ్ళ పిల్లలకు చదువుకొనే అవకాశాలు పోయాయి. S.P.C.K. వారు ఆ కొరతను తీర్చడానికి 1715లో ఒక బడి పెట్టారు.

క్రీ.శ. 1790 నాటికి జాన్ హెూమ్స్ అనే విద్యావేత్త చెన్నపట్నంలోని నల్లటౌనులో 'మదరాసు అకాడమీ' అనే పేరుతో ఒక వసతి బడిని స్థాపించారు. కుంఫిణీ బావుటా కింద చెల్లుబడి అయ్యే వివిధ ప్రాంతాలలో పని చేసే తెల్లదొరలు తమ పిల్లలను ఈ చెన్నపట్నం వసతి బడిలోనే చేర్చేవారు. ఆ పిల్లల కోసం మిసెస్ ముర్రే అనే ఆవిడ ఒక వసతి బడిని పెట్టింది. తెల్లవాళ్ళ పిల్లకాయలకు యథోచిత విద్యలు లభిస్తున్న ఈ కాలంలో నల్లవాళ్ళు తమ పాట్లు తాము పడి ఇంగ్లీషు చదువులు చదువుకొనేవారు. 1790 ప్రాంతాలలోనే బందరులో మోర్గన్ దొరగారు ఒక స్కూలును నడిపారు. అందులో నల్లవాళ్ళ చిన్నవాండ్రు కూడా చదువుకొనేవారు. కావలి బొర్రయ్యగారు ఇక్కడే ఇంగ్లీషులో ప్రావీణ్యం సంపాదించాడు. ఒంగోలులో ఒక బ్రాహ్మణుడు కూడా ఈ కాలంలో ఒక ఇంగ్లీషు నేర్పే బడిని పెట్టాడు. వెన్నెలకంటి సుబ్బారావుగారు ఇక్కడే చదువుకొన్నారు. చాలామంది నేటివు యువకులు తమ బంధువులు కుంఫిణీ ఉద్యోగాలలో ఉంటే, ఉమేదువారీలుగా కచ్చేరీలలో చేరి స్వయంకృషితో ఉద్యోగానికి అవసరమైన విద్యలు నేర్చుకొనేవారు.

కుంఫిణీవారు వర్తకం ప్రధానంగా చూసుకొన్న రోజుల్లో పరిస్థితులకూ, వారు రాజ్యపాలకులై పన్నులు వసూలు చేయడం మొదలుపెట్టాక పరిస్థితులకూ చెప్పుకోదగ్గ

Glyn Barlow - The Story of Madras; Oxford University Press, 1921. (See the story of Schools).

పరిణామాలు వచ్చాయి. రెవెన్యూ శాఖలో చాలామంది నేటివులు అవసరమయ్యారు. సర్కారు వారికోసం సొమ్ము రాబట్టే ఉద్యోగులు సొంతలాభం కొంతైనా చూసుకోక తప్పదు. జీతాలు చాలనప్పుడు సాధ్యమైతే చట్టబద్ధంగానూ లేకపోతే అడ్డదారులలోనూ ధనార్జన చేయడం మానవనైజం. రెవెన్యూ డిపార్టుమెంటులోని నేటివులు అక్రమాలు, అన్యాయాలు, మోసాలు, దగాలు, తప్పుడు రికార్డులు సృష్టించడాలు మొదలైనవి చేస్తున్నారని అధికారులు గుర్తించారు. ఈ నేరాలకు మూలకారణాలు ఏమిటని దర్యాప్తులు చేశారు. నేటివులు నిజాయతీగా వ్యవహరించాలంటే ఏమి చర్యలు తీసుకోవాలో సూచించమని కలెక్టర్లను చెప్పమన్నారు. విశ్వసనీయంగా ప్రవర్తించే నేటివులను ఏ విధంగా ప్రోత్సహించాలి? నేరాలకు ఏ శిక్షలు వేయాలి? మొదలైన ప్రశ్నలకు సమాధానాలు వాంఛించారు.

కడపలో కలెక్టరుగా ఉండే మెస్తల్ రోజ్ అనే కుంఫిణీ ఉద్యోగి మూలకారణాన్ని నివేదించాడు. నేటివు చిన్నవాండ్ల విద్యావిధానంలోనే లోపం ఉందని, వారికి నైతిక శిక్షణ అవసరమని, పన్నెండు, పదమూడేళ్ల వయసు నుంచి పద్దెనిమిది, ఇరవైయేళ్ల వయసులో వాళ్ళకి తగిన విధంగా తర్ఫీదు ఇస్తే నీతి, నిజాయతీగల సేవకులుగా తయారవుతారనీ సలహా ఇచ్చాడు. ఇది కాలేజీ బోర్డు వారికి రెవెన్యూ బోర్డువారు పంపించారు (అప్పటికే కుంఫిణీ కొలువులోని తెల్లదొరల చదువుల కోసం కలకత్తాలోనూ, చెన్నపట్నంలోనూ కాలేజీలు ఉండేవి. వీటి సంగతి ఇంతకు ముందే వివరంగా తెలుసుకొన్నాం).

నేటివుల విద్యావిధానంలో లోపాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. రెవెన్యూ బోర్డువారి ఫైళ్లను చూసిన గవర్నరు సర్ థామస్ మన్రో ఒక యాదస్తును 1922 జూలై రెండవ తేదీ నాడు రాసి ముఖ్యమైన ఆదేశాలను ఇచ్చాడు. ఆయన ఏది చేసినా సమస్యను కూలంకషంగా పరిశీలించి చేస్తాడు. అందుకే మూల కారణాలలోనికి వెళ్ళాడు. ''రాజ్యాలను సంపాదించాక మనం భౌగోళికంగా సర్వేలు చేయించాము. దేశంలో పండే పంటల ఆరాలు తీశాము. వనరుల గురించి భోగట్టాలు తెలుసుకొన్నాము. జనాభా లెక్కలు గుణించాము. అంతేగాని నేటివుల విద్యావిధానం గురించి తెలుసుకోడానికి ఏమాత్రం ప్రయత్నించలేదు'' అని స్పష్టం చేశాడు. జిల్లాలలో ఉన్న కలెక్టర్లందరికీ తాఖీదులు పంపించాడు. ఒక్కొక్క చోట ఎన్నిరకాల పాఠశాలలు ఉన్నాయి? ఎటువంటి విద్యలు ఏ పద్ధతులలో బోధిస్తారు? నేటివుల మత విశ్వాసాలకు భంగం లేకుండా వారి విద్యావిధానంలో అనవసరపు జోక్యం కలిగించుకోకుండా మార్పులు తీసుకురావడానికి ఏం చేయాలి? అవి చాలకపోతే మనం ధన సహాయం చేయాలా? ఇటువంటి ప్రశ్నలు వేసి అన్ని వివరాలతో సమాధానాలు పంపమని మన్రో జారీ చేసిన తాఖీదుపై సమాచార సేకరణ జరిగింది.

ఇండియాలోని కుంఫిణీవారు ఏది చేయాలన్నా ఇంగ్లండులోని డైరెక్టర్ల బోర్డు అంగీకరించాలి. మన్రో పంపిన యాదస్తును ఇంగ్లండులోని పెద్దలు ఒప్పుకొన్నారు. తమ ఆదాయం పెరిగే ఏ ప్రయత్నాన్నయినా ఆశీర్వదిస్తారు. జిల్లాలలోని కలెక్టర్లు నివేదికలు తయారుచేసి పంపడానికి రెండేళ్లు పట్టింది. ఈలోగా కుంఫిణీ కొలువులో ఉన్న నేటివు

విద్యావంతులు తమ తమ సూచనలను కూడా లేఖల మూలంగా విన్నవించుకొన్నారు. 1820లోనే స్కూలు బోర్డు సొసైటీలో సభ్యునిగా ఉన్న వెన్నెలకంటి సుబ్బారావుగారు బోర్డుకు ఒక సుదీర్ఘమైన లేఖ రాశారు. అందులో నేటివు విద్యా విధానం పరిస్థితులపైనా, వాటిని మెరుగుపరచడానికి తీసుకోవలసిన చర్యలపైనా చాలా చెప్పారు. ఇంగ్లీషులో ఆయన రాసిన ఆ ఉత్తరానికి నా అనువాదాన్ని చూడండి.

అయ్యా!

ప్రస్తుతం స్కూళ్ళలో నేటివులు నేర్చుకుంటున్న అసమగ్రమైన విద్యావిధానం గురించి కమిటీవారికి విన్నవించుకునే నిమిత్తం అనుజ్ఞ దయచేయమని సవినయంగా ప్రార్థించుకొంటున్నాను. ఇప్పుడు అమలులో వున్న రూల్సు మార్చడానికి, సవరించడానికి కొన్ని సూచనలు నివేదించుకొంటాను. ఇవి నేటి పరిస్థితులను చక్కపరచి సాహిత్య జ్ఞానాన్ని వృద్ధి చేస్తాయనే నమ్మకంతోను కమిటీవారు వాటిని ఆమోదిస్తారని పరిపూర్ణంగా విశ్వసించుతున్నాను.

చెన్నపట్టణంలో దరిదాపుగా ప్రతి వీధిలోనూ బళ్ళున్నాయి. వీటిలో అన్ని కులాల వాళ్లు చదువుకుంటున్నారు. ఒక్కొక్క బడిలో ముగ్గురికి తక్కువగాకుండా యాభై మందికి మించకుండా పిల్లకాయలు వుంటారు. చెన్నపట్టణం తెలుగు బళ్లలో పంతుళ్ళందరూ ఉత్తరాది బ్రాహ్మణులే! దక్షిణాది తెలుగుకంటే, పడమటి జిల్లాల తెలుగుకంటే ఉత్తరాదిభాషనే నిండా ఎన్నిక చేయడమే ఇందుకు కారణం. సెంటు జార్జి కోటకు లోబడిన యెన్నో జిల్లాల్లో బడిలేని గ్రామం కనబడడం చాలా అరుదనే చెప్పాలి.

పిల్లవాణ్ణి ఐదోయేట బడిలో వేయడం శుభకరమని భావిస్తారు. అక్షరాభ్యాసం చేయించాక తల్లిదండ్రులు శక్తినిబట్టి అయ్యవారికి కొన్ని కానుకలు ఇచ్చి కుర్రవాడిని బడికి పంపుతారు. అక్కడ ఇసుకలో బొటనవ్రేలు పెట్టించి గుంట ఓనమాలు దిద్దిస్తారు. అవి మనసుకు పట్టాక కడితంమీద (పలక వంటిది) వ్రాయిస్తారు. పిల్లవాడు అక్షరాలను బోధపర్చుకున్నాక గుణింతాలు నేర్పుతారు. దేవతల పేర్లు, మనుషుల పేర్లు చిన్న చిన్నవి వ్రాయడం బోధిస్తారు. చెప్పిన పేరు వ్రాయడం వచ్చాక తాటాకుమీద గంటంతో లిఖించడం నేర్పుతారు. మొదట గుండ్రటి సున్నాలు చుట్టడంతో ఈ వ్రాత బాగా పట్టుబడుతుంది.

ఇవన్నీ నేర్చుకున్నాక బాలరామాయణం చదివిస్తారు. ప్రతి సాయంత్రం ఒక కొత్త శ్లోకం నేర్పుతారు. అది మరునాడు ప్రొద్దుట అప్పచెప్పాలి. రోజూ ఉదయం ఆరు గంటలకు పిల్లకాయలు బడికి వస్తారు. రెండో మూడో ఎన్నో కొన్ని వరుసలలో కూర్చుని పాఠాలు నేర్చుకుంటారు. వాళ్ళల్లో చురుకైన విద్యార్థి పాఠాన్ని పైకి చదువుతాడు. మిగతావాళ్ళు తమ చేతిలోని పుస్తకాన్ని చూస్తూ ఆ మాటలు వల్లె వేస్తారు. పొద్దుట తొమ్మిదిదాకా ఇలాగా చదువుకున్నాక అయ్యవారికిగాని, ఇంకొకరికి గాని పాఠాలు అప్పజెప్తారు. ఆ తర్వాత చద్దన్నం తినడానికి పిల్లలను వదిలేస్తారు. మళ్ళీ

పది గంటలకు బడికి వచ్చి కడితల మీద, తాటాకుల మీదా వ్రాయడం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల దాకా వ్రాశాక భోజనాలకు విడిచిపెడతారు. తిరిగి నాలుగు గంటలకు పాఠశాలకు వచ్చి అయ్యవారుగానీ, యింకొకరుగానీ చెప్పే కొత్త పాఠాలను అయిదు దాకా చదువుకుంటారు. ఆ తరువాత అందరూ శ్రద్ధాభక్తులతో నిలబడి సంవత్సరాల పేర్లూ, మాసాలూ, వారాలు, గ్రహాలు, నక్షత్రాలూ, వివిధ పర్వదినాలూ, పండుగలూ పబ్బాలూ మొదలైనవి యావత్తూ బిగ్గరగా వల్లెవేస్తారు. బాల రామాయణంగాక బడిపిల్లలు చదివే గ్రంథాలు మరికొన్ని వున్నాయి. అవి: అమరకోశంలో కొన్ని వర్గులు (స్వర్గవర్గు, వ్యోమవర్గు, దిగ్వర్గు, కాలవర్గు మొదలైనవి) కొన్ని నీతి బోధక గ్రంథాలు, గణితశాస్త్రంలో కొన్ని ప్రకరణాలు. గ్రంథాలు చదువుకున్నవాళ్ళను ఉత్తరోత్తరా చాలా గౌరవిస్తారు కనుక పురాణేతిహాసాలలో సులభమైన భాగాలు కూడా కొన్ని చెప్తారు.

వాస్తవానికి పెళ్ళిచూపులలో వరుణ్ణి పిల్లతరపు వాళ్ళు పరీక్ష చేసేటప్పుడు అతగాడు పుస్తకాలు చదువుకొన్నాడో లేదో చూస్తారు. చదువుకున్నవాడైతే తమ అల్లుడు మంచి తెలివితేటలు గలవాడని సంబరపడి నిండా తృప్తి చెందుతారు. పున్నమినాడు, అమావాస్యనాడు ఆటవిడుపు. ఆ పర్వదినాలలో చదువుకొనడం నిషిద్ధం. పైన చెప్పిన పుస్తకాలన్నీ కుర్రవాళ్ళు చదువుతారు. నిజమే. అయితే, వాటిలో ఒక్కముక్కకు సైతం వాళ్ళకు అర్థం తెలియదు. వాళ్ల అయ్యవార్లకు కూడా అంతంత మాత్రమే తెలుసు. ఇచ్చిన ఏ కాగితాన్నయినా, ఉత్తరాలైనా, పద్దులయినా గడగడా చదవడానికి వుపయోగపడు తుందన్న వుద్దేశ్యంతోనే పుస్తకాలు చదివిస్తారు తప్ప మరెందుకూ కాదన్నమాట స్పష్టం.

ఈ దేశంలోని బళ్లలో కుర్రవాళ్ల చేత చిన్నవయసులోనే వ్యాకరణంగానీ, నీతిబోధక పుస్తకాలుగానీ చదివించకపోవడం చాలా విచారించవలసిన విషయం. ఇది పఠించివుంటే చదువుకొన్న విద్య రాణించుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చును. ఇవి లోపించడం వల్లనే నేటివులు వ్రాసే ఉత్తర ప్రత్యుత్తరాలలో ఎన్నో వ్యాకరణ దోషాలు తరచు కనబడుతూ వుంటాయి. ఏ భాషలోనైనా నిర్దుష్టమైన ప్రావీణ్యానికి వ్యాకరణ జ్ఞానం ఎంతో ఆవశ్యకం. అటువంటి పునాదిని నిర్లక్ష్యం చేశాక భాష క్షుణ్ణంగా రమ్మంటే ఎలాగ వస్తుంది?

ఈ దేశంలో కుర్రవాళ్లు తమ పదోయేటగానీ, పదకొండోయేటగానీ బడి విడిచిపెట్టేస్తారు. చదువు పూర్తి అయిందా లేదా అని ఏమాత్రం పట్టించుకోరు. కులవృత్తిలో ప్రవేశిస్తారు. వాళ్ల తండ్రి కచేరిలో నౌకరీ చేస్తుంటే కుర్రవాడు కూడా అందులో చేరుతాడు. లెక్కలు, పద్దులు వ్రాయడం నేర్చుకుంటాడు. కొంచెం చెయ్యి తిరిగాక బంధువులు ఎంతో తాపత్రయపడి ఏదో వుద్యోగంలో వాణ్ణి వేస్తారు. అందుచేత ఆ అబ్బాయికి మాతృభాషలో మంచి ప్రావీణ్యం రావడానికి ఏమాత్రం శ్రద్ధ తీసుకోరు. బడి విడిచిపెట్టాక భాషా జ్ఞానం వుత్తరోత్తరా సంపాదించుకొంటారని ఒప్పుకోవచ్చుగాని సాధారణంగా అది సమగ్రం కాదని చెప్పాలి. ఆదిలో నేర్పవలసిన పద్ధతులలో చెప్పించచక పోవడం పెద్ద లోపమే.

వ్యాకరణ గ్రంథాలూ, ముఖ్యమైన నీతికావ్యాలూ చదవకపోవడంవల్లనే ఈ దుస్థితి ఏర్పడింది. తమ కుటుంబాలు చేసుకునే వృత్తులకూ, కుర్రాళ్లు చదువుకునే చదువుకూ ఏమీ పొందిక లేదు. అన్ని కులాలవాళ్ళకూ ఒకటే పద్ధతిలో విచక్షణ లేకుండా చదువు చెప్తారు. ఈ దేశంలోని నేటివు బళ్ళలో అన్ని కులాల బాలురకు నేను మనవి చేసిన తీరుగానే బోధన జరుగుతుంది. ఒక్క భోగంవాళ్ళలోనే ఆడపిల్లలను బళ్ళకు పంపుతారు. మేజువాణీలలో పాడే పాటలను కంఠతా పెట్టడానికి వ్రాయడం, చదవడం తప్పకుండా రావాలి.

బడిపంతుళ్ళు పడే కష్టానికి తగినంత ఆదాయం రాదు. వాళ్ళ జీవితం గడవడమే చాలా గగనం. గ్రామాలలో నాలుగణాలు, మద్రాసులో మహా అయితే రూపాయ చొప్పున ఒక్కొక్క విద్యార్థివల్ల అతనికి వస్తుంది. మునుపటి ప్రభుత్వాల రోజుల్లో బడిపంతుళ్లకు నగదురూపేణా అప్పుడప్పుడూ బహుమతులు లభించేవి. ఉపపన్నులు (సంపన్నులు) భూమి కూడా ఇచ్చేవారు. కుర్రవాళ్లు విద్యాభ్యాసం ముగించుకున్నాక గురుదక్షిణ కూడా సమర్పించుకునేవారు.

నెలజీతాలు ఇచ్చుకోగల్గిన తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో వేస్తారు. లేనివాళ్లు ఇంటిదగ్గర చేర్పిస్తారు. అయితే యిళ్ళల్లో తరిఫీదు పొందినవాళ్ళ విజ్ఞానం కొంత తీసికట్టేగానీ వుత్తరోత్తరా కచ్చేరీల్లో చేరినప్పుడు పైవాళ్ళ ధర్మమా అని నేర్చుకొని ఆ లోపాన్ని కుర్రవాళ్ళు భర్తీ చేసుకుంటారు. బళ్ళలో లెక్కలు కూడా బోధిస్తారు. అయితే, ఏమంత క్షుణ్ణంగా చెప్పరు. ఉత్తమాదర్శాలు, నీతిమార్గాలు గూర్చి చెప్పాలంటే - కుర్రాళ్లకు అవంటే ఏమిటో తెలియవనే భావిస్తాను. వాస్తవానికి మా బళ్ళలో నీతివాక్యాల పుస్తకాలు చదివిస్తారుగానీ - ఎందుకు చదవాలో, వాటివల్ల లాభమేమిటో ఎంతమాత్రం ఆ కుర్రాళ్ళ మనసులకు హత్తుకునేటట్లు విశదపర్చరు. సంస్కృత భాషను కూలంకషంగా వివిధ శబ్దాల లింగభేదాలు, క్రియారూపాలూ, వాక్యనిర్మాణ సూత్రాలు విద్యార్థి అభ్యసించవలసి వుంటుంది. ఇతర భాషలు కూడ ఇంత కట్టుదిట్టంగా బోధించినట్టయితే నేటిదాకా ప్రజలు యావన్మందిలో నిర్దుష్టమైన భాష నిలిచివుండేదని చెప్పడానికి నేను ఏమాత్రం సందేహించను. ఇతర భాషలలోలాగా సంస్కృతంలో ఎంత మాత్రం సౌకర్యం లేదని మనం చూస్తూనే వున్నాం.

ఈ దేశంలో వుండే శ్రీమంతులూ, సంపన్నులూ కేవలం తమ పిల్లలకు మాత్రమే చదువు చెప్పేందుకు పంతుళ్ళను పెట్టుకుంటారు. ఇతోధికంగా జీతాలు యిస్తారు. ఇతర బాలబాలికలకు చదువు చెప్పడానికి ఈ అయ్యవార్లు గడప దాటేందుకు వీలులేదు.

దేశీయ భాషలన్నీ రమారమి ఒక్కలాగే బోధిస్తూ వుంటారు. తమిళంలో మాత్రం తక్కువ అక్షరాలు వున్నాయి. అరవ కుర్రవాళ్ళచేత మొట్టమొదట తమిళంలో పుస్తకాలే చదివిస్తారు. సాధారణంగా సంస్కృతాన్ని దేవనాగరి లిపిలో వ్రాయాలికానీ, తెలుగు, కన్నడం, గ్రంథం, బలుబొంద భాషల్లో కూడా సంస్కృతంలో వున్న సమానమైన అక్షరాలూ వుండడంవల్ల దక్షిణదేశంలో సంస్కృత గ్రంథాలన్నింటినీ నిర్దుష్టంగానే యీయా భాషలలో లిఖిస్తున్నారు. తెలుగు, కన్నడం, తమిళం, మహారాష్ట్ర వంటి

భాషల్లోనూ, సంస్కృతంలోనూ వ్యాకరణ గ్రంథాలున్న సంగతి లోకవిదితమే. చిన్నప్పుడే వీటిని బోధించితే ఆయా భాషల కుర్రాళ్ళు నిస్సందేహంగా ప్రావీణ్యం సంపాదించుకుంటారు. అయితే వీధిబళ్ళలో వీటి ప్రసక్తే లేదు.

ఇంక యీ దేశంలోని నేటివులు ఇంగ్లీషు భాష ఎలా నేర్చుకుంది మనవి చేస్తాను. మాతృభాష నేర్చుకొన్నాక ఫలానా వయసులోనే ఇతర భాషలు నేర్చుకోవాలనే రూల్సు ఎక్కడా లేవు. అరవై సంవత్సరాలు పైబడ్డవాళ్లు కూడా ఎంతో ఆసక్తితో ఈ దేశంలో ఇంగ్లీషు చదువుకోవడం నేను కళ్ళారా చూశాను. ఇంగ్లీషు బళ్ళో చేరిన నేటివులు అచ్చుపడ్డ స్పెల్లింగు బుక్కులోంచి చూచి మొట్టమొదట అక్షరాలు నేర్చుకుంటారు. ఆ తరువాత ప్రతిరోజూ వుదయం ఉపాధ్యాయుడు స్పెల్లింగులు నేర్పిస్తాడు. వొకాబులరీ పుస్తకంలోంచి పాఠాలు చెప్తాడు. 'డయలాగు' అనే సంభాషణా శిక్షణ కూడా పుస్తకంలోంచే బోధిస్తారు.

ఈ పుస్తకాలు పూర్వం ఒక సందర్భంలో చెన్న పట్టణంలో విద్యార్థుల నిమిత్తం నేటివు యింగ్లీషు మాస్టర్లు రచించినవనుకుంటాను. ఒక వంద మాటలను నేర్చుకొని కొంచెం కుదురైన దస్తూరీ అలవర్చుకోగానే ఏదో ఒక కచేరీలో ఉమేదువారిగా చేరుతాడు. తరువాత తన చుట్టాల ప్రాపకంవల్ల క్రమంగా ఏదో కొంచెం జీతం వచ్చే వుద్యోగం వేయించుకుంటాడు. జిల్లాలలో వుండే యింగ్లీషు విద్యార్థులకు తెలిసిన పుస్తకాలు మూడే 1. వకాబ్యులరీ, 2. డయలాగు, 3. అరేబియన్ నైట్సు.

ఇక వ్యాకరణమంటారా? వాళ్ళకు సగమెరుక. నేను చెప్పిన వొకాబులరీ డైలాగు పుస్తకాలు కూడా నిర్దుష్టం కావు. వ్యాకరణ బద్ధంగా లేవు. అవి చదివినవాళ్ళు ఏమాత్రం తప్పులు లేకుండా ఇంగ్లీషు మాట్లాడలేరు. జిల్లాలలోని బళ్ళలోనేకాక రాజధానిలో సైతం ఇంగ్లీషు నేర్పించే విధానం చూస్తే అది విద్యాప్రదానం చేయవలసిన ఉత్తమ ధర్మాలకు అనుగుణంగా లేదన్న సంగతి అవగతం గాకమానదు. చెన్నపట్నంలోని నేటివు ఇంగ్లీషు మాస్టర్లలో గ్రామరు అంటే ఏమిటో తెల్సినవాళ్ళు బహుకొద్దిమంది. పూర్వం ఇంగ్లీషు బళ్ళలో వుండే వుపాధ్యాయుల వరుమానం నిజానికి చాలా బాగానే వుండేది. అప్పుడు మహా అయితే మూడు నాలుగు ఇలాంటి స్కూళ్ళు వుండేవి. ఇప్పుడు ఎక్కడ చూచినా అవే గనుక పంతుళ్ళ జీతాలు ఒక పంటికిందకి రావడం లేదు.

ఇంక ఇంగ్లీషు ఉచ్చారణ సంగతి. ఏ నేటివు అయినా దాన్ని ధారాళంగా మాట్లాడగలగడమన్న ప్రశ్నేలేదు. అందుచేత చక్కగా వ్యాకరణ యుక్తంగా వ్రాయగలిగితే చాలు. పరభాషను ఎవరూ స్వచ్ఛంగా వుచ్చరించలేరన్న విషయం జగద్విదితమే. మాటలవరసకు గీర్వాణంలో 52 అక్షరాలు వున్నప్పటికిన్నీ సంస్కృతంలో పరిపూర్ణమైన పాండిత్యాన్ని సంపాదించుకున్న పండితుడైనా సరే ఇంగ్లీషు భాషను దోషరహితంగా ఉచ్చరించడానికి ఇబ్బంది పడ్తున్నాడు. ఇంతకీ ఆ భాషలో ఇరవయ్యారు అక్షరాలు మాత్రమే వున్నాయి.

వివిధ భాషలలో విద్యాభివృద్ధి నిమిత్తం యీ క్రింది పుస్తకాలు అచ్చువేసి ప్రచురించి సొసైటీవారు నిర్ణయించిన సరసమైన ధరలకు విక్రయించవలసినదని సవినయంగా విన్నవించుకుంటున్నాను.

నేటివు స్కూళ్ల కోసము

1. ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడము, మహారాష్ట్ర భాషలలో వున్న వ్యాకరణాలను సంక్షిప్తం చేసి వాక్యగ్రంథ రూపంలో వ్రాయించి వాడుక భాషలో వ్యాఖ్యానం చేయించాలి.
2. ముఖ్యంగా నీతి బోధకమైన వివిధ గాథలను వివిధ గ్రంథాల నుండి సేకరించి వాడుక భాషలలో వ్రాయించాలి.
3. సాధారణ గణితం, ఉన్నత గణితం వాడుక భాషలో వివరించే వాక్యగ్రంథాలు ప్రకటించాలి.

ఇంగ్లీషు స్కూళ్ళలో

4. అన్ని ప్రాంతీయ భాషలలోనూ ఇంగ్లీషు వ్యాకరణాన్ని వివరించే సంక్షేప గ్రంథాలు వుండాలి.
5. సృష్టి జరిగినది లగాయతు ప్రపంచ చరిత్రను అన్ని భాషలలోనూ అనువాదం చేయించాలి.
6. పరిచయమైన ఇంగ్లీషు డయలాగులు తర్జుమాలతోబాటు వివిధ భాషలలో ప్రకటించాలి.
7. ఇంగ్లీషులోనూ, స్థానిక భాషలలోనూ వొకాబులరీలు.
8. కొన్ని వినోద కథలు అనువాదాలతో సహా.

ఈ నివేదికను ముగించే ముందు వివిధ భాషా జ్ఞానాలను అభివృద్ధి కావించడానికి మార్గాంతరాలు తోచినప్పుడు వాటిని కమిటీవారి దృష్టికి తప్పకుండా నివేదించు కుంటానని మనవి చేస్తున్నాను.

ఇట్లు
తమ అత్యంత విధేయుడున్ను,
సేవకుడున్ను అయిన
వి. సుబ్బారావు వ్రాలు

తిరువళ్ళిక్కేణి
22-11-1820

కలెక్టర్లు పంపిన రిపోర్టుల ప్రకారం చాలా సంగతులు అరకొరగానైనా తెలియవచ్చాయి. జిల్లా జనాభా ఎంత? అందులో స్త్రీలెందరు? పురుషులెందరు? ఎన్ని స్కూళ్లున్నాయి? వాటిలో చదువుకొనే బాలురెందరు? బాలిక లెందరు? వీరిలో హిందువు లెందరు? ముస్లిములెందరు? గురువులలో బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు ఎందరు? మొదలైన వివరాలన్నీ ఇచ్చారు. మొత్తం ఎనిమిది జిల్లాల తాలూకు భోగట్టాలు తెలిశాయి. (M.J.L.S.No.38 (1850), పు. 380 నుండి)

గంజాం జిల్లా : జనాభా 2,75,281. ఉన్న స్కూళ్ల సంఖ్య తెలియదు. హిందూ విద్యార్థులు 2,950 (వీళ్లలో 12 మందే ఆడపిల్లలు). ముస్లిం విద్యార్థులు 27మందే (బాలికలు ఒక్కరూ లేరు). మొత్తం విద్యార్థుల సంఖ్య 2,977 మాత్రమే.

విశాఖజిల్లా : జనాభా 9,14,001. జిల్లాలో ఉన్న స్కూళ్లు 914. హిందూ విద్యార్థులు 9,618 (303గురు బాలికలు), ముస్లిం విద్యార్థులు 97 మందే. (బాలికలు లేరు). మొత్తం విద్యార్థుల సంఖ్య 9,715.

రాజమండ్రి : జనాభా 7,38,303. జిల్లాలో 291 స్కూళ్లూ, 279 గురుకులాలు ఉన్నాయి. స్కూళ్లల్లో 2,606 గురు గురుకులాలలో 1,454 మంది విద్యార్థులున్నారు. స్కూళ్లలో 37 మందే ఆడపిల్లలు. గురుకులాలలో స్త్రీలకు ప్రవేశం లేదు. స్కూళ్లల్లో 52 మందే ముస్లిం విద్యార్థులు. మొత్తం విద్యార్థుల సంఖ్య 2,658+1,454.

మచిలీపట్నం : జనాభా 52,489. జిల్లాలో 484 స్కూళ్లు, 49 గురుకులాలు ఉన్నాయి. స్కూళ్ళలో 4,775 మంది బాలురు, 31 మంది బాలికలు. మొత్తం 4,806 మంది విద్యార్థులు. గురుకులాలలో 199 మంది బాలురు మాత్రమే ఉన్నారు. స్కూళ్లల్లో 275 మంది ముస్లిం అబ్బాయిలు. ఇద్దరు అమ్మాయిలు చదువుకొంటున్నారు. మొత్తం విద్యార్థుల సంఖ్య 5083+199.

గుంటూరు జిల్లా : జనాభా 4,54,754. జిల్లాలోని స్కూళ్ల సంఖ్య తెలియదు. హిందూ విద్యార్థుల సంఖ్య 7,464 మంది. ఇందులో 99 మంది ఆడపిల్లలు. ముస్లిం విద్యార్థులలో 257 మంది యువకులు, ముగ్గురు యువతులు. వెరశి 260. మొత్తం విద్యార్థుల సంఖ్య 7,724.

నెల్లూరు జిల్లా : జనాభా 8,39,467. జిల్లాలోని స్కూళ్ల సంఖ్య తెలియదు. 7,001 మంది హిందూ విద్యార్థులు (55 మంది బాలికలు), 620 మంది ముస్లిం విద్యార్థులు, (ముగ్గురే బాలికలు). మొత్తం విద్యార్థుల సంఖ్య 7,621.

బళ్లారి జిల్లా : జనాభా 9,27,857. జిల్లాలోని స్కూళ్ళ సంఖ్య 533. వీటిలో 6,398 మంది హిందూ విద్యార్థులు (60 మంది బాలికలు), 243 మంది ముస్లిం యువకులు చదువుకొంటున్నారు (యువతులు లేరు). మొత్తం విద్యార్థుల సంఖ్య 6,641.

కడప జిల్లా : జనాభా 10,94,000. జిల్లాలోని స్కూళ్ళ సంఖ్య 494. ఇందులో 5,658 మంది హిందూ విద్యార్థులు (107 మంది బాలికలు), 341 మంది ముస్లిం బాలురు. ఒక్కర్తే బాలిక. మొత్తం విద్యార్థుల సంఖ్య 6,000.

కొన్ని జిల్లాలలో అదనపు భోగట్టాలు తెలియవచ్చాయి. ఉదాహరణకు రాజమండ్రిలో శాస్త్రాలు బోధించే 69 మంది పండితులున్నారు. వీళ్లకు ఇందు నిమిత్తం ఇనాము భూములున్నాయి. ఈ పండితులలో పదముగ్గురికి పూర్వ సంస్థానాధీశ్వరులు ఏటా వార్షికం ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లాలో పూర్వపు కర్నాట ప్రభువులు కొంతమంది బ్రాహ్మణులకు, ముసల్మానులకు మడులు, మాన్యాలు, వార్షికాలు ఇచ్చి

వేదాలూ, అరబ్బీ, పారశీకాలు వాళ్ళ వాళ్ళ పిల్లకాయలకు బోధించే నిమిత్తం వసతులు ఏర్పాటు చేశారు. ద్రవ్య రూపేణా ఈ వార్షిక దానాలు సాలీనా 1,467 రూపాయలని తేలింది.

సర్ థామస్ మన్రోగారు ఏటా 50 వేల రూపాయలను విద్య నిమిత్తం కుంఫిణీ వారు వెచ్చించాలని డైరెక్టర్ల కోర్టువారికి సిఫార్సు చేవారు. ప్రజల విజ్ఞానాభివృద్ధికి మనం ఎంత ద్రవ్యం ఖర్చు చేసినా మనకు పుష్కలంగా లాభిస్తుంది. రాజ్యం బాగుపడడం అల్లా మన శ్రేయస్సే. జ్ఞానం విస్తరించడం వలన తప్పనిసరిగా క్రమబద్ధమైన అలవాట్లు ఏర్పడి పాటుపడడానికీ, తత్ఫలితంగా జీవన సౌకర్యాలు పొందడానికీ, ఇతోధికమైన సౌభాగ్యానికీ ప్రజలు నడుము కట్టగలరు అని మన్రోగారు రాశారు. ''పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ కమిటీ''ని నియమించాలని చెప్పారు. ఆ మేరకు డైరెక్టర్ల సభ వారు సీమలో ఆమోదం చెప్పారు.

చెన్న రాజధాని ఏలుబడిలో ఉన్న ప్రాంతాలలో జిల్లాలలో కలెక్టరేటు బళ్ళూ, తాలూకాలలో తాసీల్దార్ బళ్ళు ఏర్పాటయ్యాయి. మన్రోగారి ప్రణాళికను అమలుపరచడానికి నలుగురు కుంఫిణీ అధికారులతో ఒక కమిటీని నియమించారు. ఏటా 45,000 రూపాయల నిధులు ఇచ్చారు. మద్రాసు స్కూలు బుక్ సొసైటీ వారికి పాఠ్య గ్రంథాలు తయారు చేయడానికి అదనంగా 3,000 రూపాయలు కేటాయించారు. కలెక్టరేటు బళ్ళలో పాఠాలు చెప్పడానికి సుశిక్షితులైన ఉపాధ్యాయులను తయారు చేయడం ప్రథమ కర్తవ్యంగా కమిటీ వారు అభిప్రాయపడ్డారు. చెన్న రాజధానిలో ఉన్న తాసీల్దారీ కలెక్టరేటు స్కూళ్ళలో ఇంగ్లీషు బోధన ప్రాథమిక దశలోనే వుంది. దేశీయ భాషలలో మిగిలిన పాఠాలు చెప్పేవారు. తాసీల్దారీ బళ్ళలో చదువుకొనే విద్యార్థుల సంఖ్య ఆశాజనకంగా లేదు. ఈ పాఠశాలల్లో ఏ ఒక్కదాన్లోనూ 33గురుకు మించి చదువుకొనే పిల్లలు లేరు.

కమిటీవారు 1832లో ఒక నిర్ణయానికి వచ్చారు. పాఠాలు చెప్పే అయ్యవార్లు అందుకు తగ్గ అర్హతలు లేని వాళ్ళయినా అయి వుండాలి. లేదా అశ్రద్ధ పెరిగి వుండాలి. సరైన తనిఖీ లేక ఇలా జరిగి వుంటుంది. అయ్యవార్లకు మంచి జీతాలను ఇవ్వకపోతే అభివృద్ధిని సాధించలేమని భావించారు. చక్కని విద్యార్థులను తయారు చేయాలంటే వారికి శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులకు ముందు సరైన శిక్షణ ఇవ్వాలి. అందుకే ఉపకార వేతనాలపైన 40 మందిని సముచితమైన తర్ఫీదుతో టీచర్లను చేయదలిచారు. ఈ కేంద్ర పాఠశాలలో ఇంగ్లీషు హెడ్మాష్టరు ఆధ్వర్యంలో వివిధ పండితుల ద్వారా ఉపాధ్యాయు లవబోయే వారికి బోధన విధానాలు నేర్పాలి. ఈ ప్రణాళికకు అయ్యే నెలసరి ఖర్చులను ఈ క్రింది విధంగా రూపొందించారు.

ఇంగ్లీషు హెడ్మాష్టరు జీతం	300 రూపాయలు
సంస్కృత పండితుడు	70 రూపాయలు
అరబ్బీ పారశీక మున్షీ	70 రూపాయలు
తెలుగు అయ్యవారు	15 రూపాయలు

తమిళ వాద్యారు	15 రూపాయలు
కన్నడం ఉపాధ్యాయుడు	15 రూపాయలు
15 రూపాయల చొప్పున 20 మంది హిందూ విద్యార్థుల ఉపకార వేతనం	300 రూపాయలు
15 రూపాయల చొప్పున 20 మంది ముస్లిం విద్యార్థుల ఉపకార వేతనం	300 రూపాయలు
మొత్తం	1085 రూపాయలు

ఈ కేంద్ర విద్యాలయంలో తర్ఫీదు పొందవలసిన వారిని కలెక్టరేటుల నుంచి ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఏమాత్రం భాషాజ్ఞానమైనా లేని వాళ్లను, స్థానికులను పంపారు. పైపెచ్చు అలా పంపితే వచ్చినవాళ్ళు వయసు ముదిరినవాళ్ళే. ఈ ప్రణాళిక ఘోరంగా విఫలమైంది.

సీమలోని డైరెక్టర్ల ఉద్దేశంలో ఉన్నత విద్యలు ప్రజలలోని ఉన్నతవర్గాల వాళ్ళకూ తీరుబాటూ, వెసులుబాటూ ఉన్నవాళ్ళు నేర్చుకుంటే వారే స్వదేశీయుల మనసులు మార్చగలుగుతారు. అధిక సంఖ్యాకులైన వర్గాలలో విద్యను వ్యాపింప చేయడంకన్నా ఈ పండిత వర్గాలపై కేంద్రీకరించడం వల్ల లాభసాటిగా ఉంటుందని సీమలోని డైరెక్టర్లు నిశ్చితాభిప్రాయానికి వచ్చారు.[2]

సీమనుండి ఈ తాఖీదు 1830లో వచ్చింది. 1834లోగాని మద్రాసు రాష్ట్రంలోని కమిటీ వారికి వేడి పుట్టలేదు. అదికూడా మీరేం చేస్తున్నారని సీమలోని అధికారులు అడిగాకనే. ఎట్టకేలకు కమిటీ వారు ఒక స్కీము వేశారు. దీనిని బెంగాలులో ఉన్న సుప్రీం ప్రభుత్వంవారికి నివేదించారు. బెంగాలులో అప్పుడు విద్యా బోధన ప్రాచ్య భాషలలోనే జరిగేది. 1835 మార్చి 7వ తేదీనాడు లార్డ్ బెంటిక్కు విద్యావిధానంలో సంపూర్ణమైన మార్పును తీసుకు వచ్చారు. బ్రిటీష్ ప్రభుత్వం వారి ఆశయం భారతదేశంలోని నేటివులకు యూరోపియన్ సారస్వత విజ్ఞాన శాస్త్రాల బోధనే అని స్పష్టం చేశాడు. నిధులన్నీ ఈ ఆశయసాధనకే వినియోగించాలని శాసించారు. బెంటిక్కు ఈ నిర్ణయం తీసుకొనడానికి మెకాలే రాసిన యాదస్తు ఒకటి ప్రబల కారణం.

లార్డ్ మెకాలే (1800-1859) గవర్నరు జనరల్‌గా కౌన్సిల్‌లో సభ్యుడు. ఇతడు కవి, వ్యాసకర్త, చరిత్రకారుడు. సుప్రీం కౌన్సిల్‌లో న్యాయ శాఖకు నిర్ణేత. బెంటిక్కులాగే ఈయన కూడా మితవాది. తక్షణ కర్తవ్యాలపైన శ్రద్ధ చూపేవాడు. తొందరగా సంస్కరణలు ప్రవేశపెట్టాలని వాంఛించాడు. భారతదేశంలో మధ్య తరగతి ప్రజల సామర్థ్యాలపై నమ్మకం ఉన్నవాడు. ఈ తరగతి ప్రజల వల్లనే సంస్కరణలు సాధ్యమవుతాయనీ, బ్రిటన్‌లోలాగే భారతదేశంలో కూడా మధ్యతరగతి ప్రజలు గట్టిపడాలని ఉవ్విళ్ళూరాడు. ప్రగాఢంగా విశ్వసించాడు.[3] ఇతని విధానాలవల్లనే

2. S. Sathianadhan - ""History of Education in the Madras Presidency, Madras, 1894. p.11.
3. George D. Bearce - "British Attitudes Towards India; Oxford University Press, London, 1961 - p.156

భారతదేశంలోని మధ్యతరగతివారు విద్యావంతులయ్యే అవకాశాలు దేశంలో ప్రబలమయ్యాయి.

ఇంగ్లీషులోనే, పాశ్చాత్య పద్ధతులలోనే విద్యా బోధన జరగాలని నిర్ణయం తీసుకొన్నాక దేశం మొత్తం ఈ విధానమే అంచెలుగా అమలులోనికి వచ్చింది. మద్రాసు నగరంలో ఒక నార్మలు స్కూలూ, ఒక ఇంగ్లీషు స్కూలు నడపడం కన్నా ఒక్క ఇంగ్లీషు కాలేజీని మాత్రమే నెలకొల్పాలని కలకత్తావారు ఆదేశించారు. నిధులు చాలకపోతే తాసిల్దారీ బళ్లను మూసేసి ఆ డబ్బును దీనికి పెట్టమన్నారు.

బెంగాలు నుండి తాఖీదు వచ్చాక చెన్న పట్టణంలో "కమిటీ ఆఫ్ నేటివు ఎడ్యుకేషన్" అనే సంఘాన్ని పెట్టారు. దీనిలోని సభ్యులందరూ తెల్లదొరలే. ఈ కమిటీ వారు చేసిన సూచనలను సైతం మద్రాసు ప్రభుత్వం పట్టించుకోలేదు. 1839లో లార్డ్ ఎలిఫిన్‌స్టన్‌గారు గవర్నర్‌గా వచ్చారు. ఈయన పూర్తిగా పాశ్చాత్య పద్ధతుల విద్యాబోధన పట్ల మొగ్గు చూపారు. స్కాట్లండులోని విశ్వవిద్యాలయాలలో మాదిరిగా మద్రాసులో విశ్వవిద్యాలయం స్థాపించాలని హైస్కూళ్లలో ఇంగ్లీషు సారస్వతం దేశీయ భాషలో నేర్పాలనీ, కాలేజీ స్థాయిలో ఉన్నత సాహిత్యాలు, ఫిలాసఫీ, సైన్సులు ఇంగ్లీషులోనే బోధించాలని నిర్ణయించారు. జిల్లాల్లో క్రమేణా "సుపీరియర్ స్కూళ్ళను" స్థాపించి వాటిని కాలేజీల స్థాయికి తీసుకురావాలని ప్లానులు వేశారు.

1839లో 70,000 దేశీయులు ఒక మహజరును పెట్టుకొని ఉన్నత విద్యను బోధించే ఇంగ్లీషు కాలేజీ అవసరాన్ని విశదపర్చారు. ఈ మహజరు వల్లనే సర్కారు వారు యూనివర్సిటీ బోర్డును ఒకదాన్ని నెలకొల్పారు. అందులో ఆంగ్లేయులు, భారతీయులు సభ్యులుగా ఉన్నారు.

1. J. Cuddy
2. M. Morgan
3. రాఘవాచారియార్
4. D. Sim
5. J. wylle
6. సి. శ్రీనివాస పిళ్ళే
7. L. Dent
8. హైదర్‌జంగ్
9. నసూర్-ఉల్-ముల్క్
10. కె. నరసింగరావు
11. ఆర్ముగ మొదలియారు
12. చొక్కప్పచెట్టి

తరువాత మరో ముగ్గుర్ని చేర్చుకొన్నారు. వారు సి. రంగనాథం, శ్రీనివాస పిళ్ళ, వెంకటపతి.

1841లో ఈ బోర్డువారు ఒక ఉన్నత విద్యాశాలను స్థాపించారు. మేస్తర్ ఐర్ బర్టన్ పవల్ అనే కేంబ్రిడ్జి పండితుణ్ణి హెడ్మాష్టరుగా నియమించారు. ప్రాచ్యభాషలు నేర్పడానికి సీతారామ శాస్త్రులు, మహాలింగయ్య, గణేశ గంగాధర శాస్త్రిగార్లను నియమించారు. బోధనా భాష ఇంగ్లీషు. అది వచ్చినవారికే ప్రవేశం. నెలకు 4 రూపాయలు విద్యార్థులు చెల్లించుకోవాలి. 67 మంది విద్యార్థులు మొదటిసారిగా చేరారు. 1841 ఏప్రిల్ 14వ తేదీనాడు ఈ విద్యా సంస్థను ప్రారంభించారు.

1842లో పచ్చయప్ప పాఠశాలను సంస్థాపించారు. 1778లో చనిపోతున్నప్పుడు పచ్చయప్ప మొదలియారుగారు దానధర్మాల కోసం లక్ష వరహాలను కేటాయించి మరణ శాసనం రాశారు. 60 సంవత్సరాలపాటు ఈ సొమ్మును ధర్మకర్తలు వినియోగించలేదు. ఆనాటి అడ్వకేటు జనరల్ సర్ హెర్బర్టు కాంప్టన్‌గారు ఇది గమనించారు. సుప్రీంకోర్టు ముందు ఈ ప్రస్తావన తీసుకువచ్చారు. పచ్చయప్ప గారి నిధిలో నుంచి విద్యాలయాల స్థాపనకు ద్రవ్యం వాడడానికి అనుమతి ప్రార్థించారు. నల్లపేటలో 1842లో పచ్చయప్ప స్కూలును ప్రారంభించారు. మొదట పాఠశాలగా ఉండి తర్వాత కళాశాలగా వృద్ధి చెందింది.

బళ్ళారి, రాజమండ్రి నగరాలలో ప్రావిన్షియల్ స్కూళ్ళను, చిత్తూరు, బరంపురంలలో జిల్లా స్కూళ్ళను నెలకొల్పారు. శ్రీకాకుళం, కర్నూలు, ఆదోని, అనంతపురం వంటి ఊళ్ళలో మిడిల్ స్కూళ్లు వుండేవి. ఉపాధ్యాయులను తయారుచేసే నార్మలు స్కూళ్ళు 6 రాష్ట్రంలో ఉండేవి.

1837లో రెవరెండు జాన్ ఆండర్‌సన్ స్థాపించిన ''ది జనరల్ ఎసెంబ్లీస్ ఇన్‌స్టిట్యూట్'' అనే విద్యాసంస్థ ఉత్తరోత్తరా క్రిస్టియన్ కాలేజీగా మారింది.

రాజధానిలోనేకాక జిల్లాల్లో మిషనరీలు చాలా పాఠశాలలు నెలకొల్పారు. 1855 నాటికి తెలుగు ప్రాంతాలలో ఈ క్రింది మిషన్ స్కూళ్లు వుండేవి.

గంజాం జిల్లా : 1. శ్రీకాకుళం - లండన్ మిషన్ సొసైటీ
2. ఛత్రపురం - ఆన్‌స్లో దొరగారిది

విశాఖ జిల్లా : 3. విశాఖపట్నం - లండన్ మిషనరీవారి ఇంగ్లీషు పాఠశాల. వారిదే బాలికల పాఠశాల

గోదావరి : 4. ఏలూరు - చర్చి మిషన్ సొసైటీ వారి బాలుర పాఠశాల

కృష్ణాజిల్లా : 5. మచిలీపట్నం - చర్చిమిషన్ సొసైటీ వారి బాలుర పాఠశాల. వారే నడుపుతున్న బాలికల పాఠశాల

గుంటూరు జిల్లా : 6. గుంటూరు - అమెరికన్ మిషన్ సొసైటీ వారి ప్రాథమిక ఆంగ్ల పాఠశాల
7. పైవారిదే ప్రాథమిక ఆంగ్ల పాఠశాల

నెల్లూరు జిల్లా : 8. నెల్లూరు జిల్లా - ఫ్రీ చర్చి మిషన్ వారి ఇంగ్లీషు బడి.
9. గూడూరు - వారిదే ఒక ప్రాథమిక పాఠశాల

కడప జిల్లా : 10. కడప - లండన్ మిషన్ సొసైటీ వారి పాఠశాల

కర్నూలు జిల్లా : 11. కర్నూలు - లండన్ మిషన్ సొసైటీ వారి పాఠశాల

బళ్ళారి : 12. బళ్ళారి - పై వారిదే ఒక పాఠశాల.

1882 నాటికే చెన్న రాజధానిలో 1,185 మిషన్ స్కూళ్ళలో 38,005 మంది చదువుకొంటూ ఉండేవారు.

పాఠ్య గ్రంథాలలో తెలుగు, ఇంగ్లీషులతో పాటు గణితం, చరిత్ర, భూగోళ శాస్త్రం, ఖగోళశాస్త్రం, రాజకీయ, ఆర్థిక శాస్త్రాలు బోధించే గ్రంథాలు ఉండేవి. ప్రతి విద్యార్థీ ప్రతి పాఠ్యాంశంలోనూ ఉత్తీర్ణుడవ్వాలి. పాసయినవారికే ఉద్యోగాలు వచ్చేవి. నాటి చదువులన్నీ మధ్యతరగతి వాళ్ల ''ఉద్యోగాలు చెయ్యడానికి - ఊళ్ళేలడానికి పనికొచ్చేవని'' భావించేవారు.

విలియం బెంటిక్కు పాలనలో ప్రిన్సిపల్ సదర్ అమీనులు, డిప్యూటీ కలెక్టర్లు వంటి కొత్త ఉద్యోగాలను సృష్టించారు. సర్కారు వారి విద్యాలయాలలో ఉత్తీర్ణులయిన వారినే ఈ హోదాలలో నియమించేవారు. నెలసరి 600 నుండి 1,000 రూపాయల దాకా జీతాలు వుండేవి.

కుంఫిణీ బావుటా క్రిందకు వచ్చిన రాజ్యాలను వివిధ పరిపాలనా విభాగాలుగా రూపొందించారు. కొన్నింటిని జిల్లాలనీ, కొన్నింటిని ఏజెన్సీలని అన్నారు. జిల్లాకు ఇద్దరు తెల్లదొరలు పెద్ద అధికారులుగా ఉంటారు. ఒకరు కలెక్టరు. రెండోవారు జడ్జి. కలెక్టరే మేజిస్ట్రేటుగా, పోలీసు సూపర్నెంటుగా పౌరరక్షణ బాధ్యతలు నిర్వహిస్తాడు. ఈ తెల్లదొరల క్రింద మరికొందరు తెల్లదొరలు 'అశిష్టాంటులు' గా పనిచేస్తారు. అయితే నేటివు ఉద్యోగులే ఈ దొరల ఆజ్ఞలను అమలుపరుస్తూ సర్కారు వ్యవహారాలను, కార్యక్రమాలను నెరవేరుస్తూ ఉంటారు.

జిల్లా కలెక్టరును హుజూరు అంటారు. ఇతని కచ్చేరీని హుజూరు కచ్చేరి అంటారు. దీనిని నడిపే బాధ్యత హుజూరు శిరస్తాదారు అనే నేటివు ఉద్యోగిది. ఇతడు జిల్లాలకు సర్వాధికారి అని పేర్కొనడంలో తప్పులేదు. తెల్లదొరలు తరుచుగా ప్రమోషన్లమీదగాని, తదితర కారణాల వల్లగానీ జిల్లాల నుండి బదిలీ అవుతారుగానీ హుజూరు శిరస్తాదారు సర్వీసు కొన్నేళ్ళపాటు, ఆ మాటకొస్తే కొన్ని దశబ్దాలపాటు ఆ పదవిలో ఉంటాడు. కలెక్టరు తన ఏలుబడిలో ఉన్న కచ్చేరీలలో ఏ నేటివునైనా నియమించవచ్చు. అలాగే తొలగించవచ్చు. అయితే హుజూరు శిరస్తాదారును మాత్రం చిత్తమొచ్చినట్టు కదిలించలేడు. ఫలానా వారిని ఈ ఉద్యోగంలో నియమించవచ్చునని శిఫార్సు చేయడం దాకానే అతని మాట చెల్లుతుంది. హుజూరు శిరస్తాదారును రెవిన్యూ బోర్డువారు నియమిస్తారు. ఇతడు 'నేటివు కలెక్టరు'గా వ్యవహరిస్తాడు. ఇతని ఆఫీసును 'హుజూరు కచ్చేరి' అంటారు. ఇతని జీతం నెలకు 280 రూపాయల నుండి 700 దాకా ఉంటుంది.

ప్రతి హుజూరు కచ్చేరీలో ఆరు శాఖలు ఉంటాయి. అన్నింటిలోనూ నేటివు ఉద్యోగులే చిన్నా పెద్దా హోదాలలో ఉంటారు. ఆ శాఖలు ఇలా ఉంటాయి.

1. శిరస్తా డిపార్టుమెంటు (సెక్రటేరియట్)
2. మున్షీ డిపార్టుమెంటు (స్థానిక భాషలో ఉత్తర ప్రత్యుత్తరాల శాఖ)
3. ఇంగ్లీషు డిపార్టుమెంటు (అకౌంటులు - కరస్పాండెన్సు)

4. ఖజానా

5. దఫ్తర్‌ఖానా (రికార్డు ఆఫీసు)

6. సాదరవారదు ఇలాకా (సామగ్రి సరంజామా సంరక్షణ)

ఈ ఆరు శాఖలలోనూ గుమాస్తాలు, మద్దతుగార్లు (సహాయకులు), ఉమేదువారీలు (జీతం బత్తెం లేని వలంటీర్లు), షరాబులు, పేష్కర్లు, జవాబ్‌నీసులు (రాయసగాళ్ళు) పనిచేస్తూ ఉంటారు. జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేటుగా పనిచేస్తున్నా ఆ శాఖకు వేరే భవనాలు, కచ్చేరీలు ఉంటాయి. ఈ 'పోలీసులైను'లో సర్దారులు, హవల్దారులు, నాయకులు, జవానులు, డఫేదారులు, దవాలా బంట్రోతులు ఉంటారు.

జిల్లాలోని హుజూరు కచ్చేరీలలాగే తాలూకాలలో 'గైబాతు కచ్చేరీ'లు ఉంటాయి. వీటిలో తాసీల్దారీ శాఖ, ఠాణాదారీ శాఖ, నమ్మక్ ఇలాకా ఉంటాయి. సముతు చావళ్ళు, సాయరు చౌకీలు (సుంకం మెట్టులు) ఉంటాయి. వీటిలో కూడా చాలామంది నేటివులు చిన్నా పెద్దా ఉద్యోగాలు చేస్తూ ఉంటారు.

న్యాయ పరిపాలన శాఖను 'జుడిషియల్‌లైను' అంటారు. వీటిలో ఫౌజుదారీ అదాలత్ (క్రిమినల్ కోర్టులు), దివానీ అదాలత్ (సివిల్ కోర్టులు) ఉంటాయి. ఆగ్జిలరీ కోర్టులలో ప్రిన్సిపల్ సదర్ అమీను (నెల జీతం 500 రూ॥), కాజీ లేక ముఫ్తీ అమీను (రూ.200)లకే నేటివు న్యాయమూర్తులు ఉంటారు. జిల్లా మునసబు కోర్టులలో నేటివులే ఫస్టుక్లాసు మునసబు (నెల జీతం 140 రూ॥), సెకండ్ క్లాసు మునసబు (రూ.115), థర్డు క్లాసు మునసబు (రూ. 100) అనే రేంకులలో న్యాయాధికారులుగా ఉంటారు.

జిల్లాలోని అన్ని రకాల కచ్చేరీలలో పుస్తకాలు కట్టి, పేనాలు చివ్వి ఇచ్చే ముచ్చీలు, సిరా తయారుచేసే మసివాళ్ళూ, దీపాలు పెట్టే మసాలిచి దివిటీవాళ్ళూ, తోలుతిత్తులలో నీళ్ళు తెచ్చే పాఖాలీలు, ఉన్నత కులాల చేతుల నుంచే తప్ప నీళ్ళు పుచ్చుకోని వాళ్ళకోసం నీళ్ళపందిరి బ్రాహ్మణులు, కచ్చేరీ ఊడ్చేవాళ్ళూ మొదలైన రకరకాల పనివాళ్ళు ఉంటారు.

కుంఫిణీ పరిపాలనలో ఎన్ని రకాల శాఖలు రూపొందాయో, ఏయే ఉద్యోగాలు ఏర్పాడ్డాయో తేల్చి చెప్పడం చాలా కష్టమైన పరిశోధనా కార్యక్రమం. అయినా రాబర్టు ఎరిక్ ఫ్రెకన్ బెర్గువంటి ప్రవీణులు పాత రికార్డులన్నీ పరిశీలించి 1857 నాటికి గుంటూరు జిల్లాలో ఉన్న నేటివు ఉద్యోగాల పట్టికను తయారు చేశారు.[4] ఈ పట్టిక ఆనాటి కుంఫిణీ రాజ్యాలలోని అన్ని జిల్లాలకూ వర్తిస్తుందని భావించవచ్చు. ఈ చిన్నా పెద్దా నౌఖరీలకు ఎంతెంత జీతాలు ఇచ్చేవారో కూడా ఆయన తెలియచేశారు. వారికి కృతజ్ఞతలతో ఈ పట్టికను ఇస్తున్నాను.

4. Robert Eric Frykenberd - "Guntur District (1788-1848)" - Clarendon Press, Oxford, 1965.

జిల్లా కచ్చేరీలలో ఉద్యోగులు
(నెలసరి జీతాలతో)

అ. హుజూరు కచ్చేరి

I. శిరస్తాఖానా (సెక్రటేరియేట్)

శిరస్తా డిపార్ట్‌మెంట్ (నేటివు అకౌంట్లు)

1.	హుజూరు శిరస్తాదార్	రూ॥ 210–700
2.	నాయబ్ శిరస్తాదార్	120–175
3.	అశిస్టాంట్ శిరస్తాదార్	100–120
4.	హెడ్ గుమాస్తా	70–100
5.	మద్దత్తుగార్ 6 నుండి 8 మంది	20–15
6.	ముంచి 6 నుండి 8 మంది	12–15

మున్షీ డిపార్టుమెంటు (నేటివు లేఖలు)

1.	హెడ్ జవాబునీస్ లేక మున్షీ	70–85
2.	అశిస్టాంట్ జవాబ్ నీస్ ఒకరు-ఇద్దరు	21–30
3.	మద్దత్తుగార్ ముగ్గురు, నలుగురు	10–14
4.	అసిష్టాంట్ మద్దతుగార్లు ఒకరిద్దరు	5–7
5.	ఉమేదు వారీలు వలంటీర్లు	జీతం లేదు

ఇంగ్లీషు డిపార్టుమెంటు (పద్దులు-లేఖలు)

1.	హెడ్ ఇంగ్లీషు ఎకౌంటెంట్	100
2.	హెడ్ ఇంగ్లీషు రైటర్	70
3.	ఇంగ్లీషు ట్రాన్స్‌లేటర్	70
4.	డిప్యూటీ ఎకౌంటెంట్	60
5.	డిప్యూటీ రైటర్	40
6.	రైటర్స్ అయిదు నుండి ఏడుమంది	17–30
7.	వలంటీర్లు	జీతం లేదు

ట్రెజరీ డిపార్టుమెంటు

1.	కేష్ కీపర్	80–100
2.	అసిష్టాంట్ కేష్ కీపర్	28
3.	హెడ్ షరాఫ్	40
4.	అసిస్టెంట్ షరాఫ్	14
5.	గుమాస్తాలు ఇద్దరు ముగ్గురు	10–20

దఫ్తర్‌ఖానా (రికార్డు ఆఫీసు)

1.	దఫ్తర్‌దార్ (ఇంగ్లీషు రికార్డు కీపర్)	35

2.	నేటివ్ రికార్డు కీపర్	30
3.	గుమాస్తాలు ఇద్దరు	15–20
4.	దఫ్తర్ బంద్ ఇద్దరు	7–10
5.	ఉమేదు వారీలు ఇద్దరు	జీతం లేదు

సాదరవారదు ఇలాకా (సామగ్రి-సంరక్షణ)

1.	జమాదారులు, ముగ్గురు దాకా	10–20
2.	ప్యూనులు అయిదారుగురు	15
3.	దళారీలు, పన్నెండుమంది పైగా	6–15
4.	ముచ్చి (పుస్తకాల బైండర్లు, పేనాలు, కాగితాలు ఇచ్చేవాళ్ళు, ఇతర శారీరక శ్రమలు చేసేవారు) ముగ్గురు	7–17
5.	మంచినీటి పందిరి బ్రాహ్మణులు ఇద్దరు ముగ్గురు	9
6.	సిరా తయారుదారులు, ఇద్దరు	7
7.	మషాల్చీ, నలుగురు	3
8.	ఊడ్చేవాళ్ళు, నలుగురైదుగురు (మగాళ్లు, ఆడవాళ్లు, కుర్రాళ్ళు)	2

II. రాబడి శాఖ

భూమి శిస్తు ఇలాకా

1.	పేష్కార్	35
2.	ఇంగ్లీషు రైటర్	30
3.	జవాబ్‌నీస్ ఇద్దరు	25–30
4.	మద్దత్తుగార్, ఎనమండుగురు	15–30
5.	అసిస్టెంట్ మున్షీ ఇద్దరు	7
6.	ఉమేదు వారీలు	జీతం లేదు

నమక్ ఇలాకా (ఉప్పు డిపార్టుమెంటు)

1.	పేష్కార్	35
2.	ఇంగ్లీషు రైటర్	30
3.	జవాబ్‌నీస్ ఇద్దరు	25–30
4.	మద్దత్తుగార్ ఇద్దరు	20–30

సాయదు ఇలాకా (సుంకం వసూలు)

1.	పేష్కారు	35
2.	మద్దత్తుగార్, ఇద్దరు	12–20
3.	జవాబ్‌నీస్, ఇద్దరు	10–15

మొతర్ఫా (ఇంటి పన్నులు) ఇలాకా

1. మద్దత్తుగార్ ఇద్దరు	12-20
2. జవాబ్‌నీస్	10

అబ్కారీ ఇలాకా (సారాయి, నల్లమందు)

1. మద్దత్తుగార్, ఇద్దరు	12-20
2. జవాబ్‌నీస్. ఒకరు. లేకపోయినా ఫరవాలేదు	7-10

రేవు సుంకాల ఇలాకా

1. మద్దత్తుగార్	12-14

స్టాంపు పత్రాల ఇలాకా

1. మద్దత్తుగార్	12-14

చిల్లర మల్లర ఇజారాల ఇలాకా

1. మద్దత్తుగార్	12

III. పోలైస్ పాలన (మేజస్ట్రేట్ శాఖ)

శిరస్తా ఖానా

1. మేనేజరు	70
2. ఇంగ్లీషు రైటర్	35
3. జవాబ్‌నీస్ (మున్షీ) ఆరుగురు పైగ్గా	14-35
4. పాఖాలి (నీళ్ళు మోసే వ్యక్తి)	12
5. శిరా తయారీ మనిషి	5
6. మషాల్చీ (దీపం మనిషి)	41

సిబ్బంది (బందోబస్తు) ఇలాకా

1. సర్దార్	20
2. హవల్దార్, ఇద్దరు	10
3. నాయక్. ఇద్దరు	7
4. ఫ్యూన్ (జవాను) 30 లేక 40 మంది	5

ఠాణా

1. డఫేదార్	10
2. దళారీ 12 నుండి 15 మంది	6-7
3. ఫ్యూను: 20 నుంచి 30 మంది	5

బందీఖానా (జైలు)

1. జైలరు	14
2. నేజానాయక్ (లేన్స్ నాయక్)	7
3. ఫ్యూను 23 నుంచి 34 మంది	5

ప్రమాణం చేయించే న్యాయశాఖ

1.	బ్రాహ్మణ పండితుడు	10
2.	ఖురాన్ ముల్లా	10
3.	జంగం	7

IV. అమాంబాపతు (జనరల్) శాఖలు

(ఈ శాఖలు సుస్థిరంగా ఏర్పాటు కాలేదు. వివిధ కచ్చేరీల వ్యక్తులు వీటిని చూసుకొనేవారు)

మరామ్మత్తు పనులు

1. తనిఖీదారులు

డాక్ తపాలా

1. పోస్ట్ మాష్టరు

ఆరోగ్యశాఖ

1. డ్రెస్సర్లు
2. టీకాల వాళ్ళు
3. మద్దత్తుగార్‌లు

ఆ. గైబత్తు కచ్చేరీలు

(తాలూకా ఠాణా కచ్చేరీలు)

I. తాహసీల్దారి శాఖ

1.	రెవెన్యూ అమీన్ (పోలీసు పనులు 60-100 అయితే 100-200)	
2.	నాయక్ అమీన్	30-50
3.	శిరస్తాదార్	14-35
4.	పేష్కార్	20-30
	ఈ మూడు ఉద్యోగాలు ఒక్కరికే ఉమ్మడిగా ఇవ్వవచ్చు	
5.	హెడ్‌మద్దతుగార్	12-17
6.	మద్దతుగార్. ఇద్దరు ముగ్గురు	10-12
7.	జవాబ్‌నీస్ ఇద్దరు ముగ్గురు	7-10
8.	మషాల్చి	3
9.	ఊడ్చేవాళ్ళు	2

II. ఠాణాదారీ శాఖ

1.	పోలీసు అమీను	40-100
2.	మద్దతుగార్	10-12
3.	జమాదార్	15-20
4.	హవల్దార్	10
5.	నాయక్	7

6.	ప్యూన్లు, ముప్ఫయినుంచి యాభైమంది	5
7.	బందిఖానా డఫేదార్	7
8.	బందిఖానా ప్యూన్లు ముప్ఫయినుంచి యాభైమంది	4

III. నమక్ ఇలాకా

1.	నమక్ ఠాణేదార్	40-60
2.	పేష్కార్	20-30
3.	గుమాస్తా	15-20
4.	మద్దత్తుగార్	12-14
5.	నవీసింద (జవాబ్‌నీస్, మున్షీ) ఇద్దరు	10-12
6.	షరాబు, ఇద్దరు ముగ్గురు	10-14
7.	కొలతలు కొలిచే మనిషి ఇద్దరు ముగ్గురు	5-7
8.	డఫేదారు, ఇద్దరు ముగ్గురు	7-15
9.	ప్యూను, 30 నుంచి 50 మంది	5
10.	మషాలిచి	3
11.	ఖారీ మరక్కల్	2.5
12.	ఉప్పు విరక్కొట్టేవారు ముగ్గురు పైగా	2.5
13.	ఊడ్చేవాళ్ళు. ఇద్దరు	2

IV. సముతు చావళ్ళు, సాయరు చౌకీలు

సముతు చావడిలు (ఇవి గుంటూరు జిల్లాలో 105 వున్నాయి)

1.	సముతుదారు	10-14
2.	గుమాస్తా	7
3.	పైగస్తీ (ఓవర్ సెల్)	5
4.	మున్షీ	5
5.	ప్యూన్లు ఇద్దరు ముగ్గురు	4

సాయరు చౌకీలలో (46 రహదార్లు 2 రేవులు)

1.	గుమాస్తా	8
2.	ప్యూను నలుగురి నుండి ఆరుగురు	4

ఇ. జుడీషియల్ కచ్చేరీలు

I. జిల్లా కోర్టు - సివిల్ శాఖ

1.	శిరస్తాదార్	100
2.	నాజిర్ (ఇన్‌స్పెక్టర్)	45
3.	రికార్డు కీపర్	35
4.	హెడ్ గుమాస్తా	24
5.	గుమాస్తా అయిదుగురు నుంచి యాభై మంది	10-21
6.	హెడ్ రైటర్ (ఇంగ్లీషు)	70
7.	రైటర్. ఇద్దరు ముగ్గురు	21-35

8.	షరాబు	10
9.	మున్షీ	7
10.	హెడ్ మెసింజర్	10
11.	మెసింజర్	5-7
12.	మషాలిచి	3
13.	ఊడ్చేవాళ్ళు. ఇద్దరు	2
II	**జిల్లా కోర్టు - క్రిమినల్ శాఖ**	
1.	రికార్డు కీపర్ (ఇంటర్‌ప్రీటర్ కూడా)	30
2.	జవాబునీస్	28
3.	గుమాస్తా	18
4.	ట్రాన్సులేటర్	50
III	**సబార్డినేట్ (ఆగ్జిలరీ) కోర్టు (1840లో)**	
1.	ప్రిన్సిపల్ సదర్ అమీను	500
2.	కాజి లేక ముఫ్తీ అమీను	200
IV	**జిల్లా మునసబు కోర్టులు**	
1.	ఫస్టుక్లాసు మునసబు	140
2.	సెకండు క్లాసు మునసబు	115
3.	థర్డు క్లాసు మునసబు	100

కోర్టులలో హిందూ పండితులను, ముస్లిం కాజీలను నియమించారు. వీరు ఆయా మతాల ధర్మశాస్త్రాల పరీక్షల్లో నెగ్గడంతో పాటు సర్కారు వారి రెగ్యులేషన్లు అన్నీ తెలిసిన వాళ్ళుగా ఉండాలి. అర్హతలున్న వాళ్ళకే ఈ పదవులు. కోర్టులలో వాదించడానికి వకీళ్ళూ లేక నేటివు ప్లీడర్లు కూడా తయారయ్యారు. వీరు కూడా పండితులలాగా, కాజీలలాగా నిష్ణాతులు కాకపోయినా కొన్ని పరీక్షలలో పాసయితే వీరికి కాలేజీ వారు సనదులు ఇచ్చేవారు. ఈ సత్తాలను చూపినవారికే కోర్టులలో వాదించే అవకాశాలు వచ్చేవి.[5]

1802లోనే కారన్‌వాలీసు ప్రవేశపెట్టిన న్యాయ విధానం అమలులోనికి వచ్చింది. జిల్లా కోర్టులు నెలకొల్పారు. ఇవి ప్రావిన్షియల్ కోర్టులకు లోబడి ఉండేవి. ప్రావిన్షియల్ జడ్జీలే పర్యటన చేస్తూ క్రిమినల్ కేసులు విచారణ చేసేవారు. 1802లోనే నేటివు కమీషనర్లకు చిన్న వ్యాజ్యాలపై తీర్పులకు నియమించారు. కొన్నాళ్ళ తర్వాత వీళ్ళు డిస్ట్రిక్టు మునసబులయ్యారు. కొన్ని అధికారాలను అదనంగా ఇచ్చారు. 1827లో ఆగ్జిలరీ కోర్టులు వచ్చాయి. నేటివు జడ్జీలకు మరికొన్ని అధికారాలు అప్పచెప్పారు. వీళ్ళనే ప్రిన్సిపల్ సదర్ అమీనులనేవారు. వీళ్ళ ఉద్యోగ బాధ్యతలు పెరిగాయి. 1843లో జిల్లా ప్రావిన్షియల్ కోర్టులు ఏర్పాటు చేశారు. సదర్ అమీను కోర్టులనే సబ్‌కోర్టులనేవారు.

5. B.B. Misra - 'The Indian Middle Classes', Oxford University Press, 1961-p.169.

వ్యాపారం చేస్తున్నప్పుడు కుంఫిణీ వారికి లాభాలు ఎంత ముఖ్యమో, పరిపాలన చేస్తున్నప్పుడు రెవిన్యూ వసూళ్ళంతకన్నా ముఖ్యమయ్యాయి. జిల్లా కలెక్టరు వీటిని ప్రజల నుండి ఎలాగైనా రాబట్టాలి. నేటివు తాసీల్దారులు ఈ వసూళ్లు చేసేవారు. నెలకు ఎనభై రూపాయలు జీతం పుచ్చుకొనే తాసీల్దార్లు కొన్ని జిల్లాలలో ఏటా లక్షా ఇరవైవేల రూపాయల పన్నులు వసూలు చేసేవారు. ఈ ఉద్యోగుల జీతాలు నెలసరి నూరు రూపాయలకు పెంచమంటే ఉత్తర సర్కారుల కమీషనర్ ఎనభై చాలన్నాడు.[6]

భారతీయుల పరిస్థితులను అర్థం చేసుకొన్న ఏ కొద్దిమందో తప్ప మిగతా తెల్లదొరలందరిదీ ఇదే మనస్తత్వం. సమస్యల పట్ల అవగాహన లేదు. తక్కువ జీతాలు చాలు అంటారు. దానికి కారణం చెప్తారు. ఏనుగుల వీరాస్వామయ్యగారు ఒక తెల్లదొరతో చేసిన చర్చ ఇలా రికార్డు చేశారు.[7] ''యీ దేశంలో బంట్రౌతులు మొదలుగా శిరస్తా వుద్యోగస్తుల వరకు జీతములు బహుస్వల్పము గనుక లోకుల వద్ద లంచాలు నిండా తీస్తారని గయా మేజిస్ట్రేటు దొర మేస్తరు జాకుసన్ దొరతో మాట్లాడునప్పుడు ప్రసక్తి వచ్చి అప్పుడు వారు చెప్పినది యేమంటే; పిడికిళ్లతో యెత్తి ఈ దేశంలో అధికారస్థులకు లోకులు లంచాలు యిచ్చేవాడికే పడియున్నందున జీతాలు మీ దేశము వలె యెక్కువ చేసినా అధికారస్థులు అడగకపోయినా వాడికె ప్రకారము లోకులు తెచ్చి యివ్వవలసిన దాన్ని యిస్తూ వస్తురు గనుక అప్పట్లో కుంఫిణీ వారికి ఎక్కువ జీతము యిచ్చే నష్టం ఒకటేగాని యెవరికిని క్షేమముండనేరదని చెప్పినాడు. బరకన్ దాసు అనే వొక ఠాణా బంట్రోతుకు యిక్కడ జీతము నెల ఒకటికి నాలుగు రూపాయలు. వాడి గుర్రము వగయిరాలకు మాత్రము నెల ఒకటికి 20 రూపాయలు సెలవు వుంటూ వున్నది. యిక్కడ జిల్లా మేజస్ట్రేటు నాజరుకు సుమారు నెల ఒకటికి నూటికి తక్కువ లేక వస్తూవున్నది. హిందుస్తానులో జుడైషైయాల్ లయనులో నల్లవాండ్లలో నాజరు వుద్యోగము సర్వోత్తమమని నిశ్చయము చేసినాను''. శిరస్తాదారు అంటే తెల్లదొరలకు రహస్య సలహాదారు. కలెక్టరు కచ్చేరి నుంచి బయటకు వచ్చే ప్రతి ఆర్డరుమీద ఇతను కూడా పక్క సంతకం పెట్టి తీరాలి. నాజర్ అంటే తనికీదారు (ఇన్స్పెక్టర్).

మన్రో మొదలుకొని మాల్కాం, మౌంట్స్టూవర్టు, ఎలిఫిన్స్టన్, బెంటిక్కు, మెట్కార్ఫ్ వంటి ఉదారస్వభావులు భారతీయులకు ఉన్నతోద్యోగాలు ఇవ్వాలన్నారు. విశాఖపట్నంలో సర్కారు వారి ఏజెంటుగా 1855-1856లో పనిచేసిన స్మాలెట్ దొరగారు నల్లవాళ్ళ జీతాలు రెట్టించడం కాదు మూడురెట్లు పెంచాలని సూచించారు. తెల్లదొరల బంగళాలో వంట చేసే నల్లకుశినీ వాడికన్నా తక్కువ జీతాలు ఒక డివిజన్ సూపర్నెంటుకు ముట్టచెప్తే నల్ల ఉద్యోగాలలో నిజాయతీ ఎలా ఉంటుందని స్మాలెట్ దొరగారు వేయవలసిన ప్రశ్నే వేశారు.[8]

---


6. Patric B. Smollet - Madras. Its Civil Administration (Being Rough notes Personal observations in (1855-1856) - London-1858 p.133.
7. ఏనుగుల వీరాస్వామయ్య - కాశీయాత్ర చరిత్ర, తృతీయ ముద్రణం, బెజవాడ, 1941 - పుట. 241.
8. Smollet ముందు పేర్కొన్న గ్రంథంలోనే పుట 131.

నేటివు తాసీల్దారీలందరూ తమ సత్ప్రవర్తనకు పూచీకత్తుగా రెండేసి వేల రూపాయలు ధరావత్తు కట్టాలని సర్కారువారు ఆజ్ఞలు జారీ చేశారు. ఇవి గట్టిగా అమలు జరిపితే డబ్బు చిక్కులు ఏర్పడుతాయి. ఏటేటా ఈ ఉద్యోగుల ఆస్తిపాస్తుల గురించి దర్యాప్తు జరిపించారు. తాము నివసించే జిల్లాలలో ఏ తాసీల్దారూ భూములు కొనుక్కోకూడదని ఆంక్షలు విధించారు. ఈ దర్యాప్తులతో, ఆంక్షలతో తాసీల్దారీలంతా విసుగెత్తి పోయారు. ప్రతి చిన్న పొరపాటుకు జరిమానాలు విధిస్తే అసలే తక్కువ జీతాలు మరీ తగ్గుతాయి. ''ప్రతి డిపార్టుమెంటూ ఒక రిటర్ను నివేదికను దాఖలు చేసుకోవాలని శ్రీముఖం పంపిస్తుంది. కాసింత జాప్యమయితే జుర్మానా వేస్తారు. ఎన్ని డిపార్టుమెంట్లకు ఆ కాగితాలు పంపగలడు?'' అని స్కాలెట్ దొరగారు మరో ప్రశ్న వేశారు.

కుంఫిణీ పాలన పట్ల అన్ని వర్గాల వాళ్ళకూ అసంతృప్తి పెరిగింది. జిల్లాలలో కొత్త కలెక్టరుగానీ, ఏజెంటుగాని వస్తాడంటే అందరికీ భయం. నలభై సంవత్సరాల సర్వీసు ఉన్న ఉద్యోగులను సైతం బర్తరఫ్ చేసేసి కోర్టుకెక్కిస్తారు. నేటివు ఉద్యోగులను చదువుకొన్న పెద్ద మనుషుల్లాగ చూడాలిగాని వాళ్ళని చిన్న నౌకర్లకన్నా హీనంగా పరిగణించకూడదని కొందరు తెల్లదొరలైనా గుర్తించడం గుడ్డిలో మెల్ల. ఇచ్చే ఉద్యోగాలకూ, వాటికై అడిగే అర్హతలకూ సంబంధం లేదు. ప్రమోషన్లు గగనం. 1858లో మద్రాసు ప్రభుత్వం వారు ఒక ఆర్డరు వేశారు. కనిస్టీబు నౌకరీని మించి ప్రమోషను కావాలంటే ఏ నేటివు ఉద్యోగయినా వ్రాత పోటీ పరీక్షలో ఉత్తీర్ణుడవాలట. ఇంగ్లీషు సాహిత్య జ్ఞానం ఎలిఫిన్‌స్టన్ దొరగారు రచించిన హిస్టరీ ఆఫ్ ఇండియా అనే గ్రంథంతో ప్రగాఢ పరిచయం ఉన్నవాళ్ళే పరీక్షకు కూర్చోవాలట. పల్లెటూళ్ళలో వీధిబడులైనా లేని కుంఫిణీ ప్రావిన్సులలో ఒక సెక్షన్ రైటరుగాని, ఎకౌంటెంట్‌గాని ఈ విద్యా యోగ్యతలు సంపాదించుకోవాలట!

''విదేశీయులం, అపరిచయస్తులమూ అయిన మనం మన రెవెన్యూ ఆదాయాల గురించి ప్రాకులాట కొంత తగ్గించి ఈ దేశ ప్రజల అవసరాల కోసం శ్రద్ధ తీసుకొంటే బాగుంటుంది... ఆంగ్లో-శాక్జన్ ప్రభువులమైన మనమూ, మన సర్కారువారు హిందూ దేశంలోని పాలక వర్గాలనూ, పాలిత వర్గాలనూ ఒకేరకంగా చూస్తామనీ, పక్షపాతం ఉండదనీ రోజూ ప్రకటిస్తూ ఉంటారు. ఆశయం గొప్పదేగాని ఆచరణ ఎలా ఉంది. చెన్న రాజధానికి సంబంధించినంత మటుకు రైతులను హీనంగా చూసి పీడిస్తున్నాం. చదువుకొన్న వర్గాల వాళ్ళను న్యూనతల పాలుచేసి అగౌరవిస్తున్నాం. నేటివు భూస్వాములను దోచుకొని ఫకీర్లను చేస్తున్నాం'' అని స్కాలెట్ దొరగారు 1858లో రాశారు.

1857లో సిపాయిల తిరుగుబాటు పేరిట తొలి స్వాతంత్ర్య సమరం జరగడానికి వేరే కారణాలు వెదకనక్కర్లేదు.



సిబ్బందితో కాలిన్ మెకంజీ

మెకంజీ, కావలి సోదరులు

అది ఏ దేశమైనా కానీండి, చరిత్ర లేని జాతి అంటూ ఏదీ ఉండదు. అయితే ఆ చరిత్రను నిక్షిప్తం చేసే పద్ధతులలో తేడాలు వుంటాయి. భారతీయుల చరిత్ర చాలా మటుకు వాగ్రూపంలోనే నిన్న మొన్నటిదాకా ఉండేది. లిఖితపూర్వకంగా లేని చరిత్రను ప్రామాణికంగా అంగీకరించలేని వ్యక్తుల దృష్టిలో భారతీయులు చరిత్రహీనులే. వాణిజ్యం కోసం మన దేశానికి వచ్చి సామ్రాజ్యాన్ని సంస్థాపించుకున్న తెల్లవాళ్ళకి వడ్డించిన విస్తరిలా మన దేశ చరిత్ర అమరలేదు. అందువల్లనే మనం చరిత్ర హీనుల్లాగ మొదట కనబడ్డాం. కానీ ఈ తెల్లదొరలే మన శాస్త్రాలూ, కావ్యాలూ, పురాణాలూ, ఇతిహాసాలూ చదవడం మొదలుపెట్టాక గతంలో మన ఘనత వాళ్ళకు కొద్ది కొద్దిగా అవగాహన అవుతూ వచ్చింది. కొందరు తెల్లవాళ్ళు చేసిన వక్ర భాష్యాలను ఖండించడానికి, వాస్తవాన్ని తెలుసుకొనడానికి భారతీయ విద్వాంసులు సైతం చారిత్రక పరిశోధనలు విస్తృతంగా చేయసాగారు.

ఇవాళ ఆంధ్రులు తమ స్థానిక చరిత్రలను పునర్నిర్మించుకొంటున్నారంటే దానికి ఈ పునాది వేసిన పుణ్యం కరనల్ కాలిన్ మెకంజీ దొరగారికి చెందుతుంది. ఈ పుణ్యకార్యానికి పురోహితులైన అదృష్టం కావలి సోదరులను వరించింది. కాలిన్ మెకంజీగారికి, కావలి సోదరులు ముగ్గురికీ ఆంధ్రదేశం ఎంతో ఋణపడి ఉంది. ఈనాటి ఈ వ్యాసం ఆ ఋణం మీద పెరుగుతూ వస్తున్న వడ్డీలో అల్పాస్వల్పాన్ని తీర్చుకొనడమే. అది తీర్చుకోలేని ఋణం.

మెకంజీ దొర తన ముప్ఫయ్యో యేట, నేటికి రెండు వందల ఏడు సంవత్సరాల క్రిందట, అంటే 1783లో మన దేశానికి వచ్చారు. తూర్పు ఇండియా కుంపిణీ వారి రాణువలో ఉద్యోగిగా ఆయన వచ్చినా ఆ రాకకు జ్ఞానతృష్ణ ముఖ్య కారణమని చెప్పాలి. భారతీయ గణిత శాస్త్రం మీద విస్తృత పరిశోధనలు చేయాలనే వాంఛ ఆయనను మన దేశానికి తీసుకువచ్చింది. పుట్టి పెరిగిన లూయిస్ ద్వీపంలోని స్టోర్నవె గ్రామంలో ఆయనకు మంచి ఉద్యోగం, అక్కడి శ్రీమంతుల ప్రాపకం లేకపోలేదు. ఆ స్కాట్లండులోని స్థానిక ప్రభువులు సంస్కారవంతులు కావడం వల్ల తాము చేరదీసిన కాలిన్ మెకంజీలో విజ్ఞాన తృష్ణను అధికం చేశారు.

లూయిస్ ద్వీపానికి ఆ రోజుల్లో లార్డు ఫ్రాన్సిస్‌గారు ప్రభువులు, ఆ వంశంలోని వాళ్ళను నేపియర్ ప్రభువులని పిలుస్తారు. వీళ్ళ మూల పురుషుడు జాన్ నేపియర్ గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు. ఈయన ''లాగర్దమ్స్'' ఘాతాంశాలను కనిపెట్టిన మేధావి. వీరికి అయిదవ తరంలోని మనుమడు ఫ్రాన్సిస్ దొరగారు తమ పూర్వీకుని జీవిత చరిత్రను వ్రాయదలిచారు. అందులో హిందువుల గురించి ప్రస్తావించాలి. ఆ అంశం మీద పరిశోధనలు జరపడానికి ఫ్రాన్సిస్ దొరగారు కాలిన్ మెకంజీ సమర్థుడని భావించారు. ఆ పనిలో నియోగించారు. స్టోర్నవె గ్రామానికి కమ్‌ప్ట్రోలర్‌గా మెకంజీ ఆ రోజుల్లో పనిచేస్తూ ఉండేవారు. పరిశోధనా పిపాస పెరిగిన మెకంజీగారు చేస్తున్న ఉద్యోగానికి రెండేసి నెలలు,

మూడేసి, నాలుగేసి నెలలు సెలవు పెట్టి గ్రంథ పఠనంలోనూ, విషయ సేకరణలోనూ పడ్డారు. మూడేళ్లపాటు ముమ్మరంగా ఈ వ్యాసంగం సాగింది. అయితే దురదృష్టవశాత్తూ ఫ్రాన్సిస్ ప్రభువు మరణించారు. ఆయన చనిపోయినా మెకంజీలో ఆయన నాటిన విజ్ఞానాంకురం చనిపోలేదు. తాను స్కాట్లండులో హిందువుల గణితంపై ప్రారంభించిన పరిశోధనలను భారతదేశంలోనే కొనసాగించాలని మెకంజీ నిశ్చయించుకొన్నారు.

అందుకు ప్రబలమైన కారణం లేకపోలేదు. ఫ్రాన్సిస్ ప్రభువుగారి కూతురూ, అల్లుడూ భారతదేశంలోనే ఉన్నారు. అల్లుడు జార్జ్‌స్టన్‌దొర నేటి తమిళనాడులోని మధురలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు. కూతురు హెస్టర్ తండ్రి తలపెట్టిన జీవిత చరిత్రను కొనసాగించాలని సంకల్పించింది. బాగా పలుకుబడి గల పెద్దల సిఫార్సులతో కాలిన్ మెకంజీ కుంఫిణీ రాణువలో ఉద్యోగం సంపాదించుకొని తిన్నగా చెన్నపట్నానికి వచ్చారు. గవర్నరుగారిని దర్శించుకొని సీమ నుంచి తెచ్చిన లేఖలను ఇచ్చారు. పదాతిదళం నుండి ఇంజనీర్ల దళానికి బదిలీ చేయించుకొన్నారు. వీలు చూసుకొని మధురకు వెళ్ళారు.

మధురలో మెకంజీ దొరగారికి మరిచిపోలేని అనుభవాలు కలిగాయి. మహత్తరమైన భారతీయ విజ్ఞాన సౌధం కళ్ళముందు కనబడింది. ఫ్రాన్సిస్ ప్రభువు కుమార్తె హెస్టర్ దొరసాని మధురలో తన గృహాన్ని ఒక పండిత కేంద్రంగా రూపొందించింది. నిష్ణాతులైన బ్రాహ్మణ విద్వాంసులను కొలువులో పెట్టుకొంది. గణిత శాస్త్రం గురించి ఎక్కడెక్కడో ఉన్న గ్రంథాలూ సేకరింప చేసింది. తన తండ్రిగారి దగ్గర పనిచేశాడని తెలిసి హెస్టర్ దొరసాని మెకంజీగారిని ఆనందంగా ఆహ్వానించింది. ఆయనను తన పరిశోధనలలో వినియోగించదలచుకొంది. తాను సేకరించిన ఆకరాలను క్రోడీకరించడానికిగాను అతడు పనికి వస్తాడని భావించింది. జాన్‌స్టోన్ దంపతులు మెకంజీని తమ యింట్లోనే అతిథిగా ఉంచుకొన్నారు. తమ కొలువులో ఉన్న వారినేకాక తదితర భారతీయ విద్వాంసులను పరిచయం చేశారు. ఈ ధీమంతుల సాంగత్యం వల్లనే భారతదేశ చరిత్ర రచనకు కావలసిన పరికరాలను వివిధ ప్రాంతాల నుండి సేకరించవచ్చుననే ప్రగాఢ విశ్వాసం మెకంజీకి కలిగింది. ఆలోచనలు ఎన్ని ఉన్నా అవగాహనకు మార్గాలూ, అవకాశాలు తక్కువ కావడంచేత కళ్ళ ఎదుట కనిపిస్తున్న భారతీయ విజ్ఞాన సౌధం గుమ్మంలోనే ఆగిపోవలసి వచ్చింది. పదమూడు సంవత్సరాలపాటు అక్కడ మెకంజీ దొరగారు పడిగాపులు పడక తప్పలేదు.

ఆ పదమూడు సంవత్సరాలను తలచుకొన్నప్పుడల్లా మెకంజీ దొరగారు చాలా బాధపడేవారు. రాణువలో కొద్దిపాటి జీతం గల ఉద్యోగం కాబట్టి సొమ్ము వెచ్చించి ఆకరాలను సేకరించే స్తోమత లేకపోయింది. పదవులు ఉన్న పెద్ద పెద్ద ఉద్యోగస్తుల పరిచయంగాని, ప్రాపకంగాని అట్టే లేదు. పటాలంతో పని కాబట్టి తరచుగా మకాములు మారడం ఉండేది. అయితే గుడ్డిలో మెల్ల ఇంజనీర్ల దళం ఆ రోజుల్లో కుంఫిణీవారు కొత్తగా స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలను సర్వే చేయాలి. భారతదేశ చరిత్రను తెలుసుకొందామని కుతూహలపడే మెకంజీ దొరగారికి మన దేశపు నైసర్గిక భౌగోళిక పరిస్థితులను

ఆకళించుకునే అవకాశం ముందుగా దొరికింది. దేశానికి వచ్చిన కొత్తలో దిండిగల్లు, కోయంబత్తూరు వంటి చోట్ల ఉన్నా ఆంధ్రుల అదృష్టం కొద్దీ తెలుగు ప్రాంతాలకే ఆయన బదిలీ అయ్యారు.

నెల్లూరు నుంచి, అటు ఒంగోలు నుంచి పడమటి కనుమలకు మార్గాలు సర్వే చేస్తున్న మజిలీలలో స్థానికులను కలుసుకొని విషయసేకరణ మొదలు పెట్టారు. చినబళ్ళ ఫకీరు చెప్పిన కంభం కైఫీయతు దొరగారు రాసుకున్నారు. నెల్లూరు పే మాస్టరు కచేరిలో ఉండే కాగితాలన్నీ చదివి హైదరు చరిత్రను క్రోడీకరించారు. గుంటూరు సర్కారును స్వాధీనం చేసుకొంటున్నప్పుడు ఆ ప్రాంతాలలో సొంత ఖర్చులమీద విషయసేకరణ చేసి ఆ భోగట్టాలన్నీ ఉన్నతాధికారులకు విన్నవించుకొన్నారు. పై అధికారులు మెచ్చుకొని ప్రమోషను కోసం సిఫార్సులు చేశారు. లెఫ్టినెంటుగా హోదా పెరిగింది. జీతం పెరిగింది.

చెన్నపట్నం రేవులో దిగిన దగ్గర్నుంచి లెఫ్టినెంటుగా ప్రమోషను రావడానికి ఆరేళ్ళు పట్టినా, మూడేళ్ళలో కెప్టెన్‌గా ప్రమోషను వచ్చింది. మైసూరు ముట్టడిలో నందిదుర్గం, సావంత దుర్గం పట్టుకొనడంలో, శ్రీరంగపట్నం యుద్ధంలో ప్రశంసనీయంగా పాల్గొనడం చేత అధికారుల మెప్పుకీ, ప్రమోషన్లకీ మెకంజీ దొరగారు నోచుకున్నారు.

కెప్టెన్‌గా నియమితులైనాక మెకంజీగారు కడప, కర్నూలు జిల్లాలలో పర్యటించారు. కృష్ణానది దాకా ఎర్రమల, నల్లమల శ్రేణులను సర్వే చేశారు. హైదరాబాదులో ఇంజనీర్ల విభాగానికి అధికారిగా నియమితులయ్యారు. 1792 నుండి 1799వ సంవత్సరందాకా ఆరేళ్లు ఈ ఉద్యోగంలోనే ఆయన ఉన్నారు. నిజాము రాజ్యాల భూగోళ పట రచనకు ఉపక్రమించారు. చాలా పరిశోధనలు చేశారు. ఖనిజాల గురించి, వజ్రాల గురించి ఆకరాలు సేకరించారు. మధ్య మధ్య యుద్ధాలలో పాల్గొంటున్నా మళ్ళా హైదరాబాదుకు తిరిగి వచ్చి భూగోళ పట రచన కొనసాగిస్తూ వచ్చారు. సింహళ ధండయాత్ర నుండి తిరిగి వచ్చాక 1796లో జీవితం సార్థకమయ్యే మహత్తర సంఘటన జరిగింది. అత్యంత ప్రతిభాశాలి అయిన ఒక ఆంధ్ర యువకునితో పరిచయం కలిగింది. ఆ పందొమ్మిదేళ్ళ కుర్రవాడిని తన గుమాస్తాగా నియమించుకొన్నా, గురువుగా మెకంజీ దొరగారు భావించారు. ఆ కుశాగ్ర బుద్ధి సాహచర్యం వల్లనే భారతీయ విజ్ఞానసౌధ ద్వార ప్రవేశంలో దొరగారు మొదటి అడుగు వేయగలిగారు. ఆ యువకుని పేరు కావలి వెంకట బొర్రయ్య.

బొర్రయ్యగారు ఉత్తర సర్కారులలోని ప్రముఖ కసుబా గ్రామాలలో ముఖ్యమైన ఏలూరులో నేటికి సరిగ్గా రెండువందల పధ్నాలుగు సంవత్సరాల క్రిందట 1776లో జన్మించారు. పదేళ్ళు వచ్చేదాకా స్వగ్రామంలోనే వీధిబడిలో చదువుకున్నారు. తర్వాత సంస్కృత కావ్యాలు అధ్యయనం చేశారు. మహామేధావి కనుక అనతికాలంలోనే స్వయంగా సంస్కృత శ్లోకాలను అల్లడం అలవర్చుకొన్నారు. ఆ రచనలోని నైపుణ్యాన్ని చూసి పెద్దలు మెచ్చుకొన్నారు. బొర్రయ్యగారి అన్నగారు నారాయణప్ప కుంఫిణీ కొలువులో ఉద్యోగిగా ఉండేవారు. ఆయన యెడల దొరలకు చాలా నమ్మకం, విశ్వాసం ఉండేవి. తన అన్నగారిలాగే పెద్ద ఉద్యోగాలు చేయాలనే సంకల్పం బొర్రయ్యగారికి

కలిగింది. అందుకు తగిన యోగ్యతలు సంపాదించాలని పారశీక హిందుస్థానీ భాషలను గట్టిగా చదివారు. ఏలూరుకు తూర్పున ఉన్న కొత్తూరు జాగీరుదార్‌గారి కాజీగారు స్వయంగా ఈ భాషలు బొర్రయ్యగారికి వాత్సల్యంతో నేర్పారు.

పధ్నాలుగో ఏడు రాగానే బొర్రయ్యగారు బందరులో ఉన్న మోర్గన్ దొరగారి ఇస్కూలులో చేరి ఇంగ్లీషు నేర్చుకొన్నారు. అక్కడ బాగా ఉత్తీర్ణులై దొరల మెప్పును పొందారు. దేశీయ పటాలానికి అధికారిగా ఉన్న కర్నల్ పియర్సు దొరగారు బొర్రయ్యగారిని చాలా అభినందించారు. ప్రోత్సాహం ఇచ్చారు. బహుశా వారి దయవల్లనే బొర్రయ్యగారికి బందరు పే మాస్టరు కచేరిలో ఉమేదువారీగా చేరగలిగే అవకాశం లభించింది. ఉమేదువారీ అంటే జీతం బత్తెం లేని అప్రెంటీస్ గుమాస్తా అన్నమాట. కుంఫిణీ కొలువులో చాలామంది యువకులు ఆ విధంగానే ఆ రోజుల్లో చేరేవారు. ఏమాత్రం రాణించినా కొద్ది జీతంతో మొదలుపెట్టి పెద్ద పదవులలోనికి వెళ్ళగలిగేవారు.

బొర్రయ్యగారు కొలువులో చేరిన వెంటనే బాగా రాణించారు. ఉద్యోగంలోని ఆనుపానులు కరతలామలకం చేసుకొన్నారు. పెద్ద దొరల విశ్వాసానికి పాత్రులయ్యారు. చాలాసార్లు ఒంగోలు, మునగాల, కొండపల్లి కసుబాలలో ఉండే సైనిక దళాలకు జీతాలు బట్వాడా చేయడానికి వేలకువేల వరహాలతో బొర్రయ్యగారిని పంపేవారు.

బొర్రయ్యగారు తమ పద్దెనిమిదో యేట మాధవాయ పాలెంలో డెంటు దొరగారి వద్ద రైటరుగా కుదురుకొన్నారు. ఇంతటి ప్రతిభావంతుడు ఇంకొకరి దగ్గర పనిచేయడం కర్నల్ పియర్స్ దొరగారికి నచ్చలేదు. నారాయణప్ప గారికీ నచ్చలేదు. తమ్ముడిని పిలిపించారు. పియర్సు దొరగారి దగ్గర యకాయకిని హెడ్ రైటరుగా బొర్రయ్యగారు నియమితులయ్యారు. ఒక ఏడాది తిరగకముందే కాలిన్ మెకంజీగారు బొర్రయ్యగారిని చూశారు. చూడగానే తమ కొలువులో హెడ్ ఇంటర్‌ప్రెటర్‌గాను, ట్రాన్సులేటరుగానూ చేర్చుకొన్నారు. ఆ తర్వాత బొర్రయ్యగారు మరే దొర దగ్గరా పనిచేయలేదు. దక్షిణ భారత దేశంలో మెకంజీ దొరగారు ఎక్కడ పర్యటించినా, ఏ యుద్ధంలో పాల్గొన్నా, ఏ సర్వే కార్యక్రమాన్ని చేబట్టినా బొర్రయ్యగారు హమేషా దొరగారి హుజూర్న ఉండవలసిందే.

మెకంజీ శిక్షణలో బొర్రయ్యగారు గణితశాస్త్రం, రేఖా గణితం, భూగోళ శాస్త్రం, ఖగోళ శాస్త్రం మొదలైనవేకాక ఇతర శాస్త్రాలూ నేర్చుకొన్నారు. పాశ్చాత్య హైందవ సంప్రదాయాల్లో ఈ శాస్త్రాలు ఏయే రీతులలో ఉండేదీ ఆకళించుకొన్నారు. వారి జ్ఞాపకశక్తి అసాధారణం కనుక వివిధ భాషలలో ప్రావీణ్యం సంపాదించుకొన్నారు. చాలా కుదురుగా భూగోళపటాలను రచించగలిగేవారు. వివిధ లిపులను అభ్యసించారు. అంతకు ముందు దొరగారు సేకరించిన తమిళ, కన్నడ, సంస్కృత శాసనాలను బొర్రయ్యగారు చదివి అర్థం చెప్పసాగారు.

బొర్రయ్యగారు మెకంజీ దొరగారి కొలువులో చేరిన కొద్దికాలానికే తన తమ్ముళ్ళు వెంకట లక్ష్మయ్యగారినీ, రామస్వామినీ దొరగారి వద్ద ఉమేదువారీగా చేర్చారు. ఈ

ఇద్దరూ ఇంగ్లీషులో ప్రావీణ్యం గలవాళ్ళే. ఈ ముగ్గురు కావలి సోదరులూ మెకంజీ దొరగారు ఎన్నాళ్ళ నుంచో ఆశించుతున్న దానిని సఫలం చేయడానికి పునాదులు వేశారు. కృషి ప్రారంభించారు.

1799లో శ్రీరంగపట్టణంపై మళ్ళా ముట్టడికి సైన్యాలు కదిలాయి. హైదరాబాదు నుండి కూచి చేసుకొన్న దళాలతో బొర్రయ్యగారు దొరగారి సరసన సాగిపోయారు. దారి పొడుగునా కలిగిన అనుభవాలను, సన్నివేశాలను వర్ణిస్తూ పద్యరూపకమైన డైరీని రాశారు. గద్వాల చేరగానే ఒక సంఘటన జరిగింది. అక్కడ సంస్థానాధిపతి సిబ్బందిలోని ఎవరో దుండగీడు మెకంజీ దొరగారి కచ్చేరీ పత్రాలను తస్కరించారు. వాటిని ఎలాగైనా సంపాదించి తెచ్చిపెట్టమని దొరగారు బొర్రయ్యగారిని పురమాయించారు. ఆ కార్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్న బొర్రయ్యగారిని గద్వాల సైనికులు చెరలో పెట్టారు. స్వయంపాకం చేసుకొనడానికి అవకాశం ఇవ్వలేదు. అభోజనంతోపాటు చాలా క్రూరహింస కూడా ప్రాప్తించింది. అయితే బొర్రయ్యగారు తమ సౌమ్యవర్తన వల్లా, సాహిత్య ప్రతిభా విశేషాల వల్లా అందరినీ మంచి చేసుకొన్నారు. గద్వాల సంస్థానాధిపతిపై పద్యాలు చెప్పి ఆయన కటాక్షాన్ని పొందారు. తన యజమానికి కచ్చేరీ పత్రాలేకాక తనకు ఘనసన్మానాన్ని కూడా ఆయన సంపాదించుకున్నారు.

శ్రీరంగపట్టణం ముట్టడిని బొర్రయ్యగారు స్వయంగా యుద్ధభూమిలో ఉండి వీక్షించారు. కోటను పట్టుకునేటప్పుడు జరిగిన బీభత్సయుద్ధ దృశ్యాలన్నిటినీ బొర్రయ్యగారు పద్యాలలో ఆవేశపూరితంగా వర్ణించారు. కోట బురుజుపై కుంఫిణీ పతాకాన్ని ప్రతిష్ఠించిన ఘట్టాన్ని అమోఘంగా గ్రంథస్తం చేశారు. ఈ రచనలు చేసినందుకు మెకంజీ దొరగారు బొర్రయ్యగారిని ప్రశంసించారు. బాగా సత్కరించారు.

టిప్పు సుల్తాన్ పతనమయ్యాక కుంఫిణీ వారు మైసూరు రాజ్యాన్ని సర్వే చేయడానికి కొందరు ఉద్యోగులను నియమించినారు. వారిపై మెకంజీ గారిని సూపర్నెంటుగా వేశారు. బెండులూరు, నివగల్లు, పీరాల మీదుగా చిత్రదుర్గం దాకా దొరగారు పర్యటించారు. బొర్రయ్యగారు అనుసరించారు. భోగట్టాలు సేకరించడానికి, కావలసినవి సంపాదించడానికీ, అవసరమైన ఏర్పాట్లు కావించడానికి బొర్రయ్యగారు ఎంతో తోడ్పడ్డారు. హానరేబిల కుంఫిణీ వారి ప్రయోజనాలు పెంపొందించడానికి దక్షిణ భారత ద్వీపకల్ప చరిత్రను స్పష్టపరిచేందుకు పనికి వచ్చే సేవలో బొర్రయ్యగారు పాల్గొన్నారు.

ఈ పర్యటనలోనే తిమ్మప్ప కథనం చేసిన ఆనెగొంది రాజుల వృత్తాంతాన్ని, హరిహరలో మధ్వ గురువుల వృత్తాంతాన్ని, నినగల్లులో భట్రాజుల వృత్తాంతాన్నీ బొర్రయ్యగారు సంపాదించి ఇంగ్లీషులోనికి అనువదించారు. వీటిని మెకంజీ దొరగారు ఉత్తరోత్తరా రాయల్ ఏషియాటిక్ జర్నల్‌లో ప్రకటించారు.

హరిహరవద్ద సర్ ఆర్థర్ వెల్లస్లీ క్రీ.శ.1800లో మహరాష్ట్ర నాయకుడు దొండయ్యను పట్టుకొన్నాడు. ఆ సందర్భంలో బొర్రయ్యగారు పద్యాలు చెప్పారు. తరువాత ఒక

సత్పురుషునిమీద ''సుత్పరుష వర్ణనం'' అనే సంస్కృత శతకాన్ని రచించారు. శ్రీరంగరాజ చరిత్రను రచించారు. ఇందులో ఉమ్మత్తూరు రాజ్య స్థాపన దగ్గర్నుంచి యాదవ రాజుల ప్రాబల్యం దాకా సవిస్తర చరిత్ర ఉంది. బొర్రయ్యగారి ప్రతిభా విశేషాలను జనరల్ కాంబెల్, కర్నల్ థామస్ మన్రో వంటి ఉన్నత సైనికోద్యోగులూ మైసూరు దివాను పూర్ణయ్యగారూ గొప్పగా శ్లాఘించారు.

బొర్రయ్యగారు ఈ పర్యటనలోనే చాలా పురాతన నాణాలను సంపాదించారు. వివిధ ప్రాచీన లిపులలో ఉన్న శాసన ప్రతిబింబాలను తీశారు. దొరవద్దనున్న ఒక హాళ కన్నడ శాసనాన్ని అక్కడికక్కడే చదివి అర్థం చెప్పారు. ఈ నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ మెకంజీగారు ఆ శాసనశిల క్రింద బొర్రయ్యగారి పేరును చెక్కించారు. ఈ శిలను కలకత్తాలోని రాయల్ ఏషియాటిక్ సొసైటీకి పంపించారు.

నిజాము రాజ్యాల దేశ పటాన్ని మద్రాసు ప్రభుత్వానికి సమర్పిస్తూ సర్వేయర్ జనరల్ పదవిని క్రొత్తగా సృష్టించమని మెకంజీ దొరగారు విన్నవించుకొన్నారు. ఈ విన్నపాన్ని సెంటుజార్జి కోట దొరతనం సీమలోని డైరెక్టర్ల బోర్డు వారికి సిఫార్సు చేశారు. 1800 సంవత్సరంలో కుంఫిణీ డైరెక్టర్ల బోర్డువారు సర్వేయర్ జనరల్ పదవిని సృష్టించడానికి నిరాకరించారు. అయితే మెకంజీ దొరగారి శ్రమకు ప్రతిఫలంగా 2400 వరహాల పారితోషికమిచ్చారు. అసలు జీతంతోపాటు నెల నెలా రెండు వందల వరహాల భత్యాన్ని మంజూరు చేశారు. ఈ ధన సహాయం వల్ల మెకంజీ దొరగారి ఆకరాల సేకరణ కార్యక్రమం మూడు పువ్వులు, ముప్ఫయి ఆరు కాయలుగా విస్తరించింది.

బొర్రయ్యగారు కొత్త గుమాస్తాలను తరిఫీదు చేయసాగారు. వివిధ ప్రాంతాలలో ఎలాగు విషయ సేకరణ చేయాలో బోధించారు. వెళ్ళిన ప్రతిచోటా దేశ చరిత్రలు, స్థానిక చరిత్రలు, భూగోళం, వైద్యం, సాహిత్యం, రసాయనశాస్త్రం, ప్రాచీన శాసనాలు, నాణాలు, ప్లానులు, డ్రాయింగులు, ప్రాచీన వస్తు సంచయాల బొమ్మలు, నమూనాలు సేకరించే విధానాలు నేర్పారు. సర్వే సూత్రాలనూ, పరిశోధనా పద్ధతులూ రూపొందించారు.

బొర్రయ్యగారు ఆరేళ్ళు మాత్రమే మెకంజీ దొరగారి దగ్గర పని చేశారు. ఈ ఆరేళ్ళలోనే ఒక జీవితకాలానికి సరిపడ్డ కృషి చేశారు. దక్షిణ భారత ఇతిహాస పరిశోధనా పితామహుడు అనే బిరుదుకు తన ఉద్దండ పాండిత్యాన్ని సంతరించుకొన్నారు. ఇంతటి ప్రతిభాశాలి దురదృష్టవశాత్తూ అకాల మరణం చెందాడు.

1803లో బొర్రయ్యగారు తమ 26వ యేట సన్నిపాతం వల్ల మరణించారు. వారి మరణానికి మెకంజీ దొరగారు మిక్కిలి వగచారు. తాము బతికున్నంత కాలం బొర్రయ్యగారిని మరచిపోలేదు. ప్రపంచం కూడా మరచిపోకూడదని బొర్రయ్యగారిని దహనం చేసిన చోట జ్ఞాపక చిహ్నంగా సముద్రతీరంలో ఒక శిలాఫలకాన్ని వేయించారు. ఆ ఫలకం 1847 దాకా మద్రాసులో ఉన్నట్టుంది. ఆ తరువాత ఎలా మాటు మణిగిందో తెలియదు. దానికోసం కొమర్రాజు లక్ష్మణరావుగారు చెన్నపట్నంలోని కొన్ని శ్మశానాలు గాలించారు. అప్పటికే అది కాలగర్భంలో—కలిసిపోయింది. లక్ష్మణరావుగారు

బొర్రయ్యగారిని దక్షిణదేశంలో పుట్టిన మొదటి ఎపిగ్రఫిస్టు అని పేర్కొన్నారు. ఉత్తర దేశంలోని శాసనాలు చదవడానికి మొదటిసారిగా ప్రయత్నించిన ప్రిన్‌సెప్ దొరగారికి ఎలాంటి గౌరవం, ఖ్యాతీ కలిగాయో అలాంటి గౌరవఖ్యాతులు ఈ ఆంధ్ర పండితునికి ఉండవలసినదని లక్ష్మణరావుగారు చెప్పారు.

బొర్రయ్యగారి అకాల మరణానికి ఎవ్వరైనా శోకించక తప్పదు. మెకంజీ దొరగారు నిరంతరం విలపించేవారని చెప్పడానికి ఒక్క ఉదాహరణ చాలు. 1817లో, అంటే బొర్రయ్యగారు పోయిన 14 సంవత్సరాల తరువాత కూడా బొర్రయ్యగారి పేరు ముందు శోకనీయుడు అనే విశేషణాన్ని వాడేవారు. బొర్రయ్యగారి సాహచర్యం తమకెంత లాభించినదీ ఒక ఉత్తరంలో వ్రాశారు.[1]

''ఒకానొక దేశీయ బ్రాహ్మణుని సాహచర్యం భారతీయ విజ్ఞాన సౌధ ద్వార ప్రవేశంలో నాచేత మొదటి అడుగు వేయించింది. అతడు శోకనీయుడైన సి.వి. బొర్రయ్య. ఆ రోజుల్లో అతడు నూనూగు మీసాల నూత్న యౌవనుడు. అత్యంత కుశాగ్రబుద్ధి. మహత్తర ప్రతిభాశాలి. తన కార్యనిర్వహణలో అన్ని వర్గాలవాండ్లను సమదృష్టితో కూడగట్టుకొని రాగల సహనశీలి. సహృదయుడు. ఈ మనుష్యుని శ్లాఘనీయ ప్రతిభా విశేషాల వల్లనే ప్రోత్సాహం వల్లనే నాకు, భారతీయ భాషాజ్ఞానం లేనివాడికి అన్నాళ్ళుగా కోరుకొంటున్నవి సంపాదించుకునే మార్గం దొరికింది. తొలిరోజుల్లో నేను సంపాదించిన కన్నడ, తమిళ శాసనాల మాట అటుంచి సంస్కృత శాసనాల వల్ల కూడా, పాత లిపులు తెలియనందువల్ల ఏ మాత్రం సమాచారం పొందలేకపోయేవాడిని. శోకనీయుడైన బొర్రయ్య ప్రజ్ఞను వినియోగించుకొన్న తక్షణమే హైందవ విజ్ఞానానికి ఒక నూతన పథకం తెరచుకొంది. అతి చిన్న వయసులోనే అతడిని నేను పోగొట్టుకొన్నా అతడు చూపిన మార్గంవల్లా, ఇచ్చిన శిక్షణవల్లా, అతని సోదరులూ, శిష్యులూ సంతోషంగా అతని పంథానే అనుసరిస్తూ ఉండడంవల్లా క్రమేణా ఒక సిబ్బందిని ఏర్పాటు చేసుకొని, అదృష్టవశాత్తూ ప్రారంభించినది అత్యధిక విజయవంతంగా కొనసాగిస్తున్న పద్ధతులలోనే, మన రాజ్యాలను పరిశీలన చేయుట జరిగించుకోవచ్చును''.

స్నేహితునికి వ్రాసిన ఈ లేఖలో ఏది రాశారో అక్షరాలా అలాగే మెకంజీ దొరగారు తమ విషయ సేకరణ వ్యాసంగాన్ని కొనసాగించారు. బొర్రయ్యగారి తమ్ముళ్ళిద్దరూ దొరగారి కొలువులోనే ఉన్నారు. పెద్ద తమ్ముడు వెంకట లక్ష్మయ్యగారు అన్నగారి అడుగుజాడల్లో నడిచారు. పరిశోధనా పద్ధతులూ, సర్వే సూత్రాలూ అన్నగారి వద్దనే నేర్చుకొన్నారు. ఆయన పెట్టిన ఒరవళ్ళనే దిద్దారు.

బొర్రయ్యగారు పోయిన తరువాత లక్ష్మయ్యగారే మెకంజీ పండితులలో ప్రధానులయ్యారు. ఇతర సంచాలకులు సేకరించిన విషయాలన్నింటిని లక్ష్మయ్యగారే వివిధ

1. తమ స్నేహితులు అలెగ్జాండర్ జాన్‌స్టన్‌గారికి 1817 ఫిబ్రవరి 1వ తేదీనాడు మెకంజీ వ్రాసిన ఉత్తరం పూర్తిపాఠం జర్నల్ ఆఫ్ రాయల్ ఏషియాటిక్ సొసైటీ - సంపుటం 1. పుట 334-43లో ఉంది.

భాగాలుగా వింగడించి అనువాదాలు చేసి దొరగారికి నివేదిస్తూ ఉండేవారు. వీటిలో ప్రభుత్వానికి పనికివచ్చే విషయాలను మెకంజీ దొరగారు ఉన్నతాధికారులకు విన్నవిస్తూ ఉండేవారు.

సీమలో ఉన్న డైరెక్టర్ల కోర్టువారు సర్వేయర్ జనరల్ పదవిని సృష్టించడానికి మొదట నిరాకరించినా, మెకంజీ దొరగారి కృషి దొరతనానికి ఎంత లాభసాటిగా ఉందో గుర్తించాక ఆ పదవిని ఏర్పాటు చేయక తప్పలేదు. ఆర్థిక, సైనిక, వాణిజ్య వ్యవహారాలకు ఉపకరించే సమాచారాలను, భౌగోళిక విషయాలను సంపాదించి నివేదించినందుకు డైరెక్టర్ల కోర్టువారు మెకంజీ దొరగారి సేవలు మెచ్చుకొన్నారు. 9,000 వరహాలు పారితోషిక మిచ్చారు. ఈ ద్రవ్యాన్ని కూడా మెకంజీ దొరగారు పరిశోధనలకే వినియోగించారు.

1808 నాటికి దొరగారి సిబ్బందిలో పన్నెండు మంది ఇంటర్‌ప్రీటర్లు ఉండేవారు. వెంకట లక్ష్మయ్యగారు హెడ్ ఇంటర్‌ప్రీటరు ట్రాన్సులేటరు, భాస్కరయ్య బ్రామిన్, కన్నడ ఇంటర్ ప్రీటర్ ధర్మయ్య, అతని కొడుకు (జైనులు), రామస్వామి బ్రామిన్, పులిగడ్డ మల్లయ్య ముతస్సద్దీ, వెంకటరావు గుమాస్తా, నిట్టల నాయన, ఆనందరావు గుమాస్తా, దరియాప్తి నారాయణరావు మరాటా మొదలైనవాళ్ళు ఆ సిబ్బందిలోని వ్యక్తులు, విషయ సేకరణకు వివిధ ప్రాంతాలకు వెళ్ళినప్పుడు ఈ పెద్ద గుమాస్తాలు దినవహిని రాసి దొరగారికి పంపేవారు. నారాయణరావు మరాటా పేరుకు గుమాస్తాయే అయినా అతనికింద ఇంకా చాలా గుమాస్తాలు ఉండేవారు. ''హైదరాబాదు సీమలో వుండే నేనున్ను, నా గుమాస్తాలున్ను చేసిన మొహనతు వహి'' అని ఆయన దొరగారికి జాబు వ్రాశాడు.

మెకంజీ దొరగారి గుమాస్తాలు పారిభాషిక పదాలు, పశుపక్ష్యాదులు, కౌలుకదపాలు, వ్యవసాయ విషయాల భోగట్టాలు కూడా సేకరించేవారు. స్థానిక చరిత్రలు స్థానికులే వ్రాయించి ఇచ్చేవారు. ఎవరు ఆ కైఫియత్ వ్రాయించినదీ తెలియచేసేవారు. ఉదాహరణకు: ''మౌజే రామరాజపల్లె ఒకటి యాదవాపురం ఒకటి కోళ్ళ గంగన్నపల్లె అంతు మూడు గ్రామాలు యొక్క హక్కుదారుడు. కాజీ కడప శహర్ సయ్యదు మహ్మదు శాహ మనుమడైన కాజీ ధుమ్మామియ్య వ్రాయించిన కైఫీయతు''

ఇంకో ఉదాహరణ ''మహారాజశ్రీ కర్నల్ కాలిన్ మెకంజి సర్వేయరు దొరగారి సముఖమునకు శ్రీ శ్యామసుందర సింగు జమీందారు తాలూకా శౌరుగడ అనేక సలాములు చేసి వ్రాయించి దాఖలు చేసిన హకీఖత్తు వగైరా.''

యాదస్తులు, కైఫియత్తులు, హకీకత్తులు, మొహనతులు వ్రాయించి పంపేవాళ్ళు తమ వ్రాతల్లో అసత్యాలు లేకపోయినా భాషాదోషాలు ఉన్నాయని తెలిసినవాళ్ళు. భేతాళ పంచశతి కథలను వ్రాసి యిచ్చిన ఆయన చివర ఇలా వ్రాశారు. ''ఈ పుస్తకం ఎవరైనా చదివేవారు, వ్రాసేవారున్ను యిందులో అక్షరాల యొక్క తప్పు ఉండినట్లైతే తెలిసినవారు చక్కగా అక్షరాలు వేసి పుస్తకం సుద్ధిచేయవలసినది. తెలిసినవారు నిందశాయరు గనుక విజ్ఞాపనము చేసుకొన్నాను.''

కొన్ని ఇతర భాషలనుండి అనువాదాలు చేసినవి కూడా ఉన్నాయి. ఉదాహరణకు ''కైఫియతు గోవ్యాఘ్రు సంవాదం కమలవాచకం అనే అరవ పుస్తకంలో వున్న ప్రకారము వాగూరిలో కృష్ణయ వద్ద వుండినది చూసి తెనిగించి వ్రాసినది.'' కొన్ని వెంకట లక్ష్మయ్యగారు స్వయంగా ఇతర భాషల నుండి ఆంగ్లంలోనికి అనువదించారు. ఉదాహరణకు List of Kings of Pandya from Thiruvilayadal. Extracted and translated by C.V. Lakshmaiah. కొన్ని రామస్వామి ఆంగ్లీకరించినవి ఉన్నాయి.

మెకంజీ దొరగారు 1815లో యావద్భారత దేశానికి సర్వేయరు జనరల్‌గా నియమితులయ్యారు. మద్రాసునుండి కలకత్తాకు తన కార్యాలయాన్ని మార్చవలసి వచ్చింది. ఫోర్టు విలియం అధికారులకు ఒక లేఖ వ్రాస్తూ దక్షిణాదిని సర్వేపనిలో గ్రంథసేకరణలో తాను తర్ఫీదు ఇచ్చినవాళ్ళలో 26 గురు దేశీయులు ఉన్నారనీ, కనీసం వాళ్ళలో నలుగురైదుగుర్ని తనతోపాటు కలకత్తా కొలువులో ఉంచుకోవాలనీ మెకంజీ దొరగారు అభిలషించారు. తన గ్రంథ సంకలనం తనతోపాటు ఉండకపోతే చెయ్యి విరిగినట్టు ఉంటుంది. లక్ష్మయ్యగారూ, వారి సోదరుడూ మొదలైనవాళ్ళు రికార్డులతో కలకత్తా రాక తప్పదు.

లక్ష్మయ్యగారి మీద మెకంజీ దొరగారికి అచంచలమైన విశ్వాసం ఉంది. తనను కనిపెట్టుకొని ఉన్న పండితుడికి ఏ లోపమూ ఉండకూడదని సర్కారు వారికి సిఫార్సు చేసి రెండు తరాల దాకా అనుభవించే హక్కులతో మద్రాసు పరిసరాల్లో ఒక గ్రామాన్ని ఇనాముగా ఇప్పించారు. 1811లోనే ఒక విల్లు రాస్తూ కావలి లక్ష్మయ్యగారికి, అతని తమ్ముడికీ తమ ఆస్తిలో పదోవంతు సంక్రమించాలని రాశారు. ఈ విల్లు రాయడానికి ఒక కారణం ఉంది. 1811లో జావా ద్వీపంపై దండయాత్రకు కుంఫిణీ సైన్యాలు కదులుతున్నాయి. అందులో మెకంజీ దొరగారు ఉన్నారు. జావాలో ఏది ఏమౌతుందో అని విల్లు రాశారు.

నిజానికి జావా ద్వీపంలో అనుకోని సంఘటనే జరిగింది. తమ అరవయ్యో ఏట ఆయన పెళ్ళి చేసుకొన్నారు. మిస్ పెట్రోనెల్లా జొకిమీనా బార్టెల్సు అనే డచ్చి వనితను చేపట్టారు. ఈమె సింహళద్వీపంలోని ట్రింకోమలీలో పుట్టింది. జావా దండయాత్ర ముగిశాక భార్యతో భారతదేశానికి దొరగారు వచ్చారు. మెకంజీ దొరగారు దేశాంతరం వెళ్ళినప్పుడు లక్ష్మయ్యగారు స్వస్థలానికి వెళ్ళి చాలా లావాదేవీలలో పడ్డారు. ఆర్జన ఎంత ఉన్నా ఆదుకోవలసిన కుటుంబాలు ఏలూరులో, బందరులో, చెన్నపట్నంలో ఏడెనిమిది ఉండేవి. కావలి వారికి జమీందారీ కుటుంబాలతో సంబంధ బాంధవ్యాలు ఉండేవి. లక్ష్మయ్యగారి తోడపుట్టిన పడుచును విస్సన్నపేట జమీందారుకిచ్చి పెళ్ళి చేశారు. బొర్రయ్యగారు తన సోదరికి ఎన్నో రుణాలిచ్చి వాటిని రాబట్టుకోడానికి దావా వేశారు. ఈ కేసు ప్రీవీ కౌన్సిల్ దాకా వెళ్ళింది. ఇచ్చిన రుణాలకు మించుమలె విస్సన్నపేట జమీందారీ లక్ష్మయ్యగారి కుమారుడికి ఎట్టకేలకు 1867లో సంక్రమించింది. ఇతరులకు రుణాలు ఇవ్వడమేకాదు లక్ష్మయ్యగారు రెండు చేతులా అప్పులు చేసేవారు. ఒకసారి రుణం తీర్చలేక జైలులో పడ్డారు. సాహిత్య విషయాల్లో ఎంత సౌమ్యులో లావాదేవీల్లో లక్ష్మయ్యగారు అంత లిటిగెంట్.

ఈ సంగతులన్నీ మెకంజీ దొరగారికి తెలుసు. అయినా ఆయనకు లక్ష్మయ్యగారిపట్ల సానుభూతే తప్ప మరేం లేదు. ''ఇరవై సంవత్సరాలుగా నా దగ్గర కొలువు చేస్తున్న పండితుడు నిర్దోషి అని నమ్మకుండా ఉండలేను'' అని దొరగారు స్నేహితులకు ఉత్తరాలు రాశారు. ''విశ్వాసపాత్రుడైన సేవకుడిని అతని విరోధుల దయాధర్మాలకు విడిచిపెట్టడానికి నాకు ఇతోధిక సాక్ష్యం, ఇంతకు మించిన గొప్ప సాక్ష్యం కావాలి. నన్ను నమ్ముకొని ఉన్నందుకు అతని శత్రువులలో కొందరికి కడుపుమంట అని నాకు తెలుసు'' అని ఆయన ''నన్ను కనిపెట్టుకొని ఉండటంచేత ఈ మానవుడు ఎన్ని కష్టాలు పడుతున్నాడో చూడు!'' అని వాపోయారు.

ఎన్ని కష్టాలు వచ్చినా లక్ష్మయ్యగారు తమ ఉద్యోగ నిర్వహణలో ఎన్నడూ మారలేదు. దొరగారు తర్ఫీదు ఇచ్చిన నేటివు సర్వేయర్లు కొలువు . మానుకొని పోతున్నప్పుడు లక్ష్మయ్యగారే అడ్డుపడి ఆ పరిస్థితిని తప్పించారు. కలకత్తాలో దొరగారిని, ఆయన ముప్పై ఎనిమిదేళ్ళుగా సేకరించిన సంకలనాన్నీ కనిపెట్టుకొని ఉండేవారు. మెకంజీ దొరగారి సంకలనం వివరాలు విన్నా చాలు ఒక్క మనిషి ఇంత ఎలా సేకరించారా అని ఆశ్చర్యం వేస్తుంది.

పధ్నాలుగు భాషలలో 16 లిపులలో ఉన్న 1568 గ్రంథాలు
264 సంపుటాలలో ఎక్కించిన 2070 స్థానిక చరిత్రలు
77 సంపుటాలలో సంకలనం చేసిన 8076 శాసనాలు
6218 నాణాలు, 2630 శిల్పాల చిత్రాలు, 106 విగ్రహాలు
79 పురాతన భవనాల ప్రతిరూపాలు, 40 పురాతన శిథిలావశేషాలు.

ఇవీ మెకంజీ సంగ్రహంలోని వివరాలు. జీవితకాలంలో ఇన్ని సేకరించినా మెకంజీ దొరగారు కొద్దిగానే పరిశోధనా వ్యాసాలు వ్రాశారు. వీటిలో శ్రీశైలంలోని ఆలయ విశేషాలు, అమరావతి స్థూప వివరాలు, దక్షిణ భారతదేశంలోని జైన స్థానాల వివరణ, అనెగొంది రాజుల చరిత్ర మొదలైనవి చెప్పుకోదగ్గవి. వీటిని ఏషియాటిక్ రీసెర్చెస్ పత్రికలో ప్రచురించారు. తన సంకలనం అంతా దగ్గర పెట్టుకొని చరిత్ర రచన చేద్దామనుకొన్నా భారతదేశంలో అది కుదరలేదు. వృద్ధాప్యం, అనారోగ్యం, విశ్రాంతి లేకపోవటం, ఇతర విఘ్నాలు వారి చరిత్ర రచనా వ్యాసంగాన్ని ఆపివేశాయి. స్వదేశానికి వెళ్ళి రచనలు చేద్దామనుకొన్నారు.

భారతదేశంలో ఒకసారి అడుగుపెట్టిన తరువాత ఆయన స్వదేశానికి వెళ్ళనే వెళ్ళలేదు. తల్లిదండ్రులను, అన్నదమ్ములను, చుట్టాలను, పక్కాలను చూడనేలేదు. ఆయన తల్లిదండ్రుల ముగ్గురు సంతానంలో రెండోవారు. ఒక్కరే తోడబుట్టిన పడుచు ఉంది. నాలుగు దశాబ్దాలపాటు వీళ్ళతో చూపులు లేవు. అయితే తోడబుట్టినవాళ్ళతో, బంధుమిత్రులతో, స్వగ్రామంలోని సంపన్న వ్యక్తులతో ఆయన ఉత్తర ప్రత్యుత్తరాలు తొలినుంచీ జరుపుతూనే ఉన్నారు. 1792 నుండి ఆయన రాసిన లేఖల సంకలనం ఎడింబరో నగరంలోని స్కాటిష్ రికార్డు ఆఫీసులో నేటికీ సురక్షితంగా ఉన్నాయి. వీటి ప్రతులు మెకంజీ స్వగ్రామము స్టోర్నవే లోని గ్రంథాలయంలో కూడా ఉన్నాయి.

స్వగ్రామం స్టోర్నవేలో తమ కుటుంబం స్వగృహాన్ని మార్చి మళ్ళా నిర్మించడానికి తన సోదరునికి మెకంజీ ధనం పంపించారు. వాళ్ళ ఇంటి పక్కన నివేశన స్థలాలను కూడా కొని గృహాన్ని విశాలంగా కట్టించాలని అభిప్రాయపడ్డారు. తాము సేకరించిన వివిధ వ్రాత ప్రతులను ఆధారం చేసుకొని స్వగ్రామంలో, స్వగృహంలో తమ జీవన సాయంత్రంలో పరిశోధనలు చేయాలనీ, గ్రంథాలు రచించాలనీ మెకంజీ ఆశించారు. భార్యతో కలిసి స్వదేశానికి వెళ్ళడానికి నిశ్చయించారు. తాము ఏ నౌకలో వచ్చేదీ స్వగ్రామంలోని మిత్రులకు చాలా ముందుగానే తెలియచేసి లండన్ రేవులో కలుసుకోమని ఉత్తరం రాశారు. అయితే స్వదేశానికి ఆయన తిరిగి వెళ్ళలేదు.

1821 మే ఏడవ తేదీన తమ 68వ ఏట మెకంజీ దొరగారు బెంగాల్లో మరణించారు. రమారమి నలభై సంవత్సరాల్లో 60 వేల వరహాలు వ్యయం చేసి ఆయన సేకరించిన ఆకరాలను బెంగాలు సర్కారువారు 40 వేల వరహాలు పెట్టి వారి భార్య దగ్గర్నుంచి కొన్నారు.

మెకంజీ దొరగారు ద్రవ్యార్జన కూడా బాగానే చేశారు. ఎంత ఉదారంగా ఎవరికి సహాయం చేసినా దుబారా ఖర్చులు చేయలేదు. తమ్ము ఆశ్రయించుకొన్న వారికి భారతదేశంలోనూ, స్వదేశంలోనూ తమ తర్వాత ఫించన్లు అందేటట్టు చూశారు. భార్యకూ, ఆమె సోదరికి వెళ్ళవలసిన వాటాలు వెళ్ళాక స్టోర్నవే గ్రామంలో ఉన్న మెకంజీగారి చెల్లెలు మేరీ వాటాకు 30,000 (ముప్ఫయివేల పౌండ్లు) నగదు వచ్చింది. ఆమె ఆ ద్రవ్యాన్ని గ్రామవాసులకు ఉపయోగపడేటట్టు ఏర్పాట్లు చేసింది. తన సోదరుని స్మారక చిహ్నం ఒకటి తమ గ్రామానికి అయిదుమైళ్ళ దూరంలో 'ఐ' అనే ప్రదేశం దగ్గరున్న సెంట్ కొలంబా చర్చి వద్ద ఒక పాలరాతి ఫలకపై శాసనం చెక్కించింది.[2] ఇప్పటికీ ఎంత శిథిలావస్థలో ఉన్నా ఆ స్మారక చిహ్నాలు అక్కడ ఉన్నాయి. 1983లో నేను స్టోర్నవే గ్రామానికి వెళ్ళి వాటిని చూశాను. మెకంజీ దొరగారి స్మృతికి తెలుగువారి శ్రద్ధాంజలి సమర్పించాను.

మెకంజీ దొరగారు పోయాక కొన్నేళ్ళదాకా లక్ష్మయ్యగారు కలకత్తాలోనే ఉన్నారు. సేకరణ సూచీలను తయారుచేసి ఆ గ్రంథాలనూ, కాగితాలనూ ఒక క్రమంలో పెట్టారు. విల్సన్ పండితుడు ఈ సంకలనానికి కేటలాగు తయారు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆయన లక్ష్మయ్యగారి సహాయంతోనే ఆ పని నిర్వహించారు. ఉత్త కేటలాగులు తయారుచేస్తే మెకంజీ దొరగారి ఉద్దేశాలు నెరవేరవు. తన యజమాని ఆశయాలను సఫలం చేయడానికి తనకు అవకాశం ఇవ్వమని లక్ష్మయ్యగారు అర్జీలు పెట్టుకున్నారు. తన గోడు అరణ్యరోదనమని నిశ్చయించుకొని మద్రాసుకు తిరిగి వచ్చేశారు.


లక్ష్మయ్యగారు ఆశాభంగంతో చెన్నపట్నానికి వస్తే వెంకట రామస్వామి కలకత్తాలో ఒక వెలుగు వెలిగాడు. ఆనాడు నగరంలోని ప్రముఖులందరినీ దర్శించుకొన్నాడు. పరిచయాలు చేసుకొన్నాడు. తన పుస్తక ప్రచురణకు చందాలు వసూలు చేశాడు. అలాగ విరాళాలు ఇచ్చిన ప్రముఖులలో రాజా రామమోహనరాయ్, ద్వారకానాథ్ ఠాగూర్,

2. చూ॥ ఛాయాచిత్రాలు


భోలానాథ్ మిశ్రా, ఓంచరణ బెనర్జీ, లాడ్లి మోహన్ ఠాగూరు వంటి ప్రఖ్యాతులున్నారు. భారతీయులనేకాక తెల్లదొరలను కూడా యాచించి వెంకట రామస్వామి వెంకటాధ్వరి రచించిన విశ్వగుణాదర్శ చంపును ఆంగ్లీకరించి 1825లో ప్రకటించాడు. దీనిని కలకత్తా సుప్రీంకోర్టులో సీనియర్ జడ్జి అయిన సర్ ఫ్రాన్సిస్ వర్క్‌మన్ మెక్‌నాటర్ దొరగారికి అంకితమిచ్చాడు. మెకంజీ దొరగారి కొలువులో ఉన్నప్పుడు సేకరించిన ఆకారాలను ఆధారం చేసుకొని దక్కన్ కవుల చరిత్ర అనే గ్రంథాన్ని రాశాడు. దానిని గవర్నర్ జనరల్‌గారైన విలియం బెంటిక్ ప్రభువుకే అంకితమిచ్చాడు. ఈ గ్రంథ ప్రచురణకు కూడా చందాలు ప్రోగు చేశాడు. ఇదే గ్రంథాన్ని మళ్ళా 1847లో బొంబాయిలో సర్ ఎర్స్కయిన్ పెర్రీగారికి అంకితమిచ్చాడు. బొంబాయిలోని ప్రముఖుల నుంచి చందాలు పోగుచేశాడు. తాను రాజా రామమోహన్‌రాయ్ గారి మిత్రుడనని చెప్పుకొని ఆంధ్ర దేశంలో తెల్లదొరల దగ్గర చందాలు దండిన దాఖలాలు కూడా ఉన్నాయి.[3]

రామస్వామిలాగ లక్ష్మయ్యగారు నోరుపెట్టుకొని బతికే లక్షణాలు గలవాడు కాదు. ఆర్థిక ప్రతిఫలం లేని గౌరవాలు ఎన్నో ఆయనకు వచ్చాయి. మద్రాసు నగరంలోని సాహిత్య సాంస్కృతిక జీవితంలో ఆయన ముమ్మరంగా పాల్గొన్నారు. భారతీయ విద్యల పట్ల, విశ్వవిజ్ఞానం పట్ల అభిరుచిగల తెల్లదొరలు స్థాపించుకొన్న మదరాసు లిటరరీ సొసైటీలో సాధారణ సభ్యులుగానే కాక కార్యవర్గ సభ్యులుగా కూడా ఆయన ఎన్నికయినారు. 1833లో జరిగిన నెలసరి సమావేశాలలో ఆయన పాల్గొన్నట్టు సొసైటీ


మెకంజీ స్వగ్రామానికి ఐదుమైళ్ళ దూరంలో ఉన్న సెంట్ కొలంబా చర్చి శిథిలాలు



3. Thomas, Mrs Julia:Letters from Madras during 1836-1839 by a Lady. London 1844. 1846-1861. 3వ ముద్రణలోని 22వ లేఖలో 1838 నవంబరు 19నాడు రాసిన భాగంలో పేరు చెప్పకపోయినా చందాలు దండిన రామమోహనరాయ్‌గారి స్నేహితుడు రామస్వామి కావచ్చు.



మెకంజీ స్మారక ఫలకం ఉన్న కట్టడం



మెకంజీ సోదరి వేయించిన స్మారక ఫలకం

మినిట్సు వల్ల తెలుస్తూంది. ఈ సాహిత్య సంఘంలో మైసూరు, తంజావూరు, తిరువాన్కూరు, పుదుక్కోట మహారాజులూ, ఆర్కాటు, కర్నూలు నవాబులూ గౌరవ సభ్యులుగా ఉండేవారు. ఇతర భారతీయులను మూడవ తరగతి సభ్యులుగానే చేర్చుకొనేవారు. నేటివులలో కార్యనిర్వాహక సభ్యులుగా ఒక్క లక్ష్మయ్యగారే కనబడుతున్నారు.

ఈ గౌరవంతోపాటు మరొక అసమాన గౌరవం లక్ష్మయ్యగారికి లభించింది. తెల్లవాళ్ళ ఒరవడిలో హిందువులు కూడా చెన్నపట్నంలో ఒక సాహిత్య సంఘాన్ని 1834లో స్థాపించుకొన్నారు. ఏడుగురు పండితులు, ఆరుగురు కరస్పాండింగ్ శ్వేత సభ్యులు, 15 మంది పోషకులు, 12 మంది ఉపాధ్యక్షులు, ఒక కార్యదర్శి, ఒక డిప్యూటీ కార్యదర్శి, 13 గురు మేనేజింగ్ కమిటీ సభ్యులు, ముగ్గురు అనువాదకులు, 6గురు ఉపాధ్యక్షులూ ఉన్న హిందూ లిటరరీ సొసైటీకి కావలి లక్ష్మయ్యగారిని ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. చెన్నపట్నం రాష్ట్రంలో స్థాపించిన మొట్టమొదటి భారతీయ సాహిత్య సంఘానికి తొలి ప్రెసిడెంటుగా ఉంటూ అంతమందిచేత గౌరవాలు అందుకొనడం అసాధారణ సన్మానం, అందుకు లక్ష్మయ్యగారు అన్నివిధాల తగినవారు. హిందూ లిటరరీ సొసైటీ వివరాలు.

హిందూ లిటరరీ సొసైటీ – మదరాసు

పండితులు:

అయ్యా శాస్త్రిగళ్
వడపూరి దీక్షితర్ వాజపేయయాజి
యన్. కృష్ణమాచార్యర్
ఆర్. గురుమూర్తి శాస్త్రులు
ఆదిశేషయ్య సిద్ధాంతిగళ్
నరసింహ శాస్త్రులు
టి. వెంకటాచల మొదలియార్

కరస్పాండింగ్ మెంబర్లు:

George Norton Esq
Col. Montieith K.L.S.; T.M. Lane Esq
Lt. T.S. Taylor
T.G. Taylor Esq
Lt. Mcphison
Lt.M.J. Rawlandson

Patrons :

ఎం. వెంకటస్వామి నాయుడు
సి. రాఘవా చెట్టియార్
బి.వి. రామానుజులు నాయుడు
సి. శ్రీనివాస పిళ్లె
ఎ. నమశ్శివాయ సెట్టి
ఎల్. అరుణాచల చెట్టి
రాజసభీవర్ధమాన యువరాజుగారు
పి. చెంగల్వరాయ పిళ్ళె
ఎల్. వెంకటపతి నాయుడు (కోశాధిపతి)
డాక్టర్ డబ్ల్యు.ఎన్. స్వామి నాయుడు
ఎం. కేశవులు నాయుడు
సి. ఏకాంబర మొదలియార్
పి. శివశంకరపాండ్యా
వి. అప్పలస్వామి మొదలియారు
ఎం. షణ్ముగరాయ పిళ్ళె

ప్రెసిడెంటు :

కావలి వెంకటలక్ష్మయ్యగారు

వైస ప్రెసిడెంట్లు :

వై. వీరాస్వామి అయ్యగారు
వి. రాఘవాచార్యర్
సి మీనాక్షి అయ్యగారు
సి. ఆర్ముగ మొదలియారు
పి. గురుస్వామి నాయుడు
ఎం.వి. అన్నాస్వామి మొదలియారు
సి. కేవశ పెరుమాళ్ళ పిళ్ళె
పి. కృష్ణమ నాయుడు
ఎం.ఎ. పార్థసారథిరావు
డి. పెరుమాళ్ళు నాయుడు
సి. చొక్కప్ప చెట్టియార్
సి.వి. రామస్వామి అయ్యగారు

సెక్రటరీ :

ఎం.ఎ. పార్థసారథిరావు

డిప్యూటీ సెక్రటరీ :

సి. రామస్వామి అయ్యర్

మేనేజింగ్ కమిటీ :

ఎం. సోమసుందర మొదలియారు (సీనియర్ మెంబరు)
పి. ఆగస్తీశ్వర మొదలియారు
ఆర్. దేశికాచార్లు
ఎన్.సి. వీరాస్వామి చెట్టియార్
డి.ఎస్. రామానుజులు నాయుడు
పి. కొండ్రాయ చెట్టియారు
డి. నారాయణస్వామి మొదలియారు
పి. వెంకటస్వామి మొదలియారు
డబ్ల్యు. దేవనాయక మొదలియారు
సి. వెంకటరెడ్డి నాయుడు
వి. నరసింగయ్య బ్రామినీ
సి. వెంకటాచల చెట్టియారు
ఎం. ఎల్లయ్య చెట్టియారు (సెక్రటరీ)

ట్రాన్సులేటర్లు :

సి. రంగయ్య నాయుడు – తెలుగు
పి. బాలు పిళ్ళె – తమిళం
వి. కిష్ణారావు – మరాఠా

పై అరవైమంది సభ్యులతో చెన్నపట్నంలో క్రీ.శ. 1834లో సంస్థాపించిన హిందూ లిటరరీ సొసైటీ గురించి వివరాలు మద్రాసు నుండి వెలువడే అసైలమ్ మద్రాసు ఆల్మనాక్ 1835వ సంవత్సరం సంపుటంలో ఉన్నాయి. ఈ సంస్థలో నల్లవాళ్ళతోపాటు తెల్లవాళ్లు కూడా కరస్పాండింగు మెంబర్లుగా ఉండడం ఆనాటి సాహిత్య సాంస్కృతిక జీవనంలోని సౌమ్య సంబంధాల నిదర్శనం. ఇంతమంది విద్యావంతుల మధ్య ప్రెసిడెంటుగా మన్ననలు పొందిన కావలి వెంకటు లక్ష్మయ్యగారి ఔన్నత్యం శ్లాఘనీయం.

అయితే సన్మానాలు తిండి పెట్టవు. ఉదర పోషణకు లక్ష్మయ్యగారు తెల్లదొరసానులకు తమిళ పాఠాలు చెప్పే మునిషిగా వృత్తి స్వీకరించారు.[4] నెలకు అయిదు వరహాల చొప్పున జీతం. వాళ్ళకు నచ్చిన సమయాల్లో చదువు చెప్పాలి. ఎంత ఓపిక ఉన్నా ఇది లక్ష్మయ్యగారి తత్త్వానికి సరిపడని వ్యాసంగం. మెకంజి దొరగారి సంకలనంలో దక్షిణ భారతదేశానికి సంబంధించిన వాటిని చెన్నపట్నానికి సర్కారు వారు పంపించి వేశారు. ఈ సంకలనం దగ్గర పెట్టుకొని మెకంజీ దొరగారి ఉద్దేశాల మేరకు పని

4. Thomas Mrs. Julia లేఖల గ్రంథం. 3వ ముద్రణ ప్రతిలోని 11 జనవరి 1837 నాటి 6వ నెంబరు ఉత్తరంలో ఈ విషయం ఉంది.

కొనసాగించాలనీ అందుకు తమకు అవకాశాలు ఇవ్వమని లక్ష్మయ్యగారు మళ్ళీ సర్కారు వారికి అర్జీలు పెట్టుకున్నారు. వీటిని దొరతనంవారు రాయల్ ఏషియాటిక్ సొసైటీకి పంపారు. అక్కడ ఒక కమిటీవారు లక్ష్మయ్యగారి అభ్యర్థనలను పరిశీలించి ఆయన అర్హతలను శంకించారు. కమిటీ వారి అభిప్రాయాన్ని సెక్రటరీగా ప్రిన్‌సెప్ దొర చెన్న రాజధాని దొరతనానికి తెలియచేశాడు. ఇంతకీ లక్ష్మయ్యగారు రాయల్ ఏషియాటిక్ సొసైటీ కరస్పాండింగ్ సభ్యులు. మద్రాసు లిటరరీ సొసైటీలో తెల్లదొరలతో బాటు సమానంగా కార్యవర్గ సమావేశాలలో పాల్గొనేవారు.[5] ఆ సంఘానికి ఇతోధిక సేవలు చేస్తున్నవారే. మెకంజీ దొరగారి ఆశయాలు, ఆలోచనా క్రమాలు తెలిసినవారు. అయినా మెకంజీ సంపుటాలపై చేయవలసిన పనిని రివరెండు టైలరు దొరగారికి అప్పగించారు. లక్ష్మయ్యగారు హతాశులయ్యారు.

లక్ష్మయ్యగారితోపాటు ఒకే రక్తం పంచుకొని పుట్టిన రామస్వామి మాత్రం హాయిగానే ఉన్నాడని చెప్పాలి. అమ్ముడుపోయే పుస్తకాలు అచ్చువేయడంలో ఆయన అందెవేసిన చెయ్యి. పందొమ్మిదో శతాబ్దం రెండో దశాబ్దంలో ఆయన కలకత్తాలో ఉండి రెండు ఇంగ్లీషు గ్రంథాలు అచ్చువేసి ధనానికి ధనం, సన్మానాలకు సన్మానాలు పొందాడు. మూడో దశాబ్దంలో మద్రాసులో ఉండి మరో రెండు ఇంగ్లీషు గ్రంథాలను ప్రచురించాడు. ఒకటి మూలికా సంకలితం అనే ఆయుర్వేద గ్రంథం; రెండోది పాకశాస్త్రం లేక సూపశాస్త్రం అనే వంటల పుస్తకం. దీనిని ఉత్తర సర్కారులందుండే సరస్వతీబాయి అనే ఒకానొక జమీందారిణి తెలుగులో రచించింది. తెల్లదొరల కోసం దీనిని రామస్వామి ఇంగ్లీషులోనికి అనువదించాడు.

రామస్వామి గ్రంథాలకు చాలా గిరాకీ ఉండేది. 'A Digest of Different Castes of India with an account of them' అనే గ్రంథాన్ని ఆయన రాశాడు. దీనికోసం రామస్వామి పుస్తకాలను ఇతర ప్రచురణ కర్తలు ఉత్తరోత్తరా పలుమారులు పునర్ముద్రించారు. మెకంజీ సంపుటాలవల్ల ఆనాడే లాభాలు పొందినవాడు రామస్వామి ఒకడే. మెకంజీ దొరగారు తవ్వి మన తలకెత్తిన చారిత్రక సంపదను ఇంకా మనం సద్వినియోగం చేసుకోలేదు. ఆ కైఫీయతులన్నీ కాకపోయినా, సగమైనా అచ్చుపడలేదు. తన కాలం నాటికే ఆ సంపుటాలు తిరిగి వ్రాయించి చక్కగా బైండు చేయించారు. ఇందులో సగం కూడా ప్రకటితం కాలేదు. తెలుగు చరిత్రకూ, సాహిత్యానికీ ఇంత సంపదను ఇచ్చిపోయిన మెకంజీ దొరగారిపైన, ఆయన్ని నమ్ముకొన్న కావలి సోదరులపైన సమగ్ర పరిశోధనలు జరగలేదు.

మౌలికమైన ఆకరాలతో గ్రంథరచన చేసే డాక్టరు మంగమ్మగారిలాంటి పరిశోధకులే "Nothing much is known about the parentage, childhood and education of Colin Mackenzie' అంటూ రాస్తే ఇక ఇతరుల గురించి చెప్పనక్కర్లేదు. ''కర్నల్ కాలిన్ మెకంజీ - ఫస్టు సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా'' అనే పేరుతో 1952లోనే మెకంజీ వంశంలోని ఒక వ్యక్తి డబ్లుయూ మెకంజీ ఒక గ్రంథం రాశారు. ఇందులో కాలిన్

5. The Madras Journal of Literature and Science. Vol. I (అక్టోబరు 1833-డిసెంబరు 1834), పుటలు 40, 42, 194 వగైరాలు.

మెకంజీగారి జీవిత విశేషాలన్నీ పూసగుచ్చినట్టు ఉన్నాయి. ఈ పుస్తకాన్ని చూసినవారు బహు కొద్దిమందే. దీనిని నేను పాతికేళ్ళ కిందట ఇండియాలోనే మద్రాసులోని కన్నెమెరా గ్రంథాలయంలో చదివాను. 1983లో నేను మెకంజీ స్వగ్రామమైన స్టోర్నవేకు వెళ్ళినప్పుడు ఈ గ్రంథం ప్రతిని ఒకటి గ్రంథాలయంవారు నాకు బహూకరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ని విశ్వవిద్యాలయాలు ఉన్నాయిగాని ఏ ఒక్కదాంట్లో కర్నల్ కాలిన్ మెకంజీపై సిద్ధాంత వ్యాసం వ్రాయడానికి ఏ ఒక్కరూ ప్రయత్నిస్తున్నట్లు కనబడదు. ఎవరైనా ఆ పనికి పూనుకొంటే నాకన్నా సంతోషించేవాడు ఉండడు.

మన పరిశోధకులు డాక్టరేటు కోసం పరిశోధనలు చేస్తున్నప్పుడే కొంచెం శ్రద్ధ వహిస్తారు కాబోలు. మిగతా రచనలలో ఇదుగో పులి అంటే అదుగో తోక అనే విధంగా కొందరు తొందరపడుతున్నారు. రాజారామమోహనరాయ్‌గారి ప్రార్థన సమాజంలో రోజూ ఇద్దరు తెలుగు బ్రాహ్మణుల వేదపఠనంతో సమావేశాలు ప్రారంభమయేవని నేను చదివిన సంగతి ఒక పరిశోధకునికి చెప్పాను. ఆకరాలు ఇచ్చాను. అలాగే కావలి రామస్వామి రామమోహన్‌రాయ్‌గారి దగ్గర తన పుస్తకానికి చందా వసూలు చేశాడని కూడా చెప్పి ఆకరాలు చెప్పాను. ఇకనేముంది? రామమోహన్‌రాయ్‌గారి ప్రార్థన సమాజంలో కావలి వెంకటరామస్వామి వేదపఠనం చేసేవాడై ఉంటాడని ఆ పరిశోధకుడు బరితెగించి రాసేశాడు. కావలివారు స్మార్త బ్రాహ్మణులేకాని నియోగులు. వేదాధ్యయనం చేసినవారిలా కనబడరు. ఇతోధిక సాక్ష్యాలు లేనిదే ఈ విషయాల్లో తొందరపడడం మంచిది కాదు (పండిత శివనాథశాస్త్రిగారు రచించిన 'హిస్టరీ ఆఫ్ బ్రహ్మ సమాజ్ (1వ సంపుటం)లో బ్రాహ్మణేతరుల కంటపడకుండా పక్క గదిలో కూర్చుని ఇద్దరు తెలుగు బ్రాహ్మణులు వేద పఠనం చేసేవారని రాశారు. వారి పేర్లను ఇవ్వలేదు).

రామస్వామి రచనలను కూడా చాలా ఓపికగా స్పెల్లింగుల దగ్గర్నుంచీ పరిశీలించితే ఎన్నో విషయాలు బయటపడతాయి. ఉదాహరణకు రామస్వామి తాము Areveti నియోగులమని చెప్పాడు. మామూలుగా ఆరువేలవారనే మాట ప్రచారంలో ఉన్నదేకాని రామస్వామి ప్రయోగంవల్ల నియోగుల పుట్టుపూర్వోత్తరాల గురించి కొంత సాక్ష్యం కనబడుతోంది. ఆరివీటి, ఆరెవీటి అనే మాటలు మహారాష్ట్ర సంబంధాన్ని తెలియచేస్తాయి.

శ్రద్ధగా అధ్యయనం చేస్తే మెకంజీ సంపుటాలూ, వారి పండితులైన కావలి సోదరుల జీవితాలూ చాలా విషయాలను విశదపరుస్తాయి.

కావలి బొర్రయ్యగారు శోకనీయుడైతే, లక్ష్మయ్యగారు శ్లోకనీయులు. మెకంజీ సంపుటాలు అవలోకనీయాలు.

డాక్టర్ జాన్ లీడెన్

ప్రాచ్యలిఖిత గ్రంథాలయాలు పరిశోధకుల పాలిటి పెన్నిధులు. సాహిత్య విషయాలు స్థానిక చరిత్రలు, సాంఘిక వ్యవస్థలు మొదలైన అంశాలపైన బహుళార్థ సాధకాలైన ఆకరాలను ఈ పుస్తక సంచయాల నుంచి ఓపికతో సమీకరించవచ్చు. మద్రాసులోని ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో నిక్షిప్తమై ఉన్న అక్షీణ సంపదలను కందుకూరి వీరేశలింగం గారి కాలం నుంచి నేడు వివిధ విశ్వవిద్యాలయాలలో సిద్ధాంత వ్యాసాల కోసం కృషి చేస్తున్న అసంఖ్యాక పరిశోధక విద్యార్థుల దాకా ఎందరెందరో వాడుకొన్నవారే. ఇంకా వాడుకోదగ్గవారే. అయితే ఈ గ్రంథాలయంలో చోటుచేసుకొన్న గ్రంథాలను ఆదిలో సేకరించి జాతికి బహూకరించిన వారి పేర్లు కొందరికే కొద్దిగా తెలుసు.

పధ్నాలుగు భాషలలో, పదహారు లిపులలో ఉన్న 1568 గ్రంథాలనూ, 264 సంపుటాలలో ఎక్కించిన 2070 స్థానిక చరిత్రలనూ, 8076 శాసనాలనూ, ఇంకా ఎన్నో ఇతర ఆకరాలనూ మెకంజీ దొరగారు తమ నాలుగు దశాబ్దాల సర్వీసులో సేకరించారు. ఈ సంపదలో చాలా భాగం చెన్నపట్నంలోని గ్రంథాలయానికి చేరింది. మెకంజీ దొరగారిలాగే బ్రౌను దొరగారు కూడా నిర్విరామంగా సంపాదించిన 2,440 సంపుటాలలో 1,273 గ్రంథాలు తెలుగు లిపిలో ఉన్నవే. ఈ ఐశ్వర్యం కూడా చెన్నపట్నంలోని గ్రంథాలయానికే సంక్రమించింది. ఈ ఇద్దరు మహనీయుల గ్రంథ సంకలనాల గంగా యమునా స్రవంతులలో మరొక చరితార్థుని గ్రంథ సంచయ సరస్వతి అంతర్వాహినిగా ఈ ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ప్రవహిస్తోంది. అతని పేరు డాక్టర్ జాన్ లీడెన్ (1775-1811). ఈయన ఒక మరుగుపడిన మాణిక్యం. ఇతని చరిత్ర తెలుసుకొనడం సాహితీపరుల కర్తవ్యం.

మెకంజీ, బ్రౌను దొరలలాగే డాక్టర్ లీడెన్‌గారు కూడా కుంఫిణీ ఉద్యోగిగా మన దేశానికి వచ్చారు. 1803 ఆగస్టు 19వ తేదీనాడు చెన్నపట్నంలో ఆయన అడుగుపెట్టినది మొదలు 1811 ఆగస్టు 28 తేదీనాడు ఆయన మరణించిన దాకా ఆ తొమ్మిదేళ్లు ఆయన సాగించిన విజ్ఞాన యాత్ర రెండు జీవితాలకు సరిపోతుంది. ఈ తొమ్మిదేళ్లలో ఆయన తెలుగు, తమిళ, కన్నడ లిపులలో ఉన్న ఎన్నో గ్రంథాలను సేకరించారు. ఆయన బహుభాషావేత్త. ప్రపంచంలోని ముప్ఫయి భాషలను ఆయన నేర్చుకొన్నాడు. అయిదు భాషలలోనికి సువార్తను అనువాదం చేశారు. ఆయన ఎడింబరో విశ్వవిద్యాలయంలో చదువుకొన్న విద్వాంసుడు. సహజంగా కవి. మంచి వక్త.

జాన్ లీడెన్ సంపన్నుల కుటుంబంలో పుట్టలేదు. అతని తండ్రి ఒక గొర్రెల కాపరి. ప్రాథమిక పాఠశాలలోనే మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకొన్న జాన్ లీడెన్‌కు ఉన్నత విద్యలు నేర్చుకొనే అవకాశం వచ్చింది. సెలవుల్లో కూడా అధ్యయనం చేసేవాడు. స్కాట్లాండ్ దేశపు ఈ యువకుడు స్కాండినేవియన్ భాషలను సైతం నేర్చుకొన్నాడు. హీబ్రూ, అరబిక్, పెర్షియన్ భాషలలో ప్రావీణ్యం సంపాదించాడు. కేవలం భాషలనేకాక శాస్త్ర విషయాలను కూడా అభిమానించేవాడు. వైద్యశాస్త్రంలో ఉత్తీర్ణుడై డాక్టర్ వృత్తికి

పట్టభద్రుడయ్యాడు. వివిధ తత్వశాస్త్రాలతోపాటు పారమార్థిక విషయాలలో కూడా కృషి చేశాడు. 1798లో మత ప్రచారం చేయడానికి చర్చి అధికారులు అనుమతిస్తూ జాన్ లీడెన్‌కు లైసెన్సు సైతం ఇచ్చారు.

విశ్వవిద్యాలయంలో చదువుకొంటున్నప్పుడే ఆయన సాహిత్య సంఘాలలో వక్తగా పేరు తెచ్చుకొన్నాడు. సాహిత్య పత్రికలలో రచనలు చేసేవాడు. కవిత్వం చెప్పేవాడు. ఎందరో సాహిత్యవేత్తలు అతని స్నేహితులు. కవిగా, నవలాకారునిగా, సాహిత్య శిఖరంగా పేరు తెచ్చుకొన్న సర్ వాల్టర్ స్కాట్ (1771-1832) గారికి ఈయన స్నేహితుడు. స్కాట్లాండ్ దేశపు జానపద గేయగాథలు, వీరగాథలు సేకరించడంలో లీడెన్‌గారు సర్ వాల్టర్ స్కాట్ గారికి ఎంతో తోడ్పడ్డారు. 1802లో ఆర్నెల్లపాటు వాల్టర్ స్కాట్‌గారి పత్రిక లీడెన్‌గారి సంపాదకత్వంలో వెలువడింది. అందులో వాక్య, పద్య రచనలను ఆయన చేశారు. ఎన్నో గేయ రచనలలో తన సృజనాత్మక శక్తులను లోకానికి చాటాడు.

తూర్పిండియా కుంఫిణీవారి బోర్డ్ ఆఫ్ కంట్రోలు డైరెక్టరుగా రైట్ హానరబుల్ హెన్రీ డండాస్ అత్యున్నత స్థానంలో ఉండేవారు. కుంఫిణీ ఉద్యోగాలు వేయడంలో ఆయన నిర్ణయాలు తిరుగులేనివి. రైట్ ఆనరబుల్ విలియం డండాస్‌గారు జాన్ లీడెన్ ప్రతిభావిశేషాలను గుర్తించి కుంఫిణీ కొలువులో ఆ యువకునికి అసిస్టెంటు సర్జన్ ఉద్యోగం వేయించారు. మద్రాసుకు పంపించారు.

భారతదేశానికి ప్రయాణం చేస్తున్నప్పుడు ఓడలోనే జాన్ లీడెన్‌గారు ప్రాచ్య భాషలను చాలా పట్టుదలగా నేర్చుకొన్నాడు. 1803 ఆగస్టు 15వ తేదీనాడు చెన్నపట్నం రేవులో దిగారు. మద్రాసు జనరల్ ఆస్పత్రిని నడిపే బాధ్యతలను స్వీకరించారు. కేవలం వైద్యునిగానేకాక వైద్యశాస్త్ర పరిశోధనలలో కూడా ఆయన నిపుణుడని అధికారులు గుర్తించారు. ఆయన సేవలను సద్వినియోగం చేసుకొనడానికి తగిన నియమాకం ఒకటి చేశారు.

ఆ రోజుల్లో టిప్పుసుల్తాన్‌ను ఓడించాక దఖలుపడిన పరగణాల సర్వేకు కుంఫిణీవారు కాలిన్ మెకంజీ దొరగారిని నియమించారు. ఒక నిపుణుల బృందాన్ని ఆయనకు సిబ్బందిగా ఇచ్చారు. ప్రకృతిశాస్త్ర పరిశోధనల నిమిత్తం జాన్ లీడెన్‌గారిని మెకంజీ సహచరునిగా పంపారు. ఇద్దరూ స్కాట్లాండ్ దేశీయులే. ఇద్దరికీ సమానమైన అభిరుచులే ఉన్నాయి. ఇద్దరి విజ్ఞాన తృష్ణకు అంచులేదు. ఈ సర్వేలో లీడెన్‌గారు వివిధ పరగణాలలోని కొండలు, వాటిలో దొరికే ఖనిజాలు, లోహాలూ, అవి రోగనివారణకు ఎలా పనికివచ్చేదీ పరిశోధించారు. శిరా సుబా లోని దేశీయుల ఆచార వ్యవహారాలూ, శరీర స్వభావాలూ, వాటివల్ల రాగల రుగ్మతలూ, ఈ సీమలో పండే పంటలూ, అవి పండే కాలాలూ, కార్తెలూ, ఏ పంట తర్వాత ఏవి పండించేవారో మొదలైన విషయాలేకాక ఆ సీమలో మాట్లాడే భాషలూ, వాటి పరస్పర సంబంధాలూ ఆ భాషల విద్యావంతుల పుస్తకాలూ, మొదలైనవాటిని క్షుణ్ణంగా తెలుసుకొన్నారు. గ్రంథాలను సేకరించారు. నోట్సును విపులంగా రాసుకొన్నారు.

1804-5 సంవత్సరంలో కొంతకాలంపాటు మెకంజీదొరగారూ, లీడెన్‌గారూ చాలా ఉత్సాహంగా పరిశోధనలు చేశారు. ఇద్దరికీ ప్రగాఢమైన స్నేహం ఏర్పడింది. కుంఫిణీవారు ఒక విశాల సామ్రాజ్యాన్ని నిర్మించుకొంటూ ఉంటే మెకెంజీగారూ, లీడెన్‌గారూ తమ మేధస్సులలో విజ్ఞాన సామ్రాజ్యాలను నిర్మించుకొంటున్నారు. ఎనలేని గ్రంథ సంచయాన్ని విడివిడిగా సేకరించసాగారు. అయితే ఇద్దరి సాహచర్యం కొద్దికాలంలోనే ముగిసింది. అనారోగ్య కారణాలవల్ల లీడెన్‌గారు సర్వే పనుల నుండి విరమించుకోవలసి వచ్చింది. మళ్ళా ఎప్పుడైనా కలుసుకొందాం అని స్నేహితులు విడిపోయారు.

మైసూరు వాతావరణం లీడెన్‌గారికి పడలేదు. అందుచేత ఉద్యోగ విరమణ చేశారు. ఆరోగ్యం కోసం శ్రీరంగపట్టణం, మలబారు కోస్తా, తిరువాన్కూరు అక్కడ నుంచి పెనాంగ్ వెళ్ళారు. ఈ ప్రయాణాలలో కూడా ఆయన ఎంత జబ్బుగా ఉన్నాసరే ఊరుకొనలేదు. సాహిత్య దృష్టితో పరిశోధనలు చేశారు. వెళ్ళిన ప్రతిచోటా, ఆగిన ప్రతి ఊళ్ళో సాహిత్య సంబంధమైన సేకరణలు చేశారు. శ్రీరంగపట్టణంలో మంచం పట్టి గదిలోంచి కదలడానికి వీల్లేని స్థితిలో కూడా ఆయన సంస్కృత భాషను చదువుకొన్నారు. పారశీకం, హిందూస్థానీ భాషలలోంచి కథలను అనువాదం చేస్తూ పొద్దుపుచ్చారు.

ఆరోగ్యం కోసం చేస్తున్న ప్రయాణాలలో కూడా లీడెన్ పరిశోధనలు మానలేదు. వెళ్ళిన ప్రతిచోటా దేవాలయాలు సందర్శించేవారు. శాసనాల ప్రతిబింబాలు తీసుకొని అనువాదాలు చేసేవారు. చూసిన ప్రతి ఊళ్లో భారతీయుల చరిత్ర, ఆచారాలు, మత నియమాలూ తెలిపే ఆకరాల గురించి భోగట్టాలు చేసేవారు. కొచ్చిన్, క్విలన్, తిరువాన్కూరుల పర్యటన తర్వాత పెనాంగ్‌కు వెళ్తున్నప్పుడు మలయా భాషలు అభ్యసించారు.

పెనాంగ్‌లో ఉన్నప్పుడు "ఇండోచైనా దేశంలోని జాతులు, భాషలు, వాళ్ళ సాహిత్యాలు" అనే అంశంపై విపులమైన వ్యాసం రాశారు. ఇది ఏషియాటిక్ రిసెర్చెస్ సంపుటాలలో ప్రచురితమైంది (సంపుటం నెం.10). మలయా నుంచి 1806లో ఆయన తిరిగి భారతదేశానికి వచ్చేశారు. ఈసారి బెంగాలు చేరారు. కలకత్తాలో స్థిరపడ్డారు. ఇండో-పెర్షియన్, ఇండో-చైనీస్, దక్కనీ భాషలపై తాను చేసిన పరిశోధనలను పొందుపరుస్తూ వ్రాసిన విస్తృతమైన వ్యాసాన్ని ఆయన ప్రభుత్వానికి 1807లో అందచేశారు. ఆయనను ఏషియాటిక్ సొసైటీ సభ్యునిగా చేర్చుకొనడంతోపాటు కలకత్తాలోని ఫోర్టు విలియం కళాశాలలో హిందూస్థానీ భాషకు ప్రొఫెసర్‌గా నియమించారు. 1811 దాకా ఆచార్యునిగా పనిచేశారు. ఈ ఉద్యోగానికి అదనంగా కలకత్తాలో జడ్జిగా కూడా విధులు నిర్వహించారు.[1]

ఇంతలో జావా ద్వీపంపై దండయాత్ర జరిగింది. కుంపిణీ సేనలు లార్డ్ మింటో నాయకత్వాన వెళ్ళాయి. మింటోగారికి దుబాసీగా లీడెన్‌గారు కూడా వెళ్ళారు. ఇదే జావా దండయాత్రలో పాల్గొనడానికి కాలిన్ మెకంజీ దొరగారు కూడా వెళ్లి జయించిన

---

1. Cassell's Encyclopedia of Literature. Vol.II (p. 1167)

ప్రాంతాలు సర్వేచేశాడు. మళ్ళా ఎప్పుడేనా కలుసుకొందామనుకొన్న పాత మిత్రులు మెకంజీగారూ, లీడెన్‌గారు జావాలో కలుసుకొన్నారు. జావాలో ఉద్యోగ నిర్వహణతోపాటు సాహిత్య పరిశోధనలు, గ్రంథ సేకరణ కొనసాగించారు. జీవితాన్ని విజ్ఞానం కోసమే అంకితం చేసిన లీడెన్‌గారు విజ్ఞాన సముపార్జనలోనే దుర్మణం పొందడం జరిగింది.

బటేవియా నగరంలోని ఒక గ్రంథాలయంలో చాలా ప్రాచ్యదేశపు గ్రంథాలున్నాయని, అవి చాలా ముఖ్యమైనవనీ లీడెన్‌గారు విన్నారు. వాటిని పరిశీలించడానికి యకాయకిని వెళ్ళారు. పబ్లిక్ భవనాలలో ఒక పెద్ద గదిని చాలా కాలంగా మూసి ఉంచారు. దాని ఎత్తు చాలా తక్కువ. కిటికీలు ఉన్నాయో లేవో. ఆ గదినిండా డచ్చి కుంఫిణీ వారి సామగ్రీ, జావా ద్వీపంలోని అపూర్వ వస్తువులూ ఉన్నాయి. గది ఎంతోకాలం నుంచి మూతపడి ఉండడం వల్ల లోపల గాలి స్తంభించిపోయింది. తలుపు తెరిచీ తెరవగానే ఉత్సాహం కొద్దీ లీడెన్‌గారు లోనికి ప్రవేశించారు. గాలి పారకుండా వెళ్ళడంవల్ల లోపల ఉన్న విషవాయువులను పీల్చారు. ఆ గదిలోంచి బయటికి వచ్చాక చలిజ్వరం ఒక్కసారిగా కమ్ముకున్నాయి. మూడు రోజుల్లో ఆయన 1811 ఆగస్టు 28వ తేదీనాడు బటేవియాలో చనిపోయారు.

ఆయన తన జీవితకాలంలో 2106లో సంపుటాలలో విషయసేకరణ చేశారు. ప్రాచీన ఆధునిక భాషలు నేర్చుకొనడంలో ఆయనకు అసమానమైన ప్రతిభ ఉండేది. తాను నేర్చుకొన్న భాషలలో పరస్పర సంబంధాలు, సామ్యాలు కనిపెట్టిన ఘనుడు. తన సంకలనాన్ని దగ్గర పెట్టుకొని ఎన్నో భావిపరిశోధనలు చేయాలనుకొన్నాడు. అది కుదరలేదు. అతని తల్లిదండ్రులు బీదవారు. ఒకవేళ తాను మరణిస్తే తన గ్రంథ సంకలనాలను అమ్మి ఆ సొమ్ము తన తల్లిదండ్రులకు ఇవ్వమని ఆయన విల్లు రాశాడు. కుంఫిణీవారు ఆ కోర్కెను నెరవేర్చారు. లీడెన్‌గారి గ్రంథాలను లండన్‌లోని ఇండియా ఆఫీసు గ్రంథాలయానికి చేర్చారు.

లీడెన్‌గారి అకాల మరణానికి, అందులోనూ దుర్మరణానికి నాటి పాశ్చాత్య సాహిత్యలోకం ఎంతగానో విలపించింది. బొంబాయి లిటరరీ సొసైటీలో ఎర్స్కయిన్‌గారు ఒక ప్రశంసా ప్రసంగం చేశారు. ఎందరో విద్యావంతులు కలిసికట్టుగా శతాబ్దాలపాటు చేయదగ్గ సేవను ఎనిమిదేళ్ళలో లీడెన్‌గారు యూరోపుకు చేశారని ఆ వ్యాసం ప్రస్తుతించింది. లీడెన్‌గారు వివిధ భాషల వర్గీకరణకు ఎనలేని సౌకర్యాలు కలిగించారు. లాక్ హార్డుగారు రచించిన 'లైఫ్ ఆఫ్ స్కాట్' అనే గ్రంథంలో లీడెన్‌గారి వ్యక్తిత్వం గురించీ, వైదుష్యం గురించి విపులంగా విశదపర్చారు. 1875లో లీడెన్‌గారి కవితలూ, కథాగేయాలూ గ్రంథరూపంలో ప్రచురితమయ్యాయి.

లీడెన్‌గారి గ్రంథ సంకలనాలను కుంఫిణీవారు కొనడమైతే కొన్నారుగాని 1812 నుండి ఆ గుట్టలు ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో కట్టలు కట్టలుగా పడి ఉన్నాయి. వాటిని తెరచి చూసే నాథుడు లేడు. 1834లో బ్రౌను దొరగారు మూడేళ్ళ సెలవుమీద

స్వదేశానికి వెళ్ళినప్పుడు ఈ గ్రంథ సంచయాన్ని చూశారు. తెలుగు, కన్నడ లిపులలో ఉన్నవాటిని పరిశీలించారు. ప్రొఫెసర్ విల్సన్ దొరగారి అభ్యర్థన మేరకు 1837 నాటికి ఈ గ్రంథాలకు ఒక కేటలాగును బ్రౌను దొరగారు తయారు చేశారు. ఈ వ్రాతప్రతులన్నింటినీ లండన్‌లో మురగపెట్టడంకన్నా వీటిని ఉపయోగించుకొనే మద్రాసుకు పంపడం ఉత్తమమని కుంఫిణీ వారికి సలహా ఇచ్చారు. కుంఫిణీవారు అప్పటికి కృతజ్ఞతలు చెప్పి సరిపెట్టుకొన్నారు.

ఏడేళ్ల తరువాత 1843లో కుంఫిణీ వారికి వేడి పుట్టింది. లీడెన్‌గారి గ్రంథ సంచయంలోని కొంత భాగాన్ని మద్రాసుకు పంపిస్తున్నామని ఉత్తరం రాశారు. లండన్‌లో ఉన్న చాలా పుస్తకాలకు వాటి పేర్లను తెలిపే ముఖపత్రాలు లేవు. తెలుగు, కన్నడ భాషలలో ఆ గ్రంథాలున్నాయి. వాటినన్నింటినీ మద్రాసు పంపించితే ఇక్కడి స్థానిక దేశీయ పండితుల సహాయంతో టైటిల్ పేజీలను పొందుపరచి గ్రంథాలను సమగ్రం చేయడం వీలవుతుందని బ్రౌను దొరగారు లిటరరీ సొసైటీ కమిటీ ద్వారా లండన్‌కు తెలియచేశారు.[2] కొత్త కేటలాగును తయారు చేయించాలని చెప్పారు.

1844 సంవత్సరం మార్చి 10వ తేదీనాడు లండన్‌లోని కుంఫిణీవారు లీడెన్ గ్రంథాలు పెూలు మొత్తం మద్రాసుకు పంపడానికి నిశ్చయించినట్టు, పంపుతున్నట్టు లేఖ రాశారు.[3] గ్రంథాలు సురక్షితంగా 1844 సెప్టెంబరు మాసంలో మద్రాసు చేరాయి. బ్రౌను దొరగారు ప్రయత్నాలు సఫలమైనందుకు సంతోషించారు. లీడెన్ సంకలనాన్నే బ్రౌను దొరగారు లండన్‌లో చూసి కేటలాగు తయారు చేశారని, వాటినే మద్రాసుకు తెప్పించారని ఎథీనియం పత్రిక (3 జనవరి 1885) సంచికలో ఆర్.ఎమ్. మెక్‌డోనాల్డుగారు తెలియచేశారు.[4]

లీడెన్‌గారి సంకలనంలో మొత్తం 2106 సంపుటాలు ఉన్నట్టు ఇంతకు ముందు తెలుసుకొన్నాం. వీటిలో 1304 సంస్కృత గ్రంథాలు వివిధ లిపులలో ఉన్నాయి. తెలుగు లిపిలో ఉన్నవి 272 అని లెక్క తేలింది. 802 ప్రాదేశిక భాషా గ్రంథాలున్నాయి. వీటిలోనూ తెలుగు లిపిలో ఉన్నవి 108. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్న వ్రాతప్రతులలో ఏవేవి లీడెన్‌గారి సేకరణలో ఇవాళ చెప్పడం అంత తేలిక విషయం కాదు. మెకంజీ, బ్రౌను దొరల గంగాయమునలలో లీడెన్‌గారి గ్రంథాలయ సరస్వతి అంతర్లీనమై పోయింది.[5]

---

2. M.J.L.S.Vol.XIII Part II (p.168)
3. M.J.L.S. పై సంపుటంలో అదే పుటలో.
4. Literary Autobiography of C.P. Brown. p.101
5. ఈ వ్యాసంలోని వివరాలు ప్రాథమికంగా ఒక ఆకరం నుండి సేకరించినవి. అది 'డిక్షనరీ ఆఫ్ నేషనల్ బయోగ్రఫీ, వాల్యూమ్ నెం.11, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్సు, లండన్, 1937-38. ఇందులోని 1094-95 పుటలలో 'Leyden' గారి జీవిత చరిత్ర ప్రచురించారు. ఈ ఆకరంలో లేని ఇతర భోగట్టాలను ఇదే వ్యాసంలో ఇతర అధోజ్ఞాపికల్లో సూచించాను.

సి.పి. బ్రౌను - సాహిత్య క్రౌను

బాల్యంలో

అది ఇవాళ అతిశయోక్తి అనిపించవచ్చు. అసత్యంలాగా కనపడవచ్చు, అయితే తెలుగు సాహిత్యం విషయంలో ఒకానొక దొరగారు చెప్పిన ఒక మాట వాస్తవానికి విరుద్ధం కాదు. ''ఒంటి చేతిమీదుగా ఏ సాహిత్యానికైనా మళ్ళీ ప్రాణం పోయడం, అందులోనూ ఒక విదేశీయుడు ఆ పని చేయడం కూడా దుష్కరమైన కార్యం. 1825లో తెలుగు సాహిత్యం చచ్చిబడి ఉంది. ముప్పయి సంవత్సరాలలో నేను దానిని బతికించి నిలబెట్టాను''. ఈ మాటలన్నది ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను దొరగారు.

ఆయన ఆనాడు పూనుకోబట్టి దేశం నలుమూలలా చెల్లాచెదురుగా వివిధ వ్యక్తుల వద్ద ఉపయోగపడుతూనో, నిరుపయోగంగానో ఉన్న వివిధ సాహిత్య ప్రక్రియలలో ఉన్న తెలుగు గ్రంథాలన్నీ ఒకచోటకు చేరాయి. విభిన్న తాళపత్రాలలో, విలక్షణమైన పాఠభేదాలతో 'లేఖక తప్పుల'తో నిండి ఉన్న కావ్యాలను ఆయన కాగితాలమీదకు ఎక్కించి, పాఠభేదాలు గుర్తించి, పండితుల చేత తీర్పు చేయించి తెలుగువాళ్ళకు తెలుగు సాహిత్య సంపదను దానం చేసిన ఉదారస్వభావుడు, దాతకెవరూ ఋణపడరు. సర్వదా కృతజ్ఞులై ఉంటూ, పేరు చెప్పుకొనడం, అతని చరిత్రను తెలుసుకొనడం శ్రేయోదాయకం. తెలుగు సాహిత్యానికి ప్రాణం పోసిన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను దొరగారు భారతదేశంలోనే కలకత్తాలో జన్మించారు.

క్రీ.శ. పద్దెనిమిదో శతాబ్ది నాలుగోపాదంలో కలకత్తా పాశ్చాత్య సమాజంలో అత్యధిక సంఖ్యాకులు విచ్చలవిడిగా పచ్చి విలాస జీవితాలు గడుపుతున్నా, కొద్దిమంది విద్యావంతులైన తెల్లదొరలలో, తాము ఏ దేశాన్ని పాలిస్తున్నారో ఆ దేశపు సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక విషయాలను అధ్యయనం చేయాలనే కాంక్ష జనించకపోలేదు. భారతదేశంలో ఆనాటి అధికార భాషగా ఉన్న పారశీకాన్నే కాక భారతీయుల ధర్మశాస్త్రాల, ప్రముఖ కావ్యాల ప్రధాన భాష అయిన సంస్కృతాన్ని అధ్యయనం చేసిన పూజ్యులు ఆనాటి ఆద్యులే.

సర్ విలియం జోన్స్ (1746-94), ఛార్లెసు విల్కిన్స్ (1750-1836), హెన్రీ థామస్ కోల్‌బ్రూక్ (1765-1837), జె.బి. గిల్‌క్రిస్టు (1757-1841), డాక్టర్ విలియం కేరీ (1761-1834), జార్జి అబ్రహామ్ గ్రియర్‌సన్ (1851-19.....) మొదలైన ప్రాచ్య భాషల కోవిదులు ఆనాడు కలకత్తాలో ఉండేవారు.

సర్ విలియం జోన్స్‌గారు బహుభాషాకోవిదులు. న్యాయశాస్త్రవేత్తగా గొప్ప వ్యాఖ్యాన గ్రంథాలు ఇంగ్లండులోనే రచించారు. 1783లో 'సర్' బిరుదాన్ని ఇచ్చి ఇండియాకు జడ్జిగా పంపారు. 1783 నుండి 1794 దాకా పదేళ్ళు ఇండియాలో ఉంటూ సంస్కృతాన్ని కరతలామలకం చేసుకొన్నారు. గ్రీకు, లాటిన్ భాషలకూ సంస్కృతానికీ గల బంధుత్వాన్నీ, సంస్కృత ప్రాశస్త్యాన్నీ ఉగ్గడించారు. 1784లో ఏషియాటిక్ సొసైటీని

స్థాపించారు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని మొదట లాటిన్ భాషలోనికి, పిదప ఆంగ్లంలోనికి పరివర్తనం చేశారు. జయదేవుని గీతగోవిందం, నారాయణుని గీతోపదేశాన్నీ, మనుస్మృతిని ఆంగ్లీకరించి యూరోపియన్లకు ప్రాచ్యసాహిత్యసౌధ ద్వారాలు తెరిచారు.

ఛార్లెసు విల్కిన్స్‌గారు ఆనాటి కలకత్తా పాశ్చాత్య విద్వాంసులలో తలలో నాలుకేకాక వారి రచనలు ముద్రించే సాంకేతిక నిపుణుడు. సర్ విలియం జోన్స్‌గారికి సహకరించి ఏషియాటిక్ సొసైటీ స్థాపనలో ఈయన పాలుపంచుకొన్నారు. మొట్టమొదటసారిగా బెంగాలీ అక్షరాలను పోతపోయించారు. పిమ్మట సంస్కృత నాగర లిపిని పారశీక లిపిని అచ్చు యంత్రాలకు సమకూర్చగలిగాడు. 1783లో భగవద్గీతను అనువదించారు. ఎన్నో గ్రంథాలకు ముద్రాపకులు.

హెన్రీ థామస్ కోల్‌బ్రూక్‌గారు కలకత్తాలో జడ్జీగా ఉంటూ భారతీయ ధర్మశాస్త్రాలపై పరమ ప్రామాణిక గ్రంథాల నిగ్గుతేల్చారు. అమరకోశాన్ని ఆంగ్ల వ్యాఖ్యానంతో ప్రచురించారు. వేదశాస్త్రాలపై ఎన్నో వ్యాసాలను రాశారు. ఏషియాటిక్ సొసైటీకి అధ్యక్షులయ్యారు.

జె. బి. గిల్‌క్రిస్టుగారు 1794లో కలకత్తాకు వచ్చారు. ఉర్దూ, హిందూస్థానీ భాషలలో పాండిత్యాన్ని సంపాదించారు. హిందూస్థానీ వ్యాకరణాన్ని, నిఘంటువునూ రచించారు. ప్రాచ్య భాషలను రోమను లిపిలో లిఖించడం మంచిదని వాదించేవారు.

డాక్టర్ విలియం కేరీగారు కలకత్తా సమీపంలో ఉన్న శ్రీరామపురంలో మిషనరీగా ఉంటూ భారతీయ భాషలన్నింటిలో బైబిలు ప్రచురణకు నడుంకట్టారు. బెంగాలీ భాషలోనేకాక సంస్కృత, మరాఠీ, తెలుగు, కన్నడ, పంజాబీ భాషలను అధ్యయనం చేశారు. వివిధ భాషల వ్యాకరణాలను రచించారు. మూడు సంపుటాలలో రామాయణాన్ని ఇంగ్లీషులోనికి అనువదించారు.

జార్జి అబ్రహాం గ్రియర్‌సన్‌గారు భారతీయ భాషలన్నింటినీ సర్వే చేసిన కోవిదుడు. 1873లో భారతదేశం పలుప్రాంతాలలో పర్యటనం చేశారు. 1898లో భారతీయ భాషల పరిశీలనా సంఘం సూపరింటెండెంటుగా నియమితులయ్యారు. 30 సంవత్సరాలు కృషి చేసి 11 సంపుటాలలో 'లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో భారతదేశంలోని భాషా కుటుంబాల చరిత్రలను, వాటి స్వరూపస్వభావాలను విశదం చేశారు.

ప్రాచ్య భాషలు నేర్చిన ఇంతమంది పాశ్చాత్య పండితులతోపాటు కుంఫిణీవారి చాప్లిన్ పురోహితులూ, ఇతర పాశ్చాత్య స్థావరాలలో మిషన్లు నెలకొల్పి మత ప్రచారం చేసే క్రైస్తవ బోధకులూ కూడా దేశ భాషలలో ప్రావీణ్యం సంపాదించి కలకత్తాలోనూ, పరిసరాలలోనూ ఉండేవారు.

రివరెండు డేవిడ్ బ్రౌన్ (1762-1812), **క్లాడియస్ బఛనన్** (1768-1815), **జాషువా మార్షమన్** (1768-1837), **హెన్రీ మార్టిన్** (1781-1812), **డేనియల్ కోరీ** (1777-1837), **థామస్ ట్రూబాడీ థోమాసన్** (?) మొదలైన క్రైస్తవ మత నిష్ణాతులు ఆనాటి ప్రముఖులు.

వీరిలో మొట్టమొదట పేర్కొన్న రెవరెండు డేవిడ్ బ్రౌన్‌గారే తెలుగు సాహిత్య పునర్వికాసానికి కారకుడైన చార్లెసు ఫిలిప్ బ్రౌను దొరగారి తండ్రి.

డేవిడ్ బ్రౌన్ ఇంగ్లండులోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చదువుకొన్నారు. గ్రీకు, లాటిన్ భాషలు అధ్యయనం చేశారు. విద్యార్థి దశలోనే మానవసేవ చేస్తూ పేదవారికి సాయం చేస్తూ ఉండేవారు. ఆయన సంపన్న రైతు కుటుంబంలో నుంచి వచ్చిన వ్యక్తి. వ్యవసాయం చేయడం ఇష్టంలేక చర్చి ఉద్యోగానికి తగిన శిక్షణ కోసం చదువుకొన్నారు. ఈయన సేవానిరతి తెలుసుకొన్న మిత్రులు భారతదేశంలోని ఒక విద్యాసంస్థ పర్యవేక్షకునిగా ఈయనను పంపితే బాగుంటుందని తలచారు. విద్యావంతుడేకాక, బిషప్పు చేత అర్చకునిగా నియమితుడైనవాడు, వివాహితుడు ఈ ఉద్యోగానికి అర్హుడవుతాడు. అప్పటికి డేవిడ్ బ్రౌనుకు ఇరవైమూడు సంవత్సరాల వయసు, పెళ్ళి కాలేదు. ఏ చర్చిలోని మతగురువూ అర్చక దీక్షను ఇవ్వలేదు.

అయితే ఇండియాలో కుంఫిణీ వారి కొలువులో చేరదలచిన డేవిడ్ బ్రౌను మతదీక్ష పుచ్చుకొనడానికి ప్రయత్నించాడు. మొదట ఇద్దరు బిషప్పులు నిరాకరించినా చివరకు 1785లో కేంటర్‌బరీ ఆర్చిబిషప్పు స్వయంగా డేవిడ్ బ్రౌనుకు దీక్ష ఇచ్చాడు. ఇంగ్లండులోని క్రైస్తవ విజ్ఞాన ప్రచారక సంఘం (ఎస్.పి.సి.కె.)లో సభ్యునిగా చేర్చుకొన్నారు. డేవిడ్ బ్రౌను తనకు పరిచితురాలైన మిస్ రాబర్ట్‌సన్ అనే యువతితో తన కోరికను చెప్పాడు. ఇండియాలోని 'విద్యాసంస్థ-శరణాలయం'లో యాభైమంది బాలబాలికల సంరక్షకులుగా భార్యాభర్తలమై సేవ చేద్దామని చెప్పాడు. ఆమె అంగీకరించింది. 1785 మార్చి 4వ తేదీనాడు వివాహం చేసుకొన్నాడు.

వెంటనే భారతదేశానికి వెళ్ళాలనుకొన్న బ్రౌను దంపతులు ఓడ కోసం ఒక ఏడాది నిరీక్షించవలసి వచ్చింది. 1786లో ఆ దంపతులు ఓడ ఎక్కారు. ఆమె గర్భవతి. భారతదేశానికి ఆరోజుల్లో ఓడ ప్రయాణం కొన్నినెలలు పట్టేది. డేవిడ్ బ్రౌను ఓడలోనే తను పనిచేయవలసిన వంగ రాష్ట్రంలోని భాష బెంగాలీని అభ్యసించాడు. అతని సతి ఓడలోనే ఫిబ్రవరి ఒకటవ తేదీనాడు ఒక మగ శిశువును కన్నది. భార్యాబిడ్డలతో డేవిడ్ బ్రౌన్ 1786 జూన్ నెలలో కలకత్తాలో కాలుపెట్టాడు. ఆ తర్వాత ఈ ముగ్గురు మరి ఇంగ్లండు ముఖం చూడలేదు.

ఓడలో పుట్టిన పిల్లవాడు ఏణ్ణర్థం లోపునే కన్నుమూశాడు. బోసినోటితో ఊసులు చెప్తూ, తప్పటడుగులు వేస్తూ, తల్లిదండ్రులకెంతో ఆనందాన్నిస్తూన్న ఆ శిశువు మరణించడంతో డేవిడ్ బ్రౌను దంపతులు సహజంగా విచారగ్రస్తులయినా విద్యాసంస్థ శరణాలయంలో తాము సంరక్షించవలసిన బాలబాలికల వల్ల తమ వాత్సల్యాన్ని పరిపూర్ణం చేసుకొన్నారు. ఎస్.పి.సి.కె. సభ్యునిగా డేవిడ్ బ్రౌను మిషన్ చర్చి పనులను స్వచ్ఛందంగా చేపట్టారు. శరణాలయం బాధ్యతలను అధికారులు తప్పించాక ఆయన తన ఇంటి వద్దనే ఒక ధర్మబడిని పెట్టి విద్యాదానం చేసేవారు. జైళ్ళలో, ఆస్పత్రులలో పౌరోహిత్యపు పనులు చేసేవారు. నిర్విరామంగా సంఘసేవా కార్యక్రమాలలో మునిగిపోయేవారు.

భారతదేశంలోని పాశ్చాత్యులలో పురుషులకన్నా స్త్రీల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలు ఎక్కువ. డేవిడ్ బ్రౌన్‌గారి సతి ఏడేళ్ళపాటే ఆయనతో జీవితాన్ని పంచుకొంది. 1894లో ఆయన ప్రెసిడెన్సీ చాప్లిన్‌గా నియమితులయ్యారు. సాలీనా పదివేల రూపాయల జీతం వచ్చే ఈ ఉద్యోగం వల్ల ఆయనకు ఇబ్బందులేవీ ఉండవుగాని భార్యా వియోగం తప్పదని శ్రీమతి బ్రౌన్ భావించింది. తమ ఇంటికి తరచుగా వచ్చే కెప్టెన్ కౌలేగారి కుమార్తె మిస్ ఫ్రాన్సిస్ కౌలే తన భర్తకు తగిన వధువు కాగలదని భావించింది. ఒకవేళ దైవం తనను తీసుకుపోయే పక్షంలో మిస్ ఫ్రాన్సిస్‌ను వివాహమాడమని చెప్పి ఆమె 1894లో మరణించింది.

మరి రెండేళ్ళకుగాని డేవిడ్ బ్రౌను తన మొదటి భార్య అంతిమ వాంఛను నెరవేర్చలేదు. 1896లో మిస్ ఫ్రాన్సిస్ కౌలేను ఆయన వివాహం చేసుకొన్నాడు. అక్షరాలా ఒక ఇంటివాడు కావడం కోసం కలకత్తా శివార్లలో నగరానికి పదిహేను మైళ్ళ దూరంలో, హుగ్లీనది పశ్చిమతీరంలో ఒక నివాస గృహాన్ని క్రయం చేశాడు. అది గవర్నరు జనరల్‌గారి ఉద్యానవనానికి ఎదురుగా ఉండేది. డేవిడ్ బ్రౌన్ తన ఇంటికి 'ఆల్టీన్' అని పేరుపెట్టారు. ఈ ఇంట్లో బ్రౌను దంపతులు సంతానవంతులయ్యారు. ముగ్గురు కుమారులే కాక కుమార్తెలు కూడా ఉన్నారు. రెండవ కుమారుడే ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను 1798 నవంబరు 10వ తేదీనాడు జన్మించారు. ఆ కుటుంబ సభ్యులు తొమ్మిది పదిమంది అయినా, ఎప్పుడూ ఇంకో ఆరు నుంచి పదిదాకా అతిథులు తప్పక ఆ ఇంట్లో భోంచేసేవారు.

డేవిడ్ బ్రౌన్‌గారి ఇల్లు రమారమి ఒక ధర్మసత్రం. తన ఇంటిని ఆనుకొన్న తోటలో ఒక పాడుపడిన దేవాలయాన్ని బాగుచేయించి ఒక అతిథి గృహాన్ని నిర్మించారు. భారతదేశానికి మత ప్రచారం చేయడానికి వచ్చే మిత్రులు అక్కడ నెలల తరబడి ఉండేవారు. ఇల్లెప్పుడూ ఒక విజ్ఞానకేంద్రం లాగా ఉండేది. వివిధ క్రైస్తవ శాఖలకు చెందిన బైబిలు పండితులు అక్కడ చర్చలు జరిపేవారు.

కలకత్తాలో ఫోర్టు విలియం కళాశాలను సివిల్ సర్వెంట్ల చదువుల కోసం కుంఫిణీ వారు స్థాపించాక దానికి ప్రొవోస్టుగా ప్రెసిడెన్సీ చాప్లిన్ అయిన డేవిడ్ బ్రౌను గారినే ఎన్నుకొన్నారు. ఆ కళాశాలలోని ఆచార్యులందరూ ఆయనను చాలా గౌరవించేవారు. వీరిలో ఒక్కొక్కరూ గొప్ప ప్రతిభావంతులు. కోల్‌బ్రూక్, గ్లాడ్విన్, హేలింగ్‌టన్, గిల్‌క్రిస్టు, బుకనన్, కేరీ మొదలైన పండిత మండలికి నాయకమణిగా డేవిడ్ బ్రౌను తన ప్రజ్ఞావిశేషాలవల్ల రాణించేవారు.

కళాశాలలో విద్య నేర్పడమేకాక డేవిడ్ బ్రౌను తన కుమారులకు తానే స్వయంగా చదువు చెప్పేవారు. హీబ్రూ, సిరియన్, అరబ్బీ, పారశీక, గ్రీకు, లాటిన్ భాషలు కుర్రవాళ్ళు విధిగా నేర్చుకోవాలి. డేవిడ్ బ్రౌను గొప్ప హీబ్రూ పండితుడు. బైబిలును మూలంనుండే అనువదించాలని అది స్వయంగా తన పిల్లలకు నేర్పారు. అరేబియా దేశం నుండి వచ్చిన షోలోమ్ అనే గొప్ప హీబ్రూ పండితుడు డేవిడ్ బ్రౌనుగారి ఇంట్లో అతిథిగా ఉండేవారు. ఆ యిల్లు బెంగాలులోని 'హీబ్రూస్కూలు'గా ప్రఖ్యాతమైంది. ఈ పండితుని దగ్గర కూడా అన్నదమ్ములు ముగ్గురూ విద్యను అభ్యసించారు.

కలకత్తా సమీపంలో ఉండడం వల్లా, అరబ్బీ, పెర్షియన్, హిందూస్థానీ భాషలను స్వచ్ఛంగా మాట్లాడేవాళ్ళ మధ్య పెరగడం వల్లా భారతదేశీయులంత స్పష్టంగా ఆ భాషలను కుర్రవాళ్లు ముగ్గురూ ఉచ్చరించగలిగేవారు. చిన్నప్పుడే స్థానికుల చెంత నేర్చుకొన్న భాషలు ధ్వనులు కల్తీ లేకుండా అబ్బుతాయి. నేటివు పండితులు ఈ అన్నదమ్ములకు సంస్కృతం వ్రాయడం, చదవడం నేర్పారు. ఇది ఉత్తరోత్తరా ఛార్లెసు ఫిలిప్ బ్రౌనుకు ఎంతగానో ఉపకరించింది. అన్నదమ్ములు ముగ్గురూ హిందూస్థానీ భాషలోని 'బాగో బహార్'ను చదువుకొన్నారు.

తన కుమారులు ముగ్గురిలోనూ మధ్యమునికి ఆంగ్ల సాహిత్యం చదవాలనే ఆకాంక్ష ఉన్నట్టు డేవిడ్ బ్రౌను గ్రహించారు. ఆ అభిరుచిని పెంపొందింప చేశారు. "మా రెండోవాడు 'పారడైజు లాస్ట్' చదివి అర్థం చేసుకొన్నాడు. డ్రైడన్ రచించిన వర్జిల్ కృతులను (గ్రీకు మాతృకనుండి) కౌపర్ అనువదించిన హోమర్ (ఇలియడ్)ను చదువుకొన్నాడు" అని డేవిడ్ బ్రౌను తన జ్ఞాపకాలలో ఒక చోట వ్రాశారు.

డేవిడ్ బ్రౌనుగారికి తమ రెండోవాడు చదువుతున్న ఇతర పుస్తకాల గురించి పూర్తిగా తెలియదు. మిల్టన్, డ్రైడన్‌ల రచనలు చదివిన మరుసటి సంవత్సరమే చార్లిసు ఫిలిపు బ్రౌను అప్పుడే తాజాగా ప్రచురితమైన సర్ వాల్టర్ స్కాటు నవలలు 'వే' 'మర్మియన్' చదివి ఎంతగానో ఆనందించారు. థామస్ మూర్ రచనలు (బహుశా యుటోపియా), బైరన్ కవితలు కూడా ఆ కుర్రవానికి అభిమాన గ్రంథాలే. విపరీతమైన వైచిత్రిగల ఇటువంటి చోద్యపు పుస్తకాలు ఆ చిన్నవాని అభిరుచికి కొంచెం హెచ్చు మోతాదులో ఉన్నా వాటిని పఠించేవారు. డేవిడ్ బ్రౌనుగారు చాలా జాగ్రత్త తీసుకొని షేక్స్పియర్ రచనలు తన కుర్రవాళ్ళకు అందుబాటులో లేకుండా చూశారు. పదహారో యేడు వచ్చేదాకా ఛార్లెసు ఫిలిప్ బ్రౌనుకు షేక్స్పియర్ రూపకాల పరిచయం కలుగలేదు. ఆనాటి కాలంలో ప్రాస్పెరో (టెంపెస్టు), ఒథెల్లో వంటి పాత్రలు వారికి బాగా నచ్చాయి.

డేవిడ్ బ్రౌనుగారు తమ కుమారులకు, ముఖ్యంగా మధ్యమునికి గ్రంథ పరిష్కరణలో చిన్నప్పుడే తర్ఫీదు ఇచ్చారు. అది చాలా ఓపికతో కూడుకొన్న పని అని బాల్యంలోనే తెలిసివచ్చింది. తప్పొప్పుల పట్టికలు తయారు చేయడం, పాఠభేదాలు గుర్తించడం, గ్రంథపాఠాలను పూరించడం తండ్రిగారి శిక్షణలో ఛార్లెసు బ్రౌను అలవర్చుకొన్నారు. పరమ పేలవంగా ఉండే పరిశోధనలు సైతం బాల్యంలోనే ఈ చిన్నవానికి ఆకర్షవంతంగా కనపడేవి. ఈ పెంపకంలోని అలవాట్లు ఛార్లెసు ఫిలిప్ బ్రౌనుకేకాక ఆంధ్ర సాహిత్యానికి ఉత్తరోత్తరా లాభించాయి.

అపూర్వమైన గ్రంథాలు సేకరించడం, అవి సద్వినియోగం అవడానికి వాటిని సత్కార్యాల కోసం స్థాపించిన సంస్థలకు దానమివ్వడం తండ్రిగారి నుంచి ఛార్లెసు ఫిలిప్ బ్రౌనుకు సంక్రమించిన మరొక సద్గుణం. డేవిడ్ బ్రౌనుగారు కలకత్తాలో ఎంతో శ్రమపడి సేకరించిన నూరు ఫోలియో గ్రంథాలను ఆయన ఫోర్టు విలియం కాలేజీకి దానం చేశాడు. డేవిడ్ బ్రౌనుగారు స్వయంగా స్థాపించిన ఒక గ్రంథాలయంలో ఎన్నో అపురూపమైనవీ, అమూల్యమైనవీ అయిన గ్రంథాలు ఉండేవి. ఇవి బైబిలు అనువాదకులకు ఎంతగానో తోడ్పడేవి.

ఆనాడు బైబిలు పండితులెందరో డేవిడ్ బ్రౌనుగారి ఇంటికి వచ్చిపోతూ ఉండడం పరిపాటి. తమ నాన్నగారిని కలుసుకొనడానికి క్లాడియస్ బుకనన్, థామస్ ట్రూబడీ థోమాసన్, హెన్రీ మార్టిన్, డేనియల్ కోరీ మొదలైన కుంఫిణీ చాప్లెన్ పురోహితులు రావడం ఛార్లెసు ఫిలిపు బ్రౌనుకు బాగా జ్ఞాపకం. డేవిడ్ బ్రౌనుగారి స్వగృహం శ్రీరామపురానికి చేరువలోనే ఉండేది. ఆ డెన్మార్కు దేశీయుల స్థావరంలో ఉంటూ మిషనరీ కార్యక్రమాలను సాగిస్తున్న డాక్టర్ విలియం కేరీ, జాషువా మార్షమన్, హెన్రీ మార్టిన్‌లు కూడా తరచూ వచ్చి వెళ్ళేవారు. ఈ మిషనరీల గ్రంథ ప్రచురణ కార్యక్రమాలు చార్లెసు ఫిలిపు బ్రౌనుపై గట్టి ముద్రవేసి ఉండవచ్చు. వివిధ భారతీయ భాషల పుస్తకాల ముద్రణకు అవసరమైన అక్షరాలను పోతపోయించడం, అచ్చుపనులు చేయడం మొదలైనవి శ్రీరామపురం మిషన్‌లో దైనిక కార్యక్రమాలు.

భారతదేశంలో తన కుమారులు ముగ్గురికీ సాధ్యమైనంత ఉన్నత విద్యను బోధించి యుక్తవయసు వచ్చాక వారిని ఇంగ్లండుకు పంపించాలని, అక్కడి విశ్వవిద్యాలయాలలో పట్టభద్రులను చేయాలని డేవిడ్ బ్రౌనుగారి ఆశయం. అటుపిమ్మట ఆ ముగ్గురూ మత దీక్షను పుచ్చుకొని క్రైస్తవ జ్ఞాన ప్రచారానికి భారతదేశానికి వచ్చి సంసేవలు చేయాలని కూడా ఆయన కలలు కన్నారు.

కన్న కలలు ఫలప్రదం కావడం కొందరి జీవితాలలోనే సాధ్యమవుతుంది. డేవిడ్ బ్రౌను ఆరోగ్యం క్షీణించింది. 1812లో ఆయన మరణించారు. ఎంత ఆర్జించారో అంతా ఆయన అతిథి సత్కారాల కోసం, ఆశయ ప్రచారం కోసం వెచ్చించారు. డేవిడ్ బ్రౌనుగారి భార్య శ్రీమతి ఫ్రాన్సిస్ బ్రౌను తన సంతానాన్ని తీసుకొని ఇంగ్లండుకు వెళ్ళి, అక్కడ తన భర్త వాంఛించినట్టు వారికి ఉన్నత విద్యలు చెప్పించాలనుకొంది. ఇందుకు డేవిడ్ బ్రౌను గారి మిత్రులు చందాలు వేసుకొని సాయం చేయాలనుకొన్నారు. 'మెమోరియల్ స్కెచెస్' అనే పేరుతో ఒక వ్యాస సంకలనాన్ని డేవిడ్ బ్రౌనుగారి సంస్మరణ సంచిక ప్రకటించి, ఒక్కొక్క ప్రతి నూరు రూపాయాలకు ఇవ్వదలిచారు. 193 మంది అభిమానులు ఆ విధంగా ఆ పుస్తకానికి చందాలు ఇచ్చారు. ఈ సంచికలో డేవిడ్ బ్రౌనుగారి క్రైస్తవ ప్రవచనాల పాఠాలు కూడా చేర్చారు.

పాతికేళ్ళకు పైగా భారతదేశంలో క్రైస్తవ పురోహితునిగా, మతప్రచారకునిగా, కళాశాల ఆచార్యుల అధ్యక్షునిగా, బైబిలు సొసైటీ సంస్థాపక కార్యదర్శిగా పనిచేసిన డేవిడ్ బ్రౌనుగారికి ఎందరో స్నేహితులు ఏర్పడ్డారు. ఆనాటి పాశ్చాత్య విద్వాంసులు, మిషనరీలు డేవిడ్ బ్రౌనుగారిపట్ల తమకు గల గౌరవాన్ని వ్యక్తపరుస్తూ సంస్మరణ వ్యాసాలను రచించారు. ఈ సంపుటానికి రెవరెండు ఛార్లెస్ సిమియన్ సంపాదకుడు. ఇందులో డేవిడ్ బ్రౌనుగారి జీవిత చరిత్రను పొందుపరిచారు. ఈ గ్రంథం మరి నాలుగేళ్ళకు 1816లో అచ్చుపడింది (దీనివల్లనే ఛార్లెసు ఫిలిపు బ్రౌను బాల్యదశలోని వివరాలు తెలుస్తున్నాయి). చందాదారుల పేర్లు గ్రంథంలో కృతజ్ఞతాసూచకంగా ప్రకటించారు. 193 మంది తలా వంద రూపాయలు ఇవ్వడంలోనే డేవిడ్ బ్రౌనుగారి పట్ల మిత్రులకున్న గౌరవం వ్యక్తమైంది.

'మెమోరియల్ స్కెచెస్' వల్ల వచ్చే 19,300 రూపాయలు తనకూ, తన సంతానానికి ప్రయాణపు ఖర్చులకు కూడా చాలవు. అందుచేత శ్రీమతి ఫ్రాన్సిస్ బ్రౌను అప్పు చేయక

తప్పలేదు. కలకత్తాలోని 'ఓల్డ్‌చర్చి ఇవాంజికల్ ఫండు' నుంచి తల్లి తీసుకొన్న ఋణాన్ని ఆమె కుమారులు ఉత్తరోత్తరా చెల్లుపెట్టారు. ఛార్లెసు ఫిలిప్ బ్రౌను తనవంతుగా నాలుగువేల రూపాయలను, అతని సోదరుడు జార్జి అదే మొత్తాన్ని తాము ఆర్జనపరులయ్యాక బాకీ క్రింద ఫండువారికి జమకట్టారు. తన సంతానాన్ని తీసుకొని శ్రీమతి ఫ్రాన్సిస్ బ్రౌను ఇంగ్లండుకు 1813లో వెళ్ళిపోయింది. అప్పటికి ఛార్లెసు ఫిలిప్ బ్రౌనుకు పధ్నాలుగు వెళ్ళి పదిహేనోయేడు వస్తోంది.

తొలిసారి ఇంగ్లండులో

భారతదేశంలో తమ కొలువులో మరణించిన వారి కుటుంబ సభ్యులలో చిన్నవాళ్ళను సివిల్ సర్వీసులో చేర్చుకొని ఉద్యోగాలివ్వడం కుంఫిణీవారు అనుసరించే ఉదార చర్యలలో ఒకటి. డేవిడ్ బ్రౌనుగారి ముగ్గురు కుమారులనూ ఆ విధంగానే తమ హెయిల్‌బరీ కాలేజీలో విద్యార్థులుగా నమోదు చేసి, సివిల్ సర్వీసుకు కావలసిన శిక్షణ ఇచ్చారు. 1814 జనవరి మాసంలో ఛార్లెసు ఫిలిపు బ్రౌను ఈ విద్యాసంస్థలో చేరాడు. భారతదేశంలో పుట్టి పెరగడంవల్ల హిందూస్థానీ ధారాళంగా మాట్లాడడం, రాయడం తెలిసినందువల్ల హెయిల్‌బరీ కాలేజి నిర్వహించిన పోటీలో ఛార్లెసు ఫిలిప్ బ్రౌనుకు ఒక బహుమతి కూడా సునాయాసంగా లభించింది. రెండేళ్ళపాటు ఈ కళాశాలలో బ్రౌను సోదరులు చదువుకొన్నారు.

కుంఫిణీ వారు తమ సివిల్ సర్వీసులో నమోదు అయిన విద్యార్థులకు ఆదిలోనే భారతదేశంలోని ఏ రాజధానులకు పంపాలో నిర్ణయిస్తారు. ఛార్లెసు ఫిలిప్ బ్రౌనును మద్రాసు సర్వీసుకు, అతని సోదరులను బెంగాలు సర్వీసుకు కేటాయించారు. హెయిల్‌బరీ కాలేజిలో తను నేర్చుకొన్నది తక్కువే అని ఆయన తన జీవిత చరిత్రలో రాశారు. కాలమంతా నవలలు, శృంగార కథాకావ్యాలు చదవడంలో గడిపేవారు. తనకు తెలిసినది ఏమీలేదని తెలిశాక ఉత్తమ గ్రంథపఠనం ప్రారంభించారు. ఏమైనా పాండిత్యం అలవడితే అది సంపూర్ణంగా తన స్వశక్తివల్లనే అని కూడా చెప్పారు. కళాశాలలో నేర్పేది ఏదైనా, తాను స్వయంగా లాటిన్ కావ్యాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. లాటిన్‌తో పాటు గ్రీకును కూడా చదువుకొన్నారు.

హెయిల్‌బరీ కాలేజీలో విద్యలు ఎలా నేర్పేవారో ఈ సంపుటంలోనే వేరొక ప్రకరణంలో విశదం చేశాను. అక్షర పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాక చార్లెస్ ఫిలిప్ బ్రౌనును 1816 జూన్ 30వ తేదీనాడు మద్రాసు సివిల్ సర్వీసులో రైటరుగా నియమించారు. చెన్నపట్నంలోని సెంటు జార్జి కోటలోని కాలేజిలో పూర్తిచేయవలసిన విద్యకోసం భారతదేశానికి పంపించారు. 1817 ఆగస్టు నాలుగవ తేదీనాడు ఛార్లెసు ఫిలిప్ బ్రౌను ఓడ దిగి చెన్నపట్నంలో కాలుపెట్టారు. ఆనాటితో ఆయన జీవితంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది.

తొలివిడత కుంఫిణీ కొలువులో

1817 ఆగస్టు 4వ తేదీనాడు 'కర్నాటిక్' అనే ఓడలో సీమనుంచి ప్రయాణం చేసి రేవులో ఛార్లెస్ ఫిలిప్ బ్రౌను ఆ నెల అయిదో తారీకున కోటలోని ఛీఫు సెక్రటరీగారిని

కలుసుకొని తమ కాగితాలను యిచ్చారు. సెంటు జార్జి కోట కాలేజీలో సివిల్ సర్వెంటు విద్యార్థిగా చేర్చుకొంటున్నట్టు కాలేజీ బోర్డువారికి తెలియచేస్తూ రూల్స్ ప్రకారం విద్యాభ్యాసం చేయమని బ్రౌనుకు తాఖీదులు యిచ్చారు. ఆగస్టు 13వ తారీకునాడు ఆయన కాలేజీలో చేరారు. ప్రతి విద్యార్థి రెండు ప్రాంతీయ భాషలు అభ్యసించాలి. బ్రౌను తెలుగు, మరాఠీ భాషలను ఎంచుకున్నారు. వీటితోపాటు జుడిషియల్ రెగ్యులేషన్ల అధ్యయనం ముఖ్యం.

కాలేజీలో చేరాక అక్కడే హెడ్ ఇంగ్లీషుమాస్టరుగా ఉదయగిరి నారాయణయ్యగారు వుంటున్నా, ఆయన బ్రౌనుకు తెలుగు నేర్పమని వెలగపూడి కోదండ రామయ్యగారికి అప్పచెప్పాడు. ఈయనే అక్షరాభ్యాసం చేయించి బ్రౌనుకు తెలుగు రాయడం, చదవడం నేర్పారు. కాలేజీలో చేరిన నాలుగు నెలలకే అర్ధ సంవత్సరపు పరీక్షలు 1817 డిసెంబరులో జరిగాయి. ఇటీవలనే విద్యలు ప్రారంభించబట్టి కొందరు విద్యార్థుల గురించి పరీక్షాధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించలేదు. వీరిలో బ్రౌను వున్నారు.

1818 జూన్ నెలలో అర్ధ సంవత్సరపు పరీక్షలు జరిగాయి. ఇందులో బ్రౌను తదితర విద్యార్థులు కొందరు ఏవిధమైన అభివృద్ధిని ప్రదర్శించలేకపోయారు. వచ్చేసారి పరీక్షలలో వారి తెలుగుభాషా జ్ఞానం మెరుగుపడుతుందని పరీక్షాధికారులు ఆశించారు. 1818 డిసెంబరు నెలలో జరిగిన పరీక్షల్లో సంతృప్తికరంగా నెగ్గినందువల్ల ఈ విద్యార్థుల భత్యపు ఖర్చుల అలవెన్సులు నెలసరి 75 వరహాలకు పెంచమని పరీక్షాధికారులైన ఎల్లిస్, కాంబెల్ దొరలు సిఫార్సు చేశారు. ఇందువల్ల నెలకు మూడు వందల అరవై రూపాయల మొత్తం అదనంగా బ్రౌనుకు లభించసాగింది.

తెలుగు నేర్చుకొనడంలో శ్రద్ధ చూపించినా ఇంకొక ప్రాంతీయ భాషగా ఎన్నుకొన్న మరాఠీలో బ్రౌను శ్రద్ధ చూపెట్టలేదు. అదనపు ప్రాంతీయ భాషగా తనకు హిందూస్తానీని నిర్ణయించమని ఆయన అధికారులను ప్రార్థించారు. అయితే అందుకు రూల్స్ అంగీకరించవు. ఆదిలో ఎంచుకొన్నది చదివి తీరాలి. అధికారులు బ్రౌను అభ్యర్థనను త్రోసిపుచ్చారు. మరాఠీని చదవమన్నారు.

1819 సంవత్సరాంతంలో సైతం బ్రౌను తన విద్యాభ్యాసాన్ని విజయవంతంగా ముగించలేకపోయారు. తెలుగు భాషా జ్ఞానం తగినంత వున్నా, పునాది గట్టిదే అయినా మాటల అర్థాలను సందర్భాన్ని బట్టి వేరువేరు విధాలుగా నిర్ణయించడం అధికారులకు నచ్చలేదు. బ్రౌను తెలుగు సంభాషణలలో వ్యాకరణ సూత్రాలను లక్ష్యపెట్టేవారు కాదు. పుస్తకాలు నిర్దేశించే వాటిని ఉల్లంఘిస్తున్నా చెప్పవలసిన భావాన్ని సరిగ్గానే వ్యక్తం చేయగలిగేవారు. విధిలేక చదవవలసిన మరాఠీలో కొంత అభివృద్ధిని కనపరిచారు.

సెంటు జార్జి కోటలోని కాలేజీలో తన విద్యను ముగించుకొనడానికి బ్రౌనుకు మూడు సంవత్సరాలు పట్టింది. 1820 జూన్ నెలలోని పరీక్షలో ఎట్టకేలకు సెకండ్ క్లాసులో ఉత్తర్ణులయ్యారు. తెలుగులో చూపిస్తున్న ప్రావీణ్యం మరాఠీలో కనబర్చలేకపోయినా కచ్చేరీ పనులు నిర్వహించడానికి తగిన జ్ఞానం వుందని పరీక్షాధికారులు భావించారు.

జుడిషియల్ రెగ్యులేషన్సు ఆనుపానులు బాగా తెలుసుకొన్నందువల్లా, మూడు సంవత్సరాల కన్నా ఎక్కువ కాలేజీలో వుండకూడదన్న షరతువల్లా బ్రౌనును ఉద్యోగంలో నియమించమన్నారు.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. బ్రౌన్‌కన్నా ఒక ఏడాది ఆలస్యంగా కాలేజీలో చేరిన జె.సి. మారిస్ అనే సివిలు సర్వెంటు విద్యార్థి తెలుగు, హిందూస్తానీ, పర్షియన్ భాషలలో చూపించే ప్రావీణ్యం అద్భుతంగా వుందని పరీక్షాధికారులు భావించారు. విద్యార్థులందరిలో యితను అసమానుడని ప్రశంసించారు. ప్రతి పరీక్షలోనూ అతడే ప్రథమస్థానం సంపాదించుకొన్నాడు. అతనికి వెయ్యి వరహాల పారితోషికం యివ్వమని బోర్డువారు సిఫార్సుచేసి యిప్పించారు. నిర్దేశించిన గ్రంథాలు బోధించే తెలుగులో యింతటి ప్రజ్ఞను చూపెట్టిన మారిస్ అధికారుల మెప్పు నోచుకొన్నారు. ఉత్తరోత్తరా ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు నిర్మాణాన్ని కుంఫిణీవారు తలపెట్టినప్పుడు ఆ పనిని మారిస్‌కే అప్పుచెప్పారు. 15,000 రూపాయలు ముట్టచెప్పారు. కాలేజీ బోర్డు సెక్రటరీ అయిన కాంబెల్‌దొరగారికి బ్రౌన్‌కన్నా మారిస్ అభిమానపాత్రుడయ్యాడు.

1820 జూన్ నెలలో పరీక్షలు జరుగుతున్నప్పుడు మద్రాసు గవర్నరు బహదూరు అయిన సర్ థామస్ మన్రో ముగ్గురు విద్యార్థులను ప్రశ్నించడం స్వయంగా దగ్గరుండి చూశారు. తర్వాత ఆ యేడు ఉత్తీర్ణులవుతున్న విద్యార్థులందర్నీ వుద్దేశించి హితోపదేశం చేశారు. ''దేశ భాషలలో వ్యవహార జ్ఞానం లేకపోతే మిగతా జ్ఞానాలన్నీ సివిల్ సర్వీసులో నిరుపయోగమని చెప్పారు. చక్కని భాషా జ్ఞానం ఒక సాధనమే. సత్పరిపాలన గమ్యంగా భావించాలి. ఈ దేశ ప్రజల గురించి ఏర్పరచుకొన్న దురభిప్రాయాలకు స్వస్తి చెప్పండి. భారతీయుల మధ్య బహుకాలం సంచరిస్తూ జీవించిన వాళ్ళెవరైనా నేటివుల సద్గుణాలను మెచ్చుకొంటారు. ప్రజలలో సద్భావం వుంటే, అదే ఏ ప్రభుత్వానికైనా రక్ష'' అని మన్రోగారు చెప్పారు. ఈ మాటలు ఆ విద్యార్థులపై గట్టి ప్రభావాన్ని చూపెట్టాయి. బ్రౌన్‌లో దేశ భాషల పట్లగల అభిప్రాయానికి ప్రాయం వచ్చింది.

సెంటు జార్జి కోట కాలేజినుండి ఉత్తీర్ణులయ్యాక బ్రౌనుగారిని సివిల్ సర్వీసులో మొట్టమొదట 1820 ఆగస్టు 8వ తేదీనాడు కడపలో జిల్లా కలెక్టరుగారికి, మేజిస్ట్రేటు గారికి అసిస్టెంట్‌గా నియమించారు. ఆ రోజుల్లో హన్‌బరీ దొరగారు అక్కడ కలెక్టరుగా వుండేవారు. ఆయన తెలుగు ధారాళంగా మాట్లాడేవారు. వారిని చూశాక, మన్రో దొరగారి హితోపదేశం గుర్తు వచ్చాక, హన్‌బరీ దొరగారిని మించే సంభాషణా చాతుర్యాన్ని తెలుగులో సంపాదించాలని బ్రౌను దొరగారు నిశ్చయించుకొన్నారు. ఈ కోరిక సిద్ధించడానికి కడపలో ఉద్యోగం చేసిన తొలి రెండేళ్ళూ నిండాపట్టాయి.

తెలుగు మాట్లాడడంలో కృషి సాగుతున్నా రాతకోతలన్నీ మునిషీల ద్వారా జరిగేవి. తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలను కచ్చేరీలోని పండితులే చదివి వినిపించేవారు. ఉద్యోగరీత్యా తెలుగు అవసరమైనంత మాత్రమే ఉపయోగిస్తూ మిగతా సమయాల్లో దొరగారు గ్రీకు, హీబ్రూ, పారశీక భాషలలోని గ్రంథాలను చదువుతూ వుండేవారు. కలకత్తాలో తామున్నప్పుడు తండ్రిగారు యిచ్చిన శిక్షణ వల్ల హీబ్రూ భాష బాగా పట్టుబడింది. దాన్ని కడపలో కొనసాగించారు.

తొలి ఉద్యోగం స్వీకరించాక బ్రౌనుదొరగారికి తమ తండ్రిగారి ఆశయాలు, ఆయన తన మీద పెట్టుకొన్న ఆశలు జ్ఞాపకం వచ్చాయి కాబోలు. డేవిడ్ బ్రౌనుగారు తన కుమారులు ముగ్గుర్నీ క్రైస్తవ మత బోధకుల్ని చేయాలనుకొంటే కుంఫిణీవారు సివిలు సర్వెంట్లను చేశారు. తండ్రిగారు కలకత్తాలో వున్నప్పుడు ఉత్తమ క్రైస్తవ ధర్మాలను ఆచరణలో పెట్టారు. ధర్మబళ్ళను ఆయన నడిపేవారు. తమ తండ్రిగారి సంఘుసేవను గుర్తుకు తెచ్చుకుని బ్రౌను దొరగారు కడపలో రెండు ధర్మబళ్ళను నేటివుల విద్యకోసం స్థాపించారు. తెలుగు హిందూస్థానీ భాషలు నేర్పడానికి వాటిలో నేటివు అయ్యవార్లనే నియమించారు.

1822 అక్టోబరు 25 నాటికి బ్రౌను దొరగారు కడప నుండి బదిలీ అయ్యారు. మచిలీపట్నం జిల్లాకు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. సహాయక మేజిస్ట్రేట్ హోదాలో ఉంటూ దస్తావేజులు రిజిష్టర్ చేస్తూ వెయ్యిరూపాయల లోపు సివిల్ దావాలు విచారణ చేసి తీర్పులు చెప్పే సివిల్ సర్వెంటుగా డిసెంబరు 16నాడు ప్రమాణ స్వీకారం చేసి విధులను స్వీకరించారు.

1823లో జిల్లా జడ్జిగారు సెలవు మీద వెళ్ళడం వల్ల ఆ ఖాళీలో రెండు నెలలపాటు జడ్జిగా, క్రిమినల్ జడ్జిగా బ్రౌను దొరగారు వ్యవహరించవలసి వచ్చింది. అప్పటికే ఆయన పైలా పచ్చీసులో ఉన్నారు. వయసు పట్టుమని పాతిక నిండలేదు. ఉడుకు నెత్తురు. చుట్టూ వున్న అవినీతిని, లంచగొండితనాన్ని చూసి ఆయనకు ధర్మకోపం వచ్చింది. మచిలీపట్నం కోర్టు నాజరు మరికొందరు ఉద్యోగులతో కలసి చేస్తున్న అక్రమాలు చూసి బ్రౌనుదొరగారు మండిపడ్డారు. నాజరును బర్తరఫ్ చేశారు. రెగ్యులేషన్లలో ఉన్న లొసుగులు, రూల్సు ఇచ్చే రక్షణలు బాగా తెలిసిన నాజరు పై అధికారులకు అర్జీలు పెట్టుకొన్నాడు. సర్కారువారు బ్రౌను దొరగారిని సంజాయిషీ అడిగారు. ఆయన చెప్పిన విషయాలు ఉన్నతాధికారులు స్వీకరించక బర్తరఫ్ ఉత్తరువులు రద్దు చేశారు. ఈ ఉదంతం యువకులైన దొరగారి మీద ఏమీ ప్రభావం చూపినట్టే లేదు. తమ తొందరపాటు, ఆగ్రహాలను అణచుకోవడం నేర్చుకోలేదు.

కడపలో స్థాపించినట్టే మచిలీపట్నంలో కూడా బ్రౌను దొరగారు ధర్మబళ్ళను నెలకొల్పారు. తమ సొంత విజ్ఞానానికి బెంగాలీ వ్యాకరణాన్ని పఠించసాగారు. సంస్కృతం దేవనాగరి లిపి నేర్చుకొని మరీ అధ్యయనం చేయసాగారు. 1823 జూన్ నెలలో ఆరు వారాల పాటు సెలవు తీసుకొని బందరు నుండి చెన్నపట్నానికి వెళ్ళారు. కొత్త పుస్తకాల కోసం ఆతృతగా అన్వేషించే ఆయనకు మద్రాసులోనే, బహుశా ఆబే దుబాయ్‌గారు రచించిన 'హిందువుల ఆచారాలు' అనే గ్రంథం తటస్థపడింది. దాన్ని కొని బందరుకు తీసుకొని వెళ్ళి ఉంటారు. ఆ పుస్తకానికి చాలా చరిత్ర ఉంది. దానిని చదివిన బ్రౌను దొరగారు తెలుగు సాహిత్యంలో చాలా చాలా చరిత్రను సృష్టించారు.

ఆబే దుబాయ్ (1770-1848) పరాసు ఫాదిరీ, కేతలిక్కు, భారతదేశంలో క్రైస్తవ మత వ్యాప్తికోసం 1792 నుండి 1823 దాకా దక్షిణ భారతంలో సంచరించిన ప్రబోధకుడు.

తెలుగు, తమిళ, కన్నడ భాషలు క్షుణ్ణంగా వచ్చు. సంస్కృత జ్ఞానం కూడా బాగా అలవర్చుకొన్నాడు. భారతీయులలాగే పరివ్రాజకుని వేషధారణ వేసి ప్రజలలో కలసి మెలిసి తిరిగేవారు. అందరూ ఈయనను 'దొడ్డస్వామయ్యవారు' అని పిలిచేవారు. రెండు దశాబ్దాలపాటు హిందువుల ఆచార వ్యవహారాలను పరిశీలించి వాటిపై ఆయన ఫ్రెంచి భాషలో ఒక గ్రంథం రాశారు. ఇటువంటి గ్రంథం దొరికితే ఆంగ్లంలో ప్రచురించాలని కుంఫిణీ వారు భావిస్తున్నప్పుడు ఈ ఫ్రెంచి గ్రంథం గురించి విన్నారు. 1807లో ఈ వ్రాతప్రతిని సంపాదించారు. ప్రతికలు పుట్టించి ఒక ప్రతిని లండన్ పంపారు. 1816లో ఏ.డి. కేంబెల్ గారు కాలేజి బోర్డు సెక్రటరీగా ఉన్నప్పుడు ఆబే దుబాయ్ గ్రంథాన్ని ఆంగ్లంలోనికి అనువదించి ప్రకటిస్తే బాగుండునని భావించారు. ఒకరు అనువాదం ప్రారంభించారు. మధ్యలో మరొక ఆలోచన వచ్చింది. అప్పుడు దుబాయ్ ఫాదరి దక్షిణ భారతంలోనే ఉన్నారు. ఈ గ్రంథంలో చేర్పులూ మార్పులూ అవసరమైతే ఆ పని చేయమన్నారు. దుబాయ్ ఫాదిరీగారు మూలగ్రంథాన్ని చాలాచోట్ల పెంచి అదనపు సమాచారంతో తిరగ రాశారు. అయితే ఈ విపులీకరణ ప్రతి అందేలోగా పూర్వం అనువాదానికి పంపిన పుస్తకాన్ని ఆ ట్రాన్సులేటరు పూర్తిగా తర్జుమా చేశాడు. ముద్రాపకునికి అందచేశాడు. దాని అచ్చుపని పూర్తయి అమ్మకానికి పుస్తకాల షాపులోనికి వచ్చింది. వేడి వేడి కేకులలాగ ప్రతులు అమ్ముడయ్యాయి. బ్రౌను దొరగారు ఈ సంగతి విని పుస్తకాన్ని కొనుక్కొని బందరుకు వెళ్ళారు.

1824లో ఆబే దుబాయ్‌గారి రచన చదువుతూ ఉంటే దొరగారికి సహజంగా ఒకచోట అత్యంత విస్మయం కలిగించే వాక్యాలు కనబడ్డాయి. తాము ఏ కడపలో రెండేళ్ళపాటు ఉద్యోగం చేసి తెలుగు అనర్గళంగా మాట్లాడడం సాధన చేశారో ఆ కడప జిల్లాలోనే ఒక గొప్ప కవి ఉన్నాడని దుబాయ్ ఫాదిరీగారు రాస్తే సహజంగానే బ్రౌను దొరగారిలో కుతూహలం పెరిగింది. తమ పుస్తకంలో రెండుచోట్ల దుబాయ్ ఫాదిరీ వేమనగారిని పేర్కొన్నారు. రెండోసారి ఒక అధోజ్ఞాపికలో ఇలా చెప్పారు. ''ప్రఖ్యాత కవులలో చాలా ప్రాచుర్యం పొందిన కవులలో వేమన ఒకరు. వీరి పద్యాలు తెలుగులో రచించినవే అయినా బోలెడు ఇతర భాషలలోనికి అనువాదమయినవి. ఈ తాత్త్విక కవి రెడ్డి కులానికి చెందినవాడనీ, కడప జిల్లాలో 17వ శతాబ్ది చివరి పాదంలో జన్మించినవాడనీ చెప్పుకొంటారు. ఈయన పద్యాలలోని శానా ఉదాహరణలు నేను విన్నాను. అవి వివేకంలోనూ, స్వతంత్రంలోనూ శ్రేష్ఠమైనవి.''

దుబాయ్ ఫాదిరీగారి ఈ వాక్యాలు చదివాక బ్రౌను దొరగారు వేమన పద్యాలను చదవాలనుకొన్నారు. తమ పరిచయస్తులయిన నేటివులందరినీ వేమన గురించి ప్రశ్నించారు. ఆ కవి శ్రేష్ఠుని గ్రంథాన్ని తమకు ఇవ్వమన్నారు. మచిలీపట్నం కోర్టులో సదర్ అమీనుగా ఉంటున్న పండితుడు తిప్పాభట్ల వెంకటశివ శాస్త్రి ఒక ప్రతిని తీసుకొచ్చి ఇచ్చాడు. ఇది దొరగారికి అందిన తొలి ప్రతి. అందుకు దీనిని 'A' అనే ప్రథమాక్షరంలో గుర్తు చేసుకొన్నారు. ఈ తాళపత్ర ప్రతిలోని పద్యాలను కాగితాల మీదకు కనకాద్రి ఎక్కించసాగాడు. ఇంతలో కడప నుండి ఒక ప్రతి వచ్చింది. దీనిని 'C' అని పేర్కొన్నారు.

'A' ప్రతిలోని పద్యాలనూ, 'C' ప్రతిలోని పద్యాలను కనకాద్రి కాగితంమీదకు ఎక్కించాడు. దీనిని 'B' కనకాద్రి ప్రతి అని వ్యవహరించారు.

ప్రతులు సిద్ధమవుతున్నప్పుడే తర్జుమాకు కావలసిన సరంజామాను సమకూర్చుకొన్నారు. తెలుగు పద్యాలను ఇంగ్లీషులోనికి అనువదించాలంటే అర్థ నిర్ణయం కచ్చితంగా ఉండాలి. తెలుగు పదాలకు ఇంగ్లీషు అర్థాలను ఇచ్చే నిఘంటువును ఏ.డి. కాంబెల్ దొరగారు రచించారు. దానికి కాలేజి బోర్డువారు మూడేళ్ళకిందటే 1821లో అచ్చువేశారు. దీని ప్రతినొకదానిని దొరగారు కొన్నారు. దానిని కూలంకషంగా పరిశీలించారు. అందులో 14,862 పదాలు మాత్రమే ఉన్నాయి. దీనివల్ల భాష సమగ్రంగా తెలియదు. అందుచేత తెలుగు పదాలకు ఇంగ్లీషు అర్థాలనిచ్చే T.E.D. నిఘంటువును ప్రారంభించి, కొత్త మాటలు తటస్థపడ్డప్పుడు వాటినీ, వాటి అర్థాలనూ ఆ సంపుటానికి ఎక్కించసాగారు. వేమన పద్యాలలో ఎన్నో అపురూపమైన, అపరిచితమైన పదాలు కనబడుతున్నాయి. ఇవి నిఘంటువులకు కూడా ఎక్కాలి అని దొరగారు నిర్ణయించుకొన్నారు.

వివిధ ప్రతుల నుండి వేమన పద్యాలను కాగితం సంపుటాలలో ఎక్కించాక 1824 మార్చి 5వ తారీఖునాడు దొరగారు వాటిని ఆంగ్లంలోనికి అనువదించడానికి పూనుకొన్నారు. పదిరోజుల పాటు అశ్లీల పర్వంలోని పద్యాలనే అనువాదం చేశారు. ఆనాడు వేమన పద్యాల పేరుమీద ఎన్నో మోటు పద్యాలు, బూతు పద్యాలూ చలామణిలో ఉండేవి. కొన్ని ఘాటు పద్యాలను వేమనగారు స్వయంగా చెప్పకపోలేదు. ఈ తరహా వాటి నన్నింటినీ ఒకచోట చేర్చి దొరగారు ఆ విభాగానికి 'అశ్లీల పర్వం' అనే పేరు పెట్టారు. సాధు పాఠాలు, శాశ్వతక్రమమూ నిర్ణయమయ్యేదాకా ఈ సందిగ్ధ పద్యాలను ఇంగ్లీషులోనికికాక లాటిన్‌లోనికి అనువదిస్తే మంచిదని దొరగారు నిర్ణయించారు. మార్చి 19వ తారీకున మొదటి భాగంలోని పద్యాలను అనువదించడం ప్రారంభించారుగాని ఒక్క వారం తిరక్కముందే మార్చి 24వ తేదీనాడు ఆ పనిని ఆపేశారు.

వేమన పద్యాల అనువాదం తాత్కాలికంగా నిలిపి వేయడానికి బలమైన కారణం ఉంది. పాఠ నిర్ణయం చేయాలన్నా, లేఖక దోషాలను పరిహరించాలన్నా ఛందోజ్ఞానం చాలా అవసరం. అందుచేత 1824 మార్చి 24వ తారీఖు నుంచి ఏప్రిల్ 12వ తారీఖు దాకా ఒక మూడు నెలలపాటు ఛందస్సు నేర్చుకొనడానికి వినియోగించారు. వారికి గ్రీకు, లాటిన్ ఛందస్సుల పరిజ్ఞానం ఉంది. అందుచేత అతి కొద్దికాలంలోనే తెలుగు ఛందస్సులను అవగాహన చేసుకొన్నారు. రోజుకో గంట చొప్పున ఒకటి రెండు వారాలు ముఖ్య సూత్రాలను అధ్యయనం చేస్తే ఏ విద్యార్థికైనా ప్రారంభ దశలో ఛందస్సు పట్టుపడుతుందని ఆయన స్వానుభవం వల్ల తెలుసుకొన్నారు. ఇంకో రెండు వారాల పాటు కృషి చేస్తే జటిలమైన ఛందో రహస్యాలు తెలుసుకోవచ్చునని భావించారు.[1]

1824 ఏప్రిల్ 15వ తారీఖు నుండి స్థిరంగా కూర్చొని పద్యానువాదం పునః ప్రారంభం చేశారు. జూలై 31 నాటికి ప్రథమ భాగం అనువాదం పూర్తి చేశారు. అంటే

1. ఆంధ్ర గీర్వాణచ్ఛందం - పుట 3

మూడున్నర నెలలపాటు ఈ ఆంగ్లీకరణ సాగిందన్నమాట. ఒక్క వారంరోజులపాటు విశ్రాంతి తీసుకొని 1824 ఆగస్టు 8 నాడు ద్వితీయ భాగంలోని పద్యాలను అనువదించసాగారు.

ఒక వారం రోజులు విశ్రాంతి తీసుకొన్నారంటే ఆ ఏడు రోజులలో ఒక ముఖ్యమైన పనిని పురమాయించారు. పదాల అర్థాలను నిర్ణయించడానికి నిఘంటువు సహాయం చాలా అవసరం. మచిలీపట్నంలోనే మామిడి వెంకయ్యగారు ఉన్నారని దొరగారికి తెలుసు. ఆ పండితుడు ఆంధ్ర దీపిక అనే నిఘంటు రచన చేసి కుంపిణీ వారి కాలేజి బోర్డుకు వెయ్యి వరహాలకు దాని కాపీ రైటును విక్రయించారనీ తెలుసు. మాతృక నుంచి ఎన్ని ప్రతికలనైనా పుట్టించి తమ ఇష్టులకు ఇచ్చుకోవచ్చుననే షరతును వెంకయ్యగారు తమకు అట్టి పెట్టుకొన్నారని కూడా దొరగారికి తెలుసు. అందుచేత ఆంధ్ర దీపికకు తమకు కావలసిన పద్ధతిలో త్వరగా ఒక ప్రతి పుట్టింప చేశారు. 1824 ఆగస్టు 12వ తేదీ నాటికి ప్రతి సిద్ధమైంది. ఇది దొరగారి సూచన మేరకు వ్యుత్పత్తుల కలం విడిచిపెట్టి మాతృక క్రమాన ఉన్నట్టు వ్రాసిన ప్రతి. ఇది ప్రస్తుతపు అవసరాలకు, భావి సమగ్ర రచనకు ప్రాతిపదికరూపంగానూ సరిపోతుందని దొరగారు భావించారు.

రమారమి మూడు నెలలపాటు శ్రమించి నవంబరు నాలుగవ తేదీనాడు ద్వితీయ భాగం అనువదిస్తూనే కొన్ని పద్యాలను చిల్లర భాగంలోనూ, కొన్ని అశ్లీల పర్వంలోనూ జమకట్టి వేరే విడిగా ఒక సంపుటిలో వ్రాయసాగారు. మోటుగా వుండే వాటిని పూర్వంలాగే లాటిన్ భాషలోనికే అనువాదం చేశారు. తొలి రెండు భాగాలలోని పద్యాలూ, అశ్లీలపర్వంలోని 55 పద్యాలు, చిల్లరభాగంలోని 91 పద్యాలు పరిష్కరించి అనువదించారు. వెంకటశివయ్యగారి ప్రతిలోనూ, కనకాద్రి ప్రతిలోనూ వున్న యావత్తు పద్యాలూ ఈ సంపుటాలలోనే ఎక్కాయని దొరగారు నోటు చేసుకొన్నారు. అయితే 37 పద్యాలను, అవి పునరుక్తులు కాబట్టి త్రోసిపుచ్చారు.

ద్వితీయ భాగం పూర్తి చేసిన మరునాడే నవంబరు 5వ తేదీనాడు తృతీయ భాగం అనువదించడానికి దొరగారు పూనుకొన్నారు. సగటున రోజుకు ఎనిమిది పద్యాల చొప్పున పరిష్కృత అనువాదం సాగింది. 1824వ సంవత్సరమంతా వేమన పద్యాల తర్జుమాలోనే దొరగారు తమ తీరిక సమయాల్లోని అన్ని గంటలూ వినియోగించాను.

1824 నవంబరు 23వ తేదీనాడు దొరగారిని రాజమండ్రి కలెక్టరుగారికి, మేజిస్ట్రేటు గారికి హెడ్ అసిస్టెంటుగా కుంఫిణీ వారు నియమించారు. ఉద్యోగక్షేత్రం మారినా చేపట్టిన సాహిత్య కార్యక్రమం ఆగలేదు.

అనువాదం చేస్తూనే మధ్యమధ్య ఈ సంపుటాలలో నోట్సుతోపాటు ఉత్తరోత్తరా ఇవి ప్రకటించబోయేటప్పుడు అచ్చువేయవలసిన ఉపోద్ఘాతాలు దొరగారు వ్రాస్తూ వచ్చారు. డిసెంబరు 23వ తేదీన వేమన పద్యాలపైన 16 పుటల తొలి పలుకులు దొరగారు పూర్తిచేశారు. ఎన్నెన్నో విషయాలు అందులో పొందుపరిచారు. సంవత్సరం పూర్తయినా తలపెట్టిన కార్యం సంపూర్ణం కాలేదు.

1825లో వేమన పద్యాల అనువాదాన్ని కొనసాగించారు. కిందటి సంవత్సరం నవంబరు 5వ తారీఖున మొదలెట్టిన తృతీయ భాగపు అనువాదం ఈ యేడు జనవరి 18వ తారీఖు దాకా సాగింది. ఈ భాగంలో మొత్తం 543 పద్యాలను ఆయన తర్జుమా చేశారు. తృతీయ భాగం పూర్తి చేసిననాడే చతుర్థభాగం అనువాదానికి పూనుకొన్నారు. ఏప్రిలు 21వ తేదీ నాటికి నాలుగవ భాగం సంపూర్ణమయింది. దీనితోపాటు చిల్లరపద్యాలూ, అశ్లీల పద్యాలూ ఉన్న పంచమ విభాగం కూడా తుదముట్టింది.

వేమన పద్యాలను అనువదిస్తున్న కాలంలో బ్రౌను దొరగారికి తిప్పాభట్ల వెంకటశివ శాస్త్రితోపాటు పర్యం సోదరుల సలహాలు, సహాయాలు లభించాయి. వీళ్ళు ముగ్గురూ అన్నదమ్ములు. పెద్దాయన పేరు పర్యం అద్వైతబ్రహ్మ శాస్త్రి. ఈయనకు బ్రహ్మయ్య అనేది వ్యవహారనామం. ఇతని పెద్ద తమ్ముడు 1825లో 18 ఏళ్ల యువకుడు. పేరు సీతారామ శాస్త్రి. చిన్న తమ్ముడు రామలింగ శాస్త్రి. బ్రహ్మయ్యగారు కోర్టు పండితులు. ఈయన దొరగారిని ముందు భారతం చదవమని ప్రార్థించసాగారు. ఈ ఆది కావ్యాన్ని సీతారామ శాస్త్రితోపాటు చదవమని విన్నవించారు. రామలింగ శాస్త్రికన్నా సీతారామశాస్త్రి చాలా తెలివైనవాడు. పైగా కవి. బ్రహ్మయ్యగారి సలహాను పాటించి దొరగారు ఆంధ్రమహాభారత పఠనాన్ని వెంటనే ప్రారంభించారో, లేదో తెలియదు. బ్రహ్మయ్యగారి సలహా ఇచ్చిన విషయాన్నే గ్రంథస్థం చేశారు.

వేమన పద్యాల సంస్కరణలో బ్రహ్మయ్యగారి సలహాలు కొన్ని ఉన్నాయి. విశేషణాల వ్రాతలో ఐక్యం పనికిరాదని, దానికి బదులు 'యిన' అనే అక్షరక్రమాన్నే వాడాలని బ్రహ్మయ్యగారి నిర్ణయాత్మకమైన సూచన (ఆయన సూచనమేరకు నేను ఇది ఇప్పుడు 'నిర్ణయాత్మకమయిన' అని స్పెల్‌చేసి ఉండాలి).

వేమన పద్యాల సంస్కరణలో బ్రహ్మయ్యగారు మరొక అభిప్రాయాన్ని చెప్పారు. 'ఈ పద్యాలను ఎంత శ్రద్ధగా సంస్కరించినా వ్యాకరణ దోషాలూ, ఛందోభంగాలూ, అలంకారిక లోపాలూ ఉండనే ఉంటాయి. వీటిని సంస్కరించాలంటే కొత్త రచన చేయడమే అవుతుంది. అందుచేత దీనినొక భక్తి కావ్యంగా భావించి ఇప్పుడున్న పద్యాలను యథాతథంగా అచ్చువేయడమే సముచితం. ఇప్పటి పద్యాలు అందుకు యోగ్యంగానే ఉన్నాయి'. (D.1773 - 4వ సంపుటి)

బ్రహ్మయ్యగారి నోట ప్రతిరోజూ ఒకే పాట. ''వేమన పద్యాలను ఏమీ సంస్కరించకండి. వాటి పాఠాలను అట్లాగే శాశ్వతంగా ఉండనివ్వండి. తమరు కావ్యకవుల కృతులను చదవడంలోనే తమ కాలాన్ని సద్వినియోగం చేసుకోండి'' అని దొరగారి చెవినిల్లు కట్టుకొని బ్రహ్మయ్యగారు శతథా చెప్పేవారు.

మచిలీపట్నంలో బ్రహ్మయ్యగారి సోదరునితో కలసి మహాభారతం చదివిన దాఖలాలు లేవుగాని, రాజమండ్రి చేరాక కోనసీమలో ఉండే ములుపాక బుచ్చయ్య శాస్త్రి అనే ఆరామద్రావిడ బ్రాహ్మణ కవితో పరిచయం ఏర్పడింది. ఈయన 'వెంకటేశ్వర

మాహాత్మ్యం', 'మాఘమాహాత్మ్యం' అనే కావ్యాలను రచించారు. దొరగారితో ఎలా పరిచయమైందో తెలియదుగాని, ఈ పండితకవి దగ్గర కావ్యాలు చదువుకోవాలనీ, ఛందస్సు నేర్చుకోవాలనీ అభిలషించి ఆ కోరికను వెంటనే తీర్చుకొనసాగాడు.

కావ్యాలలో భాష సర్వసాధారణమైన తెలుగువాళ్ళకు బోధపడని మోతాదులో ఉందని దొరగారు గుర్తించారు. అయితే నిరక్ష్యరాస్యులైన ఆంగ్లేయులకు మిల్టన్, డ్రైడన్ కవుల భాష కొరుకుడు పడుతుందా? కృషి వల్లనే సాహిత్య పునర్వికాసం సాధ్యమవుతుందని దొరగారు భావించారు. ''షేక్స్పియర్ నాటకాలలోని కొన్ని పలుకుబళ్లూ, నుడికారాలూ ఇవాళ సర్వసామాన్యంగా అందరికీ అర్థమవుతున్నాయంటే వ్యాఖ్యాతలు విపులంగా వాటిని వివరించి ప్రాణం పోయబట్టే అవి భాషలో మళ్ళా చలామణి అవుతున్నాయి. ఇటువంటి పునర్వికాసం తెలుగు సాహిత్యంలో కూడా సాధ్యమవుతుందని నమ్మకంగా ఆశించవచ్చు. అయితే సక్రమమైన పద్ధతులను అనుసరించాలి.'' అని దొరగారు విశ్వసించారు. ''సంస్కృత విద్యలను పునరుద్ధరించిన గౌరవాన్ని ఇంతవరకూ ఇంగ్లీషు పండితులు నోచుకొన్నారు. ఇకమీద తెలంగాణా భాషలకు తమ సహాయాన్ని వారు ప్రసాదింతురుగాక!'' అని దొరగారు అర్థించారు (D-1773, సంపుటి 4). ఆంగ్లేయులందరూ కలసి సహాయం చేస్తే ఎంతటి ఉపకారం జరుగుతుందో అంతా తామొక్కరే ఒంటిచేతిమీదుగా చేయడానికి ప్రణాళిక వేసుకొన్నారు.

తెలుగు సాహిత్యాన్ని పునరుద్ధరించాలంటే ముందు అన్ని కావ్యాలకూ సుపరిష్కృత ప్రతులు సిద్ధం చేయాలి. సాధుపాఠాలు నిర్ణయించాలి. ప్రాచీన ప్రయోగాలకు బదులు తమ చిత్తమొచ్చిన పదాలను విలేఖరులు తరతరాలుగా వ్రాతప్రతులలో చొప్పిస్తూ వుంటారు. ఈ గతి గ్రీకు కావ్యాలకు కూడా పట్టింది. ఈ సంగతి తెలిసిన దొరగారు ఒక చోట ఇలా రాశారు. ''గ్రీకు కావ్యాలలో ప్రాచీన కవుల ప్రయోగాలను వ్రాయసకాండ్రు సర్వసాధారణ భాషకు మార్చేస్తున్నారని విలపిస్తూ వుంటే ప్రస్తుత దైన్యస్థితిలో వున్న తెలుగు సాహిత్యంలో ఇటువంటి మార్పులు ఎంత విస్తారంగా ఉంటాయో మరి?'' (D-1773. సంపుటి 4).

తీరిక సమయాలను సంపూర్ణంగా తెలుగు సాహిత్యానికి అంకితం చేసినా బ్రౌను దొరగారు కుంఫిణీ సివిల్ సర్వెంటుగా తమ విధులను అలక్ష్యం చేయలేదు. ఇంకా ఉడుకునెత్తురు బాగా మరుగుతూ ఉండడం వల్ల తమ సిబ్బందిలోగాని, తమ అధికారం చెల్లుబడి అవుతున్న శాఖలలోగాని ఏ మాత్రం అవినీతినైనా సహించలేకపోయారు. 'నమ్మక్‌దారోగా' ఉద్యోగిగా ఉన్న గవర్రాజు ఉప్పుకొఠార్లలో వర్తకుల నుండి డబ్బు గుంజుతున్నాడన్న నేరారోపణను పరిశీలించి ఆ ఆసామిని ఉద్యోగం లోంచి బర్తరఫ్ చేయడమేకాక రెండువేల రూపాయలు జుల్మానా వేశారు. బ్రౌను దొరగారి ఈ చర్య ఉద్యోగులకు సింహస్వప్నమయింది. జుల్మానా చెల్లించాక గవర్రాజు చెన్నపట్నంలోని రెవెన్యూ బోర్డువారికి, పై అధికారులకు అర్జీ పెట్టుకొన్నాడు. వాళ్ళు కేసు మొత్తం పరిశీలించి గవర్రాజు చేస్తున్నదాంట్లో సంప్రదాయవిరుద్ధమైనదేమీ లేదని తేల్చారు. అతగాడు వసూలు చేస్తున్న ద్రవ్యం దైవకార్యాలకని సాక్ష్యం పుట్టింది. కట్టిన జుల్మానాను వడ్డీతో వాపసు

చేయమని హుకుం జారీ చేశారు. ఈ కేసులో గవర్రాజుపై చాడీలు చెప్తూ ఉప్పందించిన ఇన్‌ఫార్మర్‌లకు ముట్టచెప్పిన ఇనాము నగదులను తిరిగి రాబట్టమన్నారు. ధర్మకోపంతో ముక్కుకు సూటిగా పోయే బ్రౌనుదొరగారి తలకు రెండోబొప్పి ఉద్యోగ నిర్వహణలో కట్టింది. మచిలీపట్నంలో ఇంతకు ముందు ఆయన బర్తరఫ్ చేసిన కోర్టునాజరు హాయిగా మళ్ళా కొలువులో ఉన్నాడు. ఇప్పుడు ఈ నమ్మక్‌దారోగా గవర్రాజు కథ ఇలా అడ్డం తిరిగింది.

కచ్చేరి పనులు ఎలా ఉన్నా కావ్యసేకరణ మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతూంది. బెంగాలు సివిల్ సర్వీసులో ఉన్న పాశ్చాత్య పండితులు హెచ్.హెచ్. విల్సన్ (1786-1860) గారు అప్పుడే సంస్కృత విష్ణుపురాణాన్ని కలకత్తా నుండి ఆంగ్లేయులకు పరిచయం చేశారు. తెలుగులో ఒక విష్ణుపురాణం ఉందని బ్రౌను దొరగారు విన్నారు. చెన్నపట్నం కాలేజీలో ఒక ప్రతి ఉందని తెలుసుకొని దానికొక పుత్రికను పుట్టించారు. (D-312) దీనిని ఆసాంతం పరిశీలించాక ఈ ప్రతిని ఇతర ప్రతులతో సరిచూడాలని దొరగారు భావించారు. ముగ్గురు పండితుల పరిష్కరణలు సంపాదించారు.

ములుపాక బుచ్చయ్యగారితోనూ, బ్రహ్మయ్యగారితోనూ సంప్రదించాక మొదట ఏయే కావ్యాలు చదవాలో నిర్ణయించుకొన్నారు. దొరికిన కాడికి కావ్యాలను తాళపత్రాల నుండి కాగితాల మీదకు ఎక్కింప చేశారు. రూపాయకు రెండువందల పద్యాల చొప్పున విలేఖరికి కూలి ఇచ్చి కాగితం ప్రతులను సిద్ధం చేయించారు. రాయసాలకు ఈ రేటు సరిపోతుందిగాని పరిష్కరించే పండితులకు జీతం అన్నీ కలుపుకొని లెక్కపెడితే రెట్టింపు సెలవు అవుతుంది. విష్ణుపురాణం ప్రతి తయారు చేయించడానికి బైండింగు చార్జీలు మినహా 32 రూపాయలు పట్టింది.

> (D-313 ప్రతిలో దొరగారు ఇలా రాశారు. ''ఆన 1825లో నేను విష్ణు పురాణాన్ని నిండా శ్రద్ధగా చదివివున్నాను. కాని నా స్వంత ప్రతిని ఎవరో దొంగిలించారు. కాబట్టి దొరికినంత మట్టుకు ప్రశస్తమైన వ్రాతప్రతులనుండి ఈ పుస్తకము సిద్ధము చేయించినాను. పద్య సంఖ్యలు తప్పుగా ఉన్నాయి. నా డిక్షనరీలో పొందుపరిచిన అంకెలనుబట్టి పిదప సవరించినాను.)

1825 ఏప్రిలు 25వ తేదీనాటికి వేమన పద్యాల చిత్తు పరిష్కరణా, ఆంగ్లీకరణా ముగిసింది. కాబట్టి మే నెల నుంచి కావ్యసేకరణ ప్రతుల పరిష్కరణ, విశ్లేషణ ప్రారంభించారు. విష్ణుపురాణమేకాక పద్మపురాణం చాలా ప్రఖ్యాతమైనదని విన్నారు. మడికి సింగన రచించిన ఈ కావ్యాన్ని నిండా ఆసక్తితో చదివారు. ఇందులోని అహల్యా చరిత్ర వారిని బాగా ఆకట్టుకొంది. వాస్తవానికి మడికి సింగన ఈ ఘట్టాన్ని ఆకర్షవంతంగా రచించారు. దొరగారు ఈ రచనకు ముగ్ధులై అహల్యా కథను సింగన పద్యాల నుండి ఇంగ్లీషులోనికి 1825 మే 18వ తేదీనాడు అనువదించటం ప్రారంభించారు. 25వ తేదీనాడు ముగించారు. (D-383)

ఒక పని ముగిసిన వెంటనే తీరికూర్చోవడం దొరగారికి చేతకాని విద్య. అహల్యా చరిత్రను ఆంగ్లంలో పూర్తిచేసిన మర్నాడే మే 26వ తారీఖున నీలాసుందరీ పరిణయాన్ని చదవడం ప్రారంభించినట్టుంది. కొంతదాకా ఆంగ్లానువాదం చేశారు. (D-552)

కావ్యపఠనం చేస్తున్నప్పుడు దొరగారికో భావం కలిగింది. ఇప్పటిదాకా కాలేజీ బోర్డువారు తెలుగు అభ్యసించడానికి వీలుగా వ్యాకరణాలూ, నిఘంటువులూ, పదకోశాలూ, సెలక్షన్లూ ప్రకటిస్తున్నారేగాని తెలుగు కావ్యాల పరిచయం గట్టిగా ఏర్పరుచుకొనదలచిన ఆంగ్లేయులకు పనికివచ్చే ఛందోగ్రంథాలను చెన్నపట్నం కాలేజీవారు ప్రకటించలేదు. కలకత్తాలో కోల్‌బ్రూక్‌గారు, యేట్సుగారు గీర్వాణ ఛందస్సు గురించి అప్పుడప్పుడు అక్కడక్కడ వివరాలు ఇస్తున్నారుగాని దక్షిణ భారతంలో ఏ సివిల్ సర్వెంటూ ఛందస్సు మీద తన దృష్టిని సాగించలేదు. ఆ కార్యం తామే సాధించాలని దొరగారు భావించారు. చెన్నపట్టణంలోని కాలేజీ బోర్డులో సభ్యుడుగా ఉంటున్న మేస్తర్ రిచర్డు క్లార్కు దొరగారు ప్రోత్సహించడం వల్ల ఈ సంవత్సరంలోనే 'Analysis of Telugu Prosody' అనే రచన మొదట చేశారు. (D-1260)

తెలుగు ఛందో గ్రంథాలలో కవిజనాశ్రయం అత్యంత ప్రాచీనమైనది. దీని ప్రతిని తయారుచేయించాక తిప్పాభట్లు వెంకటశివ శాస్త్రిగారు సవరించారు. ''దీనిని నాకు చదువు చెప్పిన పండితులు వెంకటశివయ్యగారు సరిదిద్దారు'' అని కృతజ్ఞతలు చెప్తూ దొరగారు దీనిని అధ్యయనం చేశారు. ఇంతకు ముందు వేమన పద్యాల పరిష్కరణ కోసం చదివిన ఛందో విషయాలపై రాసి పెట్టుకొన్న నోట్సును సొంతం తిరగరాశారు. ఈసారి ఛందశ్శాస్త్రంలో నిష్ణాతులైన పండితుల సన్నిధిలో ఈ పని చేపట్టారు. కవిజనాశ్రయాన్ని ఇంగ్లీషులోనికి అనువాదం చేశారు (D-1279). ఎప్పుడు అనువదించారోగాని అప్పకవీయంలోని తృతీయాశ్వాసానికి కూడా దొరగారు ఆంగ్లానువాదం చేశారు. యతిప్రాసలకు చెందిన భాగమే అప్పకవీయంలోంచి తమకు ప్రస్తుతానికి అవసరం కనుక దానితోనే తృప్తిపడ్డారు.

1825 డిసెంబరు నాటికి 'ఆంధ్రగీర్వాణచ్ఛందము' అనే తెలుగు పేరుతో 'The Prosody of the Telugu and Sanskrit Languages Explained' అనే ఇంగ్లీషు గ్రంథాన్ని బ్రౌను దొరగారు రచించారు. ఇందులో ఆరు ప్రకరణాలు ఉన్నాయి. వీటికి ముందు ఒక పది పుటల ఉపోద్ఘాతంలో పూర్వం ఛందోబద్ధమైన రచనలలోనే సర్వవిద్యలు రచించేవారనీ, సంస్కృతంలో వున్న పురాణేతిహాసాలు, కావ్యాలు అన్నీ తెలుగులో చంపూకావ్యాలుగా అనువదితమయ్యేవని చెప్పారు. తెలుగు సాహిత్య పతనం ఏ క్రమంలో సాగాలో చెప్పారు. మొదటి ప్రకరణంలో ఎనిమిది అక్షర గణాలను, రెండు మూడు సూత్రాల గణాలను (హగణ వగణాలను) వివరించారు. పదమధ్యంలో సంయుక్తాక్షరం ముందున్న లఘువు గురువు అవుతోందని చెప్పారు. ఈ సూత్రాన్ని ప్రత్యక్షంగా వివరించడానికి ఆదిపర్వంలోని ఒక పాదాన్ని ఉదాహరణగా ఇచ్చారు.

రెండవ ప్రకరణంలో సమవృత్తాలు, జాతివృత్తాలు విశదం చేశారు. మూడవ ప్రకరణంలో ఉపజాతి వృత్తాలు, అక్కరలు, రగడలు బోధపరిచారు. నాలుగో

ప్రకరణంలో కందపద్యం విశదపర్చారు. అయిదో ప్రకణంలో సంస్కృత కావ్యాలలోని ఛందస్సులను పేర్కొన్నారు. ఆరో ప్రకరణంలో యతిప్రాసలు వివరించారు. మొదటి అనుబంధంలో పారిభాషిక పదాలపై వివరణలు ఇచ్చారు. రెండవ అనుబంధంలో లేఖన విధానం, వర్ణక్రమపద్ధతి తెలియచేశారు. మూడవ అనుబంధంలో మగణాది, యగణాది ఎనిమిది అక్షరమాత్రాగణాలతో మొదలైన వృత్తాలన్నింటినీ క్రమపట్టికలో యతిస్థానాన్ని నిర్దేశిస్తూ చూపించారు. నాలుగో అనుబంధంలో తెలుగు వ్రాత ప్రతుల స్థితిని ప్రదర్శించడానికి ఆంధ్ర మహాభారత సభాపర్వం ద్వితీయాశ్వాసంలోని 155వ పద్యం మొదలుకొని 168వ పద్యం దాకా పాఠభేదాలతో పొందుపరిచారు.

బ్రౌను దొరగారు ఈ గ్రంథంలో పాశ్చాత్య, ప్రాచ్య, భారతీయ తెలుగు పండితులను, గ్రంథకర్తలను, కవులను పేర్కొన్నారు. ఈ చిన్న గ్రంథంలో ఇంతమంది ప్రామాణిక రచయితల నుండి వివరణలు, ఉదాహరణలు ఇవ్వడం గమనించదగ్గ సంగతి. బ్రౌను దొరగారు తమ ఆంధ్ర గీర్వాణచ్ఛందంలో ముగ్గురు సమకాలికులైన తెలుగు పండితులను పేరుపెట్టి ప్రశంసించారు. వారు రావిపాటి గురుమూర్తి శాస్త్రి, వఠ్యం అద్వైత బ్రహ్మ శాస్త్రి, ములుపాక బుచ్చయ్య శాస్త్రి. ఈ ముగ్గురి సహాయంతోను, వారి వద్ద గల ఆంధ్రకావ్యాల ఆధారాలతోను ఈ ప్రాథమిక ప్రామాణిక గ్రంథాన్న దొరగారు ఆరు నెలలలో సిద్ధం చేసి 1825 డిసెంబరు 13వ తేదీనాడు ప్రచురణార్థం కాలేజీ బోర్డు వారికి స్వయంగా తీసుకువెళ్ళి సమర్పించారు.

1826 మార్చి 16వ తారీఖునాడు బ్రౌనుదొరగారు సమర్పించిన ఛందోగ్రంథాన్ని పరిశీలించాక ఏ.డి. కాంబెల్ దొరగారు తమ అభిప్రాయాన్ని చెప్తూ శ్లాఘనీయమైన ఈ పుస్తకంలో కొద్ది మార్పులు చేస్తే ప్రకటనార్హమని గవర్నమెంటు వారికి సిఫార్సు చేశారు. ఈ గ్రంథాన్ని కాలేజీ బోర్డువారు తమ ప్రచురణగా అచ్చు వేయిస్తే తనకు 50 అచ్చుప్రతులు తప్ప ఏవిధమైన పారితోషికం అక్కర్లేదని బ్రౌను దొరగారు స్పష్టం చేశారు. దీనిని ప్రచురించడానికి ప్రభుత్వం అనుమతించింది. సవరణలకు గ్రంథకర్తకు ప్రతిని పంపారు.

బ్రౌను దొరగారు తెలుగు సాహిత్య కృషిలో తలమునకలై ఉంటున్న 1826లోనే మేస్టర్ జారెట్ దొరగారు ఆయనను కలుసుకొన్నారు. వీరికి పూర్వపరిచయం ఉంది. జారెట్ దొరగారు హీబ్రూ భాషలో మత్తయి సువార్తను ప్రచురించినవారు. ఈయన ''ఈ తెలుగు సాహిత్య ఝుంఝూటం పెట్టుకోవద్దు. ఈ చురుకు, ఈ ఉద్రేకం, ఈ అభినివేశం తొందరలోనే తగ్గిపోతాయి'' అంటూ జోస్యంతో కూడిన సలహా అయాచితంగా ఇచ్చారు. చిన్నప్పుడు అందరూ ''నువ్వు ఉత్త చంచల స్వభావుడవు. నీది నిముషానికో గుణం' అంటూ తమకు అస్థిరత్వాన్ని అంటగట్టేవారని బ్రౌను దొరగారికి జ్ఞాపకం వచ్చింది. అయితే ఝుంఝూమారుతంలో ఒక కొమ్మనున్నపత్రం ఎంత రెపరెపలాడినా పట్టు తప్పదు.

1826 జనవరి నెలలో కుంఫిణీ వారు బ్రౌను దొరగారిని రాజమండ్రి నుండి కడపకు బదిలీ చేశారు. అక్కడి జిల్లా కోర్టుకు రిజిస్ట్రార్‌గా నియమించారు. జనవరిలో బదిలీ ఉత్తరువు జారీ అయినా అప్పుడు దొరగారు మద్రాసులో సెలవుమీద ఉన్నారు. ఛందోగ్రంథం నిమిత్తం కావచ్చు. మార్చిలో సెలవు ముగిసింది. మళ్ళా కడపకు రావడం

దొరగారికి సంతోషదాయకమే. ఇక్కడి నేటివులు చాలామంది తమకు తెలుసు. తాము పెట్టిన ధర్మబళ్ళలో చదువుకొన్నవారు ఉన్నారు. తెలుగు రాయడం చదవడం తెలిసిన ఉమేదువారీలు ఇక్కడ తెలిసినవాళ్ళలోనే దొరుకుతారు. వాళ్ళను ఉపయోగించుకొని తెలుగు కావ్యాలలో ముఖ్యమైన వాటిని పాఠాంతరాలతో ప్రతులు తయారు చేయించాలి. వాటిని పండితులచేత పరిష్కరింపచేయాలి. ఈ సిబ్బందికి తగిన ఒక స్థావరాన్ని చూడాలి. తమ బంగాళాలోనే దీనిని కొనసాగించాలంటే ఆ బంగళా విశాలంగా వుండాలి.

ఎప్పుడు ఏ తారీఖునాడు కొన్నారో తెలియదుగాని బ్రౌను దొరగారు కడపలో పెద్ద తోటలో ఒక బంగళాను వెయ్యి వరహాలు పెట్టి కొన్నారు. సాహిత్య కార్యక్రమాలు జరిపించడానికి పండితులను నియమిస్తే ఆ బ్రాహ్మణులు పని చేయడానికి వేరే బంగళాను ఈ తోటలోనే కట్టించారు. మొత్తం ఈ ఆవరణలో మూడు కొఠిడి బంగళాలు దొరగారికి వున్నట్టున్నాయి. నడిమి బంగళాలో బ్రాహ్మణులు పనులు చేసేవారు. ఈ తోటను ఇరవై సంవత్సరాల నుంచి కనిపెట్టుకొని వున్న మాలీలు దొరగారి కొలువులో అదే తోటపని చేయసాగారు. తోట గొప్పది. రోజూ కపిల తోలేవారు. కాలువలు తీసేవారు. బంగళాలో కుశినీ, గుఱ్ఱపు లాయం వగైరాలన్నీ వుండేవి.

కడప చేరాక దొరగారు కోనసీమ నుంచి ములుపాక బుచ్చయ్య శాస్త్రిగారిని, యితర పండితులను తమ వద్దకు రప్పించుకొని బంగళాలో 'కాలేజీ'ని పెట్టారు. ప్రతుల లేఖకులు, మొకాబిలా చేసేవాళ్లు, పరిష్కరించే పండితులు అందరూ ఈ 'కాలేజీ'లో పనిచేసేవారు. 'బాల్యంనుంచి తమ దయవల్ల తరిబియ్యతు అయి తమ కటాక్షానికి' పాత్రుడయిన అయోధ్యాపురం కృష్ణా రెడ్డి అనే సంపన్న కుటుంబంలోని వ్యక్తి బ్రౌను దొరగారికి కుడిభుజం అయ్యాడు. బంగళా వ్యవహారాలూ, కాలేజీ పనుల అజమాయిషీ చూసుకొనేవాడు.

లేఖకులను, పండితులను నియమించాక 1926లోనే దొరగారు తమకు కావలసిన గ్రంథాల ప్రతులు రాయించసాగారు. పట్టాభిరామ శాస్త్రిగారు వ్రాసిన 'ఆంధ్ర ధాతుపాఠం' అనే వ్యాకరణ గ్రంథానికి మాతృక చెన్నపట్టణంలోని కాలేజీలో మాత్రమే వుంది. మరొక ప్రతి ఎక్కడా లేదని దొరగారు విన్నారు. అందుచేత తమ ఖాసాకు ఒక ప్రతిని తయారు చేయించారు. నిండా జాగ్రత్తగా పరిశీలించారు. ఈ గ్రంథం ఒక్క తెలుగు ధాతువులనే వివరిస్తున్నట్టు చెప్పుకొన్నా 'అట్టాయించు' వంటి హిందూస్తానీ మాటలను కూడా స్వీకరించినట్టు దొరగారు గుర్తించారు. (D.1227 చూ॥ పుట 31)

బహుశా కడపలోని కాలేజీలోనే బ్రౌను దొరగారు తమ 'ఆంధ్రగీర్వాణ ఛ్ఛందం'లో కాంబెల్ దొరగారు సూచించారో ప్రస్తుతం లభిస్తున్న ఆకరాల వల్ల తెలియవు. 1827లో కాలేజీ బోర్డువారు ప్రచురించిన ఈ ఛందోగ్రంథం మాత్రం కాంబెల్ దొరగారికే 'శానా గౌరవ పూర్వకంగా' అంకితం. కారణం ఏమిటంటే ఈ దొరగారే తెలుగు సాహిత్యం ఇంగ్లీషు పాఠకుల అందుబాటులోనికి తీసుకువచ్చినవారట. నిజానికి అప్పటికి కాంబెల్

దొరగారు ఇంగ్లీషులో వ్యాకరణం, నిఘంటువు మాత్రమే ప్రామాణికమైన తెలుగుభాషా విషయక గ్రంథాలు.

ఆంధ్ర గీర్వాణచ్ఛందంలో బ్రౌను దొరగారు తెలుగు సాహిత్యాన్ని అభ్యసించవలసిన క్రమం వివరించారని యింతకుముందు చెప్పుకొన్నాం. ఆ క్రమం ఏమిటంటే మొదట వేమన పద్యాల వంటివి చదవాలి. ఇవి కావ్యభాషకు తగినంత స్థాయిలో గొప్పగా లేకపోయినా అవగాహనకు సరిపోతాయి. ఈ పద్యాల తర్వాత చక్రవర్తి రాఘువాచార్యులు రచించిన నలచరిత్ర అనే ద్విపద కావ్యంలో కథ చదవమన్నారు. ఆ పిమ్మట రంగనాథ రామాయణం పఠించమన్నారు. ఈ ద్విపద కావ్యాల పరిశీలన తర్వాతనే ఆంధ్ర మహాభారతంలోని కొన్ని పద్యాలు, భాగవతంలోని అష్టమ దశమ స్కంధాలు అధ్యయనం చేయమన్నారు. ఆ తర్వాత అలంకార కావ్యాలు తారా శశాంకం, సుభద్రా పరిణయం, మనుచరిత్ర, దశావతార చరిత్ర, హంస వింశతి వంటివి చదవాలి. ఆ తర్వాత బాగా చదువుకొన్న పండితులకే కొన్నిచోట్ల చిక్కులు పెట్టే రాఘవపాండవీయం, నైషధం, విష్ణు చిత్తీయం, చిట్టచివర వసుచరిత్ర నిండా శ్రద్ధగా పఠించాలి. తెలుగు సాహిత్యంలో వసుచరిత్రకు చాలా పెద్దపీట వేస్తారు.

తెలుగు సాహిత్యం ఎంత విస్తారమైనదో చెప్పడానికి ఈ కొద్దిపాటి పుస్తకాలను పేర్కొన్నారు. 'ఆంధ్రగీర్వాణచ్ఛందం'లో ప్రామాణిక ప్రయోగాలను మాత్రం ఎక్కువగా ఈ క్రింది కావ్యాలలోంచే యిచ్చారు.

1. ఉత్తర రామాయణం
2. తారాశశాంక విజయం
3. దశావతార చరిత్ర
4. పద్మ పురాణం
5. భానుమతీ పరిణయం
6. భాస్కర రామాయణం
7. మహాభారతం (ఆది, సభా, అరణ్యా, విరాట, కర్ణ పర్వాలు)
8. భాగవతం (దశమ స్కంధం)
9. రంగనాథ రామాయణం
10. రాఘువ పాండవీయం
11. వసుచరిత్ర
12. విష్ణు పురాణం
13. హంస వింశతి

పై గ్రంథాలలోని ప్రామాణిక ప్రయోగాలను దొరగారికి ములుపాక బుచ్చయ్యా శాస్త్రి, బ్రహ్మయ్యా, వెంకట శివయ్యా అందచేసి వివరణలు యిచ్చి వుంటారు. పందొమ్మిదో శతాబ్దంలోని తెలుగు పండితులకు అలవాటయిన పేర్లనే దొరగారు ఈ గ్రంథంలో ఆంధ్రకవులను పేర్కొనేటప్పుడు ఉపయోగించారు. ఉదాహరణకు భాగవతాన్ని రచించినది 'పోతురాజు' (పుట. 81). కందుకూరి రుద్రయ్యకు బదలు కంసాలి భద్రయ్యా (పుట 87, 88) అని చెప్పారు. వాస్తవానికి అప్పకవి ఉదహరించిన 'వెలగకు వెల్లయంచు...' అనే చాటువును కూడా దొరగారు ఈ గ్రంథంలో యిచ్చారు. అయితే ''ఇందుకుగాను వినుకొండలోను గుంటుపల్లి భాస్కరయ్యగారి ముందు కందుకూరి రుద్రయ్యగారు చెప్పిన పద్యము'' అని అప్పకవి చెప్పిన మాటలు బదులు 'రామకృష్ణమ్మ' ఆక్షేపానికి 'భద్రయ్యా'

సమాధానంగా పొందుపరిచారు. తెనాలి రామకృష్ణుని పందొమ్మిదో శతాబ్దపు పండితులు 'రామకృష్ణమ్మ' అని వ్యవహరించేవారు కాబోలు.

గ్రంథ పరిష్కరణలో అభ్యుదయం యిబ్బడి ముబ్బడిగా సాగాక లాక్షణికుల ప్రయోగాల విషయంలో చుట్టూ అల్లుకొన్న కొన్ని కట్టుకథలు పట్టుసడలి వాస్తవం తెలియవస్తూ వచ్చింది. అయితే ఆంధ్ర గీర్వాణచ్ఛందంలో 'ఓం ప్రథమం' యతిస్థాన విషయంలో బ్రౌను దొరగారు ఏర్పరచిన ఒక వ్యవస్థ చాలాకాలం తెలుగు పద్య కావ్య ముద్రణలలో అందరూ పాటిస్తూ వచ్చారు. ప్రతి వృత్తంలోనూ ఒక్కొక్క పాదాన్ని రెండు పంక్తులుగా యతిస్థానం దగ్గర వింగడించి రాయడం ఆయన ప్రారంభించారు. యతి అక్షరాన్ని సూచించడానికి దానికి ముందు 'తారకం' అనే పువ్వు గుర్తు పెట్టేవారు. ఉదాహరణకు :

'ఉన్నత నీలహారమున

*** నుత్పల మాలిక చెప్పినామయా'**

అనంతర ముద్రాపకులు పద్యపాదాన్ని రెండుగా విడదీసి చూపించకపోయినా యతిస్థానం దగ్గర తారకం నిలపడం అలవాటయిపోయింది. మామిడి వెంకయ్యగారు దంత్య తాలవ్య భేదాలను సూచించడానికి చజలపై తెలుగు రెండంకె వేయడం ఎలా మన పండితులకు అలవాటైపోయిందో, పద్యపాదాలలో యతిస్థానం దగ్గర బ్రౌను దొరగారి తారకం అంత ప్రబలమైన అలవాటుగా నిలబడిపోయింది. పందొమ్మిదో శతాబ్దంలో అచ్చువేసిన పద్యకావ్యాలలో విధిగానూ, ఆ తర్వాత కొన్ని కావ్యాలలో విరివిగానూ ఈ గుర్తులు కనబడతాయి. తారకానికి బదులు చిన్న డైమండు (♦) లేక మామిడి పిందె (ᵔ) వంటి గుర్తులు యతిస్థానంలోనికి వచ్చాయి. తెలుగు ముద్రణలో క్రా వడి పూర్వం అక్షరం కింద గురువులాగ 'U' వుండేది. దీనివల్ల ముద్రణలో అసౌకర్యాలు వున్నాయని దీనిని బ్రౌను దొరగారు '౹ లాగ '౽' లాగ మార్చడం మన పరిశోధకులు యిప్పటికే గుర్తించారు.

1827లో ఇంగ్లీషులో వెలువడిన మొట్టమొదటి ఛందోగ్రంథం 1977లో మళ్ళా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. దీనికి బంగోరె సంపాదకుడు. ఈ ప్రచురణలో ఆయన చారిత్రకోపోద్ఘాతాన్నే సమకూర్చారు గాని తొందరగా అచ్చు వేయాల్సిన అవసరం కొద్దీ ఛందో విషయాల జోలికి పోలేదు. వాస్తవానికి ఏదైనా విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసానికి ఈ 'ఆంధ్ర గీర్వాణచ్ఛందం' ఎంచుకోదగ్గ పుస్తకమే.

కడపలో 'స్థిరపడి' బంగళా కొనుక్కొనగానే కుంఫిణీవారు అప్పుడే కడప జిల్లాలో చేరిన 'కంభం'లో పెట్టిన ఆక్జిలరీ కోర్టు జడ్జీగా దొరగారిని నియమించారు. కడపలో తమ 'కాలేజీ'లో కొనసాగిస్తూనే అక్కడ చేయవలసిన పనులను కంభం నుంచే పురమాయిస్తూ దొరగారు యిటు ఉద్యోగ విధులు, అటు సద్యోగ సాహిత్య నిధులు చూసుకొనేవారు.

అయ్యలరాజు నారాయణ రచించిన హంస వింశతి కావ్యాన్ని దొరగారు శ్రద్ధగా చదివారు. ఇందులోని కథలకూ, చార్ దర్వీషు, బాగోబహార్, డెకమరాన్, తోతీనామా

మొదలైన పుస్తకాలలోని కథలకూ గల పోలికలను దొరగారు గుర్తించారు. ఈ "కావ్యాన్ని బ్రాహ్మణ విద్వాంసులతో కలసి చదివాను. ఈ కవి గ్రంథంలో వాడిన వందలకొలది పదాలు తమకు తెలియవని వారు అంగీకరించారు" అన్న సత్యాన్ని దొరగారు గ్రంథస్థం చేశారు. "ఈ పదాలన్నింటిని కవి తాను వర్ణించిన వివిధ వృత్తుల వాళ్ళ నోళ్ళనుండి విని వుంటాడని" తన పండితులు చెప్పినందువల్ల దొరగారు ఆయా వృత్తులవల్ల, జీవనోపాధి చూసుకొనే శూద్రుల వద్ద ఆ పదాల అర్థాలను తెలుసుకొని నోట్ చేసుకొన్నారు. (D-912) నిఘంటు రచనకు యిది అవసరం. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు మహాకోశ నిర్మాణానికి ప్రాతిపదికగా వృత్తి పదకోశాలను సంకలనం చేయించాలనే మంచి ప్రణాళికను వేసుకొన్నారు. కొన్ని సంపుటాలు వెలువడ్డాయి. అయితే అన్ని మంచి ప్రయత్నాలలాగే యిదీ చెట్టెక్కిపోయింది.

పద్యకావ్యాలతో పాటు ద్విపద కావ్యాల ప్రతులను కూడా 1827లో దొరగారు తయారుచేయించారు. బాణాల శంభుదాసు రచించిన సారంగధర చరిత్ర ద్విపదను నిండా శ్రద్ధగా చదివారు. ఈ కథకూ పాశ్చాత్య దేశాలలో ప్రచారంలో ఉన్న కథలకూ గల పోలికలను ఇలా స్పష్టపరిచారు.

"The adventures of Prince Sarangadhara a popular Telugu Romance, A new Edition carefully revised and corrected, prepared in the year 1827 - The story in this poem closely resembles that of Phodra and Hippolitus - or that of Crispusson of the Emperor Constantine - or that of Antheos and Cleoboa (Brunk I Anthol 419V). In Byron's Parisina Verse 255 is a similar tale. And the oldest is the one of Joseph and Potiphar's wife". (D-1193; p.1515)

ప్రపంచ కథావాఙ్మయంలో చాలా కథలకు పోలికలు ఉంటాయి. తులనాత్మక పరిశీలన చేయగలవారే ఈ సారూప్యాలను, సామ్యాలను విశదపరచగలరు.

బాణాల శంబుదాసులాంటి ద్విపద కవుల రచనలేకాక గౌరన వంటి ప్రామాణిక కవుల ద్విపద కావ్యాలను బ్రౌను దొరగారు సంపాదించి ప్రతులు పుట్టించారు. పమిడిపాటి వెంకటనరసయ్య అనే పండితుని చేత తీర్పు ప్రతిని చేయించారు. (D-1211) ద్విపద కావ్యాలలో గౌరన హరిశ్చంద్ర దొరగారికి చాలా ఇష్టమైనది కనుక ఒక తీర్పు ప్రతితో ఊరుకొనక దీనికి టీక ఉత్తరోత్తరా చెప్పించారు. (D-1221)

1827లో ఇంతకు ముందు వేమన పద్యాలకు తాము చేసిన ఆంగ్లానువాదాలను మళ్ళా ఓసారి తిరగవేసినట్టుంది. మార్చి నెలలో ఒక నోటు రాశారు. దేశంలోని నాలుగు చెరగుల నుంచీ వేమన పద్యాల వ్రాతప్రతులను దొరగారు తెప్పించారు. అయితే తమ దగ్గర ఉన్న ప్రతులలో ఆరింటిని మాత్రం సంప్రదించలేదు. "ఈ కృషియావత్తు పునః పరిశీలనం చేయాలి, ఉన్న వ్రాతప్రతులన్నీ మొకాబిలా చేయించాలి. అయితే యీ పనులు నిర్వర్తించడానికి ఇతోధికమైన తీరుబాటు కావాలి. ప్రస్తుతం నాకున్న ముఖ్యమైన వ్యాపకాల వల్ల యిది సాధ్యపడదు" అని దొరగారు 1827 మార్చిలో వ్రాసుకొన్నారు. (D-1773. సంపుటి 2)

తాము తెలుగులో సంకలనం చేసి ఆంగ్లానువాదం చేసిన వేమన పద్యాల ప్రతిని కాలేజీ బోర్డువారికి సమర్పించినాక చీఫ్ సెక్రటరీ మేస్టర్ హార్కెనెస్ దొరగారు 1827 జూలై 23 తేదీనాడు దాని ప్రచురణను సిఫార్సు చేస్తూ పారితోషికంగా వేయి వరహాలు బ్రౌను దొరగారికి మంజూరు చేయమని కూడా సూచించారు. వేమన పద్యాల ప్రచురణలైతే కుంఫిణీవారు చేపట్టారుగాని పారితోషికం సంగతి వారికి పరగడుపైంది.

వేమన పద్యాల ప్రతిని సమర్పిస్తున్నప్పుడే బ్రౌను దొరగారు కాలేజీ బోర్డువారికి మరొక సూచన చేశారు. తాము మచిలీపట్నంలో ఆంధ్రసాహిత్య పఠనం మొదలుపెట్టిన నాటినుంచి ఎన్నో తెలుగు గ్రంథాలకు ప్రతులను రాయిస్తూ వస్తున్నారు. ఎందరెందరు నేటివులో తమ పుస్తకాలయాల్లో ఉన్న గ్రంథాలను దొరగారి లేఖకులు రాసుకొనడానికి ఎరువు ఇచ్చారు. 1827 ఏప్రిల్ 14వ తేదీ నాటికి తమ దగ్గర జమ అయిన తెలుగు గ్రంథాల జాబితాను, ఆ పుస్తకాల కొన్నింటి నమూనాలను పంపించి వీటిని తమ వద్ద నుంచి కొనుక్కొని సెంటు జార్జి కోట కాలేజి గ్రంథాలయంలో చేర్చమని అర్థించారు. అప్పటికి కాలేజీలో ఉన్న తెలుగు గ్రంథాలేమిటో, వాటి వివరాలేమిటో బ్రౌను దొరగారికి బాగా తెలుసు. దాని జాబితాను కూడా భద్రం చేశారు. తమ ఆంధ్ర గీర్వాణచ్ఛందంతో కలుపుకొని 51 పద్యకావ్యాలూ, 6 ద్విపద కావ్యాలూ, 3 యక్షగానాలూ వెరసి 60 గ్రంథాలే కాలేజీలో ఉన్నాయి. తాము ప్రతులు వ్రాయించిన గ్రంథాలలో ఒక్కొక్క దానికి ఎంత వెచ్చించిందీ కూడా చెప్తూ వాటిని తీసుకోమన్నారు. 'కాలేజీ గ్రంథాలయం' అనే ప్రత్యేక సంస్థను నెలకొల్పమన్నారు.

బ్రౌను దొరగారు కొనమన్న కావ్యాలు పరమ ప్రామాణిక గ్రంథాలే అయినా, ప్రయోజనంగలవే అయినా 'కాలేజీ గ్రంథాలయం' అనే ప్రత్యేక సంస్థను ఆయన సూచించినట్లు ఏర్పాటు చేయడం చాలా డబ్బు ఖర్చుతో కూడుకొన్న పని అని అంగీకరించలేదు. అయితే బ్రౌను దొరగారి పుస్తకాల్లో వ్యాకరణాలంకార శాస్త్రాలు, ప్రసిద్ధ కావ్యాలూ వున్నాయి. కనుక 500 రూపాయలు పెట్టి ఆ పదహారు గ్రంథాలను కొనమని బోర్డువారు విజ్ఞాపన చేశారు. ఆ గ్రంథాల వివరాలు ఇవి:

బ్రౌను దొరగారి సంకలనం నుండి ఎంచిన గ్రంథాలు

వ్యాకరణ ఛందో గ్రంథాలు :

1.	ఆంధ్రకౌముది	35 రు.
2.	కవిశిరోభూషణం	21 రు.
3.	లక్షణ దీపిక	21 రు.
4.	అప్పకవీయం	63 రు.
5.	సులక్షణసారము	42 రు.

నిఘంటువులు, అలంకారశాస్త్రాలు :

6.	శివాంధ్రము	28 రు.
7.	విష్ణుఆంధ్రము లేక వేంకటేశాంధ్రము	21 రు.

8.	ఆంధ్రభాషార్ణవము	42 రు.
9.	ఆంధ్రభాషాభూషణం	42 రు.
10.	కావ్యాలంకార చూడామణి	35 రు.

పద్యకావ్యాలు :

11.	ప్రబంధరాజీయము	28 రు.
12.	పంచతంత్రి	28 రు.
13.	రసికజన మనోభిరామము	21 రు.
14.	రాధామాధవ సంవాదము	24 రు.
15.	వైజయంతీ విలాసము	22 రు.
16.	హంసవింశతి	21 రు.
		వెరశి 500 రూ.

బ్రౌను దొరగారి వద్ద ఈ పుస్తకాలను కొనడానికి కాలేజి బోర్డువారు నిర్ణయించినప్పుడు దొరగారు కంభంలో ఉన్నారు. అక్కడో 'కాలేజీ' నడుస్తోంది. కడపలో నిత్యం జరుగుతూన్న 'కాలేజి' ఉంది. పుస్తకాలు కడపలో ఉన్నాయి. వాటిని సిద్ధం చేయమని దొరగారు అయోధ్యాపురం కృష్ణా రెడ్డికి హుకుం రాయించి పంపారు. కృష్ణా రెడ్డి సందిగ్ధంలో పడ్డాడు. "కంభంలో ఉండేవారు కాలేజీ వారికి కావలసిన గ్రంథాలు వ్రాయించినారో లేదో తెలీదు. ఈ గ్రంథాలకు వేరే నూతన ప్రతులు పుట్టించి వుండి అంపించితే సరే. లేనినాడు వేరే నూతన ప్రతులు పుట్టించి ఉండనట్లయితే కాలేజీ వారికి ఇవ్వగలందులకై ఆ వ్రాతప్రతులే అంపించవలెనో, లేక వేరే కొత్త ప్రతులు పుట్టించవలెనో తెలిసినది కాదు. పాత ప్రతులు కాలేజీకి అప్పగించే యోచన చేస్తే సదరు గ్రంథాలకు తమ దగ్గర వేరే ప్రతులు లేవు. యే ప్రకారం శలవు అయితే ఆ ప్రకారం శిరసావహించి నడుచుకొంటూ వున్నాను" అని కృష్ణా రెడ్డి దొరగారికి 1828 డిసెంబరు 26వ తేదీనాడు మనివర్జీ రాసుకొన్నాడు.[2]

తాము సేకరిస్తున్న గ్రంథాలు సర్వులకూ వుపయోగపడాలన్న తాపత్రయంతోనే దొరగారు కాలేజీ బోర్డువారికి తమ గ్రంథాలు అమ్మచూపారు. వీటి పుత్రికలు తమ వద్ద ఉంచుకొని పాతవి ఇలా సద్వినియోగం చేస్తూనే కొత్తకొత్తగా మరికొన్ని కావ్యాల ప్రతులను సిద్ధం చేయించసాగారు. కడపలో ములుపాక బుచ్చయ్య శాస్త్రిగారు ఆంధ్ర మహాభారతం తీర్పు ప్రతులు తయారుచేస్తున్నారు. రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారి పంచతంత్ర కథలు పాఠ్యగ్రంథంగా సుప్రసిద్ధమైనదైనా, ఒక పద్యకావ్యం ఈ పేరుతోనే ప్రాచీనమైనది ఉందని దొరగారు తెలుసుకొన్నారు. బైచరాజు వెంకటనాథుడు చెప్పిన పంచతంత్రానికి ఆరు ప్రతులు సంపాదించి, వాటి నుంచి సాధుపాఠాలు గుర్తింపచేసి, తీర్పుప్రతిని సిద్ధపరిచారు. ముగ్గురు పండితులచేత అర్థాలు వ్రాయించారు. పదాల అకారాది పట్టికను తయారు చేయించారు.

2. M.411 పుట 26.

నిఘంటు నిర్మాణం తలపెట్టిన వారికి ప్రసిద్ధ కావ్యాల పద ప్రయోగకోశాలు అవసరం. బ్రౌను దొరగారు తెలుగు భాషకు చక్కని నిఘంటువు తయారుచేయాలని తలపోశారు. ఆ ఉద్దేశంతోనే మామిడి వెంకయ్యగారి ఆంధ్ర దీపికకు పుత్రిక వ్రాయించారు. కాంబెల్ నిఘంటువులో పుటల మధ్య తెల్లకాగితాలు చేర్చి కొత్తగా బైండు చేయించారు. ఇందులో కొత్త మాటలు ఎక్కించసాగారు. 1828 జూన్ నెలలో 'నా నిఘంటు పుట్టుపూర్వోత్తరాలు' అనే శీర్షికలో ఒక యాదస్తు రాశారు. కొన్ని భాగాలు తెనిగించాను చూడండి.

''1821 సంవత్సరం కడప జిల్లాలో గడిపాను. రెవెన్యూ, పోలీసు వ్యవహారాలలో శానా చురుకుగా పాల్గొనేవాడిని. వ్యావహారిక భాషలో తగిన విధంగా గట్టి పరిచయమేర్పడింది. ఆ భాషలోనే లౌకిక వ్యవహారాలన్నీ జరుగుతాయి. ఆ సంవత్సరమే నేను గ్రీకు, పెర్షియన్ భాషల అధ్యయనాన్ని మళ్ళా కొనసాగిస్తిని. ఈ భాషల సంపూర్ణ జ్ఞానం సంపాదించడమే నా ముఖ్యాశయము. వీటితోనే నాకు నా తీరిక సమయాల్లో సరిపోయేది. ఆ సంవత్సరాంతంలో మచిలీపట్నం కోర్టులో నన్ను రిజిస్ట్రారుగా నియమించారు. కాంబెల్ దొరగారి నిఘంటువుతో పరిచయం ఏర్పడడంతో దానికి విపర్య నిఘంటువుగా ఇంగ్లీషు-తెలుగు కోశం నిర్మించాలనుకొన్నాను. మూడు నెలలు పనిచేశాను. గిల్‌క్రిస్టు తన ఇంగ్లీషు-హిందీ నిఘంటువులో ఏ ప్రణాళికను వేసుకొన్నాడో దానినే అనుసరించాను. నాకు నిండా అభినివేశం, సూక్ష్మబుద్ధిగల బ్రాహ్మణుడు సహాయకునిగా లభించినాడు. సహాయకుడేమిటి? సహస్రామికుడనాలి. నా నిఘంటు నిర్మాణము విజయవంతమవుతుందనే నమ్మకం విస్తారంగా కుదిరింది.''

''1828 మధ్యలో నేను చెన్నపట్టణానికి వెళ్ళాను. మొట్టమొదట 'బాయిలూ' కూడా ఇటువంటి నిఘంటు నిర్మాణంలో ఉన్నాడని విన్నాను. తర్వాత 'మార్టులాక్' కూడా ఈ కృషిలో ఉండడమేకాక తన రచన రమారమీ పూర్తిచేశాడని తెలిసింది. కాంబెల్ నిఘంటువును ఈయన పూర్తిగా తిరగవేసి రాశాడు. అయితే కొత్త నోటుతో పూర్తిచేయగలుగుతాననే నమ్మకం లేక ఆయన తన కాగితాలన్నీ నాకు అప్పగిస్తానని దయతో చెప్పాడు. ఆ సమయంలోనే బాయిలూ కూడా తాను మొదలెట్టిన రచన తాలూకు కాగితాలన్నీ నాకు ఇచ్చేస్తానన్నాడు.''

''ఈ ప్రతిపాదన గురించి ఏమి చేయాలన్న ఆలోచనలో వున్నప్పుడు 'జాన్ మారిస్' కూడా ఇలాంటి కృషిలోనే ఉన్నాడని ఎవరో చెప్పారు. ఒక కార్యాన్ని నలుగురు తలపెట్టినట్టు తేలింది. మారిస్ దొరకు కాలేజీ బోర్డు వారి ఆదరణ లభించిందని నేను తెలుసుకొన్నాక నా శ్రమ ఫలప్రదం కాలేని ప్రతికూల కార్యమే అని భావించి విరమించాను. మార్టులాకుగారు, బాయిలూ గారూ ఇచ్చిన కాగితాల కట్టను వారిండ్లకు వాపసు చేశాను.''

''మచిలీపట్నం వెళ్ళి తెలుగు బదులు గ్రీకు భాషతో గడిపాను. నిజానికి అదంటేనే నాకు శానా ప్రీతి. ఇదే కాలంలో నేను లాటిన్ పఠనం మొదలెట్టాను. నాతోబాటు 'కెర్గిలీ' దొర లాటిన్ గ్రంథాలు చదివాడు. ఆయన కప్పటికే లాటిన్ కవుల కావ్యాలతో పరిచయముంది. 1823-24 రెండేళ్లూ ఇలా గడిచాయి.''

''యథాలాపంగా తెలుగు కవి వేమనను ఎవరో నా దృష్టికి తీసుకువచ్చారు. మచిలీపట్నానికి తిరిగి రాగానే వేమన పద్యాలు చదువడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాను. ఎట్టకేలకు 1824 ఏప్రిలు నెలలో వేమన పద్యాలను ఇంగ్లీషులోనికి అనువదించడానికి కూర్చున్నాను. చదివినదే తడవుగా కొత్త మాటలను నేను కాంబెల్ నిఘంటువులో పుటల మధ్య కుట్టిన తెల్ల కాగితాలపైన ఎక్కించాను. అదే సమయంలో నేను తెలుగు ఛందస్సు నేర్చుకొనడానికి మొదలుపెట్టాను. 1824 అంతంలో మారిస్ తన 'ఇంగ్లీషు నుండి తెలుగు' నిఘంటువు నుండి విరమించుకొన్నాడని విన్నాను. నేను అప్పట్నించీ నిండా సంతోషంగా నా కృషి కొనసాగించాను. అసలు దానిని విరమించుకొనడమన్నదే నాకు శానా బాధాకరంగా ఉండేది.'

''నా పూర్వవిధానం లోపభూయిష్టమని గుర్తించి, నా అదనపు పదాలు చేర్చిన కాంబెల్ నిఘంటువునే ఇప్పుడు ప్రాతిపదికగా ఏర్పరచుకొన్నాను. నా చేర్పులు బహుశా 4000 పదాలు కావచ్చు. పని శానా మందకొడిగా సాగింది. శ్రమ నిండా ఎక్కువయింది. ఇది పంచుకొనడానికి సహాయకులు లేరు.''

''రోజుకు రెండు మూడు గంటలు తెలుగు పద్యాలు చదవడంలోనూ, కొత్త పదాలు కాంబెల్ నిఘంటువులోకి ఎక్కించడంలోనూ గడిపేవాణ్ణి, తరువాత మూడు నాలుగు గంటలు కాంబెల్ నిఘంటువు తిరగవేసి రాయడంలో గడిచేది. ప్రతి మాటా తూచడం, కాపీచేయడం, జాన్సన్ ఇంగ్లీషు నిఘంటువును ఎక్కించడంతో ఆ మూడు నాలుగు గంటలూ సరిపోయేది. ఇది ఎంత శ్రమగా ఉండేదంటే కోర్టులో గడపవలసిన కాలంలో, కేసులు విచారించే కాలంలో నాకు ప్రాణం లేచి వచ్చేది.''

'1824 చివర నన్ను రాజమండ్రి జిల్లాలో కలెక్టరు గారికి సహాయకునిగా నియమించారు. అక్కడ కూడా అదే జమిలి కృషి కొనసాగించాను. అయితే అది నాశక్తికి మించిన కార్యమని గుర్తించాను. 1825 మధ్యలో ఇంగ్లీషు - తెలుగు నిఘంటు నిర్మాణం విరమించాను. అయితే తతిమ్మాది, అంటే తెలుగు-ఇంగ్లీషు నిఘంటు రచన నిర్విరామంగా కొనసాగింది. ఈ సమయంలోనే నేను సలక్షణమైన తెలుగు వ్యాకరణం 'భట్టీయం' అభ్యసించి దానిని ఇంగ్లీషులోనికి, లాటిన్‌లోనికి అనువదించాను. ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు మానుకోడానికి మరో కారణం మారిస్ తన పనిని చురుకుగా జరిగించుతున్నాడని దరిమలా నాకు చెప్పడమే.''

''మారిస్ నిజానికి ఇప్పటికే తన రచన పూర్తి చేశాడు. దానిని మొదట కాలేజీ బోర్డు వారు అంగీకరించారు. అయితే ద్వితీయ పరిశీలనలో దానిని నిరాకరించారు. ఈలోపున నేను వేమన పద్యాల వ్రాతప్రతులన్నీ చదవడం, అనువదించడం కొనసాగించాను. అన్నీ చదివాక వేమన పద్యాలను తొమ్మిది విభాగాలుగా కేటాయించి ఒక విస్తార ప్రతి తయారు చేశాను.''

''1825 చివరి రోజులలో చెన్న పట్టణం వెళ్ళాను. ఛందస్సు మీద రచించిన పుస్తకాన్ని ప్రకటనార్థం కాలేజి బోర్డువారికి సమర్పించాను. దానిని వారు ఆమోదించి

అచ్చు వేశారు. మారిస్ మళ్ళా తన కృషి మానుకొన్నాడని విన్నాక మూడోసారి ఇంగ్లీషు-తెలుగు నిఘంటు రచనకు నేను ఉపక్రమించాను. అయితే మళ్ళా మానుకోవలసి వచ్చింది. ఎందుచేతనంటే మారిస్ తన నిఘంటువు సరిదిద్ది బోర్డువారి ఆమోదం పొంది అచ్చుకు ఇచ్చాడని విన్నాను. అయితే అది ఎప్పటికైనా వెలుగు చూస్తుందా అన్నదే సందేహం.''

''ఈలోగా నా ముఖ్య కృషి తెలుగు-ఇంగ్లీషు నిఘంటు రచన నిర్విఘ్నంగా సాగింది. దాని విజయం నేను ఆశించిన దానికన్నా ఎక్కువే. పదాల అన్వేషణలో నేను అత్యంతోపయోగమైన తెలుగు కావ్యాలు పరిశీలించాను. పద్య సంఖ్య, ఆశ్వాస సంఖ్య ఉదహరిస్తూ అన్ని ప్రయోగాలూ చూపించాను. వాడుక భాషలోని ప్రయోగాలను సేకరించాను. వీటికీ కావ్య భాషకూ తేడా వుంది.''

''1825లో తెలుగు కావ్యాలన్నీ సేకరించి నాకోసం కాగితం ప్రతులు తయారు చేయించాలనుకొన్నాను. ఇది మూడేళ్ళగా సాగుతోంది. నా లేఖకులు శానామంది వుండడం వల్ల నేను ప్రతి తయారు చేయించని చెప్పుకోదగ్గ ప్రౌఢకావ్యాలు తెలుగులో శానా కొద్దిగానే ఉన్నాయని చెప్పాలి.''

''కేవల కావ్య సంకలనాలకన్నా సాధుపాఠాలే ఉత్తమ ప్రయోజనకారులు కనుక వివిధ వ్రాతప్రతులను మొకాబిలా చేయించి, కావ్యాల పరిష్కరణకు పూనుకొన్నాను. ఈ పని ఎలా చేస్తున్నదీ కాలేజీ బోర్డువారికి దాఖలు చేసుకొన్న ఉత్తరంలో వివరించాను. 'A Plan for the Revival and Promotion of Telugu Literature' (తెలుగు సాహిత్య పునర్వికాసమునకు, ప్రోత్సాహమునకు యోచనలు) అని నేను వ్రాసిన సంపుటంలో ఆ వుత్తరానికి నకలు వుంది.''

''ఆ జాబు నేను రెండు సంవత్సరాల కిందట వ్రాసినది. ఉపయుక్తమైన పుస్తకాలతో వారి గ్రంథాలయాన్ని నింపాలనే నా ప్రతిపాదనను కాలేజీ బోర్డువారు రమారమీ కొట్టిపారేసినా తెలుగు కావ్యాల సేకరణా, పరిష్కరణా ఈ ఘడియదాకా నేను ఇంకా కొనసాగిస్తూనే ఉన్నాను - జూన్ 1828'' (D-1391)

తాము సాగించుతున్న కృషికి ఒక్క తెలుగు జిల్లాలనే ఆయన పరిమితం చేయలేదు. కుంఫిణీ వారు చెన్న రాజధానిలోని దక్షిణ ప్రాంతాలలోని తమిళ జిల్లాలోనికి బదిలీ చేసినా అక్కడ కూడా తెలుగు గ్రంథసేకరణ చేశారు. 1829లో తిరుచునాపల్లి ప్రావిన్షియల్ కోర్టుకు దొరగారిని రిజిస్ట్రారుగా నియమించారు. ఇక్కడ వుంటున్నప్పుడే వారి రెండో పుస్తకం అచ్చయింది. ముద్రిత గ్రంథాలలో ఇది ద్వితీయమైనా రచనలో మాత్రం మొదటిదే. ఏ తెలుగుకవి పద్యాలు తమను ఉత్తేజితుల్ని చేసి ఆంధ్ర సాహిత్య పరిశోధనకు పురికొల్పాయో ఆ వేమనగారి పద్యాలను దొరగారు తమ ఆంగ్లానువాదంతో కాలేజీ బోర్డువారిచేత 1829లో ప్రకటింపచేశారు.

ఇది 176 పుటల పుస్తకం. ఇందులో మూడు విభాగాలున్నాయి. ప్రథమ భాగంలో 200, ద్వితీయ భాగంలో 214, తృతీయ భాగంలో 279 మొత్తం 693 పద్యాలున్నాయి. పుటపై

సగంలో తెలుగు పద్యాలు, అడుగు సగంలో ఆంగ్లానువాదం అచ్చువేశారు. ఆదిలో తొలిపలుకులూ, చివర ప్రతిపద్యంలోని ఆది పదాలను అకారాదిక్రమంలో విశదపరిచే సూచి ఉన్నాయి.

కాలేజీ బోర్డువారు ఈ పుస్తకానికి 500 ప్రతులు ముద్రించారు. 50 కాపీలు బ్రౌను దొరగారికి ఇచ్చారు. మిగిలిన 450 ప్రతులు దేశంమీదకు వెళ్ళవలసినదే గాని కాలేజీ డిపోను దాటి బయటకు వెళ్ళినట్టులేవు. కట్టని ఈ ముద్రణ కాగితాలను చుట్టబెట్టి, కాలేజి చిత్తుకాగితాలలో జమకట్టారు. ఇది ఎవరు చేసిన పనో చెప్పక్కర్లేదు. వేమనగారి పద్యాలను, అటువంటి రచనలను ప్రచారంలోనికి రానివ్వని వర్గాల గురించి ఆదిలోనే ఆబే దుబాయ్ ఇలా చెప్పారు.[3]

Amongst the few Hindu works which are written in a free philosophical vein, and in which the Hindu religion and its customs are openly criticized, not one that I know has been written by a Brahmin. All the works of this kind that I have seen have emanated from authors who were not of this caste. Tiruvalluvar was a Pariah, Pattanattu Pillai and Agastya were both of the Vellala caste, and their poems are written in Tamil; Sarvagnamurti was a Lingayat, and his works are in Canarese. One of the most famous is Vemana, whose pocide originally written in Telugu, have since been translated into several other languages. We are told that this philosopher, who was of the Reddy caste, and was born in the district of Cuddapah, died towards the end of the seventeenth century. His writings, from which I have seen several extracts, appear to me to be most interesting and are distinguished by much discernment and independence. It is to be noticed that the authors of all these satirical and revolutionary works belong to recent times. If in earlier days any enlightened writers published similar works, the Brahmin have taken care that not a trace of them shall remain. Nowadays they rage against the authors we have mentioned and speak of their works with contempt. They cannot, of course succeed in destroying them, but they do everything in their power to prevent the reading of them - Dubois

తమ 50 ప్రతులు అందుకొనడమే తప్ప మిగతావి ఏమయ్యాయో తెలుసుకొనే అవకాశం దొరగారికి రాలేదు. వేమన పద్యాలను అచ్చువేసినట్టే తమ నిఘంటువు అచ్చువేయమని కోరుతూ నమూనా పుటలలో ఒక నివేదికను కాలేజీ బోర్డువారికి 1829లో దొరగారు విజ్ఞాపన చేశారు. ఈ కాగితాలను కూడా బోర్డువారు ఉప్పుపాతరలో ఊరవేసినట్టు పెట్టి పట్టించుకోలేదు.

బ్రౌను దొరగారు మాత్రం తాము చేపట్టిన సాహిత్య కృషిని విడనాడకుండా సాగించారు. తమిళనాడులోనే తెలుగు కావ్యప్రతులను సంపాదించారు. నేడు సరస్వతీ మహాలు గ్రంథాలయంగా విశ్వవిఖ్యాతమైన తంజావూరు రాజుగారి గ్రంథాలయములోని అపూర్వ గ్రంథాలకు ఆనాడే ఆయన కొన్ని ప్రతులు పుట్టించారు.

3. Abbe Dubois "Hindu Manners and Customs' (3rd Edition), Oxford, 1906 (pp 274, 275 Foot note)

ఆంధ్ర సాహిత్య వ్యాసంగాన్ని ఆరంభించిన నాటి నుంచి తమ జీవితాంతం వరకూ గ్రంథ సేకరణ ఒక పవిత్రమైన కర్తవ్యంగా భావించి లెక్కలేనన్ని సంపుటాలు సంపాదించిన బ్రౌను దొరగారు ఆదిలో ఆ కార్యక్రమాన్ని ఎలా నిర్వహించగలిగారన్నది కుతూహలభరితమైన విషయం. తనకు కావలసిన ముడిసరుకు ఎక్కడ దొరుకుతుందన్న ప్రాథమిక 'సర్వే' ప్రతి వ్యవస్థలోని వారూ చేయక తప్పదు. తెలుగు సాహిత్య పునర్వికాస ప్రోత్సాహాలకు ముడిసరుకు గ్రంథాలయాలలోనే లభ్యమవుతోంది. పందొమ్మిదో శతాబ్దంలో సంపన్న గృహస్తుల మహళ్ళలో, సంస్కారవంతుల గృహాలలో తప్ప పబ్లిక్ లైబ్రరీలు లేవన్న సంగతి బ్రౌను దొరగారికి తెలుసు. అందుచేత ఎవరెవరి దగ్గర ఏయే గ్రంథ సంచయం వున్నది ఆరాలు తీయించారు. ఆ వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకొన్నారు. స్నేహ భావంతో కొందరి వద్దా, ద్రవ్యాశ చూపి కొందరి వద్దా గ్రంథాలు సేకరించారు. వాటికి పుత్రికలు పుట్టించి మాతృకలను మళ్ళా వాటి పుట్టింటికి అప్పచెప్పారు.

1828లో రాసిన యాదస్తులో పేర్కొన్న ప్రణాళిక ప్రారంభకాలం నాటినుంచి, ఉత్తరోత్తరా ఒకసారి సీమకు వెళ్ళేదాకా ఆయన ఎవరెవరి గ్రంథాలయాలను సందర్శించిందీ, ఏయే గ్రంథాలను సంగ్రహణం చేసినదీ తెలుసుకొందాం (ఇక్కడ చారిత్రక క్రమంలో కథనం చేస్తున్నా, ఈ జాబితా చరిత్రలో కొంచెం 'ఫాస్టు ఫార్వర్డు' టెక్నిక్‌ను అనుసరించుతున్నందుకు మన్నించండి). బ్రౌను దొరగారు తమకు తెలిసినంతవరకు ఎవరెవరి దగ్గర గ్రంథాలున్నది ఇలా రాశారు.

''పాత కడపలో ఉన్న చించోలి అప్పన్నాచార్యులవద్ద చాలా ఘనమైన సంస్కృత గ్రంథ సంచయం వున్నది.''

''నొసలంలో ఉండే రంగారెడ్డిగారి సంస్థానంలో గొప్ప పుస్తకశాల వున్నది.''

''దువ్వూరు తాలూకాలోని పల్లెపాడులోని రాఘవాచార్యులుగారి కుమారుడు యోగ్యులు. అతనివద్ద శానా గ్రంథాలు ఉన్నాయి.''

''నెల్లూరుకు సమీపాన వడ్లపూడిలోని గోపరాజు సుబ్బయ్య ఇంకొక గట్టి విద్వాంసుడు. ఈయనే దశావతార చరిత్రను నావద్దకు తెచ్చి యిచ్చాడు.''

''చిత్తూరుకు దక్షిణాన, కంబానికి సమీపాన వున్న మొగుల్లూరు వాస్తవ్యుడు కొండూరు చిదంబరం నాకొక బండెడు గ్రంథాల రాశి ఇచ్చాడు.''

''కోవెలకుంట్ల శివార్ల అవుకులోని అక్షింతల సుబ్బరాయశాస్త్రి బెంగాలులో ముప్ఫయి సంవత్సరాలు వాసం చేశారు. ఆయన బెంగాలీ భాష క్షుణ్ణంగా తెలిసిన విద్వాంసుడు.''

''మచిలీపట్నంలో నాకు మామిడి వెంకయ్యగారి విద్యాలయంలోనికి ప్రవేశం దొరికింది. కడపలో గజ్జల రెడ్డిగారి గ్రంథాలయం, పుంగనూరు రాజావారి పుస్తక భాండాగారం, చెన్నపట్టణంలో లంగరు పాపయ్యగారి కావ్య సంచయం మొదలైనవన్నీ నాకు అందుబాటులోనికి వచ్చాయి.''

''దువ్వూరు గుడిపాడులోని కరణం లక్ష్మీపతి యింట్లో చక్కని గ్రంథరాశి వుంది. కంబంలోని నాగిరెడ్డిపల్లి వాస్తవ్యుడు వంగీపురం వెంకటు కృష్ణమాచార్యులు ముప్ఫయి రెండేళ్ళ వయసు, శానా నిరాడంబరుడు, చక్కని విద్వాంసుడు, కవి.''

''కంబానికి మూడామడల దూరంలో వున్న ఉయ్యాలవాడ గ్రామకరణం మిడుతూరి లక్ష్మీనరసుకు అతిశయమైన విద్వత్తు వుంది. అతడు కవిత్వం చెప్తాడు.''

''మంచాల కృష్ణమరాజు అప్పకవీయంలోని మూడు ఆశ్వాసాలను తీసుకొని వచ్చి నాకు ఇచ్చాడు. ఆ పద్యాలన్నీ ఆయనకు కంఠతా వచ్చును.''

''కర్నూలుకు నైఋతి దిశలో యాభైమైళ్ళ దూరంలో వున్న గద్వాల సంస్థానం ప్రభువులైన, 'రాజమాన రాజ పూజితులైన రాజెసీతారాం భూపాలరావు 'బహదరు' వారి ఆస్థాన విద్వాంసులైన కృష్ణమాచార్యులు కవీశ్వరులు. ఈయనకు భూవసతి, జీతాలు ఏర్పాటు చేశారు. మూడువందల రూపాయల వార్షికం ఇస్తారు. ఈ సంస్థానాధిపతులు 1827 డిసెంబరు 23వ తేదీనాడు నేనున్న చోటుకు విజయం చేసి నన్ను కలుసుకున్నారు.''

''కాకినాడ సమీపాన జమీందార్లతో సంబంధాలుగల దంతులూరు జగన్నాథరాజు గారు విద్వాంసులు. వీరి వద్ద గీర్వాణాంధ్ర గ్రంథాలు కడు ప్రశస్తమైనవి వున్నాయి.''

''గూటాల జమీందారులైన అప్పారావుగారి బావమరిది చెలికాని వెంకటరాయనిం వారు నాకు దశావతార చరిత్రను అంపించారు.''

''సింహాద్రి శాస్త్రుర్లవారి వారసులైన బుచ్చయ్య వద్ద రాజమంద్రిలో 'యోనితంత్రం' మొదలైన గ్రంథాలున్నాయని కప్పగంతుల మందప్ప శాస్త్రుర్లు చెప్పాడు. ఈ గ్రంథాలను సదరు బుచ్చయ్య స్వయంగా సంకలనం చేయలేదు. ఆస్తిగా లభ్యమైనవి. ఇవి ఎంత మాత్రం ఆయనకు అర్థం కానివి.''

''ద్రాక్షారం చెంతనున్న కుయ్యూరు కరణం - మిరాశీదారుడైన పిండిప్రోలు లక్ష్మణకవి నిండా దొడ్డ కవీశ్వరుడు.''

''రాజమండ్రిలోని తూపర్తి శీనయ్య అనే వైష్ణవుని వద్ద చాలా పెద్ద గ్రంథసంచయం వుంది.''

''మచిలీపట్నంలో ప్రత్యేకంగా గుండుమళ్ల జగన్నాథం వద్దా, రాజా జగన్నాథ రావుల వద్దా పుస్తకాలు వున్నాయి.''

''నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి జమీందారీకి చెందిన నెల్లూరు అప్పన్న పంతులు బాగా చదువూ సంస్కారంగల ఆసామి. ఇతని వకీలు మైదవోలు సుబ్బారావు పమిడి గ్రామ వాస్తవ్యుడే కాని చెన్నపట్టణం తిరువళ్లిక్కేణి పార్థసారథి స్వామి కోవెల దగ్గర్లో నివసిస్తూ వుంటాడు. ఈయన ఇంగితమెరిగిన చక్కని వ్యక్తి. ఇతడే 'రామలావణ్యాసీమ' శతకాన్ని సంపాదించి నాకు అందచేశాడు.''.

''కల్నల్ మెకంజీ దొరగారి వద్ద పూర్వం మేనేజర్‌గా పనిచేసిన కావలి వెంకటలక్ష్మయ్య ప్రస్తుతం చెంగల్పట్టు జిల్లాలోని తిరువళ్లూరు సమీపాన వున్న

తిన్ననూరులో జాగీరు పొందినవారు. ఈయన , 1829 మార్చినెలలో వచ్చి నన్ను కలుసుకొన్నారు. ఇతని కుమారుడు కావలి వెంకటసుబ్బయ్యా పోషకుడు. దక్కను కవుల చరిత్రను రచించిన కావలి వెంకట రామస్వామి కుమారుడైన వెంకటకృష్ణయ్యా పదిహేడేళ్ళవాడు. ఇతడిని వెంకటసుబ్బయ్యా పరిచయం చేశాడు. (రామస్వామి గ్రంథకర్త) బెంగాలీ బాగా వచ్చు. గుణం 'మొర్రి బేసికూన'; పొగరు మోతు.''

''షేక్ హమీదు నిండా పెద్దమనిషి. 1819లో నాతో గ్రంథాలు చదివాడు.''

''నెల్లూరులోని మంగమూరి లక్ష్మీనరసు అతని సోదరుడు చెంచురామయ్యా నాకు తెలిసినవారు.''

''తంజావూరు రాజ్యంలోని కుంభకోణంలోని సరిగంటి చిత్రై చిన్నసామి నాయుడు రాజావారి చిత్రకారుడు. ఇతని కుమారుడు తిరుపల్లి సామినాయుడు మనుమడు అయరమి నాయుడు నా సేవకుడు.''

''కందాళ త్రయమూర్తి అసలు పేరు సింగన్నాచారి. ఇతడు భాగవతానికి హృదయరంజనీ వ్యాఖ్య, టీక రచించాడు. ఇతని వయసు 63 సంవత్సరాలు. నేను తిరుచునాపల్లిలో వున్నప్పుడు ఇతడు ఆ గ్రంథాన్ని నా చెంతకు తీసుకొని వచ్చాడు. ఈయన అక్కడే నివసిస్తున్నాడు.''

1829 తంజావూరులోని రామారావు ఇరవయ్యొనిమిదేళ్ళవాడు, బహుయోగ్యుడు. నిండా మర్యాదస్తుడు. మరాఠీ వ్యాకరణాన్ని రచించాడు. 'తెలిమఖస్'ను మరాఠీలోనికి అనువదించాడు. ఇతని ఇంగ్లీషు భాషా జ్ఞానం ఆశ్చర్యకరమైనది. కాలేజీలో హెడ్మాష్టరు పనికి నిండా అర్హతలున్నవాడు. ఇంగ్లీషు మరాఠీ భాషలు వచ్చుగాని, సంస్కృతంగాని, సాహిత్యంగాని ఎరిగినవాడు కాదు.'

''తంజావూరు రాజ్యంలో రెసిడెంటుగారి శిరస్తాదారు వెంకటరావుకు 1829లో ముప్ఫయి సంవత్సరాల వయసు. ఇతడు రామారావుకున్నంతపాటి చదువూ సంస్కారాలు గలవాడేగాని అతనికి సరిసమానుడు మాత్రం కాడు. తంజావూరులోని రాజావారి గ్రంథాలయంలో ప్రతులను వ్రాస్తున్న లేఖకులమీద ఈ వెంకటరావును 'పైగస్తీ' (పర్యవేక్షణ)కు నియమించాను.''

''1826లో నేను నగరిలో వున్నాను. చింతలపట్టు గ్రామంలో రొంపిచర్ల వెంకటరామరాజు అనే బహునమ్రుడు నిండా పేదవాడైన వ్యక్తి వున్నాడు. జమీందారి కొలువు చేస్తున్నాడు. ఇతడు నాకు మొల్ల రామాయణాన్ని తెచ్చి విక్రయించాడు.''

పైన దొరగారి మాటల్లో వారు చెప్పిన విషయాలు వారి నిఘంటు సంపుటాల యాదస్తులలోనూ "Plan for the Revival and Promotion of Telugu Literature' అనే ప్రణాళిక నుండి సేకరించినవి. బ్రౌను దొరగారి లేఖల సంపుటాలలో గ్రంథ సేకరణ గురించి కొన్ని వందల జాబులు చెప్పే విషయాలు చాలా ఆసక్తికరమైనవి. వాటినన్నింటిని

విశ్లేషణ చేయవలసిన అవసరం ఉన్నా ప్రస్తుత ప్రకరణం పరిమితికి అవి మించిన విషయాలు. అయినా కొన్ని లేఖలను గమనించడం పరిశోధకులవిధి.

ఎంతమంది సంపన్న సాహితీపరులతో సత్సంబంధాలున్నా, ఎంతమంది సాహిత్య సంపన్నులతో సాదర పరిచయాలున్నా సమకాలిక గ్రంథాలు కొనుక్కోవాలన్న కోరిక బ్రౌను దొరగారికి ఉంది. భారతీయులు తమ యిళ్ళలో భద్రంగా చూసుకొనే గ్రంథాలను పూజలో సైతం పెట్టుకొంటారని ఆయనకు తెలుసు. వాటిని అన్యులకు ఇవ్వడానికి అంగీకరించని వారు అమ్మడానికి ముందుకొస్తారా? వాటిని చూడడానికి కూడా యివ్వరు. ఇటువంటి వారితో స్నేహ భావం వల్లనే ప్రతులను వ్రాయించుకొనడానికి అవకాశాలను సృష్టించుకోవాలి. ఆ పని దొరగారు చేస్తూనే ఉన్నారు గాని కొందరు వృత్తిరీత్యా ఇతరులకు వ్రాతప్రతులు రాసి పెట్టేవారున్నారని తెలుసుకొని అటువంటి వారిని అందుకు తన పనులకై వినియోగించారు. కొందరు గడవని వాళ్ళు తమ దగ్గరున్న గ్రంథ సంచయాన్ని యోగ్యులకు అమ్మ చూపుతారు. ఎవరి దగ్గర అలా కొనడానికి వీలైన గ్రంథాలున్నాయో తెలుసుకొని వాళ్ళను కలుసుకోవాలి.

తాము కుంఫిణీ ప్రభుత్వంలో పెద్ద హోదాలో ఉన్నా పుస్తక సంచయమున్న వారింటికి వెళ్ళి వాటిని పరిశీలించడానికి ఎంత దూరమైనా వెళ్ళడం బ్రౌను దొరగారికి సమ్మతమే. 1834లో యానాం కాపురస్తుడైన మాజేటి రెడ్డి దొరగారికి రాసుకున్న ఒక లేఖలోని భాగాలను చూస్తే ఇది స్పష్టమవుతుంది.

''మాహారాజశ్రీ రాజాధిరాజ సి.పి. బ్రౌను దొరగారి సముఖమునకు యానాం కాపురస్తుడైన మాజేటి రెడ్డి వ్రాసుకొన్న అర్జీ విన్నపములు.''

అయిదారు సంవత్సరముల క్రితం కాకినాడ నుంచి తమరు యానాం విజయం చేసి యానాం శేపు (Chef)గారు అయిన 'ముశ్యేలే' 'స్పరుదా' (Monsieur L'Espardat) దొర గారున్ను, ముశ్యే రేబం దొరగారున్ను, తమరున్నూ, మా తండ్రి అయిన సర్వేశలింగమును, నన్ను పిలిపించి నీదగ్గర ఆంధ్ర గీర్వాణ గ్రంథములు చాలా వున్నవి అని మీవూరి దొరలు మాతో చెప్పినారున్ను అని మాతండ్రిని తమరు శలవు యిచ్చినంతలో వున్నవి అని మనవి చేసిన మీదట తమరున్ను మావూరు దొరలున్నూ మా యింటికి విజయము చేసి మాదగ్గర వున్న గ్రంథములు యావత్తు చిత్తగించి నీలపల్లిలో లినారస్ దొరగారి ఇంటి వద్ద మేము వుంటూ వున్నాము. అక్కడికి రావలసినదని శలవు దయ చేయించినందున మా తండ్రి సర్వేశలింగం నేనున్ను దర్శనమునకు వచ్చినంతలో అనుగ్రహం మాయందున వుంచి మావద్దనున్న వేమయ్య గ్రంథం సన్నిధిని వుంపించి మా దారిద్ర్య విచ్ఛిన్న మయేటట్టుగా రొక్కరూకలుగా కొన్ని రూపాయలు బహుమతిగా దయ చేయించి అప్పట్లో రక్షించినారు...'' (M 417 పుటలు 266, 267)

ఈ లేఖాలేశం వల్ల కొన్ని విషయాలు విస్పష్టమవుతాయి. యానాం ఫ్రెంచి వారి స్థావరం. సాధారణంగా ఇంగ్లీషు కుంఫిణీ వారు పక్కనున్న నీలపల్లెలోనే ఉంటారు. అయితే ఫ్రెంచి వారి వూళ్ళో తెలుగు గ్రంథాలున్నాయని విన్న బ్రౌను దొరగారు ఆ

'పరరాజ్యాని'కి వెళ్ళడమేకాక ఒక సాధారణ దరిద్రుని ఇంటికి స్వయంగా వెళ్ళి గ్రంథాలు చూశారంటే వారి పుస్తక సంపాదనా వ్యామోహం తెలుస్తుంది. తమకు కావలసిన ఒక గ్రంథం ఎంచుకొని దానికి రొక్కరూకలు ఇచ్చారు. 1834కు అయిదారు సంవత్సరాల క్రిందట అంటే 1828లోనో, 1829లోనో ఇది జరిగిందన్నమాట. అప్పటికి బ్రౌను దొరగారు కడపలో తిరుచునాపల్లిలో వున్నారు. బహుశా యానాం వెళ్ళిన సంవత్సరం 1825 కావచ్చు. అప్పుడు ఆయన రాజమండ్రిలో హెడ్ అశిష్టాంటు కలెక్టరుగా వున్నారు. వేమన పద్యాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్న రోజులు. అందుకే వేమయ్య గ్రంథాన్ని సర్వేశలింగం లైబ్రరి నుండి ఎంచుకొన్నారు. మాజేటి రెడ్డి లేఖలోని మరికొన్ని భాగాలు కూడా ఆసక్తిదాయకాలే.

"... దరిమిలాను పులిచేరు నుంచి మా తండ్రి చేత అనేక చిత్రవిచిత్రమైన ఆంధ్ర గ్రంథములు తెచ్చినాడు. తమకు కావలసిన గ్రంథములు ఆజ్ఞాపిస్తే దాఖలు చేసుకొనడమవుతున్నది..." (M 417, పుట 268)

సర్వేశలింగం సంకలనం నుండి దొరగారు మొత్తం 613 గ్రంథాలను స్వీకరించారు. వీటిలో తాంత్రిక, వైద్య, వ్యాకరణ గ్రంథాలేకాక శతకాలూ, యక్షగానాలూ కూడా ఉన్నాయి.

ఈ 613 గ్రంథాలలో 386 సంస్కృత ప్రతులు, మిగతా 227 తెలుగు పుస్తకాలు.

1830లో మచిలీపట్నంలో ఉండే కోటిలింగన్న గారి భార్య అమ్మజూపిన గ్రంథాలను 370 రూపాయలు పెట్టి దొరగారు కొన్నారు. ఇందులో ప్రధానంగా సంస్కృత గ్రంథాలే ఎక్కువ. కొద్దిపాటి తెలుగు గ్రంథాలు లేకపోలేదు. 13 పురాణాలు, 130 ఉపనిషత్తులు, వేదాంత పౌరాణిక తాంత్రిక గ్రంథాలు ఈ రాశిలో ఉన్నాయి.

రాజమండ్రిలోని ఒక న్యాయవాది పుస్తకాలయం కూడా దొరగారు ఖరీదు చేశారు. ఇందులోఅత్యుత్తమమైన తర్కశాస్త్ర గ్రంథాలు ఉన్నాయి. తాము ఇచ్చిన వెల స్వల్పముగాని, ఫలమధికం అని దొరగారు చెప్పారు.[4]

ఇందులో పేర్కొన్న చిత్ర విచిత్రమైన గ్రంథాలన్నీ ఉత్తరోత్తరా బ్రౌను దొరగారు సర్వేశలింగం వద్ద నుంచి సేకరించారు.

చూడండి ఆ గ్రంథాల వివరాలు - దొరగారి రిమార్కులు.

4. డా॥ ఆర్. పద్మావతి - బ్రౌను తెలుగు కావ్య సముద్ధరణము - పుట 28.

పద్యకావ్యాలు
బ్రౌను దొరగారి సాహిత్య రిమార్కులు
పండితుల గుమాస్తాల వివరాలు

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
1.	D.4	ఉత్తరరామాయణం	తిక్కనగారిది. దొరగారి రిమార్కులు మార్జిన్‌లో వున్నాయి.
2.	D.14	జైమిని భారతం	This is one of the poems which are looked upon as పంచ డబ్బులు or mere fictions or Apoctryphal Tales అని మొదటి పేజీలో వ్రాశారు. 346వ పేజీలో సరిదిద్దుకున్నారు. Wrong. the పంచడబ్బులు were written by other poets. They are seperate poets. They are seperate poems (Zuluri Appaiah Says) entitled. మైరావణ చరిత్ర, శతముఖ రామాయణం, కృష్ణార్జున సంవాదం, గంగాగౌరీ సంవాదం, కుశలవ కథ, These x పంచడబ్బులు అని జూలూరి అప్పయ్య పండితుడు చెప్పినాడు.
3.	D.18	పద్మపురాణం	మడికి సింగన. 1832లో బ్రౌను దొరగారి ఆజ్ఞానుసారం 5 వ్రాతప్రతులను సరిజూసి జూలూరి అప్పయ్యగారు బందరులో తయారు చేశారు. P.36లో అప్పయ్యగారి తీరు.
4.	D.19	పద్మపురాణం	పాద్మం. The language used in this translation is easy and very beautiful.
5.	D.27	బాలభాగవతం	మెకంజీ గుమాస్తాలు సేకరించినది సానిదె లక్ష్మణరావు, నారాయణరావు, 1812 మార్చిలో మాహెలో వున్నాడు.
6	D.34	బ్రహ్మోత్తర ఖండం పుల్లయ రచన	ది.29 నవంబరు 1831 సం॥ మొకాబిలా చాయడమైనది వారణాశి రామస్వామి వ్రాలు. నండూరు వెంకటాచార్యులు వ్రాలు.
7.	D.45	భాగవతం	ప్రథమ, తృతీయ, ఏకాదశస్కంధాలు. బ్రౌను దొరగారు దిద్దించిన గ్రంథం అని వ్రాత.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
8.	D.103	భాగవతం	దశమస్కంధం. I.61-957
9.	D.117	భాగవతం	This is a very poor manuscript of the Seventh book of the Bhagavat which has been printed at Madras 1840-C.P. Brown.
10.	D.163	మహాభారతము 7 ప్రతులనుండి పాఠాలు	పాఠభేదాల ప్రతి. The Mahabharata now first rendered to numerical arrangement and copied in seperate verses and lines by the Directions of Charles Philip Brown. the alterations made in this copy show the various readings found in some copies compared by me. సంస్కృత అధ్యాయ సంఖ్యలు కూడా ఇచ్చారు.
11.	D.166	మహాభారతం "దీనిమీద ఎక్కించిన ప్రతిభేదాలు"	ప్రతిభేదాల వివరాలు (paper) 8 ప్రతులు 1. రా॥బ్రం॥ పంతులు ప్రతి. యానాం 2. రాచర్ల గోపన్న ప్రతి 3. గా. కొండన్న ప్రతి 4. వద్దిపర్తి వెంకయ్య ప్రతి 5. మన్నెం కనకయ్య ప్రతి. సా॥ యానాం 6. ఆచంట లింగరాజు ప్రతి 7. తాడిగడప వీరేశలింగం ప్రతి, పెనుగొండ
12.	D.169	మహాభారతం పాఠభేదాల ప్రతులు	కొన్ని కొత్త పేర్లు cf above
13.	D.172 to 187	మహాభారతం పాఠభేదాల ప్రతులు	కొన్ని కొత్త పేర్లు cf above
14.	D.211	మహాభారతం	This is the new edition corrected and ready for Printing. కడప వాస్తవ్యులు గరిమెళ్ల వెంకయ్యగారి పరిష్కరణ. (1837-38)
15.	D.233	మహాభారతం	"ప్రతిభేదములు విమర్శించి నిర్దోషముగా నియమించిన క్రొత్త గ్రంథము. యిది పుట్టినది మహారాజశ్రీ బ్రౌనుదొరగారి ఆజ్ఞప్రకారం ౧౮౪౦ సంవత్సరం జూలై తే॥ ౮ వరకు చెన్నపట్టణమందు మహాభారతంబు నందు విరాటపర్వము తీర్పు చేయించబడ్డది"

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
16	D.309	వాసిష్టరామాయణం	మాజేటి సర్వేశలింగం వ్రాసెను. తాళపత్రం.
17.	D.311	విష్ణుపురాణం	I have collected this copy and recorded all the deviations which occurred in the two last books. The rest are of less consequence. They are sadly imperfect. The binder has misplaced the 7th and 8th books and the 3rd and 4th. I cannot find the 6th book any where in it.
18.	D.312	విష్ణుపురాణం (1885లో కాబోలు)	కాలేజి ప్రతినుండి వ్రాసుకొన్నది. ఇతర ప్రతులతో సరి చూడాలి. అయితే ఆసాంతం నేను దీనిని చదివాను. ముగ్గురు పండితుల పరిష్కరణలు సంపాదించాను. రూపాయికి రెండు వందల పద్యాల చొ॥ విలేఖరికి కూలి, కాగితాలు, బైండింగు, పరిష్కరించే పండితుని జీతం అన్నీ కలుపుకొంటే రెట్టింపు అవుతుంది. 32 రూపాయలు. తప్పు బైండింగు
19.	D.313	విష్ణుపురాణం	ఆన 1825లో నేను విష్ణుపురాణాన్ని నిండా శ్రద్ధగా చదివివున్నాను. కాని నా సొంత ప్రతిని ఎవరో దొంగలించారు. కాబట్టి దొరికినంత మటుకు ప్రశస్తమైన వ్రాతప్రతుల నుండి ఈ పుస్తకము సిద్ధము చేయించినాను. పద్య సంఖ్యలు తప్పులు. నా డికషనేరిలో పొందు పరిచిన అంకెలను బట్టి సవరించినాను.
20.	D.324	స్కాందపురాణం (సూతసంహిత)	మొకాబిలా చాయడమైనది. D.30 డిసెంబరు ౧౮౩౦ సం॥ భట్టరామాచార్యుల వ్రాలు. కొండూరి నరసింహాచార్యుల వ్రాలు.
21.	D.325	హరివంశం	విష్ణుపురాణం పీఠికలో విల్సన్ దొర ఇలా అన్నారు. (పుట.58) అని ఉదాహరణ.
22.	D.330	కాశీఖండం	ఈ గ్రంథము నాకోరికపైన దగ్గర ఉండే నా పండితుడు నరసింహాచారి సిద్ధము చేసినాడు. అతడు నాలుగు ప్రతులతో బాటు సంస్కృత మూలము కూడా చూసినాడు. అయినా ఫలితము తృప్తికరముగా లేదు. వచనములలో

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
			శ్రీనాథుడు వాడిన శబ్దాలేమిటో గుర్తించ లేనంతగా పాఠభేదాలలో చాలా పెద్ద తేడాలు వున్నవి.
23.	D.356	శ్రీకాళహస్తి మాహాత్మ్యం (32 పుటలలో)	'New Edition 1840. Founded on a comparison of four MSS and an English Summary of the story'.
24.	D.357	శ్రీకాళహస్తి మాహాత్మ్యం	of this rare poem until 1833. I never was able to obtain but one copy. గద్వాల నుండి 1832లో ఒక కాపీ వ్రాయించారు. కాణాదం పెద్దనగారి భద్రాపరిణయం కూడా ఈ ప్రతిలోనికి ఎక్కించింది. మెకంజీ సంకలనంలో ఉన్న ప్రతిలోని పాఠభేదాలను ఇందులో ఎక్కించారు.
25.	D.360	శ్రీపర్వతపురాణం	It is silly stupid book utterly worthless yet written by a man of learning and in good style of Poetry.
26.	D.361	శ్రీపర్వతపురాణం	''తెలుగు శ్రీశైలమాహాత్మ్యం, రాజ మహేంద్రం జిల్లా యర్రనగూడెం పోలీసు అమీనయిన గజవల్లి కొండయ్య పంతులు.''
27.	D.363	శ్రీపర్వతపురాణం	దొరగారి నోటు కూడా వుంది. ది ౬ ఆగస్టు ఆ ౧౮౭౦ సంవత్సరం మొకాబిలా చాయడ మైనది. వారణాసి రామస్వామి వ్రాలు. కొర్రపాటి చన్నప్ప వ్రాలు.
28.	D.370	అంబరీష చరిత్రం	Begun 29-3-40. copied from a Ms. in the Mackenzie library. (కర్తః హర్యపరాజు రంగశాయి.)
29.	D.379	అనిరుద్ధ చరిత్ర (సవ్యాఖ్యానం)	బ్రౌను దొరగారి అనుమతిపై పమిడిపాటి వెంకటనరసయ్య వ్రాసిన వ్యాఖ్యానం. 1834. ఇంగ్లీషులో కథాసంగ్రహం.
30.	D.383	అహల్యాచరిత్రము	ఇంగ్లీషు అనువాదం. ప్రారంభం. 18th May 1825. ముగింపు 25th May 1825. మడికి సింగన రచనకు

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
31.	D.384	అహల్యా సంక్రందన విలాసం	the original of this was given to me by Vemulapati Venkaiah at Ongole on 29th June 1833. వేమనారాధ్యుల సంగమేశం రచన.
32.	D.387	అహల్యా సంక్రందనం	పులిచేరిలో మాజేటి సర్వేశలింగం వ్రాసుకొన్న ప్రతి
33.	D.388	ఆదిలక్ష్మీవిలాసం	This poem is so obscured with pendantry it is quite worthless. అక్కినేపల్లి నరసింహం రచన.
34.	D.392	ఆముక్తమాల్యద	Small summary. 5-6 lines.
35.	D.405	ఆముక్తమాల్యద	బుధ స్తోమణీ వ్యాఖ్యాన సహితం. (1813) This manuscript has been corrected throughout by the very learned critic Zuluri Appaya is 1834. This third book of this poem is wanting. జోగి జగన్నాథర్రాజు వ్యాఖ్యాత.
36.	D.423	ఆముక్తమాల్యదా శబ్దసూచి	1849 – బ్రౌను దొరగారి సొంత ఖర్చులపై తయారుచేసినది.
37.	D.449	కవికర్ణ రసాయనం	మాంధాతచరిత్ర అన్న పేరే సమంజసం అని దొరగారి రిమార్కు
38.	D.453 -4	కవికర్ణ రసాయనం సవ్యాఖ్యానం 1832)	నందననామ సంవత్సర మార్గశిర శు॥ 2 శుక్రవారం వరకు బందరు పట్టణంలో న్యాయాధికారిగా నున్నటువంటి మహారాజశ్రీ చార్లీసు ఫిలిప్ బ్రౌను దొరగారి సెలవు ప్రకారము జూలూరి అప్పయ్య కవికర్ణ రసాయన ప్రబంధమునకు సంపూర్ణముగా టీక రచించడమైనది.
39.	D.464	కుచేలోపాఖ్యానం	9 ప్రతులనుండి పాఠభేదాలు గుర్తించి సవరించి తయారుచేసిన తీర్పు ప్రతి
40.	D.481	గణపతీయం	దొరగారి నోట్సు చాలా వుంది.
41.	D.491	చంద్రరేఖావిలాపం	దొరగారి పీఠిక. చాలా పెద్దదే.
42.	D.497	చంద్రరేఖావిలాపం శబ్దసూచి	—
43.	D.500	చంద్రాంగద చరిత్ర	ఆంగ్లపీఠిక, కథాసంగ్రహం (పైడిమర్రి వెంకటపతి రచన.)

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్క్స్
44.	D.501	చంద్రాగద చరిత్ర	సోమవారమాహాత్మ్యం అనే ద్విపద కావ్యం ఇదే విషయాన్ని ప్రతిపాదించినా కథ వేరు అని దొరగారు గుర్తించారు.
45.	D.502	చంద్రాగద చరిత్ర	I have taken a copy of this book. C.P. Brown. 1840
46.	D.510	చమత్కారమంజరి	సింహాద్రి వెంకటాచార్యుల రచన. this poem is useless, it is composed in a bad pedantic style and is in many places nearly unintelligible. Yet it is much admired by some learned Telugus. The subject of the poem is the marriage of Krsna which is the theme of at least twenty Telugu poems.
47.	D.524	దశావతార చరిత్ర	7వ ఆశ్వాసం (55-199) అహల్యా కథ. దొరగారి నోట్సు చాలా వుంది.
48.	D.528	,, ,, వ్యాఖ్య	గరిమెళ్ల వెంకయ్య చేసిన టీక. పది ఆశ్వాసాలకు. 1834 మార్చి 14 వరకు
49.	D.531	,, ,, పదసూచి	—
50.	D.552	నీలాసుందరీ పరిణయం	ఆంగ్లానువాదం కొంతదాకా 25 మే. 1825
51.	D.593	బిల్హణోపాఖ్యానం	ఇంగ్లీషు నోట్సు అక్కడక్కడ వున్నాయి.
52.	D.598	భల్లాణచరిత్ర	మల్లవరపు వాలేశ్వరుని రచన. దొరగారు విషయ సూచికను వ్రాశారు. 2.2.43
53.	606	భానుమద్విజయం	వెలగపూడి కృష్ణయ్య రచన. This entertaining and useful book is extremely rare. This poem is translated in Tamil perhaps from Telugu. The Title is affixed to it Tamil Ariyum Perumall. ఇంగ్లీషు, తెలుగు విషయసూచికలు ఇంగ్లీషు టిప్పణి.
54.	D.611	భానుమద్విజయటీక	27-D.(18) 41. This is a learned and useful commentary యోగశాస్త్ర వ్యాఖ్యానం వేరే పుస్తకంలో వుంది.
55.	D.641	మనుచరిత్ర	సటీక - జూలూరి అప్పయ్య శాస్త్రి The Manu-caritra vol.1. with a commentary in the

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
			autograph of the learned author Zuluri Appayya Sastry who composed it at the desire and at the expense of Mr. C.P. Brown. "The Manucaritra Vol.II and last. with a commentary explaining every word, in the original handwriting of Zuluri Appaiah a brahmin fo extraordinary learning, who understood and accomplished this ardous and important work at the desire and in the pay of C.P. Brown. ఖరనామసంవత్సర మార్గశిర ౧౧ గురువారం ఆ ౧౮౩౨ సం॥ డిసెంబరు ది ౨౬ తేదీ వరకు మహారాజశ్రీ ఛార్లెసు ఫిలిప్‌బ్రౌన్ దొరగారి సెలవు ప్రకారము జూలూరి అప్పయ్యా ఈ స్వారోచిషమనుసంభవమునకు అనగా మనుచరిత్రకు టీక చెయ్యడమైనది.
56.	D.642	మనుచరిత్ర శబ్దసూచి	This verbal index to Manucaritra, a celebrated Telugu poem compiled at Masulipatnam in the year 1932 under the directions of C.P. Brown.
57.	D.649	మూర్ఖచరిత్ర	మాజేటి సర్వేశలింగం రచన. తన విరోధిపై.
58	D.651	మొల్ల రామాయణం	"Mem the యుద్ధకాండ in two MSS is written in two different ways one probably is borrowed from another translation not that by Bhaskara however. ఈ మొల్ల రామాయణంలో అయిదు ఆశ్వాసముల పరియంతం యెత్తివాసం లేదుగాని యుద్ధ కాండ గురించి రెండు విధాలుగా వున్నది. కొన్ని గ్రంథములు వక తరహాగా వున్నది. మెట్టుకు ఆ రెండు తరహాలు భాస్కర రామాయణమును అనుసరించినవి కావు.
59.	D.662	యయాతిచరిత్ర	This manuscript has been compared twice with other copies and proses very correct. పాఠభేదాల ప్రతి.
60.	D.663	రఘువంశం	అవుడూరి కిచ్చయ్యా - దీర్ఘమైన రిమార్కు. It is stupid as need be పండితాభిప్రాయం

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
			"మూలమెంత సరళమో, స్పష్టమో తెనిగింపు అంత కఠినము, సమాసజటిలము."
61.	D.665	రత్నావళీ పరిణయం	ధూర్జటి వెంకటరాయుడు. "ఈ సంపుటములో మూడు కావ్యములు వున్నవి. సారంగధర పద్యకావ్యము, రత్నావళీ పరిణయము (తెలుగులో), రతిరహస్యము (సంస్కృతము). ఈ మూడున్ను నిండా దోషములో వున్ననూ మొకాబిలా చేయుటకు పాత వ్రాతప్రతులనుండి యెత్తి వ్రాయడమైనది. సారంగధరకు నావద్ద వేరే తీర్పు ప్రతి వున్నది"
62.	D.668	రసికజన మనోభిరామం	'శేఖు మహమ్మదు సాహేబు ప్రతిక్రమాన."
63.	D.686	రాఘవపాండవీయం (సటీకం)	This verbal commentary was composed by the very learned Narasimhachari. This volume is in his own hand writing. The poem is one of extraodinary refinement and singularly difficult.
64.	D.697	రాధామాధవ సమాగము	ఎడవల్లి వెంకటపతి. "This is copied from a manuscript in the Mackenzie library, the poem is extremely rare'.
65.	D.706	రాధామాధవ సంవాదము	a critical edition thus treated with an ample commentary. Prepared under the direction of Charles Philip Brown by పమిడిపాటి వెంకటనరసయ్య. 1829
66.	D.708	రాధికా సాంత్వనం	పెద్ద రిమార్కు. D.711-12 టీకలు (వ్యాఖ్యాత పేరు తెలియదు.)
67.	D.714	రామాభ్యుదయం	"This new edition was complete in September 1850'
	D.715	రామాభ్యుదయం	This poem is much celebrated but extremely rare. for many years I never met but one manuscript. Subsequently I produced one from the Mackenzie collection: but that is deficient the first book is wanting as far as the end of the introduction. (పెద్ద రిమార్కు -

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
			పరిష్కరణ విధానం) శైలిని బట్టి కాల నిర్ణయం. చాలాకాలం తరువాత నాలుగు ప్రతులు దొరికాయి.
68.	D.719	రుక్మాంగద చరిత్ర	ఇంగ్లీషులో కథా సంగ్రహం. ది ౪ అక్టోబరు ౪౮౭౧ సం॥ మొకాబిలా శాయడమైనది.
69.	D.749	వసుచరిత్ర	సవ్యాఖ్యానం. This is the older commentary composed about 1750 A.D.
70.	D.759	వసుచరిత్ర. సటీక	"ఆన 1834 సం॥ ఏప్రిల్ నెల ౫ తేదీ వరకు మ-రా-శ్రీ చా॥ పి॥ బ్రౌను దొరగారి సెలవు ప్రకారం ఈ వసుచరిత్ర ఆరు ఆశ్వాసముల కున్ను జూలూరి అప్పయ్య ప్రతిపద టీక చెయ్యడమైనది'. This book is in the hand writing of the learned critic himself while the original text is in the hand writing of his son. అప్పయ్యగారిపై ప్రశంస. అమెరికన్ మిషన్ ప్రెస్సు తాలూకు యేజెంటు వ్రాసిన లేఖ. 1839లో యథాతథంగా అచ్చువేసినట్టు జ్ఞాపిక.
71.	D.750	వసుచరిత్ర. సటీక	ములుపాక బుచ్చయ్యగారి వ్యాఖ్య. వ్యాఖ్యానం అవతారిక నూరార్లు లెక్కశాయక. "ప్రతిపదార్థ ప్రకాశిక" D.761 కూడా.
72.	D.762	వాణీవిలాస వనమాలిక	దొరగారు ఆంగ్లంలో సమగ్ర వ్యాఖ్యానం వ్రాశారు.
73.	D.768	విక్రమార్క చరిత్ర	గ్రంథం పొడుగునా మార్జిన్‌లో విషయ వివరణ. రెండు ప్రతులే దొరికాయి మొదట. తరువాత రెండు. అన్నింటిలో దోషాలు. ఒక దగ్గరే బహుశా ఒక ప్రతికే ఇది పుత్రికలు. Being similar instructure to the Arabian Nights.
74.	D.773	విజయవిలాసం	ప్లవంగనామ సం॥ జ్యేష్ఠ శు ౪౩ తారీఖున గాలీవానా వచ్చి వుప్పు నీరు పొంగిన తారీకు ఈ విజయవిలాసమూ యీ శు 3సోమవారాన మాజేటి సర్వేశలింగంకు దొరికినది.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
75	D.782-785	విజయవిలాసం	సవ్యాఖ్యానం. జూలూరి అప్పయ్యగారు 1831. బందరు (1830 డిసెంబరు 11)
76.	D.791	వీరభద్రవిజయం	The style is classical and elegant. రెండు ప్రతుల నుండి తయారుచేసిన కూర్పు.
77.	D.796	వైజయంతీ విలాసం	గ్రంథం పొడుగునా ఇంగ్లీషు నోట్సు.
78.	D.799	వైజయంతీ విలాసం	1833 పైడిపాటి వెంకటనరసు వ్యాఖ్యానం. Ladies wager, "One poem is very entertaining one and deserves publication. The poet evidently held neither the gods, nor the brahmins in any respect.
79.	D.800	వైజయంతీ విలాసం	విన్నకోట నరశింహ్వులు దస్తూర్ని వ్రాసి మాజేటి సర్వేశలింగముకు యిచ్చెను.
80	D.802	వైజయంతీ విలాసం	ఆరణిమఠం వీరభద్రయ్యగారి టీక.
81.	D.807	శశాంక విజయం	This copy contains the fair transcript of the correct text accompanied by various readings.
82	D.809	శశాంకవిజయం	సంపుటము ౧ తొలి మూడాశ్వాసములు. What title shall I give his commentary తారాప్రకాశిక? తారాభావదీపిక? The name of the Advaita common Bhal. 'చకోరీయం' అని చివరకు పెట్టారు. సంక్షిప్తం చేస్తే మంచి గ్రంథం.
83	D.819		చకోరీయ వ్యాఖ్యాన సహితం. తరువాత తారకం నరసింహాచారిగారి వ్యాఖ్యానం. పునరుక్తులు, అనవసర పాండిత్య ప్రకర్షణ తొలగించడానికి జూలూరి అప్పయ్యగారు సరిదిద్దారు. కొన్ని చోట్ల దొరగారే సవరణలు చేశారు. కొన్ని భాగాలు కొట్టివేశారు. ఈ వ్యాఖ్యానానికి చివరి పేరు 'తారకం' 1828లో నరసింహాచారి వ్యాఖ్య. 1830లో అప్పయ్య గారి సవరణలు. 1843లో దొరగారి కురుచకూర్పు, 1853లో తీర్పు ప్రతి.
84	D.823	శశాంక విజయ శబ్దసూచిక	1830 బందరు. నలుగురు కుమారులకు నాలుగు నెలలు పట్టినది. నలుగురి మనుష లకు నాలుగు మాసములు తగిలి వున్నది.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
85	D.826	శివలీలావిలాసం	తారీఖు దొరగారు ఇంగ్లీషులో వ్రాశారు.
86	D.836	శుకసప్తతి	అవతారిక వేరు. చతుర్థాశ్వాసంలో నిలిచి పోయి 1831లో ఈ ప్రతి సిద్ధం చేయించారు. twenty in number.
87	D.837	శుకసప్తతి	(1839లో ఇంకొక ప్రతి) 1831లో జూలూరి అప్పయ్యగారిని ఈ గ్రంథం పరిశీలించి సవరించమని దొరగారు కోరారు. చాలా శ్రద్ధగాను కొనియాడతగ్గట్టుగా పంతులుగారు పరిష్కరించారు. హంసవింశతికన్నా మేటి శైలి అన్నారు.
88	D.842	శృంగారనైషధం	"సుక్కుల నామసంవత్సర మార్గశిర శుద్ధ ఆదిత్యా వారం మూడు జాముల వరకు శేకుహమ్మదు సాహెబు నైషధ కావ్యం అష్టమాశ్వాసములును సంపూర్ణంగా వ్రాసెను."
89	D.855	సకలకథాసార సంగ్రహం	మెకంజీ గ్రంథాలయంలోనూ, కాలేజీ గ్రంథాలయంలోనూ వున్న ప్రతుల నుండి సిద్ధము చేసిన కూర్పు. (1840) అక్టోబరు. This is an illitrate poem of no merit whatever parts are superior one stolen from better authors. July 1843.
90	D.862	సత్యభామా సాంత్వనం	The great theme of this book is Purusha Viraham. (రాజమండ్రి మకాం చిత్రాడ కాపురస్తులయిన చెలికాని ధర్మారాయనిం గారి వద్దనుంచి మనుచరిత్ర సత్యాభామా సాంత్వనం కలవక, పుస్తకం భానుంబైల కొండలరావు తెప్పించి మెస్తరు శి.పి. బ్రౌను దొరగారి సొంతమునకు యిచ్చినాడు. 1834 సం. యేప్రిల్ 18, Kondulrow inhabitant of Cocanada.
91	D.867	సానందగణేశ్వర విలాసం	మొకాబిలా చాయడమైనది. వారణాసి రామస్వామి వ్రాలు - కొజ్జిపాటి చెన్నప్ప వ్రాలు.
92.	D.874	సారంగధరోపాఖ్యానం	దొరగారు పుస్తకం నిండా ఇంగ్లీషు నోట్సు వ్రాసుకొన్నారు.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
93.	D.879	సారంగధరోపాఖ్యానం	కృష్ణయ్య, కొండలరాయడు, 1829 సెప్టెంబరు 26న మొకాబిలా చేశారు
94	D.881	సారంగధరోపాఖ్యానం	1843 మే సటీక - ఎవరు టీక వ్రాశారో తెలియదు
85	D.882	సింహాసన ద్వాత్రింశత్తు	అక్కడక్కడ ఇంగ్లీషు నోట్సు పాఠభేదాలు చాలా వున్నాయి. విడి కాగితాలపై వ్రాసిన అదనపు భేదాలు అవసరమైన చోట్ల అంటించారు.
96	D.884	సింహాసన ద్వాత్రింశత్తు	This is the new edition... duly corrected by the editor Narasimhachari under my direction in the year 1842. విమర్శ.. వుంది. (ఘాటుగా) బ్రాహ్మణీక వైముఖ్యం.
97	D.885	సింహాసన ద్వాత్రింశత్తు	43 పుటల విషయసూచిక. 1842 డిసెంబరు 29 నాటికి ముగించారు.
98	D.888	సీతావిజయం	ఆగస్టు ఆన 1832వ సంవత్సరం మొకాబిలా చేయడమైనది. వారణాశి రామస్వామి కొంగ్రపాటి చన్నప్ప.
99.	D.895	సునందాపరిణయం	"అవుదాండ్ల అప్పయ్య మొకాబిలా చూచి దిద్దినది. కొంగ్రపాటి చన్నప్ప మొకాబిలా చదవడమున్ను అయినది. ది ౪ జూన్ ఆన 1832 సం॥ ప్రతి భేదాలు ఎక్కించడమయినది. వారణాశి రామస్వామి వ్రాలు జూలూరు లక్ష్మీనారాయణ వ్రాలు."
100	D.898	సురాభాండేశ్వరం	పాఠభేదాలు. నిర్దుష్టపాఠం. దొరగారి ఇంగ్లీషు టిప్పణి.
101	D.912	హంసవింశతి	చాలా పెద్ద నోట్సు. 1827లో మొదట చదివారు. చార్ దర్వీష్, బాగోబహార్. డెకమెరన్, తోతీనామా కథల పోలికలు. The learned Brahmins with whom I read this book own their ignorance of hundreds of terms used by the poet.... 1830 కూర్పు తరువాత పాఠభేదాలు చాలా దొరికాయి. కనుక శబ్దసూచికలోనికి ఎన్నో పదాలు ఎక్కలేదట. ఈ సంగతి 1845లో వ్రాశారు. 'దుస్సంధి,

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
			అఖండయతి, అన్యదేశ్య పదములు నిరంతరం ఈ పుస్తకంలో దొర్లుతాయి. ప్రయోజనం కోసం గాంభీర్యాన్ని కవి త్యాగం చేశాడు' అని రిమార్కు
102	D.914	హంసవింశతి	1830లో శుద్ధప్రతి
103	D.915	హంసవింశతి	1826లో కడపలో వ్రాయించిన ప్రతి
103	D.922	హరిశ్చంద్ర నలోపాఖ్యానం	సవ్యాఖ్యానం. రెండు వ్యాఖ్యానాలు ఉన్నవి. చిన్నది ప్రాచీనం. మితంగా అవసరమైనంత వుంది. పెద్దది ఆధునికము. బందరులో రచించినది.
105	D.930	హరిశ్చంద్రోపాఖ్యానం (శంకరకవి)	సవ్యాఖ్యానం. సంస్కారములు బంతుల నడుమ (D.929.27.6.1846) This volume has been carefully revised and corrected by Venkata Subbaya Sastri.
106	D.932	హరిశ్చంద్రోపాఖ్యానం	మంచి కావ్యం. వీరశరభయ్య రచన. నరసింహాచారిగారు శ్రద్ధగా, ఆసాంతం సంస్కరించి కూర్చినది. 28 మార్చి 1844.
107	D.935	హరిశ్చంద్ర	The tale of Harichandra by Virasarabhaya is exceedingly popular. It is composed in a beautiful classical easy style, it is an original Telugu poem and is full of amusing incidents.

ద్విపద కావ్యాలు

108	D.942	ఉత్తర రామాయణం	A new and correct edition prepared under the script of C.P. Brown.
109	D.943	ఉత్తర రామాయణం	సుదీర్ఘమైన వ్యాఖ్య. 1841
110	D.944	ఉత్తరరామాయణం	ఈస్టు ఇండియా హౌసు గ్రంథాలయం ప్రతినుండి ఎత్తి వ్రాసినది
111	D.950	ప్రభులింగలీల పాఠ విభేదాలు	1839. నరసింహాచార్యుల పరిష్కరణ.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
112	D.951	"	
113	D.952	ప్రభులింగలీల పాఠ విభేదాలు 31, 30	విషయ సూచిక. తెలుగు 34, 38 ఇంగ్లీషు చిలకమర్రి నరసింహాచార్యులు కూర్చిన ప్రతి
114	D.962	"	సటీక. 1842
115	D.964	బసవపురాణం	161 పుటల ఇంగ్లీషు కథా సంగ్రహం.
116	D.968	బసవ పురాణం	1840 New Edition
117	D.981	రామాయణం	1840 సెప్టెంబరు 11 1839లో ప్రతి సిద్ధం చేశారు. 15 ప్రతుల నుండి పాఠ భేదాలు గుర్తించారు. కొత్త కూర్పు (D.982) తెలుగులో దొరగారు చెప్పిన మేరకు వ్రాసిన కథా సంగ్రహం నుండి ఆంగ్లానువాదం చేశారు. 19 సెప్టెంబరు 1839 పరిష్కరణ ప్రారంభం 7th జనవరి 1840 ముగిసింది. ఆరుగురు మనుషులు నిత్యం పనిచేశారు.
118	D.1014	శ్రీనివాసవిలాస సేవధి	దొరగారి ఇంగ్లీషు నోట్సు అక్కడక్కడ ఉన్నాయి.
119	D.1023	అభిమన్యు కల్యాణం	24-3-1847, 43 పుటలు దొరగారి అనువాదం. 6-4-1847 ముగిసింది.
120	D.1043	కాటమరాజు చరిత్ర	ఇంగ్లీషు నోట్సు గ్రంథం నిండా ఉన్నాయి. నలసిద్ధి ఈగంత ప్రభువు ఏనుగంత పేరు అని దొరగారి రిమార్కు. (a little Baron with a long name).
121	D.1051	చొక్కనాథ చరిత్ర	The Telugu style is low and lazy enough
122	D.1064	నలచక్రవర్తి కథ	అయిదు ఆశ్వాసాల కింద దొరగారు విభజించారు.
123	D.1065	నలచక్రవర్తి కథ	1841లో ముద్రించిన పాఠానికి ఇది మాతృక. 1828లో తీర్పు ప్రతి తయారు అయింది. వివిధ ప్రతుల నుండి పాఠ భేదాలు గుర్తించారు.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
124	D.1083	నవనాథచరిత్ర	సటీక. 4 పుటల ఇంగ్లీషు కథా సంగ్రహ పాఠభేదాలు గుర్తించారు.
125	D.1086	పండితారాధ్య చరిత్ర	A new edition prepared by Virabhadrayya a learned Jangam Priest; under the directions of C.P. Brown. The present Vol. was prepared under the inspection of the Editor.
126	D.1087	పండితారాధ్య చరిత్ర	మూడు ప్రతుల నుండి పాఠభేదాలు. A learned Jangam Guru in my employ. July 1839 మొదలు 1841లో పూర్తి. దీర్ఘమైన రిమార్కులు.
127	D.1091	పండితారాధ్య చరిత్ర	రెండు భాగాలు. అయిదు ఆశ్వాసాలు. (పండితారాధ్య చరిత్ర ప్రతులు : 1086 నుండి 1103 దాకా. 18 ప్రతులు)
128	D.1106	పరమయోగి విలాసం తాళ్ళపాక తిరువెంగళనాథుని	There is a manuscript of this in the library at Oxford, transcribed from a Volume in the E.India House Library and sent to me by Prof. Wilson. మద్రాసులో దొరికిన ప్రతులలోని పాఠభేదాలు పొందుపరిచారు.
129	D.1111	పరశురామాయణం	An abstract of this work by Mr. Taylor is in the Madras Journal No.19 (April 1838) p. 353. This poem is mere rubbish and on perusing the beginning I desired the transcriber to desist. The illiterate comparer did not even know the laws of rhyme. దీని యొక్క మాతృక కుంఫిణీవారు పెట్టుకొన్న చెన్నపట్నం కాలేజీ మెకంజీ పుస్తకాలలో వున్నది'.
130	D.1112	పల్నాటి చరిత్ర కోళ్ళపోట్లాట	19th Dec. 1842. (D.1130 ఇంగ్లీషు నోట్సు 4 పుటల పీఠిక)
131	D.1113	రాచమల్లు రాయబారం	24, Dec. 1842
132	D. 1114	గురజాలయుద్ధం	30 Dec. 1842 (టిప్పణులు)
133	D.1149	కోళ్ళ పోట్లాట	New edition prepared under my orders 1850 by Virabhadrayya. వీరభద్రయ్య మూడు పుటలలో కథ ఉపోద్ఘాతం వ్రాశాడు.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
			(పల్నాటి వీరచరిత్ర ప్రతులు D.1112 నుండి 1164 దాకా. 53 ప్రతులు ఉన్నాయి.)
134	D.1165	భల్లాణ చరిత్ర	''ఈ కావ్యము జబ్బుగా వున్నది. యతులు ప్రాసలను గురించి సూత్రం తెలియని కవి చెప్పినది పనికి రాదు''
135	D.1178	యోగీశ్వర చరిత్ర	రామస్తవ రాజులు కన్నా గాంభీర్యములో ఇది ఒక వన్నె తక్కువ. ఆక్సుఫర్డు బొదిలీసు గ్రంథాలయంలో దీని ప్రతి ఒకటి చూశాను.
136	D.1193	సారంగధర చరిత్ర	1827లో కూర్చిన ప్రతి. పాశ్చాత్య పురాణాలతో దీని పోలికలున్న కథల భోగట్టా ఇచ్చారు. (బాణాల శంభుదాసు రచన)
137	D.1198	సారంగధర చరిత్ర	Beng Rice అనే మిషనరీ బెంగుళూరు నుంచి పంపిన ప్రతి.
138	D.1201	సారంగధర చరిత్ర	దొరగారి నోటు బాణాల శంభుదాసు చేమకూర అప్పన్న పేరేగాని గౌరన పేరు చెప్పనందుకు తప్పుపట్టారు.
139	D.1202	సారంగధర చరిత్ర	సటీక. 28-9-1843 ఏడు భాగములు. 5 ప్రతులు టీకాకారుని పేరు తెలియదు.
40.	D.1211	హరిశ్చంద్ర (గౌరన)	వెంకటనరసయ్య తీర్పు చేసిన ప్రతి.1847లో ముద్రణ. (1827 ప్రతి సేకరణ)
141	D.1216 నుండి 1221	'' సటీక ''	D.1217 పుటల్లో సారాంశం. 1846 ఆగస్టు 9, 1851 ఆగస్టు 20 (D.1221) ముగిసినది

వ్యాకరణం, ఛందస్సు, నిఘంటువులు

142	D.1227	ఆంధ్ర ధాతుపాఠం	పట్టాభిరామ శాస్త్రిగారిది. దీని మాతృక చెన్నపట్నంలో కుంఫిణీవారు పెట్టుకొన్న క్షాలేజిలో వుంది. మరొక పుత్రిక లేదని విన్నాను. ఈ గ్రంథం ఒక్క తెలుగు ధాతువు లనే యిస్తున్నట్టు చెప్పుకొన్నా అట్టాయించు వంటి హిందూస్తానీ మాటలను కూడా స్వీకరించింది. చూ॥ పుట 31 (1826)

వరుస	D. సెం.	గ్రంథం	రిమార్కు
143	D.1237	ఆంధ్రశబ్ద చింతామణి	సుదీర్ఘమైన నోట్సు చాలా ముఖ్యం.
144.	D.1259	శబ్దతత్త్వ వివేకం	తెలుగులో సంస్కృత వ్యాకరణం. వరద వేదాంతాచార్యులు. 'బాలబోధిని.'
145	D.1260	Analysis of Telugu Prosody	వ్రాతప్రతి. అచ్చుపడింది.
146	D.1261	అప్పకవీయం	3వ ఆశ్వాసం. దొరగారి ఇంగ్లీషు అనువాదం.
147	D.1279	కవిజనాశ్రయం	1825లో అనువాదం చేశారు. This copy is corrected by my learned teacher Vencata Siva - ఏప్రిల్ 26.
148	D.1313	రగడ లక్షణము	ఆంధ్రాంగ్ల భాషలలో వివరణలు. దొరగారి రచన.
149	D.1328	సులక్షణసారం	దొరగారు కొన్ని పద్యాలకు అనువాదం వ్రాశారు.
150	D.1330	The Entire Grammar of Telugu	1837లో మొదలుపెట్టారు.
151	D.1331	Telugu Vocabulary of Grammar	1812లో ముగిసినది. ఇది కాంబెలు దొరగారి వ్యాకరణం డిక్షినేరీ గ్రంథాలకు ముందు రచించినది. 1780లో, బహుశా తెలుగుదేశంలో వున్న ఫ్రెంచి రోమను పాదరీలు వ్రాసి వుంటారు. ఈ తెలుగు వ్యాకరణం మొదట లాటిన్ భాషలో వ్రాసినట్టు స్పష్టం. ఇది పామర గ్రంథం. తెలుగు తెలిసినవాళ్ళకు తప్ప తలకొట్టుకొన్నా బోధపడని స్పెల్లింగు. ఈ తప్పులు వ్రాయసకాని వల్ల వచ్చినవి. అతనికి ఇంగ్లీషు జ్ఞానం స్వల్పం, తెలుగు శూన్యం.
152	D.1332	ఆంధ్రదీపిక	వెంకయ్యగారి నిఘంటువు
153	D.1332	ఆంధ్రదీపిక	బందరు 12-8-1824. ఇది నా సూచనల మేరకు మాతృక క్రమాన వున్నట్టు వ్రాసిన ప్రతి. వ్యుత్పత్తుల కాలం వదలిపెట్టారు. ఇది భావి సమగ్ర రచనకు ప్రాతిపదిక. (D.1336. 1842 ఫిబ్రవరిలో వ్రాయించుకొన్న ప్రతి)

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
154	D.1359	ఆంధ్రనామ సంగ్రహం	సటీక (D.1337 నుండి 1359 దాకా ప్రతులు)
155	D.1368	ఆంధ్ర భాషార్ణవ శబ్దసూచి	1850 ఆగస్టు ముగిసింది This work contains perhaps one fourth of the language certainly notmore.
156	D.1372	ఆభాసాంధ్ర నిఘంటువు	మిశ్ర నిఘంటువు. రాజమండ్రి 1834. 1832లో మొదలుపెట్టారు.
157	D.1373	కర్కంబాడి నిఘంటువు సముచ్చయం	ఆంధ్రనామ సంగ్రహం, ఆంధ్ర నామశేషం, వెంకటేశాంధ్రం, సాంబ నిఘంటువు అనే నాలుగు నిఘంటువుల నుండి తయారు చేసిన సంపుటం.
158	D.1375	దేశిపద నిఘంటువు	నాలుగు ప్రతులు. ఒకటే గ్రంథం. బందరు-చెన్నపట్టణం, కంచి 1838 సం॥ జనవరిలో దీనిని దొరగారు చూశారు. అకారాదిగా ఉంది.
159	D.1385	పదనిధి	3 సంపుటాలలో తెలుగు నిఘంటువు. 1841లో ప్రారంభించారు. తత్సమ పదాలు కూడా చేర్చారు.
160	D. 1391	Brown's T.E.D.	తొమ్మిది సంపుటాలు. చాలా వివరాలు. ఆత్మకథలో లేని విషయాలు ఉన్నాయి. 1836 నాటికే గ్రంథాలకు 30,000 రూపాయలు ఖర్చు చేశారు. బ్రౌణీయం అని తనే పేరు పెట్టారు.
161	D.1392	Brown's E.T.D.	జాన్సను పండితుని ఇంగ్లీషు నిఘంటువు. ముద్రిత ప్రతులు పుటల మధ్య తెల్ల కాగితాలు వాటిపై అర్థాలు. తెలుగు ఎప్పుడు నేర్చుకొన్నది మొదలైన వివరాలు ఉన్నాయి.
162	D.1394	T.E.D.	Pere Mottel గారి నిఘంటువు. కాంబెలు దొరగారు చెప్పినది ఇదే.
163	D.1395	పీఠిక	E.T.D. దొరగారు వ్రాసిన పీఠిక వగైరా నోటులు అన్నీ అసమగ్రం. అయినా చాలా ఉపయోగపడతాయి.

వచన కావ్యాలు

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
164	D.1400	ఉత్తర రామాయణ సంగ్రహం	బ్రౌన్ దొరగారు వ్రాయించారా? రంగనాథ రామాయణ కథ
165	D.1401	కామరూప కథ	తడకమళ్ళ కృష్ణారావు రచన (ఈ గ్రంథాలయంలో ఇతని దస్తూరీలో గ్రంథాలు చాలావున్నాయి) నవల
166	D.1407	కాశీయాత్రచరిత్ర	వ్రాతప్రతి. దొరగారి రిమార్కులు వున్నాయి.
167	D.1412	క్రైస్తవ పురాణ కథాసంక్షేపం	తెలుగులో పాత నిబంధన కథా సంగ్రహం. 1702లో రోమను ఫాదరీలు చేసిన అనువాదం.
168	D.1412 -16	గోవ్యాఘ్రుచరిత్ర	మాజేటి సర్వేశలింగం పుదుచ్చేరిలో యల్లయ్యగారి ప్రతి ప్రకారం ఖాసాకు వ్రాసుకొన్నది.
169	D.1424	బత్తీసుపుత్రిక కథలు	మాజేటి సర్వేశలింగంకు వ్రాసియిచ్చినది. తాళపత్రం.
170	D.1437	భాగవతసారం	
171	D. 1438	భారతకథాసూచి	
172	D.1453	వినోద కథలు	తాతాచార్యుల కథలు. దొరగారి ఉపోద్ఘాతం. (ఆనాటి వచన కావ్యాల ప్రతులు అన్నీ ఉన్నాయి. బహుశా దొరగారు వ్రాతప్రతులు సేకరించారేమో...)
173	D.1517	కాళహస్తిలింగశతకం	మాజేటి సర్వేశలింగం మొకాబిలా చాయడ మయినది. పుత్రికతో రుజువు అయినది.
174	D.1538	గణస్తవం	మాజేటి సర్వేశలింగం దస్తూరీని...
175	D.1561	జగన్నాయక శతకం	ఇది ఒక పనికిమాలిన క్లిష్ట రచనము. తెలుగు ఛందస్సున రచితమైనదయినను ఇందు సర్వము సంస్కృతమే అని దొరగారు ఇంగ్లీషులో వ్రాశారు.
176	D.1576	దత్తాత్రేయశతకం	అమీరపు లక్ష్మయ్య దస్తూరిని వ్రాసి మాజేటి సర్వేశలింగముకు ఇచ్చెను.
177	D.1562	మురుమళ్ళశతకం	కట్టాల మామయ్య వ్రాసి మాజేటి సర్వేశ లింగంకు ఇచ్చెను.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
178	D.1702	వృషాధిపశతకం	మాజేటి సర్వేశలింగం ఖాసా పుస్తకం. 1703 కూడా అతనిదే.
179	D.1721 నుండి 1774	వేమనపద్యాలు	54 ప్రతులు. వివిధ రకాలు. నోట్సు టిప్పణులు ఆంగ్ల లాటిన్ అనువాదాలు. ఒకటేమిటి వేమనపై దొరగారి వెర్రి అభిమానం కనబడుతుంది. 1824లో మొదలు పెట్టారు అనువాదం. ఈ నోట్సు చాలా ఉపయోగం. 15-4-1824.
180	D.1781	శివముకుందశతకం	మాజేటి సర్వేశలింగం. దస్తూరీని వేలయ్య ప్రతి ప్రకారం.
181	D.1786	శ్వేతకుభృన్నల కేసరి శతకం	ది. 14 ఫిబ్రేవరు 1832 సం. ఈ శతకము సంప్రతించి తీర్పు చెయ్యడమైనది. జూలూరి అప్పయ్య వ్రాలు.
182	D.1799	సదాశివ శతకం	పుదుచ్చేరిలో మాజేటి సర్వేశలింగం వ్రాసినాడు.
183	D.1821	సోమేశ శతకం	పుదుచ్చేరిలో జంగం బసవయ్యగారి ప్రతిచూసి మాజేటి సర్వేశలింగం వ్రాసుకొనెను.
184	D.1823	హంసకాశికాంబ శతకం	మాజేటి సర్వేశ లింగం వ్రాలు.
185	D.1835	అక్కామహాదేవి చరిత్ర	మాజేటి సర్వేశలింగం స్వదస్తూరిని వ్రాసినారు
186	D.1836	ఉషా పరిణయం	పులిచేరిలో సదాశివ భక్తుని కొమారుడు బసవప్ప వ్రాసుకొన్న ప్రతి చూసి మాజేటి సర్వేశలింగం సంపూర్ణంగా వ్రాసెను
187	D.1852	కురవంజి	మాజేటి సర్వేశలింగం ఈ చంద్రశేఖరుడు దస్తూరీలను వ్రాసినది
188	D.1872	గురునంబిచరిత్ర	మాజేటి సర్వేశలింగం వ్రాసెను.
189	D.1907	పార్థసారథి విజయం	1840లో ప్రతి విలేఖన జరిగిందని దొరగారి జ్ఞాపిక. (ఆలూరి కుప్పన రచన)
190	D.1913	భద్రకాళీ కళ్యాణం	పైడిముక్కల పుల్లయ్య మాజేటి సర్వేశ లింగంకు సంపూర్ణంగా వ్రాసి ఇచ్చెను.
191	D.1914	భల్లాణ చరిత్ర	మాజేటి సర్వేశలింగం వ్రాసుకొనెను
192	D.1915	భల్లాణ చరిత్ర	మాజేటి సర్వేశలింగం వ్రాసుకొనెను. ఆలపాక పెద్ది. విరోధి. ఆశ్వీజ శు.10 ఆదివారం. మాజేటి

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
			సర్వేశలింగం పుదుచ్చేరిలో, ధాతువు నామ సం. కార్తీక నెల 21 తేదీ బుధవారం సర్వకాలం గ్రహం. పుణ్యకాలం ఉదయమయిన పన్నెండు ఘడియల నరమీద పుదుచ్చేరిలో ప్రాంసుకోటి చేసినది.
193	D.1941	వీరచోడవ్య చరిత్ర	ఈశ్వర మాజేటి సర్వేశలింగం వ్రాసుకొన్నాడు.
194	D.1953	సాంబశివ విలాసం	మదరాస్ జర్నల్ 3వ సంచిక 71 పుటలో టీటస్ వ్రాసిన ఈ గ్రంథ చరిత్రగలదనీ, ఈ ప్రతి 8-7-1842న ముగిసిందని దొరగారి నోటు.
195	D.1957	సారంగ నాటకం	విరోధి. పుదుచ్చేరిలో మాజేటి సర్వేశలింగం
196	D.1961	సుగ్రీవ విజయం	1842లో విలేఖనం.
197	D.1990	పొగాకు దండకం	విరోధి పుదుచ్చేరిలో వ్రాస్తిని (పేరు లేదు)
198	D.1993	భల్లాణ దండకం	నందన - మాజేటి సర్వేశలింగం
199	D.1998	భోగినీ దండకం	విరోధి - మాజేటి సర్వేశలింగం
200	D.2014	విద్యావతీ దండకం	నిడమామిళ్ళ రాయులయ్యగారి ప్రతి ప్రకారం. విక్రమలో పుదుచ్చేరిలో వ్రాస్తిని. మాజేటి సర్వేశలింగం.
201	D.2022	శరభేశ్వర దండకం	సర్వధారి - పుదుచ్చేరి - మాజేటి సర్వేశలింగం

వేదాంత గ్రంథాలు

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
202	D.2082	గురుబోధ	సర్వజిత్తు. మాజేటి సర్వేశలింగం వ్రాసుకొనెను.
203	D.2088	చెన్న బసవ పురాణం	దొరగారు 171 పుటలలో ఈ కథ అనువదించారు. 16వ శతాబ్దిలో రచన అని అభిప్రాయపడ్డారు.
204	D.2098	జ్ఞాన బోధకం	దొరగారు తెలుగులో రిమార్కు వ్రాశారు. 1840, నిర్మోహమాటంగా.
205	D.2111	నవరత్నమాలిక	మహిత శుకవాణి మాకు సామ్రాజ్యమొసగెన్ తుదనొక ఆకుమీద యానాము కాపులు మాజేటి సర్వేశలింగమునకు భూమి ఇచ్చినట్లు ఒక సీసమాలిక వుంది.
206	D.2113	నిగమాంత నాగ్ర రసాయనము	సర్వధారి పుదుచ్చేరిలో ప్రతి చూసి మాజేటి సర్వేశలింగం వ్రాసెను

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
207	D.2118	పంచీకరణం	15-2-1841
208	D.2197	వీరమాహేశ్వరాచార సంగ్రహం	13-9-1839 బసవ సిద్ధాంతాలకు విరుద్ధమైన బ్రాహ్మణ మూఢాచారాలను అంగీకరించడానికి శ్రమపడే గ్రంథం. ఇటువంటివానిని జంగాలు కొట్టి పారేస్తారు... ముఖ్యమైన నోటు.
209	D.2199	,,	కీలక. మా అయ్యావార్లు బురగుపల్లి లింగయ్యగారి ప్రతి చూసి మాదేటి సర్వేశలింగం వ్రాసెను.
210	D.2208 2213	వేదాంత రసాయనం	(మంగళగిరి ఆనందయ్య) (డి. 2212లో 28 పుటల కథాసంగ్రహం. డి. 2213 సటీక. పాఠభేదాలు)
211	D.2215	వేదాంత వార్తికం	శృంగార కవి వెంకన్న పుస్తకం జూచి మాజేటి సర్వేశలింగం వ్రాసెను. పార్థివ.
212.	D.2231	శివగీతలు	ప్రమాది. దెందులూరు కనకయ్య వ్రాసిన ప్రతి జూచి మాజేటి సర్వేశలింగం దస్తూరిని వ్రాసినది.
213	D.2244	శైవాచార సంగ్రహం	ప్రభవ. మాజేటి సాలంకయ్య కుమారుడు సర్వేశలింగం స్వహస్త లిఖితంగా వ్రాసుకొనెను
214	D.2254	సప్త ప్రకరణం	విరోధి. వేలయ్యగారి ప్రతి ప్రకారం పుదుచ్చేరిలో మాజేటి సర్వేశలింగం
215	D.2406	ఆంధ్ర చింతామణి	రుధిరోద్గారి. మాదేటి సర్వేశలింగం
216	D.2408	ఔషధయోగములు	మాదేటి సర్వేశలింగం వైద్యశాస్త్రం.
217	D.2458	వైద్య చింతామణి	సంస్కృతంలో ఇంద్రకంటి వల్లభయ్యగారు వ్రాసిన వైద్య చింతామణికి ధేనువుకొండ కేశవయ్య చేసిన అనువాదం. తాౠరిలో మాజేటి సర్వేశలింగం ఖాసను వ్రాసుకొనెను.
218	D.2468	వైద్యసారం	(నరనాథసిద్ధ ప్రదీపిక) సర్వధారి. మాజేటి సర్వేశలింగం. స్వహస్త లిఖితం. పుదుచ్చేరిలో వ్రాసినది.

వరుస	D. నెం.	గ్రంథం	రిమార్కు
		సంగీతం	
219	D.2536	జాతి స్వరముల సాహిత్యం	1833వ సంవత్సరము చిత్రనెల మహా రాజరాజే శ్రీ బ్రౌన్ దొరవారికి చిత్తూరిలో వుండే కుప్పయ్య శేషయ్య వ్రాసి ఇచ్చిన జాతి స్వరముల సాహిత్యములు. నందన సంవత్సరం చిత్రినెల.
220	D.2550	బొబ్బిలికథ	బొబ్బిలి కథ కుమార రాయుడి కథ కాకమ్మ కథ Meeting with one of the wandering minstrels...... I employed him for about a month to recite all the Ballads he know and there were written down his direction.
221	D.2571	లంకా సారథి	వికృతిలో మాజేటి సర్వేశలింగం పెరుమాళ్ల ప్రతి చూసి లంకా సారథి వ్రాస్తిని.
222	D.2582	శృంగారపదాల అకారాది పట్టిక	తాళరాగాలు - పదకర్తల పేర్లు. అసమగ్రం.
223	D.2657	హైదరు చరిత్ర	ఏప్రెలు 1848. తెలుగు, దొరగారి రిమార్కు ఏప్రెలు 1855 ఇంగ్లీషు అనువాదం తమది. తెలుగు ఎవరిచేతనో వ్రాయించారు.

1829 డిసెంబరులో కుంఫిణీవారు బ్రౌను దొరగారి హోదాను పెంచారు. అప్పటిదాకా సబార్డినేటు హోదాలో వున్నవారిని అసిస్టెంటు జడ్జిగా, జాయింటు క్రిమినల్ జడ్జిగా ప్రమోటు చేసి రాజమండ్రికి బదిలీ చేశారు. ఒక పక్క సాహిత్య కృషి చేస్తూనే తమ ఉద్యోగ విధులను చాలా చక్కగా నిర్వర్తించేవారు.

1830 నుండి 33 నవంబరు దాకా రాజమండ్రి, మచిలీపట్నాలలోనే నార్తరన్ ప్రావిన్షియల్ కోర్టు క్రింద పని చేశారు.

1830 ఫిబ్రవరిలోనే చెన్నపట్నం నుంచి ప్రచురితమయ్యే గవర్నమెంటు గజిట్లో హిందువులు మిక్కిలిగా వాంఛించే సరుకులు ఏమిటనే విషయం మీద ఒక వాణిజ్య వ్యాసం వ్రాశారు. దీనిని బెంగాలు పత్రికలు ప్రచురించాయి. ఇది అలా అలా పాకి ఇరవై సంవత్సరాల తర్వాత ఒక అమెరికన్ గ్రంథంలో చోటు చేసుకొంది (చూ॥ మిసెస్ రాబర్ట్సు రచించిన 'కేరక్టరిస్టిక్స్ ఆఫ్ హిందూస్థాన్' 29వ ప్రకరణం)

1829లో విలియం బెంటిక్కు భారతదేశంలో సహగమనాలను నిషేధించినా, చెల్లాచెదురుగా ఆ దురాచారం సాగుతూనే వుంది. 1833లో ఇటువంటి ఘోరాన్ని తలపెడుతున్న వార్తలు పోలీసులు ఇలా నివేదించారు. ఈ ఉత్తరం చూడండి.

''మహారాజశ్రీ రాజమహేంద్రవరం జిల్లా మేజిస్ట్రేటు వారి సముఖమునకు బాయణి కృష్ణయ్య హెడ్డు పోలైసు తాలుకే పిఠాపురం సన్ ౧౨౪౨ (1242) ఫసలి ౧౮౩౩ (1833) సం॥ జూన్ ది ౨౭ (27) తేదీ వరకు సర్కారు పనిలో హాజరు వుండి వ్రాసుకున్న అర్జీ విన్నపములు.

చేబోలు కాపురస్తుడైన ములగా జన్నప్ప భార్యలు తిర్పతమ్మ, రామమ్మ వీరు యిద్దరు ఫలహారము పుచ్చుకోక బహు యిబ్బందిలో వుండి యిక్కడ వున్న పక్షమునకు సహగమనముకు అధికార్లు శలవు ఇవ్వరు గనుక యిక్కడి నుంచి లేచి కాకినాడైనా మరి యెక్కడికైనా లేచి వెళ్ళవలెనని యెవరెవరి తోట అంటూ వారిలో వారు ఆలోచనలు చేసుకొంటూ వున్నారనిన్ని వారు లేచి వెళ్ళే యెడల ఆటంకం చెయ్యవలసి వుండునో లేక వెళ్ళనివ్వవలసినదో శలవు యివ్వవలసినదని వారి యిద్దరి వద్దనున్న కాపువున్న తాలుకే మజ్కూరు బంట్రోతులు యిద్దరు యీ తారీఖున నాపేర వుత్తరం వ్రాసి పంపించినారు. సదరహీ తిర్పపతమ్మ - రామమ్మ - అనే యిద్దరున్ను అక్కడ నుంచి లేచివెళ్ళే పక్షమునకు ఆటంకపరచవలసి వుంటున్నదో లేక వుపేక్షగా వుండవలసినదో యిందున గురించి చిత్తవృత్తి శలవు దయచేయించవలెను. దివ్య చిత్తానికి తేవలెను. కృష్ణయ్య హెడ్డు పోలైసు' అని వున్నది. (M417-pp.210-11)

ఈ సహగమన ప్రయత్నాన్ని దొరగారు ఆపారనుకోవాలి. 1827లోనే ఒక సతిని నిరోధించి ఆ విషయమై కూడా వ్యాసం వ్రాసి ఏషియాటిక్ జర్నల్‌కు పంపారు (1828 సంపుటి పుట 615). హిందువుల ఆచారవ్యవహారాలే కాక వారి శిల్పాలపై కూడా దొరగారు అధ్యయనం రాశారు. ఇది ఏషియాటిక్ జర్నల్‌లో ప్రచురితమైంది. (1828 సంపుటి. పుట 596). విగ్రహాల విషయంలో వారి ఆసక్తి ఉత్తరోత్తరా కూడా కొనసాగుతూనే ఉందనడానికి దాఖలాలుగా కొన్ని లేఖలు కనబడుతున్నాయి.

''మహారాజశ్రీ సి.పి. బ్రౌను యిస్క్వైయరు ఆక్టింగు కల్క్టరు జిల్లా గుంటూరు సర్కారు మృత్తుజాన్నగరు తాలూకే పల్నాడు వగైరాగారి సముఖానకు పోలిపెద్ది మల్లయ్య దారోగా డివీజన్ కొండవీడు వ్రాసుకున్న అర్జీ.

యీనెల ది ౧౦ (10) తారీఖును ౩౭౪ (374)రున దయ చేయించిన హుకుములో పురాతనమైన కొన్ని శిలావిగ్రహాలు స్త్రీ పురుష విగ్రహాలలో యెవి అయినా సరే వేగజం యత్తుకు లోగా వుండేవిగా కావలశిన విన్ని కొండవీడు వగైరా గ్రామాదులలో యెన్ని దొరికేవిన్ని అవి భిన్నమైనవో సమగ్రంగా వున్నవో విచారించి యత్తిల్లా చేశేదనిన్నీ భిన్నమైనటువంటి తామ్రలోహ కంచు విగ్రహాలు దొరికే పక్షమునకు విచారించి యత్తిల్లా చాయమనిన్ని మయశిల్పమనే శిల్పి శాస్త్రమున్నూ వాస్తు శాస్త్రమున్నూ గీర్వాణపు గ్రంథాలు దొరికిన పక్షమందు తెప్పించి పంపిస్తే వాటికి ప్రతులు వ్రాయించి తిర్గి పంపించడమవుతూ వున్నదన్ని యిత్యాది సంగతులు ఆజ్ఞాపించినారు గన్కు మనవి వ్రాసుకొనేది యేమంటే

యీ డివీజన్ యిలాకాలో కొండవీడు అమీను బాదాలో శిథిలమైన దేవస్థలాలలో విగ్రహాలు పూర్వమే యెవరెవరు తీసుకొని పోయినారని తెలిసినది. యిప్పుడున్నూ కొండవీడు ఖిల్లా వగైరాలలో, వుండే శిథిలమైన దేవాలయములలో యేమి, యింకా యితర జాగాలను యేమి నేను వెళ్ల విచారిస్తే యిప్పట్లో విగ్రహాలు యెక్కడా వున్నట్లు జాడా కనుపడలేదు. యింకా యిలాకా గ్రామాదులలో విచారిస్తున్నాను. వున్న పక్షమందు ఆ విగ్రహాలు యొక్క తరహాదారీ వగైరాలు జాహిరు చేస్కుంటూ వున్నాను.

భిన్నమైన తామ్రలోహకంచు విగ్రహములను గుర్తించి విచారిస్తే ఎవరివద్ద నున్ను వున్నట్టు కనబడలేదు. యీ యిలాకాలోకి ఫిరంగిపురం అనే గ్రామంలో తామ్రలోహ కంచు విగ్రహాలు యెవ్వరైనా కావలెనని ఫర్మాయిస్తే యుక్తమయిన విగ్రహాలు పోత పోశే కంచర భద్రప్ప అనేవాడు వుండి కాటకంగా వున్నందున యిక్కడ జరుగుబాటు లేక యీ మధ్యను బందరు ఆ ప్రాంత్యములక్కు వెళ్లినాడని తెలిసినది.

మయశిల్పం అనే శిల్పి శాస్త్రమున్నూ వాస్తు శాస్త్రమును గురించిన్ని విచారించినంతల్లో యీ వైపుల గ్రంథములను సంపాదన చేసినవారు యవరూ లేన్నట్టు తెలిశినది.

మయశిల్పం అనే శిల్పి శాస్త్రము వాస్తు శాస్త్రము యొక్క సంగతులు బాగా తెలిశిన వాండ్లు తెనాలి ఠాణా యిలాకా కూచిపూడి అనే గ్రామంలో మాగులూరు సుబ్బాదత్తుడు అనే కంసాలిన్నీ చేబ్రోలు ఠాణా యిలాకా అమరావతి ఆ ప్రాంత్యముల రామయోగి అనే కంసాలిన్నీ వున్నట్టు తెలిశినది. యీ యిద్దరున్నూ యోగ శాస్త్రముల సంగతి యేమి, సదరు శాస్త్రముల సంగతి యేమి తెలిశిన వాండ్లు గన్కు వాండ్ల వద్దను ఆ గ్రంథములు వుండవచ్చును. మరిన్నీ పోతవిగ్రహాలు పోసే వాండ్లున్నూ గన్కు భిన్నమైన విగ్రహాలున్నూ వాండ్లపరంగానే వుండవచ్చును గన్కు నాకు తెలిశిన సంగతి విశదపర్చుకున్నాను. దివ్య చిత్తానకు తేవలెను. ది ౧౨ (12 జనేవరి ౧౮౩౩ (1833) సం॥ మకాం కొండవీడు.

''పోలేపెద్ది మల్లయ దారోగా
డి॥ కొండవీడు''

(M418-పు.471 నుండి 474)

జీవితంలో ఎంత వైవిధ్యముందో దొరగారి గ్రంథ సేకరణలో, జ్ఞానసముపార్జనలో అంత వైవిధ్యముంది. ఆకరాలు సేకరించి అధ్యయనం చేయగలవారు దేని గురించైనా ప్రామాణిక రచనలు చేయగలరు.

ఎక్కడెక్కడ ఏయే పుస్తకాలు ఏవిధంగా దొరుకుతాయో దొరగారికి తెలుసు. వివిధ ప్రదేశాల నుంచి వారికి వర్తమానాలు వస్తుంటాయి. పిఠాపురం కాపురస్తులైన అవసరాల వెంకట్రాయుడుగారి పుస్తకాలు ఆ గ్రామం అమీను కచ్చేరీలో జప్తు అయి ఉన్నాయని తెలుసుకొని దొరగారు తమ ఆజ్ఞధారకుడైన బాయణి కృష్ణయ్యా పేర హుకుం రాయించారు. దాని ప్రకారం జప్తులో ఏయే గ్రంథాలున్నాయో చూసి ''సుత ప్రకాశికా ప్రథమ సూత్రమనే గ్రంథం మొదలుకొని స్వర్గారోహణ పర్వం పరియంతం నెంబర్లు 98 గల

గ్రంథముల జాబితా'' పంపిస్తూ ఉదహరించి ఉన్న అన్ని గ్రంథములూ కావలసినవో లేక కొన్ని కావలసినవో చిత్తవృత్తి శలవు దయచేయమని కృష్ణయ్య లేఖ రాసుకొన్నాడు (M 401 పుట 335). వేలంలో ఈ పుస్తకాలను దొరగారు తన మనుషుల చేత కొనిపించి తెప్పించుకొన్నారు. మొత్తం 790 రూపాయలు చెల్లించారు. ఈ గ్రంథరాశిలోని ఉద్గ్రంథాలలో సంస్కృతంలోని ప్రథాన కావ్యాలూ, కొన్ని తెలుగు పుస్తకాలూ ఉన్నాయి.

వివిధ జిల్లాలలోని కచ్చేరీలలో వున్న నేటివు వుద్యోగులకు తాఖీదులు పంపిస్తూ తమకు కావలసిన పుస్తకాల వైనం దొరగారు చెప్పేవారు. 1834 మార్చి నెలలో గజవెల్లి కొండయ్య రాసిన ఒక లేఖలోని భాగం ఆసక్తికరంగా ఉంది.

''భారతం 18 పర్వాలున్ను, రంగనాథ రామాయణం, భాస్కర రామాయణం, దశావతార చరిత్ర, సత్యాభామా సాంత్వనం, భళ్లాణ చరిత్ర, బహులాశ్వచరిత్రను గురించిన్ని ఆ పుస్తకములు ఉన్నవారు ఖరీదుకు ఇచ్చినా సరే లేక బహుమతి కావలసి వుంటే ఆ వైనం తెలియచేసుకొంటే ఆ చొప్పున చేయిస్తున్నామని వ్రాయించి నావద్దకు పంపించిన ప్రకటన కాగితం నా కచ్చేరిలో కట్టించడమే కాకుండా యెవరెవరితోటి పైగా నేనున్ను తెలియచేస్తూ వుండడమైనది. ఆ వైనం వెనుక నుంచి వ్రాసుకొంటున్నాను....''

(M401. p. 341-43)

ఖరీదుకు లభించక, ఎరువుగా ఎవ్వరైనా ఇచ్చిన గ్రంథాలతో పని తీరిపోయిన వెంటనే వాటిని సొంతదారులకు వాపసు చేయించడంలో బ్రౌను దొరగారు చాలా ఖచ్చితంగా ఉండేవారు. 1834 సెప్టెంబరు 28వ తేదీనాడు తాడికడప వీరేశలింగం వ్రాసుకొన్న అర్జీ ఈ సంగతిని విశదం చేస్తుంది.

''తమ సముఖము లోవయనం నేను పంపించుకొన్న భారత గ్రంథముల తాలూకు విమర్శ తేలిపోయినటువంటి గ్రంథములు.

1. సంపుటం
   భీష్మపర్వం
   ద్రోణ పర్వం
   కర్ణపర్వం
2. సంపుటం 1కి
   విరాటు పర్వం
   ఉద్యోగ పర్వం

వెరసి అయిదు పర్వములున్ను ఈ నెల 18 తారీఖున అనుగ్రహపూర్వకమయిన తమరు దయచేయించిన ఆజ్ఞప్రకారం నిన్నటిరోజు రాత్రి 2 గంటలకు సదరహీగ్రంథములు అందినందున ఈరోజున రాపాక సుబ్బయ్యను పిలిపించి ఆయన గ్రంథములు ఆయనకు తిరిగి యిప్పించడం అయినది గనుక యీసంగతి తమ చిత్తానకు విశదం కాగలందులకు విన్నపం వ్రాసుకొన్నాను...''

(M.417-p.448-9)

బ్రౌను దొరగారు తమ చిత్తానకు విశదం కాగల విన్నపాలు తెలుసుకొని, ముందు వచ్చిన కోపాన్ని మరచిపోయి నౌకర్లను మెచ్చుకొనే సందర్భాలు చాలా ఉన్నాయి. ఆయన ఒక వూరి నుంచి ఇంకొక వూరికి బదిలీ అయినప్పుడు తమ కొత్త హోదాలోనికి ప్రవేశించాక పాతవూరి నుంచి తమ పుస్తకాలను తెప్పించుకొనేవారు. బందరు పాతరామన్నపేటలో నిలచిపోయిన దొరగారి బొట్లెరు సూదాబత్తుల ఆదినారాయణ 1834 జూలైలో దొరగారి పొస్తుకాలు బండ్లమీద పంపించాడు. ''ఆ బుక్కుల బండ్లు బందరు యేటికాడ అటకాయించిన వాన్ని రెండో మూడో రోజులు ఆ యేరుతీసి పొయ్యేదాకా వుండవలసి వస్తుందని'' తెలుసుకొన్నాక ''త్వరపడక అయ్యేట్లో నీట యెల్లిపోయేదాకా అక్కడ రెండుమూడురోజులు వుండి మరీ బళ్లు తీసుకొని వెళ్ళవలసినదని'' ఆదినారాయణ వర్తమానం పంపాడు. పుస్తకాలు రావడం ఆలస్యమైనందున బ్రౌను దొరగారు కోప్పడ్డారు. బందరులో ఉన్న దొరగారికి లేఖ రాశారు.

సూదాబత్తుల ఆదినారాయణను పిలిపించి మేస్తరు వూష్టరు దొరగారు జాబువైనం చెప్పారు. ''బుక్కులు మనుష్యులమీద పంపించమంటే బళ్ళమీద పంపించినావని మీ దొరగారు బహుకోపం చేసినాడని'' చెప్పారు. ''పెట్టెలునిండా బరువు వున్నవన్ని వక వక పెట్టెకు ఎనిమిది మనుష్యులు కావలెనన్ని కూలి రు. 30లు పర్యంతం అవుతుందన్ని బళ్ళ మీద అయితే రు.18లకు వెళ్ళినవనిన్ని'' సూదాబత్తుల ఆదినారాయణ మనవి చేసుకొన్నాడు (M417; p.499-500) వర్షాకాలం కనుక బళ్ళు ఆలస్యంగా వస్తాయని బ్రౌనుదొరగారు తర్వాత తెలుసుకొన్నారు. వర్షాల వల్ల పుస్తకాలకు వచ్చే ప్రమాదం ఆయనకు అవగతమే.

ఒకసారి చల్లా సుబ్బన్న అనే ముఖ్య ఆశ్రితుడు బ్రౌను దొరగారి సన్నిధిలో చెన్నపట్నం నుండి సెలవు తీసుకొని, తనపరంగా దయచేసిన పుస్తకాలు పట్టుకొని కడపకు బయల్దేరాడు. తన కష్టాలు ఇలా చెప్పుకొన్నాడు.

''... శలవు తీసుకొన్న పిమ్మట రెండు మూడురోజులు వరుష ఆటంకము చాత పట్నంలోనే వుంటిని. పిమ్మట మార్గమధ్యమందున యేతన్నిమిత్తం చాతనే నాలుగు మూడు రోజులు ఆటంకమైనది. తరువాత కూడా మార్గంలో జలకర్దమం విస్తారంగా వుండడంవల్ల ప్రయాణము జరగక నున్ను కంచి, తిరుమల మొదలయిన యాత్రలు నాకు అపూర్వం అయినందునా అవి మార్గంలోనే వున్నందునా అవి సేవించవలెనని నాకు వుంటే కోరికను నెరవేర్చుకోవలసినది ముఖ్య ధర్మం అయినందు చాత యే తద్విషయమై కొన్ని రోజులు అయినది. యీ హేతువల చాతనున్ను తమరు నాపరంగా దయచేసిన పుస్తకములు యంత భద్రముగా నేను తెచ్చినప్పటికి సవ్వారి అడుగు నుంచి నీరుమట్టుకొని వచ్చి కొంచెం తడసినందున అవి ఆరవేయడం మొదలయిన ఆటంకములు కలిగినది గనుకనున్ను యీ నెల 25 తారీఖు మట్టుకు ఇక్కడ ప్రవేశించినందుకు అంతరాయమయినది. 26 తారీఖుననే యిక్కడ ప్రవేశించి తక్షణం పుస్తకములు గరిమెళ్ళ వెంకయ్యగారి పరంగా ఇచ్చినాను. ఆయన తమ స్వారవిజ్ఞాపన పత్రికె వ్రాసుకొని నాపరంగా ఇచ్చినారు. అది యిందులో మల్ఫూపు చేసుకొన్నాను గనుక దాఖలు చిత్తగించవలెను. అనివార్యమైన అవశాత్తు

వర్షాపద్రవం చాత సంభవించిన దోషమనగా పుస్తకములు కించిత్తు తడవడమనే తప్పితముకు కరుణ సంకళిత హృదయులయి క్షమించవలెనని ప్రార్థిస్తాను.''

దొరగారు క్షమించారో లేదో తెలియదు. ఈ లేఖను చల్లా సుబ్బన్న 1838 నవంబరు 26వ తేదీనాడు రాశాడు (M419. పుటలు 481–83). చిన్న తప్పులయితే క్షమించే స్వభావం వున్నా తన వద్ద పనిచేసే వ్రాయసకాండ్రకు బుద్ధిరావడానికి వాళ్ళు ఎక్కించే పాఠాలలో ఏమాత్రం భిన్నత ఉన్నా, దానిని గుర్తించకపోతే దొరగారు అర్ధరూపాయి లేక పావలా జుల్మానా విధించేవారు. ఈ లేఖకులకు మంచి జీతాలే ఇచ్చేవారు. రోజుకు నలభై పద్యాలను రాసేవాళ్ళకు నెలకు ఆరు రూపాయలు ముట్టేది. తమ కాలేజీ కచ్చేరి సిబ్బందిలో అశ్రద్ధ, అజాగ్రత్త ఏర్పడకుండా చూసుకొనేవారు.

ఒకసారి 'యం. వీరప్ప' అనే వ్యక్తి ''యేలిన వారి దయకు అపాత్రుడయ్యాడు. ఈ నాలుగు మాసాల నుంచి తాము నన్ను తోటలోగా రావద్దని ఆజ్ఞ దయచేసినప్పటికిన్ని నేటివరకున్ను తమ యొక్క సింహద్వారమును దర్శనం చేసుకొంటూ...'' మని వర్జాలు రాసేవాడు. పద్యాలలో కూడా వేడుకొనేవాడు.

చంద్రుడెవ్వరికిని చల్లనైయుండును
పద్మముల్ జేసిన పాపమేమి
యిలవసంతుడును వనమెల్లబ్రోవక
జాజి జేసిన యదృష్టంబుగాక
సంపెంగ వాసనల్ చర్చింప శక్యమా
యిలతేట్లకును ప్రాప్తిలేదుగాని
హరుడు ప్రసూనంబునైన చేపట్టడా
గేదంగికిని ప్రాప్తిలేదుగాని
నాకు భాగ్యము లేదు గాబోలు సుమ్మ
యెవ్వరికిని నీవు యిచ్చి యిచ్చి యిచ్చి రక్షించలేదో
కల్పముల మేటి కందర్పహరునసాటి
పరగనమ్మితి బ్రౌను భూపాల తిలక. (M430. -118)

ఈ వీరప్ప యే తప్పు చేసినా క్షమించవచ్చుగాని యతిప్రాసలు లేని ఈ జబ్బు పద్యం దొరగారి ఆమోదం పొందిందని చెప్పలేం. పద్యాలలో కాక వచనంలో తమ తప్పులను ఒప్పుకుంటూ సిబ్బందిలోనివారు దొరగారికి రాసిన ఉత్తరాలు కూడా కొన్ని వున్నాయి. ఈ క్రింది జాబును చూడండి.

''తమ యొక్క రైటరు డిక్షనేరి రామయ్య అనేక సలాములు చేసి వ్రాసుకొన్న విజ్ఞాపన యేమంటే, నేను చేసిన తప్పు మన్నించవలసినది. క్షమించవలెను. రక్షించి కాపాడవలెను. దవడలు వేసుకొన్నాను. చంపలు వేసుకొన్నాను. బుద్ధి వచ్చినది, శరణు

శరణు అని తమ్మున చొచ్చినవారిని కాపాడే ప్రభువులు రక్షించే ప్రభువులు. నాలుగు దినములు నాకు కడుపులో బడబాలనమనే దావాగ్ని జొరబడి బహుశ్రమ పెట్టుచున్నది. పడ్డ పడక లేవలేదు. ప్రాణాలున్ను పోలేదు. నిద్రాహారాదులు లేవు. జీవచ్ఛవమై పడివున్నాను. అనేక బాధలున్ను కలిగి ఉన్నది. నాకు అర్థబలము లేదు. మనుషుల బలము లేదు. శిఫార్సుల బలము లేదు. బొందిలో నుంచి ప్రాణములు పోలేక తపిస్తున్నది. నాస్థితి యిట్టిదని చెప్పేవారు లేకపోయిరి. నేను మనవి చేసుకొన్నందుకు నాకు సంభవించిన ఆసత్తు వల్ల నాకు బహు బాగా బుద్ధి వచ్చినది. నాబుద్ధికి శాస్తి అయినది. నేను బహు దరిద్రుణ్ణి. నా శ్రమంతా పారద్రోలి నన్ను తమ సన్నిధానానికి రప్పించి నాపనిని నాకు యిప్పించి రక్షించవలెనని ప్రార్థిస్తున్నాను. 1852 మే నెల ఆరవ తేదీ.'' (M-431.p. 6)

బ్రౌను దొరగారు ఎందరెందరిని ఏయే సందర్భాలలో తమ సన్నిధానంలో గాని, కాలేజీ కచ్చేరీలలో గాని నిలిపి పోషించారో వారు వదలిపెట్టి వెళ్ళిన సంపుటాలనిండా సాక్ష్యాలు ఉన్నాయి. వ్రాతప్రతులు పుట్టించడానికి, తీర్పు ప్రతులు సిద్ధపరచడానికి, పదసూచికలు వ్రాయడానికి తమ కొలువులో ఎప్పుడూ పదినుంచి ఇరవైదాకా బ్రాహ్మణులూ, శూద్రులూ ఉండేవారని బ్రౌను దొరగారు తమ నిఘంటువుల్లో విశదం చేశారు. క్రీ.శ. 1827 నుంచి వారిదగ్గర ప్రతి లేఖకులుగా, మొకాబిలా చేసేవారుగా ఈ క్రిందివారు పనిచేశారు.

1. అంకాళు
2. అచ్చి, సిద్ధవటం
3. అప్పన్న శాస్త్రులు
4. అప్పయ్య, అవధాన్ల
5. అప్పయ్య, చిల్లర
6. అప్పయ్య, నందిరాజు
7. అప్పయ్య, బోయినపల్లి
8. అమ్మన్న, పువ్వాడ
9. కనకయ్య, మన్నెం
10. కామాక్షయ్య, పువ్వాడ
11. కిచ్చయ్య
12. కృష్ణయ్య, గుండవరపు
13. కొండయ్య, తూములూరి
14. కొండలయ్య (కొండలరాయుడు?)
15. కొండలరాయుడు (కొండలయ్య?)
16. కోనప్ప, చెంచయ్య అల్లుడు
17. గరుడప్ప (య్య?), రాయసం
18. గరుడయ్య(ప్ప?), రాయసం
19. చిదంబరం, దిగివోలు
20. చెంచయ్య, బోయినపల్లి
21. చెన్నప్ప, కొర్రపాటి
22. తిరుమల రాయడు
23. నరసింహాచార్యులు, కొండూరి
24. నరసింహాచార్యులు, చిలకమర్రి
25. నరసింహాచార్యులు, మద్దూరి
26. నరసింహాచార్యులు, విన్నకోట
27. నరసింహాచార్యులు, సముద్రాల
28. నారాయణ, దంపూరి
29. బసవయ్య, రాయసం
30. బ్రహ్మ, నొగనోటు
31. బ్రహ్మయ్య
32. రామయ్య, చిడ్డు
33. రామస్వామి, వారణాశి
34. రామాచార్యులు, చట్టు
35. లక్ష్మీనారాయణ, జూలూరు
36. వీరవెంకయ్య

37. వెంకటకృష్ణమ్మ(య్యా?), చాగంటి
38. వెంకటాచలం (వెంకటాచలం, సరాపు?)
39. వెంకటాచలం, సరాపు (వెంకటాచలం?)
40. వెంకటాచార్యులు, నండూరి
41. వెంకట్రామయ్య
42. వెంకయ్య, గరిమెళ్ళ
43. శేషయ్య, మైలవరపు
44. శ్రీనివాసు, దేవరాజు
45. సుబ్బన్న
46. సుబ్బారాయడు, అయినాల
47. సుబ్బారావు, కె
48. సోమరాజు, రామవరపు
49. హరిప్రసాదు

ఇంతమంది రాయసాలూ, మొకాబిలాదారులు తయారుచేసిన ప్రతులను పండితులు పరిష్కరించి తీర్పు ప్రతులు సిద్ధం చేసేవారు. బ్రౌను దొరగారి కాలేజీ కచ్చేరిలో వివిధ కాలాలలో ఈ క్రింది పండితులు వుండేవారు. వీరు వివిధ విధులు నిర్వర్తించేవారు.

1. అద్వైత బ్రహ్మయ్య
2. అనంతాచార్యులు, సముద్రాల
3. అప్పయ్య, జూలూరి
4. కృష్ణమాచార్యులు, ముడుంబి
5. గురురాజు, నందివాడ
6. చంద్రయ్య, పట
7. చిన్నయ్య, పరవస్తు
8. చెంచయ్య, బోయినపల్లి
9. తాతాచార్యులు, తిరుపతి
10. నరసింహాచార్యులు, కంభం
11. నరసింహాచార్యులు, చిలకమర్రి
12. నరసింహాచార్యులు, సముద్రాల
13. బుచ్చయ్య శాస్త్రి, ములుపాక
14. వీరభద్రయ్య, ఆరణిమఠం
15. వీరాస్వామి, వారణాసి
16. వెంకటకృష్ణమాచార్యులు, వంగీపురం
17. వెంకటనరసయ్య, పైడిపాటి
18. వెంకటసుబ్బ శాస్త్రి, దంపూరి
19. వెంకయ్య, గరిమెళ్ళ
20. వెంకయ్య, మామిడి
21. సింగటయ్య, తెన్నెల
22. సుబ్బన్న, నందివాడ
23. సుబ్బన్న, బొడ్డపాటి

ఇంతమంది విద్యావంతులు ఒక చెయ్యి వెయ్యబట్టే బ్రౌను దొరగారి ప్రణాళికారథం కదిలింది.

ఈ విద్వాంసుల తోడ్పాటుతోనే ఆయన ఆంధ్రసాహిత్య సౌధాన్ని రూపొందించగలిగాడు. దీని నిర్మాణంలో చలువరాళ్ళెత్తిన సాహిత్య కూలీలందరూ చరితార్థులే.

ఎవరెవరు ఏయే కావ్యాలను పరిష్కరించారో, టీకలు చెప్పారో, వ్యాఖ్యానాలు చేశారో చూడండి.

ఈ పండితులలో కొందరు కడపలోని 'కాలేజీ కచ్చేరి' క్షేత్రంలో ఉంటూ సాహిత్య వ్యవసాయం చేశారు.

బ్రౌను పండితులు

అప్పయ్య, జూలూరి :

1. ఆముక్తమాల్యద (సవ్యాఖ్యానం) పరిష్కరించారు, (D.405)
2. కవికర్ణ రసాయనం టీక వ్రాశారు.(D-453-4)
3. జైమినీ భారతం - పంచడుబ్బులు ఏమిటో చెప్పారు. (D-14)
4. నరసింహాచారిగారి చకోరీయ వ్యాఖ్యానం కుదించారు. (D-819), 1830
5. పద్మపురాణంపై తీర్పు (D-18)
6. భాస్కర శతకం (D-1637)
7. మనుచరిత్ర టీకా తాత్పర్యాలు (D-641) 1831
8. మాతృశతకం (D-1653)
9. వసుచరిత్ర (D-759), 1834. దస్తూరి మూలంకి వారిది, వ్యాఖ్యానం అప్పయ్యగారిది.
10. విజయవిలాసం, సవ్యాఖ్యానం (1831-బందరు)
11. శశాంక విజయం (D-818)
12. శుక సప్తతి - పరిష్కరణ (D-837)
13. శ్వేత కుభృన్నృకేసరి శతకం తీర్పు (D-1786)
14. సురాభాండేశ్వరీయము (D-897)

నరసింహాచార్యులు, చిలకమర్రి :

1. కాశీఖండం పరిష్కరణ (D-330)
2. రాఘవపాండవీయం వ్యాఖ్యానం స్వహస్తలిఖితం (D-686)
3. విక్రమార్క చరిత్ర
4. హంసవింశతి
5. హరిశ్చంద్రోపాఖ్యానం

బుచ్చయ్య, ములుపాక :

1. దశావతార చరిత్ర (D-520)
2. పంచతంత్రం -(D-2688)
3. భాగవతము (D-103)
4. భారతం (D-166)
5. వసుచరిత్ర టీక ప్రతిపదార్థ ప్రకాశిక (D-760-1)
6. విష్ణుపురాణం (D-312)
7. శశాంక విజయం (D-818)
8. సురాభాండేశ్వరీయం (D-909)
9. హంసవింశతి (D-912)

వీరభద్రయ్య, ఆరణిమతం :

1. పండితారాధ్య చరిత్ర
2. ప్రభులింగలీల
3. వైజయంతీ విలాసం టీక (D-802)

వెంకట నరసయ్య, పైడిపాటి (1834)

1. అనిరుద్ధ చరిత్ర వ్యాఖ్యానం (D-379)
2. గౌరన హరిశ్చంద్ర ద్విపద పరిష్కరణ (D-1211)
3. రాధామాధవ సంవాదం - పరిష్కరణ (D-706) 1829
4. విక్రమార్క చరిత్రము
5. వేమన పద్యములు
6. వైజయంతీ విలాసం, వ్యాఖ్యానం (D-799), 1833

వెంకట సుబ్బయ్య శాస్త్రి :

1. శంకరుని హరిశ్చంద్రోపాఖ్యానం పరిష్కరణ (D-930)

వెంకయ్య, గరిమెళ్ళ :

1. కవిరాజ మనోరంజనం
2. దశావతార చరిత్ర - టీకా తాత్పర్యాలు (D-528), 1834
3. మహాభారతం - పరిష్కరణ (D-211)
4. సత్యభామా సాంత్వనం

అయోధ్యాపురం కృష్ణారెడ్డి తొలినుంచీ, బహుశా దొరగారు బంగళా కొన్నప్పట్నుంచీ 'కాలేజీ కచ్చేరి' వగయిరాలపైనున్ను, బంగళా వగైరా పనులున్ను చక్కగా ఖబరుదారి చేశి జర్గిస్తూ వుండేవాడు. 1828లో ఈ పనులు ప్రారంభించాడు. ఎప్పటికప్పుడు దొరగారు ఏ వూళ్ళో వుంటే ఆ వూరికి లేఖల ద్వారా వర్తమానాలన్నీ నివేదించేవాడు. ఒక ఉత్తరంలో ఇలా రాశాడు.[6]

''కాలేజీ కచ్చేరి బ్రాహ్మణులు నవంబరు నెల తాగాయతి వారు కచ్చేరికి రావడమున్ను వారు చేశ్ని తీర్పులున్నూ విచారించినంతల్లో శానా అశ్రద్ధగా జర్గించి వున్నారు. ఇందు నిమిత్తము అయి - నవంబరు నెల తాగాయతి హరహరదినమువారు వచ్చే ఘంటలున్నూ వారు చేశ్ని పనిన్ని యావత్తున్నూ విచారిస్తూ వున్నాను. యిందు మీదట యీ అయిదు నెలల్లో వారు హాజరువుండి నవుకరీ చేశ్ని దినాలు యెన్ని అయినదిన్ని గైరుహాజరు అయిన దినాలున్ను లెఖ్ఖచేసి హాజరు అయిన దినాలకున్నూ చేశ్ని పనికిన్ని వారికి యుక్తం ప్రకారంగా కొంచెము అయివేజు యిప్పించి ఆ తకరారు సంగతి యావత్తున్నూ పాదాల సముఖానకు విజ్ఞాపన చేస్తూ వున్నాను. హెగ్గు దొరవారు యిప్పించిన అయివేజు యెవరెవరికి యేమి యిప్పించినదిన్ని ఆ వైనం యావత్తున్నూ వారి చాత రశీదులు తీసుకొని విజ్ఞాపన చేస్తూ వున్నాను.''

కాలేజీ కచ్చేరిలో వుండే పండితులకు సరిగ్గా జీతాలు ముట్టేవి కావు. అయితే ఋణాలు పుట్టేవి. వాటితో జీవించేవారు. కొన్ని నెలలపాటు జీతాలు రాకపోతే అప్పుడు అర్జీ పెట్టుకొనేవారు. అవికూడా కలిసిపెట్టుకొనేవారు. ఒక లేఖ చూడండి.[7]

6. బంగోరె సంశోధన - 'బ్రౌన్ జాబుల్లో స్థానిక చరిత్ర శకలాలు - కడప సంకలనం' - శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, 1977 - పుట 25.
7. ఆర్. పద్మావతి - పుట 307.

''మహారాజశ్రీ సి.పి. బ్రౌను ఇస్కోయరు దొరగారి సముఖానకు

తమ కాలేజి నౌకర్లు వ్రాసుకొన్న అర్జీ విన్నపం. మాకు జనేవరు నెల తాలూకు, ఫిబ్రేవరి నెల తాలూకున్ను జీతములు యింతవరకు ముట్టకుండా వున్నవి. మార్చినెల కూడా జరుగుతూ వున్నది... మా మనవి ముఖ్యముగా చిత్తగించి సదరహి రెండు నెలల జీతమున్ను దయచేయించవలెనని మిక్కిలి వినయపూర్వకముగా వేడుకొంటున్నాము. దివ్యచిత్తానకు తేవలెను.

ఆన 1834 సంవత్సరం ది.28 మార్చి
కంభం నరసింహాచార్యులు చేవ్రాలు
జూలూరి అప్పయ్య చేవ్రాలు
వెంకటనర్సు వ్రాలు
సముద్రాల నరసింహాచార్యులవ్రాలు
వారణాశి రామస్వామివ్రాలు (M-401.p.321)

పై జాబులో పైడిపాటి వెంకటనరసయ్య, వంగీపురం నరసింహాచార్యుల చేవ్రాళ్ళు లేవు. కారణం వారు కడప కాలేజీ కచ్చేరిలోకాక, కంభం కాలేజీ కచ్చేరిలో 1829 నుంచి 1834 దాకా వున్నట్టు దాఖలాలు వున్నాయి. దొరగారి సన్నిధానంలో వుండబట్టి కొందరికి కంభంలో, రాజమండ్రిలో, బందరు మొదలైన చోట్ల జీతాలు ముట్టేవి కాబోలు. ఏమైనా 1834 బ్రౌను దొరగారి జీవితంలో చాలా గడ్డుకాలం. ఉద్యోగానికే గండం తెచ్చిన సంవత్సరం.

నందన నామ సంవత్సరం (1832-33)లో చాలా దుర్భరమైన కరువు వచ్చింది. ప్రజలు కటకట లాడిపోతున్నారు. కరువు పరిస్థితులవల్ల లూటీలు, దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయి. పశుగ్రాసం లేదు. వానలు ఎడపెట్టాయి. ఏర్లు ఎండిపోయాయి. అంటువ్యాధులు పెచ్చరిల్లాయి. కటకటలాడించిన ఈ కరువు కాలంలో దొరగారు గుంటూరు జిల్లాలో కలెక్టరుగా ఉండి కళ్ళారా ప్రజల కష్టాలు చూశారు. కరువును 'కరువు' అనడం అధికారులకు నచ్చదు. అది ఏ ప్రభుత్వమైనా సరే అనావృష్టి, ప్రకృతి వైపరీత్యం, లేవిడి మొదలైన పదజాలాన్ని వాడాలేగాని కాటకాన్ని కాటకం అనరు. బ్రౌను దొరగారు కలెక్టరుగా ఆ దుర్భిక్షాన్ని 'గుంటూరు కరువు'గా అధికార పత్రాలలో పేర్కొన్నారు. మదరాసులోని పై అధికారులకు కోపం వచ్చింది. పేరుకు 'గుంటూరు కరువు'గాని, కడప, నెల్లూరు, చిత్తూరు మొదలైన అన్ని జిల్లాలకు పట్టిన దుస్థితే.

తమకూ, తమ పండితులకూ వచ్చిన ఆర్థిక కష్టాల కారణాలు తెలుసుకొనడానికి దొరగారి జీవితంలో ఈ కాలానికి సంబంధించిన కొన్ని ఘట్టాలు, ఘటనలు తెలుసుకొనడం అవసరం.

1832 - దొరగారి ముప్పయి మూడో యేట మచిలీపట్నం జిల్లా జాయింట్ క్రిమినల్ జడ్జిగా పనిచేస్తూ వుండేవారు. తమముందు విచారణకు వచ్చిన కొన్ని కేసులలో అబద్ధపు సాక్ష్యాలూ, దొంగ సంతకాల పత్రాలు

మొదలైనవి కోకొల్లలుగా వున్నాయి. ఒక కేసులో వాది, ప్రతివాదులు మొదట ఒకరకంగానూ తర్వాత యింకో రకంగానూ చెప్పుకొన్నారు. దొరగారు 'దొంగసాక్ష్యం' నేరానికి మొదట ఒకరకంగా తీర్పుచెప్పి రెండోసారి దాన్ని రద్దుచేసి కఠిన శిక్షలు వేశారు. ఆగస్టు నెల 6వ తేదీనాడు ఆర్డరు వేశారు. దీనిమీద పై అధికారులకు నేటివులు అప్పీలు చేసుకొన్నారు. 1832 నవంబరులో దొరగారు కూడా రెగ్యులేషన్లు ఎలా వ్యాఖ్యానించాలో విశదం చేయాలని నార్తరన్ ప్రొవిన్షియల్ కోర్టువారికి ఉత్తరం రాశారు. - డిసెంబరులో దొరగారిని గుంటూరు జిల్లా ఆక్టింగ్ కలెక్టరుగా బదిలీ చేశారు. ప్రొవిన్షియల్ కోర్టులోని యిద్దరు జడ్జీలు బ్రౌను దొరగారు జారీ చేసిన ఆగస్టు ఆర్డరులో ఘోరమైన తప్పిదాన్ని చేశారని డిసెంబరు 18వ తేదీనాడు నిర్ణయించారు.

- డిసెంబరులో గుంటూరు జిల్లాలో విలయతాండవం చేస్తున్న కరువును 'కరువు' అని రిపోర్టులో పేర్కొని దొరగారు చెన్నపట్నంలోని అధికారులకు కోపం తెప్పించారు.

1833 - మార్చి నెల 19వ తేదీనాడు, అంటే గుంటూరులో పట్టుమని పన్నెండు వారాలు కలెక్టరుగా పనిచేసేసరికి అక్కడ నుంచి చిత్తూరు జిల్లాకు జడ్జిగా నియమించారు.

- చిత్తూరులో స్థిరపడకుండానే ఒక్క నెల్నాళ్ళలో వారిని రాజమండ్రి ఆగ్జిలరీ కోర్టుకు జడ్జిగా బదిలీ చేశారు.

- ఇది మచిలీపట్నం డివిజనుకు సంబంధించిన హోదా కనుక, బందరు తమకు సుపరిచితమైన ప్రదేశం కాబట్టి యిక్కడే ఒక తెలుగు ముద్రాక్షరశాలను స్థాపించాలని, పుస్తకాలు ప్రచురిద్దామని దొరగారు ప్రణాళికలు వేసుకొన్నారు. అన్ని ఏర్పాట్లూ ఎంతో ధనం వెచ్చించి చేశారు. టైపులు, మిగతా సరంజామా తెప్పించారు. తమ తోటి ఆంగ్లేయుని నమ్మి అతగాడు చేసిన మోసంవల్ల దొరగారు అన్నివిధాలా నష్టపోయారు. పెట్టిన పెట్టుబడికి మించుమలె వసుచరిత్రలో నాలుగు నమూనా పుటలు అచ్చుపడి చేతికి వచ్చాయి. లాభం గూబలలోనికి వచ్చింది.

1834 - ప్రొవిన్షియల్ జడ్జీలు బ్రౌను దొరగారు ఘోరమైన తీర్పు చెప్పారని నిర్ణయించాక కుంఫిణీవారు అందుకు శిక్షగా ఆయనను అక్టోబరు 25వ తేదీనాడు ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేశారు. పదిహేడు సంవత్సరాలు, ఒక్కరోజు కూడా జబ్బుపడి సెలవు పెట్టకుండా కుంఫిణీ కొలువులో పనిచేసిన సర్వీసు ఒక్క కాగితం ముక్కతో తుడిచిపెట్టుకుపోయింది. ఈ పదిహేడేళ్ళపాటు తాము ఏఏ రంగాలలో ఎటువంటి సేవలు చేశారో మనవి చేసుకొంటూ, మళ్ళా సర్వీసులో చేర్చుకోమని ప్రార్థిస్తూ బ్రౌను దొరగారు నవంబరు 4వ తేదీనాడు అర్జీ పెట్టుకొన్నారు. ఈ విన్నపాన్ని మన్నించవలసిన అవసరం లేదని నవంబరు 14వ తేదీనాడు చెన్నపట్నం కుంఫిణీవారు 'డిస్మిసల్ ఆర్డరు' ఖాయం చేశారు.

- నవంబరు 26వ తేదీనాడు బ్రౌను దొరగారు లండన్‌లోని డైరెక్టర్ల కోర్టువారికి విజ్ఞాపన ఒకటి లిఖించి చెన్నపట్నం అధికారులకు యిచ్చి సీమకు పంపమన్నారు. దీనిని రూల్సు ప్రకారం ఆ సర్కారు వారు 20 రోజులపాటు నోటీసు బోర్డులలో పెట్టి లోకానికి చాటారు.
- డిసెంబరు 2వ తేదీనాడు బ్రౌను దొరగారు స్వదేశ ప్రయాణం నిమిత్తం మూడేళ్ల 'ఫర్లో' సెలవు మంజూరు చేయించమని అర్జీ పెట్టారు.
- డిసెంబరు 17వ తేదీనాడు కోరంగి రేవులో సీమకు వెళ్ళే ఓడ ఎక్కారు. అది బందరులోనూ, చెన్నపట్నంలోనూ ఆగాక చెప్పవలసిన వారికి అన్నీ చెప్పి చివరకు చెన్నపట్నంలో తమ పదిహేడు సంవత్సరాల సర్వీసుకు 'గుడ్ బై' చెప్పి కదలసాగారు.

ఉత్తముడు, ఉన్నతాదర్శాలు గల వ్యక్తికి ఉద్యోగం ఊడి, ఇన్నాళ్ళు చేసిన కృషి నీళ్ళుకారిపోతూందని తెలుసుకొన్నవాళ్ళంతా చాలా బాధపడ్డారు. కోరంగి రేవులో వారివద్ద సెలవు తీసుకొన్నవాళ్ళలో ద్రాక్షారం జమీందారుగారు వారి వకీలు మొదలైనవారున్నారు. దేవరకొండ లక్ష్మీకాంతం అనే ఆ వకీలు యిలా ఒక లేఖలో రాశాడు.

'...... యీ దేశం నుంచి తమరు లండన్‌కు విజయం శాయగలందులకు కోరంగి రేవుకు వచ్చిన సీమ వాడమీద వేంచేసి యుండగా.... శెలవు పుచ్చుకొని వచ్చిన దారభ్య తమరు కార్య సఫలమును పొంది దౌలతు అభివృద్ధియై త్వరగా విజయం శాయగలందులకు దేవుని వేడుకొంటూనే వున్నాను.... యీ జిల్లాలో వుండే అన్యాయమనే చీకటి తమ అధికారమే అన్న సూర్యోదయమై మిక్కిలి న్యాయం కలిగి అబద్ధములు, అన్యాయములు హరించిపోయి, దుర్మార్గులైన ప్రజలు దేశాంతర వ్యవస్థులై పోయినారు. అటువంటి పనికి యీ జిల్లా ప్రజలయొక్క దురదృష్టం చాత తమరు శీమకు విజయం శాయడం తటస్థమైనందున దుర్మార్గులకు యేమి హర్షమై వున్నదో కాని యితరమైన ప్రజలకు తమరు యెప్పుడ విజయం చేతురని కోరుతూ తమ రాకడకే నిరీక్షించి యున్నారు. (M.-417.p.217-223)

బ్రౌను దొరగారు మచిలీపట్నంలో మొట్టమొదట వేమన పద్యాలు చదవడం ప్రారంభించిన నాటినుంచి వారితో కలసి మెలసి సాహిత్య కృషి చేసిన వఠ్యం అద్వైత బ్రహ్మయ్యగారు చాలా ఆవేదన చెందారు. ''ప్రస్తుతం తమ విషయమై జరిగిన కార్యమును గురించి తమ ఆశ్రితుల గ్రహచారము వల్లనే సంభవించినట్లుగా భావించి చాలా విచారమును పొందినాను'' అని ఒక లేఖలో మునుపే రాశారు.

(1834 నవంబరు 14వ తేదీ M-425.p. 442)

ఇన్నేళ్లుగా తాము సంపాదించిన గ్రంథాలను ఎవరెవరి దగ్గర జాగ్రత్త చేయాలో వారి దగ్గర వుంచారు. కడపలో తాము ధర్మబడిలో చదువుకొని, తరువాత తమ వద్దనే గుర్రాలమీదా, సామానుమీదా తైనాతీగా పనిచేసిన మండెల కొండల రాయుడికి ఏమి అప్పగించారో అతని లేఖలోని భాగంవల్ల తెలుస్తుంది.

''అంతట తమరు సీమ వెళ్ళేటప్పుడు వాడమీద నీలపల్లి నుంచి బందరుకు వచ్చినంతల్లో అంతకు తదనంతరం బందరులో వున్న సామాను యావత్తు ఊిషు దొరగారికి అప్పగించమని సెలవు యిచ్చినారు. అంతట తమరు బందరుకు వచ్చి తిరిగి శీమకు వెళ్ళేటప్పుడు పిన్నీషు (pinnace) మీద కొంత సామాను వేసుకొని వాడ దగ్గరకు వెళ్ళేటప్పుడు నాకు సెలవు యిచ్చినది యేమంటే యిది వర్కు బందరులో వున్న సామాను యావత్తు యెలాగున కనిపెట్టుకొని వున్నావో ఆలాగుననే నీలపల్లెలో లీనారసు (Linarce) దొరగారి తరపున సామాను నేను వచ్చినదనుక ఆ సామానును బహుజాగ్రత్తగా చూచుకొంటూ వుండవలసినదని లీనారసు దొరగారికి యేలినవారు వాడమీద ఉత్తరం వ్రాసి యిచ్చి నీలపల్లెలలో వున్న సామాను దగ్గరికి వెళ్ళమని సెలవు యిచ్చినారు. ఏలినవారి యొక్క ఆజ్ఞప్రకారం నేను నీలపల్లెకు వెళ్ళి లీనారసు దొరవారికి వుత్తరం యిచ్చినంతల్లో ఆ సామాను దగ్గర నన్నున్నూ, వర్రె వీరవెంకయ్యా నాయుణ్ని ఆ సామాను, గ్రంథములు యావత్తున్ను చిల్లర సామాను బహుజాగ్రత్తగా చూసుకొంటూ వున్నంతల్లో......'' (M-417 p. 228-230)

ఓడ చెన్నపట్నంలో ఆగాక బ్రౌను దొరగారు అక్కడ అందరి దగ్గరా సెలవు తీసుకొన్నారు. వారిని కోరంగిలో ఓడ ఎక్కించిన ద్రాక్షారం జమీందారు అంగర బ్రహ్మాజీ పంతులుగారు 1835 జనవరి 8వ తేదీనాడు ఒక దొరగారికి ఒక ఉత్తరం రాశారు. ఆ లేఖలో దొరగారి తరపున వారి శ్రేయోభిలాషులందరూ ప్రభుత్వం వారికి దాఖలు చేసిన అర్జీల సంగతి విశదమవుతుంది. లేఖను చూడండి.

''........ కోరంగి నుంచి బయలు వెళ్ళి ది.6 జనవరి ఆన 1835 సం॥ తారీఖున చన్నాపట్నం ప్రవేశించి నందున సమస్తమయిన దొరలున్ను తమర్ని సంతోషంగా వుండగలందులకు అనుకూలమైన మాటలు విశదపరుస్తూ వున్నారున్ను గౌనరు బహదరు వారున్ను తమ బంధువులవల్ల తమ సంగతి తెల్సి తిర్గి శీమకు వ్రాయించినారనిన్ని ఈ నెల ది.20 తారీఖున మీరు వ్రాయించిన వుత్తరం అందినందున నా సంతోషం వ్రాయడంకు ఆలస్యమైనది. సముద్రమందు వున్నవార్కి వాడ దొరికినట్టు సంతోషించినాను. తమయందు వున్న సుగుణ సంపతిన్ని, నిష్పక్షపాతమున్ను, ధర్మగుణమున్ను విద్యా నిధిత్వమున్ను మొదలయిన సుగుణములు కల్గిన మిమ్మున చూశి మాట్లాడిన సుగుణవంతులయిన దొరలు అందరు మిక్కిలి సంతోషించి తమరు అభివృద్ధి కాగలందులకు కోరుతూ వుంటారన్న నమ్మకం కలిగినందుకు దొరలు అంతా తమతో యుక్తంగా ముచ్చటించినారని వ్రాయించినందున సంతోషించినాను. గౌనరు బహదరు వారున్ను సమస్తమయిన ధర్మములు తెల్సివున్న వారె అయినందున అప్పట్లో ఆయన ప్రయాణపు తొందర చేత మీ విషయమయి జవాబు వ్యతిరిక్తంగా యిచ్చినప్పటికి యిప్పుడు మీ అభీష్టం చొప్పున త్వరగా సంభవింప చేస్తారనిన్ని తమ ప్రయోజకత్వపు శక్తివల్లనున్ను, ప్రజా పరిపాలన ధర్మంవల్లనున్ను తమ అభీష్టసిద్ధి అయి వస్తున్నారనన్ని నమ్మి త్వరగా తమ సంకల్పం అయి రాగలందులకు దేముణ్ని ప్రార్థిస్తున్నాను. కోరంగిలో తమవద్ద సెలవు

పుచ్చుకొని తమరిని వదలిన విచారం చాత యటూ తోచక ద్రాక్షారామంలోనే యింత పరియంతం వుండి యిప్పుడు గౌనరువారు బందరుకు వచ్చినారని తెల్సి రాజమహేంద్రవరం వచ్చినాను. డాక్టరుగారిని చూస్తే ఆయనకు బదిలీ అయినదని ఆయన వల్ల తెల్సి ఆయన్ని దూరస్థలముకు వెళ్లుతారని విచారమయినది. మేస్తరు న్యూ జడ్జిగారిని మేస్తరు కప్తావీణమలీ దొరగారిని చూడడమయినది. గవునరు వారు ది 16 జనవరు తారీఖ్ను బందరు వచ్చి మూడురోజులు వుండి ది 18 తారీఖున బెజవాడ వచ్చినారున్ను యేలూరు మార్గంగా యీ రాజమహేంద్రవరం వచ్చి తూర్పు వెళ్లుతారని తెలస్తున్నాది.

మేస్తరు క్రాలి దొరగారి గౌనరు వారి దర్శనం అయి నేను అర్జీ యిచ్చిన పిమ్మట జరిగిన సంగతులు వ్రాస్తున్నాను. తమ శక్తియుక్తులా నేర్పువల్లనూ ప్రముఖులయిన దొరలు వశ్యులయిన కార్యసానుకూలమయి తమరు శీఘ్రంగా రాగలందులకు నిత్యం దేముణ్ని ప్రార్థిస్తున్నాను. నాకు తోచిన సంగతులు వ్రాసుకోవడంవల్ల వుత్తరంకు కాగితం వఖప్పుడు విస్తరించును గనుక నటుపె యిడ్లుగా పంపించడాముకు రీజను వున్న పక్షముకు ఆ చొప్పున తమరు పంపిస్తూ వుండవలెనని కోరుతాను. తమరు సుఖంగా ఖులాసాగా వుంటూ తమ మనోభీష్టం చొప్పున త్వరగా రాగలంద్లుకున్ను దేముణ్ని ప్రార్థిస్తున్నాను. గవునరు బహాదరు వారిని రాజ మహేంద్రవరంలో కల్సుకొని భీముని పట్నం పరియంతం వెళ్ళి దేహస్వస్థత లేక నేను వచ్చి వున్నందున్న తమ వుత్తరం పంపించడమునున్ను దొరలను చూశి సంగతులు వ్రాయడముకున్ను విలంబం అయినంద్కు క్షమించవలెనని కోరుతాను. నాల్గురోజులలో యిక్కడ నాకు తెల్సిన సంగతులు వయినంగా వ్రాస్కుంటాను. తమ దీవెనలు వల్ల అంతా సురక్షితంగా వున్నారు. తమ సంతోషంతో త్వరగా తమ దర్శనం శాయగలంద్కు దేముణ్ని ప్రార్థిస్తున్నాను. చిత్తానకు తేవలెను.

ది 13 మార్చి ఆన 1835 సం॥''

(M.401-pp.119-21)

ఎవరెన్ని రకాలుగా దేవుణ్ణి ప్రార్థించారోగాని శ్రేయోభిలాషులు సంతోషించేటట్టు బ్రౌను దొరగారు లండన్ చేరుకొన్నారు.

మలిసారి సెలవు మీద ఇంగ్లండులో

ఎప్పుడో నూనూగు మీసాల నూత్నయౌవనం కూడా సరిగ్గా వచ్చీ రాని వయసులో బ్రౌను దొరగారు ఇంగ్లండులోని హెయిల్‌బరి కాలేజీలో చదువుకొని భారతదేశానికి వెళ్ళారు. 17 సంవత్సరాలపాటు స్వతంత్రంగా జీవించి, 'సర్వాధికారాలతో సాంమ్రాజ్యం' చేసి, ఉడుకుపాలు తగ్గక ఉగ్రకోపంతో వ్యవహరించి, ఉద్యోగం ఊడగొట్టుకొని స్వదేశానికి తిరిగి చేరుకోవలసి వచ్చింది. ఆదినుంచీ బ్రౌను దొరగారిది పుస్తకాలలో విస్తరించిన జ్ఞానమే తప్ప లౌక్యాలు చాలా తక్కువగానే తెలుసు. ముక్కుకు సూటిగా పోతే చిక్కుల్లో పడతామని మూడోసారి తల బొప్పికట్టాక లోకవ్యవహారం కొద్దికొద్దిగా తెలుస్తూవచ్చింది.

భారతదేశంలో తాము అధికార నిర్వహణలో చేసినవి తప్పిదాలే అని ఒప్పుకొంటూ డైరెక్టర్ల కోర్టువారికి అర్జీరాసి ఇవ్వక తప్పలేదు. స్వదేశంలో బంధుమిత్రులను కలుసుకొని చూడవలసిన ప్రదేశాలు చూసి లండన్‌లో కుంఫిణీ వారి ఉత్తరువుల కోసం కాచుకొని వున్నారు. మూడేళ్ళపాటు సీమలో ఉండవలసి వచ్చింది. నిరంతర సాహిత్య వ్యాసంగం చేసే దొరగారు చూడవలసిన ప్రదేశాలన్నీ చూశాక, లండన్‌లో స్తిమితంగా కూర్చొని తమ రచనా వ్యాసంగం ప్రారంభించారు. స్వదేశానికి వస్తున్నప్పుడు తమ పుస్తకాలనన్నింటినీ భారతదేశంలోనే విడిచిపెట్టలేదు. కొన్ని తమతో తెచ్చుకొన్నారు. వీటిలో 1825లో నోట్సు రాసుకొన్న వ్యాకరణ గ్రంథాలూ, భట్టీయం, బాలసరస్వతి అనువాదాలూ, 1829లోనే ప్రారంభించిన నిఘంటు సంపుటాలూ మొదలైనవి ఉన్నాయి.

1835 నవంబరు నెలలో డర్బీషైర్‌లో ఉన్న వాల్టన్‌హాల్ 27వ నెంబరు గృహంలో కూర్చొని 'ఎ గ్రామర్ ఆఫ్ ది తెలుగు లాంగ్వేజి' అనే పేరుతో ఇంగ్లీషులో ఆంధ్రవ్యాకరణం రచనకు ఉపక్రమించారు. ఇందులో ఛందస్సుకు సంబంధించిన ప్రకరణం చేర్చాలని తలచారు. లండన్‌లో విద్వన్మిత్రులు వచ్చి వెళుతూ ఉండేవారు. వీరిలో ప్రొఫెసర్ రోసెన్ (Rosen) అనే పండితుడు సంస్కృత ఛందస్సుల గురించి కుతూహలం ప్రదర్శించారు. ఆయన అభ్యర్థన పై దొరగారు గీర్వాణ ఛందస్సుల గురించి 'A Familiar Analysis of Sanskrit Prosody' అను ఒక పెద్ద వ్యాసం వ్రాసి ఏషియాటిక్ జర్నల్‌లో ప్రచురించారు. (1837 సంవత్సరపు సంపుటి. పుటలు 153-241) ఉత్తరోత్తరా ఇది ఒక చిన్న సైజు పుస్తకంగా వెలువడింది.

ఒక పక్క రచన చేస్తూనే బ్రిటిష్ మ్యూజియం, బోదిలియన్, ఇండియా ఆఫీసు మొదలైన ప్రదేశాలలోని గ్రంథాలయాలలో పరిశోధనా వ్యాసంగం చేస్తూ వచ్చారు. ఇండియా ఆఫీసు లైబ్రరీలో కుప్పగా పడున్న తెలుగు, కన్నడ గ్రంథాలు చూసి, వాటిని పరిశీలించి ఒక కేటలాగు తయారుచేశారు. ఇది ప్రొఫెసర్ విల్సన్ గారి కోరికపై చేశారు. ఈ పుస్తకాలు ఇక్కడ దిక్కు మొక్కు లేకుండా పడి ఉండడం కన్నా వీటిని భారతదేశానికి, ముఖ్యంగా చెన్నపట్టణానికి పంపమని సిఫార్సు చేశారు. అక్కడ ఉన్న దక్షిణ భారత గ్రంథాల సంఖ్య మొత్తం 2,106. వీటిలో చాలాభాగం డాక్టర్ లీడన్‌గారి సేకరణలే. ఈ కేటలాగును తయారుచేసి ఇచ్చినందుకు కుంఫిణీ డైరెక్టర్ల కోర్టువారు 1837 మార్చిలో దొరగారికి ధన్యవాదాలు తెలియచేశారు.

1836లో దొరగారు ఆక్స్‌ఫర్డ్‌లో ప్రొఫెసర్ విల్సన్‌గారి ఆతిథ్యం స్వీకరించారు. ఆయన తాంత్రిక విషయాలపైనా, శాక్తేయ విధానాలపైనా ఆసక్తి చూపించారు. భారత దేశంలో తాము సేకరించిన గ్రంథాలలో తంత్రంపై చాలా గ్రంథాలు ప్రామాణికమైనవి ఉన్నాయి. చదివిన విషయాలు జ్ఞాపకం తెచ్చుకొని ఒక వ్యాసం రాశారు. ఇది చిత్తు ప్రతిగానే మిగిలింది.

ఇంగ్లండులో నిలకడగా కూర్చొనగలగడం వలన దొరగారు తమ తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును ఒకరకంగా పూర్తి చేశారు. ఇది వ్రాతలో తొమ్మిది సంపుటాల ఉద్గ్రంథం.

ఈ రచన ఎలా సాగినదీ వివరిస్తూ ఎన్నో నోట్సు కొన్ని కొన్ని సంపుటాలలో పొందుపరిచారు. ఉత్తరోత్తరా వ్రాసుకొన్న తమ సాహిత్య జీవిత చరిత్రలో లేని భోగట్టాలు బోలెడన్ని యిందులో వున్నాయి. తమ నిఘంటువుకు ఏ పేరు పెట్టాలా అన్న మీమాంసలో పడ్డారు. రకరకాల సూచనలు రాసుకొన్నారు. చివరకు 'బ్రౌణీయం' అనే పేరును తామే నిర్దేశించుకొన్నారు (D.1391). దీనిని ఇవాళ మనం 'బ్రౌణ్యం' అని వ్యవహరిస్తున్నాం. సీమలో ఉన్నప్పుడే వారికి ఒకసారి వెనుతిరిగి చూసుకొని జమా ఖర్చులు తేల్చుకోవాలన్న ఊహ కలిగింది. భారతదేశంలో తాను సేకరించిన తాళపత్ర గ్రంథాలు, వాటిని కాగితం మీదకు ఎక్కించిన వైనాలు, ఆ ప్రతుల నుండి తీర్పు చేయించిన గ్రంథాలు, చెప్పించిన వ్యాఖ్యానాలు, చేయించిన టీకలు, వ్రాయసగాళ్ళకు ఇచ్చిన జీతాలు, పండితులకు ముట్టచెప్పిన వేతనాలు, కాగితాలు, కలాలు, బైండింగు ఖర్చులు అన్నీ కలుపుకొని ఏ మాత్రం ఖరీదు చేస్తాయని దొరగారు ఒక అంచనా వేసుకొన్నారు. 1836 నాటికి 30,000, అక్షరాలా ముప్ఫయివేల రూపాయలు వీటి మీద ఖర్చు పెట్టినట్టు ఉజ్జాయింపుగా తేలింది!! (D.1391). 1836 మే 20వ తేదీ నాటికి నిఘంటు సంపుటాలు సాపు చేయటం పూర్తయింది. ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులో Furlough అనే మాటకు 'శలవుమీద దేశమునకు పోయివుండే కాలము' 'completed the Telugu Dictionary during furlough in England' అనే వాక్యాన్ని ఉదాహరణగా ఇచ్చారు.

ప్రారంభించిన వ్యాకరణ గ్రంథం 1837లో పూర్తయింది. 'దానికి మొదట 'ది ఎంటైర్ గ్రామర్ ఆఫ్ తెలుగు' అని పేరు పెట్టారు. తర్వాత 'ది గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్' అన్నదే ఖాయం చేశారు. నిఘంటువు వ్యాకరణం రచిస్తూనే తీరిక సమయాలలో వినోదానికి షేక్స్పియర్ నాటకాలను వీక్షించేవారు. ఆ ప్రదర్శనలు వినోదానికి బదులు వివేచనను, విచారాన్ని కలిగించేవి. పేరుకు షేక్స్పియర్ నాటకమేగాని అందులో డ్రైడన్ చేసిన మార్పులు చాలా ఉన్నాయి. నాటక ప్రదర్శన చూశాక ఒళ్ళుమండి దొరగారు లేఖ రాశారు (రెండేళ్ళ తర్వాతగాని షేక్స్పియర్ నాటకాలలో ఇతరులు చేర్పులు, మార్పులు చొప్పించకూడదనే నిర్ణయానికి క్రమంగా నాటక ప్రయోక్తలు వచ్చారు).

భారతదేశంలో ఉన్నప్పుడు సీమలోని కుంఫిణీ డైరెక్టర్ల కోర్టువారికి పెట్టుకొన్న విజ్ఞాపనలో నేరగాళ్ళను శిక్షించడానికి బదులు, వాళ్ళ మీద తీర్పు చెప్పిన జడ్జీని శిక్షించడం ఏం బాగుండదంటూ ప్రశ్నిస్తూ వచ్చిన వైఖరిని దొరగారు సీమలో మార్చుకొన్నారు. ''నేను చేసినది సూత్రబద్ధమైన న్యాయవిచారణ కాదు. అయితే చేసిన తప్పిదాన్ని నా చిత్తశుద్ధి క్షాళన చేస్తుందనుకొన్నాను. ఇప్పుడు నా బాధలు నాకళ్ళు తెరిపించాయి.'' అన్న ధోరణికి మారారు. కుంఫిణీ డైరెక్టర్ల కూడా ''కొంచెం తొందరపాటు మనిషేగాని ఒళ్ళు దాచుకొనకుండా పనిచేసే పెద్దమనిషి. పదిహేడు సంవత్సరాలు మన కొలువు చేశాడు. ఈ మూడేళ్ళపాటు సాలీనా కేవలం 500 పౌన్ల జీతం మీద ఇతడు పడ్డ కష్టాలు చాలు. మళ్ళా సర్వీసులో చేర్చుకొందాం'' అని భావించారు. అయితే తమ నౌకరుకు బుద్ధిరావడానికి ఒక షరతు పెట్టారు. మళ్ళా భారతదేశానికి వెళ్ళాక ఒక్క ఏడాదిపాటు రెవెన్యూ, జూడిషియల్ శాఖలలో ఏవిధమైన పనులూ చేయకూడదనే ఆంక్షతో 'ఫైనల్ ఆర్డర్లు' వేసి పత్రాలు చేతికిచ్చారు.

పరమ సంతోషంతో బ్రౌను దొరగారు మళ్ళా ఇంకో పదిహేడు సంవత్సరాల పాటు సివిల్ సర్వీసులోనూ, తెలుగు సాహిత్య రంగంలోనూ కృషి చేయడానికి 1837 ఆగస్టు 30వ తేదీనాడు ఓడ ఎక్కారు. కొన్ని కారణాలచేత ఒక పక్షం రోజులు ఓడ కదలలేదు. చివరకు సెప్టెంబరులో సఫరు మొదలైంది.

మలివిడత కుంఫిణీ కొలువులో

1837 ఆగస్టు 30వ తేదీనాడు బయలుదేరవలసిన ''మేరీ ఆన్'' అనే ఓడ మరో రెండు వారాల తర్వాత మరమ్మత్తులు పూర్తి చేసుకొని భారతదేశానికి పయనించింది. 1838 జనవరి మొదటి వారంలోగాని ఈ నౌక చెన్నపట్నం చేరుకోలేదు. నాలుగు నెలలకు పైగా సాగిన ఈ ప్రయాణంలో బ్రౌన్ దొరగారికి తగిన స్నేహితులే లభించారు.

రాబర్ట్ కాల్డ్‌వెల్ (1814-91) అనే మిషనరీ పరిచయమయ్యాడు. ఈ ఇరవై నాలుగేళ్ళ యువకుడు తమిళ జిల్లాలలో మత ప్రచారం చేయడానికి వెళుతున్నాడు. బ్రౌను దొరగారు తెలుగు నేర్పుతామన్నారు. తనకు తమిళ భాష ప్రస్తుతం అవసరమని, కోరమాండల్ కోస్తాలో ఆ భాషలో పనిచేయాలని కాల్డ్‌వెల్ చెప్పారు. బహుశా ఈ తొలి పరిచయంలోనే ''కోరమాండల్'' అన్న ప్రయోగం తప్పని, అది నిజానికి కర్రిమండలమని బ్రౌను దొరగారు చెప్పారు. కాల్డ్‌వెల్ ఈ నాలుగు నెలలూ దొరగారి దగ్గర సంస్కృతంతోపాటు ఎన్నో నేర్చుకొన్నాడు. ఈ మిషనరీయే తర్వాత రైట్ రెవరెండ్ కాల్డ్‌వెల్‌గా ప్రసిద్ధుడై ''ద్రావిడ భాషల తులనాత్మక వ్యాకరణం'' అనే ప్రఖ్యాత గ్రంథాన్ని 1856లో రచించాడు (ఇందులో బ్రౌను దొరగారిని ఆరు సందర్భాలలో పేర్కొన్నాడు).

నాలుగు నెలలపాటు కలిసి మెలిసి ప్రయాణం చేయడంతో కాల్డ్‌వెల్ బ్రౌను దొరగారిని బాగా పరీక్షగా అర్థం చేసుకొన్నాడు. ''ఈయనిది పిచ్చి పాండిత్యం. ఇతడు విడ్డూరమైన వికార స్వభావుడు. ఒక్క క్షణం నిలకడగా, నిశ్చింతగా ఉండలేడు. ఈయన చాలా విజ్ఞానవంతుడేగాని, వీరి అభిప్రాయాలను పూర్తిగా అంగీకరించలేము. పరమ విసుగెత్తించేస్తాడు. వీరికున్న ధారణాశక్తి గల వ్యక్తిని మరెవరినీ నేను ఇప్పటిదాకా చూడలేదు. గ్రీకు, లాటిన్ కవుల పాదాలను ఘడియ ఘడియకు ఉదాహరిస్తూ ఉంటారు. అంతేకాదు మన స్కాట్లండు దేశపు కవుల పద్యాలను పాదాలకు పాదాలు యాకరవు పెట్టగలడు. ఈయన ఒక పనికిరాని పరిజ్ఞాన సర్వస్వం. ఎవ్వరూ చదవని పుస్తకాల పుట్ట. సనాతన వస్తు సామగ్రి కేటలాగు. క్రైస్తవ విజ్ఞానంలో ఈయన ద్వితీయ శ్రేణి సంస్కారవాదుల రచనలు చాలా చదివాడు. స్పానిష్ జెసూట్ల గురించి ఎక్కువగా తెలుసు. స్వవచోఘాతాలు కోకొల్లలు. వీరి ఊహలు ఊసరవెల్లులు. తనకు తాను తప్ప మరెవ్వరూ సాటిరారు. చిన్నప్పుడే దేశాన్ని వదలి పెట్టి ఇండియాకు వచ్చి హిందూ మహమ్మదీయులతో స్నేహ సంబంధాలు పెట్టుకొన్న ఇలాంటి వాళ్ళంతా ఒక్కటే. యుక్తవయసులో ఆక్స్‌ఫర్డు వంటి విశ్వవిద్యాలయాల్లో చదువుకొని ఉంటే ఈయన ఇంకొక విధంగా పరిణమించి ఉండేవాడు'' అంటూ తన అనుభవాలను కాల్డ్‌వెల్ గ్రంథస్థం చేశాడు.[8]

8. Reminiscences of Bishop Caldwell (as quoted in Literary Autobiography of C.P. Brown, p.85 onwards.

మురారిలాగ బ్రౌను దొరగారిది తృతీయ పంథా అని ఎవరైనా భావిస్తారు. భారతదేశంలో చాలామంది తెల్లదొరలు ఆయనతో చాలా విషయాలలో ఏకీభవించలేదు.

1838 జనవరి 7వ తేదీనాడు దొరగారు చెన్నపట్నంలో అధికారులను కలుసుకొని డ్యూటీలో చేరారు. డైరెక్టర్ల కోర్టువారి ఆదేశానుసారం దొరగారిని రెవెన్యూ, జ్యూడిషియల్ శాఖలలో నియమించక పెర్షియన్ ట్రాన్స్‌లేటరుగా జనవరి 23న ధ్రువపరిచారు. నెలకు కేవలం నాలుగు వందల రూపాయలు మాత్రమే జీతం. మద్రాసులో ఇది ఏమీ సరిపోదు. ఇంకో వూరులోని ఉద్యోగాలలో వేయరాదు.

బ్రౌను దొరగారు చెన్నపట్నం చేరగానే గజెట్‌లో ఈ వార్త ప్రచురితమైంది. ఈ వార్తను చదివి దొరగారి శ్రేయోభిలాషులు సంతోషించారు. ద్రాక్షారం జమీందారు అంగర బ్రహ్మాజీ కృష్ణాజి పంతులు వెంటనే ఇలా రాశారు.

''... తమరు ఈ నెల 7వ తారీఖున పట్నంలో ప్రవేశించినారని గేజిటు వల్ల తెల్సినట్టు మంచాల పురుషోత్తం ఉత్తరం వల్ల నాకు తెలిసినందున అమితమైన సంతోషమైనది. తమరు నిర్దోషులు, బహు పుణ్యాత్ములు అయినందున తమరు యెక్కడ వున్నా ఖులాసాలే గాని తమ ప్రాపకం కోరి వున్న వారికి తమరు ఈ దేశమునకు రావడం నుంచి హద్దులేని సంతోషమునకు హేతువు అయినది. ఈమధ్య అనేకమంది అనేక విధాల అనుకొంటూ వున్న తమ పని గురించి నేను పొంది వున్న సంకోచం అనే చీకటి తమరు ప్రవేశించడంతో సూర్యోదయ శ్రవణంలోనే వదలినది...'' (M-407 p.35-36)

తరువాత సంగతి తెలియచేస్తూ బ్రౌను దొరగారు జనవరి 9వ తేదీనాడు కడపలో తమ బంగళాను చూసుకొనే అయోధ్యాపురం కృష్ణారెడ్డికి ఒక లేఖ ద్వారా తెలియచేశారు. ఇప్పుడు ఈ నమ్మినబంటు కదిరి మునసబు అయ్యాడు. దొరగారికి ఇలా జవాబు రాశాడు.

''...యేలిన వారు యీ నెల 9వ తారీఖున వ్రాయబడిన ఆజ్ఞా పత్రిక ఈదినం పగలు 7 గంటల వేళ నాకు చేరినందున తాము శీమకు పోయిన వర్తమానం తెలిసిన దారభ్యం యీ దినం వరకు తమ యొక్క క్షేమ సమాచారం యేదిన్ని తెలియకుండా వుండినందున అహర్నిశం నాకు కలిగి వుండే అత్యంతమైన వ్యసనం ఈ దినంతోటి పరిహారమై విశేషమైన సంతోషాన్ని పొంది వున్నాను... తమరు వ్రాయించిన ఆజ్ఞ ప్రకారం తాము శీమకు విజయం చేసిన దినం మొదలుకొని ఈ దినం వరకు తమ యొక్క బంగళా అద్దె సంబంధం లెఖ్ఖ యావత్తున్ను వివరగతిగా నాలుగైదు దినములలో సముఖములోకి పంపిస్తున్నాను (1838 జనవరి నెల 20వ తేదీ). (M.432.p.51)

కృష్ణారెడ్డికి కబురు రాసినట్లే దొరగారు తమ నౌఖరు మండెల కొండలరాయుడికి కూడా వర్తమానం పంపాడు. అతడు ఒక లేఖలో ఇలా రాశాడు.

''... మా అదృష్ట యోగం వల్ల 1838 సంవత్సరం ది 9 జనవరి నెలలో యేలినవారు చెన్నపట్నం విజయం చేస్తూనే శలవు యిచ్చిన ప్రకారం యానాములో వున్న సామాను

వగైరా వాడమీద వేసుకొని నేనున్నూ, నా తమ్ముడైన స్వామిన్నీ వాడ మీద యెక్కి యేలిన వారి యెుక్క పాదాలు చూచినంతల్లో మా యెుక్క దరిద్రము విఛ్ఛిన్నమైనదని సంతోషిస్తూ వున్న తర్వాత పదిహేను రోజులకు యేలినవారు శలవు యిచ్చినది యేమంటే యిప్పుడు పని యేమిన్నీ లేదున్ను ముందు పని వచ్చినంతల్లో పిలిపిస్తున్నామని ఆజ్ఞ చేసినారు...''

(M.417.p.232)

పాత సిబ్బందిని పిలిపించుకొని చెన్నపట్నంలో ''కాలేజీ కచ్చేరి''ని మళ్ళా జరిపించాలంటే అది అంచెల మీద సాగవలసిన పని. జీతాలు ఇవ్వగలగాలి. ఇంతకు పూర్వం తయారు చేయించిన తీర్పు ప్రతులు గ్రంథాలయంలో మూలుగుతున్నాయి. అవి వెలుగు చూసే ఏర్పాట్లు చేయాలి. దేనికైనా డబ్బు ముఖ్యం. దొరగారు అప్పుల మీద బతుకుతున్నారు. ఒక ఇంగ్లీషు వర్తకుని వద్ద అప్పులు చేశారు. ఉత్తరోత్తర అసలు ఫాయిదాలతో కలిపి 60,000 అక్షరాలా అరవైవేల రూపాయలు చెల్లించి దొరగారు ఋణ విముక్తులయ్యారు. ఇందులో ముప్ఫయివేలు అసలు, ముప్ఫయివేలు వడ్డీ. ఈ గుదిబండ తొలగేదాకా ఆయనకు జైల్లో పడతామని భయమే ఉండేది. ఆరోజుల్లో బాకీలు తీర్చలేని వాళ్ళను చెరసాలపాలు చేసేవారు. కుంఫిణీ కొలువులో బాధ్యతాయుతమైన నౌకరీ చేస్తూ ఉంటే అప్పులు పుడతాయన్నది దొరగారికి విశదమైన సంగతే. అయితే ఇబ్బందికరమైన సందర్భాలలో అప్పులవాళ్లు సగం బాకీ అయినా తీర్చమని ఒత్తిడి చేస్తారు. లోగడ నండూరి వెంకటాచలం అనే ఏలూరు వాస్తవ్యుడు రాసిన ఉత్తరం ఆయనకు బాగా జ్ఞాపకం. అందులో కొంత భాగం ఇలా ఉంది.

''... దేవరవారి దాపున ది.25 ఫిబ్రవరి తారీఖున శలవు పుచ్చుకొని యింటికి వచ్చి తిథి ప్రయోజనం జరుపుకొని యేలినవారి సముఖానికి రావలెనని వస్తూ ఉండగా యింటి వద్ద వున్న వాండ్లకు జీవనం జరపగలందులకు ధాన్యం మూలంగా బదులు యిచ్చిన సాహుకారు నా బాకీ పైసలు చేసి పొమ్మనమని బంట్రోతును ''మొహస్సలు'' చేసి రానివ్వనందున ఆ బాకీ లెఖ్ఖ చూచుకొంటే రూ. 33-10-0 ముప్ఫయి మూడు రూపాయల పది అణాలు అయినది. అందుకు అనేక విధముల ఆ సాహుకారును బతిమాలుకొంటే సగం రూపాయలు యిప్పుడు యివ్వవలసినదన్ని కడమ సగమున్ను మీదొరగారు మీకు పని చెప్పగానే యిత్తురుగాని అని అన్నారు. గనుక... యేలినవారు దయచేసి జుములా పదమూడు రూపాయల పదమూడు అణాలు దయ చేయించి యేలూరులో యిచ్చే లాగున వుత్తరం వ్రాయిస్తే... సాహుకారును **''సముజాయించు''**కొని యేలినవారి సముఖానకు చేరి నాకుటుంబ రక్షణము చేసుకొంటున్నాను...'' (M-417 పుట 332-34)

ఈ లేఖలోని ''మొహస్సలు', ''జుములా'', ''సముజాయించు'' అనే పదాలను కుండలీకరణాలలో ''యిబ్బంది'', ''మొత్తం'', ''బతిమాలు'' అనే అర్థాలను దొరగారు పూర్వమే రాసి పెట్టుకొన్నారు. తమ నౌఖరీలో వున్న వాళ్ళ కష్టాలను పట్టించుకొని తమ కష్టాలనుండి తాము గట్టెక్కి సాహిత్య కార్యక్రమాలను కొనసాగించాలి.

పూర్వం అచ్చుకు సిద్ధంగా ఉన్న తమ గ్రంథాలను వెంటనే ముద్రించే ఏర్పాట్లు చేయాలి. 1829లో వేమన పద్యాలను కాలేజీ బోర్డు వారు ప్రచురిస్తే, తమకు ఇచ్చిన 50

ప్రతులు మాత్రమే వెలుగు చూశాయి. 1839 నాటికి ఈ పదేళ్ళలో వేమన పద్యాలపై తమ మక్కువ ఎక్కువైంది. 1834లోనే పైడిపాటి వెంకటనరసయ్యాకు పంపిన తాఖీదులోని కొన్ని వాక్యాల వల్ల దొరగారి అభిమానం తెలుస్తుంది.

''వేమన పద్యాలను గురించి మీరు ఎంత దూరం జరిగించినారో ఆ సంగతి తెలియచేయవలసినది. ఇది జబ్బుకావ్యం అయినా సరి దీని మీద నాకు బహు దయ కలిగినట్లు విచారించి తొందరపడి తీర్పు చేయిస్తూ రావలసినది... వేదములన్నీ వాదములు సుమ్మీ అనే పద్యం పిచ్చి తప్పులతో వున్నట్లు గుర్తించి వున్నాము. అది ఒక గణంగా లేనందున వచనంగా యేర్పరచుకొని పది పన్నెండు చరణములు దనుకా సాగినా సరికాని ఈ పద్యం నాకు ఒక దరువు మర్యాదా వున్నదని తెలుస్తున్నది. ఈ పని త్వరమీద వుంచవలసినదని మాకు తాత్పర్యం లేదుగాని నిర్దోషంగా నియమించవలెనని మిక్కిలి తాత్పర్యముగా వున్నాము. ఈ చిత్తు గ్రంథము మాకు ముఖ్యమైన దస్తావేజు అవుతూ వున్నది... యిటు పిమ్మట సర్వ గ్రంథములకు మహా సులభమైన ఒక వ్యాఖ్య అల్లించేటందుకు బుద్ధి వున్నది.... యిది గ్రామ్యోక్త గ్రంథం అయినా సరి...''

(M.401, p.185-89)

దొరగారు ఈ భావాలను కాగితాలపై పెట్టిన తేదీ 1834 జనవరి 3వ తారీఖు. అయితే అంతకు ముందే 1827లో వేసుకొన్న ప్రణాళికలోనే కఠినమైనా సరే, జటిలం కాకపోయినాసరే, సకల (లాటిన్) కావ్యాలకున్నట్లుగానే ఉత్తరోత్తరా ముద్రించే ఏ తెలుగు కావ్యానికైనా సరే వ్యాఖ్యానం వుండాలని భావించారు. ఈ ఉద్దేశంతోనే తారాశశాంక విజయానికీ, పంచతంత్రానికీ టీకలు చెప్పించారు. 1834 నాటికి వారి ప్రణాళికలో ఈ క్రింది 14 కావ్యాలకు టీకా వ్యాఖ్యానాలు తప్పనిసరిగా ఉండాలనిపించింది. అందుకే కొందరు పండితులచే ఆ పని చేయించారు.

	గ్రంథం		వ్యాఖ్యాత
1.	అనిరుద్ధ చరిత్ర	-	జూలూరి అప్పయ్యా
2.	ఇళాదేవీయం	-	వెంకటనరసయ్యా
3.	కవికర్ణ రసాయనం	-	జూలూరి అప్పయ్యా పంతులు
4.	తారకథ	-	నరసింహాచార్యులు
5.	దశావతార చరిత్ర	-	గరిమెళ్ళ వెంకయ్యా
6.	బిల్హణీయం	-	వెంకట నరసు(?)
7.	భల్లాణ చరిత్ర	-	-
8.	భాస్కర శతకం	-	పైడిపాటి వెంకట నరసు
9.	మనుచరిత్ర	-	జూలూరి అప్పయ్యాపంతులు
10.	రాఘవపాండవీయం	-	నరసింహాచారి
11.	రాధామాధవం	-	వెంకట నరసు
12.	వసుచరిత్ర	-	జూలూరి అప్పయ్యా పంతులు
13.	విజయ విలాసం	-	వెంకట నరసుశాస్త్రి
14.	సుమతీ శతకం	-	పైడిపాటి వెంకట నరసు

1834 నాటికి ఈ పద్నాలుగే పరిగణనలోకి వచ్చిన గ్రంథాలు. వీటిలో శతకాలు కూడా ఉండటం గమనించదగ్గ విషయం. ప్రణాళికలో ఏయే గ్రంథాలను ఏయే పండితుల పరిష్కరణ కోసం కేటాయించారో రాశారుగాని ఒక్కొక్క కావ్యాన్ని నలుగురైదుగురు చేత వ్యాఖ్యానం చేయించిన సందర్భాలు ఉన్నాయి. ఒకరికివ్వవలసిన కావ్యాన్ని ఇంకొకరి చేత చెప్పించిన దాఖలాలు ఉన్నాయి. ఉదాహరణకు 1830 డిసెంబరులో విజయ విలాసానికి జూలూరి అప్పయ్యగారి చేత వ్యాఖ్యానం చెప్పించారు. (D-782-785)

పై ప్రణాళిక పట్టికలో లేదు గాని 1831 నాటికే శుకసప్తతికి ఒక ప్రతిని తయారుచేయించారు. దీనికి అవతారిక లేదు. నాలుగో ఆశ్వాసంలో కథ నిలిచిపోయింది. మొత్తం 20 కథలే ఉన్నాయి (D-836). ఈ కావ్యాన్ని పరిష్కరించి సవరించమని జూలూరి అప్పయ్యగారికి అప్పగించారు. నిండా శ్రద్ధగా కొనియాడదగ్గట్టుగాను పంతులుగారు పరిష్కరించారని దొరగారు భావించారు. హంసవింశతి కన్నా ఈ కావ్యంలోనే మేలైన శైలి ఉన్నదనే అభిప్రాయం గ్రంథస్థం చేశారు.

1833 నాటికే వైజయంతీ విలాసంలో గ్రంథం పొడుగునా దొరగారు ఇంగ్లీషులో నోట్సు వ్రాసుకొన్నారు. దీనికి పైడిపాటి వెంకటనరసయ్య వ్యాఖ్యానం చేశారు. ఈ కావ్యానికి 'లేడీస్ లెజర్' అనే ఇంగ్లీషు పేరు దొరగారు పెట్టారు. ''ఇది సురులనుగాని, భాసురులనుగాని మన్నన చేయని గ్రంథం'' అని రిమార్కు వ్రాశారు.

ఒక్క సాహిత్యం గ్రంథాలనే కాక దొరగారు సంగీత గ్రంథాలను కూడా సేకరించారు. 1833 'చిత్రి' మాసంలో, చిత్తూరులో వుండే కుప్పయ్యగారి శేషయ్య 'జాతిస్వర సాహిత్యము' అనే సంగీత గ్రంథాన్ని దొరగారికి వ్రాసి యిచ్చాడు. (D-2536)

పైన పేర్కొన్న ప్రణాళికలో చేర్చలేదు గాని 1834 నాటికే 'ఆముక్తమాల్యద' వ్యాఖ్యానం తప్పనిసరిగా వుండదగ్గ కావ్యమని గుర్తించారు. ఒక ప్రతిని సంపాదించాడు. 1813లో జోగి జగన్నాథరాజుగారు ఒక వ్యాఖ్యానం చేశారు. 'బుధమనస్తోమణీ వ్యాఖ్యానసహితమైన ఈ ఆముక్తమాల్యదను దొరగారు జూలూరి అప్పయ్యగారిచేత సరిదిద్దించారు. కావ్యంకన్నా వ్యాఖ్యానం జటిలంగా ఉండకూడదు. 'మహాసులభమైన వ్యాఖ్య అల్లించేటందుకు' వారు పూనుకున్నారు కదా!

చేతికి వచ్చిన ఏ పుస్తకాన్నయినా దొరగారు మెచ్చుకోలేదు. 1832లోనే 'శ్రీపర్వతపురాణం' అనే కావ్యాన్ని గజవెల్లి కొండయ్య సంపాదించి ఇచ్చాడు. దీనిని వారణాసి రామస్వామి, కొర్రపాటి చన్నప్ప మొకాబిలా చేశారు. గ్రంథాన్ని సొంతం దొరగారు చదివారు. "It is a silly stupid book; Utterly worthless yet written by a man of learning in a good style of Poetry'' అని నిర్మొహమాటంగా రిమార్కు రాశారు. (D-360)

దొరగారు సీమ నుండి తిరిగి వచ్చిన 1838 నాటికి వారి సాహిత్య కృషి ఒక స్థాయికి చేరుకొంది. 1838 జనవరి నెలలో అనగా సీమ నుంచి వచ్చిన కొత్తలోనే 'దేశి-పరదేశి నిఘంటువు' అనే గ్రంథాన్ని దొరగారు చూశారు. ఒకటే గ్రంథానికి నాలుగు ప్రతులున్నాయని గుర్తించారు. మిగతావి బందరు, చెన్నపట్నం, కంచి నగరాలలో వున్నాయి. ఇది అకారాదిగా చేసిన నిఘంటువు (D-1375)

కడపలో గరిమెళ్ల వెంకయ్యగారు తదితర పండితులు ఆంధ్రమహాభారతం పద్దెనిమిది పర్వాలు రమారమి పూర్తిగా పాఠభేదాలు గుర్తించి, శుద్ధప్రతులు తయారు చేశారు. ప్రస్తుతం ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో 89 తాళపత్ర ప్రతులలో మహాభారతం వివిధ పర్వాలున్నాయి. వీటిలో దొరగారు సేకరించినవి ఇప్పుడు ప్రత్యేకించడం కష్టం. దొరగారి నౌఖరీలో వున్నవారు చాలా చోట్లనుంచి సేకరించి పంపించారు. మన్నెం కనకయ్య, తాడిగడప వీరేశలింగం ఎక్కువ ప్రతులు సంపాదించారు. భారతం శుద్ధప్రతిని తయారు చేయించడంలో 12 సమగ్ర తాళపత్ర ప్రతులను సంప్రదించినట్టు దొరగారే ఒక వ్యాసంలో పేర్కొన్నారు. ప్రతి ఆశ్వాసంలో పద్య సంఖ్యలు ఖచ్చితంగా దొరగారి ఆదేశం ప్రకారం ఇచ్చారు. (D-163) ఈ శుద్ధ ప్రతులను తయారు చేయించడానికి 2,714 రూపాయలు పెట్టుబడి పెట్టారు.

తమ వద్ద ఎన్ని కావ్యాల ప్రతులున్నా కొత్తవాటి గురించి ఎవరు ఎక్కడ ఏది రాసినా దొరగారు వెంటనే ఆ ప్రతి కోసం ప్రయత్నించేవారు. 'పరశురామాయణం' అనే ద్విపద కావ్యం గురించి టైలరు దొరగారు 1838 ఏప్రిలు నెలలో మద్రాసు నుండి వెలువడే పత్రికలో ఒక వ్యాసం రాశారు. ఈ పుస్తకాన్ని తెప్పించి వ్రాయసగాడు కాగితాలకు ఎక్కించేటప్పుడే దొరగారు చూసి 'ఇది చెత్త! వ్రాసినందువల్ల ప్రయోజనం లేదు' అని గట్టిగా వాదించారు. 'ఈ పామర కవికి యతిప్రాసల గురించి కూడా తెలియదు' అని చెప్పారు. (D-1111). ఇలాగే 'భల్లాణచరిత్ర' గురించి కూడ ఆ దొరగారు తమ అభిప్రాయం రాశారు. 'ఈ కావ్యము జబ్బుగా వున్నది. యతులు ప్రాసలు గురించి సూత్రం తెలియని కవి చెప్పినది. పనికిరాదు'' అని తెలుగులోనే రిమార్కు రాశారు. శ్రమ నిష్ఫలం కాకూడదని ఆదిలోనే జాగ్రత్త పడేవారు.

ప్రసిద్ధ చంపూ ప్రబంధాలకు ప్రతులు సిద్ధం చేయించాక 'దొరగారి దృష్టి 1838లో ద్విపద కావ్యాలపై మళ్ళింది. జూలై నెలలో పండితారాధ్య చరిత్ర పరిష్కరణ మొదలు పెట్టాక ఆరణిమతం పెద వీరభద్రయ్య అనే వీరశైవ గురువు, పండితుడు దొరగారి సలహా ప్రకారం మూడు ప్రతుల నుండి పాఠభేదాలు సేకరించారు. ఈ కావ్యం తీర్పు ప్రతిని తయారుచేయించేసరికి మూడేళ్లు పట్టింది (D-1087). 'ప్రభులింగలీల' అనే ద్విపదను నరసింహాచారిగారు పరిష్కరించారు. వైష్ణవులను శైవ, జైన గ్రంథాల గురించి అడగకూడదని దొరగారికి తెలుసు. అలా అడిగితే వారు విభ్రాంతులవుతారని తెలుసు. కానీ సహజ గంభీరులైన విద్వాంసులు తమ భావాలను బయటపడనీయకుండా తామెన్నడూ అలాంటి గ్రంథాలను గురించి వినలేదని చెప్తారు. ఇది గ్రంథ సేకరణలో పరిపాటి. అయితే తమ వద్ద పనిచేసే పండితులు వైష్ణవులైనా, శైవులైనా చెప్పిన పని చేయాలి కనుక నరసింహాచారి చేత ప్రభులింగలీలను తీర్పు చేయించారు. దొరగారి అభిమాన గ్రంథాలలో ఇదొకటి.

1839లో దొరగారు 'జంగాల సాహిత్యం' అని పేరు పెట్టి పిలిచే వీరశైవ వాఙ్మయంపై కృషి ఇనుమడింప చేశారు. సెప్టెంబరు 13 నాటికి దొరగారు వ్రాయిస్తున్న 'వీర మాహేశ్వరాచార సంగ్రహం' అనే ద్విపద కావ్యం ప్రతి సిద్ధమయింది. దీనిని కూలంకషంగా

చదివి దొరగారు రిమార్కు రాశారు ''బసవేశ్వరుని సిద్ధాంతాలకు విరుద్ధమైన బ్రాహ్మణ మూఢాచారాలను అంగీకరించడానికి ఇది తాపత్రపడే గ్రంథం. ఇటువంటివి స్మార్తులకూ, ఆరాధ్యులకూ పొత్తు కుదిర్చే ఉద్దేశంతో రచించినవి. వీటిని మత విరుద్ధాలుగా జంగాలుకొట్టి పారేస్తే ఆశ్చర్యం లేదు. బసవేశ్వరుడు ఏ ఆచారాలను నిర్మూలించడానికి పాటుపడ్డాడో వాటిని ఈ గ్రంథం ప్రబోధిస్తుంది. మరీ ముఖ్యంగా 424వ పుటలో చెప్పిన మంత్రాలు మొదలైనవాటిని బసవేశ్వరుడు గర్హించాడు'' అంటూ దొరగారు నిర్ణయించారు.

రంగనాథ రామాయణాన్ని 15 ప్రతుల నుండి పాఠభేదాలు గుర్తించి తీర్పు ప్రతిని పుట్టించారు (D-982). సెప్టెంబరు 19వ తేదీనాడు పరిష్కరణ ప్రారంభించారు. ఏడాది ముగిసినా పని ముగియలేదు. మరో వారం రోజులు పట్టింది. నాలుగు నెలలపాటు ఆరుగురు మనుషులు నిత్యం దానిమీద పనిచేశారు. ఒకపక్క కొత్త ప్రతులు పుట్టిస్తూనే పాత వాటిలో ముఖ్యమైన పుస్తక ప్రచురణలపై దృష్టి కేంద్రీకరించాలనిపించింది. చెన్నపట్టణంలో ముద్రాక్షరశాలలు కూడా నెలకొల్పడానికి నేటివులు ముందుకొస్తున్నారు. మిషనరీలు సరేసరి. 1829లో ఇంగ్లీషు అనువాదంతో ప్రచురించిన వేమన పద్యాలను 1839లో ఆంగ్లానువాదరహితంగా ప్రచురించారు. తొలి ముద్రణకన్నా పద్యాల సంఖ్య పెరిగింది. మూడు భాగాలలోనూ (అనుబంధంలోని రెండు పద్యాలను కలుపుకొని) వెరసి 1165 పద్యాలు ఈ ఎడిషన్‌లో ఉన్నాయి. ఇది అమెరికన్ మిషన్ ప్రెస్‌లో అచ్చుపడింది.[9]

తాము ఇంగ్లీషులో రచించిన తెలుగు వ్యాకరణాన్ని కాలేజీ బోర్డువారు ఎలాగూ ప్రకటించరని నిశ్చయించుకొన్నాక దొరగారు 1840లో ఎస్.పి.సి.కె. వారి వేపెరి మిషన్ ప్రెస్‌లో అచ్చువేయించారు. ఈ కాలంలో ఆయన మద్రాసులోని వేపేరిలో ఉండేవారు. సీమనుంచి వచ్చిన కొత్తలోనే వారిని కాలేజి బోర్డు సభ్యునిగా ఎన్నుకొన్నారు. ఈ బోర్డువారి నేటివ్ ఎడ్యుకేషన్ కమిటీకి ఆక్టింగ్ సెక్రటరీగా కూడా పనిచేశారు. కాలేజి బోర్డువారితో యింత అనుబంధం వున్నా తెలుగు వ్యాకరణం ముద్రణ మాత్రం ప్రైవేటు రంగానికి ఇవ్వవలసి వచ్చింది. మద్రాసు ఆగ్జిలరీ బైబిల్ సొసైటీ, ఎస్.పి.సి.కె. మొదలైన క్రైస్తవ సంఘాలతో దొరగారికి ప్రగాఢమైన అనుబంధం ఉంది. సీమ నుంచి రాగానే 1838లో ఆగ్జిలరీ బైబిల్ సొసైటీవారే దొరగారు అనువదించిన లూకా సువార్తను 'లూకాచేత వ్రాయబడిన శుభవర్తమానము' అనే పేరుతో అచ్చువేశారు.

సీమనుంచి తిరిగి వచ్చినది మొదలు బ్రౌను దొరగారు చెన్నపట్నంలోనే రమారమీ స్థిరనివాసులయ్యారు. ఈ కారణంచేత నగరంలోని పాశ్చాత్య సాహిత్య సమావేశాలలో పాల్గొంటూ 'మద్రాసు లిటరరీ సొసైటీ' సభ్యులుగా చురుకుగా కార్యక్రమాలలో పాల్గొనసాగారు. 1829 నుంచి మద్రాసులో 'ఆగ్జిలరీ రాయల్ ఏషియాటిక్ సొసైటీ' కూడా పనిచేస్తోంది. 1830లో మదరాసులోని లిటరరీ సొసైటీలో మైసూరు, తంజావూరు, తిరువాన్కూరు, పుదుక్కోట రాజులూ, ఆర్కాటు నవాబు, కర్నూలు నవాబు గౌరవ సభ్యులుగా చేరారు. 1833 నుంచి 'జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్సు' అనే పత్రికను

9. ఈ 1839 నాటి ప్రతిని తిరిగి 1980లో యోగి వేమన తెలుగు విజ్ఞాన కేంద్రం' హైదరాబాదు వారు పునర్ముద్రించారు. సంపాదకుడు బంగోరె.

లిటరరీ సొసైటీవారు ప్రచురించేవారు. ఇది సంవత్సరానికి మూడుమారులు నాలుగు నెలలకోసారి వచ్చే పత్రిక. దీనిని 'మద్రాసు జర్నలిజం' అని కూడా వ్యవహరించేవారు M.J.L.S అనే పొడి అక్షరాలతో దీనికి ఇంకో పేరు ఉంది. 1839 జనవరి నుంచి, అంటే 9వ సంపుటం ప్రారంభం నుండి ఈ పత్రికకు బ్రౌను దొరగారు సంయుక్త సంపాదకులయ్యారు. సొసైటీకి జాయింటు సెక్రటరీగా కూడా నియమితులయ్యారు.

పదవ సంపుటం నుంచీ (1835 జూలై - డిసెంబరు సంచికల ఉమ్మడి సంపుటి) దొరగారు ఈ పత్రికలో వరుసగా వ్యాసాలు వ్రాసి ఇంగ్లీషు భాషలో తెలుగు సాహిత్యం గురించి, అనుబంధ విషయాల గురించి లోకానికి తెలియచేశారు.

1) 10వ సంపుటం (1839, జూలై- డిసెంబరు)	Essay on the Language and Literature of the Telugus (p.43-59)

ఇది 62 పెద్ద పేరాగ్రాఫుల వ్యాసం. మొదటి భాగం పుట 360 నుండి 387 దాకా, రెండవ భాగం 13 నుండి 85 దాకా వచ్చాయి. తరువాత అనుబంధాలు ఇచ్చారు.

2) 11వ సంపుటం (1840) (జనవరి- జూన్)	Essay on the Creed, Customs and Literature of the Jangams (p.143-177)

ఈ వ్యాసాన్ని దొరగారు సొసైటీ సమావేశంలో చదివారు.

ఏప్రిల్ 1840	Note regarding the sects of Hindus called Tengala and Vadagala (p.300-302)
3) 12వ సంపుటం (1840) (జూలై- డిసెంబరు)	Notice of some Roman Catholic books existing in Telugu Literature (p.54-58).
1840 (అక్టోబరు)	Account of Basava Purana - the Principal book used as a religious code by Jangams. (p.271)
4) 13వ సంపుటం 1844 (రెండవభాగం)	Translation of Maratta document. Account of the Tribes of Maharatta Brahmins. (Makhenze Mss.No.851)

ఈ ఆంగ్ల వ్యాసాల్లో ఆంధ్ర సాహిత్యం గురించి చాలా వివరగతిగా దొరగారు రాశారు. ఒకరకంగా ఆనాటికి తెలియవచ్చిన తెలుగు సాహిత్య చరిత్రగా మొదటి వ్యాసాన్ని పరిగణించవచ్చు. చారిత్రక ప్రాధాన్యంగల ఈ వ్యాసంలోని కొన్ని కొన్ని భాగాలను మాత్రమే ఆనాటి అభిప్రాయాలకు మచ్చుతునకలుగా దొరగారి మాటలలోనే చెప్పుకొని గమనిద్దాం.

''పూర్వకాలంలో మనం లాటిన్ నుంచి ఇంగ్లీషు పుట్టిందని చెప్పుకొన్నట్టే తెలుగువాళ్ళు సంస్కృతం తమ తల్లి భాష అని చాటుకొంటారు'' అంటూ ఆంగ్లేయులకు విశదపరిచారు. ''వీళ్ళ ప్రాచీన వ్యాకరణాలు సంస్కృత భాషలో సంస్కృత సూత్రాల ప్రకారం రచించబట్టి ఇలాంటి అభిప్రాయం సహజమేగాని సంస్కృత విద్య సర్వసామాన్యం కాదు''. (పేరా-44)

''ఉత్తరాది జిల్లాల తెలుగు భాష చాలా హుందాగా వుంటుందని తెలుగువాళ్ళే అంగీకరిస్తారు (దీని వాళ్లు తూర్పు భాష అంటారు). మదరాసులో మాట్లాడేది భ్రష్టం అంటారు. పరదేశీయులకు అన్నీ ఒకలాగే వుంటాయంటే క్షమించాలి. ఎక్కడ చూసినా హిందూస్థానీ పదాలతోనూ, ఇంగ్లీషు ముక్కలతోనూ తెలుగు సంకరమైపోయింది. బొబ్బిలి కథ, బళిర కరివేల్పు శతకం వంటి ఆధునిక రచనలు అన్యదేశ్యాలమయం. క్రీ.శ.1700లో ఇంగ్లీషు ఎలాగైతే ఫ్రెంచి, స్పానిష్ భాషల పదాల కలగలుపో ఇప్పటి వ్యవహారపు తెలుగు అలాగే ఉంది.'' (పేరా. 45)

''ఆంధ్ర సాహిత్యంలో మూడు యుగాలున్నాయి. నన్నయ భీమనలూ, తొలి ముగ్గురు జంగం కవులూ తొలియుగంలో ఉన్నారు. తర్వాత క్రీ.శ.1200లో తిక్కన యుగం, పిమ్మట రెండువందల ఏళ్ళకు భట్టుమూర్తి మజ్జుందిన భాస్కరుడై వెలిగాడు. 'ఆరయశాలి వాహన శాకాబ్దములద్రి గజాగ్ని సోములన్ తారణ వత్సరంబు' అన్న చాటుపద్యం ఆధారంగా కృష్ణరాయలు A.D.1458లో మరణించాడని చెప్పాలి''. (పేరా.46)

'ఆంధ్రమహాభారతం అంచెలుగా రచించినది. ఇందులో 23,000 పద్యాలున్నాయి. భారతంలో తప్ప విరివిగా వచనం మరెక్కడా వాడినట్టు లేదు (పేరా.48). 'భాగవతం సాంతం అందరూ చదవరు. దశమస్కంధం పఠిస్తారు. ఇందులోనూ రుక్మిణీ కళ్యాణం, జలక్రీడలు ఆసక్తిగా చదువుతారు. గజేంద్ర మోక్షంలాంటి యితర ఘట్టాలు ప్రచారంలో వున్నాయి'. (పేరా.50)

''అన్నింటికన్నా రామాయణమే ఎక్కువ ప్రచారంలో వుంది. వెన్నెల్లో రంగనాథ రామాయణాన్ని వింటారు. భాస్కర రామాయణపు సంస్కృత శైలి శామ్యూల్ జాన్సన్‌గారు వాడే లాటిన్ భూయిష్ట కృతకాంగ్ల శైలిలాగ వుంటుంది' (పేరా.48). రంగనాథ రామాయణం ఇతర కావ్యాలకన్నా మూలానికి విధేయంగా వుంటుంది. అయితే ఒక గమనించదగ్గ విషయం చెప్పాలి. యుద్ధకాండలో రాముడు శివలింగాన్ని అర్చించే సుదీర్ఘ ఘట్టం వుంది. రావణుడు ఎంతటి దుర్మార్గుడైనా బ్రాహ్మణుడట. బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టుకొనడానికి ఈ పూజట. ఈ ఘట్టం రంగనాథ రామాయణంలో, తెలుగు ఆధ్యాత్మ రామాయణంలో వుంది. అయితే అన్ని వ్రాతప్రతులలో లేదు. ఈ ఘట్టం భాస్కర రామాయణంలో లేదు.. మరో రెండు తెలుగు రామాయణాలలో కనబడదు. దక్షిణ భారతదేశంలో మనకు లభించే సంస్కృత రామాయణపు ప్రతులలో కూడా ఇది కనబడదు''. (పుట.369)

'మహాకవులకు బంధ కవిత్వం పిచ్చిలేదు. ద్విపద కవులలో కూడా ఇది కనపడదు. ఆధునిక కావ్యాలలో ఒకటో రెండో తప్పించి అన్నింటిలోనూ ఈ దుర్గుణం తాండవిస్తుంది. (పు.364)

''మొట్టమొదట పేర్కొనవలసిన కవి భట్టుమూర్తి. ఇంగ్లీషువాళ్లు మిల్టన్ కవిని మెచ్చుకొన్నట్టు తెలుగువాళ్లు భట్టుమూర్తిని శ్లాఘిస్తారు. వసుచరిత్ర రచించాడు. ఇతని అసలు పేరు రామరాజు. వసుచరిత్రను రామరాజభూషణమని పేర్కొంటారు. నరస

భూపాలీయం, హరిశ్చంద్రనలోపాఖ్యానం ఇతని ఇతర కృతులు - ఈ కవే పాంచాలీ పరిణయం రచించినట్టు చెప్తారు. అటువంటి పేరుతో ఏ కావ్యమూ నాకు చిక్కలేదు. భట్టుమూర్తి అనే బిరుదును అతని పోషకుడైన కృష్ణరాయలు ఇచ్చాడు. ఈ రాయలు నరసరాయని దాసీపుత్రుడు. తండ్రి తరువాత రాజ్యానికి వచ్చాడు. (పుట. 363)

''శ్రీనాథుడు నైషధాన్ని ఆంధ్రీకరించాడు. కాశీ ఖండాన్ని, భీమఖండాన్ని స్కాంద పురాణం నుంచి తెలిగించాడు. ఈ కవి మరుత్తరాట్చరిత్రను, హరవిలాసాన్ని, శాలివాహన సప్తశతిని రచించాడంటారు. అయితే ఈ గ్రంథాలు నాకు లభించలేదు. శ్రీనాథుడు వీధి నాటకం అనే పేరుతో చాలా యక్షగానాలు రచించాడు. మౌఖిక సంప్రదాయంతో సుమారు 30 రచనలు మాత్రం లభిస్తున్నాయి.'' (పేరా.74)

''తెలుగు గ్రంథాలను సామాన్య కావ్యాలూ, మహాకావ్యాలు అని రెండు వర్గాలుగా విభజించవచ్చు. సామాన్య కావ్యాలు, ద్విపద ఛందస్సులో ఉంటాయి. మహాకావ్యాలు చంపూ ప్రబంధాలు, బ్రాహ్మణ విద్వాంసుల అంచనా ప్రకారం నిరాడంబరత ఒక దోషం. ద్విపదలలో ఈ గుణం ఉంటుంది. అదీ కాక ద్విపద కావ్యాల్లో చాలా మట్టుకు, బహుశా అన్నీని శూద్ర రచనలు కావచ్చును. పద్యకావ్యాలు సర్వసాధారణంగా పవిత్ర కులం వాళ్ల రచనలు. అయితే తెలుగు వాళ్లు గర్వంగా చాటుకునే వసుచరిత్ర శూద్రుడు చెప్పినదే.'' (పుట. 360)

తమ కాలానికి ఆంధ్రసాహితీపరులు చెప్పుకునే కథలనుబట్టీ, తమ ప్రత్యేక పరిశీలనవల్లా బ్రౌను దొరగారు ఈ సుదీర్ఘమైన వ్యాసంలో ఆంధ్రసాహిత్య చరిత్రను తొలిసారిగా ఆంగ్లంలో ఉదాహరణలతో సైతం చెప్పారు. అనంతర పరిశోధనలవల్ల కొన్ని వాస్తవాలు కావని తేలినా, మొత్తం దొరగారి అంచనా చాలావరకు హేతుబద్ధంగానే ఉంది. ఒక పరదేశీయుడు పట్టుమని పదిహేను సంవత్సరాలలో ఆనాటికి లభ్యమైన ఆంధ్ర సాహిత్యాన్నంతా ఔపాసన పట్టగలగడం శ్లాఘించదగ్గ విషయమే. బ్రౌను దొరగారు రచించిన ఆంగ్ల వ్యాసాలు గ్రంథరూపంలో మొన్నటివరకూ అలభ్యాలు. నిన్న ఆచార్య జి.యన్. రెడ్డిగారు సంకలనం చేసి గ్రంథరూపంలో తెచ్చారు.[10]

ఆంధ్రసాహిత్యంలో తమ కాలపు పండితులు వసుచరిత్రకు చాలా పెద్ద పీట వేయబట్టి బ్రౌను దొరగారు మొట్టమొదట ఈ కావ్యాన్ని అచ్చువేయించే ప్రయత్నాలు చేశారు. 1839-40లో ముద్రణ ప్రారంభమైనా ఇది మరి నాలుగేళ్లకుగాని సంపూర్ణ ప్రతి బయటకు రాలేదు. 1842 నాటికి తొలి నాలుగాశ్వాసాలే అమ్మకానికి సిద్ధమయ్యాయి. మిగతా మూడు ఆశ్వాసాలు 1844లోగాని ముద్రాక్షరశాల నుండి బయటపడలేదు.

బ్రౌను దొరగారు ఆదేశించి అచ్చు వేయించిన తొలి తెలుగు కావ్యం చక్రపురి రాఘవాచార్యులు రచించిన నలచరిత్ర. ద్విపద. ఇది 1841లో ప్రచురితమైంది. దీనిని అమెరికన్ మిషన్ ప్రెస్‌లో అచ్చువేశారు. ఈ గ్రంథ ప్రచురణ దొరగారికి ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. కావ్య సేకరణలో తమకు తోడ్పడిన వాళ్లకు దీని ప్రతులను పంపి కృతజ్ఞతలు

10. Prof. G.N. Reddy "Selected Essays of C.P. Brown (1798-1884) on Telugu Literature and Culture, Tirupati, 1988.

ఒకరకంగా చెప్పుకొన్నారు. 1841 అక్టోబరు 22 తేదీనాడు గుండవరపు కృష్ణయ్యా దొరగారికి ఒక ఉత్తరం రాస్తూ ''తమరు నాయందు కృపచేసి పంపించిన నలచరిత్ర ప్రింటు పొస్తకమున్ను వుత్తరమున్ను యేకకాలమందే అంది అపారమైన సంతోషాన్ని పొందినాను' అని తెలియచేశారు. (M.418; p.333). నలచరిత్ర పంపుతూ రాసిన ఉత్తరంలో దొరగారు 'యింకా కొన్నాళ్ళకు హరిశ్చంద్ర చరిత్ర ద్విపద, సారంగధర చరిత్ర ద్విపద, ప్రభులింగలీల ద్విపద మొదలైన కొన్ని ప్రబంధములు అచ్చువేయించడానికి వుద్యుక్తులైనాము' అని వివరించి తమకు గౌరన రచించిన నవనాథ చరిత్ర ప్రతి చాలా జరూరు అని తెలియచేశారు. (M.418, p.338)

1842లో గౌరన చెప్పిన హరిశ్చంద్ర ద్విపదను వేపేరి మిషన్ ప్రెస్‌లో అచ్చువేయించారు. ఈ కావ్యంలో 'ఆ కవే చెప్పిన నవనాథ చరిత్ర ద్విపద కావ్యంలో యుండేటి యొక కథకూడా జోడించారు. ఈ పుస్తకంలోనే 1842లో అచ్చుపడి అమ్మకానికి సిద్ధంగా వున్న గ్రంథాల జాబితాను ఇలా తెలియచేశారు.

1. వసు చరిత్ర సవ్యాఖ్యానం
2. మను చరిత్ర (రెండు భాగాలు)
3. కుచేలోపాఖ్యానం
4. ఆంధ్ర భాగవతం (సప్తమ స్కంధం)
5. హరిశ్చంద్ర ద్విపద
6. నలచరిత్ర ద్విపద
7. వేమన పద్యములు (మూడు భాగాలు)
8. సుమతి, భాస్కర, కాళహస్తి, కోదండరామ, బళిర కరివేల్పు, లావణ్యా సీమ శతకాలు
9. తెలుగు లిపిలో వున్న భగవద్గీత మూలం
10. అమరకోశం (సవ్యాఖ్యానం)
11. ఆంధ్రవ్యాకరణము.

అచ్చులో వున్న గ్రంథాలు

1. సారంగధర ద్విపద
2. ప్రభులింగ లీల
3. నెల్లూరు శంకరకవి హరిశ్చంద్ర కావ్యం (5 ఆశ్వాసాలు)
4. కంచి వీరశరభయ్య హరిశ్చంద్ర కావ్యం (5 ఆశ్వాసాలు)
5. ఆదిపర్వం

1842 నాటికే మదరాసులో నేటివులు ముద్రాక్షరశాలలు నెలకొల్పసాగారు. పురాణం హయగ్రీవ శాస్త్రి, పువ్వాడ వెంకటరావు వంటి విద్యావంతులు బ్రౌను దొరగారి దగ్గర పండితులు సిద్ధం చేసిన తీర్పు ప్రతులను తీసుకొని గ్రంథ ప్రచురణకు పూనుకొన్నారు. 1842లో వర్తమానతరంగిణి పత్రికలో రుక్మిణీ కల్యాణం, ప్రహ్లాద చరిత్ర మొదలైన పుస్తకాలు వెలకు దొరకుతాయని ప్రకటించారు. దొరగారి కలలు నిజమవడం

ప్రారంభించాయి. అభిలషించే వారందరికీ అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండాలన్నదీ వారి ఆశయం. ఈ ఆశయంతోనే ఆయన గ్రంథాలయాలలో కూడా సామాన్యులకు సౌకర్యాలు కలిగించారు.

మదరాసు లిటరరీ సొసైటీలో రెండురకాల చందాదారులు సభ్యులుగా ఉండేవారు. 35 రూపాయలు విరాళం ఇచ్చి నాలుగు నెలలకు 22 రూపాయలు చందా యిచ్చేవారిని ప్రథమ తరగతి సభ్యులుగా పరిగణించేవారు. అన్ని కొత్త పుస్తకాలూ పత్రికలతో సహా సభ్యులకు వంతుల వారీగా అందచేసేవారు. సొసైటీ సౌకర్యాలన్నీ వీరు వాడుకోవచ్చు. పదిహేను రూపాయల విరాళం చెల్లించి నాలుగు నెలలకు 10 రూపాయలు చొప్పున చందాలు యిచ్చేవారిని రెండోతరగతి సభ్యులుగా చేర్చుకొనేవారు. వీరు గ్రంథాలయంలోనే కూర్చొని చదువుకోవాలి. బ్రౌను దొరగారు సామాన్య పౌరులలో సాహిత్య పిపాస గలవారిని దృష్టిలో పెట్టుకొని మూడవ తరగతి సభ్యులను కూడా చేర్చుకోవాలనే ప్రతిపాదన తీసుకువచ్చారు. వీరు నెలకి రూపాయి మాత్రమే చందా కడితే చాలు. పుస్తకాలు ఇంటికి తీసుకెళ్ళాలంటే ఈ మూడవ తరగతి సభ్యులు పుస్తకానికి ఇరవై రూపాయలు ధరావత్తు కట్టాలి. అంతా నగదు రూపంలో ఇవ్వక్కర్లేదు. సగం రొక్కం చెల్లించి మిగతా సగానికి ప్రోనోటు రాసి యిస్తే చాలు. తీసుకెళ్ళే పుస్తకాలు సైజునుబట్టి దానిని ఇంట్లో వుంచుకొనే కాలాన్ని నిర్ణయించాలి.

ఆక్టేవో సైజు సంపుటం	ఒకవారం
క్వార్టోసైజు సంపుటం	రెండు వారాలు
ఫోలియోసైజు సంపుటం	మూడు వారాలు

బ్రౌను దొరగారు ఈ బహుజన ప్రయోజనకారి అయిన ప్రతిపాదనను 1848 వార్షిక సమావేశంలో సభవారికి సూచించారు. ఈ తీర్మానాన్ని సభ్యులు ఆమోదించి, మేనేజింగు కమిటీని తగు చర్యలు తీసుకోమని ఆదేశించింది (M.J.L.S. Vol.15-35 of 1849. p.381). లిటరరీ సొసైటీలో రాజాలు, నవాబులు మాత్రమేకాక కచ్చేరీ గుమాస్తాలు, సాధారణ సాహితీపరులు కూడా సభ్యులుగా చేరే అవకాశాన్ని కలిగించిన దొరగారు అభినందనీయులు.

తెలుగు సాహిత్యంలోని ప్రసిద్ధ కవుల కావ్యాలనేకాక శతకాలను, యక్షగానాలనూ ప్రచురింపచేస్తూ బ్రౌను దొరగారు తాము స్వయంగా రచించిన గ్రంథాల ప్రచురణకు ఏర్పాట్లు చేసుకొన్నారు. 1840 జనవరి చివరి రోజున వఠ్యం అద్వైత బ్రహ్మయగారికి రాసిన వుత్తరంలో ''మేము చెప్పుకొన్న ఆంధ్రవ్యాకరణమున్ను, ఆంధ్ర నిఘంటువున్ను, ఇంగ్లీషు నిఘంటువున్ను ఈ మూడు గ్రంథములున్ను తామే అయి చాపా చెయ్యడముకు యిక్కడ వుండే వక పుస్తకాల వర్తకుడు యత్నపడి మా దగ్గిర దరఖాస్తు చేసినాడు గనుక ఈ మూడు పుస్తకాలున్ను నేను యేర్పరచిన ప్రకారమే స్వచ్ఛంగా పుట్టే సమయం వచ్చినది'' అని దొరగారు తెలియచేశారు. ఆంధ్ర వ్యాకరణం అచ్చుపడింది. నిఘంటువులకు

ఎస్.పి.సి.కె వారితో ఒప్పందం చేసుకొని 1844లో వాటి ముద్రణ పనులు ప్రారంభింప చేశారు. వెయ్యి పేజీలలో పూర్తవుతుందనుకొన్న పని మూడువేల పేజీల దాకా విస్తరించింది. 1852లో తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు అచ్చుకూటం నుండి బయటకు వచ్చాయి.

నిఘంటు నిర్మాణానికి అత్యవసరమైన ప్రామాణిక ప్రయోగాల కోసమే బ్రౌను దొరగారు ఆంధ్ర సాహిత్యంలోని ప్రసిద్ధ గ్రంథాలన్నింటిని సేకరించారు. నిఘంటువుల అచ్చు పని ప్రారంభించాక తమ గ్రంథాలయం తమ ఒక్కరికే కాక సర్వులకూ ఉపయోగపడాలని 1845 జనవరి ఇరవై ఏడవ తేదీనాడు ఒక లేఖ వ్రాస్తూ దొరగారు తమ ప్రాచ్యలిఖిత గ్రంథాలయాన్ని కుంఫిణీ సర్కారువారికి బహూకరించారు. మద్రాసు లిటరరీ సొసైటీవారికి దానిని స్వాధీనం చేశారు. 1,615 తాళపత్ర సంపుటాలు, 836 బైండు చేసిన కాగితం సంపుటాలు గల ఈ సంస్కృతాంధ్ర గ్రంథాలయాన్ని సంరక్షించడానికి తాము నియమించిన ముగ్గురు నేటివులను అదే వుద్యోగంలో వుంచమని కోరారు. వాళ్ళకు నెలసరి ఇవ్వవలసిన జీతాల పరిమితి ఏమిటో తెలియపర్చారు.

1845 ఫిబ్రవరి 1వ తేదీనాడు మద్రాసు లిటరరీ సొసైటీవారి వార్షిక సమావేశం జరిగింది. అందులో జె.పి. మారిస్ దొరగారు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వాల్టర్ ఎలియట్ దొరగారు దానిని బలపర్చారు. మహత్తరమైన ఔదార్యంతో సి.పి. బ్రౌను ఇస్క్వయరుగారు తమ ప్రాచ్యలిఖిత గ్రంథాలయాన్ని బహూకరించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను అని దాని సారాంశం. ఈ గ్రంథాలయ సంరక్షణ నిమిత్తం పెట్టవలసిన ఖర్చుల విషయమై మద్రాసులోని ప్రభుత్వం వారికి, బెంగాలులోని సుప్రీం ప్రభుత్వం వారికి అనుమతి కోసం విజ్ఞాపనలు సొసైటీవారు వ్రాసుకొన్నారు. ఈ గ్రంథాలయం విలువను కట్టి తమకు తెలపమని సుప్రీం ప్రభుత్వం వారు అడిగారు. అందు నిమిత్తం ఒక సబ్ కమిటీని వేశారు.

ఈ గ్రంథాలయం విలువను రూపాయణాపైసలతో కట్టడం అసాధ్యమని సబ్ కమిటీ వారు సవినయంగా మనవి చేశారు. దీనికి సరిసమానమైన సంకలనం దక్షిణ భారతంలో ఇంకేదీ లేదని తెలియచేశారు.

మద్రాసు లిటరరీ సొసైటీకి దొరగారు దానం చేసిన గ్రంథాల సంఖ్య మొత్తం 2,440. ఇందులో సంస్కృత గ్రంథాలు సగానికి పైగా ఉన్నాయి (1,299). మిగతావి చాలా మట్టుకు తెలుగు గ్రంథాలే (1,116). ఇది అక్షరాలా వెయ్యి నూటపదహార్లు (శేషించిన వాటిలో 18 కన్నడ గ్రంథాలూ, 3 మలయాళ గ్రంథాలు, 4 బర్మా భాషలోని గ్రంథాలు ఉన్నాయి). 1824లో తెలుగు భాషను శ్రద్ధగా చదవడం మొదలుపెట్టినప్పుడు దొరగారి వద్ద ఒక్క తెలుగు గ్రంథం లేదు. ఇరవై ఒక్క సంవత్సరాలలో వెయ్యినూటపదహారు గ్రంథాలను సేకరించారు.

బ్రౌను సేకరించిన గ్రంథాల వివరాలు

సంస్కృత గ్రంథాలు- తెలుగు లిపి

విభాగాలు	దొరగారి కేటలాగులో గుర్తింపు సంఖ్యల లెక్క	వివరగతి భోగట్టాలు
వేదాలు	1 నుండి 24	ఇవి మొత్తం 130 సంపుటాలు
వేదాలు	1 నుండి 59	వీటిలో రెండు తప్ప మిగతావి
వేదాలు	1 నుండి 33	బైండు చేసిన గ్రంథాలు
వేదాలు	1 నుండి 14	
మంత్రాలు	1 నుండి 137	అన్నీ బైండు చేశారు. ఈ 137 సంపుటా లలో 702 మంత్రాలున్న గ్రంథాలున్నాయి.
వేదాంతం	441 నుండి 446	అన్నీ బైండు చేసినవి
పురాణాలు	351 నుండి 429	79 బైండు చేసిన బుక్కులే. ఒక్కొక్క సంపుటంలో ఒకటిగాని పెక్కు గాని పురాణాలు ఉంటాయి.
స్కాంద పురాణం	618 నుండి 633	16 సంపుటాలు
కావ్యనాటక అలంకారాలు	451 నుండి 538	88 బైండు చేసినవి
వ్యాకరణం ఛందస్సు నిఘంటువులు	600 నుండి 617	18 సంపుటాలూ బైండు చేసినవే
తెలుగు గ్రంథాలు		
కావ్య, నాటక అలంకార, పురాణ, వైద్య గ్రంథాలు సూచికలు జాబితాలు	1 నుండి 333 401 నుండి 409	అన్నీ బైండు చేసినవే. ఈ 333 సంపుటాలలో 700 రచనలు ఎక్కించారు
నిఘంటువులు,	371 నుండి 389	19 గ్రంథాలూ బైండు చేసినవే
కన్నడ రచనలు		
వివిధ రచనలు	341 నుండి 358	18 బైండు
తాళపత్రాలు **సంస్కృతాలు**		
మంత్రాలు	1 నుండి 165	165 సంపుటాలలో 2320 మంత్రశాస్త్ర గ్రంథాల మంత్రాలు ఉన్నాయి

	దొరగారి కేటలాగులో గుర్తింపు సంఖ్యల లెక్క	వివరగతి భోగట్టాలు
	401 నుండి 545	మొత్తం 145 సంపుటాలు. ఇందులో 480 గ్రంథాలున్నాయి
ణాలు	201 నుండి 400	ఈ 200 సంపుటాలలో 450 వివిధ పుస్తకాలు ఉన్నాయి.
ాటక ాలు	601 నుండి 766.	మొత్తం 166 సంపుటాలు. వీటిలో 360 రచనలు ఉన్నాయి
ం	551 నుండి 582	32 సంపుటాలు, ఇందులో 70 రచనలు వున్నాయి
	891 నుండి 925	సంపుటాల సంఖ్య 25. వీటిలో ఉన్న రచనలు 40.
వ్యాకరణం, ఛందస్సు నిఘంటువులు	801 నుండి 878	మొత్తం సంపుటాలు 78. ఇందులోని రచనలు 140
తెలుగు గ్రంథాలు		
వేదాంతం	601 నుండి 643	43 సంపుటాలు, 150 రచనలు
కావ్యాలు, పురాణాలు	1 నుండి 553	సంపుటాలు 553, రచనలు 1090
జ్యోతిష్యం	721 నుండి 755	మొత్తం సంపుటాలు 35. వీటిలోని రచనలు 70.
గణితం	701 నుండి 711	11 సంపుటాలు - 50 రచనలు
వైద్యం	761 నుండి 841	సంపుటాలు 81, రచనలు 270
వ్యాకరణ ఛందో నిఘంటువులు	651 నుండి 694	441 సంపుటాలు. ఇందులో 80 రచనలు ఉన్నాయి.
వివిధ ప్రక్రియలు	842 నుండి 913	సంపుటాల సంఖ్య 72. రచనల సంఖ్య కూడా 72.
సంస్కృత గ్రంథాలు - పేపరు : కాశీ మోస్తరు		
వేదాంతం (తెలుగు, నాగరి మహారాష్ట్ర లిపులు)	951 నుండి 958	సంపుటాలు 8. రచనలు 40
పురాణాలు (తెలుగు, నాగరి లిపులు)	959 నుండి 972	మొత్తం సంపుటాలు 14. వీటిలోని రచనలు 16.

విభాగాలు	దొరగారి కేటలాగులో గుర్తింపు సంఖ్యల లెక్క	వివరగతి భోగట్టాలు
కావ్య, నాటక అలంకారాలు (నాగర లిపి)	973 నుండి 975	మొత్తం 3 సంపుటాలు. రచనలు కూడా 3.
తర్క, వ్యాకరణాలు (తెలుగు, నాగరి, బెంగాలీ లిపులు)	976 నుండి 982	ఇవి మొత్తం 7 సంపుటాలు ఇందులోని రచనలు 23.

ఇంత పెద్ద గ్రంథాలయాన్ని బహూకరించాక బ్రౌను దొరగారు తమ సాహిత్య కృషికి స్వస్తి చెప్పలేదు. పూర్వం లాగే కొనసాగించారు. ఉదాహరణకు 1849లో తమ సొంత ఖర్చులపైన ఆముక్తమాల్యదకు శబ్ద సూచిని తయారుచేయించారు. 1850 సెప్టెంబరులో రామాభ్యుదయానికి కొత్త తీర్పు ప్రతిని పూర్తి చేయించారు (D.714). ''నిండా అరుదైన ఈ కావ్యానికి విశేషమైన కీర్తివున్నా శానాకాలం వరకు దీనికి మారుప్రతి నాకు లభించలేదు. ఆ తరువాత మెకంజీ సంకలనంలో ఒక ప్రతిని గుర్తించాడు. అయితే దీనిలో అవతారిక లోపించింది. ఆ పిమ్మట నాలుగు ప్రతులు సంపాదించాను'' అని చెప్పి, శైలినిబట్టి ఎలా కాలనిర్ణయం చేశాలో, పరిష్కరణ విధానం ఎలా వుండాలో విశదం చేస్తూ చాలా పెద్ద రిమార్కులు దొరగారు రాశారు. (D.715)

ఎనిమిదేళ్ళ కిందట 1842లో మొదలెట్టిన పల్నాటి వీరచరిత్ర తీర్పు ప్రతిని 1850లో తయారుచేయించారు. ఆరణిమఠం వీరభద్రయ్య ఈ కార్యాన్ని నెరవేర్చాడు. దొరగారు ఇంగ్లీషులో నోట్సు, కథా సంగ్రహం రాశారు. (D.1130)

ఒకపక్క ఇటువంటి సాహిత్య కృషి చేస్తూనే బ్రౌను దొరగారు తమ ప్రధాన ఆశయం నెరవేరడానికి రచనలు చేశారు. ఆయన ఆంధ్రభాషా సాహిత్యాలను అధ్యయనం చేసి, ప్రావీణ్యం సంపాదించుకొనడంలో మొట్టమొదటి తాత్పర్యం ఇంగ్లీషు వాళ్ళకు తెలుగు నేర్పడమే. "Few had opened a way for Englishmen to learn Telugu' అని గుర్తించబట్టే లోటును భర్తీ చేయదలిచారు. "My object has been to introduce Telugu or English giving each a command of both Languages'' అని కూడా చెప్పారు.

ఆ రోజుల్లో తెలుగు నేర్చుకోవాలనుకొనే ఆంగ్లేయులు రెండురకాల వాళ్ళే ఉండేవారు. ఒకరు కుంఫిణీ వారి సివిల్ సర్వీసులో చేరి 'జుడైశాలు పనికిగాని రెవిన్యూ పనికిగాని 'వచ్చి 'తెలుగు మాటలున్ను తెలుగు చదువులున్ను' వచ్చాక 'గొప్ప ప్రభుత్వమునకు పైంటు అవుతూ' 'దౌలతు అభివృద్ధి' కాగా 'సకల సాంమ్రాజ్య అఖండిత తేజో విభవాతి శయంబులు' పొందక పొందడమే. రెండవరకం ఆంగ్లేయులు మిషనరీలుగా

సేవ చేస్తూ సువార్తను ప్రచారం చేసి దేవుని సమస్తమైన వాక్యమును తెనిగించదలుస్తారు. ఇంగ్లీషు నేర్చుకొనదలచుకొన్న తెలుగువాళ్ళు కచ్చేరీలలో ఉమేదువారీగా ప్రవేశించి, వృద్ధిలోనికి వచ్చి నాలుగురాళ్ళు సంపాదించుకొని కుటుంబాన్ని జరిపించుకొనడమే. ''ప్రకృతియందు సదరహీ ఇంగ్లీషు విద్య ఈ దేశమందు ప్రబలముగా వ్యాపించియున్నది. ముఖ్యముగా యీ రాజధానిలో సమస్తమైన వారికి గృహములయందున్ను ఇంగ్లీషు విద్య పారాయణముగా నున్నది. కడపట పంచాంగములు జెప్పే భొట్లు యనే పేరుగల వారి చిన్నవాండ్రు గూడా అధ్యయన పారాయణము చేయడమునకు బదులుగా నింగ్లీషు విద్యనే పారాయణము చేయుచున్నారు''. (M-430, p.349-55)

తెలుగువారికి ఇంగ్లీషులోనూ, ఇంగ్లీషువారికి తెలుగులోనూ ప్రావీణ్యం సిద్ధించి నిత్య వ్యవహారాలు వాటిలో జరిపించడానికి తగినవిధంగా పుస్తకాలు లేవు. ఈ లోటును భర్తీచేసి తమ ఆశయాలను సఫలం చేయడానికి నూతన విధానాలతో పాఠ్యగ్రంథాలుగా కొన్ని వాచకాలను దొరగారు రచించారు.

1840లో ఇంగ్లీషులో తెలుగు వ్యాకరణాన్ని రాసి ప్రచురించారు.

1841లో డైలాగులు అనే ఇంగ్లీషు తెలుగు సంభాషణల వాచకాన్ని రచించారు. ఇందులో వ్యాకరణ విశ్లేషణ కూడా ఉంది.

1852లో ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వాచకాలను రచించి ప్రచురించారు. వీటిలో ఆంధ్ర మార్గదర్శి అనే 'తెలుగు రీడర్' ప్రధానమైంది. ఈ పుస్తకంలో కథలు, అర్జీలు, కేసుల విచారణ పత్రాలు మొదలైనవి. 'సివిలు సర్వెంటు' విద్యార్థులకు ఉపయోగించేవిధంగా వున్నాయి. ఈ 'రీడరు'లోని ఉత్తరాలను చదివితే తెలుగువాళ్ళ మనస్తత్వాలు అవగాహన అవుతాయని దొరగారి భావం. ఈ పుస్తకంలోని తెలుగు భాగాలను ఇంగ్లీషులోనికి తర్జుమా చేసి వేరే సంపుటంగా కూడా ప్రకటించారు. వ్యాకరణ విశ్లేషణ, లఘు నిఘంటువు దీనికి జతచేశారు. ఇతర ప్రాంతీయ భాషలను అభ్యసించదలచిన సివిల్ సర్వీసు విద్యార్థుల కోసం ఈ రీడర్‌ను తమిళ, కన్నడ, మలయాళ భాషలలోనికి అనువాదం చేయించదలిచారు. అంతేకాక తమ ప్రాపకం కోరిన ఒక ఓఢ్ర యువకుని చేత ఒరియా భాషలోనికి కూడా ఈగ్రంథాన్ని పరివర్తన చేయించారు.

1852లోనే 'వాక్యావళి' అనే గ్రంథాన్ని పరివర్తన చేయించారు. పియర్సన్‌గారి బెంగాలీ పుస్తకం 'బాక్యాబొళి' ఆధారం. ఇందులో జాతీయాలు నుడికారం బోధించారు.

తెలుగు భాషను అభ్యసిస్తున్న ప్రారంభదశలోని విద్యార్థుల కోసం ఇన్ని పుస్తకాలు ప్రచురిస్తున్నప్పుడే బైబిలును అనువదించడానికి ప్రారంభించారు. నమూనా తర్జుమా కాగితాలను సమర్పిస్తే దొరగారి తెనిగింపును బైబిల్ సొసైటీ కమిటీ వారు తిరస్కరించారు. కమిటీ వారికి తెలుగులో చాలా కొద్ది పరిచయమే ఉన్నందున ఇలా జరిగిందని దొరగారు భావించారు. పట్టుమని పదేళ్ళయినా ఆంధ్రభాషా సాహిత్యాలను అధ్యయనం చేయని వారు పవిత్ర గ్రంథాలను తెనిగించబూనడం దురదృష్టకరమని వారి విశ్వాసం. బైబిలును ఆంధ్రీకరించడానికి దొరగారు సంస్కృత, బెంగాలీ, తమిళ, మరాఠీ, కన్నడ భాషలలోని

అనువాదాలను సంప్రదించేవారు. వీటిని గ్రీకు, హీబ్రూ పాఠాలతో సరిపోల్చి చూసేవారు. ఈ అనువాద కార్యక్రమంలో జీతమిచ్చి, సమర్థులైన నేటివులను నియమించారు. వారే ఈ ఆంధ్రీకరణ పరిసమాప్తం చేశారు.

బ్రౌనుదొరగారు ప్రొటెస్టెంటు క్రైస్తవులు. ఇతర శాఖల వారిపట్ల ఔదార్యం కొంత తక్కువగా చూపేవారు. 'మద్రాసు జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్' 1840 జూలై సంచికలో రోమను కేథలిక్కుల విగ్రహారాధనపై చేసిన విమర్శలు కొంచెం సంచలనం కలిగించాయి. 1840లోనే క్రైస్తవ కావ్యాలలో ఒకటైన 'జ్ఞానబోధనము' అనే వ్రాతప్రతిని సంపాదించారు. ఇది కేథలిక్కుల గ్రంథం. 1840 ఆగస్టు 3వ తేదీనాడు దీనిపైన ఇలాగ అభిప్రాయం గ్రంథస్థం చేశారు.

"ఇది క్రీస్తుమతం బోధచేసే గ్రంథస్థమై వున్నది. మెట్టుకు యిది బయబిల్ బోధ తాలూకా కాదు. మతము గురించీ, నీతిని గురించీ, పాపం, పుణ్యాం, మోక్షం ఇత్యాదుల గురించీ ప్రసంగించి వున్నదిగానీ నీరసంగా జబ్బుగా చెప్పి వున్నది. ఇది వ్రాసినమీదట ఇతరమైన వొకప్రతి దొరికి కొంతమట్టుకు సంప్రదించుతున్నాము గాని యెక్కువ ఫాయిదా లేదు" అని తెలుగులోనే రాశారు. (డి.2098)

సాటి క్రైస్తవ శాఖనే అభిమానించనివారు హిందువులతో సాయిలా ఫాయిలాగా ఉండగలరా? "కడచిన ముప్ఫయి సంవత్సరాలలో నేను హిందువులతోఎన్నడూ మిళితం కాలేదు. వాళ్ళ పండుగులూ, పబ్బాలూ పట్టించుకోలేదు. నా నౌఖరీలో పని చేసేవాళ్ళు తప్పించి నాకు చాలా తక్కువ మందితో పరిచయాలు వుండేవి. నన్ను వచ్చి కలుసుకొనే నేటివులు బహు అరుదు. నేను హిందూ మత విగ్రహారాధనను పని కట్టుకొని ప్రతిఘటిస్తానని చెప్పుకొనేవారు. బ్రాహ్మణులను విమర్శించే వేమన పద్యాలను ప్రచురించినందుకు, జంగాలను వెనకేసుకొని వచ్చినందుకు, నా హైందవ వ్యతిరేకత రుజువు అయినదని భావించేవారు" అని ఆత్మకథలో దొరగారు రాసుకొన్నారు.

హిందువుల ఆచారవ్యవహారాలలో కొన్నింటిని తమ అంతరాంతరాలలో బ్రౌను దొరగారు పూర్తిగా గర్హిస్తారు. ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్ర చరిత్ర వ్రాతప్రతిలో కొన్నిచోట్ల ఘాటైన మాటలలో రిమార్కులు రాశారు. వ్రాతప్రతి పుట 208లో కాశీలో ప్రవేశించాక "ఆ మరునాడు నాతో కూడా వచ్చిన బ్రాహ్మణులందరి చేత తీర్థశ్రాద్ధాలు పెట్టించడమైనది. (నాకు స్త్రీల నెలసరి నిరోధం పొసగినందున అందుకు) నాలుగో దినము నేను తీర్థ శ్రాద్ధము పెట్టడమయినది" అని వీరాస్వామయ్యగారు రాశారు.[11] ఇక్కడ మార్జిన్‌లో దొరగారు "No brahmin can write a book without making this allusion. The printed copy omits it' అని రాశారు. పైన ఉదహరించిన వాక్యంలో కుండలీకరణాలల్లో వున్న వాక్యం అచ్చు పుస్తకంలో లేని మాట నిజమే. తమ ఆడవారు బయటు ఉన్నదన్న విషయాన్ని వీరాస్వామయ్యగారు చెప్పడం దొరగారు "ఫిల్తీ" రోత, అసహ్యం అన్నారు.

11. కాశీయాత్ర చరిత్ర - 1941 ముద్రణలో - పుట 157.

ఈ ఒక్కచోట మాత్రమే కాదు. కాశీయాత్ర చరిత్రలో వీరాస్వామయ్యగారు స్త్రీలు కేవలం పురుషులకు భోగార్థులా? లేక పురుషులవలనే వీరున్నూ జ్ఞానవంతులై మోక్షార్థులా? అనే జిజ్ఞాసలో పడ్డారు. ఇతిహాసాదులలో పురుషులకు ఫలాని ఫలాని సుకర్మను చేస్తే స్వర్గములో అనుభవించడానికి రంభాద్యప్సరసలు వున్నారని ఆశ చూపించియున్నదిగాని, ఫలాని మంచి కర్మము స్త్రీలు చేయుటవల్ల ఫలాని దేవతలతో స్వర్గములో క్రీడిస్తూ వుండవచ్చునని ఆశకూడా చూపలేదే! ఇలాంటి భావాలు వెలిబుచ్చి తమ సిద్ధాంతాన్ని ఇలా రాశారు.

''నా బుద్ధిద్వారా నిశ్చయము చేసినది యేమంటే స్త్రీలకు పురుషులకున్ను హృత్కమలములు ఊర్ధ్వాధో భాగముల యందు రెండేసి గ్రంథులనే ముళ్ళు గలిగి వుండేది నిశ్చయము. అధోభాగమందుండే గ్రంథి పరమాత్మ సంబంధమయినదిన్ని ఊర్ధ్వభాగ మందుండే గ్రంథి సంకల్ప రూపంబయిన మాయాసంబంధమయిన దిన్ని ఔను. స్త్రీలకు గర్భధారణ నిమిత్తమయి అధోభాగమందుండే గ్రంథి ఫలకాలమురాగానే వీడబడి ఋతువనే సంజ్ఞను పొందుచున్నది. పురుషులకు మాయసంబంధమయిన వూర్ధ్వభాగ మందుండే గ్రంథి ఫలకాలము రాగానే జ్ఞానోదయ సామగ్రిని చేయడానికి వయిపుగా వీడబడి పోవుచున్నది. యిందుకు దృష్టాంతమేమంటే పురుషులకు యౌవన ప్రారంభమయిన వెనక బాల్యమునందుండే కంఠధ్వని సౌషవము వుండేది లేదు; భేదింపు చున్నది. స్త్రీలకు మాత్రము జననదారభ్య కంఠధ్వని యొకటే రీతిగా పురుషుల కంటే హెచ్చుగా యథోచితమయిన శ్రావ్యత కలిగి ఉంటున్నది'' (పుట. 149-50)

ఈ వాక్యాలు వున్నచోట వ్రాతప్రతిలో దొరగారు 'observe the Scoundrel blackguardism of brahmins here' అని రిమార్కు రాశారు. 'తుచ్ఛబ్రాహ్మణుల దౌష్ట్యాన్ని గమనించండి'' అని వారి ఉద్దేశం. వ్రాత ప్రతి (డి.1407-పుట 211). ఈ రిమార్కులను గుర్తించారో లేదోగాని మన పరిశోధకులు ''సి.పి. బ్రౌను దొరగారు వీరికి స్నేహితులు. ఈ బ్రౌను దొరగారు 1852-54 మధ్య ప్రకటించిన తెలుగు నిఘంటువులో ఇంద్రాణి, శీదా, సొలకట్టు పలవరకాయ అను పదాల అర్థాలకు వీరాస్వామయ్యగారిని ప్రామాణికంగా పేర్కొన్నారు'' అని వ్రాశారు.[12] భాషా ప్రయోగాలను స్వీకరించడం వేరు. భావాలను తెగనాడడం వేరు.

తమకు మంత్రసిద్ధులున్నాయని, దేవరహస్యాలు తెలుసునని లోకులను నమ్మించేవారు బ్రౌను దొరగారి వద్దకూడా ఆ విధమైన జ్ఞానం ప్రదర్శించదలిచారు. ''లోకేశ్వరులైన ధూర్జటి వెంకటాచలయ్య'', ''అయిదారు సంవత్సరాలుగా తపము చేసి యీశ్వరాజ్ఞ ద్వారా తమ కులాభివృద్ధిన్ని బావుటాకు సహకారిణియైన గగన సృష్టియనేది యిప్పుడు నూతనముగా సృష్టింపబడినది. హిందువులకు యెంత మాత్రము తెలియకూడని శీమ రహస్యముతో సమానమైనది. దొరలలో తాము సర్వజ్ఞులౌటచేత తమకు మాత్రమగుపరచి యింకా కొన్ని దేవతా రహస్యము తమకు మన్నిచేయవలసిన

12. దిగవల్లి వెంకట శివరావు - కాశీయాత్ర చరిత్ర, పుట 4.

అత్యక్కరచేత'' ఉత్తరం రాశారు. (M.430-p.222) దొరగారు సర్వజ్ఞులైతే వారికి ముందే ఈ లోకేశ్వరులు చెప్పబోయేదేమిటో తెలిసి ఉండాలి కదా!

సి. రంగనాయకులు అనే వ్యక్తి దొరగారికి గ్రంథసేకరణ అంటే ఇష్టమని తెలిసి 'సారార్థసంగ్రహం' అనే పుస్తకానికి ప్రతి వ్రాశాడు. దేవుడు తన కలలో కనపడి ఫలానా పుస్తకం కాపీచేసి దొరగారికి యివ్వరా అని ఆజ్ఞాపించాడని చెప్తూ, గ్రంథాన్ని సమర్పించుకొంటూ ఉత్తరం రాశాడు. దీనిపైన దొరగారు "Pity! the God did not happen to know that I already possessed this poem' అని రాశారు. (M.427, p.231)

బ్రౌను దొరగారు దైవభక్తి, పాపభీతి ఉన్నవారే. ఆయన పరమ నైష్ఠిక క్రైస్తవులు. ఎన్నడూ సబ్బాతు నియమాన్ని ఉల్లంఘించలేదు. వారానికి ఆరు రోజులు, ప్రతిదినం తెల్లవారుజామున అయిదునుంచి, ప్రొద్దుట పదిదాకా సాహిత్య కార్యక్రమాలలో పాల్గొన్నా ఆదివారం పూర్తిగా విశ్రాంతి దినమే. ఆరోజు తమ నిఘంటు నిర్మాణం నిలుపుదల చేసేవారు. తాము సేకరించిన అంతర్జాతీయ గ్రంథాలలో ఇంగ్లీషు, గ్రీకు, లాటిన్, ఫ్రెంచి, పారశీక భాషల గ్రంథాలు ఉన్నాయి. హిందువుల శాస్త్రాలతోపాటు వీటన్నిటినీ అధ్యయనం చేసేవారు. 'డైయిజమ్'ను హృదయములో చేర్చుకోవచ్చు. క్రైస్తవ మతంలో పుట్టి, ఆ మత సిద్ధాంతాలను త్యజించి, క్రీస్తు దేవుడు కాదనే వాదనను 'డైయిజమ్' అంటారు. డైయిస్టులు నాస్తికులు కాదు. దేవుడు ఒకడున్నాడని ఒప్పుకొని బైబిలులో వుండే సిద్ధాంతం అక్కరలేదనే మతస్థులు. వీరు ఏకేశ్వరవాదులు. హిందూ మహమ్మదీయ విద్యావంతులందరూ డైయిస్టులే అని దొరగారి నమ్మకం.[13]

తమకు సబ్బాతు పట్టింపు వున్నట్టే హిందువులకు కొన్ని పట్టింపులు ఉంటాయని గుర్తించడం అవసరం. తాము ఆదివారం నిఘంటు పనులు ఆపుచేసినట్టు పురాణం హయగ్రీవ శాస్త్రిగారు. ''ఈ దేశమందు ఫాదర్లచేత నేర్పరచి యుండే ముద్రాక్షరశాలల యందు శ్రీ మద్రారామాయణమును అచ్చువేయించుటకు సమ్మతి పడక'' సొంతంగా ప్రచురించారు. దొందూ దొందే!

బ్రౌను దొరగారికి భూత దయ, పేదసాదల పట్ల సానుభూతి విస్తారంగా ఉన్నాయి. తమ ఆర్జనలోని ప్రతిఒక్క రూపాయిలో ఒక పైసను దానధర్మాలకు కేటాయించారు (ఆనాడు రూపాయికి 192 పైసలు ఉండేవి). ప్రతి నెలా కుంటి, గుడ్డి, అవిటివాళ్ళకు అయిదువందల రూపాయలదాకా ధర్మం చేసేవారు. ఎందరో బిచ్చగాళ్ళు సైతం దొరగారికి ఉత్తరాలు రాసిన దాఖలాలు ఉన్నాయి.

''యేలిన వారి ధర్మ టిక్కట్టు వల్ల జీవనం జరుపుతూ వుండి చనిపోయిన భిక్షగాడైన పొన్నప్ప కుమార్తైనున్ను కుష్ఠ సంకటం చేత తండ్రి అన్న వస్త్రములలో పాలుపడి జరుపుతూ వున్న అఖిలాండమనే దిక్కుమాలిన భిక్షగత్తె వినయ విధేయతలతో చనిపోయిన తన తండ్రి ధర్మటిక్కట్టు దొరగారి సముఖంలో దాఖలు చేసి పెద్ద సంకటంచేత యెందుకూ కొరగాని తనకు ఆ టిక్కెట్టు ఇవ్వమని ప్రార్థించింది'' (1852 అక్టోబరు M-432, p.6-7)

13. Literary Autobiography, p.40

దిక్కులేని వాళ్ళను ఆదుకోవడమేకాక ఎందరో బీద విద్యార్థులకు తమ ధర్మబళ్ళలో దొరగారు చదువులు చెప్పించారు. బందరులో వుండే వరదయ్యా అనే చిన్నవాడి తల్లి కూలికి దంచి, ఒక అయ్యావారికి నెల ఒక్కింటికి ఒక పావలా చొప్పున ఇప్పించి తెనుగు చదువు నేర్పించింది. అటు తర్వాత యింగ్లీషు నేర్చుకోవలెనంటే చెన్నపట్టణములో ధర్మబళ్ళు శానా వున్నవని అతనిని యీ దేశములోకి తీసుకువచ్చి, యెళుంబూరిలో వుండే బ్రౌనుదొరగారి ధర్మబడిలో విడిపించి, ఆమె యిప్పటివలెనే కూలికిపోతూ కుమారుని కాపాడుతూ వుండెను. యిట్లా కొన్ని దినాలు జరుగుతూ వచ్చెను. పిమ్మట ఆమె పరమపదము చేరెను. వరదయ్యా దొరగానికి అర్జీ పెట్టుకొన్నాడు.[14] ఇలాంటి లేఖలు ఎన్నో ఉన్నాయి.

వ్యక్తులు తమ సొంత విషయాలు చెప్పుకొంటూ చదువు చెప్పించమని కోరడమేకాక, కొన్ని పేటలలోని వ్యక్తులు సమిష్టిగా దొరగారికి విద్యావిషయమై రాసిన లేఖలు వున్నాయి. ఒకసారి మద్రాసులోని మూడు పేటల కాపులు ఇలా రాసుకొన్నారు.

''కొత్తపేట-తిరువల్లిక్కేణి-యెళుంబూరు యీ మూడు గ్రామముల కాపులు మిక్కిలి వినయవిధేయులై సలాములు చేసి వ్రాసుకొన్న మనవి యేమంటే-

మాయొక్క చిన్నవాండ్లకు బాల్యములోనే యింగ్లీషు విద్యాభ్యాసము చేయించడముకు ఉపాధ్యాయులను వుంచి జీతం మొదలయినది యివ్వడముకు వుపకృతి లేక చింతిస్తూ వుంటిమి. ఇంతలో అంధుడికి నేత్రములున్ను, యేరుదాటనలవిలేని వానికి నావదొరికినట్టున్నన్న దాహంగొన్నవానికి గంగామృతం దొరికినట్టుగా తమరనే సత్ప్రభువులు ధర్మపరిపాలన యందున్ను, దీనసహాయము యందున్ను మనస్కరించి అంతఃకరణ పూర్వకముగా కొత్తపేటలో వొక పాఠశాల యేర్పరచి వుపాధ్యాయులను వుంచి జీతం మొదలైనవి తమ సొంత ద్రవ్యం దయ చేయించి విద్యాభ్యాసం చేయిస్తూ....

గోవింద మొదలిని నియోగించారు. విద్యాభ్యాసమునకు వుపయోగమైన పుస్తకములు, కాగితములు, పేనాలు మొదలైనవి యిప్పించగలందులకున్ను సదాపై విచారణ జరిపించడానికి, అతను ఉత్తరువు ప్రకారము జరిపించవలసిన కార్యాలలో మోసం చేశాడు.

4 సంవత్సరాలుగా యెప్పుడు పాఠశాలకు రాలేదు. బాలురను పరీక్ష చేయలేదు. ఈ సంగతి దొరగారికి తెలిసి నిండా కోపగించి పాఠశాల నిలిపి వేయాలని నిశ్చయించారు.'' (ఎమ్.432.పి.15-18)

33 గ్గురు సంతకాలు పెట్టి మహజరు ఇచ్చారు. (సంతకాలు తెలుగు, తమిళం, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో ఉన్నాయి.)

విద్యాదానం విషయమై పలువురు అర్జీలు పెట్టుకుంటే కొందరు కన్యాదానం చేయించమని మహజరు పెట్టుకొన్నారు. రాచూరి తాలూకాలో చేరిన ఆత్మకూరి కరణం ఆలూరి నారాయణప్ప ఇలా రాశాడు.

---

14. ఆంధ్ర మార్గదర్శి - తెలుగు రీడరు - పుట 73.

''పది సంవత్సరముల కిందట నాకు వివాహమై నిరుడు దైవోపహతం చేత నా భార్య వియోగమైనది... మా బ్రాహ్మణ యిండల మొదటి పెండ్లికి చిన్నదాని నిమిత్తమై వంద్లపరియంతం పుచ్చుకొంటారు. లాగంటిపనికి రెండోపెళ్ళి అనగానే నాలుగు మూడు వందలు రూపాయలు అడుగుతారు... నేను వివాహము చేసుకోకుండా విరక్తిమార్గాన వుండడానికి యింకా నాకు కొన్ని దినములు సంసారము చేయవలెననే యిచ్ఛ వున్నది... సకల ధర్మస్వరూపులు నావంటి దీనునకు కన్యాదానం చేయించి ఇల్లు నిలుపవలెను'' అని 1833లో ప్రార్థించాడు.[15]

నారాయణప్పకు కన్యాదానం చేయించారో లేదో తెలియదుగాని దొరగారు మాత్రం వివాహం చేసుకొన్నట్లు లేదు. సంసారం లేనివాడికి సహవాసాలూ, సరదాలూ ఎక్కువంటారు. ఇది దొరగారి పట్ల వర్తిస్తుంది. ఆర్జన బాగా ఇనుమడించాక అతిథి సత్కారాలు ఎక్కువ చేశారు. దొరసానులను పార్టీలకు పిలిచేవారు. ఎన్నడూ ఇరవైమందికి తక్కువగా అతిథులు లేకపోయినా ఆర్భాటంగా విందుభోజనాలు ఏర్పాటు చేసేవారు. దొరగారికి డబ్బు ఖాతరులేదని, చాలా దుబారా చేసేవారని ప్రఖ్యాతి వచ్చింది. తమ బంగళాలో భుజించేవారెవ్వరూ వాళ్ళ ఇంటికి దొరగారిని ఆహ్వానించి విందులు చేయలేనివారే.

రాయపురంలో రాజప్రాసాదమంత బంగళా, తోట - రెండు సవారీ బళ్ళు, ఆరు గుర్రాలు, ప్రాంగణమంతా పాలరాతి శిల్పాలు, డెబ్బయి తైలవర్ణ చిత్రాలు, అంగరంగ వైభోగాలతో దొరగారు జీవించసాగారు. గవర్నరు బహదూరుగారి మహలులో కన్నా ఘనంగా తమ బంగళాలోనే షడ్రసాన్న భోజనాలు అతిథులకు వడ్డించేవారని "My table was more Splendid than that of Governor' అని దొరగారు ఆత్మకథలో రాసుకున్నారు. ఇంగ్లీషు నుడికారం తెలియనివారు ఈ వాక్యాన్ని ఇక తన డైనింగ్ టేబుల్ గవర్నర్ ఇంట్లో దానికంటే జిగేల్మనేదని వ్రాసుకున్నాడు' అని ఆంధ్రీకరించారు.[16]

1846లో చెన్నపట్నంలోని పోస్టుమాస్టర్ పదవి ఖాళీ అయింది. మారిస్ దొరగారు తెలుగు అనువాదకుని పదవికి రాజీనామా చేశారు. ఈ రెండు స్థానాలలో బ్రౌను దొరగారిని కుంఫిణీవారు నియమించారు. వీటితోపాటు పెర్షియన్ ట్రాన్స్‌లేటరుగా కూడా పనిచేసేవారు. రోజుకు పది గిన్నెకాసుల ఆదాయం వచ్చేది. అంటే దినసరి పదిహేడున్నర రూపాయలు అంటే నెలకు 565 రూపాయలు (దొరగారు తమ మిశ్ర నిఘంటువులో 'గిన్నెకాసు' అంటే అయిదు వరహాలు లేక పదిహేడున్నర రూపాయలని అర్థవివరణ రాశారు). వేతనం ముట్టే ఉద్యోగాలుకాక, జీతం లేని గౌరవోద్యోగాలు మరికొన్ని వుండేవి. విద్యాసంఘంలో సభ్యునిగా, మద్రాసు బ్యాంకిలో గవర్నమెంటు డైరెక్టరుగా, మద్రాసు కాలేజీ గ్రంథాలయంలోని వ్రాతప్రతుల క్యూరేటరుగా కాలేజీ బోర్డు ఎగ్జామినర్లలో సీనియర్ సభ్యునిగా దొరగారు పదవులు నిర్వహించారు.

---

15. ఆంధ్ర మార్గదర్శి - తెలుగు రీడరు - పుటలు 195-96.
16. బంగోరె - 'బ్రౌను లేఖలు' - పుట 141.

వ్రాతప్రతుల క్యూరేటరుగా వున్నప్పుడు మెకంజీ కైఫీయత్తుల స్థితిని గమనించారు. అవి శిథిలమవుతూ వుండడం చూసి మేలురకం ఇంగ్లీషు పేపరు మీద స్థానిక చరిత్రలను కాపీ చేయించారు. ఇండియాకు వచ్చిన కొత్తలో నేర్చుకొన్న మరాఠీ భాషాజ్ఞానాన్ని సార్థకం చేసుకొంటూ మెకంజి సంపుటాలలో వుండే మరాఠీ వ్రాతప్రతులు చదివారు. ఆ భాషనుండి హైదరు చరిత్రను ఇంగ్లీషులోనికి అనువదించి 1849లో అచ్చువేశారు.

మెకంజీ స్థానిక చరిత్రలను అధ్యయనం చేసి 1850లో తెలుగు, కన్నడ దేశాల చరిత్రలలో వచ్చే హిందూ ముస్లిం తారీఖుల కాలక్రమ సూచికను తయారు చేశారు. 70 పుటల ఈ ముద్రిత గ్రంథం పేరు 'సైక్లిక్ టేబుల్స్'. ఉత్తరోత్తరా ఇది పెరిగి 'కర్నాటిక్ క్రోనాలజీ' అనే పేరుతో మరో ముద్రణ పొందింది. తొలితరాల వారు రాసిపెట్టి పోయిన గ్రంథాలలోంచి సమకాలిక సమస్యలకు సంబంధించిన విషయాలను సేకరించి వివరగతి గ్రంథాలు రాయడం పరిశోధకుల కర్తవ్యం. ఆనాడు మిరాశీ వాదంపై చర్చలూ దర్యాప్తులూ జరిగాయి. దొరగారు ఒక పరిశోధక వ్యాసం రాశారు. ఎల్లిస్, బ్లాక్ బర్న్, సర్ థామస్ మన్రో దొరలు వ్రాసిన గ్రంథాలలోంచి కుంఫిణీ డైరెక్టర్ల రిమార్కుల నుండి సారాంశాన్ని సమకూర్చి 'మిరాశీ సామ్యం' అనే గ్రంథాన్ని 1850లో రచించారు. కుంఫిణీ వారి అనుమతి లేకుండా ఈ రచన చేసినందుకు సర్కారు వారి మందలింపులకు గురి అయ్యారు గాని దీనిని 1852లో ప్రచురించారు.

1852లోనే బ్రౌను దొరగారికి ఫస్టుక్లాసు సివిల్ సర్వెంటు అన్న హోదా వచ్చింది. ఈ యేడే చాలా పుస్తకాలు ప్రచురించారు.

బ్రౌను రచనల కాలక్రమ సూచిక

1825 - ఆంధ్రశబ్ద చింతామణి - 'ఆంగ్లానువాదం' (D-1237) బ్రౌను దీనిని 23-7-1825న, మళ్ళా 25-9-1827న రెండుసార్లు అనువదించాడు - అముద్రితం.

1825 - 'జిల్లా నిఘంటువు' - మద్రాసు.

1827 - 'ఆంధ్రగీర్వాణచ్ఛందము', మద్రాసు, ఇది 1977లో వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారిచే పునర్ముద్రితం - ఛందోగ్రంథం.

1827 - Notice regarding the names used in the Indian Zodiac, MJLS, 1827, No.33 వ్యాసం.

1828 - 'Hindu Sculpture'; - Asiatic Journal, London, 1828 V.No.Edition. మొదట ఇది మదరాసు గెజిట్‌లో ప్రకటించినప్పుడు తన పేరు వేసుకోలేదు - వ్యాసం.

1828 - 'Suttee Prevented' - Asiatic Journal, London, 1828 V.No.Edition ఇది కూడా మొదట మదరాసు గెజిట్‌లో ప్రకటించినప్పుడు తన పేరు వేసుకోలేదు - వ్యాసం.

1829 - 'The Verses of Vemana, Moral, Religious and Satirical' - Madras. 1939 పునర్ముద్రితం, తెనుగు కావ్యానువాదం.

1830 (?) - 'Essay on Trade' మద్రాసు గెజిట్‌లో ముద్రించబడింది.

1837 - A Familiar Analysis of Sanskrit Prosody', London. 1839లో లండన్‌లోనే మళ్ళా ఇది ముద్రించబడింది - ఛందో గ్రంథం.

1838 - 'లూకా చేత వ్రాయబడిన శుభవర్తమానము' - మద్రాసు. (లూకా సువార్తకు తెలుగు అనువాదం - క్రైస్తవ మత సంబంధి)

1839-40 - "Essay on the Language and Literature of the Telugus' - Madras (ఈ వ్యాసం మొదట."Madras Journal of Literature and Science'లో రెండు భాగాలుగా 1839, జూలై- అక్టోబర్ సంచికలోనూ, 1840 అక్టోబరు - డిసెంబరు సంచికలోనూ ప్రకటించబడింది. వ్యాసం)

1840 - 'A Grammar of the Telugu Language' Madras 1857లో మద్రాసులోనే మళ్ళా ముద్రించబడింది. వ్యాకరణ గ్రంథం.

1840 (Jan) Essay on the Creed, Customs and Literature of Jangams', MJLS - ఇదే సంస్కరించబడి "Essay on the Creed and Customs of Jangams' అనే పేరుతో "Journal of Royal Asiatic Society'లో 1871లో మళ్ళా ప్రకటించబడింది - వ్యాసం.

1840 (April) -"Notice regarding the sects of Hindu called Tengala and Vadagala - MJLS వ్యాసం

1840 (July) "Notice of Some Roman Catholic Books existing in the Telugu Language' MJLS వ్యాసం

1840 (Oct) "Account of the Basava Purana, the Principal book used as a religious Code by the Jangams' MJLS వ్యాసం

1840 (Oct) "Notice regarding Mss in England - MJLS.

1841 - కుచేలోపాఖ్యానం - ఘట్టుప్రభుని 3 ఆశ్వాసాల కృతి' మద్రాసు (పరిష్కృతం)

1841 - 'నల చక్రవర్తి కథ - రాఘవాచారికృత ద్విపద కావ్యం' - మద్రాసు (పరిష్కృతం)

1841 - "Dialogues in Telugu and English for the use of learners with a grammatical analysis' Madras. ఇది 1853లో మరోసారి మద్రాసులోనే ముద్రించబడింది - వాచకం.

1842 - 'సీతాకల్యాణము, 'గరుడాచలము', తెలుగు యక్షగానములు, మద్రాసు.

1842 - హరిశ్చంద్ర కావ్యం (ద్విపద) - గౌరనకృతి - మద్రాసు. (నవనాథ చరిత్ర నుండి కూడా కొంత భాగం దీంతో కలిపి ముద్రించబడింది - పరిష్కృతం)

1842 - ఆదిపర్వము (నన్నయ ఆంధ్రమహాభారతములోనిది) పరిష్కరణము.

1844 - 'వసుచరిత్ర - రామరాజభూషణుని ప్రబంధం - జూలూరి అప్పయ్య వ్యాఖ్యాన సహితం' మద్రాసు - పరిష్కృతం.

1844 'హైదరు చరిత్ర' మరాఠీ గ్రంథానికి తెనుగు అనువాదం. పరిష్కర్త వేటూరి ప్రభాకరశాస్త్రి. ఆంధ్రపత్రిక (దినపత్రిక)లో వరుసగా 5-3-1944 నుండి ప్రకటించబడింది. 1956లో (Ed నిడుదవోలు వెంకటరావుగారు) గ్రంథం - మద్రాస్

1844 - "Account of the Tribes of Maharatta Brahmins: Translation of Maharatta Documents of the Mackenzie Mss-MJLS.

1847 (Dec.) "On the Numerals of Balaam's name' - Christian Observer, London వ్యాసం

1847 - Translation of the Telugu Introduction to catalogue of Telugu and Sanskrit Mss, in the possession of C.P. Brown - MJLS, 1847, No.33-వ్యాసం

1849 - 'వైజయంతీ విలాసం - సారంగు తమ్మయ్యకృతి. వ్యాఖ్యాన సహితం - పరిష్కృతం.

1849 - 'Memoirs of Hyder Ali and Tippoo Sultan' - Madras. మరాఠీ నుండి లఘువివరణలతో ఇంగ్లీషులోనికి చేసిన అనువాదం

1850 - 'కవి రత్నాకరము (సంస్కృతము-తెలుగులిపి) - మద్రాసు, పరిష్కృతం. 1865లో రెండో ముద్రణ

1850 - 'Cycle Tables of Hindu and Mahomedan Chronology' - Madras.

1851 - 'కీర్తనలు LXVII (చంపూ కావ్యం) - మద్రాసు; క్రైస్తవమత సంబంధి

1851 - 'మనుచరిత్ర - అల్లసాని పెద్దన కృతి. జూలూరి అప్పయ్య వ్యాఖ్యాన సహితం' - మద్రాసు, పరిష్కృతం.

1852 - జిల్లా నిఘంటువు - మద్రాసు

1852 - 'బ్రౌణ్య ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు' మద్రాసు (ఇది 1895లో యం. వెంకటరత్నం గారిచే పరిష్కరింపబడింది. 1974లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారిచే మళ్ళా ముద్రించబడింది.)

1852 - 'బ్రౌణ్య తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు' - మద్రాసు. (ఇది 1903లో మద్రాసులోనే ఎం. వెంకటరత్నం. W.H. Campbell, కందుకూరి గార్ల సంపాదకత్వంలో పరిష్కరింపబడింది. 1966లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్ వారిచే 'బ్రౌణ్య మిశ్ర భాషా నిఘంటువు'తో కలిపి మళ్ళా ముద్రించబడింది.)

1852 - 'నిస్తర రత్నాకరము' - The Jewel Mine of Salvation' - Madras ఇది ఒక అజ్ఞాతకవి చేత వ్రాయబడింది. క్రైస్తవ మత సంబంధమైన పద్యకావ్యం. దీనినే పెంపుచేసి తమిళంలో కూడా ముద్రించారు.

1852 - 'A Catalogue of Irregular Verbs in the English Language' Madras (వ్యాకరణగ్రంథం)

1852 - 'English Translations of the Exercises and documents printed in the Telugu Reader' Madras. (ఈ వాచకం 1865-67 సంవత్సరంలో రెండోసారి ముద్రించబడింది.)

1852 - The Telugu Reader' ఆంధ్ర మార్గదర్శి - తెలుగు రీడరు Madras (ఈ వాచకం కూడా 1865-67లో మళ్ళా ప్రకటించబడింది)

1852 - "Three Treatises on Mirasi Right by F.W. Ellis, Lt. Col Blackburne and Sir Thomas Munro, with the remarks made by the Hon' - Madras. (Court of Directors 1822 and 1824 Edited - Historical)

1852 - 'Vakyavali or Exercises in Idioms; English and Telugu' - Madras (ఇది కూడా వాచకమే)

1853 - సలోమాను లిఖిత హితోపదేశములు. సలోమాను రచించిన సామెతలు - మద్రాసు. (ఇవి సంస్కృత ఛందస్సులో కూర్చబడి తెలుగు లిపిలో ప్రకటించబడ్డాయి - క్రైస్తవ మత సంబంధం)

1853 - 'The Wars of Rajas' - Madras అనంతపురరాజుల చరిత్ర - తెలుగు నుండి ఇంగ్లీషులోనికి అనువదించబడింది.

'The Annals of Handeh Ananthapuram' అనే పేరుతో, ఇది గురజాడ అప్పారావుగారి పరిష్కరణంతో 1920లో మద్రాసులోనే మళ్ళా ముద్రించబడింది.

1853 - 'పౌలు చరిత్ర' - తెలుగు లిపిలో ఉన్న సంస్కృత పద్యకావ్యం. క్రైస్తవ మత సంబంధం - మద్రాసు

1854 - 'బ్రౌణ్య మిశ్రభాషా నిఘంటువు' - మద్రాసు. (ఇది 1903లో మద్రాసులో ఎం. వెంకటరత్నం, W.H. Cambell, కందుకూరి గార్ల సంపాదకత్వంలో పరిష్కరించబడింది.

1966లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు వారిచే 'బ్రౌణ్య తెలుగు- ఇంగ్లీషు నిఘంటువు'తో కలిపి తిరిగి ముద్రించబడింది)

1855 - 'తాతాచారి కథలు' (తెలుగు)లో - మద్రాసు (1926లో గురజాడ అప్పారావుగారు దీనిని పరిష్కరించి మద్రాసులో ప్రకటించారు. 1951లో మళ్ళా ముద్రించబడింది. 1974లో 'బంగోరె' గారిచే మద్రాసులోనే మరోసారి ప్రకటించబడింది.)

1855 - 'మిరాశీవాదము' - మద్రాసు (ఇది తెలుగులో రచింపబడి, ఇంగ్లీషులోనికి అనువాదం చేయబడింది)

1855 - 'English and Hindustani Phraseology or Exercises in idioms English and Dakshini Hindustani - Madras (వ్యాకరణ గ్రంథము)

1859 - 'The Experience of A Nicholas' (Edited in English Verse) - London క్రైస్తవ మత సంబంధం.

1861 - 'A Titular Memory' - London (ఇది చారిత్రకం. ప్రస్తుతం అలభ్యం. దీనిని డా॥ వీరభద్రరావుగారు పేర్కొన్నారు. చూ॥ సి.పి. బ్రౌన్ పు.260

1863 - Carnatic Chronology' - London (ఇది కూడా చారిత్రకమే)

1864 (July) 'Telugu Spells' MJLS, కడప క్రిమినల్ డాక్యుమెంటులకు - తెలుగు నుండి ఇంగ్లీషు అనువాదం.

866 - Some Account of the Literary Life of Charles Philip Brown' - London (Revised Edition - London, 1872) దీనిని నిడుదవోలువారు తెలుగులోకి అనువాదం చేసి 1963 మే నెల భారతిలో ప్రకటించారు - స్వీయచరిత్ర

1871 - On Malabar, Coramandal, Quilon, etc. J.R.A.S., London

1871 - Essays on the Creed and Customs of Jangams, J.R.A.S., London

1909 - 'Popular Telugu Tales' by Tatachari Madras. (ఇది తాతాచారి కథలకు ఇంగ్లీషు అనువాదం)

1953 - 'వాణీ విలాస వనమాలిక' (టేకుమళ్ళ రంగసాయి)కు ఇంగ్లీషు వ్యాఖ్యానం, మద్రాసు

1967 - 'Verses of Vemana in the Telugu Original with English Renderings' A.P. Sahitya Academy. 1977లో పునర్ముద్రితము

1973 - 'Sumati Satakam' in the Telugu Original with English Renderings by C.P. Brown - A.P. Sahitya Academy (ఈ తెలుగు కావ్యానువాదానికి సంపాదకుడు డా॥ సి.ఆర్. శర్మగారు)

అముద్రితాలూ, వివరాలు తెలియనివీ

అప్పకవీయం - ఆంగ్లానువాదం

'అమరకోశము' (సంస్కృతం) - తెలుగు వ్యాఖ్యాసహితం - ఈ పరిష్కృత గ్రంథం మద్రాసులోనే ముద్రించబడింది. కాని కాలం ఎప్పుడో తెలియదు.

'అహల్యా కథ' - పద్మపురాణంలోనిది ఆంగ్లానువాదం - అముద్రితం

'అహల్యా వృత్తాంతం' - దశావతార చరిత్రలోనిది - ఆంగ్లానువాదం - అముద్రితం.

'కవిజనాశ్రయం' - ఆంగ్లానువాదం

'కవిశిరోభూషణం' - ఆంగ్లానువాదం

'పదనిధి' (D.1385) - ఈ నిఘంటువు 1841లో వ్రాయబడింది. అముద్రితం.

'ప్రభులింగలీల' - ద్విపదకావ్యం (3వ ఆశ్వాసంలోని ఒక భాగానికి చేసిన ఇంగ్లీషు అనువాదం)

'బాలసరస్వతీయం' - ఇంగ్లీషు అనువాదం

'భగవద్గీత' (సంస్కృతం) - తెలుగు లిపి
(ఈ పరిష్కృత గ్రంథం మద్రాసులో ప్రచురించబడింది. కాలం ఎప్పుడో తెలియదు).

'రేఫఱకారవచ్ఛబ్ద జ్ఞాపక లోకోపకారము' - (R.597, R.1209, D.2154) అముద్రితం.

'A summary of and an Explanatory note in English on Vanivilasa Vanamalika (a Telugu metrical encyclopaedia of Hindu Literature) of Tekumalla Rangasai' - ఇది ప్రచురణ వివరాలు తెలియని వ్యాసం.

'Common Prayer Book' - ఇది మద్రాసులో ముద్రించబడింది. కాలం ఎప్పుడో తెలియదు. క్రైస్తవ మత సంబంధం.

ఏది చేసినా పకడ్బందీగా చేసే దొరగారు 'జిల్లా నిఘంటువు' అనే గ్రంథాన్ని చాలా జబ్బుగా, నీరసంగా రచించి అచ్చువేశారు. రెవిన్యూ బోర్డువారు ఇందులో లోపాలను ఎత్తి చూపారు. దొరగారు క్షమాపణలు చెప్పుకున్నారు. ఇంతటి పేలవమైన జబ్బు రచన చేయడానికి బహుశా వారికి నిజంగా జబ్బు చేయడమే కారణం కావచ్చు. 1853 ఏప్రిలు 16వ తారీఖున ఆయనకు పక్షవాతం వచ్చింది. వైద్యులు మద్రాసులో ఉండరాదన్నారు. నీలగిరి కొండలకు వెళ్ళమన్నారు. లోగడ చాలాసార్లు 1845లో, 1848లో చాలా జబ్బుపడి కోలుకొన్నారు. 1849లో గుర్రంమీంచి కిందపడి పక్క యెముక, కుడి బొటనవేలు విరుచుకున్నారు. రచయితకే కాక మానవునికి కుడి బొటనవేలు లేకపోతే బతుకులేనట్టే. సరిగ్గా ఈ సమయంలోనే దొరగారి నిఘంటువులు అచ్చు అవుతున్నాయి. మొండిఘటం కనుక దొరగారు ఎడమచేత్తో రాత అలవర్చుకొని నిఘంటువు ప్రూఫులను వామహస్తంతోనే దిద్దారు. మిగతా రుగ్మతలు వేరు, పక్షవాతం వేరు. అందుచేత దొరగారు తమ యాభై అయిదోయేట వైద్య సలహాను పాటించి ఉదకమండలానికి వెళ్ళారు.

నీలగిరి శీతల వాతావరణం ఉపశమనంగా ఉంది. తిమురు వాయువురోగం తిరుగు ముఖం పట్టింది. పూర్తిగా కోలుకొన్నారు. నీలగిరిలో ఒక క్రైస్తవ కుటుంబం వారి అతిథిగా ఉన్నారు. తమ సాహిత్యా జీవిత చరిత్రను రాసుకొన్నారు. Lanx Satura May 1853 అని మొదటలో పేరు పెట్టినా C.P. Brown Oothacamand Memoranda June 1853' అని దొరగారు దీనికి శీర్షిక పెట్టారు. దీని ప్రతి ఇంగ్లండులోని ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో ఉంది (EUR-C-65)

అర్ధంతరంగా వచ్చిన అర్ధాంగరుగ్మత నయమయ్యాక బెంగుళూరు, మైసూరు, శ్రీరంగపట్టణాల పర్యటన చేశారు. 1854లో మద్రాసుకు తిరిగి వచ్చారు. ఆరోగ్యం మళ్ళా దెబ్బతినడం మొదలైంది. ఇంగ్లండులో ఉన్న దొరగారి తోడబుట్టు పడచులు స్వదేశానికి వచ్చెయ్యమని ఉత్తరాలు రాశారు. 1854 మే ఒకటవ తారీఖునాడు సర్వీసు నుంచి రిటైరు అవడానికి నిశ్చయించి రాజీనామా చేశారు. 1838లో సీమనుంచి తిరిగి వచ్చాక మరో పదిహేడు సంవత్సరాలు చెన్నపట్నంలో కుంఫిణీ వారి కొలువులో పని చేశారు. సాలీనా 920 పౌన్ల పింఛను సర్కారువారు మంజూరు చేశారు.

ఇంగ్లండుకు వెళ్ళిపోయే ప్రయత్నంలో తమ వద్దనున్న అయిదువేల సంపుటాల యూరోపియన్ సాహిత్య గ్రంథాలను అమ్మకానికి పెట్టారు. కొనేవారే కరువయ్యారు. ఒక్కొక్క సంపుటానికి ఒక షిల్లింగు కన్నా తక్కువ వెల కొనుక్కొనే వారు ఇచ్చారు. దొరగారి దగ్గర బైబిలు సాహిత్యం ఎన్నో సంపుటాలు ఉన్నాయి. వాటినన్నింటిని బైబిల్ సొసైటీవారికి బహూకరించారు. తాము జీతమిచ్చి నేటివుల చేత తెనుగింప చేసిన బైబిలు సంపూర్ణమైంది. తమ నిఘంటువులో మూడవది మిశ్ర భాషా నిఘంటువు కూడా ప్రెస్సునుండి బయటకు వచ్చింది. తాము రచించదలచిన వ్యాకరణ నిఘంటువులు ముద్రితాలయి వెలుగు చూశాయి. కనుక స్వదేశానికి నిశ్చింతగా వెళ్ళవచ్చునని భావించారు. ఈ ప్రయాణపు హడావిడిలో కూడా పుస్తక ప్రచురణ మరచిపోలేదు. తమ దగ్గర రమారమీ ఆస్థాన పండితునిగా, హాస్య చతురునిగా పనిచేసిన తాతాచార్యులు చెప్పిన కథలను గ్రంథరూపంలో ప్రకటించారు. ఇది తెలుగువారికి దొరగారి వీడ్కోలు బహుమతి.

మొత్తంమీద 34 సంవత్సరాలు బ్రౌను దొరగారు కుంఫిణీ సర్వీసులో భారతదేశంలో వున్నారు. రమారమి మూడు దశాబ్దాలు తెలుగు భాషా సారస్వతాలకే జీవితాన్ని అంకితం చేశారు. వివిధ కాలాలలో వివిధ పండితులచేత లభించినన్ని తెలుగు కావ్యాలకు తీర్పు ప్రతులు, టీకలు, వ్యాఖ్యానాలు చేయించారు. తాము చేయించిన ఈ సాహిత్య కార్య ఫలితాలను చెన్నపట్నంలోనే భావితరాల కోసం ఇచ్చిపోయారు. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో మొత్తం 206 సంపుటాలలో వారి రిమార్కులున్న గ్రంథాలున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తు, వారు 17 పెద్ద సంపుటాలలో సేకరించి భద్రపరిచిన లేఖలు, అర్జీలు మరొక ఎత్తు. తెలుగు ప్రజలలో వివిధ వర్గాల వారి నుంచి, వివిధ అంతస్తుల, మతాల, హోదాల వ్యక్తుల నుంచి సంపాదించిన ఈ పత్రాలు మొత్తం 1591 ఉన్నాయి (M.417 నుంచి M.431 దాకా ఉన్న 15 సంపుటాలలో పత్రాల సూచికను నేను తయారుచేయించాను). ఈ లేఖలవల్లనే దొరగారి జీవితాన్ని ఇంతకన్నా విపులంగా పునర్నిర్మించవచ్చు. కోరిక ఉన్నా అందుకు తీరిక కావాలి.

కేవలం పుస్తకాల వల్ల జీవద్భాషను నేర్చుకోలేమని దొరగారికి తెలుసు. ప్రజా జీవనాన్ని మించిన పాఠశాల లేదు. అందుకే రాజులూ, రైతులూ, పండితులూ, పామరులూ, వాదులూ, వకీళ్లు, వైద్యులు, వేటగాళ్లు, వర్తకులు, వాడకళాసీలు - ఒకరేమిటి అన్నివర్గాల వారి భాషనూ ఆయన అధ్యయనం చేశారు. అందుకే తమ బట్లరు, గుర్రపువాడు, దర్జీ మేస్త్రి,

కంపోజిటర్లు, బీరు డిపార్టుమెంటు మేస్త్రి, బుక్కు బైండర్లు మొదలైనవారందరూ రాసిన ఉత్తరాలను దొరగారు భద్రం చేశారు. తెలుగు ప్రజలంతా తనకు చదువు చెప్పిన గురువులే అని దొరగారు కృతజ్ఞతలు చెప్పుకొని స్వదేశానికి తిరిగి వెళ్ళారు.

కడసారి ఇంగ్లండులో

భౌగోళికంగా భారతదేశాన్ని విడిచి వెళ్ళినా బ్రౌను దొరగారు మానసికంగా ఎన్నడూ ఆంధ్రభాషా సాహిత్యాలను విస్మరించలేదు. పైగా స్మరించని దినమన్నది లేదని చెప్పుకోవచ్చు. ఆయన 1855 ఏప్రిలు నెలలో ఇంగ్లండుకు వెళ్ళిపోయినా మరో మూడు దశాబ్దాలపాటు తమ దేశంలో ఆరోగ్యవంతులై జీవించారు. తమతోపాటు తీసుకువెళ్ళిన తమ గ్రంథాలను కొన్నింటిని తిరగరాశారు. తమకు అంతకు ముందు అలభ్యమైనవీ, అధ్యయనం చేయనివీ తెలుగుకు సంబంధించిన పుస్తకాలు ఏ భాషలో వున్నా సంపాదించి, కొన్ని సొంత ద్రవ్యంతో కొని ఆసాంతం చదివి విశ్లేషణ చేశారు. చెప్పవలసిన వాటిని నిస్సంకోచంగా, నిర్దాక్షిణ్యంగా, నిక్కచ్చిగా గ్రంథస్థం చేశారు.

బ్రౌను దొరగారు ఇంగ్లండులో తాము జీవించిన ముప్ఫయి సంవత్సరాలలో ఎప్పుడు ఏయే సాహిత్య కార్యక్రమాలు చేపట్టినదీ తమ పుస్తకాలలో తారీకులతో సహా తెలియచేశారు. ఈ గ్రంథాల ఇరవైవేల పుటల పాఠాలను మైక్రోఫిల్ముల మీదకు ఎక్కించి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని 'బ్రౌను రీసెర్చి ప్రాజెక్టు' వారు తెప్పించారు. నేను 1983లో ఇంగ్లండుకు వెళ్ళినప్పుడు మూడు వారాలు ఇండియా ఆఫీసు లైబ్రరీ వారి పఠన మందిరంలో, బ్రౌను దొరగారి గ్రంథ సంచయంలో ఆసక్తికరమైన వాటిని పరిశీలించి నోట్సు రాసుకున్నాను. నేను స్వయంగా తెలుసుకొన్న విషయాలనే కాలక్రమానుసారం కింద పొందుపరుస్తున్నాను.

లోగడ ఆరోగ్యం కోసం నీలగిరిలో వున్నప్పుడు రచించిన తమ ఆత్మకథ Lanx Satura 1857లో దొరగారు తిరగ రాశారు. (EUR-B-56) ఇందులో చెప్పిన కొత్త విషయాలను పాత ప్రతితో తులనాత్మకంగా పరిశీలించిగాని తెలుసుకోలేము.

అది ఆంధ్రదేశం కానివ్వండి, ఆంగ్లదేశం కానివ్వండి. పుస్తకాల కోసం దొరగారు గాలించని ప్రదేశముండదు. లండన్‌లో ఒక పుస్తకాల షాపులో ఒక అపురూపమైన వ్రాతప్రతి లభించింది. ఇది పరాను ఫాదిరీలు తెలుగు భాషను ఫ్రెంచిలో బోధపరుస్తూ రచించిన నిఘంటువు. దీనిని దొరగారు కొన్నారు. ఈ గ్రంథాన్ని ఆ ఫాదిరీలు 1720-1730 ప్రాంతాలలో రచించారు. తెలుగును 'బడగ' అని పిలిచేవారు. 1860లో దొరగారు ఈ నిఘంటువును శ్రద్ధగా పరిశీలించి ఇందులో కనబడ్డ కొత్త ప్రయోగాలను గుర్తించారు. తాము 1852లో ప్రచురించిన తమ నిఘంటువులోనికి ఈ నూతన ప్రయోగాలను ఆగస్టు మాసంలో ఎక్కించారు. రిమార్కులు రాశారు. (EUR-F-70)

తెలుగు భాషా సాహిత్యాల మీద పరమ ప్రామాణికులు గనుక బ్రౌను దొరగారికి గ్రంథకర్తలు భారతదేశం నుండి తమ నూతన ప్రచురణలను [illegible]పించేవారు. 'మద్రాసు

ఇంజనీరింగు కాలేజీలో మున్షీగా ఉన్న ఎం. లక్ష్మీనరసయ్య తన ఉత్తమాకాంక్షలతో అభినందనలు 1861 జూలై రెండవ తారీఖునాడు తాను రచించిన తెలుగు గ్రామరు పుస్తకాన్ని బహూకరిస్తూ పంపించాడు. దొరగారు దీనిని చదివి విమర్శించారు. 'ఈ వ్యాకరణం ద్వారా ఎవ్వరూ భాషను నేర్చుకోలేరు' అని తొలిపేజీలోనే దొరగారు తీర్పు రాశారు. లోపల పుటలలో 'చిట్టచివరకు గోతిలో పడవేసే అడ్డదారులలో ఇదొకటి. అయ్యవార్లవారి నట్టిల్లు ఎంత స్పష్టంగా వుంటుందో ఈ గ్రంథం కూడా సర్వశూన్యమై స్పష్టంగా ఉంటుంది' అనే అర్థం వచ్చే రిమార్కులు ఇంగ్లీషులో రాశారు. ప్రతి పుటలోనూ కాకపోయినా చాలాచోట్ల ఈ విమర్శలు రాశారు. పదమూడవ పుటలో 'ఇతగాడు కళ- ద్రుతములు విడిచిపెట్టాడు. విలియం బ్రౌను, విలియం కేరీ కూడా అంతే. శానామంది బ్రాహ్మణులకు ఈ అంశాలు అవగాహన కావు' అని రాశారు (EUR-B-58)

ఇంగ్లండులో విశ్రాంతి చిక్కేదాకా విలియం కేరీగారు 1841లోనే ప్రచురించిన తెలుగు గ్రామరును చదివే అవకాశం బ్రౌను దొరగారికి చిక్కలేదు కాబోలు. 1863లో దీని ప్రతిని ఒకదానిని చదివి 'కేరీగారు ఇందులో శానా కొద్ది సూత్రాలనే చెప్పారు. వాటిలో శానా కొద్ది సూత్రాలే సుబద్ధమైనవి' అని రాశారు. కేరీగారు తమ పుస్తకానికి 'ఎ గ్రామర్ ఆఫ్ తిలింగ లాంగ్వేజి' అని పేరు పెట్టారు. ఈ భాష పేరు 'తెలుగు' కాని 'తిలింగ' కాదు అని బ్రౌను దొరగారు రాశారు.

కేరీగారి బైబిలు అనువాదం గురించి 187వ పుటలో చూడమన్నారు. పుస్తకం చివర 'సమాప్తం' అనే చోట 'ఫినిష్' అన్న చోట 'ఫినిష్ ఆఫ్ కేరీస్ ఎర్రర్స్' 'కేరీ ప్రమాదాలు పరిసమాప్తం' అని దొరగారు రాశారు. పుస్తకం నిండా ఎక్కడెక్కడ కేరీగారు పొరబడ్డారో విశదపరుస్తూ నోట్సు ఉన్నాయి. (EUR-B-57)

బ్రౌను దొరగారి ఆంధ్ర భాషాధ్యయనం వేమన పద్యాలతో ప్రారంభమైంది. జీవితమంతా వేమనగారిపై ఆలోచిస్తూనే ఉన్నారు. 1866లో వేమన పద్యాలపై మేజరు మేగ్డోనాల్డు మద్రాసు జర్నలులో ప్రశంసా వాక్యాలను రాశారు. ఈ సంగతిని నోటు చేస్తూ తమ ప్రతిలో ప్రతి పేజీలోనూ కొత్త నోట్సు దొరగారు రాసుకొన్నారు. సాధారణంగా అందరూ తెలుగులోని వేమన పద్యాలకూ, తమిళంలోని 'తిరుక్కురళ్'కు పోలికలు చూస్తారు. బ్రౌను దొరగారు 'కురళ్' కన్నా 'శివవాక్యం' అనే తమిళ గ్రంథం కొంచెం స్థాయి తక్కువ తమిళంలో ఉన్నా వేమనగారి శైలికి దగ్గర్లో ఉంటుందని రాశారు. తాము మళ్ళా వేమన పద్యాలను అచ్చువేస్తే ఒకే సంపుటంగా వేమన, చౌడప్ప, కాళహస్తి, కోదండరామశతకాలు నాలుగింటినీ ఒకే సంపుటంలో చేరుస్తామని చెప్పారు. ఈ వేమన పద్యాల పుస్తకం చాలా విలువైనది. (EUR-B-1)

భారతదేశంలో ఎన్నో విలువైన పుస్తకాలను విడిచిపెట్టినా స్వదేశానికి వస్తున్నప్పుడు తమతోబాటు దొరగారు తెచ్చుకొన్న గ్రంథాలలో ఒకటి మరీ ముఖ్యమైనది ఉంది. అది తెలుగు తాళపత్ర గ్రంథముల వివరణ పట్టిక. ఈ వ్రాతప్రతి 105 ఫోలియోల గ్రంథం. మొదటి నుంచి 68వ ఫోలియో ఎడమ చేతిపుట దాకా ఇమడలేదు. మరో

సంపుటిలో కూడా చేర్చారు. ఈ రెండు సంపుటాలనూ బ్రౌను దొరగారు 1867 మార్చి 4వ తేదీనాడు డాక్టర్ రీయన్ దొరగారికి ఎరువు ఇచ్చారు. (MSS-TEL D-9) ఇవి సాహిత్య పరిశోధకులు పునఃపరిశీలన చేయవలసిన సంపుటద్వయం. వాటి వివరాలు

బ్రౌను రచనల వివరాలు

అర్జీలు - ఇంగ్లీషు సహా

అర్జీలు - ఇంగ్లీషు సహా - కొంత కన్నడ శబ్దములును

అర్జీలు - డిమ్మి కాగిత పెద్దబుక్కు

అర్జీలు - హైదరుఖాను సుబేదారు వగైరా అర్జీలు - ఇంగ్లీషు సహా.

ఇంగ్లీషు - అరవం డిక్షనేరి. మొదటి వాల్యూం.

ఇంగ్లీషు - తెనుగు డిక్షనేరి. మొదటి వాల్యూం - అ॥

ఇంగ్లీషు - తెనుగు డిక్షనేరి. మొదటి వాల్యూం - కొత్తది

ఇంగ్లీషు - తెనుగు వొకాబ్యులరి బుక్కు

కామెల్ (Campbell's) డిక్షనేరికి మధ్య కాగితములువేసి షరా వ్రాసియుండే జిల్దులు - 23

కాళహస్తి మహత్యం - పద్యకావ్యమునకు ఇంగ్లీషు సూచి

కిర్లంపూడి క్రిమినల్ విచారణం - తెనుగు కిర్లంపూడి పిల్లి చిన్నిగారి కోర్టు విచారణకు ఇంగ్లీషు బుక్కు

కిర్లంపూడి పిల్లి చిన్నిగారి కోర్టు విచారణకు తెనుగు బుక్కు

గ్రామరు - తెనుగు ఇంగ్లీషు కలది 1833 సంవత్సరము పుట్టిన ప్రతి

గ్రామరు - తెనుగు ఇంగ్లీషు కలది. 1834 సంవత్సరము పుట్టిన ప్రతి

గ్రామరు - తెనుగు ఇంగ్లీషు గలది 1836 సంవత్సరము పుట్టిన ప్రతి

గ్రామరు - తెనుగు ఇంగ్లీషు గలది 1837 సంవత్సరము పుట్టిన ప్రతి

గ్రామరు - తెనుగు ఇంగ్లీషు గలది. 1842 సంవత్సరము పుట్టిన ప్రతి.

చంద్రాంగద చరిత్ర - పద్యకావ్యమునకు ఇంగ్లీషు సూచీ.

చిక్కయ కథ - యక్షగానమునకు ఇంగ్లీషు సూచీ

జాన్సన్ డిక్షనేరి మధ్య కాగితములు తగిలించి తెనుగు అర్థం వ్రాసియుండే జిల్దులు - 43

జాబులు - ఇంగ్లీషు సహా.

జాబులు - చిన్న జిల్దులు - 43

డిక్షనేరి - తెనుగు ఇంగ్లీషు. దొరవారు దిద్దినది. జిల్దులు - 43.

తెనుగు - ఇంగ్లీషు డిక్షనేరి. శ్రీ దొరవారు చేసిన జిల్దులు

ప్రభులింగలీలకు ఇంగ్లీషు భాషాంతరము

బసవపురాణం - పద్యకావ్యమునకు ఇంగ్లీషు సూచీ

భండనారాతి భీమ కోదండరామ శతకం
భక్తాంఘ్రిరేణు చరిత నాటకం - యిదే విప్రనారాయణ చరిత్ర చూచుకో.
భగవద్గీతలు - గీ॥ మూలం. తెనుగు టీక
భగవద్గీతలు - గీ॥ మూలం. తెనుగు టీక.
పద్యకావ్యము - అ॥
భగవద్గీతలు. గీ॥ మూలం. తెనుగు టీక. వచనకావ్యం. గీ॥ తా॥
భట్టువాండ్లు రాజులను స్తోత్రం చేసిన పద్యములు
భద్రకాళీ కల్యాణం - యక్షగానం
భద్రరాజపుత్ర చరిత్ర ప.కా.అ.
భద్రాది రామ శతకం
భద్రా పరిణయం. ఇదే ముకుంద విలాసం ప.కా.స॥
భరత లక్షణం ॥గీ॥ తెనుగుటీకతో - అ॥
భర్తృహరీ గీ॥ శ్లోకములున్ను -
తెనుగు పద్యములున్ను - ఇదే సుభాషిత రత్నావళి
భల్లాణ చరిత్ర - ఇదే భల్లాణరాయ చరిత్ర - ప.కా.స.
భల్లాణ చరిత్ర - ద్విపద కావ్యమునకు ఇంగ్లీషు సూచీ
భానుమద్విజయం - పద్యకావ్యమునకు ఇంగ్లీషు సూచీ
మచిలీపట్నం అదాలతు కోర్టు విచారణ - కొంత తెనుగు కొంత ఇంగ్లీషు బుక్కు
మచిలీపట్నం అదాలతు కోర్టు విచారణ, తెనుగు బుక్కు
మచిలీపట్నం ఆగ్జిలేరి కోర్టు సివిల్ విచారణ, తెనుగు బుక్కు
రామాయణం - అరణ్యాకాండ శ్లోకములు ఇంగ్లీషు భాషాంతరము సహా
వాణీ విలాసం - పద్య కావ్యమునకు ఇంగ్లీషు సూచీ
వేదాంత రసాయనం - పద్య కావ్యమునకు ఇంగ్లీషు సూచి
శ్రీ దొరగారు తెనుగు భాష యొక్క స్థితిని ఇంగ్లీషులో వ్రాసినది
సుమతి శతకం - ఇంగ్లీషు భాషాంతరమున్ను కొన్ని కన్నడ అర్జీలున్ను.

పరాసు ఫాదిరీలు ఫ్రెంచి భాషలో రచించిన తెలుగు నిఘంటువును ఒక దానిని ఇంతకు ముందు దొరగారు 1860లో కొన్నారు. మళ్ళా 1865లో ఇంకో ఫ్రెంచి వారి తెలుగు నిఘంటువు దొరగారి దృష్టిలోనికి వచ్చింది. దీని రచనా కాలం ఏమిటో ఎక్కడో రాతలో కనబడదు. అయితే ఈ కాగితాల ప్రతిని బాగా పరిశీలించి కాగితం వాటర్ మార్క్ 1794 కాబట్టి పుస్తకాన్ని ఆ తర్వాత రచించి ఉంటారని దొరగారు పత్తేదారి పని చేసి కూపీలాగారు. దీనిని ఇంగ్లండులో ఇరవైఅయిదు షిల్లింగులు పెట్టి దొరగారు కొన్నారు. తమ నిఘంటువులో చేర్చడానికి ఒక్క నూతన ప్రయోగం కూడా లభించలేదు కాబోలు ''ఇది శుద్ధంగా పనికిమాలిన గ్రంథము'' అని తెలుగులో స్పష్టంగా దొరగారు

రాసిపెట్టారు. ఇది 289 పుటల ఫుల్ స్కేపు పుస్తకం. ఈ గ్రంథాన్ని ఇంగ్లండులో వున్న తెలుగు పరిశోధకులు పరిశీలించారు.[17]

నిఘంటువు, వ్యాకరణాలు రచించే వారికి తమ కృషి నిత్యం కొనసాగించవలసిన కార్యంగానే కనబడుతుంది. పుస్తకాలు ఒక ముద్రణ పూర్తికాగానే దానికి పునఃపరిశీలన చేసి తిరగరాయడం ప్రారంభించాలి. దొరగారు ఇదే చేసేవారు. దీనికి అవసరమైన ఆకరాలు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి.

1857లో ప్రచురితమైన తమ తెలుగు గ్రామర్ ప్రతిలో మధ్య మధ్య ఫారాలులాగ తెల్ల కాగితాలు చేర్చారు. వాటిమీద పెంపుదల నోట్సు రాశారు. ఒక పుటలో 1869లో తమ దగ్గర వున్న పుస్తకాల, పత్రాల వివరగతి పట్టికను పొందుపర్చారు. ఇందులో 15 ఉపయుక్త గ్రంథాల పేర్లు ఉన్నాయి. (EUR-B-53)

తమ తెలుగు గ్రామరు ప్రతిని ఇంకొక దానిని కూడా మూడవ ముద్రణకు సిద్ధం చేశారు. 1869 నవంబరు 5వ తేదీనాడు ఈ సంగతి రాస్తూ 'Entirely in the Hand writing of C.P. Brown' అని స్పష్టపరిచారు. ఇంగ్లండులో తమ గ్రంథాలను కాపీ చేసే వ్రాయసగాళ్ళు కూడా ఉండేవారేమో. (EUR-B-54) 1869లోనే ఇండియన్ సివిల్ సర్వీసులో చేరడానికి తెలుగు అధ్యయనం చేసే ఆంగ్ల యువకులను పరీక్షించే బాధ్యతను దొరగారు స్వీకరించారు. ఈ కుర్రాళ్ళచేత తెలుగు రాయించేవారేమో.

తాము చేసిన తెలుగు గ్రామరు గ్రంథంలోంచే లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా వుంటూ 1868 నుంచీ పాఠాలు చెప్పేవారు. అయితే ఇతర ఆంగ్లేయులు రచించిన తెలుగు గ్రామర్లు కూడా చర్చలోనికి వచ్చేవి కాబోలు. 1870లో మళ్ళా విలియం కేరీగారి వ్యాకరణంపై దొరగారు విరుచుకుపడ్డారు. ''నేను కేరీగారి అజ్ఞానాన్ని ఆడిపోసుకోవడం లేదు. వారి అవివేకం క్షమించదగ్గదే. అయితే ముందూ వెనుకా చూసుకోని వారి వెర్రి తొందరపాటునే నిందిస్తున్నాను... తమ తొలిపలుకులలో కేరీగారు తమకొక తెలుగు పండితుడు సహాయం చేసినట్టు చెప్పుకొన్నారు. పాపం! ఆ మానవుడు నిందకు బాధ్యుడు కాడు.'' ఈ మాటలు 1870లో దొరగారు రాశారు. (EUR-B-57)

కొత్తతరంలోని ఆంగ్లేయులు తెలుగు వ్యాకరణాలను ఇంగ్లీషులో రాస్తూ వున్నారు. ఎ.హెచ్. ఆర్డెన్ 1873లో 'ఎ ప్రోగ్రెసివ్ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజి' అనే గ్రంథాన్ని రచించారు. దీనిని బ్రౌను దొరగారు 1873 ఆగస్టు 15నాడు మొదట చూశారు. ఆ తారీఖును నమోదు చేశారు. 'నా గ్రంథాన్ని ఇతగాడు ఎన్నడూ చూడలేదనుకొంటాను. కొన్ని కొన్ని విషయాల మూలంగా ఈ పుస్తకాన్ని మేస్టర్ షార్కీ రచించి ఉంటాడని నేను భావిస్తాను. ఈ పుస్తకానికి రివరెండు జె.క్లేగారు సహాయం చేసి వుండడం నిజమైతే ఆయన గొప్ప పండితుడు కాడని తెలుస్తూంది.'' ఇటువంటి రిమార్కులతో ఆర్డెన్ వ్యాకరణాన్ని దొరగారు కొట్టి పారేశారు.

1857లో మామిడిపూడి వెంకటకృష్ణమాచార్యులు ఆంధ్రశబ్ద చింతామణిని, బాలసరస్వతీయాన్ని ముద్రించారు. దీని ప్రతి దొరగారు చూశారు. ఇతరుల

17. J.P.L. Gwynn గారు తెలుగు వాణి పత్రికలో దీని గురించి ఒక వ్యాసం రాశారు. సంపుటి-5, సంచిక-4, 1980. ఈ వ్యాస ప్రతిని నాకు గ్విన్‌గారు ఇంగ్లండులో అందచేశారు.

వ్యాకరణాలను విమర్శిస్తున్నప్పుడు తమ వ్యాకరణాల తొలి ముద్రణలు మరొకసారి పరిశీలించి ఉంటారు. 1825లో తాము ఆంగ్లంలోనికి అనువదించిన నన్నయ భట్టీయం, బాలసరస్వతీయం ప్రతులను 1875లో ఆయన మళ్ళా బయటకు తీశారు. 1827లో, 1840లో, 1846లో తాము చేసిన కృషిని నోటు చేశారు. తమ గ్రంథాలలో TE625 నెంబరుగల పుస్తకం బాలసరస్వతీయం అని, దాని 12వ పేజీలో ''గ్రంథకర్త వెంకన్న'' అని ఉన్నట్టు చెప్తూ బహుశా బాలసరస్వతి అసలు పేరు వెంకన్న కావచ్చా? అన్న సందేహాన్ని వెలిబుచ్చారు. (TEL D.8)

ఇంగ్లండులోని ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో లభించే దొరగారి పుస్తకాలలో ఆయన తారీఖులు పేర్కొంటూ రాసిన రిమార్కుల సంగతే ఇప్పటిదాకా కాలక్రమానుసారం కథనం చేశారు. ఇంకా చాలా గ్రంథాలలో వారి విమర్శనాత్మకమైన వాక్యాలు ఉన్నాయి. వీటిని ఇంగ్లండులో ఉన్న మూడు దశాబ్దాల కాలంలో ఎప్పుడు రాశారో తెలియదు. కొన్ని కొన్ని విషయాలు చాలా ఆసక్తికరంగా వున్నాయి.

వాక్యాలలో వివరించిన తెలుగు నుడికారాల గ్రంథం ప్రతి ఒకటి ఇంగ్లండులో ఉంది (MSS EUR-B-63). ఈ వ్రాతప్రతిని తాము 1826లో ప్రారంభించినట్టు నోటు చేశారు. ''ప్రయోగశరణావయ్యాకరణాః' అని చెప్పి 'A Grammar is a record of usages' అనే నిర్వచనం రాశారు.

'లోఘూట్-ఎ-తెలింగ' అనే పేరుతో తెలుగు పారశీక నిఘంటువు ఒకటి ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో ఉంది. ఇది పూర్తిగా పారశీక లిపిలో వున్న గ్రంథం. ముందు ఉపోద్ఘాతంలో తెలుగు అరబ్బీ భాషంత మధురమైనదని చెప్పారు. తెలుగు మాటలను ఎర్ర సిరాతోనూ, పారశీకంలోని అర్థాలను నల్ల సిరాతోనూ రాశారు. ఈ పుస్తకాన్ని దొరగారు చూశారో లేదో తెలియదు. గ్రంథం మీద తారీఖు ఏదీ కనపడదు. నేను లండన్‌లో పరిశోధనలు చేస్తున్నప్పుడు ఈ గ్రంథాన్ని ఆ గ్రంథాలయంలోనే నాలాగ పరిశోధనలు చేస్తున్న ఒక ముస్లిం విదుషీమణి చేత చదివించుకొన్నాను (పుస్తకం నెంబరు 2529). దొరగారు భారతదేశంలో కుంఫిణీవారి పెర్షియన్ ట్రాన్స్‌లేటర్‌గా చాలాకాలం పనిచేశారని గుర్తుంచుకోవాలి.

1884లో దొరగారికి ఎనభై ఆరు సంవత్సరాల వయసు వచ్చింది. తమ జన్మదినానికి ఒక వారం రోజులు ముందుగా ఒక 'ఉయలు' రాశారు. ఇంగ్లండులో తాము గడచిన మూడు దశాబ్దాలలో సేకరించిన ప్రాచీన లిఖిత, ముద్రిత గ్రంథాలలోని తమ నోట్సును ఇండియా ఆఫీసు గ్రంథాలయానికి దానం చేశారు. తాము ఇచ్చిన గ్రంథాలను స్వాధీనపరచుకోడానికి అయ్యే ఖర్చుల మింజుమలె ఒక పది పౌండ్లను కూడా దానం చేశారు. తమ విల్లును అమలు పరచవలసిన వాళ్ళలో ఒకరైన రివరెండు జార్జి బ్రౌనుకు తమ గ్రంథాలయంలో అతనికి నచ్చిన నూరు సంపుటాలను దానం చేశారు. దొరగారి బంధువుల పేర్లూ, వివరాలూ పరిశోధిస్తే తెలుసుకొనడానికి తగినన్ని ఆకరాలు వారి విల్లులోనూ, ఇతర పత్రాలలోనూ ఉన్నాయి.

భారతదేశంలో ఉన్నప్పుడు ఎందరో తెలుగు పండితుల సహాయసహకారాలతో బ్రౌను దొరగారు తెలుగు సాహిత్య జ్యోతిని మళ్ళా వెలిగించారు. స్వదేశానికి వెళ్ళిపోయాక 'అసహాయసూరి'గానే గొప్ప కృషి చేశారు. ఆయన ఇతరులపై రాసిన రిమార్క్కులు చూస్తే ఈయన 'ధిషణాహంకార సంభారదోహలభాషార్ణవ మూర్తి'గా కనబడతారు. తమకు తెలిసినంత తెలుగు ఇంకే ఆంగ్లేయునికీ తెలియదని ఆయన నమ్మకం. ఆంగ్లేయులకే కాదు బహుశా ఆంధ్రులకు కూడా తెలియదేమో.

మరణశాసనాన్ని రాసిన అయిదు వారాల తర్వాత తమ ఎనభైఆరోయేట బ్రౌను దొరగారు కీర్తిశేషులయ్యారు. మరణించిన వారందరూ కీర్తిశేషులు కారు. చరితార్థులు మాత్రమే ఈ పదానికి అర్హులు. తెలుగును బతికించిన ఆయన చిరస్మరణీయులు.

మన భాషా సాహిత్యాల కోసం ఇంతటి మహత్తర కృషిని చేసిన బ్రౌను దొరగారి జ్ఞాపకార్థం మనం ఏమేమి చేశామన్నది వేసుకోవలసిన ప్రశ్న. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు 1963లో డాక్టర్ కొత్తపల్లి వీరభద్రరావు గారిచేత 'సి.పి. బ్రౌన్ (1798-1884)' అనే జీవిత చరిత్రను రాయించారు. దీనిని వీరభద్రరావుగారు అమెరికాలో విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో వుంటున్నప్పుడు రచించారు. చాలా ముద్రిత గ్రంథాలను సంప్రదించారు కానీ, మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్న వ్రాతప్రతుల సంపుటాలను చూడలేకపోయారు. అందుకే ప్రయత్నం ఎంత ప్రాథమికమో ఫలితం కూడా అంత ప్రాథమికంగానే పరిణమించింది.

అయితే, ఈ గ్రంథంలో డాక్టర్ వీరభద్రరావు గారు రాసిన ''తెలుగు ప్రజలు - బ్రౌను దొర'' అనే అధ్యాయం చాలా చక్కని ప్రణాళికతో రాశారు. బ్రౌన్ దొరగారి 1591 లేఖల పత్రాల సంపుటాలను వీరభద్రరావుగారు చూసివుంటే చెప్పుకోదగ్గ గ్రంథమే ఈ శీర్షికలో వ్రాయగలిగి వుండేవారు.

తెలుగు భాషా సమితివారు తయారుచేయించిన విజ్ఞాన సర్వస్వం మూడవ సంపుటిలోని అక్షరాది సూచిలో బ్రౌన్ పేరే లేదు! సంగ్రహాంధ్ర విజ్ఞానకోశంలో కూడా బ్రౌన్ జీవిత చరిత్ర ప్రత్యేకంగా లేదు. భాషా సమితి పునః సంశోధిత ప్రతిలో అయిదుసార్లు బ్రౌన్ పేరు అకారాది సూచికలో కనబడుతుంది.

తెలుగు విశ్వవిద్యాలయం వారు తమ విజ్ఞాన సర్వస్వ కేంద్రం ద్వారా 1988లో ప్రచురించిన తెలుగు సంస్కృతి - 2వ సంపుటంలో బ్రౌను దొరగారి జీవిత విశేషాలు చేర్చారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో డాక్టరేటు పట్టాకోసం ఆర్. పద్మావతిగారు ఒక సిద్ధాంత గ్రంథాన్ని రచించారు. 'బ్రౌను-తెలుగు కావ్య సముద్ధరణము' అనే ఈ గ్రంథం 1986లో ప్రచురితమైంది. ఈ గ్రంథానికి 'అభినందన'గా ముందు మాట రాస్తూ 'నిజానికి బ్రౌను సాహిత్యాన్ని గురించి, అతని జీవితాన్ని గురించి పరిశోధించడానికి కనీసం పదిమంది పరిశోధకులు చేపట్టతగినంత సామగ్రి ఉంది' అని ఆచార్య జి.ఎన్. రెడ్డిగారు చెప్పారు. ఇవి అక్షర సత్యాలు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు మాత్రం చెప్పుకోదగ్గ కార్యక్రమాన్ని చేపట్టారు. సి.పి. బ్రౌన్ రిసెర్చ్ ప్రాజెక్టు అనే పథకాన్ని రూపొందించి ఈ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బ్రౌన్ గ్రంథాలను నాలుగింటిని ప్రకటించింది. లండన్‌లోని ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో వున్న బ్రౌనుకు సంబంధించిన పత్రాలనూ, పుస్తకాలనూ మైక్రో ఫిలింమీద ఎక్కించి, తెప్పించింది. ఇవి ఇరవైవేల పుటలలో వున్న ఆకరాల గనులు. ఈ భోగట్టాలన్నింటినీ ఓపికతో పరిశీలించి బ్రౌన్ సమగ్ర సాహిత్యసేవను అంచనా వేయకుండానే ఈ ప్రాజెక్టు నిలిచిపోవడం దురదృష్టకరం.

బ్రౌను గురించి చెప్పుకొనేటప్పుడు బంగోరె గురించి చెప్పుకొనక తప్పదు. అతనికి బ్రౌన్ పిచ్చి నావల్లనే సంక్రమించింది. 'బ్రౌన్ జాబులు - తెలుగు జర్నలిజం చరిత్ర' అనే చిన్న సంకలనాన్ని నాకు కూడా అంకితమిస్తూ 'బ్రౌన్ గురించి పరిశోధించవలసిన సోర్సెస్ చాలా వున్నాయంటూ తనకు తెలియకుండానే నన్ను ఈ కృషికి పురిగొల్పిన' వాడుగా నన్ను పేర్కొన్నాడు. ఇది 1973లో జరిగింది. బంగోరె దీక్షగా పరిశోధనలు చేసినా దక్షత లోపించడంవల్లా, నిగ్రహం కోల్పోయినందువల్లా ప్రాజెక్టును పూర్తిచేయలేకపోయాడు. అయితే రాకాసి పట్టుదలతో మౌలికమైన పరిశోధనలు చేసి బ్రౌన్ సాహిత్య స్వీయ చరిత్రను ఎడిట్ చేసినందుకు అతన్ని ఎంతగా మెచ్చుకోవాలో, అతని అకాల బలవన్మరణానికి అంత బాధపడాలి. బ్రౌన్ విషయంలో అతడు చేసినవీ, చేయనివీ, చేయకూడనివీ, చేయవలసినవీ ఎన్నో అతనికే చాలాసార్లు చెప్పాను. అంతటి దీక్షతో పరిశోధనలు చేసేవాళ్ళు ఇప్పుడూ, ఎప్పుడూ మనకి కావాలి. చేయవలసినది అశేషం, చెప్పవలసినది ఎప్పుడూ సశేషం.

'బ్రౌణోచ్ఛిష్టం జగత్సర్వం' అనే వ్యాసంలో నిడదవోలు సుందరేశ్వరరావుగారు ఎంత రాసినా మిగిలిపోయేది ఎంత చెప్పినా తనివి తీరనిది బ్రౌన్ కథ' అన్నారు.[18]

నిజమే మరి.

18. కడప జిల్లా రచయితల ఎనిమిదవ మహాసభలు, సి.పి. బ్రౌన్ - వేమన సంస్మరణ సంచిక, 1984.

కొందరు పండితులూ, గ్రంథకర్తలు

సమాజంలో చారిత్రకమైన మార్పులు సంభవించినప్పుడు వాటికి అనుగుణమైన తీరులోనే రచనాప్రక్రియలు మారుతూ ఉంటాయి. పద్యకావ్యాలూ, శతకాలూ మొదలైన సంప్రదాయానుసారమైన రచనలకన్నా వినూత్నమైనవి చేయవలసిన అవసరం కుంపిణీ యుగంలో ఏర్పడింది. అందుకు తగినట్టుగానే చాలామంది పండితులు తెల్లవారి పరిచయం వల్ల నిఘంటువులూ, వ్యాకరణాలూ, వాక్యగ్రంథాలు మొదలైనవి రచించారు. ఈ యుగంలోనే కొందరు పండితులు ఏయే గ్రంథాలు రచించారో తెలుసుకోనడం ఆవశ్యకం.

మామిడి వెంకయ్య (1764–1834)

పాశ్చాత్య పద్ధతులలో ఆధునిక ప్రణాళికతో అకారాది తెలుగు నిఘంటువును రచించిన మొదటి ఆంధ్రుడు మామిడి వెంకయ్యగారు. క్రీ.శ.1764లో పాలకొల్లులో జన్మించారు. అప్పుడా గ్రామం వాణిజ్య కేంద్రం. వెంకయ్యగారు జన్మతః వైశ్యులే అయినా ప్రవృత్తిచేత విద్యాన్వేషణలో ఉన్నవారు. జన్మస్థానంలో తాము కోరుకొనే జ్ఞానాభివృద్ధి జరగదని మచిలీపట్నానికి మకాం మార్చుకొని అక్కడే ఎనలేని కృషి సల్పారు. సంస్కృతాంధ్ర భాషలలో అపారమైన ప్రజ్ఞను సాధించారు. మేధావి, కోవిదుడు, వేదశాస్త్ర పారంగతుడు అయిన వెంకయ్యగారు అమరకోశానికి వ్యాఖ్య రచించారు. 'బాలామర' బిరుదును పొందారు. ఉత్తరోత్తరా సాహిత్య చక్రవర్తి అనే ఖ్యాతి కూడా వచ్చింది. శబ్దకల్పతరువు, ఆంధ్రదీపిక, ఆంధ్రలక్షణం, పర్యాయరత్నమాల, అలఘురేఫలక్షణం, వెంకయ్య వ్యాకరణం, సశేషామరకోశం అనే గ్రంథాలను రచించారు.

వెంకయ్యగారు చేసిన ఆంధ్రదీపిక కాలానుగుణ్యమైనది. దీని ప్రయోజనాన్ని తెల్లదొరలు గుర్తించారు. దానిని వెంకయ్యగారు 1805 నాటికి సిద్ధం 'చేస్తున్నారు'. శాలివాహనశక వర్షములు 1729 అక్షయనామ వైశాఖ పూర్ణిమనాడు, అనగా క్రీ.శ.1806 మే 7వ తేదీనాడు గ్రంథం సంపూర్ణం చేశారు. దీని ప్రాశస్త్యాన్ని గుర్తించి కలకత్తాలోని ఫోర్టు విలియం కాలేజీవారూ, చెన్నపట్నంలోని కుంఫిణీ వారు దీని హక్కులు పుచ్చుకొనడానికి ప్రయత్నించారు. 1812లో చెన్నపట్నంలోని కాలేజీ బోర్డువారు ఈ నిఘంటువును కొని అచ్చువేయదలచారు. తమ గ్రంథ ప్రచురణలలో ఇదే మొదటిదిగా చేయాలనుకొన్నారు. 1813లో వెయ్యి పూలవరహాలు ఇచ్చి కాపీరైటు కొనుక్కొన్నారు.

వెంకయ్యగారు తమకు నగదుకాక భూవసతిని ఇవ్వమనికోరాడు. గాని కుంపిణీవారు భూములన్నీ జమీందారులవని సాకు చూపించి తప్పుకోచూశారు. వెంకయ్యగారికి రూల్సు బాగా తెలుసు. భూములు జమీందారులవైనా అవసరమొచ్చినప్పుడు వాటిని స్వాధీనం చేసుకొనే హక్కులతోటే పెర్మనెంటు కవుళ్ళను ఇచ్చిన వైనాన్ని గుర్తు చేశారు. ఆంధ్ర దీపికతోపాటు తాము చేసిన 'శబ్దార్థ కల్పతరువు' అనే సంస్కృత నిఘంటువును కూడా బేరానికి పెట్టారు. కుంఫిణీవారు ఒక్క 'ఆంధ్రదీపిక'నే కొనదలిచారు. కాలేజీ బోర్డు తరపున ఎ.డి. కాంబెల్ దొరగారు ఉత్తరాలు రాశారు.

వెంకయ్యగారు వేయిపూల వరహాలకు తమ గ్రంథాన్ని అమ్మక తప్పలేదు. 1814 మే 7వ తేదీనాడు ఒడంబడిక రాసుకొన్నారు. ఆ ఒడంబడికలో ఆయన కొన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు.

''నేను నా స్వకీయ కావ్యమును గురించి యచ్చువేయవలయునది లేదు. అచ్చు వేయించవలయుననియు లేదు. అయితే నేనేనియు, నా వంశస్థులేనియు నీ పుస్తకమును జూచి మరియొక పుస్తకమును వ్రాయించి మనమునకు దోచునట్టి వానికీయవచ్చును.''

ఈ షరతు ఆంధ్రదీపికను బతికించింది. నిఘంటువును కొన్నారేగాని దాని రెండు సంపుటాలను కుంఫిణీవారు అచ్చువేయలేదు. దాన్ని ఆధారం చేసుకొని కాంబెల్ దొరగారిచేత ఇంకో విస్తృత నిఘంటువును రాయించదలిచారు. వెంకయ్యగారు తమ ప్రతికి పుత్రికలు పుట్టించి కోరిన వారికి ఇచ్చారు. సి.పి. బ్రౌను దొరగారు తాము మచిలీపట్నంలో ఉన్నప్పుడు దీనికి ఒక పుత్రికను పుట్టించి తమ గ్రంథాలయమందు పెట్టుకొన్నారు. అది నేడు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది (D.1333). దీనిని బ్రౌను దొరగారు 1824 ఆగస్టు 12వ తేదీనాటికి రాయించుకొన్నారు. కూలంకషంగా పరిశీలించి విశ్లేషణ చేశారు.

ఆంధ్రదీపిక ప్రారంభ భాగంలో వెంకయ్యగారు ఒక చిన్న వివరణలాంటి వ్యాకరణం రాశారు. ఉచ్చారణ భేదాలను సూచించడానికి అక్షరాలపై ౧, ౨, 3, ౪ అనే తెలుగు అంకెలను వేసేవారు.

తాలవ్యములైన చకార జకారముల మీద	(౧)
దంత్యములైన చకారజకారముల మీద	(౨)
రేఫమీద	(౧)
శకట రేఫ మీద	(౨)
సంస్కృత 'థ' కారంపైన	(౨)
ధకారము మీద	(౪)

కుంఫిణీ యుగంలో మొదలైన ఈ అక్షరాల మీద అంకెలు ఒక్క దంత్యాల పైన ౨ గుర్తుపెట్టడం అనే సంప్రదాయంగా తరువాత ఎన్నో తరాల దాకా వచ్చింది. ఇప్పటికీ ఈ రెండంకె రంకె వేస్తూనే ఉంది.

బ్రౌను దొరగారు పరిశీలించిన ఎన్నో కావ్యాల వ్రాత ప్రతులలో ఎక్కడా శకటరేఫ కనబడలేదు. అందుచేత దాని అవసరం తెలుగు భాషలో లేదని గుర్తించారు. మన భాషలో ఉన్నట్టే పాశ్చాత్య సాహిత్యంలో కూడా పట్టింపులు ఉండేవని ఆయనకు తెలుసు. 'ఆంగ్లోశాక్జనులు' పూర్వం ఒక రకమైన 'ర'కారం ఉచ్చరించేవారు. దానికి లాటిన్ 'ర' కారం ఉన్న పదాలకు ప్రాస చెల్లదని పోపు, డ్రైడన్‌ల కవిత్వాలే అసాధువులనీ, వాళ్ల అజ్ఞానులనీ పాశ్చాత్య విమర్శకులు తేల్చడం బ్రౌను దొరగారు గమనించక పోలేదు. ఆంధ్రదీపికలో వెంకయ్యగారు శకటరేఫ గురించి ఇలా రాశారు.

''ఇప్పుడు వాడికగా ఏల వ్రాయడము లేదంటే ఏ శబ్దమందు రేఫయుండవలెనో ఏ శబ్దమందు శకటరేఫ యుండవలెనో విభజన చేసి వ్రాయడము ప్రయాస గనుకను, పరీక్ష లేకపోయినందుకును, అశ్రద్ధ చేతను వ్రాయడము లేకపోయినది. ఇప్పుడున్ను కవిత్వం వ్రాయవలసి వచ్చితే అపుడు విమర్శించి విభజనగా చెప్పబడుచున్నది. ఈలాగునకే ఈ అర్ధ బిందువులన్నూ వాఁడు, వీఁడు, నాఁక, లేఁక, దాఁక మొదలైన శబ్దము లందు నోట పలుకుచూ నుండిన్ని పరీక్ష లేకపోవడము చేతను అనాస్థచేతను వ్రాయడము లేకపోయినది. ఈ భాషయందే గాకుండా సంస్కృతమందున్ను తవర్గద్వితీయ వర్ణమైన 'థ' కారము అనాస్థచేతను ఆంధ్రమందు శకటరేఫము వలెనే వ్రాయడము లేకపోయినది.'' (D.1313, p.7 a)

వెంకయ్యగారు తమ కాలానికే వాడుకలో లేవన్న బండిరాలను, అరసున్నలను ఉత్తరోత్తరా గ్రాంథికవాదులు రెక్కపట్టుకొని తీసుకువచ్చి గ్రంథాలలో చొప్పించారు. వెంకయ్యగారికి గ్రామ్యాల గురించి తెలుసు. ''శాస్త్రశిక్షకు రాక న్యూనాధిక వర్ణంబులుగల శబ్దంబు గ్రామ్యంబులవియే యపశబ్దములు'' అని సూత్రీకరించారు.

బ్రౌను దొరగారి 'ఆంధ్రదీపిక' ప్రతిలో 638 పుటలు ఉన్నాయి. సగటున పుటకు 32 మాటలున్నాయి. అంటే ''గ్రంథం మొత్తం మీద 21,416 మాటలు ఉండాలి'' అని లెక్కకట్టి 'అబ్బో! అన్నా? అసంభవం'' అని దొరగారు రిమార్కు రాశారు. మెరవడి, అలవోక, కొసరు, విడ్డూరం అనే పదాలకు కష్టం కాబట్టి అర్థాలు వెంకయ్యగారు ఇవ్వలేదని గుర్తించారు.

''మామిడి వెంకయ్యగారి పాండిత్యంపట్లా, శ్రద్ధపట్లా గల గౌరవంవల్లనే నేనీ విమర్శ చేశాను. పుట్టుకవల్ల, పరిస్థితులవల్ల బందరులో దుకాణదారుడుగా ఉండే వ్యక్తికి యింత పాండిత్యం ఉందంటే అది ప్రత్యేకంగా కొనియాడదగ్గది'' అని దొరగారు మెచ్చుకొంటూ వెంకయ్యగారి శబ్దార్థకల్పతరువును కొనకపోయినా కుంఫిణీవారు వాడుకొనడం గమనించారు. ఈ విషయాన్ని తమ సంపుటాలలో రాసిపెట్టుకొన్నారు. ''వెంకయ్యగారి శబ్దార్థకల్పతరువును ప్రొఫెసరు విల్సన్‌గారు తమ సంస్కృత నిఘంటు నిర్మాణంలో ఉపయోగించుకొన్నారు. మేదినీ కోశాన్ని అనుసరించడం వల్ల కల్పతరువులో మాటల క్రమం ఏ ప్రారంభకునికీ సుకరంగా ఉండదు.''

వెంకయ్యగారి తెలుగు నిఘంటువు, సంస్కృత కోశమూ వారి జీవితకాలములో అచ్చుపడలేదు. ఒకానొక 'ఆంధ్రదీపిక' ఒకసారి కాదు మూడు ముద్రణలను నోచుకొంది. 1848లో ఒకసారి, 1872లో రెండవసారి, 1882లో మూడవసారి ముద్రణ పొందిన 'ఆంధ్రదీపిక'కు కర్త చుండూరు రంగనాయకులు శ్రేష్ఠిగారు. ఈయన కుంఫిణీవారి కచ్చేరీలలో తమిళ, మహారాష్ట్ర, మలయాళ భాషలకు వైభాషికులు (టాన్సులేటరు). మామిడి వెంకయ్యగారి పుస్తకం పేరును మాత్రమే వాడుకొన్నారో, లేక గ్రంథాన్ని కూడా చుండూరువారు వాడుకొన్నారో తులనాత్మక పరీక్షచేసి చెప్పడానికి భావిపరిశోధన అవసరం. చుండూరి వారి ఆంధ్రదీపిక ప్రతి (1882 నాటిది) అడయారు గ్రంథాలయంలో ఉంది. మామిడి వారి ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది.

వెంకయ్యగారి శబ్దార్థ కల్పతరువు 1961లోగాని వెలుగు చూడలేదు. మచిలీపట్నం లోని వాసవీ గ్రంథ ప్రచురణ సమితివారికోసం శ్రీ శుద్ధచైతన్య స్వామిగారు దీనిని పరిష్కరించి నాగరి-తెలుగు లిపులలో ప్రకటించారు. దీనిని ఉపయోగించుకొనడానికి కొన్ని పద్ధతులు తెలుసుకొనడం ప్రాథమికావసరం. మామిడి వెంకయ్యగారి ఆంధ్రదీపికను వారి పేరుతోనే మళ్ళా ప్రచురించే అవకాశం 1965లో శ్రీ వాసవీ గ్రంథ ప్రచురణ సమితివారికే లభించింది. వెంకయ్యగారి పేరుతో ఈ కోశాన్ని తెలుగుదేశానికి ఇచ్చినందుకు ఎంత సంతోషించాలో చెప్పలేము. అయితే వెంకయ్యగారి గ్రంథాన్ని వారు రచించినట్లు యథాతథంగా గాక ఇతర నిఘంటువు నుండి మాటలు ఎరువుతెచ్చి చేర్చినందుకు చింతించాలి. ''వృద్ధయయిన తల్లికి పెద్దవారైన బిడ్డలవలె ఈ యాంధ్రదీపికకు ఇప్పటి ఆంధ్ర నిఘంటువులు ఇంచుక అక్కఱకు వచ్చెను'' అని ఇప్పటి పరిష్కర్తలు భావించారు.

మామిడి వెంకయ్యగారు నిఘంటువులనే కాక వ్యాకరణాన్ని కూడా రచించినట్టు తెలుస్తుంది. చెల్లపిళ్ల వెంకట శాస్త్రిగారు తాము 1780 ప్రాంతాలలో నీలపల్లి లోకల్ ఫండు స్కూల్లో నాలుగో క్లాసు చదువుకొనేటప్పుడు ఒక శేషయ్య వ్యాకరణం చదువుకొనేవారట. ''శేషయ్య వ్యాకరణం ఇప్పుడెక్కడా కనబడడం లేదు. అది వెంకయ్యా వ్యాకరణానికి బదులుగా బయలుదేరింది. వీరభద్ర పళ్ళేనికి హనుమత్పళ్ళెం వంటిది. శేషయ్య అనే ఆయన వ్రాశారని తోస్తుంది. వెంకయ్య వ్యాకరణం మాత్రం వెంకయ్యా వేయించిందిగాని రచించింది కాదు. అయితే ఆయన పేరుతో వ్యవహరించడం ''పుణ్యైర్యశో లభ్యతే'' అనే అభిప్రాయానికి ఉదాహరణం అనుకోవాలి. నన్నయభట్టీయం సూత్రాలకు బాలసరస్వతి వ్రాసిన టీకను విడదీసి తాడినాడ వెంకయ్యగారు అచ్చువేయించినారు. ఇప్పటికీ ఆ పేరుతోనే వ్యవహరింపబడుతూ ఉంది.[1] తా॥ వెంకయ్యగారి వ్యాకరణం ఒకటి వావిళ్ళవారు 1914లో ప్రచురించారు. ఆంధ్ర వ్యాకరణము తా. వెంకయ్యచేత చేయబడినది అని అట్టమీద గట్టిగా ప్రకటించారు. మామిడి వెంకయ్యగారి వ్యాకరణం ఏమైపోయిందో చెప్పలేము.

తన రచనలవల్ల పరభాషల వాళ్ళు తెలుగు నేర్చుకొనడానికి ఉపకరించిన మామిడి వెంకయ్యగారు తమ డెబ్బయ్యో ఏట 1834లో మరణించారు. అపరిమితమైన వారి భాషాజ్ఞానం పరిమిత ప్రయోజనాలకే ఉపయోగడడం గమనించదగ్గ విషయం.

సామినేని ముద్దు నరసింహం (1792 (?) - 1856)

ఇంగ్లీషువారికి ఉపయోగపడే గ్రంథాలు మన భాషలో రచించినవారు కుంఫిణీ యుగంలో ఉన్నట్టే ఇంగ్లీషువారి పరిచయంతో వారి గ్రంథాల అధ్యయనం వల్ల భావవిప్లవం కలిగి మన భాషలోనే మన జాతి బాగుపడడానికి ఉపయోగించే గ్రంథాలు రాసినవారు కూడా ఉన్నారు. అటువంటి రచయిత పేరు సామినేని ముద్దు నరసింహం. అతని గ్రంథం పేరు ''హితసూచని.''

1. చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి - ''కథలు-గాథలు'', ప్రథమ భాగం - పుట 405.

''వ్యావహారిక భాష ప్రయోజనాన్ని గుర్తించి ఆ వాదాన్ని ప్రారంభించినవాడు ఈ ముద్దు నరసింహం. అంతేకాదు - సంఘసంస్కారము, మతాంతర వివాహము, బ్రహ్మ సమాజము ద్వారా బంగళా దేశం నుంచి ఆంధ్రదేశంలోకి దిగుమతి కావడం కాదు. అంతకుపూర్వమే మన తెలుగు వాడొకడు ఈ ఉద్యమాన్ని తలపెట్టి ప్రచారం చేసిన వాడున్నాడు అని రుజువు చేయడానికి ఈ 'హితసూచని' ఆధారం. అందుచేతను ఈ గ్రంథం తిరిగి అచ్చువేయాలి'' అని 1924లోనే గిడుగు రామమూర్తిగారు చెప్పారు. ఈ మాటలు అక్షరసత్యాలు.

సామినేని వంశీయులు తరతరాలుగా రాజమండ్రి వాస్తవ్యులు. ఈస్టిండియా కుంఫిణీవారి దుబాషులుగా వ్యవహరించినవారు. సామినేని ముద్దు నరసింహంగారు తమ పదోయేటో, పదమూడోయేటో వీధిబడి చదువులు ముగించుకొని కుంఫిణీవారి కచ్చేరీలో ఉమేదువారీగా చేరారు. వారికి పధ్నాలుగో యేడు రాగానే వారికి పోషకుడైన తెల్లదొర ఒకాయన రాజమండ్రి నుండి కోయంబత్తూరుకు బదిలీ అయ్యాడు. ఆనాటి నేటివు గుమాస్తాలందరిలాగా ముద్దు నరసింహంగారు ఆ దొర కొలువులో చేరడానికి కోయంబత్తూరు వెళ్ళారు. ఆ రోజుల్లో రాకపోకలకు సౌకర్యాలు లేవు. అందుచేత రాజమండ్రి నుంచి నాటున ప్రయాణం చేసి బందరుకు వెళ్ళి అక్కడి ఓడ ఎక్కి మద్రాసు చేరి ఆ నగరం నుంచి నాటున కుంభకోణం చేరాడు. ఏదొర దగ్గర ఎన్నాళ్ళు పనిచేశారో ప్రస్తుతం లభించే ఆకరాల వల్ల తెలియదు.

అయితే 1813 నుంచి 1817 దాకా గుంటూరు జిల్లాలో 'సాయర్‌మోతర్ఫా సూపరింటెండెంటు' ఉద్యోగం చేశారని చెప్పడానికి దాఖలాలు ఉన్నాయి. బ్రౌను దొరగారు సేకరించిన జాబుల సంకలనాలలో సామినేని నరసింహం నాయుడుగారికి వారి చేతికింది చౌకీ గుమాస్తాలు రాసిన ఉత్తరాలు ఒకటి కాదు రెండు కాదు ఏడు భద్రంగా ఉన్నాయి.[2] 1816లో గుంటూరు జిల్లాలో 'పిండారీ గుర్రము' వచ్చినట్టు ఒక లేఖ చెప్తుంది. పిండారీలు దేశంమీద పడి దోచుకొనడం ఆ రోజుల్లో పరిపాటి. ఈ కాలంలో ఒకసారి ముద్దు నరసింహంగారు ఒంగోలులో ఉన్నారు. పిండారీ వారిని ఎదిరించి వీరత్వం చూపించారు.

''ఒంగోలు దగ్గిర కొత్త పట్నంలో వివాహానికి ఆయన (ముద్దు నరసింహం) వెళ్ళాడు. రాత్రి పెళ్ళి జరుగుతూ ఉండగా మరాఠా దండు దోచుకొనడానికి వస్తూ వుందని వార్త వచ్చింది. అప్పుడు ముద్దు నరసింహం ఆడవాళ్ళను, పిల్లల్ని అటక ఎక్కించాడు. తలుపులన్నీ బార్లా తీయించి వేసి గుమ్మం పక్కకు ఒక తలుపు చాటున తనూ, మరొక తలుపుచాటున తన నౌఖరూ నక్కి ఉన్నారు. ఒక్కొక్క దోపిడీవాడు లోపల కాలుపెట్టగానే ముద్దు నరసింహం వాడి తల నరకడమూ, నౌఖరు ఆ తలను మొండాన్నీ పక్కకు లాగి పారేయడమూ పద్ధతిని ఏడుగురు దోపిడీదార్లను చంపి ఆ శవాలను వీధిలో పారేయించి కత్తులు పట్టుకొని తనూ నౌఖరూ వీధిలోకి వచ్చేటప్పటికి ఇరుగుపొరుగు

2. ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో M.418 సంపుటంలో 147వ పుట నుంచి 158వ పుట దాకా.

వాళ్ళు ధైర్యం తెచ్చుకొని కత్తులూ, కర్రలూ పట్టుకొని వచ్చి మరాఠా దండును తరిమి వేశారు'' అని ముద్దు నరసింహంగారి మునిమనుమడు సామినేని ముద్దుకృష్ణ తమ తాతతండ్రులు చెప్పిన వైనాలను కథనం చేశాడు.[3]

ముద్దు నరసింహంగారు కత్తిసాములో ఆరితేరినవారని పై కథనం వల్ల చెప్పవచ్చు. తమ గ్రంథంలో 'శరీరారోగ్యమునకు జరూరైన సంగతులు బాగా తెలుసుకొనేవాడిక' వ్యాయామం వల్ల వారికి ఉండేదని భావించడానికి ఆధారాలు ఉన్నాయి. వెలమవారిలో కత్తి పట్టడం కొందరికీ, కర్రపట్టడం కొందరికీ విద్య. ముద్దు నరసింహంగారు ఆది వెలమలు. తెలుగుదేశంలో వెలమ దొరలలో రెండు రకాల వారున్నారు. పద్మ వెలమలు లేక పెద్ద వెలమలు లేక రాచ వెలమలు అనే శాఖ ఒకటి. ఆది వెలమలు అనే శాఖ ఇంకొకటి. పద్మ వెలమల స్త్రీలు ఘోషాను పాటిస్తారు. ఆది వెలమలు పరదాను పాటించరు.

ఎక్కడెక్కడ ఏయే ఉద్యోగాలు చేశారో ప్రస్తుత పరిశోధనల వల్ల చెప్పలేముగాని ముద్దు నరసింహంగారు 1848 నాటికి, రాజమండ్రిలో పెద్ద హోదాలో ఉన్నారు. ఆదిలో వృత్తి పన్నులు వసూలు చేసే 'మోతర్ఫా దారోగా' రెవెన్యూ శాఖలో ఉన్నా ఉత్తరోత్తరా జుడిషియల్ శాఖలోనికి వచ్చారు. 1848 నుండి 1852 దాకా అయిదేళ్ళు ఆయన రాజమండ్రిలో సెకండుక్లాసు డిస్ట్రిక్టు మునసబుగా పనిచేశారు. 1852లో ఆయనను ఫస్టుక్లాసు జిల్లా మునసబుగా ప్రమోటు చేసి సీతానగరంలో నియమించారు. అయితే ఏ కారణాలవల్లనో తెలియదుగాని మరుసటి సంవత్సరం రాజమండ్రి జిల్లా కోర్టులో ఆయనను థర్డ్ క్లాస్ డిస్ట్రిక్ట్ మునసబుగా వేశారు. 1855 దాకా ఆ మూడేళ్ళూ ఆయన ఆ హోదాలోనే ఉండేవారు. 1856లో ఆయన పెద్దాపురంలో మరణించారు.

ఉద్యోగ ధర్మాలలోనే కాక స్నేహరీత్యా కూడా ముద్దు నరసింహంగారు తెల్లదొరలతో సాయిలాపాయిలాగా ఉండేవారు. భారతీయుల బాగుకోసం చాలా ఆలోచించారు. 1853లో ''విద్యలు సమస్త ప్రయోజనములకు ఆవశ్యకములై వున్నవి. అవి గ్రంథస్వరూపములపై యున్నవి... వర్తమానకాలములో విజ్ఞానదాయకమైన పుస్తకాలు వాక్యగ్రంథాలుగా'' వ్రాయాలని, అచ్చువేయాలని ఆయన భావించారు. ''హితసూచని' అనే వాక్యగ్రంథాన్ని 'మోరల్ ఇన్‌స్ట్రక్టర్'గా ఆయన ఎనిమిది ప్రకరణాలలో రచించారు. ఇవాళ మనం వచనగ్రంథం అనే దానిని ఆయన వాక్యగ్రంథమన్నారు. నేడు 'వ్యాసము' అనే పదానికి ఆయన 'ప్రమేయము' అని పేరు పెట్టాడు. హితసూచనిలోని ఎనిమిది ప్రమేయాలు ఇలాగ ఉన్నాయి.

1. విద్యాప్రమేయము
2. వైద్యప్రమేయము
3. సువర్ణప్రమేయము
4. మనుష్యేతర జంతుసంజ్ఞా ప్రమేయము
5. పక్షిప్రభృతి ప్రమేయము

3. ''సంస్కృతి'' - సరస్వతీ పవర్‌ప్రెస్ వారి పక్షపత్రిక - 1-5-1959

6. మంత్రప్రమేయము
7. పరోక్షాది జ్ఞాన ప్రమేయము
8. వివాహ ప్రమేయము

ముద్దు నరసింహంగారు ప్రోక్త గ్రంథంలో వెలిబుచ్చిన అభ్యుదయ భావాలు గొప్పవి. ఆయన వేగుచుక్క. మూఢాచారాలు, అంధవిశ్వాసాలు చిమ్మచీకట్లులాగ ఆవరించిన నిశాంత సమయంలో ఇంక అరుణోదయం కాబోతున్నదని చాటే వెలుగుచుక్క. ఇహలోక విరుద్ధాలయిన వాటిని ఆయన తోసిపుచ్చిన హేతువాది. ఆడపిల్లలను రజస్వలానంతరమేకాక పూర్ణవయసు వచ్చాక వాళ్ళ ఇష్టంతోనే పెళ్ళి చేయాలని సప్రమాణంగా వాదించిన దిట్ట. దయ్యాలూ, భూతాలూ, దివ్యదృష్టి వగైరాలను తూర్పారపట్టిన గట్టివాడు. ఇతర లోహాలను బంగారం చేయడం అసంభవమని రుజువు చేసినవేత్త. వాడుక భాషలో వాక్యగ్రంథాలకు బహుశా ఆద్యుడు.

పండిత పామర సాధారణంగా వుండే వాక్యగ్రంథం లేకపోవడంచేత హిందూదేశము వారికి విద్యలు రావడం కఠినమైనదని ఈయన గుర్తించారు. తెలుగులో శాస్త్రగ్రంథాలు ఏర్పాటు చేయాలంటే సంస్కృతం మొదలైన భాషలను ఆశ్రయించాలి. ఇద్దరు ముగ్గురు పండితులను కూర్చి వారికి కావలసిన గ్రంథాలను తెప్పించి ఇస్తే కావలసిన పుస్తకాలు త్వరగా ఏర్పాటు కావచ్చునని ఆనాడే చెప్పారు. ఇంగిలీషు బాగా తెలిసిన అసలు గ్రంథము యొక్క ముఖ్యాభిప్రాయములు సులభముగా బోధపడి, తగినట్టు దేశ భాషకు సంగ్రహము చెయ్యడమునకు లాయఖైనవారు పూనుకొన్న పక్షములో, తెలుగువాళ్ళు విజ్ఞానవంతులవుతారని ముద్దు నరసింహంగారి నమ్మకం.

ఆయన 1853లో సూచించిన పద్ధతిని తెలుగు అకాడమీ చేపట్టడానికి నూటిరవై సంవత్సరాలు పట్టింది!

ముద్దు నరసింహంగారు 1853లో రచించిన గ్రంథాన్ని వారి కుమారుడు రంగప్రసాదుగారు 1862లో ప్రచురించారు. అప్పటికి కందుకూరి వీరేశలింగంగారు సుమారు 14 సంవత్సరాల కుర్రవాడు. వీరేశలింగంగారు హితసూచని చదివి ప్రభావితు లయ్యారు. వీరేశలింగంగారి సంతకంతో వున్న హితసూచని పుస్తకం వడ్లమూడి గోపాల కృష్ణయ్యగారి దగ్గర ఉంది.[4] వీరేశలింగంగారిని, గిడుగు రామమూర్తిగారిని ప్రభావితులను చేసి ముందుకు నడిపించిన 'హితసూచని' ప్రథమ తాంబూలం పొందదగ్గ గ్రంథం.[5] ముద్దు నరసింహంగారు ప్రశంసనీయులు.

4. వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారి 'వ్యావహారిక ఆంధ్ర భాషా వ్యాకరణము' - సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరం - 1958. పుట సంఖ్యలు ఇవ్వలేదుగాని ఇందులో ముద్దు నరసింహంగారిపైన వ్రాసిన భాగంలో ఇది వడ్లమూడి వారు చెప్పారు.
5. ఇది 1986లో నా ప్రవేశికతో పునర్ముద్రణ పొందింది. రాజమహేంద్రవరం ఆంధ్రకేసరి యువజన సమితివారు ప్రచురించారు.

రావిపాటి గురుమూర్తి శాస్త్రి (1770-1836)

తెల్లదొరల నిమిత్తం తెలుగులో వాక్యగ్రంథాలు రచించిన ప్రథములలో బహుశా మొదటివారు రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు. ఈయనకు తల్లిదండ్రులు 'బారసాల' నాడు పెట్టిన పేరు ఉత్త గురుమూర్తి మాత్రమే. ఆర్వేల నియోగుల కుటుంబంలో పుట్టినవాడు కనుక పేరులో 'శాస్త్రి' పదం తొలినుంచీ లేదు. 1819లో సెంటుజార్జి కోట కాలేజీవారు ప్రచురించిన 'విక్రమార్కుని కథలు' పుస్తకంలో 'యార్వేలనియోగియగు రావిపాటి గురుమూర్తి' అన్న పేరే కనబడుతుంది. సెంటుజార్జి కోటలో కాలేజీని స్థాపించిన ప్రారంభ సంవత్సరాలలోనే గురుమూర్తిగారిని తెలుగు ఉపాధ్యాయునిగా తీసుకొన్నారు. వేదం పట్టాభిరామ శాస్త్రిగారు ప్రధానాంధ్ర సంస్కృతోపాధ్యాయులు. గురుమూర్తిగారు డిప్యూటీ తెలుగు మాష్టరు. తెల్లదొరలకు పాఠ్యగ్రంథంగా ఉపయోగపడడానికి గురుమూర్తిగారు 'విక్రమార్కుని కథలు' అనే వాక్య గ్రంథాన్ని 104 పుటలలో రచించారు. దీనిని 1819లో కాలేజీ బోర్డువారు అచ్చువేశారు. ఇదొక్కటే ఆనాటి ప్రామాణిక పాఠ్యగ్రంథం. ఇది 1828లో, 1850లో, 1858లో మూడు పునర్ముద్రణలు పొందింది.

'విక్రమార్కుని కథలు' ప్రతులను మద్రాసులోని సివిలు సర్వెంటు విద్యార్థులే కాక సీమలోని వారుకూడా చదువుకొనడానికి వీలుగా కాపీలను ఇంగ్లాండుకు పంపించారు. అంతేకాదు. గురుమూర్తిగారి జీతాన్ని పెంచారు. ఆయనకు బంగారు కడియాల జతను కూడా బహూకరించారు.

1820లో వేదం పట్టాభిరామ శాస్త్రిగారు చనిపోయారు. ప్రధానోపాధ్యాయుడనే హోదాలో గురుమూర్తిగారిని నియమించారు. ఒక శాఖలో ప్రధాన స్థానాన్ని అధిష్ఠించే ఆచార్యుని పేరులో ఆ హోదాను సూచించే పదం ఉండాలని కాబోలు ఆయనను 'గురుమూర్తి శాస్త్రి' అని సగౌరవంగా పిలువసాగారు.

ఒక్క చెన్నపట్నం కుంఫిణీ కాలేజి పనులకే కాక చెన్న రాజధాని విద్యావిధానం విషయంలో కూడా సర్కారువారు గురుమూర్తిశాస్త్రిగారి సలహాలను తీసుకొనేవారు. ఆయన 1833లో కలెక్టరేటు స్కూళ్ళలో బోధించవలసిన పుస్తకాలను ఇలా నిర్దేశించారు.

1. ప్రభ వల పుస్తకము
2. సులభమైన మాటలుగల పుస్తకములు.
3. వచన రూపముగానుండే వ్యాకరణము
4. కొంచెము ఛందస్సు
5. సులభమైన మాటలు గల పద్యముల పుస్తకము
6. అకారాది శబ్ద పుస్తకము
7. జాబులు
8. భారతములో ఆదిపర్వము

ఇవి అన్నిన్నీ అర్థములత[3] గూడ చెప్పవలసినది.

కాలేజీలో ప్రధానాంధ్రోపాధ్యాయునిగా గురుమూర్తిశాస్త్రిగారు సివిల్ సర్వెంట్లకు తెలుగు నేర్పడమేగాక ఆ విద్యాభ్యాసంలో వారి అభివృద్ధి ఎలా ఉందో కొన్ని నిర్ణీత సమయాలలో పరీక్షలు కూడా సీనియర్ కాలేజి బోర్డు సభ్యులతో పాటు జరిపేవారు. తనవద్ద చదువుకొన్న తెల్లదొరలు పెద్ద హోదాలో ప్రవేశించినా తమకు వచ్చే సందేహాలను, భాషా విషయంలోని అనుమానాలనూ గురుమూర్తి శాస్త్రిగారికి లేఖల ద్వారా తెలిపి సందేహ నివృత్తి చేసుకొనేవారు. 1827లో సి.పి. బ్రౌన్ దొరగారు 'అలవోక', 'డాబాలు' అనే మాటల అర్థాలు వ్రాసి పంపమని కోరారు. గురుమూర్తి శాస్త్రిగారు ఒక లేఖలో విడమర్చి చెప్పారు.

1834లో గురుమూర్తి శాస్త్రిగారు ''తెలుగు భాష జదువుకొను విద్యార్థులకు లోక వ్యవహారానుసారముగా జదువనేర్చుకొనుటకు...'' పంచతంత్ర కథలు అనే ఇంకో వాక్యగ్రంథాన్ని రచించారు. ఇదికూడా ఉపయుక్త గ్రంథమైంది. 1842, 1848, 1864, 1869 సంవత్సరాలలో మరి నాలుగు పునర్ముద్రణలు నోచుకొంది.

తెలుగు మాటలకు ఇంగ్లీషు అర్థాలనిచ్చే నిఘంటువు, తెలుగును ఇంగ్లీషులో బోధించే వ్యాకరణాలు, వాక్యగ్రంథాలు రచిస్తే ఆమోదించినవాటికి నగదు పారితోషికం ఇస్తామని కాలేజీ బోర్డువారు ప్రకటించడంవల్ల చాలామంది సివిల్ సర్వెంట్లు ఆ కృషి ప్రారంభించారు. గురుమూర్తి శాస్త్రిగారు తమ పూర్వ విద్యార్థులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. జె.సి. మారిస్ దొర రచించిన నిఘంటువులో గురుమూర్తి శాస్త్రిగారి పాత్ర ఎంతో ఉంది. 1835లో ఈ నిఘంటువు అచ్చుపడినప్పుడు మారిస్ తన గురువుగారికి కృతజ్ఞతలను పీఠికలో చెప్పుకొన్నారు.

తెలుగువారికి తెలుగులోనే వ్యాకరణం నేర్పవలసిన అవసరాన్ని గురుమూర్తి శాస్త్రి గారు గుర్తించారు. 1836లో 'తెలుగు వ్యాకరణము' అనే పేరుతో అయిదు ప్రకరణాలలో 316 లక్షణ వాక్యాలతో ఒక గ్రంథాన్ని రచించారు. సంస్కృత వ్యాకరణ సంప్రదాయాన్ని అనుసరించి సూత్ర పద్ధతిలో కాక ఆంగ్ల వ్యాకరణ పద్ధతులను అవగాహన చేసుకొని 'వాక్య పద్ధతి'లో వ్యాకరణాన్ని చెప్పడం ఒక విశేషం. ఇందులోని ప్రకరణాల వివరాలు ఇవి:

1. అక్షరలక్షణ ప్రకరణము
2. సంధి ప్రకరణము
3. విశేష్య ప్రకరణము
4. విశేషణ ప్రకరణము
5. క్రియా ప్రకరణము

అక్షర లక్షణ ప్రకరణంలో అక్షర స్వరూపాలు చెప్తూ అచ్చులు స్వతంత్రంగా రాసేటప్పుడు ఎలా ఉంటాయో, హల్లులతో చేర్చి రాసేటప్పుడు ఏ గుర్తులు ఉంటాయో, వాటి పేర్లు ఏమిటో విశదం చేశారు. గుణింతం విశదపరిచారు. సంధి ప్రకరణంలో తెలుగు భాషలో సకలమైన శబ్దాలు కళలు అనీ, ద్రుతప్రకృతులు అని రెండు రకాలని చెప్పారు. ఈ

భాషలో రెండచ్చులు అవ్యవహితములుగా ఉండవు. కనుక అజంత శబ్దాలకు అజాది శబ్దాలు పరమైతే సంధియైనా వస్తుంది - రాని పక్షాన రెండు శబ్దాల నడుమ యకారమైనా, ద్రుతమైనా వస్తుందన్నారు. అంటే ఆ రెండు శబ్దాలలో పూర్వశబ్దం కళలలో చేరినదైతే 'య'కారం, ద్రుతప్రకృతులలోని దైతే 'న'కారం వస్తుందని చెప్పారు.

విశేష్య ప్రకరణంలో తెలుగు భాష దేశ్యము, తత్సమము, తద్భవము, గ్రామ్యము అని నాలుగు విధాలని చెప్పారు. మొదట దేశ్యాన్ని పేర్కొనడంలో విశేషముంది. దేశ్యము రెండు విధాలు. అచ్చ దేశ్యము, అన్య దేశ్యము అని వాటిని అంటారు. అచ్చ దేశ్యమనగా తెలుగుదేశపు మాటలు, అన్య దేశ్యమనగా తెలుగు విభక్తులు - చేర్చి పలుకబడుచున్న ద్రావిడాది దేశముల మాటలు. గ్రామ్యమనగా లక్షణమునకు విరుద్ధముగా సర్వజనులచేత సాధారణముగా వ్యవహరింపబడుచున్న మాటలు.

భాషా తత్త్వం బాగా తెలిసినవారు కాబట్టి గురుమూర్తి శాస్త్రిగారు సర్వజనులచేత సాధారణముగా వ్యవహరింపబడే గ్రామ్యానికి కూడా తమ వ్యాకరణంలో లక్షణం చెప్పారు. ఉదాహరణకు కొన్ని చూడండి.

''202, గ్రామ్య భాషయందు వీని, వాని అనెడు ద్వితీయాంతములు వీణ్ని, వాణ్ని అనియు ఏ తటములు - వీఁడి - వాఁడి అనియు చెప్పబడును''

''228. గ్రామ్యభాషయందు - ఁడు వర్ణాంత శబ్దమునకు సువర్ణకము రాక 'ఁడు' వర్ణము పోయి 'ణ్ణి' అనువర్ణము వచ్చును. నేను ఘనుణ్ణి, నేను చెలికాణ్ణి. అది అనే శబ్దము కొననుగల దానికి నువర్ణకము రాక అది అను దానికి 'దాన్ని' అనునది వచ్చును. నేను గొల్లదాన్ని. నేను చిన్నదాన్ని ఇత్యాది.''[6]

ఆదిలో ఇలాగ లక్షణ వాక్యపద్ధతిలో గురుమూర్తిశాస్త్రిగారు చెప్పినట్టే ఇప్పుడు వ్యాకరణం బోధిస్తే మంచిది. ఆంధ్రభాషా బోధనలో మన విద్యాధికారులు చిన్నయసూరికి పెద్దపీట వేయడానికి పూర్వం గురుమూర్తి శాస్త్రిగారి వాక్య గ్రంథాలూ, వ్యాకరణం ఎందరికో ఉపకరించేవి. గురుమూర్తి శాస్త్రిగారి గురుపాండిత్యం, ప్రామాణికత్వం పట్ల బ్రౌను దొరగారికి ఎంతో గురి ఉంది. తన రచనలను ఆయన ఆమోదించినందుకు బ్రౌను దొరగారు ఆ సంగతిని ఎంతో సగర్వంగా చెప్పుకొంటూ "I mention his name because, his talents and good sense always entitled his judgement and respect" అని 1839లో ప్రశంసించారు.[7]

అయితే అదే బ్రౌను దొరగారు 1850లో గురుమూర్తి శాస్త్రిగారి వ్యాకరణం, పంచతంత్రం, ఇతరులు రచించిన ఆంధ్రభాషా సంగ్రహం, అరేబియన్ నైట్సు అనే పుస్తకాలతో పాటు పాఠశాలలో బోధించడం నిష్ప్రయోజనమని పై అధికారులకు తెలియచేశారు.[8] కుంఫిణీ వారికి కావలసినవి తక్షణ ప్రయోజనాలే. గురుమూర్తి శాస్త్రిగారు

6. తెనుఁగు వ్యాకరణము - 'రావిపాటి గురుమూర్తి శాస్త్రి' - వావిళ్ల రామశాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, 1951

7. Literary Autobiography of C.P.Brown, p.134.

8. M.J.L.S. Vol.X (1839)

1835 ప్రాంతాలలో రిటైరు అయ్యారు. కుంఫిణీవారు కొంత మొత్తాన్ని సముచిత పారితోషికంగా ఆయనకు ఇచ్చారు. అయితే ఆయన పూర్వ విద్యార్థులెవరో ఆయనకు కడప జిల్లా కదిరిలో డిస్ట్రిక్టు మునసబుగా ఉద్యోగమిచ్చారు. మళ్ళా కొలువులో ఉంటున్నందువల్ల పూర్వం పుచ్చుకొన్న 'గ్రాట్యూయిటి' మొత్తాన్ని వాపసు చేయమని కుంఫిణీవారు తాఖీదు పంపించారు. కుంఫిణీవారి విశ్వాసాలు అలా ఉంటాయి. గురుమూర్తి శాస్త్రిగారు 1936లో మరణించారు. ఆయన కుమారుడు గురవయ్యను మాత్రం కాలేజీలో ఉపాధ్యాయునిగా వేసుకొన్నారు. 'గుడ్డిలోమెల్ల'.

వఠ్యం అద్వైత బ్రహ్మయ్య శాస్తుర్లు (?-1840)

తమకు పూర్వం చదువు చెప్పిన మాష్టర్లకు ఉత్తరోత్తరా పెద్ద హోదాలో ప్రవేశం కలిగేటట్టు ఉద్యోగాలు వేయించినట్టే తాము జుడిషియల్ శాఖలో పనిచేస్తున్నప్పుడు తమ కోర్టులో ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించిన సర్కారు పండితుల దగ్గర కూడా బహుకాలం నేర్వదగ్గ విద్యలుంటే నేర్చుకొనడం కూడా సివిలు సర్వెంట్లకు అబ్బిన సుగుణాలలో ఒకటి. 1822లో మచిలీపట్నం జిల్లా కోర్టులో రిజిష్టార్ హోదాలో ప్రవేశించిన బ్రౌను దొరగారికి ఆ కోర్టు పండితులైన వఠ్యం అద్వైత బ్రహ్మయ్య శాస్తుర్లు గారితో పరిచయమైంది. అందరూ ఆయనను బ్రహ్మయ్యగారని పిలిచేవారు. వఠ్యంవారు గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా కారుమూరు గ్రామ కాపురస్తులు. బందరులో స్థిరపడ్డారు. వీరు ముగ్గురన్నదమ్ములు. పెద్దవారు బ్రహ్మయ్యగారు. ఈయనకు సీతారామ శాస్త్రి, రామలింగ శాస్త్రి అనే ఇద్దరు సోదరులున్నారు. తమ్ముళ్ళకు బ్రహ్మయ్యగారు చదువులు చెప్పించారు. ఉద్యోగాలు వేయించారు.

బ్రహ్మయ్యగారికి అపారమైన సంస్కృత భాషాజ్ఞానం, ధర్మశాస్త్ర వైదుష్యం ఉన్నాయి. బ్రౌను దొరగారికి ఈయన విద్యానాథుని ప్రతాప రుద్ర యశోభూషణంలోని శ్లోకాలను ఉదాహరిస్తూ ఏకశిలానగరం గురించి చెప్పారు. సంస్కృత రాఘవ పాండవీయం, ఓఢ్రాక్షరాలలో ఉన్నది పూర్వం తెప్పించుకొని ఆ లిపి తెలిసిన వారిని సంప్రదించి, బందరులో ఓఢ్రం బాగా వచ్చిన వ్యక్తి పరిచయమైనందున అతని ద్వారా తెలుగు లిపిలో రాయించి చదివారు. పూరీ జగన్నాథంలో పీతాంబర దేవుగారికి జమీందారుగారి పేర ఉత్తరం రాసి దీనికి వ్యాఖ్యానం రాయించి తెప్పించే ప్రయత్నాలు చేశారు. బ్రౌను దొరగారికి భర్తృహరి సుభాషితం మూడు శతకాలు సేకరించి ఇచ్చారు. బ్రహ్మయ్యగారికి చక్కని గ్రంథాలయం ఉంది. ఇంట్లో ఉన్న పుస్తకాలన్నీ విచారించి దొరగారికి కావలసినవి వ్రాయించి ఇచ్చేవారు. అరువు మార్గములో చాలామంది వీరి పుస్తకాలు తీసుకువెళ్ళి ప్రతికలు పుట్టించుకొనేవారు.

బ్రహ్మయ్యగారికి తెలుగులో తమ పరిమితులు బాగా తెలుసు. బ్రౌను దొరగారికి ఆవశ్యకమైన వ్యాఖ్యానాలను రచించడానికి ఆనాటి పండితులలోకల్లా మేటి అయినవారు జూలూరి అప్పయ్యగారని బ్రహ్మయ్యగారు భావించారు. ఆ పండితుణ్ణి బ్రౌను దొరగారికి పరిచయం చేసి తెలుగు సాహిత్యానికి చక్కని వ్యాఖ్యాన సంపదను సముపార్జింప చేశారు.

బందరులో సదరు కోర్టు పండితులుగా ఉండి ఎందరో జడ్జీలను మెప్పించి చివరకు మద్రాసులోని సదర్, ఫౌజుదారీ అదాలత్తులలో సీనియర్ పండితులుగా నియమితులయ్యారు.

1834 అక్టోబరులో బ్రౌనుదొరగారి ఉద్యోగంలో కష్టాలు వచ్చాయి. 1834 నవంబరు 14వ తేదీనాడు బ్రహ్మయ్యగారు దొరగారికి ఒక లేఖ రాస్తూ ''ప్రస్తుతం తమ విషయమై జరిగిన కార్యమును గురించి తమ ఆశ్రితుల యొక్క గ్రహచారము వల్లనే సంభవించినట్టుగా భావించి చాలా విచారము పొందినాను. తిరిగి తమరు ఎప్పటిలాగే అభ్యుదయము పొందవలెనని ఈశ్వర ప్రార్థన చేస్తూ వున్నాను'' అని రాశారు. బ్రౌన్ దొరగారు సెలవుపెట్టి లండన్ వెళ్ళిపోయారు. 1837లోగాని రాలేదు. మద్రాసుకు తిరిగి వచ్చిన బ్రౌను దొరగారు బ్రహ్మయ్యగారిని 1838లో వచ్చి కలుసుకోమన్నారు. కలుసుకొన్నాక బ్రహ్మయ్యగారిని బ్రౌను దొరగారు వసుచరిత్ర ముద్రణ విషయంలో పర్యవేక్షకునిగా ఎంచుకొన్నారు. నాలుగాశ్వాసాల పర్యంతం ముద్రణ జరిగాక బ్రహ్మయ్యగారికి అనారోగ్యం వచ్చింది. చెన్నపట్నం వదలి బందరు వెళ్ళిపోయారు. 1840లో మరణించారు.

బ్రహ్మయ్యగారికి ఏవిధమైన బంధువులో తెలియదుగాని ఇదే కాలంలో వత్యం వాసుదేవ పరబ్రహ్మ శాస్త్రుల వారనే ఉద్దండ పండితులు ఒకాయన ఉన్నారు. ఈయన కూడా చెన్నపట్టణంలోనే ఉంటూ చాలామంది దొరల పరిచయాల నేర్పరచుకొన్నారు. వాళ్ళలో 1835 నుండి కాలేజీ బోర్డు సభ్యులుగా ఉన్న జాన్ ప్రయర్ థామస్ దొరగారు ముఖ్యుడు. వీరు సివిల్ సర్వెంట్లకు సంస్కృత భాషలో పరీక్షాధికారిగా ఉండేవారు. ఈయన చెన్న రాజధాని గవర్నరుగారి కౌన్సిల్‌లో కూడా సభ్యులయ్యారు. సంస్కృత పండితులైన జాన్ ప్రయర్ థామస్‌గారు వాసుదేవ పరబ్రహ్మయ్యగారి ధర్మశాస్త్ర పాండిత్యానికి ఆనందించి 'వ్యవహార దర్పణము' అనే ప్రామాణిక గ్రంథాన్ని రచింపచేశారు. హిందూ రాజ్యములో ఉండే ఆంధ్రులు, ద్రావిడులు మొదలయినవారు విభాగము మొదలయిన సకల వ్యవహారములను విజ్ఞానేశ్వరీయము, స్మృతి చంద్రిక, సరస్వతీ విలాసము, మాధవీయము, వరదరాజీయము, భగవద్భాస్కరం, నందపండితీయం, దత్తత చంద్రిక మొదలైన ధర్మశాస్త్ర గ్రంథములలో చెప్పి ఉండే ప్రకారం ఆచరిస్తున్నారు. అయితే ఆ గ్రంథములు యావత్తు సంపూర్ణంగా చూస్తేనేగాని అన్ని వ్యవహారములయొక్క రీతిన్ని తెలియదు. మరిన్ని ఎప్పుడు వాడుకలో లేకుండా వుండే సంగతులు కూడా ఆ గ్రంథంలో చాలా చెప్పబడి ఉన్నాయి. అందుచేత ప్రస్తుతం వ్యవహారము యొక్క స్వరూపాన్ని తెలియచేయడానికి యావదంశములో సంగ్రహించి గీర్వాణ భాషలో వ్యవహార దర్పణం రచింపచేశారు. అందులోని దాయభాగంలోని విషయాలకు తెలుగు వాక్యాలు కూడా వాసుదేవ పరబ్రహ్మయ్యగారు రచించారు. ఈ పుస్తకానికి 'జాన్ ప్రయర్థామసుబ్బాపాలీయము' అని పేరు పెట్టారు.

బ్రౌను దొరగారి లేఖల సంకలనాల సంపుటాలలో బ్రహ్మయ్యగారు రాసిన లేఖలు తొమ్మిది దొరుకుతున్నాయి. బహుశా ఇదే ఆయనకు దొరగారు రాసిన చివరి లేఖ -

అందులో వసుచరిత్ర ముద్రణ గురించి తమ ఆత్రతను, ఆశయాలను దొరగారు వ్యక్తం చేశారు. లేఖ చూడండి.

''రాజశ్రీ వర్యం అద్వైత బ్రహ్మయ్యా శాస్త్రుల్లగారికి సల్లాం. త॥

ఆ దేశము మీరు చేర్ని తరువాత మీకు ఆరోగ్యమైన సంగతిన్ని కాని సంగతిన్ని వినకపోవడము వల్ల నిండా విచారముగా వున్నాము. దైవసహాయంవల్ల త్వరగా ఆరోగ్యము కావలెనని కోరి యున్నాము. మెట్టుకు యిందుకు గురించి త్వరగా మాకు యెరుక చేస్తే బహు సంతోషిస్తూ వున్నాము.

''ప్రస్తుతం వ్రాయించే సంగతి యేమంటే పోయిన నెల ఆరంభం నుంచి వసుచరిత్ర చాపా చేసే పని బొత్తిగా నిల్చిపోయినది. యిందువల్ల మనకు చాలా ఫలం రావలసినందుకు ఫలం రాకుండా నష్టం సంభవించిపోతున్నదని చింత పడియున్నాము. ఈ పని యెందుకు నిల్చిపోయినదో అని విచారించినంతల్లో చాపా చేశే వాండ్లకు మనము అయిదు వందల రూపాయిల మట్టుకు బాకీ పడినట్టుగా తెల్సినది.

''యీ పని యింతదూరం జర్గించి వుండి మధ్య చాలించుకోవడం మహా హానికరంగాని మరి ఒకటి కాదు. ఇంటికి గోడలు కట్టిన తర్వాత పైకప్పు మాత్రం బాకీ వుంచి ఆ కొంచెం కుదిరించకుండా యిల్లు యావత్తు పాడు చెయ్యడం యంతపని అవునో యిదిన్ని అలాగ్నునే వున్నది. యీ పని చాలించే బుద్ధి మీకు ఒకవేళ ఉదయించినదేమో అని సందేహించి మనకు ప్రత్యామ్నాయం యితరులు యీ పనిమీద పడేటట్టు యోచించి యున్నాముగాని ఆ చొప్పున కుదరకపోయినది.

''యెందునుండి అంటే పని సగం మట్టుకు జరిగివుండగా పరులు యిందులో చెయ్యి వేశేటందుకు సంకోచిస్తూ వున్నారు. మరిన్ని వాండ్లు అట్లా సంకోచించడం న్యాయమేలే. యెందుకంటే వకరు ఆరంభించిన పనిని మరి వకరు ఉద్యోగించి తీర్చడం అపురూపమై బుద్ధి దూరమై వుండును, యీ పని యీ తీరుగా పడియుంటే మనకు యావత్తు నష్టి సంభవించకుండా మీకు యెరుకచేయడం మాకు ధర్మమే: మీరై యీ పని కడాకు జరిగించడానికి బుద్ధి లేకపోయిన పక్షమునకు ఉత్తరోత్తరా పరులు యిందులో ప్రవేశించి కడాకు సాగించిన పక్షమందు దీని యొక్క ఫలమేమి, పెట్టుబడి రూకలు యేమి తిర్గి మనకు రావడానికి ఆకరం కనుపించలేదు.

''దివ్యఫలమున్నూ, శాశ్వతమైన పేరున్నూ రావలసిన పని యెడల సుఖం ఎంతమాత్రం సంభవించకుండా నష్టం తెచ్చుకోవడం లేతపని అవును గనుక మీరు ఆవశ్యకరముగా నేను యీసారి చెప్పుకున్న బుద్ధిని ఆలోచనకు తెచ్చి, ఆ వరసగా మన సుబ్బారావు యీ పని ఆఖరు పర్యంతం కాజేశేలాగు మీరు ఆవశ్యముగా యేర్పరచవలెనని యీ జాబు మీ పేరిట వ్రాయించడమైనది.

''యిది గాక మేము చెప్పుకున్న ఆంధ్ర వ్యాకరణమున్ను, ఆంధ్ర నిఘంటువున్ను, యింగిలీషు నిఘంటువున్ను యీ మూడు గ్రంథములున్ను తామే అయి చాపా

చెయ్యడముకు యిక్కడ వుండే వక పుస్తకాల వర్తకుడు యత్నపడి మా దగ్గెర దరఖాస్తు చేసినాడు గనుక యీ మూడు పొస్తకాలున్ను నేను యేర్పరిచిన ప్రకారమే స్వచ్ఛంగా పుట్టే సమయం వచ్చినది కాబట్టి యీ సమాచారం మీకున్ను సంతోషకరమే గనుక రాయించడమైనది యింతే. సల్లాం.

1840 జనవరి 31 C.P. Brown

వసుచరిత్ర బ్రహ్మయ్యగారి మరణానంతరమే సవ్యాఖ్యానంగా వెలుగుచూసింది. ఈ వ్యాఖ్యానం జూలూరి అప్పయ్యగారు చెప్పినది. బ్రౌను దొరగారికి జూలూరి అప్పయ్యగారిని ఎరుక పర్చినందుకు బ్రహ్మయ్యగారు వందనీయులు.

జూలూరి అప్పయ్య పంతులు

(18వ శతాబ్దం ప్రథమ ద్వితీయ పాదాలు)

అపర నన్నయ భట్టునని లోకులముందూ, సాటి సాహితీపరుల ముందూ చాటుకొన్నా, నాకేం తెలియదని కనీసం దేవుని దగ్గర చెప్పుకొనే వినయం నిజమైన విద్యావంతుల లక్షణం. 'ఇప్పుడు దేశంలో ఉన్న పండితులలో ఇంతటివాడు ఇంకెవరూ లేర'ని వత్యం అద్వైత బ్రహ్మయ్యవంటి వారు బ్రౌను దొరగారికి ఎరుకపరచిన జూలూరి అప్పయ్యపంతులు తాను రచించిన 'యదువంశభూషణ శతకం'లో స్వవిషయం తెలుపుకొన్నారు.

తలపగసాహితీ చతురతా లవలేశము లేదు, లక్షణం
బుల తెఱగెట్టిదో తెలియబోలదు పూర్వకవి ప్రయోగ వా
గ్విలసమా యెఱుగను; గవిత్వము జెప్ప బూనినాడన
న్నెలమి గృతార్థుజేయదగుఁగృష్ణ హరీయదువంశ భూషణా (D.1665)

అయితే నిజానికి తనకేయే ప్రజ్ఞలు లేవని ఈ పద్యంలో సవినయంగా చాటినా ఆ లక్షణాలన్నీ ఆయనలో ఉన్నాయి. జూలూరి అప్పయ్యగారు బాపట్ల దగ్గరనున్న వేటపాలెం వాస్తవ్యులు. వేపారిపంతులు. వేటపాలెం ఆనాడు నాయుడుపల్లి అనే ఉర్ఫ్ నామంతో కూడా వాడుకలో ఉండేది. బ్రౌను దొరగారు బందరులో ఉన్నప్పుడు బహుశా 1824లో అప్పయ్యగారిని పిలిపించుకొని వారి వైదుష్యాన్ని చూసి తమ ఖాసా కచ్చేరీలో పండితునిగా చేర్చుకొని ఉంటారు. తెలుగు మాటలకు ఇంగ్లీషు అర్థాలను ఇచ్చే నిఘంటు నిర్మాణానికి ఆంధ్రభాషలోని ప్రసిద్ధ గ్రంథాలలోని పదప్రయోగాలను పరిశీలించాలి. కావ్యాల సంస్కరణా, వాటి ప్రతి పదార్థాలూ, కఠినమైన వాటికి టీకలూ అవసరం. ఈ పని చేయడానికి సమర్థులైన పండితులు కావాలి. వారిపైన 'పైగస్తీ' పెద్దగా ఉద్దండ పండితుడు, ఉదార స్వభావుడూ, తేలిక మాటలతో క్లిష్టమైన విషయాలు చెప్పగలవాడూ కావాలి. అతడు పరమ ప్రామాణికుడై వుండాలి. అందుకే బ్రౌను దొరగారు అప్పయ్యగారికి జీతమిచ్చి వసుచరిత్రకూ, మనుచరిత్రకూ టీకా తాత్పర్య వ్యాఖ్యాన ప్రతులను చెప్పించారు.

ఇతర పండితుల చేత కూడా కొన్ని కావ్యాలకు టీకలు చేయించారుగాని ఆ పోకడలు నచ్చక మళ్ళా అవే కావ్యాలకు అప్పయ్యగారిని టీక చెప్పమని కోరారు. ఉదాహరణకు వసుచరిత్రకు ములుపాక బుచ్చయ్య శాస్త్రి మూడాశ్వాసాలదాకా టీక చెప్పాడు. ఈ విధానం నచ్చక బ్రౌను దొరగారు అంతటితో ఆ పని ఆపు చేయించారు (D.760; 761). అప్పయ్యగారి టీకనే ఆదరించి ఉత్తరోత్తరా అచ్చు వేయించారు.

అప్పయ్యగారు టీకా తాత్పర్యాలు చెప్పే విధానమూ వ్యాఖ్యాన వైఖరి తెలుసుకోవాలంటే వసుచరిత్రలో తొలి పద్యానికి వారు చెప్పిన మాటలు మచ్చుకు చూస్తే చాలు.

శ్రీభూపుత్రి వివాహవేళ నిజమంజీరాగ్రరత్నస్వలీ
లాభివ్యక్తి వరాంఘ్రిరేణుభవకన్యాలీల యంచున్మదిన్
దా భావింప శుభక్రమాకలనచేఁ దద్రత్నముం గప్పుసీ
తాభామాపతి ప్రోవుతం దిరుమలేంద్ర శ్రీమహారాయనిన్.

టీక. శ్రీ భూపుత్రి = శ్రీలక్ష్మీ స్వరూపురాలైన, భూపుత్రి = భూమికి కొమార్తెయైన సీతాదేవి, వివాహవేళ = పెండ్లికాలమందు, అనగా వరుడున్ను తానున్ను ఒకచోట గూర్చున్న సమయమందనుట, నిజ... వ్యక్తి = నిజతనయొక్క, మంజీర = కాలి అందె యొక్క, అగ్రరత్న = శ్రేష్ఠమైన నాయకరత్నమందలి, స్వలీలా = స్వకీయమై విలాసాకృతి యొక్క, అభివ్యక్తి = ప్రతిబింబమును, వరాంఘ్రి... యంచున్వర = పెనిమిటియైన రామస్వామి యొక్క, అంఘ్రిరేణుభవ = పాదరేణువు వలన బుట్టినటువంటి, కన్యాలీల యంచున్ = కన్యకయొక్క విలాసమని, మదిందాభావింప = మనస్సుయందు తాను ఊహించుతూనుండగాను, ఇక్కడ శ్రీరామపాద రేణువువలన నహల్యాదేవి పాషాణరూపమువిడిచి స్త్రీ రూపమువహించి నందున మంజీరాగ్రరత్నమున్ను పాషాణజాతే గనక తత్పాదరేణు స్పర్శ చేతను యీ రత్నమున్ను, స్త్రీ రూపము వహించెనా యేమి అనేటట్టుగా నూహించెనని ఆశయము. శుభక్రమాకలనచే = శుభలీలచేతను, తద్రత్నముంగప్పు = ఆ రత్నమును కప్పిపెట్టునటువంటి, సీతాభామాపతి = సీతాంగనకు నాథుడైన శ్రీరామస్వామి, తిరుమలేంద్ర శ్రీమహారాయనిన్ = తిరుమలదేవరాయశ్రేష్ఠునిని, ప్రోవుతన్ = రక్షించుగాక అని కృతిపతి కాశీర్వచనము. ఇందులో శుభక్రమాకలనచే అన్నచోట క్రమపాద నిక్షేపే అనెడి ధాతువువలన సన్నికల్లు ద్రొక్కించడమనే వ్యాజముచేతను రత్నము గప్పెనని ప్రకారాంతరముచేత నర్థము చెప్పుచున్నారుగాని, సన్నికల్లు ద్రొక్కించువేళ సీతాదేవి నిలిచియుండవలసినది. ఆలాగున నిలిచియున్నప్పుడు నిజమంజీరాగ్రరత్నమందు నిజాకార ప్రతిఫలనము లెస్సగా సంభవింపదు. ఇంతేకాకుండా శుభక్రమాకలనయనగా శుభపాదవిక్షేపణాకలనమని చెప్పితే క్లిష్టనామకదోషమున్ను ప్రాప్తమగుచున్నది. శుభక్రమాకలన యనెడు పదమునకు పాదవిక్షేపణాకలనరూపార్థమే కవి హృదయమైనట్టయితే పదక్రమాకలనయని రచించును. అలాగున లేదు గనక ప్రకారాంతర మంగీకరించదగినది కాదు. ఇక్కడ సీతాదేవికి స్వాధీనపతి కాత్వమున్ను శ్రీరాములకు అనుకూల నాయకత్వమున్ను తెలియబడుచున్నది. "ప్రియోపలాలితా

నిత్యం స్వాధీనపతికామతా, ఏకాయత్తోనుకూలస్వాయ దితితల్లక్షణమ్'. అనగా వివాహ సమయమందు సీతాదేవి సిగ్గుచేత తలవంచుకొని పాదముల వంకనే చూచుతున్న యెడల కాలి అందెయొక్క నాయకమణియందు ప్రతిఫలించిన తన రూపమును తానే చూచి అదివరకు పాషాణమును స్త్రీనిగా జేసినటువంటి శ్రీరాములవారి పాదరేణువువలన యీ రత్నమున్ను పాషాణమే గనక స్త్రీ అయినాదా యేమి అనేటట్టు భ్రాంతిని పొందుచూ నుండగాను ఆ భావము తెలిసి విలాసవతిగాను ఆ రత్నముమీద చెయివేసి కప్పినవాడై ఆమెయొక్క భ్రాంతిని పోగెట్టనని తాత్పర్యము. (D.759, p.p.1007, 1008)

అప్పయ్యగారి పద్ధతి యింత సరళమైనది కనుకనే బ్రౌనుదొరగారు ఒకటి కాదు, రెండు కాదు పది కావ్యాలకు అప్పయ్యగారి చేత తీర్పు, టీక చెప్పించారు. వీటిలో కొన్ని ఇతరులు చెప్పిన వాటికి సవరణలు, కుదింపులు. అప్పయ్యగారి శంఖంలో పోస్తేనేగాని బ్రౌను దొరగారికి ఏ తీర్పూ తీర్థం కాదు.

అప్పయ్యగారు 'యదువంశభూషణా' శతకమేకాక 'రామప్రశాంతతకందం' అనే యాభై కందపద్యాల కృతినీ 'శ్రీనివాసతారావళీ' అనే 27 పద్యాల విప్రలంభ శృంగార రచననూ చెప్పారు. వీటి ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో D.731 అనే పెద్ద బుక్కు సంపుటంలో ఉన్నాయి (నెంబర్లు 39a, 47a, D కేటలాగులో D.730 లక్ష్మీనారాయణ సంవాదం అనే పేరుతో ఈ పెద్ద బుక్కును పొరపాటున పేర్కొన్నారు.)

జూలూరి అప్పయ్యపంతులు గారికి కవిగా పేరు రాలేదుగాని గొప్ప వ్యాఖ్యాతగా చెదరని స్థానం తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ ఉంటుంది.

ములుపాక బుచ్చన్న శాస్త్రి

నందలూరు వాస్తవ్యుడైన ఈ కవిపండితుడు బ్రౌను దొరగారి కొలువులో కడప బంగళాలోని కాలేజీ కచ్చేరీలో నెలజీతం మీద పనిచేశాడు. ఈయన 'వెంకటేశ్వర మాహాత్మ్యం', 'మాఘ మాహాత్మ్యం' అనే కావ్యాలను రచించాడు. మొదటి కావ్యానికి నాలుగు ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. వీటిలో రెండు తాళపత్ర ప్రతులు, రెండు కాగితం ప్రతులు. కాగితం ప్రతులలో ఒకటి అసమగ్రం. (D-355) ఈ కావ్యం వల్ల ఇతడు కోనసీమ ద్రావిడ బ్రాహ్మణుడనీ, శంకర శాస్త్రి శిష్యుడనీ మట్లవారు పాలించిన గుడ్లూరులో వుండేవాడని తెలుస్తుంది.

రసము పాకంబు శయ్యము రక్తి వృత్తి
రీతి వ్యంగ్యంబుల కృతి ఖ్యాతి మీర
గలుగ జెప్పంగ వలయు సత్కవికి నిన్ని
యెట్లుగల్గు నటంచు నూహించుచుండ

ఈయనను దేవుడు కరుణించాడట. కృతులు చెప్పాక ఈయనకు బ్రౌనుదొరగారి ప్రాపకం దొరికింది. కవికదా! వసుచరిత్రకు టీక చెప్పలేడా? అని ఆ పనిలో దొరగారు ఇతణ్ణి నియోగించారు. 'ప్రతిపదార్థ ప్రవేశిక' అనే పేరుతో టీకను రచించాడు. సర్వసాధారణంగా స్వతంత్ర కావ్యాలలో చెప్పే మాదిరి కృత్యాది పద్యాలు రచించాడు.

బ్రౌను దొరగారిని ప్రస్తుతించాడు. ఈనాడు దేశంలో బాగా ప్రచారం పొందిన ఈ క్రింది పద్యం అందులోనిదే.

నూరార్లు లెక్కసేయక
పేర్లందిన విబుధ జనుల బిలిపించుచు నే
మార్లర్థ మిచ్చు నితరణి
చార్లీసు ఫిలిప్పు బ్రౌను సాహెబు కరుణన్ (D.760)

పేర్లందిన విబుధుడు కదా అని పిలిపించి బ్రౌను దొరగారు 'సరసోక్తులచే' టీక రాయమంటే కొరకరాని కొయ్యలాగ దానిని బుచ్చన్న చెప్పాడు. జీతం అంటే ఇచ్చారుగాని టీకను దొరగారు ఆమోదించలేదు. ఆ సంగతి తెలుపలేదు. దొరగారికి బుచ్చన్న కడప నుంచి ఒక లేఖ రాసుకొన్నాడు. ''తమ పండితుడు ములుపాక బుచ్చయ్య శాస్త్రి వినయపూర్వకముగా అనేక సలాములు జేసి వ్రాసుకున్న విజ్ఞాపన పత్రిక యేమంటే, తమ శెలవు ప్రకారము కృష్ణారెడ్డి పంపించిన వసుచరిత్ర ప్రతిపదార్థ ప్రకాశిక తమరు అంగీకరించినదీ లేనిదీ తెలియలేదు. యిక్కడనైతే బహుమంది పెద్దలు అంగీకరించి బహుదేశముల వారు వ్రాసుకొని పోతూనూ వున్నారు. ఆ ప్రకారము బహుమంది విద్యార్థులు వ్రాసుకొని వర్ణిస్తా వున్నారు. తమ పేరిట కృతి గనుక తనంతటనే విస్తరిల్లుతూ వున్నది. నేను తమరు సుకృతంగా పాఠశాల పెట్టి అనేకమందికి గీర్వాణ వ్యాకరణ కావ్యనాటకాలంకారాది గ్రంథములు అభ్యసింపచేస్తూ వున్నాను. యింత పర్యంతము తమరు ఇప్పిస్తూ వచ్చిన ద్రవ్యమునుపయోగించి కాలయాపన చేస్తూ వుంటిని. యిప్పుడా ద్రవ్యము సరిపోయినందున అశనాచ్ఛాదనాలకు నేనా శ్రమపడుతూ వున్నాను. లోగడ సముఖాన మనవి జేసుకున్న ప్రకారము నాఘటుము వున్నంతకు అన్నము ఇచ్చి కాపాడితే తమకు బహుపుణ్యము వస్తూ వున్నది. తమరు ఉపేక్ష చేసిన పక్షమందు యీ వార్ధికములో బహు కష్టపడేను. కాంగా నాయందు కటాక్షించి నాకు అన్నానకుగా కృష్ణారెడ్డికి వ్రాయించి దయచేయకర్తలు. పత్రిక ముఖాంతరం విశేషము యేమి వ్రాయవలసినది యీ పత్రికనే నన్నుగా కటాక్షించి అన్నమిచ్చి కాపాడవలెనని కోరుతూవున్నాను. యీ చిన్న గురువరాజు మనవి చేయగా నా వర్తమానమంతా చిత్తానకు వచ్చేవి యింతే విజ్ఞాపన పత్రిక.'' తను వేసుకొన్న పథకాలకు తోడ్పడే పండితులనే బ్రౌను దొరగారు పోషించేవారు. ఆయన ఒక సివిల్ సర్వెంటేగాని జమీందారు కాదు. ఆశ్రితులు మాత్రం చాలామంది. ఎందరికని అన్నం పెట్టగలడు?

బేతపూడి సుందరరాయుడు (1800 (?) - 1860)

ఒకరి దగ్గర కొలువుచేస్తూ అంతకన్నా మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించడం మెచ్చుకోదగ్గ విషయమే. కృష్ణాతీరం పులివర్తి సమీపంలో ఉన్న బేతపూడి గ్రామవాసి సుందరరాయుడు మచిలీపట్నం వెళ్ళి చదువుకొని, మద్రాసులోని కాలేజీ పాఠశాలలో చదువుకొని కలెక్టరేటు టీచరుగా పనిచేసి రిడక్షన్‌లో ఉద్యోగం పోయినా దొరల ప్రాపకం వల్ల తెల్లదొరలకు చదువుచెప్పే మనిషిగా ఉద్యోగం సంపాదించుకొన్నాడు. ఆ దొరలకు చదువు చెప్పడానికి వాళ్ళతోపాటు నీలగిరి కొండలకు వెళ్ళి అక్కడే కొన్నాళ్ళు ఉన్నాడు.

నీలగిరికి వెళ్లేటప్పుడు మిత్రుల కోరికమీద నీలగిరికి పొయ్యే మార్గంలో ఉన్న బస్తీ గ్రామముల చర్యలు, ఆ కొండమీద జరిగే చర్యలు వచన పూర్వకముగా సంధినియమము లేక నూతనముగా విద్యనభ్యసించేవారలకు సులభముగా అర్థమయ్యేటట్లు ఒక సమాచార పత్రికను వ్రాసి పంపుతూ ఉండేవాడు. ఇదే 'నీలగిరి చరిత్ర' అనే పుస్తకరూపం దాల్చింది. దీనిని తెల్లదొరలు చదువుకొనేవారు. దీని వ్రాతప్రతి ఒకటి ఇంగ్లండులోని హెయిల్‌బరీ కాలేజివారి కోసం పంపాడు. ఈస్టిండియా కాలేజి లైబ్రరీలోని Mss-Tel.D.4 అనే ప్రతిలో మూడు ప్రకరణలు ఉన్నాయి.

బేతపూడి సుందరరాయుడు ఇంగ్లీషు చదువులవల్ల ప్రభావితుడైనట్టు కొంతవరకే కనపడుతుంది. ఈ నీలగిరి చరిత్రను నారదుడు నందికేశ్వరునికి చెప్పినట్టు కథనం చేశాడు. నీలగిరిని కనిపెట్టిన 'ఛవలను' దొర (Sullivan)కు కొండమీద వుండే హనుమంతుడు దొరగారి పూర్వజన్మమును గురుతెరిగిన వాడు కనుక దారి చూపించాడట. ఇటువంటి సనాతన భావాలు తప్పిస్తే సమకాలిక విషయాలు చాలా ఈ చరిత్రలో సుందరరాయుడు చెప్పాడు. ఇంగ్లండులోని ఈ పుస్తకాన్ని సివిల్ సర్వెంట్లు చదువుకొన్న దాఖలాలు ఆ పుటలలో రాసుకొన్న అనువాద పదాల వల్ల తెలుస్తుంది.

బేతపూడి సుందరరాయుడు నీలగిరి చరిత్రలో మార్గ పద్ధతి - కొండ స్వాధీనమవుట, కొండ వృత్తాంతము, స్థలమాహాత్మ్యము అనే ప్రకరణాలు మొదట రాయించాడు. తరువాత 'కాలేజీ వృత్తాంతము - పొగబండి సంగతి' అదనంగా చేర్చాడు. రెండవ భాగంలో అర్జీలు చేర్చాడు. 'రెవిన్యూ అండు మేజిస్ట్రేటు డిపార్టుమెంటు, జూడీస్సైయాల్ డిపార్టుమెంటు, పబ్లిక్ వర్కు డిపార్టుమెంటు, మిలిటేరి డిపార్టుమెంటు' అనే నాలుగు విభాగాలలో అర్జీలున్నాయి. కాలేజీ వృత్తాంతంలో స్వవిషయం కొంత చెప్పుకొన్నారు. దానివల్ల ఆనాటి చదువుల సంగతి మరింత విశదమవుతుంది. ఆ భాగాలను విపులంగానే పరిశోధకులు ఇంతకు ముందు ఉదాహరించారు.[9]

''నేను మచిలీపట్టణము నుంచి వచ్చి చెన్నపట్టణపు కాలేజియను పాఠశాలయందు ప్రవేశించి సంస్కృతము - తెలుగు - ఇంగిలీషు - యీ మూడు భాషలు అభ్యసించుటకై సర్కారువారివల్ల - నెల ౧ కి ర్పూ ౧౫ జీతము గల కల్కుటరే టీచర్ పనిలో యేడు సంవత్సరములు వుంటిని - తరువాత గౌరన్మెంటు రిడక్షన్‌లో ౧౮౩౬ సంవత్సరములో ఆ పని నిల్చినది - వెంటనే - ఏ. డి. క్యేంబిల్ దొరగారి ప్రాపకము వల్ల కేపటన్ రౌల్యాండసన్ దొర శక్రటేరిగా వుండేటప్పుడు తిరిగి కాలేజీలో ప్రవేశించి మునిషి పనులవల్ల, జీవనము జరుపుకొంటూ - దొరలదగ్గర యోగ్యతా పత్రికలను పొందుతూ బహుకాలము జరిపినాను - ఇదిన్నిగాక యీ చెన్నపట్టణపు రాజధానికి వచ్చే దొరలు సదరహి కాలేజీలోనే కొందరు మునిషీలవల్ల ఆయా దేశభాషలు చదివి - ఆదినుంచి తెలుగు పరీక్షాధికారులగు దొరలలో మహారాజే శ్రీ- జాన్- మక్కెరల్- ఏ- డి- కెంబెల్- జె- సి- మారీసు సి.పి. బ్రౌన్ - జే- డి- సిం- కేప్టన్ - జే- సి- మగ్డానల్ అనే దొరలవల్ల వారి

9. కొత్తపల్లి వీరభద్రరావు - తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం - పుట 207.

దగ్గిర హిందువులలో పరంపరగా సన్నిధానవర్తులున్ను ఇంగిలీషు సంస్కృతాంధ్ర భాషలయందు పూర్ణపండితులున్నగు - శ్రీ-సైదాపేట-మీనాక్షయ్య (2) రావిపాటి-గురుమూతిన్ శాస్త్రి (3) - అడక్కి - సుబ్బారావు (4) - శ్రీ పెరుంబుదూరు - కృష్ణమాచార్యులు (5) రావిపాటి - గురువయ్య వీరి ద్వారా పరీక్షింపబడి యోగ్యతా పత్రికలు వహించి వారివారి హోదాల ప్రకారము - దొరలు ఆయా జిల్లాలకు - సర్వాదికాలుర్గా గవరన్మెంటువారి వలన నియమింపబడి వ్యవహారిస్తూ వుందురు - మరిన్ని - హైయిస్కూలనే - హిందూ పాఠశాలయందు - ఇంగిలీషులో సకల విద్యాపారంగతులయిన - ఇ- బి. పవల్ అనే ఇంగిలీషు దొరగారు పైన చెప్పిన రాజధానిలో ప్రవేశించుటవలన - సమస్తమైన హిందువులకు ఇంగిలీషు పాండిత్యము కలగజేసి - ఆ భాషయందు వుండే సకల శాస్త్రముల యందున్ను యోగ్యతల కలగచేసినారు - అందువల్లనే హిందూ దేశస్థులందరున్ను ఆ దొరగారి పేరు చెప్పుకొని కష్టపడి చదివి యోగ్యతా పత్రికలను పొంది పైన చెప్పిన రాజధానిలో చేరిన ఆయా జిల్లాలలో గొప్ప హోదాలను కలగచేసుకొని సౌఖ్యములను జెందుతున్నారు.'' (నీలగిరి చరిత్ర : పుటలు ౨౬, ౨౫)

నీలగిరిలో దొరలకు పాఠాలు చెప్తూనే ఆ చలి భరించలేక మద్రాసులో ఉద్యోగం కోసం సుందరరాయుడు ప్రయత్నించాడు. తనకు పూర్వ పరిచయం ఉన్న బ్రౌను దొరగారికి ఈ కింది ఉత్తరం రాశాడు.

''మహారాజశ్రీ సి.పి. బ్రౌన్ దొరగారి సముఖమునకు తమ ఆశ్రితుడు బేతపూడి సుందరరాయుడు అనేక సలాములు చేసి వ్రాసుకున్న అర్జీ విన్నపము యేమంటె'',

''నా దగ్గిర చదువుతూవుండే దొరలలో వోగిలివి దొరగారు తెనుగులో అర్జీలు చదువగలరు. తనంతట తాను తర్జుమా కొంచెం సుమారుగా చెయ్యగలరు. మాటలు కూడా సుమారుగా మాట్లాడగలరు. గ్రామరు విషయం బాగా తెలుసును. యిదిగాక లూయను దొరగారు నాదగ్గిర మూడు నెలల నుంచి చదువుతున్నారు. ఆయన అర్థగ్రాహ్యాము చేసుకోగలరు. కొంచెం మాట్లాడగలరు. తర్జుమా కొంచెం కొంచెం యిప్పుడు ఆరంభం చేస్తూవున్నారు. అయితే బుద్ధి బహుసూక్ష్మంగా వున్నది. శీఘ్రంగా గ్రహించదగ్గవారే. వారికి కూడా అర్జీల మీదనె పాటు చేయిస్తున్నాను, సదరహి యిద్దరు దొరలు అరవ భాషలోను ఇదే ప్రకారం కొంచెం యెచ్చు తగ్గుగా వున్నారు. మార్చినెలలో తమ సముఖములోకి వచ్చి పరీక్షివ్వవలెనని వున్నారు. గనక యీ సంగతులు తమ చిత్తానకు విశదం కాగలందుల్కు మనవి వ్రాశినాను.

''యిదిగాక కాలీజి తెలుగు మునిషీలలో విశ్వంభర శాస్త్రులు రాజీనామా యిచ్చినట్టు నాకు తెలిసినది. ఆ మాట నిజమైతే సరే. లేక యిఖమీద రాజీనామా దాఖలు చేసెలాగున వుండెనా నేను బహుదినముల నుంచి కాలేజీలో సరటఫకెట్టు సంపాదించుకోవలెనని అక్కడనే కనిపెట్టి తమ దయను కూడా అనుసరించుకొని వున్నాను. ఆ యిలాకా రిడక్షన్‌లో పనిపోయినందున అక్కడ తిరిగి వకటి ఖాలి అయితే

నాకు యిత్తురనే అభిప్రాయంతో జీవనానికి గడియక నానా శ్రమపడుతూ యీ నీలగిరికిన్ని వచ్చి దేహానికి సరిపడక వున్నా నేను చదువు చెప్పే దొరలకు నావల్ల విఘాతం లేకుండా వారి దయకున్ను పాత్రుణ్ని కావలెననివున్నాను. అయితే యిది వర్కు నా గ్రహచార సామాన్యం వల్ల అనేక పనులు ఖాలి అయినా వకటైనా నాకు దొరకకపోవడం తమ చిత్తానికే విశదం అయి వుండడం చేత నేను విస్తరించి వ్రాసుకోలేదు. యీ విశ్వంభర శాస్త్రుల సరిటఫికేట్టు నాకు దయచేసి నన్ను పరీక్ష చెయ్యావలెనని తమ అభిప్రాయం వుంటె అది అయ్యేవరకు ఆ పని వకరికిన్నీ యివ్వక నిలిపి పెట్టవలెనన్ని నేను వచ్చిన మీదట నన్ను తమరు పరీక్ష చేసి తరువాతనైనా నాకు ఆ పని ఖాయంగా చేసి యివ్వవలెనని ప్రార్థిస్తున్నాను.

''మరిన్ని యిక్కడికి వచ్చిన మునిషీలు దొరలకు చదువు సాగ మునుపె వారి చదువుకు విచ్చిత్తు కలగజేసి, తిరిగి పట్నం లేచిపోతూ వుండినా నేను మాత్రం అన్ని కష్టములకు లోబడి వారి చదువుకు ఆటంకం లేకుండా సాగించవలెనన్ని, అట్లా లేచివస్తే తమ చిత్తానకు యెక్కడ కోపం వస్తుందో అనే భయం చేత యిక్కడనే వున్నాను. అయితే ఈ సమయంలో నేను అక్కడ లేనందున ఆ ఖాలి అయ్యె సరటఫికెట్టు ఎవరికైనా యిస్తారేమో అని నిండా భయంగా వున్నది. నాకు ఆ భయం లేకుండా నన్ను కాపాడవలసిన భారకులు తమరె గనుక విన్నపం వ్రాసుకొన్నాను.

''మరిన్ని నేను నా కొలువు సమగ్రంగా చేసి, పేరు తెచ్చుకోవలెనని వున్నందున యీ కొండమీద మంచు, చలిచేత యెన్ని కష్టములు సంభవించినా అవి అన్ని నోర్చుకొని యిక్కడనే వున్నాను. వకవేళ నేను యిప్పుడే రావలశినట్టున్ను అట్లా రాకపోతే పని దొరకదు అని వున్నట్టు అయితే యిప్పుడే రావలెను. అరణ్యామధ్యలో వున్నందున యేమి తోచక వున్నాను. మెట్టుకు ఆసరటుపడేటు నాకు వకటి దయచేసి నన్ను యట్లా ముందుకతేవలెనో అట్లా తెచ్చి ఆజ్ఞయే చొ॥ దయచేయిస్తే ఆ చొప్పున నడుచుకొంటున్నాను. గాని నా స్వతంత్ర్యం మీద వకటిన్ని చేయను. యిందున గురించి కాలేజీలో అర్జీ యిచ్చెలాగ్ను వక అర్జీ నాతమ్ముడైన మల్లయ్యా దగ్గిరికి అంపిస్తున్నాను గనక ముందుగా తమకు విన్నపం వ్రాసుకున్నాను.

నీలగిరి

1842 సం॥ జనవరి నెల 9వ తేది''

(M.420 pp.282-85)

బ్రౌను దొరగారు సిఫార్సు చేశారో లేదో తెలియదు. సుందరరాయుడు దర్శనం చేసుకొన్నప్పుడు గానీ అతని తమ్ముడు మల్లయ్యా వచ్చినప్పుడుగాని దొరగారు 'నవనాథచరిత్ర' వ్రాతప్రతి గురించి వాకబు చేసినట్టున్నారు. సుందరరాయుడు హైదరాబాదులో ఉన్న తన అన్నగారు బేతపూడి సాంబయ్యా గారికి ఆ పుస్తకం గురించి చాలాగా రాశాడు. ''నీవు వ్రాసిన ప్రయోజనము నాకు స్వకార్యమే గనుక యెక్కడయినా ఆ గ్రంథం జాడ దొరికిన పక్షమందు సాధించి పంపిస్తున్నాను'' అని అన్నగారు జవాబు రాశారు. (M.411-pp.102-104)

బ్రౌను దొరగారి ప్రాపకం దొరకకపోయినా బేతపూడి సుందరరావుకు అతని దగ్గిర చదువుకొన్న ఆర్.యస్. ఎల్లిస్ చాలా పెద్ద హోదాలో ప్రవేశించాక నీలగిరి చరిత్రను అతనికి అంకితం ఇచ్చాడు. ఇది 1864లో సుందరరాయుని మరణానంతరం అచ్చుపడింది. అయితే ఇందులోని భాగాలు 1830-40 మధ్య చెన్నపట్నం నుండి వెలువడుతున్న 'వృత్తాంతి' అనే పత్రికలో మొదట ప్రచురితమయ్యాయి. ఈ నీలగిరి చరిత్ర ఇటువంటి గ్రంథాలకు దారితీసింది.

కోలా శేషాచలం

నీలగిరిని కనిపెట్టాక ఆ శీతల వాతావరణం తమ దేశీయులకు వేసవిలో అనువైనదని మద్రాసులోని తెల్లదొరలు భావించారు. గవర్నరు మొదలుకొని ఎందరెందరో ఎండాకాలంలో నీలగిరికి వలస వెళ్ళేవారు. అది వేసవి రాజధానిగా మారడం వల్ల సివిల్ సర్వెంట్లూ వాళ్ళు, కచ్చేరీలో పనిచేసే నేటివు ఉద్యోగులూ ఫైళ్ళు బళ్ళకెత్తించి అక్కడకు పయనమయ్యేవారు. థామస్ సింప్సన్ దొరగారి కచ్చేరిలో మాంగాడు శ్రీనివాస మొదలి ప్రధానోద్యోగిగా ఉండేవాడు. ఈయన దగ్గిర కోలా శేషాచలం గుమాస్తాగా పనిచేసేవాడు. ఇతడు కవి. మద్రాసు చింతాద్రిపేటలోని వెంకటాచలనాయని పుత్రుడు. యాదవుడు. విద్యలు నేర్చి కచ్చేరీ కొలువులో చేరాడు. తనపై ఉద్యోగి శ్రీనివాస మొదలియారు వద్ద గణిత శాస్త్రాన్ని అభ్యసించాడు.

1846 మే నెలలో చెన్నపట్నం నుండి బయలుదేరి శేషాచలం నీలగిరికి వెళ్ళాడు. 1847 జనవరి 13వ తేదీనాడు మరలా స్వగ్రామానికి వచ్చాడు. ఈ మధ్యకాలంలో తాను చేసిన పయనాలు, చూసినవాటి వైనాలు 'నీలగిరి యాత్ర' అనే వచన గ్రంథంగా ఉత్తరోత్తరా రచించాడు. ఆనాడు అందరూ సామాన్యంగా రాసే వాడుక భాషలోగాక కృతక గ్రాంథికంలో దీనిని రచించడం ఒక విశేషం. ఇది చిన్నయసూరి రచనలకు ఒక దశాబ్దం ముందుగానే బయలుదేరిన కొత్త ఫ్యాషను.[10]

శేషాచలం గ్రంథంలో మూడు ప్రకరణాలు ఉన్నాయి. నీలగిరి చేరేదాకా వున్న వృత్తాంతం తొలి ప్రకరణంలో, నీలగిరి విశేషాలు రెండో ప్రకరణంలో, తిరుగు ప్రయాణం చివరి ప్రకరణంలో వున్నాయి. 'స్వదేశ భాషాభ్యాసలోలురగు బాలుర కనవధిక వాచక వైభవోన్మేషకరంబును, సమధిగత శాస్త్రలక్షణ విచక్షణ శిక్షితంబుకగునీగ్రంథంబు' శేషాచలం రచించాడు. దాన్ని పాఠ్యగ్రంథంగా పెడతారని ఆశించాడేమో. అలా జరగలేదు.

''అత్యావశ్యకంబులగుట చేసి 'ఇంగిలీషు' మొదలగు కతిపయగ్రామ్య పదంబులు ప్రస్తుత వ్యవహారానుగుణముగా వాడక తప్పలేదు. అలా వాడినచోట్లు పువ్వు గుర్తు '*' ఆ మాట దగ్గర వాడాడు. బేతపూడి సుందరరాయుడు ఈ సంజ్ఞ వాడకుండానే ఇంగ్లీషు మాటలు ప్రయోగించాడు. ఇద్దరి పుస్తకాలను కొద్దిగా తైపారు వేద్దాం.

---

10. శేషాచలం గ్రంథ రచనా కాలం వివాదాస్పదం. దీని గురించి గోడేవారి ప్రకరణంలో విశదపరచాను.

''మరిన్ని ఆ కొండల మీదనున్న... మంచున్ను చల్లని గాలిన్ని వురలగడ్డలు, మెట్టకోసు, కాళిప్ల - తరనాస, కారెట్టు, ముల్లంగి, పటానీలు, చిన్న పెద్ద బీనసు, సీమ గుమ్మడికాయ మొదలయినవి వుండడము వల్ల మన స్వదేశముకంటె అతిశయము ఆ ఛవలనుదొర యేర్పరచినాడు'' అని సుందరరాయుడు రాశాడు.

''* ఎంగిలీషు రెడిష్ బీట్‌రూట్ * నోల్‌కోల్ * టర్నిప్స్ * కార్రాట్ అను గడ్డలు * స్పినేజ్ అనుశాకపత్రంబులు * కాలీఫ్లవర్ అను పువ్వు, విజటేబిల్ మారొయను శాఖశలాటువు * రాస్‌బెటి * మెల్‌బెటి, స్ట్రాబెటి * బ్లాక్ బెటి * హిల్‌గూస్ బెటి * పీచ్చెస్ * పియర్ * ఆప్పిల్ అనంబడు ఫలంబులు నమ్మలయంద గలుగుచున్నయవి. ఎంగిలీషు రెడిష్షనగా సీమముల్లంగి. ఇది యీ దేశపు ముల్లంగికంటె (గొంతనిడుద సన్నంబయి యెఱడాఱు మీఱికాఱుంబునుగొఱవడియున్నయదియి. బీట్‌రూట్టను కందంబులు త్రివిధంబులగురోహిత వర్ణంబులయియుండును''

ఈ విధంగా శేషాచలం ఎంగిలీషు నామంబులు వ్రాయబడి కందశాకాశాకాశలాటుల గురించి 58 పంక్తుల వచనం రాశాడు.

ఈ 'నీలగిరి యాత్ర'ను శేషాచలం గొడే జగ్గారావు గారికి అంకితమిచ్చాడు.[11]

కృతిభర్త ఈ గ్రంథాన్ని ఎలా మెచ్చుకొన్నారో, ఇందులో ప్రకరణాల ముందూ చివరా ఆశ్వాస ప్రారంభంలోనూ, అంతంలోనూ ఉన్నట్టు పద్యాలు సాధారణ వృత్తాలలోనేకాక స్రగ్విణి, భుజంగప్రయాతం, పంచచామరం మొదలైనవీ, గర్భకవిత, బంధ కవిత్వాలూ, పాదగోపనాలు మొదలైన పాండిత్య ప్రకర్షకు కావలసినవన్నీ వున్నాయి. తన కృతిని 'అసూయా విరహితులై గైకొనుండు' అని శేషాచలం ప్రార్థించాడు. ఈ కృతిని చూసి ఇవాళ ఎవరూ అసూయ కాదుగదా గర్వపడనూ పడరు. తెలుగు వచనం కృతక గ్రాంథిక రూపాన్ని సంతరించుకొంటున్నందుకు సిగ్గుపడడం ప్రారంభిస్తారు.

పెరన శ్రీమన్నారాయణ (1834–)

యుగధర్మం ఏమిటో తెలియకుండా అన్ని గ్రంథాలనూ ఛందోబద్ధం చేయబూనడం అవివేకం. కుంఫిణీ యుగంలో నిఘంటువులూ, వ్యాకరణాలూ సమస్తం వాక్య గ్రంథాల రూపంలో వస్తున్నప్పుడు సర్కారు వారి రెగ్యులేషన్లను పద్యకావ్యంగా చెప్పాలనుకొన్న ఘనుడొకడున్నాడు. బ్రౌను దొరగారికి అతడు రాసిన ఉత్తరాన్ని చూడండి.

''మహారాజశ్రీ సీ.పీ.బ్రౌన్ దొర యిస్కాయరు జడిజీ జిల్లే రాజమహేంద్రిగారి దివ్యసముఖాన్కు ఆశ్రితుడు పెరన శ్రీమన్నారాయణ వ్రాసుకొన్న అర్జీ విన్నపములు. అన 1802 సంవత్సరం ది. 13 జూలయి తారీఖున మహారాజశ్రీ గౌనరుకంసలేర్లు వారి చాత

11. బేతపూడి సుందరరాయుడితో తులనాత్మక విశ్లేషణ చేయడానికే కోలాశేషాచలం సంగతి ఇక్కడ చెప్పుకొంటున్నాం. ఇతడు కొంచెం అర్వాచీనుడు.

కరణముల నిమిత్తం నిర్ణయింపబడ్డ యిరువది తొమ్మిదో రెగ్యులేషన్‌లో వున్న పందొమ్మిదో శిక్సనుల తాత్పర్యమున్ను నేను తెలుగున పద్యకావ్యం చేసినాను. తదారభ్యా ఆ గ్రంథం ఆ మట్టున అట్టే వున్నది. తమరు సకల ధర్మస్వరూపులు. పండిత శ్రేష్ఠులు ఆంధ్ర గీర్వాణముల యెందు కవిత్వములు విమర్శించే యెడల భోజరాజులని తమ యొక్క కీర్తి జగద్విఖ్యాతమైయున్నది గనుక ఆ గ్రంథం తమ సన్నిధికి పంపిస్తిని. యిరువయ తొమ్మిదో రెగ్యులేషన్ చిత్తగించి ప్రవేశిక్యను భావము పద్యముల యెందు విమర్శించి తప్పులు వున్న పక్షమందు క్షమచేసి దిద్దించి కరణములు యీ గ్రంథము కంఠోపాఠము చేసుకొనేలాగు సరికెలెరు ఉఖుం దయచేయించి ప్రకటన చేయించవలెనని వేడుకొంటూ వున్నాను. యింకా ముఖ్యమైన కొన్ని రిగ్యులేసనలు శలవు ప్రకారం పద్యకావ్యం చెయ్యవలెనని తాత్పర్యం వున్నది. సకలధర్మ స్వరూపులైన మహారాజశ్రీ గౌనరుమెంటు వారిచాత విరచింపబడ్డ రిగ్యులేసనలు భారత భాగవత రామాయణాది గ్రంథములవలెను ఛందోబద్ధములు శాశ్వతమై ఆచంద్రార్కమై వుంటున్నవి. నేను దర్శనానికి వచ్చి సముఖమందు నాఖీకత్తు విజ్ఞాపన చేసుకొందామంటే పెద్దవాణ్ణిన్ని శరీర రుగ్మత కలవాణ్నిన్ని అయివుండి నా దగ్గిర చదువుకుంటూ వున్న భట్రాజు మూ॥ గ్రంథ యిచ్చి పంపిస్తిని. దాఖలు చిత్తగించవలెను. దొర ముందువుండి ధ్యానం చేసినంత మాత్రంచాత గజేంద్ర ద్రౌపదుల ప్రాణమానములు రక్షించిన నారాయణహంశాసంభూతులు గనుక నిర్భయంగా అభయం వేడుకొని అర్జీ విన్నపం వ్రాసుకొన్నాను. 10 అక్టోబరు 1834.'' (M.417 పుట 452).

మారుతున్న లోకంతో మారనివాళ్లూ వుంటారు. మారి బాగుపడ్డ వారూ ఉంటారు.

''ఉద్యోగస్తులలో ఒకడు'' (1793 ప్రాంతాలు)

స్వదేశీయ ధర్మశాస్త్రాలు న్యాయ విచారణలో ఎంత ముఖ్యమో, పరిపాలన ప్రారంభమయ్యాక ఆ ప్రభువులు ఏర్పాటు చేసిన రెగ్యులేషన్ల పరిధిలోనే వ్యాజ్యాలు నడుస్తాయి కనుక ''అదాలతు చట్టచిట్టాలు'' ప్రజలు తెలుసుకోవాలి. ఇంగ్లీషువారు తమ భాషలో రచించిన వీటిని ప్రాంతీయ భాషలలో అనువదించి ప్రజలకు తెలియచేయాలి. ఈ పనిని ఇంగ్లీషు తెలుగు తెలిసిన విద్యావంతుడు ఒకడు చేసి లాభం పొందాడు.

లండన్ ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో చాలా వ్రాతప్రతులు ఉన్నాయి. వాటిని ఓపికగా పరిశీలిస్తే ఇటువంటి విషయాలు బయటపడతాయి. ఆ గ్రంథాలయంలో 'Mss-Tel C-1' అనే నెంబరు గల పుస్తకం చాలా ఆసక్తిదాయకంగా ఉంది. ఇది 120 ఫోలియో పుటలు గల గ్రంథం. మొదటి పద్దునుండి ఎనభై ఎనిమిదో పద్దుదాకా చట్టదిట్టాలు విశదం చేశాడు. ఆ పుస్తకం ముఖచిత్రం ఇలా వుంది.

(కుంప్పని వారి జాగీరు భూమిలో నుంన్ను మరింన్ని
టీపు సుల్తాన్ వల్ల విడ్డపడ్డి తాలూకా
నీతి న్యాయం నడిపించ్చే నిమిత్యం చట్టదిట్టాలు
చెంన్నపట్ణంలో వుండె
కౌంస్సిల్‌లో గవర్‌నర్ వారి ఆజ్ఞ ప్రకారం
హానరబుల్ కుంప్పిని వారి వుద్యోగస్థులలో
ఒకడు అలక్ సాండ్దర్ ఫాల్‌కొనర్ అనే వారి వల్లను
యింగిల్సీసు తెల్గు భాషలూ
తరజ్మ ఛాయ పడింద్ది
౧౭౯౩ సంవత్సరంలో

పద్దెనిమిదో శతాబ్దంలతోనే 'ఒకడు' ఇలా అదాలతు చట్టదిట్టాలను వాక్యరూపంలో 'తరజ్మ' చేయడం సమకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే.

రావినూతల రామయ్య (1840 ప్రాంతాలు)

1793లో కుంఫిణీ ఉద్యోగులలో 'ఒకడు' తన పేరు చెప్పుకోక కోర్టు గ్రంథాలు తెనిగించాడు గానీ, 1846 నాటికి ముందే రావినూతల రామయ్య అనే ఆయన 'కోడ్ ఆఫ్ రెగ్యులేషన్స్ అండ్ లెజిస్లేటివ్ ఆక్టులు' తర్జుమా చేసి ప్రచురించారు. 1846లో ఇంకొక గ్రంథం ప్రచురించారు. ముఖపత్రం ఇలా వుంది.

ఫౌజుదారీ అదాలతు కోర్టు యొక్క సరిక్యూలరువులు
౧౮౦౫ సం॥ మొదలు ౧౮౪౫ సం॥ జూన్ ౬ తేదీ వరకు
యిందులో కడపట యిండెక్సు అనే సూచి చేర్చబడినది. చన్నపట్నం కలెక్టర్
కచేరి లేటు నవుకరు రావినూతల రామయ్య వల్ల
తర్జుమా చేయబడ్డది చన్నపట్నం
వర్తమాన తరంగిణి ముద్రాక్షరశాల (౧౮౪౬ సం॥)

ఇది 409 పుటల గ్రంథం - 76 పుటల ఇండెక్సు ఉంది. సాంఘిక చరిత్రకు చాలా ఉపయోగపడుతుంది. ఈ ముద్రిత గ్రంథం లండన్‌లోని ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో ఉంది. (కాల్ నెంబరు TELC-466). ఇటువంటి గ్రంథాలను వర్తమాన తరంగిణి ముద్రాక్షరశాలవారు చాలా ప్రచురించారు.

కర్నల్ కాలిన్ మెకంజీ దొరగారు 'తయారుచేసిన కలెక్షన్'లో నుంచి కయిఫియ్యతులు ఇప్పటికీ మన తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించే ప్రయత్నాలలోనే ఉన్నారుగాని 'వర్తమాన తరంగిణి' వారు ఎప్పుడో వాటిలోని పనికొచ్చే భాగాలను అచ్చువేసి అమ్ముకొన్నారు.

లండన్‌లోని ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో వున్న "OR.9672' అనే కైఫియత్తులు గ్రంథంలో ఇలా ఉంది.

''యీపయి కనుపరిచిన విషయములు యావత్తు ముందు రచింపబొయ్యేడి గ్రంథమునకు అనుక్రమణికగా నగుచున్నవి. లేక వారి ప్రభుత్వ మాయారాజుల నామములను వారు జీవించి యుండిన కాలములను లేక వారి ప్రభుత్వ ప్రాబల్యముయొక్క సమయములను మాత్రమే తెలియచేయుచున్నాము.

ఈ పంచాంగములను పుచ్చుకొనెడి వారు సంవత్సరం 1 కి రు. 3 చొప్పున మాకు చెల్లించుట కంగీకరించి వకసంవత్సరపు పయకమును ముందుగా పంపించిన యడల సదరు విషయముతో చేరిన గ్రంథము సాంగముగా రచించుటకు నిశ్చయించడమైనది. పు. వెంకట్రావు అని వున్నది'' (పుట 51). చందాదారులు చేరారో లేదో, ఆ గ్రంథం సాంగంగా రచించడం జరిగిందో లేదో. ప్రస్తుతం లభించే ఆకరాల వల్ల తెలియదు. కుంఫిణీ యుగంలోని చరిత్రలను సాంగం రచించడానికి ఇతోధిక కృషి చాలా అవసరం. దక్షతగల పరిశోధకుడు దీక్షగా లండన్ ఇండియా ఆఫీసు గ్రంథాలయంలో పరిశోధనలు చేస్తే చాలా విషయాలు వెలుగు చూస్తాయి.

తమసోమా జ్యోతిర్గమయ!

అచ్చుకూటాలూ - పుస్తక ప్రచురణలు
(షూల్జి నుంచి సూరి దాకా)

కుంపిణీ యుగంలోనూ, దీనికి పూర్వ యుగాలలోనూ మన కావ్యాల చివర ఒక పద్యం కృతికర్తలు పొందుపరుస్తూ ఉంటారు. ఉదాహరణకు అల్లసాని పెద్దనగారు స్వారోచిష మనుసంభవం అనే పేరుతో మనుచరిత్ర రచించారు. దాని ఆఖరి ఆశ్వాసంలో ఈ క్రింది పద్యం కనబడుతుంది.

కోరిక నీ స్వారోచిషు
చారిత్రము వినిన, వ్రాయ, చదివిన, ధన ధా
న్యారోగ్యపుత్ర సంతతులు
నైరూఢిగ గంద్రు పిదప నమర్వతంబున్ (మను-6-121)

పద్యకావ్యాలలోనే కాదు ద్విపద కావ్యాలలో కూడా ఇటువంటి ఫలశ్రుతి ఉంటుంది. పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్యచరిత్ర చిట్టచివర దానిని విన్నా చదివినా వ్రాసినా అభిమత ఫలాలు పొందవచ్చునని స్పష్టం చేసి...

కావున నీకృతి గారవించినను
నావిరి చదివిన వ్రాసిన వినిన
నరువొంద వారల కభిమతార్థంబులు
గరుణించు శివుడు మంగళ మహశ్రీలు

గ్రంథకర్తలు సంపూర్ణంగా విరచించిన కృతిని ఎవ్వరైనా వినడం, చదవడం బాగానే ఉందిగాని మళ్ళా వ్రాయడం ఏమిటనే ప్రశ్న ఇవాళ మనలో చాలామందికి కలగవచ్చుగాని పూర్వం రచయితలు తమ గ్రంథాలను 'చెప్పేవారు', 'చేసేవారు' వ్రాయసగాళ్లు రాసుకొనేవారు. మాతృక నుంచి పుత్రికలు పుట్టించుకొనేవారు. అందుకే చాలా వ్రాతప్రతులలో చిట్టచివర లేఖకుడు ఒక హెచ్చరిక చేసేవాడు.

ప్రతిచూచి వ్రాసినాడను
అతి సెబ్రలు వ్రాలు, చూడవన్నియు దప్పుల్
యతియును బ్రాసము నెఱుగను
మతిమంతులు తప్పుదిద్ది మన్నింపరయా. (చాటుపద్యరత్నాకరం-176)

అచ్చుకూటాలు, పుస్తక ప్రచురణలు రాకముందు వ్రాతప్రతులే పాఠకులకు శరణ్యాం కనుక లేఖకులకు ఫలశ్రుతిని చెప్పడం తొలిరోజుల రివాజు. అచ్చుపుస్తకాలు వచ్చినా ఆ గ్రంథాల రచయితలు వాటిని వ్రాసినట్టు ముఖపత్రంమీద చెప్పేవారు కాదు. ఉదాహరణకు 1842లో ప్రచురించిన హరిశ్చంద్ర ద్విపద కావ్యం అట్టమీద ఇలా తెలుగులో చెప్పారు.

''ఈ గ్రంథము గౌరనమంత్రిచేత చెప్పబడ్డ సమగ్రమైన
హరిశ్చంద్ర ద్విపద కావ్యమున్ను
ఆయననే చెప్పిన నవనాథ చరిత్ర
ద్విపద కావ్యములో యుండేటి యొక కథయున్నుగలది''

ఇంకో ఉదాహరణ చూడాలంటే 'దాశరథీ శతకం' అట్టమీద ఇలా ఉంది.

శుభమస్తు
గోపకవీశ్వరునిచేత చేయబడిన
దాశరథీ శతకము
తప్పులు లేనట్లు పరిశోధింపించి
ఆ. అనంతాచార్యుల వారిచేత
సరస్వతీ పీఠ ముద్రాక్షరశాలయం
దచ్చువేయంబడియె
శాలివాహనశకంబులు - ౧౭౬౭
విశ్వావసు - సం॥ పంగుని నెల

ఈ పై రెండు ఉదాహహరణల వల్ల గ్రంథకర్తలు తమ కృతులను 'చెప్పేవారు', 'చేసేవారు' అన్న సంగతి తెలుగులో పుస్తక ప్రచురణ ముమ్మరంగా సాగుతున్న 1845 ప్రాంతాలలో సైతం 'జనవాడుక'గా ఉండేది. అయితే 1869 నాటికి రచయితలు తమ గ్రంథాలను 'వ్రాయడం' రచించడానికి పర్యాయపదమయింది. ఏనుగుల వీరాస్వామిగారి కాశీయాత్ర చరిత్ర రెండవ ముద్రణ ముఖపత్రం ఇలా ఉంది.

కాశీయాత్ర చరిత్ర
యేనుగుల వీరాస్వామయ్యవారి
చేత వ్రాయబడి
కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్లగారి
వుత్తరువు ప్రకారం
పుదూరి నారాయణశాస్త్రిచేత
లేఖక తప్పులు దిద్దబడి
౧౮౩౮ సం॥ ఏప్రెల్ నెలలో
అచ్చువేయబడిన యీ పుస్తకము గవరన్మెంటు వారి వుత్తరవు ప్రకారము
వర్తమాన తరంగణీ ముద్రాక్షరశాలయందు
పువ్వాడ వెంకటరావుగారి వలన
రెండవ తూలి ముద్రింపబడినది
౧౮౬౯ సం॥ డిసెంబరు నెల

తెలుగులో పుస్తక ముద్రణ చరిత్రను ఇప్పటిదాకా ఎవ్వరూ మినహాయింపులు లేకుండా సమగ్రపరచలేదు. దానికి ఇతోధిక పరిశోధన అవసరం. భారతదేశంలో కుంఫిణీవారి రాజ్యాలన్నింటిలో ఒక్క చెన్న రాజధానిలో మొట్టమొదటిసారిగా క్రీ.శ. 1711లో ముద్రణ యంత్రాన్ని నెలకొల్పారని చరిత్రకారులు చెప్తున్నారు.[1] కలకత్తాలో 1779లోగాని ముద్రాక్షరశాలను స్థాపించలేదట! చెన్న రాజధానిలో ఆంగ్లేయులు ముద్రణ యంత్రాన్ని వాడుతున్న కాలంలోనే తంజావూరు దగ్గర ఉన్న తరంగంబాడి అనే డెన్మార్కు దేశపువారి మిషనరీలు ప్రెస్సును స్థాపించి తమిళ పుస్తకాలను అచ్చువేయడం ప్రారంభించారు. వీరిలోనే ఉత్తరోత్తరా తెలుగు పుస్తకాన్ని ప్రచురించిన ప్రసిద్ధుడు ఉన్నాడు.

మొట్టమొదటి తెలుగు పుస్తకాన్ని, అందులోనూ విదేశంలో అచ్చువేసిన గొప్ప వ్యక్తిగా బెంజమిన్ షూల్జి (1689–1760) అనే జర్మను ఫాదిరీని మనం జ్ఞాపకం పెట్టుకోవాలి. ఇతడు క్రైస్తవ మత ప్రచారానికి తన ఇరవై తొమ్మిదోయేట భారతదేశానికి వచ్చాడు. ఇరవైమూడు సంవత్సరాలు దక్షిణ భారతంలో సేవ చేశాడు. స్వదేశం చేరుకొన్నాక, అక్కడ పదిహేడు సంవత్సరాలపాటు తెలుగు పుస్తకాల ముద్రణలో బతుకు వెళ్ళబుచ్చాడు. మాతృదేశంలో సైతం తెలుగును విస్మరించనందుకు షూల్జిని అభినందించాలి.

షూల్జి జర్మనీలోని సోనెల్‌బెర్గ్ నివాసి. ప్రఖ్యాతమైన 'హాలే' విశ్వవిద్యాలయంలో చదివి పట్టభద్రుడయ్యాడు. అప్పటికే ఆ యూనివర్సిటీ నుండి కొందరు ఉత్సాహవంతులు ప్రచారం కోసం భారతదేశానికి వెళ్ళారు. హాలే విశ్వవిద్యాలయంలో మత విద్యాశాఖకు ఆచార్యుడుగా ఉండే అగస్టస్ హెర్మన్ ఫ్రాంక్ మెరికల్లాంటి కుర్రాళ్ళను తయారు చేశాడు.

1. C.J. Nirmal - The Journal of Indian History - Vol. XLIV.Part-II, 1966, p.483

సువార్త ప్రచారానికి దీక్షపూనిన సంస్థల తరపున వాళ్ళను విదేశాలకు పంపేవాడు. 1710లోనే అతడు హాలే నగరంలో మొట్టమొదటి బైబిల్ సొసైటీని సంస్థాపించాడు.

పదిపన్నెండేళ్ళకు ముందుగానే ఇంగ్లండులో రెండు సువార్త సంఘాలు వెలిశాయి. క్రీ.శ. 1699లో స్థాపించిన క్రైస్తవ జ్ఞానాభివృద్ధి సంఘం (ఎస్.పి.సి.కె.), 1701లో స్థాపించిన సువార్త ప్రచారక సంఘం (ఎస్.పి.జి.) చాలా చురుకుగా పనిచేస్తున్నాయి. అయితే ఈ సంఘాలవారు మత ప్రచారానికి మిషనరీలను భారతదేశానికి పంపలేకపోయారు. అందుకు రాజకీయమైన కారణాలు ఉన్నాయి. ఇంగ్లీషు తూర్పిండియా కుంఫిణీవారు దేశీయుల మతవిశ్వాసాల జోలికి ఎవ్వరినీ పోనివ్వరు, వాణిజ్యానికి అడ్డొచ్చే మత ప్రచారం అందరు వర్తకులూ అంగీకరించరు.

రాజశాసనం అయితే దేనికైనా వర్తకులు శిరసావహించాలి. డెన్మార్కు దేశీయులు అప్పటికే భారతదేశంలో కొన్ని గిడ్డంగులు కట్టుకొని వర్తకం చేస్తున్నారు. ఆ దేశపు రాజుకు క్రైస్తవ మత ప్రచారం పట్ల చాలా ఆసక్తి ఉంది. భారతదేశంలో తన ఏలుబడిలోని యువకులు విలాసపురుషులు, తాగుబోతులు, వ్యభిచారులు అని రాజపురోహితుడు చెప్పాక హాలే విశ్వవిద్యాలయంలో యోగ్యులయిన జర్మన్ యువకులను ఎన్నికచేసి దక్షిణ భారతంలో ప్రచారానికి డెన్మార్కు రాజు నాలుగో ఫ్రెడరిక్ పంపించాడు.[2]

తంజావూరు సీమలో తరంగంబాడి అనే కరపట్టణం ఉంది. 1620 నాటికే అక్కడే డేనులు గిడ్డంగి నెలకొల్పారు. కోట కట్టుకొన్నారు. అక్కడి తెల్లవారు శ్రద్ధగల క్రైస్తవులు. విద్యాప్రియులు. 1706లో డెన్మార్కు రాజు పంపించగా ఇద్దరు జర్మను ఫాదరీలు తరంగం బాడికి చేరుకొన్నారు. బర్తలోమయి జిగింగ్‌బాయి, హెన్రీ ఫ్లూచో అనే ఈ ఇద్దరూ అమితోత్సాహంతో మత ప్రచారం మొదలుపెట్టారు. బడులు నడిపారు. భాషలు నేర్చుకొన్నారు. బైబిల్ అనువదించారు. దేశీయ ఛందస్సులో దేశీయ సంగీతానికి అనువుగా కీర్తనలు కట్టారు. ఉత్తరోత్తరా ఒక ముద్రణ యంత్రాన్ని నెలకొల్పిన వెంటనే గ్రంథాలు అచ్చువేశారు.

ప్రశంసనీయమైన ఈ సేవలో ప్రథమునిగా ప్రముఖునిగా జిగింబాగ్‌ను పేర్కొనాలి. బైబిల్‌ను తమిళంలోనికి అనువదించ ప్రారంభించాడు. భారతీయ మతాన్నీ, ఆచార వ్యవహారాలనూ అర్థం చేసుకొనడానికి ప్రయత్నించాడు. తమిళదేశపు దైవాల పుట్టుపూర్వోత్తరాలపై రెండువందల పందొమ్మిది పుటల గ్రంథాన్ని వ్రాశాడు. క్రీ.శ.1711లో ఇంగ్లీషు సొసైటీవారు బహూకరించిన ఒక ముద్రణ యంత్రం, లాటిన్ టైపులు తరంగంబాడికి చేరాయి. జిగింబాగ్ తన లాటిన్ గ్రంథాన్ని అచ్చువేశాడు. దీనిని జర్మనీకి పంపితే అక్కడి మతాధికారులకు ఆక్షేపణీయమైన భాగాలు కనపడ్డాయి. ఆంక్షలు విధించారు.

జిగింబాగ్ తమిళంలో నీతివెణ్బా, కొంద్రైవేందన్, ఉలగనీతి అనే కావ్యాలు రచించాడు. 1713లో జర్మన్ మిత్రులు బహూకరించిన తమిళప్రెస్ తరంగంబాడికి వచ్చింది. ఆ సంవత్సరం సెప్టెంబరు మాసంలో తంజావూరు రాజ్యంలో మొదటిసారిగా ఒక తమిళ

2. E. Arno Lehman - It Began at Tranquebar - p.3

గ్రంథం అచ్చుపడింది. జిగింబాగ్‌కు ఉత్సాహంగల సహాయకులు తోడ్పడ్డారు. అయితే వీళ్ళ ఉత్సాహం మీద చన్నీళ్లు చల్లే ప్రయత్నాలు జర్మనీలోని మతాధికారులు తలపెట్టడం వల్ల తరంగంబాడి మిషనరీలు డెన్మార్కు రాజుగారికి ఒక విజ్ఞాపన చేసుకొన్నారు.

1714లో డెన్మార్కు దేశపు రాజు తరంగంబాడిలో ఉన్న మిషనరీలు ఏవిధమైన సెన్సారు ఆంక్షలకూ లోబడక తమకు తోచిన పుస్తకాలను తమిళంలోనూ తదితరమైన ఏ భాషలోనైనా యథేచ్ఛగా అచ్చువేసి ప్రకటించుకోవచ్చునని ఆదేశం ఇచ్చాడు. పూర్వం సెన్సారు బాధలకు ఈ మిషనరీలు గురి అయ్యారు. వీరు రచించిన గ్రంథాలను 'హాలే' నగరానికి పంపిస్తే అక్కడి మతాధికారులు వాటిని తొక్కిపెట్టారు. డెన్మార్కు రాజు ఈ మిషనరీలకు ద్రవ్యం ఇతోధికంగా పంపించాడు.

డెన్మార్కు రాజు ఫ్రెడరిక్‌లాగే అతని తమ్ముడు కూడా సువార్త ప్రచారానికి పూనుకున్నాడు. ఈయన ఇంగ్లాండు రాజవంశంలోని ఒక రాకుమార్తెని పెళ్ళి చేసుకొన్నాడు. డెన్మార్కు, ఇంగ్లాండులు వియ్యాలవారయ్యారు. డెన్మార్కు రాజుగారి తమ్ముని ప్రోత్సాహం వల్లనే ఇంగ్లండులో క్రైస్తవ జ్ఞానాభివృద్ధి సంఘం (ఎస్.పి.సి.కె.) 1699లో స్థాపించడం లోగడ జరిగింది.[3] తరంగంబాడి మిషనరీలకు ఎస్.పి.సి.కె వారు ధన సహాయం, ముద్రణ యంత్ర దానం చేశారు.

1706లో జిగింబాగ్, ప్లూచె తరంగంబాడికి వస్తే 1709లో మరి ముగ్గురు జర్మనులు మత ప్రచారానికి వచ్చారు. వీళ్ళకు జిగింబాగ్ శిక్షణ ఇచ్చాడు. భాషలు నేర్పాడు. వీళ్ళలో జాన్ ఎర్నస్టస్ గ్రుండ్లర్ (1677–1720) చాలా సమర్థుడు. మరి పదేళ్ళ దాకా ఇంకెవరూ జర్మనీ నుండి రాలేదు. 1719లో బెంజమిన్ షూల్జి ఇంకో ఇద్దరితో భారతదేశానికి వచ్చాడు. అప్పటికి జిగింబాగ్ మరణించాడు. గ్రుండ్లర్ ఒక్కడే కొనప్రాణంతో ఉన్నాడు. ఇద్దరు మిత్రులతో షూల్జి రావడం చూశాక గ్రుండ్లర్ ప్రాణం లేచి వచ్చింది. షూల్జి స్నేహితులు భారతదేశానికి ప్రచారం కోసం వచ్చినా ఫాదిరీ దీక్షను పొందలేదు. వెనువెంటనే గ్రుండ్లర్ షూల్జి ఒక్కడినే ఫాదిరీగా నియమించాడు. ఇది 1720 జనవరి ముప్పయి ఒకటో తేదీన జరిగింది. మార్చి 19వ తారీఖున గ్రుండ్లర్ మరణించాడు. తరంగంబాడి మిషన్‌కు షూల్జి నిర్వాహకుడయ్యాడు.

షూల్జి అన్ని విధాల గ్రుండ్లర్‌ను అనుసరించాడు. గ్రుండ్లర్ భారతీయుడులాగే వస్త్రధారణ చేసేవాడు. అచ్చుపనులు శ్రద్ధగా చూసేవాడు. షూల్జి కూడా ముద్రణ పనులలో తలమునకలయ్యాడు. పోర్చుగీసు, డేనిష్, తమిళ భాషల్లో ఇరవై పుస్తకాలను ఆరేళ్ళలో ప్రకటించాడు. 1721లో 48 సంకీర్తనల సంకలనాన్ని ప్రకటిస్తే 1723లో 160 సంకీర్తనల సంకలనాన్ని అచ్చువేశాడు. రెండేళ్ళలో 112 సంకీర్తనలను షూల్జి రచించాడు. నాలుగైదు సంకీర్తనలు సిద్ధం కాగానే వాటిని విడికాగితాల మీద అచ్చువేసి విద్యార్థులకు పంచిపెట్టేవాడు. ప్రతి క్రైస్తవ పర్వదినానికి ఒక పాట కొత్తది కట్టవలసిందే.

---

3. ఆర్చిడీకన్ - ఎఫ్.ఎస్.గ్లెడ్‌స్టన్ - రెవ.సి.యస్. సుందరేశన్ ''ఇండియా పాకిస్తాన్ల క్రైస్తవ సంఘ చరిత్ర'' - C.L.S. మద్రాసు, 1956 - పుట 52.

తమిళంలో బైబిల్ లేదనే చింతతో షూల్జి ఆ కొరతను తీర్చదలిచాడు. జిగింబాగ్ విడిచిపెట్టిన అనువాద కార్యాన్ని స్వీకరించాడు. వివిధ పాఠభేదాలున్న హీబ్రూ గ్రంథాలను ఎదుట పెట్టుకొని ఒక లేఖకుణ్ణి పక్కన పెట్టుకొని షూల్జి 1725 నవంబరు 24వ తేదీనాటికి బైబిల్ తమిళానువాదం పూర్తి చేశాడు. గ్రంథాన్ని సొంతం ప్రతిపద పరిశీలనతో తిరగవేయడం ప్రారంభించాడు.

షూల్జి బైబిలు అనువాదం పూర్తిచేసిన 1725 నాటికి తరంగంబాడిలోని డేనులు నిర్బంధ విద్యావిధానాన్ని తమ ఏలుబడిలో ఉన్న గ్రామాలలో అమలుపెట్టారు. గ్రామవాసులందరూ విధిగా తమ పిల్లలను బడికి పంపాలన్న నిబంధన రాగానే తరంగంబాడి డేనిష్ మిషన్ అదుపులోనికి ఇరవైఒక్క పాఠశాలలు వచ్చాయి. విద్యార్థులు రాయడం, చదవడం, లెక్కలు కట్టడం నేర్చుకోవాలి. కొత్త నిబంధనతోపాటు క్రైస్తవ పాఠాలు చదవాలి. ప్రశ్నోత్తర క్రమంలో మతసూత్రాలు కంఠతా పెట్టాలి. ఇందుకుగాను విద్యార్థులకు పుస్తకాలు అవసరమయ్యాయి. వీటికై మిషన్‌వారి అచ్చుకూటం చాలా ఉపయోగపడింది. ఈ ముద్రణ కార్యక్రమాలను ఏడేళ్ళు షూల్జి నిర్వహించాడు. 1728లో తన బైబిల్ అనువాదాన్ని అచ్చు వేయించాడు.

తన సహచరులతో షూల్జికి అభిప్రాయభేదాలు వచ్చాయి. షూల్జి చాలా సమర్థుడే. తెలివితేటలు కలవాడే కాని ఒంటెత్తు గుణం వున్నవాడు. తలబిరుసు జాస్తి. ఇతరులతో సర్దుకుపోలేడు. అందుచేత తరంగంబాడి బాధ్యతను సహచరులకు అప్పచెప్పి కొత్త ప్రదేశాలలో మత ప్రచారం చేయడానికి 1726లో బయలుదేరాడు.


సువార్తను ప్రచారం చేయడానికి ఇంగ్లండులో రెండు సంఘాలు ఏర్పడినా భారతదేశంలో ప్రబోధించడానికి ఒక్క ఆంగ్లేయుడూ వాళ్ళకు దొరకలేదు. డెన్మార్కు దేశపు రాజు, జర్మనీ దేశపు యువకులను ఇంగ్లండు దేశపు సంస్థల సాయంతో ఇండియాకు పంపవలసి వచ్చింది. ఆంగ్లేయుల అజమాయిషీలో అప్పుడు కడలూరు, మద్రాసు పట్టణాలు ఉండేవి. అక్కడ మత ప్రచారం చేయడానికి ఆంగ్లేయుడు దొరకనందున షూల్జి ఆ పనికోసం నడుం కట్టాడు. 1726లో షూల్జి కడలూరు, మద్రాసు, ప్రళయకావేరి పట్టణాలలో పర్యటన చేశాడు.

షూల్జి భారతీయులలాగే వస్త్రధారణ చేయడమేకాక, జోళ్ళు లేకుండా నడిచేవాడు. అడవుల్లో కాళ్ళు చెక్కుకుపోతున్నా రక్తం కారినాసరే లక్ష్యపెట్టకుండా నడిచేవాడు. పాదచారిగా తప్ప ప్రయాణం చేసేవాడు కాదు.[4] 1726 సెప్టెంబరు 1వ తేదీన షూల్జి మద్రాసులో స్థిరపడ్డాడు. పొద్దున ఊళ్ళో దిగిన షూల్జి మధ్యాహ్నం సెంటు జార్జి కోటలోని కుంఫిణీ గవర్నరును కలుసుకున్నాడు. సుదీర్ఘ సంభాషణ జరిగింది. నల్లవాండ్ల కోసం బడి పెట్టాలని నిర్ణయం జరిగింది. సెప్టెంబరు 5వ తేదీన కోటబురుజుల మీద నుంచి దండోరా వేశారు. గవర్నరుగారి ఉత్తరువు మీద పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్టు దేశీయులలో షూల్జి ఒక అభిప్రాయాన్ని కలిగించాడు. పదిరోజుల్లో పాఠశాల ప్రారంభమయింది. ఇది ధర్మబడి. రోజుకో గంటసేపు పోర్చుగీసు, ఇంగ్లీషు పాఠాలు చెప్పేవారు. మిగతాకాలంలో తమిళ చదువులు సాగేవి.

4. History of Christianity in India - J. Hough Vol.III, p.380

ఆనాడు చెన్నపట్టణంలో తెలుగువారు చాలామంది ఉండేవారు. అదే ప్రధాన భాష. అందుచేత షూల్జి తెలుగు విభాగాన్ని కూడా పాఠశాలలో ఏర్పాటు చేశాడు. ఒక పంతులును నియమించాడు. విద్యార్థులతోపాటు తాను కూడా తెలుగు నేర్చుకొన్నాడు. ఈ తెలుగు చెప్పే అయ్యవారు బ్రాహ్మణుడు. ఇతనికి షూల్జి బైబిలు పాఠాలను నేర్పసాగాడు. కొత్త నిబంధనలోని కథా సన్నివేశాలను చెప్పాడు. యేసునాథుణ్ణి బాప్టిస్టులు 'దైవశాబకం' (ల్యాంబ్ ఆఫ్ గాడ్) అని పిలవడం ఈ పంతులుగారికి బాగా నచ్చింది. ఈయన మతం మారుతాడని షూల్జి భావించాడు. కాని అది జరిగేలోగా ఆ పంతులుగారు మరణించారు.[5]

తెలుగు నేర్చుకొంటున్నప్పుడు దాని వ్యాకరణాన్ని తనకోసమేకాక ఇతరులు అధ్యయనం చేయడానికి కూడా వీలుగా 1728లో షూల్జి ఎనిమిది ప్రకరణాల్లో రచించాడు. వర్ణమాల, ఉచ్చారణ, నామవాచకాలూ, విశేషణాలు, సర్వనామాలు, క్రియలు, వాక్యనిర్మాణం అనే విభాగాలతో చేసిన ఈ గ్రంథానికి షూల్జి 'Grammatica Telugica' అని పేరు పెట్టాడు.[6] ఇందులో తెలుగు విభాగాన్ని తెలుగు లిపిలోనే వ్రాశాడు. షూల్జి కృషివల్లనే తెలుగు గ్రంథాలు మొదటిసారిగా పాశ్చాత్య దేశాలలోనైనా ముద్రణ పొందడం ప్రారంభించాయి. షూల్జి స్వహస్త లిఖితమైన తెలుగు అక్షరాల స్వరూపం ఎలా ఉంటుందో మచ్చుకు అతడు చేసిన వ్యాకరణంలోని కాగుణింతాన్ని చూస్తే తెలుస్తుంది.



ఇది బెంజమిన్ షూల్జి దస్తూరి

5. History of Christianity in India - J. Hough Vol.III, p.381
6. షూల్జి వ్రాతప్రతి హాలే విశ్వవిద్యాలయంలో చిరకాలం భద్రం చేశారు. ఇది 1984లో తొలిసారి జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్ వారి ఔదార్యంతో అచ్చుపడి వెలుగు చూసింది. ఇందుకు ఆంధ్రులందరూ సంతోషించాలి.

బెంజమిన్ షూల్జికన్నా ముందుగానే భారతదేశంలో తెలుగు ప్రాంతాలతో సంబంధమున్న పాశ్చాత్యులు తెలుగు భాషను నేర్చుకొని కొన్ని పదాలను గ్రంథస్తం చేయకపోలేదు. క్రీ.శ. 1680 నుంచి 1713 దాకా ప్రాచ్య భాషలపై యాదస్తును థామస్ బౌరే అనే ఆయన భద్రపరిచాడు. 1709లో ప్రచురితమైన 'మలే డిక్షనరీ'లోని ఒక ప్రూఫు కాగితం **బ్రిటిష్ మ్యూజియం** గ్రంథాలయంలో దొరుకు**తుంది.** (Mss.EVR-E192) దాని నుంచి నేను కాపీ చేసుకొన్న ఈ క్రింది ఇంగ్లీషు తెలుగు **మాటలు** 1701 నాటి పాశ్చాత్యుల తెలుగు వర్ణక్రమ విధానాన్ని తెలియచేస్తుంది.

God	-	బరమేశ్వరుడు
Star	-	నక్షత్రం
Earth	-	నెల్ల
Wind	-	గాళి
Cold	-	సళ్ళి
Sun	-	సూర్యుండు
A boat	-	పద్దవ
A castle	-	కొత్త

రాశులు - వారాలు

మెశం, వ్రూశబం, మిథునం, కటకం, శింహం, కన్ని, వ్రచ్చికం, ధనుసు, మకరం, కుంబం, మీంనం, అద్దివారం, సొంవ్వారం, మంగలారం, బూద్దవారం, బ్రూహస్పితి, శుక్రవారం, శన్నివారం

The Alphabet of the TELANGA on the coast of choramandal in EAST INDIA THE WO NAW MA HAA or the First Part of the Alphabet'

ఒనమః సివాయః శిద్ధం నమః
అఆ ఇఈ ఉఊ రురూ లులూ ఎఐ ఒఔ అంఅః

The Second part of the Alphabetలో క, ఖ, గ, ఘ, ఙ అంటూ మిగతావన్నీ యిచ్చారు. ఒకటి నుంచి నూరు, వెయ్యిదాకా సంఖ్యలున్నాయి.

తనకు ఒకతరం పూర్వులైన పాశ్చాత్యులు నేర్చుకున్న పద్ధతిలోనే షూల్జి తెలుగు భాషను అభ్యసించాడు. అయితే తాను నేర్చుకొంటున్నప్పుడే తన తెలుగు గురువుగారికి బైబిలు పాఠాలు చెప్పి మన్ననలు పొందాడు.

తెలుగు పంతులుగారికి చేసిన ప్రబోధాలు ఫలించడం వల్ల తమిళ వాద్యారయ్యలకు బైబిల్ పాఠాలు చెప్పడం మొదలుపెట్టాడు. వాళ్ళ సహాయంతో పాత నిబంధన అనువదించాడు. అచ్చు వేయించాడు. 1727లో కొత్త నిబంధన అనువాదాన్ని పూర్తి చేశాడు. తెలుగు నేర్చుకోవడం మొదలుపెట్టి రెండు నెలలు పూర్తికాక ముందే ఈ భాషలోనికి బైబిల్ అనువాదం చేపట్టడం మహాసాహసమే. అయినా షూల్జి పట్టుదలకు యిది నిదర్శనం. అతని తమిళ అనువాదం కూడా తొందరపాటు పనే. ఈ రెండు

భాషల్లోనికే కాదు దక్కను ఉర్దూ భాషలోనికి కూడా షూల్జి బైబిల్‌ను అనువదించాడు. హిందూస్థానీ భాషకు ఒక వ్యాకరణం కూడా రచించాడు.

భారతదేశంలో ఇరవైమూడు సంవత్సరాలు మత ప్రచారం చేసి, పుస్తకాలు అచ్చువేసి, విద్యాశాలలు నడిపి అనారోగ్య కారణాలవల్ల 1743లో షూల్జి స్వదేశానికి తిరిగి వెళ్ళిపోయాడు. హాలే నగరంలోనే జీవిత శేషాన్ని గడిపాడు. గ్రంథ ప్రచురణకు పూనుకొన్నాడు. తెలుగు టైపులు పోతపోయించి నాలుగు పుస్తకాలను ప్రచురించాడు. ఇవి ప్రఖ్యాత జర్మన్ లూథరన్ తత్వవేత్త జోహాన్ ఆర్నెడ్ట్ (1555-1621) రచించిన నాలుగు గ్రంథాలకు అనువాదాలు.[7]

వీటి వివరాలు యివి:

1. 'సత్యమైన వేదంలో వుండే జ్ఞాన ఉపదేశాల యొక్క సంక్షేపం' 24 పుటలు 1746లో హాలేలో ముద్రణ.

2. 'మోక్షానికి కొంచ్చుపొయ్యేదొవ' 47 పుటలు. 1746లో హాలేలో ముద్రణ. ఈ పుస్తకానికి 24 పుటల 'ఎడిషన్' ఒకటి వేరే ఉన్నట్టుంది.

3. 'వక గురువు అఇదు బ్రాహ్మలయొక్క నడిమను కూర్చుండి విండ్లతొను... ఆకాసమును భూమిని సృష్టించిన పెద్ద, స్వామిమీద ప్రసంగించ్చిన తర్కమితె' - 48 పుటలు, 1747లో హాలేలో ముద్రణ.

4. 'బుద్ధి కలిగిన తెలుగు వాండ్లలోపల వొకడొకడికి పుంణ్యాపు దొవచూపించ్చె నూరు జ్ఞానవచనాల యొక్క చింన్న పుస్తకం ఇతి' - 48 పుటలు. 1747లో హాలేలో ముద్రణ. దీనికి కూడా ఇంకో 'ఎడిషన్' వున్నట్టుంది.

పై నాలుగు పుస్తకాల ముఖపత్రంమీద యింత పొడుగాటి పేర్లు వివరంగా వున్నా పెద్దక్షరాలతో చిన్న పేర్లను సూచించాడు. మొదటిది 'సంక్షేపం' అనీ, రెండవది 'మోక్షానికి' అని, మూడోది 'పెద్దస్వామి' అనీ, నాలుగోది 'నూరుజ్ఞాన వచనాల' అని పేర్కొనవచ్చు.

షూల్జి ప్రచురించిన ఈ పుస్తకాల ప్రతులు లండన్ బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలోనూ, కోపెన్‌హేగన్‌లోని రాయల్ గ్రంథాలయంలోనూ వున్నాయి. భారతదేశంలో శ్రీరాంపూరు మిషను గ్రంథాలయంలో రెండు పుస్తకాలే వున్నాయి. మొట్టమొదటి తెలుగు పుస్తకంలోని మచ్చుపుటను కొమర్రాజు లక్ష్మణరావుగారు సంపాదకత్వం వహించిన 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం'లో 1932లో ప్రచురించారు (ప్రథమ సంపుటం - పుట 323). అప్పటికి షూల్జిమీదా, క్రైస్తవ మిషనరీల మీదా విపుల పరిశోధనలు జరగకపోవడం వల్ల వ్యాసకర్త గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు కొన్ని పొరపాట్లు రాశారు. ఈ పొరపాట్లను ఎత్తిచూపుతూ డాక్టర్ జె. మంగమ్మగారు తమ 'బుక్ ప్రింటింగ్ ఇన్ ఇండియా' అనే గ్రంథంలో షూల్జి పుస్తకాల ముఖపత్రాలు నాలుగింటి మచ్చుపుటలతో బాటు ప్రకటించారు.

7. It Began at Tranquebar - E. Arno Lehman - p.119

ఈ మచ్చుపుటల వల్లనే ఎన్నో విషయాలు తెలుస్తాయి. షూల్జి తెలుగు అంకెలనే తన పుస్తకాల్లో వాడాడు. భాష సర్వసాధారణమైన వాడుక భాష. 18వ శతాబ్దంలో తెలుగువాళ్ళు అవలంబించే లేఖన పద్ధతులనే షూల్జి కూడా అనుసరించాడు. అనుస్వారం తర్వాత వచ్చే అక్షరానికి ద్విత్వం, ఒక అక్షరం తరువాత సంపూర్ణాక్షరానికి బదులు అప్పుడప్పుడు అక్షరపు వత్తు రాయడం (ఉదా॥ లెఖ్ఖ అని వ్రాయడాని కల్లె అని రాయడం), వట్రసుడికి బదులు అక్షరాన్ని ఇకారాంతం చేసి వ్రావడి ఉండడం (ఉదా॥ సృష్టించు అనే మాటను 'స్రిష్టించు' అని రాయడం) మొదలైన ప్రాచీన పద్ధతులు కనబడతాయి. ముఖపత్రంలో పెద్ద వాక్యంలో పుస్తకం పేరు రాసినా వివిధ పంక్తులలో దాన్ని లిఖించడంలో పాశ్చాత్య ధోరణి కనబడుతుంది.

క్రైస్తవ మతాన్ని షూల్జి 'కిరస్తాం' అని పేర్కొనేవాడు. ఏసుక్రీస్తును 'సర్వేశ్వరుడి యొక్క కుమారుడైన యెజస్సు క్రిస్తుస్సు అయ్యవారు' అని వివరించేవాడు. బైబిలును 'సత్యవేదం' అనేవాడు. 'తిరుసభ' అనే కొన్ని తమిళ ప్రయోగాలను కూడా వాడేవాడు. తెలుగు ప్రజలకు తెలియని మతాన్ని బోధిస్తున్నా తెలిసే భాషలోనూ తన సమాసాలు నిర్మించుకొని చెప్పాడు. తత్సమ పదాలు ఎక్కువ వాడేవాడు. ఉదాహరణకు 'ఉపదేశాల సంక్షేపం'లో చేసిన వివరణ చూడండి.

'పది కల్పనలునున్ను, విశ్వాసం యొక్క మంత్రమున్ను, పదమండల మంత్రుమున్ను జ్ఞాన స్నానం యొక్క వర్తమానమున్ను, జ్ఞానమైన రాత్రి భోజనం యొక్క వర్తమాన మున్ను పాపం సంకీర్తన చేసే మంత్రమున్ను, భోంచేయపోయేటందుకు మునుపు చెప్పవలశిన మంత్రమున్ను పొద్దున్నే లేచేటప్పుడు చెప్పవలశిన మంత్రమున్ను, రాత్రి పండుకొనే టప్పుడు చెప్పవలశిన మంత్రమున్ను అణిగి వున్నది' అనే విషయ సూచిక వివరణలో క్రైస్తవ మంత్రాలను హైందవ పరిభాషలోనే చెప్పాడు. మోక్షం నిత్యజీవం అనీ, నరకం నిత్యమరణమనీ వివరించాడు.

షూల్జి ఆనాడు ప్రయోగించిన పదాలు ఈనాడు తెలుగు క్రైస్తవులలో ప్రచారం పొందలేదు. యెహోవా అనే పదానికి సర్వేశ్వరుడు అనే అనువాదాన్ని షూల్జి చేశాడు. తర్వాత చాలామంది దానినే వాడుతూ వచ్చారు. అయినా ఈ ప్రయోగం మీద చాలా చర్చ జరిగింది. దీనిని క్రైస్తవులు తమ ప్రయోగాలనుండి తొలగించారు. సర్వశక్తుడు, సర్వోన్నతుడు అనే మాటలేగాని సర్వేశ్వరుడు అనే పదం 'తెలుగు, బైబిల్ నిఘంటువులో ఈనాడు కనబడదు. ఆనాడు షూల్జి చేసిన తమిళ అనువాదాలుగానీ, తమిళ కీర్తనలుగానీ ఈనాడు ఎవరూ వాడడం లేదు.

కేవలం మత గ్రంథాలనేకాక షూల్జి యితర పుస్తకాలను కూడా రాశాడు. తెలుగు అక్షరాలను, గుణింతాన్నీ, వాటి ఉచ్చారణలనూ సులభ పదాలను వివరించే ఒక పన్నెండు పుటల గ్రంథాన్ని లాటిన్ భాషలోరాసి 1747లో ప్రచురించాడు. 'కాన్‌స్పెక్టస్' అనే పేరు దీనికి వాడాడు. తెలుగు భాష సమగ్ర స్వరూపం చూపించాలనే ప్రయత్నమిది. స్వదేశానికి తిరిగి వెళ్ళాక అక్కడ తమిళంతోపాటు తెలుగు బోధించడానికి 1728లో రచించిన వ్యాకరణాన్ని ఇంగ్లీషు, తెలుగు, తమిళ, లాటిన్ భాషలలో రచించిన నిఘంటువులను, ఈ 'కాన్‌స్పెక్టస్' పుస్తకాన్నీ ఉపయోగించుకొన్నాడు. ఈ పుస్తకం సాహిత్యపరంగా నిరుపయోగమని డాక్టరు మంగమ్మగారి అభిప్రాయం.

షూల్జి కాలంలో తెలుగును పామరులు 'వరుగె' అని పిల్చేవారు. ఇది తమిళ భాషా ప్రభావం వల్ల తెల్లవాళ్ళకు అలవడ్డది. తమిళులు తెలుగును 'వడుక్కు' అనీ, తెలుగు వాళ్లను 'వడుగర్' అని పిలుస్తారు. వాళ్ళ కావ్యాలలో ఈ ప్రయోగాలే వున్నాయి. షూల్జి తరంగంబాడిలో మొదట తమిళ శిక్షణ పొందినవాడు కనుక తెలుగును 'వడగె' అని వ్యవహరించేవాడు. 'రడయోరభేదః' కనుక జాతుల వాళ్ళ ఉచ్చారణలో 'వడగె' అన్నమాట 'వరుగె' అని మారింది. తెలుగును పామరులు ఈ పదంతో వ్యవహరిస్తారని షూల్జి తన 'కాన్స్పెక్టస్' గ్రంథం ముఖపత్రంలోనే వివరించాడు. మరో వంద సంవత్సరాలకు తెలుగును 'జెంటూ' అని పామరులు పిలిచేవారు. దీనిని కాంబెల్ వంటి వాళ్ళు ఖండించారు. తెలుగు భాషకు 'వరుగె' 'జెంటూ' అనే మాటలేకాక 'వర్తక్' అనే పర్యాయపదం వుందని డాక్టర్ మంగమ్మగారు చెప్తున్నారు. ఈ అభిప్రాయానికి ఆధారం మృగ్యం.

షూల్జి ఒక లౌకిక గ్రంథాన్ని కూడా రాశాడు. దీనిని అనంతర పరిశోధకులు 'మద్రాసు డైలాగ్స్' అని పేర్కొంటారు.[8] ఇది ముప్పయి సంభాషణలున్న నూరు పేజీల గ్రంథం. ఇందులో ఆనాటి చెన్న పట్టణపు సాంఘిక పరిస్థితులను షూల్జి వివిధ వ్యక్తుల సంభాషణ రూపంలో వివరించాడు. ప్రశ్నోత్తరాల రూపంలో మత గ్రంథాలు రచించడం అలవాటయిన షూల్జి అదే బాణీలో దీనిని రాశాడు. ఇందులో నేటివుల కౌశలం, ఆచార వ్యవహారాలు, నడవడిక, వర్తక వ్యాపారాలు, గృహ నిర్వహణ, పాడిపంటలు, తోటలు దొడ్లూ మొదయిలన అంశాలను చర్చించాడు. బ్రదర్ జోన్, బ్రదర్ పీటర్ యిద్దరి సంభాషణల్లో ఆనాటి జాతుల వాండ్ల ఆహార పానీయాల చర్చ సాగించాడు. పెర్సివల్ స్పియరు ఈ గ్రంథం నుండి ఎన్నో ఉదాహరణలను తన పుస్తకంలో ఉటంకించాడు. దీనిని అపురూపమైన, ఆసక్తిదాయకమైన పుస్తకమని మెచ్చుకొన్నారు.

చెప్పుకోదగ్గ విశేషమేమిటంటే షూల్జి ఈ 'డైలాగ్స్'ను మొదట తెలుగులో రచించి, పిదప దానిని ఇంగ్లీషులోనికి అనువదించాడు. తెలుగు వ్రాతప్రతి హాలేలో వుందేమో. ఉంటే దానివల్ల ఎన్నో ఆనాటి తెలుగు వ్యావహారిక రూపాలు తెలుస్తాయి. తెలుగుమీద షూల్జికి చాలా మక్కువ. లేకపోతే తాను అనువదించి ప్రకటించిన హిందూస్తానీ బైబిల్లో ఒక తెలుగు అధ్యాయాన్ని కూడా చేర్చుతాడా!

తెలుగును యింతగా ప్రేమించి తెలుగు అక్షరాలను మొదటిసారిగా చెక్కించి, పోత పోయించి, తెలుగు గ్రంథాన్ని మొట్టమొదటిసారి అచ్చువేసిన ఈ ప్రథమ పాశ్చాత్యుడు 'న్యాయం తీర్చేనాటిలోలె వొప్పగించగానే "నిత్య జీవం అయిన మోక్షంలో" తప్పక ప్రవేశించుతాడు.

జీవిస్తున్నప్పుడు షూల్జి మద్రాసులో ప్రవేశించడం తెలుగువారి అదృష్టం. ఆదిలో చెన్నపట్టణంలో ఇంగ్లీషువారు కోట కట్టుకొన్నాక 'జాతుల వాండ్ల' సంఖ్య ఎక్కువ కాజొచ్చింది. వీళ్లకు క్రైస్తవ పురోహితులు అవసరమయ్యారు. కుంఫిణీవారు 'చాప్లిన్'

8. Percival Spear - "The Nabobs' Oxford paperbacks, p. 118

అనబడే పురోహితుణ్ణి ఒక్కొక్క స్థావరానికి ఒక్కొక్కణ్ణి నియమించి సీమనుంచి పంపేవారు. వీళ్ళలో కొందరు దేశ భాషలు అధ్యయనం చేసేవారు. గ్రంథాలు రచించేవారు.

1727లో చెన్నపట్టణం చాప్లిన్‌గా థామస్ కన్‌సెట్పస్ వచ్చాడు. ఇతడు షూల్జి సమకాలికుడు. షూల్జిలాగే పట్టభద్రుడు. ఎటొచ్చీ ఈయన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో నేర్చుకొన్నాడు. తెలుగు వ్యాకరణాన్ని ఇంగ్లీషులోనికి అనువదించాడు.[9] ఇది ఏ గ్రంథానికి అనువాదమో తెలియదు. బహుశా కాన్‌ట్పుకస్ స్వయంగా రాసుకొన్న నోట్సుకు ఒక రూపం కావచ్చు. లేక షూల్జి లాటిన్‌లో రచించిన గ్రంథానికి అనువాదం కావచ్చు. కన్‌సెప్టస్ మూడేళ్ళే చెన్నపట్టణంలో జీవించాడు. 1730లో మరణించాడు. ఇంకొన్నాళ్ళు బతికితే యింకే గ్రంథాలు రాసేవాడో, ఏమైనా తెలుగు వ్యాకరణం మీద ఇంగ్లీషులో గ్రంథ రచన చేసిన మొదటి ఆంగ్లేయుడిగా కన్‌సెట్పస్ మొదటి వాళ్ళ జాబితాలో చేరుతున్నాడు.

'జోహాన్ ఫ్రెడరిక్ ఫ్రిట్జ్' అనే ఫాదిరీ కూడా షూల్జి సమకాలికులలో ఒకడు. ఈయన 'కర్త ఉపదేశించిన జపం' వివిధ భాషలలో సంకలనం చేశాడు. రోమన్ లిపిలో ఆయా భాషల్లోని లార్డ్స్ ప్రేయర్‌ను లిఖించాడు. 1748లో ఈ గ్రంథాన్ని లీప్‌జిగ్‌లో అచ్చువేశాడు. ఒక ప్రతిని షూల్జికి యిచ్చాడు. ఇందులో మొదటిసారిగా 'కర్త ఉపదేశించిన జపం' తెలుగు మాటలలో గ్రంథస్తం అయింది.

ఇప్పుడు తెలుగు క్రైస్తవులు 'ప్రభువు ప్రార్థన'లో 'పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధపరచబడుగాక...' అంటూ పఠిస్తారు. 1748లో జర్మనీలో గ్రంథానికి ఎక్కిన ప్రార్థన యిలా వుంది:

''పరమండలాల్లో వుండే మా తండ్రీ
మీయొక్క నామధేయము పడ్సింప పరనట్టుగాను
మీయొక్క రాజ్యము రానీ
మీయొక్క చిత్తము పరమండలములో
సాధ్యపడును వలెను భూమిలో నున్ను
సాధ్యపడునట్టుగాను
నానాంట కలుగు మా భోజనము మాకు నేరు
ఇచ్చేండి
మా అప్పుల వారికి మేము తాళినట్టుంవలనె
మీరున్ను మా అప్పులు మాకు తాళండి
మమ్మును నచ్చోదనలో ప్రవేశింపకుండి
అయితేను కీడులో నుండి మమ్మును రక్షించుకొండి
అదేమంటే రాజ్యమును బలమును మహిమమును
మీకు ఏనాటికి నేటికి కలిగుండును.
''ఔను''

9. History of Christianity in India - J. Hough Vol. III p. 385

ఇందువల్ల 18వ శతాబ్దంలో తెలుగు క్రైస్తవులు పఠించే ప్రభువు ప్రార్థన విశదమవుతుంది. 'లార్డ్స్ ప్రేయర్' అనే మాటకు సి.పి. బ్రౌను దొరగారు ఉత్తరోత్తరా 'కర్త వుపదేశించిన మంత్రం' అని అర్థమిచ్చారు.

ఆదిలో షూల్జితోపాటు మరి ఇద్దరు ఫాదరీలు తరంగంబాడికి వచ్చారు. వాళ్ళ కృషి గురించి ఏమీ తెలియదు. తరంగంబాడి అచ్చుకూటంలో తమిళ గ్రంథాలతోపాటు చిన్న చిన్న తెలుగు పుస్తకాలను కూడా అచ్చువేసేవారా? 1712లోనే తరంగంబాడిలో అచ్చుకూటం నెలకొల్పారు. 1719లో ఒక తెలుగు బైబిల్ గ్రంథం చెన్నపట్టణం సెంటు జార్జికోటలోని గ్రంథాలలో ఉన్నట్టు దాఖలాలు ఉన్నాయి.[10] ఇది అచ్చుపుస్తకం కాక వ్రాత ప్రతి అయి వుండవచ్చునని మంగమ్మగారి అభిప్రాయం.[11] ఆనాటికి తెలుగులో ముద్రణ సౌకర్యాలు విరివిగా లేకపోవడమే ఆమె అనుమానానికి, అభిప్రాయాలకీ కారణం. సెంటుజార్జి కోటలోని పుస్తకాలలో 1719లోనే నమోదు అయిన తెలుగు బైబిల్ అచ్చు పుస్తకమే అయితే షూల్జికన్నా ముందే ఎవరో మొదటి తెలుగు పుస్తకాన్ని అచ్చువేశారని భావించక తప్పదు. అతని పేరు మాత్రం చరిత్ర పుటల్లో మరుగుపడిందని చెప్పక తప్పదు. అయినా బెంజమిన్ షూల్జి చేసిన సేవ, గొప్పతనం ఈషణ్మాత్రం తగ్గదు.

షూల్జి, అతని సమకాలికులు చెన్నపట్టణంలో నివసిస్తూ ధర్మబళ్లా సువార్త ప్రకటనం చేస్తున్న రోజుల్లో కుంఫిణీ వారికి చాప్లిన్ పురోహితులు కావలసి వచ్చారు. కనుక మత ప్రచారానికి చూసీ చూడనట్టు అనుమతి ఇచ్చారు. పురపాలన, పౌరసంబంధాలు, లావాదేవీలు, కోర్టు వ్యవహారాలూ, సాంఘిక జీవనానికి కావలసిన సదుపాయాలు మొదలైనవి అవసరమయ్యాక కుంఫిణీవారు చాలా పరిమితమైన మోతాదులో అచ్చు యంత్రాలను ఉపయోగించుకున్నారు.

1761లో ఫ్రెంచి వారితో యుద్ధం వచ్చాక, పుదుచ్చేరిని పట్టుకొని కొల్లగొట్టి ఆ వూళ్ళోని సరుకులన్నింటినీ ఇంగ్లీషువారు చెన్నపట్నం తెచ్చుకొన్నారు. పుదుచ్చేరిలో ఒక అచ్చుయంత్రం వారికి లభించింది. దీన్ని తీసుకొని వచ్చి వేపేరిలో ఉండే ఎస్.పి.సి.కె మిషను వారికి కుంఫిణీవారు బహూకరించారు. అవసరమైనప్పుడల్లా దీనిని తాము వాడుకోవచ్చుననే షరతు మీదనే ఇచ్చారు.

మద్రాసులో అలెగ్జాండర్ డేవిడ్‌సన్ (1785-86) గవర్నరుగా ఉన్నప్పుడూ, ఇతని తర్వాత ఆర్చిబాల్డ్ కాంబెల్ (1786-1790) పాలనలోనూ శాంతియుత పరిస్థితులు నెలకొన్నాయి. ఖగోళ పరిశోధనలూ, వైద్యశాఖ, తపాలా సౌకర్యాలు, పంపిణీ గ్రంథాలయాలూ, వృక్షశాస్త్రీయ వనాలు, ఆంగ్రోబెలగారి ధర్మబడి మొదలైనవి వర్ధిల్లిన ఆ ప్రశాంత వాతావరణంలో మొట్టమొదటి పత్రికగా 'మద్రాసు కూరియర్' ఇంగ్లీషు భాషలో 1785లో వెలుగు చూసి కొన్నాళ్లు ప్రసరించింది. కుంఫిణీ వారి ప్రింటరుగా ఉండే రిచర్డ్ జాన్‌స్టోన్ దీనిని ప్రారంభించాడు. 1788 నుండి హ్యూబాయిడ్ దీనికి ఎడిటరు.

10. The Nababs - Percival Spear P. 188

11. Book Printing in India - Dr. J. Mangamma p.30

1780లోనే ప్రారంభమైన బెంగాలులోని పత్రిక మద్రాసు వారికి ప్రోద్బలమైంది. 1789లో బొంబాయిలో 'బోంబే హెరాల్డ్' రంగప్రవేశం చేసింది. 1795లో 'మెడ్రాస్ గజెట్టు' అనే కొత్త పత్రికను ఆర్. విలియమ్స్ తీసుకువచ్చాడు. సర్కారు వారి అనుమతి లేకుండా ''ఇండియా హెరాల్డ్'' అనే పత్రికను 'హంఫ్రీస్' అనే తెల్లదొర ప్రకటించగానే అతణ్ణి అరెస్టు చేశారు. సీమకు పంపించి వేస్తే ఓడనుండి తప్పించుకొన్నాడు. ఇవన్నీ ఆంగ్లేయులు, ఆంగ్లేయుల కొరకు ఆంగ్లభాషలో ప్రచురించే పత్రికలు.

పత్రికల ప్రభావం ఇనుమడించడం ప్రారంభమైతే పాలకులు జాగ్రత్త పడతారు. అనుమతి లేని పత్రికలు వెలువడటంతో 1795లో సెన్సారు నియమాలను ప్రవేశపెట్టారు. 1799లో పత్రికలకు కలిగించిన ఉచిత తపాలా సౌకర్యాలను రద్దు చేశారు. 'ది గవర్నమెంట్ గజెట్' అనే పత్రికను ప్రభుత్వమే ప్రచురించసాగింది.

కుంఫిణీ పాలకులు వారి జాగీర్లతో నివసించే తెల్లవాళ్లకాక మిషనరీలే ప్రాంతీయ భాషల గురించి ఎక్కువగా పట్టించుకొనేవారు. ఆ భాషలు మాట్లాడే ప్రజలలో మత బోధనలు చేయాలి కనుక వారికి భాషాజ్ఞానం, రాతకోతలు, చదువుసంధ్యలు ఆయా భాషలలో అవసరమయ్యాయి. భారతదేశంలోని కుంఫిణీ పాలకులు తమ తమ విశ్వాసాల వల్ల క్రైస్తవులే గానీ భారతీయులలో ఆ మత ప్రచారానికి సుముఖులు కారు. వారికి కావలసినది వర్తకం, లాభాలు. నేటివులలో అసంతృప్తిని రేకెత్తించే ఏ కార్యక్రమానికైనా వారు వ్యతిరేకులు. ఇంగ్లాండులోని పార్లమెంటు కూడా వీరి ప్రయోజనాలు కాపాడే చర్యలే తీసుకుంది.

క్రీ.శ.1793లో తూర్పిండియా కుంఫిణీ వారికి పార్లమెంటులో ప్రసాదించిన ప్రభుత్వ శాసన పత్రం (చార్టర్)లో కుంఫిణీ వారికి చిక్కులు కలిగించే మతసంబంధ కార్యక్రమాలలో పాల్గొనే ఇంగ్లీషు పౌరులను భారతదేశంలో ప్రవేశించడానికి అనుమతి నిరాకరించవచ్చు. లైసెన్సులు లేనివారు కుంఫిణీ రాజ్యాలలో సంచరించకూడదు'' అనే అభ్యనుజ్ఞను ఇచ్చారు. దీని ఫలితంగానే భారతదేశంలోని ఆంగ్లేయుల జాగీరులలో కాక బుడతకీచు, డచ్చి, ఫ్రెంచి, డేనిష్ స్థావరాలనే మిషనరీలు వాసం ఏర్పరచుకొని మత ప్రచారం, పుస్తక ప్రచురణ మొదలైన కార్యక్రమాలను చేపట్టారు. అందుకే డెన్మార్కు దేశీయుల అధీనంలో ఉన్న తరంగంబాడిలో అంతటి కృషి ఆదినుంచి దక్షిణ భారత భాషలలో జరిగింది.

వాస్తవానికి మొదటి తెలుగు పుస్తకాలను భారతదేశంలో ప్రచురించిన శ్రీరామపురం మిషనరీల విషయంలో కూడా చాలా ఆసక్తికరమైన చరిత్ర ఉంది. అధికారరీత్యా కుంఫిణీవారు తమ జాగీరులలో మత ప్రచారకులను నిషేధించినా, సీమలోని డైరెక్టర్ల కోర్టులో ప్రముఖులు క్రైస్తవులే కనుక కుంఫిణీ సర్జన్లు మొదలైనవారు సువార్త ప్రచారం చేసుకొనే అవకాశాన్ని కలిగించారు. 1793లో అటువంటి ఒక సర్జనుగారి మిత్రునిగా విలియం కేరీగారు కలకత్తాకు ఒక డెన్మార్కు దేశపు ఓడలో వచ్చారు. ఆ సర్జనుగారి 'కీర్తి' కేరీ గారిని ఇబ్బందుల పాలు చేసింది. ఆయన బెంగాలులోని నీలిమందు పొలాలలో

మేస్త్రీగా పనిచేసి కావలసిన ధనాన్ని, బెంగాలీ **భాషా** జ్ఞానాన్నీ సంపాదించాడు. బాప్టిస్టు మిషను కార్యక్రమాలను చేపట్టాడు. 1799లో **కేరీ**గారు ఒక గిడ్డంగిని కొన్నారు. దాని లాభాలతో మత ప్రచారం చేయమని ఇంగ్లాండు నుంచి నలుగురు మిత్రులను రప్పించాడు. అమెరికన్ ఓడలో వస్తున్న ఈ మిషనరీల రాకకు కలకత్తాలోని కుంఫిణీవారు ఆందోళన చెందారు. వాళ్ళను ఓడ దిగనివ్వలేదు. కలకత్తాలో అడుగుపెట్టడానికి అనుమతి ఇవ్వలేదు.

అయితే ఈ నలుగురు తమ దృఢ నిశ్చయాన్ని సడలించలేదు. కలకత్తా ఆంగ్లేయులదైనా దానికి సమీపంలో ఉన్న శ్రీరామపురం డెన్మార్కు దేశీయుల స్వాధీనంలో ఉన్న స్థావరం కనుక చాటుగా నాటు పడవలు ఎక్కి అక్కడకు చేరుకొని ఆ డేనిష్ అధికారుల శరణు కోరారు. ఈ ఇంగ్లీషువారిని తమకు అప్పగించాలని, వారిని మళ్ళా ఇంగ్లాండుకు తాము పంపించి వేస్తామని గవర్నర్ జనరల్ వెల్లస్లీ శ్రీరామపురం డేనిష్ పాలకులను గట్టిగా **అడిగాడు**. అయితే తమ దేశపు రాజు సువార్త ప్రచారానికి సుముఖుడేకాక ప్రధాన **పోషకుడు** కనుక ఆ నలుగురు ఆంగ్లేయులకు శ్రీరామపురంలో ఆశ్రయమేకాక రక్షణ కలిగింది. తన మిత్రులున్న శ్రీరామపురంలోనే తన గిడ్డంగిని, కార్యక్రమాలను కొనసాగించాలని విలియం కేరీగారు నిశ్చయించుకొని కలకత్తా నుంచి మకాం మార్చివేశారు.[12] ఈ విధంగా శ్రీరామపురంలో మిషను కార్యక్రమాలు ఉత్తరోత్తరా తెలుగు పుస్తక ప్రచురణలు ప్రారంభమయ్యాయి.

కేరీగారి సహాయకులుగా నలుగురు ఇంగ్లండు నుండి బెంగాలుకు వచ్చినా అందులో ఇద్దరు అకాల మరణం చెందారు. మిగిలిన ఇద్దరూ దీర్ఘకాలం పాటు కేరీగారితో కలిసి చేసిన మత గ్రంథ ప్రచురణల కార్యక్రమం వల్లా, విద్యాభివృద్ధి సంసేవల వల్లా చరిత్రకెక్కి చిరస్మరణీయులయ్యారు. వీరిలో విలియం వార్డు వృత్తిరీత్యా ముద్రాపకునిగా తర్ఫీదు పొందినవాడు. జాషువా మార్ష్‌మన్ ఇంగ్లండులో ఒక ధర్మబడిలో ఉపాధ్యాయుడు. కొన్నాళ్ళు పుస్తక విక్రేత. ఈ ఇద్దరు సహాయకులు తమ సేవలతో సువార్త ప్రకటనకూ గ్రంథ ప్రచురణకు ద్రవ్యం ఆర్జించడానికి కేరీగారికి తోడ్పడదలిచారు.

ఆ రోజుల్లో కలకత్తా చుట్టుప్రక్కల చాలా ఆంగ్లేయ కుటుంబాలు ఉండేవి. తమ పిల్లల చదువు సంధ్యల గురించి ఈ సంసారులు చాలా ఇబ్బంది పడేవారు. సరైన పద్ధతులలో పాఠశాలలు లేవు. తమ సంతానాన్ని ఇంగ్లాండు పంపించి సక్రమమైన విద్యలు నేర్పించాలంటే అసౌకర్యాలు జాస్తి. ఈ పరిస్థితులను గమనించి కేరీగారు శ్రీరామపురంలో ఆంగ్లేయ బాలుర కోసం ఒక వసతి బడిని స్థాపించారు. నెలకి ముప్ఫయి అయిదు రూపాయల చొప్పున ఒక్కొక్క విద్యార్థి జీతం చెల్లించాలి. పాఠశాలలో లాటిన్, గ్రీకు, హీబ్రూ, పెర్షియన్, సంస్కృత భాషలను బోధించేవారు. ఈ పాఠశాలవల్ల సాలీనా వెయ్యిపౌన్ల ఆదాయం వచ్చేది.

1800 ప్రాంతాలలో కుంఫిణీ కొలువులో సివిలు సర్వెంట్లుగా ప్రవేశించే యువకులకు ప్రాచ్య విద్యలు నేర్పడానికి ఫోర్టు విలియం కళాశాలను స్థాపించారు.

12. P. Thomas - 'Christians and Christianity in India and Pakistan' - George Allen and Unwin Ltd. London, 1954. p.165

అందులో సంస్కృత, బెంగాలీ, మరాఠీ భాషల ఆచార్యునిగా విలియం కేరీగారినే ఎన్నుకొన్నారు. సాలీనా వెయ్యి పౌన్ల ఆదాయం అధికంగా దీని వల్ల శ్రీరామపురం మిషను కార్యక్రమాలకు లభించాయి.

పెట్టుబడి లభించాక, భవనాలు, ముద్రణా యంత్రశాల, దాని పరికరాలు సంపాదించారు. విలియం వార్డు తన సాంకేతిక జ్ఞానాన్ని సద్వినియోగం చేసి శ్రీరామపురంలో అచ్చుపోత పోసే యంత్రాన్ని, కాగితం తయారుచేసే యంత్రాన్నీ నిర్మించాడు. అచ్చుదిమ్మల తయారీలో స్థానిక పంచాణం కులాలలోని శిల్పులను చేర్చుకొన్నారు. పంచానన అనే కమ్మరీ, మనోహర్ అనే అతని సహాయకుడు వివిధ భారతీయ భాషల లిపులకు తగిన అక్షరాలు పోత పోయడంలో పాటుపడ్డారు.

కేరీగారి నిరంతర కృషి వల్ల బైబిలు తర్జుమాలు వివిధ భాషలలో కొనసాగాయి. క్రీ.శ. 1800 మార్చి 18వ తేదీనాడు శ్రీరామపురం మిషనులోని ముద్రాక్షరశాలలో 'న్యూ టెస్టమెంట్' తొలిపత్రం అచ్చుపడింది. నాటినుండి నిర్విరామంగా పనిచేయబడ్డ 1801 ఫిబ్రవరి 7వ తేదీనాటికి ఈ కొత్త నిబంధన గ్రంథం అచ్చుపూర్తయింది.

శ్రీరామపురంలో వివిధ భాషలలో బైబిలు అనువాదాలు, వ్రాతప్రతులు సిద్ధమవుతున్నా వాటిని అచ్చువేయడానికి వ్యవధి పట్టింది. 1807లో తెలుగు అక్షరాల ఫౌంటును ఇంగ్లండు నుంచి దిగుమతి చేయదలిచారు. 1811 నాటికి తెలుగు గ్రంథాల అచ్చుపని సాగుతూంది. హిందీ, మరాఠీ, సంస్కృతం, గుజరాతీ, ఒరియా, తెలుగు, కన్నడం, మలయాళం వంటి ముప్ఫయి ఆరు భాషలలో శ్రీరామపురం వారు బైబిలు గ్రంథాలను ప్రచురించారు. చైనీసు, బర్మీసు భాషలను కూడా చేపట్టారు.

కేరీగారు బహుముఖ వ్యాపకాలలో ఉన్నా మూడు తెలుగు గ్రంథాలను రచించి శ్రీరామపురం నుండి ప్రచురించారు. అయితే 1820లో ఒక నిర్ణయానికి వచ్చారు. తెలుగు పుస్తకాల ప్రచురణ తెలుగు భాష ప్రాచుర్యంగల ప్రాంతాల నుండే జరిగితే మంచిదనే యోచన వచ్చింది. అందుచేత తమ వద్ద గల తెలుగు గ్రంథాల ముద్రణ బాధ్యతలను మద్రాసులోని ఆగ్జిలరీ బైబిల్ సొసైటీ వారికి అప్పగించారు. అప్పటికి దేశంలో మిషనరీల పట్ల కుంఫిణీ ప్రభుత్వం వారి వైఖరి మారింది. ఆదిలో మత ప్రచారానికి అనుమతించని వారు ఇప్పుడు చట్టరీత్యా మిషనరీల జోలికి వెళ్ళకూడని పరిస్థితి వచ్చింది.

ప్రతి ఇరవై సంవత్సరాలకూ బ్రిటిష్ పార్లమెంటు కుంఫిణీ వారికి చార్టరును ఇవ్వాలి. 1793లో ససేమిరా మిషనరీలు భారతదేశ ప్రజలకు అసంతృప్తి కలిగించే మత ప్రచారం చేయకూడదని కుంఫిణీ వాణిజ్య వర్గాలవారు మొండికెత్తారుగాని, ఇరవయ్యేళ్ళలో 1814లో ఛార్టరును పొందే సమయానికి ఇంగ్లాండులోని మిషనరీ విద్యల నిరంతర పోరాటం వల్ల క్రైస్తవ జ్ఞానాన్ని భారతదేశంలో ప్రచారం చేయడానికి ఎవరైనా రావచ్చుననే అభ్యనుజ్ఞ రాజశాసన పత్రంలో ప్రవేశించింది. ప్రెస్సులు పెట్టుకొనడానికి పూర్వపు నిర్బంధాలు లేవు.

కుంఫిణీ వారు తమ బావుటా క్రింద చెల్లే రాజ్యాలలో మిషనరీల ముద్రణ సాగనివ్వనప్పుడు డెన్మార్కు పతాకం కింద చెల్లే తరంగంబాడిలో, శ్రీరామపురంలో మిషనరీలు ఆశ్రయం పొందేవారు. ఇతర ప్రాంతాలలో మత ప్రచారం చేయడానికి దక్షిణాదికి వచ్చే మిషనరీలు మొదట తరంగంబాడికి వచ్చేవారనిపిస్తుంది.

తెలుగు భాషలో క్రైస్తవ గ్రంథాలు అనువాదం చేసిన ప్రచారకులకూ, తరంగంబాడికి ఏదో సంబంధం ఉన్నట్టుంది. బెంజమిన్ షూల్జ్ తరంగంబాడిలో మొదట పనిచేశాక చెన్నపట్టణానికి చేరి తెలుగు అనువాదాలు చేశారు. ఉత్తరోత్తరా విశాఖపట్టణంలో స్థిరపడిన ఇద్దరు ఆంగ్లేయులు కూడా మొదట తరంగంబాడిలోనే ఓడ దిగారు.

1804, ఫిబ్రవరి మాసంలో లండన్ మిషను సొసైటీవారు జార్జిక్రేన్, అగస్టస్ డిగ్రేంజస్ అనే ఇద్దరు మిషనరీలను భారతదేశానికి పంపించారు. వీరు డిసెంబరు నెలలో తరంగంబాడికి చేరారు. కొన్నాళ్ళపాటు అక్కడ ఉండి ఉత్తర సర్కార్లలో మత ప్రచారం చేయడానికి నిశ్చయించుకొని 1805 జూలై 25వ తేదీనాడు విశాఖపట్టణం చేరుకొని అక్కడ స్థిరపడ్డారు.

జార్జిక్రేన్, అగస్టస్ డిగ్రేంజస్ వెనువెంటనే తెలుగు నేర్చుకొనడానికి ఉపక్రమించారు. ప్రాథమిక గ్రంథాల కోసం, వ్యాకరణం కోసం ప్రయత్నాలు చేశారు. చెన్నపట్టణంలోని స్నేహితులకు వీటి గురించి ఉత్తరాలు రాశారు. స్థానికుల వద్ద అక్షరాభ్యాసం చేశారు. స్వయంకృషితో నిఘంటు నిర్మాణానికీ, వ్యాకరణ రచనకూ కావలసిన పదజాలాన్ని, తదితర వస్తు సామగ్రిని సమకూర్చుకొన్నారు. అయితే వీరి ఆశయం నిఘంటువునుగానీ, వ్యాకరణాన్నిగానీ రచించడం కాదు. బైబిలును తెనిగించడమే వారి సంకల్పం. ఇది నెరవేరడానికి క్రైస్తవ మతాన్ని స్వీకరించిన ఒక బ్రాహ్మణ యువకుడు తోడ్పడ్డాడు. అతని పేరు ఆనందరావు.

మైసూరు సైన్యాల కొలువులో సుబ్బారావు అనే దేశస్త బ్రాహ్మణుడు పద్దు గుమాస్తాగా ఉండేవాడు. మహారాష్ట్ర నుండి ఎప్పుడో వలస వచ్చి, ముఖ్యంగా గుంటూరు పరగణాలో స్థిరపడిన బ్రాహ్మణులను దేశస్తులంటారు. జన్మతః మహారాష్ట్ర బ్రాహ్మణుడైన సుబ్బారావుకు తెలుగు బాగా వచ్చు. టిప్పు సుల్తాన్ ఓడిపోయాక సుబ్బారావు ఒక ఇంగ్లీషు ఆఫీసరు కొలువులో చేరాడు. సుబ్బారావుకు ఆధ్యాత్మిక చింతన చాలా ఎక్కువగా ఉండేది. పరాసు వాళ్ళతోటీ, ఇంగ్లీషు వాళ్ళతోటీ ఏర్పడిన పరిచయం వల్ల అతనిలో తాత్వికమైన ప్రశ్నలు రేగి వుండవచ్చు. తీర్థయాత్రలు చేశాడు. ఒకనాడు ఒక దేవాలయానికి వెళ్ళి అక్కడ వున్న ఒక వృద్ధ బ్రాహ్మణుని చూసి శాశ్వతానందం ఎలా దొరుకుతుందని ప్రశ్నించాడు. ఆయన ఏదో మంత్రం ఉపదేశించి నాలుగు కోట్లసార్లు పునశ్చరణ చేయమన్నాడు. ఎన్నో పూజావిధులు కూడా నిర్దేశించాడు. సుబ్బారావు అన్నీ చేశాడు గాని ఆశించిన ఫలితం చేకూరలేదు. సుబ్బారావు విసిగిపోయి ఇంటికి పోదామనుకొన్నాడు.

దారిలో ఒక రోమను కేతలిక్కును కలుసుకొన్నాడు. మాటల సందర్భంలో మత ప్రసక్తి వచ్చింది. చాలాసేపు చర్చించుకొన్నారు. ఆ రోమను మతస్థుడు క్రైస్తవ మతం

గురించి రెండు తెలుగు పుస్తకాలను సుబ్బారావుకు ఇచ్చాడు. వాటిని చదివాక సుబ్బారావులో పరివర్తన కలిగింది. క్రైస్తవ మతంలో చేరాలనుకొన్నాడు. అతని బంధుమిత్రులు ఇది గ్రహించి చాలా నొచ్చుకున్నారు. ఎలాగైనా ఆపాలని ఎన్నో ఆశలు పెట్టారు. మడిమాన్యాలు ఇవ్వచూపారు. సుబ్బారావు వాదించాడు. తన నిర్ణయం మారదన్నాడు. బంధువులను విడిచి దూరంగా ఎక్కడికైనా పోతానన్నాడు. భార్యను తనతో రమ్మన్నాడు. ఆమె ఇష్టపడలేదు. సుబ్బారావు భార్యను విడిచిపెట్టి నిష్క్రమించాడు.

తనకు పుస్తకాలనిచ్చిన రోమను కాథలిక్ మిషనరీని సుబ్బారావు కలుసుకున్నాడు. ఆయన సుబ్బారావుకు బాప్తిస్మం ఇచ్చాడు. ఆనందరాయుడు అనే కొత్త పేరును పెట్టాడు. రోమను మతస్థుల తెలుగు పేర్లలో 'ఆనంద' పదం ఉంటుంది. రెవరెండ్ ఫీలిక్సు 'భాగ్యానంద స్వామి' అనే పేరును పెట్టుకొన్నాడు. 'జాయ్‌కిమ్ డిసూజా' 'అధికానందస్వామి' అనే పేరును పెట్టుకొన్నాడు. అందుకే కాబోలు బాప్తిస్మం పొందుతూ సుబ్బారావు ఆనందరాయుడు అనే పేరును వాంఛించినట్టుంది. మతం మారే ముందు మళ్ళా బ్రాహ్మణ్యంలో కలవడానికి వీలులేకుండా అతడు తన శిఖాయజ్ఞోపవీతాలను విసర్జించాడు. కొన్ని నెలలు గతించాక మిషనరీ అతడిని పుదుచ్చేరికి పంపించాడు.

పుదుచ్చేరిలో మత సంబంధమైన మానసికానందం ఆనందరావుకు కలగకపోయినా సంసార విషయంలో ఆనందం లభించింది. అతని భార్య భర్తను వెదుక్కొంటూ వచ్చింది. కలుసుకొంది. ఆమె భర్త వియోగాన్ని భరించలేకపోయింది. మతం మారినా సరే అతడిని విడవలేననుకొంది. బంధువులు ఎన్నో హింసలు పెట్టారు. వాటిని పడలేక పారిపోయి భర్తను చేరుకొంది. సంసారం కుదుటపడ్డా ఆనందరావులో అసంతృప్తి హెచ్చింది. రోమను మతంలో కూడా విగ్రహారాధన ఉంది. ఇది ఆనందరావుకు నచ్చలేదు. తరంగంబాడిలో ఒక మిషను వుందని విన్నాడు. భార్యతో కలిసి అక్కడకు వెళ్ళాడు.

తరంగంబాడిలో బైబిలు అనువాదం చేస్తున్నారని విని ఆనందరావు సంబరపడ్డాడు. తానూ సహాయం చేస్తానన్నాడు. అక్కడ మిషనరీలు మొదట అతణ్ణి అనుమానించినా తరువాత తమలో కలుపుకొన్నారు. అంతకుముందు ఎన్నడూ చూడని మత గ్రంథాలను ఆనందరావు తరంగంబాడిలో చూశాడు. ఆబగా చదివాడు. తమిళం నుండి గ్రంథాలు తెనిగించాడు. అతనికి తెలుగుభాష మంచినీళ్ళ ప్రాయం. మరాఠీ భాషలో కూడా ధారాళంగా రాయగలడు. అతనికి మదరాసులోగాని, తంజావూరులోగాని మంచి ఉద్యోగం ఇప్పించాలని మిత్రులు ప్రయత్నించారుగాని ఆనందరావు నిరాకరించాడు. దైవసేవలో కాలం గడపాలని నిర్ణయించుకొన్నాడు.

తరంగంబాడిలో కొన్ని నెలలు ఉన్నాక విశాఖపట్టణంలో స్థిరపడిన ఇంగ్లీషు మిషనరీల గురించి విన్నాడు. వాళ్ళు బైబిలును తెనిగిస్తున్నారని తెలుసుకొన్నాడు. తెలుగువాళ్ళ మధ్యనుంటేే తన సేవలు ఇతోధికంగా ఉపయోగపడతాయని ఆనందరావు భావించాడు. తనను విశాఖపట్టణం పంపమని తరంగంబాడి మిషనరీలను కోరాడు. వాళ్లు సంతోషించారు. ఆనందంగా పంపించారు.

విశాఖపట్టణంలో అప్పటికే క్రేన్, డిగ్రేంజెస్ ఒక స్థలం కొన్నారు. ఇల్లు కట్టారు. ఒక బడిని పెట్టారు. విశాఖపట్టణం ఒక కోటలో వుండే కుంఫిణీ సిబ్బందికి, రాణువలోని సోల్జర్లకూ పౌరోహిత్యం చేస్తూ వుండేవారు. దీనివల్ల కొంత ఆర్థిక ప్రతిఫలం వచ్చేది. ఇది మిషను కార్యక్రమాలకు పనికి వచ్చేది. అప్పుడు విశాఖపట్టణంలో 20 వేల మంది జనాభా. మిషనరీలు ఒక ఇంగ్లీషు బడిని ప్రారంభించగానే ఎందరో విద్యార్థులు అందులో చేరారు. ముగ్గురు బ్రాహ్మణ బాలురు కూడా ఉన్నారు. బడికి మంచి పేరు వచ్చింది. ముప్ఫయి మైళ్ల దూరంనుండి కూడా విద్యార్థులు వచ్చేవారు. ఉత్తరోత్తరా ఒక పెద్ద ధర్మబడిని కట్టవలసినంతగా ఈ పాఠశాల నడిచింది.

ఆనందరావు భార్యతోపాటు విశాఖపట్టణం చేరాక మిషనరీలకు కొండంత సహాయం లభించింది. బైబిలు అనువాదంలోనేకాక పాఠశాల నిర్వహణలో కూడా ఆనందరావు తోడ్పడేవారు. తెలుగు బడిలో 40 మంది విద్యార్థులు, ఇంగ్లీషు బడిలో 20 మంది వుండేవాళ్లు. సరస్వతీ ప్రార్థనకు బదులుగా ఒక పద్యాన్ని ఆనందరావు రచించాడు. బడి మూసేటప్పుడు ప్రతిరోజూ విధిగా దీనిని విద్యార్థులు చదవాలి. ఒకరు ఒక పాఠం చదివితే మిగతావాళ్లు అతని తరువాత గొంతు కలిపి చదివేవారు. మిషనరీల భార్యలు కూడా బాలికా పాఠశాలలు నడిపేవారు. ఆనందరావు భార్య విశాఖపట్టణంలో బాప్తిస్మం పుచ్చుకొంది.

మత ప్రచార కార్యక్రమాలు ఒక ప్రక్క కావిస్తూనే మిషనరీలు బైబిలు అనువాదం కొనసాగించారు. మత ప్రచారం కోసం కొన్ని కరపత్రాలు ముందు తెనిగించారు. వాటిని చెన్నపట్టణానికి పంపిస్తే డాక్టర్ కేర్ సంతోషించి తన అజమాయిషీలో ఉండే అసైలమ్ ప్రెస్సులో అచ్చువేశాడు. ఈ ముద్రిత ప్రతులు చూసి క్రేన్, డిగ్రేంజెస్ పొంగిపోయారు. బైబిలు అంతా ఇలాగే నిర్దుష్టంగా కుదురుగా ఉండాలని ఆశించారు. ఆ ఆశలు ఫలించేలోగా 1809 జనవరి 8వ తేదీ నాడు జార్జి క్రేన్ మరణించాడు. డిగ్రేంజెస్ క్రుంగిపోయాడు. స్నేహితుని మరణం వల్ల చెయ్యి విరిగినట్టయింది. మనోవ్యాధి పెరిగింది. డిగ్రేంజెస్ 1810 జూలై నాలుగో తేదీనాడు మంచానపడ్డాడు. అతని భార్య అలాగే పక్క గదిలో మంచాన పడి ఉంది. జాన్‌గార్డన్ అనే కొత్త మిషనరీ అదృష్టవశాత్తూ విశాఖపట్టణంలో మత ప్రచారానికి వచ్చాడు. అతనికి బైబిలు అనువాద బాధ్యతనూ, ఆనందరావునూ డిగ్రేంజెస్ అప్పచెప్పాడు. ఆ మంచం దగ్గర ఆనందరావు ప్రమాణం చేశాడు. ''ఈ ప్రదేశం విడిచిపెట్టి వెళ్ళను. దేవుడు నాకు శక్తి ఇచ్చినంతకాలం రెండు నిబంధనలూ అలాగే అనువాదం చేసుకొంటూపోతాను. మీరు కన్నుమూసిన చోటే నేనూ మరణిస్తాను. ఈ గోడలు దాటి ఇంకెక్కడకూ వెళ్ళను'' అని తన దృఢ నిశ్చయాన్ని చెప్పాడు.[13]

13. J. Hough - History of Christianity Vol.IV దీనిలో 262 పుట నుంచీ ఆనందరావు జీవిత చరిత్ర వివరాలు కొన్ని లభిస్తాయి.

1810 జూలై 12వ తేదీన డిగ్రేంజెస్ మరణించడానికి ముందు, మత్తయి, మార్కు, లూకా మూడు సువార్తల అనువాదాన్ని పూర్తి చేశాడు. వీటిని 1812లో శ్రీరామపురంలో అచ్చువేశారు. ''దేవునియొక్క సమస్తమైన వాక్యము'' ''సువిశేషము మమ్మును రక్షించేకర్త అయిన యేసుక్రీస్తు యొక్క శుభ సమాచారము'' అనే పేరుతో ప్రకటించారు. జి. క్రేన్, ఆనందరాయర్ల సహాయంతో గ్రీకు భాష నుండి అగస్టిన్ డిగ్రేంజెస్ అనువదించినట్టు తెలియచేశారు. ఇది 319 పుటల గ్రంథం.

డిగ్రేంజెస్ మరణించిన రెండేళ్ళకు 1812లో ఎడ్వర్డ్ ప్రిచ్చెట్ అనే పాదిరి విశాఖపట్టణం మిషను అధికారిగా వచ్చాడు. ఆయన కూడా తెలుగులో నిష్ణాతుడు. డిగ్రేంజెస్ విడిచి పెట్టిన భాగాలను అనువదించసాగాడు. మూడు సువార్తల ప్రచురణ తర్వాత ఆరేళ్ళకు సంపూర్ణంగా బైబిల్ అనువాదం పూర్తయి మద్రాసు కమర్షియల్ ప్రెస్‌లో 1818లో అచ్చయింది. జాన్ గార్డన్, ఆనందరాయర్ల సహాయంతో ఎడ్వర్డ్ ప్రిచ్చెట్ అనువదించినట్లు ముఖపత్రంపై ఉంది. ఈ గ్రంథము యేసుక్రీస్తు యొక్క నూతన నిర్ణయమైయున్నది అని గ్రంథనామాన్ని విశదపర్చారు. దీనిని బాప్టిస్టు అండ్ ఫారెన్ బైబిల్ సొసైటీవారు ప్రచురించారు. ఇది 800 పై చిలుకు పుటల గ్రంథం.

ప్రిచ్చెట్‌గారి బైబిల్ ముద్రణ పొందిన 1818లోనే శ్రీరామపురంలోని మిషనరీలు అనువదించిన 860 పుటల తెలుగు బైబిలు వారి ముద్రణాలయంలో అచ్చువేశారు. దీని పేరు 'ఈశ్వరుని అన్ని మాటలు.... ఇది దమన్ పుస్తకము' ఇందులో పాత కొత్త నిబంధనలు రెండూ తర్జుమా చేశారు. ఈ అనువాదానికి ఆదరణ లభించినట్టు లేదు. ప్రిచ్చెట్‌గారి అనువాదాన్నే ఆధారం చేసుకొని ఎన్నో పునర్ముద్రణలు తరువాత వచ్చాయి. 1831, 1854 సంవత్సరాల కూర్పులు విశాఖపట్టణం మిషనరీల అనువాదాన్ని ఆధారం చేసుకొనే అచ్చువేశారు.

ప్రిచ్చెట్ అనువాదం సరళంగానూ, సుబోధకంగానూ ఉంటుంది కనుక జనులకు తగి ఉన్నదని కాంబెల్ దొరగారు అభిప్రాయపడ్డారు. సెంటుజార్జి కోట కాలేజీలో ఉండే ఒక మహా పండితుని అభిప్రాయం కూడా ఇదే.[14]

ప్రిచ్చెట్ 1824లో, గార్డన్ 1828లో మరణించారు. ఆనందరావు ఎప్పుడు పుట్టాడో, ఎప్పుడు మరణించాడో తెలియదు. బైబిలు అనువాదంలో వరుసగా ముగ్గురు మిషనరీలకు చేదోడు వాదోడుగా ఉండి అన్ని కూర్పులలోనూ సహాయకుడనే హోదాలో ముఖపత్రం మీద తన పేరు అచ్చుకెక్కిన ఘనత ఆనందరావుదే.

ఈ యుగంలో చాలామంది ఆనంద నామధారులు కనబడతారు. వేదాంత రసాయనం అనే క్రైస్తవ కావ్యాన్ని మంగళగిరి ఆనందయ్య రచించాడు. మెకంజీ దొర కొలువులో ఆనందరావు అనే ఒక గుమాస్తా ఉండేవాడు. ఈ ముగ్గురు ఆనందరావులూ ఒకరే అని నిడుదవోలు వెంకటరావుగారు ''ఆంధ్ర వచన వాఙ్మయం'' లో రెండు బైబిలు అనువాదాల గురించి చెప్పి ఇలా రాశారు.[15]

14. Hough - History of Christianity in India. Vol.IV. p. 270 n.
15. నిడుదవోలు వెంకటరావు - ఆంధ్రవచన వాఙ్మయం, ఆంధ్ర గ్రంథమాల, 1954-పుట 71

''పై రెండు క్రైస్తవ గ్రంథాలను తెలుగు వచనముగా రచియించిన ఆనందరాయరు మంగళగిరి ఆనందకవి. ఇతడే వచన గ్రంథమునేగాక, వేదాంత రసాయనమను పద్యకావ్యమును రచియించినాడు. ఇది యేసుక్రీస్తు చరిత్రను తెలుపు నాల్గాశ్వాసముల ప్రశస్త కృతి. టీకాతాత్పర్యములతో 1882లో ముద్రితమైనది. బ్రౌను దొరవారీ గ్రంథమును గూర్చి 1840లో The Madras journal of literature and science అను పత్రికలో వ్రాసియున్నారు. విజయనందన విలాసము అనునది యీతని మరియొక పద్యకృతి. ఈతడే స్థానిక చరిత్రలకు మూల పురుషుడగు కర్నలు మెకంజీ దొరవారివల్ల నియమితుడై అమరావతీ స్తూపమును మొదట పరిశోధించిన శాసనములకు ప్రతులు వ్రాసినవాడు. ఈతని దినచర్యనే 'Dairy of Ananda Rao' అనియుందురు. ఈతని దినచర్యలో అమరావతి ప్రాంతమున దొరికిన రత్నములను మెకంజీ దొరవారి ప్రతినిధియగు కావలి లక్ష్మయ్యగారికి పంపినట్లు కలదు''. (Tylor Vol. III Page 505)

పైన వెంకటరావుగారు పేర్కొన్న బ్రౌను వ్యాసంలో వేదాంత రసాయనం రాసిన ఆనందకవి అప్పటి నూరేళ్ళ కిందటివాడని దొరగారు చెప్పారు. బ్రౌను దొరగారి అంచనా కూడా తప్పే. ఈ సంగతి వెంకటరావుగారు పట్టించుకోలేదు. వెంకటరావుగారి మాటలను పట్టుకొని డాక్టర్ జె. మంగమ్మగారు తమ 'బుక్ ప్రింటింగ్ ఇన్ ఇండియా' అనే గ్రంథంలో ముగ్గురు ఆనందనామధారులూ ఒకరే అని భావించినట్టు కనబడుతుంది. (పుట 63)

ముగ్గురు ఆనందనామధారులు భిన్న వ్యక్తులని ఉత్తరోత్తరా గ్రహించి నిడుదవోలు వెంకటరావుగారు 'ఆంధ్ర వచన వాఙ్మయము' రెండవ ముద్రణం (1977)లో పైన ఉదాహరించిన వాక్యాలను తొలగించారు.

తెలుగు సాహిత్య చరిత్రలో చోటు చేసుకొందుకు ఆనందరావు చేసిన బైబిలు అనువాద సహాయం ఒక్కటే చాలు.

దక్షిణ భారతంలోని ప్రాంతీయ భాషలలో గ్రంథ ప్రచురణ కార్యక్రమాన్ని ప్రధానంగా మిషనరీలే చేపట్టినా, సెంటు జార్జికోటలో కాలేజీని పెట్టాక మద్రాసు కుంఫిణీ సర్కారువారు ప్రాథమిక పాఠ్య గ్రంథాలను స్వయంగా ప్రచురించక తప్పలేదు. కోటలో కాలేజీకి అనుబంధంగా ఒక ప్రెస్సూ, ఒక డిపో 1812లోనే తలపెట్టారు. లాటిన్, ఇంగ్లీషు, తమిళ, తెలుగు భాషలలో గ్రంథ ప్రచురణ ప్రయత్నాలు మొదలుపెట్టారు. తెలుగు అక్షరాలను పోతపోసే 'పడి అచ్చు' మూల యంత్రాలను, పరికరాలను కొనడానికి పెట్టుబడిని మంజూరు చేశారు.

కాలేజీ బోర్డువారు ప్రచురించిన తెలుగు భాషకు సంబంధించిన గ్రంథాలలో కొన్ని వ్యాకరణాలు, వాక్య గ్రంథాలు, పదకోశాలు, ఎంచిన సంకలనాలు వున్నాయి.

1816 - ఎ.డి. కాంబెల్ దొరగారు ఇంగ్లీషులో చేసిన తెలుగు వ్యాకరణం.

1819 - రావిపాటి గురుమూర్తిగారి విక్రమార్కుని కథలు

1820 - ఎ.డి. కాంబెల్‌గారి వ్యాకరణం రెండో ముద్రణ

1821 - ఎ.డి. కాంబెల్‌గారి తెలుగు నిఘంటువు

కాలేజీ బోర్డువారు తాము అభిమానించేవారు చేసిన గ్రంథాలనే ప్రచురిస్తున్నారు. కనుక ఆ రచయితలకన్నా ముందుగా అటువంటి గ్రంథాలను రచించినవారు ప్రైవేటు ముద్రాక్షరశాలల్లో తమ గ్రంథాలు యిదే కాలంలో అచ్చువేయించుకొన్నారు. ఇది కమర్షియల్ ప్రెస్‌లో ముద్రించారు.

1817 - విలియం బ్రౌనుగారి తెలుగు వ్యాకరణం

1818 - విలియం బ్రౌనుగారి వొకాబులరీ

కుంఫిణీ వారి సివిల్ సర్వెంట్లు చాలామంది పాఠ్యగ్రంథాలుగా ఉపయోగపడే పుస్తకాలను రచించసాగారు. మిషనరీలు భారతదేశంలోని కుంఫిణీ రాజ్యాలలో యథేచ్ఛగా ప్రచారం చేసుకోవచ్చుననే హక్కును 1814 నాటి ఛార్టరులో పొందుపరిచాక 1817లో బళ్ళారిలో వెర్నాక్యులర్ ట్రాక్టు సొసైటీని సంస్థాపించారు. కరపత్రాల వంటి చిరుపొత్తాలను యిక్కడ మిషనరీలు ప్రచురణకు సిద్ధపరిచేవారు. 1825 నాటికి బళ్ళారిలో అచ్చుకూటం ఒకటి వీరు స్థాపించారు. 1818లో మద్రాసులోనూ, 1840లో విశాఖ పట్నంలో ట్రాక్టుల కోసం అచ్చుకూటాలు వచ్చాయి. మిషనరీల గ్రంథ ప్రచురణలు క్రైస్తవ జ్ఞానాభివృద్ధికి వుద్దేశించినవి. విద్యాలయాలలో పాఠ్యగ్రంథాల ప్రచురణ విభిన్నమైన విషయం.

1820లో మద్రాసు స్కూల్ బుక్ సొసైటీని సర్కారువారు స్థాపించారు. పదేళ్ళలో కొన్ని పాఠ్యగ్రంథాలు, తత్తుల్యమైనవీ ప్రచురించారు. 1842 నాటికి కాలేజీలో అమ్మే పుస్తకాల గురించి పత్రికలలో వివరాలు వున్నాయి.[16]

కాలేజీలో అమ్మే పుస్తకాలు

తెలుగు	రు.-అ-పై
కేమిల్ గ్రామరు చీనా కాగితాలది కట్టినది	4-0-0
కట్టనిది	3-8-0
ఈ దొరగారి తెలుగున్ను యింగిలీషున్ను	
డిక్షనెరీ గోవా కాగితాలది	15-0-0
చీనా కాగితాలది	6-0-0
వేమన పద్యాలు కట్టినది ఇంగ్లీషు	2-0-0
అర్థం సహా కట్టనిది	1-12-0
మారీసు తెలుగు సెలక్షన్ చీనా	4-0-0
డిటో - ఇంగ్లీషున్ను తెలుగున్ను వుండే	
రెండు వాలాల డిక్షనేరీ	35-0-0
కట్టనిది	32-8-0
బ్రౌను ఛందస్సు తె॥యిం॥న్ను	0-8-0

16. వర్తమాన తరంగిణి - ఆశ్వాసం I - సంచిక 19, 1842 అక్టోబరు 13.

రావిపాటి గురుమూర్తి శాస్త్రులవారు	
చేసిన విక్రమార్కుని కథలు	3-8-0
కట్టనిది	2-12-0
గురుమూర్తి శాస్త్రులవారి తెలుగు వ్యాకరణం కట్టనిది	2-8-0
విశ్వంభరశాస్త్రి అమరకోశం	2-8-0
వుస్టలరు దొరగారు చేసిన తెలుగు	
అరేబియన్ నైట్సు	13-0-0
కట్టనిది	12-0-0
బొ॥ సుబ్రావు యింగిలీషు తెలుగు	
సినానిమసు డిక్షనేరి	3-0-0
అచ్చులో	
హంసవింశతి తెనుగు వచన కావ్యం; వేణుగోపాలశతకం.''	

ఈ పుస్తకాల వివరాలలో కొన్నింటిని 'కట్టనివి'గా, కొనిన 'కట్టినవి'గా తెలియచేయడంలో ఒక విశేషముంది. తొలి రోజుల్లో ప్రచురణకర్తలే అన్ని పుస్తకాలను బైండు చేయించేవారు కాదు. విడివిడి పుటల ఫారాలను కట్టకుండా అమ్మేవారు. కొనుక్కొనేవారు బైండు చేయించుకొనేవారు. ఇటువంటి వాటినే 'కట్టనివి' అని పేర్కొనేవారు. ప్రచురణకర్తలే బైండు చేసిన వాటిని 'కట్టినవి' అని పేర్కొనేవారు.

అన్ని తరహాల పుస్తకాలనూ తాము ప్రకటించవలసిన అవసరం లేదని కాలేజీ బోర్డువారు, స్కూల్ బుక్ సొసైటీ వారు భావించారు. ప్రైవేటు వ్యక్తులు నడిపే ప్రెస్సులలో వాటిని వివిధ ప్రచురణ కర్తలు ముద్రించుకొనడమే మంచిదని భావించారు. అయితే అచ్చుకూటాలను పెట్టుకోడానికి, పత్రికలు ప్రచురించడానికి సర్కారువారి అనుమతి కావాలి. పత్రికా స్వాతంత్ర్యంపై తీవ్రమైన నిర్బంధాలు వుండేవి. అభ్యంతరకరమైన రచనలు చేసిన తెల్లవాళ్ళని భారతదేశం నుంచి బహిష్కరించేవారు. 1835లో సర్ చార్లెస్ మెట్కాఫ్ గవర్నరు జనరల్‌గా పదవిని స్వీకరించాక 'నేటివ్ ప్రెస్'పై నిర్బంధాలను పూర్తిగా రద్దు చేశాడు. అచ్చుకూటాలు పెట్టదలచుకొన్నవారుగానీ, పత్రికలు నడపదలుచుకొన్నవారు గానీ మేజిస్ట్రేటు దగ్గర 'డిక్లరేషన్' తీసుకొంటే చాలు, వాటిని నిర్వహించవచ్చుననే ఉదారమైన ఆజ్ఞలు మెట్కాఫ్ జారీ చేశాడు. భారతదేశంలోనూ, మద్రాసు ప్రెసిడెన్సీలోనూ, తెలుగు సాంస్కృతిక రంగంలోనూ చెప్పుకోదగ్గ మార్పులు వచ్చాయి.

1836వ సంవత్సరంలో ప్రచురితమైన మద్రాస్ ఆల్మనాక్ వార్షిక సంచికలో ఒక్క చెన్నపట్నంలోనే 20 ప్రైవేటు ముద్రాక్షరశాలలు వున్నట్లు చిరునామాలతో సైతం ప్రకటించాడు.[17] ఈ ముద్రాక్షరశాలల జాబితాలో ప్రతియేడు కొత్త అచ్చుకూటాల పేర్లు వచ్చి చేరేవి. వృత్తాంతిని, వర్తమాన తరంగిణి అనే ముద్రాక్షరశాలలు కూడా ఏర్పడ్డాయి.

17. Vide - Arudra's beginnings of Telugu Journalism in "Studies in the History of Telugu Journalism" - Ed. K.R. Seshagiri Rao, Delhi, 1968, p.17

పత్రికా ప్రకటనంతోపాటు పుస్తక ప్రచురణ కూడా లాభసాటి వ్యాపారమేకాక జ్ఞానాభి వృద్ధికి మార్గం అని విద్వత్కుటుంబాలలోని వ్యక్తులు గ్రహించారు. 1842 నాటికి 'వర్తమాన తరంగిణి' వారి దగ్గర లభించే పుస్తకాల కేటలాగును ప్రచురించారు.

'ఈ దిగువను మా పత్రికలో ప్రసిద్ధపరచి వుండే సకల గ్రంథములున్ను రొఖరూకలకు క్రయానికి యీ చాపాఖానాలో దొరకడమవును.'

ఇంగ్లీషు తెనుగు

బహువిధముల అనేక మాటలు కొత్తగా చేర్చి విశేషములైన సంగతులున్ను వ్యవహారపు విషయములున్ను చదువుకొనేవారికిన్ని తక్కిన వారికిన్ని ఉపయోగించే లాగున కాంబి రామకృష్ణ శాస్త్రులవారివల్ల ఏర్పరచబడిన వొక్కబ్లేరి డైలాగు మొదలైన గ్రంథం.

	రు. 4 అ 8
ప్రశ్నోత్తరములుగా వ్యాకరణము	రు. 1 అ 8
యిర్రెగ్యులర్ వెర్బులు	రు. 1 అ 8
కార్పెంటర్సు సినానిమసు డిక్షినేరి	రు. 4
ప్లీజాంటు స్టోరీ	రు. 2

యింగ్లీషు అరవము

లుక్కింగు గ్లాసు	రు. 5
పెర్షియన్ స్టోరీ	రు. 2
ప్లీజింగు టేల్సు	అ 12
క్రొత్తగా యేర్పరచబడిన వొక్కబ్లేరి మొదలయినవి	రు. 7

తెనుగు

టీకామరము	రు. 7
మూలం అమరం	రు. 1 అ 8
మనుచరిత్ర మూలం	రు. 2
ఆదిపర్వం	రు. 8
వసుచరిత్ర టీకతో నాలుగో ఆశ్వాసము పర్యంతం తయారుగా వున్నవి. మిగిలిన రెండు ఆశ్వాసములున్ను పూర్తిగానే యిప్పించడమవును	రు. 10
కుచేలోపాఖ్యానం	రు. 1 అ 8
వేమన పద్యములు 3 భాగములు	రు. 2

భర్తృహరిః సంస్కృత శ్లోకములు		
తెలుగు భాషలో భాగములు	రు. 1	
ఆంధ్రనామ సంగ్రహం టీకతో	రు. 1	
హరిశ్చంద్ర నలోపాఖ్యానము		
యక్షగానము గరుడాచలము	రు. 4	
రుక్మిణీ కల్యాణము	అ 5	
ప్రహ్లాద చరిత్ర	రు. 1	అ 4
భగవద్గీతలు	రు. 1	
బాల రామాయణము అర్థముతో		అ 14
బాలశిక్ష		అ 14
భజగోవింద శ్లోకములు అర్థముతో		అ 8
కవిజన రంజనం		అ 12
శుకరంభా సంవాదం రంభా రావణ సంవాదం		అ 12
గజేంద్ర మోక్షం		అ 8
నరసింహ శతకం		అ 12
రామతారక శతకం		అ 12
కాళహస్తి శతకం		అ 8
కలువాయి శతకం		అ 8
కాంతాలలామ శతకం		అ 8
లావణ్యా శతకం		అ 8
సిద్ధరామ శతకం		అ 8
భళిర కరవేల్ప శతకం		అ 6
చమడప్ప శతకం		అ 6
దాశరథీ శతకం		అ ౫
సుమతీ శతకమున్ను ఛందస్సున్ను		అ ౪
భాస్కర శతకం		అ ౪
జానకీ పతి శతకం		అ ౫
వరయోగీంద్ర శతకం		అ ౧ ౨
గురుమూర్తి శాస్త్రుల్లవారు చేసిన వ్యాకరణం		రు ౧ అ ౮
పంచతంత్ర కథలు		రు 3 అ౮
ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణం		అ ౧౦

అరవం - కన్నడం - హిందూస్తానీ పుస్తకాల పట్టికలు కూడా ఉన్నాయి.
(వర్తమాన తరంగిణి - పుస్తకం 1, సంచిక-9, 1842 ఆగస్టు 4)

1842 నాటికి ఇన్ని పుస్తకాలు ప్రచురితమైనట్లు దాఖలాలు కనబడుతున్నా ఒక అర పుష్కర కాలం ముందుగానే ప్రామాణిక గ్రంథ ప్రచురణలు ప్రారంభమయ్యాయని

భావించవచ్చు. ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్ర చరిత్రను 1838లో పుదూరు నారాయణశాస్త్రిగారు 'లేఖక తప్పులు' దిద్ది ప్రచురించారు. ఈ పేరులో ఉన్న 'పుదూరు' అన్నది గ్రామనామం. నెల్లూరు జిల్లా నాయుడుపేటకు కోసెడు దూరంలో ఈ గ్రామముంది. 'ఏభైయిళ్ల విద్వన్మండలి' ఈ గ్రామంలో ఉన్నట్టు వీరాస్వామయ్యగారు చెప్పారు. (కాశీయాత్ర చరిత్ర పుట 360). ఈ విద్వత్కుటుంబాలలోని వారందరికీ గ్రామనామం 'పుదూరు' అని మొదట ఉన్నా ఇంటి పేర్లుగా వేరే పౌరుష గ్రామనామాలు కూడా పేరుతో చేర్చుతారు. వీరందరూ ద్రావిడ బ్రాహ్మణ శాఖకు చెందినవారు. వేదం, పురాణం, వావిళ్ళ, చదలువాడ అనే ఇంటిపేర్లు పుస్తక ప్రచురణ రంగంలో ప్రసిద్ధమైనవి.

పురాణం వారిలో కృష్ణ శాస్త్రులు, హయగ్రీవ శాస్త్రులు అనే సోదరులు సంస్కృతాంధ్ర పండితులు. కృష్ణ శాస్త్రులుగారు 1840లో శంకర భగవత్పాదుల 'ఆత్మబోధ ప్రకాశిక' ప్రతిపదార్థ వ్యాఖ్యానసహితంగా అనువదించారు. ఈ ఆంధ్రీకరణాన్ని అనుసరించి రామానుజ కవిరాయలు ఒక తమిళానువాదం తయారుచేశారు. తమ సోదరులలాగే హయగ్రీవ శాస్త్రిగారు పుస్తక ప్రచురణలో అభిలాష గలవారు. ముమ్మడిశెట్టి పార్థసారథి శెట్టిగారితో కలసి 'వివేకాదర్శం' అనే అచ్చుకూటాన్ని నెలకొల్పారు. శాస్త్రిగారు ఎటువంటి పుస్తకాలు ప్రకటించదలిచారో ఆయన బ్రౌను దొరగారికి రాసిన ఈ క్రింది లేఖవల్ల విశదమవుతుంది.

''మహారాజశ్రీ ఆంధ్ర భాషా పండితులగు బ్రౌను సాహెబుగార్కి పురాణం హయగ్రీవ శాస్త్రి అనేక సలాములు చేసి వ్రాసుకున్న మనవి యేమంటే, వాల్మీకియ్యమగు శ్రీ మద్రామాయణమును అనేక మూల ప్రతులనున్ను వుంచుకొని పరిష్కరించి కొన్ని దురూహములగు ('దురవగాహములగు' అని బ్రౌను దిద్దుబాటు) ఘట్టములయందు వ్యాఖ్యానకారుల అభిప్రాయమును సంగ్రహముగానున్ను తేటగానున్ను తెలియవ్రాశి, ప్రతి అధ్యయ కథను సంగ్రహముగా ముందు దెలిపి యింకా కొన్ని పద్ధతులను నవీనంగా నేర్పరచి ముద్రాక్షరముల యందు అచ్చువేయించే లాగున నిశ్చయిస్తిని గనక నా వుద్యమము సఫలపరచుటకు తమ్ము వేడడమేమంటే ముందు తాము అనేక ప్రతులను వుంచుకొని పరిష్కరించి యుండే రామాయణము బాలకాండనున్ను అయోధ్యకాండనున్ను దయచేసి పంపడము మాత్రమేగాక, రామాయణ వ్యాఖ్యానములగు రామానుజియ్యము, గోవింద రాజియ్యము, భావ ప్రకాశిక, టీకా శిరోమణి, కతక టీక, వెద్యనాదియ్యము, నాగోజీపండితియ్యము, వీటిలో యేది వుండినా దయచేసి పంపడము వల్ల చాలా సహాయముగా వుండును. లోగడ కలకత్తాలో ముద్రాక్షర విరచిత రామాయణము తమ వద్ద వున్నట్టున్ను సదరహి గ్రంథము ప్రకృతమందు నేను దిద్ది యేర్పరచబొయ్యే రామాయణ గ్రంథమునకు చాలా సహాయపడుననిన్ని దాన్ని యిప్పించే లాగున నున్నులోగా రా.రా. పార్థసారథి శెట్టి వ్రాయించి పంపించిన జాబువల్ల తెలియనగును.

సదరహి రామాయణము క్రౌదరు సాహెబుల వద్ద బాలకాండ మాత్రము వుండగాను దాన్ని తెచ్చి యీ దేశపు పుస్తకములలో సరిచూడగా ప్రతి శ్లోకమున్ను వేరుపడియున్నది. కొన్నిచోట్ల శ్లోకములు లేకయున్ను, కొన్ని స్థలములయందు

అధికముగా నున్ను యిట్లు న్యూనాధిక్యముల చేత యీ దేశమందు గల పుస్తకములకు శానా వేరుపడి యున్నది. గనుక అది యీ దేశస్థులకు చాలా విరుద్ధముగా నున్నందున నాకు సహాయపడనేరదని నమ్ముతున్నాను. యిదిన్నిగాక కాశీ దేశస్థ నాగోజీ పండితీయ్యమనే వ్యాఖ్యానమునకున్ను కూడా అది విరుద్ధంగానే వున్నందున అచ్చు వేయించే యెడల పండితుల కృత్రిమం వల్ల అట్లా జరిగినట్లు నాకు తోస్తున్నది.

యిదిగాక యీ దేశమందు ఫాదర్లు చేత నేర్పరచియుండే ముద్రాక్షరశాలలయందు శ్రీమద్రామాయణమును అచ్చు వేయించుటకు సమ్మతి పడకపోయినందున నా సొంతంలోనే అచ్చు ఆఫీసు వేయించేలాగున కొన్నిమంది సహాయమున్ను పొందడము వల్ల నిశ్చయిస్తిని. అందులో తెలుగు అక్షరములను సిద్ధపరచితిని. ఆ అక్షరములు తమరు ప్రకృతమందు వేయించే ఆదిపర్వంలో అక్షరములవంటివి అయి వాటికంటే కుదిరికెగా నున్నవి. ప్రమాణమందు వాటిలో జతగా నున్న కుదిరికెలో తమరు అచ్చు వేయించిన లూకా గ్రంథమునందు వుండే అక్షరములకు జతగా నున్నవి. యీ నెల 20 తారీఖున ఆఫీసు యేర్పరిచేలాగున నిశ్చయిస్తిని గనక తమ్ము వేడడమంటే యీ క్రింద వ్రాశే పుస్తకములను దయచేసి నాకు అచ్చువేసే లాగున యిప్పించి సహాయము చేయవలెను.

ప్రకృతమందు కావలసిన పుస్తకములు తారాశశాంకము, కుచేలోపాఖ్యానము, సారంగధర చరిత్రము, మైరావణ చరిత్ర, సుభద్రా పరిణయము, రాధికా సాంత్వనము, రాఘవ పాండవీయము సవ్యాఖ్యానము, మనుచరిత్ర సవ్యాఖ్యానము, తెలుగు పద్యములలో కూడా వుండే కర్ణామృతములు 3 శతకములున్ను, కొద్దిరోజులకు పిమ్మట కావలసిన పుస్తకములు భారతము యుద్ధపంచకము, రంగనాథ రామాయణము, తెలుగు భాగవతము, హరిశ్చంద్ర నలోపాఖ్యానము సవ్యాఖ్యానము, వీటిలో యెవరికైనా అచ్చు వేయుటకు యిచ్చేలాగున ముందు వాగ్దత్తము చేసియున్న పక్షమందు ఆ పుస్తకములను దక్క తక్కిన పుస్తకములను నాకే యిచ్చేసే లాగున దయచేయవలెనని కోరుతున్నాను.

తమరు యీ విషయమందు సర్వజ్ఞులు గనక యింకా యే పుస్తకములు అచ్చు వేయించుటకు నుపయుక్తంగా తమకు తోస్తున్నదో వాటిని తెలియచేయవలెనని కోరుతున్నాను.

యీ అచ్చువేసే విషయములను గురించి తమరు సర్వసాధారణముగా సహాయము చేయవలెనని తలంపుగల ప్రభువులయినందువల్లనున్ను, ఆంధ్రభాష యందుగల పుస్తకములు సుష్టుగా దిద్ది వేయించవలెననే కోరిక గలవారైనందుననున్ను నా విషయముగా అచ్చుకు కావలసిన పుస్తకముల నిచ్చి సహాయం చేస్తామని లోగడ నొకతూరి జాబువ్రాసి పంపించియుండడంనున్ను, సదరహి మూడు హేతువులవల్ల యీ రీతిగా వ్రాయడమైనది. చిత్తగించవలెను.

సంస్కృత గ్రంథములు ప్రాయశః నావద్దనే ప్రకృతమందు వుండడము వల్ల వాటిని గురించి తమకు వ్రాయలేదు. విశేషముగా కావలసిన పక్షమందు మనవి చేసుకొంటున్నాను. చిత్తగించవలెను. యిదే అనేక సలాములు.

తా॥ నాకు పంపే పుస్తకములను యీ జాబును తెచ్చే రా.రా. పార్థసారథి శెట్టి గుండా పంపితే చేరుతున్నది. గనుక దయచేసి పంపవలెను'.

(10-4-1840 M. 401 p.p.297-99)

అనేక సంస్కృతాంధ్ర గ్రంథాలను పురాణం హయగ్రీవ శాస్త్రిగారు ప్రామాణికంగా ప్రచురించారు. పురాణం వారి తరువాత అదే పుదూరి ద్రావిడ శాఖకు చెందిన 'వావిళ్ళ'వారు సుప్రసిద్ధులు. వీరు నలుగురు సోదరులు. వీరిలో రామస్వామి శాస్త్రుర్లుగారు (1832–1891) కడగొట్టువారైనా గ్రంథ ప్రచురణ రంగంలో నేటికీ ప్రథమ శ్రేణిలో లెక్కింపవలసినవారు.

రామస్వామి శాస్త్రుర్లుగారి పెద్దన్నగారి పేరు వెంకటరమణ శాస్త్రి. వీరు బళ్ళారిలో కలెక్టరు గుమాస్తా శిరస్తాదారుగా పనిచేశారు. రెండవ అన్నగారు సుబ్బరాయ శాస్త్రి. సామాన్య విద్యతో సంతృప్తిపడి 'దండిగుంట'లో స్థిరపడ్డారు. రామస్వామి శాస్త్రిగారు తమ మూడో అన్నగారు అనంత నారాయణ శాస్త్రితో కలిసి నెల్లూరులో గట్టుపల్లి శాస్త్రులవారి వద్ద వేదాధ్యయనం చేశారు. తరువాత ఈ అన్నదమ్ములిద్దరూ కలసి కోనసీమకు వెళ్ళి బులుసు పాపయ్య శాస్త్రిగారి వద్ద వ్యాకరణం చదువుకొన్నారు. తరువాత చెన్నపట్నానికి వచ్చి తండియార్‌పేటలోని తంజావూరు రామానాయుడిగారి సంస్కృత పాఠశాలలో వ్యాకరణ సాహిత్యాల కృషి కొనసాగించారు. అంతతో ఆగక మైసూరుకు వెళ్ళి చదువు కొనసాగించారు. అక్కడే ముద్రాక్షరశాలలు స్థాపించాలనే ఆలోచన వచ్చింది. ముమ్మడి కృష్ణరాజ వడయారు కాలంలో వారి ప్రోత్సాహం వల్ల ఒక ప్రెస్సును పెట్టి కన్నడ పుస్తక ప్రచురణ ప్రారంభించారు. కాని సహాయ సంపత్తిలేక దానిని కొనసాగించలేకపోయారు.

మద్రాసుకు ఈ అన్నదమ్ములు తిరిగి వచ్చాక రామస్వామి శాస్త్రుర్లుగారు వారి సోదరుల మామగారైన వేదం వెంకటాచల శాస్త్రిగారితో కలిసి వివేకాదర్శన ముద్రాలయం స్థాపించారు. ఇది కూడా మూన్నాళ్ళ ముచ్చటయింది. అన్నగారు అనంత నారాయణ శాస్త్రి గారితో కలిసి వివేక రత్నాకరమనే అచ్చుకూటాన్ని నెలకొల్పారు. అయితే 'అనంత నారాయణ శాస్త్రిగారికి మైసూరు సంస్కృత పాఠశాలలో ఉద్యోగం లభించడం వల్ల ఆయన భాగస్వామ్యం వదులుకొన్నారు. రామస్వామి శాస్త్రుర్లువారు ఒంటరిగా తంటాలు పడ్డారు. హిందూ భాషా సంజీవిని అనే అచ్చుకూటాన్ని కొన్నాళ్ళు నడిపారు. ఇంతలో సరస్వతి తిరువేంకటాచార్యులు గారు వచ్చి కలిశారు. ఇద్దరూ సరస్వతీ నిలయ ముద్రాక్షరశాలను స్థాపించారు. ఇది కూడా అల్పాయుష్షు సంస్థగానే పరిణమించింది.

ఇతరులతో పొత్తుల వ్యాపారంగా కాక స్వకీయ సంస్థగా రామస్వామి శాస్త్రుర్లుగారు ఆది సరస్వతీ నిలయ ముద్రాక్షరశాలను నెలకొల్పి కాళ్ళు నిలదొక్కుకున్నారు. 1854లో మొదటిసారిగా ఈ అచ్చుకూటాన్నుండి ఒక పుస్తకం వెలుగు చూసింది. నాటినుంచి రామస్వామి శాస్త్రుర్లుగారి 'వావిళ్ళ సంస్థ' ఇటీవల మబ్బులు మూసినా వెలుతురు వెదజల్లుతూనే ఉంది.

రామస్వామి శాస్త్రిగారి అల్లుడు చదలవాడ సుందరరామ శాస్త్రిగారు (1840-1925) కూడా ముద్రాపకులే. 'శారదాంబా విలాస ముద్రాక్షరశాల'ను స్థాపించి ప్రామాణిక గ్రంథాలను ప్రచురించారు. వాల్మీకి రామాయణానికి ప్రతి పదటీకా సహితాంధ్ర వ్యాఖ్యానాన్ని 15 సంపుటాలలో ప్రచురించారు. మామగారు పోయాక వావిళ్ళ సంస్థను ఈయనే కొన్నాళ్లు నిలబెట్టారు. రామస్వామి శాస్త్రుర్లవారి కుమారుడు వెంకటేశ్వర శాస్త్రిగారు (1885-1956) ఆ తర్వాత ఆ సంస్థకు వారసులయ్యారు.

పుదూరు ద్రావిడ బ్రాహ్మణులేకాక భువనగిరి రంగయ్య శెట్టి, పువ్వాడ వెంకటరావు, నరసప్ప శెట్టి మొదలైనవారు గ్రంథ ప్రచురణలు చేపట్టిన దిట్టలే.

రంగయ్యశెట్టిగారు జూలూరి అప్పయ్యపంతులు గారి టీకతో 'మనుచరిత్ర' 1851లో ప్రచురించారు.

పువ్వాడ వెంకటరావుగారు ఇతరులతో కలిసి బ్రౌను దొరగారి పరిష్కరణలు ఆధారంగా మహాభారతం అన్ని పర్వాలూ అచ్చువేశారు.

నరసప్పశెట్టిగారు తమ హిందూ ముద్రాక్షరశాలలో కాంబెల్ దొరగారి వ్యాకరణం, నిఘంటువుల పునర్ముద్రణ చేపట్టారు.

తెలుగు సాహిత్యానికి గ్రాంథిక శృంఖలాలను తగిలించిన చిన్నయసూరిగారు (1809-1862) వాణీ దర్పణమనే అచ్చుకూటంలో 1853లో తమ నీతిచంద్రికను ముద్రించారు.

ఇంతకుముందు వైయాకరణం రామానుజాచార్యులుగారు వాడుక భాషలో రచించిన ఆదిపర్వం వచన గ్రంథాన్ని 1847లో చిన్నయసూరిగారు సరిచూశారు. భాషనేం మార్చలేదు.

సూరిగారు 'సుజనరంజని' అనే పత్రికను నడిపారు. వీరి నీతిచంద్రిక, బాలవ్యాకరణాలు ప్రాచుర్యం పొందాక తెలుగులో గ్రంథ ప్రచురణల ధోరణి మారి తెలుగు సాహిత్యం మారుగొంతుకతో మాట్లాడసాగింది. అయితే మళ్ళా కొన్నాళ్ళకు స్వంత గొంతుక తెచ్చుకొంది.

త్యాగరాజస్వామి చెప్పినట్టు 'ఎందరో మహానుభావులు'. వందనాలు చెందవలసిన ఈ అందరూ అచ్చుకూటాలు పెట్టి గ్రంథాలు ప్రచురించారు.

ఈ అందరి పేర్లూ, వాళ్ళ ప్రెస్సుల పేర్లూ పూర్తి వివరాలతో లభించలేదు.

అయితే దొరికినంత మటుకు కుంఫిణీ యుగంలో ముద్రాక్షరశాలల పేర్లు అకారాది క్రమంలో చెప్పుకొందాం.

ప్రెస్సు పేరు	ఊరు	కాలం
అమెరికన్ మిషన్ ప్రెస్	మద్రాసు	1841–65
ఆదివిద్యానిలయ ముద్రాక్షరశాల	మద్రాసు	——
ఆదివివేకాదర్శ ముద్రాక్షరశాల	మద్రాసు	1851
ఆల్బియన్ ప్రెస్	మద్రాసు	1836
ఎథీనియం ప్రెస్	మద్రాసు	1836
ఎస్.పి.సి.కె. ప్రెస్	మద్రాసు	1836–1910
ఓరియంటలిస్ట్ ప్రెస్	మద్రాసు	1837
కమర్షియల్ ప్రెస్	మద్రాసు	1818
కర్ణాటిక్ క్రానికల్	మద్రాసు	1836
కల్వివిళక్కు అచ్చుకూటం	మద్రాసు	1836
కళానిధి ప్రెస్	మద్రాసు	1853–56
కాలేజి ప్రెస్	మద్రాసు	1819–29
కొలసుట్-ఉల్-అక్బర్	మద్రాసు	1836
క్రిష్టియన్ నాలెడ్జి సొసైటీ (సి.కె.ఎస్.) ప్రెస్	మద్రాసు	1844–91
జ్ఞానసూర్యోదయ ముద్రాక్షరశాల చర్చిమిషన్ ప్రెస్		1829–36
జ్యోతిష్కళానిధి ముద్రాక్షరశాల	మద్రాసు	1853
ది అబ్జర్వర్	మద్రాసు	1837
ది కన్సర్వేటివ్ ప్రెస్	మద్రాసు	1836
ది స్పెక్టేటర్	మద్రాసు	1837
పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ ప్రెస్	మద్రాసు	1857–67
మద్రాసు కూరియర్ ప్రెస్	మద్రాసు	1836
మద్రాసు గజిట్ ప్రెస్	మద్రాసు	1836
మద్రాసు సర్క్యులేటర్ అండ్ జనరల్ క్రానికల్	మద్రాసు	1836
మాస్టర్ సి.జె. టేలర్‌గారి అధీనంలో ఉన్న పురుశవాకంలోని ప్రెస్	మద్రాసు	1836
మిషన్ ప్రెస్	బళ్ళారి	1835–44
మిషన్ ప్రెస్	విశాఖపట్నం	1840–59
మిషన్ ప్రెస్	వేపేరి, మద్రాసు	1842
మిషన్ ప్రెస్	శ్రీరామపురం	1814–18
మిష్టర్ జెగ్రాంట్‌వారి లిథోగ్రాఫిక్ ప్రెస్	మద్రాసు	1836
మేల్ ఎసైలమ్ ప్రెస్	మద్రాసు	1836
మేస్తర్ ఇ. గార్డన్‌గారి అధీనంలో ఉన్న రాయపురంలోని ప్రెస్	మద్రాసు	1836
లండన్ మిషన్ ప్రెస్	విశాఖపట్నం	1856–66
వర్తమానతరంగిణీ ముద్రాక్షరశాల	మద్రాసు	1847
వాణీదర్పణ ముద్రాక్షరశాల	మద్రాసు	1853
వాణీవిలాస ముద్రాక్షరశాల	మద్రాసు	
విద్యానిలయ ముద్రాక్షరశాల	మద్రాసు	
వివేకకళానిధి ముద్రాక్షరశాల	మద్రాసు	
వివేకదర్పణ ముద్రాక్షరశాల	మద్రాసు	1853

వివేకధర్మ ముద్రాక్షరశాల	మద్రాసు	1843
వివేకరత్నాకర ముద్రాక్షరశాల	మద్రాసు	
వివేకవిద్యానిలయ ముద్రాక్షరశాల	మద్రాసు	1864
వివేకాదర్శ ముద్రాక్షరశాల	మద్రాసు	1843
వృత్తాంతిని ప్రెస్	మద్రాసు	1838
శారదానిలయ ముద్రాక్షరశాల	మద్రాసు	
సరస్వతీ అచ్చుకూటం	మద్రాసు	1836
సరస్వతీ పీఠ ముద్రాక్షరశాల	మద్రాసు	1845
సూర్యాలోక ముద్రాక్షరశాల	మద్రాసు	
సేలమ్ ప్రెస్	మద్రాసు	1836
స్కాటిష్ ప్రెస్	మద్రాసు	1857-62
స్టాండర్డ్ ప్రెస్	మద్రాసు	1836
హిందూప్రక్షిప్త ముద్రాక్షరశాల	మద్రాసు	
హిందూ ప్రెస్	మద్రాసు	1848

విబుధవరుల వల్ల విన్నంత, కన్నంత, తెలియవచ్చినంత తేటపరిచిన పై పట్టికలో తేదీల పైనాలు కొన్ని సవరణలకూ, వివరణలకూ తావిస్తాయి. దీనికి ఇతోధిక పరిశోధన అవసరం. ఏమైనా షుల్జ్ నుంచి సూరిదాకా సాగిన తెలుగు గ్రంథ ప్రచురణ చరిత్ర ఆంధ్ర సాహిత్య వికాసానికి చేతనైన సేవలు, చేర్చదగిన చేవలు చెప్పుకోదగ్గ విధంగానే ఇంకా దొరకవచ్చు.

ఏ పరిశోధనైనా అనంతం.

చిట్టచివర కారల్ మార్క్స్ విశ్లేషణ

ఇప్పటిదాకా సమగ్ర ఆంధ్ర సాహిత్యం కుంఫిణీ యుగం సంపుటంలో వివిధ చరిత్రకారులు తూర్పు ఇండియా కంపెనీ స్థాపన నుంచి ఉద్వాసన దాకా చెప్పిన భోగట్టాలు, చేసిన అంచనాలు, చూపెట్టిన దాఖలాలు పొందుపరుస్తూ ఈ యుగచరిత్రను అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాం. అయితే శాస్త్రీయ సామ్యవాద దృక్పథంతో ఈ యుగచరిత్రను అధ్యయనం చెయ్యడం అవసరం. గతితార్కిక, చారిత్రక, భౌతిక వాదాల ప్రాతిపదికపై శాస్త్రీయ సామ్యవాద స్థాపనాచార్యులైన కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ [illegible] తూర్పు ఇండియా కంపెనీ పుట్టుపూర్వోత్తరాలనూ, దాని కట్టకడపటి [illegible] ఫలితాలనూ చర్చిస్తూ తమ రచనలలో చక్కని విశ్లేషణ చేశారు. కారల మార్క్స్ 1853 జూన్ 10వ తేదీనుండి కొన్ని ముఖ్యాంశాలను చెప్పుకొనడం మన అవగాహనకు తప్పనిసరి ప్రాతిపదిక. ఆ సంగతులను నివేదిస్తాను.

తూర్పు ఇండియా కంపెనీ తన వ్యవహారాలను ప్రారంభించే ప్రప్రథమ దశలోనే [illegible] లాభసాటిగా [illegible] ముప్ఫయి వేల పౌన్ల విలువగల వెండి, బంగారాలను విదేశాలకు

ఎగుమతి చెయ్యడానికి రాజమకుటానుమతిని సంపాదించింది. ఇండియా నుండి దిగుమతి చేసుకొనే వస్తువులను ఇతర దేశాలకే ప్రధానంగా మళ్ళా ఎగుమతి చేసుకొంటారు. కనుక వీటి కోసం భారతదేశానికి చెల్లించే వెండి, బంగారాల కంటె, కొత్త ఎగుమతుల వల్ల లభించే ముద్ద వెండి బంగారాల పరిమాణాలు అత్యధికం అని ఆనాటి ఆర్థిక వేత్తలు భావించినట్టు మార్క్సు గమనించాడు.[1]

1688లో ప్రధాన భూస్వామ్య పారిశ్రామికాధిపతుల ప్రయోజనాలతోనూ, అగ్ర వాణిజ్యవేత్తల ప్రయోజనాలతోనూ ఇంగ్లండులో రాజ్యాంగ ప్రణాళికాబద్ధమైన రాచరిక వ్యవస్థ బలపడినా, సార్వభౌమాధికార సంస్థగా పార్లమెంటును రూపొందించడానికి అభివృద్ధి నిరోధక భూస్వామ్యవర్గం సహాయపడింది. తూర్పు ఇండియా కంపెనీ తమ దేశంలో అధికారంలో ఉన్నవారికి ఏటా పన్నెండువందల పౌన్లను 'కానుకలు'గా చెల్లిస్తూ వచ్చేది. 1693 నాటికి ఈ మొత్తం ఏటా తొంభైవేల పౌన్లకు పెరిగింది. లంచానికి 'కానుక' అన్నది ముద్దు పేరు. ఇంగ్లండు రాజుగారే పదివేల పౌన్ల లంచం పుచ్చుకొన్నారు. ఒక డ్యూక్‌గారు అయిదువేల పౌన్ల లంచం తిన్నారు. ప్రత్యక్షంగా పుచ్చుకొన్న ఈ లంచాలు ఇలా వుండగా బ్రహ్మాండమైన మొత్తాలను ధర్మవడ్డీకి అప్పు ఇస్తానని ప్రభుత్వానికి కంపెనీ ఆశ చూపింది. పోటీ కంపెనీల డైరెక్టర్లను కొని వేసింది.

భారతదేశంలో కంపెనీవారు రాజ్య విస్తరణ ప్రారంభించేసరికి ప్రజాస్వామ్య దేశమైన ఇంగ్లండులో ఒక వర్గం ఒక నూతనవాదాన్ని లేవదీసింది. బ్రిటిష్ ప్రజలైన కంపెనీవారు రాజమకుటంతో ఎలాంటి సంబంధం లేకుండా స్వతంత్రంగా తాము చలాయించగలిగే సార్వభౌమాధికారాలను సొంతంగా కలిగి ఉండటానికి ఎంతమాత్రం వీలులేదని ఈ వాదం ఉద్ఘాటిస్తుంది. ఇటీవల లభించిన దిగ్విజయాల ఫలితంగా లభించాయని విశ్వసించే 'అద్భుతమైన నిధి నిక్షేపాల'లో తమకు కూడా వంతు కావాలని ఆనాటి మంత్రులూ, ప్రజలూ ఇంగ్లండులో కోరారు. జాతీయ ఖజానాకు ఏటా నాలుగు లక్షల పౌన్లు చెల్లించడానికి కంపెనీ 1767లో ఒప్పందం చేసుకొని బయటపడేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది.[2] అయితే ఒప్పందం ప్రకారం ఈ కప్పాన్ని చెల్లించడానికి మారుగా కంపెనీ ఋణ్ల చిక్కుల్లో పడి ధన సహాయం కోసం పార్లమెంటునే అర్థించింది.

1784లో పార్లమెంటు ఈస్టు ఇండియా కంపెనీపై అజమాయిషీ చేసే ఒక బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసింది. కంపెనీ అధికారాన్ని రాజమకుటం నియమించే కమీషనర్లకు బదిలీ చేసింది. కంపెనీ డైరక్టర్లూ, మంత్రిత్వ సభ్యులూ కుమ్మక్కయ్యారు. 'ఈస్టిండియా కంపెనీ – దాని చరిత్ర, ఫలితాలు' అనే వ్యాసంలో కారల్ మార్క్సు నాలుగు విభిన్న కోణాల నుంచి భారతదేశ సమస్యలను పరిశీలించాడు.

ఒకప్పుడు కేవలం తన ఏజెంట్లకు వ్యాపార స్థావరాలు నిర్మించుకొనడంలోనూ, తన సరుకులు నిలువ చేసుకొనడానికి గిడ్డంగులు స్థాపించుకొనే ప్రయత్నాలలోనూ కంపెనీ తన కార్యకలాపాలను ప్రారంభించింది కోటలు నిర్మించుకొంది. 1689లోనే ఇండియాలో రాజ్యాన్ని స్థాపించుకొని ఈ భూభాగాల నుండి వచ్చే ఆదాయాన్ని తమ లాభాలకు ఒక

1. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం – పుట 30
2. అదే పుస్తకంలో – పుట 26

మూలాధారం చేసుకొనే కోరిక కంపెనీవారికి ఉన్నప్పటికీ 1744 దాకా బొంబాయి, మద్రాసు, కలకత్తా చుట్టుప్రక్కల ఏవోఅప్రధానాలైన కొద్దిపాటి ప్రదేశాలు తప్ప మరి వేటినీ సంపాదించలేదు. అయితే క్లైవ్ సాధించిన విజయాల ఫలితంగా బెంగాలు, బీహారు, ఒరిస్సాలో తరువాత క్రమం లక్షా అరవైయేడు వేల చదరపు మైళ్ళ విస్తీర్ణంగల భూభాగాన్ని ఆక్రమించుకొంది. స్వదేశ సంస్థానాలన్నింటి చుట్టూ కంపెనీవారి అధీనంలో ఉన్న ప్రాంతాలే విస్తరించి ఉంటూ బ్రిటిష్ సార్వభౌమత్వం రూపాన్ని సంతరించుకొంటోంది.

ఈ విధంగా భారతదేశపు నైసర్గికమైన సరిహద్దులకు తుట్టతుదకు చేరుకొనేవరకూ కంపెనీ పేరుమీదుగానే బ్రిటిష్ ప్రభుత్వం రెండు శతాబ్దులుగా సంఘర్షణలు సాగించింది. బూటక ప్రశాంతి వచనాలు అందరికంటే మించి గొంతు చించుకొని అరవడానికి నిశ్చయించుకొన్న వారితో సహా ఇంగ్లండులోని అన్ని పక్షాలూ ఒకే ఒక్క బృహద్భారత సామ్రాజ్యం యొక్క సరిహద్దులు స్పష్టరూపం సంతరించుకొనేవరకూ ఆ పరిణామం జరుగుతున్నంతకాలం ఈ చర్యను చూసీ చూడనట్టుండి నోరు మెదపకుండా ఎందుకు ఊరుకొందో మనకు ఇప్పుడు అర్థం అవుతోందని కారల్ మార్క్స్ చెప్పాడు.[3] ఆయన ఇంకా ఇలా విశదపరిచారు.

''ఇండియా నుండి ఇంగ్లండుకు రవాణా చేయబడిన ధనరాసులన్నీ, సాపేక్షంగా అత్యంత స్వల్పమయిన వాణిజ్యా వ్యాపారంలో సంపాదితమైనవి కాకుండా సరాసరి ఆ దేశాన్ని ప్రత్యక్షంగా దోపిడీ చేయడం వల్ల సంపాదితమై, ఆ దేశంలో బలాత్కారంగా గుంజి పోగు చేసుకొని, ఇంగ్లండు తరలించి వేయబడినట్టి అపారములైన నిధులే. 1813లో ఎట్టి నిర్బంధాలు లేకుండా వర్తకం ఆరంభమవడంతో, ఇండియా వర్తక వ్యాపారం అతి స్వల్పకాలంలో మూడింతలకు పైగా పెరిగింది. ఇంతేకాదు, వర్తకం యొక్క స్వభావమే పూర్తిగా మారిపోయింది. 1813 వరకూ ప్రధానంగా ఎగుమతి చేసే దేశంగా వుండినట్టి ఇండియా ఇప్పుడు దిగుమతి చేసుకొనే దేశమయిపోయింది. ఇది కూడా ఎంతో త్వరితగతిన జరిగిందంటే, అంతవరకూ రూపాయికి 2 షిల్లింగుల 6 పెన్నీలుండిన మారకపు రేటు, 1823 నాటికే 2 షిల్లింగులకు పడిపోయింది. అనాది నుండీ ప్రపంచానికంతటికీ నూలు వస్త్రాలను తయారుచేసి పెట్టే బృహత్తర కర్మాగారమైన ఇండియా, ఆనాటికే ఇంగ్లీషు నూలు కట్టలు, నూలువస్త్రాల ప్రళయప్రవాహంలో మునిగిపోయింది''.

''ఇండియాను తమ సొంత ఎస్టేట్లుగా మార్చివేసినట్టి డబ్బుసంచుల వర్గం యొక్క ప్రయోజనాలూ, ఆ దేశాన్ని తమ సేనలతో జయించినట్టి అల్పజన పరిపాలకవర్గం యొక్క ప్రయోజనాలూ, ఆ దేశాన్ని తమ జౌళి సరకులతో ముంచివేసిన మిల్లు యజమాని వర్గం యొక్క ప్రయోజనాలూ ఆనాటి వరకూ చెట్టాపట్టాలు వేసుకొనే పురోగమించాయి. కాని ఇండియన్ మార్కెట్టుపైనే పరిశ్రమాధిపతి వర్గ ప్రయోజనాలు అధికం కాజొచ్చిన కొద్దీ, ఆ

3. భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం - పుట 29

దేశంలో వున్న దేశీయ పరిశ్రమను నాశనం గావించిన తరువాత, ఇక ఆ దేశంలో ఉత్పాదక శక్తులను సరికొత్తగా సృష్టింపజేసే ఆవశ్యకతను పరిశ్రమాధిపతి వర్గం మరింతగా గుర్తింప నారంభించింది. ఒక దేశాన్ని మీరు మీ ఫ్యాక్టరీ సరుకులతో ఎల్లకాలం ముంచి వేస్తూనే ఉండాలంటే మీ సరుకులకు ప్రతిఫలంగా, ఆ దేశం ఏదో ఒక దినుసును మీకు పంపించగలిగే సామర్థ్యాన్ని దానికి మీరు కలుగుజేస్తేనే గాని వీలుండదు.''

''ఇటు పరిశ్రమాధిపతివర్గానికీ, అటు డబ్బు సంచుల వర్గానికీ జరిగిన సంఘర్షణలో ఇండియా యుద్ధభూమిగా పరిణమించింది. ఇంగ్లండులో తమ అత్యధిక ప్రాబల్యాన్ని తెలుసుకొన్న పరిశ్రమాధిపతి వర్గం తమకు వ్యతిరేకంగా వున్న ఈ శక్తుల విధ్వంసాన్నీ, పురాతనకాలం నుంచీ వస్తున్న భారతీయ పరిపాలనా యంత్రాంగ వ్యవస్థ యావత్తు నాశనాన్ని ఇండియా కంపెనీయొక్క అంతిమ అస్తమయాన్ని ఇప్పుడు కోరుకొంటుంది.''

18వ శతాబ్దం మొత్తంమీద సర్వదశలలో ఈస్ట్ ఇండియా కంపెనీ విషయాలలో పార్లమెంటు జోక్యం కలిగించుకోవలసిందిగా ఒక కోరిక వెల్లడయింది. అయితే ఇది వాణిజ్యవర్గాల నుండి గాక పారిశ్రామిక వర్గాల నుండి బయలుదేరింది. పార్లమెంటు ఒక చట్టం ప్రకారం ఇండియా, పర్షియా, చైనాల నుండి ఎగుమతి కాబడిన చేనేత వస్త్రాలుగాని, అద్దకం చేసిన లేదా రంగు వేసిన నూలు వస్త్రాలనుగాని ధరించడం నిషేధించింది. వాటిని తమ దగ్గర ఉంచుకొన్న వారికీ, అమ్మేవారికీ 200 పౌన్ల జరిమానా విధించేవారు.

''భారతదేశపు చేమగ్గాన్ని నాశనం చేసినదీ, వడకు రాట్నాన్ని ధ్వంసం చేసినదీ దేశంలో చొరబడిన బ్రిటిష్ వాడే తప్ప మరెవ్వడూ కాదు. యూరోపియన్ మార్కెట్ల నుండి హిందూదేశపు నూలు బట్టలను తరిమివేయడంతో ఇంగ్లండు తన విధ్వంసన కార్యం ప్రారంభించింది. ఇదైన తరువాత హిందూస్థానానికి నూలు ఎగుమతి ప్రారంభించి, చివరకు పత్తికి పుట్టిల్లయిన దేశాన్నే నూలువస్త్రాలతో ముంచేసింది. 1818 నుండి 1836 వరకు ఇండియాకు గ్రేట్ బ్రిటన్ ఎగుమతి చేసిన నూలు సరుకులు 1:5:200 నిష్పత్తిలో పెరిగిపోయాయి. ఇండియాకు బ్రిటన్ సన్ననూలు వస్త్రాల ఎగుమతి 1824లో 10 లక్షల గజాలుండగా, 1837లో 6 కోట్ల 40 లక్షలకు మించింది. కాని అదే సమయంలో ఢక్కాపట్నపు జనసంఖ్య 1,50,000 నుండి 20,000 వరకూ తగ్గిపోయింది. వస్త్రాల ఉత్పత్తికి ప్రసిద్ధికెక్కిన ఇండియా దేశపు పట్టణాలు ఈవిధంగా క్షీణించిపోవడం ఒక్కటే దుష్ఫలితమై యుంటే ఒక విధంగా వుండేది. కావి అంతకంటే ఘోరమైనదేమంటే వ్యవసాయానికి, వస్తూత్పత్తి పరిశ్రమకీ ఉండే ఐక్యతను బ్రిటిష్ ఆవిరి యంత్రమూ, బ్రిటిష్ విజ్ఞానశాస్త్రమూ హిందూస్థానం యావత్తు భూభాగంపై నుండీ కూలంకషంగా పెకలించివేశాయి.''

ఈస్ట్ ఇండియా కంపెనీ సుదీర్ఘ చరిత్రలో, పార్లమెంటు జోక్యంవల్ల ఎటువంటి మార్పులు వచ్చాయో మార్క్స్ చాలా స్పష్టంగా విశదపర్చాడు. 1858లో న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యూన్ పత్రికకు 'ఇండియా చట్టం'పైన ఒక వ్యాసం రాస్తూ అందులో ఇలా చెప్పాడు.

''1784వ చట్టం ప్రకారం, ఆచరణలో కంపెనీకుండిన పరిపాలనాధికారం, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ద్వారా మంత్రి మండలి పర్యవేక్షణ కిందికి వచ్చింది. చైనా వర్తకంలో కంపెనీకున్న గుత్తాధిపత్యం ఒక్కటే తప్ప, కంపెనీకుండిన ఇతర వాణిజ్యా గుత్తాధిపత్యమంతా 1813 శాసనంతో అంతరించిపోయింది. కంపెనీకుండిన వాణిజ్యపు స్వభావమంతా 1834 శాసనం సంపూర్ణంగా రద్దు చేసింది. ఇకపోతే ఇండియా పరిపాలనాధికారం ఒక్కటే తప్ప కడమ అన్ని అధికారాలను 1854 శాసనం తుడిచిపెట్టేసింది. చరిత్ర పరిభ్రమణంలో 1612లో వాటాదార్ల కంపెనీగా మారిన ఈస్ట్ ఇండియా కంపెనీ మళ్ళీ తన తొల్లిటి స్వరూపమే ధరించుతూంది. ఎటు దిరిగి, వర్తకం చేయని భాగస్వాముల వర్తక కంపెనీగానూ, స్థిరంగా నిర్ణయించబడిన డివిడెండ్లు మాత్రమే అనుభవించే హక్కును కలిగినట్టి డబ్బా దసకం లేని వాటాదార్ల కంపెనీగానూ ఈనాడు రూపొందింది.''

1857లో ''ఇండియా సమస్యపై వ్యాసం రాస్తూ కారల్ మార్క్స్ అప్పటి టోరీ నాయకుడు డిజ్రేలి ఉపన్యాస భాగాలను 'న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యూన్'లో ఉదాహరించాడు. అవి ఇలా ఉన్నాయి.

''విభజించి పాలించు'' అనే పురాతన సూత్ర ప్రాతిపదికపైనే గత పదేళ్ళవరకూ ఇండియాలో బ్రిటిష్ సామ్రాజ్యం స్థాపింపబడిందనీ - అయితే ఇండియాలో వున్న వివిధ జాతీయతల పట్ల గౌరవాన్ని చూపడం ద్వారానే, వారి మతాలతో ఏవిధంగానూ జోక్యం కలుగజేసుకోకుండా ఉండేటట్టు జాగ్రత్త వహించడం వల్లనే భూవసతిని కలిగినవారి ఆస్తిని పరిరక్షించడం వల్లనే ఈ సూత్రం అమలు జరపడం జరిగిందనీ ఈయన ఉద్ఘాటించాడు. దేశంలో వున్న అల్లరి చిల్లర జనానికి ఉపాధి కల్పించి, తనలోకి ఆకర్షించే రక్షక కవాటంగా సిపాయి సేవ ఉపయోగపడింది. అయితే ఇటీవల సంవత్సరాలలో, జాతీయతను నాశనం చేసే సూత్రం ఒకటి ఇండియా పరిపాలనలో అవలంబించడం జరుగుతూ వచ్చింది. బలప్రయోగం చేసి దేశీయ సంస్థానాధీశులను సర్వనాశనం చేయడమూ, ఆస్తుల అనుభవానికి అవరోధాలు కల్గించడము ప్రజల మతంలో జోక్యం కలుగజేసుకోవడమూ - ఇట్టి రూపాలలో ఈ సూత్రం అమలు పరచడం జరిగింది. 1848లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఆర్థికస్థితి ఎంతగా చెడిపోయిందంటే, ఏదో ఒక విధంగా కంపెనీ ఆదాయాన్ని పెంచుతేనేగాని గత్యంతరం లేకపోయింది. అప్పుడు కౌన్సిల్ ప్రకటించిన ఒక తీర్మానంలో ఆదాయం పెంచడానికి దేశీయ సంస్థానాధీశులకు నష్టం సంభవించే విధంగా బ్రిటిష్ భూ భాగాలను విస్తరింపచేయడం ఒక్కటే పద్ధతి అనే సూత్రం ఇంచుమించు ఎట్టి దాపరికమూ లేకుండానే నిర్వచించబడింది. తరువాత సతారా రాజు చనిపోవడం సంభవించగా, ఈ సూత్రం అనుసరించి ఈస్ట్ ఇండియా కంపెనీవారు అతని పెంపకపు కొడుకుని వారసునిగా గుర్తింప నిరాకరించి, ఆ సంస్థానాన్ని తమ రాజ్యంలో కలిపేసుకున్నారు. ఆ క్షణం నుండి, ఏ దేశీయ సంస్థానాధీశుడైనా సరే నిస్సంతుగా చనిపోయాడనే సరికి ఈ బలాత్కార ఆక్రమణ పద్ధతి వినియోగించబడుతుండేది. హిందూదేశ సమాజానికి మూలస్తంభమైనట్టి దత్తత సూత్రాన్నే ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో రద్దు చేయసాగింది.

ఈ విధంగా 1848-1854 మధ్యకాలంలో ఒక డజనుకు పైగా స్వతంత్ర సంస్థానాధీశుల రాజ్యాలు బ్రిటిష్ సామ్రాజ్యంలోకి బలాత్కారంగా కలిపేసుకోవడం జరిగింది. 80,000 చదరపుమైళ్ళ విస్తీర్ణం కలిగి, 40 లక్షల నుండి 50 లక్షల వరకూ జనసంఖ్య, బ్రహ్మాండమైన ఐశ్వర్యమూ కలిగిన బేరార్ రాజ్యాన్ని 1854లో బలప్రయోగం చేసి కాజేశారు. హిందువులే కాకుండా మహమ్మదీయులు కూడా ఈస్ట్ ఇండియా కంపెనీతో తలపడడానికి దారి తీసినట్టి అయోధ్య ఆక్రమణను పేర్కొంటూ, ఈ ఆక్రమణల జాబితాను పూర్తిచేశాడు మిస్టర్ డిజ్రేలీ. గత పదేళ్ళుగా ప్రభుత్వంచే అవలంబింపబడిన నూతన విధానం ఇండియాలో వున్న ఆస్తి అనుభవ పద్ధతిని ఎలాగైతే గందరగోళపరచిందో మిస్టర్ డిజ్రేలీ వివరించాడు.

ఇండియాలో భూమి అనుభవం హక్కుల పైన మార్క్సు చాలా కూలంకషమైన అధ్యయనం చేశాడు. భారతీయ సైనికుల తిరుగుబాటుకు నేపథ్యంగా భూమి సమస్యపై విశ్లేషణాత్మకమైన వివరణ ఇచ్చాడు.

''పురాతన హిందూ సాంఘిక సంస్థల ప్రకారం భూస్వామ్యపు హక్కు గ్రామ సంఘాలకే ఉండేదని, ఏయే వ్యక్తులు ఎంతెంత భూమి సాగు చెయ్యాలో నిర్ణయించి భూమిని వ్యక్తులకు పంపిణీ చేసే హక్కు వీటికే ఉండేదనీ, జమీందార్లూ, తాలూక్దార్లూ కేవలం ప్రభుత్వోద్యోగులేననీ, గ్రామంలోని భూముల సాగుబడిని అజమాయిషీ చేసి, గ్రామం నుండి రాజుకు రావలసిన శిస్తు వసూలుచేసి రాజుకు చెల్లించే విధులు మాత్రమే వీరు నిర్వహించుతుండేవారనీ ఇప్పుడు తెలుస్తూంది.''

''హిందూ దేశంలో ఇంగ్లీషు వారు నేరుగా పరిపాలన సాగించుతున్న రాష్ట్రాలలో ఇటీవలి సంవత్సరాలలో భూమి అనుభవ విధానమూ, భూమిశిస్తు ఆదాయ విధానము అవలంబించడంలో ఈ అభిప్రాయం యొక్క ప్రభావమే చాలావరకూ ప్రస్ఫుటమైంది. భూమిపై సర్వహక్కులూ ఇతరుల కెవ్వరికీ లేకుండా తమకే, తమకొక్కరికే ఉన్నాయని జమీందార్లూ, తాలూక్దార్లూ చేసిన వాదనకు ప్రభుత్వమూ, రైతులూ, ఇద్దరికీ వుండిన హక్కులను సహితమూ వీరు హస్తగతం చేసుకోవడమే మూలాధారమని ఇప్పుడొక అభిప్రాయం ఏర్పడింది. ఈ అభిప్రాయ ఫలితంగా వాస్తవంగా భూమిని సాగు చేసే రైతులకూ దేశం యొక్క సాధారణ పురోభివృద్ధికీ గుదిబండగా తయారైన వీరిని వదలించుకోవడానికి సర్వప్రయత్నలూ జరిగాయి. ఈ మధ్యవర్తుల హక్కులకు గల మూలాధారాలు ఏవైనప్పటికీ, ఇవి చిరకాల భుక్తంవల్ల ఏర్పడిన హక్కులని వారు చెబుతున్న కారణంగా, ప్రజల పట్ల ఈ హక్కులు ఎంత బాధాకరంగానూ, నిరంకుశంగానూ, హింసాత్మకంగానూ ఉన్నప్పటికీ కూడా వీటిని సాంతమూ కొట్టి పారేయడానికి న్యాయశాస్త్రం ఒప్పుకోదు. కాబట్టి వీటిని కొంతవరకైనా గుర్తించక తప్పింది కాదు. అయోధ్యలో బలహీనులైన దేశీయ రాజుల పరిపాలన ఫలితంగా, ఈ ఫ్యూడల్ భూస్వాములు ప్రభుత్వానికి చెందాల్సిన స్వామ్యాలకు రైతులకుండిన హక్కులకూ ఎసరుపెట్టి, వాటిని తమ గుప్పిట్లో లంకించుకున్నారు. పోతే దరిమిలా ఆ రాజ్యాన్ని కలిపేసుకోవడం జరిగిన తదుపరి, ఈ విషయం పరిశీలనకొచ్చినప్పుడు భూమి శిస్తు

ఫైసలాను నిర్ణయించే వ్యవహారానికై నియమించబడిన కమీషనర్లకీ, యథార్థంగా తమకున్న హక్కుల పరిమితులను గురించి జమీందార్లూ, తాలూకాద్దార్లకీ నిర్దాక్షిణ్యమైన వాగ్యుద్ధం చెలరేగింది. దీని ఫలితంగా వీరిలో తీవ్రమైన అసంతృప్తి ప్రబలి, తిరుగుబాటు చేసిన సిపాయిలతో వీరు చేతులు కలిపి ఏకమవడానికి కారణమైంది.''

భారతదేశంలో జాతీయ విముక్తి పోరాటం ప్రారంభమైన కాలంలో 1858లో బ్రిటిష్ ప్రధానమంత్రిగా ఉన్న డార్బీ అవలంబించిన దృక్పథం గురించి మార్క్స్ ఇలా రాశాడు.

''వేళ్ళు పాదుకొన్న హక్కులను అనుభవించుతున్న వర్గం యొక్క ప్రయోజనాలే పవిత్రమైనవిగా ఎంచి, భూస్వామ్య ప్రభువర్గ ప్రయోజనాలను నిలబెట్టడం యొక్క ప్రాముఖ్యతను సమర్థించే టోరీ, లేక కన్సర్వేటివ్ పార్టీ సామాన్య సూత్రాలతో సరిగ్గా అనుగుణంగానే ఉంటుంది. తమ స్వదేశంలోని భూస్వామ్య ప్రయోజనాలను పేర్కొనేటప్పుడల్లా భూస్వాములను గురించీ, శిస్తులను అనుభవించేవారి గురించే వారు చెబుతారుగాని, శిస్తులు చెల్లించేవారి గురించికాని, భూమిని వాస్తవంగా సాగుచేసే రైతులను గురించికాని వారు ఎత్తుకొనే ఎత్తుకోరు. ఇందుచేత జమీందార్ల, తాలూకాద్దార్ల సంఖ్యా వాస్తవంగా ఎంత స్వల్పంగా ఉన్నప్పటికీ వీరి ప్రయోజనాలనే అత్యధిక సంఖ్యాకులైన ప్రజలయొక్క ప్రయోజనాలతో డార్బీ మంత్రివర్గం సమానం చెయ్యడంలో ఏమీ ఆశ్చర్యం లేదు.''

భారతదేశంలో ఫ్యూడల్ వర్గాలు మాత్రమేకాక యూరోపియన్ విజ్ఞాన శాస్త్రీయ భావాలను అవగాహన చేసుకొన్నట్టి ఒక నూతన వర్గం ప్రాదుర్భవించడం మార్క్స్ గమనించాడు. భారతదేశంలోని జాతీయ విముక్తి తిరుగుబాటును అణచివేయడంలో పాల్గొన్న ఆఫీసర్లు అంగీకరించిన సత్యాలను మార్క్స్ ఇలా చెప్పాడు.


''ఇండియా ప్రజానీకంలో అశేష జనానికి గొప్ప పారిశ్రామికశీలమైన శక్తి వుంది. పెట్టుబడిని సంచయం చేసుకోవడానికి తగిన సామర్థ్యం వుంది. గణిత శాస్త్రాలను గ్రహించగలిగే స్ఫుటమైన మేధాశక్తి వుంది. లెక్కలు కట్టడానికీ, భౌతిక శాస్త్రాలు ఆకళింపు చేసుకోవడానికీ, చక్కని ప్రజ్ఞ వుంది. వారి బుద్ధి కుశలతలు అత్యంత శ్రేష్ఠమైనవి.''

ఇండియాలో బ్రిటిష్ పాలన భావి ఫలితాలను 1853లోనే అంచనా వేస్తూ మార్క్స్ యిలా చెప్పాడు.

''తమ ఉత్పత్తులకు అవసరమయ్యే పత్తి మొదలైన ముడి సరుకులను అంతకంతకు మరింత చౌకగా గుంజుకోగలగడమనే ఏకైక లక్ష్యంతోనే ఇండియాకు రైల్వేలను సమకూర్చే అభిప్రాయం ఇంగ్లీషు మిల్లు అధిపతి వర్గానికి ఉందని నాకు తెలుసు. కాని, ఒక దేశంలో వున్న రవాణా వ్యవస్థలో ఒకసారి యంత్రాలు గనుక మీరు ప్రవేశపెట్టారంటే, ఆ దేశంలో ముడి ఇనుమూ, రాక్షసి బొగ్గూ ఉన్న పక్షంలో యంత్రోత్పత్తి చేయకుండా ఆ దేశాన్ని ఆపడం ఇక మీతరం కాదు. రైల్వే రవాణా యొక్క తక్షణ వర్తమాన అవసరాలను తీర్చగలిగే పారిశ్రామిక విధానాలను ఆ దేశంలో ప్రవేశపెట్టనిదే, ఒక బ్రహ్మాండమైన దేశంలో విస్తృతమైన రైల్వే మార్గాల అల్లికను మీరు కొనసాగించి దానిని సరైన పద్ధతిలో



కారల్ మార్క్సు సమాధి



కారల్ మార్క్స్ గ్రంథాలయం

ఉంచలేరు. అంతేకాదు రవాణా వ్యవస్థలో యంత్ర వినియోగాన్ని ప్రవేశపెట్టడం, రైల్వేలతో తక్షణం సంబంధం లేనట్టి ఇతర పారిశ్రామిక రంగాలలో కూడా యంత్ర వినియోగానికి తప్పక దారి తీసి తీరుతుంది. అందుచేత ఇండియాలో ఆధునిక పరిశ్రమకు రైల్వే విధానం నిజమైన అంకురార్పణే అవుతుంది. నూతన శ్రమకు అలవాటుపడగలిగే ప్రత్యేక బుద్ధి కుశలతను అలవర్చుకొనేట్టూ, అందుకు అవసరమైన యంత్రశాస్త్ర పరిజ్ఞానాన్ని నేర్చుకొనేటట్లూ హిందూ దేశస్థులకు బ్రిటిష్ వారి వల్లనే అవకాశాలు లభించుతాయి. కాబట్టి ఇది జరగడం తథ్యం. కలకత్తా టంకశాలలో కొన్ని సంవత్సరాలుగా ఆవిరి యంత్రాలను పని చేయించుతున్నట్టి దేశీయ ఇంజనీర్లూ, హరిద్వార్ రాక్షసి బొగ్గు జిల్లాలో ఉన్న అనేక ఆవిరి యంత్రాలు పనిచేయడంలో నియమితులైనట్టి దేశీయ కార్మికులూ, ఇంకా ఇతర దృష్టాంతాలూ ప్రదర్శించుతున్నట్టి శక్తి సామర్థ్యాలూ నైపుణ్యా కుశలతలూ ఇందుకు ప్రబల నిదర్శనాలు.''

''గ్రేట్ బ్రిటన్‌లో నేడున్న పాలక వర్గాల స్థానాన్ని పారిశ్రామిక కార్మిక వర్గం ఆక్రమించుకొనే సమయం వస్తేనే తప్ప లేదా తమపై ఇంగ్లీషువారు విధించిన దాస్య శృంఖలాలను భారతీయులు తమంతట తామే తుత్తునియలుగా తెంచివేసే శక్తి అభివృద్ధి చేసుకోగలిగే సమయం వస్తేనే తప్ప తమ మధ్య అక్కడక్కడ చెదురుమదురుగా బ్రిటిష్ బూర్జువా వర్గం వెదజల్లిన నూతన సాంఘిక బీజం ఫలితాలను భారతీయులు అంతవరకూ అనుభవించలేకపోతారు...'' మహత్తరమైనట్టి, ఆసక్తిదాయకమైనట్టి ఆ దేశం యొక్క పునరుద్ధరణ అద్యతన భావిలో కాకపోతే సుదూర భవిష్యత్తులోనైనా సరే తప్పక సంభవించి తీరుతుందనే మనం నిస్సందేహంగా ఆశించవచ్చు'' అని కారల్ మార్క్స్ 1853లోనే విశదపరిచాడు.

ఈ మాటలను ఆయన వ్రాసిన తరువాత నూరేళ్ళలోగా భారతదేశంలో గొప్ప మార్పులు వచ్చాయి.

కారల్ మార్క్స్ క్రాంత దర్శనం శాస్త్రీయమైనది.

మొదటి తెలుగు పత్రికలు

కుంఫిణీ యుగంలోని తెలుగు సాహిత్య రంగం అన్ని దిశలలో విస్తరించింది. కొత్త పరిమాణాలూ, కొత్త పరిణామాలు సంతరించుకొంది. భావ చైతన్యంలో నూతన ప్రకియలను చేపట్టింది. ముద్రాక్షరశాలలు, పుస్తక ప్రచురణలు, సమాచార పత్రికలు వెలువడసాగాయి.

తెలుగులో ఓం ప్రథమం వెలువడ్డ మొదటి పత్రిక ఏదీ? దానిని ఎవరు స్థాపించారు? ఎవరు సంపాదకులు? ఎలా నడిపించారు? ఎన్నాళ్ళకోసారి వచ్చేది? ఏయే విషయాలు ప్రచురించేవారు? మొదలైన ప్రశ్నలకు ఇప్పటిదాకా తెలుగులో సమాధానాలు దొరకవు. కుంఫిణీ కాలంలో ఆంధ్రదేశ రాజకీయ చరిత్రని ఎవరూ సమగ్రంగా రాయలేదు. సాంఘిక చరిత్రనూ, దానిలో భాగమైన పత్రికల చరిత్రనూ రచించడానికి ఎవరూ ఇటీవలి కాలం దాకా గట్టిగా పూనుకోలేదు.

తెలుగులో మొదటి పత్రికలను స్థాపించిన పూజనీయుల పేర్లను తెలుసుకొని వాళ్ళను సంస్మరించడం మన విధి. వాళ్ళు పత్రికలను ఎలా నడిపారో తెలుసుకొని ఆ మహదాశయాలను విస్మరించకుండా వుండడం మన ధర్మం. ఇల్లలికి ముగ్గు పెట్టినవాళ్ళకు పండుగ చేసి ఆనందించడం మన కర్తవ్యం. మొదటి తెలుగు పత్రికను ఉమ్మడిగా సంస్థాపించదలచిన వ్యక్తులు నలుగురు ఉన్నారు. వాళ్ళు నలుగురూ చెన్నపట్నం వాస్తవ్యులు. సంస్కారంగల వాళ్ళు. వాళ్ళు పేర్లు:

1. కాన్‌స్టాంటైన్ శాంపి
2. ఎ. వట్టరసర్
3. టి. విశాఖ పెరుమాళయ్యా
4. టి. శరవణ పెరుమాళయ్యా

ఈ నేటివు పెద్ద మనుషులు నలుగురూ కలసి "మద్రాసు క్రానికల్" అనే పేరిట తెలుగు తమిళ భాషలలో ఒక పత్రిక నడపదలిచారు. ఈ నలుగురు మనుషులు చెన్నపట్టణమందు మిక్కిలి ప్రముఖులుగానున్న ధనవంతులనే పేరు గలవాళ్ళు. వీళ్ళలో కాన్‌స్టాంటిన్ శాంపిగారికి స్వంత అచ్చుకూటం ఉంది. దాని పేరు కమర్షియల్ ప్రెస్. దీనిలో 1819 నుంచి పుస్తక ప్రచురణ సాగుతోంది (విలియం బ్రౌనుగారి వ్యాకరణాన్ని ఇక్కడే అచ్చువేశారు).

పై నలుగురు "చెన్నపట్టణం పెద్ద మనుషులు" 1832లో మద్రాసు గవర్నరుగారికి ఒక మహాజరు పెట్టుకున్నారు. సెంటు జార్జికోట దొరతనం కింద చెల్లుతున్న ప్రెసిడెన్సీలో ఎన్నో ఇంగ్లీషు పత్రికలున్నా మిగతా ప్రాంతీయ భాషలలో, అనగా తమిళ, తెలుగు భాషలలో పత్రికలు లేవని విన్నవించుకొన్నారు. ఇంగ్లీషు పత్రికలు ఏ ఉదార ఆశయాలతో సాగుతూ ఉన్నాయో అవే సూత్రాలపై తమ పత్రికను నడపదలిచారు. భారతదేశంలోని యీ ప్రాంతాలలోని ఇటువంటి ప్రయత్నం జరగడం ఇదే తొలిసారి

కనుక ప్రెసిడెన్సీలోని నేటివులు తమ తమ మాతృభాషలలో తమ అభిప్రాయాలను, ఆలోచనా తాత్పర్యాలను ప్రకటించుకోవడానికి అనువుగా ఉంటుందని గవర్నరుగారికి ఈ నలుగురూ మనవి చేసుకొన్నారు.[1]

ఈ పత్రికను వారానికి రెండుసార్లు ప్రకటించదలిచారు. బుధవారంనాడు తెలుగు భాషలోనూ, శనివారంనాడు తమిళ భాషలోనూ వెలువడుతుందని తెలియచేశారు. ఇంగ్లీషు డెమ్మీ సైజులో పేజీకి మూడు కాలముల చొప్పున పత్రికలో వ్యాపారాలకు, రాజకీయాలకు, సాహిత్య విషయాలకు సంబంధించిన సంగతులను ప్రచురించదలిచారు. సివిలు, మిలటరీ ఉద్యోగుల విషయాలను ''పయింట్ల''ను ప్రకటించుతారు. దేశీయ విదేశీయ ఆంగ్లేయ విఫణి వీధుల పరిస్థితులను కూడా తెలియచేయదలిచారు. పత్రికలో స్వేచ్ఛాయుతంగా, ధారాళంగా అన్ని విషయాలూ అందరూ చర్చించవచ్చునని పత్రికాధిపతులు నలుగురూ తమ విజ్ఞాపన పత్రంలో గవర్నరుగారికి విన్నవించుకొన్నారు. ఇంతటి ఉదాత్తమైన ఆశయాలతో నడుపదలచుకొన్న ''మద్రాసు క్రానికల్''కు 1832లో ప్రభుత్వం నుండి అనుమతి లభించిందో లేదో తెలియదు. 1833లో తెలుగు, తమిళ భాషలలో ఒక పత్రిక మద్రాసు నుంచి వెలువడేదని రివరెండు జె. లాంగు దొరగారు ఒక నివేదికలో బెంగాలు ప్రభుత్వానికి ఉత్తరోత్తరా 1859లో తెలియజేశారు.[2] బహుశా ఇది ''మద్రాసు క్రానికల్'' కావచ్చు. ఈ పత్రిక తెలుగు, తమిళ సంచికలు ఎన్ని వెలువడ్డాయో ఏ నెలనుంచి వెలువడ్డాయో తెలియదు. 1832 నుంచి 1837 దాకా తెలుగు పత్రికల గురించి ఏవిధమైన అదనపు సమాచారం ఇప్పటిదాకా బయటపడలేదు.

1838లో ''వృత్తాంతిని'' అనే తెలుగు పత్రికను కొందరో, ఒక్కరో ప్రారంభించారు. ప్రొప్రయిటర్ల పేర్లుగాని, ఏజెంటు పేరు గాని తెలియదు కాని ఈ పత్రికకు మండిగల వెంకట్రాయశాస్త్రి అనే విద్వాంసుడు సంపాదకుడు. ''వృత్తాంతిని'' సంచికలు ఏమీ లభించకపోయినా, దీని తర్వాత వచ్చిన ''వర్తమాన తరంగిణి'' అనే పత్రికలోని విభిన్న సంచికలలో దీని ప్రసక్తిని, ప్రశస్తిని తరచు సంపాదకులు, పాఠకులు పొందుపరిచేవారు. వృత్తాంతినిలో ఏవైనా ముఖ్యమైన సమాచారంగాని ప్రచురితమయితే దానిని ప్రభుత్వం దృష్టిలోనికి ''తెలుగు ట్రాన్సులేటరు'' తీసుకురావాలనే ఆదేశాన్ని కుంఫిణీవారు జారీ చేశారు. ఆ పత్రికను సదరు కచ్చేరీకి సప్లయి చేయడానికి ఏర్పాట్లు చేశారు.

1838లో మద్రాసులోని పత్రికల కోవలో వృత్తాంతిని చేరినా ఇది ఎక్కడ నుండి ప్రచురితమయ్యేదో చిరునామా అసైలమ్ ఆల్మనాక్ (1839) సంచికలో కనపడదు. ఈ పత్రికకు చందాదారులు వివిధ ప్రాంతాలలో ఉండేవారని భావించవచ్చు. 1838 జూలై నుంచి రాజమండ్రి జిల్లా జడ్జిగా ప్రభుత్వం చేసిన జేమ్స్ థామస్ అనే సివిలు సర్వెంటు తన

1. Public consultations 2. November 1832 Quoted by C.J. Nirmal "The Press in Madras under the East India Company-Journal of Indian History Vol.XLIV Part-II August 1966, p.495.
2. K. Natarajan, History of Indian Journalism Part-II, The Report of the Press Commission New Delhi-1954, P.64.

కచ్చేరీలోని నేటివులను సంతోషపెట్టడానికి మద్రాసు నుండి వెలువడుతున్న "వృత్తాంతిని" పత్రికను తెప్పిస్తూ ఉండేవాడు. ఈ పత్రిక గురించి అతని భార్య జూలియా సీమలో ఉన్న తన బంధువులకు లేఖల ద్వారా అప్పుడప్పుడు తెలియజేస్తూ ఉండేది. ఈ పత్రిక "చాలా ముచ్చటగా, తమాషాగా, చమత్కారంగా ఉండేదని "ఇటీజ్ వెరి క్వయంట్" అన్న ఒక్క వాక్యంలో తెలియచేసింది. ఇంగ్లీషు పత్రికల నుంచి అనువాదాలూ చాలా అల్పమైన నిష్ప్రయోజనమైన విషయాల గురించి ఎంచి ప్రచురించేవారని ఆమె అభిప్రాయపడింది. ఉదాహరణకు సీమరాణిగారి పడక మంచం గురించి రాస్తూ ఆమె ఎప్పుడూ కటిక నేలమీద ఏమీ కప్పుకోకుండా నిదురించేదని రాశారట. కిందటి సంచికలో మద్రాసు గవర్నరుగారు ఇచ్చిన విందు గురించి సమాచారం ఇచ్చారట. దీనికి శానామంది నేటివు పెద్ద మనుషులను సైతం ఆహ్వానించారట.[3]

రాజమండ్రి జడ్జిగారైన థామస్ దొర ఆ ఊళ్ళో ఒక గ్రంథాలయాన్ని పెట్టాడు. అందులో పత్రిక సంచికలు పురజనులకు లభించేవి. 1839 సెప్టెంబరు 8వ తేదీనాడు రాజమండ్రి వాస్తవ్యుడైన బొమ్మరాజు నాగేశ్వరరావు బ్రౌను దొరగారికి ఒక లేఖ రాస్తూ "చెన్నపట్నపు వృత్తాంతిని అనే తెలుగు న్యూసు పేపరులో యీ మధ్య తమ వద్ద వున్న జ్యోతిష్య గ్రంథముల యొక్క వైద్యశాస్త్రములు వగైరాలు వివరం వ్రాయబడి వున్నది" అని తెలియచేస్తూ, వాటిలో తనకు కావలసిన పుస్తకాల ప్రతుల గురించి అర్జీ పెట్టుకొన్నాడు. ఈ ఉత్తరం నకలు బ్రౌను లేఖల సంపుటాలలో ఉంది. (ఎమ్.417–పి.339)

"వృత్తాంతిని" పత్రికకు "బుద్ధిమంతులు" వుత్తరాలు రాస్తూ వచ్చేవారు. వాటిని అందులో ప్రచురించేవారు. కొందరు "లోకరక్షకుడు" మొదలైన పేర్లతో రాసినారు. "వివాహముల గురించిన దుర్వ్యయము" అనే విషయంపై సుదీర్ఘమైన లేఖ ఒకటి 1841 ఫిబ్రవరి 15వ తేదీ సంచికలో అచ్చుపడింది. సంఘ సంస్కారం కోసం ఆనాటి విద్యావంతులు ఎంత తహతహలాడేవారో ఈ లేఖ వల్ల తెలుస్తుంది. "వృత్తాంతిని" సంచికలు దక్కకపోయినా ఈ లేఖ మాత్రం బ్రౌను సంపుటాలలో జాగ్రత్త చేయడంవల్ల ఆనాటి సంపాదక లేఖలు ఎలా ఉంటాయో తెలుసుకొనడానికి ఈ లేఖను పరిశీలించడం అవసరం.

వివాహములను గురించి దుర్వ్యయము

మహారాజశ్రీ వృత్తాంతి యిడీటరుగారి సముఖానకు -

అయ్యా,

ఈ తైనెల పుట్టిన వెనక మనవారిలో పెద్దమనుష్యులుగా వుండేవారి యిండ్లలో పెండ్లిండ్లులో జరిగినవి. వాటిలో రెండుమూడు యిండ్లకు నేను వెళ్లియుంటిని. ముహూర్తము వేళకున్ను పోయినాను. రాత్రులలో కచ్చేరీలకున్ను వెళ్లినాను. ఈ రెండు వేళల్లో ముహూర్తంవేళకు వెళ్లినప్పుడు నా మనస్సుకు బహు సంతోషముగా వుండినది.

3. Julia Thomas - Letters from Madras during the years (1836-1839) by a lady, New Edition, London, 1846 - p.116

ఈ వేళలో పెండ్లికొమారుడున్ను, పెండ్లికుమార్తెయున్ను, పందిలిలో కూర్చుండి వారివారికి తగిన ప్రకారం మంత్రోక్తులచేత దేవ బ్రాంహ్మణుల పూజచేయడమున్ను వారివారికి కలిగిన మట్టుకు దానాలున్ను భూరిదక్షిణలు యివ్వడమున్ను చేతనున్ను, తమ తమ వారిలో వృద్ధులుగానును పెద్దలుగానున్ను వుండేవారిచేతనున్ను ఆశీర్వచనములు జెందడమున్ను, యివి యావత్తున్ను మన శాస్త్ర సమతిగానున్ను, ఆయా కులాచార సమ్మతిగానున్ను వుంటున్నవి గనక మహా చక్కగా యుండినది. అయితే రాత్రులలో కచ్చేరీ యుంచవలెగదా - పందిలి వేసి శృంగారించవలసియున్నదిగదా - అనే ఆలోచన మీద అందుకుగాను పట్టబొయ్యే ఖర్చు యెంతో అంతమాత్రం రూకలను ముహూర్త వేళలో ఖర్చు అయ్యేదానిలో లోపంచేసి యిందుకుగాను విధిలేక మిగిలిస్తున్నారు. కచ్చేరీ పందిలి నాట్యం వీటిని నిలిపితే - యిందుకుగాను వృథా శలవయ్యే మొత్తాన్ని దానధర్మముల కింద అగత్యంగా శలవుచేతురనే దానికి నేను సందేహించలేదు.

పెండ్లిండ్లలో కచ్చేరి వుంచడములో వుండే గుణాగుణాలు యేమని యోచనచేసి చూస్తే అనేకవిధాల దోషమే కనిపిస్తున్నది గాని గుణలేశమున్ను లేదు. మొదలెత్తగా యీ విషయమై వారి వారి పరువుకు తగినమట్టుకు 50 వరహాలు మొదలు 1000 రూపాయీల మట్టుకు శెలవయె రూకలు వృథాగా పోతున్నవి. రెండోది - రాత్రులలో నిండా ప్రొద్దుపొయ్యేవరకు మేలుకుని యుండడముచేత యింటి యజమానుడికిన్ని కచ్చేరికి వచ్చే వారికిన్ని నిద్రాభంగమై శరీరసౌఖ్యం తప్పిపోతున్నది.

మూడోది కచ్చేరికి వచ్చేవార్లలో వ్యవస్థ లేక పిలవబడని వారున్ను, సామాన్యు లయినవారున్ను రావడమువల్ల యింటి యజమానుడు వార్లను యెరుగకపోయినప్పటికిన్ని, తనకు విహితులు కాకపోయినా తన వియ్యంకుల వారికి విహితుడేమో అని భ్రమించి వారికంతా తాజంబేసి మర్యాదలు చేయవలసి సంభవించినది గదా అని మనస్సులో నొచ్చుకొంటాడు.

నాలుగోది, కచ్చేరీకి వచ్చినవార్లలో నూటిలో తొంబై తొంమ్మిది మందికి భరతశాస్త్రములోగాని, సంగీతములోగాని జ్ఞానము లేదు. వీరు కచ్చేరీకి రాగానే గంధం పుష్పం పన్నీరు తాంబూలాలు యిచ్చి కూర్చుండబెట్టితే యితనికి నాట్యములో రుచిలేదు గనక రవంత ప్రొద్దు కూర్చుండియుండగానే నిద్ర వస్తున్నది. యింటికి పోదామా అని తలుస్తాడు. తనకు ముందర వచ్చినవారు యింకా వున్నారు, తాను లేస్తే మర్యాదగా వుండదు, యిటుండగా యింకా కొందరు కచ్చేరికి వెనకవచ్చినవారు వేరే తావు లేకపోతే, తన్ను పృష్టభాగముతో తోసి తనకు ముందరవచ్చి కూర్చుంటారు, వద్దని చెప్పచాలడు. దీనికిన్ని సహించుకొని యాల వచ్చినామని తనలోతాను నొచ్చుకుంటాడు. యిట్లా కొంతసేపు కూర్చుండి యవరైనా వకరు లేస్తే ఆ సమయము చూచి యీమట్టుకు బ్రతికినామని తానును కూడా లేచి వెళ్లిపోతున్నాడు.

అయిదోది, యిందులో యింటివాడికైనా, కచ్చేరికి వచ్చిన వారికైనా యేమైనా సార్థకము కద్దా అని విచారిస్తే యవరికిన్ని యేమిలేదు. 15 సంవత్సరాలకు మునుపు వరకు కచ్చేరికి వచ్చేవారు నాట్యమాడుతూ యుండే దాసీకి రూపాయీలు వేసే మర్యాద కద్దు.

దానివలన యింటివాడికికి కొంచం కూడుదల యుండినది. ఇప్పుడు వక డబ్బు కూడా వేసే మర్యాద లేదు. కచ్చేరీకి వచ్చినవార్లలో యెవడో వకడియందు మోహించినట్టు వాణ్ణి లాగేకొర్కకై నటించే దాసి తన అభినయములచేత వాంణిమాత్రమే రంజింపచేస్తున్నది. కొదవ వారందరున్ను నిష్ప్రయోజకులయి దాని రూపలావణ్యములజూచి భ్రమించి యింటికి వెళ్లినవెనక దాన్ని తలుచుకొని నిద్రపట్టక వ్రిథాగా చెడిపోతున్నారు. నర్తనము చేసే దానికైనా యేదైనా ప్రయోజనముకద్దా అని చూస్తే కచ్చేరికి వచ్చినవారు రూపాయీలు వెయ్యపోయినారు. నాలుగైదు రాత్రులు నిండా కష్టపడి నిద్రమాని తన అభినయముల చేతనున్ను తాను పాడే పదాల చేతనున్ను స్త్రీలకున్ను పురుషులకున్ను వుండే మర్యాదలను తప్పి సభలో నిలుచుండి సౌంజ్ఞలచేతనున్ను యుక్తులచేతనున్ను కొన్ని రహస్యాలనంతా బయిలువేసి లజ్జవిడిచి మానముచెడి యింత కష్టపడ్డవెనక యింటి యజమానుడివద్దకి వెళ్లి దేహీ అడిగితే అతనికి యిష్టం వచ్చిన మట్టుకు యేమి యిచ్చినా తీస్కుపోతున్నారు గనక వీరికిని కష్టానికి తగిన ఫలప్రాప్తిలేదు.

ఆరోది యీ కచ్చేరిని వుంచడంవల్ల సంభవించిన ముఖ్యమయిన కీడు యేమంటే, కచ్చేరీ చేస్తూయుండేటప్పుడు యిదివరకు స్త్రీలముఖం చూడని పిల్లకాయలు కొందరు వచ్చి కూర్చుంటారు. వారు యీవరకున్ను విద్యార్థులై చదువుకొంటున్ను, యీ లోక వ్యాపారాలు యేదిన్ని తెలియనటువంటివారుగానున్ను వుండివున్నారు. యీ కచ్చేరీకి వచ్చిన వెనుక యిక్కడ నర్తనం చేస్తూ యుండే దాసీ కన్యకను చూచిన్ని నటిస్తూ యుండేటప్పుడు దాని నానావిధ వ్యాపారాలనున్ను చూచి అది పాడే శృంగార పదాలనున్ను వినగా యితనికి యీవరకున్ను తెలిసియుండని కొన్ని వ్యాపారాలనున్ను చేష్టలనున్ను నేర్చుకొంటారు. అవతల యీవిధమైన సల్లాపాలయందు చిన్నవాండ్లకు బుద్ధి పుట్టి చదువుమీది జ్ఞాపకము తప్పి యీ దాసీలయిండ్లకు పోవలననే వక అపేక్ష మనస్సులో కలిగి మహారాజుల యిండ్ల చిన్నవాండ్లయితే ప్రామిస్సేరినోట్లు వ్రాసి యిచ్చి డిస్కౌంటుచేసి రూకలు సంపాదించుకొని వారి యిండ్లకు పోతారు. పేదవానింటి చిన్నవాండ్లయితే యెక్కడయినా దొంగిలించి రూకలు సంపాదించి వారి యిండ్లకుపోయి వ్యాధిని సంపాదించుకొని భ్రష్టుడయి చెడిపోతున్నాడు. దృష్టాంతానికి కావలసియుంటె అనేక పేర్లు యుదహరించగలను. అయితే గడిచిపోయినవాటిని చెప్పినందువల్ల సార్థకము లేదుగనుక వారి పేర్లను చెప్పవలసిన అగత్యము లేదు. యింకా అనేక దోషాలు వున్నవి. యిది అందరికిన్ని తెలిసిన సంగతే గనక విస్తరించవలసిన నిమిత్తము లేదు. నాయొక్క తాత్పర్యమేమిటంటే యీ కచ్చేరీలను వుంచి దాసీలను రప్పించేటందువల్ల మనమై మన పిల్లకాయలకు దుష్టచేష్టలు నేర్పిస్తున్నాము.

గనక యికమీదను పెండ్లిండ్లు చేసేవారు కచ్చేరి పందలివేసి అక్కడికి దాసీలను రప్పించి నాట్యము చేయించేది మాని దానికి పట్టే ఖర్చులను ముహూర్తము వేళలో దానధర్మాలున్ను బంధువులకున్ను బ్రాహ్మణులకున్ను అన్నం పెట్టించి తృప్తిచేయిస్తే బంధువులుగాక స్నేహితులుగానున్ను యిష్టులుగా నున్ను పెండ్లికి వచ్చేవారిని యెట్లా తృప్తి చేయవచ్చునని అడిగితే వారికి యీవత్తున్ను వకనాటికి బ్రాహ్మణులనుకొని వంట

చేయించి విందు చేసి ఆ విందు ప్రయుక్తమయి సంగీతములో విద్వాంసుడుగా (వుండే) బ్రాహ్మణ్నైనాగాని యితర వర్ణములోగాని వక పురుషుణ్ని రప్పించి కొంతసేపు భగవన్నామ కీర్తన చేయిస్తే చేయించేవారికిన్ని వినేవారికిన్ని పరలోకసాధనం కద్దు. తమరు దయచేసి యీ కాకితాన్ని కడాకు చదివిచూచి దీన్ని తమ వృత్తాంత పత్రికలో ప్రచురణము చేయించడము లోకోపకారంగా వుండునని తమకుతోస్తే అలాగున తాము ప్రచురము చేయవలెనని కోరుతున్నాను. అయితే యీ కాకితము చదివేవారు తోడుతోనే తమ యింట్లో పెండ్లి ప్రయోజనాలు వస్తే కచ్చేరియుంచడము యిప్పుడే మానుతారని నేను యెంచలేదు. గాని దినంపేరట, యిందులో వ్రాసియుండే సంగతులు యావత్తున్ను నిశ్చయమని కొందరు బుద్ధిమంతులు యెంచుకొని కచ్చేరియుంచక మానుతారనే యెడల నేను సందేహించలేదు.

1841 సంవత్సరం	తమ చందాదారుడైన లోకరక్షణి
ఫిబ్రవరి నెల 15వ తేది	(సంపుటం 1, ఎం.417, పేజీలు 73-80)

1838 నుండి 1841 దాకా నాలుగేళ్లు నడిచినా ''వృత్తాంతిని'' అభిమాన సంపత్తిలేక నిలిచిపోయింది. అయితే పత్రికల జరూరత్ తెలుసుకొన్నవారు 1842లోనే ''వర్తమాన తరంగిణి'' అనే పత్రికను స్థాపించారు. దీనికి ''యెడిటరున్ను, ప్రొప్రయిటరున్ను'' సయ్యాదు రహిమతుల్లా అనే సాహెబుగారు. పత్రిక కొంతకాలం నడిచాక ఆయన ఒక ప్రకటన చేశారు.

''యీ చన్న పట్టణమందు మిక్కిలి ప్రముఖులుగానున్ను, ధనవంతులనే పేరుగల వారుగానున్ను ఉండే కొందరు నేటివు పెద్ద మనుషులు పూర్వం ''వృత్తాంతి'' అనే వక ఆంధ్రపత్రికను ప్రచురము చేసి అది కొద్దికాలము వరకు జరుగుతూ వుండెను. యింతలో దానికి అంత్యకాలము సంభవించి అది మృతి బొందెనని మిక్కిలి చింతతోటి తెలియచేయుచున్నాము.

యిపుడు వుదయించి వుండే వర్తమాన తరంగిణి అనే పత్రికకు యేజంటున్ను, ప్రొప్రొయిటరున్ను అయిన మేము మిక్కిలి ధనవంతులము కాము. ఆంధ్రభాషయందు మిక్కిలి జ్ఞానము గాని రుచిగాని గలవారముగాము. అయితే యీ దేశస్తులయిన పెద్ద మనుష్యులు యీ విషయమును వృద్ధిపరచడమునకు సహాయులవుదురనే తాత్పర్యము చాతనున్ను యీ మూలముగా హిందువులయొక్క స్నేహమునకు నేను పాత్రుడనయి తద్వారా ప్రతిష్ఠను పొందవలెననే తాత్పర్యం చాతనున్ను నూరార్లు వ్రాయపడి, ముద్రాక్షరములు మొదలుగా గల పనిముట్లను సంపాదించి యీ పత్రికను వుదయింప చేయడమునకు కారకుడనయితిమి.

సమాచార పత్రికలనేవి రాజ్యమునేలే జమీందార్లకున్ను వుద్యోగములను చేసేవారికిన్ని గొప్పగా వర్తక వ్యాపారములను చేసే వారికిన్ని మిక్కిలి వుపయోగమవుచున్నవి.

యిలాటి వారికి నానాదేశములందు జరిగే వ్యవహారములు ఆకళింపు కావడంవల్ల తమ తమ వ్యవహారములను బందోబస్తు చేసుకొనడముకేమి వింతగా వుండే సమాచార ములను చూసి సంతోషపడడమునకేమి అక్కడక్కడ జరిగే దుష్కృత్య సత్కృత్యములను తెలుసుకొనడముకేమి శక్తి గలిగి బుద్ధి అభివృద్ధి కావడముకు ఆస్పదమవుతున్నది.

సయ్యదు రహీమతుల్లా సాహెబు యేజంటు''
(వర్తమాన తరంగిణి - పుస్తకం - 2)
ఆశ్వాసం 4; సంచిక 17
1843 మే 11)

పత్రిక ప్రొప్రయిటరు దీనిని ప్రారంభించడంలో తన ఆశయాలను 1843లో వెల్లడి చేసినా వర్తమాన తరంగిణి 1842 జూన్ 8వ తారీఖు నుంచి వెలువడుతూ ఉండేదని ఊహించవచ్చు. ప్రొప్రయిటర్ల ఉత్తరవు మీద ఎడిటరు 1842 డిసెంబరు 29వ తేదీనాడు ఒక ప్రకటన ఇలా చేశారు.

''మహారాజ రాజశ్రీ
వర్తమాన తరంగిణి చందాదార్లకు
విన్నపములు.

ఈ అడుగున మేము వ్రాయబొయ్యే ఒక ముఖ్యమైన సంగతిని అశేషులున్ను సావధాన మనస్కులయి యాకర్ణించవలయునని ప్రార్థించుచున్నాము.

మనవారిలో కట్టుబాటు లేకపోవుటయే దౌర్భాగ్య సంపత్తికి నాకరముగా నున్నది. యింగిలీషు వారిలో నందరున్ను మంచి కట్టుబాటులో నుండుట వలన వారికి లక్ష్మి కటాక్షము గలిగి సకల సాంమ్రాజ్యముల ననుభవింపుచున్నారు. యదియునుంగాక వారి యర్భకులకు శైశవము నందే స్తనం దయత్వము వదలి నంతట దేశభాషలలోనం బూర్ణ ప్రజ్ఞ వారి పితరులు కలగజేసి ఖండితమయిన కట్టులోనందీర్చుట వలన వారికి ధైర్యసాహసములు సాధారణముగా కలుగుచున్నవి. విద్య నేర్చుకోవడమనగా నక్షరముల నభ్యసించి వంకర టింకరగా తమ పేరు మాత్రము కొంతప్పుల గుణింతములతో వ్రాసేపాటి శక్తి కలగగానే నిలపడము గాదు. సుశబ్దాసశబ్ద వ్యాక్య సౌష్ఠవముల నెరుగుటయున్ను తప్పుఒప్పుల కనుగొని వ్రాయనేర్చుటయున్ను కన్న విన్న పుస్తకంబుల కర్థము జెప్పగలుగుటయున్ను సంకేత నిర్ణయ ప్రకారాంతరముల నేర్చుటయున్ను దేశ భాషా భావసంచారవేదియై భాషా భూషణంబగు దోషరహిత జాతీయ ఫణితి ''తోడన'' చాతుర్య చమత్కారముల గ్రక్కుచు మాటలాడు ధోరణి నాకర్షించి తెలుసుకొనుట యున్నిత్యాదులే భాష నేర్చుకొన్న వాడనుటకు నిదర్శనంబులు. హూణులలో నిట్టి వివేక సంపత్తి పూర్ణంబుగా నుండుట వలన వారందరు ధైర్యశాలులయి వెలయుచున్నారు.

ఇంగ్లీషులో - యెథీనియం - ఈవెనింగు మెయిల్-స్పెక్టేటరు-యెగ్జామినరు-పోర్టుఫోలియో-అడ్వర్‌టైజరు-సార్వైసు గేజట్టి మొదయిలన వర్తమాన పత్రికలు చెన్న పట్నములోనున్ను బంగాళా హర్కార్ - కలకత్తా అబ్జర్వరు-కలకత్తా స్టార్ - అగరా

అఖబరు మొదయినవి బంగాలీలో నున్ను బొంబాయి టయంస్-ఢిల్లీగెజట్టీ-హర్కారా మొదలయినవి బొంబాయిలోనున్ను హాంగుకాంగు గెజెట్టి చీనాలోనున్ను, యూనైటెడ్డు-కింగ్డం-లన్‌డన్ మెయిల్ - మంథిలీటయంసు మొదలయినవి శీమలోనున్ను యింకా సిలోన్ సర్క్యులేటరు వగయిరాలు చిల్లరదేశములలోనున్ను ప్రబలించి యుండడమేగాకుండా తత్పత్రికలకు నాధారముగా మూలధనము నేర్పరచి నలుగురున్నేకమయి యభిమానపూర్వకముగా నత్యంత ప్రేమతోటి యింగిలీషువారు ఆ పత్రికలన్ని జరుపుకొంటున్నారు.

మన దేశస్తులకు తెలివిగలిగి విద్యావంతులయి నానా దేశాచారములనున్ను తెలుసుకొని బాగుపడుటకయ్యే యీ తెలుగు పత్రిక పూర్వము స్థాపింపబడినదిగాని - దానికి యభిమానించి నడిపించే ప్రభువులు లేకపోవుట వల్లనే అది క్షీణగతి నొందినది. మళ్ళీ మేమున్ను దేశాభిమానము వలననే యిప్పట్లో యీ పత్రికను స్థాపించినాముగాని - లాభము రావలెననిగాదు. చందాయున్ను - అతి సులభమేను. యింగిలీషు పత్రికలలో నొక్కొక్క దానికి నెల ఒకటికి ఒక రూపాయి మొదలు పది రూపాయలవరకు చందా నిశ్చయించియున్నారు. అదిన్నిగాక అనేకమంది వేల తరబడి చందాదార్లున్నారు. వారు వారభ్యంతరము లేకుండా - చందా రూకలు చెల్లిస్తున్నారు. మన తెలుగులో ఒక చందాగల పత్రిక వక్కటే వుండిన్ని దీనికి చందాదార్లు బహు కొంచెమందే వున్నారు. వారున్ను చందా రూకలు సరిగా చెల్లించరు. యెప్పుడు బిల్లుచూస్తారో అప్పుడే పత్రిక నిలిపి వేస్తారు. అందుకు భయపడి యెన్నాళ్లుండతరము - మేమున్ను 3 నెలల నుంచి పత్రిక బహూబాగానే జరుపుచున్ను యింకా చందాదార్లు యేర్పడి వృద్ధి పొందుననే అభిప్రాయంతో యెన్నాళ్లు చేతి రూకలు వేసినా గాని కడాపటు మనస్సులో వ్యాకుల పడవలశే వచ్చుచున్నది.

మా శిబ్బంది శెలవు ర్పూ 100కి అధికంగానే వున్నది. వరుమానం 70 రూపాయలకు అధికముగా లేనందున చేతి సొమ్ము తగులుబడి అవుతున్నది గనుక యిప్పుడున్ను యీ భాషను విశ్వసించే ప్రభువులు వారు వారు దయచేసి జనవరిలోగా తమ స్నేహితులను యీ పత్రిక నభివృద్ధి చేసేపని పూనుకోజేయకపోతే మేమెన్నాళ్లు నిర్వహించగలము గాన వారు కీర్తి ప్రతిష్ఠలు వహించి యీ పత్రిక స్థిరముగా నడిచేలాగున చేయించవలెనని ప్రార్థించుచున్నాము.

ప్రొప్రయిటర్ల యుత్తరవుమీదనిటుల

ఎడిటరు''

(వర్తమాన తరంగిణి, పుస్తకం-1
ఆశ్వాసం-2. సంచిక 10- 1842 డిసెంబరు 29)

1843లో సయ్యదు రహిమతుల్లా తాను యెడిటర్ను అని చెప్పుకొన్నాడు. పత్రిక ప్రారంభించేటప్పుడు ఎవరు సంపాదకత్వం వహించేవారో తెలియదు. తొలి ఆరు సంచికల తర్వాత మధ్యలో కొత్త ఎడిటరును నియమించారు. ఆ సంగతిని పత్రికలో తెలియపరిచారు.

కొత్త యెడిటరు

''పూర్వపు యెడీటరుగారికి కొన్ని హేతువుల వల్ల యీ పత్రిక యొక్క సంబంధము వదలిపోయినదని మా చందాదారులు తెలుసుకోవచ్చును. వారు యెడీటరుగా వున్న కాలములో యీ పత్రిక బాగానే జరుగుతూ వచ్చెను. యికమీదట మాకాలములో పూర్వపు పద్ధతినే గాని అంతకంటే ఈషదధికముగా గాని జరుగుననిన్ని తక్కువగా మాత్రం వుండదనిన్ని మా పత్రికను చదివేవారికే క్రమముగా తెలియవచ్చును గనుక - మేము మరేమిన్ని చెప్పవలసినదే లేదు - మేము యెడీటరుగా ప్రవేసించినందున యికను యీ పత్రికకు కావలసిన సహాయములు శక్తివంచనలేకుండా చేస్తామనడమే కాకుండా, యీ పత్రికను బలముగా స్థాపించవలెనని యిష్టముగల మా సఖులకు శ్రేయోభివృద్ధినే కోరుతూ వుంటాము. మత విషయములైన వాదములకున్ను దూషణ భూషణ తిరస్కారములకున్ను నటవిటగాయకాది చరిత్రములకున్ను యింకా యితర దుర్విషములకున్ను మా పత్రికలో స్థలమివ్వము.

ముఖ్యముగా యీ పత్రిక నానాటికి పరంపరగా అభివృద్ధి కావలెనని జగత్కర్తను సదా వేడుకొంటున్నాము.''

(వర్తమాన తరంగిణి పుస్తకం-1,
ఆశ్వాసం.1, సంచిక-7,
1842 జూలై 21)

తెలుగులో వచ్చిన మొదటి పత్రికలు చదివేవారు తమ భావాలను, కోరికలను సంపాదకులకు ఎలా తెలియచేసేవారో ఎంత సుదీర్ఘమైన జాబులు రాసేవారో తెలుసుకొనడం ఆనాటి పైనాలు అవగాహన చేసుకొనడానికి అవసరం. తమకు వచ్చే ఉత్తరాలకు పత్రికాధిపతులు ఎలాగ సమాధానాలు రాసి ప్రచురించేవారో కూడా చాలా ఆసక్తికరమైన విషయమే. జాబు, జవాబు చూడండి.

''మహారాజ రాజశ్రీ
వర్తమాన తరంగిణి యెడిటరు గారికి

ప్రియమైన అయ్యా!

''మీ యెుక్క పత్రికకు నేనొక చందాదారుడనై వుండేపాటి భాగ్యమును కలగక వున్నప్పటికిన్ని అప్పటప్పటికి వాటిని చదివి చూసే సమయములు నాకు కలిగి వుంటున్నవి. అట్లా చదివి చూడడం వల్ల మీయొక్క పత్రికెకు మిక్కిలి ప్రసిద్ధిన్ని గణ్యమున్ను అభివృద్ధి సహాయే హేతువ చాలా కలుగవచ్చునో అట్టి విషయమును యోచించిగా నాబుద్ధ్యా తోచిన కొన్ని సంగతులను యీ దిగువ వ్రాస్తున్నాను. చిత్తగించి అవి సమర్పకమైన పక్షమందు అదే ప్రకారం నడిపింతునని నమ్మియున్నాను''.

''గడిచిన యార్వనెల నుంచి ప్రచురమయ్యే మీ పత్రికెలలో వేశే రస్సా అనగా అచ్చు బహు సన్నవిగానున్ను చీనాకాగితంలో వెయ్యడం చాత అక్షరాలు తీరుమ్మానించి

వ్యాకయించి కలిసిపోవడమున్ను అందువల్ల - అక్షరాలు బొత్తిగా తెలియకపోవడమున్ను యీరీతిని వుండడమేగాకుండా అన్యదేశములలో నడిచే యుద్ధ ప్రసంగము మొదలయిన సంగతులు అందరికిన్ని సులభంగా తెలిసేటట్టు హోస్సలుకలంసే చెప్పడానికి బదులుగా యంగ్రేజి పత్రికలలో వుండే వాటిని అలాగే తర్జుమా చేసి వేశేటట్టు తెలుస్తున్నది. యీలాగున చేయడం వలన మీ పత్రిక చదివే వారికి వేసటయున్ను అరుచిన్ని పుట్టడానకు హేతువు అయి వుంటున్నది.''

''గనక తమయొక్క అభివృద్ధిని కోరి నేను మనవి చేసేది యేమంటే మీయొక్క పత్రికె అగత్యం ల్యాక పెద్దదిగా వుండే పనిలేదు. స్వారస్యం కలిగి యెంత చిన్నదిగా వుంటే అంత అంత మేలని గ్రహించవలసినది.''

''ఇదిగాక చీనాకాగితమును ఆపేక్షించి ప్రిన్ యెగ్ పేపరు అనే వూరకుండా వుండే తెల్ల కాగితం మీద అచ్చువేసినట్టయితే చూచేటందుకు అక్షరాలు స్పష్టంగా నున్ను సులభంగానున్ను అగుపడును. యీ కాగితం వల్ల నిండా ఖర్చున్ను కానేరాదు. అక్షరాలు చెక్కివుండే అచ్చులు సదరకీ కాగితాల మీద లెస్సగా పాటినప్పటికిన్ని యిప్పుడు మీరువేశే చీనాకాగితంలో వకపక్క వేసిన అక్షరాలు మరి వక పక్కను తెలుస్తున్ను యిరుపక్కలు కలిసివున్నట్టు యేలాగున అగుపడుతున్నదో ఆ మ్యారకు అగపడదు.''

''4. ఇప్పుడు వేసే సన్న అక్షరాలకంటే టైపు సులువుది. కొంత పెద్దదిగానున్ను అక్షరాలు బాగా తీరుమానం అయి భటువులుగా వేసినట్టయితే బాగా వుండును. యిందువల్ల చిన్నవాండ్లు సహా చదివేటందుకు వుపయుక్తమయి యుండును.''

''5. పత్రికలో ప్రథమ భాగమందు గవర్నరుమెంటు వారివల్ల హుకుం చేయబడ్డ పాయింటుమెంట్లున్ను రజా మొదలయిన ముఖ్యమైన దరబారు సంగతులున్ను వేసి అటుతర్వాత యిడిటోరియాల్ అనే ఖుద్దు మీవల్ల చెప్పబడే సంగతులు సమాచారములు కాలమానములు బాజారి వర్తమానములు అక్కడక్కడ నడిచే చోద్యమైన సంగతులు విద్యావిషయాలు యివి మొదలయినవి వేసినట్టయితే చదివేవారికి బహురుచిగా వుండును.''

''6. ఈ చొప్పున మీరు నడిపించడంవల్ల యీ స్థళాంలో నుండే కొందరు మీకు చందాదార్లు అయ్యేదే గాకుండా సులభంగా యింకా అన్యస్థలాల్లో చందాదార్లు చిక్కడంలో యెంతమాత్రం సందేహం లేదు. పైని వ్రాసిన ప్రకారము మీరు నడిపింతురు అనే గుర్తును మీయొక్క వచ్చేవారం పత్రికెలూ చూడవలెననే కోరికతో మీ యొక్క వినయ విధేయుడయియున్నాను.

మీ పత్రికె చదివేవాడు.''

బళ్ళారి,
చాందు, 20 ఆగస్టు
స్న 1842, సం

ఈ వుత్తరమునకు జవాబు

''ఈ కింద వ్రాయబోతున్నాము గనుక మా చందాదార్లు అందరు సావధానముగా చదివి వుత్తరమున్ను అందుకు జవాబున్ను బాగా ఆకళింపు జేసుకొని తమ తమ తాత్పర్యములను తెలియజేతురని కోరుతున్నాము.''

''ఈ వర్తమాన తరంగిణి కొత్తగా యేర్పడ్డదిగదా దీన్ని ప్రసిద్ధం చేయబూనుకొన్నవారు యింగిలీషు కాకితాలను పూసుకొన్న వారివలెనే ద్రవ్యవంతులు కానివారు. యింగిలీషు కాకితాలు అచ్చువెయ్యవలెనంటే వారిలో పదిమంది కట్టుబాటుగా చేరి అందరున్ను అందుకు తగిన ప్రయాసకుగాను తలా కొంచెం ముందుగా రూకలు వేసి దాన్ని మూలధనం చేసుకొని అభివృద్ధి చేసుకొంటూ రావడం వలన వారు యేపని మొదలుబెట్టినా నిరాటంకంగా సాగుతూ వుంటున్నది. మనవారిలో ద్రవ్యవంతుల సహాయం యిలాగంటి కార్యాలలో వుపయోగపడితే చక్కగానే వుండును. అట్లాకాకుండా పోవడం చేత ప్రకృతంలో అన్నీ యేకకాలంలో సమకూర్చవల్లలేదు. ప్రకృతోపయోగంగా వక తరహా టైప్పు సంపాదించి వాటితో ఆరంభించియున్నాము. అవి కొంచెం పాతవి గనక కొన్ని స్థలములలో అంటనట్టున్ను కొన్ని స్థలములలో నిండా అద్దినట్టున్ను కనిపిస్తున్నది. పైన వ్రాసిన హేతువువల్ల కాకితములు మార్చడానకు యిప్పట్లోవల్లలేదు''.

''ఆదిలోనే ఆలాగాంటివి కొన్ని మా అభిప్రాయానికి తోచి కొద్ది దినములలో అన్ని చక్కపరచుకోవచ్చుననే ఆలోచనలో యిందుల లోపాలోపములు యింకా కొన్నిదినముల వరకు మా పత్రికలకు అభిమానులు (సిక్) ఉండేవారు. సాక్షేమిస్తూ రావలసినదిగా యిదివరకే ప్రసిద్ధపరచివున్నాముగదా.''

''పయిన వ్రాసి వున్న జాబు మాకు పంపినవారు పత్రిక యెడల అభిమాన పూర్వకంగా వ్రాసిన సంగతులు మాకు సంతోషమయినది. వారు యెల్లప్పటికిన్ని యీ అభిమానమే వహించి చేతనయినంత మట్టుకు సహాయ సంపత్తులు జరిగించవలెనన్ని వారేగాకుండా ఆ చొప్పున అభిమానం కలిగిన వారందరూ వుభయుల కోరికలు ఫలితములయ్యే లాగున చెయ్యవలెనన్ని కోరుతున్నాము.''

''ఈ కాకితములు సర్వత్రా వ్యాపించి తగిన చందాదారులు యేర్పడి అందుకు న్యాయంగా పట్టే శెలవులు వచ్చే మార్గం కలగగానే యీ పత్రిక లోకుల మనస్సుకు తృప్తికరంగా నున్ను అందరూ స్తోత్రం చెయ్యతగిన రీతిగానున్ను జరిగించెవలెనని వున్నందున అభిమానం గలవారు దయచేసి వృద్ధికరంగా జరిగించవలెనని కోరుతున్నాము.''

''ఇప్పుడు మేము ఈ ఆఫీసు వుంచి వుండేది యెందుకంటే బుద్ధిమంతులుగా వుండే యింగిలీషు వారు సమస్త దేశ వర్తమానములున్ను తెలుసుకోవడానికున్ను అందులో బహుమంది తమ యుక్తులున్ను నేర్పులున్ను వృద్ధి చెయ్యడమునకున్ను అనే వర్తమాన

పత్రికలు స్థాపించి వుండడమే గాకుండా వాటికి తగినట్టు అభిమానించి అందరూ పుచ్చుకోవడమున్ను ముందు రూకలే యిస్తూ వుండడమున్ను అందువల్ల ఆ పత్రికలను స్థాపించినవారికి విశేష లాభం కూడా వుంటున్నది. యింగిలీషువారిలో యిటువంటి ఔదార్యమున్ను కట్టుబాటున్ను మత సంబంధమైన విశ్వాసమున్ను కలిగియుండుటవల్లనే వారికి దినే దినే అభివృద్ధిన్ని ఆయురారోగ్యైశ్వర్యములున్ను కలిగి వున్నవి.''

''మనవారిలో వక పత్రికయినా లేనందున యీలాంటి పత్రికను స్థాపిస్తే బహుజనోపకారమునిన్ని దినేదినే మనవారికి అభివృద్ధియనిన్ని అందరున్ను అభిమానించి దీన్ని బాగా క్రమంగా జరుపుదురనిన్ని యిందువల్ల మనకు లాభం లేకపోయినా కీర్తి ప్రతిష్ఠలు కలగడానికి అయినా హేతువుగా వుంటున్నదనిన్ని యిటువంటి దుర్ఘటమైన పనిని పూనుకొని నా చేతనయిన మట్టుకు నానాదేశాలలో వుండే పెద్దమనుష్యులకు కాకితాలున్ను స్వరూప సూచకములున్ను అంపడమున్ను అప్పుడప్పుడు పుస్తకాలు మొదలయిన వాటిని నయంగా అచ్చువేసి యిస్తామనడమున్ను బయటి దేశాలలో నుండే వారు పత్రికలు తెప్పించుకొంటే పోష్టు ఫ్రీగా అంపుతామనడమున్ను యిలాగంటి అనేక ప్రయత్నాలు యీ మూడు నెలలుగా చేసినాగాని యీ వరకు న్యాయంగా వుండే పట్టుబడి వరకయినా వసూలు లేకుండా వున్నది. వుండే చందాదార్లున్ను మాయందు కటాక్షించి రూకలు త్వరగా యివ్వడంలేదు. యిప్పుడు చందా చేశి వుండే కొందరు పెద్ద మనుష్యులు మాత్రం మా పత్రికయందు అభిమానించి జరిపించవలెననే తలంపుగలవారైయున్నారు. గాని యింకా యిది అభివృద్ధి అయ్యే సహాయమయినా వెతికే తొందర పుచ్చుకోవడానకు యిష్టం లేకుండానున్నారు.''

''ఇందులో మాకేమిన్ని లాభం లేకపోయినా ప్రస్తుతము శిబ్బందీ శెలవున్ను కాగితాలున్ను మసిన్ని ఆఫీసులు వుంచి యుండే యింటి బాడుగెయున్ను ఇంత మట్టుకు యేమి గతలును - దుర్విషయాలలో వ్రయం చేయడానికి రూకలు విస్తారంగా దొరుకుతున్నవి. యిటువంటి సద్విషయాలకు డబ్బులేకపోతున్నది అందరికిన్ని కట్టుగుడ్డ మొదలు సమస్తానికిన్ని యీశ్వరుడు యేదోవక దోవ కలగచేశి యున్నాడు గాని సృష్టించి వూరికె విడిచిపెట్టలేదు. మనము భూమిలో నుండగా మంచి కావ్యములలో మన బుద్ధినంతా ప్రవర్తింపచేశి కీర్తిని పొంది పరలోకానికి పోతే కొన్నాళ్ళు మన పేరున్ను భూమిలోనుండును. (యిస్తు జీవతి జీవంతి బహవస్సంతు జీవతి బకోపికిం నరురుతే చంద్వా స్వోదర పోషణం) అనే న్యాయం ప్రకారంగా వారు వారు తమ పొట్టను నిండించుకోవడమే ముఖ్యమని యెంచుతున్నారు. వృథా శెలవులు చెయ్యడానకు సిద్ధమయి సద్విషములలో తమ మనస్సును చొరనివ్వరు.''

''అవి అంటుండగా యిప్పుడు బళ్లారి నుంచి మాకు వుత్తరం వ్రాసిన ఆయన మా పత్రికను పుచ్చుకొనేవారు కాకపోయినా మా పత్రిక మీద యిటువంటి అధికారము చేస్తున్నారు. మేమున్ను మా పత్రికను అభివృద్ధి చేయడానకు కొందరు పెద్ద మనుష్యులు

పూనుకోవలెనన్ని వారు అప్పటప్పటికి ఆ పత్రికకు మంచి ఫర్మాయిషీలు చేస్తూ రావలెనన్నిన్ని మేమున్ను ఆ ప్రకారమే జరిగించి అందువలన లోకులకు ఉత్సాహాన్ని కలగచేయవలెనని యెంచుతున్నాముగాని వృథాగా యిటువంటి తొందరలు అనగా పత్రిక కయినప్పటికిన్ని చందాచేయకుండా ధర్మానికి చదవడమేగాకుండా యీలాగున అధికారం చేయనిచ్చుగల వారికి కూడా జవాబుల నివ్వవలెనని తలంపుపుట్టడానికి తెంపులేని మనస్సుగల వారమయియున్నాము.''

ప్రతి కలానికిన్ని జవాబు

''మా పత్రికలోని అక్షరాలను గెజిట్టీ విషయం తప్ప యెంత అక్షరం వుంటే అందగించునో, నేర్చుకొనే వారికిన్ని వుపయోగించునో అంత పెద్ద అక్షరములతోనే వేస్తున్నాము. కాకితాల విషయంలో యీ కలాలకు పూర్వం వ్రాసిన అసందర్భములు తప్ప వేరే వ్రాయవలసిన మాటలు లేవు. ఇంగిలీషు కాకితములలో నుంచి తర్జుమాచేసి వ్రాసే విషయంలో కొందరి తాత్పర్యం హొస్సలుగా వ్రాయవలెనన్నిన్ని కొందరి తాత్పర్యం యింగిలీషులో నున్నది యావత్తు వ్రాయవలెనన్నిన్ని వున్నందున కొన్ని సంగతులు యింగిలీషులో వుండేటట్టుగానున్ను కొన్ని హొస్సలు కలంగానున్ను వ్రాస్తున్నామేగాని అన్నిన్ని వకటే తరహాగా వ్రాయడంలేదు. మెట్టుకు అటువంటి సంగతులు హొస్సలు కలంగా వ్రాయడమే మాకున్ను యిష్టంగా నున్నప్పటికిని లోకుల యిష్టాన్ని కనిపెట్టి అనుసరించవలెనని రెండువిధముల వ్రాస్తూ రాగా మా తాత్పర్యాన్ని అనుసరించి వక్కరు వుత్తరం వ్రాసినందున అలాగే జరిగించడం మంచిదని తలచినాము. అయితే పోయినసారి మా పత్రికలో వ్రాసిన రాణి విషయం వంటి విషయాలు మాత్రం యథాస్థితిగా వ్రాయక విధిలేదు. తతిమా వాటికి హొస్సలు కలంగా వ్రాయడానకు సిద్ధంగా వున్నాము.''

''2. యిప్పుడు మేము ప్రసిద్ధపరిచే 12 పక్కలున్ను అత్యావశ్యకములనడానకు దాఖలా యేమంటే - కొన్ని సంగతులు యెడం చాలక వుప పత్రికలు అచ్చువేయడమున్ను (యీ మిగతా మరి వక పత్రికలో నగుపడును) అని వ్రాయడమున్ను తప్ప వేరే యేమికావలెను.''

''3. మొదటి కాలంలోనే యిందుకు జవాబు వ్రాసియున్నాము.''

''4. దేశ వర్తమానాలకున్ను గవర్నమెంటు వుద్యోగాది విషయములకున్ను భేదం కలగవలెనన్నిన్ని గెజిట్టీ విషయం *కుఱ్ఱవాండ్లు బోధపరచుకోలేకపోవడమే గాకుండా పీళ్ళైనా చదవనేరరు గనుక వారికి యీ విషయంవల్ల యీషన్ ప్రయోజనమున్ను కలగదనిన్ని అందుకు తతిమా సంగతులే వుపయుక్తమవుతవనిన్ని గెజిట్టీ విషయం మాత్రం కడపట సన్నక్షరాలలో నచ్చువేయిస్తున్నాము.''

★ చిన్నవాండ్లు అనగా యెన్ని యేండ్ల వయసుకు లోబడ్డ వారో మాకు వుత్తరము వ్రాసినాయన తెలియచేతురని కోరుతున్నాము.

''గెజిట్టీ సంగతి యేమంటే వచ్చే కాగితం సులభముగా భాషాంతరం చేయకూడినా గాని మంగళవారం సాయంత్రం తెచ్చేది - రాత్రి సావుకాశం చాలనందున బుధవారం నాడీ తర్జుమా చేసి అచ్చు వేయవలసియున్నది. యీ గెజిట్టీలు కడపటి కాగితములో నచ్చు వేయకుండా మొదటనే వేయవలెనంటే మొదటి కాగితమున్ను రెండో కాకితమున్ను అచ్చువేయనిది మూడోది వేయడానకు, యుక్తము కానందుననున్ను మూడున్ను వకనాడే వేయకూడనందునున్ను - మొదటిది రెండోది తత్పూర్వమే అచ్చువేసి సిద్ధపరచకపోతే మూడోది అచ్చుబొత్తిగా వేయడానకు వాటంకానందుననున్ను కడపటి కాగితంలోనే అచ్చుపడవలసియున్నది. యీ స్వల్ప కార్యము సులభంగా తెలుసుకోతగ్గది. అయినా మాకు వుత్తరము వ్రాసిన వారు వుత్తరం వ్రాసి అంపించేలోగానే తెలుసుకోక పోయినందుకు వ్యసనపడుతున్నాము.''

''6. పయిన వ్రాసిన ప్రకారం వృద్ధి చేయడానికి యిచ్చకలవారందరున్ను చందాచేయనున్ను చేస్తారు. పత్రికయున్ను బాగా జరిగే సోపాయం వెతకి ఫర్మాయిషీ చేస్తారు. ఆలూపోలూ లేకుండా వుండగానే (చేలో పత్తి చేలో వుండగానే పోలికి మూడు ముళ్ళూ, నాకు ఆరు మూళ్లు) అనే సామెతను అవలంబించారు. మాకు చందాదార్లు విశేషించి కలుగతారని వ్రాయడము వలననే తృప్తి పొందముగాని అట్లా కలిగిన నాటికి మా పత్రిక భాగ్యసంపత్తి కలిగినదని మాత్రం సంతోషించి యీపయిన వ్రాసిన విషయాలను అవలంబించుచున్నాము.''

ఈ సుదీర్ఘమైన ''జాబు-జవాబు''లవల్ల మొదటి తెలుగు పత్రికలలో లభ్యమవుతున్న తొలి పత్రిక స్వరూప స్వభావాలు ఆనాటి మాటలలోనే విశదమవుతుంది. సంపాదక లేఖలకు రుసుము చెల్లించక్కర్లేదు గాని ప్రకటనలకు ''ఛార్జీలు'' ఉండేవి. వాటిని ఇలా ప్రకటించారు.

''మా పత్రికలో ప్రకటనలను ప్రచురము చేయవలెననే ఆపేక్ష గల వారందరున్ను పంఙ్తి 1కి మూడేసి అణాలు ఇవ్వవలెను. వాడుకగా ప్రకటనలను పంపిస్తూ వుండే వర్తకులకు మామూలు తోపుడు తోసి యివ్వడమవును. ప్రచురము చేయవలసిన ప్రకటనలను గాని జాబులను గాని పంపించేవారు సోమవారము సాయంకాలమునకు లోపల యేజంటు దగ్గిర చేరేలాగున పంపించవలెనని ప్రార్థించడమవుతున్నది.''

(వర్తమాన తరంగిణి పుస్తకం 1, సంచిక 11, 1842 ఆగష్టు 18)

పత్రిక నడపడంలో సాధక బాధకాలు చూసుకొని ప్రచురణ చేసేవారిని కూర్చుకొనడం అవసరమే. ''వర్తమాన తరంగిణి ప్రతి గురువారమున్ను ప్రాతఃకాలమున ప్రచరమౌను'' అని చెప్తూ దానికి కొత్త కారణాలు ఇలా చెప్పారు.

''ప్రకటన - మా పత్రికను ఇదివరకు ప్రతి బుధవారపు ఉదయాన ప్రచరము చేస్తూ వుంటిమి. అయితే అడుగడుక్కున్ను మంగళవారపు గెజిట్టి మంగళవారం రాత్రి వస్తున్నది గనుక అది తర్జుమా చేసి అచ్చు వెయ్యడానికు సావుకాశం చాలనందుననున్ను అధవా కష్టపడి సిద్ధం చేసినాగాని బంట్రోతులు అప్పగించడంలో జరిగించే అజాగ్రత్త వల్లనున్ను

సావుకాశపడుతూ వచ్చినది. గనుక యిక మీదట పూర్వపు వృత్తాంతి వలెనే ప్రతి గురువారం ఉదయాన ప్రచురము చేసేలాగున నిశ్చయించుకొని జాగ్రత్తలేని బంట్రోతులకు బదులు కొందరు కొత్తవాండ్లను యేర్పరచి యికమీద మేము చెప్పిన వేళకు సరిగా మా పత్రికలు చందాదార్లకు చేరేలాగున చేసినాము.''

(పుస్తకం 1 - సంచిక 7, 1842 జూలై 21)

చెన్నపట్నంలోని చందాదారులకు బంట్రోతుల ద్వారా పత్రికలు అందజేసేవారు. బయట ఊళ్ళలో వుండేవారికోసం ఇంకో ప్రకటన ఇలా చేశారు.

''ప్రకటన- బయటి దేశములో నుండేవారు పదిమందికి తక్కువ గాకుండా యేకముగా చేరి మా పత్రిక వకటేకట్టగా సదరకీ పదిమందికిన్ని యెవరి పేరటనయినా తెప్పించుకొనే పక్షమందు అటువంటి దరఖాస్తులు చేసినవారికి పోస్టు ఫ్రీగా వర్తమాన తరంగిణి పంపించడమవును. 5 మందికి తక్కువగాకుండా చేరి వకటిగా తెప్పించుకొంటే వక నెల పోస్టు ఫ్రీగా నున్ను వక నెల బేరింగు పోస్టుగా నున్ను అంపించడమవును.''

(పుస్తకం-1, సంచిక-7 1842 జూలై 21)

1842• నుంచి వర్తమాన తరంగిణి కనీసం ఒక దశాబ్దం పైగానే చక్కగా నడిచింది. సయ్యద్ రహమతుల్లా నుండి దీనిని పువ్వాడ వెంకటరావుగారు కొనుక్కున్నట్టున్నారు. ఆయన 1847 నుండి 1852 దాకా బ్రౌను దొరగారికి వివిధ కాలాలలో వ్రాసిన ఉత్తరాలవల్ల ఆయన ''వర్తమాన తరంగిణి యెడిటరు'' అన్న సంగతి స్పష్టమవుతోంది. ఈ పత్రిక ఆదిలో చక్కని సమకాలిక ప్రాంతీయ రచనలు ప్రచురిస్తూ ఉండేది. అయితే రాను రాను గడ్డు గ్రాంథికం కాకపోయినా కొంచెం కఠినమైన శైలిలో రాయడం ప్రారంభించింది. తెలుగువారి విద్యాభివృద్ధినే ఆశయంగా భావించడం వల్ల వర్తమాన తరంగిణి పాఠశాలను కూడా స్థాపించింది.

''ప్రకృతమందు మన రాజ్యమునకు అన్యవిద్యయైన యింగిలీషు విద్య వ్యాపించియున్నదానికి షోడశాంశమైన స్వదేశ విద్యలు వ్యాపించియుండలేదు గనుక నటువంటి లోపమును పోగొట్ట తలచి యీ రాజధానిలో గవర్నమెంటువారు నిర్ణయించియున్న యూనివర్సిటియనే పాఠశాలలోనేమి పచ్చప్పగారి పాఠశాలలోనేమి స్వదేశ విద్యలను కూడా జెప్పించగలందులకు నిష్కర్ష చేసియున్నప్పటికిన్ని ఆ పాఠశాలలయందు యింగిలీషు విద్యే విశేషముగా ఉన్నదని కొందరు బుద్ధిమంతులు యోచించి మాస నిష్కర్షగా కొంత ధనమును పుచ్చుకొనేలాగున స్వదేశ విద్యల యొక్క కొన్ని పాఠశాలలను స్థాపించియున్నారు.'' (ఎమ్.420)

విద్యాభివృద్ధికి ఆనాటి పత్రికలు ఎలా పాటుపడేవో తెలుసుకొంటే సంతోషం కలుగుతుంది. ఆ సదాశయాలు ప్రశంసనీయాలు. సమకాలిక పత్రికల అభిప్రాయాలను పొందుపరుస్తూ పత్రికాధిపతుల కర్తవ్యాన్ని చాటి చెప్పే ఈ కింది వాక్యాలు గమనించదగ్గవి.

''మేలు చేసినవానికి కీడు చేయడము వలన జయము గలుగుచుండెడి యీ దుష్కృత కాలమునందు హిందూల కిటువంటి బుద్ధిగలిగియున్నట్టయిన యింగిలీషువారి

ప్రభుత్వమేల యీ దేశమునందు స్థిరపడియుండును. మా సమానవృత్తి నవలంబించి యుండెడి సరిక్యూలేటరు పత్రికాకారుడు దెలియజేసిన ప్రకారము కిరస్తు మతస్తులు చేయుచుండెడి యక్రమములు వక్కాణింప శక్యము లేకనున్నవి.

అవి యనగా - ఈ యింగిలీషువారు చేసిన మోసములు తంత్రములు దుర్మార్గములు మొదలయినవి. యంగులాండు-ఫ్రాన్సి-జర్మాని-స్కాట్లెండు మొదలగు దేశ చరిత్రల యందు వ్రాసియుండుటను యెల్లవారు చూచియుండలేదా! హిందూ రాజులతో జేసికొనిన యొడంబడికెల నతిక్రమించి మిత్రద్రోహము చేత వారి సంస్థానములను నాశనముచేసిన సంగతి పోయిన సంవత్సరము ఏప్రిల్ నెలలో హానరేబిల్ కోర్టాఫ్ డిరక్టరుల వారి యెదుట మేస్టరు సలివెన్‌గారు చేసిన ప్రసంగము దృష్టాంతముగనుండలేదా - దుష్కృతపుంజములుగా నుండెడి కిరస్తు మతస్తులు లజ్జావర్జితులై హిందూలయందు దోషారోపణము చేయడము తిన్న యిల్లు గుద్దలించేనన్న చందముగా నుండును -

కాబట్టి పత్రికాకారులు తమ యభిప్రాయములను దెలియజేయడమందు లోకులయొక్క సుగుణదుర్గుణములను చక్కగా నాలోచించవలసినది ధర్మము.''

ఆంగ్లేయుల పాలన, మిషనరీల ప్రవర్తనల గురించి కూడా వర్తమాన తరంగిణిలో చాలా తీవ్రమైన అభినివేశంతో రాసేవారు. ఉదాహరణకు ఒక వ్యాసభాగం చూడండి.

''సుమారు 250 సంవత్సరముల క్రిందట యీ యింగిలీషువారీ హిందూదేశము నందు వర్తకము చేసికొని జీవించెడి కొరకు వచ్చియున్నందున యప్పటి హిందూదేశపు రాజులు నిష్కపటులుగా నుండుటచేత తంత్రముగల యీ యింగిలీషు మనుష్యులు సదరు హిందూదేశపు రాజులచే ననేక సన్మానములను బొంది మిత్రద్రోహము చేయుట కారంభించి మాయోపాయములచేత గొన్ని యధికారములను సంపాదించుకొని యీ దేశమునందు తామే ప్రభుత్వముచేయుటకు జేసిన కృతి ఫలితమైన పిదప ప్రజా వశీకరణముకొరకు పూర్వపు రాజులకంటే తమ ప్రభుత్వము మిక్కిలి నీతిగలదిగా నున్నట్టు కొంతకాలము గనుపరచుచు వచ్చి యతియాశ గలవారై తమ ప్రభుత్వము నెల్లప్పటికి యీ హిందూ దేశమునందు స్థిరపరచవలయునని తలచి యటుల జేయుట కాధార మెద్దియని దీర్ఘాలోచనము చేసి తమ మతము నీ దేశమునందు వ్యాపింపజేసిన పక్షంబున తమ దొరతనము బలపడుటకు సాధకముగా నుండునని నిశ్చయించి యాకార్యము నిర్విఘ్నముగ నెరవేరునటుల సదరు హిందూదేశీయుల ద్రవ్యమును వారి స్వాతంత్ర్యములను హరించుటకు క్రమక్రమముగా నొడ్డుచు వచ్చిన యురులను హిందువులు సడ్డసేయకుండినప్పటికి - మత విరోధములచే పూర్వపు హిందూదేశపు దొరతనములు మారిపోయిన సంగతిని పర్యాలోచనకు తెచ్చి వివేక జ్ఞానములేని హిందూదేశపు చిన్నవాండ్లక్కు తమ తమ ప్రభావము బోధించినట్టయినా తమ యభీష్టము సులభముగ లభించునని తలంచి మందమందలుగా మిషినేరి సమూహములనీ హిందూదేశము నందంతట వ్యాపింపజేసి యా మతాభిమానులయిన బహుమందిచే

నివ్వబడెడి చందాపైకము వలన పట్టణములు - పల్లెలు మొదలగు స్థలములయందు మిషినేరి పాఠశాలలను స్థాపింపజేసియుండుటచే నా పాఠశాలలు అజ చర్మము గప్పుకొనియున్న వ్యాఘ్రములనే సంగతి హిందూలు తెలిసికొనక తమ చిన్నవాండ్ల నచ్చటికి బంపుట వలన స్వమతమునందు జ్ఞానశూన్యులయిన బాలురకు మిషినేరులు తమ మత విషయమును బోధించి మిథ్యామతులుగా జేసి కొన్ని మోసముల చేత కిరస్తు మతములో జేర్చుకొనుచున్నారు. యిది సకలమైన వారికి దెలియని విషయము కాదు''

హిందువుల పత్రికలు ఈ విధంగా రాస్తూ వుంటే మిషనరీలు ఊరకనే చూస్తూ కూర్చొనలేదు. తమకు తోచిన విధంగా తమ భావ ప్రచారం చేసుకొన్నారు. దానికి అనువుగా పత్రికలను కూడా ఉపయోగించుకొన్నారు.

బందర్‌లో ఎడ్మండ్ షార్కీగారు 1848 నుండి ''హితవాది'' అనే సచిత్ర మాసపత్రికను నడిపారు. పధ్నాలుగు సంవత్సరాల పాటు దీనిని (1882 దాకా) తీసుకువచ్చారు. ప్రచురణ బందరు నుంచి అయినా ముద్రణ మద్రాసులోనే జరిగేది.

ఆ రోజుల్లో తెలుగు జిల్లాలలో ముద్రాక్షరశాలలు ఒక్క బళ్ళారిలోనూ, విశాఖపట్నం లోనూ తప్ప మరెక్కడా లేవు. జిల్లాలలో అచ్చుకూటాలు ఏర్పడ్డాక ఇతర పత్రికలు వెలువడసాగేవి.

1832 నుంచి 1848 దాకా నాలుగంటే నాలుగే తెలుగు పత్రికల గురించి చరిత్ర తెలుస్తూంది.

1832 మద్రాసు క్రానికల్
1838 వృత్తాంతిని
1842 వర్తమాన తరంగిణి
1848 హితవాది

ప్రప్రథమ భారత స్వాతంత్ర్య సమరం జరిగిన 1857తో కుంఫిణీ యుగం ముగిసింది. తరువాత వచ్చిన మార్పులవల్ల పత్రికారంగంలోనూ మార్పులు సహజంగా వచ్చాయి. ఉత్పత్తి సాధనాలలో అభివృద్ధి కనబడితే ఉత్పత్తిలో కూడా పెరుగుదల ఉంటుంది.

తొలి తెలుగు యెడిటర్లు

ఇవాళ ''పత్రికా సంపాదకుడు'' అన్న పదబంధం మనకందరికీ సుపరిచితమైనదేగాని కుంఫిణీ యుగంలో మొట్టమొదటి పత్రికలు వెలువడినప్పుడు వాటికి ''యిడిటరు'' లేక ''యెడిటరు'' అనే పేరుతోనే సంచాలకులు ఉండేవారు. ఇంగ్లీషు పదాన్నే నాడు వాడుకొనేవారు. ఆనాటి ఎడిటర్ల గురించి తెలియవచ్చినన్ని వివరాలు చెప్పుకొనడం చరిత్రకు అవసరం.

1832లో ''మద్రాసు క్రానికల్'' అనే పేరుతో తెలుగు, తమిళ భాషలలో ఒక పత్రికను వెలువరించాలని నలుగురు నేటివు పెద్దమనుష్యులు గవర్నరుగారికి అర్జీ పెట్టుకొన్నారు. ఆ పత్రిక వచ్చిందో లేదో, వస్తే దానికి ''యెడిటరు'' ఎవరో ప్రస్తుతం లభించే ఆకరాలవల్ల విశదం కాదు. అర్జీదార్లలో ఒకరైన కాన్‌స్టాంటైన్ శాంపీ ముద్రాపకుడు. మిగతా ముగ్గురిలో ఇటీవలి పరిశోధనవల్ల విశాఖ పెరుమాళయర్ తమిళ పండితుడని తెలుస్తుంది.[1] ''మద్రాసు క్రానికల్'' ఒకవేళ ప్రచురితమైతే దాని తమిళ శాఖకు ఈయన ''యెడిటరుగా'' ఉండి ఉండవచ్చు. తెలుగు యెడిటరు పేరు ఊహించడానికి కూడా ఆస్కారం ప్రస్తుతం లేదు.

మండిగల వెంకట్రాయశాస్త్రి

1839లో ప్రచురణ మొదలైన ''వృత్తాంతిని'' మనకు తెలిసిన మొదటి పత్రిక. దీని యెడిటరు పేరేకాక వారి వివరాలు కొన్ని తెలియవస్తున్నాయి. ''లోక వ్యవహారములను తెలియజేయడమే లౌకిక జ్ఞానమనంబడును. అట్టివానికి వర్తమాన పత్రిక 'కారణభూతమ''నియు ఈయన విశ్వాసం. ఆ ఆశయంతోనే వృత్తాంతిని ఆయన ఎడిట్ చేసేవారు. అయితే అది ''అభిమాన సంపత్తి'' లేక నిలిచిపోయింది. ''మన మద్రాసు గవర్నమెంటు తాలూకు అన్ని జిల్లాలలోనున్ను వ్యాపించియుండే ఆంధ్ర భాషయందు ప్రచురపడుచు నుండిన వృత్తాంతి పత్రిక యొక్క జీవనదశలో దాని ప్రయోజనమునకు సంభవించిన విఘాతము గోచరమై వ్యసనపడనివారు తరచుగా వుండిరని నమ్మకూడలేదు'' అని వెంకటరాయశాస్త్రిగారు ఉత్తరోత్తరా ఒక లేఖలో వర్తమాన తరంగిణి యెడిటరుగారికి రాశారు.

వృత్తాంతినికి చాలామంది పాఠకులు ఉత్తరాలు రాస్తూ ఉండేవారు. ఆ బుద్ధిమంతులకు తమ పత్రిక కూడా అటువంటి లేఖలు ''మత సంబంధ వాదములున్ను, పరస్పర దూషణములున్ను యెుకమాత్రము లేనివి'' రాయాలని వర్తమాన తరంగిణి కోరుకొంది.

---

1. ద ఇంగ్లీష్ ఆన్యువల్ రిపోర్ట్ ఫ్రమ్ ద గవర్నర్స్ ఆఫ్ ద మెడ్రాస్ యూనివర్సిటీ 1848-49 అనే నివేదికలోని జాబితాలో తమిళ పండితుని పేరు విజగ పెరుమాళ్ అయ్యర్ అనే విషయం కనబడుతుంది. చూ. బ్రౌన్ జాబులు – తెలుగు జర్నలిజం చరిత్ర – బంగోరే. నెల్లూరు. 1973. పుట.65

వృత్తాంతిని సాంఘిక విషయాలను, సాహిత్య సమాచారాలను, సమకాలిక చరిత్రల రచనలు ప్రచురించేది. మండిగల వెంకట్రాయశాస్త్రిగారు తాము ఎడిటరుగా ఉన్నప్పుడు నీలగిరి చరిత్రలో కొంత భాగము సదరు పేపరులో ప్రచురించారు. ''బహు'మంది చందాదారులు అది బహు అతిశయముగా ఉంద''ని మెచ్చుకొనడంవల్ల ఆగిపోయిన ఆ చరిత్రను తిరిగి ''వర్తమాన తరంగిణి''లో ప్రచురించమని కోరారు. ''దైవీక, రాజీక లౌకికాతిశయము''లనున్ను ప్రచురించాలని వారి ఉద్దేశం.

మండిగల వెంకట్రాయశాస్త్రిగారి ఊరు బహుశా కడప కావచ్చును. ఆ ''షహరు'' ''మొకాం''గా 1842లో వారు చెప్పుకొన్నారు. ఎడిటోరియా బాధ్యతల నుండి విశ్రాంతి తీసుకొన్నా అక్కడ జరిగే కొన్ని సంగతులను ఆయన కడప నుంచి పత్రికలకు పంపేవారు.

సయ్యదు రహీమతుల్లా సాహిబు

వృత్తాంతినికి ఆ తర్వాత వచ్చిన తెలుగు పత్రిక వర్తమాన తరంగిణి. దీని తొలి సంచికల్లో ఆ ''పత్రిక యెడిటరున్ను ప్రొప్రయిటరున్ను'' తానే అని ఈయన ప్రకటించుకొన్నాడు. ఈయన ''నామకేవాస్తి'' యెడిటరో, నిజంగా తెలుగులో రచనలు చేసేవాడో, కనీసం తన ఉద్దేశాలు చెప్పి రాయించుకొనేవాడో తెలియదు. ఈయన కొద్దికాలంపాటే ఈ హోదాలో ఉన్నాడు. తర్వాత యాజమాన్యం మారింది.

పువ్వాడ వెంకటరావు

వర్తమాన తరంగిణికి నాలుగు కాలాలపాటు పర్మనెంటు ఎడిటర్‌గా పనిచేసిన వ్యక్తి పువ్వాడ వెంకటరావుగారు. ఈయన ''ఉత్తమ పండితు''లని పూర్వపు యెడిటరు మండిగల వెంకట్రాయశాస్త్రిగారు ప్రశంసించారు. ''ఈ పత్రికకు అనంతరము తమరే యెడిటరుగానున్న పక్షమునందు యీ పత్రిక పురోభివృద్ధి కలిగి బాగా జరిగివచ్చున''ని ఆయన దీవించారు. అలాగే జరిగింది. 1842 నుండి ప్రస్తుతం లభిస్తున్న ఆకరాలనుబట్టి, కనీసం 1858 దాకా ఆయన వర్తమాన తరంగిణిని నడిపేవారని ఊహించవచ్చు.

పత్రికకు యెడిటరుగానే కాక దాని ప్రొప్రయిటరుగా కూడా ఆయనే ఉండేవారు. 1853లో పువ్వాడ వెంకటరావు అండ్ కంపెనీ అన్నది ఉండేది. దాని తరపున వెంకటరావుగారు వర్తమాన తరంగిణినేకాక చాలా గ్రంథాలను ప్రచురించేవారు. జ్యోతిష్కళానిధి ముద్రాక్షరశాల ప్రొప్రయిటరు ఆలూరి ఏకామ్రనాథ జోస్యులవారితోనూ, దూర్వాసుల జగన్నాథ సుబ్బారావు అండ్ కంపెనీతోనూ భాగస్వాములై వెంకటరావుగారు ఆంధ్ర మహాభారతం 18 పర్వాలను అచ్చువేశారు.

1847లో బ్రౌను దొరగారి ''స్వంత ఆఫీసు తాలూకు తెలుగు పుస్తకములను అచ్చువేయించతలచియున్న పక్షమునకు అనుజ్ఞ దయ చేయిస్తే - విశేష ఖర్చులు తగులబడి కాకుండా అచ్చు తయారుచేయించ''డానికి వెంకటరావుగారు సిద్ధంగా ఉన్నట్టు ఒక లేఖలో చెప్పారు.

కేవలం సాహిత్య గ్రంథాలనేకాక ''పౌజుదారీ అదాలత్ కోర్టుయొక్క సరిక్యూలరువులు'' (1846), రివిన్యూ బోర్డు సరిక్యూలర్ ఉత్తరువులు (1853), అదే రివిన్యూ బోర్డువారి ఉత్తరువులు (1856) మొదలైన వాటిని పువ్వాడ వెంకటరావు అండ్ కంపెనీ ప్రచురించేది. ఈ గ్రంథాల ముద్రిత ప్రతులు లండన్‌లోని ఇండియా ఆఫీసు లైబ్రరీలో ఉన్నాయి. (తెలుగు-సి-466, తెలుగు-డి-62)

''లేట్ కర్నల్ మెకంజీ గారు తయారుచేసిన కలెక్షన్‌లో నుంచి పూర్వ వృత్తాంతములు పూర్వ చరిత్రలు పూర్వం రాజ్యం చేసిన రాజుల పేర్లు కయిఫియ్యతులు వగయిరాలు వ్రాయించిన బుక్కు యొక్క యిండిక్సును'' కూడా 235 పుటల గ్రంథంలో పువ్వాడ వెంకటరావుగారు ప్రచురించారు. దీని ప్రతి కూడా లండన్‌లో పై గ్రంథాలయంలోనే ఉంది. (ఒ.ఆర్.9672)

మండిగల వెంకట్రాయశాస్త్రిగారు ఆశించినట్టు ''దైవీక, రాజీక, లౌకికాతిశయాల'' విషయంలో పువ్వాడ వెంకటరావుగారు కనీసం ఒకటిన్నర దశాబ్దాలపాటు ''యెడిటరుగా, ప్రొప్రయిటరుగా'' బహుళార్థ సాధకాలయిన గ్రంథాల ప్రచురణ'' కర్తగా తెలుగు వారికి సేవ చేశారు. ఈయనకు విశాఖపట్నంలో బంధువులో, స్నేహితులో, అభిమానులో ఉండేవారు. బహుశా ఆ ఊరికీ ఈయనకూ సంబంధం ఉందేమో. తనకు విశాఖపట్నం నుండి వచ్చిన కమలా ఫలాలలో కొన్నింటిని ఆయన బ్రౌను దొర గారికి 1852 డిశంబరు 7వ తేదీనాడు పంపించుకొన్నారు.

బ్రౌను దొరగారూ, పువ్వాడ వెంకటరావుగారూ ఇద్దరూ సఫలులే.

జాన్ ఎడ్మండ్ షార్కీ (1821–1887)

తెలుగుగడ్డమీద మొదటి తెలుగు పత్రికను స్థాపించిన ఘనత బహుశా జాన్ ఎడ్మండ్ షార్కీ అనే ఆయనకు చెందుతుంది. ఇతడు పరంగీ యువకుడు. నేడు ఆంగ్లో ఇండియన్లని మనం వ్యవహరించే వాళ్ళను ఆనాడు ''పరంగీ''లని పిలిచేవాళ్ళు. షార్కీ తండ్రి పేరు ఫిలిప్. ఆయన బందరు సర్కారులో సదరు అమీనుగా ఉండేవాడు. జాన్ ఇతని పెద్ద కొడుకు. 1821 జూలై మొదటి తేదీన పుట్టాడు. చెన్నపట్నంలో చదువుకొన్నాడు. క్రైస్తవ పాఠశాలలో 1843వ సంవత్సరంలో తెలుగు పరీక్షకు హాజరయ్యాడు. అతని స్వచ్ఛమైన ఉచ్చారణకూ, ఉదాత్తమైన భాషకూ పరీక్షాధికారులు పొంగిపోయారు. క్రైస్తవ మతబోధకు షార్కీని నియోగించారు. అప్పటికి అతనికి 22 సంవత్సరాలు.

యౌవనపు ఉత్సాహంతో షార్కీ బందరులో క్రైస్తవబోధ మొదలుపెట్టాడు. రాబర్ట్ నోబుల్‌తో కలసి పాఠశాలను నడిపాడు. ఇదే ఉత్తరోత్తరా నోబుల్ కళాశాల అయింది. మత బోధతోపాటు ఆంధ్ర సాహిత్య పఠనాన్ని కూడా షార్కీ కొనసాగించాడు. మతవిషయాలను తనతో ముచ్చటించడానికి వచ్చిన వాళ్ళతో సంస్కృతం, తెలుగు మాట్లాడేవాడు. వాళ్ళ దగ్గర ఎన్నో నేర్చుకొనేవాడు. 1848 ఆగస్టులో షార్కీ ''హితవాది'' అనే పత్రికను స్థాపించాడు. అప్పటికి అతని వయసు 27 సంవత్సరాలే.

ఆ వయసులోనే షార్కీ ఆంధ్రసాహిత్య పరిశోధనలు చేశాడు. తెలుగు పండితులకు జీతమిచ్చి ఎన్నో గ్రంథాలు వ్రాయించేవాడు. బుర్రా శేషాచల శాస్త్రి అనే పండితుడు షార్కీ గారి వద్ద సంస్కృతాంధ్ర గ్రంథాలకు ''సూచి మొదలైన వచన రూపకాలు'' చేస్తూ ఉండేవాడు.[2] ఇటువంటి విద్వాంసులు ఇంకెందరు షార్కీ దగ్గర వున్నారో, ఎన్ని గ్రంథాలు సంకలనం చేశారో తెలియదు. అయితే ఆ పుస్తక సంచయమంతా గంగపాలవడం దురదృష్టం. 1884లో బందరుకు తుఫాను దెబ్బ తగిలింది. ఆ గాలి వానలో షార్కీ గారి అమూల్యగ్రంథాలు, వ్రాతప్రతులు అన్నీ కొట్టుకుపోయాయి.[3] సంస్కృతాంధ్రాలలో ఆయన చేసిన ఇరవై సంవత్సరాల కృషి ఇలా నామరూపాలు లేకుండా నాశనం కావడం చాలా శోచనీయం. షార్కీ స్థాపించిన పత్రిక ప్రతులు కూడా వెతికినా గాని భారతదేశంలో దొరకవు. అయితే బ్రిటీషు మ్యూజియం[4]లోని గ్రంథాలయంలో మాత్రం కొన్ని ప్రతులు దొరుకుతాయి. ఈ హితవాది పత్రిక కాపీలు మాత్రమే కాదు, షార్కీ వ్రాసిన కొన్ని క్రైస్తవ గ్రంథాలు కూడా ఇంగ్లండులో ఉన్నాయి. మత ప్రచారంలో రాబర్ట్ నోబుల్‌తో కలిసి తెనిగించిన ''సామాన్య ప్రార్థన - దావీదు కీర్తనలు'' అనే గ్రంథం కూడా అదే గ్రంథాలయంలో ఉంది.[5] బైబిలులోని కొన్ని కథలను తీసుకొని షార్కీ తెలుగులో రచించాడు. ''నూతన నిబంధన గ్రంథములోని కథలు'' అనే పుస్తకం కూడా బ్రిటీషు మ్యూజియం గ్రంథాలయంలో ఉంది.[6]

స్త్రీ జనోద్ధరణ కోసం షార్కీ తన భార్యతోపాటు చాలా కృషి చేశాడు. హిందూ వనితల స్థితిగతులను మెరుగుపరచడానికి సాహిత్యం ఒక సాధనమని భావించి నవలలాంటి ఒక కథను షార్కీ తెనిగించాడు. అన్నా కేథరీన్ ముల్లెన్ అనే మహిళ ఇంగ్లీషులో రచించిన గ్రంథాన్ని ''పుల్మనీకరుణలచరిత్ర'' అనే పేరుతో షార్కీ తెనిగించి ప్రచురించాడు. 211 పుటల ఈ గ్రంథం 1858లో ముద్రితమైంది. దీనిని నవలగా పరిగణించితే ఇదే తెలుగులో ఆంగ్ల ప్రభావం వల్ల ఆ ప్రక్రియలో వెలువడిన తొలి రచనగా స్వీకరించవచ్చు. నరహరి గోపాలకృష్ణమశెట్టి గారి ''శ్రీరంగరాజచరిత్ర'' 1872లోనూ, కందుకూరి వీరేశలింగంగారి ''రాజశేఖర చరిత్ర'' 1878లో ప్రచురితమయ్యాయి. ''పుల్మనీ కరుణల చరిత్ర'' ప్రతి ఒకటి బ్రిటీషు మ్యూజియం లైబ్రరీలో ఉంది. దీనిని ఇతర రచనలతో తులనాత్మకంగా పరిశీలించడం అవసరం.

మిషనరీలు పత్రికలు నడపడంతోపాటు కథా వాఙ్మయం కూడా ప్రారంభించారనుకోవచ్చు.

---

2. బ్రౌను లేఖలు - సంపుటం 15 - పుట.32
3. సి.యల్.యస్. స్టోరీస్ ఆఫ్ తెలుగు చర్చ్ ఫౌండర్స్ నె.8 బై కానన్ యఫ్.యఫ్. గ్లెడ్‌స్టోన్ - ద క్రిస్టియన్ లిటరేచర్ సొసైటీ ఫర్ ఇండియా, పార్క్ టౌన్, మెడ్రాస్ - 1941.
4. కాటలాగ్ ఆఫ్ ద తెలుగు బుక్స్ ఇన్ ద లైబ్రరీ ఆఫ్ ద బ్రిటీష్ మ్యూజియమ్ బై యల్.డి. బార్నెంట్. పేజ్.151.
5. అదే కేటలాగు - పుట. 108
6. అదే కేటలాగు - పుట. 38

రివరెండు పీటర్ పర్సివల్

తెలుగు పత్రికలను నడిపిన మిషనరీలు మరికొందరు కుంఫిణీ యుగంలో ఉన్నారు. చెన్నపట్టణం ప్రెసిడెన్సీ కాలేజీ దేశభాషల విభాగంలో ఆచార్యుడుగా ఉన్న రివరెండు పీటర్ పర్సివల్ 1855లో ''దినవర్తమాని'' అనే పత్రికను తమిళంలో ప్రారంభించాడు. 1856 నుండి దీనిని తెలుగులో కూడా ప్రచురించేవారు. పర్సివల్ తమిళంలో రాసిన వాటిని ఆయన సహాయకుడెవరో తెలుగు చేసేవాడు. ఈ సహాయకుని పేరు వెల్లడి కాలేదు. తెలుగు దిన వర్తమానిలో అనువాదమయ్యే విషయాలలో ఘోరమైన పొరపాట్లు ఉండేవి. వాటిని సర్కారు వారి చీఫు సెక్రటరీ గారి దృష్టికి జిల్లా అధికారులు తెచ్చేవారు. ఈ పత్రిక సర్కారు వారి ప్రాపకంలో వెలువడేది కనుకనే తప్పులు ఎత్తి చూపడం అధికారులకు అవసరమైంది. దినవర్తమాని గురించి ఇతర వివరాలు ఇంకా లభించలేదు.

యెడిటర్లను సంపాదకులనే పదం ఎప్పుడు ప్రాచుర్యానికి వచ్చిందోగాని పర్సివల్ మాత్రం ఒక రకం సంపాదకుడు.

1853లో సి.పి. బ్రౌను దొరగారు ఇంగ్లీషు మాటలకు తెలుగు అర్థాలను చెప్పే నిఘంటువులో ''యెడిటరు'' అనే మాటకు అచ్చు వేయడానకు గ్రంథమును సవరించి యిచ్చేవాడు,'' ది ఎడిటర్ ఆఫ్ ది పేపర్ క్వారల్డ్ విత్ ద ఓనర్'' అనే వాక్యానికి ''ప్రసిద్ధ పత్రికను అచ్చుకు సవరించి యిచ్చేవాడికిన్ని, రూకలు పెట్టి కాగితము వేయించే వాడికిన్ని వివాదము జరిగినది'' అని చెప్పారు.

బొంబాయిలోని మరాఠీ పత్రికలలో ఎడిటరును కర్త అని పిలిచేవారట. ''ఎడిటోరియల్ రిమార్క్స్'' అనే పదబంధానికి ''వ్యాఖ్యాత చెప్పిన మాటలు'' అనే అర్థం ఇచ్చారు.

బ్రౌనుదొరగారి కాలంలో ఎడిటర్ అనే ఇంగ్లీషు పదానికి సరిపోయే పదం ఏదీ లేదని తెలుతోంది. పి. శంకర నారాయణగారి నిఘంటువులో కూడా ఎడిటర్ అన్నమాటకి అచ్చు వేయుటకు గ్రంథమును సవరించి ఇచ్చేవాడు, ''వార్తాపత్రికాధిపతి'' అనే అర్థాలిచ్చారు.

బహుజనపల్లి సీతారామాచార్యులుగారు తమ శబ్దరత్నాకరంలో సంపాదకుడు అనే పదానికి సంపాదించువాడు అనే అర్థం మాత్రం ఇచ్చారు.

కుంఫిణీ యుగం తొలి తరం పత్రికలకు ''యెడిటర్'లే కాని ''సంపాదకులు'' లేరు.

చిన్నయసూరి పెద్దరికం

సర్వసామాన్యంగా లోకులు తమకు పదహారోయేడు వచ్చేసరికి ప్రాథమిక విద్యను పరిపూర్తి చేసుకొనడం పరిపాటి. అయితే ఒక అసాధారణ వ్యక్తి తన పదహారో యేట అక్షరాభ్యాసం మొదలుపెట్టి ఇసుకలో గుంటోనమాలు దిద్దడం ప్రారంభించాడట. కుశాగ్రబుద్ధి కనుక అతనిలో విద్యాబీజాలు ''దున్నక జల్లితే'' - కొయ్యక పండినట్టు'' అచిరకాలంలోనే పంటకు వచ్చాయట. ఇతని పేరు పరవస్తు చిన్నయ్య. శ్రీ పెరంబూదూరు వాస్తవ్యులైన పరవస్తు వెంకట రంగ రామానుజయ్యా గారికి ఈ చిన్నయ్యా లేక లేక పుట్టిన మగ బిడ్డ. కానక కన్న సంతానం కనుక గారాబంగా ఆటపాటలలోనే తప్ప చదువు సంధ్యలలో చిన్నయ్యా పెరగలేదు. పెరిగీ పెరగగానే పెద్ద చదువులు అబ్బేటంత కృషి కొద్దికాలంలోనే చేయగలిగాడట. ఈ ''అట''లన్నీ చిన్నయ - చిన్నయసూరిగా ప్రసిద్ధుడైన తొంభై ఏళ్ళ తరువాత ఆయన బంధుకోటిలోనివారైన నారాయణవనం-కూ వకుళా భరణం''గారు కథనం చేసిన విషయాలు.[1]

పరవస్తు వెంకట రంగమానుజయ్యాగారు ఎప్పుడు శ్రీ పెరంబూదూరు విడిచిపెట్టి చెన్నపట్టణం చేరుకొన్నారోగాని గాజుల లక్ష్మీనరసుశెట్టి (1806-1868) గారి ప్రోద్బలంవల్ల ఈస్టిండియా కుంఫిణీ వారి సదర్ అదాలత్ కోర్టులో పండిత పదవిలో నియమితులయ్యారట. వాస్తవానికి లక్ష్మీనరసుశెట్టిగారు వెంకటరంగ రామానుజయ్యా గారికన్నా వయసులో చాలా చిన్నవారు. చిన్నయ పుట్టిన 1808 ప్రభవ నామ సంవత్సరంలోనే శెట్టిగారుకూడా పుట్టారు. కుమారుని ఈడువారైన శెట్టిగారు రంగరామానుజయ్యా గారికి ఉద్యోగం వేయించారంటే నమ్మడం కష్టమైనా అసంభవం కాకపోవచ్చు. అయితే శెట్టిగారికిగానీ చిన్నయ్యాకు గానీ యుక్తవయసు వచ్చే 1832 ప్రాంతాలకు రంగరామానుజయ్యా గారికి వయస్సుచాలా మళ్ళింది. శతవృద్ధులు. ఆయన 1836లో చనిపోయారు. అప్పటికి ఆయన వయసు నూటపది సంవత్సరాలట. అంటే చిన్నయ వీరికి తమ 78వ సంవత్సరంలో పుట్టారనుకోవాలి. ఆయన వాస్తవంగా నూట పది సంవత్సరాలు బతికి 1836లో మరణిస్తే ఆయన జననం 1826 అని లెక్కతేలుతుంది.

రంగరామానుజయ్యా గారికి చిన్నయ్యా ఒక్కడే సంతానం కాదు. ఒక కుమార్తె కూడా ఉంది. దురదృష్టవశాత్తూ ఆమె బాలవితంతువయింది. మగ సంతానం లేనందున రంగరామానుజయ్యాగారూ, భార్య శ్రీనివాసమ్మ చేయని పూజలు, నోచని నోములు ఉండవు. వారి బంధుకోటిలోని వారు చెప్పుకొనే కథలనుబట్టి ''ప్రతివాద భయంకరం శ్రీనివాసాచార్యులుగారు ఈ దంపతులచేత ''పుత్రకామేష్టి' లాంటి హోమం చేయించాక చిన్నయ్యా పుట్టాడట. పుట్టినప్పుడే ఆ శిశువు కుడికంట్లో నల్లగుడ్డు కొంచెం స్థలం మారి ఉంది. పెద్దయ్యాక చిన్నయ్యా దృక్పథం వేరవడంలో ఆశ్చర్యం లేదు!

---

1. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక - సంచికలు, సంపుటి 4 (1931)లో ''పరవస్తు చిన్నయసూరిగారి జీవితం'' అనే చిన్న వ్యాసాన్ని ఈ నారాయణవనము - కూ -వకుళాభరణముగారు రాశారు. ఈయన మదరాసు కోమలేశ్వరంపేట కార్పరేషను స్కూల్లో ఉపాధ్యాయులు.

బంధుకోటిలోనివారు సూరిగారి గురించి చెప్పుకొనేవి కట్టుకథలైనా, గట్టి కథలైనా రంగరామానుజయ్యగారు చెన్నపట్టణంలోని న్యాయస్థానంలో పండితుడు. ఆయనకు తమిళ, తెలుగు, ప్రాకృత గ్రంథాలలోనూ, వ్యాకరణంలోనూ, వృత్తిరీత్యా ధర్మశాస్త్రాల లోనూ ప్రావీణ్యం ఉంది. చిన్నయ్య తన బాల్యంలో బాల రామాయణం, అమరం, శబ్దాలు, ఆంధ్ర నామ సంగ్రహం చదువుకొన్నాక తండ్రి దగ్గర నేర్చుకోవలసినవన్నీ అభ్యసించాడు. కంచి రామానుజాచార్యుల వారి వద్ద తర్కం, మీమాంస, అలంకారాలు చదువుకొన్నాడు. అంతేకాక తండ్రిగారి దగ్గరున్న ధర్మశాస్త్రాలలో కేతన విజ్ఞానేశ్వరీయం వంటివి కూడా కూలంకషంగా పరిశీలించి ప్రయోగాలు గుర్తుంచుకొన్నాడు.[2] ఉత్తరోత్తరా తను రచించనున్న నిఘంటువు కోసం ప్రయోగాలను చిన్నయ్య చిన్నప్పుడే అన్వేషించసాగాడు.

తండ్రిగారి జీవిత కాలంలో చిన్నయ్య ఏ ఉద్యోగాలు చేశాడో తెలియదు. 1840లో ఆఫ్ఘన్ మిషను పాఠశాలలో 'కొద్ది వేతనమున' ఉపాధ్యాయులుగా ఉండేవారు. అయితే అప్పటికే వ్యాకరణ రచన చేయాలనే కోరికే ఆయనలో ఉంది. ''పద్యాంధ్ర వ్యాకరణం'' అనే రచన చేశారు. ఇందులోని 48 పద్యాలు మాత్రమే లభిస్తున్నాయి. దొరికినంత మటుకు ఈ గ్రంథంలోని పద్యాలను ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు ప్రచురించారు.[3] మిగతా గ్రంథం ఎవరివద్దనైనా ఉంటే, దానిని పంపిస్తే అంతా అచ్చువేస్తామని పరిషత్తువారు ప్రకటించారు. ఇప్పటిదాకా ఆ గ్రంథం బయటపడలేదు.

చిన్నయగారి పద్యాంధ్ర వ్యాకరణం ఆంధ్ర శబ్ద చింతామణికి పద్యబద్ధమైన అనువాదం. ఒక సంజ్ఞా పరిచ్ఛేదం మాత్రమే కొంతవరకు తెనిగించినట్టుంది. అప్పకవి పాఠాలనే స్వీకరించినా కొన్ని చోట్ల చిన్నయ్య స్వతంత్రించాడు. ఆధునిక వ్యాకరణాలు పద్యాలలో చెప్పడం సమంజసం కాదనుకొని దీనిని నిలిపివేసి ఉంటాడు. అప్పటికే తెలుగులో వాక్య గ్రంథాలుగా ఎన్నో వ్యాకరణాలు వెలువడ్డాయి. తెల్లదొరలు సైతం తెలుగు వ్యాకరణాలు ఇంగ్లీషులో రాస్తున్నారాయె.

1840 ప్రాంతాలలో చెన్నపట్టణంలో వున్న ఏపాటి కవి పండితుడైనా బ్రౌను దొరగారి దృష్టిలో పడకుండా ఉండడు. ఆ వ్యక్తి దగ్గర ప్రాచీన గ్రంథాలు ఏమైనా ఉంటే వాటికోసం దొరగారు ప్రయత్నించకా మానరు. 1840లో బ్రౌను దొరగారు చిన్నయ్యను పిలిపించుకొని తమ సాహిత్య కార్యక్రమాలలో పరిష్కర్తగా నియోగించారు. ''పరవస్తు చిన్నయ్య, ద కాటనీ, ఎడిటర్ ఆఫ్ దశావతార'' అని దొరగారు ఒక దగ్గర చెప్పాడని పరిశోధకులు తెలియచేశారు.[4] ''ది ఎన్‌టైర్ గ్రామర్ ఆఫ్ తెలుగు'' అనే ఆంగ్ల గ్రంథంలో

2. నిడుదవోలు వెంకటరావు - బాల వ్యాకరణ పుట్టు పూర్వోత్తరాలు - భారతి (మే 1961) సంచికలోని ఒక అధోజ్ఞాపికలో ఇలా రాశారు. ''చిన్నయసూరి తన నిఘంటువు కొరకు విజ్ఞానేశ్వరము నుండి, యెన్నియో ప్రయోగములను సేకరించినాడు. ధర్మశాస్త్ర గ్రంథమగుటచేత అందలి పారిభాషిక పదములకు తెలుగున నే పదములు వాడినాడో తెలిసికొనుటకు మూలశ్లోకములు గూడ నుదహరించినాడు. సీతారామాచార్యులవారు శబ్దరత్నాకరమున విజ్ఞానేశ్వరము నుండి గ్రహించిన పదములన్నియు చిన్నయసూరి వ్రాసికొనినవియే కాని వేరు కావు. (పుట.67)

3. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక - సంపుటి 18, సంచిక.4 (1929)

4. డాక్టర్ ఆర్. పద్మావతి - ''బ్రౌను తెలుగు కావ్య సముద్ధరణము'' - 1986. పుట 283.

ఆంధ్ర వ్యాకరణాన్ని బ్రౌను దొరగారు రచించారు (డి.1330). 1837 మార్చి నెలలో ఈ రచనను ఆరంభించారు. ఈ గ్రంథంలోనే ''సాతాని చిన్నయ్యా'', 'దశావతార చరిత్ర ఎడిటరు' అని చెప్పారుగానీ వాస్తవానికి 1834 మార్చి నెల 14వ తేదీ నాటికి గరిమెళ్ళ వెంకయ్య దశావతార చరిత్ర పది ఆశ్వాసాలకు ''శ్రీ మహారాజరాజశ్రీ చార్లీసు ఫిలీప్పు దొరగారి అనుజ్ఞ చేతను'' సంపూర్ణంగా టీకను చెప్పాడు.

గరిమెళ్ళ వెంకయ్య చేత టీకను చెప్పించిన బ్రౌను దొరగారు ''సాతాని చిన్నయ్యా'' దశావతార పరిష్కర్త అని చెప్పారంటే బహుశా చిన్నయ్య 1834కి పూర్వం దొరగారి కొలువులో ఉండి వుండాలి. ఒకరికి అప్పచెప్పిన పని తమకు ఆమోదకరమైన పద్ధతిలో సాగకపోతే దానిని నిలుపుదల చేయించడం బ్రౌను దొరగారికి కొత్త కాదు. ములుపాక బుచ్చయ్యచేత వసుచరిత్రకు ప్రతి పదార్థ ప్రకాశిక (డి.760, 761) చెప్పించి ఆ పాండిత్యా ప్రకర్ష నచ్చక జూలూరి అప్పయ్యగారిచేత 1834లో వ్యాఖ్యానం రాయించారు. దశావతార చరిత్ర దొరగారికి చాలా ఇష్టమైన కావ్యం.

ఇందులోని అహల్యా సంక్రందన ఘట్టాన్ని ఆయన ఒక్క పద్యం విడవకుండా ఆంగ్లంలోనికి అనువదించారు. ధరణిదేవుల రామయ్య చెప్పిన దశావతార చరిత్ర ''ఎ పర్టిక్యులరీ డిఫికల్ట్ బుక్ బీయింగ్ ఎ మాస్టర్‌పీస్ ఆఫ్ పొయిట్రీ'' కనుక మొదట చిన్నయ్యను దీని పరిష్కరణకు నియోగించి వుంటారు. పదిహేను వందల పుటలలో, 5 సంపుటాలలో పేజీకొక పక్కనే గ్రంథాన్ని దొరగారు కాపీ చేయించారు (డి.520). పక్క పుటలలో పాఠభేదాలు, సవరణలు చేర్చారు. బహుశా ఇందులో ''సాతాని చిన్నయ్యా'' దస్తూరీ ఉందేమో పరిశోధించాలి. దశావతార చరిత్రకు అకారాది క్రమంలో పదసూచిని కూడా బ్రౌను దొరగారు సంపూర్ణంగా తయారు చేయించారు. ఇది 1085 పుటల గ్రంథం (డి.531). దీనిని 1850 ఏప్రిల్‌లో తయారుచేయించినట్టు పెన్సిలు నోటు దొరగారు రాశారు.

బ్రౌను దొరగారికి అత్యంత ప్రీతిపాత్రమైన దశావతార చరిత్ర పరిష్కరణలో చిన్నయ్యా పాత్ర ఎంతో తేల్చవలసిన సంగతి. ఇది భావి పరిశోధకులకు పని కల్పిస్తుంది.

అయ్యలరాజు రామభద్రుడు రచించిన ''రామాభ్యుదయం'' ప్రతులు చాలా అరుదుగా మొదట లభించేవి. ఎంతో ప్రయత్నించాక ఒకటి కాదు, రెండు కాదు, నాలుగు ప్రతులను బ్రౌనుదొరగారు ఉత్తరోత్తరా సంపాదించారు. వీటిలో ఒకటి చిన్నయ్యా ఇచ్చిన ప్రతి. ఇది అసమగ్రం. ఎక్కడ ఈ ప్రతిలోని గ్రంథం ఆగిపోయిందో దొరగారు నోటు చేశారు (డి.715). రామాభ్యుదయం 1840 నాటికి ఒక్కటే ప్రతి దొరికితే దొరగారి బ్రాహ్మణులు ఇది ఎందుకూ పొందని ప్రతి అని తిరస్కరించారు. 1850 నాటికి మరి నాలుగు ప్రతుల సాయంతో సంపూర్ణంగా రాయించారు. 1840-50ల మధ్య ఎప్పుడో చిన్నయ్య రామాభ్యుదయం ప్రతిని దొరగారికి ఇచ్చి ఉండవచ్చు. బహుశా 1849కి ముందే కావాలి. ఏమంటే 1849 నుంచి చిన్నయ్యను ''చిన్నయ సూరీ' అని పిలిచేవారు. ఆ గౌరవ సూచక పదం ప్రతిలోని పేరులో లేనందువల్ల కాలం తేల్చడంలో హద్దు ఒకటి తెలుస్తుంది.

ఆఫ్లను మిషను స్కూల్లో 1840 నుంచి ఎంతవరకూ చిన్నయ్య ఉద్యోగం చేశారో నికరంగా చెప్పలేం. 1842లో పచ్చయప్ప పాఠశాలను స్థాపించారు. పచ్చయప్పగారి వర్ధంతి నాడు ఏటా బ్రాహ్మణ సమారాధన, పండిత సభలు జరిపేవారు. ఈ సభలలో ఆనాటి కవి పండితులందరూ పాల్గొని సంభావనలు పుచ్చుకొనేవారు. వర్తమాన తరంగిణిలో ఒక సంవత్సరపు ముచ్చట ఇలా రిపోర్టు చేశారు.

''ప్రతి సంవత్సరమందు జరిగే ఆబ్దికము నాడు కవి సంభావనలిప్పించేటప్పుడా కవుల తారతమ్యతలను చక్కగా వివరించి వారి వారికి తగిన బహుమతినిప్పించుచూ వచ్చిరి. అయితే ఈ సంవత్సరమాలాగున జరగలేదు.''

''యెందుచేతనంటే ఆంధ్రమందు సాతాని చిన్నయ్య, తోట విజయ రాఘవులు నాయుడు, వీరాసామి నాయుడు యనే ముగ్గురు కవులకున్ను, 30-20-10 రూపాయల చొప్పున సంభావనలిప్పించి బహుదినముల నుండి విశేష ప్రయాసలకు లోబడి చదువుకొని శాస్త్రులు, పండితులని పేరు వహించి పేరుకు తగినట్టుగానే విశేష యుత్ప్రేక్షలతో సంస్కృత శ్లోకములను చేసిన కవివరులకు (బయనీని సుద్ధికి భారీశాలువ జోడు, విద్వాంసులకు బేడ వెలితిగుడ్డ అన్నట్టు) అయిదేసి రూపాయల చొప్పున సంభావన లిప్పించినారని వినుటకు మిక్కిలి చింతించవలసియున్నది'' (యమ్.420, పుట.322)

వర్తమాన తరంగిణిలో రిపోర్టుచేసిన ఈ సంగతి ఏ సంవత్సరంనాటిదో బ్రౌను కాపీ చేయించిన సంపుటాలలో స్పష్టంగా పేర్కొనలేదు. బహుశా 1844 నాటి ముచ్చట అయి ఉంటుంది. చిన్నయ్యగారు పచ్చయప్ప పాఠశాలలో పండితునిగా చేరకముందే ''పచ్చయప్ప నృప యశోమండనం'' అనే పేరుతో యేటా ఆ వర్ధంతినాడు పద్యాలనూ, శ్లోకాలనూ రాసి చదువుతూ సంభావనలు పుచ్చుకొనేవారు. ఈ పద్యాలలో కొన్నింటిని ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు సేకరించి ప్రచురించారు.[5] ఇందులో వెరసి ఇరవై పద్యాలూ శ్లోకాలూ ఉన్నాయి. మచ్చుకు రెండు పద్యాలు చూడండి.

''శ్రీ యలమేలు మంగ కుచసీమ బయంట దొలంగగాంచి కాం
తా యిట గొండపై నిరత హర్షమునం దగిగోరువంక లిం
పై యలరారె గంటె యన నారసి సిబ్బితి వూను నెచ్చెలిం
బాయక కౌగలించు హరి పచ్చప కీర్తుల నిచ్చ బ్రోచుతన్''

''సతత మనంత భోగముల సన్నుతి కెక్కినవాడు కల్మిగు
బ్బెత కిరవైన వాడు ఘన విభ్రమమూనిన మేనివాడు రా
జిత గుణరత్న హారములచే దులకించెడు వాడు సూరి వం
దితుడగు శ్రీనివాసుడిల నిచ్చలు బచ్చపకీర్తి బ్రోవుతన్.

ఈ పద్యాలలో రెండో దానిలో ''సూరి వందితుడ''నే పదంలో ఏదైనా ప్రత్యేకార్థం ఉందేమో. ఈ పద్య రచనలు చేసే నాటికి చిన్నయకు ''సూరి'' అనే గౌరవ పదం పేరుతో

5. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, సంపుటి 20. సంచిక 2 (1931)

కలిసి వాడడం మొదలుకాలేదు. 1845 నుంచి 1848 దాకా పచ్చయప్ప పాఠశాలలో చిన్నయ ఒక పండితునిగా పనిచేసినట్లు 1847-48 నాటికి పచ్చయప్ప కాలేజి రిపోర్టు పేర్కొంటున్నట్లు సూరిగారి బంధుకోటిలోని వారు చెప్తున్నారు. అయితే 1848 నాటికి యూనివర్సిటీ బోర్డు వారి హైస్కూలులో చిన్నయ తెలుగు అసిస్టెంటు టీచరుగా పనిచేస్తున్నట్టు దాఖలాలు కనపడతాయి. (అశైలమ్ ఆల్మనాక్ 1848 వార్షిక సంచిక)

1847-48 నాటికి చిన్నయ యూనివర్సిటీ బోర్డు హైస్కూలు తెలుగు సూపరింటెండెంటుగా నియమితుడయ్యాడు. ''కాంచీపురం పచ్చయప్ప మొదలారిగారి విద్యాశాలయందాంధ్ర గీర్వాణ ప్రధానోపాధ్యాయులయిన వైయాకరణ రామానుజా చార్యుల వారిచేత లేఖన ప్రమాది దోషంబులు లేక బరిశోధింపబడి, హానరేబిల్ కంపెనీవారి యూనివర్సిటీయను శాస్త్ర పాఠశాలయందాంధ్రోపాధ్యాయులయిన ప. చిన్నయగారిచేత సరిజూడబడి, దీనికి శాస్త్ర నిబంధనములను మెండుగా నుంచక వై. రామానుజాచార్యులవారిచేతనే భారత వచనంబను పేరుగా జేయబడిన ఛాయా వ్యాఖ్యానము తోడ శాలివాహన శకవర్షంబులులో 1869 తదియగా ప్లవంగనామ సంవత్సరానికి జ్యేష్ఠ శుద్ధ 3 సోమవారంబునందు అచ్చువేయబడియె'' అనే 1847 నాటి పుస్తకంవల్ల చిన్నయగారి ఉద్యోగపు హోదా, సరివారితో గల స్థానం తెలుస్తున్నాయి.

శాస్త్ర నిబంధనములను మెండుగా నుచంక వైయాకరణం రామానుజాచార్యుల వంటి వారు కొందరు 1847లో వచన రచనలను చేస్తున్నా ఆనాటి కొందరు మద్రాసీ తెలుగువారు తెచ్చిపెట్టుకొన్న శైలిలో కృతక భాషను వాడుతూ గ్రంథాలు రాయడం ప్రారంభించారు. ''నీలగిరియాత్ర''ను రచించిన చింతాద్రిపేట వాస్తవ్యుడు కోలా శేషాచలం అటువంటివాడు. ఆనాడు పచ్చయప్ప సభలలో పాల్గొనే పండితుల పేర్లు కొన్ని చూడండి.

1. వైయాకరణ రామానుజాచార్యులు
2. నావల్పాకము వెంకటాచార్యులు
3. మహాభాష్యము అప్పలాచార్యులు
4. పాకము వేదాంతాచార్యులు
5. శిరోమణి అప్పళాచార్యులు
6. మహాభాష్యము అళహసింగరాచార్యులు
7. వింజమూరి రామానుజాచార్యులు
8. తిరుముషి ముత్తప్ప
9. కళత్తూరు నరసింహా రాఘవాచార్యులు
10. అళశూరు తిరువలాచార్యులు
11. అరశానిఫాల శ్రీనివాస రాఘవాచార్యులు
12. తిరువహీంద్రపురము బంగారాచార్యులు
13. పగులు దివిడి కృష్ణమాచార్యులు
14. దిట్టకవి రామజోగిశాస్త్రులు
15. కాళహస్తి పాపన్న శాస్త్రులు
16. మల్లంపల్లి మల్లికార్జున శాస్త్రులు
17. వడమూరి గోవిందాచార్యులు
18. బాబూరాయపేట వేదవ్యాసాచార్యులు
19. శ్రీముష్ణం రాఘవాచార్యులు
20. వేళచ్చేరి అప్పళాచార్యులు
21. నిమ్మగడ్డ వెంకట నరసింహ సిద్ధాంతి
22. సాతాని చిన్నయ్య
23. తోట విజయ రాఘవ నాయుడు
24. వీరాసామి నాయుడు

పందొమ్మిదో శతాబ్దం ప్రథమార్ధం ముగుస్తున్న కాలంలోనే దక్షిణాది తెలుగువారిలో ఒకరకం కాంప్లెక్సు వచ్చినట్టుంది. కుంఫిణీయుగం తొలిరోజుల్లో చెన్నపట్నంలోని పాఠశాలలో అందరూ ఉత్తరాది జిల్లాల తెలుగువాళ్ళే అయ్యవార్లుగా ఉండేవారు. పడమటి దక్షిణ రాజ్యాలలోని తెలుగు అంతటి ప్రశస్తమైనది కాదనే అభిప్రాయంతో ఉత్తరాది ఉపాధ్యాయులను నియమించేవారని వెన్నెలకంటి సుబ్బారావు గారు తమ విద్యా నివేదికలో తెలియచేశారు. చిన్నయగారి తర్వాత వారి స్థానంలో పనిచేసిన కొక్కొండ వెంకటరత్నంగారి భాషనే ఉత్తరోత్తరా ఆక్షేపించేవారు వచ్చారు.

ఆయన తెలుగుకు ''అరవ తెలుగ''ని, ''మదరాసు తెలుగని, ''చెన్న పట్నం తెలుగ''ని ''గుజరాతి పేట తెలుగ''ని మాటిమాటికి వేదం వెంకటరాయశాస్త్రిగారు ఎత్తి పొడిచారు. ''వాస్తవముగా శాస్త్రుల వారివంటి అఱవ తెనుగు పండితుల వల్లనే మన తెలుగు భాషకు ఇప్పటి దురవస్థ సంభవించినది. చెన్నపట్టణములలో తెలుగు గ్రంథములు అచ్చుపడడము, అక్కడున్న అఱవ తెలుగు పండితులు గ్రంథములు పరిష్కరించడము, ఆంధ్ర గ్రంథాలు పాడుకావడమునకు ముఖ్య కారణము. ఎందునా పొందని నేటి అధ్వాన్నపు తెలుగు పరవస్తు చిన్నయసూరిగారి మూలముగా దాపరించినది. ఆయన కాలములో వచనాలు వాడుక భాషలోనే అందరూ వ్రాసేవారు. ఆయన మాత్రము వింత తెలుగు వ్రాసేవారు'' అని గిడుగు రామ్మూర్తిగారు విశదపరిచారు.[6]

నడమంత్రంగా వచ్చిన వింత తెలుగు కొన్ని చారిత్రక కారణాల వల్ల వచ్చింది. అసమానతలు ప్రస్ఫుటంగా ఉన్న ఏ వ్యవస్థలోనైనా బలహీనవర్గాలు తమ్ము తాము రక్షించుకొందుకై సైద్ధాంతిక కవచాలను సృష్టించుకొంటాయి. ఉన్నతవర్గాల వారితో సమానంగా కొన్ని విషయాలలో పురోగమిస్తాయి. ఆర్థికంగా మెరుగుపడ్డ సాటివారి సహకారంతో వీలైన సందర్భాలలో తమ ఆధిక్యతను చాటుకొనడానికి ప్రయత్నిస్తాయి. దక్షిణాది తెలుగువారు సరిగ్గా ఇదే చేశారు. తమ సహజ మాండలిక భాషలోగాని, ఉత్తరాది వారి వాడుకభాషకు దగ్గరలో వున్న గద్య రచనలను చేయడానికి ప్రయత్నించారు. ఒకరిద్దరు ''శాస్త్ర నిబంధనలను మెండుగానుంచక'' సరళంగా రాయ జూచినా శబ్దాడంబరం, పాండిత్య ప్రకర్షా చప్పట్లు కొట్టించుకొనడం ప్రారంభించాయి. ఈ ''వింత తెలుగు'' సలక్షణమైనదని నిరూపించడానికి శాస్త్రం అవసరమైంది. దానిని చిన్నయ సమకూర్చదలిచాడు.

యూనివర్సిటీ బోర్డు హైస్కూల్లో తెలుగు సూపరింటెండెంటు హోదాకు వచ్చాక పద్యాంధ్ర వ్యాకరణం వల్ల ప్రయోజనం సిద్ధించదని ఆ ప్రణాళిక బాటల్లోనే ఆంధ్ర శబ్దశాసనం, శబ్ద లక్షణ సంగ్రహం అనే వ్యాకరణ రచనలకూ చిన్నయ పూనుకొన్నాడు. అయితే ఈ ప్రణాళిక ఆయనకు తృప్తినిచ్చినట్టు లేదు. సంస్కృత వ్యాకరణాలలో అసమానమైన సిద్ధాంత కౌముదిలాంటి తెనుగు వ్యాకరణం ఒకటి సంస్కృతంలోనే రాస్తే మంచిదని భావించి ఆ రచనను ప్రారంభించాడు. చిన్నయ సూత్రాల పౌర్వాపర్యాలు విశ్లేషణ చేసిన వారికి ఆయన వేసుకొన్న రెండు విభిన్న ప్రణాళికలు విశదమై వాటి కాలక్రమం అవగతమవుతుంది.[7]

6. గిడుగు వెంకటరామమూర్తి పంతులు – ''ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం'' – పుట.161
7. జి.వి. కృష్ణారావు – చిన్నయ సూత్రాల పౌర్వాపర్యాలు, భారతి, జూలై, 1965.

శబ్ద శాస్త్రంలో తనకుగల ఉద్దండ పాండిత్యాన్ని సాటి పండితుల మధ్య నిరూపించు కొన్నాక యూనివర్సిటీ బోర్డువారు చిన్నయను సగౌరవంగా "చిన్నయ్య"గారు అనే మర్యాదతో వ్యవహరించసాగారు (చూ.అసైలమ్ ఆల్మనాక్ 1848 సంచిక). 1848-49 నాటికి ఆయనకు ప్రొఫెసర్ అనే అర్థం వచ్చే "శాస్త్రి" బిరుదానికి సమానమైనదేదైనా ఇవ్వాలని యూనివర్సిటీ గవర్నర్లలోని కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్ళ, సి. రంగనాథశాస్త్రి వంటివారు తలపోసినట్టుంది. బ్రాహ్మణేతరులు "శాస్త్రి" అనే పద ధారణకి అనర్హులని పందొమ్మిదో శతాబ్దంలో సర్వులూ విశ్వసించడంచేత చిన్నయను చిన్నయశాస్త్రి అనకుండా "చిన్నయసూరి" అని పిలవసాగారు.

1848-49 వార్షిక నివేదికలో మద్రాసు యూనివర్సిటీ టీచర్ల జాబితాలో చిన్నయసూరి, హయగ్రీవశాస్త్రి ప్రథమ ద్వితీయ స్థానాలలో కనబడతారు.[8] ఈ ఉపాధ్యాయుల శిక్షణలో చదువుకొన్న విద్యార్థులను అయ్యవార్ల సమక్షంలో బ్రౌను దొరగారు 1849లో పరీక్షించారు. తమ రిపోర్టును 1849లో పంపించారు. "ఉపాధ్యాయులు వేసిన వివిధ వ్యాకరణ విషయాలపైన ప్రశ్నలకు ఏడుగురు హిందువులున్న క్లాసు సవినయంగా సమాధానాలు చెప్పారుగాని ఏ ఒక్కడూ సర్వసాధారణమైన ఒక తెలుగు ఉత్తరాన్ని చదవడంలోగాని, రాయడంలోగాని నెగ్గలేకపోయారు. పైగా సగంమంది కుర్రాళ్ళకు తెలుగు మాతృభాష" అని బ్రౌను దొరగారు చెప్పారు. తరువాత ఇంకో క్లాసు గురించి ఆయన చెప్పిన మాటలు ఇంగ్లీషులోనే చూడండి.

"The third class is more perfect in grammar but here again the tutors, proceeding on the native method, prefer that course which gives the greatest degree of Labour and the smallest profit." (బ్రౌను జాబు పుట.66)

చిన్నయసూరిగారు, హయగ్రీవశాస్త్రిగారు తమ శిష్యులకు వ్యాకరణం నూరిపోయడం దీనివల్ల తెలుస్తుంది. బహుశ్రమతో కూడుకొన్న విద్యావిధానాన్నేగాని వివేకవంతమైనదాన్ని యూనివర్సిటీ బోర్డువారు అమలు జరపడం లేదని గడచిన అయిదేళ్లుగా తను మొత్తుకుంటున్నట్టు బ్రౌను దొరగారు తమ నివేదికలో రాశారు. "మెనీ ఆఫ్ ద గ్రమటికల్ క్వశ్చన్స్ పుట్ బై ద నేటివ్ ట్యూటర్స్, ఆర్ ఇన్‌టెండెడ్ టు అస్టానిష్ ద ఆడియన్స్" అని చెప్పారు.

ఈ పండితుల వ్యాకరణ విషయ ప్రశ్నలు సాధారణులను ఆశ్చర్యచకితులను చేసి మెప్పిస్తాయేమోగాని ఆ ప్రశ్నలలో ప్రయోజనకరమైన జ్ఞానం ఇసుమంత కూడా లేదని తెలిసిన బ్రౌను దొరగారి కళ్లు కప్పలేకపోయాయి.

అయితే అందరూ భాషా వ్యాకరణ ప్రయోజనాలను ఒకే దృక్పథంతో చూడరు. "స్వదేశ భాషాభ్యాసలోలురగు బాలురకు అనవధిక వాచక వైభవోన్మేషకరంబైన సమధిక

8. ద ఇంగ్లీష్ ఆన్యువల్ రిపోర్ట్ ఫ్రమ్ ది గవర్నర్స్ ఆఫ్ మెడ్రాస్ యూనివర్సిటీ 1848-49." బ్రౌన్ జవాబులు తెలుగు జర్నలిజం చరిత్ర" అనే గ్రంథంలో బంగోరె ఉటంకించిన భాగాలు చూడండి. పుట.65

శాస్త్ర లక్షణ శిక్షితంబైన'' గ్రంథాలు అవసరమనుకొంటారు. అప్పటిదాకా తెల్లదొరల కోసం, వారి ప్రభావంతో రచించిన వ్యాకరణాలన్నీ వ్యవహారభాషా బోధకాలు, ఆంధ్ర శబ్ద చింతామణి, వికృతి వివేకాలు పూర్వభాషాను బోధకాలు. ఆంధ్ర శబ్ద చింతామణి, వికృతి వివేకాలు పూర్వ భాషను విశదం చేసి వ్యాకరణాలేగాని సుబోధకాలు కావు. అందుచేత చిన్నయసూరి వాటి ప్రణాళికను అనుసరించి ''శబ్ద లక్షణ సంగ్రహము'' అనే కృతిని రచించారు. ఇందులో అయిదు పరిచ్ఛేదాలు. అన్నింట్లో కలిపి మొత్తం 470 సూత్రాలు ఉన్నాయి. వృత్తిగాని, ఉదాహరణలుగాని లేని బోసిసూత్రాలనే వరుసగా చెప్పుకొంటూపోతున్న ఈ వ్యాకరణాన్ని శిష్యులకు బోధిస్తున్నప్పుడు అవసరమైన వ్యాఖ్యానాలను సూరి చేసేవారేమో తెలియదు. శబ్ద లక్షణ సంగ్రహాన్ని అచ్చువేసి గాజుల లక్ష్మీనరసింహశెట్టిగారికి 1853లో అంకితమిచ్చారట. ఇప్పుడు దొరుకుతున్న పునర్ముద్రణలలో కృతిపతికి సంబంధించిన పద్యాలుగాని, మంగళాశాసనంగానీ కనబడవు.

1857లో లక్షణ గ్రంథాన్నేకాక నీతిచంద్రిక అనే గ్రాంథిక లక్ష్యగ్రంథాన్ని కూడా సూరి రచించాడు. దీనిని ఆనాటి యూనివర్సిటీ బోర్డు సెక్రటరీ అయిన ఎ.జె. ఆర్బుత్తునాట్‌గారికి అంకితమిచ్చారు. ఈ దొరగారు ఆ మరుసటి సంవత్సరం డైరెక్టరు ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ అయ్యారు. ''మద్రాసు ప్రెసిడెన్సీతో జేరిన సమస్త విద్యాశాలలకు ముఖ్యాధికారి'' అయ్యారు. చిన్నయసూరిగారికీ ఆయన పుస్తకానికీ తిరుగులేని ప్రాపకం దొరికింది.

''శబ్దలక్షణ సంగ్రహం'' రచించి అచ్చువేసి అంకితం ఇచ్చినా సూరిగారికి సంతృప్తి కలుగలేదు. తమకు గల వ్యాకరణ పరిజ్ఞానం అపారం. దానిని శాశ్వతంగా ఇంకో ''నన్నయ్య''లాగ, మరో తెలుగు పాణినిలాగ సంస్కృతంలో ఒక ఆంధ్ర వ్యాకరణాన్ని రచించి వెల్లడి చేద్దామనుకొన్నారు. ''ఆంధ్ర శబ్దాను శాసనం'' అనే పేరుతో సంస్కృత సూత్రాలలో తెలుగు లక్షణం ఏడు పరిచ్ఛేదాలలో చెప్పారు. ఈ సూత్రాలు అష్టాధ్యాయి పద్ధతిలో గీర్వాణంలో ఉన్నాయి. ''అష్టాధ్యాయి నర్థము చేసికొనుటకు బరిభాషతో పాటుగా నాను పూర్విని యా వ్యాకరణమునకు సరియైన పాఠము లభించలేదు. ఇప్పుడు సూత్రములన్నియు వరుస తప్పకుండా నున్నవని చెప్పలేము. కనుక ఈ గ్రంథము కొంత దురవగాహముగా నున్నది'' అని పరిశోధకులు చెప్తున్నారు.[9]

ఆంధ్ర శబ్దానుశాసనాన్నే సూత్రాంధ్ర వ్యాకరణం అనే పేరుతో ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ప్రకటించారు. ఈ గ్రంథం సూరిగారి జీవితకాలంలోనే ఒకసారి అచ్చుపడిందని కొందరూ, కాదు ఇది అసమగ్రం అని మరికొందరూ భావిస్తున్నారు. ''సంస్కృత సూత్రాంధ్ర వ్యాకరణం – ముద్రణ పొంది ఉండాలి. ఎందుకంటే అచ్చుకాక వ్రాతప్రతిగానే ఉండిపోయిన కృతిని ''కనదగు'' ననటంలో అర్థం లేదు. ముఖ్యంగా సూరి అలా చెప్పేవాడు కాదు'' అని తొలి కొందరు నమ్ముతారు.[10] సూరి సమకాలికులే

9. అమరేశం రాజేశ్వరశర్మ – ఆంధ్ర వ్యాకరణ వికాసము – ద్వితీయ భాగము, పుట 242.
10. జి.వి.కృష్ణారావు – భారతి, జూలై 1965.

''వీరారంభించి ముగించనివి అకారాది నిఘంటువొకటి, సంస్కృత సూత్రాంధ్ర మొక్కటి, విశ్వ నిఘంటువు టీక యొకటి'' అని 1865లోనే బహుజనపల్లి సీతారామా చార్యులు, సి. సుబ్బరాయులు నాయుడు, కృష్ణమాచార్యులు చెప్పారు.[11]

సూత్రాంధ్ర వ్యాకరణం 1842లో అచ్చుపడి ఉండవచ్చునని గుత్తపల్లి సూర్యారావుగారు చెప్తున్నారు. ఆ వ్యాకరణం మొదటి పరిచ్ఛేదం చివర ఒక గద్య కనబడుతుంది. దానిని కొత్తపల్లి సూర్యారావుగారు ఒక వ్యాసంలో ప్రకటించారు. ఆ గద్యను చూడండి.

''ఇతి సకల భాషా కవి కమల మిత్ర గార్గేయస గోత్రాపస్తంబ సూత్ర యజుశ్శాఖాధ్యాయి వేంకటరంగ రామానుజార్య పుత్ర శ్రీనివాసాంబా గర్భశుక్త ముక్తాఫలాయమాన దిగంత విశ్రాంత చిరంతన కీర్తి విరాజమాన సంస్కృతాది భాషాష్టక లక్ష్య లక్షణ మహాపండిత జేగీయమాన నిరంకుశ నిరర్గళ ఝరీధారాలంకృత సంస్కృతాంధ్ర భాషానుశాసన బహులక్ష్య లక్షణ గ్రంథ రచనా ధురీణ సర్వ దర్శన సంగ్రహ కుసుమాంజలీ మహాభాష్య శ్రీభాష్య భగవద్విషయపాఠ ప్రవచన పారీణ శాత్తాదశ్రీ వైష్ణవ కుల కలశాంబుధి పూర్ణచంద్రేణ ఆంగ్ల రాజకీయ సర్వకలాశాలాంధ్ర ప్రధాన పండిత చిన్నయసూరిణా ప్రణీత గీర్వాణ భాషారూపాంధ్ర శబ్దాను శాసన సంజ్ఞా పరిచ్ఛేదః కలౌర విధీభావత్సరే విజయ తేతరామ్.''

''ఈ గద్యములోని విషయములు కొన్నింటిని బట్టి యివి శ్రీ సూరిగారు స్వయముగా వ్రాసికొనినదాయను సందేహముతో నీ గ్రంథములో దీనిం జేర్పలేదు. ఏ యితర గ్రంథములోనూ నిట్టి గద్యము లేదు'' అని కొత్తపల్లి సూర్యారావుగారు సూత్రాంధ్ర వ్యాకరణం ప్రకటిస్తున్నప్పుడు స్పష్టం చేశారు.[12]

సంస్కృతంలో రచించిన తెలుగు వ్యాకరణం సాధారణ విద్యార్థుల పఠన పాఠనాదులకు కడుదూరమని సూరిగారికి తెలుసు. వృత్తులు, ఉదాహృతులు ఇస్తూ సూత్రరచన చేస్తే బాలావబోధకు వీలైన వ్యాకరణం సాధ్యమౌతుందని భావించారు. పూర్వం రచించిన ''వ్యాకృతి సూత్రతతి యొక కొంత తెనిగించి'' బాల వ్యాకరణం రచించారు. దీని పీఠికలో ఇలా చెప్పారు.

''ఆంధ్ర భాషకు లక్షణ గ్రంథములు ప్రాచీనులు చేసినవి పెక్కులు కానబడుచున్నవి. కొన్ని లక్షణ గ్రంథములు పేర్లు మాత్రమిప్పుడు వినబడుచున్నవి. కానబడు గ్రంథములందు సంస్కృత సమములకు లక్షణములు బహుతరముగా రచింపబడినవిగాని తక్కిన భాషకు విశేషాకారముగా రచింపబడినవి కావు. కాబట్టి యాలక్షణ గ్రంథములు చదువువారికి నిస్సందేహముగా వచన రచనసేయు కౌశలము చిరకాలము రానేరదు. భాషా సమిష్టికి లక్షణ గ్రంథము కుదిరిన పక్షమందంత శ్రమపడ బనిలేదు. తుదకు లక్ష్య పరిజ్ఞానము చాలని లక్షణ పరిజ్ఞానమంత శ్లాఘ్యము కాదుగాని తుదముట్ట సర్వలక్షణ

11. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, సంపుటి 19 - సంచిక 6, 1931.
12. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, సంపుటి 19 సంచిక 6, 1931

పరిజ్ఞానము లక్ష్య పరిజ్ఞానముచేతనే సాధించుట మిక్కిలి దుష్కరము. కాబట్టి యిట్టి కొఱత వారింపబూని పెక్కు లక్ష్యములు పలుమాఱు సావధానముగా బరిశీలించి రచనా ప్రణాళిక నిర్ణయించుకొని నా నేర్పు కొలదిని సంస్కృత భాషలో సూత్ర గ్రంథమొకటి కావించితిని. ఆ గ్రంథము బాలురకు సుసాధనముగాకుండుట వలన దానియందలి సూత్రములు కొన్ని తెనిగించి ప్రకృత గ్రంథరూపముగా రచించినాడ.''

కందము

''మానితపునడక పేరిమి
మానసమున కింపు బెంపమనునంచలకున్
బోనిడి నీరసనీరము
జానుగ క్షీరంబు గొనుట సహజము కాదే.''

సూరిగారు వ్యాకరణంబులోని నీరాన్ని విడిచి క్షీరాన్ని తీసుకోమన్నా వారి అనంతరం వచ్చిన గ్రాంథికవాదులు నీరక్షీర విభాగం చేయక, చేసినా నీరాన్నే క్షీరమనుకొని స్వీకరించారు. సంస్కృత వ్యాకరణ మర్యాదలు తెలియని వారికి తెలుగు వ్యాకరణం బోధపడనంత క్లిష్టంగా పాణినీయస్థ సంజ్ఞలనే సూరిగారు చేపట్టారు. తపరకరణము, ఇత్సంజ్ఞాకరణము మొదలైన పాణినీయ సంప్రదాయాలకు చోటిచ్చినా, తెలుగుకు సహజమైన సరళ పరుషాది ప్రత్యేక పారిభాషిక పదాలను కూడా వాడారు. సూత్రరచనలో బిగువు, పొదుపు, స్పష్టత మొదలైన గుణాల కోసం ప్రయత్నించి చాలావరకు సఫలులయ్యారు.

సూరిగారు బాలవ్యాకరణాన్ని ప్రచురించడానికి ఒక సంవత్సరం ముందే మద్రాసు విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ, హైస్కూలు కళాశాలగా మారింది. చిన్నయసూరి గారి ఔన్నత్యం మరింత పెరిగింది. 1858లో ఆయన తన బాల వ్యాకరణాన్ని ప్రచురించారు. దాని కాపీ రైటు తమదే అని అనువాదపు హక్కులు తమకు తాము అట్టే పెట్టుకొన్నామనీ ఇంగ్లీషులో ముఖపత్రం మీద ప్రకటించారు.

బాలవ్యాకరణాన్ని ఇంగ్లీషులోనికి అనువదించదలిచారేమో తెలియదు. ఈ గ్రంథం ప్రసిద్ధం కాకముందే 1861లో రాచపుండు లేవడంవల్ల ఉద్యోగ విరమణ చేయక తప్పలేదు. 1862 మార్చి నెలలో కీర్తిశేషులయ్యారు. వారి బాలవ్యాకరణం వ్యాఖ్యానాలు లేకపోతే కొరకరానికొయ్యగానే కనబడుతుంది. చిన్నయసూరి గ్రంథానికి వ్యాఖ్య రాయించాలని గాజుల లక్ష్మీనరసుశెట్టిగారు ప్రయత్నించారుగాని వారి ప్రయత్నాలు సఫలం కాలేదు. బాల వ్యాకరణంలో చెప్పకుండా విడిచిపెట్టిన సూత్రాలను బహుజనపల్లి సీతారామాచార్యులుగారు త్రిలింగ లక్షణ శేషం అనే పేర రచించారు. దీనిని ప్రౌఢ వ్యాకరణం అంటారు.

1858 నుండి 1900 లోపున బాల వ్యాకరణం పదిహేడు ముద్రణలు పొందింది. అయినా ఇరవయ్యో శతాబ్దంలో వ్యాఖ్యానాలు వెలువడ్డాకగాని బాలవ్యాకరణం

రాజ్యమేలడం ప్రారంభించలేదు. పందొమ్మిదో శతాబ్దం ద్వితీయార్థంలో శేషయ్య వ్యాకరణం, వెంకయ్య వ్యాకరణం వంటివే పఠన పాఠనాదులలో ప్రసిద్ధాలు.

ఏ వ్యాకర్తకయినా లక్షణాలు చెప్పడానికి ప్రయోగాలే శరణాలు. వ్యవహారంలో ఉన్నవి స్వీకరించాలి. స్థితి ఉంటే దానికి గతి కల్పించాలి. అందుకే బాల వ్యాకరణంలో చిన్నయసూరిగారు ఒకటికాదు రెండు కాదు, ఇరవై సూత్రాలలో వ్యవహారంలోని మాటలను, అర్థాలను, ప్రయోగ విధానాలను గ్రహించాలన్నది తమ ఉద్దేశమని సూత్రాలలో వృత్తులలో స్పష్టపడేటట్టు చెప్పారు.

1. ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు
పెద్దలు వ్యవహరించిన మాట గ్రామ్యం
బయిన గ్రహింపదగునని తాత్పర్యము. (సంజ్ఞా - 23)

2. త్రిలింగ దేశ వ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు (సంజ్ఞా - 21)

3. అన్యంబులకు సహిత మిక్కార్యంబులు
కొండొకచో గానంబడియెడి (సంధి - 39)

4. అందదుకు ప్రభృతులు యథా ప్రయో
గంబుగ గ్రాహ్యంబులు (సంధి - 42)

5. వాక్యావ సానంబున సంధిలేమి దోషంబు
గాదని యార్యులండ్రు. (సంధి - 55)

6. ఒకానొకచో నామంబు సంశ్లిష్ట బహు
వచనానంత తుల్యంబయి బహువచనంబు నెనయు.
ఇట్లు ప్రయోగ దృష్టంబులు గ్రహించునది (ఆచ్ఛిక - 17)

7. ఇయకు మాఱుగా నామాంతంబున
కెత్వంబు బహుళంబుగానగు,
అయ్యది ప్రయోగంబులందు మృగ్యంబు. (ఆచ్ఛిక - 23)

8. సంప్రదానంబునకుం జతుర్థియగు
చతుర్థికి మాఱుగా షష్ఠియె తఱచుగా
బ్రయోగంబులం గానంబడియెడి (కారక - 8)

9. ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగనగు. వనము నుంచి, ధనము నుంచి యని యుంచి శబ్దాను ప్రయోగంబుతో గొందఱు వ్యవహరించెదరుగాని తుది సాధు కవి ప్రయోగరూఢంబు గాదని యెఱుంగునది. (కారక - 11)

10. ధాతుజ విశేషణవ్యవధానంబున విశేషంబులన్నింటి కయి పదం బను ప్రయుక్తంబగు. ఆద్యుడయి యప్రమేయుడై యఖిల సేవ్యుడై యొసంగెడు దేవుని నభి నుతింతు ఇచట

మఱియుం బ్రయోగ వైచిత్ర్యంబు గలదని ప్రయోగంబుల నెఱుంగునది. (కారక - 31)

11. తత్పురుషాదులకు లక్షణంబు ప్రాయికంబుగ సంస్కృతోక్తంబయగు.

....

సిద్ధంబు సర్వంబు గ్రాహ్యంబగు. (సమాస - 3)

12. స్త్రీ సమ ఘటితంబ యొకానొకండు
బహువ్రీహి చూపట్టెడు
మోటబరి ఇత్యాదులు వ్యవహార సిద్ధంబులు
గ్రాహ్యంబులు (సమాస - 6)

13. కృత హ్రస్వంబగు త్రికంబుమీది చోటు
శబ్దంబు నోత్వంబున కత్వ హ్రస్వంబులు విభాషనగు .... అను రూపంబులు
ప్రయోగంబులంగానం బడియెడి (సమాస - 15)

14. నిక్కలాదులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు (సమాస - 20)

15. మగటి మ్యాదులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు (తద్ధిత - 8)

16. అర్థ విశేషంబుల వర్ణకాంతరంబులును
మహత్ప్రయోగంబుల నెఱుంగునది (తద్ధిత - 28)

17. వ్యతిరేక తృవర్ణకార్థంబున నిజ్జయగు (క్రియా - 47)

18. కృత్తుల కర్థంబులు యథావ్యవహారంబుగ గ్రాహ్యంబులు

....

కృత్తులకు వక్ష్యమాణంబులకు భావకర్తృ కర్మాద్యర్థంబులు
మహాజన వ్యవహారానుసారిగా నెఱుంగునది. (కృదంత-1)

19. వడి ప్రభృతు లిట్లెఱుంగునది

....

ఇత్యాదులు మహాజన వ్యవహారంబుల
నెఱుంగునది (కృదంత - 22)

20. రేఫంబులు లఘ్వు లఘువులం దక్కుంగల
విశేషంబులు నార్య వ్యవహారంబుల దెలియుట శ్రేయంబు (ప్రకీర్ణక - 25)

సూరిగారి మతంలో వ్యవహారం అన్నది కావ్య భాషలోని వ్యవహారమే అని మన పండితులు అర్థం చేసుకొన్నారు. చిన్నయసూరిగారి నీతిచంద్రిక, బాలవ్యాకరణం పరమ ప్రామాణిక గ్రంథాలయ్యాయి. లోక వ్యవహారానుసారంగా విద్యార్థులచేత మాతృ భాషలో రచనాభ్యాసం చేయించడానికి బదులు గ్రాంథిక భాషను లోకంపై రుద్దారు. గిడుగువారు ఈ దుస్థితిని ఇలా చెప్పారు.[13]

13. గిడుగు రామమూర్తి పంతులు - వ్యాసావళి (1958) - పుట 26-27

''ప్రాచీన ప్రబంధస్థమై, కేవల ప్రయోగ శరణమై, పండితులకైనా బహు ప్రయాస సాధ్యమై, ఒక్క ప్రబంధ నిర్మాణమునందే ఉపయోగించదగి, పండితులు మాత్రమే అభ్యసిస్తూ ఉండిన ''గ్రాంథిక భాష''లో అధికారానధికార తారతమ్యము ఆలోచించ కుండా ఆబాలగోపాలం అందరి పిల్లల చేతనూ రచనాభ్యాసం చేయించనుద్దేశించి, అందుకు సాధనముగా, అసమగ్రము, అనిర్ణాయకము, భ్రమ ప్రమదాత్మకమున్ను అయిన చిన్ని వ్యాకరణము ఒకటిన్ని అస్ఖలితము కాని చిన్న వచన గ్రంథమొకటిన్ని రచియించి ఇచ్చి ఆ సూరిగారు కీర్తిశేషులయ్యారు. ''కొండవీటి సీమలోని నూతులలో నుండి నీళ్ళు తోడి తెచ్చుకొని వంట చేసుకొని భోజనము చేయండి'' అని బారెడు చేంతాడు, తూట్లుపడ్డ చిన్న చిల్లి చెంబు ఆకలితో నున్న చిన్న పిల్లల చేతులలో పెట్టి, తల్లిదండ్రులు శ్రీశైల యాత్రకు వెళ్ళినట్లయినది.''

చిన్నయసూరి గారి గ్రంథాలను చేంతాడుతోనూ, చిల్లి చెంబుతోనూ పోల్చినందుకు మనసు చివుక్కుమన్నా అవి సత్యాలే. గిడుగు రామమూర్తిగారే ఒకచోట ఇలా చెప్పారు. ''చిన్నయసూరి గారి యెడల మాకు గౌరవము లేక ఇట్లు వ్రాస్తున్నా మనుకోకూడదు. ఆయన భావశుద్ధి మేము ఎరుగకపోము. ఆయన అనుశాసనము మాకు వేదవాక్యము వంటిది కాదన్నమాట నిజమేగాని తక్కిన లాక్షణికుల యెడ కూడా మాకు అంత గౌరవము లేకపోలేదు.''

చిన్నయసూరి పుస్తకాలకు ప్రాచుర్యం ఎందుకు వచ్చిందో కూడా గిడుగువారు ఇలా చెప్పారు.

''యూనివర్సిటీ వారి తెలుగు పండితులున్ను, యూనివర్సిటీ పరీక్షలకు కావలసిన పుస్తకములు వ్రాసేవారున్ను, ఆ పుస్తకములు చదివేవారున్ను, పరీక్షకులున్ను మాత్రమే మన్నిస్తున్నారేమోకాని, దేశములో ఇతరులెవరూ పాటిస్తున్నట్టు కనబడదు. బడులలో అది తప్పనిసరిగా చదువలసి వచ్చినది గనుక దాని పేరు నిల్చినదిగాని లేకుంటే బాలసర్వతి వ్యాకరణమునకున్ను తక్కిన లక్షణ గ్రంథాలకున్ను ఏ గతి పట్టినదో ఆ గతే దీనికి పట్టును.''[14]

సూరిగారు తమ వ్యాకృతిని ''బాల వ్యాకరణం'' అన్నారుగాని పండితులు దానిని తమ ''పబ్బాల వ్యాకరణం'' చేసుకొంటే కవులు కొందరు ''కబ్బాల వ్యాకరణం'' చేసుకొన్నారు!

14. గిడుగు వెంకట రామమూర్తి పంతులు - బాలకవి శరణ్యం (1958) - పుట.72

విజయనగరం

కళింగ సీమలో చాలా ప్రాముఖ్యం గల విజయనగర సంస్థానం ఈ కుంఫిణీ యుగంలో సాహిత్య చరిత్రకన్నా ఎక్కువగా చెప్పుకోదగ్గ రాజకీయ చరిత్రనే సృష్టించింది. తారీఖుల వారీగా చూసుకొంటే ఈ యుగంలో ఇద్దరే ఇద్దరు రాజులు ఈ సంస్థానాధీశ్వరులుగా కనబడుతారు. ఈ రాజుల పేర్లూ, వారి రాజ్యకాల వివరాలు ఇవి :

నారాయణ గజపతిరాజు	1794 – 1845
విజయరామ గజపతి	1845 – 1879

లెక్కకు ఇద్దరే ప్రభువులు ఈ యుగంలో కనబడుతున్నా ఈ ఇద్దరూ కుంఫిణీ వారితో చాలా లావాదేవీలు ఉన్నవారు. నారాయణ గజపతి తన జీవితకాలంలో ఎక్కువ భాగం కాశీ క్షేత్రంలోనే గడిపారు. అక్కడే మరణించారు. ఇందుకు చాలా ప్రబలమైన కారణాలున్నాయి. గత చరిత్రలోని ఘనకీర్తి, అమితమైన ఆత్మాభిమానం ఈ రాజును సొంత సంస్థానానికి దూరం చేశాయి. ఏ సంఘటనలు వీరి ప్రవాసానికి కారణాలయ్యాయో చాలా వివరాలతో చెప్పుకోవలసిన అవసరం ఉన్నా టూకీగానే తెలుసుకొందాం.

బొబ్బిలియుద్ధం కథా, దానికి ప్రధాన కారణాలు, ఆ యుద్ధం పర్యవసానాలూ ఆంధ్రులందరికీ సుపరిచితాలే. పరాసు సేనల సహాయంతో సలాబత్ నిజాముగా రాజ్యానికి వచ్చాడు. తన సేనల ఖర్చులు తానే చూసుకొంటాననీ, వాటి నిమిత్తం తనకు కొన్ని సర్కారులను జాగీరుగా ఇవ్వమని సేనాని బుస్సీ నిజాముని అడిగాడు. ఉత్తర సర్కార్లు నాలుగింటిని నిజాము ఇచ్చాడు. ఈ సర్కార్లలో ప్రముఖమైన విజయనగరాన్ని విజయరామరాజు ఏలుతున్నాడు. ఈయన తన రాజ్యాన్ని విస్తరించుకోవాలన్న కోరికతో బుస్సీ సహాయంతో క్రీ.శ. 1757లో బొబ్బిలి కోటపై దాడి చేశాడు. గెలిచాడు. అయితే ఆ సంవత్సరంలోనే తాండ్రపాపయ్య రాత్రిపూట విజయరామరాజును పొడిచి చంపాడు. ఆ తరువాత విజయనగర సంస్థానానికి ఆనందరాజు పాలకుడయ్యాడు. ఇతడు బుస్సీ మీదా, ఫ్రెంచి వాళ్ళమీదా పగబట్టాడు. విజయరామరాజు మరణానికి ఫ్రెంచి వాళ్ళే కారణమని, వాళ్ళను సర్కార్ల నుండి వెళ్లగొట్టాలని ఆనందరాజు నిశ్చయించాడు. ఒక పరదేశ శక్తిని వదుల్చుకోవాలంటే అంతటి సామర్థ్యంగల మరొక పరదేశ శక్తితో సఖ్యం చేయాలి. ఆనందరాజు ఇంగ్లీషు కుంఫిణీ వాళ్ళకు ఆహ్వానం పంపాడు.

ఫ్రెంచివారికీ, ఇంగ్లీషువారికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే కాలం అది. ఒకరి పొడ ఇంకొకరికి గిట్టదు. పరాసువాళ్ళను పరాజితులను చేయడానికి తగిన అవకాశం కోసం చూస్తున్న ఆంగ్లేయులకు ఆనందరాజు ఆహ్వానం ఆనందదాయకమైంది. ఒకరకంగా ఆంధ్రభూములలో కుంఫిణీ వారి రాజ్యకాంక్షకు విజయనగరం వారి పిలుపే నాందీ ప్రస్తావనలు పాడింది. 1758లో కర్నల్ ఫోర్డు విశాఖపట్నంలో తన సేనలతో దిగాడు. కసింకోటలో ఆనందరాజును కలుసుకొన్నాడు. ఇద్దరి మధ్యా రెండు స్వతంత్ర రాజ్యాలు కుదుర్చుకొనే ఒప్పందంలాంటి ట్రీటీ సాధ్యమైంది. సంతకాలు చేసుకొని సమరానికి కదిలారు. పరాసువాళ్ళను కృష్ణానది అద్దరికి తరిమికొట్టారు. 1759లో నిజాము ఎనిమిది

పరగణాలతో మచిలీపట్నాన్ని ఇంగ్లీషు వారికి ధారాదత్తం చేశాడు. ఆనందరాజు ఫ్రెంచి వాళ్ళపై పగతీర్చుకొనడమేగాక ''ట్రీటి'' ప్రకారం పరాసు ధనాన్ని దోచుకొన్నాడు.

పూర్వం ఫ్రెంచి వారికి ఇచ్చినట్టే ఇప్పుడు ఇంగ్లీషు వాళ్ళకు నిజాము సైనిక సహాయం నిమిత్తం శ్రీకాకుళం, రాజమండ్రి, ఏలూరు, కొండపల్లి సర్కారులను నాలుగూ ఇచ్చాడు. అయితే ఇంగ్లీషువాళ్ళు ఈ రాజ్యాలను వెంటనే స్వాధీనం చేసుకోలేదు. కావలసినప్పుడు పుచ్చుకొంటామన్నారు. ఇది 1782లో జరిగింది. మరి నాలుగేళ్ళకు ఇంగ్లీషువాళ్ళకు రాజ్యకాంక్ష పెరిగింది. అయితే ఈ నాలుగేళ్ళలో విజయనగరం వారు మరీ బలవంతులయ్యారు. ఫ్రెంచి వారిమీద పగ తీర్చుకున్న ఆనందరాజు 1759లోనే మరణించాడు. అతని తరువాత విజయరామరాజు రాజ్యానికి వచ్చాడు. ఇతడు వారసుడు కాడు. దత్తపుత్రుడు. దత్తు వచ్చిన నాటికి పదకొండేళ్ళ వయసువాడు. ఇతని సవతి అన్నగారు సీతారామరాజు చాలా సమర్థుడు. తమ్ముని తరపున తాను సంస్థానాన్ని పాలించాడు. దాన్ని విస్తరింపజేశాడు. కళింగసీమలో ఆనాడు 29 మంది జమీందారులు ఉండేవారు. వీరందరినీ సీతారామరాజు సామంతులను చేసుకొన్నాడు. లొంగని వాళ్ళను బంధించి దేవులపల్లి కోటలో సంకెళ్ళలో పెట్టాడు. ఇతనివల్ల బాధలుపడ్డ జమీందారుల పేర్లు చూడండి.

1. జయపురం
2. శృంగవరపుకోట
3. మాడుగల
4. సాలూరు
5. కోటపాలెం
6. కురుపాం
7. అనకాపల్లి
8. సత్యవరం
9. గోలుకొండ
10. పాలకొండ
11. ఆంద్ర
12. రేగులవలస
13. కోరాం
14. త్యాడ
15. పాచిపెంట
16. సంగమ వలస
17. చెముడు
18. రాజాం
19. నరవ
20. బొబ్బిలి
21. మొహరి
22. ఖిమిడి
23. పార్వతీపురం
24. మక్కువ
25. మేరంగి
26. ఆరగడ
27. గుముసూరు
28. చీకటి
29. జలంత్రా

ఈ జమీందారులందరూ విజయనగరం గుప్పిటి నుండి బయట పడాలని విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే ఫలించలేదు. విజయనగరం వారికి గొప్ప సైనికబలం ఉంది. 7,760 మంది సైనికులు ఉన్నారు. వీళ్ళలో 1620 మంది తెల్లవాళ్ళ పద్ధతిలో దుస్తులూ, ఆయుధాలు ధరించేవాళ్ళు. ఈ సైనికుల నిమిత్తం సాలీనా అయిదున్నర లక్షల రూపాయలు వ్యయం చేసేవారు. చేతిలో కళ్ళెంలాగ ఉంటాడనుకొన్న విజయనగరం సంస్థానాధీశ్వరుడు కుంఫిణీవారి పక్కలో బల్లెం అయ్యాడు. ''మీరు సేనలను తగ్గించుకొంటారా లేక

మమ్మల్ని పేష్కసు మొత్తాన్ని పెంచమంటారా?'' అని అడుగుతూ విజయనగరం వారికి 2,000 కన్నా ఎక్కువ సిబ్బంది అనవసరమని కుంఫిణీవారు తేల్చారు. విజయరామరాజు సిబ్బందిని తగ్గించుకొన్నాడు. అయినా కుంఫిణీవారు పేష్కసు పెంచారు. సీతారామ రాజును అధికారం నుంచి తప్పించారు. పెంచిన పేష్కసు తామే వసూలు చేసుకొనడానికి రాజును రాజ్యం వదలి బందరుకు వెళ్ళమన్నారు. రాచవారు ఈ అవమానాన్ని సహించలేపోయారు. కుంఫిణీవారికి తలవంచడం కన్నా కత్తిపట్టుకొని కదనరంగంలో వీర మరణం గౌరవప్రదం అనుకొన్నారు. 1794లో విజయనగరానికి పది పన్నెండు మైళ్ళ దూరంలో వున్న పద్మనాభం అనే కొండ దగ్గర రాచవారికీ కుంఫిణీవారికీ యుద్ధం జరిగింది. ముప్పావుగంటసేపు సాగిన ఈ యుద్ధంలో విజయరామరాజు, అతని క్షత్రియ వీరులు మరణించారు. రాజు చుట్టూ దాట్లవారూ, దంతులూరి వారూ, సాగివారూ, చింతలపాటివారు, గొట్టుముక్కలవారూ, వేజర్లవారూ, పెనుమత్సవారు ఒక బురుజులాగ ఉన్నారు. ఈ క్షత్రియ వీరులందరూ ఆ ముప్పావు గంట యుద్ధంలో నేలకొరిగారు. కత్తి పట్టుకొని ముందుకొస్తే చేసే యుద్ధం వేరు. ఫిరంగి గుండుతో ఫరంగులు చేసే యుద్ధం వేరు.

మహా పౌరుషవంతులైన ముగ్గురు విజయనగర సంస్థానాధీశ్వరులు పాశ్చాత్యులతో సఖ్యంవల్లనో, విరోధం వల్లనో వరుసగా తమ పంతాల కోసం, పట్టింపుల కోసం ప్రాణాలు పోగొట్టుకొన్నారు.

(1) **పెద విజయరామరాజు (1741-1757)**: పరాసువారితో కలసి బొబ్బిలి ముట్టడించాడు. ఫలితంగా తాండ్రపాపయ్య చేతిలో మరణించాడు.

(2) **ఇమ్మడి ఆనందరాజు (1757-1760)**: ఫ్రెంచివాళ్ళ మీద కక్షకొద్దీ ఇంగ్లీషువారిని కళింగసీమకు ఆహ్వానించి, పరాసువారిని సీమనుంచి వెళ్ళగొట్టి దేశానికి తిరిగి వస్తూ స్ఫోటకంవల్ల మరణించాడు.

(3) **చిన విజయరామరాజు (1760-1794)**: పేష్కసు బాకీలు తీరేదాకా సంస్థానాన్ని విడిచి బందరుకు వెళ్ళమని కుంఫిణీవారు ఆదేశించడం అవమానంగా భావించి 1794లో పద్మనాభ యుద్ధంలో నమ్మిన సరదార్లతోపాటు ప్రాణాలు పొగొట్టుకొన్నాడు.

విజయనగరం సంస్థానాధీశ్వరులు పౌరుషవంతులేకాక కొంచెం పట్టువిడుపు గలవారు. పద్మనాభ యుద్ధం ప్రారంభానికి ముందు చిన విజయరామరాజు ఒక కట్టుదిట్టమైన ఏర్పాటు చేశాడు. యుద్ధంలో పరాజయం సంభవిస్తే ఆత్మహత్యా చేసుకొనకుండా తన భార్యచేత, తల్లిచేత ప్రమాణం చేయించాడు. ఎనిమిదేళ్ళ వయస్సుగల తన కుమారుడు నారాయణ గజపతిని వీలు చూసుకొని ఆంగ్లేయులకు లొంగిపొమ్మని ఆజ్ఞాపించాడు. పద్మనాభయుద్ధంలో రాజు, ఆతనితోపాటు రాచవారు నేలకొరిగాక స్త్రీలనూ, రాకుమారుణ్ణీ తీసుకొని సంరక్షకులు మన్యంలో ఉన్న కాశీపురానికి ఆ జమీ పాలకుడైన ముఖీరాజ భూపాల రాజుగారి ఆశ్రయాన్ని పొందారు. మరింత సురక్షితమైన ప్రదేశం కనుక ''మక్కువ'' అనే గ్రామానికి వీరిని ఆయన తీసుకొని వెళ్ళి సంరక్షించారు.

యుద్ధంలో గెలవనైతే గెలిచారు గాని కుంఫిణీవారు పేష్కుసు ద్రవ్యాన్ని కళ్ళ చూడలేకపోయారు. స్వామి భక్తి పరాయణుడైన సంస్థానపు ఉద్యోగులు రైతుల నుండి శిస్తులు వసూలు చేసి, దానిని రాకుమారునికి జమ కట్టసాగారు. వేలకొలది వీర భటులు వచ్చి అండగా నిలబడ్డారు. కుంఫిణీవారిని ఎవరూ లక్ష్యపెట్టడం లేదు. సంస్థానాధీశ్వరుడు సాయుధ దళాలను సంపూర్ణంగా సమకూర్చు కొంటే అదుపులోనికి రావడం కష్టమని కుంఫిణీవారు రాజీ బేరాలు మొదలుపెట్టారు. రాజుకు, రాణివాసం వారికి ఏమీ కీడు జరగదనీ, నిర్భయంగా రాజ్యానికి రమ్మనీ రాయబారాలు చేశారు. చెన్నపట్నంలో ఉన్న కుంఫిణీ గవర్నరు స్వహస్తలిఖితమైన హామీని, సరికొత్త కౌలును 1794 ఆగష్టు 10వ తేదీనాడు సంతకం చేసి పంపించాడు. (పద్మనాభ యుద్ధం ఆ ఏడు మే నెలలో జరిగింది). కుంఫిణీవారిని నమ్మవద్దని జమీందారులు సలహా ఇచ్చినా నారాయణ గజపతి సెప్టెంబరు 21వ తేదీనాడు ఆంధ్రలో ప్రవేశించారు. అది విజయనగరానికి సమీపంలో ఉన్న ఇంకొక కొండ ప్రదేశం. చెన్న పట్టణానికి కొత్త గవర్నరు వచ్చాడు. ఆయన కూడా కొత్త ప్రమాణ పత్రాన్ని రాసి పంపాక నారాయణ గజపతి విజయనగరంలో ప్రవేశించాడు.

1794లో పద్మనాభ యుద్ధం మాత్రమే జరగలేదు. కుంఫిణీవారి విధానాలలో మార్పులు వచ్చాయి. పూర్వం చీఫులను నియమించి వారి ద్వారా పరిపాలన సాగించేవారు. ఇప్పుడు కలెక్టర్లను నియమించి పన్నులు వసూలు చేయసాగారు. శాశ్వత భూమిశిస్తు విధానాన్ని ప్రవేశపెట్టి ఏయే జమీందారు ఎంత పేష్కుసు చెల్లించాలో నిర్ణయించారు. 1802 నాటికి విజయనగరంవారు సాలీనా అయిదు లక్షల రూపాయలు కట్టాలని పరిష్కరించారు. నారాయణ గజపతి అప్పుల పాలయ్యాడు. రాజ్యం తరిగింది. పేష్కుసు పెరిగింది. 1817 నాటికి ఆయన తీర్చవలసిన ఋణాలు పన్నెండు లక్షలని తేలింది.

కుంఫిణీవారు ఆ బాకీలన్నీ తాము తీరుస్తామని హామీ ఇచ్చి జమీందారీ వ్యవహారాలు తమకు స్వాధీనం చేయమన్నారు. నారాయణ గజపతి సొంత ఖర్చులకు సంవత్సరానికి ఎనభైవేల రూపాయలు తీసుకొని శిస్తు వసూలు బాధ్యతలను కుంఫిణీ వారికి అప్పగించారు. అయిదేళ్ళలో కుంఫిణీవారు అప్పులన్నీ తీర్చేశారు. సంస్థానం నారాయణ గజపతి చేతికి స్వాధీనం చేశారు.

అడగనివారిది పాపం, చేతికి ఎముకలేని రాజుగారు బ్రాహ్మణులకు అగ్రహారాలూ, క్షత్రియులకు జాగీర్లు ఇచ్చెయ్యసాగారు. అయిదేళ్ళలో మళ్ళా అప్పుల పాలయ్యారు. ఈసారి ఆ మొత్తం ఏడులక్షల దాకా పాకింది. మళ్ళా జమీందారీని కుంఫిణీవారికి స్వాధీనం చేసి, నారాయణ గజపతి సాలీనా లక్ష రూపాయలను తమకు పంపమని 1827లో కాశీ క్షేత్రానికి వెళ్ళిపోయారు. 1845లో మరణించేదాకా ఆయన వారణాసిలోనే ప్రవాస జీవితం గడిపారు.

నారాయణ గజపతి గారిని ప్రజలు నారాయణ బాబుగారిని వ్యవహరించేవారు. సంస్థానంలోని చాలామంది ఈ ప్రభువు పేరునే కొన్న తరాలు దాకా తమ బిడ్డలకు పెట్టుకొనేవారు. ఆధునిక యుగంలో భావ కవిత్వంపై తిరుగుబాటుచేసి వచన కవితలు

ప్రారంభించిన శ్రీరంగం నారాయణబాబు (1906-1961) గారికి ఈ ప్రభువు పేరునే పెట్టారు. రాజ్యంలో ఉన్నాలేకపోయినా స్వామి భక్తిని ప్రదర్శించడం ఆనాటి లక్షణం. ప్రభుత్వంలో ఉన్నా ప్రవాసంలో ఉన్నా ఆశ్రితులను ఆదుకొనడం ఆనాటి రాజుల గుణం. కాశీలో ఉంటున్నప్పుడు కూడా నారాయణ గజపతిగారు అప్పులుచేసి దానాలు ఇస్తూ ఉండేవారు. చనిపోయిన నాటికి ఆయన బాకీలు పదకొండు లక్షలు.

తండ్రి తరువాత ముమ్మడి విజయరామ గజపతిగారికి జమీందారీ దఖలు పడింది. అప్పటికి ఆయన వయసు ఇరవై ఏళ్ళు. ఈయనకు కాశీ వదలి రావడం ఇష్టంలేదు. అయినా కుంఫిణీవారి కోరికను అనుసరించి 1848లో విజయనగరానికి వచ్చి రాజ్యాన్ని చేపట్టారు. 1845 నుండి నాలుగేళ్ళు స్మారెటు దొరగారు సంస్థానం వ్యవహారాలు చూశారు. విజయరామ గజపతిగారికి వ్యవహార నైపుణ్యాం అలవడి సంస్థానపు బాకీలు తీరేదాక ఒక ఏజెంటును నియమించడం అవసరమని భావించారు. స్పెషల్ ఏజెంటుగా క్రూయిజర్ దొరగారు వచ్చారు. అప్పులన్నీ తీర్చేసి రెండు లక్షల ఇరవై యొక్క వేయికి పైగా నిలువచేసి 1852లో విజయరామ గజపతిగారికి సంస్థానం అప్పచెప్పారు.

వ్యవహారజ్ఞానం బాగా అలవర్చుకొనడంవల్ల ఆనాటి జమీందారులందరిలో విజయనగరం సంస్థానాధీశ్వరులు చాలా సమర్థులనే పేరు వచ్చింది. విజయరామ గజపతిగారు తండ్రిలాగే దానధర్మాలు చేసేవారుగాని, వ్యక్తులకుగాక సంస్థలకు ఇవ్వడం ప్రారంభించారు. విశాఖపట్నంలోని వైద్యశాలకు ఇరవైవేల రూపాయలను ఇచ్చారు. విజయనగరంలో జిల్లా స్కూలు అనే పేరిట ఒక ఆంగ్ల పాఠశాలను స్థాపించారు (ఇదే కళాశాలగా అభివృద్ధి చెందింది). విజయనగరంలోనే వేదసంస్కృత పాఠశాలను నెలకొల్పారు. స్త్రీ విద్యకోసం బాలికల పాఠశాలలను చాలాచోట్ల ఏర్పాటు చేశారు.

కుంఫిణీవారు విజయరామ గజపతిగారి వదాన్యతనూ, యోగ్యతనూ గుర్తించారు. సుప్రీం లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో వీరిని సభ్యునిగా చేర్చుకొన్నారు. 1884లో ''మహారాజా'' అనే బిరుదును, 13 శతఘ్నుల సైనిక వందన మర్యాదను స్థిరపర్చారు. ''నైట్ కమాండర్ ఆఫ్ ది మోస్ట్ ఎగ్జాల్టెడ్ ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఇండియా'' (KCSI) అనే అత్యున్నత బిరుదాన్ని 1866లో ఇచ్చారు.

రాజుకు తగ్గ దివాను లభించినప్పుడు రాజ్యం వృద్ధి చెందుతుంది. విజయరామ గజపతిగారికి పెనుమత్స జగన్నాథరాజుగారనే దివాను దొరకడం ప్రజలకు శ్రేయస్కరమైంది. ఈయన నీటి వనరులు ఏర్పరిచారు. ఆనకట్టలు కట్టించి, వ్యవసాయానికి అనువైన కాలువలు తవ్వించారు. జమీలో ఎన్నో రహదారులు వేయించారు. వర్తక వ్యాపారాభివృద్ధి చేశారు. ఈ దివాను గారి దక్షత వల్ల సంస్థానం సుభిక్షితమయింది. విజయరామరాజుగారు తమకు 1850లో జన్మించిన ఆనందగజపతి అనే కుమారునికి రాజ్యం అప్పచెప్పి 1879లో కన్నుమూశారు.

సంస్థానంలో ఉన్నా, ప్రవాసంలో ఉన్నా నారాయణ గజపతి కాలంలో వారిని ఆశ్రయించుకొన్న కవులు సాహిత్య కృషిని బాగా చేశారు. విజయరామ గజపతిగారు ప్రత్యక్షంగా సాహిత్యపోషణ కావించారు. ఈ యుగంలోని కవుల గురించి అవసరమైనంత భోగట్టాలు తెలుసుకొందాం.

చేటరాతి లక్ష్మీనరసయ్య (1740-1800)

మన సాహిత్య చరిత్రకారులు ఇతని ఇంటిపేరును ''చట్రాతివార''ని పేర్కొనడం పరిపాటి. అయితే ఇతడు యతిస్థానంలో తన ఇంటిపేరును ఒక నిఘంటువులో ఇలా చెప్పుకొన్నాడు.

''క్షోణి కౌండిన్య గోత్రజ గోప జగ
వీర రాఘువు కనకాంబగారి సుతుడు
చేటరాతి లక్ష్మీనరసింహ కవి
చెప్పినాడు విశేషాంధ్ర మొప్పుమీర''

ఇదే కవి ఇదే గ్రంథంలోని ఇంకో పద్యంలో తన ఇంటిపేరు, సొంతపేరు ఇంకొకలాగ చెప్పుకొన్నాడు.

''ఆంధ్ర సంగ్రహ శేషాదులందులేని
యన్నిటిని గూర్చె నీ విశేషాంధ్రమందు
వీర రాఘువ కనకాంబగారి సుతుడు
చాటరాతి లక్ష్మీనరసయ్య సుకవి''

రెండు పద్యాలలోనూ తల్లిదండ్రుల పేరులు ఒకటే. కనుక రెండు రకాలుగా ఇంటిపేరును, తన పేరునూ చెప్పుకొన్న కవి ఒకటే. ఇతడు ఈశ్వరీ పరిణయం అనే ఒక ప్రబంధాన్నీ, కోదండరామశతకం, విశేషాంధ్రం అనే గ్రంథాలనేకాక ''పద్మనాభ యుద్ధమ''నే సమకాలిక చారిత్రక కావ్యాన్ని రచించాడు. ఇతని శతకంలో కొన్ని పద్యాలు బ్రౌను దొరగారి కాలంలోనే ప్రాచుర్యం పొందాయి. ''భండనారాతి భీమ! కోదండరామ!'' అనే మకుటంగల ఈ శతకంలోని 13 పద్యాలను బ్రౌనుదొరగారి ముద్రిత శతక గ్రంథాలలో చేరాయి. ఈ పదమూడింటిని శతక కవుల చరిత్రకారులు తమ గ్రంథంలో మళ్ళా ప్రచురించారు.[1] సీతారామరాజుగారి నిరంకుశ పరిపాలనలో ఈ శతకాన్ని కవి చెప్పాడని లోకులు చెప్పుకొంటారు. అనుసరించిన వారిని ఆదుకోలేని అధిపతులను దూషిస్తూ అలా ఒక పద్యం చెప్పాడు.

''వెను వెంటఁ దిరిగితే విటకానితోఁ జెప్పి
    సమకూర్చు కార్యంబు సానిదైన
మచ్చిక జేసితే వచ్చిన దొంగను
    గూసి పోఁగొట్టును కుక్కయైన
నలవాటుఁ జేసితే యడుగునంటిన ముల్లు
    రక్షసేయును పాదరక్షయైన
నీవాఁడ ననుకొన్న నెలనెల పనిఁజేసి
    మానిపోవును డబ్బు మంగలైన
అంతకన్నను తక్కువైనట్లు దోచె
ననుసరించిన వారి గాయంగ లేక

1. వంగూరి సుబ్బారావుగారు - 'శతకకవుల చరిత్ర' - నరసాపురం, 1957- పుట 410 నుండి

యందలం బెక్కి తిరిగితే యతిశయంబె?
భండనారాతి భీమ కోదండరామ''

దండించకపోతే దారిలోనికి రాని వారి సంగతి ఇలా చెప్పాడు.

''కొతిమిరగింజ లంకురములఁ బెట్టునా
పాఁత చెప్పుల కాళ్ళుఁ బామకున్న
మడిలోపల మనుష్యమలము వేయక కాని
బలువు ముల్లంగి దుంపలు మొలచునె
బరిక చేతనుబట్టి భయపెట్టికొట్టక
కంచరి తట్టు శీఘ్రము నడచునె
తండముల్ కోలచే పుండుగాఁ బొడువక
తిన్నగా నడుచునే దున్నపోతు
మెట్టుకొకమారు దొబ్బులఁ బెట్టకున్న
కరిగి మెత్తనఁబడదు ముష్కరుని మనసు
దొంగవానికిఁ జెవిఁగోయ దోసమేమి
భండనారాతి భీమ కోదండరామ.''

దుష్టుల పరిపాలనలోనే ఈ శతకాన్ని కవి చెప్పాడని నిర్ణయించడానికి ఈ క్రింది పద్యం సాక్ష్యం ఇస్తుంది.

''సామంతులకు నివాసములందు పారాలు
వారాంగనలకు సవ్వాయి పుండ్లు
మధుకోశములయందు మక్షిక వ్యూహంబు
మొగలి పూచెండ్లకు ముళ్ళగములు
అర్చనగుళ్ళలో నాశ్శీలు గొనువారు
శ్రీగంధతరుల కాశీ విషములు
రాజుల యొద్ద దుర్మార్గ ప్రధానులు
గొర్ల మందల యొద్ద కుర్కురములు
గలుగజేసిన విధికేమి గల్గునొక్కొ
తత్తదర్థుల చేత పొందగల తిట్లే
కానిపని సేయ దేవతకైన నింద
భండనారాతి భీమ కోదండరామ!''

ఏమాటనైనా వాడడానికి సంకోచించని చత్రాతి లక్ష్మీ నరసయ్య ఇతర రచనలు ఇంత ప్రాచుర్యం పొందలేదు. ''పద్మనాభ యుద్ధం'' ఒక ఆశ్వాసం అచ్చుపడింది. ఇందులో కవి సందర్భానుసారంగా హిందూస్థానీ, ఉర్ధూ, ఇంగ్లీషు పదాలను స్వేచ్ఛగా ప్రయోగించాడు. పద్మనాభ యుద్ధాన్ని ప్రత్యక్షంగా చూసినంత చక్కగా రచన సాగింది. ఇది పరిశీలించదగిన చారిత్రకకావ్యం.

వద్దిపర్తి కోనమరాజు (1754–1834)

ఈయన కవిత్వం చెప్పగలిగిన కవి. తన సంగతి ఇలా చెప్పుకొన్నాడు.

''ఊరు సర్వసిద్ధి పేరు కోనమరాజు
వద్దిపర్తి వారు వాస్తవంబు
బ్రాహ్మణుండనేను బ్రాబంధికుండన
బరగువాడ ధాత్రినెరుగువాడ''

లోకాన్ని తెలిసినవాడు కాబట్టే సమకాలికమైన విషయాలపై కవితలు చెప్పాడు. ఇతడు రచించిన జమాబంది దండకం, కమిటి ఉత్తరం కుంఫిణీ యుగంలోని కరణాల కష్టనష్టాలను, మిరాసీదారుల సమాచారాలు, యినాం భూముల జమాబందీ ఫైసలా వివరాలు వగైరాలు ఉన్నాయి. ఈ కవి సంప్రదాయబద్ధంగా వేంకటేశ్వరోపాఖ్యానం, రేవతీ పరిణయం, శ్రీ మహాలక్ష్మి పరిణయం మొదలైన కృతులు చెప్పాడు. జానకీరామ శతకం రచించాడు. ఈ శతకం విలక్షణమైనది. దీనిలో కవి స్వకీయ విషయాలు చాలా ఉన్నాయి. సొంత దావా ఏదో కోర్టుకెక్కితే ''నిజము సాధించి నా భూమి నిర్వహించి తీర్పు నా పక్షముగ జేయు దేవ దేవ!'' అని ప్రార్థించి కేసు గెలుచుకొన్నాడు. జీవితంలో ఏ విషమఘట్టం వచ్చినా ఇతడు పద్యాలు చెప్పాడు. జగన్నాథుని రథ యాత్రా సందర్భంలో ఇతణ్ణి సుంకమడిగారట. ఇవ్వకుండా పద్యాలు చెప్పాడు. రథం ఆగిపోయిందట. డబ్బు పుచ్చుకోకుండా ఇతణ్ణి జాతరలోనికి వెళ్ళనిచ్చారట.

జమాబంది ఇబ్బందుల గురించి ఈయన ఒక సీసమాలిక వ్రాశాడు. అందులో కరణాల భోగట్టా చెప్పాడు. దాన్ని ''కమిటీ ఉత్తరం'' అంటారు. కోనమరాజు రచనలలో సమకాలిక ప్రభావం కనబడుతోంది.

ఇతని కమిటీ ఉత్తరం, జమాబంది దండకం ఆనాటి సాంఘిక భాషాచరిత్రలోని కొన్ని అంశాలపై కాంతులు ప్రసరిస్తాయి. ఉదాహరణకు కమిటీ ఉత్తరం సీసమాలికలో కొన్ని పంక్తులు చూడండి.

''మూఁడు ముద్దత్తులు మూటికి యేకట్ట
    దిసకకుళుత్థాది దినసుమెట్టు
ఝూడాదరోబస్తు సనధిల రాబడి
    పంట మిరాసీల పంట రుసుము
చాకర్ల పంటయు సకలము రాబడి
    గాముగానా వసూల్ కట్టుబళ్ళు
పోతులు గేదెలు పొన్నూరు నాగళ్ళు
    యెద్దుల మందలు యెసగపెద్ద
నాయలవైనము పాయకారీ మొదల్
    మేకలు గొఱ్ఱెలనేకమైన
పూర్వపు మాన్యముల్ తరువాత మాన్యముల్
    కొన్న భూములు ప్రతి గొన్నయట్టి

ఫీరస్తు కల్గిన పారమాఖీఖత్తు
యిస్మెంటు కాగితమిచ్చినార
కరువులో గడికి లెఖ్ఖలు బోయె మావద్ద
కరువులో లెక్కలు గానరావు.

ఝూము ప్రొద్దెక్కెను శాలికుడా, కచే
రీకి వస్తున్నావ లేక మాను
తున్నావొ జెప్పుము తుప్పు జుల్మానాకు
కాసుకు గతిలేదు కాపులివరు
ఇదిగొ వస్తినటంచు అదిగొవస్తినటంచు
చంక లెఖ్ఖ గదించి సరవినేఁగి
యా పంచగూర్చుండ నాపంచగూర్చుండ
నంత లోపల రవియస్తమింప
చిరచిరలేచి ముందర సాగువారల
గూడిడేరా చేరి కొంతచేపు
తాటియాకులు విప్పి తారుమారులు చేసి
దీపాలముందర తిరగవేసి
ఆరుయేడ్నెల్లు వీరు చీకాకుపడిరి
గానవారల రక్షించి కరుణ జేసి
శలవు వేగం బొసంగవె సారసాక్ష
వినుత గౌరీశ వృషమాక వేంకటేశ'' (విస్మృత కళింగాంధ్ర కవులు - పు.98-100)

వద్దిపర్తి కోనమరాజులాంటి కవులు కుంఫిణీ యుగంలో సమకాలిక భాషతో విషయాలను గ్రంథస్థం చేయడం సంతోషించదగ్గ సంగతే. కమిటీ ఉత్తరం జమాబంది దండకం లాంటిదే ఇంకొక రచన మరొక కవిది ఉంది. దాని పేరు బేరీజు పద్యాలు. ఇందులో చిట్టా ఆవర్జాలు, లెక్కలు ఎలా రాయాలో కవి చందోబద్ధంగా చెప్పాడు. అతని పేరు విస్సాప్రగడ కామరాజు. ఇతడు కుంఫిణీయుగంలోని వాడేగాని ఏ ప్రాంతాలవాడో, ఎవరి ప్రాపకంలో ఉన్నాడో తెలియదు.

నడిమింటి రామజోగి (1770-1840)

ఈ కవి చిన్నప్పుడే గోదావరి మండలం నుండి విజయనగరానికి వచ్చాడు. చిన విజయరామరాజుగారి దర్శనం. రాజావారి ఖాసాఖందాలో ముప్పూటలా భోజన సదుపాయాన్ని పొందాడు. ఆనాటి విజయనగరపు కవులందరిలాగే ఇతడు దండకంలో కథాకథనం చేస్తూ భళ్ళాణ చరిత్ర చెప్పాడు. యుగధర్మాన్ని అనుసరించి బాణాసుర యుద్ధాన్ని పదంలాగ రచించాడు. దండకంలో ప్రబంధరీతులు చొప్పించాడు. అడిదం సూరకవిగారి మనుమడు సూరన్న ఈ రామజోగి దండకాన్ని ఇలా మెచ్చుకొన్నాడు.[2]

2. అడిదం రామారావు - విస్మృతాంధ్ర కళింగ కవులు అనే గ్రంథంలో ఉదహరించారు. పుట 112.

''బేబా యిప్పటి కవులకు
సూబా నడిమింటి రామజోగి సుకవి రా
డాబాహద్దరు వహవా
శా బాసుగ దండకంబు చక్కగ నుడివెన్''

సమకాలికులు ''శాబాసు'' అని మెచ్చుకొనడం ఒక కితాబే. ''ఏ గతి రచియించెనేని సమకాలమువారలు మెచ్చరే కదా!'' అని బాధపడే రోజులు పోయి ఏగతి రచియించినా మెచ్చే సహృదయులు పెరగడం గమనించదగ్గ లక్షణం.

పచ్చమెట్ట పాపయ్య (1765-1840)

ఏ కాలంలో ఏ కవి కళ్ళకైనా ఇచ్చేదాత ఇంద్రునిలాగా చంద్రునిలాగా కనబడితే అశ్చర్యపడక్కర్లేదు. మగటపల్లి కామయ్య అనే ఓడ వర్తకుడు పచ్చమెట్ట పాపయ్య అనే కవిని బాగా సత్కరించాడు. ఆ దాతను ''కామయ చంద్రా'' అని సంబోధిస్తూ కవిగారు చాలా పద్యాలు చెప్పాడు. ఇవి అడిదం సూరకవి పూర్వం కొణగుపాటి వెంకట మంత్రిమీద చెప్పిన కందాల అనుకరణలలాగ కనబడితే, చెప్పే విషయమూ ఛందస్సూ, పొగిడే తీరూ ఒకటే కాబట్టి అలా కనబడతాయి అని సహృదయులు సర్దుకుపోతారు. ఈ పాపయ్య తమ సమకాలికులలాగ ఒక దండకమూ శతకమూ కూడా చెప్పాడు. దండకం పేరు హనుమద్దండకం, శతకం పేరు మహిషాసురమర్ధనీ శతకం. అనుకరణ ఉత్తమమైన ప్రశంస అయితే ఈ కవి అడిదం సూరకవిని, నడిమింటి రామజోగిని ఘనంగా ప్రశంసించాడని చెప్పాలి.

కాళ్ళకూరి గౌరీకాంతం (1780-1860)

కొందరు సమకాలికుల సాహితీ రీతులను అనుకరిస్తే, కొందరు పూర్వకవులనే పూర్తిగా అనుకరిస్తారు. ఇటువంటి కవులు ప్రతి యుగంలోనూ వుంటారు. కుంఫిణీ యుగంలోనూ ఉన్నారు. కాళ్ళకూరి గౌరీకాంతం ''ధర్మనందన విలాసం'' అనే మూడాశ్వాసాల గ్రంథంలో వసుచరిత్ర, మనుచరిత్ర, నైషధం, విజయవిలాసం, పోతనగారి భాగవతం లోని రుక్మిణీ కల్యాణం మొదలైన కావ్యాలలోని మాతృకలకు పుత్రికలలాంటి పద్యాలను చాలా చెప్పాడు. ఇది పాండవాగ్రజుడైన ధర్మరాజు కళావతి అనే రాకుమారిని పెళ్ళాడే కథను చెప్తుంది. ధర్మరాజుకు పాంచాలి పట్టమహిషి. అందుచేత గౌరీకాంతం కాకమాని మూర్తికవి పాంచాలీ పరిణయంలోని పద్యాలను ఇమిటేట్ చేశాడు. మూర్తికవి పెళ్ళి భోజనాలను వర్ణించే ఘట్టంలో కడుపు నిండిపోయేటట్టు పద్యాలను ఒడ్డిస్తాడు. గౌరీకాంతం కూడా అదే చేశాడు. మచ్చుకు ఒక పద్యం.

''కూరల తృప్తి చేకూరె మాకును నింకఁ
బచ్చళ్ళు దెమ్మని బలుకువారు
పచ్చళ్ళ రుచిగానబడిఁ యెడు మాకింకఁ
బులుసు చారెడటంచుఁ బలుకువారు

పులుసు చారులం దృష్టి పొందితిమింక మీద
భక్ష్యముల్ దెమ్మని బలుకువారు
భక్ష్యముల్గొంటి మీపాటి పాయసము తి
మ్మనములు దెమ్మని యనెడివారు
పాయసము తిమ్మనములుండె ఫలరసములు
పెరుగు పాలల్ల దెమ్మని పిలుచువారు
నగుచు బ్రాహ్మణ ముఖ్యులాద్యంతయుక్త
భుక్తిం గెవ్వన నార్చి రప్పుడు నృపుండు'' (ధర్మనందన-3-53)

ఇటువంటి అనుకరణ పద్యాలే ''కడుపు నిండితే గారెలు చేదు'' అనే సామెతను నిజం చేస్తాయి. అయితే కడుపు నింపుకొనడానికి కవులు కావ్యాలు రచించక తప్పదు. గౌరీకాంతం విజయనగర సంస్థానంలో నారాయణ గజపతి కాలంలోనివాడు. ఆ ప్రభువుకు కృతిని ఇవ్వలేదు గాని వారి దగ్గర దండనాయకునిగా ఉన్న వెలిచేటి గురురాయుడనే శూరునికి అంకితమిచ్చాడు. కృత్యాదిలో నారాయణ గజపతిని ఇలా వర్ణించాడు:

''నిత్యగంగాస్నాన నిఖిల దేశాస్థాన
పూజిత కీర్తి యేపుణ్యమూర్తి
శ్రీరంగనాథ పదారాధనోన్మేష
పరమ పవిత్ర మేప్రభు చరిత్ర
మురుసువర్ణంబు వర్ణోదయాకారి మా
ధవ వర్మ యేకులోత్తముని పూర్వుఁ
డశనిఖండన పటిష్ఠాఖండ దోర్దండ
పాండిత్యుఁ డే గోత్ర పతికులేశు
డట్టి శ్రీ పూసపాటి వంశాబ్ధి చంద్ర
విజయరామ సర్వం సహావిభుతనూజుఁ
డరుణ నిభతేజుఁ డలరు నారాయణ గజ
పతి మహారాజు భోగ సుపర్వ రాజు'' (ధర్మ-1-11)

నారాయణ బాబుగారు ఎక్కువకాలం ప్రవాసంలోనే ఉండడంవల్ల ప్రత్యక్షంగా చేసిన సాహిత్య పోషణ గణనకు రాలేదు.[3]

వీరి తర్వాత వచ్చిన మహారాజా విజయరామ గజపతికాలం నుంచీ మళ్ళా విజయనగర సంస్థాన సాహిత్యం కొత్త చిగుళ్ళు వేసింది. అవి జమీందారీ యుగంలో జమకట్టుకోవాలి.

3. వీరికాలంలో విజయనగర సంస్థానంలో ఉన్న కవుల గురించే ఇక్కడ విపులంగా చెప్పుకొన్నాం. ఈ కవుల గురించీ, వారు వారు చేపట్టిన ప్రక్రియల గురించి వివరంగా వ్రాసిన ప్రకరణాలలో కూడా మరికొంత భోగట్టా ఉంది. ఉదా: పరిపరి పరిణయాలూ, అభ్యుదయాలూ, విలాసాలూ, చరిత్రలూ, ఉపాఖ్యానాలు, శతక కవులు, దండకాలు వగైరాలు.

గోడేవారు

కుంఫిణీ యుగంలో పెద్దాపురం వంటి కొన్ని ప్రాచీన సంస్థానాలు చితికిపోతే గోడేవారిలాంటి కొత్త జమీందారులు వర్ధిల్లారు. విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి పరిసరాల్లోని చాలా గ్రామాలకు ప్రొప్రయిటర్లయ్యారు. విజయనగరం తరువాత ఇంత పేష్కసు కట్టేవాళ్ళు లేరన్నంత ఘనులయ్యారు. అయితే కుంఫిణీ యుగంలోని ఇతర జమీందార్ల కన్నా ఒక ఆకు ఎక్కువే గోడేవారు చదువుకొన్నారు. ఈ కుటుంబంలోని ఆడవాళ్ళు కూడా స్వయంగా కావ్యాలు రచించారు. గ్రంథాలు వ్రాయించారు. విద్యాసంస్థలు నెలకొల్పారు. ఇంగ్లీషు సంస్కారంలోని మంచినంతా జీర్ణించుకున్నారు. ఈ కుటుంబంలోని వివిధ వ్యక్తుల సాహిత్యసేవా, వాళ్ళను ఆశ్రయించిన సాహితీపరుల వివరాలూ తెలుసుకొందాం.

గోడే జగ్గారావు

కుంఫిణీ యుగంలోని చాలామంది నేటివ్ ప్రముఖులు ఎవరో ఒక తెల్లదొరవద్ద దుబాషిగానో, పండితుడిగానో ఉంటూ క్రమంగా కీర్తి సంపదలు ఆర్జించుకొన్నారు. ఈ యుగం తొలి రోజులలో ఉత్తర సర్కార్లకు బందరే రాజధాని. అక్కడ కుంఫిణీవారి గిడ్డంగికి ఆండ్రూస్ అనే దొర చీఫుగా ఉండేవాడు. ఆయన దగ్గర గోడే జగ్గారావుగారు దుబాషీగా ఉండేవారు. ఆ రోజుల్లో ఒక తెల్లదొర ఎంతటి ఉన్నత పదవిలో ఉంటే అతని దుబాషీకి కూడా అంతటి ఔన్నత్యం వచ్చేది. జాన్ ఫైబస్ దొర బందరులో చీఫుగా ఉన్నప్పుడు అతని దుబాషీ కాండ్రేగుల జోగిపంతులు గొప్ప వెలుగు వెలిగాడు. కొన్నాళ్లు ఆండ్రూస్ చీఫుగా ఉన్నాడు. అప్పుడు గోడే జగ్గారావుగారు ప్రముఖులయ్యారు. ఆండ్రూస్ పాల్గొన్న రాజకీయాలన్నింటిలో ఆయనకు కూడా ఒక చెయ్యి ఉంది.

ఉత్తర సర్కార్లను నిజాం వద్ద నుంచి పుచ్చుకొన్నా అవి తెల్లవాళ్లకు స్వాధీనం కాలేదు. స్థానిక ఇజారాదారులు ధిక్కరించారు. ఒక్కొక్కర్నీ వరసగా తెల్లవాళ్లు లోబరుచుకొన్నారు. మైలవరం దుర్గాన్ని పట్టుకొనడంలో గోడే జగ్గారావుగారు చాలా సహాయపడ్డారు. ఆయన సహజంగా వీర కుటుంబంలోంచి వచ్చినవాడు, దుర్గాన్ని సాధించి, తిరగబడిన వాళ్లను పట్టుకొని తెల్లవాళ్ళకు అప్పజెప్పారు. దొరలు సంతోషించి జగ్గారావుగారికి జోడు మషాళ్లు, షాహిమాన్ పాలకి, అరిగె ఆఫ్తాగిరీ మొదలైనవి ఇచ్చి సన్మానించారు.[1] తమకు తోడ్పడ్డ వాళ్ళను ఘనంగా సత్కరించడం తెల్లవాళ్ళకు బాగా తెలుసు. కాండ్రేగుల జోగిపంతులుగారు చేసిపెట్టిన ఉపకారాలకు ఆయన సంతతికి దివి జాగీరు ఇచ్చారు.

ఉత్తర సర్కార్లు స్వాధీనమయ్యాక ఈ సువిశాల ప్రదేశాన్ని ఒక్క బందరు నుండే పాలించలేమని భావించి తెల్లవాళ్ళు 1769లో మూడు ప్రావిన్సులను ఏర్పాటు చేశారు. ఒకటి బందరు, మిగతా రెండూ విశాఖపట్టణంలోనూ, గంజాములోనూ నెలకొల్పారు.

1. సత్యవతీ పరిణయం - కాకరపర్తి బుచ్చిపాత్రయ్య 1-44

ఈ క్రొత్త ప్రావిన్సులకు కౌన్సిళ్ళు ఏర్పాటు చేశారు. విశాఖపట్టణం కౌన్సిలుకు ఆంద్రూస్ దొరను చీఫుగా నియమించారు. అతనితోపాటు గొడే జగ్గారావుగారు కూడా విశాఖపట్టణం వెళ్ళారు. అక్కడే స్థిరపడిపోయారు. బాగా ఆర్జించారు. పెర్మనెంటు సెటిల్‌మెంటు సందర్భంలో కొన్ని జమీందారీలను కుంఫిణీవారు వేలం వేశారు. షేక్ మహమ్మదుపురం జమీందారీని గొడే జగ్గారావుగారు 18,445 రూపాయలకు కొనుక్కొన్నారు. ఇందులో 18 జిరాయతీ గ్రామాలు 6 శోత్రియ గ్రామాలు 5 మొఖసాలు ఉన్నాయి. ఈ చిన్న జమీందారీ క్రమంగా పెరిగింది. నూరేళ్లలోపున జగ్గారావుగారి మనుమడు మహారాజా అనే బిరుదు తెచ్చుకొనేటంత విశాలమైంది.

గొడే జగ్గారావుగారు ఎంత ఘనంగా ఆర్జించారో అంత గొప్పగా దానధర్మాలు చేశారు. తమ తల్లిదండ్రుల పేరిట సుభద్రపురం, సూర్యనారాయణపురం అనే అగ్రహారాలను దానం చేశారు. విశాఖపట్టణంలో కోదండరామస్వామి వారి ఆలయాన్ని ప్రతిష్ఠించారు. కాశీలో సత్రం పెట్టించారు. కాకరపర్తి తిరుపతి పాత్రయ్య రచించిన సత్యభామాకృష్ణసంవాదాన్ని అంకితం పుచ్చుకొన్నారు (దాని అవతారికలో జగ్గారావుగారి కొడుకుల గురించి, కూతుళ్ల గురించి ఏమీ చెప్పలేదు). తీరిక సమయాల్లో ఎప్పుడూ కవులతో గడిపేవారని ''హృద్యానవిద్య గద్య పద్య పఠణ ప్రవణ - లసిత వదనుడు'' అనే పొగడ్తల వల్ల తెలుస్తోంది. జగ్గారావుగారికి ఇద్దరు భార్యలు. అందులో చెల్లమ్మగారికి ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు పుట్టారు. ఒక కూతురు స్వయంగా రచనలు చేసింది. ఇద్దరు కొడుకులు ప్రసిద్ధులయ్యారు. మొత్తంమీద క్రీ.శ. 1813లో జగ్గారావుగారు పోవడానికి ముందే విశాఖపట్టణంలో గొడేవారిది సాహిత్యపోషక కుటుంబమైంది.

మదిన సుభద్రయ్యమ్మ

గొడే జగ్గారావుగారి సాహిత్య పిపాస వారి పెద్ద కూతురిలో ఇనుమడించింది. ఆమెకు తమ తల్లి పేరే సుభద్రమ్మ అని పెట్టుకొన్నారు. చిన్నప్పట్నుంచీ తండ్రిగారి సాహిత్యగోష్ఠులను చూడడం వల్ల సుభద్రమ్మలో రచనాసక్తి కూడా పెరిగింది. దానికి తోడు ఆశక్తికూడా కలిగింది. ''ఆయత విద్యా సమగ్ర'' అనీ, ''ఆంధ్ర గీర్వాణభాషా పరిజ్ఞాన ప్రశస్తి'' కలదని సమకాలిక కవులు మెచ్చుకొనేటంత చదువుకొంది. అయితే ఈ యుగంలోని ఇతర స్త్రీ రచయితలలాగే ఈమె కూడా ''గణనియమాదికంబులు, వికాసపు ప్రాసలు శబ్ద సంధులనే ఘనవిరతి క్రమంబెరుగనని, ఘన కవీశ్వరులార కారుణ్యావరులార పండితోత్తములార భవ్యులార! నెరసులున్న చక్కగా దిద్దుడీ'' అని రమారమీ ప్రతి శతకంలోనూ ప్రార్థించింది. ఈమె గురువులు ఆ పని చేసిపెట్టారేమో (విద్యాగురువు: ఎవరో పార్వతీశంగారు; కవిత్వ గురువు: ప్రౌఢవచోవిభవాభి రాముడైన రామేశంగారు). విశాఖపట్టణంలో తండ్రిగారు ప్రతిష్ఠించిన కోదండరాముడిమీద, ఇతర దైవాలమీద, దగ్గర్లోనే ఉన్న సింహాద్రి మకుటంలో తన తండ్రిపేరు కూడా చేర్చి ''చారు

వైశాఖ పురధామ జగ్గరాయ దాస హృదయా సోమ కోదండరామ'' అని కీర్తించింది. ఈమె రచించిన అశేష రచనలలో 12 అచ్చుపడ్డాయి.[2] వాటి వివరాలు చూడండి.

1.	కృష్ణ శతకం	(95 కంద పద్యాలు)
2.	కేశవ శతకం	(116 పద్యాలు (ఉత్పల, చంపకాలు)
3.	కోదండరామ శతకం	(19 సీస పద్యాలు)
4.	జానకీ హృదయేశ్వరాష్టకం	(ఒక మత్తకోకిల)
5.	రంగేశ్వర శతకం	(4 శార్దూల వృత్తాలు)
6.	రఘునాయక శతకం	(95 పద్యాలు, ఉత్పల, చంపకాలు)
7.	రాఘువరామ శతకం	(93 కంద పద్యాలు)
8.	వెంకటేశ శతకం	(12 సీస పద్యాలు)
9.	శ్రీరామ దండకం	(రామాయణగాథ, సంపూర్ణం)
10.	సింహగిరి శతకం	(9 సీస పద్యాలు)
11.	సింహాచలాధీశ్వర శతకం	(4 శార్దూల పద్యాలు)
12.	హరి రమేశ పద్యాలు	(5 సీస పద్యాలు)

ఈ గ్రంథాలలో ధర్మరక్షణా! దైత్యనాశనా! పరమేశ్వరా! అనే సంబోధనలతో కూడా కొన్ని పద్యాలు కనబడుతున్నాయి. ''స్థాన విశేషమాత్రమాన'' అనే పూర్వ పద్యప్రభావంతో ''నీటి ముత్తెమా'' అనే సంబోధనతో ఒకపద్యం, ''కురంగనాభమా'' అని మరోపద్యం, మరికొన్ని చాటువులు కూడా ఉన్నాయి.

శతకాలు, దండకాలు మాత్రమేకాక సుభద్రమ్మ చెప్పిన పద్య కావ్యాలూ ప్రబంధాలూ ఏమైనా ఉన్నాయో లేదో తెలీదు. ప్రబంధ రచన చేసినట్టు ఆమె ఎక్కడా చెప్పుకొన్నట్టు కనబడదు. సుభద్రమ్మను ఆమె మేనత్త కొడుకు మదిన సూరయ్యకు ఇచ్చి పెళ్ళి చేశారు. ఈ దంపతులు జమీందారీ ఛాయాలో జీవించారు. ఆధునిక జమీందారీ కుటుంబాలలో కవిత్వం చెప్పిన ఇల్లాళ్లలో సుభద్రమ్మే ప్రథమురాలు. తాను ఆడదే అయినా స్త్రీ వ్యామోహాన్ని గర్హిస్తుంది. కేశవ శతకంలోని ఈ పద్యం చూడండి.

''స్త్రీ కడ సత్యవర్తన జయించుచు గోర్కెలొసంగు భర్తదా
లోక విరోధియౌను తుదిరూఢిగ ప్రాణముగోలు పోయెడిన్
కైక వరంబు గాదనక కానకు రాముని బంపి త్వరన్
నాకము జెందె బంక్తి రథనాముడు శోకము చేత కేశవా'' (నెం.40)

ఆడవాళ్ళ విషయంలో మగవాడు ఆడినమాట తప్పినా భర్తలేని స్త్రీలు మాత్రం గడవనప్పుడు తోడబుట్టినవాళ్ళ యింట ఉండకూడదు. ఈ సంగతి మరో శతక పద్యంలో చెప్పింది.

2. తెలుగు కావ్యములు. 1వ భాగము - మదిన సుభద్రయ్యమ్మ ఆర్షవర ముద్రాక్షరశాల, విశాఖపట్టణం, (1893)

''కాంతుడు లేకున్న గడుపేదయై యున్న
బుత్రులు బాలత బొందియున్న
మిత్రులు శత్రులై మేలెరుంగక యున్న
తిరిపెమే యూరను దొరకకున్న
దీన పోషకుడైన దేవ రక్షామణి
కనికరం బెదపూని కావ కున్న
తన సహోదరులకు ధన ధాన్య సంపదల్
కరము ప్రభుత్వంబు కలిగియున్న
భ్రాతృ గృహవాస మింతికి భార మగునె
వారి కుటిల వచశ్శర వ్రజమునాటి
బాధపడు కంటె దేహంబు బాయుటొప్పు
హీనమై యున్న బ్రదుకేల మానినులకు
వర విశాఖ పురాధీశ హరి రమేశ'' (నెం. 4)

భర్త పోయినా సహోదరులకు ధనధాన్యాలూ, ప్రభుత్వం కలిగినా సుభద్రమ్మకు బాధ హైన్యం మాత్రం కలుగలేదు. సోదరులూ, మేనల్లుళ్లూ ఆమెను చాలా గౌరవించారు. నిజానికి ఆమె దాంపత్యం ఆనందమయమైంది. ఇద్దరు కొడుకులు పుట్టారు. పెద్దవాడికి తండ్రి పేరే పెట్టుకొంది. ప్రిన్సిపల్ సదరమీనుగా పనిచేశాడు. సీమరాణి విక్టోరియా ఇచ్చిన సి.ఐ.యస్ (కంపానియన్ ఆఫ్ స్టార్ ఆఫ్ ఇండియా) బిరుదును పుచ్చుకొన్న వాళ్ళలో మదినె జగ్గారావే ప్రథముడు. సుభద్రమ్మ కొడుకు ఇంతటి ప్రఖ్యాతుడయితే మేనల్లుళ్ళు ''మహారాజు''లయ్యారు (రెండో మేనల్లుడు మహారాజా నారాయణ గజపతిరావుగారే ఈ గ్రంథాలను అచ్చువేయించాడు).

గొడే సూర్యప్రకాశరావు

గొడే జగ్గారావుగారికి ముగ్గురు కూతుళ్లున్నా ఇద్దరే కొడుకులు. ఇద్దరి పేర్ల ముందరా తన తండ్రి సూరయ్యగారి పేరును కలుపుకొన్నారు. పెద్దకొడుకు సూర్యప్రకాశరావు బహుభాషావేత్త. సంస్కృతాంధ్రాలూ, ఇంగ్లీషూ, పార్సీ చక్కగా చదువుకొన్నాడు. వాస్తు, వృక్ష, అశ్వశాస్త్రాలూ తెలిసినవాడు, ఇంగ్లీషు పద్ధతులలో వృక్షశాస్త్రాన్ని అభ్యసించి ఆధునిక విధానాలతో తోటలు వేయించాడు. ఈయన సంపాదించిన చెట్లు చాలా అబ్బురమైనవి. అనకాపల్లి జమీందారీని వేలంలో కొని అక్కడ సూర్యప్రకాశరావు పెద్దతోట వేయించి అందులో గొప్ప బంగళా కట్టుకొన్నారు (ఈ తోటను ఆనాటి గవర్నర్లూ, వాళ్ళ ప్రధానోద్యోగులు చాలా మెచ్చుకొన్నారు). ఏ మాత్రం ''యాస'' లేకుండా తెల్లదొరలతో ఇంగ్లీషు మాట్లాడేవాడు. నిర్దుష్టంగా ఇంగ్లీషు వ్రాసేవాడు. అనకాపల్లి సత్యవరం జమీందారీ గ్రామాలను కొనుక్కున్నా జమీందారీ ఆడంబరాలు లేకుండానే దొరలతో కలసి మెలసి ఉండేవాడు. ఆ రోజుల్లో జమీందార్లు ఎక్కడకు వెళ్ళినా నౌఖర్లు, చాకర్లు, బాజాభజంత్రీలు, గొడుగులు పట్టేవాళ్లు వగైరాలు

ఉండేవారు. ముఖ్యంగా తెల్లదొరలతో భేటీకి వెళ్లినప్పుడు మరీ పటాపటోపం ఉండేది. సూర్యప్రకాశరావు ఒక్కడే గుఱ్ఱపు స్వారీ చేసుకొంటూ తెల్లదొరల వద్దకు వెళ్ళేవాడు.[3] సాయిలా పాయిలాగా ఉండేవాడు.

ఇంకొక కారణంవల్ల ఇంగ్లీషు వాళ్లకు సూర్యప్రకాశరావంటే ఇష్టం. పూర్వం అనకాపల్లి సంస్థానం కాకర్లపూడి వారిది. వాళ్లకు ''పాయకరావు'' అనే బిరుదు ఉండేది. కుంఫిణీ వాళ్లకాలంలోని జమీందారును నల్లమందు పాయకరావు అనేవారు. ''రాత్రి మూడురోజుల పర్యంతరం భోంచేయడమే. ఆ తరువాత నల్లమందు వేసుకుని పడుకొంటే మూడు జాములకే లేచేవాడు.''[4] ఈయన పోయాక ఉత్తరోత్తరా ఈ జమీలు వేలం వేశారు. దానిని క్రీ.శ. 1810లో గొడే సూర్యప్రకాశరావు కొనుక్కొన్నాడు. అయితే తరువాత కాకర్లపూడివారు పితూరీలు చేశారు. జగన్నాథ పాయకరావు, ఎఱ్ఱప్పడు వెంకటపతిరాజు మొదలైనవాళ్లు కుంఫిణీవాళ్లను ధిక్కరించారు. తెల్లవాళ్ళతో కుమ్మక్కు అయ్యాక ధనికుల ఇళ్లపైబడి ధనధాన్యాలు దోచుకున్నారు. లోకభీకరంగా ఇళ్ళకు చిచ్చు పెట్టేవారు. ఈ పాయకరావు పితూరీని అణచడంలో గొడే సూర్యప్రకాశరావు చాలా ప్రముఖ పాత్ర వహించాడు (లేకపోతే కొనుక్కొన్న జమీందారీ పోతుంది). ''మరువం కసురెలపై మార్కొంటూ వంకవై నలుపారు మీసాలు'' దువ్వుతూ దొరలతో, ఫౌజులతో అడవుల వెంటవెళ్ళి కాందిశీకులైన పితూరీదారులను పట్టుకొని తెల్లవాళ్ళకు అప్పచెప్పాడు. మన్యం కమీషనరు రసూల్‌దొర చాలా మెచ్చుకొన్నాడు. గవర్నరు ఆడెమ్ ప్రకాశం పాలు పంపించాడు.

జమీందారీ సుస్థిరమయ్యాక సూర్యప్రకాశరావు ''అనుపమాన మేధావిశేషంతో సకల శాస్త్రార్థ విజ్ఞాన చాతుర్యం''తో సాహిత్యసేవ చేశాడు. అక్కినేపల్లి నరసింహం రచించిన ఓఘువతీ పరిణయాన్ని అంకితం పుచ్చుకొన్నాడు. ఒక్క ప్రకాశరావే కాదు, అతని భార్య కూడా విద్యాభివృద్ధికీ, గ్రంథరచనకూ చాలా తోడ్పడింది.

గొడే జానకమ్మ

సర్వసాధారణంగా జమీందారీ ఛాయా స్త్రీలు బయటకు రారు. పరపురుషుల కంటపడరు. సంఘ జీవితంలో పాల్గొనరు. అయితే గొడేవారి ఇంటి ఆడబడుచులు, కోడళ్లు బాగా సంస్కారం ఉన్నవాళ్లు. తెల్లదొరలతో సైతం సంభాషించేవారు. ప్రజోపయోగ కార్యాలకు తోడ్పడేవారు. గొడే సూర్యప్రకాశరావు గారి భార్య జానకమ్మ ''విద్యా విశారద'' అని సమకాలిక కవులు మెచ్చుకొనేవారు.

ఆమె స్త్రీ విద్యకోసం పాటుపడింది. తెల్లదొరల సలహాపై ఆడపిల్లల బడిని విశాఖపట్టణంలో నెలకొలిపింది. ఒక అనంతర కావ్యంలో ఇలా ఉంది.[5]

---

3. మెకంజీ సంపుటాలు - అనకాపల్లి కైఫీయతు.
4. సత్యవతీ పరిణయం. కాకరపర్తి బుచ్చిపాత్రయ్య - అవతారిక (1-63 నుండి 1-73 దాకా) సూర్యప్రకాశరావు గొప్పలు ఉన్నాయి.
5. పై కావ్యంలోనే. 1-77

''క్యారెక్ట్మెకల్ధార శ్రీ జానకమ్మ తోడ
బరగ హిందూ బాలికా పాఠశాల
నీలిశాఖ ప్రతిన్ నిల్పనీవ తగదు
వనగ నాయమ పాఠశాల నిటు నుంచె''

బళ్లు పెట్టించడమేగాక జానకమ్మగారు కొన్ని గ్రంథాలు వ్రాయించింది. మరింగంటి వెంకటాచార్యులు అనే కవి ''మల్లారి చరిత్ర'' అనే కులపురాణం వ్రాశాడు. ''అది మత్కులాచారమంతయు నుండు గ్రంథం'' అని జానకమ్మగారు ఆదరించింది. అయితే అందులో ఆమెకు నచ్చని కొన్ని పట్లు ఉన్నాయి. అందుచేత ఎర్రమిల్లి పేర్రాజు అనే ఆశ్రితుణ్ణి పిలిచింది. ఆ గ్రంథం గురించి చెప్పింది.

మున్నున్న పుస్తకమున జాల తప్పు
లున్నవి గావున నన్నియు మీరు
సవరించుటే కాదు సరసంబుగాగ
మరికొన్ని పట్టులనరాసి రచింప
వలసిన గ్రంథంబు తెలియజేసెదను (ఆర్. 338 (బి))

అని పురమాయించింది. ఈ మాటలలోనే మన పురాణాలు ఆదిలో ఎలా పెరిగినదీ గ్రహించవచ్చును. పోషకులు ఆదేశించినట్టు పురాణాలు మార్చేసే దురాచారం తొలినుంచీ పట్టుకొన్న రోగమే. తమకు తోచినవన్నీ వ్రాసి స్కాందపురాణానికి అంటగట్టడం చాలా సర్వసాధారణం. ఈ మల్లారిచరిత్ర మార్పులు తెలుగులో మంజరీ ద్విపదలో ఉన్నాయి. కాబట్టి నిన్న మొన్న జరిగింది కాబట్టి ఈ రచనా సాహసాన్ని మనం పట్టించుకోం. ఇదే సంస్కృతంలో వ్రాస్తే అది వ్యాసప్రోక్తమని వాదించేవాళ్లూ ఉంటారు! కుల చరిత్రలూ, కుటుంబ చరిత్రలూ వ్రాసుకొనడం తప్పుకాదు. అందుకు పురాణాలను సంస్కరించనక్కర్లేదు. (నిజానికి గొడే సూర్యప్రకాశరావుగారు అంకితం పుచ్చుకొన్న ఓఘవతీ పరిణయం అవతారిక ఒక చిన్న సైజు కులపురాణం).

మన పురాణాలలో ప్రక్షిప్తాలు ప్రవేశపెట్టిన మహానుభావుల పేర్లు మనకు తెలియవు. ఈ మల్లారి చరిత్రలో సవరణలు వ్రాసిన ఎర్రమిల్లి పేర్రాజు గురించి ఇవాళ ఎవరూ చెప్పుకోకపోవచ్చునుగాని ఆ రోజుల్లో జానకమ్మగారు ఇతణ్ణి ''తమ యాశ్రితులలోన దద్దయునెపుడు గారవించు''తూ ఉండేవారు. ఆ ఆశ్రితులలో ఎందరు కవులో తెలియదు.

గొడే సూర్యనారాయణరావు

గొడేవారి కుటుంబంలో గ్రంథాన్ని అంకితం పుచ్చుకొనని వాళ్లలో ఒక్క సూర్యనారాయణరావే కనబడుతున్నాడు. ఈయన జగ్గారావుగారి రెండో కొడుకు. తండ్రి సంపాదించిన జమీందారీ చాలా పెంచాడు. నక్కపల్లితోపాటు 16 గ్రామాలు, కుప్పిలితోపాటు 16 గ్రామాలు క్రీ.శ.1818లో ఈయన కాకర్లపూడివారి వద్ద కొన్నాడు. కోటీశ్వరుడనిపించుకొన్నాడు.[6] దేవాలయాలకు భూములిచ్చాడు. వానమామల

6. నీలగిరి యాత్ర – కోలా శేషాచలం, మద్రాసు ఓరియంటల్ లైబ్రరీ ప్రచురణ, పుట 75.

మఠానికి చాలా దానాలు చేశాడు. మదరాసు పార్థసారథి కోవిలదగ్గర ఒక మఠంలో ద్వాదశినాడు సంతతారాధన ఏర్పాటు చేశాడు. సప్తగోదావరులకు స్నానఘట్టాలు కట్టించాడు. బీదవాళ్ళకు అన్నసత్రాలు, ఉచిత వస్త్రాలు ఇచ్చాడు. ఈయన కృతి అంకితం పుచ్చుకోవాలనుకొన్నప్పుడు అది పడలేదు. గ్రంథం పూర్తయ్యేలోగా కవి మరణించాడో లేక సూర్యనారాయణ చనిపోయాడో తెలియదు. అయితే ఈయన కొడుకు లిద్దరూ కృతిభర్తలే. సుప్రసిద్ధులే.

గొడే వెంకట జగ్గారావు

గొడే సూర్యనారాయణరావుకు క్రీ.శ. 1817లో పెద్ద కొడుకు పుట్టాడు. అతనికి తన తండ్రి పేరే ఆయన పెట్టుకొన్నాడు. ఆ బిడ్డకు పాశ్చాత్య పద్ధతులలో ఉన్నత విద్య చెప్పించాలని తలిచాడు. అయితే ఆ రోజులలో హైస్కూలు, కాలేజీ సౌకర్యాలు సాధారణ పట్టణాలలో లేవు. అందుకే వెంకట జగ్గారావు పదిహేను పదహారు సంవత్సరాల వయసు వచ్చేదాకా విశాఖపట్టణంలో చదువుకొని ఆ తరువాత ఉన్నత విద్య కోసం మద్రాసు వెళ్ళాడు. అక్కడ మెస్టర్ టి.జి. టైలరుదొర సర్కారువారి ఖగోళశాస్త్రజ్ఞునిగా ఉండేవారు. ఆయన దగ్గర వెంకటజగ్గారావు ఎనిమిది సంవత్సరాలు చదువుకొన్నాడు. సామాన్య గణితం దగ్గర నుండి ఛాయా గణితందాకా అన్నీ కరతలామలకం చేసుకొన్నాడు. హైందవ పాశ్చాత్య పద్ధతులలో భూగోళ, ఖగోళ శాస్త్రాలను పరిశీలించాడు. ఒక వంక చదువుకొంటూనే ఆయన ఖగోళ పరిశీలనలు చేస్తూ ఇంగ్లీషు పత్రికలకు వ్యాసాలు వ్రాసేవాడు. క్రీ.శ.1836లో హాలీ తోకచుక్క కనబడ్డప్పుడు దానిపై ఆయన చేసిన పరిశోధనలు, దాని ప్రయాణగతిపై కట్టిన గుణింతాలూ వెనువెంటనే మద్రాసులోని ప్రముఖ పత్రికలు ప్రకటించాయి.[7] ''బృహస్పతి గ్రహద్రవ్యరాశి పరిశీలన;'' ''శూన్యాంక ప్రయోజన పరిశీలన'' మొదలైన శాస్త్రీయ విషయాలపై చాలా ప్రామాణిక వ్యాసాలను ఎన్నో ఇంగ్లీషులో వ్రాశాడు. ఖగోళ విద్యలో నిష్ణాతుడవడంచేత టైలరు దొర సెలవుమీద ఉన్నప్పుడు అతనికి బదులుగా వెంకటజగ్గారావు హంగామీ[8]గా ఆ ఉద్యోగ విధులను నెరవేర్చాడు.

చెన్నపట్టణంలో చదువుకొన్న శాస్త్రాలను వెంకటజగ్గారావు స్వగ్రామంలో అమలుపెట్టాడు. ఆధునిక పరికరాలు అన్నీ తెప్పించి విశాఖపట్టణం డాబా తోటలో ఆయన పెద్ద నక్షత్రశాలను నిర్మించాడు. ''కాలగతి శీఘ్ర స్ఫూర్తి బోధింపగా'' దీనిని కట్టించినట్టు జనులు ఆశ్చర్యంగా చెప్పుకొన్నారు. ఒక్క ఖగోళ శాస్త్రంలోనేకాక సంస్కృతాంధ్ర కవిత్వాలన్నా వెంకట జగ్గారావుకు ఇష్టం. మదరాసులోని ''హిందూ లిటరరీ సొసైటీ''కి క్రీ.శ. 1836 నుండీ ఆయన పోషకుల వర్గంలో ఉన్నాడు. చెన్నపట్టణంలోని విద్వాంసులకు ఆయన ప్రాపకం ఎప్పుడూ ఉండేది. కోలా శేషాచలం అనే రచయిత వ్రాసిన ''నీలగిరి యాత్ర'' అనే వాక్య గ్రంథాన్ని వెంకట జగ్గారావు అంకితం పుచ్చుకొన్నాడు. వివిధ మత గ్రంథవేత్తగా, బహుకళావిదగ్ధునిగా, సంగీత కోవిదునిగా అతడు చాలా ప్రఖ్యాతుడయ్యాడు.

---

7. Journal of Literature & Science, Vol.3 No.1 (1836 January)
8. ''హంగామీ'' అంటే ''తాత్కాలికం'', ''టెంపరరీ'' అని అర్థం.

ఆ రోజుల్లో అంతటి ప్రశంసలు వచ్చినా ఆంధ్రుడై పుట్టిన కారణంచేత వెంకట జగ్గారావుకు అఖిల భారత ఖ్యాతి ఈనాడు రాలేదు. తెలుగు గడ్డమీద పుట్టిన మొట్టమొదటి ఆధునిక సైంటిస్టుని ఆంధ్రులం కనుక మనం కూడా జ్ఞాపకం పెట్టుకోనం. గొడేవారు అంకితం పుచ్చుకొన్న గ్రంథాలన్నీ వెలుగు చూశాయిగాని వెంకట జగ్గారావు ఇంగ్లీషులో వ్రాసిన వ్యాసాలన్నీ గ్రంథరూపంలో వచ్చినట్టు కనబడదు. దురదృష్టవశాత్తూ ఆయన ముప్ఫయి తొమ్మిదోయేటనే మరణించాడు. మరికొన్నేళ్ళు బ్రతికుంటే చాలా సాధించి ఉండేవాడు. ఆయన స్థాపించిన నక్షత్రశాలను అతని అల్లుడు అంకితం వెంకటనరసింహారావు చాలా ఉత్సాహంతో నడిపించాడు. వెంకట జగ్గారావుకు మగసంతానం లేదు. ఒక్కర్తే కూతురు. ఈమె పేరిటనే విశాఖపట్టణంలో మిసెస్ ఏ.వి.యన్ కాలేజీ పెట్టారు. బ్రతికింది కొద్దికాలమైనా గొడే వెంకట జగ్గారావు చాలా నిండైన విద్యా జీవితాన్ని అనుభవించాడు. ఈ బహుముఖ ప్రజ్ఞావంతుని గురించి ఇంకా విపుల పరిశోధనలు అవసరం.

గొడే నారాయణ గజపతిరావు

వెంకట జగ్గారావు చాలా తక్కువ కాలం బ్రతికినా అతని సవతి తమ్ముడు నారాయణ గజపతిరావు మాత్రం 75 సంవత్సరాలు జీవించాడు. (జననం 1828; మరణం 1903) వెంకట జగ్గారావు చెన్నపట్నంలో చదువుకొంటే ఈయన కలకత్తా హిందూ కాలేజీలో విద్యాభ్యాసం చేశాడు. 1853లో తన వంతుకు వచ్చిన జమీందారీకి ''పట్టం'' కట్టుకొన్నాడు. చాలా దానధర్మాలు చేశాడు. పుస్తకాలు అచ్చు వేయించాడు. పత్రికలకు విరాళాలు ఇచ్చాడు. తన తండ్రి అంకితం పుచ్చుకోవలసిన గ్రంథానికి అవతారిక వ్రాయించి కృతి అందుకొన్నాడు. చాలామంది విద్వాంసులను పోషించాడు. ఇతని సాహిత్య వ్యాసంగం జమీందారీ యుగంలో ఎక్కువ జరిగింది. ఇప్పుడు గొడేవారు పోషించిన వివిధ కవుల గురించి తెలుసుకొందాం.

కాకరపర్తి తిరుపతి పాత్రయ్య

మన సాహితీపరులలో అందరూ సంప్రదాయానికి కట్టుబడ్డవాళ్ళే. ప్రాచీన ధోరణులలో రచనలు చేసినవాళ్ళే. అయితే ఎంత పురాతన మార్గంలో నడుస్తున్నా దారంట కొత్త కొమ్మలు చూసి మత్తువాసన గుబాళించే పువ్వులను ధరించిన కవులు కొందరు లేకపోలేదు. వాళ్ల కోవలో తిరుపతి పాత్రయ్య ఒకడు. ఈయన సత్యభామాకృష్ణ సంవాదం అనే శృంగార ప్రబంధాన్ని వ్రాసి గొడే జగ్గారావుగారికి అంకితం ఇచ్చాడు. దాని అవతారికలో ఏయే పూర్వకవుల గొప్పతనాలు తనలో ఉన్నవీ ఇలాగ జగ్గారావుగారి నోటంట పలికించాడు.

మృదుపదవైఖరుల్ బొదలించునప్పుడు
  నందితిమ్మామాత్యు నైపుణంబు
సలలితాలంక్రియల్ సమకూర్చునప్పుడు
  కవి రామభద్రుని కౌశలంబు

నర్థ గుంభన రీతులలరించు నపుడల
సాన పెద్దన ప్రతిభానిరూఢి
ఘనతర శ్లేష కల్పన చేయునపుడు పిం
గళ సూర కవి నిరాఘాట పటిమ
నీకు గల్గుట జేసి నాళిక భవ వ
ధూనటి యనారతము తన కేశ మృదుల
జిహ్వికా రంగమున ప్రీతిచే నటించు
పాత్రకవి వర్మ సద్గుణ ప్రకర ధుర్య'' (సత్య 1-14)

అష్ట దిగ్గజాలలో నలుగురి నైపుణ్యాలు తనలో ఉన్నాయని భావించి చాటుకొనేవాడు. కనీసం సగం దిగ్గజమేనా కావాలి. నిజానికి ఈ ప్రతిభలన్నీ తిరుపతి పాత్రయ్యలో ఉన్నాయి. కేవల కల్పనాకథను తీసుకొని చక్కగా సానపట్టి జాతి రత్నాన్ని చేశాడు. కొన్ని కోణాలలో ఈ రత్నం ధగధగలాడుతుంది. హాయి గొలుపుతుంది.

ఇందులో కథ చాలా స్వల్పమే. ఒకనాడు ఎంత రాత్రయినా సత్యభామాదేవి ఇంటికి శ్రీ కృష్ణమూర్తి రాలేదు. ఆమె విరహంలో పడి దూతికను పంపింది. ఆయన వచ్చాడు. అయితే ఆమె ''అన్యవధూ పరిభోగ చిహ్నాముల్ కనుగొని రోషవహ్నిశిఖ కైవడి కన్నులకెంపు నింపుతూ'' తలుపు వేసుకుంది. భార్యాభర్తలకు సంవాదం నడిచింది.

ఇంకొకరికి సొమ్మయినాడని సత్యభామ ఇలా ఎత్తిపొడిచింది.

తళుకు పసిడి గాజుల నొక్కుల గళంబు
స్తన మృగనాభి పత్రమూనిన యురంబు
గంబురా విడియంపు కావిని కనుదోయి
లాక్షారసమున ఫాలస్థలంబు
పలుమొన సోకున కళుకు లేజెక్కిళు
లసదుగాటుక చిన్నె నలతి మోవి
రమణీయతర నఖాంకముల బాహుయుగము
పలుచని జిగి కదంబమున మేను
ముద్రలెట్టుచు తనదు సొమ్ముగ దలంచి
యెవతె నిను నమ్మి యున్నదో యిపుడు తగవు
మాలి నిన్నంట దగునె మా జోలి రాకు
యొకరి సొమ్మొకరు గానంగ నుచితమగునె'' (సత్య.ఆ.3 - పుట 57)

కళ్ళెదుట స్పష్టంగా కనబడుతున్న పరిభోగ చిహ్నాలన్నీ మరొక కారణంచేత ఏర్పడ్డవని కృష్ణుడు నైసుగా ఇలా వ్యాఖ్యానించాడు.

శ్రీవత్సరుచియెద జెన్నలరెనుగాక
యిది కురంగమదాంకమే! లతాంగి!
గళమున నమరు భాగ్యంపు రేఖలుగాక
యివి గాజుల నొక్కులా! యిందువదన!

కర్ణకుండల రత్న కాంతిగాకక్షుల
  నిది తమ్మరసమటే! యిగురుబోడి!
నాపై కొదవు నీదు కోపరసంబుగా
      కిది యంగరాగమటే! వధూటి!
తద్వియోగోధితోష్ణ నిశ్వాసములను
కమలు నధరంబు నైల్యంబు గాక కజ్జ
లాంకమే యిది యంబురుహాయతాక్షి!
యేల యనుమాన మింక! నన్నేలుకొనవె! (సత్యా.3, ఆ.పుట.57)

చూస్తూ ఉండగా ఇలా బుకాయించి బురుడీలు చెప్పి బుట్టలో వేసుకోగలిగిన వాళ్ళకు ఎవరు వశంవదులు కారు? సత్యభామ చివరకు తలుపు తీసింది. ''నిజాఖిలాషాభిరూప్యంబుగా కుసుమ శరకేళిక''లకు దారి తీసింది. ఆ ''నిజాభిలాషులు'' ఏమిటో చెప్పకుండా తిరుపతి పాత్రయ్య తొందరలో కావ్యాన్ని ముగించడంలో ఎంతో ఔచిత్యం చూపించాడు. సత్యభామా కృష్ణ సంవాదం మూడాశ్వాసాల శృంగార ప్రబంధమే గానీ సంవాదం మాత్రం మూడో ఆశ్వాసంలోనే ఉంది. అయితే ఆ అన్య వధువు మరీ పరాయిది కాదు. యాదవ కుటుంబంలోనిదే. పేరు శశిరేఖ. జవ్వనం రాగానే ''ఎవ్వడొక్కొ తగినట్టి వరుండు'' అని తల్లిదండ్రులు అనుకొంటూ ఉంటే ఆ పిల్లది నల్లవాణ్ణి ''ఉల్లంబులో'' వరియించింది. అతడి ఘనకార్యాలన్నీ గోడమీద వేసిన బొమ్మలు చూసి మెచ్చుకొని మనసు ఇచ్చుకొంది. అతడు వీధంట వాహ్యాళి వెళుతూ ఉంటే చూసి మరులుకొంది. తోటలో విరహం, కృష్ణుడు ''ఉవిదవలవంత యెరుగనట్లు'' చాటు నుంచి చూశాడు. తరువాత తనతోపాటు దగ్గరలో ఉన్న ''బంగళా''కు తీసుకెళ్ళాడు. అవును బంగళాకే తీసుకెళ్ళాడు. చూడండీ పద్యం.

''ఉదిత లజ్జా భరంబున నోహటిలుచు
నేటికెదురీదని హృద యేశు వెంట
వచ్చెనా రామ యారామ వాటి నడుమ
నలరు బంగరు బంగళా కెలనికంత'' (సత్యా. 2. ఆ. పుట 47)

కుంఫిణీ యుగంలో కొత్తగా కట్టుకొన్న బంగళాలేకాక ప్రాచీన రత్నబిత్తిక గృహాలు కూడా సత్యభామా కృష్ణ సంవాదంలో ఉన్నాయి. ఇందులోని పాత్రలు రువాణపు పావడలు, రువాణపు పయ్యెదలు ధరిస్తారు. ఆ చక్కని చుక్కల మేనిపై ''కాశ్మీర పంకచిక్కణత''లు ఉంటాయి. ''నిడుదు సుపాణి యొంట జిగినిగ్గులు'' మెరుస్తున్న కావ్యం ఇది. పదలాలిత్యంతోపాటు అర్థ గౌరవం కూడా ఉన్న కొద్దిపాటి గ్రంథాలలో ఇది ఒకటి. ఇంత చక్కని కవి ఇంకే గ్రంథాలు వ్రాశాడో తెలియదు. కాకరపర్తివారి వంశంలో ఎందరో కవులున్నా ఈ కుటుంబం పూర్వచరిత్ర కూడా ఏమీ తెలియదు; కాకరపర్తి తిరుపతి పాత్రయ్య వేదశ స్త్రార్థ ప్రవీణుడనీ, కరగతాఖిల శాస్త్రసముత్కరుడనీ చెప్తూ అతని

కొడుకు కృష్ణయ్య అనవద్యమనోజ్ఞ కవిత్వ సిద్ధికోసం నమస్కరించాడు.[9] నిజంగా తిరుపతి పాత్రయ్య కవిత్వం నిర్దుష్టమే, మనోజ్ఞమే.

కాకరపర్తి కృష్ణయ్య

తిరుపతి పాత్రయ్యకు ఎందరు కొడుకులో కాని ఒకడికి కృష్ణయ్య అని పేరు పెట్టాడు (తండ్రి పేరు బ్రహ్మంభట్టు; దీన్ని కొడుకుకు పెట్టుకోలేదెందుకో). గొడే జగ్గారావుగారు కాకరపర్తివారికి ఇచ్చిన అగ్రహారాలు (సుభద్రాపురం, సూర్య నారాయణ పురాలు) గంజాం జిల్లా పర్లాకిముడి తాలూకాలో ఉన్నాయి. కృష్ణయ్య అక్కడే పెరిగాడు కాబోలు. పర్లాకిముడికి ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న ముఖలింగక్షేత్రాన్ని చాలాసార్లు చూసి ఆ స్థలపురాణాన్ని మూడు ఆశ్వాసాల గ్రంథంగా రచించాడు. ముఖలింగేశ్వరునకే అంకితం ఇచ్చాడు.

దీని మూలం స్కాంద పురాణోత్తరఖండంలో ఉందని చెప్పాడు (1-15). దీనిని కుమారస్వామి అగస్త్యునికి చెప్పాడు. కళింగ సీమలోని ఒక శబరపల్లెలో ఒక పెద్ద ఇప్ప చెట్టుంది. దాని తొర్రలో ఒక శివలింగం కనబడింది. సంస్కృతంలో ఇప్పచెట్టును మధుకం అంటారు. అందుచేత ఈ దేవునికి మధుకేశ్వరుడు అనే పేరు వచ్చింది. ఈ దేవుని చుట్టూ బ్రహ్మ కోటిలింగాలను ప్రతిష్ఠించాడు. అసలు లింగానికి ''ముఖము గల్గుటచేత ముఖలింగమనియు, ముఖ్యమౌటను దగ ముఖ్యలింగమనియు'' పేరు వచ్చిందట. బ్రహ్మ ఎపుడు ప్రతిష్ఠించాడోగాని క్రీ.శ. తొమ్మిదో శతాబ్దంలో మొదటి దేవాలయ ప్రతిష్ఠ జరిగిందని చరిత్రకారులు నిర్ణయించారు.[10]

అయితే పురాణం చెప్పిన కుమారస్వామి మాత్రం కొంత ఆధునికుడే. ''విష్ణువర్ధన మధుకర్ణ గజపతి'' దేవుని వంశ ''సంజాతు''లగు భూపతులు పర్లాకిముడియను పురంలో తమకు రాజధానియై దనర క్రమక్రమంగా కళింగరాజ్యమేల''డం కూడా స్కందుడు అగస్త్యునికి చెప్పాడు. ఇందువల్ల పర్లాకిముడి రాజధాని అయ్యాక ఈ పురాణం పుట్టిందని చెప్పాలి. తన స్వగ్రామానికి దగ్గరలో ఉన్నది కనుక, కళింగంలోని ప్రముఖక్షేత్రం కనుక కాకరపర్తి కృష్ణయ్య ''ముఖలింగక్షేత్ర మాహాత్మ్యం'' అనువదించాడు (ఇతడు ముఖలింగేశ్వర తారావళి అనే పేరిట 27 కందపద్యాలను కూడా వ్రాశాడు. ''శ్రీముఖలింగా'' అని మకుటం). స్థలపురాణం కనుక ఇందులో పద్యాలు ఎంతో సాఫీగా నడిచినా, అట్టే రసవంతమైన పట్లు తక్కువ. ఈ గ్రంథ రచన తరువాత శశిరేఖా పరిణయం అనే కావ్యాన్ని కృష్ణయ్య చెప్పాడు. ఇది కూడా మూడాశ్వాసాల గ్రంథం. ఇది శృంగార ప్రబంధమని కవి చెప్పాడు గాని ఇందులో ప్రబంధ శైలికన్నా పురాణ ధోరణే ఎక్కువ. మహాభారతంలోని సభాపర్వాన్ని మొదట టూకీగా చకచకా చెప్పుకొంటూ పోయాడు. అరణ్యపర్వ సమయంలో శశిరేఖా పరిణయాన్ని ఎంత విపులంగా చెప్పదలచినా వాచ్యంగానే చెప్పాడుగాని ధ్వని వ్యంగ్యం తక్కువ. మాయ శశిరేఖలాగ ఘటోత్కచుడు

9. ముఖలింగక్షేత్ర మాహాత్మ్యం అవతారిక, 1-10; 11.
10. కళింగ సంచిక (కళింగ దేశచరిత్ర - సంపాదకులు రాళ్ళబండి సుబ్బారావుగారు) ముఖలింగం - భావరాజు వెంకట కృష్ణారావుగారు, పుట 217.

పీటల మీద కూర్చొని ఒక మారు, ''బెబ్బులి కైవడి'' ఒకమారు, ''భీతిగా భూతంబుగతి'' మరియు భల్లూక, జంబుక మహిష ఖడ్గగండకోరగ సూకర గర్దభాతి'' వివిధ రూపాలలో కనబడడం, వగైరా మాయాబజారు ఘట్టాలు అనంతర కవుల కావ్యాలలోనే రక్తి కట్టాయి (ఉదాహరణకు అప్పప్ప కవి శశిరేఖా పరిణయం). శృంగారానికి మరింగంటి వారి తాళాంకనందినీ పరిణయాన్ని చెప్పుకోవాలి. కాకరపర్తి కృష్ణయ్య తన గ్రంథంలోని ''నేరు పున్నేరము నెమ్మనంబున గణింపక'' గైకొనమన్నాడు. గాని తండ్రిలో ఉన్న నేరుపు ఇతనికి అబ్బలేదు.[11]

తండ్రి గుణాలలో ఇంకొకటి కూడా కృష్ణయ్యకు అబ్బలేదు. గొడే జగ్గారావుగారు పిలిచి ఒక కృతి అంకితం ఇమ్మంటే తిరుపతి పాత్రయ్య ''సరసాగ్రణి యీతని యాదరమే మనకు పదికోట్ల ద్రవ్యంబు ముష్కరు పయింజెప్పిన కావ్యరసము బూడిదను బోయు పన్నీరుగదా'' అనుకొన్నాడు (1-18). కొడుకు కృష్ణయ్య మాత్రం తన గ్రంథాలు రెండింటినీ దేవునికే అంకితమిచ్చాడు. తండ్రిని ఆదరించిన గొడేవారికి ఇంకేదైనా పుస్తకం కృతి ఇచ్చాడేమో తెలియదు. ఇతని కొడుకు బుచ్చిపాత్రయ్య మాత్రం మళ్ళా గొడేవారి పోషణలో వున్నట్టు కనబడుతుంది.

కాకరపర్తి బుచ్చిపాత్రయ్య

గొడే జగ్గారావుగారి రెండో కుమారుడు సూర్యప్రకాశరావుకు అంకితంగా బుచ్చిపాత్రయ్య ఒక కావ్యం వ్రాద్దామనుకున్నాడు. సరసార్థ పదగుంభనలతో సత్యవతీ పరిణయం అనే అయిదాశ్వాసాల ప్రబంధాన్ని వ్రాశాడు. అయితే గ్రంథం పూర్తయ్యేసరికి సూర్యప్రకాశరావో, బుచ్చిపాత్రయ్యో మరణించిన చాలాకాలానికి అతని మనుమణ్ణి, సోదర పుత్రుణ్ణి పిలిపించి గొడే నారాయణ గజపతిరావు ఈ కావ్యంలో కృతి భాగాన్ని వాళ్లచేత పూర్తిచేయించి తానే అంకితం పుచ్చుకొన్నాడు.

బుచ్చిపాత్రయ్య కవిత్వంలో ''సురుచిర సంప్రదాయ పరిశుద్ధమైన మహాకవితా ధురీణతా స్ఫురణ ఉంటుందని'' సమకాలికుల భావన. అంతేకాదు ''పురాణ పరిశోభి విశిష్ట పదార్థాల వక్తృతా గరిమ, పాణిని ప్రముఖ కల్పిత శాస్త్ర రహస్యవిత్తతలో అపరిమితమైన సాధువాక్పద విప్రౌఢిమ ఉన్నవాడు, ఇతడు వ్రాసిన సత్యవతీ పరిణయం బాగా వెలుగు చూడకపోవడంవల్ల దీన్ని పిల్ల వసుచరిత్రలలో జమకట్టలేదు గాని అక్షరాలా ఆ పేరుకు ఇది తగినదే!

వాస్తవానికి సత్యవతి వసురాజుగారి పిల్ల. భట్టుమూర్తిగారి వసుచరిత్రలో హీరో. ఆయన ఒకనాడు వేటకు వెళ్ళాడు. ఆయనతోపాటు గిరిక వెళ్ళలేదు (అక్కడే వచ్చింది అసలు చిక్కు). వసురాజుగారికి వల్లమాలిన విరహమొచ్చింది. వనమంతా ఇంపుమీర క్రమ గిరికాస్వరూపమై కళ్లగట్టి భావనానందగతిలో పరవశుడై ఉండే తరుణంలో చెచ్చెర రేతస్ఖలనమైంది. ఆ వీర్యమమోఘంబని దానిని అరంధ్ర పర్ణ పరిణద్ధముగావించి

11. ''నేరపునేరముల్ మదిగణింప'' – కూడదనడం మాత్రం తండ్రి దగ్గర నేర్చిన పదాలే. చూ. సత్యభామా కృష్ణ సంవాదం (ద్వితీయాశ్వాసం పుట 45)

సూత్రఘటితముగా వెసనొనరించాడు (సత్య 2-98). ఎయిర్ మెయిల్‌లో గిరికాదేవికి పంపించాడు. అయితే దారిలో చిన్న ఏక్సిడెంటు జరిగి సరుకు సముద్రంలో పడింది. శాపగ్రస్తమై చేపరూపాన వున్న అద్రిక అనే అప్సరస ''యారస కణంబుల మింగి యిపుడు గర్భలాభమును గాంచింది'' ఫలితం : సత్యవతి జననం.

వసురాజుగారికి ఈవిధంగా పుట్టిన పిల్లదాని కథను పిల్ల వసుచరిత్రలాగ బుచ్చిపాత్రయ్య కథనం చేశాడు. అనగనగా హస్తినాపురం. ఆ వూరేలే శంతనుడు వేటకు వెళ్ళాడు. ఒకచోట తోటలో ''ఘన ఘనసార వాసనల కన్న పటీరపు తావికన్న - వింతయైన వాసన'' వేసింది. గానం వినబడింది. చెలికాడు పక్కనే ఉన్నాడు. ఎవరో ఏమిటో చూసిరా అని అతణ్ణి శంతనుడు పంపించాడు వసుచరిత్రలాగే. అతగాడు వెళ్ళివచ్చి నఖశిఖ పర్యంతం వర్ణించాడు. మళ్ళా చెలికాణ్ణి పెళ్ళి మాటల కోసం వసుచరిత్రలోలాగే పంపాడు. వసుచరిత్రలోలాగే కవి ఇలాగ వ్రాశాడు.

''లలన లొకచోట సరససల్లాప గతుల
మెలగుచున్నెడ రసభంగ మెలయ కుండ
బొలుచు తగు వేష భాషల పొలుపు జూప
వలయునటు వారి వార్తలు దెలియవలయు'' (సత్య. 2-66)

ఇది వసుచరిత్రలోని ''సారసలోచనలున్న చోటికిన్ భోరున లాతివారు చొరబూనినచో రసభంగమ''న్న భావానికి అనుసరణ (వసు.2-55). అయితే సారసలోచనలున్నచోట రసభంగమైతే వాళ్లు సాలోచనలవుతారు. లలనల సరస సల్లాపగతులకు రసభంగమైతే వాళ్లు సరససల్లాపగతులలో ఉండడం అభాసమే. రసభంగమైనా సల్లాపాలు కొనసాగించడం పిల్ల వసుచరిత్రలకు రివాజే! ఇలాంటి నేరుపున్నేరాలనే కాకరపర్తి కవులు సైరణ చేయవద్దన్నాడు కాబోలు. ఏమాటకా మాటే చెప్పుకోవాలి. సత్యవతీ పరిణయంలోని పద్యాలు ఏ అర్వాచీన ప్రబంధంలోని పద్యాలకూ తీసిపోవు. కూచిమంచి తిమ్మయ్యకన్నా, అడిదం సూరన్నకన్నా కాకరపర్తి కవులు ఏం తక్కువ తినలేదు. పైగా పసగల కిసిమిసి పళ్లు సైతం చూశారు (చూ. సత్య 1-58). ఎటొచ్చీ ప్రాచీన కావ్యాల విందుతో కడుపు నిండాక ఈ గారెలే కాదు ఏవి వడ్డించినా సాహిత్య భోక్తలకు చేదే. అయితే గొడేవారు ఈ కవులను పోషించిన రోజుల్లో ప్రాచీన కావ్యాలు వడ్డించిన విస్తళ్ళలాగ అచ్చుపడలేదు. పిల్ల వసుచరిత్రలన్నీ అందరూ చదవలేదు. అందుకే ఇతరులలాగే కాకరపర్తివాళ్లు కూడా ఇటువంటి రచనలు చేశారు. వీళ్లలాగా బోలెడు పరిణయాలు వ్రాసినవాడు ఇంకొకడు గొడేవాళ్ళ పోషణలో ఉన్నాడు.

అక్కినేపల్లి నరసింహం

నిజానికి ఈ యుగంలోనే కాదు, ప్రతియుగంలోనూ పండితులెక్కువ; కవులు తక్కువ. అందుకే మనకు గ్రంథాలు ఎక్కువ; కమ్మని కావ్యాలు తక్కువ. పండితులకూ కవులకూ గల తేడా గురించి అక్కినేపల్లి నరసింహం అనే కవి ఓఘవతీ పరిణయం అనే కావ్యావతారికలో ఇలా చెప్పాడు.

పండితులైన నేమియొక పద్యము గూర్చగలేదు; గూర్చినా
నిండుగ సద్రసంబుబుకనేరదు; నేర్చిన సుప్రసిద్ధమై
యుండ; దటుండెనేని యమృతోక్తులుగా వివియెల్లారా రమే
శుండు దయామయాత్ముడగుచున్ గనుపట్టిన గాక కల్గునే'' (ఓఘ. 1-17)

పండిత కావ్యాలలో రసం ఉబకకపోవడానికి నరసింహమే మరోకారణం కూడా ఈ ప్రబంధంలో చెప్పాడు.

మారుమూలల గలుగు కఠోర శబ్ద
కలిత పాషాణ పాకముల్ గడలు కొలిపి
కబ్బములు సెప్పి యరసిక గ్రామణులకు
గృతులిడుదురవి దాంభికోన్నతులుగాన'' (ఓఘ. 1-19)

నిజమే. మన గ్రంథాలు చాలా మట్టుకు దాంభికోన్నతిగలవే. అరసికులకు నివేదించిన కవిత్వం గలవే. అక్కినేపల్లి నరసింహం మాత్రం రసిక గ్రామణికే తన పరిణయాన్ని అంకితమిచ్చాడు. గొడే సూర్యప్రకాశరావుగారు ''పాకములలోన గదళీ పాకమె మాధుర్య సరసపాకము'' అని చెప్పి దానితో ఒక కృతిని చెప్పించుకొన్నాడు. నరసింహం ఈ ఓఘవతీ పరిణయాన్ని చెప్పాడు. దీనిలో ''అభ్యుదయ పరంపరాభి వృద్ధిగా'' అని చెప్తూ కథ ఎత్తుకొనే ముందు 200 గద్య పద్యాల అవతారిక వ్రాశాడు. గొడేవారి కులపురాణాన్నీ, జగ్గారావు గారి గొప్పతనాన్నీ, అతని వివిధ సంతానాల వివరాలనీ విపులంగా చెప్పాడు. తరువాత విడ్డూరమైన కథను చెప్పాడు.

ఓఘవతి అనే చిన్నదానికి తండ్రి స్వయంవరం చాటించాడు. ఎందరెందరో వచ్చారు. ''ఇచ్ఛకువచ్చువాని వరియింపవె యంచును బల్కనేరి దామెచ్చక'' ఆ పిల్ల తన తాతను, అంటే స్వయంగా తండ్రి తండ్రినే వరించింది (ఓఘ. 4-125). ఉత్తమ ఇల్లాలై కాపురం చేసింది. ఈ విపరీత పరిణయాన్ని అక్కినేపల్లి నరసింహం నాలుగో ఆశ్వాసంలోనే చెప్పాడు. మొదటి మూడు ఆశ్వాసాల్లో ఓఘవతి తాత ముత్తాతల కథను చెప్పాడు. సూర్యవంశంలోని దుర్యోధనుడు నర్మదా నదిని పెళ్ళాడాడు (భారత గాథలోని విలన్ చంద్రవంశంవాడు). ఈ పెళ్ళి రెండాశ్వాసాలు వసుచరిత్రను అనుకరించింది. ఈ దంపతులకు సుదర్శన అనే కూతురు పుట్టింది. ఈమెను అగ్నిహోత్రుడు మోహించాడు. వీళ్ళకు సుదర్శనుడు అనే కొడుకు పుట్టాడు. అతగాడికి పుట్టినవాళ్ళలో ఓఘవంతుడు ఒకడు. ఇతని కూతురే ఓఘవతి. తాతను పెళ్ళాడిన గొప్పది.

ఈ విచిత్ర గాథ పురాణేతిహాసాలలో ఉన్నదే. మహాభారతం అనుశాసనిక పర్వంలో మొదటే సుదర్శనోపాఖ్యానం ఉంది. దీనిని 41 గద్య పద్యాలలో క్లుప్తంగా తిక్కనగారు చెప్పారు. దీనినే ప్రబంధ ధోరణిలో అక్కినేపల్లి నరసింహం 858 గద్యపద్యా లకు పెంచాడు. వాస్తవానికి తిక్కనగారు పొదుపుగా చెప్తూనే చూపించిన నేర్పు ఇతడు ప్రకటించలేకపోయాడు. సుదర్శన కన్యను అగ్నిహోత్రుడు మోహించిన తరుణంలో తిక్కనగారు చెప్పిన రెండు సీసపద్యాలు రమణీయాలు (అను.1-48; 1-50), ఆ చక్కదనం ఇతరుల రచనలలో రమ్మంటే ఎలా వస్తుంది?

అక్కినేపల్లి నరసింహం విడ్డూరపు పెళ్ళిళ్ళు కథనం స్పెషలైజ్ చేసినట్టుంది. ఓఘవతీ పరిణయాన్ని అతడు క్రీ.శ.1817లో వ్రాశాడు. దానికి ముందే బహుశా వల్లమాంబా పరిణయం అనే పేర వినాయకుని పెళ్ళి కథను మూడాశ్వాసాలలో చెప్పాడు. దీనిని పులిపాక సీతయ్యగారి రామయ్యకు అంకితమిచ్చాడు (డి.736). వినాయకుని వంటి కావ్య నాయకుడు దొరికాక అంతటి మహానుభావునితో సాటివచ్చే మరొక పెళ్ళి చేయించడం బాగుంటుందని మరో కావ్యంలో నారదుని పెళ్ళి చేశాడు. అయోధ్య రాజు సృంజయని కూతురు సుకుమారిని పెళ్ళాడి కలహ భోజనుడు పెళ్ళి భోజనం చేశాడు. ఈ కథకు సుకుమారీ పరిణయం అని పేరు పెట్టాడు. (డి.890)

ఈ పెళ్ళిళ్ళేకాక అక్కినేపల్లి నరసింహం ఇతర కావ్యం కూడా వ్రాశాడు. దాని పేరు ఆదిలక్ష్మీ విలాసం. ఇందులో ఆదిలక్ష్మి కామవల్లి మొదలైన అక్కల కథను చెప్పాడు. అంతర్వేదిలోని నరసింహస్వామికి అంకితమిచ్చాడు. కొప్పునాతి కృష్ణయ్య కృతి ప్రేరేపకుడు. రామావతారంలో విష్ణువు ఏకపత్నీవ్రతుడు. సీతను తప్పించి యింకెవర్నీ కన్నెత్తి చూడడు. ఆదిలక్ష్మి అతణ్ణి చూసి మోహించి కృష్ణావతారంలో రుక్మిణిగా ఆ మక్కువ తీర్చుకుంది. ఈ అవతారాల మధ్యకాలంలో ఏడుగురు అక్కలతో పుట్టింది. శ్రీనాథుని కాలం నాటికే ఈ అక్కల కథ పాటగా ప్రసిద్ధం. (క్రీడాభిరామంలో జక్కుల పురంధ్రి కామవల్లీ మహాదేవి కైటభారీ వలపు పాడింది).

ఆడవాళ్ళ పాటగా అందరికీ బోధపడే ఈ కథను ఎవరికీ అర్థంకాని శైలిలో అక్కినేపల్లి నరసింహం వ్రాసినట్టుంది. ''కర్కశ పాండిత్యంతో నిగూఢమైన ఈ కావ్యం శుద్ధ నిష్ప్రయోజనం'' అని బ్రౌను దొరగారు భావించారు.[12] చెప్పుకోవలసిన విడ్డూర మేమిటంటే; ఓఘవతీ పరిణయంలో ''కఠోరశబ్ద కవిత, పాషాణ పాకాన్ని'' నిందించిన కవి అదే నోటితో ఆదిలక్ష్మీ విలాసాన్ని తత్తుల్యమైన పాకంలో వ్రాయడం, ఆదిలక్ష్మీ విలాసం గద్యలో ''సుకుమారోఘవతీ పరిణయ శృంగార బంధుర ప్రబంధ రచనా ధురంధర పురందరు''ణ్ణని కవి చెప్పుకున్నాడు. అంతేకాదు తాను ''సరస కవితానల్ప కల్పనా విజృంభణుడ''నని విజృంభించాడు. సకల ప్రబంధ లక్షణ లక్ష్యపయోభిమందరుణ్ణని చెప్పుకొన్నాడు. ఉత్త పాండిత్య ప్రకర్ష చూపెట్టుకొనదలిస్తే సహృదయులకు దూరమై అరసిక గ్రామణులను మాత్రమే హడలకొట్టడం జరుగుతుంది. ఈ యుగంలో ఆ ఘనకార్యం చేసినవాళ్లు చాలామంది ఉన్నారు.

కోలా శేషాచలం

పద్యకావ్యాలలోని వచనాలు ఎంత జటిలంగా ఉన్నా సాధారణంగా నిత్య వ్యవహారాలలో మన పూర్వులు శిష్ట వ్యావహారికాన్ని వాడేవారు. కుంఫిణీ యుగం తొలి రోజులలో సాగిన వచన రచనలన్నీ సహజ సజీవ భాషలోనే ఉండేవి. అయితే ఏదో అజ్ఞాతమైన చిన్నతనం వల్ల చెన్నపట్టణంలోని పండితులు చేటపెయ్యి లాంటి కృతక భాషను క్రమేణా తయారు చేసుకొని సాహిత్య దుర్గాలను చేపడం మొదలుపెట్టారు. దినచర్యలు, యాత్రా చరిత్రలు వంటి రచనలను కూడా గడ్డు గ్రాంథికంలో వ్రాయసాగారు. ఇటువంటి వాళ్లలో కోలా శేషాచలం ఒకడు.

12. This poem is so obsecured with pedentry that it is quite useless (D.338)

చెన్నపట్టణం చింతాద్రిపేటలో శేషాచలం ఉండేవాడు. ఈయన క్రీ.శ. 1846 ప్రాంతాలలో సెంటు జార్జి కోటలోని సర్కారుకు చెందిన ''ఆడిటర్ జనరల్'' కచ్చేరీలో గుమాస్తాగా ఉండేవాడు. చక్కగా తెలుగు కావ్యాలు చదువుకొన్నాడు. చిత్ర బంధ కవిత్వాలు చెప్పగలడు. ఈయన ఆఫీసు పనిమీద ఏడు నెలలపాటు ఉదకమండలంలో ఉన్నాడు. ఆ రోజుల్లో చెన్నపట్టణంలోని కుంఫిణీ దొరలు వేసవిలో తమ కచేరీలను నీలగిరికి తరలించుకొని పోయేవారు, వాటితో నల్ల గుమాస్తాలు విధిలేక వెళ్ళేవారు. కోలా శేషాచలం క్రీ.శ. 1846 మే 12వ తేదీన తాను చెన్నపట్టణంలో బయలుదేరి మళ్ళా 1847 జనవరి పదమూడు నాటికి స్వగ్రామం చేరుకొనేదాకా చూసినవీ, చేసినవీ డైరీలాగ వ్రాసిపెట్టుకొన్నాడు.

ఈ డైరీని మరో పదేళ్ళ పోయాక క్రీ.శ. 1858లో మూడు ప్రకరణాల వచన గ్రంథంగా వ్రాశాడు. చెన్నపట్టణంలోని ''మాగ్నటిక్ అబ్జర్వేటరీ'' ఆఫీసులో రామధేను రామానుజ నాయుడనే ఆయన ''అస్సిస్టాంట్''గా ఉండేవాడు. ఈ అయస్కాంత సమీక్షాశాలా సహాయుడు శేషాచలానికి స్నేహితుడు. ఆయన తన ఫ్రెండు వ్రాసిన నీలగిరి యాత్రను చదివి ఉంటాడు. చెన్నపట్టణంలోని అబ్జర్వేటరీకి తరచూ వచ్చిపోయే గొడే వెంకట జగ్గారావు చెవిని నీలగిరి యాత్ర గ్రంథం గురించి రామానుజ నాయుడే చెప్పి ఉంటాడు. వెంకటజగ్గారావు దీనిని అంకితం పుచ్చుకొన్నాడు.

ఈ గ్రంథాన్ని శేషాచలం అనవసరపు గ్రాంథికంలో వ్రాశాడు. చిన్నయసూరి నీతిచంద్రికను చూసి దానికన్నా జటిలం చేశాడు. దానిలాగే ఇది కూడా పాఠశాలల్లో ''వాచకవైభవాన్ని'' పొందుతుందని ఆశించాడు. స్వదేశ భాషాభ్యాసలోలురగు బాలురకే కాక నీలగిరి వెళ్ళేవాళ్ళకు కూడా పనికివస్తుందని ఆశించాడు. అయితే రమారమి నూరేళ్లదాకా అచ్చులోనికి రాలేదు.[13] ఎవరికీ ఉపయోగపడినట్టు లేదు. నీలగిరి దారిలో

---

13. మదరాసు ఓరియంటల్ లైబ్రరీ వారు 1963లో నీలగిరి యాత్ర ప్రచురించారు. దీనిని చిన్నయసూరి నీతి చంద్రికకన్నా పదేళ్ళ ముందుగా శేషాచలం వ్రాసినట్టు పరిష్కర్తలు భావించారు. అయితే యాత్ర పదేళ్ల ముందు జరిగినా గ్రంథాన్ని 1854లోగాని తేర్చలేదు. (చూ.పు.76) నీతిచంద్రిక ప్రథమ ముద్రణ 1853 లో జరిగింది.

నీలగిరి యాత్ర గ్రంథ రచనా కాలాన్ని చెప్పే పద్యం –

''కలియుగంబున వర్షముల నాల్గు వేలుదొ
    మ్మిది నూఱులును నైదు పదులు నాఱు
జను విక్రమార్కుని శకమున వేయుదొ
    మ్మనూ్నట పదియేండ్లు మఱియు రెండు
నబ్దముల్ శాలివాహన శకంబున వేయు
    నేడు నూఱులు డెబ్బదేడు గ్రైస్తు
శకమున నొక వేయి శతకము లెన్మిది పదు
    లయిదును మఱి నాల్గు హాయనములు
నడుచునానంద వర్షంబునను నినుండు
వృషభరాశి గతుండైన వేళ నిష్ట
దేవతాను గ్రహంబున దేర్చినాడ
నీలగిరి యాత్ర నెమ్మది నెఱయు వేడ్క'' (నీలగిరియాత్ర – పుట 76)

మృగాల భయం గూర్చి ఇతడు చెప్పినదే ఇటువంటి పుస్తకాలకూ వర్తిస్తుంది. ''ఈ యొక్కడు మితంబోలు దక్కుదక్కు మెకంబులు తమ భాజనంబులగు భోజనంబులనేని సామాన్యంబుగ నక్కరగల తరి బూరిగొని మెక్కుచుండుగాని తక్కు సహాయంబుల నంటవు'' అని శేషాచలం చెప్పాడు (పుట.59). సాహిత్య పరిశోధకులూ, తత్తుల్యులూ తప్ప ఈ పుస్తకాన్ని అవసరమొచ్చినప్పుడే తప్ప ''తక్కు సమంబులనంటరు.''

నిముషకవి వెంకటేశం

విశాఖపట్టణంలోని గొడేవారికి ఎలాంటి బంధువోగాని ఒక జగన్నాథరావుకు వేదాంతం అంటే చాలా ఇష్టం. ఇతడు యోగిగా కూడా మారాడు. ఇతనిపై నిముషకవి వెంకటేశం అనే కవి సీసపద్య శతకం చెప్పాడు. ''జ్ఞానభోగి గొడే జగన్నాథ యోగి'' అని దీని మకుటం. కేవలం వేదాంత శతకం.

కవి తన గురించి ఏమీ చెప్పుకోలేదు. గొడే జగన్నాథరావు తల్లిదండ్రులు వెంకటరావు, చెల్లమ్మలనీ, తాతపేరు తాతయ్య అనీ, నాయనమ్మ పేరు వెంకమ్మ అనీ కవి చెప్పాడు. ఈ పేరు వాళ్ల విశాఖపట్నం గొడేవారి వంశవృక్షాలలో నాకు కనబడలేదు. బహుశా గొడే జగ్గారావుగారి తాత ముత్తాతల కోవలో వాడు కావచ్చును. తాత జగ్గన్న అయిదుగురు అన్నదమ్ములలో నాలుగోవాడు. తండ్రి కూడా అయిదుగురు సోదరులలో నాలుగోవాడు.

ప్రస్తుతం దొరుకుతున్న ఆకరాలను బట్టి ఈ జగన్నాథ యోగి గురించి గాని, నిముషకవి వెంకటేశం గురించి గాని ఎక్కువ చెప్పలేం.[14] అయితే ఎవరో జగన్నాథ యోగి చరిత్రను ఎన్. నారాయణకవి పద్యరూపంలో వ్రాశాడనీ (ముద్రణ 1897), ఎన్. నారాయణరాజకవి జగన్నాథయోగి శతకాన్ని వ్రాశాడు (ముద్రణ 1899). ఈ రెండు గ్రంథాలను నిముషకవి కుటుంబంలోని వాళ్ళే వ్రాశారేమో. ఈ అచ్చుపడ్డ పుస్తకాలు దొరికితేగాని ఏమీ చెప్పలేం.[15]

ఒక్క విషయం మాత్రం నిస్సందేహంగా చెప్పవచ్చు. గొడేవారు చేసిన సాహిత్య సేవ, విద్యాభివృద్ధి అనల్పం.

కుంఫిణీ యుగం నాటి సాహిత్యవనంలో వీళ్ళది గొప్ప గోడెం!

---

14. శతక కవుల చరిత్ర (వంగూరి సుబ్బారావుగారు పుట 690.)

15. ఆంధ్రవాఙ్మయ సూచిక, పుటలు 69, 70 - వంగూరి వారు ఈ ముద్రిత శతకాన్ని చూశారేమో!

గద్వాల

చరిత్రా, సాహిత్య చరిత్ర గల ప్రాచీన సంస్థానాలలో గద్వాల ఒకటి; దీని గురించి ఇంతకు ముందు ''సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి 2003''లో విపులంగానే చెప్పుకొన్నాం. గద్వాల పెదసోమన (1704-1717) మహాభారతం ఉద్యోగపర్వం నుంచీ యథాశ్లోకానువాదాన్ని కొటికలపూడి వీరరాఘువయ్య చేత తెనిగింపచేయడం గురించి తెలుసుకొన్నాం. పెదసోమన్న తర్వాత చెప్పుకోదగ్గ గద్వాల ప్రభువు చినసోమన్న (1762-1794). ఇతడు పెదసోమన్నకు మనుమడు. ఇతని కాలంలోనే గద్వాల ప్రభువు లకు ''భూపాల'' అనే బిరుదు నామం సంక్రమించింది. అంతకు ముందు వారు ''నాడ గౌడులు.''

చిన్న సోమన్న తండ్రి రామారాయుడు (1748-1761) కాలంలో నిజాం గద్వాల వారికి రెండువేల రూపాయలు బహుమతి ఇచ్చి అది పేష్కసులో మినహాయించుకో మన్నాడు. కర్నూలుకు సైతం ''నాడ గౌడు''ను చేశారు. క్రీ.శ. 1800 దాకా కర్నూలు నుండి గద్వాలకు కప్పం ముట్టుతూ వచ్చేది. చినసోమన్న 17 మహాళ్ళకు ప్రభువయ్యాడు. కర్నూలు ఆదోని పరగణాలలో రెండు మహాళ్ళు, నంద్యాలలో 15 ఉండేవి. నాడగౌడు సర్నాడగౌడు అయ్యాడు. ఈ పదవికి రాజలాంఛనాలయిన ఛత్ర చామరాలు ఉండేవి.

చినసోమన్న కాలంలో ఇటు మహారాష్ట్రులు, అటు నిజాం అధికారం చూపించి కప్పాలు పుచ్చుకొనేవారు. ఈ యిద్దరినీ ఒకరిపై ఒకరిని పురికొల్పుతూ మధ్యలో సోమన్న లాభం చేసుకొనేవాడు.[1] ఇతడు నిజాంకు 40,000 పేష్కసునే కాక 10,000 రూపాయల దివానీ రుసుము కూడా కట్టేవాడు. చినసోమన్న కాలంలోనే సాహిత్య పోషణ ఈ సంస్థానంలో విరివిగా జరిగింది.

ఇతని తర్వాత ఇతని తమ్ముడు రాజా చిన్న రామ భూపాలుడు 1794-1800 దాకా పాలించాడు. ఇతని కాలంలో కర్నూలు నుండి వచ్చే పన్నులు ఇంగ్లీషు కుంఫిణీవారికి సంక్రమించాయి. చిన్న రామభూపాలునికి పుత్ర సంతానం లేదు. తన ఒక్కగానొక్క కుమార్తె లింగమ్మను జోళాపురంలోని నల్లారెడ్డి కుమారునికిచ్చి పెళ్ళిచేసి అల్లుణ్ణి యిల్లరికం తెచ్చుకొన్నాడు. అతనికి సీతారామభూపాలుడనే పేరు పెట్టాడు. మామగారి తర్వాత రాజ్యానికి వచ్చాడు. 1806 నుండి 1849 దాకా పాలించాడు.

కుంఫిణీయుగం బాగా వెలుగు వెలుగుతున్న కాలంలో సీతారామ భూపాలుడే గద్వాల ప్రభువు. ఇతని కాలంలో పేష్కసు, ఇతర కప్పాలు అన్నీ కలిపి 1,15,000 రూపాయలకు పెరిగింది. ఈయన 1827 డిసెంబరు 23వ తేదీనాడు బ్రౌనుదొరగారిని ఆయన ఉన్నచోట కలుసుకొన్నారు. వీరి ఆస్థాన విద్వాంసులైన కృష్ణమాచార్యులగారి విద్వత్తు, స్తోమతు బ్రౌను దొరగారికి పరిచితమే. ఆంగ్లేయులతో, ఆధునిక సౌకర్యాలతో సంబంధాలు పెరిగిన తరువాత గద్వాల సాహిత్య చరిత్రలో చెప్పుకోదగ్గ మార్పులు వచ్చినట్టున్నాయి. కుంఫిణీ యుగంలో ఆనాడు మద్రాసు పట్టణంలో నెలకొంటున్న అచ్చుకూటాల ప్రభావం గద్వాల దాకా వచ్చినట్టుంది. సీతారామ భూపాలుని

1. Pictorial Hyderabad - Vol.III p.620 N

అవసానదశలోనే చెన్నపట్టణంలో ఎన్నో తెలుగు కావ్యాలు ముద్రణ పొందడం ప్రారంభమయ్యాయి. ఎప్పుడు వెలసిందో నికరంగా తారీఖు తేల్చి ప్రస్తుతమున్న ఆకరాలతో చెప్పలేంగాని గద్వాలలో కూడా ''సాహిత్య విద్యాముకురము'' అనే ముద్రాక్షరశాలను సంస్థానాధీశ్వరులు సంస్థాపించారు. దీనిలోనే గద్వాల పండితుల గ్రంథాలు ఎన్నో అచ్చుపడి వెలుగు చూశాయి.

సీతారామ భూపాలునికి ముగ్గురు భార్యలున్నా సంతతి లేదు. ఆయన 1849లో చనిపోయాక పెద్దభార్య లింగమ్మగారు (1849-1851) రాజ్యభారం వహించారు. వడ్డేపల్లి ఎల్లారెడ్డి కుమారుడు రామన్నను దత్తత చేసుకొన్నారు. అతనికి 1851లో సోమభూపాలుడనే పేరు పెట్టి రాజ్యం ఇచ్చారు. ఇతడు గద్వాల ప్రభువులలో మూడవ సోమన్న, పేరయితే పూర్వరాజులదిగాని తీరు వారిలాగా దొడ్డది కాదు, పరమ చెడ్డది.

మూడవ సోమన్న పట్టుమని నాలుగేళ్ళు పాలించలేదు. తాగుడు, వ్యభిచారం మరిగాడు. రాచకార్యాలు విస్మరించాడు. జనులు ద్వేషించసాగారు. ఇతడు పక్కరాజ్యంలోని బేడర్లకు ఉద్యోగాలు ఇచ్చాడు. కొలువులో నిలిపాడు. నిండు దర్బారులో ఈ మూడవ సోమన్నను 1844 సెప్టెంబరు 26వ తేదీనాడు ఇతని సైనికులే కాల్చి చంపేశారు.[2]

పెంచుకొన్న వాని హత్యతో పెట్టుకొన్న ఆశలు కుప్పకూలిపోగా రాణీలింగమ్మ గారు రాజ్యభారాన్ని రెండవ రాణీ అయిన తన సపత్ని వెంకటలక్ష్మమ్మగారికి అప్పచెప్పారు. ఈమె 1844 నుండి 1875 దాకా గద్వాలను ముప్ఫయి రెండేళ్ళు పాలించారు. ఈమె తన అన్నగారి కుమారుడు రామన్నను 1848లో దత్తత చేసుకొన్నారు. అప్పుడు ఇతనికి మూడేళ్ళ వయసు. రామన్నకు రాజారాం భూపాలుడనే పేరు పెట్టారు. ఇతడు 1805లోగాని యుక్తవయస్కుడై రాజ్యానికి రాలేదు. తమ సామంతులెవరినైన దత్తత చేసుకొంటే దానిని అధిరాజులు ఆమోదించాలి. వెంకట లక్ష్మమ్మగారు పెంచుకొన్న చిన్నవాని దత్తత చెల్లుతుందని నిజాం మంజూరు చేశాడు.

అయితే గద్వాల 1853 నుండి పేరుకు మాత్రమే స్వతంత్ర సంస్థానం. దానివల్ల వచ్చే వరుమానాన్ని నిజాం ఇంగ్లీషు కుంఫిణీవారికి మీదు కట్టాడు. సైనిక వ్యయం నిమిత్తం కొన్ని ప్రాంతాల కప్పాన్ని కుంఫిణీవారికి అప్పచెప్పడం నిజాముకు కొత్తేం కాదు. పూర్వం ఉత్తర సర్కారులు దత్తమండలాలు ఇచ్చినట్టే ఇప్పుడు 1853లో ''రాయచూరు-దో ఆబ్''ను దానిలో వున్న గద్వాలను నిజాం కుంఫిణీవారికి హక్కు భుక్తం చేశాడు.

గద్వాల 214 గ్రామాలున్న 804 చదరపు మైళ్ళ విస్తీర్ణంగల రాజ్యం. సాలీనా 86,840 సిక్కా రూపాయలు పేష్కసు కట్టే సంస్థానం. ఈ ద్రవ్యాన్ని పుచ్చుకొనడానికి గద్వాలలో ఒక బ్రిటీష్ కమీషనర్ ఉండేవాడు. అయితే గుడ్డిలో మెల్ల; గద్వాల రాజ్యానికి సివిల్, క్రిమినల్ అధికారాలు పూర్వంలాగే చెల్లుతూ వచ్చాయి.

2. Vide Col. Meadows Taylor's "Story of my life", 1882 Edition **p.164** as enated in Pictorial Hyderabad. Vol.II p.620N

1857లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య సమరంలో కుంఫిణీవారి పునాదులు కదిలాయి. అప్పుడు వారికి నిజాము అత్యంత విశ్వాసపాత్రుడైన నేస్తంగా తోడ్పడ్డాడు. గద్వాల ప్రభువు రాజారాంభూపాలుడు నిజామును నమ్మినబంటుగా వ్యవహరించాడు. నిజాము పట్ల కృతజ్ఞతలతో కుంఫిణీవారు గద్వాలపై వచ్చే ఆదాయాన్ని ఆ ప్రభువుకు దఖలు చేస్తే గద్వాల సంస్థానాధిపతి షోలాపురంలాగా నాశనమయ్యేదని రాజభక్తుల విశ్వాసం. రాజారాం భూపాలుడు 1845 నుండి 1901 దాకా పరిపాలించాడు.

పై చరిత్ర వల్ల కుంఫిణీ యుగంలో గద్వాలను ఏలుకొన్న ఏడుగురి పేర్లను ఇలా క్రోడీకరించవచ్చు.

రాజా చిన్నసోమ భూపాలుడు	1762–1793
రాజా చిన్నరామ భూపాలుడు	1794–1806
రాజా సీతారామ భూపాలుడు	1806–1840
రాణీ లింగమ్మ	1840–1844
రాజా మూడవ సోమభూపాలుడు	(1840–1844)
రాణీ వెంకటలక్ష్మమ్మ	1844–1875
రాజా రాంభూపాలుడు	1843(జ)–1907

ఈ ఏడుగురి పరిపాలనా కాలంలో గద్వాలలో చక్కని సాహిత్య పోషణ జరిగింది. ఏటేటా ప్రతి కార్తీక మాసంలో పండితులను, మాఘ మాసంలో కవి గాయకులను సన్మానించే చక్కని సంప్రదాయాన్ని ఆదిలో పెద సోమన్నగారే గద్వాలలో నెల కొల్పారు. ఇది అవిచ్ఛిన్నంగా కుంఫిణీయుగంలోనూ, జమీందారీ యుగంలోనూ, కొన్నాళ్ళు ఆధునిక యుగంలోనూ కొనసాగుతూనే వచ్చింది. ఈ సత్సంప్రదాయాన్ని మొదలుపెట్టిన తాతగారి అడుగుజాడలలోనే నడచిన చినసోమభూపాలుడు స్వయంగా కవి. చక్కని పోషకుడు. ఇతనికి ''సారస్వత వైభవాభినవ భోజరాజ''నే బిరుదు కూడా లభించింది.

తన తాతగారు యథా శ్లోక మహాభారతానువాదాన్ని ఆకాంక్షించినట్టే యథాశ్లోక తాత్పర్య రామాయణ రచనను కూడా సంకల్పించినట్టు చిన సోమన్నకు తెలుసు. దానిని నెరవేర్చాలని ఆయన నిశ్చయించుకొన్నాడు. తన ఆస్థానంలోని కవులను పిలిచి ఇలా చెప్పినట్టు యథాశ్లోక తాత్పర్య రామాయణం అవతారికలోని అప్పలాచార్యుల వారి పద్యాల వల్ల తెలుస్తుంది.

''అలకణాదము పెద్దనాధ్వరి దనరించు
పటు చమత్కృతులతో బాలకాండ
యల కొత్తపల్లి రామాచార్యులొనరించు
మరి నయోధ్యాకాండ సరసరచన
అలిగార్గ్య పురవాసుడగు సుబ్బశాస్త్రి య
రణ్యా కాండంబును రమణ గూర్చు

నల తిరుమల కృష్ణమాచార్యులతి వేగ
గావించు సుందరకాండ మరియు
బోరవెల్లొ శేషకవి బ్రేబూని యుద్ధ
కాండనుం జేయు తెన్గు నీకరణి మీరు
కొదువ కిష్కింధకాండంబు గూర్చి రాము
నకును పట్టాభిషేకమొనర్పవలయు''

శ్రీమద్రామాయణమిది
నేమమ్మున వృద్ధ సోమనృపతి మునుకవి
గ్రామణుల చేత నాంధ్రము
గా మహినిర్మింప బూనె గావున నాకున్

''అతని సంకల్పమీ డేర్పనర్హమగుట
ప్రేమ నీకాండలన్ని జెప్పింతుగాన
కొదువ కాండము మీరింపు గూర్పవలయు
నమర కేశవదివ్య నామాంకితముగ'' (అవతారిక-46, 47, 48 పద్యాలు)

ఈ పద్యాల వల్ల ఏయే కవులు ఏయే కాండలు విరచించినదీ విశదమవుతున్నది. ఆ భోగట్టానే ఇలా క్రోడీకరించవచ్చు.

బాలకాండ	-	కాణాదం పెద్దన సోమయాజి
అయోధ్యకాండ	-	కొత్తపల్లి రామాచార్యులు
అరణ్యకాండ	-	గార్గేయపురం సుబ్బశాస్త్రి
అవతారిక, కిష్కింధకాండ	-	కామసముద్రం అప్పలాచార్యులు
సుందరకాండ	-	తిరుమల కృష్ణమాచార్యులు
యుద్ధకాండ	-	బోరవెల్లి శేషయ్య

ఈ కవులు కేవలం ఈ ఆరుకాండలనేకాక ఇతర గ్రంథాలను కూడా ఈ రచనకు ముందూ వెనుకా విరచించారు. ఈ ఆరుగురేకాక గద్వాల సంస్థానంలో ఈ యుగంలో ఇంకా మరికొందరు కవులు ప్రసిద్ధులే ఉన్నారు. వారి వారి వివరాలు కొద్దిగా ముచ్చటించుకొందాం.

కాణాదం పెద్దన సోమయాజి

ఈ కవి తాను ఉభయ కవితా నిస్సహాయ సాహితీ నిహారుణ్ణని తన గద్యలో చెప్పుకొన్నాడు. ఇతనికి ''భాసుర కవితా విలాస పాండిత్యం''తోబాటు ''ఆంధ్రవచశ్చమత్కృతులు'' కూడా తెలుసు. ఒక్క గద్వాలలోనే కాక ఇతర సంస్థానాలలో కూడా కృతులు రచించాడు. మన్ననలు పొందాడు. సురపురం సంస్థానంలో బహరీపామ నృపాలుడి కొలువులో మత్స్యపురాణం రచించాడు. ''విప్రవంశం'' అనే పేరుతో నందవరీక బ్రాహ్మణుల చరిత్రను చిన్న గ్రంథంగా వ్రాశాడు. భోజుడు సంస్కృతంలో రచించిన

చంపూ రామాయణానికి సంస్కృతంలోనే వ్యాఖ్యానం లాంటి టీకను సమకూర్చాడు. తన చతుర్విధ కవిత్వ ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ ముకుందవిలాసం అనే పేరిట భద్రాపరిణయాన్ని రచించాడు. ఇందులోని శ్లేషలూ, చమత్కారాలు కోకొల్లలు. ఈ కావ్యంలోని సొగసులను అనంతర కవి ఒకాయన తస్కరించాడంటేనే ముకుందవిలాసం గొప్పతనం తెలుస్తుంది. అందుకే సమకాలికులలో వెన్నెలకంటి వెంకటపతి ఇతణ్ణి ఇలా ప్రస్తుతించాడు.

''ఇద్దరు జోడునన్న కవి యెఱ్ఱన తిక్కన సోమయాజి దా
నుద్దగు వారికిన్ ముగ్గురి కొక్కడె దీటగు నల్లసాని మా
పెద్దన వారితోడు తన బేరు వహించిన్న శ్రీకణాదముం
బెద్దన సోమయాజి వినుపెద్దన బొల్సు కవిత్వ సంపదన్'' (డి. 375)

ఇందులో అతిశయోక్తి ఏమీ లేదని సమకాలికులు సర్టిఫికేటు ఇచ్చారు. కణాదం పెద్దనగారి పెద్దరికం గుర్తించే అతని చేత బాలకాండ తెనిగింప జేశారు. యథాశ్లోక తాత్పర్య రామాయణాన్నే కాక పెద్దన అధ్యాత్మ రామాయణాన్ని సంపూర్ణంగా అనువదించాడు. కవితా వధువు ఎవరిని వరిస్తుందో ఇతడు చెప్పిన కొటేషను ఇతని కవిత్వానికి బాగా వర్తిస్తుంది.

''తనరన్ వ్యాకరణజ్ఞు(దంద్రియనుచున్ ధర్మజ్ఞునిన్ భ్రాతయం
చును మీమాంసకునిన్ నపుంసకుండటంచు స్వీడి దూరంబునం
గని యస్పృశ్యునిబోలె ఛాందసుని వేడ్కం గావ్యలీలారస
జ్ఞునిజేచ్చం గవితావధూమణి వరించున్ భావ గర్భంబునన్'' (ముకుంద-4)

పెద్దన సోమయాజిగారి ముకుంద విలాసం రసజ్ఞులను వరించేది మాత్రమే కాదు. రసజ్ఞులు వలచేది.[3] పెద్దనగారు యథా వాల్మీకంలో బాలకాండను అనువదించినా ఆయనకు ఇతర రచనల వల్లనే ఎక్కువ పేరు వచ్చింది.

పెద్దన సోమయాజిగారి అధ్యాత్మ రామాయణం గద్వాల సంస్థానం వారి ముద్రాక్షరశాలలోనే 1875 నాటికి అచ్చుపడిందని 1943 మే నెల 26వ తేదీ నాటి గోలకొండ పత్రిక సాక్ష్యంతో సాహితీపరులు తెలియచేస్తున్నారు.[4] యథాశ్లోక తాత్పర్య రామాయణం రెండు సంపుటాలలో 1896 నాటికి గాని ముద్రితం కాలేదు.

యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని అనువాద సరళి ఎలా ఉంటుందో తెలుసుకోడానికి ఒక మెతుకును పట్టి చూద్దాం.

''మా నిషాద ప్రతిష్ఠాంత్వమగామ శ్శాశ్వతీస్సమాః
యత్క్రౌంచ మిధునాదేక మవధీః కామమోహితం'' (బాల.2-15)

ఈ సుప్రసిద్ధ శ్లోకం తాత్పర్యాన్ని కాణాదం పెద్దన సోమయాజి ఇలా అనువదించాడు.

---

3. ముకుంద విలాసానికి టీక చెప్పించమని తిరుపతి వెంకటకవులు గద్వాల ప్రభువును కోరారు. అల్లసాని పెద్దనగారి - ''పూత మెరుంగులు'' మాలికలోని ఉపమానాలను ముకుంద విలాసానికి కూడా తిరుపతి కవులు అన్వయింపజేశారు. చూ.నానారాజ సందర్శనం - పుట 34.

4. యండమూరి సత్యనారాయణరావు - ''ఉషఃకిరణాలు'' పుట 278.

''క్రౌంచ మిథునంబునందొక్క కామమోహి
తమగు క్రౌంచంబు ద్రుంచితీవమర దాన
గనక నుండు మనేక హాయనములుండ
బూను సంహితులను వినుమా నిషాద (బాల.ప్ర)

మొత్తంమీద కాణాదం పెద్దన సోమయాజిగారి రచనలు కొన్ని అచ్చులో వెలుగు చూశాయి.

కొత్తపల్లి రామాచార్యులు

ఈయన యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని అయోధ్యకాండను 5 ఆశ్వాసాలలో అనువదించాడు. తాను శౌర్య ధైర్య గాంభీర్య చాతుర్యధుర్యుడైన సోమభూపాలుని ఆస్థానంలోని విద్వన్మహా కవినని చెప్పుకొన్నాడు. ఇతనిది సరస రచన అని చిన సోమభూపాలుడే మెచ్చుకొన్నాడు. ఈ విద్వాంసుని ఇతర రచనల వివరాలు ఇప్పటి పరిశోధకులకు లభించలేదు.

గార్గేయపురం సుబ్బశాస్త్రి

ఈయన కూడా కాణాదం పెద్దన సోమయాజిలాగా ఉభయ కవితా నిస్సహాయ సాహితీ ధురీణుడు. యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని అరణ్యకాండను మూడు ఆశ్వాసాలలో తెనిగించాడు. ఈయన చేసిన ఇతర కృతుల పేర్లయినా ప్రస్తుతం తెలియవు.

కామసముద్రం అప్పలాచార్యులు

గద్వాల కవులలో ప్రభువు కంట పడిన వాళ్ళలో ఇతడు ముఖ్యునిలాగ కనబడతాడు. ఎందరో కవులుండగా ఇతనినే చిన సోమన్న పిలిపించి యథాశ్లోక తాత్పర్య రామాయణాన్ని చెప్పించే తన సంకల్పాన్ని ప్రకటించి అవతారికతోపాటు కిష్కింధ కాండను రచించమనడంలో విశేషమేమైనా ఉండాలి. ఇతడు విద్వత్కవికుంజర బిరుదాంకితుడు. చతుర్విధ కవితా నిర్వాహకుడు. చినసోమన్న తనను పిలిచి ఇలా చెప్పినట్లు కవి అవతారికలో రాశాడు.

''సకల విద్వత్కవీశ్వరు లెన్న సంస్కృత
    కృతుల సరస చమత్కృతులు కొన్ని
మాగధ భాండీర మాళవీ ప్రముఖ స
    త్ప్రాకృతమ్ముల ప్రబంధములు కొన్ని
చక్రకంకణ పద్మశంఖ శార్ఙ్గ్య గజాశ్వ
    రథముగ కృతుల చిత్రములు కొన్ని
మరియు తద్భవ తత్సమ ప్రభృతుల విశ్రు
    తముగ నాంధ్ర ప్రబంధములు కొన్ని
రచన చేసి సమస్త రాజ సభల
నెలమి గీర్తి వహించితి విప్పుడాది

కావ్యమిది దివ్యమాంధ్రంబుగా నొనర్చి
శౌరి కర్పింపు మప్పలాచార్యసుకవి. (అవతారిక-45)

ఈ అప్పలాచార్యులు యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని కిష్కింధాకాండను మూడాశ్వాసాలలో తెనిగించాడు. ఇతని అనువాదాలలో ఇంకొక ప్రసిద్ధ గ్రంథముంది. అది నారాయణతీర్థులవారు రచించిన ''కృష్ణలీలా తరంగిణి.'' దీనిని ''ఆంధ్రాష్టపది'' అనే పేరుతో కామసముద్రం అప్పలాచార్యులు అనువదించినట్టు తెలుస్తుంది.[5] ఈ తెలుగు రచన ఎంత ప్రాచుర్యం చెందిందో చెప్పలేము గాని నారాయణ తీర్థులవారి జీవిత కాల నిర్ణయంలో ఇదొక ఘట్టం. గద్వాల చినసోమన (1762-1793) ఆస్థాన కవులలో ఒకరు తరంగిణిని అనువదించారంటే అప్పటికే తరంగాలు చాలా ప్రచారంలో ఉండి ఉండాలి. తీర్థులవారు ఈ కాలానికి ఎంత ప్రాచీనులో తేలాలంటే అప్పలాచార్యులవారి ఆంధ్రాష్టపది ప్రతి లభిస్తే దాని పరిశీలన వల్ల తేలవచ్చు.

జయదేవుని అష్టపదులను కూడా ఇతడు తెనిగించాడు.[6] అయితే చినసోమన్న పేరకూడా కొన్ని అష్టపదుల అనువాదాలు ఉన్నాయి. (ఆర్. 900, బి). ''గద్వాల సోమ నరపాల ప్రణీతం పద్మావతీంద్ర జయదేవ కవీంద్రగీతం'' అని అనువాదకుని పేరు స్పష్టంగా ఉంది. అప్పలాచార్యులు కూడా వేరే అనువాదాలు చేశాడేమో. ఇతని తండ్రి కృష్ణమాచార్యులు అష్టాభాషా కవి. ఆయన ఏ తెలుగు గ్రంథాలు వ్రాశాడో తెలియదు.

తిరుమల కృష్ణమాచార్యులు

కామ సముద్రం అప్పలాచార్యుల తండ్రి కాక మరో కృష్ణమాచార్యులు గద్వాలలో ఉన్నాడు. వాళ్ల ఇంటిపేరు తిరుమల. ఇతడు తన గద్యలో అష్టభాషా కవితా సమాన వైభవ ధురంధరుడని చెప్పుకొన్నాడు. ఇతడు బ్రౌనుదొరగారికి పరిచితుడు. సీతారాం భూపాలుని ఆస్థానంలో కూడా ఉండేవాడు. మడులు మాన్యాలేకాక సాలీనా ఇతనికి 300 రూపాయల జీతం గద్వాల కొలువులో లభించేదని బ్రౌను దొరగారు నోట్ చేసుకొన్నారు. ఈయన అతివేగంగా కవిత్వం చెప్తాడని రాజుగారి ఉద్దేశం. ఇతడు యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని సుందరకాండను 3 ఆశ్వాసాలుగా అనువాదం చేశాడు. ఇతని ఇతర రచనలు ఏమిటో తెలియవు.

బోరవెల్లి శేషాచార్యులు

గద్వాలలోని చాలామంది కవులు తాము ఉభయ కవితా నిస్సహాయ కవితా విహారులమని చెప్పుకొంటారు. వాళ్ళలాగా ఈ బోరవెల్లి శేషాచార్యులు కూడా ఆ బిరుదాన్ని తన గద్యలో చెప్పి యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని యుద్ధకాండను నాలుగాశ్వాసాలలో తెనిగించారు. ఇతని గురించి ఇంతకన్నా ఎక్కువ వివరాలేం తెలియడంలేదు.

---

5. తూమాటి దొణప్ప - ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణం - పు.123
6. గోలకొండ కవుల సంచిక - పుట.395. ఇది ఏకతరంగ ప్రబంధము. ముద్రిత ప్రతి గద్వాల సంస్థానంలో లభించును అని ఈ ఆకరము వల్ల తెలుస్తుంది.

పై ఆరుగురు కవులేకాక గద్వాల సంస్థానంలో కర్మమడకల అనంతాచార్యులు, బాణాల శేషాచార్యులు, పుల్లగుమ్మి వెంకటాచార్యులు మొదలైన పండితులు, ధర్మాధికారులు ఉండేవారు. వీరిలో కొందరు సంస్కృత గ్రంథకర్తలు.

చినసోమన్న

గద్వాల ప్రభువు చిన సోమన్న స్వయంగా కవి అని ముందు చెప్పుకొన్నాం. ఈయన హరిభట్టు సంస్కృతంలో రచించిన ''రతి రహస్యము''ను పద్యకావ్యంగా అనువదించాడు. జయదేవుని గీతగోవిందంలో కొన్ని అష్టపదులకు విపులమైన గేయానువాదాన్ని కూడా చేశాడు. అన్ని అష్టపదులకూ ఇటువంటి వివరణాత్మకమైన ఆంధ్రగీర్వాణ వ్యాఖ్యానరూపకమైన విశేష వ్యాఖ్య రచించాడో లేదో తెలియదు. మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఒకే ఒక్క అష్టపదిలోని పల్లవీ చరణాలకు శ్లోకము, ద్విపద, చూర్ణిక, దరువు అనే నాలుగు రకాల పెంపుసొంపులు చేకూర్చిన ప్రతి ఉంది. దాని వివరాలు ఆసక్తిదాయకంగా ఉన్నాయి. జయదేవుని గీతగోవిందంలో పన్నెండు సర్గలు, ఇరవై నాలుగు అష్టపదులూ ఉన్నాయి. ప్రతి సర్గలో చాలా శ్లోకాలున్నాయి. గద్వాల చినసోమభూపాలుడు దశమ సర్గలోని చతుర చతుర్భుజం అనే విభాగంలోని 19వ అష్టపది ''ప్రియే చారుశీలే'' అనే దానికి వివరణాత్మకమైన విధంగా ద్విపద, గేయం, శ్లోకం, వృత్తం, దరువు, చూర్ణిక, మళ్ళా శ్లోకం, వృత్తం, దరువు, చూర్ణిక అనే క్రమంలో సవిస్తార వ్యాఖ్యారూపానువాదం చేశాడు. చూడండి.

> ''ప్రియే! చారుశీలే! ప్రియే! చారుశీలే!
> విముంచ మయి మాన మనిదానం
> సపది మదనానలో దహాతి మమ మానసం
> దేహి ముఖ కమల మధుపానం! (అష్టపది-19, ధ్రువం-1, మూలం)

శ్లో. ''ఇహ్యైవ మదనానలో దహతి మానసం దేహి మే
స్ఫురద్వ దన పంకజ స్ఫుటమరంద పానం ముహుః
విముంచ మయి దారుణం కృతమకారణం మానమ
ప్యనారతరతి ప్రియే రమణి చారుశీలే ప్రియే''

చం. ''మదన మహానలంబు పలుమారు దహింపగఁ జేసె నామదిన్
వదన సరోజ దివ్యమధుపాన మొసంగు మకారణంబుగా
పదరిన కోపమున్ విడిచి బాగుగ మత్ప్రియురాలవైన యో
మదవతి! చారుశీల! నను మన్నన సేయవె రాధికామణీ''

పదం : ''చలమేల బాలా చారుశీలా చెలువైన ప్రియురాలా వలరేనికాక కేవలమింత దయలేక, కలికి నామది వీఁక కనలఁ జేసెనిఁక, తళుకైన నీమోము దమ్మి పానకము తలచిన నొసగుము తాళను నిమిషము - ''చ''

> పలుమారు నించుక భాషించితివేని పలుజిగి మెఱుగు
> వెన్నెల చిన్నెల మించు తొలగించు చాలా! ఆభీలమై కలము

చీకటు లాతలిరాకు మోవి తేనెలకై నీమోము నెల దృ
క్చకోరము నలరింపఁ జేయును- ''చ''

చూర్ణిక. ''అయిరాధికే చారుశీలే ప్రియే సంప్రతి మద
సదహనోదహతి మమ మానసం దేహి వదన
సరోజ మధుపానం! మానమప్యనిదానం విముంచ
కించిదపి వచసియతి దంత మౌక్తిక కౌముదీతిమి
రమతి ఘోరం హరతు స్ఫురదధర శీధవేతవానన
యామినీశః లోచన చకోరం రోచయతు'' (ఆర్. 900 బి)

అయితే కర్తృత్వ విషయంలో కొంచెం చిక్కుముడి పడే పద్యం ఒకటి ఈ గ్రంథ భాగంలో ఉంది. అష్టపదిలోని 8వ చరణం తరువాత ఒక శ్లోకం, ఒక పద్యం ఇలా ఉన్నాయి.

శ్లోకం. ''గద్వాల సోమనరపాల మణి ప్రణీతం
పద్మావతీంద్ర జయదేవ కవీంద్రగీతమ్
రాధామది ప్రథిత మాధవ సూక్తి జాతం
మాధుర్య చాటు ఫణితం జయతు ప్రభూతమ్''

ఉ. ఈవగమించి సోమధరణీశ్వర **సూనుడుం** సొంపునించి ప
ద్మావతికిం బ్రియుండయిన తజ్జయ దేవబుధోక్తి రాధికా
దేవిని గూర్చి పల్కు వసుదేవ తనూభవ చాటు పాటవ
శ్రీ విలసద్వ చస్థితిని జెన్నగు గీతము వేడ్కజేయుతన్'' (ఆర్.900 బి)

శ్లోకంలో కర్త గద్వాల సోమనరపాలుడనీ, పద్యంలో సోమధరణీశ్వర సూనుడనీ ఉండడం గమనించదగ్గ విషయం. గద్వాల ప్రభువులలో పెదసోమన్నకు పుత్రులు లేరు. భర్త అనంతరం అతని రెండవ భార్య తిరుమల రాయులను దత్తత చేసుకొంది. ఇతడు నాలుగేళ్ళు పాలించాడు (1738-1742). ఇతడు సోమధరణీశ్వరసూనుడే కావచ్చుగాని గీత గోవిందానువాదం ఇతని రచన కాదేమో. గద్వాల చినసోమనకు పుత్రులు లేరు. ఇతని తరువాత ఇతని తమ్ముడు చినరామభూపాలుడు రాజయ్యాడు. ఇతడు సోమధరణీశ్వర సూనుడు కాలేడు కదా. పై ఉత్పలమాలలో పాఠాంతరమేదైనా ఉందేమో ప్రత్యంతరం లభిస్తేగాని చిక్కుముడి విడివడదు.

బహుశః ఈ అష్టపదుల అనువాదం చిన సోమభూపాలుడు తన ఆస్థానంలోని నట్టువ మేళంలోని బిరుదు పాత్రలు నర్తనం కోసమో లేక పూడూరి కేశవస్వామి గుడిలోని దేవగణికల నాట్యం కోసమో రచించి ఉంటాడు. ఈ అష్టపది అనువాదం గద్వాల పెదసోమన చేశాడని కొందరు భావిస్తున్నారు.[7] ప్రాచ్యలిఖిత గ్రంథాలయం పరిశోధకులు చినసోమన్న రచనగా గుర్తించారు.[8] గద్వాల సోమన్న మాత్రమేకాక ఉయ్యూరు

7. తూమాటి దొణప్ప - ఆంధ్ర సంస్థానములు, పుట 119.
8. బులెటిన్ ఆఫ్ ది గవర్నమెంట్ ఓరియంటల్ ఎమ్ఎస్ఎస్, లైబ్రరీ, మద్రాస్, ఓల్.8, నెం.2, పి.పి.43-55

జమీందారు వెంకటాద్రి అప్పారావుగారు ఆధునిక యుగంలో గీతగోవిందాన్ని అనువదించాడు. ఇది అసమగ్రం. చతుర చతుర్భుజం అనే పదోసర్గం దాకానే నిండుగా ఉంది. దీని ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.2520)

గద్వాల సంస్థానంలో సంగీత సాహిత్యాలు రెండూ విరివిగానే వికసించాయని చెప్పవచ్చు. గద్వాల ప్రభువుల జ్ఞాతులు రాజవోలువాసులైన నాడగౌడు ముష్టిపల్లివారి వంశంలోని వెంకట భూపాలుడు ఒకటి కాదు, రెండు కాదు 3,476 కీర్తనలు రచించాడు.[9] అన్నింటికి రాగ తాళ నిర్దేశాలున్నాయి. కీర్తనల మధ్య గాన యోగ్యాలయిన ద్విపదలు కూడా ఉన్నాయి. గద్వాల సంస్థానంవారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి ఎన్నో అమూల్యమైన తాళపత్ర గ్రంథాలను ఇచ్చారు. ఇంకా సంస్థానంలోని గ్రామాలలో ఎన్ని తాళపత్ర ప్రతులు ఉన్నాయో, గద్వాల చిన సోమన్న గీత గోవింద, కామ సముద్ర అప్పలాచార్యుల కృష్ణలీలా తరంగిణి అనువాదం దొరికితే మన గేయ సాహిత్యం మరింత మధురమవుతుంది.

బొబ్బిలి

సంస్థాన స్థాపన చిరకాలం కిందటే జరిగినా ఈ యుగంలోనే బొబ్బిలి పాలకులు చేసిన సాహిత్య పోషణ కనిపిస్తోంది. ఈ యుగంలో నలుగురు రాజులు సాహిత్యసేవ చేశారు. ముగ్గురు పాలించారు. ఇద్దరు స్వయంగా రచనలు చేశారు. ఆ వివరాలు వాళ్ళు పోషించిన కవుల భోగట్టాలు తెలుసుకొందాం.

రాజా వెంకటరంగారావు (1794–1800)

సుప్రసిద్ధమైన బొబ్బిలియుద్ధం నాటికి ఈయన మూడు నాలుగేళ్లు వయస్సువాడు. ఆ యుద్ధంలో గోపాలకృష్ణ రంగారావుగారు చనిపోయారు. ఆయన కొడుకే ఈయన. ఇతణ్ణి చినరంగారావుగారని కూడా పిలుస్తారు. ఇతడు పెరిగి పెద్దవాడయ్యేదాక పినతండ్రి వెంగళరావుగారే వ్యవహారాలు చూసుకొన్నాడు. తరువాత రాజబంధువు ఇనుగంటి నరసయ్యగారి చెప్పుచేతలలో చినరంగారావుగారు ఉన్నారు. అయినా రాజ్యం చేతికి రావడానికి చాలా ఆటంకాలు కలిగాయి. కొన్నాళ్ళు విజయనగరం వాళ్ళు ఇతణ్ణి నిర్బంధంలో పెట్టారు. చివరకు ఎలాగో ఇతడు హైదరాబాదు చేరుకొని సిఫార్సులు సంపాదించాడు. కుంఫిణీవారు ఇతడి హక్కులను గుర్తించి బొబ్బిలి రాజ్యానికి సన్నదు ఇచ్చారు. క్రీ.శ.1794లో చిన రంగారావుగారు పట్టం కట్టుకొన్నారు.

పాలించిన ఆరున్నర సంవత్సరాలలో ఈయన చేసిన దానధర్మాలు చాలా ఉన్నాయి. వేయించిన తోటలూ, తవ్వించిన చెరువులూ, ఇచ్చిన అగ్రహారాలూ అనేకం. ఈయన రాజ్యకాలంలోనే కొటికలపూడి శివరామశాస్త్రి తారకోపాఖ్యానం, రామచర్య (రామాయణం) అనే కృతులు రచించి శివునికి అంకితమిచ్చాడు. ఆ శివరామయ్యగారి

9. బి. రామరాజు – ''మరుగుపడిన మాణిక్యాలు'', పుట 82.

కొడుకు వెంకటరామయ్య ''తారలతో తుషారాధాముని రీతి'' సుకవులలో మెలిగాడట. చుక్కల్లో చంద్రుడిలా వెలిగిన ఈ వెంకటరామయ్య ఏ కృతులు చెప్పాడో తెలియదు. ఇతని కొడుకు వెంకటకృష్ణయ్య మాత్రం ప్రసిద్ధుడు. తాతతండ్రులలాగా ఇతడు ''ధారుణి మండలాధిపాస్థానములను సన్నుతి'' వహించడమేకాక అగ్రహారాలు పొందాడు. చినరంగారావుగారు క్రీ.శ. 1800లో అంటే తమ రాజావసాన కాలములో వెంకట కృష్ణయ్యకు రామునివలస అనే గ్రామాన్ని ఇచ్చారు. అప్పటికి ఈ కవికి 36 సంవత్సరాల వయసు. ఇతడు చినరంగారావుగారి వారసుని రాజ్యంలో కూడా ఘనసత్కారాలు పొందాడు.

రాజారాయుడప్ప రంగారావు (1802–1830)

చినరంగారావుగారికి సంతానం లేదు. అందుచేత ఆయన తమ బంధువర్గంలో పాల్తేరు రావువారి కుటుంబంలోని అప్పారావుగారి కుమారుడు రాయుడప్పకు రాజ్యం ఇచ్చారు. రాజ్యంతోపాటు రంగారావు అనే బిరుదు కూడా వచ్చింది. తన జనక తండ్రి శత్రువులను పారదోలి నిలబెట్టిన రాజ్యమే తనకు వచ్చిందని రాయుడప్పగారి నమ్మకం. ఈయన స్వయంగా కవి కనుక తాను రచించిన గ్రంథంలో తన తండ్రి గురించి ఇలా చెప్పించాడు.[1]

రిపులం బారగదోలి బొబ్బిలి ధరిత్రీ నాథునిన్ గ్రమ్మరన్
నృపతుల్ మెచ్చగ దత్పురిన్ నిలిపెబెంపేపారమీ తండ్రినే
రుపుతో వేంకట రంగ భూవిభుడ పుత్రుండై హయస్యందన
ద్విపద విత్తాదుల తోడ మీకొసగె మైత్రిన్ రాజ్యమాత్మీయమున్ (ఆర్.428)

చినరంగారావుగారు మైత్రితో ఇచ్చిన రాజ్యాన్ని దత్తతగా అంగీకరించడానికి కుంఫిణీవారు రెండేళ్ళు తీసుకొన్నారు. 1802లో రాయుడప్ప రంగారావుగారు రాజ్యానికి వచ్చారు. అప్పటికి ఆయనకు 13 సంవత్సరాల వయసు. చాలా కుశాగ్రబుద్ధి. రాజకీయ వ్యవహారజ్ఞానం బాగా అలవరచుకొన్నారు. సర్ థామస్ మన్రోగారు గవర్నరుగా పర్యటించినపుడు రాయుడప్పగారిని బొబ్బిలి రాజ్యంలో కలుసుకొని మాట్లాడి చాలా మెచ్చుకొన్నారు. రాయుడప్పగారు మాటకారి. నొప్పించకుండా రెచ్చగొట్టగలిగే నేర్పు ఉండి, హక్కుల విషయం వచ్చినప్పుడు వినయంగా మాట్లాడుతూనే నిర్మొహమాటంగా నిజం చెప్పగలరు.

ప్రతి జమీందారుకీ ''సనదీమిలకియ్యత్ ఇస్తిమిరారు''లో కొన్ని హక్కులు ఉన్నాయి. తన సంస్థానాన్ని విక్రయించుకొనడానికిగానీ, దానం చేయడానికిగానీ అధికారాలు ఉన్నాయి. ఈ స్వతంత్రాలను అరికట్టాలని కుంఫిణీవాళ్ళు ప్రయత్నించారు. ''ప్రసిద్ధిని పొందినటువంటి పూర్వోత్తరపు జమీందారులకు'' వారి తాలూకు జమీందారీలున్ను, వారికీ దేశంలో జరిగే మామూళ్ళున్ను వారి కింద శాశ్వతంగా

1. ఇది సంకల్ప సూర్యోదయంలోనిది. అచ్చుపడ్డ గ్రంథంలో ఈ పద్యం లేదు. 1906లో బొబ్బిలి పాలించిన రాజాగారు ఈ పుస్తకంలో రాయుడప్ప రంగారావుగారు వ్రాసిన పద్యాలతో కాక వేరే విధంగా వంశ వర్ణన చేయించారు.

వుంచడం వల్ల వారి యొక్క పూర్వోత్తరపు ప్రతిష్ఠను దృఢపర్చవలె''ననే ముఖ్య తాత్పర్యంతో కొన్ని రెగ్యులేషన్లు చేస్తున్నామని జమీందార్లకు ఉత్తరాలు వ్రాశారు. ఈ నిబంధనలవల్ల ఏదో ఒరగబోతోంది కనుక ముందుగా తమ దాన విక్రయాధికారాలను వదులుకొంటున్నామని జమీందార్లు కుంఫిణీ వాళ్ళకి ''లిఖిత రూపకమైన అర్జీవల్ల తెలియశాయవలసినద''న్నారు.

ఈ ఉత్తరంలోని మోసాన్ని గుర్తించి రాయుడప్ప సవినయంగా లెంపకాయలు కొట్టారు. ''-మేము అంగీకరించవలసిన సంగతిని గురించి లిఖిత రూపకమైన దస్తావేజు మేము దాఖలు చేస్తే మాకు లభించే కిఫాయతులు రెగ్యులేషను మూలముగ సంప్రాప్తం అయ్యేలాగున వ్రాయించినారు. అప్పటప్పటికి జారీ అవుతాయన్న రెగ్యులేషన్‌ల వల్ల పూర్వపు రెగ్యులేషన్‌లు అనేకంగా నిషేధింపబడుతూ వుండడం చూస్తూ వున్నందున రెగ్యులేషన్‌ల మూలముగా లభించే కిఫాయతులు అనుశృతంగా జరుగుతున్న ధైర్యం చాలకుండా వున్నది. కాబట్టి యిప్పుడు తయారు అవుతూ వున్న రెగ్యులేషన్‌ల మూలంగా లిఖింపచేసే కిఫాయతు యప్పటికిన్నీ జరిగేలాగున మా పేర అనుగ్రహ పూర్వకమైన దస్తావేజు దయచేయిస్తామన్న పక్షమందున.......'' ఒప్పుకుంటామని రాయుడప్పగారు నిర్మొహమాటంగా వ్రాశారు. తెల్లవాళ్ళ మోసాలు లోకానికి తెలిసినవేగాని ఇలాంటి జమీందార్ల జాగ్రత్తలు మాత్రం పనికిరాలేదు.[2]

రాజ్య పరిపాలనలో ఎంత దక్షత ఉందో సాహిత్యంలో అంత అభినివేశం కూడా రాయుడప్పగారికి ఉంది. కందాళ వెంకటాచార్యులవారి శిష్యరికం చేశారు. నిఖిల శాస్త్రవాసనలతో సముచితమైన విజ్ఞానాన్ని పొందారు. విశిష్టాద్వైతమంటే అభిమానం. అందుచేత ఆ మతాన్ని ప్రబోధించే ''సంకల్ప సూర్యోదయ''మనే సంస్కృత నాటకాన్ని తెనిగించారు. దీనికి క్రీ.శ.1268-1369లో జీవించిన వేదాంత దేశికులు రచించారు. ఆయనకు ''కవితార్కిక ఆసింహ'', ''సర్వ తంత్ర స్వతంత్ర'' అనే బిరుదులున్నాయి. నూరేళ్ళు జీవించిన ఈయన హంససందేశం, యాదవాభ్యుదయం, పాదుకాసహస్రం వంటి గ్రంథాలు వ్రాశారు. వైష్ణవంలో వడగల సంప్రదాయం వీళ్ళు వేదాంత దేశికుల ధ్యానశ్లోకాన్ని చదవందే ఏ కార్యం చేయరు. రాయుడప్ప రంగారావుగారికి వేదాంత దేశికులంటే ''అవిరళమైన భక్తి.'' అందుకే సంకల్ప సూర్యోదయాన్ని అనువదించారు.

వేదాంత నాటకాలలో కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయం ప్రసిద్ధం. అది అద్వైతాన్ని ప్రబోధిస్తుంది. ఆ బాణీలో విశిష్టాద్వైతాన్ని ప్రచారం చేయడం కోసం వేదాంత దేశికులు దీనిని రచించారు. పురుషుని నిరంతరము నిద్రపుచ్చు త్రిగుణశక్తియను రాత్రి కైటభారి సంకల్ప సూర్యోదయం చేతనే నాశనమవుతోందని ప్రకటించారు. ప్రబోధ చంద్రోదయాన్ని తొలిరాయల యుగంలోనే నంది ఘంటల జంట అనువదించారు.

2. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు ''శ్రీ బొబ్బిలి సంస్థానాధిపతుల చారిత్రములో ఉంది. పుటలు 96 నుండి 103. ఈ చరిత్రను శ్వేతా చలపతి రంగారావుగారు వ్రాశారు. చెన్నపురి, వైజయంతి ముద్రాక్షరశాల (1902). ఇది గురజాడ శ్రీరామమూర్తిగారు వ్రాసిన ''శ్రీరామ వంశీయుల చరిత్రము'' అనే గ్రంథానికి అనుబంధం.

అయితే కుంఫిణీ యుగం దాకా ఎవరూ సంకల్ప సూర్యోదయాన్ని తెనిగించలేదు. రాయుడప్ప రంగారావుగారికీ ఆ ఘనత చెందుతుంది. అయితే నాటకాన్ని పద్యకావ్యం గానే అనువదించారు. మూలంలోని పది అంకాలకూ పది ఆశ్వాసాలను వ్రాశారు. రచన సరళంగా సాగింది. ఇది గుజిలీ పుస్తకాల తీరులో అచ్చుపడింది గాని మళ్ళా ఆధునిక పద్ధతులలో అచ్చుపడడం అవసరమే.

రాయుడప్ప రంగారావుగారు తమ ఇరవై ఎనిమిది సంవత్సరాల పాలనలో ఈ ఒక్క గ్రంథంకాక ఇంకేమిటి రచించారో తెలియదు. స్వయంగా ఇతర గ్రంథాలు వ్రాయకపోయినా కవులను పోషించారు. చిన రంగారావుగారిలాగా ఈయన కూడా కొటికలపూడి వెంకట కృష్ణయ్యగారికి అగ్రహారాన్ని దానం చేశారు. క్రీ.శ.1826లో ఇచ్చిన ఈ గ్రామం పేరు సుభద్ర. కవులకు అగ్రహారాలనేకాక బాటసారుల కోసం అన్నసత్రాలు పెట్టించారు. కాశీకావడి తెచ్చిన వాళ్ళకు రూపాయి చొప్పున ఇచ్చేవారు. వికలాంగులకు కూడా రూపాయి చొప్పున మంజూరు చేసి జీవనోపాధి కల్పించారు (ఆ రోజులలో రూపాయి అంటే చాలా విలువ). దానధర్మాలు చేస్తూ న్యాయంగా పాలించినా శిస్తులు మాత్రం చాలా కఠినంగా వసూలు చేసేవారు. సప్త సంతానాలలో ఒకటైన ఒక దేవాలయానికి పునాదిని మాత్రమే వేశారు. బొబ్బిలి కోటలోని వేణుగోపాలస్వామివారి ఆలయం వీరి కుమారుల రాజ్యకాలంలో పూర్తయింది.

రాజా శ్వేతాచలపతి రంగారావు (1830-62)

రాయుడప్ప రంగారావుగారికి ముగ్గురు భార్యలు. మొదటి భార్య నలుగురు కొడుకులలో పెద్దవాడి పేరు శ్వేతాచలపతి. ఈయనే తండ్రి తరువాత బొబ్బిలి రాజ్యాన్ని పాలించారు. తండ్రి పునాది వేసిన వేణుగోపాల స్వామివారి ఆలయాన్ని ఈయన 1837లో పూర్తి చేయించారు. ఈయన కూడా తండ్రిలాగా చాలా దైవభక్తుడు. త్రికాల సంధ్యావందనంలాగా రోజు ముమ్మారు దేవాలయానికి వెళ్ళేవారు. ఈయన కాలంలో ''పంచకాచార్య పురుషదుర్వర్తనం'' వల్ల వైష్ణవానికి కొంచెం చెడ్డపేరు వచ్చింది. శ్వేతా చలపతి మేనమామ ఇనుగంటి సీతారామయ్యగారు ఆ వైష్ణవాన్ని రామానుజాచార్యుల వారిలాగ ఉద్ధరించి మేనల్లుడికి బోధించారట (ఈయన ప్రబోధకుడేకాక పెద్ద దివాను కూడా). మేనమామగారు చెప్పిన ప్రవచనాన్ని శ్వేతాచలపతిగారు తమ పురోహితుడు కొటికలపూడి కోదండ రామయ్య చేత గ్రంథరూపంలో వ్రాయించాడు.

శ్వేతా చలపతిగారికి వైష్ణవ గ్రంథాలేకాక ఇతర గ్రంథాలన్నా యిష్టమే. ''బహువిధ గ్రంథముల్ బహుదేశముల నుండి యెంచి తెప్పించి వ్రాయించినాడు'' అని కవులు ఇతణ్ణి ప్రశంసించారు.[3] ఈయన స్వయంగా గ్రంథాలు రచించకపోయినా ఇతని తమ్ముడు జనార్ధన రంగారావు గ్రంథకర్తలు, మంచి సాహితీపరులు.

3. మండపాక పార్వతీశం గారి ప్రశంస. ''బొబ్బిలి సంస్థానాధిపతుల చరిత్రము''లో ఉదాహరణ. పుట 120.

జనార్ధన రంగారావుగారు

రాయుడప్ప రంగారావు రెండో కొడుకు పేరు జనార్ధనంగారు. ఈయన తన మేనమామ ఇనుగంటి సీతారామయ్యగారి తరువాత బొబ్బిలి రాజ్యానికి దివానుగా కొన్నాళ్ళు ఉన్నారు. అన్నగారు కట్టించిన వేణుగోపాలస్వామి చక్కని సీసపద్య శతకం చెప్పారు. గరుడపచ్చలు నీలాలు వున్న గోడలు, నునుకడాని గుమ్మాలు, కుందనపు కొప్పులు ఉన్న మంగళతరాలయంలో మదవతులు కొలిచే వేణుగోపాలుణ్ణి కీర్తిస్తూ ''అతను యుద్ధంబునకు యోధయైన రాధ'' దేవిడీవద్ద నిలబడి ముద్దులు కులుకుతూ ఉన్న దృశ్యాలను ఊహిస్తూ జనార్ధన రంగారావుగారు చెప్పిన ఈ శతకంలో నూరు పద్యాలూ లేకపోవడం దురదృష్టమే. ఏభై అయిదు పద్యాలేమో దొరుకుతున్నాయి. ''భవ్యగుణజాల వేణుగోపాల బాల'' అనే మకుటమున్న ఈ శతకం అముద్రితం. దీని ప్రతి ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది. ఆర్. 433 ఈ పుస్తకం ఒక్కటే గాదు, జనార్ధన రంగారావుగారు రచించిన మిత్రవిందాపరిణయం కూడా అచ్చుపడలేదు. ఇది నాలుగాశ్వాసాల ప్రబంధం. దీని గద్యలో జనార్ధన రంగారావుగారు తమ ''మృదుమధురోభయకవితా విచిత్రుడ''ననీ, ''పోషిత సత్కవి నికాయుడ''ననీ చెప్పుకొన్నారు. (ఆర్. 461 ఎ). వేణుగోపాల శతకంలో కవిత్వం మృదుమధురంగానే ఉంది. ఈయన పోషించిన కవుల వివరాలు తెలియడంలేదుగాని బొబ్బిలివారి ఆస్థానంలో కొటికలపూడివారిది ప్రధాన పండిత కుటుంబం.

కొటికలపూడి వెంకట కృష్ణయ్య

ఈయన క్రీ.శ. 1764లో జన్మించాడు. ఈయన ముత్తాతగారు వల్లంభట్లు ''సకల వేదాంత విశారదుడు.'' తాతగారు శివరామయ్య ''సాహిత్య భోజుడు.'' తండ్రి వెంకటు రామయ్య ''మహాప్రబంధుడు.'' ఇలాంటి సాహితీపరుల పెంపకంలో పెరిగినవాడికి ''మృదుపదరచనా చాతురి విదితార్థ సమృద్ధి'' కలగడంలో వింతలేదు. ''మహా విద్వత్కవి గ్రామణి'' అనడంలోనూ విడ్డూరం లేదు.

కొటికలపూడివారు కవులేకాక బొబ్బిలి సంస్థానాధీశ్వరులకు పురోహితులు. జ్యోతిష్యులు. అందుచేత ఈ కుటుంబంలో అందరికీ జ్యోతిష్యం కూడా క్షుణ్ణంగా వచ్చు. వెంకట కృష్ణయ్య కూడా కార్తాంతికులు మెచ్చుకొనేటట్టు జాతకాలు వ్రాయగలడు.

అయితే వెంకటకృష్ణయ్య అభిరుచులు మొదట్లో సాహిత్యంపైననే ఎక్కువ మొగ్గినట్టు కనబడతాయి.

అప్పటిదాకా అందరూ విద్యాభ్యాసంలో చదువుకొంటున్నా, ఎవరూ తెనిగించని మేఘసందేశాన్ని ''ధీరత''తో తెనిగించాడు. బహుశా ఇతనిదే మొట్టమొదటి ఆంధ్రాను వాదం కావచ్చు. అయితే దురదృష్టవశాత్తూ పూర్వమేఘంలోని శ్లోకాలకు చేసిన అనువాదాలు దొరకడం లేదు. ద్వితీయ సర్గ మాత్రమే లభిస్తోంది. విద్యుత్వంతం అనే ప్రథమ శ్లోకాన్ని ఇలా అనువదించాడు.

''చపలాన్వితుని సేంద్రచాపుని సగర్జానాదునిన్ సాంబున
భ్రపదస్థున్ నిను సాటి చేసికొను తత్ప్రాసాదముల్ శీ తరు
గ్లా పల్ చిత్రరుచుల్ మృదంగ నినదోల్లాసంబు రత్నస్థలుల్
విపులౌన్నత్యము గల్గి తత్తదుచితా విర్భూత లీలాగతిన్'' (ఆర్. 480 ఎ)

ఈ మేఘ సందేశానువాదం అచ్చుపడలేదు. ప్రథమసర్గ పద్యాలు లభిస్తాయో లేదో తెలియదు. ఈ కావ్యాన్ని వెంకట కృష్ణయ్య శ్రీరామునికి అంకితమిచ్చాడు. దీని తరువాత దిలీప చరిత్రను అంకితమిచ్చాడు. ఇది ప్రౌఢంగా ఉంది. అచ్చుపడింది. (మంజువాణి పత్రికలో మంత్రిప్రగడ భుజంగరావుగారు ప్రకటించారు). ఇందులో ''స్వాతీగతుడగు కవి విఖ్యాతిం గురిపించు వృష్టిగతి'' కవి కూడా తన ప్రతిభను కురిపించాడు. ద్వితీయా శ్వాసంలో దిలీపుడు శివ స్తోత్రం చేస్తాడు.

''ఛందములలోన బ్రణవంబు చందముునను
భూతములలోన గగనంబు పోల్కి గేశ
వాబ్జ గర్భాది సురలలో నాద్యుడైన
ఫాలలోచను............'' (2-198)

ప్రస్తుతించిన రీతిలో దండకం, పాద గోపన చంపకమాల, బహువిధత్రికంద గర్భిత సీసం, నాగబంధ చంపకమాల, చక్రబంధ శార్దూలం, చతుర్విధ కంద గర్భిత చంపకం, షోడశ విధకందం వగైరా చిత్ర కవిత్వాలను వెంకటకృష్ణయ్య వాడాడు. చతుర్థాశ్వాసంలో దిలీపుడు కొడుకుకు పట్టం కట్టేక చెప్పిన రాజనీతులలో సరళత్వం ఉంది. ఈ దిలీప చరిత్ర వ్రాశాకనే వెంకటకృష్ణయ్య కీర్తి ఇనుమడించినట్టుంది. చిన రంగారావుగారు రామునివలస అనే గ్రామాన్ని దానం చేశారు.

ఆ తరువాత రాజ్యానికి వచ్చిన రాయుడప్ప రంగారావుగారికి వెంకటకృష్ణయ్యా అంటే గురుభావం ఉంది. పద్మపురాణంలో ఉన్న శ్వేతాచల మాహాత్మ్యాన్ని తెలుగు చేస్తున్న సంగతి విని రాయుడప్పగారు దానిని ఏరికోరి అంకితం పుచ్చుకొన్నారు (ఆయన తమ పెద్ద కుమారునికి శ్వేతాచలపతి అని పేరుపెట్టుకొనడం గమనించదగ్గ విషయం.) శ్వేతాచలమాహాత్మ్యానికే కూర్మ మాహాత్మ్యం అనే నామాంతర ఉంది. ఈ గ్రంథం అచ్చుపడలేదు (ఆర్. 639). ఈ పురాణాన్ని తెనిగించాక వెంకట కృష్ణయ్య క్రీ.శ.1810లో అగ్నిష్టోమంచేసి సోమయాజి అయ్యాడు. తరువాత వ్రాసిన ప్రతి గ్రంథంలోనూ వెంకటకృష్ణ సోమయాజి అని గద్యలో చెప్పుకొన్నాడు. రాయుడప్ప రంగారావుగారికే కాక వారి దివానుగా, బావమరిదిగా సంస్థానపు వ్యవహారాలలో ప్రముఖుడైన ఇనుగంటి సీతారామయ్యగారికి కూడా వెంకటకృష్ణయ్య గ్రంథాలు అంకితమిచ్చాడు. విజ్ఞానేశ్వరీయంలోని వ్యవహారకాండను ఆయన ప్రోద్బలం వల్లనే అనువదించాడు. కాకతీయ యుగంలోనే మూలఘటిక కేతన దీనిని తెనిగించాడు. అయినా బొబ్బిలిలో దాని ప్రతులు దొరకలేదేమో. అందుకే అనువాదం చేయవలసిన అవసరం వచ్చింది కాబోలు. ఇనుగంటి సీతారామయ్యగారు ''వ్యవహార కాండమ్మైనన్ ప్రవిలమతి'' తెనుగు చేయమన్నారు. ప్రావీణ్యము మీరగా అనేక చమత్కారము లావిర్భవించేటట్టు రచించమని

ఆయన చెప్పాడు. అయిదాశ్వాసాలలో విపులంగా వెంకటకృష్ణయ్యా దానిని సాధించాడు. ఈ గ్రంథం అచ్చుపడలేదు (ఆర్. 593). ఇది రాయుడప్ప రంగారావుగారి రాజ్యకాలం లోనే వెంకట కృష్ణయ్యా రచించాడు.

రాయుడప్పగారు వేదాంతంవైపు మొగ్గి సంకల్పసూర్యోదయం తెనిగించారు. ఆ గ్రంథం సంస్కృతంలో పుట్టడానికి కారణమైన ప్రబోధ చంద్రోదయాన్ని వెంకట కృష్ణయ్యా మూడాశ్వాసాలలో ఆంధ్రీకరించాడు (ఇది రామునికే మళ్ళా అంకితం). ఈ నాటకానువాదం కూడా పద్య కావ్య రూపంలోనే సాగింది. ఇది అచ్చుపడలేదు (ఆర్. 476 (ఎ); 480 (బి); 656). రాయుడప్పగారు ఈ గ్రంథానువాదం వల్ల ఏమనుకొన్నారో తెలియదు. 1826లో సుభద్ర అనే గ్రామాన్ని మాత్రం వెంకటకృష్ణయ్యాగారికి ఆయన ఇచ్చాడు. ప్రబోధచంద్రోదయ రచనకు పూర్వమో, తరువాతో తెలియదు.

వెంకట కృష్ణయ్యా 74 సంవత్సరాలు జీవించాడు. క్రీ.శ. 1838లో పోయాడు. ఈయనకు ఏడుగురు కొడుకులు. ఇద్దరు కూతుళ్ళూ కలిగారు. వీళ్ళలో నాలుగో కొడుకు మాత్రమే కవిగా పేరు తెచ్చుకొన్నాడు.

కొటికలపూడి కోదండరామయ్యా

ఈయన వెంకటకృష్ణయ్యాగారి నాలుగో కుమారుడు. ఇతడు రాయుడప్ప రంగారావుగారి పెద్ద కొడుకు శ్వేతా చలపతితో కలిసి చదువుకొన్నాడు. ''అభ్యసించితివి బాల్యమాదిగ మాతోడ సకల వేదాంతార్థశాస్త్ర చయము'' అని శ్వేతాచలపతి ఒకసారి అన్నట్టు కోదండరామయ్యా చెప్పుకొన్నాడు. శంకరాచార్య శిష్యత్వమున్నా కోదండ రామయ్యాకు రామానుజం మీద రక్తి ఉంది. అన్యథా వైపరీత్య జ్ఞానాలు లేవట. సర్వమతాలకు సముడే. ఇతడు 38 సంస్కృతాంధ్ర కావ్యాలు వ్రాశాడు. వాటిలో 14 మాత్రమే దొరుకుతున్నాయి. ఇందులో శతకాలు, రెండు గణిత శాస్త్రాలు, రెండు వేదాంతాలు. ఒకటి ఆరాశ్వాసాల కావ్యం. ఇన్ని గ్రంథాలు ఇతడివి దొరుకుతున్నా మూడే అచ్చుపడ్డాయి. ఒకటి మారుతీ శతకం. రెండోది ప్రపదన పారిజాతం, మూడోది ఆర్యభట్టీయం. వీటిలో రెండోదాంట్లో కోదండరామయ్యా తాను వేద వేదాంత బోధ నిధిననీ, కార్తాంతిక సంఘ సన్నుతుడనని చెప్పుకొన్నాడు. ఇతని గ్రంథాల జాబితాను చూడండి.

ఆర్యభట్టీయ సిద్ధాంత వ్యాఖ్యానం	అచ్చుపడింది ప్రాచ్యలిఖిత గ్రంథాలయం ప్రచురణ, 1956.
జానకీ రామశతకం	ఆర్.532 (303 సీస పద్యములు)
తారక బ్రహ్మమహాత్మ్యం	ఆర్. 590
దేవచూడామణీ శతకం	ఆర్. 606
నృసింహ పురాణం	ఆర్.555 (6 ఆశ్వాసాలు)
ప్రపదన పారిజాతం	అచ్చుపడింది
భారతీశతకం	ఆర్. 562

మాధవ శతకం	ఆర్. 572 (బి)
మారుతీ శతకం	అచ్చుపడింది
రాజవతంస శతకం	ఆర్. 580 (బి)
వేణుగోపాల శతకం	ఆర్. 647
శ్రీ సతీశ శతకం	ఆర్. 572 (ఎ)

ఈ గ్రంథాలలో కొన్నింటి రచనా కాలాన్ని కోదండ రామయ్య పేర్కొన్నాడు. పేరుపడ్డ జ్యోతిష్యుడు కనుక తన జనన కాలాన్ని కూడా ఇచ్చాడు (క్రీ.శ. 1807). ఇతడు ఆర్యభట్టీయంలో లేని విషయాలను 'ఆనందపాదం' అనే పేర వ్రాసినట్టు బొబ్బిలి వాళ్ళు చెప్పారు.[4] ఆర్యభట్టీయంలో నాలుగే పాదాలు ఉన్నాయి. ఇది కొత్త పాదం. ఇది ఎక్కడుందో వెదకాలి.

గరిమెళ్ళ సుబ్బయ్య

బొబ్బిలిలో కొటికలపూడి వారిదేకాక గరిమెళ్ళ వారిది కూడా పండిత కుటుంబమే. తర్క వ్యాకరణాలూ వేదాంతాలూ బాగా చదువుకొన్న గరిమెళ్ళ సుబ్బయ్య రాయుడప్ప రంగారావుగారి సమకాలికుడేకాక ఆయనకు సంకల్ప సూర్యోదయంలో సహాయకుడయ్యాడు. ఈ సంగతిని గ్రంథాదినే రాయుడప్పగారు ఇలా చెప్పి తలచుకొన్నారు.

తర్క వ్యాకరణాగమాంత ముఖ శాస్త్ర ద్రవ్య విజ్ఞాన బా
లార్కోచ్చాటిత కామలోభ మదమోహక్రోధ మాత్సర్య సం
పర్కున్ శ్రీ గరిమెళ్ళ వంశయుని దివ్యత్ సుబ్బయాభిజ్ఞున్
కోర్కిన్ మత్కృతికిన్ సహాయుడగుటన్ గూర్మిన్ దలంతున్ మహిన్. (1–14)

రాజాగారి కృతికి సహాయం చేయడమేకాక గరిమెళ్ళ సుబ్బయ్య స్వయంగా ఏ గ్రంథాలు వ్రాశాడో తెలియదు.

బొబ్బిలి రామయ్య

కొటికలపూడి వెంకట కృష్ణయ్య ఒక్కడేకాక మరొకరు కూడా ఈ యుగంలో బొబ్బిలిలో విజ్ఞానేశ్వరీయాన్ని తెనిగించారు. అతని పేరు రామయ్య. తండ్రి పేరు గోపాలపంతులు. ఈయన పండిత కుండలేశ్వరుడట. తండ్రి అలాంటివాడైతే కొడుకు పురాతనాధునాతన విద్వద్వరుల అనుమతిని ఆంధ్రగీర్వాణ రచన చేసేవాడు. ఈయన విజ్ఞానేశ్వరీయంలోని ప్రాయశ్చిత్తకాండను తెనిగించాడు. ఇది రాయుడప్ప రంగారావు గారి కాలంలోనే జరిగింది. వెంకట కృష్ణయ్యగారు వ్యవహారకాండను మాత్రమే తెనిగించడం వల్ల శేషగ్రంథంగా దీనిని రామయ్య తెనిగించాడేమో. దీని అసమగ్ర ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్. 710)

---

4. నా మిత్రులు కోట లక్ష్మీనారాయణగారు 8-8-1966 తేదీన నాకు వ్రాసిన లేఖలో కోదండరామయ్యగారి ఆనందపాదం ప్రతిని వేటూరివారు మిగతా గ్రంథాలతోపాటు ప్రాచ్యలిఖిత గ్రంథాలయానికి చేర్చారని తెలియచేశారు. కేటలాగులో అది కనబడదు.

దామెర వెంకటరాయడు

పూర్వ కవులు అనువదించిన గ్రంథాల ప్రతులు దొరకకపోవడంవల్ల వాటిని ఎవరో తెనిగించలేదనుకొనడం, మన పుణ్యాం కొద్దీ వదలిపెట్టారని భావించడం సహజమే. కవిత్రయంవారు భాగవతాన్ని వదలిపెట్టడం పుణ్యమని బమ్మెర పోతరాజు గారు అన్నారు (భాగవతం.1-19). ఆనాటి నుండి ప్రతి కవీ ఇలా అనడం పరిపాటి అయింది. బొబ్బిలిలో దామెరవారనే వెలమదొరల కుటుంబం ఉంది. అందులో కవిగా పుట్టిన వెంకటరాయడు స్కాంద పురాణంలో సేతు ఖండం గురించి ఇలా భావించాడు.

భువి సమస్త పురాణముల్ పూర్వకవుల
చేత దెనిగింపబడియెను సేతుఖండ
మొకటి మా పుణ్యవశమున నుండె దాని
మృదు వచో రీతి తెనిగింపు మిద్ద చరిత (ఆర్. 543)

ఇలా అన్నది శ్వేతా చలపతి రంగారావుగారు. ఆయన కవిని చిన్నప్పట్నుంచి ఆదరించారు. ''బాల్య మాదిగనను తన భావనయందు నిలిపి, సంపదలిచ్చి మన్నించారని'' కవి చెప్పుకొన్నాడు. ఇతడు అయిదాశ్వాసాలలో తెనిగించిన సేతు ఖండం సమగ్ర ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది (ఆర్. 543). ఇది అచ్చుపడలేదు.

బొబ్బిలి కేశవయ్య

సాహిత్య గణితాలు మాత్రమేకాక సంగీతం కూడా ఈ యుగంలోనే బొబ్బిలిలో రాణించింది. బొబ్బిలి కేశవయ్యగారు ఉన్న ఊళ్ళోనే కూర్చొనక దిగ్విజయ యాత్ర చేశాడు. ఎప్పుడూ గుర్రం మీదనే సంచారం చేసేవారు. వెళ్ళిన ప్రతి ఆస్థానంలోనూ విద్వాంసులను ఓడించి, వాళ్ళ తలపాగాలూ, తంబురాలూ, భూషణాలు తీసుకొనే వాడు. ఈయన తంజావూరుకు వెళ్ళినప్పుడు బళ్ళకొద్దీ తలపాగాలా, తంబురాలూ, శాలువలు రాగా ఓడిపోయిన విద్వాంసులు వెంట నడిచారట. శరభోజ ఆస్థానంలో బొబ్బిలి కేశవయ్యగారు జెండాకట్టిన తంబురా పట్టుకొని పాడారట. తమిళ పదాలు రచించిన ఘనం కృష్ణయ్యగారు ఈయన వద్దనే మధ్యమకాల గానంలోని సొగసులు నేర్చుకొన్నారట.[5]

జైత్రయాత్ర చేసుకొంటూ వచ్చిన బొబ్బిలి కేశవయ్యగారిని దక్షిణాది సంగీత చరిత్రకారులు ఒక రాక్షసునిలాగ చిత్రించారు. ఈయన చేసిన సవాలు తంజావూరులో ఏ విద్వాంసుడూ ఎదుర్కో లేకపోయాడు. ఇతడు సింహనందనం అనే బహుళాక్షర ప్రమాణం గల తాళంలో పల్లవులు పాడడంలో ఘటికుడు. ఈయనను ఓడించడానికి సంగీతత్రయంలోని ఒకడైన శ్యామశాస్త్రులు శరభనందనం అనే తాళ పల్లవిని రచించవలసి వచ్చింది. బొబ్బిలి కేశవయ్యగారి రచన కాదుగాని వారి ప్రభావంతో రచించిన ఒక సింహనందన దరువు తాళ లక్షణ గ్రంథాలలో దొరుకుతుంది. చూడండి.

5. Madras Tri Centenary Commemoration Vol.p.p.429-430.

కలికిగగల వలగ ధృతకవగగలప
గలలక పదముల గతులలోనా
వెలయుచు తాళములారై మెలగెడి దేమిచెలీ!
అలివేణి చతురతాభిజ్ఞులగులవారు
తలపలపల రు క్రమములెంతయు, చోద్యములుగాగ దలచి మదిని
చెలగి ఉత్తర రంగ శౌరి సత్కృపనం
జేసిన నగవేమిర వంగలి పురి భీమేశా! (డి. 2538)

అభిజ్ఞులు చూడాలని ఎంచకపోయినా సింహనందనం గ్రంథాలకెక్కింది. బొబ్బిలి కేశవయ్యగారు ఆశువుగా ఇలాంటి సంగీత రచనలు ఎన్నో చేసేవారు. ఈయన రచించిన కీర్తనలు దక్కకపోవడం దురదృష్టమే. దక్షిణాది విద్వాంసులను గడగడ లాడించిన ఈయనకు "భూలోక చాపచుట్టి" అనే బిరుదు మాత్రం దక్కింది. ఈయన హిరణ్యాక్షుడు కాదు. హిరణ్యగర్భుడే. ఉత్తరాది సంగీత సంప్రదాయానికి ఈ యుగంలో ఆద్యబ్రహ్మ అనుకోవచ్చు. ఇతని గురించి ఇంకా పరిశోధనలు జరగాలి.

బొబ్బిలిలో ఎందరు రాజులు పాలించినా, ఎందరు కవులు జీవించినా ఒక్క కేశవయ్య గారికే బొబ్బిలి కేశవయ్యగారనే కీర్తి దక్కింది.

వెంకటగిరి

ఆరవీటి రాజుల యుగం నుంచీ రాయ సామ్రాజ్యపు రాజకీయాలలో వెలుగోటివారు తలమునకలుగా పాల్గొన్నారు. కాకతీయులకాలం నుంచీ ప్రసిద్ధులైన పద్మనాయకులలో 77 గోత్రాలవారు ఉన్నారు. రేచర్ల గోత్రీకులలో సుప్రసిద్ధులున్నారు. మూలపురుషుడైన చెవిరెడ్డి దగ్గర్నుంచి కుంఫిణీ యుగంలో కడపటివాడైన సర్వజ్ఞ కుమార యాచమనాయుడిదాకా 27 తరాలవారి చరిత్రను వాళ్ళ వందిమాగధులు గానంచేసి వ్రాతమూలంగా భద్రపరిచారు.[1] 15వ తరంలోని నిర్వాణ రాయప్పగారు "వెలిగొండుగు రాయవిభుడు" అనే బిరుదుతో కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకాలోని వెలిగోడు పాలించారని ప్రతీతి. ఈయన చనిపోయేటప్పుడు మల్లన అనే కవి "వైకుంఠారోహణం' అనే చిన్న కావ్యాన్ని వ్రాశాడు.[2] అప్పటినుంచీ ఇతని సంతతి వారికి వెలుగోటివారనే పేరు వచ్చిందని కూడా చెప్తారు (వెలుగోడు కర్నూలుకు తూర్పున 40 మైళ్ళ దూరంలో ఉంది). నిర్వాణ రాయప్ప మునిమనుమలలో ఒకడైన వెంకటాద్రినాయుడు (19వ తరంవాడు) తన పేర ఒక కోట కట్టుకొన్నాడు. అదే వెంకటగిరిగా ప్రసిద్ధమై ఉత్తరోత్తరా వెలుగోటి వారి రాజధాని అయింది.

1. ఇటీవల చచ్చిపోయిన శూరులను వర్ణించేవారు మాగధులు. ఇప్పటి రాజుల యథార్థాలను పొగిడేవారు వందులు. పురాణకాలంలోనివాళ్ళను వర్ణించేవాళ్ళు సూతులు. జైమినీభారతం, అశ్వమేధపర్వం, 55 అధ్యాయం, శ్లో.40, 41).
2. వెలుగోటివారి వంశావళి (మద్రాసు విశ్వవిద్యాలయంవారి ప్రచురణ) 218వ నెంబరు పద్యం.

23వ తరంలోని సర్వజ్ఞకుమార యాచమనాయడు క్రీ.శ. 1895లో వెంకటగిరిలో పట్టం కట్టుకొన్నాడు. ఈయన సంస్కృత కవి. కాళికా భక్తుడు. జ్ఞాన ప్రసూనాంబమీద రెండు అష్టకాలు సంస్కృతంలో వ్రాసినట్టు తెలుస్తోంది. ఇతని కాలం నుంచీ రాజధాని మారలేదు. వెంకటగిరి రాజుల అందరి పేర్ల చివరా యాచమనాయుడు అనేది తప్పక ఉంటుంది. బొబ్బిలిరాజుల పేర్ల చివర రంగారావనీ, నూజివీడు రాజులకు అప్పారావనీ ఉంటుంది. అయితే బొబ్బిలివాళ్ళనూ, నూజివీటి వాళ్ళనూ గుర్తుపట్టడం సులభం. రంగారావు, అప్పారావు అనే పేర్లముందు రాయుడప్ప, నారసింహ అనే పేర్లు ఏవో ఉంటాయి. వెంకటగిరి రాజులలో ఒకటే కుమార యాచమనాయళ్లూ లేక బంగారు యాచమనాయుడు ఒకరి తరువాత ఒకరు కనబడతారు. ఒకే పేరున్నవాళ్ళు వివిధ తరాలలో ఉన్నప్పుడు మొదటివారి పేరు ముందు ''పెద్ద'' అనే విశేషణాన్ని తగిలించి తరువాత ఇమ్మడి, ముమ్మడి అంటూ రెండో, మూడో తరాలవాళ్ళని సూచించడం చరిత్రకారుల సంప్రదాయం. అయితే ఇప్పటిదాకా ఎవడూ వెంకటగిరి రాజుల విషయంలో పాటించలేదు. తరం నెంబరు సూచించడమే జరుగుతోంది. ఇది సాధారణ పాఠకులకు ఇబ్బందే.

వెలుగోటివారి వంశంలో 5వ తరంనుంచీ ''యాచమ'' అనే పేరు కనబడుతున్న 13వ తరంలోని యాచమ నాయుడే వెంకటగిరి వంశకర్త. అయితే 20వ తరంలోని యాచమనాయకుడే ప్రసిద్ధుడు. ఇతణ్ణే వంశావళి పద్యకర్తలు పెదయాచమ నాయుడని వ్యవహరించారు. ఇతడు సాహిత్యపోషణ కూడా చేశాడు.[3] ఇతని జ్ఞాపకార్థమే వెంకటగిరి రాజులందరూ తమ బిడ్డలకు ''యాచమ'' అని పేరుపెట్టుకొన్నారు. కుంఫిణీయుగంలో ఇద్దరు బంగారు యాచమనాయుళ్లూ పాలించారు. సాహిత్యపోషణ చేశారు. వాళ్ళగురించి విడివిడిగా చెప్పుకొందాం.

ఇమ్మడి బంగారు యాచమనాయుడు

ఈయన క్రీ.శ. 1722లో పుట్టాడు. 1755లో పట్టం కట్టుకొన్నాడు. 1777 దాకా జీవించాడు. వెలుగోటి వారి వంశంలో ఇతడు 24వ తరంవాడు. మొదటిసారిగా 22వ తరంలో బంగారు యాచమ అనే పేరు కనబడడంవల్ల ఇతడికి ''ఇమ్మడి'' అనే విశేషణాన్ని తగిలించాను. ఈయన సప్త సంతానాలలో అన్నీ స్థాపించినట్టుంది. వెంకటగిరిలో విశ్వేశ్వరాలయం కట్టించాడు. ఈయన కట్టించిన సత్రాలూ, త్రవ్వించిన చెరువులూ ఇప్పటికీ దొరవారి సత్రం, దొరవారి కోనేరు అనే పేర్లతో కనబడతాయి. ఈయనే నాయుడుపేట కట్టించాడు. ఇతని కాలంలో నలుగురు కవులు కనబడుతున్నారు.

కస్తూరి రంగప్ప

ఇమ్మడి బంగారు యాచమనాయుడు మీద కస్తూరి రంగప్ప అనే కవి పంచరత్నాలు చెప్పాడు. పదాలు అల్లాడు. మన శృంగార పదవాఙ్మయంలో కస్తూరి రంగని పదాలు కొన్ని ఉన్నాయి. ''ఇందెందు వచ్చితివిరా అలదాని యిల్లు యీవీధి కాదు పోపోరా'' అనే

3. నాయకరాజుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం - రెండవ సంపుటి, 2003.

పదంలో కస్తూరి రంగముద్ర ఉంది.[4] బహుశ దీనిని వెంకటగిరి కస్తూరి రంగప్ప వ్రాసి ఉండవచ్చునేమో. ఇతడు చెప్పిన పదాలు శృంగారరస యుక్తాలని చరిత్రకారు లంటున్నారు.[5]

మంచెళ్ల కృష్ణమరాజు (1848)

ఇతడు నాలుగు శతకాలు చెప్పాడు. ''వేంకటనగాధిపతీ, విలాస కృపామతీ'' అనే మకుటమున్న శతకంలో ''సకల కళా విశేషముల జాడ లెరింగిన వాడగాను'' అని చెప్పుకొన్నాడు (సంఖ్య.18). ''ఇమ్ములనాదు కబ్బము రహిన్ రసవంతముగాక యున్న నందమ్మగు నీదు వర్ణన ఘనమ్ముగా'' అని దేవునికి చెప్పి కల్పవృక్షం కొమ్మలు వంకలైనా గుజ్జుకోరవా అని ప్రశ్నించాడు (నెం.20). ఇతని శతకాల నిండా దైవలీల పొగడ్తలే ఉన్నాయిగాని గుజ్జుకు కొరతలేదు. ''పూరుషముఖ్యుడా భువనపూజ్యుడు నాకు ప్రసన్నుడయ్యెడిన్'' అనే మకుటంతో చెప్పిన ఉత్పలమాలా శతకంలో స్తుతి మరీ ఎక్కువ. ఈ రెండు శతకాలే కాక రంగ శతకం, రఘు పుంగవ శతకం అనేవి కూడా మంచెళ్ళ కృష్ణయ్య రచించాడు. అయితే మొదటి రెండు మాత్రమే అచ్చుపడ్డాయి 'ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి శతక సముచ్చయం ప్రథమభాగంలో ఇవి ఉన్నాయి). ఇతడు బంగారు యాచమ నాయుని కాలంవాడే. ఆ ప్రభువుమీద ఈయన వ్రాసిన ఒక దండకమే కాక ఈ పద్యం కూడా వ్రాశాడు.

''కోటలు నుగ్గునుగ్గు మదకుంజర పంక్తులు పిండిపిండి చెం
డీటెలు పొట్టుపొట్టు పొగలెక్కు హయంబులు చక్కుచక్కునీ
ధాటికి సాటి లేదు వసుధాతల నేతల నెంచి చూడవె
ల్గోటి కులాబ్ధి చంద్రనృపకుంజర! బంగరు యాచభూపతీ!''

(చాటుపద్య రత్నాకరం నెం.110)

ప్రభువును గొప్పగొప్పగా వర్ణించే ఈ మంచెళ్ళ కృష్ణయ్య ఇవ్వని వాళ్ళని పచ్చి పచ్చిగా తిట్టగలడు. ఇంకో పద్యం చూడండి.

''ఇయ్యక చదివించుకొనే
కొయ్యలునౌ లంజతొత్తు కొడుకులు దొరలా?
యియ్యగ నేరుతు రర్థికి
వెయ్యారులు యాచభూప వినుత దిలీపా! (చాటుపద్య రత్నాకరం, నెం.108)

ఇయ్యనివాళ్ళను మంచెళ్ళ కృష్ణయ్య ఇంత ఘాటుగా తిట్టినా తాను ఇస్తానన్నది ఇవ్వక మెత్తగా ఇంకో కవిచేత తిట్లు తిన్నాడు!

కొమ్మలపాటి ఓబన్న

ఈయన వసుచరిత్రను అతిపిపాసతో చక్కగా చదువుకోవాలనుకొన్నాడు. ఆ కావ్యాన్ని మంచెళ్ల కృష్ణయ్య సవ్యాఖ్యానంగా పంపిస్తానని చెప్పి ఒక్కమూలాన్ని మాత్రమే పంపించాడు. అప్పుడు కోపంవచ్చి ఓబన్న ఈ పద్యం వ్రాసి పంపించాడు.

4. ఆంధ్ర వాగ్గేయకారచరిత్ర – రజనీకాంతరావు, పుట 403.
5. వెలుగోటివారి వంశ చరిత్రము – వెల్లాల సదాశివశాస్త్రులు, పుట 124.

''షడ్రసోపేత భోజన మిడి యతనికి
నాపోశనము నీక యలచు కరణి
అతి పిపాసార్తున కమృత కూపము జూపి
''చేదలే'' దనుచు వచించు మాడ్కి
దనర గన్యాదాన మొనరించి తరిని గ
ర్భాదాన మొనర జేయని పగిదిని
దర్పణాంతరమున ధనరాశి జూపించి
కొనుమెంతవలసిన నను విధమున
దెలిసియును నయ్యో సవ్యాఖ్య దెచ్చియీక
మూలమంపితి వేటికి మూలధనము
మూలధనమన్న యట్లు సమూల మొసగు
పొల్లు పుచ్చకు తృష్ణ? మంచెళ్ల కృష్ణ'' (చాటుపద్య రత్నాకరం నెం.193)

తృష్ణతో వసుచరిత్ర చదువుకోదలంచిన కొమ్మలపాటి ఓబన్న ఈ పద్యం తప్పించి ఏ గ్రంథాలు వ్రాశాడో తెలియదు.

ముడింబి అప్పయ్య దీక్షితులు

ఇమ్మడి బంగారు యాచమనాయకుని తండ్రి పేరు కుమార యాచమనాయుడు. అతని కాలంలో (1865) ముడింబి అప్పయ్య దీక్షితులు అనే కవి విష్ణు పురాణం తెనిగించాడు. ఇంతకుముందు వెన్నెలకంటి సూరన్న విరచించిన విష్ణుపురాణం ప్రసిద్ధమే. అయితే ''విష్ణుపురాణము భావము అవైష్ణవుడెరుగడు'' అని అప్పయ్య ఉద్దేశం. భారత భాగవతాదులు కూడా అవైష్ణవుల తెనిగింపు వల్ల తేటపడలేదని అతని తాత్పర్యం. అందుకే ఇలా చెప్పుకొన్నాడు.

శ్రీ భాగవతము మహాభారతంబును
నద్వైత వేషులైనట్టి వారు
తెలిగించిరట గాన తేటపడదు హరి
పారమ్య మా విష్ణు భక్తి విధము
శ్రీ పరాశరముని శిష్టాగ్ర గణ్యుండు
విష్ణు పురాణంబు వెలయజేసి
అదియు గొందరు యతుల ద్వైతమని తమ
భాష్యముల లోపల వ్రాసికొనిరి
అదియుగాదని రామానుజాచార్యవర్యు
డెట్లు వ్యాఖ్యాన మొనరించెనట్లు నెగడ
రమణ చెలువొంద విష్ణుపురాణ మొకటి
తెలుగు గావించె నప్పయ దీక్షితుండు (ఆర్. 751)

రామానుజ వ్యాఖ్యను అనుసరిస్తూ తెలిగించిన ఈ విష్ణు పురాణం వెలుగు చూడలేదు. ఇందులో ఆశ్వాస విభాగం లేదు. అంశాల కింద విభజించాడు. షష్ఠాంశం చివర ఒక పద్యంలో వెంకటగిరి ప్రభువు వల్ల సన్మానం పొందినట్లు చెప్పాడు.

ఇది భూభూషణ భూత వేంకట మహాపృథ్వీభర ప్రాంత పూ
ర్వదిశా మధ్యంధరాధి పాలన మహారాజాగ్రణీ సేవ్య భూ
రి దయాసాంద్ర కుమార యాచ ధరణీ భృద్వింద్య శ్రీ వైష్ణవా
గ్ర్యదయాధ్యాప్పయదీక్షతార్యకృతిలో రంజిల్లు షష్ఠాంశమై (ఆర్.751)

ఈ పద్యంలో చెప్పిన కుమార యాచమ నాయుడు 23వ తరంలోని వాడని, ఇమ్మడి బంగారు యాచమ నాయుడి తండ్రి అని వంశచరిత్ర వల్ల తెలుస్తోంది.[6] ఈ బంగారు యాచమనాయుడి కొడుకు పేరు కూడా కుమార యాచమనాయుడే. అతడు కూడా కవులను పోషించాడు.

ఇమ్మడి కుమార యాచమనాయుడు

ఇతనికి సర్వజ్ఞ బిరుదు లేదు. ఇతని తాతగారికే బిరుదు ఉంది. వాస్తవానికి ఇతడు వెలుగోటి వాళ్ల ఇంట్లో పుట్టినవాడు కాదు. ఇమ్మడి బంగారు యాచమ నాయుడికి బిడ్డలు లేరు. అందుచేత అలవలపాటివారి చిన్నవాడిని దత్తత చేసుకొని తన తండ్రి పేరు పెట్టుకొన్నాడు. ఈ ఇమ్మడి కుమార యాచమ నాయుడు క్రీ.శ. 1762లో జన్మించాడు. 1777లో రాజ్యానికి వచ్చాడు. 1805 దాకా, అంటే 28 సంవత్సరాలు పాలించాడు. ఇతని కాలంలోనే హైదరాలీ వెంకటగిరిమీదకు దళాలను పంపి దోపిడీ చేయించాడు. ఇళ్లు తగులపెట్టాడు. తెల్లవాళ్లతో యుద్ధం చేయడానికి హైదరు వెంకటగిరివాళ్ళ సహాయాన్ని కోరాడు. వాళ్లు ఒప్పుకోలేదు. అందుకే పగపట్టి హైదరు పంతం తీర్చుకొన్నాడు. తెల్లవాళ్ళకు సహాయం చేయడంలో వెంకటగిరివాళ్లు కాళహస్తి వాళ్ళతో పోటీపడ్డారు. వాళ్ళకన్నా తానే ముందుగా నకారా కూచి వేసే హక్కులను తెల్లవాళ్ళ అనుగ్రహంవల్ల సంపాదించుకొన్నారు. ఈ ఇమ్మడి కుమార యాచమ నాయుడు కూడా పెంపుడు తండ్రిలాగ సాహిత్యాన్ని పెంపు చేయించాడు. ఈయన "కాశీ విశ్వనాథ వరలబ్ధ భాగ్యగీర్వాణవల్లభుడనీ", "కోవిద జనాధారు"డనీ అని కవులు ఇతణ్ణి పొగిడారు. పండితులకు చాలా అగ్రహారాలు ఇచ్చాడు. ఒక్క 1802లోనే 8 గ్రామాలు దానం చేశాడు.

కస్తూరి లింగప్ప

కస్తూరి వాళ్ళు వెంకటగిరి సంస్థానంలో వందిమాగధుల్లాగ కనబడుతున్నారు. ఇమ్మడి బంగారు యాచమనాయుడిపైన పంచరత్నాలూ, శృంగార పదాలూ చెప్పిన రంగప్పకు ఏమవుతాడోగాని కస్తూరి లింగప్ప ఆ నాయకుని కొడుకు మీద నవరత్నాలు

6. వెలుగోటి వారి వంశ చరిత్రము - వెల్లాల సదాశివశాస్త్రి - పు 118

చెప్పాడు. ఇతడు కూడా రంగప్పలాగ ''గాన యోగ్యములగు'' పదాలు చెప్పాడట. అయితే ''ఇవీ ఇతని రచనలు'' అని ప్రత్యేకంగా ఇప్పటికి వేటినీ గుర్తు పట్టలేం.

నరకూరి నారాయణ

గుర్తు పట్టలేనంతగా ఇతరుల రచనలలో కలసిపోయిన కృతి నరకూరి నారాయణ వ్రాసిన పారిజాతాపహరణం అనే యక్షగానం. మన వీధి భాగవతాలలో భామాకలాపం చాలా సుప్రసిద్ధం. సిద్ధేంద్రయోగి కూచిపూడి భాగవతం అశేషప్రచారం పొందాక రమారమీ ప్రతి ఊళ్లోనూ ఒక భామాకలాపం. పారిజాతం తయారయినట్టుంది. అయితే సిద్ధేంద్రుల ప్రభావం నరకూరి నారాయణమీద ఇతని అనుకరణలు ఇతర పారిజాతాలపైనా చాలా ఉంది. నారాయణ పారిజాతంలో సవతుల కయ్యం చాలా ప్రచారమైనది. ఉత్తరోత్తరా పారిజాతం అనే పదానికి సవతుల కయ్యం అనే అర్థం జనంలో రూఢమైంది. కొందరు యక్షగాన కవులు శివపారిజాతాలు వ్రాశారు. అయితే వాటిలో గంగా పార్వతుల కయ్యం తప్ప పారిజాత ప్రసక్తి ఏమీ లేదు.[7] ఈ యుగంలో వచ్చిన పారిజాతాలూ, భామాకలాపాలూ, గొల్ల వేషాలు 16కు తక్కువ లేవు. అసలు మన సాహిత్యంలో అన్ని యుగాలలోనూ కలిపి 19 పారిజాతాలూ, 28 భామాకలాపాలు, 14 గొల్లకలాపాలు ఉన్నాయి.[8]

ఈ యుగంలో వచ్చిన వాటి వివరాలు చూడండి:

పారిజాతాలు

1.	నరకూరి నారాయణ	1882లోనే అచ్చుపడింది.
2.	మాతృభూతయ్య	ఆంధ్రవిశ్వవిద్యాలయ ప్రచురణ యక్షగానాలు, సంపుటి 5
3.	శేషం రంగాచార్యులు	శివ కేశవ పారిజాతం కె.నెం. 3139
4.	జ్యోతి రామయ్య	అసమగ్రం కె.1743
5.	పులిజాల లక్ష్మీనారాయణ	ఆర్.438
6.	లింగమూర్తి	శివపారిజాతం (డి.1944-5; ఆర్.1157, ఆర్.1197)
7.	కనకజెట్టి వెంకటకృష్ణాజెట్టి	శివపారిజాతం (టి.636-7)
8.	తరిగొండ వెంకమ్మ	ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ 1965 (విష్ణుపారిజాతం అని పేరు పెట్టారు)
9.	రామచంద్రపురం శ్రీనివాసయ్య	(కె.184) సర్వాంగ సుందరమైన పారిజాతం అని పరిశోధకుల అభిప్రాయం. (యస్వీ. పుట.88)
10.	నందవరం సింగన్న	డి. 1901

7. ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర, ద్వితీయభాగం, యస్వీ జోగారావు, పుట.65
8. అదే గ్రంథం, ప్రథమభాగం, పుట 12.

గొల్ల కలాపాలు

1.	ఆత్రేయపురం తమ్మయ్య	ఆర్.485, డి.187 (?)
2.	నరకూరి నారాయణ	కె. 173
3.	భారతి రామరాజు	డి.1873-76
4.	బొండపల్లి వెంకటదాసు	ఆర్.487
5.	నక్కలపాటి సంజీవయ్య	కె. 3225, 3708
6.	ఘట్టు రామయ్య	కె. 3807

పారిజాతాలూ, గొల్లకలాపాలూ పదహారు లెక్కతేలుతున్నా భామాకలాపం మాత్రం ఒక గుడిమెట్ల రామయ్య వ్రాసినదే కనబడుతున్నది (రాధాకృష్ణ సంవాదం; రాజమండ్రి ఆంధ్ర ఇతిహాసక పరిశోధక మంజరి. ప్రతి నెం.13.) పారిజాతాలలో కూడా కొంత భామాకలాపం ఉంటుంది. నరకూరి నారాయణ ఈ రచనలలో సిద్ధహస్తుడు. ఇతడు తన పారిజాతాన్ని ఇమ్మడి కుమార యాచమ నాయునికి అంకితం ఇచ్చాడు. ఆ రాజుగారు తన్ను పిలిచి ''ముక్కు తిమ్మన్నగారు చెప్పిన పద్య కావ్యంబు జూచి సమాధికంబుగ బారిజాత నాటకము క్రమమొప్ప శృంగార కావ్యంబు జేయు''మని ఆజ్ఞాపించినట్టు గ్రంథాదిని చెప్పాడు. గ్రంథాంతంలో ఇలా చెప్పాడు.

అని యిట్టు లీ కథ నాద్యంతముగను
జనమేజయునకు వైశంపాయనుడు
వినిపించె నయ్యతులిత జనాధార
ఘన వెలుగోటి బంగరు యాచనృపతి
తనయ కుమారేచ ధరణీ తలేంద్ర
వినవయ్య మిది జగద్విమత ప్రభావ
మిది పుణ్యచరిత్ర మిది బుధ స్తోత్ర
జన్మ సాఫల్యమె.......'' (డి.1899)

ఇది వ్రాసినందుకు నిజంగా నరకూరు నారాయణ జన్మ సఫలమైందని చెప్పవచ్చు. ఇతడు నరకూరు ముత్తయ్య కొడుకుననీ, కాళమ్మ కుమారుడననీ, అమిత యశుడననీ చెప్పుకొన్నాడు. ఇతనికి యశము వచ్చినా రాకపోయినా ఇతనివల్ల పారిజాత యక్షగానానికి చాలా ప్రాచుర్యం లభించింది. ఇతని రచనాభాగాలు దేశమంతటా అల్లుకొన్నాయి. తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయంలోని రాధ కథ (టి.487), సత్యభామ కథ (టి.488) వంటివి నారాయణ రచనలే అని పరిశోధకులు గుర్తుపట్టారు.[9] ఇతని రచన ఆటభాగవతం అనే పేర కూడా ప్రచారం అయింది. (ఆర్. 560ఎ). అయితే దేశంలో మరికొన్ని కలాపాలు కూడా ఆటభాగవతాలుగా ప్రచారంలోనికి వచ్చాయి (డి.1860). అయితే వాటి కర్తల పేరు తెలియదు.[10]

9. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర, ద్వితీయ భాగం, పుట 64.
10. మదరాసు ఓరియంటల్ లైబ్రరీ బులెటిన్ సంపుటి 1 నెం.2 ఆట భాగవతం కృష్ణకథ అచ్చుపడింది.

ముమ్మడి బంగారు యాచమనాయకుడు (జ.1791-ప.1805-మ.1848)

నరకూరి నారాయణ పారిజాతాన్ని అంకితమిచ్చిన కుమారయాచమ నాయకుడికి పిల్లలు లేరు. అందుచేత తన అన్నగారు అలవలపాటి కొండయ్యగారి కొడుకును పెంచుకొని తన పెంపుడు తండ్రి పేరు పెట్టారు. ఈ ముమ్మడి బంగారు యాచమ నాయకుడు క్రీ.శ. 1805లో పట్టం కట్టుకొన్నాడు. 44 సంవత్సరాలపాటు పాలించాడు. ఈ సుదీర్ఘ పాలనలో 17 అగ్రహారాలను దానం చేశాడు. ఇతని కాలంలో వెలువడిన గ్రంథాల లెక్కగాని, గ్రంథకర్తల జమగాని నికరంగా తేలలేదు.

శతఘంటం రంగన్న

ముమ్మడి బంగారు యాచమ నాయుడి కాలంలోనే ఉన్నాడని కచ్చితంగా చెప్పగలిగిన వాళ్లలో శతఘంటం రంగన్న ఒకడు. ఈయన ఆ నాయుడికి అంకితంగా హేమావతీ దండకాన్ని చెప్పినట్టు తెలుస్తూంది[11] బహుశా ఈతడే బంగారు నాయుని పెంపుడు తండ్రి కుమారయాచమనాయుడికి అంకితంగా లీలావతీ దండకాన్ని చెప్పి ఉండవచ్చు.[12] రంగన్నగారి ఇతర రచనల గురించిగాని, తదితర వివరాలుగానీ తెలియవు. ఆధునిక యుగం తొలి రోజుల్లో భాగవత పురాణాన్ని వచనంగా ఆంధ్రీకరించిన శతఘంటం వెంకటరంగశాస్త్రిగారు బహుశా ఈ రంగన్నగారి మనుమడు కావచ్చు. కుమార యాచమనాయకుని కాలంలోని పట్టాభిరామయ్య అనే కవి కూడా ఒక లీలావతీ దండకాన్ని వ్రాశాడు.

మోచర్ల సోదరులు

బంగారు యాచమనాయుని కాలంలోనే నెల్లూరు మండలంలోని తెట్టు గ్రామంలో మోచర్లవారి కుటుంబం ఒకటి ఉంది. అందులో వెంకన్న, దత్తప్ప అనే ఇద్దరన్నదమ్ములు ఉండేవారు. ఇద్దరూ ఆశుకవిత్వంలోనూ, సమస్యాపూరణంలోనూ ఉద్దండులు. ఎంత అత్యాశువుగా చెప్తున్నా అంత్యప్రాసలూ, కఠిన సమాసాలు దొర్లిస్తూనే వినేవాళ్ళ వీనులకు విందులు చేసే కమనీయ కవిత్వమేకాక గడుసుదనం కూడా వీళ్ళ సొమ్మే. అయితే ఇద్దరిలో వెంకన్న మరీ గడుసువాడు. ఎత్తువేసి ఏదైనా సాధించడంలో గొప్పవాడు.

ఒకసారి వెంకన్న వేసిన ఎత్తు అంతా ఇంతా కాదు. ఆకాశమంత ఎత్తు. పాపం ఎవరో సంస్కృత వ్యాకరణ పండితుడు వెంకటగిరి సంస్థానంలో అవమానం పొందాడు. ఆ సంగతి వెంకన్నకు చెప్పుకొన్నాడు. ఆ ఆస్థానంలో తెలుగుకేగాని గీర్వాణానికి గౌరవం లేదని మొరపెట్టాడు. ఒళ్లు మండి, గుండె కరిగి ఆ పండితుణ్ణి వెంటపెట్టుకొని వెంకన్న వెంకటగిరి సంస్థానానికి వెళ్ళాడు. ''తెలుగు కవుల మొచ్చామని'' కబురుపెట్టాడు. సభలో మొట్టమొదటే రాజుగారి నోరు కట్టేశాడు. ఆయన ''మీదే ఊరు'' అన్నాడు. వెంకన్న

11. వెలుగోటి వారి వంశ చరిత్ర. పుట 136

12. అందులోనే - పుట 134.

''తెట్టు'' అని చెప్పాడు. రాజుగారు ''తెట్టేనా'' అని నిర్లక్ష్యంగా అన్నారు. కవిగారు సగర్వంగా ఆశువుగా తెట్టును పొగిడాడు.[13]

''తెట్టు కుమారయాచ జగతీవర నందనా! రాజ్యలక్ష్మి కిం
బట్టు; ధరాంగనామణికి బాపట బొట్టు! రిపూరగాళి వా
కట్టు; సముజ్జ్వల ధృతికి గట్టు; బుధాళికి వేల్పుజెట్టువా
గ్దిట్టల కున్కి పట్టును మదీయ వాసము యాచభూపతీ!''

ఈ పద్యం నిజంగా ఆ సభలో రిపులకు వాకట్టే. వాళ్ళ హృదయాలు కవికి తాకట్టే. రాజుగారు అడిగిన ప్రశ్నలకూ, పండితులు ఇచ్చిన సమస్యలకు తడుముకోకుండా సమాధానాలు చెప్పి వాళ్ళను విస్మయ భరితుల్ని చేశాడు. 46 సమస్యలు పూరించి తన వాగ్దిట్టతనం చూపించాడు.

ఇచ్చిన సమస్యలలో ''దోగ్ధ్రీ ధేనువు గర్భమందు పులి కందుల్ పుట్టెనుగ్రాకృతిన్. ''వక్త్రంబుల్ పది కన్ను లైదు కరముల్ వర్ణింపగా వేయగున్'' వంటి కఠిన ప్రాసలూ, ''చూతు లవుడాయటంచు సుందరి పలికెన్. ''రండాగమనంబు చేయ రమ్యంబయగున్'' వంటి బూతులు; ''కప్పను జూడంగ పాము గడగడ వడకెన్'', ''ఎలుకలు తమ కలుగులోని కేనుగు నీడ్చెన్'' వంటి అసందర్భాలు ఎన్నో ఉన్నా అన్నింటినీ అర్థవంతంగా వెంకన్న నల్లేరుమీద బండి నడకలాగా పూరించాడు. ఈ సమస్యలు ఇప్పటికీ సాహిత్యలోకంలో ప్రచారంలో వున్నాయి.[14]

ఇలాంటి అసాధారణ ప్రతిభను చూసి రాజు మెచ్చుకొన్నాడు. పండితులు ''అభినవ ఆంధ్ర కవితా పితామహుడ''నే బిరుదుతో శ్లాఘించారు. రాజు నూట పదహార్లూ, పట్టుబట్టలూ బహూకరించారు. పుచ్చుకొన్న పట్టుబట్టలు పీలికలుగా చింపి వెంకన్న అందరికీ పంచిపెట్టాడు. అందరూ ఆశ్చర్యపోయారు. దివానుగారు కొంచెం లౌక్యుడు కనుక ఈ చర్యలో కారణం తెలుసుకోదలిచాడు. అప్పుడు వెంకన్న మండిపడుతూ తిట్టిపోశాడు.

---

13. ఈ తెట్టు పద్యాన్ని దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు తమ చాటుపద్య రత్నాకరంలో ఉదాహరించారు (పుట.112). మొదటి పాదంలో ''తెట్టుకుమార జగతీనరవందన'' అనే పాఠం ఉంది. అయితే వెంకటగిరి రాజులలో కుమార కృష్ణులనే వాళ్ళెవరూ ప్రాచీనులలో లేరు. వాస్తవానికి పేరులో కృష్ణ శబ్దం ఉన్నవాళ్ళంతా క్రీ.శ.1858 తరువాతనే పుట్టారు. వీళ్ల మనుమలే కుమార కృష్ణజగతీ వరనందనులనే మాటకు అర్హులు. అంటే క్రీ.శ.1900 ప్రాంతాలలోగాని వాళ్లు పుట్టలేదు. అందుకే పద్యం మొదటిపాదాన్ని ''తెట్టు! కుమారయాచ జగతీవర నందన! అని సవరించాను. అప్పుడు ఈ రాజు ముమ్మడి బంగారు యాచమ నాయకుడే అనడానికి ఆస్కారం ఉంది. (వెంకన్న పూరించిన ''ఇరుకరాదు కొరకరాదు'' వగైరా దత్తపదుల పద్యం క్రీ.శ. 1892 నాటికే చాటుపద్యంగా చెలామణి అయింది. చూ. అముద్రిత గ్రంథ చింతామణి. సంపుటి 5, సంచిక 8. చాటుపద్యం నెం.18
14. ఈ సమస్యలన్నింటినీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు ప్రచురించారు. చాటుపద్యరత్నాకరం (పద్యం నెం.204 నుండి 253 దాకా 50 పద్యాలు)

''యాచమనాయని త్యాగము
గోచులకే గాక కట్టుకోకల కౌనా
రేచర్ల గోత్రమందున
నీచుండుదయించి కులము నీరుగ జేసెన్'' (చాటుపద్య రత్నాకరం నెం.1-254)

ఇంకెవరైనా ఈ పద్యాన్ని సభలో చెప్తే తక్షణం తల కొట్టించేవారే గాని శాపానుగ్రహదక్షత ఉందనిపించే ఆశుకవితా ప్రదర్శన చేశాక వెంకన్న కోపం ధర్మకోపమే అయి ఉంటుందని రాజూ, దివానూ గ్రహించారు. కారణం తెలుసుకొని క్షమాపణ చెప్పుకొని వ్యాకరణ పండితుణ్ణి ఘనంగా సత్కరించారు.

తానేకాక తాను మెచ్చిన వాళ్లకు కూడా సన్మానాలు చేయించే ఈ వెంకన్న ఏమేనా కావ్యాలు వ్రాశాడో లేదో తెలియదు. ఇతడు వెంకటగిరి సంస్థానంలోనే కాక వినుకొండ మల్రాజు వారివల్ల కూడా బహుమతులు పొందాడు.

ఊరె కవులు

మోచర్లవారేకాక ఊరెవారు కూడా వెంకటగిరితో సంబంధం ఉన్నవాళ్ళే. ఊరె నరసయ్య అనే ఆయన తిట్టుకవిత్వంలో దిట్ట. కందుకూరి రుద్రయ్య ''తిట్టుదునా'' అనే పద్యాలలోనూ, భట్టుమూర్తి ''లొట్ట ఇదేమి మాట'' అనే మాలికలోనూ తిట్టిన పద్ధతిలో ఈ నరసయ్య ''అటునిసుమంత తిట్టవలెనంచు మదిం దలపోసి చూచినన్'' ఏ కటువులు నిండాలో, దీవన చేస్తే కీర్తిని కోరే మానవులు ఎలా ముంగిట నిలవాలో చెప్తూ 27 పాదాల చంపకమాల వ్రాశాడు.[15] ఆఖరి పాదంలో ''వేంకటగిరివాస రమేశ భక్తుడన్'' అని చెప్పుకొన్నాడు. ఇతనికి ఎటువంటి బంధువో ఊరె వీరభద్రయ్య అనే ఆయన నెల్లూరు మండలంలో ఉంటూ దొనకొండ గంగజాతరపై ఈ పద్యం చెప్పాడు.[16]

''కోపుల వెంట వేయు జడకోపులు మూపులు మోపికామినుల్
తోపిడిద్రోయు చన్గవల త్రోపులు మెండుగ ద్రాగి తూగుచున్
గైపులు చెందు నిమ్మొరటు కాపులు, నింతి యొకాని యొక్కడున్
బాపడు రాడు నీదరికి బాపురె యో దొనకొండ జాతరా!''

దొనకొండ జాతరకు వెళ్ళాడో లేదో గాని ఈ బాపడు కర్నూలులో కొన్నాళ్లు ఉన్నట్టుంది. కందనూలు ''ట్రెజరీలో ఉండే నరహరి కృష్ణమ్మ సెట్టిగారి'' ఆజ్ఞ శిరమునందు దాల్చి కరణీకములు విప్రతతికి నిచ్చినట్టి గోపరాజు రామ ప్రధాని వృత్తాంతాన్ని వీరభద్రయ్య పద్య కావ్యంగా చెప్పాడు. ఇందులో ''మృదుమధుర శబ్దగుంభన''లు ఉన్నాయని కవి చెప్పుకొన్నాడు. ఈ గ్రంథం 1909లో అచ్చుపడింది. దీని రచనాకాలం క్రీ.శ. 1843 నాటి శుభవృత్తు కావచ్చును. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోని ఒక ప్రతి చివర ''కరణీకోద్ధ్రుకమంజరి సమాప్తం, శుభకృతు నామ సంవత్సర చైత్ర బహుళ అష్టమీ బుధవారం'' అని ఉంది (డి.2597). నెల్లూరు మండలంలో ఉండే ఈ ఊరె కవులు ఇతరగ్రంథాలు ఏమిటి రచించారో తెలియదు. వీళ్లు వెంకటగిరి ఆస్థానంలో ఉన్నారో లేదో, సన్మానాలు పొందారో లేదో తెలియదు.

---

15. చాటుపద్య రత్నాకరం, ప్రథమతరంగం, పద్య సంఖ్య 160
16. అదే పుస్తకంలో అదే తరంగం, ఆఖరి పద్యం

ఇమ్మడి సర్వజ్ఞ కుమార యాచమనాయుడు

వెంకటగిరి సంస్థానంలో, రెండు తరాలుగా ఔరస సంతానం లేదుగానీ ముమ్మడి బంగారు యాచమనాయునికి మాత్రం క్రీ.శ.1831లో ఒక కొడుకు పుట్టాడు. అతనికి సర్వజ్ఞ కుమార యాచమనాయుడు అనే పేరు పెట్టారు. ఇతడు 1848లో రాజ్యానికి వచ్చాడు. అప్పటికి అతనికి 17 సంవత్సరాల వయసు. ఈయన 1892 దాకా అంటే షష్టిపూర్తి అయ్యాకనే మరణించాడుగాని 47వ ఏటనే కొడుక్కి పట్టం కట్టి రిటైర్డు జీవితాన్ని పధ్నాలుగు సంవత్సరాలపాటు గడిపాడు. ఈయన సాహిత్య వ్యాసంగం కుంఫిణీ యుగంలో పదేళ్లు, మిగతాది జమీందారీ యుగంలోనూ జరిగింది. ఈయన స్వయంగా అయిదు వేదాంత గ్రంథాలు వ్రాశాడు. ఉత్తరోత్తరా ఈ సర్వజ్ఞ కుమార యాచమనాయుడు వేదాంతం వైపు మొగ్గినా ఆదిలో పచ్చి శృంగార రచనలు చేయించాడు.

లోకంలో ఎన్ని విద్యలున్నా రెండే రెండు ముఖ్యమైనవని ఈ రాజుగారి ఉద్దేశం. ఒకటి రతి విద్య. రెండోది ఆధ్యాత్మిక విద్య. మొదటిదాని రహస్యాలు తెలుసుకోవడం కోసం తమ ఆస్థాన కవీశ్వరులైన గోపీనాథం వెంకయ్య శాస్త్రుల వారిచేత బ్రహ్మానంద శతకం చెప్పించారు. ''ఆ పద్యముల నుండెడి భావమిప్పటి జనులకు చక్కగా బోధపరచుకొనునట్టి యోగ్యత లేకపోయినందున నాధ్యాత్మ విషయమైన యీ గీతార్థ సంగ్రహమనెడు గ్రంథమును పద్యరూపమున జేయించక నందరికి తెలియుటకు నింగిలీషు గ్రంథము రీతిగ తెలుగు మాటలతో రచియించుచున్నాడను'' అని చెప్పి ఈ రాజాగారు గీతను వ్యాఖ్యానించారు.

ఆనాడు ముమ్మరంగా సాగుతున్న క్రైస్తవ మత ప్రచారాన్ని వారి వాదనను ఖండిస్తూ ''హిందూమత విరోధ భాంజని'' అనే క్రైస్తవ వ్యతిరేక గ్రంథాన్ని కూడా వ్రాశాడు. కేవలం మత గ్రంథాలనేకాక సంగీత నాట్యాల పోషణలో కూడా ఈయన గొప్ప కృషి చేశాడు. తన కాలంనాటి దాక్షిణాత్య ఔత్తరాహ శాస్త్రీయ సంగీత విద్వాంసుల సమావేశం ఒకటి ఏర్పాటు చేసి నాట్యకళా నిపుణుల చర్చలు కూడా పరిశీలించి ''సభారంజని'' అనే గ్రంథాన్ని సంగీత సాహిత్య రసికుల సహాయార్థం వాడుక భాషలో రచించాడు. మానసిక వ్యాయామమేకాక శారీరక వ్యాయామము కూడా ఈయనకు బాగా తెలుసు. సాముగరిడీలలోబాగా ఆరితేరినవాడు. అందుకే ''నర్‌హనర్'' అనే వ్యాయామ గ్రంథాన్ని రచించాడు. తన తరువాత ఈ సంస్థానం ఎలా నడపాలో శాసిస్తూ ''మాముల్ నామా'' అనే ఒక వచన రచన చేశాడు. మొత్తంమీద ఈయన రచించిన వేదాంత గ్రంథాలే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.

ఇంగిలీషు గ్రంథంలో ఒక్క గీతార్థ సంగ్రహం మాత్రమేకాక నాస్తికధ్వాంత భాస్కరం, నిర్గుణ వాద నిరాకరణం, మనస్సాక్ష్యం, సారాంశ పంచకం అనే గ్రంథాలు కూడా తెలుగు మాటలలో వ్రాశాడు. ఈ గ్రంథాలన్నీ జమీందారీ యుగంలోనే ఆస్థాన పండితుల పరిష్కరణతో అచ్చుపడ్డాయి. ఈ సర్వజ్ఞ కుమార యాచమ నాయుని పోషణలో చాలామంది పండితులూ, కవులూ ఉన్నారు.

తర్కభూషణం వెంకటాచార్యులు

ఈయన అలంకార శాస్త్రంలో అందెవేసిన చేయి. ''శృంగార కల్పవల్లి'' అనే లక్షణ గ్రంథాన్ని రచించాడు. వెంకటగిరి రాజావారు ఈయనకు క్రీ.శ.1851లో ఎదురుగుంట అనే గ్రామాన్ని సర్వాగ్రహారంగా ఇచ్చాడు. ఎవరో ''నవకోటి'' అనే గ్రంథం వ్రాస్తే దానిని ఖండిస్తూ ఈయన ''శతకోటి'' అనే గ్రంథాన్ని సంస్కృతంలో వ్రాశాడు. ఈ అలంకారికుడు వ్రాసిన ఇతర గ్రంథాల వివరాలు తెలియవు.

గన్నవరం అనంతకృష్ణ శాస్త్రులు

ఈయన వెంకటగిరి ఆస్థాన పండితుడేగాని ఏ శాస్త్రంలో నిష్ణాతుడో తెలియదు రాజాగారితో పాటు ఈయన తీర్థయాత్రలకు వెళ్ళేవాడు. క్రీ.శ.1858లో ధనుష్కోటిలో ఉన్నప్పుడు ఈ అనంతకృష్ణశాస్త్రుల వారికి రాజావారు నెల్లూరు జిల్లా పోలూరు తాలూకాలోని కసవారెడ్డి పాలెం దానమిచ్చారు. ఈ పండితుడు గ్రంథకర్తో కాడో తెలియదు.

గరుడాచల సోమయాజులు

ఈయన కూడా వెంకటగిరి ఆస్థాన పండితుడే. ఇతడు క్రీ.శ.1860లో రాజాగారి ధనసహాయంవల్ల అతిరాత్రయాగం చేశాడు. ఈయన ఏ శాస్త్రంలో ప్రవీణుడో తెలియదు.

గోపీనాథం వెంకయ్య శాస్త్రులు

వెంకటగిరి ఆస్థానంలో కవి పండితులలో అఖిలాంధ్ర ప్రఖ్యాతిని పొందినవాళ్లలో గోపీనాథం వెంకయ్య శాస్త్రులుగారు ఆద్యులు. ఈయన క్రీ.శ. 1820 ప్రాంతాలలో జన్మించినట్టు ప్రతీతి. వెంకయ్య శాస్త్రులుగారు పదహారో యేటికే మంచి పాండిత్యం సంపాదించారు. ఆ నూనూగు మీసాల కొత్త యవ్వనంలో నెల్లూరు నుంచి వేదాద్రికి నరసింహస్వామి కళ్యాణం చూడటానికి వెళ్ళారు. దాని మహిమవల్లనే తనకు కవిత్వ విద్యా విశేషాలు లభించాయని వెంకయ్యగారి విశ్వాసం. అయినా ఆయన చిన్నప్పట్నించీ కావ్యాలూ, నాటకాలు చదువుకొన్నారు. చాలా లక్షణగ్రంథాలు అభ్యసించారు. ఇంతటి పునాది లేకపోతే ఏ ప్రతిభావంతుడూ నాలుగు కాలాలపాటు నిలబడే గ్రంథాలు వ్రాసే వ్యుత్పత్తిని సంపాదించలేడు; శబ్దార్థ శాస్త్ర సంస్కారం లేనిదే ఉద్గ్రంథ రచనకు ఎవరూ సాహసించలేరు.

వెంకయ్య శాస్త్రులుగారు గొప్ప సాహసమే చేశారు. మన సాహిత్యంలోని భారత భాగవత రామాయణాలలో తిక్కనగారూ, పోతరాజుగారూ, కంకంటి పాపరాజుగారు నరాంకితంగాక దేవునికే తమ గ్రంథాలను అంకితమిచ్చారు. భాస్కర రామాయణాన్ని ''ఒక్కమర్త్యుని గృతినాథుని జేసి రచించిరి, ఇది సమీచీనము గాదు'' అని వెంకయ్యగారు భావించారు. రామాయణాన్ని సంపూర్ణంగా తెనిగించి కృష్ణునికి అంకితం చేయాలని భావించారు; అదే సమీచీనం అనుకొన్నారు. ఆ పరిశుద్ధ కృత్యానికి ఉపక్రమించారు.

''కొంచెపు విద్యలన్ కడుపుగూటికి'' అన్యుల వద్ద చేరడం ఆయనకు ఇష్టం లేదు. ''నృపతుల వేడినన్ గరుణ నిచ్చిన నిత్తురు దంతి, వాజి, రత్నాపట, ధన, అగ్రహారములు'' అయితే అవి అస్థిరాలు అని ఆయన గ్రహించాడు. అందుకే మాధవాంకితంగా రామాయణాన్ని పూర్తి చేశాడు.

గ్రంథం పూర్తిచేశాక ఆయనకు ఒక చిక్కు వచ్చింది. సాధారణంగా కవులకు ''కృత్యాద్యవస్థ'' ఏర్పడుతుంది. ఈయనకు ''గ్రంథాంత్య చింత'' కలిగింది. ఈ మహాకావ్యాన్ని లోకంలో ముఖ్యంగా పండిత సభలలో విస్తరింపచేసే నాథుడెవరా అన్న సందేహం పట్టుకొంది. అప్పుడప్పుడే సర్వజ్ఞకుమార యాచమనాయుడు రాజ్యానికి వచ్చాడు. ''ధ్రువుడో ప్రహ్లాదుడో'' అని జనులు చెప్పుకొనేటంత భక్తితో ఆ బాలరాజా ఏలుతున్నాడు. ఆ సంగతి వెంకయ్యగారు విన్నారు. ఈయన రామాయణం ఆంధ్రీకరించిన విషయం ఆయన విన్నాడు. రాజాగారు కూడా రామాయణాన్ని ''గీర్వాణంబున కన్యూనాతిరిక్తంబుగా భగవదంకింతంబుజేసి యాంధ్రభాష రచియింప సమర్థుండగు పండితుడెవ్వడో'' అని విచారించే సమయంలో ఈ సంగతి తెలిసింది. అందుకే వెంకయ్యశాస్త్రులవారిని సత్కరించి ఆ ''మహాపుణ్యా కావ్యంబు జగంబునందు విస్తరిల్ల'' జేశాడు. అచ్చు వేయించాడు.

రాజాగారు ఆ మాత్రమే చేసి ఊరుకోలేదు. శాస్త్రులవారికి మారెళ్ళ తాలూకాలోని పెరుగుపల్లి అగ్రహారాన్ని ఇచ్చారు.[17] రామాయణం పూర్తికాగానే ఒక ఉగాదినాడు మొదలుకొని శ్రీరామనవమి దాకా పదిరోజులపాటు దానిని పారాయణ చేయించి, దశమినాడు సామ్రాజ్య పట్టాభిషేకం చేయించారు.[18] దీని తరువాత వెంకయ్యశాస్త్రుల వారిని పిలిచి బ్రహ్మ వైవర్తపురాణంలోని[19] కృష్ణజన్మ ఖండాన్ని తెనిగించమన్నారు. రామకథ కృష్ణాంకితం చేశారు కనుక కృష్ణకథ రామాంకితం చేయమన్నారు. ''అన్యుడధి నాయకుడగుట కర్హుడగునే?'' అని చెప్పారు (1-18). అగ్రహారాలు పుచ్చుకొన్నా వెంకయ్యశాస్త్రులగారిలో పోతరాజుగారి ఆశయాలు పోలేదు.

వృజినమటంచు జిత్తమున నించుక చూడక కావ్యకన్యకన్
గుజనులకిచ్చి నిందితపుగూడు భుజించెడు వాని కుర్విలో
సుజనత గల్గునే బుధులు చూసి గణింతురె వాని పాండితిన్
నిజముగ వాడు పాత్రమగునె మధువైరి ప్రసాద దృష్టికిన్''

(కృష్ణ జన్మఖండం - 1-24)

నిందితపుకూడు తినకపోవడం వల్లనేకాక పరిగ్రహించిన కథవల్ల కూడా తన కవిత్వం చాలా పవిత్రమైనదని వెంకయ్యశాస్త్రులవారి అభిప్రాయం. కవిత్రయం వారి కవిత్వం కన్నా తనదే కొనియాడదగినదని ఆయన ఉద్దేశం. ఆంధ్ర సాహిత్య చరిత్రను టూకీగా ''కట్టె-కొట్టె-తెచ్చె'' అన్నట్టు చెప్తూ స్వాతిశయాన్ని ఎలా ప్రకటించుకొన్నారో చూడండి.

---

17. వెలుగోటి వారి వంశ చరిత్ర - వెల్లాల సదాశివశాస్త్రులు - అవధానం శేషశాస్త్రులు - పుట.140 - దానకాలం 1860
18. అదే పుస్తకంలో పుట.142 - పారాయణ కాలం 1864
19. గ్రంథంలో ''కైవర్తపురాణం'' అనే రూపమే సర్వత్రా కనబడుతుంది.

''ఆంధ్ర కవిత్వ విద్య మొదల వివిధ విచిత్ర శబ్దార్థ గుణాలంకార రస బహుళ ప్రవాహ రూపంబుగా నన్నపార్యు మహాకవి వదన వినిర్గతంబై ప్రబంధ పరమేశ్వరుని కుక్షి ప్రదేశంబున విశ్రమించి యచ్చట నుండి బహుప్రకారంబుల బహుకవి ముఖంబులందు బ్రవర్తిల్లె. నేనందులో నొక్కింత పరిగ్రహించి ప్రకారాంతరంబుగ నిమ్మహాపురాణకథ రచియించెద. మత్కవిత్వంబు నన్నపారాద్యుల కవిత్వంబు కంటె నల్పంబైనను శ్రీకృష్ణ కథా విలాస బహుళంబగుట వలన నతి పవిత్రంబై సకల జనంబుల చేత గొనియాడ దగియుండు.''[20] (కృష్ణ జన్మ ఖండం. 1-25)

సకల జనాలూ కొనియాడడంమాట అలా ఉంచి రాజుగారు మాత్రం ఘన సత్కారాలు చేశారు. ఆయనకు రాధాకృష్ణులంటే వెర్రి భక్తి. శ్రీకృష్ణజన్మఖండంలో ఇతర కృష్ణావతార గాథలతోపాటు రాధాకృష్ణుల ప్రణయగాథ కొంచెం ఎక్కువగానే ఉంది. కృష్ణుడు నెలబిడ్డగా ఉన్నప్పుడే బ్రహ్మదేవుడు వచ్చి రాధాకృష్ణులకు వైవాహిక కృత్యాలు చేస్తాడు. ఆ దంపతులు వివిధ గతులతో క్రీడిస్తారు. క్రీడాంతంలో మళ్లా శిశువు రూపం దాల్చిన కృష్ణుని చూసి రాధ విలపిస్తుంది. ఆకాశవాణి ఊరడిస్తుంది. తరువాత రాసక్రీడలు వగైరాలు, సవతుల కయ్యాలు మొదలైన వాటితోపాటు రాధ యశోదకు భక్తి జ్ఞానోపదేశాలు చేయడం, తన నామ మహిమ చెప్పడం వగైరాలతోపాటు మళ్ళా రాధాకృష్ణుల సంభోగ వర్ణన, ప్రణయ కలహాలు మొదలైనవి ఈ శ్రీ కృష్ణ జన్మఖండంలో ఉన్నాయి.

రాధాకృష్ణుల చరిత్రను బాగా తేటపరిచే ఈ కావ్యాన్ని వ్రాసినందుకు, వ్రాశాక వెంకటగిరి రాజావారు వెంకయ్య శాస్త్రులవారికి రాధాకృష్ణపురం అనే కొత్త అగ్రహారంలో పన్నెండో భాగాన్ని ఇచ్చాడు.[21] ఈ అగ్రహారానికి మొదట సోమసాని గుంట అనే పేరుండేది. ఇప్పటికీ అదే పేరుతో గ్రామాల పట్టికలో ఉంది. ఈ ఊరుకు రాధాకృష్ణపురం అని పేరు పెట్టడానికి మరో కారణం ఉంది. వెంకటగిరి రాజావారు 1862లో ఉత్తరదేశ యాత్రలు చేశారు. మధుర, గోకులం, గోవర్ధనం, బృందావనంలో రాధావల్లభ స్వామివారి సన్నిధిలో బంగారు పాదుకలు చేయించి వెంకటగిరికి తెచ్చారు.

వాటిని పవిత్రంగా ప్రతిష్ఠించారు. రాధావల్లభస్వామి సన్నిధిలో పండిత గోష్ఠులు జరిపించారు. బహుశా ఆ సభలలో వెంకయ్యశాస్త్రుల వారి శ్రీకృష్ణ జన్మఖండ పఠనం జరిగి ఉండవచ్చును.

శ్రీకృష్ణ జన్మ ఖండంలోని రాధాకృష్ణుల శృంగారం తగు మాత్రమే ఉంది కనుక రాజాగారికి తృప్తి కలిగినట్టు లేదు. అందుకే బ్రహ్మానంద శతకాన్ని వ్రాయమని వెంకయ్యగారిని పురమాయించారు. ''సురత భావానంద మరయ బ్రహ్మానంద వేశంబె గాని వేరు కాదు'' అని సెలవిచ్చారు. శ్రీకృష్ణుడు గోపికలతో ఎలా క్రీడించినదీ అట్టుగుట్టు ఆనవాళ్ళతో బట్టబయలు చేయమన్నారు. గోపీనాథం వారు సిద్ధపడ్డారు.

---

20. ఈ వచనంవల్ల వెంకయ్యశాస్త్రులగారి కాలం నాటికి ఎర్రయ్యగారే తిక్కనగారికన్నా ప్రాచీనులనే పండిత సంప్రదాయం ఉన్నట్టు కనబడుతోంది.

21. శిశుపాల వధ, గోపీనాథం వారి అనువాదం 1-46.

బ్రహ్మానంద శతకంలోని తొలి పద్యాలలోనే కృష్ణుడు సాక్షాత్కరిస్తాడు గానీ తరువాత ఎక్కడకు ఎలా అంతర్ధానమయ్యాడో తెలియదు. ఈ శతకంలోని నాయకుడు ''హిందూస్థానీ దిరుసు'' వేసుకొంటాడు (46). ''ఫీడా మిఠాయి తింటాడు (62). ఇతని ''విజిటింగు హాలులో'' వాలుసైడ్ల లస్టర్లు ఉంటాయి (76). అక్కడ అతడు ముఖ్తె సర్ఖాసు దర్బారు చేస్తాడు (77). తుపాకీ పట్టుకొని వేటకు వెళతాడు (74). ''జోడు వెలుగురాల్ గట్టిన సారటు''లో ఎక్కి షికారు వెళతాడు (113). ఇతడు హిందూస్థానీఖ్యాలు రస్తాలు బల్మేలుగా'' చెప్పగలడు (77). ద్వాపర యుగంలోని గోపీనాథుణ్ణికాక శుద్ధ కలికాలంలోని గోపాలకృష్ణుణ్ణే గోపీనాథంవారు ఈ శతకంలో చిత్రించారు.

ఆ చిత్రణ అక్కడతో ఆగలేదు. కామశాస్త్రంలో చెప్పిన రహస్యాలలో ''వివిధోచితాంశములను నీ శతకమందున మరుగుగా నింపు మెరయ'' చెప్తానన్నారు (125). కానీ ఎటొచ్చీ ఒక్క సురత వర్ణనలోనే మరుగు లేదు. దీనిని సహృదయులు సైతం మన్నించరేమో అని ''సజ్జనులార! ఈ శతకంబు గేవల శృంగారమని నిరసింపవలదు'' అని వెంకయ్యగారు అర్థించారు. శ్రీకృష్ణుని లీలావిహారాలు ఎన్ని వర్ణించినా తప్పులేదన్నారు. ఇటువంటి గ్రంథాలు చదివితే వినయం, విజయం, విత్తలాభం కలగాలని ఆశించారు (129). బూతు పుస్తకాలు అచ్చువేసుకొని అమ్ముకొనేవాళ్ళకు మాత్రం నేడు విత్తలాభం కలుగుతోంది.

బ్రహ్మానంద శతకం చదివాక వెంకటగిరిలో పండితులు సైతం అసహ్యించుకొని ఉంటారు. కృష్ణజన్మఖండంలో సంభోగ శృంగారవర్ణన ఉన్నా అది రసవంతంగా ఉంది. చూడండి.

''ఏ బంధములు లేని ఈశ్వరుండప్పుడు
 రమణ చౌశీతి బంధముల పెనగె
నే ప్రొద్దు నే చేష్ట లెరుగని విభుడష్ట
 లలిత శృంగార చేష్టల జరించె
బరికింప నే చవి యెరుగని ధన్యుండు
 సతిమోవి తేనియ చవులు గొనియె
యెద్దాని నంటక యెసగు సర్వాతీతు
 డంచితముగ గళలంటి మెరసి
నరయు నెందును చిక్కని యరుల మూర్తి
రాధకరములలో జిక్కి రహిమెలంగె
భక్త పరతంత్రుడగుట నాభవ్య చరితు
డిన్ని విధముల క్రీడించె నింతి తోడ'' (శ్రీకృష్ణ జన్మ ఖండం, ఆ 2 పుట.75)

దేవుడిన్ని విధాలుగా భక్తపరతంత్రుడైనందువల్ల తొలిగ్రంథంలో క్రీడిస్తే వెంకయ్య శాస్త్రులుగారు రాజభక్తితో గ్రుడ్డిగా ఒళ్లూ పై ఎరుగని పచ్చి కామాన్ని బ్రహ్మానంద శతకంలో వ్రాశారు. సహజంగా జుగుప్స కలిగించే ఈ పద్యాలను ఒక్క రాజాగారే మెచ్చుకొని ''వీటి భావమిప్పటి జనులకు చక్కగా బోధపరచుకొనునట్టి యోగ్యత'' లేదన్నారు. బూతుశతకం వ్రాయించాక రాజాగారు వేదాంతంలో పడ్డారు. ''యథారాజా

తథా కవీ'' అని వెంకయ్య శాస్త్రులుగారు కూడా గీతాపారాయణంలో పడ్డారు. రాజాగారు అందరికీ తెలిసేట్టు వచనంలో గీతా వ్యాఖ్యానం చేస్తే వెంకయ్యశాస్త్రులుగారు పద్యరూపంలో భగవద్గీతా శాస్త్రాన్ని వ్రాశారు.

ఇంతకుముందు ఈ యుగంలోనే వేముగంటి దత్తోజీ పండితుడు భగవద్గీతను తెనిగించినా అది కేవలం రామానుజ భాష్యాన్ని అనుసరించి చేసినదే. కాబట్టి ఒక్క విశిష్టాద్వైతులే ''చూడదగినదిగా వున్నదని చింతించి త్రిమతస్థులు చూడందగినట్లు'' మూలానుసరణంగా వెంకయ్యగారిచేత దీనిని వెంకటగిరి రాజావారే అనువదింప జేశారు.[22] దత్తోజీ పండితుని అనువాదంలో శ్రీకృష్ణపరమాత్ముడు ''వైష్ణవమంత్రోపాస్తి'' చేసేవాళ్ళకే మోక్షమిస్తానంటాడు. వెంకయ్యశాస్త్రుల వారి కృష్ణుడు మాత్రం ''అన్యులు గాని వింతత యోగమున'' తలచుకొనే వాళ్ళనే ఉద్ధరిస్తానంటాడు. (నెం.307)

ఈ మోక్షశాస్త్రాన్ని వ్రాశాక చాలాకాలానికిగాని వెంకయ్యశాస్త్రులవారు గ్రంథరచన చేసినట్టు కనబడదు. సర్వజ్ఞ కుమార యాచేంద్రుల కుమారుడు గోపాలకృష్ణమ యాచేంద్రులు రాజ్యానికి వచ్చాక ''మా తండ్రిని వేమారు మెప్పించారు'' నన్ను మెప్పించడని కోరి గ్రంథం చెప్పించేదాక ఏదీ వ్రాసినట్టు లేదు. అయితే ఒక్కటే తేడా. కృష్ణ జన్మ ఖండం చెప్పిస్తూ పెద్దరాజాగారు అన్యుడభినాయకుండౌట కర్హుడగునా?'' అంటూ భగవదంకితం చేయించారు. ఈ చిన్నరాజాగారు మాత్రం మాఘకావ్యం ''శ్రీకృష్ణనాయకంబై యున్నది కనుక మదంకితంబుగాజేసి యాంధ్రకావ్యముగా రచింపు'' మని పురమాయించారు (1-25). కడుపుకూటికి నరాంకితం చేయడం వృజినమని ఆదిలో భావించిన వెంకయ్యశాస్త్రులవారు ఇప్పుడు తప్పు లేదనుకొని శిశుపాల వధను నాలుగాశ్వాసాలలో 1155 గద్యపద్యాలుగా చెప్పారు. వృద్ధాప్యంలో చేసిన అనువాదమైనా ఎంతో ప్రౌఢంగా అనువాదం సాగింది. ఈ యుగంలోనే ఇంతకు ముందు పోచిరాజు వీరన్న మాఘాన్ని అనువదించాడు. గోపీనాథం వారిలోనే శబ్దగత ప్రౌఢిమ కనబడుతుంది. ఒకటి రెండు పద్యాలను తైపారు వేస్తే ఇద్దరి తేడా కనబడుతుంది. షష్ఠ సర్గలోని రుతువర్ణనలోని ఒక శ్లోకం చూడండి (ఈ ఘట్టంలోనే శబ్దార్థ సారాలు ఘుమఘుమలాడుతాయి).

''ప్రణయకోపభృతో అపి పరాఙ్ముఖాత్యపదివారి
    ధనారవ భీరవః
ప్రణయనః పరిరాయ మనంతరం నవరిరేవలి
    రేచిత మధ్యమః'' (6-38)

''ప్రణయ కోపంబుబూని పరాఙ్ముఖత వహించి
    యపుడభ్ర రవభీతి హృదయులైన
లేమలంతటు నిగుడివళి ప్రమాత్ర మధ్యలై కౌ
    గలించిరి మగల దగిలి'' (పోచరాజు - 252వ కమ్మ)

22. ఈ అనువాదం క్రీ.శ.1880 నాటికే జరిగిందని తెలుస్తోంది. (చూ. భగవద్గీత శాస్త్రులు. వెల్లనాట్టూరు జూబిలీ ముద్రాక్షరశాల ముద్రణ. ....8-1899 పీఠిక.

''పొలయలుకబూని పతులం
గలయక యున్న చెలులపుడు ఘనాఘన నాదా
కులితలయి కౌగలింపగ
వళి రేచిత మధ్యలగుచు వర్తించి రొగిన్'' (గోపీనాథం. 2-39)

తెలుగులో ఉన్న రెండు మాఘానువాదాలు తులనాత్మకంగా పరిశీలిస్తే చాలా విషయాలు బయటపడతాయి (శబ్దగత ప్రౌఢిమ గల శ్లోకాలను అనువదించేటప్పుడు మూలంలాగా అనువాదం ఎప్పుడూ ఉండదన్న సంగతి మొట్టమొదటా చిట్టచివరా జ్ఞాపకం పెట్టుకోవాలి). ఏ శ్రీనాథుడో అనువదిస్తున్నప్పుడు మూలంలో పదాలు అలాగే దిగివచ్చి జిగేలుమంటాయి. అక్కడక్కడ గోపీనాథం వారు కూడా అక్కడక్కడ అంతటి చాకచక్యం చూపించారు. ఆరో సర్గలోనే ఒక శ్లోకాన్ని చూడండి.

''నవపలాశవనం పురః స్ఫుట పరాగ పరాగతపంకజం
మృదులతాంత అతాంత మలోకయత్స సురభాం సురభిం
సుమనో భరైః (6-2)

దీన్ని గోపీనాథం వారు గొప్ప ప్రతిభతో ఇలా అనువదించారు.

నవపలాశ వనంబు మరియు
బటు పరాగ పరాగత పంకజంబు
మృదులతాంత లలాంతమై మెరయు కు
సుమ సురభి సురభిని గృష్ణుడు చూచెనపుడు (2-3)

ఇటువంటి అనువాద శిల్పాన్ని చూసినప్పుడు గోపీనాథం వారి గొప్పతనం సాక్షాత్కరిస్తుంది. వారి వ్యుత్పన్న కౌశల్యం బోధపడుతుంది. అయితే నిత్యవ్యవహారంలో లేని సంస్కృత భాషలోని పదాలు తెలుగువాడు వాడుతున్నప్పుడు లింగవిభక్తులలో ప్రమాదాలు రాక తప్పదు. వెంకయ్యగారి తప్పులను పూండ్ల రామకృష్ణయ్యగారు పట్టారు. గోపీనాథ రామాలయంలోని సీతారాముల వివాహ ఘట్టంలోని ఈ పద్యం చూడండి.

''రమణుని ముద్దు మోముగని రాక సుధాంసుని నిండు వెన్నెలం
గొమరు వహించు కల్వలన గోమలి వాలిక చూపులా రఘూ
త్తముల రమణీయ దివ్యపద తమ రసంబుల మీద నెంతయుం
బ్రమద మొలర్ప వ్రాలె పతి పాదములం బ్రణమిల్లు కైవడిన్'' (బాల. 1291)

ఈ పద్యంలో ''రాక'' పద ప్రయోగం ఉంది. తెలుగు సాహిత్యంలో రమారమి అందరూ అకారాంత స్త్రీలింగంగానే రాక శబ్దాన్ని వాడారు.[23] సంస్కృతంలో రాక శబ్దానికి పుంలింగ ప్రయోగాన్ని వెదకాలని చెప్తూ పూండ్లవారు ఈ ప్రయోగాన్ని ఆక్షేపించారు. పెళ్ళిచూపులు మగని కాళ్ళపై పడడం సాధారణ ధర్మమేగాని భార్య కన్నుల ''కలువలు'' భర్త కాళ్ళు ''తామరల''పై పడటమేమిటి? పరస్పర విరోధాలగున్ వాటికి సాధారణ ధర్మం ఎలా చెల్లుతుంది అని ప్రశ్నించారు. ''ఈ గ్రంథమునందిట్టి

23. సూర్యరాయాంధ్ర నిఘంటువులో ''రాక'' శబ్దాన్ని అకారాంతంగా ఇచ్చారు. బహుశా అచ్చు తప్పు కావచ్చు.

సంశయాంశములు పెక్కులగుపడుచున్నవి. ఒకదాని వెంబడి యొకదానింగ్రమముగా'' చెప్తామని పూండ్లవారు వ్రాశారు.[24] అయితే వెంకయ్యగారు ఈ ఆక్షేపణలు రావడానికి యాభై సంవత్సరాలకు ముందే తమ రామాయణంలో ఇలా విన్నవించుకొన్నారు.

''ఇల సర్వజ్ఞుడు దేవదేవుడు రమాధీశుండు లేడన్యుడే
నెలమిన్ నేర్చిన భంగి చెప్పితి శుభంబీరామ చరిత్రమున్
బలుమారిందుల తప్పులుండిన గణింపకన్ బోక సద్భక్తితో
దిలకింపందగు భావి సత్కవుల మందీభూత చేతస్కులై'' (పీఠిక 15)

చాలామంది ఆధునికులు గోపీనాథం వారిని సద్భక్తితోనే తిలకిస్తున్నారు. శాస్త్ర పాండిత్యంతో వారి సాహిత్యం పండి పరిపక్వమైనదనీ, ప్రాచీన మహాకవుల కోవకు చెందినవారిలో వీరు కడపటివారు అనీ పుట్టపర్తి నారాయణాచార్యులవంటి విద్వాంసులు భావిస్తున్నారు.[25] గోపీనాథం వారి కడపటి గ్రంథంగా కొందరు ''రాధికా పరిణయం'' అనే కావ్యాన్ని పేర్కొంటారు.[26] ఇది సర్వజ్ఞకుమార యాచేంద్రుల బావమరిది వెల్లంకి సూర్యారావు గారికి అంకితం అని కొందరు పొరబడ్డారు. కాని ఆయన అల్లుడు చెలికాని వెంకటగోపాలరావుగారికి అంకితం. ఇతడు మద్రాసు దగ్గర తిరూరు ముఠా అధిపతి. ఈయన తిరువూరు జమీందారుగారు. ఈ కావ్యం ''రత్నాకరం'' అనే పత్రికలో అచ్చుపడిందట. గ్రంథరూపంలో వచ్చినట్టు లేదు.

వెంకయ్యశాస్త్రుల వారి జీవిత కాలంలోనే వారి ఇతర గ్రంథాలన్నీ గ్రంథరూపంలో వచ్చాయి. ఆయన క్రీ.శ. 1895 ప్రాంతాలలో కీర్తిశేషులయ్యారని ప్రతీతి. అయితే 1892 నాటికే మరణించారేమో! ఆ సంవత్సరం నవంబరు ఒకటవ తేదీ అముద్రిత గ్రంథ చింతామణిలో వెంకటగిరి రాజావారు పంపించిన పుస్తకాలను పత్రికాధిపతి అందుకొంటూ మండపాక పార్వతీశ్వర శాస్త్రులగారినే ఈ కవి ఇప్పుడు సజీవుడని చెప్తారు. గోపీనాథం వారి గురించి అలా చెప్పకపోవడం వల్ల అప్పటికే ఆయన కీర్తిశేషులనుకోవచ్చును.[27]

జూపల్లి ధర్మారావు

గోపీనాథంవారివల్ల రాధికా పరిణయాన్ని అంకితం పుచ్చుకొన్న చెలికానివారే కాకుండా జూపల్లివారు కూడా వెంకటగిరిరాజ బంధువులే. 23వ తరంలోని మొదటి సర్వజ్ఞ కుమార యాచేంద్రులవారి కాలం దగ్గర్నుంచి జూపల్లివారి ఆడబిడ్డలను వెంకటగిరి రాజులు చేసుకొనడం కనబడుతుంది. 27వ తరంలోని ఇమ్మడి సర్వజ్ఞ కుమార యాచేంద్రులు తమ అక్కగారిని జూపల్లి ధర్మానాయుడుగారికి ఇచ్చి 1854లో వివాహం జరిపించారు. బహుశా ఈ ధర్మానాయుడు గారిమీద చాలా చాటువులు జరిపించారు. బహుశా ఈ ధర్మానాయుడు గారిమీద చాలా చాటువులు పుట్టి ఉంటాయి. ఈయన ''మెరవడి విద్య'' లేనివాళ్ళను మెచ్చుకోడు. ఇతని కట్టుదిట్టాల గురించి, విద్వత్తు గురించీ ఇలా చెప్పుకొంటారు.

---

24. అముద్రిత గ్రంథ చింతామణి సముఖం. సంపుటి 4, సంచిక 7
25. విక్రమ సింహపురి మండల సర్వస్వం తృతీయ ఖండం, పుట 20.
26. భగవద్గీతా శాస్త్రము, వావిళ్ల ప్రచురణ, 1951, నిడుదవోలు వెంకటరావు గారి పీఠిక, పుట 4
27. అముద్రిత గ్రంథ చింతామణి సంపుటి 5, సంపుటి 1లో ఉంది. నాదగ్గర కొన్ని సంచికలు లేవు. వాటిలో బహుశా గోపీనాథం వారి మరణవార్తను ప్రచురించారేమో పరిశోధించాలి.

''ఎరుగని వాని గోట చొరనీయడు; నేర్పున జొచ్చెనేనియున్
దొరసముఖమ్ము దొర్కుటది దుర్లభ; మట్లులభించెనేనియున్
మెరవడి విద్యలేక కడు మెచ్చడు; మెచ్చక యీవి యీడయా
సురగురునంత వానికిని జూపలి ధర్మని వేడబోయినన్''

(చాటుపద్య రత్నాకరం 3-161)

సురగురుడంతటి ప్రతిభావంతులకే దిక్కు లేకపోతే మామూలు భట్రాజుల సంగతి చెప్పాలా? ఈరపరాజు, సూరపరాజు అనే ఇద్దరు ఈయన గురించి ఇలాగ సంభాషించు కొన్నారట.

జూపల్లి ధర్మరాయం
డేపాటి ధనంబొసంగె! నీరపరాజా!
పాపాత్ముండెవ్వరికిని
జూపనిదె చూపెనయ్య సూరపరాజా! (చాటుపద్య రత్నాకరం 3-160)

సామన్య కవులకు మొండిచేయి చూపెట్టినా సత్కవులు వీరి దాన హస్తాన్ని బాగా పొగిడారు. జూపల్లివారి దానధారతో ఆకాశగంగ సంవాదాన్ని ఎవరో ఇలా వ్రాశారు.

''నేనాకాశ తరంగిణిన్, ధరణిలో
నీవెవ్వరే? వాహినీ?''
''నానా జూపలి ధర్మ భూవిభుని
పాణింబట్టు దానాపగన్'',
''నీనా యంతర మేడ కేడ?''
''అవులే, నీవేడ? నేనేడ? పో;
నేనాయాచకు పాదజాత నటవే?
నేదాతృ హస్తోదితన్'' (చాటుపద్య రత్నాకరం 3-162)

విద్వాంసులకు సిరిసంపదలు ధారపోసిన ఈ జూపల్లి ధర్మారాయుడుగారు ఏ కృతులు చెప్పించారో తెలియదు. భావి పరిశోధన వల్ల తేలవచ్చును.

భావి పరిశోధన వల్ల వెంకటగిరి సంస్థానంలోని ఇతర కవుల గురించి కూడా మరికొన్ని వివరాలు దొరకవచ్చు. మాటవరసకు నూరేళ్ళకిందట వెంకటగిరి సంస్థానంలో సీతారామయ్య అనే సంస్కృత కవి ''హేమవతీ తాండవం'' అనే గ్రంథాన్ని వ్రాశారు. ఇది ఏభాషలోనో తెలియదు. గాని ఈ కావ్యనాయిక హిమవతి మాత్రం ఆస్థాన నర్తకి. వెంకటగిరిలోనే గడియారం భాస్కరశాస్త్రిగారు సంస్కృతంలో శివుని గూర్చి అష్టకాలు వ్రాశారట.[28] (ఈయన ముమ్మడి బంగారు యాచమ నాయకుని కాలంవాడు). ఆనాటి సంస్కృత కవులు కూడా తెలుగులో ఒకటీ అరా రచనలు చేసి ఉంటారు. భావి పరిశోధనల వల్లగాని ఈ అజ్ఞాత రచనలు బయట పడవు.

---

28. విక్రమ సింహపురి మండల సర్వస్వం, తృతీయ ఖండం, పుటలు 138-139.

రామాయణ రచనలు

తెలుగువాళ్ళకు శ్రీరాముడే కన్నతండ్రి; సీతమ్మే కన్నతల్లి; సీతారాములలాగ తెలుగు గుండెలకు హత్తుకొన్న ఇతర దైవాలు లేరు. అందుకే ''సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మాదుతండ్రి'' అని త్యాగరాజస్వామి లలితరాగంలో ప్రపంచానికి చాటాడు. సీతారాములనూ, ఇతర రామాయణ పాత్రలనూ తెలుగు గ్రామాలలో పుట్టి పెరిగిన వ్యక్తులలాగే ఆంధ్రులు పరిగణిస్తారు. సీతమ్మకు ఒక ఆడబడుచు లేకపోతే ఎంత లోటో తెలుసు కాబట్టే తెలుగు తల్లులు శాంతను పరిపూర్ణ పాత్రగా తీర్చిదిద్దారు. వాల్మీకి విస్మరించిన ఊర్మిళకు తెలుగువాళ్ళే న్యాయం చేకూర్చారు. రామాయణ గాథలను రసవత్తరం చేశారు.

కొత్త కల్పనలు సృష్టించి రామాయణాన్ని కమనీయం చేసినట్టే సీతారాముల పేరిటా, ఇతర పాత్రల పేరిటా చక్కని పలుకుబళ్ళను సృష్టించుకొని తెలుగు భాషకు మనవాళ్ళు తీయందనాలు చేకూర్చారు. ఏదేనా చూడముచ్చటగా ఉంటే అది ''సీతారామ కోరుతూ'' ఉందంటారు. దేనికైనా అడ్డూ ఆపూ, ఆలనా పాలనా లేకపోతే అది ''రామందాడి''గా ఉందంటారు. ఇలాంటి పలుకుబళ్ళు మన భాషలో కనీసం పాతికైనా లెక్క తేలుతాయి.[1]

లెక్క తేలనిదల్లా మన సాహిత్యంలో ఉన్న రామాయణ రచనల వైనమే. ఈ యుగంలో రామకథలు రామందాడిగా ఉన్నాయి. అయితే వాటిలో ఆడవాళ్ళూ, జానపదులూ వ్రాసుకొన్నవే సీతారామ కోరుతూ ఉంటాయి. కొన్ని పద్యకావ్యాలలో అన్ని ఉన్నా రసానికి మాత్రమే చోటు కిష్కింధంగా ఉంటుంది. పద్యకావ్యాలూ, ద్విపదలూ, వచన కావ్యాలూ, యక్షగానాలూ, గేయాలూ మొదలైన వివిధ ప్రక్రియా భేదాలలో చాలామంది వ్రాశారు. ఇంతెందుకు? ఒక్కమాటలో చెప్పాలంటే ''తెలుగునాట కలముబట్ట నేర్చిన ప్రతి మానిసియు పూర్వము రామాయణ గాథను తడవెను'' అన్న డాక్టరు రామరాజుగారి తీర్పు ఈ యుగంలో వర్తిస్తుంది.[2] ఆయన సంపాదించిన గేయ రామాయణాలు సుమారు వంద ఉంటాయి. అందులో సగం అచ్చుపడ్డాయి. సగం పడలేదు. తెలుగు ఇల్లాళ్ళు కట్టుకొన్న రామాయణం పాటలే 42 ఒకచోట చేరి ఇటీవల అచ్చుపడ్డాయి.[3] ఆ పుస్తకం ఉపోద్ఘాతంలో ఆడవాళ్ళ రామాయణంలోని అందాలను ''కృష్ణశ్రీ'' గారు చవిచూపించారు. పామరుల రామాయణాలలోని పసందులన్నీ డాక్టరు రామరాజుగారు విశదపర్చారు.[4] యక్షగాన రచయితలు వ్రాసిన రామాయణాల గురించి డాక్టరు యస్వీ జోగారావుగారు క్రోడీకరించారు.[5] ఈ పరిశోధకుల దృష్టిలో ఇతరత్రా దొరికిన ఆకరాలను కనిపెట్టిన

---

1. రామాయణాన్ని ఆధారం చేసుకొన్న తెలుగు సామెతలను, పదబంధాలనూ శ్రీ పరాశరం గోపాల కృష్ణమూర్తిగారు సేకరించారు – ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక. సంపుటి 59. సంచికలు 5–6.
2. తెలుగు జానపదగేయ సాహిత్యం, పుట.61
3. స్త్రీల రామాయణం పాటలు, ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రచురణ.
4. తెలుగు జానపద గేయ సాహిత్యం, పుటలు 60 నుండి 105.
5. ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర, ద్వితీయభాగంలోని వివిధ శీర్షికలు.

విషయాలను జోడించి సమన్వయం చేస్తే ఈ యుగంలోని రామాయణ రచనల లెక్క దాదాపుగా తేలుతుంది. వీటిలో పద్యకావ్యాల గురించి ముందు చెప్పుకొందాం.

పరశురామపంతుల అనంతరామయ్య

సీతా రామాంజనేయ సంవాదంతో దేశమంతటా పరశురామ పంతులవారు ప్రఖ్యాతులయ్యారు. లింగమూర్తిగార్కూ, వారి కొడుకు రామమూర్తీ చక్కని కవులు. ఈ తాతతండ్రుల వారసత్వాన్ని అనంతరామయ్య పుచ్చుకొన్నట్టుంది. రామాయణంలోని ఏ భాగాలను తీసుకొన్నాడోగానీ హనుమద్విజయం అనే పద్యకావ్యాన్ని వ్రాశాడు. ఇది అసంపూర్ణం, అముద్రితం. ఇతని ఇతర రచనలు అలభ్యాలు (గో.క.349). వరంగల్లులో 1830 ప్రాంతాలలో ఇతడు ఉండేవాడు.

రావు అప్పలరాజు

ఏ ప్రాంతాలవాడో, ఎప్పటివాడో తెలియదుగాని రావు అప్పలరాజు అనే కవి ''సీతాచరిత్రం'' అనే పేరిట రామాయణాన్ని వ్రాశాడు. ఈ కావ్యం ప్రతి చాలా అతిగా శిథిలమైంది. ఒక్క సంగతి మాత్రం బాగా చెప్పాడు. చూడండి.

అతి హింస లేనివారలు
నతి భక్తులు కారు హరికి నతిరాగమునన్
మతియందు బొడమదేరికి
నతుల బలైశ్వర్యయుతులు నాహవజేతల్ (ఆర్. 255)

అతి సాఫీగా పద్యాలు నడిచే ఈ కావ్యం అంతా దొరక్కపోవడం దురదృష్టమే. ఇది బహుశా అయిదాశ్వాసాల కావ్యం.

చెరుకుమూడి కృష్ణయ్య

ఒక్క రావు అప్పలరాజు వ్రాసిన కావ్యమే కాదు. ఈ యుగంలో చాలామంది రచించిన గ్రంథాలు కూడా ఎన్ని ఆశ్వాసాలో చెప్పలేం. చెరుకుమూడి కృష్ణయ్య చెప్పిన ''శృంగార రాఘవం'' మూడు ఆశ్వాసాలు మాత్రమే దొరుకుతుంది. సీతాపహరణంలో కథ ఆగిపోయింది. దొరికినంత మటుకూ ఇది హృద్యప్రబంధమని పరిశోధకులు భావిస్తున్నారు (డి.847). ఇతడు ఇంతకు ముందు ''వాసుదేవ చరితాది మహోత్తమ పద్యకావ్యాలు వ్రాశాడట (ఆర్.121). ఈ సంగతి శృంగార రాఘవాన్ని కృతి పుచ్చుకొన్న కాటేపల్లి నారాయణ నోటంట కవి చెప్పించాడు. ''పన్నియైనను'' రచించినా చెరుకుమూడి కృష్ణయ్య గ్రంథాలలో ఒక్క శృంగార రాఘవమే'' అసమగ్రంగా లభిస్తోంది. ఈ కవి తాను ''శృంగార జ్ఞాన వైరాగ్య రచనా తోషితుడనని గద్యలో చెప్పుకొన్నా కావ్యానికి శృంగార రాఘవం అని పేరు పెట్టడం గమనించదగ్గ విషయం.

బేతపూడి కృష్ణయ్య

రామాయణంలోని శృంగార ఘట్టాలనే వర్ణించాలనే సంకల్పం మన కవులలో చాలామందికి లేకపోలేదు. సీతా కల్యాణం దాకా కావ్యాన్ని చెప్పి ఊరుకొన్నవాళ్ళు కొందరు ఉన్నారు. వాళ్ళలో బేతపూడి కృష్ణయ్య ఒకడు. ఈయన ''జానకీ రాఘవం'' అనే పేరిట అయిదాశ్వాసాల శృంగార కావ్యాన్ని వ్రాసి అడపా నారప్పకు అంకితం ఇచ్చాడు. అడపావారు కొండపల్లి, కొండవీడు సర్కారులలో గజపతుల కాలంనుంచీ మంచి పలుకుబడిగల సర్దార్లు. బేతపూడివారు కూడా ఆ ప్రాంతాల వాళ్ళే కావచ్చును. కృష్ణయ్య ఈ కావ్యం చెప్పడానికి ముందు అలమేలు మంగా వివాహం, పండిత మనోభిరామం అనే గ్రంథాలు వ్రాసి దైవాంకితం చేశాడు. భట్టుమూర్తి పోకడలంటే ఇతనికి అభిమానంలాగ ఉంది. వసుచరిత్రలోని ''మహిమన్ వాగనుశాసనుండు'' అనే పదో నెంబరు కృత్యాది పద్యానికి ఇమిటేషనుగా కృష్ణయ్య సృష్టించిన పద్యాన్ని చూడండి.

వాగీశుండు తెనుంగు పద్యకవితా వారాశిం గల్పింప వి
ద్యాగణ్యుండగు కుండలీంద్రుండు గుణాఢ్యత్వంబునన్ మీఱన్
నాగీర్వాణ వచఃస్తుతిన్ మెలగు శ్రీనాథుండు కావ్యామృత
శ్రీగైకొంచు బుధాళికిచ్చు మహితోత్సేకంబు వర్ణించెదన్. (డి. 517)

బేతపూడి కృష్ణయ్య వర్ణించిన మహితోత్సేకపు కవిత్వం సరసంగానే ఉందని పరిశోధకుల అంచనా.[6]

సురపురం కేశవయ్య

పండితులు మెచ్చుకొన్న తరవాతనే ఏ కవికైనా తన నైపుణ్యాం పట్ల తృప్తి కలుగుతుంది. అయితే కేవలం పాండితీ స్ఫోరకంగానే రచనలు చేస్తే రసం లోపించవచ్చు. తమ ప్రావీణ్యాన్నంతా ప్రదర్శించడానికి మన కవులు శ్లేషకావ్యాలు, అనేకార్థకావ్యాలూ, నిరోష్ఠ్యంగా రామాయణ కథను వ్రాసిన కవులు మన వాళ్ళలో లేకపోలేదు. వాళ్ళలో సురపురం కేశవయ్య ఒకడు. ఈయన ఆత్మకూరు సంస్థానంలోనివాడు. ఈ కావ్యాన్ని రాజా సోమభూపాలుడికి అంకితం ఇచ్చాడు. గ్రంథంలోని కొన్ని పద్యాలేగాని అంతా లభ్యం కాలేదట. ఇతని కవిత్వం ప్రౌఢంగా ఉంటుందని పరిశోధకుల భావం.[7]

గంధ్రేటి గురవయ్య

ఒక భాషలో ప్రౌఢంగానూ, రసవంతంగానూ ఉన్న రచనలను ఇతర భాషలలోనికి అనువాదం చేసుకోవడం సహజం. ఓఢ్రభాషలో రచించిన కొన్ని రామాయణాలను మన ఉత్తరాది కవులు తెనిగించారు. ఎవరో బ్రాహ్మణుడు ఆ భాషలో వ్రాసిన రామాయణాన్ని బంటుపల్లి రామయ్య అనే ఆయన వచన రూపంలో అనువాదం చేశాడు. ఆ తరువాత దాన్ని గంధ్రేటి గురవయ్య ''రామ రసామృత సింధు రామాయణం''

6. ఆంధ్రకవుల చరిత్ర - 3వ భాగం, పుట 254.
7. గోలకొండ కవుల సంచిక - పుట 397.

అనే పేరిట పద్యరూపంలో రచించాడు. యుద్ధకాండలో కొంతదాకా ఈ గ్రంథం దొరుకుతుంది. ఈ గ్రంథాన్ని రచించబట్టి ''జన్మమిన్నాళ్ళకు సఫలమయ్యే'' అని కవి భావించాడు. ''నా అదృష్టరేఖను ఎంతని పొగుడుకోను'' అన్నాడు (ఆర్.432; ఆర్. 1021). ఈ గ్రంథం వెలుగుచూడకపోవడం దురదృష్టమే.

హరిహరనాథుని చెన్నకృష్ణయ్య

అదృష్టమన్నది కర్మపైన ఆధారపడి ఉంటుందని మనవాళ్ళ నమ్మకం. తగిన కారణం లేనిదే ఏ కార్యమూ జరగదని కర్మ సిద్ధాంతం ప్రధానంగా బోధిస్తుంది. భారతీయ దర్శనాలలో కార్యకారణాల చర్చను సాంఖ్యులు మొదట చేశారు. సాంఖ్య సిద్ధాంతాలకు మన ఫిలాసఫీ చాలా ఋణపడింది. ఈ దృక్పథాన్ని ప్రతిఫలించిందో లేదోగాని, చెన్నకృష్ణయ్య అనే ఆయన ''సాంఖ్యరామాయణం'' ఒకటి మన సాహిత్యంలో కనబడుతోంది. ఇది అసమగ్రం. సుందరకాండలో కొంతదాకే ఉంది. ఈ కవి వివరాలు కూడా అట్టే తెలియవు. ఇంటిపేరు హరిహరనాథునివారనీ, తండ్రి పేరు నరసింగయ్య అని మాత్రమే తెలుస్తోంది. ఇతని మీద బమ్మెర పోతరాజుగారి శబ్దాలంకారాల ప్రభావం కనబడుతోంది. పోతరాజుగారు కైవల్యం కోసం భాగవతాన్ని వ్రాస్తే, చెన్న కృష్ణయ్య ఇహలోక ఋణవిముక్తి కోసం రామాయణాన్ని వ్రాసినట్టు ఉంది. చూడండి ఈ పద్యం.

కాంతుడర్ధ శరీరమిచ్చె తనకై కాంక్షించి యం చాత్మలో
చింతంబొంది యపర్ణనైఋణములో జిక్కంగరాదంచుబల్
సంతోషంబున దేహమంతయు బరాధీనముంజేయున
క్కాంతారత్నము నాశ్రయింతు నన్నృణుంగా జేసినన్ బ్రోవగాన్ (ఆర్. 964)

చెన్నకృష్ణయ్య ఋణం తీరినట్టు లేదు. ఋణానుబంధరూపంలోని ఇతని కృతి కన్య ఇంకా మిగిలే ఉంది.

పండితారాధ్యుల నాగలింగం

సప్తసంతానాలలో కృతి ఒకటి. అయినా ఇతర సంతానాలు శాశ్వతంగా ఉండవు గనుక శ్రీమంతులు కృతులనే ఆశిస్తారు. కట్టించిన గుళ్ళు పడిపోయినా, చెప్పించిన పుస్తకాలు చెక్కు చెదరవనే నమ్మకంతో చాలామంది కావ్యాలు అంకితం పుచ్చుకొన్నారు. కొందరు తాము నిలిపిన ఇతర సంతానాల గురించి ఆ కావ్యాలలో ఒకటి రెండు పద్యాలలో చెప్పించుకొన్నారు గాని మానూరు వెంకటరాయలు అనే ఆయనలాగా పూర్తిగా ఒక ఆశ్వాసం నిండా తాను చేసిన ప్రతిష్ఠను చెప్పించుకొన్న వాళ్ళు లేరు.

కొండవీడు దగ్గరనున్న హౌబుగణేశుపేటలో మానూరువారు కొత్తగా దేవాలయం కట్టించారు. అందులో పట్టాభిరాముణ్ణి ప్రతిష్ఠించారు. ఈ సత్కార్యాన్ని పండితారాధ్యుల నాగలింగం అనే కవి మెచ్చుకొన్నాడు. పట్టాభిరామ విలాసం అనే అయిదాశ్వాసాల

కావ్యంలో ఆఖరి ఆశ్వాసంలో ఈ దేవాలయ నిర్మాణ ప్రశంస ఉన్నది. మొదటి నాలుగింటిలో రామచరిత్ర ఉంది.

పండితారాధ్యుల వారిది విద్వాంసుల కుటుంబం. శ్రీపతి పండితుడు వీరశైవుల పండితత్రయంలోని ఒకడు. ఇతని వంశంలో ఎన్నోతరాల తరువాత శంభులింగం అనే ఆయన పుట్టాడు. ఇతనికి ''విద్వత్కవి కంఠీరవ'' అనే బిరుదు ఉండేది (ఆర్.1008 గద్య). ఈ శంభులింగంగారి మనుమడే నాగలింగం. ఈయన ''భోజరాజ చరిత్రము'' అనే కావ్యం వ్రాశాడని పట్టాభిరామవిలాసంలోని ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తోంది.

రాజులు హెచ్చగ సత్కవి
రాజులు మెచ్చంగ భోజరాజ చరిత్రం
భోజ రచించితివన్నిట
బూజితుడవు నాగలింగ బుధజనమౌళీ. (ఆర్.16)

తాను ''ఎన్నిట'' గొప్పవాడో వివరంగా నాగలింగం చెప్పుకొన్నాడు. నాటకాలంకారాలు, సరస సాహిత్యాలు, సంస్కృతాంధ్ర వ్యాకరణాలు, షడ్విధభాషలూ, బంధ చిత్ర కవిత్వాలు వగైరాలు తనకు తెలుసునని చెప్పుకొన్నాడు, అయితే ఇతని ప్రావీణ్యాలు లోకం తెలుసుకొనడానికి ఇతని తొలిగ్రంథం దొరకలేదు. రెండోది సమగ్రమైనా అచ్చుపడలేదు.

నండూరి బాపయ్య

కొందరి గ్రంథాలు సమగ్రమైనా అచ్చుపడకపోతే, మరికొందరివి అసమగ్రమై వెలుగు చూడలేదు. అలాంటి వాటిలో నండూరి బాపయ్య వ్రాసిన శ్రీరామ చరిత్రము ఒకటి. ఇది ఎన్ని ఆశ్వాసాలో తెలియదు. ప్రథమాశ్వాసంలో కొంతభాగమే లభిస్తోంది (ఆర్.987). బాపయ్య రామకథ రచన అంతటితో విఘ్నమైందో అవిఘ్నంగా సాగిందో తెలియదు గాని, ఇతని విఘ్నేశ్వరచరిత్ర మటుకు పూర్తిగా దొరుకుతూంది. స్కాంద పురాణంలోనూ, భాగవతంలోనూ ఉన్న ''గాథలరసి సకల జనరంజకముగా'' దానిని అతడు క్రీ.శ.1817లో వ్రాశాడు. (ఆర్.65). ఈ రెండు గ్రంథాలలో యడవల్లి లచ్చన్న (గురువు), దామరాజు వెంకన్న (గణితవిద్యావేత్త, ఆప్తుడు) అనే వ్యక్తుల ప్రశంస ఒకేతీరు పద్యాలలో ఉంది. కవిత్వ రీతిలో ఏదేనా తేడా ఉందో లేదో.

ఆవంచ భావన

స్కంద పురాణంలోని గాథలరసి నండూరి బాపయ్య విఘ్నేశ్వర చరిత్ర వ్రాస్తే స్కంద పురాణంలోని రామకథ లన్నింటినీ సంగ్రహించి ఆవంచ భావన రఘురామవిజయం అనే ఎనిమిదాశ్వాసాల గ్రంథాన్ని వ్రాసి మల్లెపూడిలోని రాజగోపాలస్వామికి అంకితమిచ్చాడు. వాసిష్ఠ గౌతమి పశ్చిమాన గోస్తనీ తీరాన మల్లెపూడి ఉందని భావన చెప్తాడు. తన వంశం గురించి చాలా విపులంగా చెప్పుకొన్నాడు. అయితే సాహిత్య చరిత్రకు పనికిరాదు. ఈ రఘురామ విజయం సమగ్రం, అముద్రితం. (ఆర్.817)

చెన్నూరు రామన్న

ఆవంచ భావన స్కందపురాణ గాథలను తెనిగించినట్టే ఇతరులు ఇతర పురాణాలను గాలించి రామకథను అనువదించారు. ఏ పురాణాన్ని అనుసరించాడోగాని చెన్నూరు రామన్న ఒక రామాయణాన్ని ఆంధ్రీకరించాడు. ఇతడు క్రీ.శ. 1834 ప్రాంతాలవాడు. హుజూరు నగరం తాలూకాలోని యాదవాకిళ్ళ గ్రామంవాడు. రామన్న వ్రాసిన రామాయణం ప్రతి ఆవూరి కరణంగారివద్ద ఉందట. కవిత్వం రసవత్తరం అని పరిశోధకులు చెప్తున్నారు.[8]

ఆకొండి వెంకటకవి

సంస్కృతంలో ఉన్న వివిధ రామాయణాలలో **తత్త్వ** సంగ్రహరామాయణం ఒకటి. ఇది రామాయణంలోని ఒక్కొక్క కాండకు ఒక్కొక్క పఠనశ్రవణఫలం ఉందని నిరూపించింది.[9] ఈ తత్త్వ సంగ్రహ రామాయణంలోని సుందరకాండను (ఏకాశ్వాసం) ఆకొండి వెంకటకవి అనువదించాడు (ఆర్.415). మిగిలిన కాండలు తెనిగించాడో లేదో తెలియదు. ఇది అచ్చుపడిందని మిత్రులు చెప్పారు. నేను చూడలేదు.

ఘట్టు వెంకట రామకృష్ణయ్య

రామాయణంలోని ఆరు కాండల కథనూ ఆరు ఆశ్వాసాలుగా ఘట్టు రామకృష్ణయ్య చెప్పాడు. దీనిపేరు పట్టాభిరామాయణం. ఈ అసమగ్ర గ్రంథం అముద్రితం (ఆర్.172). ఈ కావ్యం కృత్యాదిలో ఇతడు తన వివరాలు చెప్పుకొన్నాడు. వాటివల్ల ఈయన మాఘకావ్యాన్ని అనువదించినట్టు తెలుస్తోంది. తాళాదిరాగ సందర్భాలనుబట్టి ''నాటక వేష జాతీయ విధములు'' సల్పినట్టు కూడా విశదమవుతోంది. ఘట్టు రామకృష్ణయ్యా రచించిన నాటకాల పేర్లు మాత్రం తెలియవు. కుచేలోపాఖ్యానం మొదలైనవి వ్రాసిన ఘట్టు ప్రభువుకు ఈయన ఏరకం బంధువో తెలియదు.

వారణాసి వెంకటేశ్వర్లు

రాయలసీమలోని ఘట్టువారి కుటుంబంలాగ ప్రోలునాడులో వారణాసి వారిది విద్వాంసుల వంశం. వారణాసి కామయ్య మంచి లాక్షణికుడు. జ్యోతిష గ్రంథవేత్త. వివిధాంధ్ర కావ్యాలు చదువుకొన్నవాడు. ఇతని తమ్ముడు మల్లన ఉభయ భాషా కవిత్వ విశేష ఘనుడు. పురాణాలు చెప్పి కుండలాలు మొదలైనవి సంపాదించాడు. కామయ్యా కొడుకు పేరు వెంకటేశ్వర్లు. ఇతని తండ్రి దగ్గరే అన్నీ నేర్చుకొని కవిత్వం చెప్పాడు. శ్రీ రామచంద్రోపాఖ్యానం అనే పేరిట రామకథను ఆరాశ్వాసాల గ్రంథంగా చెప్పాడు. సమగ్రం. (ఆర్.941)

బులుసు సీతారామయ్య

తెలుగులో రమారమీ అన్నీ చంపూకావ్యాలే. నిర్వచనాలు తక్కువ. సంస్కృతంలో చంపూకావ్యాలు అరుదు. రామాయణాన్ని భోజుడు సంస్కృతంలో

8. గోలకొండ కవుల సంచిక. పుట 407
9. సంస్కృత వాఙ్మయ చరిత్ర, ద్వితీయ సంపుటం. పుట.56

చంపూకావ్యంగా వ్రాశాడు. దీన్ని పోయిన యుగంలో బుగ్వేద కవి వెంకటాచలం అనువదించాడు. తెలుగులో చంపూ రామాయణం అన్న పేరు దానికే స్థిరపడింది. అయితే భోజుని చంపూరామాయణాన్ని ఇతరులు కూడా అనువదించారు. వాళ్ళలో బులుసు సీతారామయ్య ఒకడు. ఈ కృతిని ఈయన సిరిగాంపురం వీరరాఘవయ్య పంతులు, భాగన్నపంతులు అనే అన్నదమ్ములకు అంకితమిచ్చాడు. అయితే వీళ్ళు బుగ్వేదకవి అనువాదాన్ని చూసినట్టు లేదు. కవిని పురమాయిస్తూ ఇలా చెప్పారు.

కులుకు మృదూక్తి గుంభనల గోమలతం గనుపట్టు తేనియల్
వెలువడు భోజచంపు రఘువీరుని వృత్తము జెప్పరెవ్వరున్
తెలుగున మున్గవీశ్వరులు నీ వదిసేవధిగా దలంచి మి
క్కిలి సరసంబుగాగ దెనిగింపుము మటంచు బహూకరింపగల్ (ఆర్.325)

బులుసు సీతారామయ్య ''మిక్కిలి సరసం''గా తెనిగించిన ఈ భోజ చంపువు ఆరాశ్వాసాల కావ్యం. సమగ్రం. అయితే అముద్రితం.

మంత్రిప్రగడ సూర్యప్రకాశం

రామాయణాన్ని పద్యకావ్యంగా వ్రాసినవాళ్ళలో చాలామంది ఆరాశ్వాసాలుగా రచన చేశారు. మంత్రి ప్రగడ సూర్యప్రకాశం కూడా సీతారామచరిత్రను ఆరాశ్వాసాల గ్రంథంగానే వ్రాశాడు. ఈయన 1808లో పుట్టాడు. 1873లో మరణించాడు. మాడుగుల సంస్థానం ఆశ్రితుడు. భీమలింగ శతకాన్ని, కృష్ణార్జున చరిత్ర అనే రెండర్థాల కావ్యాన్ని కూడా ఇతడు చెప్పాడు. ఇతని కవిత్వం మృదు మధుర పదగుంభితమై మనోరంజకంగా ఉంటుందని పరిశోధకుల అంచనా.[10]

రామకథలను వ్రాసిన ఈ పదహారు మందీ సంస్కృతంలోని వివిధ రామాయణాలను అనుసరించారుగాని వాల్మీకిని యథాతథంగా అనువదించలేదు. ఇంతకు ముందు యుగాలలోని రామాయణ రచనలు యథా వాల్మీకంగా లేవనే గద్వాలలో చిన సోమభూపాలుడు తన ఆస్థాన కవులచేత వాల్మీకి రామయణాన్ని ''యథాశ్లోక తాత్పర్య రామాయణం'' అనే పేరిట తర్జుమా చేయించాడు. ఒక్కొక్క కవి ఒక్కొక్క కాండ అనువదించారు. ఈ వివరాలు చూడండి.

బాలకాండ	-	కాణాదం పెద్దన సోమయాజి
అయోధ్యకాండ	-	కొత్తపల్లి రామాచార్యులు
అరణ్యకాండ	-	గార్గేయపురం సుబ్బాశాస్త్రి
అవతారిక, కిష్కిందకాండ	-	కామసముద్రం అప్పలాచార్యులు
సుందరకాండ	-	తిరుమల కృష్ణమాచార్యులు
యుద్ధకాండ	-	బోరవెల్లి శేషయ్య

10. ఆంధ్ర కవుల చరిత్ర, 3వ భాగం - పుట 323.

ఈ కవులు కేవలం ఈ ఆరు కాండలే కాక ఇతర గ్రంథాలను కూడా ఈ రచనలకు ముందూ వెనకా రచించారు. వాటి వైనాలను తెలియవచ్చినంత మటుకు, ఈ సంపుటంలోనే ''గద్వాల'' ప్రకరణంలో ఉంది.

గోపీనాథం వెంకయ్య శాస్త్రులు

గద్వాలలోని పై ఆరుగురేకాక మరికొందరు వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా అనువదించారు. వెంకటగిరిలో గోపీనాథం వెంకయ్య శాస్త్రులుగారు మూలానికి ''అన్యూ నానతిరిక్తం''గా రామాయణ రచన చేశారు. దీనిని ఆయన తన పదహారోయేట తలపెట్టారు. కొన్నేళ్ళ కృషితో పూర్తిచేశారు.

ఇలాగ యథావాల్మీకంగా రామాయణాన్ని అనువాదం చేసినా తెలుగు ప్రజలలో వాల్మీకేతర రామాయణాలపై మక్కువ పోలేదు. అద్భుత రామాయణాలు, అహిమహి రామణచరిత్రలు, సీతావిజయాలు అంటే సామాన్య ప్రజానీకానికి ఎంత ఆదరణో సాహితీపరులకూ అంత అభిమానమే.

అవాల్మీకమైన రామాయణ రచనలు చూడండి.

ముడింబి కృష్ణయ్య

ఈయన అద్భుత రామాయణాన్ని తెనిగించాడు. రామాయణం శతకోటి మితమని భరద్వాజుడు విన్నాడట. వాల్మీకి వద్దకు వెళ్ళి ''శతకోటి మిత రామచరిత్రలో నేమేమి రహస్యముల్వలికినారో మామూలు చరిత్రలో కనబడవు''. కాబట్టి వాటిని వివరించ మన్నాడు. సీతా మాహాత్మ్యాన్ని ప్రతిపాదించే అద్భుత రామాయణాన్ని వాల్మీకే చెప్పాడట. దీనిని ముడింబి కృష్ణయ్య అనువదించాడు. ఇది ఎన్ని ఆశ్వాసాల కావ్యమో, కర్త వివరాలు ఏమిటో తెలియవు. ఇది అముద్రితం. (డి-1)

పెనుమల్లి బాపయ్య

సీతాదేవి శతకంఠ రావణుని చంపిన గాథను కథనం చేసే మరొక కావ్యం సీతా విజయం. దీనిని పెనుమల్లి బాపయ్య ఏకాశ్వాసంగా రచించాడు. కౌశికీ నదీ తీరంలోని విష్ణు సంవేద్యమనే పుణ్యక్షేత్రమహిమను కూడా ప్రస్తావించాడు. గద్యలో తాను విశేషచారిత్రుణ్ణని చెప్పుకొన్న కవి గురించి ఏమీ వివరాలు తెలియవు. ఈ సీతావిజయం అముద్రితం (ఆర్.468 (ఎ)); డి. 889). 'ఈతని కవిత్వమందు లక్షణ విరుద్ధమైన బ్రయోగము లక్కడక్కడ కనబడుతున్నవి'' అని వీరేశలింగంగారు కంఠోక్తిగా చెప్పారు.[11]

ముద్దు లక్ష్మీనారాయణ

దశకంఠ రావణునితో తృప్తిలేక ప్రజలు శతకంఠుణ్ణి, సహస్రకంఠుణ్ణీ సృష్టించి వాడిని రామునిచేత చంపించారు. ఈ కథను సహస్ర కంఠ రామాయణం అనే పేర ముద్దు లక్ష్మీనారాయణ రచించాడు. దీనికి లక్ష్మీ నారాయణ కావ్యం అనే నామాంతరం గద్యలో కనబడుతోంది. ఈయన మండపాక కామయ్యగారి శిష్యుడు. తన గురువుగారినీ సమకాలికుల్నీ ఇతడు కావ్యంలో నుతించాడు. వాళ్ల పేర్లు ఇవి:

11. ఆంధ్రకవుల చరిత్ర - 3వ భాగం, పుట.287

మండపాక కామయ్య	-	గురువు
మండపాక పార్వతీశం	-	గురుపుత్రుడు
కొల్లూరి బ్రహ్మయ్య	-	పినతల్లి కొడుకు
కొల్లూరి కామశాస్త్రి	-	పినతల్లి కొడుకు
పంతుల బ్రహ్మయ్య	-	
ద్వివేది నరసింహం	-	బావమరిది
చెళ్ళపిళ్ళ నరసింహం	-	మిత్రుడు
దూసి వెంకట రామయ్య	-	ఇంకో గురువు

వీళ్ళందరూ సాహితీపరులే. వీళ్ళందరూ బహుశా విని మెచ్చుకొన్న ఈ సహస్రకంఠ రామాయణం అచ్చుపడినట్టు లేదు. (ఆర్.483)

వేల్పూరి వెంకటేశ్వరులు

రామాయణ గాథలను విచిత్రతరంగా చేసి చెప్పుకోడానికే వేయితలల రావణాసురులను విడ్డూరపు ఊహలు సృష్టించాయి. ఓఢ్రభాషలో ఇటువంటి రామకథలు చాలా ఉన్నట్టున్నాయి. తుమరాడ పాపయ్య,[12] గంఢ్రేటి గురవయ్యలలాగ ఓఢ్ర రామాయణం నుంచే కథను సంగ్రహించి వేల్పూరి వెంకటేశ్వరులు కూడా ఒక విచిత్రరామయణం వ్రాశాడు. ఇతని కవిత్వం మృదువై శ్రావ్యంగా ఉందని వీరేశలింగంగారి అభిప్రాయం.[13] ఈ కవి గోవ్యాఘ్రచరిత్ర, జానకీ రామశతకం లాంటి ఇతర రచనలు కూడా చేశాడు.

పాలెపు సీతన్న

శతకంఠ, సహస్రకంఠ రావణుల కథలను ఎందరు రచించినా ప్రజలలో ఎక్కువగా ప్రచారం పొందిన మరో రావణుడు మైరావణుడే! రావణ కథకు ముందే యుద్ధకాండలో చొప్పించడం వల్లనే ''మైరావణ కథ'' అసలు రామాయణంలో అతుక్కొనిపోయింది అని చెప్పవచ్చు. ఇంతకు ముందు యుగాలలో కూడా మైరావణ చరిత్రలు రచించిన కవులు ఉన్నారు. ఈ యుగంలో పాలెపు సీతన్న ఒక మైరావణ చరిత్రను వ్రాశాడు. గ్రంథాంతంలో రచనాకాలం ఇచ్చాడు. ''ప్రమాదీచ సంవత్సరం కార్తీక బహుళ సప్తమి జయవారం'' (1793 (?); 1854 (?) ఈ గ్రంథం అచ్చుపడలేదు. కాకినాడ పరిషత్తు కార్యాలయంలో దీని ప్రతి ఒకటి ఉంది. (గ్రంథ సంఖ్య 896).

వాల్మీకి రామాయణంలోని పాత్రలనే తీసుకొని విచిత్రాలూ, విడ్డూరాలూ కల్పించి శతకంఠ, సహస్రకంఠ రావణ కథలు మొదలైనవి కొందరు సామాన్యముగ సృష్టిస్తే, రావణ పాత్రలతోనే ఆధ్యాత్మికమైన వ్యాఖ్యానానికి అనువుగా రామాయణాన్ని రచించిన వాళ్ళు లేకపోలేదు. సంస్కృతంలో ఆధ్యాత్మ రామాయణం సుప్రసిద్ధమే. ఇది

12. కడపటిరాజుల యుగం. సమగ్ర ఆంధ్ర సాహిత్యం రెండవ సంపుటి 2003.
13. ఆంధ్రకవుల చరిత్ర, 3వ భాగం, పుట. 326

మొదట బ్రహ్మాండపురాణంలో ప్రసక్తమైంది. శ్రీరాముడు పరబ్రహ్మ స్వరూపుడనీ, సీత అవిద్య అనీ శివుడు పార్వతికి ఉపదేశం చేస్తాడు. వాల్మీకి రామాయణంలోలాగే ఆధ్యాత్మ రామాయణంలో కూడా ఆరు మామూలు కాండలు, ఉత్తరకాండా ఉన్నాయి. దానిని మన తెలుగువాళ్ళు చాలామంది అనువదించారు.

ఈ యుగంలో ఎవరెవరు అనువదించినదీ చూడండి.

కోటమరాజు నాగయ్య

ఇతడు కృష్ణా జిల్లావాడు. మొరుతోట ముక్తీశ్వర భక్తుడు. 1850 ప్రాంతాలలో ఉండేవాడు. ఇతని ఆధ్యాత్మ రామాయణం సంపూర్ణమే కావచ్చుగాని ఇప్పుడు అసమగ్రంగానే లభిస్తోంది (ఆర్.528). ఇతని కవిత్వం అంత ప్రౌఢంగా లేకపోయినా హృద్యంగానే ఉందని వీరేశలింగంగారి అంచనా.[14]

మోదుకూరి పండరినాథం

ఇతడు అనుమకొండలో ఉండేవాడు. ఆంధ్రంలోనేకాక సంస్కృతంలో కూడా రచన చేసేవాడు. అధ్యాత్మ రామాయణాన్ని తెనిగించడమేకాక 2400 శ్లోకాలలో ''రామకథా కల్పలత'' అనే గ్రంథం వ్రాశాడు. ఈ సంస్కృత గ్రంథం చాలా జీర్ణదశలో ఒక తరం కిందట ఉండేది. ఇప్పుడెలాగ ఉందో, పండరినాథుని అధ్యాత్మ రామాయణ ప్రతి అనుమకొండ పరిశోధక మండలిలో ఉంది.[15]

కాణాదం పెద్దన

వాల్మీకి రామాయణంలో బాలకాండను అనువదించిన పెద్దన సోమయాజి దాని తరువాతనో, ముందో అధ్యాత్మ రామాయణాన్ని సంపూర్ణంగా తెనిగించాడు. బాలకాండ నుంచి సుందరకాండ దాకా అయిదు ఆశ్వాసాలలోనూ యుద్ధకాండ రెండు భాగాలుగానూ ఉత్తరకాండ ఒకటిగా మొత్తం ఎనిమిది ఆశ్వాసాలుగా దీనిని రచించి చినసోమన్న కోరిక మీద గద్వాల ఆదికేశవులకు అంకితమిచ్చాడు. ఈ కావ్యం చాలా ప్రౌఢంగా ఉందని పండితుల అభిప్రాయం.[16] ఇది అచ్చుపడింది. ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో దీని వ్రాత ప్రతి ఒకటి ఉంది. (డి.375)

అల్లమరాజు రామకృష్ణయ్య

పిఠాపురంలో క్రీ.శ.1835 నాటికే కవి చకోర చంద్రోదయం వంటి కావ్యాలు వ్రాసిన అల్లమరాజు రామకృష్ణయ్య కూడా ఒక అధ్యాత్మ రామాయణ రచన చేశాడు. ఈ గ్రంథాన్ని చూసినట్టు వీరేశలింగంగారు వ్రాశారు గాని దీని గురించి విమర్శాత్మకమైన సంగతులు చెప్పలేదు. ఉదాహరణలు ఇవ్వలేదు.[17] ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో వేరే అధ్యాత్మ రామాయణ ప్రతులున్నా దీని ప్రతులు లేవు.

---

14. ఆంధ్రకవుల చరిత్ర – 3వ భాగం, పుట 331.
15. గోలకొండ కవుల సంచిక – పుట.402
16. ఆంధ్రకవుల చరిత్ర
17. ఆంధ్ర కవుల చరిత్ర – 3వ భాగం, పుట 313

రామయ్య

ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోనే ఇంకొక అధ్యాత్మ రామాయణం ప్రతి ఉంది. అది అసమగ్రం. ఆద్యంతాలు లేవు. కిష్కింధ కాండం నుంచి కొంతదాకా మాత్రమే గ్రంథం లభిస్తోంది. ఆరంభంలో వ్రాసిన ఒక కావ్యం వల్ల దీనిని ఎవరో రామయ్య వ్రాసినట్టు తెలుస్తోంది (ఆర్.585). ఇతని ఇంటిపేరూ, ఊరిపేరూ, ఇతర భోగట్టాలూ ఏమీ దొరకలేదు.

ముడుంబై వెంకట కృష్ణమాచార్యులు

ఈయన ఎక్కడివాడో, ఎప్పటివాడో నికరంగా చెప్పవచ్చు. క్రీ.శ.1800 ప్రాంతాలలో కార్వేటి నగరం సంస్థానాన్ని ఆశ్రయించుకొని జీవించాడు. ఇతడు అధ్యాత్మ రామాయణాన్నే కాక ఇతర రచనలు కూడా చేశాడు. ''కృష్ణాదీన రక్షామణి'' అనే శతకం, ద్విపదలో ఉత్తర రామాయణం, శ్రీరామస్తవ చూర్ణిక రచించాడు. పోలేరమ్మ దండకం కూడా చెప్పాడు. ఇతని అధ్యాత్మ రామాయణం అచ్చుపడిందో లేదో తెలియదు.

కంచెర్ల శరభన్న

అచ్చుపడని అధ్యాత్మ రామాయణాలలో కంచెర్ల శరభన్నది ఒకటి. కంచెర్లవారిది ప్రాచీన కుటుంబాలలో ఒకటి. కంచెర్ల అయ్యన్న అనే ఆయన శబ్దనాటకాలంకార సరణులు ఒప్పేటట్లు కాశీ ఖండాన్ని ద్విపద కావ్యంగా వ్రాశాడట. ఈయన ఎప్పటివాడో తెలియదుగాని మేడూరు ఊరంకి ప్రాంతాలవాడు. కంచెర్లవారు మేడూరి స్థల కరణాలు. కాశీఖండాన్ని ద్విపదగా వ్రాసిన అయ్యన్నగారి వంశంలోనివాడే శరభన్న. ఇతడు వ్రాసిన అధ్యాత్మరామాయణంలో తొలి రెండు కాండలే దొరుకుతున్నాయి. (డి.313)

ఇంతమంది ఇన్ని రకాలుగా పద్య రూపంలో వ్రాసినా అశేష ప్రచారం పొందిన అధ్యాత్మ రామాయణం మాత్రం గేయరూపంలో ఉన్నదే. మునిపల్లె సుబ్రహ్మణ్యంగారు 104 కీర్తనలలో రచించిన ఈ రామకథలోని పాటలు కొన్ని నేటికీ ఆంధ్రదేశంలో అక్కడక్కడ వినిపిస్తాయి. సంస్కృతం నుంచి దిగుమతి చేసుకొన్న వృత్తాలలో రచించిన గ్రంథాలు పండితులకూ, ఉన్నత విద్యాసంస్కారులకూ రుచిస్తాయిగాని సాధారణ సంస్కారులకూ, పామరజనానికీ గేయరూపంలో ఉన్నవే హృదయానికి హత్తుకొంటాయి. అందుకే ప్రతియుగంలోనూ గేయానికి దగ్గరగా ఉన్న ద్విపదలలోనికి పద్యకావ్యాలు పరివర్తన పొందుతూ ఉంటాయి. ఈ యుగంలో ఏదో ఒక్కటి తప్ప మిగతా అన్ని ద్విపద రామాయణాలూ ఉత్తరకాండకు, విచిత్ర రామాయణాలకు సంబంధించినవే. ఈ సంగతివల్ల కూడా ప్రజల అభిరుచి తెలుస్తుంది.

ఈ యుగంలోని ద్విపద రామకథల గురించి కొంచెం తెలుసుకుందాం.

నారాయణగారి చిదంబరం

ఎప్పటివాడో, ఎక్కడివాడో తెలియదుగానీ నారాయణగారి చిదంబరం అనే కవి ద్విపద కావ్యంగా కుశలవ కథను చెప్పాడు. ఇది మూడాశ్వాసాల గ్రంథం. కవిపెట్టిన పేరు

శ్రీరామ కుమార విజయం. సంస్కృతాంధ్ర సత్కవితా రహస్యవేదిననీ, పదవాక్య నిధిననీ కవి చెప్పుకొన్నాడు. వ్రాస్తున్నది కుశలవ కథే అయినా శకుంతల కథను కూడా కథనం చేశాడు. సంస్కృత కావ్యాలు చదువుకొన్నవాడు కనుక కాళిదాసుగారి అభిజ్ఞాన శాకుంతలాన్ని ఇందులో అనుసరించాడు. ఈ కావ్యం అచ్చుపడలేదు. దీని ప్రతి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి కార్యాలయంలో ఒకటి ఉంది. (గ్రంథ సంఖ్య 2550).

పాతూరి తిరుపతయ్య

కుశలవ కథ తరువాత మన ప్రజలకు బాగా నచ్చిన కథ మైరావణ చరిత్ర. దీనిని తొలియుగాలలో మారయ్యలాంటివాళ్ళు పద్యరూపంలో కథనం చేశారు.[18] ఈ యుగంలో హనుమద్విజయం అనే పేర మైరావణ చరిత్రను ద్విపదగా చెప్పినవాళ్ళలో పాతూరి తిరుపతయ్య ఒకడు. ఇతడు తిమ్మపూడి గ్రామస్థుడు. నూతక్కి కరణం. మైరావణ చరిత్రను ద్విపదగా వ్రాసి దానినే యక్షగానంగా కూడా మార్చాడు. సుందరకాండను కూడా ఇతడు యక్షగానంగా వ్రాశాడు. ఇతని రచనల ప్రతులు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి.

వాటి వివరాలు ఇవి:

1. మైరావణ చరిత్ర. ద్విపద - ఆర్.457; ఆర్.602
2. మైరావణ చరిత్ర యక్షగానం - ఆర్.939; డి.1928-9. కాకినాడ.2986.
3. సుందరకాండ యక్షగానం - ఆర్.870

పాతూరి తిరుపతయ్య రచనలో పట్టు తక్కువ, తప్పులెక్కువ అని పరిశోధకుల తీర్పు.[19] ఇతడు పూర్వరామాయణంలో సుందరకాండను చెప్పడం గమనించదగ్గ విషయం.

బేడె రాఘవరెడ్డి

ఉత్తర రామాయణాన్నికాక పూర్వరామాయణాన్నే ద్విపదగా చెప్పిన ఈ యుగం కవులలో బేడె రాఘవరెడ్డి ఏకాకి. ఇతడు తెలంగాణాలోని దమ్మారావుపేటవాడు. క్రీ.శ. 1800 ప్రాంతాలవాడు కావచ్చు. ఇతని గ్రంథం ప్రతి ఒకటి హనుమకొండ పరిశోధక మండలిలో ఉంది.[20] ఒక తరం కిందటే అది చాలా శిథిలావస్థలో ఉంది. ఇప్పుడు ఎలా ఉందో తెలియదు.

లావనూరి రామయ్య

లిఖిత గ్రంథాలయాలలో ఒక మూలపడి ఉండి చితికి, చివికిపోతున్న గ్రంథాలన్నీ వెలుగు చూస్తాయన్న ఆశలు కూడా ఆ గ్రంథాలలాగే శిథిలమైనా కనీసం ఒకటి రెండు అచ్చుపడినా కొండంత ఆనందం కలుగుతుంది. తంజావూరు సరస్వతీ మహాలులోనూ, మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోనూ కుశలవోపాఖ్యానం అనే ద్విపద కావ్యానికి

18. మలిరాయల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి, 2003.
19. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర - ద్వితీయ భాగం. పుట.427
20. గోలకొండ కవుల సంచిక - పుట.406

సుమారు ఆరు ప్రతులు ఉన్నాయి. ఈ గ్రంథాన్ని తంజావూరు వారు ప్రకటించారు. చక్కని రచన, కృత్యాది శిథిలం కావడంవల్ల గ్రంథకర్త వివరాలు దొరకలేదు. తండ్రిపేరు ఓబళన్న అనీ, ఇంటిపేరు లావనూరివారు అనీ మాత్రమే తెలుస్తోంది. తన గురువు తిరుమలాచార్యులుగారు సంగీత సాహిత్య చతురుడని కవి చెప్పుకొన్నాడు. రామయ్యా ఏ ప్రాంతంవాడో, ఏ కాలంవాడో తెలియదు కాని గోదావరీ తీరంవాడని గ్రంథంలోని కొన్ని పంక్తులవల్ల ఊహించవచ్చు.

లవుడు శత్రుఘ్నుని సైన్యాలతో పోరే ఘట్టంలో ఇలా చెప్పాడు.

నరుడు గోదావరి నదిలోన మునిగి
దురిత వర్గముల బోదోలు చందమున
బలుక నేయక బూన బైకొన నీక
తలచెడి పార నాదళముల బరపె (ఉత్తరభాగం-110)

ఈ పంక్తుల వల్లనే లావనూరి రామయ్యా గోదావరి ప్రాంతాల వాడేమో అని ఊహాగానం చేయవచ్చు. శత్రుఘ్నుని సేనలతో కుశుడు పోరాడుతున్న ఘట్టంలో రామయ్యా ఇలా వ్రాశాడు.

కన్యకా విక్రయ గతికులై బ్రతుకు
యన్యాయశీలుర యాపాపమెల్ల
యమభయంకర దండహతుల నుగ్గైన
క్రమమున రిపులెల్ల గడికండవైరి. (ఉత్తరభాగం.365)

ఈ పంక్తులవల్ల కన్యాశుల్కం ప్రబలుతున్న కాలంలో బహుశా లావనూరి రామయ్యా ఉన్నాడని భావించవచ్చును. ఇతడు జైమినిభారతంలోని అశ్వమేధ పర్వాన్ని చాలా అనుసరించాడు. ఆ పోలికలను మిత్రులు విశలదేవుని సుందరశర్మగారు బాగా చూపించారు.[21]

నీలకంఠంగారి లింగాచారి

పరిష్కర్తలు సవరించి చూపిస్తేనేగాని ఈ యుగంలోని చాలామంది కవుల సత్తా మనకు తెలియదు. వ్రాతలో వచ్చే తప్పులు కాక రచనలో ఉండేవాటిని ఎవ్వరూ దిద్దలేరు. కడప జిల్లాలోని పైడికాల్వ గ్రామంలో లింగాచారి అనే ఆయన శతకంఠ రామాయణాన్ని ద్విపదగా వ్రాశాడు. బహుశా ఇతడు 1845 నాటి క్రోధి సంవత్సరం ప్రాంతాలవాడు కావచ్చును. కవిత్వాన చాలా దోషాలు ఉన్నాయని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ గ్రంథం ప్రతి ఒకటి కాకినాడ పరిషత్తు కార్యాలయంలో ఉంది. (గ్రంథ సంఖ్య : 1320)

అధ్యాత్మ రామాయణాన్ని పద్యకావ్యంగా వ్రాసిన కృష్ణమాచార్యులు ఉత్తరకాండకు ద్విపదగా వ్రాసినట్టు ఇంతకుముందు గుర్తించాం. పద్యకావ్యాలు వ్రాసేవాళ్ళు కూడా సామాన్య ప్రజానీకానికి, పామరజనానికీ ఉపయోగించే రచనలు

21. కుశలవోపాఖ్యానం - తంజావూరు సరస్వతీ మహలు ప్రచురణ. నెం.22 (1951)

చేయాలంటే యక్షగానాలూ, గేయ కృతులూ రచించాలని గుర్తించడం ఈ యుగంలో ప్రారంభమైంది.

ఇతర పురాణేతిహాసాలలోని ఇతివృత్తాలను తీసుకొని యక్షగానాలూ, స్త్రీల పాటలూ వ్రాసుకొన్నట్లే రామాయణ గాథలను ఈ యుగంలో చాలామంది వ్రాశారు. కర్తల పేర్లు తెలిసిన రచనలకంటే తెలియనివే ఎక్కువ. దొరికినంత మటుకూ ఈ యుగంలో రచయితల పేర్లుగల రామాయణ గేయాలనూ, యక్షగానాలనూ ఒకచోట క్రోడీకరిస్తున్నాను.

రచయిత	రచన	ఆకరం
1. తిరునగరు అనంతదాసు	రామనాటకం (లక్ష్మణ మూర్ఛ)	ఆర్. 813. యస్వీ. పుట 141.
2. శిరుగంబూరు అన్నపూర్ణమ్మ	కంసల్య బైకలు (పాట)	బి.రా.రా.80
3. తాటిపురం ఆదినారాయణ	సూక్ష్మ రామాయణం (పాట)	బి.రా.రా.64
4. విజయనగరం చెంగల్వరాయడు	రామకథ (యక్ష)	యస్వీ.143
5. మమ్ముడిదేవుల తిరుమలయ్య	గీత రఘునందం (యక్ష)	యస్వీ.106
6. జూలకంటినారాయణ	కొమ్మాలపాటి రామాయణం (యక్ష)	ఆర్.671 (ఎ) యస్వీ.
7. సూర్యనారాయణగారి పట్టాభిరామయ్య	సుందరకాండ (యక్ష)	యస్వీ.438
8. ఓగిరాల పాపయ్య	రామ నాటకం	యస్వీ.187
9. పాలయ్యంకరి బోడె మల్లరాజు	జానకీ పరిణయం (యక్ష)	యస్వీ.427
10. మఠంమడికాళయ్య	శారద రామాయణం	గోలకొండకవుల సంపుటి.44
11. మంతెన ముద్దయ్య	మంతెన రామాయణం (యక్ష)	యస్వీ.363
12. శోభనాద్రి రాఘవదాసు	రామాయణ కీర్తనలు	ఆర్.357
13. ఊరి రామచంద్రరాజు	కుశలాయకం	బి.రా.రా.95
14. అగస్త్యరాజురామన	సీతాకల్యాణం(యక్ష)	డి.1958
15. రామభక్త కవి	శారద రామాయణం	బి.రా.రా.70
16. మరింగంటి భట్టరు రామానుజాచార్యులు	శ్రీరామనాటకం లక్ష్మణమూర్ఛ	యస్వీ.123
17. వినుకొండ విజయరామయ్య	వినుకొండ రామాయణం (ద్విపద?)	కాకినాడ. గ్రంథ సంఖ్య.1220
18. శీర్నాడు వెంకటరావు	లేపాక్షి రామాయణం (యక్ష)	యస్వీ.117
19. మెరత్తూరు వెంకటరామశాస్త్రి	సీతాకల్యాణం (యక్ష)	యస్వీ.336
20. వేల్పూరి వెంకటేశ్వర్లు	రామలీలలు (యక్ష)	యస్వీ.101
21. లాడెసుందర నారాయణ	రామకథా సుధార్ణవం	బి.రా.రా.64
22. ధర్మపురి శేషప్ప	ధర్మపురి రామాయణం	యస్వీ.359
23. యాముజాల శేషాచలపతి	రామాయణ యక్షగానం	యస్వీ.363
24. రాపాక శ్రీరాములు	అధ్యాత్మ రామాయణం (యక్ష)	యస్వీ.360

అసంఖ్యాకమైన గేయనాటక రామాయణాలలో కనీసం రెండు డజన్ల మంది రచయితల పేర్లు ఈ పట్టిక వల్ల తెలుస్తున్నది. ఈ జాబితాలోని ఆకరాలలోని కొత్త సంకేతాలలో యస్వీ. అంటే యస్వీ జోగారావుగారి యక్షగాన వాఙ్మయ చరిత్ర ద్వితీయ భాగంలోని పుట సంఖ్య. బి.రా.రా. అంటే - డాక్టరు బిరుదు రాజు రామరాజుగారి తెలుగు జానపద గేయ వాఙ్మయంలోని పుట సంఖ్య అని అర్థం. ఈ ఇద్దరు పరిశోధక మిత్రులూ ఆ పుటలలో ఈ మధుర రచనల గురించి అవసరమైనంత విపులంగా చర్చించారు. దొరికిన ఆకరాలన్నీ ఇచ్చారు. ఆ పుటలను సూచించడం తప్ప వివరాలలోనికి వెళ్ళడం చర్విత చర్వణం అవుతుందని మానేస్తున్నాను.

అయితే ఒక్క సంగతి చెప్పడం మానెయ్యకూడదు. ఈ గేయనాటక రచయితలలో కొందరు చాలా ప్రతిభావంతులు రసవంతమైన రచన ఎలా చేయాలో తెలిసినవాళ్ళు పాండిత్య ప్రకర్షకన్నా రసపట్టు ముఖ్యమని తెలిసినవాళ్ళు. అందుకే ఈ రచనలలో చాలా మట్టుకు నేటికీ ప్రజలలో సజీవంగా ఉన్నాయి. పల్లెప్రాంతాలలో ఇవి ఇంకా ఊపిరి పీలుస్తున్నాయంటే వీటిలో ఎంత జీవం ఉందో తెలుస్తుంది.

జీవితం నాగరికమైన కొలదీ గేయకావ్యాలు, దృశ్యకావ్యాలు తగ్గి వచన కావ్యాలు ఎక్కువ అవుతాయి. కుంఫిణీయుగంలో మన బస్తీ జీవితాలలో మార్పులు ప్రవేశించాయి. అచ్చు యంత్రాలు రాగానే వచన కావ్యాలు ముమ్మరం అయ్యాయి. ఇతర వచన గ్రంథాలతోబాటు రామాయణం కూడా వచనరూపంలో అచ్చుపడింది. ఈ యుగంలో మొదట చెప్పవలసినది దేవకి వెంకటసుబ్బయ్య వ్రాసిన వచన రామాయణం. ఇది అరణ్యకాండ నుండి మాత్రమే దొరుకుతుంది. సంస్కృత రామాయణంలో అధ్యాయ సంఖ్యలతో సైతం రచయిత దీనిని అనువదించాడు. దీని ప్రతి ఒకటి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి కార్యాలయంలో ఉంది.[22]

ఈ వెంకట సుబ్బయ్య రామాయణం తరువాత చెప్పవలసినది సింగరాజు దత్తాత్రేయులు, సింగరాజు వెంకట సుబ్బయ్య రచించిన వచన రామాయణం. వీళ్ళు 1840 ప్రాంతాలవాళ్ళు. గ్రంథమంతా ఇప్పుడు దొరకదు. దత్తాత్రేయులు వ్రాసిన అరణ్య, కిష్కింధాకాండలు; వెంకటసుబ్బయ్య రచించిన యుద్ధకాండ మాత్రమే లభిస్తున్నాయి. ఇది గ్రాంథిక రచన అని పరిశోధకులు చెప్తున్నారు.[23]

ఈ యుగంలోనే పైడిపాటి పాపయ్య రంగనాథ రామాయణాన్ని వచనంలో వ్రాశాడు. ఇతడు పూర్వరామాయణాన్ని గద్యరూపంలో చెప్తే పాటూరి నరసింహశాస్త్రి రంగనాథ రామాయణంలోని ఉత్తరకాండను వచనంలో రచించాడు. ఈ ఇద్దరి రచనలవల్లా రంగనాథ రామాయణం గద్యరూపంలో సంపూర్ణమైంది.

ఈ యుగంలో ఇలాగ వచన కావ్యాలు వికసిస్తూ ఉంటే నిర్వచనంగా కావ్యం వ్రాయడం ఇంకా గొప్పే అనుకొనేవాళ్ళు లేకపోలేదు. జయంతి రామభట్టు అనే ఆయన

22. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, సంచిక.4, పుట 259
23. ఆంధ్ర వచన వాఙ్మయం, నిడుదవోలు వెంకటరావుగారు, పుట.75

నిర్వచనంగా ఉత్తరరామాయణాన్ని రచించారు. దీని ప్రతి ఒకటి ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.771 (ఎ)

ఈ యుగంలో ఇన్ని రామాయణ కావ్యాలు పుట్టినా కొన్నే వెలుగు చూశాయి. ఏ కొద్దిగానో ప్రచారం పొందాయి.

రామునివంటి రాజుంటే హనుమంతుని వంటి బంటూ ఉంటాడని సామెత చెప్పినట్టు రసవంతమైన కావ్యాలు ఉంటే వాటిని బతికించే రసజ్ఞులూ ఉంటారు. మిగతా రచనలన్నీ పరిశోధనా ధేనువులను చేపే చేట పెయ్యలే!

పరి పరి పరిణయాలు

దేశం సుభిక్షంగా, నిత్యకల్యాణం పచ్చతోరణం అన్నట్టున్నా లేకపోయినా, ఈ యుగంలో సాహిత్యంలోని కల్యాణాలకు కరువు లేదు. సర్వ సాధారణంగా ప్రతి ప్రబంధం చివరా నాయికా నాయకులు పెళ్ళి చేసుకొని ఆ పిమ్మట సుఖంగా జీవిస్తూనే ఉంటారు. ప్రత్యేకంగా ఫలానా పరిణయం అని పేరు పెట్టి వ్రాసిన ప్రబంధాలలో విధిగా నాయికా నాయకుల కల్యాణంలోనే కథ కంచికి వెళ్లడానికి శోభనం గదిలో నిర్గమనం పెడుతుంది.

గ్రంథనామంలో పరిణయం, కల్యాణం, వివాహం అనే పదాలున్న కావ్యాలను వ్రాసినవాళ్లు ఈ యుగంలో 50 మందికి తక్కువ లేరు. వాళ్ళందరూ ఏయే పరిణయాలు వ్రాశారో చూద్దాం.

మన పురాణ పురుషులలో ఎక్కువ పెళ్లిళ్ల చేసుకోవడానికి ఓపికా, తీరుబాటూ ఉన్న మహానుభావుడు శ్రీకృష్ణుడే. కాబట్టి ఏ తెలుగు కవైనా కల్యాణ కావ్యాన్ని వ్రాద్దామనుకొంటే ఆ ముచ్చట తీర్చటానికి ముందుగా సిద్ధమయ్యే దైవం కృష్ణుడే. అందుచేత ఈ యుగంలో పదహారుమంది రచయితలు శ్రీకృష్ణుని పెళ్ళిళ్ల చేశారు. అష్ట మహిషుల్లో ఏ ఒక్కర్నీ విడిచిపెట్టకుండా అందరికీ మంగళ సూత్రాలు మళ్లా కట్టించారు. రాధ ఏ పాపం చేసుకొందని గోపీనాథం వెంకయ్యశాస్త్రుర్లు గారు రాధికా పరిణయం కూడా చేయించారు. కృష్ణుని సోదరుడు మాత్రం తీసిపోయాడా అని వద్దపర్తి కోనమరాజు రేవతీ పరిణయం జరిపించి బలరాముణ్ణి ఒక ఇంటివాణ్ణి చేశాడు. అనిరుద్ధుడూ, అభిమన్యుడూ యథాశక్తి మళ్లా పెళ్ళికి తయారయ్యారు. కాళిదాసుగారి రఘువంశంలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొన్న పుణ్యాంకొద్దీ అజమహారాజూ, ఇందుమతీ ఈ యుగంలో మళ్లా అయిదారుసార్లు పెళ్ళిపీటలమీద కూర్చోవలసి వచ్చింది. లక్ష్మీ పార్వతులు కూడా పెళ్లి నడకలు నడిచారు. సీతకే కాక ఆవిడ అత్తగారు కౌసల్యకు కూడా ఈ యుగంలో పెళ్ళి ముచ్చట తీరింది.

ఈ కల్యాణాలన్నీ చూస్తే వైభోగంగానే ఉంటాయిగాని కొన్ని గ్రంథాలు చదివితే ''పెళ్ళి బాగుంది, పప్పు వండితే మరీ బాగుంటుంది'' అనే సామెత జ్ఞాపకం వస్తుంది.

రొటీను కల్పనలు, రొటీను శిల్పాలు, పాత వర్ణనలు చూస్తూ ఉంటే కొందరు కవులు బాసికం మొదలు భజంత్రీల దాకా బదులుతోనే పెళ్ళిళ్ల జరుపుతున్నారన్నది విదితమౌతుంది. అయినా సాహిత్య జమ కట్టుకోవలసిన వాళ్లు కూడా ఉన్నారు. కనుక ఈ పెళ్లి భోజనాలన్నీ మనం చేయక తప్పదు.

ఈ పరిణయకర్తల భోగట్టాలు అకారాదిగా తగినన్ని వివరాలతో చెప్పుకొందాం.

దొంతిరాజు అచ్చన్న

ఇతడు కాళిందీ పరిణయం వ్రాశాడు. ఇది ఎన్ని ఆశ్వాసాల కావ్యమో తెలియదు. తేటగుంటలోని పేరూరి వెంకయ్యసెట్టికి అంకితం ఇచ్చాడు. మూడో ఆశ్వాసంతో ఆగిపోయిన ఈ కావ్యం ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.340)

అకలంకం కృష్ణమాచార్యులు

ఇతడు మూడాశ్వాసాలలో శకుంతలా పరిణయం వ్రాశాడు. చిరుమామిళ్ల పాపయ్యా గారి ప్రేరేపణవల్ల దీనిని వెంకటేశ్వరునికి అంకితమిచ్చాడు. చిరుమామిళ్లవారు తరతరాలు వాసిరెడ్డి వారి వియ్యంకులు. కొందరు సాహితీపరులే. ఈ కృతిని ప్రోత్సహించిన పాపయ్యా గారి చిన్న తాతగారి కొడుకుల్లో ఒకరైన వెంకయ్యా ''కావ్యనాటక గుణాలంకార పారీణతా ప్రావీణ్యంలో''నూ, వాక్పటుత్వంలోనూ గొప్పవాడని కవి ఒక పద్యంలో చెప్పాడు (శకు.1-48). ఇతరులు కదన పాండిత్యం గలవాళ్లు. పాపయ్యగారి అన్నగారి శౌర్యాన్ని ఇలా వర్ణించాడు.

మత్తగజంబు లీల జిరు మామిళ వెంకటురామ శౌరిపు
త్త్రోత్తముడైన రామవిభుడో హరి సాహరి శత్రుకోటి పై
గత్తి జరీదూసి యెసకన్ బెనకన్ జళిపింప నింపు పై
గుత్తపు దాపితా రవికకుట్టు పటుక్కున విచ్చె రంభకున్ (శకుం.1-80)

రంభ రవికకుట్లు తెంపిన ఈ కవికి ప్రాచీన చమత్కారాలన్నీ కరతలామలకాలు. ఈ కృష్ణమాచార్యులు చిరుమామిళ్లవారి ఆస్థానకవి, వాళ్ల పోషణలో ఇంకే గ్రంథాలు వ్రాశాడో తెలియదు. ఇతని శకుంతలా పరిణయం అచ్చుపడింది (వావిళ్ల-1927). ఇది పిల్ల వసుచరిత్రల జాబితాలో చేరింది. ఇది వ్రాశాక ఇతడు కృష్ణానేని వారి ఆస్థానంలోనికి వెళ్లి స్థిరపడ్డాడేమో. కృష్ణానేని తిరుపతిరావు ఆనతిని ధనుర్విద్యావిలాసం అనే శాస్త్రగ్రంథాన్ని పద్యరూపంలో చెప్పాడు. విల్లు నిర్మించడం మొదలు శరప్రయోగం దాకా సకల విషయాలూ వివరించాడు. ఈ గ్రంథాన్ని విపులమైన పీఠికతో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రచురించారు.[1] గ్రంథకర్త గురించి దొరికినన్ని వివరాలు తెలియచేశారు.

వేటూరివారికి ''ఆకాశ రావణ సంహారం'' అనే మరో గ్రంథం దొరికింది (ఆర్.663). దానిలో ఈ ధనుర్విద్యా విలాసంలోని పద్యాలే కొన్ని ఉన్నాయట. ఒకవేళ

1. మదరాసు ప్రభుత్వం ఓరియంటల్ లైబ్రరీ ప్రచురణ, 1950.

ఆకాశరావణ సంహారాన్ని కూడా ఇతడే వ్రాస్తే ఇతని ఇంటిపేరు ''ఉరుటూరు'' వారని చెప్పవచ్చు. అయితే కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యాలయంలో ఉన్న కుమ్మాలపాటి దండకం, జలక్రీడా విలాసం అనే యక్షగానం ఇతని రచనలే అని పరిశోధకులు నిర్ణయించారు.[2] ఇంటిపేరు అకలంకం వారని తేల్చారు. కొమ్మాలపాటి దండకాన్ని ఇతడు వాసిరెడ్డి వెంకటాద్రిగారి ప్రేరణవల్ల వ్రాశాడట. మొత్తంమీద ఇతడు చాలా సంస్థానాలలో ఉన్నాడు.

శిష్టు కృష్ణమూర్తి

ఒక ఆస్థానం నుంచి మరొక ఆస్థానానికి మారుతూ ఉండడం ఈ యుగంలో రివాజే. నరసింహంగారి కృష్ణమాచార్యులలాగ శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి కూడా అనేక సంస్థానాలు సందర్శించాడు. ఇతడు ఆశ్రయించిన వాళ్ల పట్టిక ఇది.

రామచంద్రపురం	కాకర్లపూడి రామచంద్ర రాజుగారు. వారి తమ్ములు జగన్నాధరాజుగారు	కవి తన 45వ సంవత్సరాలదాకా వీళ్ళ ప్రాపకంలో ఉన్నాడు.
కాళహస్తి	దామెర వెంకటపతి రాయనింగారు	ఇక్కడ పదహారు సంవత్సరాలు కవి ఉన్నాడు.
పిఠాపురం	రావుగంగాధర రామారావు	కవిని సత్కరించాడు
జగ్గయ్యపేట	రాజా వెంకటరాయడు (పిఠాపురం భోగపత్ని కొడుకు)	కవిని సత్కరించాడు
మాడుగులు	కృష్ణభూపతి	రెండువేల రూపాయలు వచ్చు భూములు ఇచ్చి ఆస్థానంలో ఉంచుకొన్నాడు

ఒకరకంగా శిష్టు కృష్ణమూర్తిగారితో సాహితీపరులు ఉదర పోషణార్థం సంచారం చేయడం మొదలైనదని చెప్పవచ్చు. ఈయన గోదావరి మండలంలోని రామచంద్రపుర ప్రాంతాలలో పుట్టి పెరిగాడు. అక్కడి స్థానిక ప్రభువులు కాకర్లపూడి వారి దృష్టిలో పడ్డాడు. ఆశుకవిత్వంలోనూ, పురాణ పఠనంలోనూ మంచి ప్రావీణ్యం గలవాడు. సాహిత్య స్పర్ధల వల్ల పుట్టి పెరిగిన గడ్డను విడిచిపెట్టి దూరంగా ఉన్న కాళహస్తి సంస్థానానికి చేరాడు (ఆ సంస్థానాధిపతి గోదావరి మండలానికి దత్తు వెళ్ళాడు). అక్కడ కొన్నేళ్ళుండి మళ్లా స్వీయమండలానికి వెళ్ళాడు. పలువురిని ఆశ్రయించాడు. దక్షిణాన రామేశ్వరం నుంచి ఉత్తరాన జగన్నాథం దాకా సంచరించాడు. సంస్కృతాంధ్రాలలో చాలా గ్రంథాలు వ్రాశాడు. చివరన దాని లిస్టు చెప్పుకొందాం.

2. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి పత్రిక సంచిక, 4, పుట. 196.

మొదట ఈ కవి గురించి చెప్పుకోవలసినది ఇతడు పేచీకోరు మనిషి. కాకర్లపూడివారి ఆశ్రయంలో ఉన్నప్పుడు పిండిప్రోలు లచ్చన్నగారితో తగాదా పడ్డాడు. లచ్చన్నగారు ఇతని సర్వకామదా పరిణయంలో తప్పులు పట్టారు. బహుశా మొఖం చెల్లక కృష్ణమూర్తి దూరసీమలకు వెళ్లిపోయాడు. యౌవనంలో లచ్చన్నగారితో పేచీపెట్టుకొంటే వృద్ధాప్యంలో పరవస్తు చిన్నయసూరిని చూసి అసూయపడ్డాడు. సూరిగారి బాలవ్యాకరణాన్ని అమాంతంగా సంస్కృతంలోనికి మార్చేసి ఈ గ్రంథం పూర్వం ఉన్నదే అని దబాయించి కర్తృత్వాన్ని హరిభట్టుకు అంటగట్టాడు. ఈ అళీకాన్ని అనంతర పరిశోధకులు బయటపెట్టారు. ఇలాంటి ఫోర్జరీ రచనలు శిష్టు కృష్ణమూర్తికి పేలపిండి. ఒక రాత్రికి రాత్రి ఈయన సంస్కృతంలో ఒక అశ్వశాస్త్ర గ్రంథాన్ని వ్రాసేసి అది ప్రాచీనమన్నాడు. పంతమొస్తే మన పాతవాళ్ళది భల్లూకపు పట్టు!

శిష్టు కృష్ణమూర్తి రచనల వివరాలు

సంస్కృతం : యక్షోల్లాసం (కావ్యం), వల్లవీ వల్లకోల్లాసం, మదనాభ్యుదయం (భాణాలు); రామాయణం (కంకణబంధం), హరికారికలు (వ్యాకరణం); నీల శైలానాథీయం (యాత్రాచరిత్ర), అశ్వశాస్త్రం (కల్పితం).

తెలుగు : సర్వకామదా పరిణయం (ప్రబంధం కాకర్లపూడి జగన్నాథరాజుగారికి అంకితం (దీని కృతి సమర్పణ సమయంలోనే పిండిప్రోలు లచ్చన్న తప్పులు పట్టాడు). 2. వెంకటాచలమాహాత్మ్యం (రచన శ్రేష్ఠంగా లేదని వీరేశలింగంగారి అభిప్రాయం) (ఆం.క.చ.పుట.320). 3. స్త్రీ నీతిశాస్త్రం (రాజమండ్రి జిల్లా కలెక్టరు కచేరీలో శిరస్తాదారుగా ఉన్న తుళసింగసెట్టిగారి ప్రోత్సాహంవల్ల వ్రాసినది). 4. వీక్షారణ్యా మహాత్మ్యం (కాళహస్తి చేరాక వ్రాసినా తుళసింగసెట్టికి అంకితం), 5. వాయుపుత్ర శతకం (వారి మహాబంధు సుమిత్ర - వాయుపుత్ర అని మకుటం సీస శతకం). 6. పంచతంత్రం (వివరాలు తెలియవు), 7. వసుచరిత్ర వ్యాఖ్యానం (కృష్ణమూర్తికి అభినవభట్టు మూర్తి అనే బిరుదు ఉన్నట్టు నిడుదవోలు వెంకటరావుగారు వ్రాశారు. శతకకవుల చరిత్ర - అనుబంధం - పుట 764.)

శిష్టు కృష్ణమూర్తి ఇన్ని రచనలు చేసినా తగాదా వ్యక్తిగానే కీర్తి గడించాడు. తొలి తగాదాలకు మూలకారణం ఇతని సర్వకామదాపరిణయం అన్న సంగతి గమనించతగ్గది.

కాకరపర్తి కృష్ణయ్య

జీవనోపాధికోసం శిష్టు కృష్ణమూర్తి దేశాటనం చేసి పదిమందిని ఆశ్రయించినా ఈ కాలంలో చాలామంది ఉన్నచోటే ఉంటూ ఒక్కరినే నమ్ముకొన్నారు. కాకరపర్తివారు విశాఖ మండలంలో గోడేవారి ఆశ్రితులు. కాకరపర్తి కృష్ణయ్య సత్యభామా కృష్ణ సంవాదం అనే గ్రంథం వ్రాసి గోడే జగ్గారావుగారి వల్ల మాన్యం అందుకొన్నాడు. ఇతడు వ్రాసిన శశిరేఖా పరిణయం దోషరహితంగా, హృదయంగమంగా ఉంటుందని

వీరేశలింగంగారు సర్టిఫికేటు ఇచ్చారు.[3] ఇతడు ముఖలింగక్షేత్ర మాహాత్మ్యం కూడా వ్రాశాడు.

కామనూరి కృష్ణయ్య

మన కవులు అధికంగా వ్రాసిన పరిణయ కావ్యాలలో ఇందుమతీ పరిణయం ఒకటి. మునుపటి యుగాల్లో తెనాలి రామభద్రయ్య, చిత్రకవి అనంతయ్య, కుమారధూర్జటి మొదలైనవాళ్లు ఈ కథనే చెప్పారు.[4] రఘువంశం చదువుకొన్న ఏ తెలుగు సాహితీపరునికైనా ఈ కథ బాగా నచ్చుతుంది. రచన చేయబోయినప్పుడు రెడీమేడ్ కథా ప్రణాళిక దొరుకుతుంది. కామనూరి కృష్ణయ్య స్పష్టంగా ఇలా చెప్పాడు.

''కాళిదాసకవి శ్రేష్ఠ కల్పితంబు
భవ్య చరితంబు రఘువంశ కావ్యమందు
నజుని కథ యాంధ్ర భాషచే నలఘుమతిని
గృతి రచింపబూనితి నలంకృతులు చెలంగ'' (డి.224)

అలఘుమతితో అలంకృతులు చెలంగగా కామనూరి కృష్ణయ్య వ్రాస్తానని శపథం చేసిన ఈ అయిదాశ్వాసాల కావ్యం అముద్రితం. గద్యంలో తాను సాహిత్య కళా నిధానుణ్ణనీ, తన పేరు కృష్ణావధాని అని కవి చెప్పుకొన్నాడు. ప్రజలు ఈయన్ని కిచ్చన్నగారని పిలిచేవారు.

కమలాపురం కృష్ణయ్య

కాళిదాసుగారి రఘువంశం ఎలా తెలుగు కావ్య రచనకు ఆధారభూతమో అలాగే కుమార సంభవం చదువుకొన్నాక చాలామంది పార్వతీ పరిణయాలు వ్రాశారు. వాళ్ళలో కమలాపురం కృష్ణయ్య ఒకడు. ఈయన పినాకినీతీరాన ఉన్న కమలాపురం గ్రామస్థుడు. ఇతని కాలం ఇదమిత్థంగా చెప్పలేం. బహుశా ఈ యుగంవాడే. ఇతని కవిత్వం కొంతవరకు శ్లాఘ్యంగానే ఉందని వీరేశలింగంగారు మెచ్చుకొన్నారు.[5] ఈ పుస్తకం అచ్చుపడినట్టు లేదు.

ఆలూరి కుప్పన

మన ప్రాచీన కవులలో చాలామంది విద్యాభ్యాసంలో కాళిదాసు కృతులన్నీ చెప్పుకొంటారు. వాళ్ళకి అవి వాచోవిధేయంగా ఉంటాయి. అయితే కాళిదాసును చదువుకొన్న ప్రతిఒక్కడూ కాళిదాసుగారంత ప్రతిభావంతుడు కాలేడు. తెలుగులో ఆలూరి కుప్పన అన్న కవికి మాత్రం ఆంధ్ర కాళిదాసు అనే బిరుదు ఉంది. ఇతడు క్రీ.శ.1762–1787 దాకా తంజావూరును పాలించిన రెండవ తులజాజీ కాలంవాడు కావడానికి ఆస్కారాలు ఉన్నాయి. ఆనంద రంగరాట్ఛందం వ్రాసిన కస్తూరి రంగయ్యకు ఈయన శిష్యుడు.

---

3. ఆంధ్రకవుల చరిత్ర 3వ భాగం, పుట 299
4. ఈ పేర్లకు వరుసగా నవాబుల యుగం, ఆరవీటిరాజుల యుగం, నాయక రాజుల యుగం – సమగ్ర ఆంధ్ర సాహిత్యం – రెండవ సంపుటి 2003.
5. ఆంధ్ర కవుల చరిత్ర 3వ భాగం, పుట 301.

ఇందుమతీ పరిణయం వ్రాయబట్టే ఇతనికి ఆంధ్రకాళిదాసు అనే పేరు వచ్చిందేమో. అయినా ఆ కావ్యం నేడు అలభ్యం. ఇతడు వ్రాసిన ఆచార్య విజయం సంస్కృతంలో ప్రసిద్ధం. ఆది శంకరాచార్యుల చరిత్రను చెప్తుంది. మాతృక ఆనందగిరి వ్రాశాడు. తెలుగు గ్రంథాన్ని చెన్నపట్నంలోని ఉద్యోగి శిఖామణులు ప్రోత్సహించి చెప్పించారు. (ఆర్.138) కుప్పన చాలా గ్రంథాలు వ్రాశాడు. వాటి వివరాలు ఇవి.

1. పంచనదీ స్థల పురాణం, 2. రామాయణ యక్షగానం, 3. భాగవత యక్షగానం (పార్థసారథి విజయం అని నామాంతరం డి.1907; ఆర్. 758), 4. పరమ భాగవత చరిత్ర, 5. ఇందుమతీ పరిణయం, 8. హరికథా సుధారసం, 7. ఆచార్య విజయం (ఆర్.138).

ఇందులో కొన్ని కాలగర్భంలో కలసిపోయాయి కాబోలు. మూడోదీ ఆఖరుదీ మాత్రమే దొరుకుతున్నాయి.

చక్రప్పగారి కోటయ్య

నేడు దొరుకుతున్న అముద్రిత కావ్యాలలో చక్రప్పగారి కోటయ్య వ్రాసిన రుక్మిణీ కల్యాణం ఒకటి. దీనికి కవి ''భోజసుతా పరిణయం'' అని పేరు పెట్టాడు. ఈ అయిదాశ్వాసాల కావ్యంలో కవిత రసవంతమేగాని వ్యాకరణ దోషాలు ఉన్నాయి అని వీరేశలింగంగారు చెప్పారు.[6] ఇతని దేశకాలాల గురించి తెలియదు. ఈ కావ్యం ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.615)

వద్దిపర్తి కోనమరాజు

(జననం 1754 - మరణం 1834) సాధారణంగా ఏ గృహస్థుకైనా ఒక్క పెళ్ళి చేస్తేనే నడుం విరిగినంత అవుతుంది. రెండు మూడు పెళ్లిళ్ల చేయాలంటే సమృద్ధిగా డబ్బు ఉండాలి. మన కవులలో కవితా సంపద ఎంత ఉన్నా జన్మతః సిరి సంపదలున్న వాళ్ల అరుదు. వాళ్లలో వద్దిపర్తి కోనమరాజు ఒకడు. ఈయన విశాఖపట్నం జిల్లాలోని సర్వసిద్ధివాడు. ఆ గ్రామానికి కరణీకమేకాక ఇనాం భూములు కూడా ఉన్నవాడు. ఈయన రేవతీ పరిణయం, మహాలక్ష్మి పరిణయం అనే రెండు వివాహ ప్రబంధాలు వ్రాశాడు. వీటిలో రెండోది అచ్చుపడింది.[7] అయిదాశ్వాసాల శృంగార కావ్యం. కవిత్వం మూడుపాళ్లు సంస్కృతం, ఒకపాలు తెలుగు అనీ, కర్ణపేయం అనీ పరిశోధకులు చెప్తున్నారు.[8] ఈ రెండు పరిణయ గాథలేకాక వెంకటేశ్వరోపాఖ్యానం, జానకీరామ శతకం అనే గ్రంథాలు కూడా ఈయన చెప్పాడు (ఈ కవి గురించి మరికొన్ని వివరాలు ఇదే సంపుటంలోని ''విజయనగరం'' అనే ప్రకరణంలో ఉన్నాయి.)

6. ఆంధ్ర కవుల చరిత్ర - 3వ భాగం, పుట.260
7. కోనమరాజుగారి మునిమనుమలు వద్దిపర్తి వీరరాఘవస్వామి ప్రచురించారు. కోనమరాజుగారి మరికొన్ని వివరాలు ఈ సంపుటంలోనే విజయనగరం అనే ప్రకరణంలో ఉన్నాయి.
8. విస్మృతాంధ్ర కళింగ కవులు - ప్రథమ భాగం అడిదం రామారావుగారు, పుట 103

తిమ్మయ్యగారి తిమ్మయ్య

ఈ యుగంలో దొరికే అముద్రిత గ్రంథాలు చాలా మటుకు సమగ్రంగా లేవు. అసంపూర్ణంగా దొరుకుతున్న వాటిలో తిమ్మయ్యగారి తిమ్మయ్య వ్రాసిన ఇందుమతీ పరిణయం ఒకటి. కవి తాను విక్ష్వజ్ఞన సార్వభౌముడని చెప్పుకొన్నాడు. రస సాహిత్యపోషణ అనే విశేషణాన్ని వాడుకొన్నాడు. ఇంతకుమించి ఇతని గురించి వివరాలు తెలియదు. ఇతని అసమగ్ర కావ్యం ప్రతి ఒకటి తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయంలో ఉంది (తం.డి.137). ఈ తాళపత్రాలు బాగా దెబ్బతిన్నాయి.

కొప్పర్తి నరసన్న

కవిగా పేరు తెచ్చుకోవాలనే ఉబలాటం చాలామందికి ఉంటుంది. అయితే శక్తి చాలనప్పుడు కొందరు డబ్బిచ్చి పుస్తకాలు తమ పేర చెప్పించుకొంటారు. కొందరు ఇతరుల సహాయంతో గ్రంథాలు రచిస్తారు. రావూరు సంజీవరాయుడనే కవి సహాయంతో కొప్పర్తి నరసన్న ఒక కావ్యం వ్రాశాడు. మదనగోపాల చరిత్రం అనే నామాంతరంతో రుక్మిణీ కల్యాణాన్ని కథనం చేశాడు. ఈ కృత్యాదిని మరో వింతకథ చెప్పాడు. కొండపల్లి సర్కారులో కోడూరు దగ్గర ఉన్న ఆంజనేయస్వామి కలలో కనబడి ఆ ప్రాంతాలలో మదన గోపాలపురమనే గ్రామం కట్టించి ఆలయ ప్రతిష్ఠ చేయించి ఎవ్వరైనా కవి సహాయంతో కావ్యం వ్రాయమని ఆదేశించాడట. అందుకే ఈ రుక్మిణీ కల్యాణాన్ని నరసన్న క్రీ.శ. 1787లో వ్రాశాడు.

గ్రంథ రచనకు కావలసిన సాహిత్య స్తోమత ఉన్నా లేకపోయినా కొప్పర్తి నరసన్నకు కోవెల కట్టించేటంత ధనం ఉంది. వాస్తవానికి ఇతని పూర్వీకులు అంతర్వేదిలోనూ, సర్పవరంలోనూ కోవెలలు కట్టించారు. అగ్రహారాలు ఇచ్చారు. ఆ వారసత్వం నరసన్నకు బాగా సంక్రమించింది. ఇతడు కట్టించిన గుడిలో అంగరంగ వైభోగాలు ఎలాగున్నాగాని ఇతని కావ్యం ప్రతులు కొద్దిగా దెబ్బతిన్నా రెండు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి (ఆర్.358; ఆర్.791). కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యాలయంలో కూడా ఒక ప్రతి ఉంది.[9]

వల్లూరి నరసింహం

వీరేశలింగంగారు ''రసికజన హృదయాహ్లాదంగా'' ఉందని మెచ్చుకొన్న కవిత్వం చెప్పిన వాళ్లలో వల్లూరి నరసింహం ఒకడు. ఇతడు నాగ్నజిత్తీ పరిణయం వ్రాశాడు (డి.548). ఇది మూడాశ్వాసాల కావ్యం. అచ్చుపడినట్టు లేదు. వల్లూరివాళ్ళు నూజివీడు జమీందారీ గ్రామాలలో ఉన్నవాళ్లు. నూజివీడు సంస్థానాధిపతులు నరసింహప్పారావు గారు వల్లూరి నరసింహంగారి తండ్రి హనుమంతుగారికి తుంగబాడు మాన్యం ఇచ్చారు. ఈ హనుమంతులుగారు కవి. కపోత వాక్యం, సీతావిజయం, త్రిపురాతి విజయం అనే కావ్యాలు వ్రాశాడు. కలిదిండి రామరాజుగారివల్ల కొన్ని మాన్యాలు పొందాడు. వల్లూరి

9. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక - సంపుటి.3 - పుట.444

నరసింహంగారి కొడుకు సూరన్న కూడా కవే. ''పద శబ్దార్థ శ్లేషల బొదువ'' కవిత చెప్పాడట. ఇతడు పోడూరి రామన్నగారి అల్లుడు. వల్లూరివారు పండిత కుటుంబాలతో వియ్యమందినట్లుంది. వల్లూరి నరసింహంగారి తమ్ముడు తురగా రామన్నగారి అల్లుడట. తిట్టుకవిగా పేరు మోసిన తురగా రామకవిగారికీ, ఈ రామన్నగారికీ ఏమేనా సంబంధం ఉందేమో.

నాగ్నజిత్తీ పరిణయంలో వల్లూరి నరసింహం కొన్ని గడుసుతనాలు చూపించదలచినట్లుంది. అప్పకవి అడుగుజాడలలో నడుస్తూ అయ్యలరాజు రామభద్రుణ్ణి నుతించాడు. అప్పకవి దృష్టిలో నాన్‌బ్రామిన్సు కవులు కారు. అయినా భట్టుమూర్తిని ఎవరూ కాదనలేరు. చూస్తూ చూస్తూ పొగడలేడు. అందుచేత ''రామరాజ విభూషణ రత్న ఖచిత చారుమస్త కలాపాది హారి వాక్యగౌరవము పెక్కు భంగుల గణనచేసి'' అని అప్పకవి భట్టుమూర్తి పేరు ఇరికించి, ఘనత తగ్గించి, అయ్యలరాజు రామభద్రుణ్ణి పొగిడాడు (అప్ప.1-27). ఆ ధోరణిలోనే వల్లూరి నరసింహం ఇలా చెప్పాడు.

''గట్టిగ భట్టుమూర్తి పగగట్టి ప్రబంధములెన్ని చెప్పినన్
గిట్టక యొగ్గులెన్ని యుడికించిన రాము గురించి నెమ్మదిం
బుట్టిన చింత దత్కథన పూర్వముగా రచియించి గెల్పుచే
పట్టిన రామభద్ర కవి బ్రస్తుతి చేసిన పున్నెమబ్బదే'' (డి.546)

పూర్వ కవులను ప్రస్తుతి చేస్తే పుణ్యమబ్బుతుందనుకొనే వాళ్ల కొందరిని ఊరికే ఆడిపోసుకొంటే పాపం చుట్టుకొంటుందని ఆలోచించరేం? ఒక పక్క భట్టుమూర్తిని ఇలా ఈసడిస్తూనే అతని వరవళ్లు దిద్దే ఈ కవులంతా హిపోక్రసీలో ఉద్దండులు.

వానపాల నరసింహరాజు

శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకరైన నాగ్నజిత్తి పెళ్ళి కథను వల్లూరి నరసింహం చెప్తే లక్షణాకల్యాణాన్ని వానపాల నరసింహం వ్రాశాడు. ఈయన సాహితీ తంత్ర స్వతంత్రుణ్ణని గద్యలో చెప్పుకొన్నాడు. నెల్లూరి జిల్లాలో ఉన్న మారెకొండ నరసింహ స్వామికి అంకితమిచ్చాడు. ఈ కావ్యం శృంగార నైషధాన్ని పోలుతుందనే రసోత్తరమైన రచనమని పండితులు భావిస్తున్నారు. ఇది అముద్రితం. దీని ప్రతులు రెండు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి (ఆర్.650, ఆర్.684).

మాడభూషి నరసింహాచార్యులు

శ్రీకృష్ణుని రొమాన్సుతో వర్ణించడానికి వెయ్యి నాలుకలు చాలవుగాని మాడభూషి నరసింహాచార్యులు అనే ఆయన కృష్ణుని రెండు పెళ్లిళ్లను రెండు వివాహ ప్రబంధాలుగా చెప్పాడు. 'వల్లవీపల్లమోల్లాసం' అనే పేరిట నాగ్నజిత్తీ పరిణయాన్ని, మారుపేరు పెట్టకుండా సీదాగా రుక్మిణీ కల్యాణాన్నీ రచించాడు. వీటిలో మొదటిది వైజయంతి పత్రికలో ధారావాహికంగా మొదట అచ్చుపడింది. తరువాత పుస్తక రూపంలో వచ్చింది. ఈయన నూజివీటి సంస్థానం ఆశ్రితుడు. శోభనాద్రి అప్పారావుగారి ప్రేరణవల్ల వల్లవీపల్లవోల్లాసం రచించాడు. ఈ నరసింహాచార్యులుగారే నీలానిందా

నివారణమనే కావ్యం ఒకటి వ్రాశాడు. బహుశా అందులో సత్యభామ పెళ్లి ముచ్చట చెప్పారేమో. ''అభినవ పండిత రాయల''ని బిరుదు పొందిన మాడభూషి వెంకటాచార్యులు గారికి ఈయన తండ్రిగారు. రసికత్వంలో కూడా కాబోలు. ''మగువ తన కేళికా మందిరము వెడలెన్'' అని క్షేత్రయ్య నాయికను వర్ణించినట్టే నరసింహాచార్యులుగారు మొదట నాయకుణ్ణి ఇలా వర్ణించారు.

అతివ చన్నుంతుల నలరారు కస్తూరి
        యురము పై శ్రీవత్స సరణి మెరయ
సురత జాగరముచే సొక్కిన కన్దోయి
        వారి జాకృతి నొంది వన్నె కెక్క
గల్కి పల్మొనలచే గందిన కెమ్మోవి
        బింబ ఫలస్ఫూర్తి డంబు మీర
గాంత కస్తురి తిలకంబంటి యాననం
        బేణాంక తురితమై యింపు మీర
నెలత మణి హారమున నొక్కు లెలమి మేన
లలిత వనమాలికా చిహ్నముల వెలయ
గాంతపై మోహ సంభృత స్వాంతుడగుచు
గేళి సదనంబు వెడలె గోపాల మౌళి. (వల్లవీ.3-217)

చాలామంది కేళీ సదనం లోపల క్రీడలను వర్ణించగల వాళ్ళేగాని ఇలా బయట కొస్తున్నప్పుడు ఆ రూపాన్ని వర్ణించేటప్పుడే వాళ్ళ సత్తా బయట పడుతుంది.

సింగరాజు నాగభూషణం

వ్రాసిన పుస్తకాలు అసలు బయటపడితే కొందరి వైదుష్యమేమిటో తూకానికి తెలుస్తుంది. అజ్ఞాతంగా ఉన్న ఈ యుగం కవులలో సింగరాజు నాగభూషణం ఒకడు. ఈయన మూడాశ్వాసాల గౌరీ కల్యాణాన్ని ప్రబంధంగా చెప్పాడు. ఈ కథను వాయుదేవుడు మహామునులకు చెప్పాడట. శివుడు శృంగారచేష్టాయుక్తుడై ప్రమథ గణాల ''నొకరినొకరి ననేక నాటక సూత్ర వేషంబుల నాడుట కనుజ్ఞ'' ఇచ్చి ఉమా సమేతుడై చూశాడట. వాయుదేవుని ముఖతః గౌరీ కల్యాణం నుంచి కుమారసంభవం, తారకవధ దాకా కథనం చేసిన ఈ కావ్యంలో ఎంత ప్రాణవాయువు ఉందో చూడాలి. దీని ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.487)

బైరు నారాయణ

తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయంలో ''సత్యభామా కల్యాణం'' అనే ఒక ప్రబంధం ఉంది (తం.డి.276). దీనిని బైరు నారాయణ వ్రాశాడు. ఇతని తండ్రి పేరు జంగమనాయుడు. సోదరుడు వెంకటాద్రి (ఈయనే కృతి చెప్పించాడు). గురువు గుండ్లపూడి రామచంద్రయ్య గ్రంథం శిథిలం కావడంచేత ఇంతకన్నా వివరాలు తెలియవు. ఈ గ్రంథం సమగ్ర ప్రతి దొరికితేనేగాని కవిత్వం అంచనా కట్టడం సాధ్యం కాదు; జీవిత వివరాలు తెలుసుకోలేం.

పెద్దాడ నాగరాజు

(జననం 1760 - మరణం 1825). ఈ యుగంలో జీవిత వివరాలు తెలిసే కవులలో పెద్దాడ నాగరాజు ఒకడు. ఈయన మొదట సంపన్నుల ఆశ్రితునిగా వుండి క్రమేణా స్వతంత్ర వృత్తిని అలవర్చుకొన్నాడు. రాజమండ్రి ''అదాలత్కోర్టు''లోనూ, కుంఫిణీవారి ''ప్రావెన్షియల్ కోర్టు''లోనూ వకీలుగా ఉంటూ క్రీ.శ.1802 నుండి చాలా సంపన్ను డయ్యాడు. అంతకు ముందు మొగలితుర్రులో కలిదిండి వారి పోషణలో విద్వత్కవిగా ఉండేవాడు. వకీలు వృత్తిని చేపట్టాక కూడా చాలామంది జమీందారుల సత్కారాలను పొందుతూ ఉండేవాడు. తాను స్వయంగా కొన్ని దేవాలయ ప్రతిష్ఠలు చేశాడు. తమ్ముడు గంటలరాయుడుచేత తటాకాలు నిర్మింపచేశాడు (ఈ గంటల రాయుడుగారే కవుల చరిత్రను వ్రాసిన గురజాడ శ్రీరామమూర్తి తాతగారు).

సప్త సంతానాలలో ఇతరాలను ప్రతిష్ఠించిన నాగరాజు స్వయంగా కృతి చెప్పాడు. శకుంతలా పరిణయం అనే మూడాశ్వాసాల కావ్యం చెప్పాడు (దీనిని ఇతని ముని మనుమడు కొచ్చెర్లకోట రామచంద్ర వెంకట అప్పారావు 1900లో ప్రకటించాడు). ఈయన కవిత్వంలో మూడువంతులకంటె ఎక్కువగానే సంస్కృతముంటుందని ఇతని సంతతివారే చెప్తున్నారు. అయినా రచనల్లో కమ్మదనం లేకపోలేదు. ఎక్కడ ఏ మాట వాడాలో ఇతనికి తెలుసు. విశ్వామిత్రుని వశపర్చుకోవడానికి మేనక వీణ మీటుతూ పాడిన పాటను ఈయన ఇలా వర్ణించాడు.

అతి మాధుర్యరసైకమై శ్రవణ యోగ్యంబై ప్రతి ధ్వాన ఘూ
ర్ణిత దిక్కందరమై విచేష్టిత శకుంతీ బృందమై పల్లవ
ప్రతత స్థాణు కదంబమై నరరసార్ద్రంబై ద్రవీభూత సా
రతరాశ్మ వజ్రమై చెలంగె మృదులారావంబు తోరంబుగన్ (శకుంతల. 2-65)

ఈ పద్యంలో వాడిన మాటలకు చాలా ప్రయోజనాలు ఉన్నాయి. పుట్టబోయే బిడ్డను పెంచబోతున్న శకుంతీ బృందాన్ని, వజ్రసమానమైన ముని నిష్ఠనీళ్లు కారబోతోంది కాబట్టి ద్రవీభూత వజ్రాన్ని కవి చాలా నేర్పుగా పద్యంలో పెట్టినట్టు కనబడకుండా పెట్టాడు. తీరుబాటుగా గమనిస్తే ఇతని కవిత్వంలో సొగసులు కనబడతాయి.

నల్లాని నరసింహాచార్యులు

పెద్దాడ నాగరాజులాగ వివిధ శ్రీమంతుల చేత సత్కారాలను పొందిన కవులలో నల్లాని నరసింహాచార్యులు ఒకడు. ఎవరో చంద్రధరాధిపుడు ఇచ్చిన ''రూపికా సహస్రార్యమణి ప్రభూషణాలు'' ఈయన పుచ్చుకొన్నాడు. రాగవరుసను చక్కగా పురాణాలు చెప్పి చాలా బహుమానాలు పొందాడు. కాకర్లపూడి వారి వంశంలోని మర్లపాటి గోపాలరాజుగారు ఒక అగ్రహారం ఇస్తే ''పద్మినీ పరిణయం'' అనే నాలుగాశ్వాసాల కావ్యాన్ని వ్రాశాడు. ఆయనకే అంకితమిచ్చాడు. అయితే ఈ కావ్యం దేవుడు పురమాయించాడు. కలలో కవికి ఇలా చెప్పాడట.

''వినుమా కుమార తొల్లిటి కవి ప్రజనాథులు నేను విష్ణుచి
త్తుని సుత బెండ్లియాడుట మృదుస్థితి నీళబరి గ్రహించుటల్
వినుతి యొనర్చి రగ్రసతి నిర్మల సద్గుణ పద్మినీ కుమా
రిని గొనుటన్ రచింపరు ధురీణత నక్కథ విస్తరింపుమా!'' (ఆర్.177)

పూర్వులు చేయని పని చేయమని దేవుడు పురమాయించినా ఎంతటి ధురీణతతో అది నరసింహాచార్యులు నిర్వహించాడో తెలియదు. అయితే నెగ్గుకురాగల సమర్థుడే. కాకర్లపూడి వారి నోటంట ఇలా చెప్పించాడు.

''మునుపటి వారి కంటెనొక బుద్ధి సమేతుడు గల్గ బోవునే
యని మదినూహ సేయదగదందురు పెద్దలొనర్చినట్టి వ
స్తునికరముల్ త్యజించి కడు సుందర భంగి నపూర్వ వృత్తినా
ధునికులు సేయలెదె యతి దుర్లభ వాహన దేహజాలమున్'' (ఆర్.177)

నల్లాని నరసింహాచార్యులు అపూర్వ వృత్తితో ఆధునికంగా చేసిన కల్పనలు ఎంత సుందర భంగిగా ఉన్నాయో తెలియవు. ఇతని కావ్యం అచ్చుపడలేదు.

మండపాక పేరయ్య

కొందరి కావ్యాలు అచ్చుపడక మూలుగుతూ ఉంటే కొందరి కావ్యాలు పూర్తిగా నష్టమయ్యాయి. మండపాక పేరయ్య వ్రాసిన కుముద్వతీ పరిణయం, ఇందుమతీ పరిణయం అనే రెండు వివాహ ప్రబంధాల పేర్లు తెలుస్తున్నాయేగాని గ్రంథాలు ఎక్కడా దొరకవు. ఈయన నిరోష్ఠ్య దాశరథీ శతకాన్నీ, లక్ష్మీ నరసింహస్తుతీ వ్రాశాడట. అవి కూడా అంతరించి పోయాయి. ఈయన జమీందారీ యుగంలో ప్రఖ్యాతుడైన మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి తాత. కామయ్యగారి తండ్రి. ఈ ముగ్గురూ కవులే.

పోడూరి పెదరామయ్య

మండపాక వారి కుటుంబంలోలాగే పోడూరి వారి ఇంట్లో కూడా చాలామంది కవులు ఉండేవారు. అన్నదమ్ములు ముగ్గురు పరిణయ కావ్యాలు చెప్పడం గమనించదగ్గ విషయం. పోడూరి బాపన్న ఉషాపరిణయం రచించాడు. అతని తమ్ముడు పెదరామయ్య కౌసల్యా పరిణయం చెప్పాడు. వీళ్ళ తమ్ముడు చినరామయ్య నిరోష్ఠ్య జానకీ కల్యాణం వ్రాశాడు. ఈ మూడూ నష్టమయ్యాయి.

పెదరామయ్య వ్రాసిన శివరామాభ్యుదయం అనే ద్వర్థికావ్యంలో ఈ వివరాలు ఉన్నాయి. నాగ్నజిత్తీ పరిణయం చెప్పిన వల్లూరి సూరన్నకు పోడూరి రామన్నగారి కూతురును ఇచ్చారు. బహుశా చినరామన్నగారి అమ్మాయి కావచ్చును. పెదరామయ్య ''చిత్రయమకాంధ్ర సంస్కృత శ్లేష కవిత'' చెప్పగలవాడు. గురజాల పేరయ్యగారి ప్రోత్సాహంవల్ల శివరామాభ్యుదయం చెప్పాడు.

గురజాలవారి కుటుంబంలో చాలామంది కృతి భర్తలు ఉన్నారు. వాళ్ల వివరాలు చూడండి.

1. గురజాల పేరయ్యా	-	శివరామాభ్యుదయం
2. పార్వతీశ్వం	తండ్రి	పద్యగద్యాలు చాలా కృతి పొందాడు
3. యజ్ఞయ్యా	తాత	సప్త సంతానాలు పుచ్చుకొన్నాడు
4. మల్లప్ప సోమయాజి	ముత్తాత	దాక్షాయణీ పరిణయం కృతి భర్త
5. శ్రీరంగరాజు	కులపూర్వుడు	చమత్కార భారతం కృతి పతి.

గురజాలవాళ్లు అందుకొన్న కృతుల రచయితల పేర్లుగానీ, పోడూరివాళ్లు చెప్పిన పుస్తకాల ప్రతులుగానీ నేడు లభించవు.

కాణాదం పెద్దన

కల్యాణ కావ్యాలు వ్రాసిన కవులలో చాలామంది ఆ పుస్తకాల పేర్లలో పరిణయం అనే పేరు తగిలించలేదు. కాణాదం పెద్దన భద్రాకల్యాణాన్ని వ్రాసి ''ముకుందవిలాసం'' అని పేరు పెట్టాడు. ఈయన గద్వాల కవి. అధ్యాత్మ రామాయణాన్ని పూర్తిగానూ, యథాశ్లోక తాత్పర్య రామాయణంలో బాలకాండ రచించాడు. ఇతని ఇతర కృతుల గురించి, ఇతని ప్రతిభ గురించి ఇంతకు ముందు రామాయణ రచనల్లో చెప్పుకొన్నాం.

కాకరపర్తి బుచ్చిపాత్రయ్యా

కాకరపర్తివారి గురించి కూడా ఈ వ్యాసంలోనే ఇంతకుముందు ముచ్చటించుకొన్నాం. శశిరేఖాపరిణయం వ్రాసిన కాకరపర్తి కృష్ణయ్యాగారికి బుచ్చిపాత్రయ్యా అనే కుమారుడున్నాడు. ఈయన సత్యవతీ పరిణయం అనే అయిదాశ్వాసాల కావ్యం వ్రాశాడు. గొడేవారికి అంకితం ఈయదలిచాడు. అయితే ఆ కోరిక తీరేలోగా మరణించాడు. ఇతని సోదరపుత్రుడూ, మనుమడూ కృత్యాది పద్యాలు వ్రాసి గొడే నారాయణగజపతిగారికి అంకితమిచ్చాడు. బుచ్చిపాత్రయ్యా కవిత్వం నిర్దుష్టమై హృద్యంగా ఉందని వీరేశలింగంగారు చెప్పారు.[10]

పంతుల బ్రహ్మదేవయ్యా

ఇతని కవిత్వం హృద్యంగా ఉంటుందని ఇతరులు చెప్తే అందంగా ఉంటుంది. ఎవరికివారే నేను ''ప్రతి పద్య హృద్య ప్రబంధాను సంధాన చాతుర్యంగలవాణ్ణి'' అని చెప్పుకొంటే అన్నమాట నిలబెట్టుకోవాలి. మన కవులలో చాలామంది గద్యలో చాలా బిరుదులు వేసుకొంటారు. కొందరే నిజంగా వాటికి అర్హులు. అయితే మన ప్రాచీనులు చాలామంది స్వయంగా బిరుదులు పెట్టుకోరు. ఏ రాజో ఇచ్చేవాడు. గండపెండేరాలు మకర కుండలాలు ఇచ్చేవారు. పంతుల బ్రహ్మదేవయ్యా అనే కవికి పార్వతీపురం జమీందార్లువారు చాలా ''బిరుదాంకిత వలయాలు'' ఇచ్చారు. శివనారాయణ ధాత్రాజుగారిపై బ్రహ్మదేవయ్యా చాలా కృతులు చెప్పాడు. వారి కుమారుడు ధనుంజయ ధాత్రాజుగారిమీద పాటలు, పద్యాలు రచించాడు. ఆయన ప్రేరణవల్ల ఇందుమతీ పరిణయాన్ని కూడా మూడాశ్వాసాల కావ్యంగా చెప్పాడు. ఆ రాజుమీద ఒక శతకం కూడా రచించాడు. పార్వతీపురం జమీందార్లేకాక ఉర్లాం జమీందారు బసవరాజుగారు కూడా ఈ బ్రహ్మన్నగారిని సత్కరించి ''పంతుల బ్రహ్మన్న సాటి పండితుడేడీ'' అని

10. ఆంధ్ర కవుల చరిత్ర, 3వ భాగం, పుట 316

ప్రశంసించారు. అయితే ఇతర జమీందార్ల ఈవి బ్రహ్మన్నకు సరిపోలేదు కాబోలు. ఇందుమతీ పరిణయంలో ఇలా చెప్పాడు.

రాణన్ మించు విశాఖపట్టణపు జిల్లాలో జమీందారుల
క్షీణౌదార్యమునన్ రసజ్ఞ గుణశ్రీ దాదృశుల్ గామి దా
ర్కాణైయుండుట జేత మత్సుకవితా కన్యాలలామంబు వి
న్నాణంబొప్పగ శ్రీ ధనంజయ ధరానాథున్ వరించెన్ దమిన్ (ఆర్.569)

ఈ ధనంజయ ధాత్రాజు విద్యారసికశేఖరుడని కూడా పంతుల బ్రహ్మన్న పొగడాడు. ఈ కవి ఇతర బిరుదులేకాక కవిసార్వభౌమ బిరుదు కూడా తన గద్యలో చెప్పుకొన్నాడు. ఇంతటి కవిసార్వభౌముడు ఈ ఇందుమతీ పరిణయాన్ని ముద్దు సీతారామస్వామి సహాయంతో చెప్పవలసి వచ్చింది. కారణం తెలియదు. అయితే కృతి సహాయకుని గురించి గద్యలోనూ, గ్రంథంలోనూ చెప్పుకొనడంలోనే కవి యొక్క మంచితనం తేటతెల్లమవుతోంది. ఈ కావ్యం అచ్చుపడలేదు.

కైప మాయన్న

ఈ యుగంలో చాలామంది కవులు శబ్దాలంకారాల వైపు మొగ్గారు. వాళ్ళలో కైపమాయన్న ఒకడు. ఈయన ఉషాకల్యాణం అనే అయిదాశ్వాసాల శృంగార ప్రబంధాన్ని రచించాడు. ఇతని తండ్రి మహాదేవ శాస్త్రి సర్వజ్ఞుడట. ఇతని తాత లింగన కవీంద్రుడట. అయితే ఆయన వ్రాసిన గ్రంథాలేమిటో తెలియవు. ఉషా కల్యాణం కొంతవరకు రసపుష్టి కలదిగానే ఉన్నదంటూ వీరేశలింగంగారు చెప్పారు.[11] ఆయన ఉదహరించిన పద్యాలలో ఒకటి కూర్మపురాణం వ్రాసిన రాజలింగకవిని అనుసరిస్తూ ఉంది.[12]

''భంబులు గోళ్లు పల్లవ నిభంబులు కాళ్లు మనోజ కాహళా
భంబులు జంఘకార కరభంబులు సక్థులు శతకుంభ కుం
భంబులు రోజముల్ దవనభంబులు కంఠవలగ్నముల్ ద్విరే
భంబులు కుంతలంబులు శుభంబు లుషాసతి లక్షణంబుల్''

ఉషాసతి లక్షణాలు ఎలాగున్నా ఈ ఉషా కల్యాణంలో లక్షణ విరుద్ధమైన ప్రయోగాలున్నాయని రొటీను కంప్లయింటు వీరేశలింగంగారు చేశారు. ఈ పుస్తకం ఒకసారి అచ్చుపడింది. ఎవరు వేశారో, ఎప్పుడు వేశారో ఆంధ్రగ్రంథమాల వారి ఆంధ్రవాఙ్మయ సూచికలో లేదు.

ఉన్నవ యోగానందం

ఈ యుగంలో కొన్ని కావ్యాలను ఆ కర్తల సంతతివాళ్లో, మిత్రులో ఇటీవల ప్రచురించారు. ఉన్నవ యోగానందం రచించిన ఈ పద్మినీ పరిణయం అనే కావ్యాన్ని 1916లో ఎవరో అచ్చు వేశారు.[13] ఈయన ఉన్నవ రాజగోపాల శతకం, సభాపతి

11. ఆంధ్ర కవుల చరిత్ర – 3వ భాగం, పుట 181
12. ఆరవీటి రాజుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి, 2003
13. ఇది వచన కావ్యమని కాశీనాథుని నాగేశ్వరరావుగారి ఆంధ్రవాఙ్మయ సూచిక చెప్తోంది. (పుట 106)

లక్షణాలు వ్రాశాడు. ''అస్మన్మహాభాగధేయ సారస్వతదివిజ తరువునందు సత్ఫల ముదయంబు నొందు కొరకు'' రాజగోపాల శతకాన్ని వ్రాస్తున్నానని చెప్పాడు. పద్మినీ పరిణయం దీని తరువాత కాచిన కాయో, ముందు మగ్గిన పండో తెలియదు. ఇతడు గుంటూరు దగ్గరనున్న ఉన్నవ గ్రామంవాడు.

అల్లమరాజు రామకృష్ణయ్య

పిఠాపురం సమీపాన ఉన్న చేబ్రోలు గ్రామంలో అల్లమరాజు వారి పండిత కుటుంబం ఉంది. ఆ వంశంలోని రామకృష్ణయ్య చాలా గ్రంథాలు వ్రాశాడు (అందులో మూడు పరిణయ కావ్యాలు). చిత్రకవిత్వంలో గట్టివాడు. ఓష్ఠ్య నిరోష్ఠ్యాలూ ముక్తపద గ్రస్తాలూ, సింహావలోకనా పదాలూ మొదలైనవీ శబ్దాలంకార గారడీలు చేయగలడు. ''ఏకైకాహోరాత్ర శతగ్రంథ కల్పనాభి చిత్ర'' అనే బిరుదును గద్యలో చెప్పుకొన్నాడు. ఈయన వ్రాసిన 13 గ్రంథాల వివరాలు మాత్రం తెలుస్తున్నాయి. వాటిని అకారాదిగా చూడండి.

1. అచ్చు తెలుగు భాగవతం
2. అధ్యాత్మ రామాయణం
3. కవి చకోర చంద్రోదయం, (రచన 1835)
4. గౌతమీ మాహాత్మ్యం
5. ద్రౌపదీ పరిణయం
6. మదాలసా పరిణయం (డొంకిన సోమయ్య ప్రేరణవల్ల కుంతి మాధవస్వామికి అంకితం ఇచ్చాడు. అముద్రితం. (ఆర్.268)
7. రామకృష్ణీయం (ఆంధ్ర శబ్ద చింతామణికి వ్యాఖ్యానం. సకల జనులకు దెలిసెడి సరణిగాగ, బాల బోధమగునట్లు వ్రాస్తానని కవి చెప్పాడు)
8. వైనతేయ విజయం
9. శంతను విలాసం (రచన.1841 ఇందులో శంతనుడు గంగా సత్యవతులను పెళ్లాడిన కథ చెప్పాడు. అముద్రితం. (ఆర్.1062)
10. సత్యభామా విలాసం
11. సుకవి మనోరంజనం
12. సుశోభా వివాహం
13. హనుమదాఖ్యానం

అల్లమరాజు రామకృష్ణయ్య ఇన్ని గ్రంథాలు వ్రాసినా వీటిలో అన్నీ ప్రచారంలోనికి రాలేదు. ''కవి చకోర చంద్రోదయం'' పేరు మాత్రం చెప్పుకొంటారు. ఇతని కవిత్వం నిర్దుష్టం కాకపోయినా ప్రౌఢమయి, హృదయాహ్లాదకరంగా ఉందని వీరేశలింగంగారు చెప్పారు.[14] ఈ కవి సోదరుడూ, కుమారులూ కవులే. పిఠాపురం సంస్థానంలో ఉన్నారు.

14. ఆంధ్ర కవుల చరిత్ర - 3వ భాగం, పుట 312.

తూము రామచంద్రారెడ్డి

కొంతమంది కవులు సంస్థానాల నాశ్రయించుకొని ఉంటే కొందరు సంస్థానాధీశ్వరులు, దేశముఖులూ స్వయంగా కవిత్వం చెప్పారు. ఈ వంశంలో రామచంద్రారెడ్డి సాహితీపరుడు ఉత్కల రంగాచార్యులగారి శిష్యుడు. ఆయన సహాయం చేస్తే ''అలమేలు మంగా పరిణయం'' అనే నాలుగాశ్వాసాల కావ్యం వ్రాశాడు. ఒకనాడు వైకుంఠంలో లక్ష్మీనారాయణులకు వాగ్వివాదం వచ్చింది. స్వామివారు అలిగి తూము వారి సీమలోనే ఒక కొండగుహలో దాక్కున్నారు. తూము రామారెడ్డిగారు చూడడానికి వెళితే ''ఆలి ఎడబాటు'' భరించలేనని స్వామిగారు గోడు పెట్టుకొన్నారు. ఈ పుక్కిటి పురాణాలను ఈ కవి సగర్వంగా వ్రాశాడు (ఈ పుస్తకం 1949లో ఇప్పటి తూమువారు అచ్చువేశారు). ఈ కవి ప్రతిష్ఠించిన ఒక దేవాలయానికి దివాన్ చందూలాల్ ఒక గ్రామాన్ని ఇచ్చాడు. రామచంద్రారెడ్డికి పరశురామారెడ్డి అనే కుమారుడు ఉన్నాడు. ఇతడే అలమేలు మంగా పరిణయం వ్రాశాడని పరిశోధకులు భ్రమపడినట్టు ఉంది.[15]

రాయరఘునాథ తొండమాను

మహబూబు నగరం జిల్లాలో దేశముఖులు గ్రంథరచన చేస్తే, పుదుక్కోటలో సంస్థానాధిపతి చక్కని కావ్య రచనలు చేశాడు.

ఈయన 1769 నుంచి 1789 దాకా పుదుక్కోటను పాలించాడు. ఇతనికి రాజ్యానికి వచ్చినప్పుడు 31 సంవత్సరాల వయస్సు పదకొండు మంది భార్యలు. వీళ్లలో ఒక్కరే సంతానవతి అయింది. ఆ పుట్టినబిడ్డ కూడా ఆడపిల్ల. రాయరఘునాథునికి కావ్య కన్యకలు కూడా ఉన్నారు. పార్వతీ పరిణయం అనే చక్కని ప్రబంధాన్ని వ్రాశాడు. సవరం చిననారాయణ, రఘునాథ నాయకుడు మొదలైన ఘటికులు ఎంత సరసంగా జాతి వార్తాచమత్కారాలతో రచన చేశారో అంతటి గడుసుపోకడలతో, చమత్కారాలతో ఈ పార్వతీ పరిణయాన్ని రాయరఘునాథుడు రచించాడు. తన ఆస్థానకవి నుదురుపాటి వెంకన్నచేత గడ్డు సమస్యలు ఇప్పించుకొని వాటిని చాకచక్యంగా పూరించేవాడు. ఇతని సమస్యలన్నింటినీ ''కవి జనోజ్జీవిని'' అనే పేరుతో కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు పుస్తకరూపంలో వేశారు. ఈ సమస్యా పూరణంలో రాయరఘునాథుని చాకచక్యం తెలుస్తున్నా నిజంగా అతని రసహృదయం పార్వతీ పరిణయంలో ప్రత్యక్షమవుతోంది. ఇంత ప్రతిభావంతమైన కావ్యం ఈ యుగంలో అరుదు (ఇది అచ్చుపడింది).

పిండిప్రోలు లక్ష్మన్న

ఈ యుగంలో పాండిత్యం ఏపాటిదైనా నోరుపెట్టుకొని నెగ్గుకొచ్చిన వాళ్లలో పిండిప్రోలు లక్ష్మన్నగారు మహా ఉద్దండ పిండం. పెళ్ళిళ్లలో సంభావనల దగ్గర నుంచి పెద్ద పెద్ద దావాల దాకా అందరితో జగడాలు పెట్టుకొన్నవాడే రావు ధర్మారావు అనే

15. గోలకొండ కవుల సంచిక, పుట 402.

గుత్తదారుడు. ఇతని లంకపొలాన్ని ఆక్రమించుకొంటే కోపంతో ''రావణదమ్మీయం'' అనే రెండర్థాల తిట్టు కావ్యాన్ని లచ్చన్న వ్రాశాడు. తన మేనల్లుడు చింతలూరి మంగన్నకు విరోధంగా తీర్పు ఇచ్చినందుకు పండిత సదరమీన్ అయిన శంకరమంచి అనంతశాస్త్రిని శ్లేషార్థాలతో తిట్టాడు. అయితే తిట్టు కవిత్వం బెడిసికొట్టినందువల్ల అప్పట్లో రాజమండ్రిలో జడ్జిగా ఉన్న బ్రౌను దొరగారిని మాత్రం పొగడుతూ లచ్చన్న అర్జీలు పెట్టుకొన్నాడు.

ఒక్క ''రావణదమ్మీయం'' తప్ప ఇంకే గ్రంథాన్నీ పిండిప్రోలు లచ్చన్న వ్రాయలేదని వీరేశలింగం పంతులుగారు అభిప్రాయపడ్డారు. చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రిగారు కూడా ''లక్ష్మణ కవిగారిది మరో గ్రంథం యేదిన్నీ వేలు మడచి పేర్కోదగ్గది కనబడడమే లేదు'' అన్నారు.[16] అయితే పెద్దాడ నాగరాజు వ్రాసిన శకుంతలా పరిణయానికి పీఠిక వ్రాస్తూ పోలవరం జమీందారుగారు ''గోదావరీ మండలమున గుయ్యేటి గ్రామవాసియగు పిండిప్రోలు లక్ష్మణకవి'' ఒక శకుంతలా పరిణయం వ్రాశాడని చెప్పారు.[17] దీనివల్ల లచ్చన్న రచనలలో వేలుమడచి చెప్పడానికి మరో గ్రంథం కనబడుతోంది. అయితే ఈ శకుంతల పరిణయం నష్టమైనట్టుంది. దొరికితే ''పిండిప్రోలువారి దండితనం'' విశదమయ్యేది.

వీణం లక్ష్మీపతి

కొందరి గ్రంథాలు దొరికితే వాళ్ళ తప్పులు మాత్రమే బయటపడతాయి. వీణం లక్ష్మీపతి అనే అతడు అభిమన్యు పరిణయం అనే గ్రంథం వ్రాశాడు. ''ఇతని కవిత్వమంత మంచిది కాదు. అందు ఛందోవ్యాకరణ దోషములనేకములు కనబడుచున్నవి'' అని వీరేశలింగంగారు తీర్పు చెప్పారు.[18] ఈ గ్రంథానికి మూడు ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి (ఆర్.675. డి. 381, డి.382). ఈ కవి తిరుపతి వెంకటేశ్వరుల దయవల్ల కవిత్వం చెప్పగలిగాడట. తప్పులు లేని కవిత్వాన్ని ప్రసాదించకపోవడం దేవుని తప్పే అని సరిపెట్టుకోవాలి.

కాళ్ళకూరి లక్ష్మీపతి

విశాఖపట్టణం జిల్లాలో కాళ్ళకూరి వారిది మంచి విద్వాంసుల కుటుంబం. ఆరేడు తరాలుగా ఆ కుటుంబంలో కవులు కనబడుతున్నారు. కాళ్లకూరి నాగయ్యా అనే ఆయన కృష్ణార్జున సంవాదం అనే ప్రౌఢకావ్యం వ్రాశాడు. ఇతని కుమారుడు లక్ష్మీపతి భద్రాకల్యాణం అనే ప్రబంధం చెప్పాడు. వీళ్లు వంశకర్తలుగా ఉన్న ఈ కుటుంబంలో ఎన్నోతరం వాడోకాని కాళ్ళకూరి పేరయ్య ''రసవినోదం'' అనే కావ్యం వ్రాశాడు. ఇతని కొడుకు కాళ్ళకూరి సూర్యసీతారామ చరిత్ర అనే గ్రంథం వ్రాశాడు. ఇతని కొడుకు కాళ్ళకూరి గౌరీకాంతం ధర్మనందన విలాసం అనే శృంగార ప్రబంధం వ్రాశాడు.

16. కథలు, గాథలు : పిండిప్రోలు వారి దండితనం, పుట.4
17. శకుంతలా పరిణయం - ఆనంద ముద్రాక్షరశాల, 1900. పీఠిక - కొచ్చెర్లకోట రామచంద్ర వెంకట కృష్ణారావు పుట.4
18. ఆంధ్ర కవుల చరిత్ర, 3వ భాగం, పుట.241

గౌరీకాంతం క్రీ.శ.1815 ప్రాంతాలవాడు. లక్ష్మీపతి తన వంశకర్త అని చెప్పుకొన్నా ఎన్నితరాల పూర్వుడో సరిగ్గా గౌరీకాంతం చెప్పలేదు. ముత్తాత కావచ్చునేమో.

కాళ్ళకూరి లక్ష్మీపతి తన భద్రాకల్యాణాన్ని కాశీ విశ్వేశ్వరునికి అంకితమిచ్చాడు. సమకాలిక వ్యక్తులను ఎవరినీ పేర్కొనలేదు. ఒక్క గురువును తప్ప. ఈ కవి దెందులూరి తెలగన్నగారి శిష్యుడు. ఈయన ఎప్పటివాడో తెలియదు. భద్రాకల్యాణం సమగ్రమేకాని అముద్రితం. దీని ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.584)

తక్కెళ్ళపాటి లింగన్న

ఏకాలంవాడో సరిగ్గా నిర్ణయించని కవులలో తక్కెళ్ళపాటి లింగన్న ఒకడు. ఇతడు యౌవనంలో మోహినీవిలాసం, ప్రౌఢవయసులో సూర్యతనయా పరిణయం, ఆ తరువాత విద్యుత్ప్రభావిలాసం అనే యక్షగానం, అరవైయేళ్ళు వచ్చాక ఉత్తర హరిశ్చంద్ర కథా చెప్పాడు. వీటిలో ఒక్క యక్షగానం తప్ప తక్కిన మూడు గ్రంథాలు దొరుకుతున్నాయి. వాటి ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. మదనమోహినీ విలాసాన్ని దేవునికి అంకితమిస్తూ ఈ పద్యాన్ని లింగన చెప్పాడు.

> ''మెచ్చుట లేదు పొచ్చెములు మిక్కిలి యెంతురు, కాని మెచ్చిరే
> నిచ్చుట లేద యిచ్చిన నొకించుకగాని ఘనం బెరుంగరీ
> యిచ్చునరేశులందు ఫలమేమియటంచును భక్తిముక్తి దా
> నిచ్చు రమాధినాథునకు నిచ్చెను లింగన మంత్రి యీకృతిన్'' (ఆర్.592)

మదనమోహినీ విలాసంలో నలకూబరుని ప్రణయం వర్ణించాడు. దీని తరువాత చెప్పిన సూర్యతనయాపరిణయంలో దేవునిచేత తొలి కృతిని ఇలా లింగన పొగిడించుకున్నాడు.

> ''ఉన్నవి యె శబ్దచిత్రముల్ మిన్నగాగ
> ఘనత నీవలె శృంగార కవిత జెప్ప
> నేర్తురయ్య మదన మోహినీ విలాస
> కథ రచించిన జాణవు కావె నీవు'' (డి.910)

శృంగార కవిత చెప్పడంలో జాణననుకొనే లింగన్న సూర్య తనయాపరిణయం అనే పేర కాళిందీ కల్యాణాన్ని చెప్పాడు. ఈ కావ్యం అసమగ్రంగా లభిస్తోంది. పంచమాశ్వాసంలో కొంతదాకే దొరికింది. దీని తరువాత చెప్పిన ఉత్తర హరిశ్చంద్ర మాత్రం సమగ్రమే (డి.425). లింగన్న తాను జాణనని చెప్పుకొన్నా పరిశోధకులు అలా భావించడం లేదు. ''ఇతనిది రసవంతమైన ప్రౌఢ కవిత్వము కాదు'' అని ఒక్కమాటలో వీరేశలింగంగారు తేల్చేశారు.[19] ఇతని కాలం ఎప్పుడో నిశ్చయంగా చెప్పలేమని వీరేశలింగంగారు అన్నారు గాని సూర్యతనయా పరిణయంలో ఆధారాలు కనబడుతున్నాయి. దానిలో తన తండ్రి గురించి ఇలా చెప్పుకొన్నాడు.

---

19. ఆంధ్ర కవుల చరిత్ర, 3వ భాగం, పుట 188

''ప్రబలె వెల్గోటి కొండలరాయనృపతి
మన్నన జెలంగి యమిత సంపన్నుడగుచు
మహిత సత్కీర్తి చిట్టయామాత్య సుతుడు
ఘనుడు తక్కెళ్ళపాటి వేంకట విభుండు'' (డి.910)

ఈ పద్యంలోని వెలుగోటికొండలరావుగారి కాలం తేలితే తక్కెళ్ళపాటి లింగన్నకాలం తేలినట్టే.

చాగంటి వెంకట కృష్ణయ్య

ఏ కవైనా తన కావ్యంలో సమకాలిక కవులను పేర్కొంటే అతని కాల నిర్ణయం సులభమవుతుంది. చాగంటి వెంకటకృష్ణయ్య అనే ఆయన హైమవతీ పరిణయం వ్రాశాడు. అందులో శిష్ట కృష్ణమూర్తిని ఇష్టునిగా ప్రశంసించాడు. అంటే గ్రంథకర్త క్రీ.శ. 1850 లోపువాడు. ఈ కాలంలోని చాలామందిలాగే పార్వతీ పరిణయ కథను వ్రాశాడు. హిమవంతుని ఇంట్లో పార్వతి పుట్టడం దగ్గర్నుంచి, పరమేశ్వరుని చేపట్టడం దాకా మూడాశ్వాసాలలో వర్ణించాడు. ఈ కవి కర్రా అప్పయ్యశాస్త్రిగారి శిష్యుడు. తన గురువుగారు రసికాధీసుడని, ఎప్పుడూ ఎందరో శిష్యులకు నాటకాది శాస్త్రాలలోని నానార్థ భావాలను బోధించే విద్యాపూర్ణుడని చాగంటి కృష్ణయ్య నుతించాడు. గురువుగారి దగ్గర నేర్చుకొన్న నాటకీయత ఈ గ్రంథంలో ఎంత ఉందో తెలియదు. ఇది అచ్చుపడలేదు. దీని ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. (ఆర్.77; ఆర్.554)

పులఖండం వెంకటకృష్ణయ్య

శ్రీకృష్ణుని అష్టభార్యలలో జాంబవతి ఒకర్తె. ఈమె వివాహ కథను పులఖండం వెంకటకృష్ణయ్య అనే కవి అయిదాశ్వాసాలలో చెప్పాడు. ఇతని జాంబవతీపరిణయం సమగ్రమేకాని అముద్రితం. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఒక కాగితం ప్రతి ఉంది (ఆర్.558). ఎప్పటివాడో, ఏ ప్రాంతాలవాడో తెలియదు. ఇతర రచనలు ఏం చేశాడో తెలియదు. ''వర్ణనకెక్కి జగంబునందు బెంపారయ సాధు బాంధవ సుధావళి మిత్రుడ''నని కవి చెప్పుకొన్నాడు. బంధుకోటిలో పేరు వచ్చినా సాహిత్యలోకంలో చోటు చేసుకొన్నట్టు లేదు.

గోపీనాథం వెంకయ్యశాస్త్రులు

ఈ యుగంలో సాహిత్యలోకంలో బాగా పేరు పొందినవాడు గోపీనాథం వెంకయ్యశాస్త్రులు. వాల్మీకి రామాయణాన్ని ఎక్కువ తక్కువలు లేకుండా ఆంధ్రీకరిస్తానని పంతంపెట్టి రచన చేసిన ఈయన ఇతర కృతులు చాలా చెప్పాడు. అందులో రాధికా పరిణయం ఒకటి. ఇది వెలుగు చూసినట్టు లేదు.

కోనపల్లి వెంకట రంగయ్య

ప్రసిద్ధుల కావ్యాలే కొన్ని వెలుగు చూడకపోతే ఇక ఇతరుల మాట చెప్పక్కర్లేదు. కొన్ని గ్రంథాలు లభిస్తున్నా వాటిలో అవతారికలు లేకపోతే కవి గురించి ఏమీ తెలియదు.

కోనపల్లి వెంకట రంగయ్య అనే అతడు శశిరేఖా పరిణయాన్ని మూడాశ్వాసాలలో వ్రాశాడు (ఆర్.566). దీనికి తాడిచర్ల శేషయ్య సహాయం చేశాడు (ఈ సంగతి కవిగద్యలో చెప్పాడు). ఈ గ్రంథాన్ని కోనపల్లి తిరుమలేశ్వరునికి కవి అంకితం ఇచ్చాడు. ఇంతకన్నా వివరాలేం తెలియవు.

మరింగంటి వెంకట నరసింహాచార్యులు

ఈ యుగంలో శశిరేఖా పరిణయాన్ని వ్రాసిన ఇంకొక కవి మరింగంటి నరసింహాచార్యులు. అయితే తన గ్రంథాన్ని ఈయన తాళాంక నందినీ పరిణయం అని చెప్పాడు. బలరాముని కేతనంపై తాటిచెట్టు ఉంటుంది. అందుచేత అతడు తాళాంకుడు. మరింగంటి కవులు తమ కావ్యాలకు ఇలాంటి పేర్లు పెట్టడంలో ఘనులు. ఒక నరసింహాచార్యులు దుర్యోధనుడి పెళ్ళి కథ వ్రాసి ''చిలువ పడిగ రేని పెరణం'' అని పేరుపెట్టాడు. దుర్యోధనుడు నాగకేతనుడు. అచ్చ తెనుగు కావ్యం కనుక సర్పకేతనాన్ని కవి ''చిలువపడిగె''ను చేశాడు. ఈయన మరింగంటి కవులలో పెదనరసింహాచార్యులు.[20] ఇతనికి రెండుతరాల తరువాత ఇంకో నరసింహాచార్యులు కూడా గ్రంథరచన చేశాడు. రెండో నరసింహాచార్యులు తాళాంక నందినీ పరిణయమేకాక ఇందిరాల భాగవతం అనే యక్షగానం వ్రాశాడు. మొదటిదానిలాగే ఇది కూడా అముద్రితం. అయితే మొదటి గ్రంథం తాలూకు ప్రతులు దేశంలో కొన్ని ఉన్నాయి. రెండోదానిని మరింగంటి వారి వంశంలోని వాళ్ళే ఇంకా చూడలేదు. తాళాంకనందినీ పరిణయం గూర్చి ఇటీవలనే పరిశోధనలు వస్తున్నాయి.[21] కవి దీనిని 1842లో రచించాడు. ఇతని అన్నగారు కేశవస్వామి శతకం వ్రాశారు.

రేమెల వెంకటరావు

తెలంగాణాలో మరింగంటి నరసింహాచార్యులు అభిమన్యుడికి శశిరేఖతో పెళ్ళిని వర్ణిస్తే పిఠాపుర పరిసరాల్లో రేమెల వెంకటరావు అభిమన్యుడికి ఇంకో పెళ్ళి చేశాడు. ఈయన ఉత్తరా పరిణయం అనే మూడాశ్వాసాల కావ్యాన్ని వ్రాశాడు. మనిషి మంచి మాటకారి, ఇతనిదీ, పిండిప్రోలు లక్ష్మణకవిదీ ఒకే ఊరు. కుయ్యేరు. రేమెలవారు పద్మనాయకులైన ఇద్దరిదీ బావమరదుల వరస. ఒకసారి ఏదో సభలో ఆలస్యంగా వచ్చిన వెంకటరావుకు చోటు ఇస్తూ లక్ష్మణకవి ''దొరలకు చోటు చాలా'' అని అడిగాడు. ఈయన దొరలకు అంటే ఒత్తిగిల్లకు అనే అర్థం ఉద్దేశించాడు. ఇలాంటి సంభాషణా చాతుర్యంగల వెంకటరావు చాలా కొద్దికాలమే జీవించాడు. క్రీ.శ. 1820 ప్రాంతాలలో పుట్టి 1847లోనే పోయాడు. ఆయుష్షు ఉంటే ఇంకా ఎన్ని గ్రంథాలు వ్రాసేవాడో అని చింతించక తప్పదు. ఉత్తరాపరిణయం చక్కని కావ్యం అని పరిశోధకుల అభిప్రాయం.[22] ఇది అచ్చుపడింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు పీఠిక వ్రాశారు. రేమెల వెంకటరావుని పిఠాపురం మహారాజు నీలాద్రి రాయనింగారు ఆదరించి పోషించారు.

---

20. మరింగంటి పెదనరసింహాచార్యుల గురించి కడపటి రాజుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం రెండవ సంపుటి, 2003
21. భారతి - 1967 నవంబరు, డిసెంబరు సంచికలు.
22. ఆంధ్ర రచయితలు - మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి - పుట.41

నుదురుపాటి వెంకన్న

నల్లగొండ జిల్లాలో మరింగంటి కవులది ఎంతటి ప్రసిద్ధ పండిత కుటుంబమో పుదుక్కోట సంస్థానంలో నుదురుపాటివారు అంత కీర్తిని పొందారు. ఈ ప్రముఖులలో వెంకన్న ఆద్యుడు. రాయరఘునాథ తొండమానుకు ఆశ్రితుడు. ఎన్నో గడ్డు సమస్యలు కల్పించి తన ప్రభువుకు ఇచ్చేవాడు. రాయ రఘునాథుడు ఒక పార్వతీ పరిణయాన్ని వ్రాశాడు. నుదురుపాటి వెంకన్న ఈ ఆరాశ్వాసాల గ్రంథాన్ని వ్రాసి తన పోషకునికి కర్తృత్వాన్ని ధారపోసినట్టు చెప్పుకొంటారు.[23] నిజం ఇంకా నిలకడగా తేలలేదు.

అయితే నుదురుపాటి వెంకన్న పార్వతీ పరిణయాన్ని యక్షగానంగా రచించాడు. దాని ప్రతి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యాలయంలో ఉంది.[24] ఇతడు ఇంకా చాలా ఇతర కృతులు చెప్పాడు. వాటి వివరాలు

1. ఆంధ్ర భాషార్ణవం	(పద్యరూపంలో నిఘంటువు అచ్చుపడింది)
2. దేవమల్లచరిత్ర	(మల్లుల కుల పురాణం డి.532)
3. రఘునాథీయం	(రాయరఘునాథునికి అంకితం. అలంకారగ్రంథం, కాకినాడలో ప్రతి ఉంది. చూ. పరిషత్పత్రిక సంపుటి. 3, పుట.311, నరసభూపాలీయంలాగా మనోహరంగా ఉందని పరిశోధకుల అంచనా)
4. పార్వతీ కల్యాణం	(యక్షగానం. దీని ప్రతికూడా కాకినాడలో ఉంది.)
5. బృహన్నాయక దండకం	(పుదుక్కోట అధిపతుల ఇలవేల్పు పైన చెప్పిన డి.డి.1990)

నుదురుపాటి వెంకన్న తన దేవమల్ల చరిత్రలో తాను ''ఆసేతు హిమాచల ఖ్యాతుడ''నని చెప్పుకొన్నాడు. ఇతనికి మహోద్దండికవి అనే బిరుదు ఉంది. ఇతని కీర్తి హిమాచలందాకా వ్యాపించిందో లేదోగాని రెండు తరాల కిందట ఇతడు పరిశోధకుల దృష్టిలో పడ్డాడు.

శృంగార కవి తిరుమలనాథం

దక్షిణాదిని ఉన్న కవులలో చాలామంది ఇటీవలనే పరిశోధకుల దృష్టిలోకి వచ్చారు. వాళ్లలో శృంగార కవి తిరుమలనాథం ఒకడు. ఈయన కూడా నుదురుపాటి వెంకన్నలాగా మల్లుల కుల పురాణాన్ని వ్రాశాడు. పరమ భాగవత చరిత్ర, పరమార్థ దీపిక, పద్మినీ పరిణయం అనే మూడు కావ్యాలు కూడా చెప్పాడు. అయితే ఇవన్నీ నష్టమయ్యాయి. ఇతడు వ్రాసిన నాచికేతోపాఖ్యానం అనే ద్విపద కావ్యం ఒక్కటే బయటపడింది.[25] దీనిని తంజావూరులోని మల్లుల ప్రోత్సాహంతో తిరుమలనాథం వ్రాశాడు. పద్మినీ పరిణయం దీనిలాగే ద్విపద కావ్యమో, పద్య కావ్యమో తెలియదు.

23. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక. సంపుటి.3, పుట.312
24. అదే పత్రిక – అదే పుట.
25. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం – నిడదవోలు వెంకటరావుగారు పుట.289

చామర్తి సుందరశేషగిరిరావు

ఈ యుగంలో కాళిందీ పరిణయాన్ని చెప్పిన వాళ్లలో చామర్తి శేషగిరిరావు మూడోవాడు. ఈయన మంచి లౌకికుడు కాబోలు. అఘటన చాతురీసామర్థ్యాలు సమారంభిత యుక్త కార్యనిర్వాహకత్వం తనకు ఉన్నట్టు గద్యలో చెప్పుకొన్నాడు. అయినా గ్రంథంలో ''భూభాగమునందు స్వస్తవము భావ్యముగాదని'' తన గొప్పలు ''పల్కజాలన''న్నాడు. ఇతనికి చాలామంది ధీరశిష్యులున్నారట. ఇతని కాళిందీ పరిణయం అయిదాశ్వాసాల శృంగార ప్రబంధం. సమగ్రమేగాని అముద్రితం. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఒక ప్రతి ఉంది. (ఆర్.499)

వాడాల శేషాచార్యులు

గద్వాల సంస్థానంలో వాడాల శేషాచార్యులు అనే ఆయన కూడా ఆస్థానకవిగా ఉండేవాడు. ఈయన ''మైథిలీ పరిణయం'' అనే పద్యకావ్యాన్ని రచించాడు. ఇది అచ్చుపడలేదు గాని తెలంగాణాలో ఒకరివద్ద ఈ కావ్యం ప్రతులు ఉన్నాయట.[26] ఈ కవి 1830 ప్రాంతాలవాడు. అంటే సీతారామభూపాలుని కాలంలోనివాడన్నమాట.

తిరుమలరాజు సూరపరాజు

ఈ యుగంలో ఇప్పటికి రమారమీ ప్రాచీన పురాణ మహిళల పెళ్ళిళ్ళన్నీ జరిగినట్టే. ఒక్క ద్రౌపదికి తప్పించి, ఆమె వివాహ ప్రబంధాన్ని తిరుమలరాజు సూరపరాజు చెప్పాడు. ఇతడు కాండూరి వెంకటాచార్యులుగారి శిష్యుడు. ఈ గ్రంథాన్ని గురువుగారికే అంకితమిచ్చాడు. ఈ గ్రంథకర్త గంగరాజు పట్టణం ఏలిక. ఇతని పెదతండ్రి కుమారుడు తిమ్మరాజు ''అనుపమ కవిత్వ విద్యాఘనత'' గలవాడట. అయితే ఏ గ్రంథాలు వ్రాశాడో చెప్పలేదు. సూరపరాజు కూడా ఇతర గ్రంథాలు వేటిని రచించాడో తెలియదు. ఈ ద్రౌపదీ పరిణయం మూడాశ్వాసాల గ్రంథం సమగ్రమే. అచ్చుపడలేదు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో దీని ప్రతులు రెండు ఉన్నాయి. (ఆర్.3031 సీ. మాతృక); ఆర్.958 (పుత్రిక)

మంగళంపల్లి సూర్యనారాయణ

ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో చాలా అసమగ్ర కావ్యాలు ఉన్నాయి. అవతారికలు లేకపోయినా గద్యలవల్ల వాటి కర్తల పేర్లు తెలుస్తున్నాయి. ఆ కవుల శైలి తెలియడానికి సాంపిల్సుగా కొన్ని ఘట్టాలు ఉంటున్నాయి. ఎక్కువ శిథిలమైన గౌరీ కల్యాణం, ఒకటి ఆ గ్రంథాలయంలో ఉంది. ఇది మూడాశ్వాసాల ప్రబంధం. దీనిని మంగళంపల్లి సూర్యనారాయణ వ్రాశాడు. ఇతడు వెంకటేశ్వర్లుగారి కుమారుడు. ఇంతకన్నా ఇతని వివరాలు తెలియవు.

కొద్దిగానో గొప్పగానో వివరాలు తెలుస్తున్న ఈ 44 మంది కవులేకాక మరికొందరు వివాహ కావ్యాలు ఈ యుగంలో వ్రాశారు. అయితే వాళ్లు పద్యరూపంలో వ్రాయలేదు. కొందరు ద్విపదలలోనూ, కొందరు యక్షగానాలుగానూ రచించారు. ఆ వివరాలు చూడండి.

---

26. గోలకొండ కవుల సంచిక, పుట.413

ద్విపదలలో పరిణయాలు

చిత్తూరు గంగాధరుడు

ఈయన గంగా వివాహాన్ని చెప్పాడు (డి.1049). ఇతడు భల్లాణ చరిత్రను కూడా రచించాడు. అది కూడా ద్విపద కావ్యమే (డి.1165 నుండి 1175 దాకా పదకొండు ప్రతులు ఉన్నాయి). ఈ గ్రంథాలుకాక ఇతడు కొలిపాక మాహాత్మ్యం (ద్విపద). శృంగార సిరియాళ చరిత్ర, శుకసప్తతి (వచనం) మొదలైన రచనలు చేశాడు. ఇతడు నల్లగొండ జిల్లా చర్లపల్లివాసుడు. ఇతని కాలం నుంచి ఈ కవి వంశంవాళ్లకు సరసకవి అనే బిరుదు ఉంది. (చూ. గోలకొండ కవుల సంచిక పుట.397). ఇతని భల్లాణచరిత్ర అచ్చుపడింది. ఇతడు గంగావివాహాన్ని ఆర్యవేదోక్తమైన పద్ధతిలో వ్రాశానని చెప్పాడు. అయితే కథావిషయం కొంత పౌరాణికంగానూ, కొంత విదేశీయంగానూ ఉందని పరిశోధకుల అభిప్రాయం.[27] భల్లాణచరిత్ర వ్రాత ప్రతిపై బ్రౌను దొరగారు ఇలా తీర్పు ఇచ్చారు. ''ఈ కావ్యము జబ్బుగా వున్నది. యతులు, ప్రాసలను గురించి మాత్రం తెలియని కవి చెప్పినది. పనికిరాదు. (డి.1165). ఈ రిమార్కు గంగా వివాహానికీ వర్తిస్తుంది.

కంచెర్ల చంద్రశేఖరుడు

పురాణ పురుషులలో ఎందరెందరో వ్యక్తులను నాయకులను చేసి మన కవులు పెళ్ళిళ్లు చేశారుగాని సూర్యుని పెళ్లి ముచ్చట చెప్పినవాళ్లు ఎవరూ లేరు. కంచెర్ల అయ్యావారి కొడుకు చంద్రశేఖరం ఆ లోటు తీర్చాడు. బ్రహ్మపుత్రిక అయిన సంజ్ఞాదేవిని, సూర్యుడు కట్టుకొన్న కథను ''భాను కల్యాణం'' అనే ద్విపద కావ్యంగా ఇతడు చెప్పాడు. ఇతని తాత ప్రమథయ్యా వారు ''సరససాహిత్య లక్షణ కవీంద్రుడు. ఆయన ఏ గ్రంథాలు చెప్పాడో తెలియదు. ఈ కంచర్లవారు ఆదిమ వీరశైవ భక్తులలో ఒకడైన కిన్నెర బ్రహ్మయ్యా వంశంలోనివాళ్లట. పాల్కురికి సోమనాథుని బసవపురాణం పంచమాశ్వాసంలో కిన్నెర బ్రహ్మయ్యా కథ ఉంది. కంచర్ల చంద్రశేఖరం వ్రాసిన ఈ భానుకల్యాణం అచ్చుపడలేదు. దీని ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.1176)

పాటూరి చిన్నయ్యా

మన ద్విపద కవులు చాలామంది పద్యకావ్యాలకు అనుసరణలు వ్రాస్తారు. బమ్మెర పోతరాజుగారి రుక్మిణీ కల్యాణ ఘట్టాన్ని పాటూరి చిన్నయ్యా ద్విపదగా చెప్పాడు. ''వరుస బొమ్మలపెండ్లి వనిత చేయించు కొమరప్ప గుజ్జన గూళ్లు వండించు'' అంటూ అనుసరించాడు. ఈ చిన్నయ్యా కపిల చరిత్ర అనే ద్విపదకావ్యం కూడా వ్రాశాడు. ఈ గ్రంథాలు రెండూ కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యాలయంలో ఉన్నాయి.[28] ఇవి చాలా చిన్న కావ్యాలు.

---

27. మద్రాసు ఓరియంటల్ లైబ్రరీ వారి తెలుగు పుస్తకాల డి. కేటలాగు. సంపుటి 4; పుట 1381
28. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక సంపుటి.4; పుట.308

శేషం చెన్నుభట్టు

3,250 ద్విపదలలో అయిదాశ్వాసాలుగా విభజించి సుదీర్ఘంగా అభిమన్యు కల్యాణాన్ని శేషం చెన్నుభట్టు చెప్పాడు. ఈయనకు చిన్నప్పుడే కవితాలలామ కలిగిందట. ఇతని కవిత్వం సంగ్రహంగా, ధారాళంగా, స్వచ్ఛమైన రీతిలో ఉందని బ్రౌను దొరగారు మెచ్చుకొన్నారు. భారత గాథను కవి ఏమాత్రం అతిక్రమించలేదు. ఈ గ్రంథం అచ్చుపడ లేదు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో దీనికి 6 ప్రతులు ఉన్నాయి (డి.1022 నుండి 1027). కాకినాడ పరిషత్తు కార్యాలయంలో కూడా ఒక ప్రతి ఉంది (గ్రంథ సంఖ్య 2631). శశాంక విజయాన్ని పద్యకావ్యంగా చెప్పిన సుప్రసిద్ధుడు శేషం వెంకటపతికి, ఈ చెన్నుభట్టుకు ఎలాంటి సంబంధం ఉందో తెలియదు.

ఈ నలుగురే తప్ప ఈ యుగంలో ద్విపద కావ్యంగా పరిణయ కథలు ఇంకెవరూ చెప్పలేదు. యక్షగానాలు చాలామంది వ్రాశారు. వీటిలో చాలా మట్టుకు నీరస రచనలు. చదువుతూ ఉంటే బాగుండవు. ఆటగాళ్లూ పాటగాళ్లూ రక్తి కట్టించాలి. ఏ నుదురుపాటి వెంకన్న వ్రాసిందో చదువుతున్నా రక్తి కడుతుంది. సాహిత్య చరిత్రలో జమకట్టుకోడానికి తప్ప మరెందుకూ పనికిరానివి కొన్ని ఉన్నాయి. వీటి గుణదోషాలను, ఇతర వివరాలనూ మిత్రులు యస్వీ జోగారావుగారు, తమ యక్షగాన వాఙ్మయ చరిత్రలో చర్చించారు. ఈ యుగంలోని యక్షగాన పరిణయాలు 17 ఉన్నాయి. వాటి వివరాలు చూడండి.

1. కూరపాటి అమరలింగం	పార్వతీ కల్యాణం	డి.1909
2. ఇలపరచి చెన్నయ్య	ఉషా పరిణయం	డి.753 (ఎ). ఇతడు యయాతి చరిత్రం డి.753 (సి) మరికొన్ని కీర్తనలు కూడా చెప్పాడు.
3. రాయపూరి చెన్నయ్య	మల్లికా కల్యాణం	దీని ప్రతి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యాలయంలో ఉంది. గ్రంథ సంఖ్య. 2043.
4. వీరిపాటి నరసింహరాజు	ఉషాపరిణయం	డి.1838
5. వెలువరి పెద్దయ్య	భద్రకాళీ కల్యాణం	డి.1913 (రచన పేలవం అని యస్వీ తీర్పు)
6. వావిలపాడు మూళగిరి	ఉషా పరిణయం	ప్రతి కాకినాడలో ఉంది. సంఖ్య.1319
7. చౌదరి రామదాసు	రుక్మిణీ పరిణయం	ఆర్.458
8. అగస్త్యరాజారామన	సీతా కల్యాణం	డి.1958
9. పోడూరి వెంకటదాసు	సుకుమార పరిణయం	ఆర్.440
10. వెంకటనంబిగారి వెంకటపతి	పద్మినీ పరిణయం	డి.1897

11. మెరత్తూరు వెంకటరామశాస్త్రి	1. ఉషాపరిణయం	పన్నెండు యక్షగానాలు వ్రాశాడు. చూ. యస్వీ పుట.336
	2. రుక్మిణీ కల్యాణం	
	3. సీతాకల్యాణం	
12. తిమ్మాజీ వారి వెంకటాద్రి	సుభద్రా వివాహం	డి.1967
13. నుదురుపాటి వెంకన్న	పార్వతీ కల్యాణం	కాకినాడ. గ్రంథ సంఖ్య.166
14. భోసల శివాజీ	అన్నపూర్ణా పరిణయం	తంజావూరులో ఉంది. తం.డి.499
15. శ్రీనివాసుడు	ఉషా పరిణయం	డి. 1968 (నీరసం)
16. అనుమోద సన్యాసి	బసవ కల్యాణం	ఆర్.464
17. నూర్వీటిహరియప్ప	ఉలూచీ పరిణయం	(డి.643 వల్ల తెలుస్తుంది) కావ్యం నష్టం.

పద్యకావ్యాలూ, ద్విపదలూ, యక్షగానాలూ కలుపుకొని ఈ యుగంలో 65 మంది వివాహ ప్రబంధాల రచయితలు లెక్క తేలుతున్నారు.

ఇంతమంది చేయించిన ఈ పెళ్లిళ్లలో ఒకటి రెండు కనువిందు చేస్తాయి.

మిగతా కావ్యాలలో రసం లోపించి ''పెళ్లి సందట్లో పుస్తికట్టడం మరచిపోయారు'' అన్న సామెతను జ్ఞాపకం చేస్తాయి.

అభ్యుదయాలూ విలాసాలూ చరిత్రలూ ఉపాఖ్యానాలు

ఎవరే కావ్యం వ్రాసినా దానికో పేరు పెట్టక తప్పదు. పెట్టిన పేరు వినగానే గ్రంథ విషయం తెలిసిపోయేటుట్ట అతికితే చాలా బాగుంటుంది. మన కవులు తమ గ్రంథాలకు పెట్టిన పేర్లు చూసి వాళ్ళ స్వభావాలను ఊహించుకోవచ్చు. ఆడంబరం కావలసినవాళ్ళే, ''ప్రబంధరాజ వెంకటేశ్వర విజయ విలాసం'' అనీ, ''ప్రబంధరాజ శిరోభూషణ ప్రకృష్ట బలరామ చరిత్రము' అనీ పొడుగాటి టైటిల్సు పెడతారు. ఏ కథ వ్రాసినా ఎలా వ్రాశాడో చెప్పడానికి ''నిర్వచన ఫలానా'' అనీ ''నిరోష్ఠ్య ఫలానా'' అని పేర్లు పెట్టడం సహజమే. సంకుసాల నరసయ్య ధర్మమా అని ''కవి కర్ణ రసాయనం'' దగ్గర్నుంచి కవిజన రంజనాలు, కవిరాజ మనోరాజనాలు వగైరా వగైరాలు వెలశాయి.

కృత్యాద్యవస్థ ఎంత గడ్డుదో పుస్తకానికి పేరు పెట్టడం కూడా అంత పెద్ద సమస్య. పెద్దనగారు ''స్వారోచిషమనుసంభవం'' అనే పేరు పెడితే లోకులు మనుచరిత్ర అని పిలవడం మొదలుపెట్టారు. ప్రజల నోళ్ళలో పడితే సరే. గులాబీని ఏ పేరు పెట్టి పిలిచినా, ఉంటే, వాసన తగ్గదు. తమ కావ్యనామాలు పరిమళించాలని కవులు తమ గ్రంథాలకు చక్కని పేర్లనే వెతుక్కుంటారు. అయితే నాయికానాయకులనుబట్టి గ్రంథనామంలోని తొలిపదం ముందే ఫిక్సు అయిపోతుంది. ఇంక చివర ఏదో కలపాలి. చాలామంది ఫలానా పరిణయం అనిగానీ, ఫాలానా కల్యాణం అనిగానీ చేర్చుతారు. కొందరు ''చరిత్ర'' అనో ''ఉపాఖ్యానం'' అనో చివరన పెట్టి ఊరుకొంటారు. మరికొందరు ''అభ్యుదయమనీ ''విలాసమనీ'' హీరో పేరు చివరో, హీరోయిన్ పేరు చివరో చేరుస్తారు.

ఈ యుగంలో కావ్యాలు వ్రాసిన వాళ్ళు చాలామంది ఈ సూత్రాలనే అనుసరించారు. వీళ్ళ గురించి మూక ఉమ్మడిగా చెప్పుకొనేటప్పుడు గ్రంథనామాలలోని సామ్యాలనుబట్టి వర్గీకరణ చేసుకొనడంలో కొంత సౌకర్యం ఉంది. ముందు అభ్యుదయం గురించి చూద్దాం.

ఔడూరి కిచ్చన్న

ఇతడు మాధవాభ్యుదయం అనే పేరుతో దశావతార చరిత్రను ''శబ్దార్థవైభవభవ్యంబు''గా వ్రాయదలిచాడు. ఇతని అల్లుడి అన్న నూర్వీటి నాగయ్య ఈ గ్రంథాన్ని తిరుపతి వెంకటేశ్వరునికి అంకితం ఇమ్మన్నాడు. అలా పురమాయించే ముందు చెప్పినపద్యంలో కిచ్చన్న అంతకుముందు హంసవింశతినీ, కాళిదాసు రఘువంశాన్నీ కూడా కిచ్చయ్య తెలుగులో వ్రాసినట్టు తెలుస్తుంది. ఇతని రఘువంశం దొరుకుతుంది (డి.863). అయితే ఏం బాగున్నట్టు లేదు. బ్రౌను దొరగారి దగ్గర ఉండే పండితులు ''మూలం ఎంత సరళంగా, స్పష్టంగా ఉందో అనువాదం అంత వక్రంగా, క్లిష్టంగా ఉంది'' అన్నారు. ఈ గ్రంథం ప్రతి మీద బ్రౌను దొరగారు 'It is as stupid as need be' అని వ్రాశారు. ఎంత అవలక్షణంగా ఉండాలో అంతా ఉందని దొరగారు

రిమార్కు వ్రాస్తే దానికి అపీలు లేదు. బాగోఓగో రఘువంశాన్ని తెనిగించి కట్టెకోల నరసన్న యిచ్చిన ప్రోత్సాహంపైన కిచ్చయ్య దేవునికే అంకితం ఇచ్చాడు. ఇతని హంసవింశతి ప్రతి దొరకదు. మాధవాభ్యుదయం అయిదాశ్వాసాల కావ్యం. అచ్చుపడలేదు (డి.843). ఈ కవి 1760 ప్రాంతాలలో ఉన్నాడు.

నరసింహ సోమయాజిగారి పోచన

ఈ యుగంలో ఇంకో ''అభ్యుదయ'' రచయిత పోచన. ఇతని ఇంటి పేరు ఏమిటో తెలియదు. తండ్రి పేరు నరసింహసోమయాజి. ఇతని ఇతర వివరాలు కూడా తెలియవు. పోచన చంద్రాభ్యుదయం అనే కావ్యం వ్రాశాడు.''ఈ ప్రబంధము శబ్దాలంకారములతో నిండి శ్రావ్యముగా నున్నది'' అని వీరేశలింగంగారు మెచ్చుకొన్నారు.[1] దీని ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.125 (సి))

కాశీనాథుని వీరయ్య

వీరశైవ ఆరాధ్యుల పండిత త్రయంలో శ్రీపతి పండితుడు ఒకడు. ఇతని వంశంవారే ఈ యుగం నాటికి కాశీనాథునివారు అయ్యారు. కాశీనాథుని వీరయ్య అనే కవి ''ధర్మగుప్తాభ్యుదయం'' అనే ప్రబంధం వ్రాశాడు. ధర్మగుప్తుని కథ స్కందపురాణం బృహత్తరఖండంలో ఉంది. వీరయ్య ఈ గాథను ఎన్ని ఆశ్వాసాల కావ్యంగా వ్రాశాడో తెలియదు. రెండో ఆశ్వాసం కూడా పూర్తిగా లేని ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.399 (ఎ))

ముప్పిరాల సుబ్బారాయడు

భాగవతంలోని కృష్ణావతారగాథను ఔదూరి కిచ్చన్న మాధవాభ్యుదయం వ్రాస్తే అదే కథను కృష్ణాభ్యుదయం అనే పేరుతో ముప్పిరాల సుబ్బారాయడు అనే కవి రచించాడు. దీనిని చక్కిరాల శేషయ్య ''భ్రాతృ వాత్సల్యం''తో అంకితమిచ్చాడు. సాధారణంగా ముప్పిరాల సుబ్బారావు నరస్తుతులు చేయడు. తన ఇతర గ్రంథాలను దేవునికే అంకితమిచ్చాడు. ప్రద్యుమ్న చరిత్ర, సావిత్రి చరిత్ర, భద్రాద్రి రామశతకం మొదలైనవి ఇతని ఇతర కృతులు. అయితే రెండు మాత్రమే దొరుకుతున్నాయి. కృష్ణాభ్యుదయం ప్రతికి నకలు క్రీ.శ.1841లో కవి స్వయంగా వ్రాయించాడు. ఇతని ప్రద్యుమ్న చరిత్ర ప్రతి కూడా దొరుకుతుంది (డి.571). కవి తన కవిత్వం అమృతోపమానమని ఇలా చాటుకొన్నాడు.

> శ్రీకరముప్పిరాల కులసింధు సుధాకర మిత్రపాక హా
> నోకహ సుబ్బరాయ కృత నూత్న సుపద్యబిసప్రసూన జా
> స్తోకమరంద బిందువుల సూరి జనాళులు తృప్తి మీరగా
> నాకలి దీర గ్రోలుడు సురాళమున్ సుధగొన్న కైవడిన్ (డి.474)

---

1. ఆంధ్రకవుల చరిత్ర. 3వ భాగం, పుట 288.

ఇతని కవిత్వం ఆకలి తీరుస్తుందో లేదోగాని వీరేశలింగంగారి సిఫార్సు ప్రకారం మధురంగానే ఉంటుంది.[2]

గోటేటి సూరన్న

ముప్పిరాల సుబ్బారాయుడేకాక గోటేటి సూరన్న అనే ఆయన కూడా ఒక కృష్ణాభ్యుదయం రచించాడు. ఇది బొల్లాప్రగడ కామయ్యకు అంకితం. కృతిభర్త ఈ కావ్యాన్ని ''జగద్గేయ ప్రమేయంబుగా'' చెప్పమని ''అక్కజమైన ఈ సత్కవి''తో అన్నాడు. అయితే జగత్తులో ఎవరూ దీనిని కీర్తిస్తున్నట్టు కనబడదు. ''ఈతని కవిత్వమంత శ్రేష్ఠమయినదని చెప్పదగినది కాదు'' అని వీరేశలింగంగారు తీర్పు చెప్పారు.[3] కవి తన ఇంటిపేరు గోటేటివారు అని వ్రాసుకొన్నా తాము చూసిన ప్రతిలో ''గొంతెటి''వారు అని ఉంది కాబోలు కవిని గొంతేటి సూరన్న అని వీరేశలింగంగారు పేర్కొన్నారు. కవి ఇంటిపేరు ఏదైనా ఈ కావ్యానికి మంచి పేరు రాలేదు.

ఈ అయిదుగురే ఈ యుగంలో ''అభ్యుదయ'' కావ్యాలను వ్రాశారు. మన సాహిత్యంలో ఇతర యుగాలలో జాస్తిగానే నాయకాభ్యుదయ కావ్యాలు కనబడతాయి. తంజావూరులో ప్రత్యేకంగా ''అభ్యుదయ'' రచనలు సాగాయని కొందరు పరిశోధకులు భావిస్తున్నారు. నాయకరాజుల యుగలక్షణాలలో అభ్యుదయ రచనలు, విలాసకృతులూ బయల్దేరడం ఒకటని చెప్తున్నారు.[4] ఇవి ప్రత్యేక కావ్య ప్రక్రియలు కావు. అన్ని ''అభ్యుదయ'' రచనలూ, విలాసకృతులూ ఉదాహరణలలో ఒకే నిర్మాణక్రమంలో, ఒకే నిర్ణీత ఛందస్సులో ఉండవు. పేరులో చివర విలాసం, అభ్యుదయం అని ఉన్న గ్రంథాలను ఒకచోట చేర్చినంత మాత్రాన వర్గీకరణకు ఉపయోగించడం తప్ప, ఇంకే ప్రత్యేకతలు ఉండవు.

ఈ యుగంలోని ''అభ్యుదయ'' రచనలను చూశాక ఇంక విలాసకృతులను చూద్దాం. ఇవి కూడా పద్యాలు, ద్విపదలు, యక్షగానాలు మొదలైన విభిన్న ప్రక్రియా భేదాలలో ఉన్నాయి.

అయ్యమాచార్యులు

విష్ణుమూర్తికి సహస్రనామాలున్నా సంధ్యావందనంలో ఇరవైనాలుగు మాత్రమే సదాచారులు జపిస్తారు. వాటిలో కేశవుని పేరు మొదటిది. దక్షిణాదిని ఈ కేశవునికి ఒక విశేషం కూడా మనవాళ్ళు చేర్చారు. చెన్నకేశవుడనే పేరు సుప్రసిద్ధం. వనపర్తిలో క్రీ.శ.1834 ప్రాంతాల్లో ఉండే అయ్యమాచార్యులుగారు ఒక చెన్నకేశవ విలాసం వ్రాశారు.

దీని ప్రతి వనపర్తిలో పెద్దమండది కృష్ణకవిగారి దగ్గర ఉందని పరిశోధకులు చెప్పారు.[5] అయ్యమాచార్యులుగారు రామేశ్వరవిజయం అనే ఇంకో కావ్యం కూడా

2. ఆంధ్రకవుల చరిత్ర 3వ భాగం, పుట 267.
3, అదే పుస్తకంలో, పుట.253
4. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం, నిడదవోలు వెంకటరావుగారి పీఠిక పుటలు 61 నుండి 65 వరకు
5. గోలకొండకవుల సంచిక, పుట.359

చెప్పారట. దీని ప్రతి వనపర్తిరాజాగారి లైబ్రరీలో ఉండవచ్చునని ఆ పరిశోధకులే అనుమానించారు. ఈ గ్రంథాలు వెలుగుచూడనందున వివరాలు ఇంతకన్నా తెలియవు.

కృష్ణదాస కృష్ణదాసు

సంస్కృతంలోని నాటకాలను అనువదిస్తున్నప్పుడు మనవాళ్ళు వాటిని పద్య కావ్యాలుగా మార్చడం ఉందిగాని పాటను సైతం పద్యాలుగా మార్చడం విడ్డూరమే. జయదేవుని గీతగోవిందం గేయకావ్యంగా ప్రఖ్యాతమైంది. దీన్ని అనుసరిస్తూ కృష్ణదాస కృష్ణదాసు వ్రాసిన ''రాధాకృష్ణ విలాసం'' కేవలం పద్యమయం. ఇతడు ''వివిధ భాషా సంగీత సాహిత్య కవిత్వ శారదా విలాసు''ణ్ణి అని చెప్పుకొన్నాడు. పాటలేం వ్రాశాడో తెలియదు. రాధాకృష్ణ విలాసం అముద్రితం. (డి.695)

చిగుళ్లేపు కృష్ణమాచార్యులు

కృష్ణావతారంలో ఎందరి మానధనాలనైనా కొల్లగొట్టడానికి దేవుడికి లైసెన్సు ఉంది. కాని ఇతర అవతారాలలో ఇతర మతాల స్త్రీలను ధన్యం చేయడం కూడా శాణాతనమే. అందుకే బీబీ నాంచారు కథ విన్నాణంగా ఉంటుంది. ఒరయూరి నాంచారిని రంగనాథుడు పెళ్ళాడే కథను చిగుళ్లేపు కృష్ణమాచార్యులు యక్షగానంగా వ్రాశాడు. ''రచన ఒక మోస్తరు'' అని పరిశోధకుల భావం.[6] ఇది అచ్చుపడలేదు. (ఆర్.900 (ఎ))

పాకనాటి గణపతిరెడ్డి

కృష్ణమాచార్యులలాగే యక్షగాన రూపంలో విలాసాలు వ్రాసినవాళ్ళు ఇంకా ఉన్నారు. కృష్ణవిలాసం లేక గోపాల విలాసం అనే పేరుతో శ్రీకృష్ణజననం, బాల్యక్రీడలు వగైరాలు పాకనాటి గణపతిరెడ్డి వర్ణించాడు. ఈ కమ్మని దేశిరచనలో మధురకవితలు ఉన్నాయి. ఇది అచ్చుపడింది. అయితే వ్రాతప్రతిలో ఇతని పేరు ''వెన్నముద్ద గణపతి పెద్ద'' అని ఉంది. (డి.1863). యస్వీ జోగారావుగారు ఈకవి పేరును సరిగ్గా గుర్తించి పొందుపరిచారు. (యస్వీ.పుట.94)

కాళ్ళకూరి గౌరీకాంతం

పరిశోధకుల కృషివల్ల ఈ యుగంలోని కవుల ఊర్లూ, పేర్లూ, తారీఖులు సరిగ్గా నిర్ణయమవుతున్నాయి. విశాఖ జిల్లా చీపురుపల్లి తాలూకాలో కాళ్ళకూరి గౌరీకాంతం అనే కవి ''ధర్మనందన విలాసం'' అనే కావ్యం వ్రాశాడు. ఇతని కాలం క్రీ.శ. 1780 నుండి 1860 అని చరిత్రకారులు గుర్తించారు.[7] కాళ్ళకూరి వారి కుటుంబంలో చాలామంది కవులు వ్రాసిన పుస్తకాల పేర్లు తెలుస్తున్నాయి. గౌరీకాంతం తన తాతతండ్రుల పేర్లు, వాళ్ళ గ్రంథాలూ పేర్కొన్నాడు.

---

6. ఆంధ్ర యక్షగాన చరిత్ర - యస్వీ జోగారావుగారు, పుట.422
7. విస్మృత కళింగాంధ్రకవులు - అడిదం రామారావు, పుట.128

1. లక్ష్మీపతి	వంశకర్త	భద్రాపరిణయం
2. పేరయ్య	పెదతండ్రి	రసవినోదం
3. సూరయ్య	తండ్రి	సీతారామచరిత్ర

ఇలా పెద్దలు గ్రంథకర్తలవడంచేత ''వాణీ కటాక్ష వీక్షణము చేత కవనమెప్పుడు మీ యింట కలిగి'' ఉందని లోకులు కవిని పొగిడేవారు. గౌరీకాంతం ఆ ''రచనా విభూతి''తోనే ధర్మనందన విలాసం వ్రాశాడు. పంచపాండవులలోని ధర్మరాజుకు తమ్ముళ్ళతో పెళ్ళాడిన ఉమ్మడి భార్యేకాక కళావతి అనే ప్రైవేటు భార్య కూడా ఉంది. ఈ పెళ్ళి ముచ్చటను పాత ప్రబంధాల ధోరణితో పాత పద్యాలను అనుకరిస్తూ మూడాశ్వాసాల ప్రబంధంగా గౌరీకాంతం వ్రాశాడు. పూసపాటి నారాయణ గజపతిగారి కొలువులో ఉన్న వెలిచేటి గురురాయడికి అంకితమిచ్చాడు. ఈ గ్రంథంలో కవి చాలాచోట్ల చర్విత చర్వణంగా చెప్పిన దాన్నే మళ్ళీ చెప్పి పద్యాల సంఖ్య హెచ్చించాడనీ, కొన్నిచోట్ల పద్యాల సంఖ్య విసుగు పుట్టించునంత హెచ్చుగానున్నది'' అని పరిశోధకులు అంటున్నారు.[8] ఈ కవి గురించిన మరికొన్ని వివరాలు ఇదే సంపుటంలో ''విజయనగరం'' అనే ప్రకరణంలో ఉన్నాయి.

మారుపెద్ది చెంగల్వరాయడు

చెప్పిందే చెప్పినా విసుగు పుట్టకుండా ఉండడానికి రొటీను వివాహ కావ్యాలలో కొన్ని శాస్త్ర విషయాలను మన కవులు జొరబెడతారు. ''చారునీలా విలాసం'' అనే ద్విపద కావ్యంలో మారుపెద్ది చెంగల్వరాయడు నాట్యశాస్త్రం ఇరికించాడు. కథ ప్రకారం చారు నీల అనే రాజకుమార్తె సారసధ్వజుడనే రాజకుమారుణ్ణి పెళ్ళాడుతుంది. ఇందులో నాట్యశాస్త్ర ప్రసక్తి ఎలాగోవచ్చి ''హస్తాధ్యాయి'' భాగాన్ని పూర్తిగా కవి వివరించాడు. ఈ ద్విపద కావ్యం అముద్రితం. (ఆర్.1052)

దళవాయి తిమ్మరాజు

మన కవులలో చాలామందికి సంగీత నాట్యశాస్త్రాలు బాగా తెలుసు. వాటిలో ప్రవేశం లేకపోతే మంచి యక్షగానాలు వ్రాయడం కష్టం. మన యక్షగాన రచయితలలో దళవాయి తిమ్మరాజు ఒకడు. ఇతడు ''ప్రసన్న వెంకటేశ్వర విలాసం'' అనే కృతి రచించాడు. దక్షిణాది యక్షగానాలతోనూ, దండకాలతోనూ రాజులు ఊరేగుతున్నప్పుడు సానిపాపలు చూడడం, మోహించడం వాళ్ళను తెమ్మనడం పరిపాటే. రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి ఊరేగుతున్నప్పుడు కళావతి అనే వేశ్య చూసి మరులుగొంది. ఈ కథను దళవాయి తిమ్మరాజు వ్రాశాడు. ఇతడు క్రీ.శ. 1732లో చనిపోయాడని పరిశోధకులు భావిస్తున్నారు.[9]

చెల్లపిళ్ళ నరసయ్య

దళవాయి తిమ్మరాజు ప్రసన్న వెంకటేశ్వర విలాసం వ్రాస్తే ఈ యుగంలోనే చెల్లపిళ్ళ నరసయ్యగారు విశేషణం ఏమీ లేకుండా ఉత్త వెంకటేశ్వర విలాసం వ్రాశారు. ఇది 483

8. విస్మృత కళింగాంధ్రకవులు - అడిదం రామారావు, పుట.131
9. ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్ర. పుట 42.

గద్యపద్యాలున్న మూడాశ్వాసాల ప్రబంధం. వెంకటేశ్వరుడు చెంచితను పెళ్ళాడే కథను నరసయ్యగారు రసవంతంగా చెప్పారు. ఈయన ప్రఖ్యాతులైన తిరుపతి వెంకటకవులలో చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి ముత్తాత తమ్ముడు. వెంకటశాస్త్రిగారు చెప్పినట్టు నరసయ్యగారు రసం ఎక్కడా చెడగొట్టరు. ''సంస్కృతము చూచిన అతడఖండ సంస్కృత పండితుడనియు, దెలుగు చూచిన నితడఖండాంధ్ర పండితుడనియు నెల్లరికి విస్పష్టమగును. ఇక నౌచిత్యమును గూర్చి చర్చించినచో చాలావరకు దానిని భూషించుచునే యుండును గాని యేమైననుగాని విషయములో దొరకువడుట తప్పదు'' అని వెంకటశాస్త్రిగారు వేసిన అంచనా కరక్టు. వెంకటేశ్వర విలాసంలో ఆదినుంచీ జాతీయాలూ, పలుకుబళ్లూ కోకొల్లలుగా ఉండి కావ్యమంతటా తెలుగుతనం చల్లగాలిలా ప్రసరిస్తుంది. పాత్రోచిత భాషను పద్యాలలో సైతం వాడడంలోనే కవికి గల నాటకీయ రసదృష్టి కనబడుతుంది. నరసయ్యగారు యక్షగానాలు స్వయంగా వ్రాసినవారు గనుక ఈ వెంకటేశ్వర విలాసంలో భామాకలాపంలో మాధవిలాగ ఒక మాధవి అనే చెలికత్తెను ప్రవేశపెట్టారు. ఈయన అహల్యా సంక్రందన విలాసం, ఏకాంత సేవా కలాపం అనే యక్షగాన కృతులు చెప్పినా వాటి ప్రతులు నష్టమయ్యాయి. వెంకటేశ్వర విలాసంకన్నా వారికి పేరు తెచ్చిన కావ్యం యామినీ పూర్ణ తిలక విలాసం. ఇది 972 గద్యపద్యాలతో, ఆరు ఆశ్వాసాలతో చెప్పిన శృంగారప్రబంధం. బిల్హణకవి యామినీ పూర్ణ తిలకల ప్రణయాన్ని చాలా గడుసుగా చెప్పాడు. శ్లేషలు, యమకాలు పనిగట్టుకొని వాడారు. వెంకటశాస్త్రిగారు చెప్పినట్టు వసుచరిత్రలో లేని చిత్రకవిత్వము కూడ ఈయన కవిత్వంలో కనబడుతుంది. నరసయ్యగారి విలాసకృతులు రెండు అచ్చుపడ్డాయి. మునిమనుమడి ధర్మమా అని కొన్ని జీవిత విశేషాలు బయటపడ్డాయి. నరసయ్యగారి శిష్యులలో పిఠాపురం రాజబంధువులు ఉన్నారు. నీలాద్రి రాయనింగారి మేనమామలయిన చింతపట్ల వెంకటరావుగారూ, వారి సోదరులు మాధవరావుగారూ నరసయ్యగారి శిష్యులు. తమ గురువుగారికి రాజ దర్శనంతోపాటు సత్కారాలు చేయించారు. అందుకే ''రావువెంకటనీలాద్రి రాయనృపతి చేత సత్కృతి బొంది ప్రసిద్ధినొందినట్టి నరసయనామ విఖ్యాతయశుడ''నని ఈయన చెప్పుకొన్నారు (యామిని.1-20). అయితే రాజదర్శనానికి ముందే ఈయనకు ప్రసిద్ధి వచ్చింది. పాండితీస్ఫోరకమైన యామినీపూర్ణ తిలక విలాసం ఆ పేరు తెచ్చిపెట్టింది. పూర్వకవుల సొగసులకు ఇందులో నరసయ్యగారు ఎన్నో మెరుగులు పెట్టారు. మాటవరసకు కవికర్ణ రసాయనంలో సంకుసాల నరసయ్యగారు ''ఉద్ధతుల మధ్య పేదల కుండతరమె'' అని చక్కని పద్యం చెప్తే ఈ నరసయ్యగారు దానికి వ్యతిరేకంగా మందారమాల గర్భవతి అయిన సందర్భంలో ఇలా చెప్పారు.

''కలిమిగల చెలియ కటికుచ
ములమధ్యను నడుము వృద్ధి పొందెను ధరలో
గలిమి గలవారి తోడను
జెలిమి గావించు పేదసిరి గనుటరుదే'' (యామిని.1-87)

ఇలాగ చూసుకొంటూపోతే ఎన్నో మెరుగులు చెళ్లపిళ్ల నరసయ్యగారి యామినిలో కనబడతాయి. ఈయన స్వహస్తాలతో వ్రాసుకొన్న పూర్వకవుల గ్రంథాలు పన్నెండు పెద్ద

తాటాకు పెట్లలో ఉండేవట. గ్రంథాలయం అంటే ఈయనకు చాలా ఇష్టం. వెంకటేశ్వర విలాసంలో లంచం ఇవ్వవలసిన చోట ఈయన గ్రంథాలనే పేర్కొన్నారు (2-141). పర్వత మునీంద్రుడు హరిణిని చూపించమంటూ తన శిష్యుడు ఉపలారుభట్టును అడుగుతూ ప్రాథేయపడ్డాడు. ''మెండయిన పుస్తక భండారమయినను దోరంపు జెంగావి ధోవత్తైన జారి చెంబైన నిస్తానుషమీ'' అని పర్వతుడు పుస్తక భాండాగారాన్ని ఆశపెట్టడం నరసయ్యగారిలాంటి పుస్తకాల ప్రియుడు మాత్రమే వ్రాయగలడు. గ్రంథాలు వ్రాసుకొనడానికి ముందుతరాలవాళ్లకు పనికొస్తాయని ఈయన చక్కని ఆకులుగల తాటిచెట్ల విత్తనాలను విశేషించి తన పొలంలో నాటించారట. అయితే ఆ చెట్లు ఎదిగి ఆకులు పనికొచ్చేసరికి కాగితాల పుస్తకాలు ప్రచారంలోనికి వచ్చాయి. చెళ్లపిళ్ల నరసయ్యగారు వేయించిన తాటితోటలాగే ఆయన పుస్తకాలు కూడా నేడు అట్టే ఉపయోగానికి రాలేదు. ఈయన 1835 ప్రాంతాలలో మరణించినా ఈయన కవిత్వం కొన్ని పద్యాలలో జీవిస్తూనే ఉంది.

బసవరాజు నాగేంద్రం

వింతకథల కోసం మన కవులు ఉవ్విళ్ళూరకపోలేదు. బసవరాజు నాగేంద్రం అనే ఆయన ''అభినవప్రబంధ రచనా కుతూహలపరు''డయ్యాడు. తన ''విద్యాతిశయంబు పరీక్షించి నాకు జీవనంబు గల్పింపనర్హుడైన మహాపురుషుండు'' కృతినాథుడుగా ఉంటే బాగుంటుందని అన్వేషించి పడమటి సీమలో ఉండే రాజేశ్వరరావుకు అంకితంగా ''ఆనంద సుందరీ చాతుర్య లీలావిలాసం'' అనే మూడాశ్వాసాల శృంగార ప్రబంధాన్ని వ్రాశాడు. ఇందులో జారిణీ చేష్టలను వర్ణించాడు. పుస్తకంలోని విషయానికి తగ్గట్టుగానే ఆదిలో శ్రీకారం చుట్టి బ్రహ్మకు ''భోగాయతకామకేళిసుఖం'' ఇచ్చిన సరస్వతిని కవి ప్రార్థించాడు. స్త్రీచాతుర్య శ్రవణ కుతూహలపరుడైన ఇంద్రునికి బృహస్పతి ఈ కథ చెప్పాడట. ఈ ''ఆనంద సుందరీ చాతుర్యలీలావిలాసం'' అచ్చుపడలేదు. ప్రతి ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.390)

తునగాల నీలకంఠం

కొంచెం గొప్పతనమున్న కథలలో 'నీలకుంతలా విలాసం' ఒకటి (ఆర్.514). ఇది మూడాశ్వాసాల శృంగార ప్రబంధం. నీలకుంతల అనే రాజకుమారిని రామరాజు పెళ్ళి చేసుకున్నాడు. ఇతడిని తలారి రామయ్య అని పిలిచేవారు. ఇతడు తన పెళ్ళాం దుష్ప్రవర్తనా, చిక్కయ్య అనే శివభక్తుడి మంచితనం తెలుసుకొన్నాడు. చిట్టచివర అంతా శివలోకానికి పోయారు. ఈ గ్రంథం అచ్చుపడలేదు.

గిరిరాజుగారి పాపయ్య

శివభక్తుల కథలు ఈ యుగంలో చాలామంది వ్రాశారు. గిరిరాజుగారి పాపయ్య ''అరువత్తుమూవుర'' చరిత్రను హరభక్తవిలాసం అనే పేర వ్రాశాడు (డి.2273). రెండాశ్వాసాల దాకా గ్రంథం దొరుకుతోంది. ఈ పాపయ్యగారి మేనల్లుడి పేరు మల్లంపల్లి

బుచ్చయ్య. అతడు సత్కవీంద్రుడని పాపయ్య చెప్పాడు. మేనల్లుడి సాయంతో ఈ గ్రంథం రచించాడు.

అక్కిన ప్రగడ పిచ్చయ్య

కొంతమందికి ఇతరులు సహాయం లేనిదే కవిత్వం సాగదు. కొందరికి చిన్నప్పట్నించీ ఇది అబ్బుతుంది. అక్కినప్రగడ పిచ్చయ్యకు దేవుడు ''బాల్యము నుండి తన దివ్యపద సరోజ భక్తి ధనము కవిత్వసంపద'' ఇచ్చాడట (ఆర్.110). ఈ కవిత్వ సంపన్నుడు రొటీను కథను తీసుకోలేదు. శ్రీకృష్ణుడు పదహారువేల అందగత్తెల సొగసులను కొల్లగొట్టడంలో వింతేమీ లేదుగాని కుబ్జను మన్నించి ఆమె వలపును పండించడం ప్రత్యేకంగా నిలిచిపోయే కృష్ణలీల అని భావించి ''కుబ్జకృష్ణా విలాసము''నే కావ్యం నాలుగాశ్వాసాలలో వ్రాశాడు. దీని రచనాకాలం క్రీ.శ.1841. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోనేకాక కాకినాడ పరిషత్తు కార్యాలయంలో కూడా దీని ప్రతి ఒకటి ఉంది. కవికి తల్లిదండ్రులు పిచ్చయ్య అనే పేరు పెట్టినా జనం ఇతణ్ణి ''హరిదాసు'' అని పిలిచేవారు. అది రూఢమయింది.

శేషం రంగాచార్యుడు

అక్కిన ప్రగడ హరిదాసు ఒక గూనిదాని కథ వ్రాస్తే శేషం రంగాచార్యులు గూనివాడిని దేవుడు కరుణించే కథను వర్ణించాడు. గుంటూరు జిల్లాలోని పొన్నూరులో వెలసిన భావనారాయణస్వామి గూనిగోవిందుడనే భక్తుని కరుణించిన కథను 'భావనారాయణ విలాసం' అనే పేరుతో శేషం రంగాచార్యులుగారు వ్రాశారు. ఇతడు అభిమన్యు కల్యాణాన్ని ద్విపదగా వ్రాసిన చెన్నుభట్టు కుమారుడు. ఈ విలాసం యక్షగానకృతి, శేషం రంగాచార్యులు రతీమన్మథ విలాసం (కాకినాడ 3120) అనే మరో విలాసకృతి వ్రాశాడు. అదీ యక్షగానమే. ఇతని మరొక యక్షగానకృతి శివకేశవ పారిజాతం (కాకినాడ, 3139). ఈ రచనల వివరాలను యస్వీ జోగారావుగారు ఇచ్చారు (యస్వీ.పుట.89). ఇతర రచనలు ఎలా ఉన్నా గూని గోవిందుని కథ చెప్పే భావనారాయణ విలాసం మాత్రం చక్కని తెలుగు దేశీయ రచన వీనులకు విందుచేస్తుంది. ముద్రించతగ్గది.

పండితారాధ్యుల వీరన

''సత్కవికర్ణ రసాయనం'' గా కావ్యాన్ని రచించానన్న ధైర్యం కొందరికే వుంటుంది. ఆ సంగతిని నిర్మొహమాటంగా చెప్పుకొన్న వాళ్ళలో పండితారాధ్యుల వీరయ్య ఒకడు. ఈయన కొన్ని శివలీలలను గంగా గిరీశ విలాసమనే పేరుతో వ్రాశాడు. అయిదాశ్వాసాల కావ్యంగా దీనిని ప్రశస్త ప్రబంధమని పరిశోధకులు పేర్కొన్నారు (ఆర్.993). ఇది అచ్చుపడలేదు.

కృష్ణపాటి వీరరాఘవయ్య

శివుడు జాలరిపిల్ల గంగను పెళ్ళాడినట్టే విష్ణువు చెంచువాళ్ళ అమ్మాయి లచ్చిని చేసుకొన్నాడు. ఈ కథను నరసింహవిలాసం అనే ప్రబంధంగా కృష్ణపాటి వీరరాఘవయ్య

వ్రాశాడు. ఇది మూడాశ్వాసాల కావ్యం. దీని ప్రతి ఆంధ్రసాహిత్య పరిషత్తులో ఉంది (గ్రంథసంఖ్య. 2616).

ఎరగుడిపాటి వెంకటకవి

విష్ణువు, మోహినీ అవతారంతో శివుడంతటివాడినే భ్రమింప చేశాడట. ఈ విష్ణుమాయావిలాసాన్ని ఇంతకుముందు నలుగురు రచించారు. ఎరగుడిపాటి వెంకటకవి అయిదోవాడు. అయిదాశ్వాసాల ప్రబంధ రూపంలో దీనిని చెప్పి బిట్రగుంట వెంకటేశ్వర స్వామికి అంకితమిచ్చారు. కవి ఆ ఊరువాడే. రచన రసవంతమని పరిశోధకుల అభిప్రాయం. (డి.789)

పెనుమర్తి వెంకటకవి

ఎవరేనా తన గ్రంథానికి విలాసమని పేరుపెట్టినంత మాత్రాన అది కథాకావ్యం కానక్కరలేదు. పెనుమర్తి వెంకట కవి ఈ యుగంలో ఒక ఛందోగ్రంథం వ్రాసి దానికి లక్షణ విలాసం అని పేరుపెట్టాడు (డి.1315). ఇందులో విశేష విషయాలు అంతగా లేకపోయినా కొన్ని అపూర్వమైన ప్రాచీన గ్రంథాల నుంచి ప్రయోగాలను చూపించాడు. ఆ పుస్తకాలు ఏమంటే 1. ఆదినారాయణ విలాసం, 2. ఆదిపురాణం, 3. కవి కంఠాభరణం, 4. నీతిభూషణం, 5. మర్రికంటివారి ప్రయోగం, 6. విజయసేన.

ఇలాంటి ప్రయోగాలను సేకరించి ఒక కొత్త లక్షణ సర్వస్వాన్ని తయారుచేయడం మన లాక్షణికుల విధి.

సరసకవి వెంకటకృష్ణమాచార్యులు

కొత్త బాణీలు చేపట్టడానికి వీలులేని యుగంలో కవులు కొత్త కథా సూత్రాల కోసం వెతుకుతారు. గ్రంథ ప్రచారం విస్తారంగా లేని రోజులలో ఎవరికి వారు ఆ కథను మొట్టమొదట మేమే వ్రాస్తున్నామనుకుంటారు. సరసకవి వెంకటకృష్ణమాచార్యులు అనే ఆయన వైష్ణవ దివ్యసూరులలో ఒకడైన ఆళవందారు చరిత్రను ''యామునా విజయ విలాసం'' అనే పేర అయిదాశ్వాసాల పద్యకావ్యంగా వ్రాశాడు. ''కలలో వచ్చినవాడు రాఘవుడు తత్కావ్యంబు నవ్యంబు నా పలుకంత సార్థకమయ్యె నేడు'' అని కవి చెప్పుకొన్నాడు (ఆర్.589). ఈ సరసకవి రచన వెలుగు చూస్తే మరింత సార్థకమవుతుంది.

పోడూరి వెంకటరాజు

కొందరు కవులు తమ జీవితాలను స్వామికార్యంతోనూ, స్వకార్యంతోనూ సార్థకం చేసుకోవాలనుకొంటారు. పోడూరి వెంకటరాజు అనే ఆయన విజయనగర సంస్థానంలో ఏనుగువలసలో ఉండేవాడు. 1848లో విజయరామరాజుగారు పట్టాభిషేకం చేసుకొన్నప్పుడు ఆ విలాసాన్ని రామాయణంతో కలిపి వర్ణించాలని కవి భావించాడు. రామలీలా విలాసం అనే మూడాశ్వాసాల కావ్యం వ్రాశాడు. ఇతనిదీ సహజపాండిత్యం. పోడూరివారి కుటుంబంలో ఇంతకుముందు చాలా కవులు ఉన్నారు. ఈ యుగారంభంలో ''శివరామాభ్యుదయం'' అనే కావ్యం చెప్పిన పోడూరి పెదరామయ్యగారు ఈ వెంకటరాజు తాతగారికి తాత అవుతాడు. పోడూరివారు ఆదిలో గోదావరి

ప్రాంతంలో ఉండేవారు. ఉత్తరోత్తరా విశాఖపట్నం జిల్లాకు వచ్చారు. పూసపాటివారి ''లీలాగుణవర్ణన''లు చేసి అగ్రహారాలు సంపాదించినట్టు కనబడుతోంది. పోడూరి వెంకటరాజు వ్రాసిన ''రామలీలావిలాసం''లో పూసపాటి గజపతి రాజుల చరిత్ర దొరకవచ్చు. ఈ ''శృంగారప్రబంధం'' వెలుగు చూసినట్టు కనబడదు. దీని అముద్రిత ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.612)

బండి వెంకటస్వామి

రామాయణాన్ని సైతం శృంగార ప్రబంధంగా వ్రాసే కవులున్నప్పుడు రంభానలకూబరుల కథను ప్రౌఢ శృంగారంగా వ్రాసేవాళ్ళు ఉండకపోతారా? బండి వెంకటస్వామి అనే ''ప్రబంధ రచనా చాతుర్యధుర్యుడు'' అయిదాశ్వాసాలలో రంభానలకూబర విలాసాన్ని వ్రాశాడు (ఆర్.531). ఇతడు ''సుందోపసుందోపాఖ్యానం'' అనే ప్రబంధాన్ని దీనికి ముందు వ్రాసినట్టు తెలుస్తోంది. అది నష్టమయినట్టుంది.

శ్రేష్ఠలూరి వెంకటాచార్యులు

వివిధ పురాణాలను గాలించి ఒకే కథ ఎన్నిరకాలుగా ఉందో చూసి పునరుక్తి లేకుండా కావ్యం వ్రాయడానికి మంచి కృషి చేయాలి. తిరుపతిలో ఉన్న వెంకటేశ్వరుని మాహాత్మ్యాన్ని ''వారాహ, వామన బ్రహ్మాండ, పద్మ, గరుడడు, స్కాంద, మార్కండేయాది ముఖ్యపురాణాలు చెప్తాయి. వీటన్నిటినీ శోధించి ''కసటు దేల్చి ప్రసిద్ధ కథ సంగ్రహించి'' శ్రేష్ఠలూరి వెంకటాచార్యులు ''శ్రీనివాసవిలాసం'' అనే ద్విపద కావ్యాన్ని వ్రాశాడు. ఇతడు ద్విపదలో రచన చేసినా ఘటికుడే. అష్టభాషలు తెలిసినవాడు. అష్టావధాని బిరుదు పొందినవాడు. ఇతడు క్రీ.శ.1800 ప్రాంతాలలో ఉండి ఉంటాడని కోరాడ రామకృష్ణయ్యగారు భావించారు.[10] అయితే బ్రౌను దొరగారు చెప్పినట్టు కావ్యంలో హిందూస్థానీ పదాలు కొల్లలుగా ఉండడం వల్ల కవి అంత పాతవాడు కాడేమో అని అనుమానం. క్రీ.శ.1750 వాడు కావచ్చు. ఈ కావ్యం ఏమంత ఘనంగా లేని ఆధునిక రచన అని బ్రౌనుదొరగారి అభిప్రాయం ''రాజును చూచిన కళ్ళతో మొగుణ్ణి చూస్తే మొత్తబుద్ధి'' అనే సామెత ఈ అభిప్రాయానికి వర్తిస్తుందని కోరాడవారు భావించినట్టుంది. ''ఆంధ్రభారతమును మన వసుచరిత్రాది ప్రబంధములను పండితుల సహాయముచే వ్రాయించి సంపాదించిన బ్రౌను దొరగారికి వైష్ణవ కథా రూపమగు, నీ ద్విపద కావ్యమంతగా రుచింపకుండెదనుటలో నాశ్చర్యము లేదు'' అని కోరాడవారు అన్నందుకు నేను ఆశ్చర్యపడుతున్నాను. నవనాథ చరిత్ర, హరిశ్చంద్ర, నలచరిత్ర వంటి ప్రశస్త ద్విపద కావ్యాలను దొరగారు మెచ్చుకోడమేకాక అచ్చువేయించారు. 'పురాణ మిత్యేవ న సాధుసర్వం'' అన్న సూక్తిని దొరగారు వాడవలసినచోట వాడుతారు.

ధర్మపురి విశ్వేశ్వరుడు

పాతదైనంత మాత్రాన రోత అనకపోయినా కొత్తవన్నీ వింతగానే మొదట ఉంటాయి. శాలివాహనుడి కూతురు చంద్రలేఖ పెళ్ళి కథను విశ్వేశ్వరుడు అనే కవి

10. శ్రీనివాస సేవధి. పీఠిక. టి.టి.డి. ప్రచురణ, పుట.7

''ధర్మపురి మాహాత్మ్యం'' అనే పేర వ్రాశాడు. అయితే ఇందులోని హీరో చేసిన సాహసకృత్యాలు, హీరోయిన్ చంద్రలేఖ కోసం ''కలియుగ పొన్నపూలు'' తేవడం మొదలైన ఘట్టాలు చదివి ఆనందించిన లేఖకుడు ఈ యక్షగానానికి చంద్రలేఖా విలాసం అని పేరుపెట్టాడు. బహుశా ఈ కవిపేరు రాఘవయ్య కావచ్చును అని పరిశోధకులు భావిస్తున్నారు (యస్వీ. పుట.73). ఈ యక్షగానం ప్రతి ఆంధ్రసాహిత్య పరిషత్తు కార్యాలయంలో ఉంది. (కాకినాడ నె,.863)

చదువుల సోమలింగం

గానానికి నారద తుంబురులు ప్రసిద్ధులు. తుంబురుడి కూతురి పేరు మదనసాయక. ఈ చిన్నది ఋతుధ్వజమహారాజును ప్రేమించి పెళ్ళి చేసుకొంది. ఈ కథను ''మదన సాయకా విలాసం'' అనే పేరుతో చదువుల సోమలింగయ్య రచించాడు. ఈ కృతే కాకుండా ఇతడు శ్రీశైల మల్లికార్జునుడి పేర ''నూరుకందముల్ పొందుగ పుష్పమాల వలె బూన్చి'' చెప్పాడు. ఈ శతకం దొరకలేదు. ఇతడు శతకకవుల చరిత్రకు (అనుబంధంలోనికి కూడా) ఎక్కలేదు. మదన సాయకావిలాసం అముద్రితం. ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో అసమగ్ర ప్రతి ఒకటి ఉంది (ఆర్.471). ఈ యుగంలోనే కుమారీ శతకం వ్రాసిన ఫక్కి వెంకట నరసయ్య ఒక మదన సాయకా పరిణయాన్ని చెప్పాడు.

ఈ ఇరవైమూడు మందేకాక అకలంకం కృష్ణమాచార్యులు, కాణాదం పెద్దన, కొత్తపల్లి లచ్చన్న, అల్లమరాజు రామకృష్ణయ్య మొదలైనవాళ్ళు కూడా తమ గ్రంథాలకు విలాసమనే పేరుపెట్టినా ఈ కావ్యాలన్నీ నిజంగా నాయికానాయకుల చరిత్రలే.

అయితే తమ గ్రంథాలకు చరిత్రలని పేరు పెట్టినవాళ్ళు లేకపోలేదు. వాళ్ళ గురించి కూడా అకారాదిగా చెప్పుకొందాం.

నల్లందిఘుల అప్పలాచార్యులు

ఏ కథను తీసుకొని చెప్పాడోగాని ఈయన ''ధరాసాగరేశ చరిత్ర'' అనే కావ్యం వ్రాశాడు. దీనిని ఏనూళ్ళ పరాంకుశ రాజుకు అంకితమిచ్చాడు. కృతికర్త తండ్రిపేరు వెంకటాచార్యులు. వీళ్ళు హుజూరునగరం తాలూకాలోని శుభ్రవీడువాసులు. 1834 ప్రాంతాలలో ఉన్నారు. ఇంతకన్నా వివరాలు తెలియవు.[11]

మేడూరి అప్పన్న

ఈ యుగంలో ప్రజలను బాగా ఆకర్షించిన శైవగాథలలో సురాభాండేశ్వరం కథ ఒకటి. దీనిని చాలామంది చాలా రూపాలలో చెప్పారు. మేడూరి అప్పన్న అనే ఆయన ''వరుణాత్మజాకుంభేశ్వర చరిత్రము'' అనే పేరుతో అదే కథను రెండాశ్వాసాలలో చెప్పాడు. గణుతూరి నరసరాజుకు అంకితమిచ్చాడు. ఈ నరసరాజుగారి సవతి తల్లి సింగమ్మ ''కవిజనంబుల రక్షింపగల్పశాఖివలెను చెన్నారు'' చుండేదట. ఆడవాళ్ళు సైతం కవులను పోషించే గణుతూరి వారి కుటుంబం ప్రశంసనీయమే. మేడూరి అప్పన్న తండ్రి

11. గోలకొండ కవుల సంచిక - పుట.395

జగ్గయ్య. జాతక సిద్ధాంతాది శాస్త్రాలలో ధురంధరుడు. అప్పన్న ఈ గ్రంథాన్ని ''మృదులపద కల్పనారీతి''తో రచించదలిచారు. ఎంతవరకు కృతకృత్యుడయ్యాడో తెలియదు. పుస్తకం అచ్చుపడలేదు. దీని ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.600)

మాచిరాజు కామరాజు

మేడూరి అప్పన్నలాగే రెండు ఆశ్వాసాలలోనే కావ్యాన్ని మాచిరాజు కామరాజు ముగించాడు. ఈయన హరిహరదాసుడు. అయితే పక్షపాతం లేకుండా లక్ష్మీనారాయణు లకు ఒక పుస్తకం, పార్వతీ పరమేశ్వరులకు ఒక పుస్తకం అంకితమిచ్చి హరిహరుల పేర ఈ గోవ్యాఘ్రు చరిత్ర రచించాడు. ఈ పుస్తకం కూడా వెలుగు చూడలేదు. (ఆర్.44)

కుమార శరణయ్య

పురాతన చరిత్రలను మాత్రమేకాక సమకాలిక విషయాలను కూడా ఈ యుగంలో కవులు వర్ణించుతూ కావ్యాలు చెప్పారు. పోడూరి వెంకటరాజు రామలీలా విలాసంలో విజయరామ గజపతి పట్టాభిషేకాన్ని వర్ణించడం గమనించాం.. కుమార శరణయ్య అనే కవి తరిగొండ రమణయ్యగారు జరిపించిన శరన్నవరాత్రుల ఉత్సవాలను ''నవరాత్ర చరిత్ర'' అనే పేర ప్రశంసించాడు. ఇది ఏకాశ్వాస చాటు ప్రబంధం. తరిగొండ రమణయ్య ఎవరో తెలియదు. కవి గురించి కూడా వివరాలు బయటపడలేదు. (ఆర్.498)

వెనవెళ్ళ గంగాధరం

శివభక్తులలో చిరుతొండడు ప్రసిద్ధుడు. అతని కథను సిరియాళ చరిత్ర అనే పేరుతో వెనవెళ్ళ గంగాధరం ద్విపదగా చెప్పాడు. దీనిని రాచవీటి వీరభద్రస్వామికి అంకిత మిచ్చాడు (ఆర్.278). రచన పాటలాగ మాత్రాధిఖ్యాలతో ఉంది.

శ్రీనివాసాచారిగారి చినవెంకటాచార్యులు

కేవలం కల్పనా కథలు కృత్రిమరత్నాలని భట్టుమూర్తి నిరసించినా కొందరు ప్రతిభా వంతులు స్వకపోల కల్పితాలను జాతిరత్నాలను చేయగలరు. పింగళి సూరపరాజుగారు అలాంటి ప్రతిభావంతులు. ఆయన తీసిన బాటలో ప్రయాణం చేయడానికి ధైర్యం కావాలి. ఈ యుగంలో చినవెంకటాచార్యులు అనే కవి కళాపూర్ణోదయం బాణీలో ''భద్రరాజపురచరిత్ర'' అనే అయిదాశ్వాసాల ప్రబంధం వ్రాశాడు. కళాపూర్ణోదయంలో లాగా ఇందులో కూడా కృష్ణుడు కనబడతాడు. కవిత్వమంత ప్రౌఢమయినది కాదని వీరేశలింగంగారు ప్యాసుమార్కులు వేయలేదు. ఈ గ్రంథం అచ్చుపడలేదు. (డి.596)

గరికిపాటి తమ్మయ్య

ఇంతకుముందే వెనవెళ్ళ గంగాధరం ఒక సిరియాళ చరిత్ర వ్రాసినట్టు గమనించాం. గరికిపాటి కృష్ణయ్య కూడా ఒక సిరియాళ చరిత్ర వ్రాశాడు. అయితే ఇది పద్యకావ్యం. మూడాశ్వాసాలు. కవితామ కవితాసామ్రాజ్య ధురంధరుణ్ణి అని గద్యలో చెప్పుకొన్నా ఇది చాలా నీరసకావ్యం అని పరిశోధకుల అభిప్రాయం.

రుద్రరాజు తిరుమలరాజు

నీరసకావ్యమో సారసకావ్యమో ఎవరైనా స్వయంగా గ్రంథంవ్రాస్తే కొంత గౌరవం ఉంటుంది. కూలికి పుస్తకం చెప్పించి ఇతరులు వ్రాసినది తన పేర చలామణీ చేయించుకొనడం ఒక రకమైన చాపల్యం. ఈ యుగంలో తిరుమలరామరుద్రరాజు అనే పెద్దమనిషి ''నిరర్గళ కవితా విలాస సంతోషి తానేక విద్వత్కవిరాజు'' ననిపించుకొన్నాడు. కవిరాజు ననిపించుకొడానికి కొత్తలంక మృత్యుంజయుడనే కవిచేత చెప్పించిన ''నలరాజుచరితం' అనే పుస్తకంలో తన గద్యను వేసుకొన్నాడు. మృత్యుంజయుడు ''సకల సుకవి జనానుగ్రహ సహాయుడ'' నని తన గద్యలో చెప్పుకొంటూ ఈ నలచరిత్ర ఇతర ప్రతులలో తన పేరే వ్రాసుకొన్నాడు. అందుచేత నిజమైన రచయిత ఎవరో తెలుస్తుంది. అయినా రుద్రరాజు తిరుమలరాజు కవిపోషకుడు కాబట్టే గుడ్డిలో మెల్ల అని సంతోషించాలి. అందుకే దీనిని గ్రంథ చౌర్యం అనకుండా ఒకరు కన్నబిడ్డలను ఇంకొకరు పెంచుకొన్నట్టు ఒకరి కావ్యకన్యకను ఇంకొకరు దత్తతగా స్వీకరించాలని ఈ సందర్భంలో పండితులు మృదువుగా వ్యాఖ్యానిస్తున్నారు. (డి.541)

కోవెల తిరువెంగళరాజు

గ్రంథాలు తస్కరించడంకన్నా డబ్బిచ్చి కొనుక్కోడం గుడ్డిలో మెల్ల అనుకొన్నా మంచికావ్యం కోసం దొంగతనం చేసినా తప్పులేదనే తప్పుడు సిద్ధాంతం మన దేశంలో ప్రచారంలో ఉంది. ''వైష్ణవార్థముగ దొడరి దొంగిలిననే దోషంబు లేదు'' అనే తత్త్వంలో దొంగతనం చేసిన భక్తులను మనం పరమయోగులను చేసేస్తాం.[12] పన్నిద్ధరాళ్వార్లలో పరకాళుడు ఒకడు. ఈయన వైష్ణవులకు నిత్య సంతర్పణలు చేయడానికి దారి దోపిడీలు చేశాడు.[13] ఆయననే అరవంలో తిరుమంగయాళ్వారు అంటారు. ఇతడి చరిత్రను ద్విపదగా కోవెల తిరువెంగళదాసు శృంగార నాటక గేయప్రబంధంగా వ్రాశాడు. ఇతడు నూజివీడు ప్రాంతంవాడు కావచ్చును. శోభనా చలపతికి ఇది అంకితమిచ్చాడు. ఈ తిరుమంగయాళ్వారు చరిత్ర ప్రతి ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.345)

బొమ్మకంటి నరసింహం

తెలుగుదేశపు జానపదులను బాగా ఆకర్షించిన కథలలో ధర్మాంగద కథ ఒకటి. కాశ్మీరాన్ని పాలించే ధర్మాంగద మహారాజుకు పిల్లలు లేరు. లేకలేక ఆ రాజుకు సంతాన ప్రాప్తి కలిగింది. అయితే పుట్టిన బిడ్డ పాముపంలో ఉన్నాడు. గుట్టుచప్పుడు కాకుండా కొడుకు పుట్టినట్టే పెంచి, సాటి రాచవారింటి చిన్నదానిని తెచ్చి పెళ్ళి చేశారు. ఆ వచ్చిన కోడలుత్తమురాలు కనుక తన పాతివ్రత్య మహిమనూ, తెలంగాణాలోని ధర్మపురి మహిమను చాటడానికి నానా కష్టాలుపడి భర్తకు మానవ రూపాన్ని సంపాదించింది. ఈ కథ 'పాముపాట''గా ఆంధ్రదేశంలో ప్రసిద్ధమైంది. ఈ యుగంలో ముగ్గురు దీనిని రచించారు. ఒకదాని కర్త ఎవరో తెలియదు. స్త్రీలపాటుగా చెలామణి అయింది. రెండోది

12. పరమయోగి విలాసం – తాళ్ళపాక చిన్నన్న. ఆరవ ఆశ్వాసం. పుట 485.
13. నాయకరాజుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం రెండవ సంపుటి 2003.

ద్విపద. దీనిని బొమ్మకంటి నరసింహం వ్రాశాడు. ఇతడు బహుశా ధర్మపురి ప్రాంతాలవాడు. మూడవది జానపదగేయం. కర్త ఈపూరి నారాయణరాజు. విజయనగరం ప్రాంతాలవాడు విజయరామ గజపతికాలంవాడు. ఈ మూడు రచనలనూ మిత్రులు బిరుదురాజు రామరాజుగారు చక్కగా విమర్శించారు.[14] బొమ్మకంటి నరసింహం వ్రాసిన ధర్మాంగద చరిత్ర "సరళభాషలో ఔచితీ శోభితమై మనోహరం"గా ఉందని రామరాజుగారు చెప్తున్నారు. ఈ ద్విపద కావ్యం అముద్రితం. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో 10 ప్రతులు ఉన్నాయి. (డి.1054 నుండి 1063).

కొత్తలంక మృత్యుంజయుడు

తాను రచించిన గ్రంథాలను ఇతరుల పేరిట చెలామణి చేయనివ్వడానికి మమకారం తెంచుకోవాలి. డబ్బుకోసమో మరెందుకో ఇతరుల గద్యలతో గ్రంథాలు వెల్వరించి మనసు ఉండబట్టలేక మళ్ళా గద్యలో అవే గ్రంథాల ప్రతులను జాగ్రత్త చేయడం మానవసహజమైన స్వార్థాన్ని ప్రకటిస్తుంది. రుద్రరాజు తిరుమలరాజు పేరిట నలచరిత్రను ప్రకటించిన కొత్తలంక మృత్యుంజయుడు మళ్ళా తన గద్యతో కొన్ని ప్రతులను ప్రచారం చేయడం గమనించాం. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్న 5 ప్రతులలో మూడు మృత్యుంజయుని గద్యతో, రెండు తిరుమలరాజు పేరుతో ఉన్నాయి. ఇంకొకరి పేరుతో తన గ్రంథాలను ప్రచారంలోనికి వెళ్ళనిచ్చి మళ్ళా తన పేరు చెప్పుకొనడం మృత్యుంజయునికి అలవాటే. ధర్మాత్మజాపరిణయం అనే కావ్యాన్ని అల్లూరి అప్పలరాజుగారు రచించినట్టు అవతారికలో వ్రాశాడు. చివర తన గద్య వ్రాసుకొన్నాడు. "సొడ్డు సొడ్డంటే ఊరంతా సొడ్డు పెట్టాడన్న" సామెత చెప్పినట్లు రెండు గ్రంథాలు ఇలా ఇంకొకరిపేర రచించగానే చాలాగ్రంథాలు మృత్యుంజయుడే వ్రాసి ఇతర పేర్లు పెట్టాడని కొందరు జాబితా వ్రాశారు.[15] చూడండి

	గ్రంథనామం		ప్రణీత కృతికర్తలు
1.	శ్రీకృష్ణవిజయం (?)	-	విజయనగర మహారాజుగారికి
2.	మూర్తిత్రయోపాఖ్యానం	-	ఉప్పాంగల దంతులూరి వారికి
3.	షట్చక్రవర్తి పరిణయం	-	అల్లూరి అప్పలరాజుకు
4.	ధర్మాత్మజాపరిణయం	-	అల్లూరి అప్పలరాజుకు
5.	నిరోష్ఠ్యనల చరిత్ర	-	బోడిపాకల రాజులకు
6.	బృహన్నారదీయం		

ఈ జాబితా ఇచ్చినవారు ఇంకొక సవాలు చేస్తున్నారు. "ప్రణీత కృతికర్తలే ఈ గ్రంథాలకు నిజమైన కృతికర్తలన్నచో నిన్ని పొత్తముల శైలియు, వర్ణనలు నొక్కరీతిగా

14. తెలుగు జానపద గేయసాహిత్యం, పుట 580 నుండి.

15. ధర్మాత్మజా పరిణయం - పీఠిక - పుట.2. పీఠికాకారులు ఎవరో టి.వి. అచ్చుపడ్డ పుస్తకం ముఖపత్రం నేను చూడలేదు. వివరాలు నాకు దొరకలేదు.

నేలయుండును? ఇది అన్ని గ్రంథాలనూ తైపారుచేసి ఉదాహరణలిస్తూ వేయవలసిన ప్రశ్న. శ్రీకృష్ణవిజయం, షట్చక్రవర్తి చరిత్రలు కొంచెం ప్రాచీనుల రచనలుగా ప్రసిద్ధమయ్యాయి. దంతులూరి బాపిరాజు పేర్ల ప్రచురమయిన మూర్తిత్రయోపాఖ్యానం వ్రాతప్రతుల చివర కొత్తలంక మృత్యుంజయుని గద్య లేకపోయినా ఈ పద్యం ఉంది.

శ్రీలీల మదనగోపాల మూర్తిగృతీంద్రు
    గాదంతులూరి బాపయేదీ నీశు
గవిగానొనర్చి సత్కవిరాజు మృత్యుంజ
    యాఖ్యుడు విరచించినట్టి దైన
మూర్తిత్రయ చరిత్ర ముదమొప్పశాలివా
    హనశక వర్షంబు లజగుణాద్రి
చరిత్ర సంఖ్యానెసంగ జరుగునీశ్వర
    శరత్సహితాది మాసశుద్ధ హరిదివస
భృగుదినంబున లిఖియించి పేర్మిమీర
దంతులూరి పద్మరాజ భూకాంతమణికి
నొసగినల్లమరాజ వంశోద్భవుండు
రంగధాముడు ముదితాంత రంగుడగుచు'' (కాకినాడ గ్రంథ సంఖ్య. 1960)

ఇందులో అల్లమరాజు రంగధామంగారి నిజాయతీ కనబడుతోంది. క్రీ.శ. 1818 నాటి ఈశ్వరకే మూర్తిత్రయ చరిత్ర రచన జరిగినట్టు తెలుస్తోంది. కవికాలం రమారమి ఇదే. ఈ సాక్ష్యంవల్ల ఇతరుల పేరిట పుస్తకాలు రచించడంలో మృత్యుంజయుడు స్పెషలిస్టు అని చెప్పాలి. ఒక్క బృహన్నారదీయం మాత్రమే ఇంకెవరి పేరు అవతారికలో కృతికర్తగా చెప్పకుండా తన పేర ప్రకటించాడు. (ఆర్.86)

వాస్తవానికి మృత్యుంజయుడు చాలా చెయ్యితిరిగిన కవి. నలచరిత్రను నిరోష్ఠ్యంగా వ్రాసినా ఎక్కడా ధార ఆగదు. పద్యం కుంటదు. ఓష్ఠ్యాలపైన దృష్టిపడదు. ధర్మాత్మజాపరిణయం చక్కని ద్వ్యర్థికావ్యం. లక్ష్మీపార్వతుల పెళ్ళి కథలను ఏకకాలంలో చెపుతుంది. మూర్తిత్రయ చరిత్రలో ''పరబ్రహ్మమునకు సత్త్వరజస్తమోగుణ సంసర్గముచే గల్గిన మూర్తిభేదములగు బ్రహ్మవిష్ణుశివుల చరిత్రమును ఆరాశ్వాసాల ప్రబంధంగా చెప్పాడు. ఇన్ని చరిత్రలు, కావ్యాలు వ్రాసిన మృత్యుంజయుని కావ్యజీవితాన్ని కూడా ఒక చరిత్రగా చెప్పుకోవచ్చును.

బాపన్నగారి యాదవయ్య

మన కథాసాహిత్యంలో విక్రమార్కచరిత్ర, చంద్రహాస చరిత్ర వంటివి చాలా ప్రాచీనాలు. ఈ రెండు కథలనూ బాపన్నగారి యాదవయ్య ఈ యుగంలో రచించాడు. అయితే ఇందులో ఒకచోద్యం ఉంది. విక్రమార్కచరిత్రను వచనంలో వ్రాశాడు. చంద్రహాసవిలాసాన్ని ''వచనముల్ చెప్పకే పద్యముల్ సేయనొప్పు'' అని నిర్వచనంగా రచించాడు. చంద్రహాసుడను భూపోత్తంసకాధీశ్వరాభ్యుదయంబందు'' చిట్టచివర

గద్యకూడా వ్రాసుకోక పద్యాలలోనే తన సంగతీ, ఆశ్వాస సంఖ్యా చెప్పాడు. ఒక్క సుగుణం, విక్రమార్క చరిత్రలో వచనం వ్రాస్తున్నందుకు పద్యాలను దూరం చేయలేదు. ప్రతి కథకూ మొదట దాని కథా సంగ్రహాన్ని ఒక సీసంలో వ్రాశాడు. ఈ గ్రంథాలు రెండూ అముద్రితాలు అనుకొంటాను. విక్రమార్క చరిత్ర (ఆర్.344), చంద్రహాసవిలాసం (డి.498) ప్రతులు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. రచయిత వివరాలు అట్టే తెలియవు.

బంగారు రంగప్ప

విక్రమార్కుని కథలలో బేతాళుడు చెప్పినవి చాలా ఉన్నాయి. ఎవరైనా కవి బేతాళ చరిత్ర వ్రాస్తే అది విక్రమార్కుని కథకు సంబంధించినదే అని పొరబడడానికి వీలుంది. అయితే తెలుగువాళ్ళ చరిత్రలో కూడా ఒక బేతాళుడు ఉన్నాడు. పద్మనాయకులలో రేచర్ల గోత్రానికి ఆద్యుడైన బేతాళరెడ్డి చాలా ప్రసిద్ధుడు. అతని పరాక్రమ పౌరుషాలు, ఆలయ నిర్మాణాలు మొదలైన వాటిని అన్నసముద్రం చిన్నవీరయ్యా అనే ఆయన సంస్కృతంలో కీర్తించాడు. ఆ గ్రంథాన్ని ఆధారం చేసుకొని బంగారు రంగప్ప అనే ఆయన ద్విపద కావ్యంగా బేతాళ చరిత్రను వ్రాశాడు. ఇతడు క్రీ.శ. 1770లో పిల్లలమర్రి ప్రాంతాలలో జీవించేవాడు. ఈ ద్విపదకావ్యం ప్రతులు అనుమకొండ పరిశోధక మండలిలోనూ, హైదరాబాదు లక్ష్మణరాయ పరిశోధక మండలిలోనూ ఉన్నాయి.

హర్యపరాజు రంగశాయి

ఈ యుగంలోని ఇతర కవులలాగే ఒక చరిత్రనూ, ఒక విలాసాన్నీ హర్యపరాజు రంగశాయి కూడా రచించాడు. ఇతడు వ్రాసిన అంబరీష చరిత్ర అయిదాశ్వాసాల ప్రబంధం. ద్వాదశీవ్రత మాహాత్మ్యాన్ని చెప్తుంది. కవితాను శృంగార కవితాభిరాముడనని గద్యలో చెప్పుకొన్నాడు. ఈ గ్రంథంలో ఎంత శృంగారం ఉందో తెలియదు (డి.370). కాని ఇతడు చెప్పిన ''శివమృగయా విలాసం''లో శృంగారం వ్రాయడానికి ఆస్కారం ఉంది. అందులో శివుని దారుకావనవిహారం, గౌరిదేవి ఈర్ష్య మొదలైనవి వర్ణించాడు. ఇది ఏకాశ్వాస గ్రంథం (డి.825). ఈ కావ్యాలు రెండూ అచ్చుపడలేదు. ఈ కవి చరిత్ర బయటపడలేదు.

శేషం రఘునాథాచార్యులు

ఈ యుగంలో శేషం వారి కుటుంబంలో చాలామంది రచయితలు కనబడుతున్నారు. శేషం రఘునాథాచార్యులు, మిగతావాళ్ళకు ఎలాంటి బంధువో పరిశోధించాలి. ఇతడు ''కులశేఖర మహీపాల చరిత్రము'' అనే పేరిట కులశేఖర ఆళ్వార్ల కథను ''ఆంధ్రగీర్వాణ మిశ్ర పద్యాంతరముల''లో చెప్పాడు. ఇది మూడాశ్వాసాల గ్రంథం. ప్రశస్త రచనమని పరిశోధకుల అంచనా. (డి.2077)

ముకుందపురి రామకవి

మన కవులు వివాహ కథలకు పరిణయ కావ్యాలు అనక, చరిత్ర అనే పేరును కూడా పెడతారు. ముకుందపురి రామయ్యా అనే ఆయన కృష్ణుని కుమారుడు సాంబుడు

దుర్యోధనుడి కూతురు లక్షణను పెళ్ళాడే కథను సాంబచరిత్ర అనే పేర పద్యకావ్యంగా వ్రాశాడు. ఇది మూడాశ్వాసాలు, అముద్రితం (ఆర్.937). కవి తాను ''సరసకవి''నని గద్యలో చెప్పుకొన్నాడు.

నాగుల రామకవి

రామాయణంలోని ఋష్యశృంగుని కథ చాలామందిని ఆకర్షించుకుంది. ఎందరో దీనిని కావ్యరూపంలో చెప్పారు. ఈ యుగంలో నాగుల రామయ్య అనే ఆయన భారతంలోని కథను తీసుకొని నాలుగాశ్వాసాల శృంగార కావ్యంగా వ్రాశాడు. దేవుడే కలలో కనబడి నన్నయగారు సంక్షేపరూపంగా చెప్పిన కథను ''ఆంధ్రంబును సంస్కృతంబునను నిరుతెరంగుల మాటలకూటమిన్ వాటమగునటుల సమగ్రంబుగ'' రచించమని ఆర్డరు వేశారట. ఈ ఋష్యశృంగచరిత్ర అచ్చుపడలేదు. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు కార్యాలయంలో దీని ప్రతి ఉంది. (గ్రంథ సంఖ్య.2401)

బెహరా రామకృష్ణయ్య

ఋష్యశృంగుని చరిత్రలాగే నలచరిత్ర కూడా మనసాహిత్యంలో చాలామంది వ్రాశారు. ఈ యుగంలో వ్రాసిన వాళ్ళలో బెహరా రామకృష్ణయ్య ఒకడు. ఇది పద్యకావ్యం. రెండు భాగాలలో వ్రాశాడు. దీనిని రచించడానికి ఇతడు కుప్పిలి కృష్ణయ్య అనే కవిగారి అనుజ్ఞ తీసుకున్నాడట. ఆ కృష్ణయ్యగారు ''అఖిల శాస్త్రపురాణేతిహాస భాసమాన మానవజన ముఖ్యమాననీయుడట (ఆర్.546). ఇంత మహనీయుడేకాక ఈ కృష్ణయ్యగారు బెహరా రామకృష్ణయ్యకు మేనమామ. ఇతని అన్నదమ్ములు అందరూ మనీషి వరేణ్యులట. ఈ మేనమామలకు మొక్కి బెహరా రామకృష్ణయ్య ''లక్షణ విజయం'' అనే మరొక పెద్ద ప్రబంధం చెప్పాడు. అది ఎనిమిది ఆశ్వాసాల కావ్యం. రామాయణ కథనే ఇంకొకలాగ చెప్పాడు. ఇది కూడా ఇతని నలచరిత్రలాగే అచ్చుపడలేదు. (ఆర్.435)

కోదండరామయ్యగారి రామచంద్రయ్య

నలుడు షట్చక్రవర్తులలో ఒకడు. ఇతర చక్రవర్తుల కథలను విడివిడిగా కావ్యరూపంలో చెప్పినవాళ్ళు ఉన్నారుగాని ఆరుగురి కథలనూ ఒకే కావ్యంలో చెప్పినవాళ్ళు కొద్దిమందే. వాళ్ళలో రామచంద్రయ్య అనే కవి ఒకడు. ఇతని తండ్రిపేరు కోదండరామయ్య. ఆ ఒక్క సంగతి తప్ప మరే వివరాలూ తెలియవు. ఈయన షట్చక్రవర్తి చరిత్రలో హరిశ్చంద్రుని కథతప్ప మిగతావాళ్ళవి మాత్రమే గ్రంథంలో ఉన్నాయి. అవతారికలో కూడా లేనందువల్ల ఇతని చరిత్ర తెలియదని పరిశోధకులు చెప్తున్నారు. (డి.851)

కవిరాయని రామభద్రయ్య

షట్చక్రవర్తులంత కీర్తిప్రతిష్ఠలు గల రాజులలో రఘుమహారాజు ఒకడు. ఇతని చరిత్రను కాళిదాసు రఘువంశంలో కీర్తించాడు. తెలుగులో చాలామంది రఘువంశగాథ

అయిన ఇందుమతీ పరిణయాన్ని వ్రాశారు. కాని రఘుమహారాజు వృత్తాంతాన్ని చెప్పే గ్రంథం కొందరే వ్రాశారు. వాళ్ళలో కవిరాయని రామభద్రయ్య ప్రౌఢకవి అని చెప్పవచ్చు. ఇతని రాఘవ చరిత్ర మూడు ఆశ్వాసాల గ్రంథం. అచ్చుపడలేదు (ఆర్.421). కవి గురించి ఇతర వివరాలు దొరకలేదు.

పోచిరాజు వీరన

రఘువంశం సంస్కృత పంచకావ్యాలలో ఒకటి. ఈ యుగంలో ఆ కావ్య పంచకంలో ఏదో ఒకటి ఎవరో ఒకరు అనువదిస్తున్నా అన్నీ ఒక్కచేతిమీదుగా తెనిగించడం అరుదే. ఒక్క పోచిరాజు వీరన్న ఈ పంచ "కావ్యాలు" తర్జుమా చేశాడు. కాని వీటిలో ఒక్క మాఘకావ్యం (శిశుపాలవధ) మాత్రమే లభిస్తోంది. మిగతావి నష్టమయ్యాయి. ఈ అనువాదాలు అతడు 18వ యేటనే చేశాడు. అయితే 14వ సంవత్సరంలోనే రచన మొదలుపెట్టాడు. ఆ వయసులో అతడు కృష్ణార్జున సంవాదం అనే ప్రబంధం వ్రాశాడు. ఏయే వయసులలో ఏ రచనలు చేసినదీ అతడు ఒక పద్యంలో చెప్పుకొన్నాడు. వాటి వివరాలు చూడండి.

14వ యేట	కృష్ణార్జున సంవాదం	ప్రబంధం
18వ యేట	పంచకావ్యాలకు అనువాదాలు	పద్యకావ్యాలు
22వ యేట	విభూతి మాహాత్మ్యం	ద్విపద (ఆర్.635)
26వ యేట	మార్కండేయ చరిత్ర	పద్యకావ్యం
30వ యేట	మనువంశపురాణం	పద్యకావ్యం
36వ యేట	ముక్తదేవు చరిత్ర	పద్యకావ్యం
తరువాత	సౌందర్యలహరి అనువాదం	పద్యాలు
	ఆనందలహరి అనువాదం	పద్యాలు
	భర్తృహరి సుభాషితాలు	పద్యాలు
ఇవి అయ్యాక	భల్లాణచరిత్ర	ప్రబంధం (డి.600)

వీరన్న ఇన్ని కావ్యాలు వ్రాసినా ఇతని భల్లాణచరిత్ర మాత్రమే అచ్చుపడింది. ఇతడు గ్రంథ రచయితేకాక పరిశోధకుడు. ప్రతి విలేఖకుడు. చాలా కావ్యాలను వ్రాసిపెట్టి ఇతరులకు ఇచ్చాడు. మామిడి వెంకయ్యగారికి (బహుశా బ్రౌను దొరగారికి) ఇతడు చాలా కావ్యాల ప్రతులను వ్రాసి ఇచ్చాడు. తను కాపీచేసినట్టి కావ్యాల చివర ఇతడు ఆ సంగతి పద్యాలలో చెప్పేవాడు (ఆర్.1691). ఇతడు బందరులో ఉండేవాడు. పరగణాలోని జనసామాన్యం కోరికపైన మనువంశ పురాణంలాంటి కులపురాణాలు చెప్పాడు. ఇతని చరిత్ర ఇటీవల పరిశోధకుల దృష్టిని ఆకర్షించుతోంది.

పుల్లెల వీరభద్రసోమయాజులు

మన దేవాలయాలలో సంకీర్తనాచార్యులుగా ఉంటూ చాలామంది కవులు నిత్యమహోత్సవాలలో సేవాప్రబంధాలు వ్రాశారు. అయితే వాటిని ఎవరూ చరిత్ర

అనరు. పుల్లెల వీరభద్రసోమయాజులు అనే ఆయన ఇందుపల్లి గ్రామంలోని కేశవరాయస్వామివారిపై ధూపాది ఉపచారాల సందర్భంలో చెప్పిన సంస్కృతాంధ్ర గీతాలకు మాత్రం ''కేశవరాయ చరిత్ర'' అనే పేరు స్థానికులు పెట్టుకొన్నారు. ఈ పాటలు అచ్చుపడలేదు. (ఆర్.331).

ఎడవల్లి వెంకటకవి

ఈ యుగంలో కొత్త కథలు వ్రాద్దామనే సంకల్పం కొంతమంది కవులకు కలిగింది. ఎడవల్లి వెంకటయ్యా అనే ఆయన కూడా పాత దారికాక ఏదేనా నవీనంగా చెప్పాలనుకొన్నాడు. ఎలాగ కావ్యం చెప్తే లోకులకు రుచిస్తుందో ఎనలైజు చేశాడు. ఆ సంగతి ఇలా చెప్పాడు.

అత్యంతగూఢమై అర్థంబుగాని సం
దర్భంబు కవిత కొందరకు బ్రియము
సరవినశ్రుత పూర్వ శబ్ద ప్రయోగముల్
చెరగిన కవిత కొందరకు బ్రియము
పోడిమి రెట్టింప వాడిక మాటలు
తరచైన కవిత కొందరకు బ్రియము
సెలయేళ్ళ దుమికిన సరణి జంఝూళి
తంబైన కవిత కొందరకు బ్రియము
భూమిని నందర మనసురా గవితసెప్పి
మెప్పుగైకొనగనవశక్యమప్పనమున
దాచనేటికి బుద్ధికి తోచినటుల
రచన చేసెద వినరయ్యా రసికులార! (ఆర్.116)

నూతన చరిత్ర ఏదేనా చెప్పాలని అతని బుద్ధికి తోచింది. ''కావున'' నొక్క క్రొత్తకథ కావ్యము చేసెదనంచు నెమ్మదిన్ భావన సేయుచు పతిత పావన నామ చరిత్ర పాత్రమైవావిరి'' దోచిందట. పతితుడైన బ్రాహ్మణుడు ఒకడు రామ మంత్ర ప్రభావంచేత పవిత్రుడైన కథను మూడాశ్వాసాలలో కవి చెప్పాడు. ఇతని పూర్వులు మట్లవారి కొలువులో కవులు ''పల్లకీ వదస్థులు''గా అలరారినవాళ్ళు. ఎడవల్లి వెంకటయ్యా కవిత్వంలో అందాలు అందలాలు ఎక్కాయో లేదో తెలియదు. ఇతని గ్రంథం అముద్రితం.

పిడుగు వెంకటకవి

ఎడవల్లి వెంకటయ్యాలాగ కొత్త కథల కోసం తాపత్రయపడక కొందరు కొట్టిన పిండితోనే రొట్టెలు చేస్తారు. పిడుగు వెంకటయ్యా ''విప్రనారాయణ చరిత్ర''లోనే తన ''అతులిత రసకవిత''ను ప్రకటించదలచుకొన్నాడు. మూడాశ్వాసాలలో ఆ పద్య

కావ్యాన్ని వ్రాసిన రంగనాథస్వామికి అంకితమిచ్చాడు. ఇతడు ఎక్కడివాడో, ఏమిటో వివరాలు తెలియవు. ఇతని కావ్యానికి అసమగ్ర ప్రతి తంజావూరు సరస్వతీ మహాలు గ్రంథాలయంలో ఉంది (తం.డి.256). బహుశా పిడుగువారు తంజావూరు ప్రాంతాలవాళ్ళే కావచ్చును.

గూడూరు వెంకటదాసు

''అత్యంత గూఢమై అర్థంబుగాని సందర్భాలూ, అశ్రుత పూర్వ శబ్ద ప్రయోగాలూ'' కొందరికి ఇష్టం అని ఎడవల్లి వెంకటయ్య చెప్పిన మాటలు అక్షరాలా నిజం. గూడూరు వెంకటదాసు అనే కవికి ''దురవగాహార్థ విస్తర నిగూఢ ఘటికా ప్రబంధాలు'' చెప్పడం చాలా ఇష్టం. పాదార్థగుప్తమైన అనులోమ విలోమాలు, అచలోష్ఠ జిహ్వల రచనలు, దుష్ప్రాసలూ, దుష్కరబంధాలు మొదలైన సాము గరిడీలూ, సర్కసు ఫీట్లూ అంటే చెవికోసుకొంటాడు. ఈయన అష్టభాషాకవి; అష్టావధాని. సమస్యా పూరణంలో చతురుడు. విచిత్రబంధ కవితా వైదుష్యం కలవాడు. ఈ వెంకటదాసు తన ప్రజ్ఞలన్నీ చూపిస్తూ ''ప్రబంధ రాజ శిరోభూషణ ప్రకృష్ణ బలరామచరిత్ర'' అనే ఆరాశ్వాసాల కావ్యం వ్రాద్దామనుకొన్నాడు. ఈ సంగతి దేవునికి తెలిసింది. కలలో కనిపించి ''ఏరా డింభక నీ వొనర్చు కృతి మాకిష్టంబగున్'' అని అడిగాడట. నిజంగా గుడూరు వెంకటదాసు డింభకుడే. మనసుకు మైనారిటీ తీరినవాడు ఎవడూ మాటలతో డప్పుకొట్టి మెప్పులు పొందుదామనుకోడు. ఈ డింభకుడు ఎక్కడివాడో, ఎప్పటివాడో తెలియదు. ఈ కావ్యానికి ఏడు ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. ఒక తాళపత్ర ప్రతి లేఖనకాలం క్రోధి అని ఉంది. అంటే క్రీ.శ. 1845 (డి.586). కవి చిల్లూత్తూరు ప్రాంతాలవాడు కావచ్చును. ఇతని తండ్రి పేరు గురవప్పనాయుడు. తాతతండ్రుల పేర్లు చెప్పినా వాటినిబట్టి ఏమీ కవి చరిత్ర విశదం కాదు.

మరింగంటి వెంకటాచార్యులు

స్వస్థాన వేషభాషలమీద అభిమానం పండితులకే కాదు సాధారణ ప్రజలకు కూడా ఉంటుంది. కులాభిమానం వాళ్ళ విషయంలో మరీ ఎక్కువ. తమ తాత ముత్తాతల చరిత్రలూ, పూర్వీకుల గురించి అనుశ్రుతంగా చెప్పుకొనే కథలో కొంచెం రచన చేయగలిగిన వాళ్ళకు చెప్పి, వాళ్ళ చేత కులపురాణాలు వ్రాయించుకొనడం మన సాహిత్యంలో పరిపాటే. అయితే కొన్ని కుటుంబాల వాళ్ళు తమకు నచ్చని విషయాలను ఆ కులపురాణాల్లోంచి తప్పించి సవరణలు చేస్తారు. అలాగ ప్రక్షిప్తాలను ఈ యుగం ''నోచుకున్న రచన ''మల్లారి చరిత్ర'' చెప్తుంది. దీనిని ఒరిజినల్‌గా రచించినది మరింగంటి వెంకటాచార్యులు (తెలంగాణాలోని మరింగంటి వారి బంధువా? పరిశోధించాలి). ఇతడు చెప్పిందాంట్లో తప్పులున్నాయని తన పోషకులు (విశాఖపట్నంలో గొడేవారు) పురమాయిస్తే ఎర్రమిల్లి పేర్రాజు అనే ఆయన సవరణలు చేశాడు. వెంకటాచార్యులు ద్రావిడ గీర్వాణ భాషలు తెలిసినవాడు. సారస సంగీత సాహిత్య గరిమతో మల్లారి చరిత్రను వ్రాసినట్టు చెప్పుకొన్నాడు. ఈ ద్విపదకావ్యంలో ఎన్ని ఆశ్వాసాలు

ఉన్నాయోగాని నాలుగు మాత్రమే లభిస్తున్నాయి (ఆర్.388 (బి)). దీని సవరణలు క్రీ.శ. 1858లో వచ్చాయి కాబట్టి వెంకటాచార్యులు ఒకటి రెండు తరాల పూర్వీకుడు కావచ్చును. ఈ కావ్యానికి పద్యపరివర్తనో కాదో తెలియదు. కాని ఒక మల్లారి చరిత్ర పద్యరూపంలో కూడా ఉంది (ఆర్.388 (ఎ)). ఇది శృంగార ప్రబంధమట. తుది మొదలూ లేని ఈ గ్రంథాన్ని ఎవరు వ్రాశారో తెలియదు. బహుశా వెంకటాచార్యులే వ్రాసి ఉండవచ్చు. ఈ పద్యకావ్యాన్ని గొడేవారు మార్పించినట్టు కనబడదు.

జగన్నాథుల శ్రీనివాసుడు

విశాఖపట్నం జిల్లాలో గొడేవారి కుటుంబంలో మల్లాది చరిత్ర పట్ల శ్రద్ధ కలిగితే కార్వేటినగరంలో ఎవరికో తమ రాజవంశచరిత్ర వినాలనిపించింది. పద్యరూపంలో ఉండే ఈ గ్రంథానికి వచనరూపంలో వ్యాఖ్యానం వినాలని కోరిక కలిగింది. రాజు తలచుకొంటే దెబ్బలకు కొదువా! దండాన్వయ రూపంలో చక్కని వచనంలో ''మహారాజ చరిత్రవ్యాఖ్య'' వెలువడింది. రాజరాజు దగ్గర్నుంచి మాకరాజకుమార రామభద్రరాజు దాకా వంశచరిత్ర వచనరూపంలో వచ్చింది. ఇది మన కైఫీయత్తుల సాహిత్యంలో చేరదగ్గది. దీనికిని కవిసార్వభౌమ, వాదిగజకేసరి మొదలైన బిరుదులు గల శ్రీనివాసుడు వ్రాశాడు. ఇతడు జగన్నాథ గురువుల వంశంలోనివాడు. ఈ కావ్యం అచ్చుపడలేదు. దీని ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.2637)

మాజేటి సర్వేశలింగం

ఇవాళ ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉండే చాలా గ్రంథాల ప్రతులను మాజేటి సర్వేశలింగం అనే సాహితీపరుడు లిఖించాడు. నేను లెక్కపెట్టగలిగిన పుస్తకాల సంఖ్యే 40 దాటింది. ఇంకా ఎన్ని పుత్రికలు వ్రాశాడో తెలియదు. క్రీ.శ.1840 నాటికి ఇతడు చాలా వృద్ధుడు. గోదావరీ మండలంవాడు. ఆదిలో ఫ్రెంచివాళ్ళ కొలువులో ఉండి పుదుచ్చేరిలో నివసించాడు. ఆ చుట్టుపక్కల దొరికిన తెలుగు గ్రంథాలు చాలామటుకు ఖాసాకు కాపీ చేసుకొన్నాడు. తన పుస్తకాలు చాలా మట్టుకు బ్రౌనుదొరగారికి ఇచ్చేశాడు. ఇతని కుమారులు దొరగారికి కొన్ని ఉత్తరాలు వ్రాసుకొన్నారు. గ్రంథవిలేఖనమేకాక సర్వేశలింగం స్వయంగా కవిత్వం కూడా చెప్పగలడు. తనతో తగువు పెట్టుకొన్న ఎవరినో దూషిస్తూ మూర్ఖ చరిత్ర అనే పేరుతో ఒక పద్యకావ్యం వ్రాశాడు.

పొంగి మాజేటి సర్వేశలింగవర్యు
తోడను, విరోధ మిటుసేయగూడనట్టి
కార్యమున పరువు పోవుటగాని యిందు
వచ్చు లాభంబు లేదు భావమాన దెలియ (ఆర్.649)

మాజేటివారితో తగువుపెట్టుకొంటే వచ్చే లాభం లేదని కవి అనుకోవచ్చుగాని సాహిత్యచరిత్రకు కొంత లాభించింది. అసంఖ్యాకమైన గ్రంథప్రతులు వ్రాసిన సర్వేశలింగం స్వయంగా ఒక తిట్టుకావ్యం వ్రాశాడని తెలియడం లాభమే!

సింగరాచారిగారి సింగరాచారి

ఈయుగంలోనే సరసకవి వెంకటకృష్ణమాచార్యులు ''యామున విజయవిలాసం'' వ్రాశాడు. అదే కథను ''యామున చరిత్రం'' అను పేరుతో ఎవరో సింగరాచార్యులు బహుశా ఏకాశ్వాస ప్రబంధంగా రచించాడు. ఇతని తండ్రిపేరుకూడా సింగరాచార్యులే. ఇంతకు తప్పించి ఇతర వివరాలు తెలియవు. ఈగ్రంథం ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.220)

ఏగంటి సోమన

మన సాహిత్యంలో వైష్ణవ గ్రంథాలు ఎన్నున్నాయో శైవగ్రంథాలు కూడా రమారమీ ఆ సంఖ్యలోనే ఉంటాయి. మన పరిశోధకులు ప్రత్యేకంగా వీరశైవ వాఙ్మయంమీద కృషిచేయడంతో ఈశాఖ మూడు పువ్వులు ఆరుకాయలుగా కనబడుతుంది. శైవ వాఙ్మయంలో చొక్కనాథ చరిత్రలు హాలాస్యమహాత్మ్యాలు అరడజను పైచిలుకే ఉంటాయి. ఈయుగంలో ఏగంటి సోమన్న అనే ఆరాధ్య కులశేఖరుడు పచ్చకర్పూరపు తిరువేంగళనాథుని చొక్కనాథచరిత్రను కాపీచేశాడు. చిట్టచివర తనగద్యనుకూడా వ్రాసుకొని ''శరభేశు కృపగల సత్కవీంద్రుండ''నని చెప్పుకొన్నాడు. చొక్కనాథచరిత్ర కాపీచేసిన ఈ కవి ఏదైనా చరిత్రలు వ్రాశాడోలేదో; అసలు ఇతని చరిత్ర ఏమిటో తెలియదు.

ఈ యుగంలో చాలామంది కవులు పాత కావ్యాలు నష్టంకాకుండా మాతృకను దిద్దకుండా పుత్రికలు వ్రాసి సాహిత్యానికి ఎంతో సేవ చేశారు. పోచిరాజు వీరన ఏగంటి సోమన, మాజేటి సర్వేశలింగంలాంటివాళ్ళు అటువంటి సాహిత్యసేవను చేయడం గమనించాం. ఈ కోవకు చెందినవాళ్ళ పుణ్యమా అని ఇవాళ విపులంగా మనం సాహిత్య చరిత్రను చెప్పుకోగలుగుతున్నాం.

ఇంతమంది కవులు తమ కావ్యాల పేర్లలో ''చరిత్ర'' పదాన్ని వాడినా ఏ ఒకరిద్దరో, సమకాలిక విషయాలను ఆపుస్తకాలలో తడిమారు. నిజంగా తమకాలమందు జరిగిన చరిత్రను పద్యకావ్యరూపంలో వర్ణించిన వాళ్ళు ఇద్దరే ప్రముఖులు ఈయుగంలో ఉన్నారు. ఒకరు బొబ్బిలి వారి పౌరుషాన్నీ ఇంకొకరు విజయనగరం వారి రోషాన్నీ కీర్తించారు. ఆ కవుల గురించి తెలుసుకొందాం.

దిట్టకవి నారాయణ

దిట్టకవివారిది కవితా కుటుంబం. తరతరాలుగా వీళ్ళింట కవులు సాహిత్య జీవనం గడుపుతున్నారు. పూర్వకవుల సంగతి అలా ఉంచితే ఈ యుగంలో దిట్టకవి పాపరాజు రామకథ సారం శకుంతలా పరిణయం, సేతుమాహాత్మ్యం అనే మూడు కావ్యాలు వ్రాశాడు.[16]

16. చూ. భక్తిరస శతక సంపుటం - మహిషాసురమర్దినీ శతక పీఠిక - పు.115 - వావిళ్ళవారిది

అయితే ఇవి అప్పటిదాకా వెలుగు చూస్తున్నట్టులేదు. ఈ పాపరాజు కుమారుడే నారాయణ. ఇతడు చాలామంది జమీందార్ల సభలలో సన్మానాలు పొందాడు. విద్వత్కవులకు తలలో నాలుకలాగ ఉండేవాడు. నరసారావుపేట జమీందారులయిన మల్రాజు రామారావుగారి ఆశ్రితుడయ్యాడు. ఆయన బొబ్బిలివారి చుట్టం, తమ బంధువులు మూసా బుస్సీతో ఘోరంగా యుద్ధంచేసి వీరస్వర్గం పొందిన విషయాన్ని ప్రబంధంగా చెప్పించాలని మల్రాజు రామరావుగారు భావించారు. నారాయణతో ఇలా చెప్పారు.

''భారత యుద్ధ మట్టులతి భాసురతంగనుపట్టుచున్ మహా
వీర రసప్రధానమయి వేడుక నింపెడు రావువారి దు
ర్వార రణ ప్రసంగ మతి రమ్యతరం బదిగద్యపద్య సం
భారయుతంబుగా నొక ప్రబంధ మొనర్చు మదంకితంబుగన్''

మల్రాజువారు ఇలా అడగడానికి ముందే ''ఇదానీంతన మహావీర పురుషరనాను బంధ బంధురం''బగు ఒక ప్రబంధం వ్రాయాలని దిట్టకవి నారాయణ సంకల్పించు కొన్నాడు. బొబ్బిలి యుద్ధం కథను రంగరాయ చరిత్రము అనే పేరుతో మూడాశ్వాసాల వీరకావ్యంగా చెప్పాడు. సమకాలిక చరిత్రను చక్కగా తెలుసుకొని ఆవేశంతో రసబంధురంగా దానిని మలచాడు. రావువారి చుట్టాల ఆశ్రితుడు కనుక బొబ్బిలి వారిని పొగడడంతో పూసపాటివారి సామ్రాజ్య వైభవం గాజుపూసపాటిది చేశాడు. (1-134). పెద్దాడ మల్లేశం అనే గేయ రచయిత బొబ్బిలియుద్ధం పాటలో ఎంత పక్షపాతంగా ఎంత వీరావేశంతో కథను చెప్పాడో అంత అభినివేశంతో దిట్టకవి నారాయణ ఈ రంగరాయ చరిత్రను రచించాడు. సమకాలిక జీవద్భాషను తు.చ. తప్పకుండా అవసరమైన ఘట్టాల్లో వాడాడు. అన్యదేశ్యాలను యదేచ్ఛగా వాడాడు. ఫ్రెంచి ఉచ్చారణలకు అనువైన వర్ణక్రమంలోనే పరంగీ మాటలను ఇతడు ఉపయోగించాడు. సోలుదాదులు, సార్జంతులు, మయాదులు, కుముందానులు మొదలైన రూపాలలో సోల్జర్లు, సార్జంటులు, మేజరులు, కమాండెంటులు ఈ కావ్యంలో కనబడుతారు. అన్నిటికన్నా స్పష్టంగా కనబడేవి కవి చిత్తశుద్ధీ, ఉద్వేగాలతోపాటు నిజంగా ఒక మహాప్రబంధం వ్రాస్తున్నామనే ప్రగాఢ విశ్వాసమూ. అందుకే ఈ రంగరాయచరిత్ర పిల్లభారతమనే పేర ప్రఖ్యాతమయింది. ఉత్తరోత్తరా స్టేజి నాటకాలకు ఇందులో పాత్ర చిత్రణే వరపడి అయింది.

దిట్టకవి వ్రాసిన ఇతర గ్రంథాలు ఏమిటో తెలియవు. ఇతని కొడుకు రామచంద్రయ్య శతకకవి, చాలా శతకాలు వ్రాశడు.[17] తిట్లూ, దీవనలూ సమంగా ఇవ్వగలడనే కీర్తిని పొందాడు.

ఈ రామచంద్రయ్య గురించి ఈ పద్యంలో ప్రచారంలో ఉంది.

---

17. వీటిని వావిళ్ళవారు తమ శతక సంపుటాలలో అచ్చువేశారు. దిట్టకవివారి వంశ చరిత్రను విపులంగా చెప్పారు.

దిట్టకవి రామచంద్రుడు
దిట్టిన రాయైన బగులు దీవించిన యా
బెట్టైన చెట్టు చిగురగు
గట్టిగ దొల్లింటి భీమకవి కాబోలున్

ఈ రెండో భీమకవిగారి చిన్నాన సంతతిలో కూడా కవులు ఉన్నారు. రామచంద్రుడు నూజివీటి వారి కొలువులో ఉన్నాడు. కొంతకాలం వాసిరెడ్డి వారి పోషణలో కూడా ఉన్నాడు. ఏదో ప్రబంధం అవతారికలో వాసిరెడ్డి వారి వంశచరిత్రను రామచంద్రుడు వ్రాశాడట. ఏమైనా తండ్రికున్న చారిత్రక అభినివేశం కొడుకుకు వచ్చినట్టు లేదు. అలా రావాలంటే అభిమానాలూ, రాజభక్తీ చాలా స్ట్రాంగుగా ఉండాలి.

చాట్రాతి లక్ష్మీనరసు

రంగరాయ చరిత్ర వ్రాస్తున్నప్పుడు దిట్టకవి నారాయణ ఎంత వేడిగా కవిత చెప్పాడో అంత ఫోర్సుగా చాట్రాతి లక్ష్మీనరసు విజయనగరం వాళ్ళ కీర్తిని శ్లాఘించాడు. బొబ్బిలి యుద్ధం పర్యవసానంగా పెద విజయరామరాజుగారు తాండ్రపాపయ్య చేతిలో మరణించాక పూసపాటి వారికి ఫ్రెంచి వాళ్ళంటే మనసు విరిగిపోయింది. వీళ్ళను వెళ్ళగొట్టాలంటే ఇంకో తెల్లవాడే రావాలి అని పొరపడి పూసపాటి ఆనందరాజుగారు ఇంగ్లీషు వాళ్ళను కళింగసీమకు ఆహ్వానించారు. ఈ వచ్చినవాళ్ళు ఏకుమేకై క్రమేణా విజయనగర సంస్థానాన్ని కబళించచూశారు. తాతతండ్రులు కట్టిన కోటను విడిచిపెట్టి వెళ్ళమంటే బొబ్బిలివాళ్ళు ఎలాగ మూసాబుస్సీతో పోరాడేరో, అలాగే విజయనగరం వాళ్ళుకూడా రాజును కోట వదలిపొమ్మంటే రోషమొచ్చి యుద్ధం చేశారు. రకరకాల చారిత్రక పరిణామాల వల్ల విజయనగరం రాచవారికీ, తూర్పు ఇండియా కుంఫిణీ వారికీ, విశాఖపట్నం జిల్లాలోని పద్మనాభం అనే గ్రామం దగ్గర యుద్ధం జరిగింది. పూసపాటి చిన విజయరామరాజుగారు కళింగ దేశపు ముల్కు నిలపడానికి ఆ యుద్ధంలో ఇతర రాచవారితోపాటు మరణించారు. ఈ వీరోచిత కృత్యాన్ని చాట్రాతి లక్ష్మీనరసు ఉత్తేజకరమైన కావ్యంగా చెప్పాడు. కవి ఈ గ్రంథానికి ''విజయరామ చరిత్రం'' అని పేరు పెట్టాడు కాబోలు. అయినా పద్మనాభయుద్ధం అనే పేరుతో దొరికినంత భాగం అచ్చుపడింది.[18]

దిట్టకవి నారాయణలాగే లక్ష్మీనరసు కూడా సమకాలిక జీవద్భాషను గ్రంథంలో వాడాడు. ఉరుదూ, పారశీక, ఆంగ్లపదాలను యథేచ్ఛగా ఉపయోగించాడు. అక్కడ ఆ మాట వాడకపోతే ఫోర్సురాదు అన్నప్పుడు ఏ కవి అయినా ప్రచారంలో ఉన్న అన్యదేశ్యాన్ని వాడకమానడు. తెల్లవాళ్ళ పటాలంలో ఉండే సైనికోద్యోగులకు ''ఆప్సరులు'' అంటేనే అందంగాని పడవాళ్ళు అంటే ఏం సొగసు. వాళ్ళు ''లయను'' దిద్దుతారేగాని ఈ సైనికుల వరుస సరిచేయరు. తుపాకులను ''ఫైరు'' చేస్తే గుండు తగులుతుందిగాని ఆంధ్రంలో ''ప్రయోగిస్తే'' పాఠకుని మనస్సులో గుండు దొచ్చుకోదు. మూడు పద్యాలను చూడండి.

18. ప్రకాశకులు : వత్సవాయి రాయజగపతివర్మగారు (1934 నాలుగవ ముద్రణ)

త్వరపడకుడనుచు ధరణీ
శ్వరు డానతి యిచ్చునంత జాతిపటాలం
బరుదెంచి నిలచె తంబుర
మొరయుంపుచు లయను దీర్చి ముంగలనంతన్

కాంచిమరి యూరుకుండుట కానిమాట
గుండు మోమీనుగా వచ్చె కుంఫిణీలు
తొలిఫయరువారు జేసిన గెలువయంచు
నూహసేయుచు జాగ్రత్త నున్నయంత

కడకడ కొన్ని తుపాకులు
పెడపెడమని పేలదొడిగె పిరుద పటాలం
బుడుగక ఫయరులు జేసిరి
పిడుగులతో గూడు రాళ్ళ వృష్టి యనంగన్ (పద్మనాభ. 206-208)

ఇంత చక్కగా సమకాలిక భాషలో వ్రాసినవాళ్ళు అరుదు.[19] వర్తమానచరిత్రను పద్యంలోకాక వచనంలో చెప్తే మంచిదని ఈ యుగంలోనే చాలామందికి తట్టింది.

అట్లూరి లక్ష్మీనరసింహం

చాత్రాతి లక్ష్మీనరసు సమకాలిక రాజవంశాలలోని వీరుల యుద్ధాన్ని చరిత్రగా వర్ణిస్తే అట్లూరి లక్ష్మీనరసు అనే కవి సామాన్య సంసారులలో ఒకడి జీవితాన్ని చరిత్రగా వచనంలో రచించాడు. ఈ యుగంలోనే ఇసుకపల్లి అనే గ్రామంలో పమిడిపాటి పట్టాభిరామయ్యగారికి పురుషోత్తం అనే కుమారుడున్నాడు. ఇతడు గారడీ విద్యలో మాయలూ, మంత్రాలూ, తంత్రాలూ నేర్చుకొని మహామాంత్రికుడయ్యాడు. నానాదేశాలు తిరిగి తన విద్య చూపించి కీర్తి తెచ్చుకొన్నాడు. ''సహధర్మిణీ సహితుడై యతి విచిత్ర మహిమ పురజనుల నానందితుల'' చేస్తూ చాలాకాలం జీవించాడు. ఈ మాంత్రికుని జీవిత కథను పురుషోత్తమ చరిత్ర అనే పేరుతో అట్లూరి లక్ష్మీనరసింహం ఏకాశ్వాస పద్య ప్రబంధంగా వ్రాశాడు. (ఆర్.474 (ఎ)). ఇది అముద్రితం.

ఈవిధంగా సమకాలిక వ్యక్తుల జీవితకథలను, వీరోచిత కృత్యాలను మన కావ్యకవులు తొలియుగాల నుంచీ శ్రద్ధగా రచించి ఉంటే మనకు ఎంతో చరిత్ర దక్కేది. అయితే కావ్యకవులకు ఇలాంటి విషయాలపై మక్కువ ఉండదు. సాధారణ ప్రజలకే వీటిమీద అభిమానం ఉంటుంది.

జానపదులు ఈ యుగంలోని యుద్ధాలను, పితూరీలను, కడగళ్ళనూ అన్నింటినీ కథలుగా కట్టుకొన్నారు. అన్నాళ్ళుగా ఎవరి ఉప్పు తిన్నారో ఆ రాజులు యుద్ధాలలో ఓడిపోయి క్రమేణా అధికార రహితులు అయిపోతూ ఉంటే సాధారణ ప్రజానీకం ఊరుకోలేదు. తన ఆశయాన్ని ఉమ్మడి భావప్రకటనగా గేయంలో వెలువరిస్తుంది. వాస్తవ

19. చాత్రాతి లక్ష్మీనరసు ఇతర రచనల గురించి ఇదే సంపుటంలో శతకాలప్రకరణంలోనూ, విజయనగరం ప్రకరణంలోనూ మరికొన్ని వివరాలు ఉన్నాయి.

జీవితంలో ఎంత హీనంగా ఉన్నా ఊహాలోకంలో తన రాజులకు మనజాతి రత్నసింహాసనాలను వేస్తుంది. ఆధునికయుగంలో జమీందారీలు రద్దయి ఇప్పటికి ఒకతరం అయినా ఇంకా మనసినిమా చిత్రాలలో అంతస్తు కావలసిన ఘట్టాలలో జమీందారులే గౌరవనీయమైన శ్రీమంతులుగా, ఇంకో కథమీద అధికారం నెరపడంలోనే, మన జాతీయ మనస్తత్వం బోధపడుతుంది.

అందుకే ఇప్పటికీ పురాతన ఉపాఖ్యానాలే ప్రజల గుండెలకు దగ్గరలో ఉంటాయి. యుగంలో విలాసాలు, చరిత్రలు అనే పదాలతోపాటు ఉపాఖ్యానాలు ఆ పదాన్ని కూడా వాడుతూ కొందరు కవులు గ్రంథరచన చేశారు. అలా కావ్యాలు వ్రాసిన కవుల గురించి చెప్పుకొందాం.

శేషం తిరుమలయ్య

దేవుని గురించి చెప్పుకొన్నట్టే దైవభక్తుల గురించి చెప్పుకొన్నా పుణ్యమూ పురుషార్థమూ ఉంటుందని మనవాళ్ళ నమ్మకం. హరి భక్తులలో ప్రముఖుడు అంబరీషుడు. అతని కథను ''అంబరీషోపాఖ్యానం'' అనే పేరుతో అయిదాశ్వాసాల ప్రబంధంగా శేషం తిరుమలయ్య చెప్పాడు. ఇతడు ''నానావిధ కవిత్వ నిర్వహణ సర్వంకష మనీషాధుర్యుడు. అందుకే ఒక నిరోష్ఠ్య రచన చేసి దేవునికి అంకితం ఇచ్చాడు. (దానిపేరు తెలియదు) అయినా ఈ అంబరీషోపాఖ్యానాన్ని మాత్రం సుంకరవల్లి కోదండయ్య అనే సంపన్నుడికి అంకితమిచ్చాడు. కృతిభర్తగానీ, కర్తగానీ ఏ ప్రాంతాలవాళ్ళో, ఏ కులం వాళ్ళో తెలియదు. ఈ అంబరీషోపాఖ్యానం ప్రతి తంజావూరులో వుంది (సి.తం.డి.1)

దంతులూరి బాపిరాజు

శాశ్వతమైన కీర్తి కావాలనుకొనేవాళ్ళు సుంకరపల్లి కోదండయ్యలాగ పుస్తకాలు అడిగి అంకితం పుచ్చుకొంటారు. అయితే కవిగా కీర్తికావాలనుకొని తమ పేరు పెట్టించుకోవాలి. కొత్తలంక మృత్యుంజయుడు రచించిన మూర్తిత్రయోపాఖ్యానాన్ని వెలపెట్టికొని దంతులూరి బాపిరాజు స్వంతం చేసుకొన్నాడని అల్లమరాజు రంగశాయి సాక్ష్యమిచ్చినట్టు ఇంతకు ముందు గమనించాం. దంతులూరివారి వంశంలో చిరకాలం నుంచీ సాహిత్య పోషణ ఉంటున్నదని మాత్రం ఈ కృతి అవతారిక వల్ల తెలుస్తుంది. దంతులూరి బాపిరాజుగారి మూలపురుషులలో ఒకడైన గన్నరాజుగారు శ్రీనాథుని ధనంజయ విజయాన్ని అంకితం పుచ్చుకొన్నాడట. ఈ కావ్యం ఇప్పటికీ బయటపడలేదు. అలాగే దంతులూరి బాపిరాజు నిజంగా మూర్తి త్రయోపాఖ్యానం వ్రాశాడన్న సంగతిని కూడా రుజువు చేసే ఆధారాలు బయటపడలేదు.

ఆతుకూరి పాపయ్య

త్రిమూర్తులకన్నా శక్తి గొప్పది అని దేవీభక్తుల నమ్మకం. మన అష్టాదశ పురాణాలలో రెండు దేవీ మాహాత్మ్యాన్ని చెప్పాయి. ఆతుకూరి పాపయ్య అనే కవి ఈ సంగతి ఇలా ప్రకటించాడు.

శైవ పురాణంబులు పది
భావింపగ రెండు శక్తి ప్రతి పాదించున్
గోవిందు నాల్గు పేర్కొను
భావక సూర్యులను రెండు ప్రస్తుతిచేయున్. (1-18)

శక్తిపారమ్యాలయిన పురాణాలలో మార్కండేయం ఒకటి. దానిలోని కథను తీసుకొని ఆతుకూరి పాపయ్య లలితోపాఖ్యానం చెప్పాడు. కామదహనం జరిగాక ఆ చితాభస్మం నుండి ఛండాసురుడు పుట్టాడు. వాణ్ణి చంపడానికి చిదగ్నిలోంచి లలితాంబ ఆవిర్భవించింది. రాక్షసుణ్ణి చంపింది. ఈ కథకు ముందు దక్షయజ్ఞాన్ని, చివర కుమార సంభవాన్నీ కలిపి పాపయ్య ఎనిమిది ఆశ్వాసాల రచన చేశాడు. ఇతని కాలం తెలియదు. అయినా ఈ పుస్తకానికి పీఠిక వ్రాసినవారు ఇతడు 18వ శతాబ్ది మధ్య ఉండి ఉంటాడని ఊహించారు.[20] ఈ ఉపాఖ్యానాన్ని ఇతడు ''సకలాంధ్ర జన హృద్యంబు''గా చెప్పాలని సంకల్పించాడు.

మిక్కిలి మల్లికార్జునుడు

ప్రతికవీ తనది ''మనోజ్ఞమంజువాగ్రస'' మనుకొంటాడు. తన వచః ప్రావీణ్యం ప్రతి పద్యంలోనూ తేజరిల్లాలని భావిస్తాడు. మిక్కిలి మల్లికార్జునుడనే కవిని అతని స్నేహితులు అలాగే కృతులు రచించమని ప్రోత్సహించారు. ఉడతల పాపయ్య అనే సంపన్నుడు తమ ఊళ్ళో ఒక రామాలయం కట్టించాడు. ఆ దేవునికి ఒక కృతి అంకితం ఇప్పించాలని మిక్కిలి మల్లికార్జునుడి చేత రామచంద్రోపాఖ్యానం అనే గ్రంథం చెప్పించాడు. భూదానం చేసి, కవిని తృప్తిపరచి దేవునికి పుస్తకం ఇప్పించాడు. ఈ రామచంద్రోపాఖ్యానం అసమగ్రం. అముద్రితం (ఆర్.63) లింగమపర్తిలో ఉండే ఆ ఉడతల పాపయ్యగారికి ఇలాగ పుస్తకాలు దైవాంకితాలు చేయించడం అంటే ఇష్టం. భామిడిపల్లి వెంకటయ్య అనేకవి చేత శేషధర్మాలు అనువాదం చేయించి తాను ప్రతిష్ఠించిన దేవునికి ఇప్పించాడు. మళ్ళా మిక్కిలి మల్లికార్జునుణ్ణే పిలిచి భగవద్గీతను ఎవరూ తెనిగించలేదు కనుక మీరు అనువదిస్తే బాగుంటుందని నియోగించాడు. కృష్ణార్జునీయం అనే పేరిట గీతను మల్లికార్జునుడు అనువదించాడు. (ఆర్.775) ఇతడు గీతానువాదమేకాక ఇతర రచనలను చేశాడు. గోదావరి మండలంలోని ప్రసిద్ధులకు అంకితమిచ్చాడు. ఆ వివరాలు చూడండి.

విక్రమార్క చరిత్రం	:	1856లో వంజారి కామయ్యగారికి
నాచికేతోపాఖ్యానం	:	పిఠాపురం దివాను వ్రాద్రేవు చెలమయ్యగారికి
రాఘవ శతకం	:	పోతప్రగడ శ్రీరాములుగారికి

ఈ గ్రంథాలేకాక మిక్కిలి మల్లికార్జునుడు భేతాళ పంచశతిని కూడా వ్రాశాడు. అది ఎవరికి అంకితం ఇచ్చాడో తెలియదు. ఈ కవి 1875లో తన 70వ సంవత్సరంలో పోయాడు. ఇతని స్వగ్రామం పెద్దాడ.

20. లలితోపాఖ్యానం - ముక్త్యాల ప్రచురణ, 1917, పీఠికా కర్త, చల్లా సూర్యనారాయణగారు

తెరికపల్లి రామలింగభట్టు

పాపవిముక్తి కోసం మన పూర్వులు సత్కావ్య పఠనం చేసేవారు. నరకబాధను చాలా భయంకరంగా వర్ణించి దాన్ని తప్పించుకోవాలంటే భూమ్మీద మంచిపనులు చేయమన్నారు. భూలోకంలో ఉండే ఒక మంచివాడు నరకంలో పాపులుపడే కష్టాలు విని జాలిపడ్డాడు. యకాయకిని నరకానికి వెళ్ళి అక్కడి పాపులకు పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించి వాళ్ళను తరింపచేసి తాను గణపతిగా వెలశాడు. ఈ మంచివాడిపేరు సానందుడు. ఇతని కథ స్కందపురాణంలో ఉంది. ఈ సానందోపాఖ్యానాన్ని చాలామంది ఈ యుగంలో తెనిగించారు. వాళ్ళలో అకారాదిగా చెప్పుకోడానికి మొదటివాడు తెలకపల్లి రామలింగభట్టు. ఈయనకవే కాక తత్త్వమార్గ సంచార విలోలుడు. గణితశాస్త్ర విధిజ్ఞుడు. రచన సాఫీగా సాగింది. ఇతని పుస్తకం అచ్చుపడలేదు. (డి.872)

ఎక్కిరేల చిత్రకవి రామాచార్యులు

పుస్తకంలో వ్రాసినది ఒకటీ, దానికి పెట్టేపేరు ఇంకొకటీ అయితే పొరపాట్లకు దారితీయవచ్చు. (ఇంతకు ముందు మనం గమనించిన బేతాళ చరిత్రలాగ) ఎక్కిరేల రామాచార్యులు ''భోజభూపాలీయోపాఖ్యానం'' అనే కావ్యం ఒకటి వ్రాశాడు. ఈ పేరు చూడగానే ఎవరైనా ఇవి భోజకాళిదాసు కథలు అనుకోవచ్చును. అయితే ఇది రామాయణ కావ్యం. సంస్కృతంలో భోజరాజు, లక్ష్మణసూరితో కలిసి చంపూ రామాయణాన్ని వ్రాశాడు. యధాశ్రుత గద్యపద్య తాత్పర్యపోక్తంగా ఆ కావ్యాన్ని ఈపేరుతో రామాచార్లు తెనిగించారు. దానికి ఉన్న పేర్లు చాలక రఘునందన విలాసం అనే నామాంతరం కూడా పెట్టాడు. ఇన్ని పేర్లు పెట్టినా అనువాదానికి పేరు వచ్చినట్టు లేదు. ఈ ఆరాశ్వాసాల గ్రంథం అముద్రితం. (ఆర్.815)

సముద్రాల రామానుజాచార్యులు

అముద్రితంగానే ఉన్న మరొక ఉపాఖ్యానాన్ని కరీంనగరు జిల్లా కోరుట్ల గ్రామంలోని సముద్రాల రామానుజాచార్యులు వ్రాశాడు. దీనిపేరు సుశీలోపాఖ్యానం. ఇతివృత్తం ఏమిటో తెలియదు. గాని ఈ గ్రంథం ప్రతి ఒకటి కవి నివాస గ్రామమైన కోరుట్ల గ్రంథాలయంలో ఉంది. ఇతడు 1780 ప్రాంతాలవాడు.

కంచి వీరశరభ కవి

ఒక కావ్యానికి పేరు రావాలంటే చాలా కలసి రావాలి. గ్రంథంలో రసముంటే, సహృదయులు ప్రచారంచేస్తే జనంలో ఆకావ్యం అల్లుకుపోతుంది. మన సాహిత్యంలో హరిశ్చంద్రోపాఖ్యానాలకు కొరతలేదు. అయినా శంకరకవి కావ్యానికి వచ్చినంత ప్రచారం మరి దేనికీ లేదు. అయితే వీర శరభయ్య రచించిన హరిశ్చంద్రోపాఖ్యానం ఒకటి ఉందని ఈ యుగంలో బ్రౌను దొరగారు గుర్తించి, దానికి ''కంచి కావ్యం'' అని ఉపనామధేయం పెట్టి టీకా తాత్పర్యాలు వ్రాయించారు. అయినా ఇది లోకుల దృష్టిలో పడలేదు. కంచి వీరశరభయ్య మంచికవే. అతులిత మధుర వచస్థితిచే కృతి చేయగలవాడు

శ్రీపతి పండితుని కుటుంబంలోనివాళ్ళు తల్లివంక చుట్టాలు, (మాతామహుడు వీరన్న బహుశా ధర్మగుప్తాభ్యుదయం వ్రాసిన వీరన్న కావచ్చు). ఇతని కావ్యం సమగ్రమైనా వెలుగు చూడలేదు. (ఆర్.932)

శ్రీపాద వెంకటాచలం

బ్రౌనుదొరగారి వంటి భాషాసేవకులు బాగున్న కావ్యాలకు వ్యాఖ్యానాలు వ్రాయిస్తారు గాని కొందరు కవులు తమ కృతులకు తామే అర్థం చెప్పవలసిన స్థితి మన సాహిత్య చరిత్రలో లేకపోలేదు.

శ్రీపాద వెంకటాచలం అనే ఆయన ''రామకృష్ణో పాఖ్యానం'' అనే రెండర్థాల రచన చేశాడు. దీనికి తన మేనమామ వారణాసి లక్ష్మీపతితో కలసి తానే వ్యాఖ్యానం వ్రాశాడు. ఈ లక్ష్మీపతి వాల్మీకి రామాయణాన్ని తెనిగించాడట. రామకృష్ణోపాఖ్యానం రచనలో కూడా మేనల్లుడికి తోడ్పడ్డాడట.

ఈ మామా అల్లుళ్ళు విజయనగరంలో విజయరామగజపతికాలంలో ఉన్నవాళ్ళు. ఈ రెండర్థాల కావ్యం అచ్చుపడలేదు. (ఆర్.308 (ఎ); (బి).

కోట శివరామయ్య

ఇంతకు ముందే తెలికపల్లి రామలింగభట్టు 'సానందోపాఖ్యానం' రచించినట్టు' చెప్పుకొన్నాం. అదే కథను కోట శివరామయ్య వ్రాశాడు. కాళహస్తీశ్వరుడికి అంకితం ఇచ్చాడు. సానందోపాఖ్యానం అచ్చుపడలేదు. (డి.868).

శివరామయ్య కవిత్వం వ్రాయడంలో గట్టివాడైతే, ఇతని అన్న పాపయ్య ''ఉద్దామ మేధాశక్తి వరస లెక్కలు గూడి వ్రాయడం''లో మేటి. కోటవారి ఇంట్లో తరతరాలుగా గణకులు ఉన్నారట. ఇంతమంది గణకుల కుటుంబంలో పుట్టిన వాడి కవిత్వం గణనకు రావాలి మరి.

ఈ యుగంలో చాలామంది రచనలు గణన కెక్కుతాయేగాని అన్నీ గణికులొప్పె గవ్వలు కావు.

పంచకావ్యాలూ పంచడబ్బులూ వగైరాలు

ఏ భాషా సాహిత్యంలోనైనా, వేలకొద్దీ పుస్తకాలు వెలువడుతాయిగానీ మరీ గొప్ప గ్రంథాలను మాత్రం వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. సంస్కృతంలో మొట్టమొదట చదవవలసినది పంచకావ్యాలే. నిన్నటిదాకా భారతదేశంలోని విద్యావంతులందరూ సంస్కృతం చదువుకొన్నవాళ్ళే. పంచకావ్యాలను చెప్పుకొన్నవాళ్లే. మన ఆంధ్రదేశంలో కూడా పూర్వకవులందరూ పంచకావ్యాలను పఠించారు. కనీసం కాళిదాసత్రయాన్ని కూడా చెప్పుకోనివాళ్లు లేరేమో.

సంస్కృత పంచకావ్యాలలో మొదటి మూడు కాళిదాసు వ్రాసినవే. అవి రఘువంశం, కుమారసంభవం, మేఘసందేశాలు. మిగతా రెండింటిలో మొదటిది భారవి చెప్పిన కిరాతార్జునీయం, రెండోది మాఘుడు నిర్మించిన శిశుపాలవధ, విద్యార్థులకు ఈ అయిదు కావ్యాలూ కరతలామలకమైతే ఇంకే కావ్యమైనా చదివి అర్థం చేసుకోగలరనీ, అర్థం చెప్పగలరనీ పెద్దల అభిప్రాయం. అయితే పంచకావ్యాలను అర్థం చేసుకొనడం సామాన్యం కాదు. ద్రాక్షాపాకంలో ఉన్న రఘువంశం మొదలుకొని మహా మహోపాధ్యాయులకు సైతం కొరుకుడుపడని మాఘకావ్యందాకా అధ్యయనం చేయాలంటే సమర్థుల వ్యాఖ్యానం అవసరం. ఈ కావ్యపంచకానికి కొలచల మల్లినాథసూరి గొప్ప వ్యాఖ్యానాలు వ్రాశాడు. కాళిదాస త్రయానికి చేసిన వ్యాఖ్యలకు సంజీవినీ వ్యాఖ్యలని పేరు పెట్టాడు. భారవికి ఘంటాపద సమాఖ్యానూ, మాఘకావ్యానికి సర్వంకషను ఆయన వ్రాశాడు. మన తెలంగాణాలోని మెదకు జిల్లాలో ఈ వ్యాఖ్యానాలు వెలువడ్డాక భారతదేశం అంతటా మరే వ్యాఖ్యానాలూ వీటిముందు నిలబడలేకపోయాయి.

మల్లినాథసూరిగారి వ్యాఖ్యానాలతో పంచకావ్యాలను చదువుకొన్నాక కవి హృదయాన్ని అర్థం చేసుకొనడానికి ఆస్కారం కలుగుతుంది. ఈ వ్యాఖ్యానాలు వెలువడ్డాకనే పంచకావ్యాలకు అధిక ప్రచారం వచ్చిందని లోకులు భావిస్తారు. సూరిగారికాలం క్రీ.శ.14వ శతాబ్ది అని కొందరూ, 15వ శతాబ్ది అని కొందరూ అనుకొంటారు. అయితే మన తెలుగు సాహిత్యంలో తొలియుగాల నుంచీ పంచకావ్యాల ప్రభావం కనబడుతుంది. కుంఫిణీ యుగం నాటికి అయిదింటిని తెనిగించడం పూర్తయింది. వీటి గురించి కొంచెం విపులంగా చెప్పుకొందాం.

రఘువంశం

కాళిదాసత్రయంలో ఇది మొదటిది. కొందరు ఇది కాళిదాసు రచనలలో కూడా మొదటిదే అని భావిస్తారు.[1] తన ఇతర గ్రంథాలలో చేయని దైవప్రార్థన కాళిదాసు ఈగ్రంథంలోనే చేశాడు. వాగర్థరూపంలో కలిసి ఉన్న, పార్వతీ పరమేశ్వరులను స్తుతించాడు. కవిగా పేరు తెచ్చుకొందామని అందని మ్రానుకు అర్రులు చాస్తున్నానని ఇలా చెప్పాడు.

---

1. సంస్కృత వాఙ్మయ చరిత్ర – (ద్వితీయ భాగం). మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు – పుటు.270

మంధః కవి యశ ప్రార్థీ గమిష్యామప హాస్యతాం
ప్రాంశులభ్యే ఫలే లోభా దుర్బాహురివవామనః (రఘు. 1-3)

దీని భావాన్ని ఒక తెలుగు కవి ఇలా అనువదించాడు.[2]

మందునుడ నేను కవి యశ మందగోరి
పరమ పరిహాసమున కిల బాత్రుడగుదు
బొడుగు వానికి నందంగ బోలు ఫలము
బడయ గేలెత్తున ప్పొట్టి వాని పగిది.

రఘువంశం రాస్తున్నప్పుడు తాను పొట్టివాడినని భావించినా కాళిదాసు ఉత్తరోత్తరా ఆజానుబాహుడయ్యాడు. మన నన్నెచోడుడు చేసిన ప్రశంస అక్షరాలా నిజం చూడండి:

భాసురమతి వాల్మీకి
వ్యాసాదులు చనిన జగతి వర కవితా సిం
హాసన మెక్క కవీంద్రుల
దాసులగానేలే గాళిదాసుడు పేర్మిన్ (కుమార. 1-19)

నిజంగా కాళిదాసు భాసురమతే. అతని ఏలుబడి నిరుపమానం. ఉపమానాలకు పెట్టినపేరైన కాళిదాసు కవితాభవనంలోనికి రఘువంశమే ప్రవేశద్వారం. ఇది పందొమ్మిది సర్గల కావ్యం. తొలితొమ్మిది సర్గలలో శ్రీరాముని పూర్వుల వృత్తాంతం ఉంది. పది నుంచి పదిహేనో సర్గదాకా రామకథ, పదహారో సర్గనుంచి చివరదాకా రాముని తరువాత ఏలినరాజుల సంగతి ఉంది. మొత్తం ఇరవై తొమ్మండుగురు సూర్యవంశ రాజుల చరిత్ర ఇందులో ఉంది.

రఘువంశాన్ని సంపూర్ణంగా ఆంధ్రీకరించడం ఈ యుగందాకా జరుగకపోయినా అయిదు, ఆరు, ఏడు సర్గలలోని అజచరిత్ర ఆధారంగా మన సాహిత్యంలో వచ్చిన ఇందుమతీ పరిణయాలకు లెక్కలేదు. ఈ యుగంలో ఆ వివాహకథను చెప్పినవాళ్ళ గురించి ''పరిపరి పరిణయాలు'' అనే వ్యాసం చెప్పాను. ప్రథమసర్గలోని దిలీప మహారాజు యితివృత్తాన్ని తీసుకొని కొటికలపూడి వెంకటకృష్ణయ్య ''దిలీపచరిత్ర'' అనే కావ్యాన్ని వ్రాశాడు. (ఇతడు పంచకావ్యాలలో ఇంకొకటి కూడా అనువదించాడు). ఇకపోతే రఘువంశాన్ని పూర్తిగా ఈ యుగంలో అనువదించినవాళ్లలో పోచిరాజు వీరన్నను ముందు చెప్పాలి అయితే ఇతని కావ్యం నష్టమైంది. ఇతడు పంచ కావ్యాలయిదింటినీ తెనిగించాడు. ఒక్కటే మిగిలింది. ఇక ఔడూరి కిచ్చనచేసిన అనువాదం అవలక్షణంగా ఉందని బ్రౌను దొరగారు కొట్టిపారవేశారు. (ఇతని గురించి అభ్యుదయాలవ్యాసం చూడండి). కవిరాయని రామచంద్రయ్య రాఘవచరిత్ర అనే పేరుతో రఘువంశాన్ని తెనిగించాడు. (ఇతని గురించి కూడా అభ్యుదయాల వ్యాసంలో

2. ఆదిపూడి సోమనాథరావుగారి అనువాదం – ''ఆంధ్ర రఘువంశం'' కాకినాడ, 1913

వివరించాను). ఈ యుగంలో ముగ్గురు రఘువంశాన్ని తెనిగించినా ఏ ఒక్కటీ లోకంలో ప్రసిద్ధం కాలేదు. పండిత లోకం ఆమోదించలేదు.

కుమార సంభవం

కాళిదాసత్రయంలో రెండోది కుమార సంభవం. పేరు కుమారసంభవమైనా పార్వతి జననం నుంచి తారకాసుర సంహారం దాకా 17 సర్గలలో కథనం చేశాడు. ఇది కాళిదాసు నవయౌవనంలో వ్రాయడం వల్ల సంభోగ శృంగార వర్ణనలు పచ్చిగా ఉన్నాయని విజ్ఞుల భావం. అనౌచిత్యాలకు ఉదాహరణలుగా ఈ పచ్చి శృంగార శ్లోకాలనే అలంకారికులు చూపిస్తారు.[3] చంద్రుడిలో మచ్చ బింబమంతటా ఉండదు. ఒక సర్గలోని ఈ శ్లోకాలు కాళిదాసు కవితా కన్యకు దిష్టి చుక్కలు.

కుమారసంభవాన్ని అనువదించే ప్రయత్నాలు కాకపోయినా అనుసరించిన జాడలు మన సాహిత్యంలో తొలియుగం నుంచీ కనబడుతుంది. నన్నెచోడుడు ఉద్భటుని కుమార సంభవాన్ని పేర్కొన్నా కాళిదాసు శ్లోకాలను అనువదించకపోలేదు.[4] శ్రీనాథుని హరవిలాసంలో కూడా కామదహనం ఘట్టంలో కాళిదాసు శ్లోకాలకు అనుకరణలు చాలా కనబడతాయి. శ్రీనాథుని తరువాత ఈ యుగం దాకా పార్వతీ పరిణయాలు వ్రాసిన వాళ్ళు అనేకులు. కాళిదాసు పాతరలోంచి కొలుచుకు వెళ్లినవాళ్లే గాదెలు నింపుకున్నవాళ్లు తక్కువ. కుంచెడో, మానెడో తమ పాత్రత ననుసరించి పట్టుకెళ్లినవాళ్లు ఎక్కువ. ఈ యుగంలో ఒక్క పోచిరాజు వీరన్న మాత్రమే కుమారసంభవాన్ని పేరు చెప్పి తెనిగించాడు. అతని అనువాదం నష్టమవడం దురదృష్టం.

మేఘసందేశం

ఆకాశంలో మేఘం ఎంత ఎత్తున ఉంటుందో విశ్వసాహిత్యంలో మేఘసందేశం అంత ఉన్నతమైన కావ్యం. నీటిమబ్బు ఎంత చల్లగా ఉంటుందో ఇది అంత రసజల్లు కురిపిస్తుంది. కోరమబ్బులు, కోటబొమ్మంచులూ ఎంత త్వరత్వరగా చూస్తూ ఉండగా ఆకారాలను మార్చుకొంటాయో అంత జడివేగంతో శ్లోక శ్లోకానికీ భావ చిత్రాలను మార్చు జగదేక కావ్యం మేఘసందేశం.

ఏడాదిపాటు ప్రియురాలిని ఎడబాయవలసిన యక్షుడు ఎనిమిది నెలలు ఎలాగో ఓర్చుకొని ఆషాడమాసంలోని మొదటిరోజున కనబడ్డ ఆగడపను చూశాడు. ఆ కారుమబ్బుతో తన కథను చెప్పుకొన్నాడు. తన ఊరు వెళ్ళేదారిని విపులంగా వర్ణించాడు. తన ఊరిని వర్ణించాడు. తన ఇల్లాలి స్థితిని జాలిగా చెప్పాడు. తన సందేశాన్ని అందచేయమన్నాడు. ఇంత చిన్న అంశాన్ని తీసుకొని నిత్యసుధలూరే రసకలశాన్ని కాళిదాసు సృష్టించాడు. 115 శ్లోకాలలో కోటి అనుభవాలను పొందుపరచ్చాడు. పట్టుకెళ్ళిన పాత్ర ఎంతో అంతే నీరు దక్కే కోనేరులాగ ఇది చదివే వాడి అనుభవాలకు

3. సంస్కృత వాఙ్మయ చరిత్ర ద్వితీయ భాగం - మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు, పుట.272
4. నన్నెచోడదేవ కుమార సంభవ విమర్శ - శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రి, విశ్వవిద్యాలయ ప్రచురణ, మద్రాసు, 1937. ద్వితీయ ప్రకరణం. పుట 45 నుండి పోలికల పరిశీలన ఉంది.

తగినంత రసానందాన్ని ఇస్తుంది. అందుకే మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు ఇలా అన్నారు.[5]

''ఉపాధ్యాయులు దీని సారస్యమునకు మరగి
దీనిని పంచకావ్యములలో జేర్చి బాల్యము
నందే విద్యార్థులకు బాఠము చెప్పుచు
వచ్చుట యొక విధముగా మేలేయైనది,
గాని నిజమునకిది కావ్య జ్ఞానముతో
బ్రాపంచిక జ్ఞానము గూడ గొంత యల
వడిన పిదపనే పాఠము చెప్పవలసిన
గ్రంథమని మాత్రము చెప్పక తప్పదు''

నిజంగా మేఘ సందేశంలోని సారస్యాన్ని మరగబట్టే అనంతర కవులు వందలకొద్దీ సందేశకావ్యాలను సంస్కృతంలో వ్రాశారు. మన తెలుగు కవులు కూడా నన్నయగారి దగ్గరనుంచి ఎందరెందరో దీన్ని పదేపదే చదివే వుంటారు. నాటినుంచి కుంఫిణీయుగం దాకా రసహృదయాలకు తెలుగుదేశం గొడ్డుపోలేదే. మరి ఏ ఒక్క రససిద్ధుడూ, సిద్ధహస్తుడూ ఈ కావ్యాన్ని ఎందుకు తెనిగించలేదో తెలియదు.

కుంఫిణీ యుగంలోనే మేఘ సందేశా నువాదాలు తెలుగులో ప్రారంభమయ్యాయి. ఈ యుగంలో ముగ్గురు తెనిగించారు. పోచిరాజు వీరన్న చేసిన ఈ కావ్యానువాదం కూడా నష్టమైంది. మిగతా ఇద్దరి గురించీ చెప్పుకొందాం.

మతుకుపల్లి నరసింహశాస్త్రి

మతుకుపల్లివారిది పండిత కుటుంబం. నర్సారావుపేట జమీందారుల ఆస్థాన పండితునిగా మతుకుపల్లి కనకాద్రిశాస్త్రిగారు ఉండేవారు. ఆయనకు ఇద్దరు కొడుకులు.

ఒకాయన నరసింహశాస్త్రిగారు. రెండో అతడు కృష్ణశాస్త్రి. ఇద్దరూ బాగా చదువుకొన్నవాళ్ళే. నరసింహశాస్త్రిగారు అటు సంస్కృతంలోనూ ఇటు తెలుగులోనూ గ్రంథరచన చేశాడు. కాళిదాసత్రయంలోని రెండు కావ్యాలను తెనిగించాడు. రఘువంశంలో అయిదోసర్గనుంచీ ఉండే కథను అజ చరిత్ర అనే పేరుతో వ్రాశారు. (ఇందులో కొన్ని భాగాలు నష్టమయ్యాయి. వాటిని మాత్రం తమ్ముడు కృష్ణశాస్త్రి పూరించాడు). మేఘదూతను ఆంధ్ర మేఘ సందేశం అనే పేరున అనువదించాడు. ఇదేకాక నరసింహశాస్త్రిగారు తోట్లవల్లూరు నగరంలో నానారకాల వింతలను చెన్నపురి విలాసం అనే పేరున వర్ణించారు. ఈ పుస్తకం కూడా అచ్చుపడింది.

క్రీ.శ. 1861లో తోట్లవల్లూరు రాజు బొమ్మదేవర నాగన్నగారు పోయిన జమీందారీని రాబట్టుకొందికి చెన్నపట్నం వెళ్ళారు. ఆయనతోపాటు మతుకుపల్లి నరసింహంగారుకూడా వెళ్ళారు. ఆయన ''యత్కించిదభినవ ప్రబంధం''

5. సంస్కృత వాఙ్మయ చరిత్ర ద్వితీయ భాగం – పుట .321

వ్రాయాలనుకొన్నారు. రాజుగారు చెన్నపట్టణాన్ని వర్ణించమన్నారు. ప్రాచీన ప్రబంధాలలోని పురవర్ణనల బాణీలో చెన్నపురిని నరసింహంగారు వర్ణించారు. ఆ పద్ధతులలో 64 ప్రకరణాలలో నగరాన్ని వర్ణించారు. అయితే పుస్తకం మాత్రం చిన్నదే. మొత్తం 232 గద్యపద్యాలు ఉన్నాయి. వర్ణించేది ఆధునిక నగరం కాబట్టి సమకాలిక పదజాలం ఉంది. గౌర్నరు, కలెక్టరు, జడ్జి, కర్నలు, సుప్రీమ్‌కోర్టు, కమీస్సరి, ఇలెక్ట్రో, గేల్వానిక్మిషన్ మొదలైన మాటలకు ఛాందసులు తెలుగు పదాలను సృష్టించలేదు కాబట్టి మాటలను యథాతథంగా కవి ఇందులో వాడాడు. పొగవోడలు, ఫోటోగ్రాపులు, సారట్లు, రైలుబళ్లు, గ్రంథాలయాలు, అచ్చుకూటాలు ఒకటేమిటి ఆనాటి చెన్నపట్నంలో చూడవలసినవన్నీ చూసి చెప్పవలసిన కొంచెం ఈ కావ్యంలో కవి చెప్పాడు.

చెన్నపురీ విలాసాన్ని మృదుపాకంగా ''పండితకోటికిన్ మిగుల పామర మండలికిన్'' ''మనంబులం పండువు సేయునట్లు'' రచించానని కవి వుద్దేశం. ఇందులోనిది మృదుపాకంకాదు; జీళ్లపాకమే. తత్సమ పదచాపల్యాం ఎక్కువ. అనవసరంగా గొట్టుసమాసాలు సృష్టిస్తేనేగాని ఈయనకు తృప్తి కలుగదు. గ్రంథం అంతా కఠినపాకంలో వ్రాసినా సంతోషం కలగక చివర దశావతార ప్రకరణం అని కృతిస్వామిని దీవిస్తూ పద్యాలు వ్రాశారు. అవి నిజంగా రుద్రాక్షపాకంలో ఉన్నాయి. భాష విషయంలో కవికి గల ప్రాచీన ప్రియత్వం వల్ల ఈ కావ్యం నిజంగా యత్కించిత్తు మాత్రమే అభినవ ప్రబంధం అయింది. సరళ భాష వాడి వుంటే సంపూర్ణంగా ''అభినవం'' అయ్యేది.

అయితే కొన్ని చారిత్రక కారణాలవల్ల అప్పటి పండితులకు ఈ పాండిత్యప్రకటన అవసరం. పొట్టకూటికోసం ఏ ప్రభువునో వీళ్లు ఆశ్రయించాలి. అవకాశం దొరికితేచాలు వచ్చినదంతా వెళ్లబోసుకొని మెప్పించాలి. అవతలవాడు సులభంగా అర్థంచెప్పలేని పద్యాలు వ్రాయడం ఆరోజుల్లో ఒక ఫ్యాషను. మతుకుపల్లి నరసింహంగారు వారిని అతిక్రమించలేకపోయాడు. తన పాండిత్యాన్ని పరీక్షకు పెట్టాడు.

నరసింహశాస్త్రిగారు తోట్లవల్లూరు సంస్థానంలో పండితుడుగా పరీక్షాధికారిగా ఉండేవారు. వార్షికాలకు వచ్చే మహాపండితులను ఈయన వాళ్ళ తాహతులు నిర్ణయించేవాడు. ఈయన వ్రాసిన పుస్తకాల పేర్లు చూడండి.

1. అజ చరిత్ర (ముద్రితం, 1912)
2. ఆంధ్రమేఘసందేశం
3. ఆంధ్ర సిద్ధాంత కౌముది
4. చెన్నపురీ విలాసం (ముద్రితం. 1920)
5. నృసింహా సహస్ర నామావళి (సంస్కృతం)
6. పుండ్ర కళానిధి (సంస్కృతం)
7. భరతశాస్త్ర సర్వస్వం
8. వెంకటాచల యాత్ర చరిత్రం
9. శ్రీకృష్ణ జలక్రీడా విలాసం
10. సంగీతసార సంగ్రహం

''అద్భుత ప్రసిద్ధ సారస్వతుడు'' అని పేరు పొందిన నరసింహశాస్త్రి గ్రంథాలు, కనీసం మేఘసందేశం దొరికి, అచ్చుపడితే బాగుండును. (ఈయన క్రీ.శ.1816లో పుట్టి 1873దాకా జీవించారు).

కొటికలపూడి వెంకటకృష్ణయ్య

మతుకుపల్లి వారిలాగే జమీందారులను ఆశ్రయించుకొన్న కుటుంబాలలో కొటికలపూడి వారిది ఒకటి. వీళ్ల బొబ్బిలివారి పురోహితులు. ఈ వంశంలో వెంకట కృష్ణయ్య బహుగ్రంథకర్త. మేఘసందేశాన్ని తెనిగించాడు. దీని ప్రతి అసమగ్రంగానైనా దొరుకుతుంది. (ఆర్.480) ఇందులో ద్వితీయ సర్గ పద్యాలే ఉన్నాయి. ఈ సందేశ కావ్యమేకాక ఇతడు రచించిన ఇతర గ్రంథాలు దొరుకుతున్నాయి. ఇతని గురించి ఈ సంపుటంలోనే వేరేచోట ఉంది.

కిరాతార్జునీయం

సంస్కృత పంచకావ్యాలలో మూడూ కాళిదాసు రచించినవే. నాలుగోది భారవికృతి. కిరాతార్జునీయం ''భారవే రర్థ గౌరవం'' అన్న పేరు పొందిన మంచి భావ విస్ఫూర్తి గల కావ్యం. నారికేళ పాకంలో ఉంటుంది. దీని మొదటి మూడు సర్గలూ పాషాణత్రయం అంటారు. పాండవుల అరణ్యావాసకాలంతో కథ ప్రారంభమవుతుంది. చారులవల్ల ధుర్యోధనుడి వైనాలు పాండవులు వినడం దగ్గర్నుంచి అర్జునుడు పాశుపతం సంపాదించేదాకా సాగిన చిన్న కథను భారవి 18 సర్గలలో చెప్పాడు. మల్లినాథసూరి తన వ్యాఖ్యతో ''ఘంటాపథం'' వేసేదాకా ఈ అరణ్యంలో జొరబడ్డవాళ్లు అరుదు. దీనిని అనువదించి పెద్దాపురం పాలించిన సార్వభౌమ తిమ్మరాజుగారి తమ్ముడు బలభద్రరాజుకు ఎవరో కిందటి యుగంలో అంకితమిచ్చారు. బహుశా అది వెణుతురుపల్లి వెంకటకవి రచించినది కావచ్చును. దీని అసమగ్రప్రతి ఒకటి లభిస్తోది. (ఆర్.808) మొదలూ తుదీ లేదు. అయినా దీనిని ఈ యుగంలో ఇద్దరు ఆంధ్రీకరించారు. పోచిరాజు వీరన్న అనువాదం నష్టమైంది. మిగిలిన వారి గురించి వినండి.

గోపాలుని సింగయ్య

మన సాహిత్యంలో చాలామంది ''లొడితెడు పొట్ట'' కోసం పరులను యాచించి కావ్యాలు చెప్పారు. కొందరు నరస్తుతి చేయలేక దేవునికి అంకితమిచ్చారు. గోపాలుని సింగయ్య ''లొడితెడు పొట్టకై యొరుల లుబ్ధతనెప్పుడు గూర్చియున్న యీ జడమతియెంతయుందొలగ'' ''కిరాతార్జునీయం'' తెనిగించి అహోబల నరసింహస్వామికి అంకితమిచ్చారు. ఇది అయిదాశ్వాసాల కావ్యం. అచ్చుపడింది. ఇందులో తొలి శ్లోకాలకు సరియైన అనువాదం లేదని, న్యూనాతిరిక్తంగా ఉందని పరిశోధకులు భావిస్తున్నారు.[6] ఇతని కవిత్వం రసవంతమై సలక్షణంగా ఉందని వీరేశలింగంగారు హర్షించారు.[7]

---

6. డి.459 వివరణలో
7. ఆంధ్ర కవుల చరిత్ర, 3వ భాగం - పుట.247

''భారవిభట్టు రచించిన భారవియను కావ్యమవని ప్రఖ్యాతిగనే నారూఢిని తెనిగించెద'' అని గోపాలుని సింగయ్యలాగ చెప్పకపోయినా ఈ యుగంలో మరికొందరు కిరాతార్జునీయ కథను వ్రాశారు. వాళ్ల వివరాలు చూడండి.

కోటచింతల కృష్ణయ్య

గోపాలుని సింఘయ్య కడప మండలంవాడు. క్రీ.శ. 1800 ప్రాంతాలవాడు. కోటిచింతల కృష్ణయ్య ఎక్కడివాడో ఎప్పటివాడో తెలియదు. ''సరవిజెప్పెద బరమేశు వరము వలన చెలగి త్రిశంభు కథ లెల్ల శేఖరముగ నెలమి చెప్పెద నామది నేర్చినంత నెయ్యముగనే గిరాతార్జునియ్యమిపుడు'' అని ఒక ఎత్తు గీతిలో రెండుసార్లు సరివిగా, ఎలమిగా చెప్తానన్న ఈ కృష్ణయ్య నేర్చినది తక్కువే'. ఇది నీరస ప్రబంధమని పండితులు కొట్టి పారేస్తారు. (ఆర్. 669).

బొమ్మలాట సాంబయ్య

అనంతపురం జిల్లా హిందూపురం తాలూకాలోని లేపాక్షి యక్షగానాలకు ప్రసిద్ధమైంది. ఆ ఊళ్ళో ''బొమ్మలాట'' వాళ్ళనే ఒక కుటుంబం ఉంది. అందులో సిద్ధయ్య అనే ఆసామి కొడుకుల్లో సాంబయ్య, శంబరధరుడు, శంభువీరుడు అనే వాళ్లున్నారు. వీళ్ళందరూ కిరాతార్జునీయాన్ని యక్షగానంగా రచించి దేవునికి అంకితమిచ్చారు. అందరూ ఒకటే కృతి వ్రాసినట్టు కనబడుతోంది. మూడు తాళపత్ర గ్రంథాలయాలలో ఉన్న ప్రతులలో ముగ్గురి పేర్లు గద్యలో కనబడతాయి.

1. ప్రాచ్యలిఖిత గ్రంథాలయం
   సిద్ధయ్య కొడుకు, సిద్ధయ్య తమ్ముడూ
   అయిన సాంబయ్య కర్త. డి. 1849

2. తంజావూరు సరస్వతీ మహలు
   సాంబయ్య తమ్ముడు శంభరధరుడు
   రచించినది. (తం.డి. 476)

3. అడయారు గ్రంథాలయం
   శంభయ్య తమ్ముడు శంభువీరుడు
   రచించినది. (32-ఇ-11)

ముగ్గురు అన్నదమ్ములూ ఒకే యక్షగానాన్ని తమ పేర్లతో అంకితం ఇవ్వడం వింతగానే ఉంది. ఈ యక్షగానంలో సంభాషణలెక్కువగా ఉన్నాయని తెలుగుదనం ఉట్టిపడుతూ ఉందని పరిశోధకులు చెప్తున్నారు.[8]

శిశుపాలవధ

పంచకావ్యలలో ఆఖరిది మాఘుడు రచించిన శిశుపాలవధ. ఇందులో 20 సర్గలున్నాయి. సంస్కృత భాషలోని పదాలన్నింటినీ ఈ కావ్యం తనలో ఇముడ్చుకొంది.

8. ఆంధ్రయక్షగాన వాఙ్మయం - ద్వితీయ భాగం. డా. యస్వీ జోగారావుగారు - పుట.48

''నవసర్గ గతే మాఘే నవశబ్దో నవిద్యతే'' అనే నానుడి పుట్టింది. ధర్మార్థకామాలు మూడింటినీ ఇది వివరిస్తుంది. చాలా గడ్డు కావ్యం. ఏకాక్షర ద్వ్యక్షర శ్లోకాలు వగైరా గారడీలున్న రచన. మేఘసందేశాన్ని ఆస్వాదించడానికి ఒక జీవితకాలం ఎలా చాలదో దీన్ని అర్థంచేసుకోవడానికి, అర్థం చెప్పడానికి తాతలు దిగి రావాలి. అందుకే మల్లినాథుడు ''మాఘేమేఘేగతం వయః'' అని చెప్పుకొన్నాడు. ఇటువంటి కావ్యాన్ని అనువదించాలన్న ఉద్దేశం కలగడానికే చాలా ధైర్యం కావాలి. సార్థకంగా, సొంతంగా తెనిగించిన వాళ్ళను అభినందించక తప్పదు. వాళ్ళ గురించి చెప్పుకొందాం.

పోచిరాజు వీరన్న

పంచకావ్యాలలో మిగిలిన నాలుగింటినీ అనువదించాక పోచిరాజు వీరన్న మాఘాన్ని తెనిగించాడు. మిగతా నాలుగూ నష్టమైనా ఇదొక్కటైనా దక్కినందుకు సంతోషించాలి. దీని ప్రతి అడయారు దివ్యజ్ఞాన సమాజంవారి లైబ్రరీలో ఉంది.

గోపీనాథం వెంకయ్యశాస్త్రులు

వెంకటగిరి సంస్థానంలో ఉంటూ రామాయణమంత ఉద్గ్రంధాన్ని ఎక్కువ తక్కువలు లేకుండా ఆంధ్రీకరించిన గోపీనాథంవారు మాఘకావ్యాన్ని కూడా తెనిగించారు.

సంస్కృతంలో పంచకావ్యాల సంప్రదాయం ఏర్పడినట్టే తెలుగులో కూడా అయిదు ప్రౌఢ ప్రబంధాలను పంచకావ్యాలని వ్యవహరిస్తారు.

అవి : 1. మనుచరిత్ర, 2. వసుచరిత్ర, 3. రాఘవపాండవీయం, 4. శృంగారనైషధం, 5. ఆముక్తమాల్యద. ఈ కావ్య పంచకం కాకుండా పంచ సంఖ్యల్లో మరికొన్ని కథలు చేరుకున్నాయి. వీటిని పంచడబ్బులంటారు. ఇందులో ప్రత్యేకంగా ఒక కవి వ్రాసిన గ్రంథాలుకాక ఒక తరహా కథలనే చేర్చారు. బ్రౌను దొరగారికి వారి వారి పండితులు 5 గ్రంథ నామాలను పంచ డబ్బులుగా పేర్కొని చెప్పారు. అవి:

1. మైరావణ చరిత్ర, 2. శతకంఠ రామాయణం, 3. కృష్ణార్జున సంవాదం, 4. గంగాగౌరీ సంవాదం, 5. జైమినీ భారతం

తమ పండితుల కథనాన్ని బట్టి బ్రౌను దొరగారు పంచడబ్బులకు అర్థం చెప్పారు. ప్రామాణిక పురాణాలలోని ప్రక్షిప్త భాగాలను ఆధారం చేసుకొని ఆ పురాణ పురుషులకు అంటగట్టి వ్రాసే కేవల కల్పనా కథలను పండితులు పంచడబ్బుల క్రింద వ్యవహరిస్తున్నారు.[9] ఏవి పంచడబ్బులో ఎవరూ ఖచ్చితంగా చెప్పలేకపోయారు. మొదట విన్న తప్పు సమాచారాన్ని సవరించుకొంటూ పైన చెప్పిన అయిదు పుస్తకాల పేర్లలో జైమినీ భారతాన్ని తొలగించి కుశలవకథను పంచడబ్బులలో బ్రౌను దొరగారు పొందుపరిచారు. (డి.14-ఫోలియో 346 (బి))

9. బ్రౌణ్యం (ఇ.టి.డి.) 1852 ముద్రణ. పుట 551

ఈ యుగంలో ఒక్క జైమినీభారతం తప్పిస్తే పంచడబ్బుల పద్దులోపడే రచనలు చాలామంది చేశారు. మైరావణ చరిత్రలూ, శతకంఠ రామయణాలు వ్రాసిన వాళ్ళ గురించి రామాయణ రచనలు అనే వ్యాసంలో వివరించాను.

అయినా మీ సౌకర్యం కోసం ఇక్కడ వాళ్లపేర్లు పొందుపర్చుతాను.

మైరావణ చరిత్ర : 1. పాతూరి తిరుపతయ్య (ద్విపద)
2. పాలెపు సీతన్న (పద్యకావ్యం)

శతకంఠ రామాయణం : 1. ముడింబి కృష్ణయ్య (అద్భుత రామాయణం)
2. పెనుమల్లి బాపయ్య (సీతా విజయం)
3. ముద్దుల లక్ష్మీనారాయణ (సహస్రకంఠ రామాయణం)
4. వేల్పూరి వెంకటేశ్వర్లు (విచిత్ర రామాయణం)

పంచడబ్బులలో ఇక మిగతా రెండూ సంవాదాలు. కృష్ణార్జున సంవాదాలూ, గంగా గౌరీ సంవాదాలు మాత్రమేకాక ఇతర సంవాదాలు కూడా ఈ యుగంలో ఉన్నాయి. సంవాదమన్నది వచ్చిన ఎవరికో ఒకరికి విజయం కూడా తప్పదు. (రాజీ కాకపోతే) అందుచేత మూకఉమ్మడిగా ఈ యుగంలోని సంవాదాలనూ, విజయాలనూ పరిశీలిద్దాం.

సంవాదాలూ, విజయాలు

ఈ యుగంలో 5 కృష్ణార్జున సంవాదాలు పుట్టాయి. ఇందులో కొన్ని గయోపాఖ్యాన కథను చెప్పాయి. కొన్ని భగవద్గీతను బోధించాయి. సంవాదాలని గ్రంథనామం చివర కనబడే కావ్యాలు ఒక డజనుకు తక్కువ లేవు. ఇద్దరి మధ్య వివాదంవస్తే ఆ గ్రంథానికి సంవాదం అని పెట్టడం సబువే. యుద్ధంలో హీరో గెలుస్తాడు కనుక కొన్ని వివాద కావ్యాలకు విజయాలు అని పేరు పెట్టడం కూడా సహజమే. ఈ యుగంలో 8 విజయాలే కనబడుతున్నాయి. పేచీ ప్రబంధాల రచయితల గురించి చెప్పుకొందాం. మొదట సంవాదరకర్తల విషయం అకారాదిగా తెలుసుకొందాం.

పట్టపాక ఓబన్న

సరస సాహిత్యవంతుడనని చెప్పుకొనే ఈ కవి మూడాశ్వాసాలతో గయోపాఖ్యానాన్ని చెప్పాడు. ఇది అహోబల నరసింహస్వామికి అంకితం ఇచ్చాడు. ఇతని గురువు మధ్య మతోద్ధారుడైన రాఘవేంద్రుడు. కవికాల నిర్ణయానికి పనికొచ్చే ఆకరాలు తక్కువ. ఈ గ్రంథప్రతిని ఎవరో రుధిరోద్గారిలో వ్రాసుకొన్నారు. బహుశా ఇది 1804లోనో, 84లోనే వచ్చిన రుధిరోద్గారి కావచ్చును. ఈ కావ్యం అముద్రితం. (డి.471)

రామావఝ్ఝుల కొండుభట్టు

పట్టుపాక ఓబన్నలాగే అహోబల నరసింహస్వామికే తన సంవాద గ్రంథాన్ని అంకితమిచ్చిన ఇంకో కవి రామావఝ్ఝుల కొండుభట్టు. ఇతడు ''కపిల గోసంవాదం'' అనే మూడాశ్వాసాల వేదాంత గ్రంథాన్ని, ''బ్రహ్మవిద్య తెలుంగున విస్తరింపజేయదలచి'' వ్రాశాడు. ఇతని తండ్రి సరస కావ్య కవిత్వ విశారదుడట. కాబట్టి ఒకటి రెండు గ్రంథాలు రచించి ఉండాలి. అయితే పుస్తకాల పేర్లయినా తెలియవు. కొడుకు సరస కావ్య కవిత్వ చాతుర్య కల్పనా కలితుడననీ జన లోక విశ్రుతుడననీ చెప్పుకొన్నాడు. అంత పేరు రావడానికి కొండుభట్టు వ్రాసిన ఇతర గ్రంథాలు ఏమిటో తెలియవు. ఈ పుస్తకంలో ఆరాశ్వాసాలున్నాయి. గోదేహంలో ప్రవేశించిన సోమరశ్మి అనే బ్రాహ్మణుడు కపిలునితోచేసిన సంవాదాన్ని ఆధ్యాత్మిక ప్రతిపాదితంగా కొండుభట్టు చెప్పాడు. (ఆర్.309) ఇతని కవిత్వం మృదువుగానూ, నాతి కఠినంగానూ శ్రావ్యంగానూ ఉంటుందని వీరేశలింగంగారు మెచ్చుకొన్నారు.[10]

కాకరపర్తి తిరుపతి పాత్ర కవి

యుద్ధగాథలూ, ఆధ్యాత్మిక వాదాలూ మాత్రమేకాక ప్రణయ కలహాలను కూడా సంవాద రూపంలో వ్రాసిన కవులు కూడా ఉన్నారు. విశాఖపట్టణంలోని కాకరపర్తి తిరుపతి పాత్రయ్య అసాధారణ మేధావిశేషంతో ''సత్యభామాకృష్ణ సంవాదం'' రచించి గొడే జగ్గారావుగారికి అంకితమిచ్చాడు. తన గొప్పతనాన్ని గొడేవారు ఇలా పొగిడినట్టు కవి చెప్పుకొన్నాడు.

> మృదుపద వైఖరుల్ బొదవించునప్పుడు
> నంది తిమ్మమాత్యు నైపుణంబు
> సలలితాలంక్రియల్ సమకూర్చునప్పుడు
> కవిరామ భద్రుని కౌశలంబు
> నర్థగుంభన రీతులలరించునపుడల
> సాని పెద్దన ప్రతిభా నిరూఢి
> ఘనతర శ్లేష కల్పన సేయునపుడు పిం
> గళ సూరకవి నిరాఘాట పటిమ
> నీకు గల్గుట జేసి నాళీక భవ వ
> ధూనటి యనారతమ తావకీన మృదుల
> జిహ్వికా రంగమున ప్రీతిచే నటించు
> పాత్ర కవి వర్య సద్గుణ ప్రకట ధుర్య. (సత్యభామా కృష్ణ సంవాదం. 1-14)

అష్టదిగ్గజాలలో నలుగురి నైపుణ్యాలు తనలో ఉన్నాయని చెప్పుకొనడానికి ఏనుగు గుండెకాయ ఉండాలి. ఈ సత్యభామా కృష్ణ సంవాదం క్రీ.శ. 1893లో తిరుపతి పాత్రయ్యకు అయిదో పురుషుడైన సీతారామశాస్త్రి పరిష్కరణలో అచ్చుపడింది.

---

10. ఆంధ్ర కవుల చరిత్ర - 3వ భాగం - పుట 276.

వేముగంటి దత్తోజీ

భగవద్గీతను కృష్ణార్జున సంవాదం అనే పేరుతో అనువదించినవాళ్ళలో వేముగంటి దత్తోజీ పండితుడు ఒకడు. ఇతణ్ణి గురించి ఈ సంపుటంలోనే ''భగవద్గీతలూ - బ్రహ్మవిద్యలు'' అనే వ్యాసంలో వివరించాను.

సాంతమహంతి రామచంద్రయ్య

సంవాదం అన్నపేరు వినగానే సవతులకయ్యం - అందులోనూ గంగాగౌరుల కీచులాట జ్ఞాపకానికి వస్తుంది. ఈ యుగంలో జానపదులు ఈ కయ్యాన్ని పాటగా కట్టుకొన్నారు. పసగాడ సన్యాసి పెద్ద పాటలో వ్రాసినదాన్ని ఇంకో ఇద్దరు చిన్నపాటలో చెప్పారు.[11] అయితే శిష్టకవులు పద్యకావ్యంగా చెప్పిన శంఖున పోస్తేనేగాని ఇటువంటివి పూర్వం సాహిత్యచరిత్రకు ఎక్కేవికావు. విశాఖపట్నం జిల్లా సింహాచలంలోని నరసింహస్వామి భక్తుడై ''తత్ప్రసాద ప్రభావమాన గవిత్వంబు రచియింపబూనిన'' సాంతమహంతి రామచంద్రయ్య అనే ఆసామి గంగా గౌరీ సంవాదాన్ని వ్రాశాడు. (ఆర్.479). ఏకాశ్వాసంలోనే భూరి చరిత్రగా చెప్పిన గౌరీ సంవాదం అచ్చుపడలేదు.

రామనామాత్యుడు

గయోపాఖ్యానాన్ని కృష్ణార్జున సంవాదం అనే పేరుతో వ్రాసి అహోబల నరసింహస్వామికి పట్టపాక ఓబన్నేకాక ఎవరో రామన్నకూడా అంకితమిచ్చాడు. ఇతడు కూడా ఓబన్నలాగే ఎవరో తిమ్మన్నగారి కొడుకు. మొత్తముమీద కవిత్వము సరసముగానే ఉన్నది అని ఇతని గురించి వీరేశలింగంగారు చెప్పారు.[12] ఒకే యుగంలో, ఒకే ఊరి దేవుడికి ఒకే పేరు గల తండ్రుల కొడుకులు ఒకే పేరున్న కావ్యాన్ని అంకితం ఇవ్వడం చూస్తే బహుశా ఇద్దరూ ఒకరేనేమో, పేరు విషయంలో వీరేశలింగంగారు పొరపడ్డారేమో అని అనుకోవలసివస్తుంది. ఆయన ఓబన్న గురించి చెప్పలేదు.

గోవర్ధనం రామయ్య

ఎవరు ఏకావ్యం వ్రాసినా దానిని నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు సూతుడు గొంతు చించుకొని చెప్పవలసిందే. మనకవులు సూతునిచేత ఓవర్ వర్క్ చేయిస్తున్నారని ఎవరైనా దయతలచక తప్పదు. సూతుడుకాక ఇంకెవరు కథ చెప్పినా ''పోనీలే ఆ పురాణం కథకుడికి రెష్టు దొరకింద''నుకోవచ్చు. గోవర్ధనం రామయ్య అనే పెద్దమనిషి ''అబ్ధిలోభి సంవాదం'' అనే గ్రంథం వ్రాశాడు. దీనిని విశ్వచారి అనే బ్రాహ్మణుడు లోకాచారి అనే శిష్యుడికి చెప్పాడు. ''నక్షత్రపురాన్ని హాటకుడనే రాజు ఏలుతున్నాడట. అతణ్ణి చూడాలని దీర్ఘకేశుడనే బ్రాహ్మణుడు బయలుదేరాడు. దారిలో ఒక మందిరం కనబడింది. ఇలాంటిది నేను చూడలేదని ''చోద్యమంది''. అతడు లోపలకు

11. తెలుగు జానపద గేయ సాహిత్యం - బి. రామరాజుగారు, పుటలు.297, 299, 301
12. ఆంధ్ర కవుల చరిత్ర- 3వ భాగం, పుట 286.

అడుగుపెట్టాడు. కుతూహలాన్ని కలిగించే ఈ కథను వ్యవహారిక భాషలో రామయ్యా వ్రాశాడు. చివర ఇలాగ మనల్ని బెదరిస్తున్నాడు.

గోవర్ధన రామయ్యా యు
గావించిన యర్థిలోభ ఘర్షము విని సం
భావన యివ్వని వాడే
కేవల హీనుండు వాడు కీర్తి రహితుడున్ (ఆర్.943)

ఈ కథ అతడు చెప్పాక ఎవరు సంభావన ఇవ్వలేదో మనకు తెలియదు. మనకెందుకు దొడ్డి సంభావన ఇచ్చి పంపిద్దాం.

పోచిరాజు వీరన్న

భగవద్గీతను కృష్ణార్జునసంవాదం అనే పేరుతో అనువదించిన ప్రసిద్ధులలో పోచిరాజు వీరన్న ఒకడు. ఇతని గురించి ఈసంపుటంలో ''అభ్యుదయాలు విలాసాలు'' అనే వ్యాసంలో విపులంగా వ్రాశాను.

వేల్చేరు వెంకటరామయ్యా

ఈ యుగంలో కృష్ణార్జున సంవాదాలను రచించిన ఇతరులు ఎవరూ చెప్పుకోని గొప్పతనాన్ని వేల్చేరు వెంకట రామయ్యా చాటుకొన్నారు. తన ''సవ్యసాచి కృష్ణ సంవాదం'' ''మహోత్కృష్ట కావ్యం'' అని అతని ఉద్దేశం. తనలాంటి ''కవితాచమత్కార పారావార గంభీరుడు'' ''లోకప్రశస్తిగా'' మహాప్రబంధాలే చెప్తారని అతని విశ్వాసం. ఇది మూడాశ్వాసాల గ్రంథం. దీని సమగ్ర ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.230). ఈ కావ్యమే కాకుండా ''మృదువుగా'', ''ఒప్పుగా'' వినయంతో ''భాసురమతిని ఈ సరసుడు'' వేరే కృతులు రచించాడు. వాటి పేర్లు మాత్రం తెలుస్తున్నాయి. అవి 1. విజయలక్ష్మి నరసింహ విలాసం, 2. వియన్నదీపరిణయం, 3. ఇరవై అయిదు శతకాలు, 4. బాణాసురయుద్ధ నాటకం, 5. ఇంకా కొన్ని నాటకాలు. ఇవన్నీ అలభ్యాలు.

వేల్పూరి వెంకటేశ్వరులు

మానవుల సంవాదాలు, మానవులతో సంవాదాలుకాక జంతువుల సంవాదాన్ని వ్రాసిన వాళ్లలో వేల్పూరి వెంకటేశ్వర్లు ఒకడు. ఇతడు గోవ్యాఘ్ర సంవాదాన్ని వ్రాశాడు. దీనిని గోవ్యాఘ్రచరిత్ర అని కూడా అంటారు. ఇతడు పంచడబ్బులలో చేరే విచిత్ర రామాయణాన్ని కూడా వ్రాశాడు. (ఈ సంపుటిలోనే రామాయణ రచనలపైన వ్రాసిన వ్యాసంలో ఇతని గురించి ఉంది). వేల్పూరి వెంకటేశ్వర్లేకాక మరికొందరు గోవ్యాఘ్ర చరిత్రలు వ్రాశారు. ఒకరి పేరు కనకయ్యగారి కామరాజు. (ఆర్.44) ఇతనిది రెండాశ్వాసాల పురాణం; పద్యకావ్యం, ఇంకొకపేరు తెలియనికర్త వచనరూపంలో గోవ్యాఘ్రచరిత్ర వ్రాశాడు. (ఆర్.59 (ఎఫ్)). నలుగురు వ్రాసిన గోవ్యాఘ్ర చరిత్రలు అచ్చుపడ్డాయి. ఒకటి వెంకట కవిది. ఇంకొకటి తిరునగరు రామానుజదాసుది. తక్కిన ముద్రిత గ్రంథాల కర్తల పేర్లు తెలియదు.

యామజాల శేషాచలపతి

ఇతడు వసిష్ఠ జనక సంవాదాన్ని వ్రాశాడు. అచ్చుపడింది. వావిళ్లవారు ప్రకటించారు. వేదాంతం, ఇతడి గురించి ''భగవద్గీతలు బ్రహ్మ విద్యలు'' అనే వ్యాసంలో రాశాను.

కొమరగిరి సంజీవి

గంటకు నూరుపద్యాలు చెప్పే ఘుటికులు మన కవులలో చాలామంది ఉన్నారు. కొమరగిరి సంజీవి అనే కవి ఏదో ఆవేశం వచ్చి ''ఆశుకవిత్వ తాండవో దంచిత మండితార్భటి''తో శశాంక శేఖర శతకాన్ని రెండు గడియలలో వ్రాశాడు. ఇతడే ఇంకో రెండు గడియలలో హరిహర సంవాదమనే రచన చేశాడు. ఈ రెండు గ్రంథాలూ బహుశా ఒకటే కావచ్చునని ఒకదానినొకటి మారుపేర్లని పరిశోధకులు భావిస్తున్నారు.[13] శతకాన్ని ఎవరితోనో జగడంవచ్చి చెప్పినట్లుంది ''మద్రిపు ప్రకర కంజ శశాంక శేఖరా!'' అని దేవుణ్ణి సంభోదించాడు. ''మదీయ శాత్రవుల దండన సేయగ'' దేవుని ఘుటనా! ఘుటనా సమర్థలీల కనబడుతుందట. ఈ సంవాదంలో కవే గెలిచాడు. తాను సన్నుతాస్తోక విలాసుడయ్యాడట. (నెం.34)

సంవాదాలలో గెలిచిన వాళ్ల విజయాలను కీర్తించేవాళ్లు చాలామంది ఉంటారు. సమాన ఉజ్జీలయినప్పుడు గ్రంథానామాన్ని సంవాదపదయుక్తంగా చెప్పవచ్చు. కొంచెం మహిమ ఎక్కువ వాడు గెలిస్తే ఆ కావ్యానికి విజయమనే పేరు పెట్టడం రివాజు. ఈ యుగంలో వచ్చిన విజయ కావ్యాలు చూడండి.

అయ్యామాచార్యులు

ఇతడు రామేశ్వర విజయం వ్రాశాడు. ఇతివృత్తం ఏమిటో తెలియదు. చెన్నకేశవ విలాసం కూడా రచించాడు. ఈ సంపుటిలోనే ''అభ్యుదయాలు-విలాసాలు'' వగైరాల పైన వ్రాసిన వ్యాసంలో ఇతని గురించి తెలిసిన కొద్ది విషయాలు చెప్పాను.

పరశురామ పంతుల అనంతరామయ్య

ఇతడు హనుమద్విజయం రచించాడు. రామాయణగాథ - రామాయణాలపై వ్రాసిన వ్యాసంలో ఇతని గురించి ఉంది.

ఆలూరి కుప్పన

ఆచార్య విజయం వ్రాశాడు. ఇతని గురించి పరిపరిపరిణయాల వ్యాసంలో చెప్పాను.

త్యాగరాజ మొదలి

ఆలూరి కుప్పనవంటి తమిళదేశంలో స్థిరపడిన తెలుగువాళ్లు తమిళ గ్రంథాలు వ్రాశారో లేదోగాని త్యాగరాజ మొదలి అనే తమిళుడు తెలుగు గ్రంథాలు వ్రాశాడు.

13. శతకకవుల చరిత్ర. వంగూరి సుబ్బారావు. పుట.475

ఇతడు చిన్న చిన్న పుస్తకాలు వ్రాసి పెద్ద పెద్ద పేర్లు పెట్టాడు. సుబ్రహ్మణ్యా విజయం అనే అయిదాశ్వాసాల కావ్యానికి ''విద్వత్కర్ణామృతం'' అనే మారుపేరు పెట్టాడు. ఇతడు ''ఛందోరత్నాకరం'' అనే ఛందోగ్రంథం కూడ వ్రాశాడు. అది చిన్న పుస్తకం. ఈయన 1830 ప్రాంతాలలో పుట్టి 1870 ప్రాంతాలలో పోయాడు. ఇంజనీరింగు శాఖలో అసిస్టెంటు ఓవరుసీరుగా పనిచేశాడు. ఇతని కవిత్వం సలక్షణమని వీరేశలింగంగారు సంతోషించారు.[14]

అనుమకొండ పురుషోత్తం

సలక్షణంగా ఉన్నా లేకపోయినా యక్షగానాలు మన సాహిత్యంలో ఒక ప్రత్యేకస్థానాన్ని ఏర్పరచుకొన్నాయి. అనుమకొండ పురుషోత్తం అనే ఆయన అంగర విజయాన్ని యక్షగానంగా రచించాడు. ఇందులో కవి సృష్టికాండలో మన్మథుని ప్రభావాన్ని చెప్పాడు అని కొందరూ[15] కామదహనం గురించి చెప్పాడని కొందరూ[16] అంటున్నారు. రచన ఒక మోస్తరు అని మొదటివారి అభిప్రాయం.

కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తులో ఈ యక్షగాన ప్రతి ఉంది. (గ్రంథ సంఖ్య 34) కవి కర్నూలు జిల్లావాడు.

అల్లమరాజు రామకృష్ణయ్య

ఈ యుగంలో కవి చకోర చంద్రోదయం వంటి కావ్యాలు వ్రాసిన అల్లమరాజు రామకృష్ణయ్య వైనతేయ విజయం కూడా వ్రాశాడు. ఇతని గురించి పరిపరి పరిణయాలు వ్యాసంలో రాశాను.

పిండిప్రోలు లక్ష్మణకవి

లంకావిజయం అనే పేరుతో, రావణ దమ్మీయం అనే నామాంతరంతో పిండిప్రోలు లక్ష్మణకవి ఒక ద్వ్యర్థికావ్యం వ్రాశాడు. ఇతని గురించి కూడా ఇతర వ్యాసాలలో వివరించాను.

ఈ ఏడుగురే విజయాలను వ్రాసినట్టు తెలుతున్నాయి.

---

14. ఆంధ్రకవుల చరిత్ర - 3వ భాగం, పుట 335.
15. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర - యస్వీ జోగారావుగారు, పుట.418
16. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక - సంపుటి 4. పుట 436

నూటయాభైమంది శతక కవులు

ఒకరకంగా ఇది శతక కవుల యుగమని చెప్పవచ్చు. ఈ కాలంలో లెక్క తేలినంతమంది శతకకవులు మరే యుగంలోనూ కనబడరు. అంతేకాదు ఈ యుగంలో శతకాలలో ఉన్నంత వైవిధ్యం కూడా పూర్వయుగాలలో కనబడదు. భక్తిశతకాలు, ముక్తి శతకాలు, రక్తి శతకాలు, విరక్తి శతకాలు, స్వయంఘోషణ, సమాజదూషణ, ఇచ్చినవాళ్ళను పట్టుకుని పొగిడి పారెయ్యడం, ఇవ్వనివాళ్ళను నిలబెట్టి తిట్టిపోసెయ్యడం ఒకటేమిటి ఈ యుగంలోని శతకాననంలో కా అంటే కావలసినన్ని ననలు కనబడతాయి. అయితే అన్నీ పారిజాత పుష్పాలేకావు. కొన్ని ఉమ్మెత్త పువ్వులు, కొన్ని కాగితం పువ్వులు, మరికొన్ని ఏ సాహిత్య భ్రమరాలూ వాలని సంపెంగమొగ్గలు. ఈ శతక ప్రసూనాల గురించీ వాటిని దండగుచ్చిన వాళ్ళగురించీ అవసరమైనంత చెప్పుకొందాం.

అన్నిటికన్నా మొట్టమొదట అవసరం ఈ కవులంతా శతక లక్షణాలు పాటించారా అన్న విషయం. శతకమనగానే సంఖ్యానియమం ముఖ్యం. అష్టోత్తర శత సంఖ్యకు మన పూర్వులు మంత్ర మహిమ ప్రసాదించారు. దేవునిపేరుగాని, స్తోత్రాన్నిగాని నూటఎనిమిది మార్లు జపించమన్నారు. ఆదిలో శతకాలు కూడా స్తుతులే. అందుచేత ప్రతిశతకంలో నూట ఎనిమిది పద్యాలు ఉండడం రివాజు. అయితే కొందరు బొటాబొటిగా నూరు పద్యాలతో శతకాన్ని పూర్తిచేసినవాళ్ళు ఉన్నారు. నూరు నుంచి నూట ఎనిమిది లోపున ఎన్నో కొన్ని పద్యాలు వ్రాసినవాళ్ళు ఉన్నారు. ఒక్క శతకంతో తృప్తిపడక అదే మకుటంతో శతకద్వయాలూ, త్రిశతులు చెప్పినవాళ్ళు ఉన్నారు.

కొందరు శతకం వ్రాద్దామనుకొని మొదలెట్టినా నూరు పద్యాలు పూర్తి చేయకుండానే సగమో, ముప్పాతికో చెప్పి ఊరుకొన్నారు. ఇలాంటి అసంపూర్ణ శతకాలను పూరించిన వాళ్ళు కూడా మరికొందరు ఉన్నారు. ఉదాహరణకు రాయభట్టు వీరరాఘవయ్య 75 పద్యాలతో ఆపేసిన కస్తూరిరంగ శతకాన్ని వాడ్రేవు కామరాజు పూర్తిచేశాడు. కిందటి యుగంలో వేల్పూరి విస్సన్న 73వ పద్యంతో అసంపూర్ణంగా వదిలివేసిన విశ్వేశ్వర శతకాన్ని అతని మనుమడు పూరించాడు.

అయితే చాలా శతకాలు ఈ యుగంలో అసంపూర్ణంగానే ఉండిపోయాయి. కొన్ని కొన్ని శతకాలలో నాలుగైదు, మరికొన్నింటిలో పది పన్నెండు పద్యాలు మాత్రమే దొరికాయి. ఉదాహరణకు చత్రా లక్ష్మీనరసు చెప్పిన కోదండరామశతకంలో 13 పద్యాలే లభించాయి. వీటిని ఈ కుంఫిణీ యుగంలోనే అచ్చువేయిస్తూ ఇలా ప్రకటించాలని వ్రాతప్రతిలో ఉంది.

''ఇది ఛాపా చేసేటప్పుడు షరా వ్రాయవలసినది యేమంటే నా దగ్గెర కలిగి పద్యములు యిన్నే గనుక యీ శతకమునకు నిండు ప్రతి యే పెద్ద మనిషి దగ్గర వుండినా మేము ఛాపా చేయిస్తున్నాము గనుక అందులో పదిప్రతులు అతనికి యిస్తున్నాము'' (డి.1537)

అయితే యిప్పటిదాకా ఎవరూ నిండు ప్రతిని ఛాపా చేయించినట్టు లేదు.[1] కోదండరామ శతకంలో దొరికిన పదమూడు పద్యాలైనా అచ్చుపడ్డాయి. కొన్ని అసమగ్ర శతకాల పద్యాలు వెలుగు చూడలేదు. నూరుకు తక్కువైనా ఈ పద్యాలను శతకాల కిందనే మన చరిత్రకారులు జమకట్టుకొంటున్నారు. ఏమంటే శతకాలేకాక మరికొన్ని సంఖ్యానియమంగల రచనలు కూడా మన సాహిత్యంలో లేకపోలేదు. ఒకటి నుంచి వేయిదాకా ఏ సంఖ్యలోనైనా కొన్ని నియమాలు పాటించి ఒకే మోస్తరు రచన చేస్తే ఆ రచనకు ఒక ప్రత్యేకమైన పేరు మనలాక్షణికులు ప్రసాదించారు.

సంఖ్యానియమంగల ఏ రచన చేసిన కవినైనా మన చరిత్రకారులు శతకకవి కింద పరిగణించారు. వంగూరి సుబ్బారావుగారి శతక కవుల చరిత్రలో తారావళులు మొదలైన రచనలు చేసిన రచయితల జీవిత వివరాలు ఉన్నాయి. అందుకే ఈ ప్రకరణంలో అటువంటి వాళ్ళ గురించి కూడా ముచ్చటించుకొందాం. వాస్తవానికి తారావళీ, పంచాశక్తులు మొదలైన రచనలలో కూడా మకుట నియమం ఉంటుంది కనుక అవి శతకాలకు దగ్గర చుట్టాలే.

ఏ ఏ సంఖ్యా నియమాలకు ఏ ఏ పేర్లున్నాయో ఈ యుగంలో ఎవరెవరు ఆ రచనలు చేశారో ముందు పరిశీలిద్దాం. ఒక్కటే పద్యం చెప్తే దాన్ని ముక్తకం అంటారు. రెండు పద్యాలు చెప్తే కుళకం అంటారు. మూడు పద్యాల రచనను త్రికం అంటారు. ఈ మూడురకాల పేర్లతో చేసిన రచనలకు ఉదాహరణలేవీ ఈ యుగంలో లేవు. ఆ పైబడిన సంఖ్యా నియమ రచనలు చాలా ఉన్నాయి.

పంచకం లేక పంచ రత్నాలు

అయిదు ఒకే మోస్తరు పద్యాలను ఒకే మకుటంలో చెప్తే దాన్ని పంచకం అంటారు. పెళ్ళి సదస్యాలలోనూ, సన్మాన సభలలోనూ పంచరత్నాలు సాధారణమే. వీటిలో మకుటం ఉండక్కర్లేదు. మిగతా వాటిలో ఉంటుంది. ఈ యుగంలో మూడు పంచకాలు లభిస్తున్నాయి.

1. మోదుకూరి అమరయ్య	:	వేణుగోపాల పంచ రత్నాలు ఆర్. 692 (బి)
2. కర్త తెలియదు	:	బ్రహ్మబిల పంచరత్నాలు ''శోభిల్లు బ్రహ్మ బిలము'' అనే మకుటంతో చెప్పిన సీసపద్యాలు (చాటుపద్య మణిమంజరి 2 పుట.31)
3. ఒక అజ్ఞాత కవి	:	యోగపంచరత్నాలు ''యోగ వలసాంద్రశ్రీగురు యోగిచంద్ర'' అనే మకుటంలో ఉన్న సీసపద్యాలు. (చాటుపద్య మణిమంజరి-2, పుట.36)

1. కోదండరామ శతకం సమగ్రంగా దొరుకుతున్నా అముద్రితమే. చూ. విస్మృత కళింగాంధ్ర కవులు - అడిదము రామారావుగారు, పుట 88. (ఈ కవి వివరాలు ఇదే సంపుటంలో ''విజయనగరం'' అనే ప్రకరణంలో ఉన్నాయి).

అష్టకాలు

పంచరత్నాల తరువాత చెప్పుకోదగ్గవి అష్టకాలే. వీటిని ''వారణమాలలు'' అని కూడా పిలుస్తారు. ఆరు, ఏడు సంఖ్యలుగల రచనలు ఎవరూ చేసినట్టు లేదు. అష్టకాలు చాలా ప్రసిద్ధాలు. ఏ ఛందస్సులోనైనా వీటిని రచించివచ్చు. అయితే మత్తకోకిల వికార రచనలే వీటిలో ఎక్కువ.

(బళ్ళారి) గురురాజయ్య	:	రాఘవేంద్రాష్టకం (చూ. శతక కవుల చరిత్ర, పుట.666)
బాణాల వీరశరభయ్య	:	గోరంట్ల మాధవాష్టకం. (ఇతడు గోరంట్ల మాధవ శతకం చెప్పాడు. ఈ పేరుతో అష్టకం కూడా ఇతడు వ్రాశాడేమో. (ఆర్.128)
పేరు తెలియని ఇంకో ఏడుగురు కవులు	:	పై మాధవాష్టకంతోబాటే మరో ఏడు అష్టకాలు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. వాటి పేర్లూ, నెంబర్లూ చూడండి.

1. మాధవాష్టకం, 128 (ఇ)
2. వెంకటేశ్వరాష్టకం, 128 (ఎఫ్)
3. రఘురామాష్టకం, 128 (జి)
4. రాఘవాష్టకం, 128 (హెచ్)
5. కడపనాయకాష్టకం, 128 (ఐ)
6. కోనేటిరాయాష్టకం, 128 (జె)
7. నవనీతచోరాష్టకం, 128 (ఎల్)

ఈ యుగంలో మదిన సుభద్రాయమ్మగారనే జమీందారుల ఆడబిడ్డ కూడా ఒక అష్టకం వ్రాసి ఉంటారని అనుమానించవచ్చు. ఆమె వ్రాసిన రెండు శతక సంపుటాలలో రెండు మత్తకోకిలలు దొరికాయి. రచనా విధానం అష్టకాన్ని స్ఫురింపచేస్తోంది.[2] ఒకటి చూడండి.

మేలుగా బ్రతిమాలగా జలమేలరా వెతజాలురా
జాలినొందగలేనురా నిను సన్నుతింపగ జాలరా
యేల నీదయ రాదురా ననునేలరా వగబాపరా
జాలమేల విశాఖ పట్టణ జానకీ పరమేశ్వరా

ఇది నిస్సందేహంగా అష్టకాల బాణీయే.

పల్లిపార్వతీశం అనే కవి కొన్ని అష్టకాలు వ్రాశాడట. ఏవీ లభించలేదు.[3]

2. మదిన సుభద్రాయమ్మగారిచేత రచింపబడిన ''తెలుగు కావ్యములు''. 3వ భాగము, ముద్రణ, 1893. పుట.82
3. చూ. శతక కవుల చరిత్ర, పుట.814.

నవరత్నాలు

అష్టకాల తరువాత నవరత్నాలు వస్తాయి. పంచరత్నాలలాగే నవరత్నాలను కూడా సభలలో చదవడం ఇప్పుడు కద్దు. అయితే పూర్వం ఈ రచనలు చేసిన వాళ్ళు అరుదుగానే కనబడతారు. ''కృష్ణ నవరత్నాలు'' అనే పద్యాలను శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రచురించారు.[4] వీటిలో మకుట నియమం ఏమీ లేదు. మరెవరో కవి ''రామనవరత్నాలు'' వ్రాశాడు. అక్కడక్కడ పురుగులు కొట్టేశాయి. (ఆర్.853 (బి)). వీటిని నగతగాని మాధమయ్య వ్రాశాడని నిడుదవోలు వెంకటరావుగారు భావిస్తున్నారు.[5]

దశకాలు

నవరత్నాల తరువాత వచ్చే సంఖ్యానియమ రచన దశకం. ఒకరకంగా ఇది శతకంలోని భాగమే. మనకవులు తమ శతకాలను పది దశకాలకింద విభజించి ఒక్కొక్క దానికి ఒక్కొక్కపేరు పెట్టడం రివాజే. చాలా శతకాలలో దశావతార దశకం తప్పనిసరిగా కనబడుతోంది. శతక విభాగంగాకాక ప్రత్యేకంగా దశకాలను కూడా వ్రాసినవాళ్ళు కొందరున్నారేమో. ఉదాహరించడానికి రెండు దొరికాయి.

కర్తపేరు తెలియదు : ''శ్రీమనోనాథ'' దశకం. దీనిని దశ సీసాలు అనే పేర వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రచురించారు. ''శ్రీమనోనాథ! మాధవ! శ్రీయనంత పద్మనాభ! దయానిధీ! పరమపురుష!'' అనే మకుటంతో ఎవరో పదిసీసాలు వ్రాశారు. (చాటుపద్య మణిమంజరి-2, పుట 45)

అజ్ఞాతకవి : ''కలగంటి'' దశకం. ఇవి కూడా సీసాలే. (మెలతకలగంటి అంతట మేలుకొంటి'' అన్న మకుటం. వీటినికూడా వేటూరివారే ప్రచురించారు. (చాటుపద్య మణిమంజరి-2, పుట 51) ''కలగంటి'' శతకం వేరే ఉందేమో ఈ దశకం అందులోని ఒక భాగమేమో!

భాస్కరమాల

పదకొండు సంఖ్యతో పద్యరచన ఏదీ జరిగినట్టు లేదు. పన్నెండు పద్యాల దండను భాస్కరమాల అంటారు. మనకు ఆదిత్యులు పన్నెండుమంది కనుక ఈ రచనకు ఇలా పేరు పెట్టారు. ఒక్క మోదుకూరు అమరయ్య వ్రాసిన ''కోదండరామ భాస్కరమాల'' తప్ప ఇంకొకటి నాకు కనబడలేదు. ఇది అముద్రితం. (ఆర్.692)

వింశతులు

భాస్కరమాల తరునాత 'శశికళ' అనే రచనా విభేదం ఒకటి ఉంది. పదహారు పద్యాల గుచ్ఛానికి ఈ పేరు ఉంటుంది. అయితే ఈ యుగంలో ''శశికళ''ను వ్రాసిన వాళ్ళెవరూ అగుపించదు. భాస్కరమాల తరువాత వింశతులు చెప్పినవాళ్ళే కనబడ్డారు. వింశతి అంటే ఇరవై.

---

4. చాటుపద్యమణిమంజరి-2 పుట. 24
5. శతక కవుల చరిత్ర - అనుబంధం. పుట 880.

పోలవరపు రాయడు	:	జేసువింశతి. ''జేసు శ్రీనామం'' అనే పేరిట ఇరవై పద్యాలను వ్రాశాడు. నెల్లూరు సంత జాన్ ప్రెస్‌వారు వేసిన గేయ సంపుటిలో ఇవి ఉన్నాయి.
మరింగంటి వెంకట రాఘవాచార్యులు	:	క్షమా వింశతి

పంచవింశతులు

ఇరవై పద్యాల తరువాత ఇరవై అయిదు పద్యాల విభాగమే గణనకు వస్తుంది. దీనిని పంచవింశతి అంటారు. గరుగులాల్ అనే అతడు ''రసజ్ఞ నృసింహ పంచవింశతి'' వ్రాశాడు. ఇది క్రైస్తవ మత విద్వేష రచన. తిన్ననూరి గోపాలం అనే కవి హనుమత్పంచ వింశతి వ్రాశాడు. రెంటాలవారి శతక సంపుటి.

తారావళులు

తరువాత వచ్చేవి తారావళులు. వీటిని నక్షత్రమాలలు అని కూడా పిలుస్తారు. ఇందులో ఇరవై ఏడు పద్యాలు ఉంటాయి. ఈ యుగంలో, ఇవి వ్రాసినవాళ్ళు అధికంగానే ఉన్నారు.

జూలూరి అప్పయ్య	:	శ్రీనివాస తారావళి
మోదుకూరి అమరయ్య	:	కేశవ తారావళి, ఆర్. 692 (సి)
లోకారెడ్డి కృష్ణమాచార్యులు	:	యోగ తారావళి. డి.2171
శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి	:	అచ్చిగాని తారావళి
అడిదం బాల భాస్కరం	:	శ్రీకృష్ణ భూపతి తారావళి
రాచవేటి కవి	:	గణికాగుణ ప్రవర్తన తారావళి
పండితారాధ్యుల వీరేశలింగం	:	శనైశ్చర నక్షత్రమాల
ఎవరో అజ్ఞాతకవి	:	సరస్వతీ తారావళి. ఆర్.128(సి) (వెండి గంటం గురునాథం అనే కవి సరస్వతీ శతకం వ్రాశాడు. ఇది కూడా అతడే చెప్పాడేమో, పరిశోధించాలి).
వేల్పూరి వెంకన్న	:	కంద తారావళి వ్రాశాడు. (చూ. శతక కవుల చరిత్ర. పుట.594)

పంచశత్తులు

తారావళుల తరువాత ''రాగమాల'' అనే రచనా భేదం ఉంది. ఇందులో 32 పద్యాలు ఉంటాయి. అయితే రాగమాలకు ఈయుగంలో ఉదాహరణ నాకు దొరకలేదు. అందుచేత ''నక్షత్రమాల'' తరువాత పంచాశత్తులనే చెప్పుకొందాం. పంచాశత్తులంటే ఏభైపద్యాలు, ఇవి అర్ధ శతకాల కింద లెక్క.

జూలూరి అప్పయ్య	:	రామపంచాశత్తు కందాలు
తోట విజయ రాఘవయ్య	:	శృంగార పంచాశత్తులు నాయకీనాయక వాక్యాలు

పంచాశత్తుల తరువాత శతకాలే వస్తాయి. వాటి తరువాత ద్విశతులు, త్రిశతులు, పంచశతులు, సప్తశతులు, సహస్రాలు యథాశక్తి వ్రాయవచ్చు. ఈ యుగంలో త్రిశతులు దాకా వ్రాసినవాళ్ళే కనబడతారు.

సంఖ్యానియమం తరువాత శతకాలలో ఉండవలసినది మకుట నియమం. పద్యం చివర ఒక పదంతోనో లేక కొన్ని పదాల కలుగలుపుగానో మకుటం ఉంటుంది. అయితే కొన్ని శతకాలలో ఒక పాదం పాదమంతా మకుటమే ఆవరిస్తుంది. కొన్ని వృత్తాలలో ఒకటిన్నర పాదాలుకూడా మకుటమే. కొన్నింటిలో మూడుపాదాలు కూడా ఆక్రమించకపోలేదు. ఈ యుగంలోని శతక కవుల మకుటాలను పరిశీలిస్తే అవి రకరకాల సైజుల్లో ఉన్న సంగతి స్పష్టమవుతోంది.

సైజు ఏదైనా సరే, సాధారణంగా మకుటం సంబోధనా రూపంలోనే ఉంటుంది. అయితే కొన్ని శతకాలలో అందుకు విరుద్ధంగా ఏదో ఒక ప్రకటన మాత్రమే మకుటాయమానంగా ప్రకాశిస్తుంది.

మచ్చుకు మాత్తూరు అప్పావు మొదలి చెప్పిన మాతృ శతకంలో ''తల్లిని బోల రెవ్వరున్'' అన్న సత్యమే చివరంటా కనబడుతోంది.

గోపీనాథం వెంకయ్యా శాస్త్రులు చెప్పిన శతకంలో ''బ్రహ్మానందమదియె కాదే?'' అనే ప్రశ్నే మకుటం.

మంచెళ్ళ వాసుదేవయ్యా వ్రాసిన రెండు శతకాలలోనూ సంబోధన లేదు.

''గోపాలుడు రంగశాయి మనపాలగలండు విచారమేటికిన్'' అనే ధైర్యవచనం ''రంగశాయి శతకం''లోనూ పూరుష ముఖ్యశతకంలో ''పూరుష ముఖ్యుడా భువన పూజ్యుడు మాకు బ్రసన్నుడయ్యెడిన్'' అనే ప్రార్థన కనబడతాయి.[6]

శంకర శంకరయ్యా రచించిన రాచబిడ్డ శతకంలో ''రాచబిడ్డడింక బ్రోచుమమ్మ'' అనే భరోసాయే మకుటం.

కొన్ని శతకాల మకుటాలు చక్కగా నోట పట్టు బడతాయి. కొన్ని ఇనుపగుగ్గిళ్ళు. పిచ్చి పాండిత్యాన్ని ఒలకబోస్తూ కూడా ''నేను ఎంత చదువుకున్నానో చూడు'' అని దేవుణ్ణి సవాలు చేస్తాయి. మోదుకూరి శంకరయ్యా ధీరధీ శతకం వ్రాశాడు. ''ధరశరాధీర ధీశనుత దాశరధీ ధరధీర ధీరధీ'' అని. ఈ మకుటం ఒకపాదం ఆక్రమించినా పొదుపుగా అదే అక్షరాలు వాడానని కవి భావించినట్టుంది.

ఆ మకుటం ఫరవాలేదు. విరుపులు తెలిస్తే నోటపడుతోంది. తిందుక ఆశ్వాను అనే పెద్దమనిషి నరసింహస్వామి వారిమీద శతకం చెప్పాడు. దీని మకుటం నిజంగా ఒక అచ్చాణీ. ఎంత స్పీడుగా మాట్లాడే నోటికైనా ఇది బ్రేకు వేస్తుంది. ప్రతి పద్యం చివరా ''శ్వేతకు భృన్నృకేసరీ'' అని నూరుసార్లు అనాలంటే చెడ్డచిక్కే. ఎంత దేవుని పేరైనా ఇది ఇబ్బందికరమైన పుణ్యాన్నే ఇస్తుంది.

---

6. నన్నయ్యగారు ఆదిలోనే ఆదిపర్వం మొదటి ఆశ్వాసంలోనే ''అనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్'' అనే మకుటంతో నాలుగు పద్యాలు చెప్పారు. చూ. ఆది.1–105 నుండి 108.

అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న! మల్లంపల్లి మల్లికార్జునయ్య అనే కవి పెడనలో ఉండే ఈశ్వరుని మీద ఒక శతకం వ్రాశాడు. ఈ స్వామివారిని ఆదిలో అగస్త్యుడు ప్రతిష్ఠించాడు. కనుక ఆయనకు అగస్త్యేశ్వరుడనే పేరు వచ్చింది. ఈ దైవాన్ని స్తుతించుతూ మల్లంపల్లి మల్లయ్య నోరు తిరగని మకుటం వ్రాశాడు. చూడండి: ''పెడనాభిధాన శివపూర్వస్త్యాదిగస్త్యేశ్వరా!'' అని 105 సార్లు అనాలంటే దేవుడు దిగిరావాలి.

ఇటువంటి మకుటాలు ముళ్ళ కిరీటాలు

మకుటాల్లో ముళ్ళున్నా లలితంగా పువ్వులాంటి పదాలతో శతకాన్ని వ్రాసిన వాళ్ళు కొందరు లేకపోలేదు. మకుట నియమంలో మరికొన్ని వింతపోకడలు పోయినవాళ్ళు కొందరున్నారు. తిరువాయిపాటి రామానుజయ్య ''రంగనాయకి'' శతకం వ్రాశాడు. ఈ ఉత్పలమాలలో పద్యం చివర ''రంగనాయకీ'' అని సంబోధనతోపాటు ప్రతిపద్యంలోనూ మూడవ పాదంలో 'చూడికుడుతాయని పిల్చిన బల్కవేమి' అనే ప్రశ్న ఉంటుంది.

పిలిస్తే దేవతలైనా పలకడానికి వాళ్ళ నామాలలో, చిరునామాలలో పొట్లు ఉండకూడదు. ఈ యుగంలోని నూటయాభైమంది శతకకవులు కొన్నివందల దైవాలను తమ శతకాల్లో పిలిచారు. దేవతల ఎడ్రస్సులలో పొరపాట్లు రాకుండా మకుటంలోనే స్వాముల సాకీన్లు కూడా ఎందుకేనా మంచిదని పొందుపరిచారు. ''మురమళ్ళపురాధిప వీరశంకరా?' అనీ ''గొట్టుముక్కల పురౌకా! రాజగోపాలకా!' అని ఆయా ఊళ్ళ పేర్లతో దేవుళ్ళను మకుటంలోనే సంబోధించడం కూడా ఈ యుగంలో విరివిగా కనబడుతుంది. ఈ రివాజు నిజానికి పాతదే. ప్రతిపద్యంలోనూ కాకపోయినా ఒకటి రెండుచోట్ల అయ్యలరాజు తిప్పన తాను సంబోధించే రఘువీరుడు ఒంటిమిట్టవాడని స్పష్టపరచాడు.[7] ఈ శతకానికి గజపతులయుగంలోనే ''ఒంటిమిట్ట రఘువీరశతకమ''నే పేరు రూఢమైంది. అయితే ఇలాంటి చిరునామా శతకాలు పూర్వం కొద్దిగానే ఉండేవి. ఈయుగంలో కోకొల్లలు.

తన ఊళ్ళో ఉండే దేవుని మీద ప్రతి రచయితా ఒక శతకం వ్రాసుకోవడం వల్ల మకుటానికి గ్రామనిర్దేశం జరిగింది. ఊరి పేరేకాక ఊళ్ళో వున్న ప్రముఖుని పేరు కూడా చేర్చడంవల్ల కొన్ని మకుటాలలో మానవుల పేర్లు కూడా వచ్చాయి.

మదిన సుభద్రమ్మగారు తమ తండ్రి పేరు కూడా చేర్చడం వల్ల ''చారు వైశాఖపురధామ. జగ్గరాయ దాస హృదయాబ్ది సోమకోదండరామ!'' అనే మకుటం వచ్చింది.

మిక్కిలి మల్లికార్జునుడు కూడా తన పోషకుడైన పోతాప్రగడ శ్రీరాములిగారి పేరు వచ్చే మకుటంతో రాఘవ శతకం చెప్పాడు. అయితే ''దాసపోషకు''లైన దేవతల ముద్రలు కీర్తనలలోనేగాని శతకాలలో అరుదుగా కనబడుతాయి. మకుటంలో ఊరిపేర్లు ఉన్నవే అధికం. వాస్తవానికి ఈ యుగంలో చాలా శతకాలు ఊరిపేర్లతోనే ప్రసిద్ధమయ్యాయి.

7. గజపతుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి, 2002.

ఉదాహరణకు కలువాయి శతకం; తాడిమళ్ళ రాజగోపాలశతకం; గోరంట్ల మాధవ శతకం వగైరాలున్నాయి. అప్పుడే లేచిన కొత్త ఊళ్ళ పేర్లు కూడా మకుటంలో వగైరాలున్నాయి. పువ్వుల చిన అప్పలస్వామి ''జార్జిపేట వేణుగోపాల శతకం'' వ్రాశాడు.

ఎన్ని మకుటాల్లో ఊరి పేర్లు ఉన్నా కొన్ని శతకాలకే నిజంగా పేరు వచ్చింది. దానికి కారణం వాటిలో ఉన్న రసవత్తర విషయాలే. శతక లక్షణంలో రసనియమంకూడా ఒకటి ఉందని సాహిత్య చరిత్రకారులు కొందరు భావిస్తున్నారు.[8] అన్ని పద్యాలలో ఒకే రసం ఉండాలనీ, ఒక దాంట్లో శృంగారం. ఇంకోదాంట్లో హాస్యం, మరోదాంట్లో శాంతం ఇలాగ ఉండకూడదనీ ఈ మతం చెప్పుతోంది. అయితే ''నియమం'' అంటూ ఒకటి మేకుబందీ చేస్తే చాలు దానిని విడగొట్టే ఉల్లంఘనలు కనబడతాయి. ఉదాహరణకు తాడిమళ్ళ రాజగోపాలశతకం తీసుకోండి. అది చూడ్డానికి శృంగారం, పద్యాల నిండా వెటకారం, నిందాస్తుతి ప్రవేశించేసరికి దానివెనుక హాస్యంకూడా జొరబడుతుంది.

శతక సాహిత్య సమీక్షకులు చెప్పిన మరొక నియమం; మకుటంలోని సంబోధనకు పర్యాయపదాలు ఉండకూడదు. అయితే వద్దిపర్తి అప్పయ్యా వ్రాసిన ''మహాప్రభూ!'' అనే పర్యాయ సంబోధనలు ఉన్నాయి. దీనికి కారణం లేకపోలేదు. ''మహాప్రభూ'' శతకంలో ''రామప్రభూ'' ''ఆత్మప్రభూ'' అనే సంబుద్ధి ఒక్క చంపకోత్పలమాలలలోనే పొసగుతుంది. కవి ఆవేశంలో వృత్తం మార్చేసి శార్దూల మత్తేభాలను ఎక్కితే ''రామప్రభో'', ''ఆత్మప్రభో'' అని వేరే వేరే పిలుపులు పిలవక తప్పదు. పట్టాభిరామయ్యగారి గంగాధరం ఈమాత్రం దగ్గర పోలికలున్న మకుటాలు కూడా చెప్పలేదు. ''రమణీ మనోహరా'' అని పిలుస్తూ మధ్యలో ''గోవర్ధనోద్ధారకా'' అని మారుపేరు పెట్టాడు. ఉత్పల చంపకాలతో మొదలెట్టిన శతకంలో మత్తేభ శార్దూలాలు రావడమే దానికి కారణం. ఛందస్సుల కలగూరగంపగా తన శతకం ఉంటుందని ఇలా తానే చెప్పాడు.

''మత్తేభంబులు చంపకంబులు మహామాధుర్య శార్దూలముల్
పొత్తుల్గూర్చిన వృత్తముల్ వరుస మేల్పొల్పొంద బద్యంబులే
నిత్తున్ భక్తిని జిత్తజారి చెలికిన్ ఇంపొందం బూదండగా
క్రొత్తల్చిత్తమునందు వెల్లి విరియన్ గోవర్ధనోద్ధారకా'' (ఆర్.856 (బి))

నిజానికి శతక లక్షణాలలో ఛందో నియమంకూడా ఒకటి కనబడుతోంది. ఏ ఛందస్సులో మొదటిపద్యం మొదలుపెడితే చివర దాకా అదే పాటించాలి. అయితే చంపకమాలా, ఉత్పలమాలా రమారమీ కవలపిల్లలు. ఉత్పలమాలలోని ఆది గురువును చెరిపి రెండు లఘువులు చేస్తే చంపకమాల అవుతుంది. అలాగే మత్తేభంలోని తొలి గురువుని తొలిగించి ఆచోటే రెండు లఘువులను నిలబెడితే శార్దూలం వస్తుంది. సంస్కృత ఛందోమర్యాదల ప్రకారం ఎంత గణబద్ధం చేసినా కొన్ని వృత్తాలను తెలుగువాళ్ళు మాత్రా ఛందస్సులలాగే పరిగణించారన్నది స్పష్టం. అందుకే పెద్ద కలువ

8. దాశరథి శతకం - పీఠికలో నిడదవోలు వెంకటరావుగారు, పుట 3. (యం.శేషాచలం అండ్ కంపెనీ, 1962)

పువ్వుల పక్క చిన్న సంపెంగలూ, భారీ ఏనుగుల సరసన కురచ పులులూ మన శతక కవులు నిలబెట్టినా అది చూడచక్కని ముచ్చటే అయింది.

శతకకవులు వాడే ఛందస్సులో ఉత్పల చంపకాలు, మత్తేభ శార్దూలాలూ మాత్రమే చాలా విరివిగా కనబడే వృత్తాలు, జాతులూ, ఉపజాతులూ కూడా మన కవులు తొలి దగ్గర నుంచీ వాడుతున్నారు. ఈ యుగంలో సీసశతకాలు జాస్తీ అయినాయి. కంద శతకాలు కూడా ఆ లెక్కలోనే ఉంటాయి. గీత శతకాలు, ఆటవెలదులు అక్కడక్కడ కనబడతాయి. పంచకాలూ, అష్టకాలూ వ్రాసేటప్పుడే మనకవులు పంచ చామరాలూ, మత్తకోకిల వికార రచనలూ వాడారు. ఒక్క కాసుల పురుషోత్తంగారే పంచచామరాలలో కూడా శతకం చెప్పినట్టుంది.

ఇంతకూ ప్రతిభావంతుడు ఏ ఛందస్సు చేబట్టినా ఫరవాలేదు. చెయ్యి తిరగనివాడు దేనిని ముట్టుకొన్నా ఆ పద్యం నడవదు, ఇతరుల్ని నడవనియ్యడు. ఈ యుగంలోని కొందరు కవులు నాలుగు పాదాలతో పద్యాన్ని గమ్యం చేర్చలేక పంచపాదులూ, బహుపాదులూ వ్రాశారు. గోపీనాథం వెంకయ్యా శాస్త్రులులాంటి ఉద్దండులు కూడా ఆవేశంలో పడి బ్రహ్మానంద శతకంలో బహుపాదులుగానే సీసాలు చెప్పుకొని పోయాడు. వాటిని మూలికల కింద జమకట్టుకోమన్నాడు. బహుపాదులు సరిగ్గా నడిస్తే ఫరవాలేదు. ఉన్న నాలుగు పాదాలే కుంటి నడక నడుస్తూ ఉంటే మరో సొట్టపాదం తెచ్చి కలిపితే పాఠకుడు కవికి బుద్ధి చెప్పక తప్పదు.

సాపూ సంతనా లేని రచనలతోపాటు దుష్టసమాసాలూ, ఛందో వ్యాకరణ దోషాలు గుప్పిస్తే ఇక చెప్పాలా! ఈ యుగంలోని చాలామంది శతకకవుల ఉబలాటాన్ని మెచ్చుకోవాలేగాని ఉక్తి పాటవాన్ని కొనియాడలేం. కొందరి శతకాలను సమీక్షిస్తూ చరిత్రకారులు చెప్పినమాటలు గుర్తించతగ్గవి. మల్లన రచించిన మల్లనయోగిశతకం గురించి చెప్తూ ఆ పద్యాలు ''ఛందోవ్యాకరణ విరుద్ధపద పూరితాలు, పండిత కర్ణకఠోరాలు'' అని వంగూరి సుబ్బారావుగారు అన్నారు.[9] బాణాల వీర శరభయ్య వ్రాసిన కాళహస్తి శతకం గురించి శేషాద్రిరమణ కవులు చాలా నిర్మొహమాటంగా కుండబద్దలు కొట్టినట్టు చెప్పేశారు.

వీరశరభయ్యా భాషా స్వరూపంగాని అర్థజ్ఞానంగాని పాటించడు. భావబోధకాలైన సమాసాలు ఉండవు. విషయవంతాలైన అల్లికలు ఉండవు. అయినా ఈ శతకానికి వచ్చిన ప్రచారం ఇంత అంతా కాదు. ''పామర జనులీ శతకమును మిగుల భక్తి విశ్వాసములతో బఠించుచున్నారు. భాషాజ్ఞానములేని వారికి మాత్రమిందలి పద్యముల గమనిక యాకర్షణ పాత్రముగా ఉండును'' అని శేషాద్రి రమణ కవులు ఉల్లాకు వేశారు.[10]

బాణాల వీరశరభయ్యలాంటివాళ్లు పామరుల్ని ఇలా కట్టేసుకుంటే గాదె ఆదిశేషయ్యలాంటివాళ్ళు పండితులే హడలగొట్టే ఉద్దండ పాండిత్యంతో గర్భ బంధ కవిత్వాల శతకాలు చెప్పారు. ఆదిశేషయ్యా వ్రాసిన కొచ్చెర్ల ధామ శతకంలో నామగోపన

9. శతక కవుల చరిత్ర, పుట 443.

10. కాళహస్తి శతకం, (వావిళ్ళ ప్రచురణం) పీఠిక

షోడశాక్షరులు, రథబంధాలూ మొదలైనవి ఉన్నాయి. ఇతణ్ణి మించిపోయినవాడు అనంతరాజు సుబ్బారావు. ఈయన చిత్ర కవితా సీసశతకం వ్రాశాడు. దానిపేరు సదాశివ శతకం. అందులో బోలెడన్ని గర్భిత వృత్తాలు ఉన్నాయి. ఈ నూరు పద్యాలలోనూ 62 విశేషాలను చరిత్రకారులు గుర్తించారు.[11] ఈ సీసాలలో మత్తేభాలూ, తోటకాలు, వసంత తిలకాలు వనమయూరాలు, మత్తకోకిలలు, మణిగణనికరాలు ఒకటేమిటి ఎన్నో కవిగారు ఇరికించేశాడు. మేలుకొలుపులు, లాలిపాటలు కూడా ఈశతకంలో గర్భితమై ఉన్నాయి.

అనంతరాజు సుబ్బారావులాగ అనంతమైన చిత్రకవితా శతకాలు చెప్పకపోయినా కొందరు ప్రతిభావంతులు అంత్యప్రాసలు, త్రిప్రాసలు, ద్విప్రాసలు, ముక్తపదగ్రస్తాలు, శ్లేషలు మొదలైనవి కనబర్చారు. ముడుంబై కృష్ణమాచార్యులగారి ''దీన రక్షామణి శతకం''లో ఈ ఫీట్లన్నీ కనబడతాయి. కొత్తపల్లి లచ్చన్న తన సూర్య శతకంలో అన్నీ దుష్కర ప్రాసలే వాడాడు. అన్నీ సంయుక్తాక్షరాలే. రాకింద వాకింద యావత్తులో చెప్పిన ఈపద్యం చూడండి.

స్వర్వ్యో మధరా రంజన
దుర్వ్యసన నిరాను రక్త దుఃఖ విదళనా
నిర్వ్యాజమౌని హృదయాం
తర్వ్యాపక కోక సమ్ముదప్రదసూర్యా.

ఇంతకన్నా కఠిన ప్రాసలతో పద్యాలు చెప్పేవాళ్ళు లేకపోలేదు. అయితే కవిత్వమంటే యతిప్రాసలు, ఛందో విశేషాలు మాత్రమే కావు. విషయం లేకపోతే ఈవిశేషాలు ఎందుకూ కొరగావు. సంఖ్యానియమం, మకుట నియమం, ఛందో నియమం అనే మూడూ శతకానికి బాహ్య అవయవాలే. ఇతర ప్రక్రియల నుండి వేరు చేయడానికి తప్ప ఈ నియమాలు ఇతరత్రా అనవరం. విషయం బట్టే శతకం రాణిస్తుంది. అయితే విషయ ప్రాధాన్యాన్ని బట్టి శతకాలను వేరువేరు రకాలుగా చరిత్రకారులు విభజించక తప్పదు. నిడదవోలు వెంకటరావుగారు ఇప్పటిదాకా పద్దెనిమిది రకాల శతకాలు ఉండవచ్చునని బేరీజు వేశారు.[12]

ఆధునిక యుగంలో విభజించడం వల్ల ఇన్ని శీర్షికలు ఏర్పడుతున్నాయిగాని కుంఫిణీయుగంలో కొన్నే ఉన్నాయి. సౌకర్యవంతంగా నాలుగైదు శీర్షికల్లో ఇముడ్చుకొని ఈ యుగంలోని శతకాలను సింహావలోకనం చేయడం సముచితమే.

భక్తి శతకాలు

మన శతక వాఙ్మయం అసలు భక్తిబీజంతోనే అంకురించింది. తరువాత నీతితో అంటుకట్టారు. ఆ పిమ్మట సాంఘిక చైతన్యలత ఈ కాండాన్ని చుట్టుకొంది. అందుకే నరస్తుతులు, వ్యక్తిగత సంబోధనలు మొదలైనవి తీసేస్తే మిగతా అన్ని శతక భేదాలలో

11. శతకవాఙ్మయ సర్వస్వము - వేదం వెంకట కృష్ణ శర్మ. పుటలు 328-331.
12. శతక సంపుటం (ప్రథమభాగం) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, పుట 16. అంతకు ముందు దాశరథి శతకం పీఠికలో పదహారే చెప్పారు.

చాలావరకు ఏదో ఒక దేవుని పేరే మకుటంలో కనబడుతుంది. ఈ యుగంలో భక్తి దేవతా స్తుతులు చేసిన శతక కవులు నూటికి పైబడ్డారు. వీళ్ళలో హైందవ దేవతలపై చెప్పినవాళ్ళు 102 మంది. పోతే ఇద్దరు క్రైస్తవులు. పోలవరపురాయడు ''జేసుశతకం'' చెప్పాడు. రివరెండు పురుషోత్తమ చౌదరి ''ఏసునాధశతకం'' వ్రాశాడు.

క్రైస్తవులు తమ దైవాన్ని తెలుగు సాహిత్య ప్రక్రియలతో నుతించుకొంటే ఆ క్రైస్తవులను తుదముట్టించమని గురుగులాల్ వంటి ఆవేశపరులు నరసింహస్వామిని ప్రార్థించారు.

''శ్రీరమాలోల యాశ్రిత జనమందార
లోకేశ సద్భక్త లోకపోష
బాలార్క జితనేత్ర భావజాహిత వంద్య
దంభోళి సమధగద్దగిత దంష్ట్ర
వజ్రాయుధ ప్రభావ జితనఖాంకుర
ధవళ ధరాధరోదార దేహ!
సంపూర్ణ విక్రమ సంయుత భుజ దండ
ప్రళయ కాలాంతక ప్రతిమకోప
కుమత జన శిక్ష! మాధవాక్రూర వరద!
దానవాంతక పల్లవీ ధైర్య చోర
క్రీస్తుమతజులఁ జెండుమా కినుక తోడ
వైరి గజసింహ! ఓబుల నారసింహ! (ఆర్.88)

ఈ మకుటంతో గురుగులాల్ పాతిక పద్యాలను చెప్పాడు. యవనుల అత్యాచారాలను ఆపమని పూర్వయుగంలో కొందరు మొరపెట్టుకొన్నారుగాని ఇలాగ ''క్రీస్తు మతజుల''ను చెండమని ఏ ఒక్కడూ నిర్దేశించలేదు. ఈ ఒక్క అపస్వరం తప్ప మిగతా భక్తిశతకాలన్నీ ఆత్మదైవాన్ని కీర్తిస్తాయిగాని పరనింద చేయవు.

దేవుడు మేలుచేసి ప్రతిగ్రామంలో లక్షణమెరిగిన ప్రతి ఒక్కడూ ఏదో ఒక శతకం వ్రాసి ఆ ఊళ్ళో దేవునికి అంకితం చేస్తూ వచ్చారు. మనదేశంలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయో అంతకు రెట్టింపు శతకాలున్నాయంటే తప్పు లేదన్న చరిత్రకారుల మాటలో తప్పులేదు.[13] మనకు ముప్పయి మూడుకోట్లమంది దేవతలేకాక ఊరికో గ్రామదేవత కూడా ఉంది. మన తెలుగు కవులు ఇందులో ప్రతి ఒక్కరి మీదా శతకం చెప్పగల సమర్థులే. కాని దేవతలకే భయమేసి సాహిత్య చరిత్రకారులను కరుణించి, కొందరిని కొన్ని దేవతాస్తుతులతోనే వ్రాయమన్నారు. మానవసహజమైన విద్వేషాలను పురస్కరించుకొని ఒకరకం బొట్టుపెట్టుకొనే కవి మరోరకం బొట్టు దేవుణ్ణి తిట్టకపోయినా ప్రార్థించలేదు. అయినా మన దేవుళ్ళు అవసరానికో అవతారం ఎత్తవలసి వచ్చింది. కనుక ఒక్కొక్క అవతార భేదంపై ఒకే కవి వివిధ శతకాలు చెప్పాడు. ఉదాహరణకు తాడేపల్లి పానకాలరాయడు ''మనసా హరిపాదము లాశ్రయింపుమా?'' అని జనరల్‌గా హెచ్చరిక

13. శతక కవుల చరిత్ర - గ్రంథప్రవేశం, పుట 37

చేసి, ఆ హరి ఎత్తిన నరసింహావతారంపైనా, రామావతారంపైనా, కృష్ణావతారంపైనా కూడా ప్రత్యేక శతకాలు చెప్పాడు. ఇలాగే మదిన సుభద్రయమ్మ కూడా కేశవ శతకం, హరిరామేశ శతకం చెప్పి నరసింహ, రామ, కృష్ణావతారాలపైననే కాక వెంకటేశ, రంగేశ్వర శతకాలు కూడా చెప్పింది. ఇలాగ విష్ణుభక్తి ప్రతిపాదకాలయిన వివిధ భక్తి శతకాలను వ్రాసిన వాళ్లు ఈ యుగంలో 68మంది కనబడుతున్నారు.

విష్ణుభక్తి పూరితమైన శతకాల తరువాత శైవమత కవుల సంఖ్యా ఎక్కువగా కనబడుతోంది. ఈ యుగంలో ఇరవైమంది ఫక్తు శైవశతకాలు వ్రాశారు. వీళ్ళలో వాకలపురి శంకరయ్యా భైరవ శతకం, కౌమరాజు రామలింగం, వీరభద్ర శతకం, దెందులూరి పద్మనాభం అల్లమప్రభుశతకం వంటివి వ్రాశారు. ఇతరులు కేవలం శివుణ్ణే నుతించారు.

మన కవులలో అదృష్టవశాత్తూ శివకేశవ విభేదాలను పాటించేవాళ్ళు తక్కువ. అందుచేత కొంతమంది కవులు శివుణ్ణీ కేశవుణ్ణీ వేరువేరు శతకాలలో కీర్తించారు. ఉదాహరణకు అడిదం సన్యాసి ఇటు రుద్ర శతకాన్నీ వ్రాశాడు. అటు కేశవశతకాన్నీ చెప్పాడు. ఇలాగ చేపలతో ఈది పావురాలతో ఎగిరే హంసలు అయిదారుగురు ఈ యుగంలో కనబడుతున్నారు.

శివకేశవుల పైననేకాక వాళ్ళ భార్యలపై పద్యాలు చెప్పినవాళ్ళు కూడా ఉన్నారు. కంచి కామాక్షి మీదా, మధురమీనాక్షిపైనా, కాళహస్తి జ్ఞానప్రసూనమ్మ మీదేకాక సరస్వతి మీద కూడా ఇద్దరు శతకాలు చెప్పారు. స్త్రీ దేవతలపైన శతకాలు చెప్పిన వాళ్ళు ఫక్తు ఆరుగురు ఈ యుగంలో కనబడతారు. తాడేపల్లి పానకాలరాయడులాంటి వాళ్ళు పురుష దేవతలపైననే కాక లక్ష్మీశతకం లాంటివి కూడా చెప్పారు.

అమ్మవార్లపై కొందరు శతకాలు చెప్తే ఈ యుగంలో ఇద్దరుకవులు ఆంజనేయునిపై చెప్పారు. ఇంకో అయిదుగురు కవులు గ్రహాలపై చెప్పారు. ముగ్గురు సూర్య నారాయణుని పై రచించారు. పండితారాధ్యుల వీరేశలింగం శనైశ్చర నక్షత్రమాల రచించాడు. ఘటికాద్రి అనే శనైశ్చర శతకం వ్రాశాడు.

మొత్తంమీద ఈ నూట నలుగురూ చెప్పిన భక్తి శతకాలలో పట్టుమని పదికూడా ప్రచారంలో లేవు; వచ్చే సూచనలు కూడా లేవు. కేవలం భక్తి ఒక్కటే కావ్య గౌరవాన్ని ఇవ్వలేదు. రాసింది రక్తి కట్టకపోతే ప్రజలు దానిని గుర్తు పెట్టుకోరు[14] అందుకే ఈ యుగంలో శృంగార శతకాలలాగ భక్తి శతకాలు ఎక్కిరాలేదు.

శృంగార శతకాలు

నిజానికి ఈ యుగంలో శృంగార శతకాలను రచించిన కవులు ఇరవైమందే. వీళ్ళలో ఎనమండుగురు అజ్ఞాత కవులే. కాంతాలలామ శతకం, తాడిమళ్ల రాజగోపాల

14. గంగమ్మగారి నరసింహం వ్రాసిన కృష్ణ శతకంలోని పద్యాలు మాత్రం చాలామందికి కంఠతావచ్చు. ఇవి బళ్ళో చదువుకొనని వాళ్ళు లేరేమో.

శతకం వంటివి ఎవరు వ్రాశారో తెలియవుగాని చాలా ప్రసిద్ధమయ్యాయి. తాడిమళ్ల రాజగోపాల శతకాన్ని ఎవరో పానకాల రాయడు రచించినట్టు ఆంధ్రవాఙ్మయ సూచికలో ఉంది. (పుట.78). అయితే ఇంటిపేరు లేదు. ఇతడు తాడేపల్లి పానకాలరాయడే అని నిడుదవోలు వెంకటరావుగారు జమకట్టారు. (శతకకవుల చరిత్ర, అకారాది అనుక్రమణిక. పుట.897) కాంతలలామ శతకాన్ని కే.కృష్ణకవి రచించినట్టు ఆంధ్ర వాఙ్మయ సూచికవల్ల తెలుస్తుంది. (పుట.36). అయితేవారు 1893 ముద్రణ చూశారు. 1842 మొదటిసారి కాంతాలలామ శతకం అచ్చుపడింది. దీనితోపాటే పోతిపెద్ది వెంకన్న రచించిన లావణ్యా శతకం, డబ్బీరు నరసయ్యా చెప్పిన కలువాయి శతకం ఆయేడే అచ్చుపడ్డాయి. పాతకవుల శృంగార శతకాలలో వైదర్సు అప్పయ్య వ్రాసిన భళిర కరివేల్పు శతకం కూడా ఈ వాయలోనే అచ్చయి వచ్చింది.

ఈ యుగంలోని శృంగార శతకాలను రెండురకాలుగా విభజించవచ్చు. ఒకటి విప్రలంభ శృంగారం. రెండోది సంభోగ శృంగారం. గోపీనాథం వెంకయ్యా శాస్త్రులు తన బ్రహ్మానంద శతకంలో వర్ణించినంత పచ్చిగా సంభోగ శృంగారాన్ని ఇంకెవరూ వర్ణించలేదు.

ఈ యుగంలో ఒక్క బ్రహ్మానంద శతకంలోనే కేవల సురత వర్ణన విజృంభించింది గానీ ఇతర శృంగార శతకాలు శృతిమించలేదు. సాధారణంగా మన ప్రబంధాలలోని మోతాదులోనే ఇవికూడా ఉన్నాయి. విప్రలంభ శృంగారంలో పాత ముచ్చట్లను నెమరువేసుకొనడం ఎక్కువ. నాయక ముస్తాబుల్ని తలచుకొనడం, ఆమె అందాల తీరులు, చీరల పేరులు వర్ణించుకొనడం, బతిమాలి, బామాలి, జాలం చేయకని ప్రాధేయపడ్డం వగైరా వగైరా భావాలే ఈ శృంగార శతకాల్లో కనబడతాయి.

పోతిపెద్ది వెంకన్న రచించిన లావణ్యా శతకం నిజంగా లావణ్యా భరితం. ఈ శతకంలోని ప్రతి పద్యం ''విరులపంకాపూని'' చలువ గాడ్పులు విసురుతుంది; తెల్లాకు మడుపులు, కొత్త కైరావళ్ళు నజరు చేస్తుంది. ఈ శతకాన్ని కార్వేటినగరం ఏలిన వెంకట పెరుమాళ్ళు. రాజుగారు పురమాయించారు. కార్వేటినగరం వారి వంశవృక్షంలో ఇద్దరు పెరుమాళ్ళ రాజులు కనబడతారు. ఒకరు క్రీ.శ.1719 నుంచి 1732 దాకా ఏలారు. రెండోరాజుగారు క్రీ.శ. 1807 నుంచి 1837 దాకా పాలించారు. పోలిపెద్ది వెంకన్నను ఎవరు పురమాయించారో తెలియదు. బహుశా మొదటి పెరుమాళ్ళరాజుగారి హయాంలోనే కవి యువకుడై, శృంగార శతకాన్ని వ్రాశాడనుకోవచ్చును. తరువాత క్రీ.శ. 1752 నుండి 1807 దాకా పాలించిన బొమ్మరాజుగారి గుడ్డి దర్బారులో ప్రాణం విసిగి ''వేణుగోపాల శతకం'' అనే దూషణ కావ్యాన్ని రచించి ఉండవచ్చును. బొమ్మరాజు వ్యవహార శూన్యుడు. నక్కలకు చలివేస్తుందని మంత్రి చెప్తే రగ్గులు సప్లయి చేయించాడు. ఇలాంటి మొద్దురాజుగారు ఏరికోరి ఒక శృంగార శతకం చెప్పించుకొంటారా?

పోలిపెద్ది వెంకటరాయుడి కాలం క్రీ.శ. 1725 కావచ్చునని శేషాద్రి రమణ కవులు అన్నారు. (చూ. లావణ్యా శతకం పీఠిక వావిళ్ల ప్రచురణ. 1910) అయితే వేదం వెంకట

కృష్ణశర్మగారు క్రీ.శ.1800-1875 అని అభిప్రాయపడ్డారు. (చూ. శతక వాఙ్మయ సర్వస్వం పుట 265) కవి బహుశా 1700-1780 దాకా ఉండి ఉండవచ్చును.

పోలిపెద్ది వెంకన్న రచించిన లావణ్యాశతకం చాలా తొందరలో ప్రచారం పొందింది. దీని వరవడిలో కాంతాలలామ శతకం వంటివి పుట్టాయి. ఇతర శృంగార శతకాలకు లావణ్యాశతకం ఒరవడి పెట్టింది. కాంతాలలామ శతకం ఎవరు వ్రాశారో తెలియదు. లావణ్యా శతకంలోని పద్యాలకు చాలా పోలికలు ఇందులో కనబడుతున్నాయి. గాని పోలిపెద్దివారిది ప్రబంధ విరహశైలి. "తాలనిచ్చునె ప్రేమ కాంతాలలామ" అనే మకుటంతో పురుష విరహాన్ని వర్ణించాడు. నాయిక పగబట్టి సాధిస్తూ ఉంటే నాయకుడు "గారవింపుమా బిగువు బంగారుగాను" అని వేడుకొంటున్నాడు.

పోలిపెద్ద వెంకన్న వైదిక శ్రేష్ఠుడు. కాంతాలలామకారుడు రాచబిడ్డ "రాకుమారుడనంచు రాజసంబున నేను చెలగినీ సేవలు సేయలేదా" అని ఒకసారీ, "రాజసింహడనంచు రసికత్వమెంచియు యింతినీ రసికత్వ మెంచలేదా" అని అదే పద్యంలో ఇంకోసారీ అంటాడు (98). ఈ రాకుమారుడెవరో భావి పరిశోధనవల్ల తేలాలి.

పోలిపెద్దవారి భావాలు కొంచెం ఘాటుగా ఉంటాయి. రాకుమారుడివి నేవళంగా ఉంటాయి.

నాయికను బ్రతిమాలుకొనే సన్నివేశంలో పోలిపెద్దివారి పద్యం ఒకటి చూడండి:

అతివ నేనొకసారి యానితే నీదు వా
 తెరతేనె లేమైన దరిగిపోనె
పణఁతి నేనిసుమంత పట్టితే నీచను
 బంతులంతటిలోనె వాడిపోనె
యలుక లేమిటి కించుక బలుకరించంగానె
 పలుకులో నమృతంబు లొలికిపోనె
కడుఁబ్రేమ నొకసారి కౌఁగిలించంగానె
 కలికి నీతను వేమి కందిపోనె
వనిత నాతోడ నొకసారి కెనయగానె
దర్పకుని బొక్కసము కేమి తక్కువగునె
చాన నినుమాన నాతోన చలముబూన
వలెనటే శ్రీరామ రామ లావణ్యాసీమ (లావణ్యా. 77)

సరిగ్గా ఇలాంటి సన్నివేశంలో కాంతాలలామకారుడు ఎలాగ అడుగుతాడో చూడండి.

హాయిగా నొక్కమాటాడకున్నావేమి?
 చెలియరో! ముత్తెములో చిందునటవె?
నెనరుగా నాదు మోమున మోముఁ జేర్చిన
 దరుణి! నీవాసికిఁ దక్కువటవె?

చెలువుగా గబ్బి గుబ్బల ఠొమ్ముఁ గ్రుమ్మిన
  ముదిత! నీ వన్నెకుఁ గొదువయటవె?
జతగూడి దొంతర రతుల నన్నేలినఁ
  గలికి! నీ జాతికి గడమయటవె?
పలుకుఁమిక నీదు మదిలోని భావమెల్ల
నేలనే మది దాచేవు లోలనేత్ర!
వలచినానని యెంచవొ తెలిసెందెలిసెఁ
దాళనిచ్చునె ప్రేమ కాంతాలలామ (కాంతాలలామ-4)

పోలిపెద్ది వారి ఎత్తుగీతిలోని ఘాటు రాజకుమారుని ఎత్తుగీతిలో లేదు. అయితే పోలి పెద్దివారిది నౌకర్ల మనస్తత్వం. ''వలరాజునగరి ముందలనైన నుంచవే జీతమొల్లని కొల్వు సేతుగాని'' అని నాయకుని చేత అనిపిస్తాడు.(లా.12) కాంతాలలామకారుని రాజసం ఈ మాటలు పలికించదు.

అయితే ఎంత రాజసమున్న వాళ్ళయినా ఈ యుగంలోని కవులు శృంగారంలోని తామస ప్రవృత్తినే ప్రకోపింప చేస్తారు. భోగలాలసత్వం వెర్రితలలు వేసి వికటతాండవం చేస్తుంది. కాళహస్తి సుబ్బారాయడు అనే కవి భోగినీ శతకం చెప్పాడు. ''సురత మేదనా రసశ్రేణి సుబ్బసాని'' అనే మకుటంతో నూటమూడు సీసపద్యాలు వ్రాశాడు. సుబ్బసాని అనే నెరజాణ స్వయంగా ''నాపేర సలలిత భోగినీ శతకం'' చెప్పండని అడిగిందని సుబ్బారాయడు చెప్పాడు. ఇది పురుష విరహం. నూరేళ్ళ కిందట అచ్చుపడ్డ దీని సంగతి ఇటీవలనే బయటపడింది.[15]

ఇంకా బయట పడని శృంగార శతకాలు ఏడెనిమిది ఉన్నాయి. ఎవరో అజ్ఞాతకవి కళావతీ శతకం చెప్పాడు. (డి.1492). ఇంకో మరుగుపడిన మాణిక్యం ''బింబాధరా శతకం'' చెప్పాడు. (డి.1625). మరోపేరు తెలియని పెద్దమనిషి ''చతుర విటరాజ మోహనా! చంద్రవదన'' అనే మకుటంతో చంద్రవదన శతకం చెప్పాడు. (డి.1560). ఇటువంటి వెలుగుచూడని శతకాలు చాలా మట్టుకు అసమగ్రాలు. ''జామిపురఖేల-కీర్తివిశాల గోపబాలికాలోల మదన గోపాల బాల!'' అనే శతకాన్ని జామిలోని ఏ కవివ్రాశాడోగాని ఇందులోని రెండున్నర పద్యాలే లభిస్తున్నాయి. (డి.1573)

అయితే సమగ్రంగా కనిపించే శృంగార శతకాలు కూడా కొన్ని అచ్చుపడలేదు. విశ్వనాథ కామయ్యగారు అమరావతిలోని ఉమామహేశ్వరునిపై ఒక శృంగార శతకాన్ని ఉత్పల చంపకాలతో రచించారు.

ఈ పద్యాలు కొన్ని శివుణ్ణి తలచుకొని విప్రలంభంలో గంగాదేవి అనుకొన్నమాటలే.

---

15. భోగినీశతకం గురించి చెప్పినవాడు నిడుదవోలు వెంకటరావుగారు, దాశరథి శతకం పీఠిక, పుటలు 16-18.

రాగదవో॑యి రానసెడి రవ్వల కో॑ర్వగదో॑యి బాధచే
జాగొ॑నరింపకో॑యి యెలజవ్వన మెచ్చుట దాతునో॑యి మా
బాగని యోర్చుకొ॑న్న విరిబాణము మారుడు వింటబూనినా
రాగిడి నంటనేసె నమరావతి భాస్కదుమా మహేశ్వరా! (డి.1479)

మన్మథునికి కొత్తగురి చోట్లు చూపించే ఈ శతకం ప్రతులు రెండు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. ఒకదాని తొలి కమ్మ మీద ''విశ్వనాథ కామయ్య కవనం'' అని అదృష్టవశాత్తూ ఉండడం వల్ల కవిపేరు తెలిసింది. ఈ కామయ్యగారికీ, కవిసామ్రాట్టు విశ్వనాథసత్యనారాయణగారికీ ఏమిటి సంబంధమో తెలియదు.[16]

శివుణ్ణి శృంగార పురుషునిగా భావిస్తూ విశ్వనాథ కామయ్యగారేకాక మరొ॑కకవికూడా శతకం చెప్పాడు. వెలవెల శంభుమూర్తి అనే ఆయన మురుమళ్ళ వీర శంకర శతకం చెప్పాడు. ఇదికూడా ఉత్పల చంపకాల దండ సమగ్రంగా ఉంది. ఈకవి క్రీ.శ.1890 ప్రాంతాలవాడని నిడుదవో॑లు వెంకటరావుగారు పొరబడ్డారు.[17] అంతకు నూరేళ్ల ముందువాడు మురమళ్ళ శతకం ప్రతిని కట్టాల మామయ్య వ్రాసిపెట్టి మాజేటి సర్వేశలింగానికి ఇచ్చాడు. ఇది పరాభవలో జరిగింది. క్రీ.శ.1847లో ఒక పరాభవ వచ్చింది. మాజేటి సర్వేశలింగం బ్రౌను దొరగారికి తెలుగు కావ్యాలు సప్లయి చేసేవాడు. ఈయన 1850 నాటికే వృద్ధుడు. అందుచేత శంభుమూర్తి సర్వేశలింగానికి సమకాలికుడో, ప్రాచీనుడో కావాలి. బహుశా 1800 ప్రాంతాలవాడు కావచ్చును. ఇతని శైలి బాగానే ఉంది.

''ఎందుకు నీకు నా చెలిమి యెవ్వరికెవ్వరు నాడు నాటికే
పొందులు నింపుసొంపులును బుల్పు తలంపులు నిచ్చకంబులున్
అందని మ్రానిపండ్లకును నాసల చెందుట యింతెకాక యే
మందురు విన్నవారు మురమళ్ళ పురాధిక వీరశంకరా! (డి.1662)

మరుమళ్ళ గ్రామం గో॑దావరి జిల్లా అమలాపురం తాలూకాలో ఉంది. ఈ శతకమంతా నాయిక చెప్పిన మాటలే. మన కవులు ఇటు స్త్రీ విరహం అటు పురుష విరహం సమానంగా వ్రాశారు. తోట విజయ రాఘవయ్య అనే నిష్పక్షపాతి శృంగార పంచాశత్తు అని యాభై పద్యాలు స్త్రీలకు, యాభై పురుషులకు పంచాడు. దీనినే నాయకీ నాయక శతకమని కూడా పిలుస్తారు. ప్రత్యేకమకుట నియమం ఏమీలేదు. ప్రేమలేఖల బాణీ, ఈపద్యాలు తెలుగుదేశంలోని వేశ్యాలోకంలో ప్రచారం చెందాయి. వాస్తవానికి స్త్రీ వాక్యాలను ''వారాకామినులకై మృదు లాలిత శబ్ద యుక్తితో'' రచించానని కవి చెప్పుకొ॑న్నాడు. వీటిని లోకానుభవం లేని బాలబాలికలు చదువకూడదని పెద్దల అభిప్రాయం.[18]

16. ఇటువంటి కవిగురించి తమకు తెలియదని వారి వంశంలో ఇలాంటి రచనలు చేసినవారు లేరని విశ్వనాథ సత్యనారాయణగారు నాకొ॑క కార్డు వ్రాశారు.
17. శతకకవుల చరిత్ర, అనుబంధం, పుట.812
18. శతక కవుల చరిత్రలో వంగూరి సుబ్బారావుగారి హెచ్చరిక. పుట. 579

బాలబాలికలు చదవకూడని ఈ పద్యాలను వ్రాసింది బాలికల బడిలో అయ్యవారే! తోట విజయరాఘవయ్య మదరాసు-ట్రిప్లికేనులోని హిందూ బాలికాంధ్ర ద్రవిడ పాఠశాలలలో క్రీ.శ.1840 ప్రాంతాలలో ఉపాధ్యాయునిగా పనిచేశాడు. ఈ బడిపంతులు "పల్లికూట మందలి బుడుతలు గనుంగొనగ దర్పకుసాములు" చేసే నాయికా నాయకులను వర్ణించడం చాలా అఘోరిస్తూ ఉంది. అప్పుడు "ఒజ్జలుగని మీకునుంజదువు సాములు రెండొనగూడెనింక మీరలసితిరింటికేగి సుఖమందుడ"ని సెలవియ్యడం మరీ దారుణం.[19]

అయితే ఇంత బరితెగించి వ్రాసిన ఈయన కేవలం పచ్చి శృంగారమేకాక భక్తి శతకం కూడా వ్రాశాడు. తిరువళ్ళిక్కేణి పార్థసారథిపై ఒక కందశతకాన్ని వ్రాశాడు. అయితే నాయకీ నాయకా శతకమే ప్రచారం పొందింది. ఇటువంటి శృంగార పద్యాలను చదివే వారకాంతల సంఖ్య పెరగడంవల్లనో ఏమో రాచవేటి కవి అనే ఆయన గణికలను గర్హిస్తూ ఇరవయ్యేడు పద్యాలు వ్రాశాడు. దీనిని గణికాగుణ ప్రవర్తన తారావళి అంటారు. వారకాంత గృహం "రచ్చకూటమా బండరాయా, దొమ్మరి డోలు సంతగుజ్జరి" అని చెప్పాడు. "వెలయాలికిని దక్కునట్టి విటుడు దుత్తబూనడె తనచేతదుట్టతుదకు" అన్నాడు. కొత్తరకం అష్టకష్టాలను ఇలాగ పేర్కొన్నాడు.

తన సతిబాసి సంతతి లేని దొక్కటి
  తన బంధుహిత విరోధంబు రెండు
కైవల్య పదవి సంఘటన లేనిది మూడు
  నలువురలో హేళనంబు నాల్గు
తనదు దేహము పటుత్వము తప్పుటయు నైదు
  పెంపెరియఁగఁ దలవంపులాఱు
బలురోగముల బాధఁపడి కృశించుట యేడు
  చేజిడ్డు వదలుటచే నెనిమిది
గాన నీయష్టకష్టముల్ గలుగువార
కామినీ జనసంగతి గలిగెనేని
సరస దరహాస భువన రంజన విలాస
బుధ జనోల్లాస చిరుతని పురనివాస (నెం.7)

ఈ పద్యంలోని మకుటం వల్ల రాచవీటికవి తిరుత్తణివాడని తెలుస్తోంది. బహుశా కార్వేటినగరం సంస్థానపువాడు కావచ్చును. ఈ కవి గురించి ఇంతకన్న ఎక్కువ తెలియదు. ఇలాంటి కవులు ఎంత తిట్టిపోసినా సమాజంలో వ్యభిచారంగాని, సాహిత్యంలో శృంగారంగాని తగ్గలేదు. పైగా ఈ యుగంలోని శతకశాఖలో కొత్తరెమ్మ మొగ్గతొడిగింది. నాయిక తన ప్రియుణ్ణి తీసుకొని రమ్మని దూతికను పంపుతూ చెప్పి శతకాలుగా వెలశాయి. వీటిని దూతికా శతకాలు అని వ్యవహరించవచ్చు.

---

19. శృంగార పద్య పంచాశత్సుస్తీ వాక్యం. పద్యం నెం.10. కామగ్రంథమాల - పాండిచ్చేరి

దూతికా శతకాలు

దూతికా శతకాలలో సాధారణంగా సీసపదాయలే ఉంటాయి. ఎత్తుగీతి ఆఖరి రెండుపాదాలలోగాని, చివరిపాదంలోగాని మకుటం ఉంటుంది. ఈ యుగంలో ఇటువంటివి తొమ్మిది శతకాలు కనబడుతున్నాయి. వాటి వివరాలు చూడండి.

వరుస	కవిపేరు - శతకం పేరు	మకుటం ఇతర వివరాలు
1.	యామునచర్ల కోదండరామయ్య చెంగల్వరాయ శతకం	రామ నీవల్ల చెంగల్వ రాయునిటకు తోడుకొని వేగరాగదే తోయజాక్షి (కొంతమాత్రమే ముద్రితం డి.1552)
2.	పట్టాభి రామయ్య గారి గంగాధరం. కీరవాణి శతకం	కేశవుడు వానిదేగదే కీరవాణి. (ముద్రితం)
3.	పువ్వుల అప్పలస్వామి జార్జిపేట వేణుగోపాలశతకం	సకియ నవరత్నముల కోట జార్జిపేట వేణుగోపాలుదేవె రావే లతాంగి. (ఆర్.597)
4.	సన్నిధిరాజు జగ్గన్న వాకతిప్ప రాజలింగ శతకం	వనిత భవసాగరపు తెప్పకవాక తిప్ప రాజలింగుని దేగదే రాజవదన.
5.	కర్త ఎవరో మాచర్ల రాజలింగ శతకం	వనిత నీ వేగి మాచర్ల వాసుడైన రాజలింగంబు దేగదే రాజవదన.
6.	డబ్బీరు నరసయ్య కలువాయి శతకం	చెలియ నీవేగి కలువాయి చిన్న కృష్ణు దోడుకొని వేగరాగదే తోయజాక్షి. (ముద్రితం - ప్రఖ్యాతం)
7.	పానకాలరాయడు తాడిమళ్ళ రాజగోపాల శతకం	దీనిలో రెండురకాల మకుటాలు ఉన్నాయి. 1. తరుణినివేగి యిచటకు దాడిమళ్ల రాజగోపాలుదేగదే రాజవదన. 2. తరుణి నాయూరిపేర తాడిమళ్ళ రాజగోపాలుదండురే రమణినన్ను.
8.	బాణాల వీరశరభయ్య గోరంట్లమాధవ శతకం	మగువ నీవేగి గోరంట్ల మాధవుణ్ణి తోడుకొనివేగరావమ్మ తోయజాక్షి. (రెండోది అసమగ్రం. డి.1888)
9.	అజ్ఞాత కవి వరాహా నరసింహా శతకం	అతివ నీవేగి నేడు సింహాద్రినున్న వరాహా నరసింహుదేగదే వారిజాక్షి. (95 పద్యాలు ఉన్నాయి. డి. 6695, 1696)

ఈ దూతికా శతకాలలో కలువాయి శతకం చాలా ప్రసిద్ధమైంది. 1842 నాటికే అచ్చుపడింది. దీని ప్రకటన వర్తమాన తరంగిణి పత్రికలో ఉంది. ఈ శతకాన్ని డబ్బీరు నరసయ్య వ్రాశాడు. ఈ కోవ శతకాలలో బహుశా ఇదే మొదటిది కావచ్చు. ఇందులో ఒక క్రమ పరిణామం కనబడుతుంది. చిన్న కథలాగ శతకం సాగుతుంది.

నాయిక జీవితేశుడైన జనార్ధనుడు వేటకు వెళ్ళాడు. మళ్ళా వచ్చేస్తానని చెప్పి రాలేదు. అతనికోసం ఆమె ఎదురుచూసింది. ఎక్కడ తిరుగుతున్నాడో, ఎవర్తెను మరిగాడో అని వాపోయింది. ''చెలియ నీవేగి కలువాయి చిన్నికృష్ణు తోడుకొని రాగదే తోయజాక్షి'' అని దూతికను పంపింది. ఈ మాత్రం ఎడబాటులోనే చిక్కిపోయి ''ముంజేతి కంకణంబును సంది కడెముగా పెట్టవచ్చును చూడు'' అంది. (4). ''మరుని కేళికి రాకున్న మానెగాని మోము జూపించి పొమ్మనే ముద్దుగుమ్మ'' అని కబురుపెట్టింది. (21) ''మగడు చూడని సొగసేల మగువలకును బురుషుడెడబాయ కేలుటే భూషణంబు'' అని తలపోసింది. (36). ప్రియుడు ఇంటికి రాగానే ''కమలాక్షువాతెర కసిదీరనొక్కి నా పగదీర్చుకొందునే పంకజాక్షి'' అని ప్రతిజ్ఞ చేసింది. (85) విరహబాధ భరించలేక ప్రబంధ నాయికలాగ మరుణ్ణి, చంద్రుణ్ణి, పక్షుల్ని తిట్టింది. అయితే తెప్పరిల్లి ఇలాగ తెలివిగా పలికింది.

''బొట్టు కట్టిన ప్రతి పోఁ ద్రోయు చుండఁగా
బక్షులఁ దిట్టిన ఫలమదేమి?
మగడు నామీఁద సమ్మతిలేక యుండఁగా
బవనుని దూషింప భాగ్యమేమి?
సరసుఁడు చలమిట్లు సాధించుచుండఁగా
బుష్పాస్త్రుఁ దెగడినం బుణ్యమేమి?
అతిప్రియతముఁడిట్లు మతినెన్నకుండగా
చంద్రుని నిందింప సౌఖ్యమేమి?
చెలువుఁడీలాగు నన్నిట్లు సేయుచుండ
వారివారిని దిట్టిన వచ్చునేమి?
చెలియ నీవేగి కలువాయి చిన్నికృష్ణు
దోడుకొని వేఁగ రాగదే తోయజాక్షి'' (నెం.78)

వాళ్ళనీ, వాళ్ళనీ తిడితే లాభం లేదని తన ప్రియుణ్ణే తిట్టసాగింది. ''తల్లితండ్రిని బాసితా నొకరింటిలో పెరిగినవానికి ప్రేమ గలదే?'' అని వరుసగా ఎత్తిపొడిచింది. సొంత చెల్లెలికి కుంటెన నడిచాడు, మేనమామను చంపాడు. మేనత్తను మరిగాడు, పొరుగువాళ్లను చెరిచాడు. ''ఇట్టి కఠినాత్ముడింకనన్నే చడటువే! అని నిశ్చయించుకొంది. (83) ''ఇట్టివానికి మావార లిచ్చినపుడె వడ్లతో తట్ట యెండగా వలసె'' అని తన్ను తిట్టుకుంది. (86) ఇలాగా తిట్టి తేరుకొని మళ్ళా తెలివితెచ్చుకొంది. ''ఎందైనవాడు సంతసించిన చాలు'' అనుకొంది. ప్రియుణ్ణి కాపాడమని కనబడ్డ దేవతలకు ఇలా మొక్కుకుంది.

''ప్రాణేశుఁ డెచ్చటి పరభూమి నున్నాఁడొ
యాదిత్య దేవ కాపాడవయ్య
సరసుండు వలచి యే సఖిచెంతనున్నాఁడొ
యుడు రాజ పోషించు చుండుమయ్య
వరుఁడే నెలంత కైవసమున నున్నాఁడొ
సేవింతుఁ బసవ రక్షింపవయ్య
విభుఁడేవెలందిని విడఁజాలకున్నాడొ
దైవతోత్తములార ప్రోవరయ్య
అనుచువేఁడుదు నాతండెందైన లెస్స
నున్నదే చాలునేఁ జూడ కోర్వలేను
చెలియ నీవేఁగి కలువాయి చిన్నికృష్ణు
దోడుకొని వేగ రాఁగదే తోయజాక్షి'' (నెం.99)

ఈ కలువాయి శతకం బాణీలోనే ఇతర దూతికా శతకాలు కూడా ఉన్నాయి. ఇవి అన్నీ అచ్చుపడినట్టు కనిపించదు. కొన్ని అంతా అచ్చుపడలేదేమో. పూర్తిగా అచ్చుపడ్డ వాటిలో ఒక్క కీరవాణి శతకమే లభిస్తోంది. అయితే ఇది అచ్చంగా శృంగార శతకం కాదు; భక్తిశృంగారాల కలగలుపు. కృష్ణలీలలను స్మరించడం ఎక్కువ. కీరవాణి రచించిన గంగాధరానికి భాషా పరిచయం చాలా తక్కువ అని పండితులు భావిస్తారు.[20] బాణాల వీరశరభయ్యకు కూడా నిర్దుష్ట రచన చేతకాదు. అయితే గోరంట్ల మాధవ శతకంలో జాతీయాల పలుకు సొంపులు ఉన్నాయని పరిశోధకులు కితాబు ఇచ్చారు.[21] ఈ దూతికా శతకాలలో కొలికి పూసలాంటి కలువాయి శతకం ''బాలురు బాలికలు చదువ దగినది కాదు'' అని వంగూరి సుబ్బారావుగారు తీర్పు చెప్పారు. నిజానికి ఏ శృంగార శతకం ఈడురానివాళ్ళు చదువకూడదు. చదివినా అర్థం కాదేమో. కుర్రాళ్ళు చదువుకోవలసినవి నీతి శతకాలు. అలాంటివి కూడా ఈ యుగంలో బాగా అచ్చుపడ్డాయి. కొత్తవి విచ్చుకొన్నాయి.

నీతి శతకాలు

ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరేగదా! అని చేమకూర వెంకటరాజుగారు నిజమే చెప్పినా, కుంఫిణీ యుగంలోని ఒక నీతి శతకాన్ని అది ప్రచురణ పొందగానే అందరూ మెచ్చుకొన్నారు. పిల్లలచేత కంఠతా పెట్టించారు. నేటికీ ఆ శతకంలోని పద్యాలను నేర్పిస్తున్నారు. రమారమి ఒకటిన్నర శతాబ్దాలుగా ప్రచారం నోచుకొన్న ఆ పుస్తకం పేరు ''కుమారీశతకం''. దీనిని పక్కి వెంకట నరసయ్య రచించాడు.

కుమారీ శతకం కొన్ని ప్రత్యేక చారిత్రక అవసరాలవల్ల పుట్టింది. కుంఫిణీయుగంలోనే ఆడపిల్లలకు కూడా బడి చదువులు వచ్చాయి. కొన్నిచోట్ల బాలికా

20. కీరవాణి శతకం (వావిళ్ళ ప్రచురణ) – పీఠిక
21. మద్రాసు ఓ.లై. తెలుగు డి. కేటలాగు, సంపుటి 7, పుట 1838

పాఠశాలలు స్థాపించారు. ఈ విద్యార్థినీలకు బోధించవలసిన నీతిశతకాలు[22] కరువయ్యాయి. ఆ కొరతను పక్కి వెంకట నరసయ్య పూరించాడు. ఆయన విశాఖపట్నం క్రైస్తవ పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేశాడు. చాలా గ్రంథాలు రచించాడు. కుమారీ శతకమే కాక నారాయణ శతకాన్ని కూడా చెప్పాడు. అయితే మొదటిదాకి వచ్చిన ప్రచారం మరే గ్రంథానికి రాలేదు. తరతరాలుగా హైందవ సమాజంలో పెద్దలు చెప్తూవచ్చిన నీతులను ఈయన సూటిగా తేటగా చెప్పడమే అందుకు కారణం. పుట్టింటికీ, అత్తవారింటికీ పేరు తెమ్మని ఈ శతకం బోధిస్తుంది.

అమ్మకు రెండబ్బకు రెం
డిమ్మహిదిట్టించు కూతురెందుకు ధరన్
దొమ్మరి పుట్టుక పోయిన
నిమ్మళమని యంద్రు జనులు నిజము కుమారీ'' (19)

పెళ్ళయ్యాక ఎలామెలగాలో కూడా ఈ శతకం చెప్తుంది. ''కార్యేషుదాసీ, కరణేషుమంత్రీ'' అనే శ్లోకాన్ని ఆరుపద్యాలుగా తెనిగించాడు. ఆ శ్లోకమెంత ప్రచారం పొందిందో ఈ శతకం కూడా అంత అల్లుకుపోయింది.

కుమారీ శతకం తరువాత చెప్పుకోతగ్గది అప్పావుమొదలి రచించిన ''మాతృ శతకం'' నిజానికి కుమారీ శతకంలో లేని కవిత్వం ఇందులో ఉంది. మహిళ మనస్సులో మనుగడలో ఉండే మాతృత్వానికి ఈ శతకంలో అప్పావు రూపం కల్పించాడు. పుత్రవాంఛ, నోములు, మొక్కులు, ఎరుకలసాని సోదెలు, నెల నిలవడాలు, వేవిళ్ళు, పురుడు, కారం తినడం, బిడ్డ పెంపకం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, బిడ్డను చదివించడం, పెళ్ళి చేయడం, కోడల్ని గారవించడం మొదలు మనవణ్ణి ఎత్తడం దాకా ప్రతి స్త్రీ జీవితంలోని ఘట్టాలను అప్పావు విపులంగా ప్రస్తుతించాడు. ఈ యుగంలోనేకాక మన సాహిత్యంలో ఉన్న మంచి శతకాల్లో ఇది ఒకటి.

వాస్తవానికి మన సాహిత్యంలో రెండు మాతృశతకాలు ఉన్నాయి. రెండింటిలోనూ ''తల్లిని బోలరెవ్వరున్'' అనేదే మకుటం. కోటగిరి లింగమ్మగారి అబ్బాయి కూడా ఒక మాతృ శతకం చెప్పాడు. తన తండ్రి పేరు గోపరాజు అనీ, సోదరుని పేరు సదాశివయ్య అనీ గురువుగారు మరిగంటి రంగప్పనీ చెప్పుకొన్నాడుగాని తనపేరు చెప్పుకోలేదు. అందుకే ''లింగమ్మగారి అబ్బాయి'' అనే పేరు నేనే పెట్టాను. అప్పావు మొదటి శతకంకన్నా ఇదే ప్రాచీనమని చరిత్రకారులు తలుస్తున్నారు. అయితే లింగమ్మగారి అబ్బాయి చెప్పిన శతకంకన్నా అప్పావు రచనే మృదువుగా ఉందని కూడా పరిశీలించి విమర్శకులు చెప్పారు.[23] కోటగిరి వారి శతకం అచ్చుపడలేదు. (డి.1653). మత్తూరివారిది రెండు మూడు ముద్రణలు పొందింది.

22. వెంకటనరసయ్య రచనలు 1. అమరపదకల్పద్రుమం, 2. కవిదర్పణచ్ఛందం, 3. కుమారీశతకం, 4. నారాయణశతకం, 5. నారాయణస్తవం, 6. మదనసాయకాపరిణయం, 7. శకుంతలా పరిణయం. ఈ చివరి పుస్తకాన్ని క్రీ.శ. 1838లో రచించాడు.

23. శతక కవుల చరిత్ర, పుట 535

అచ్చునోచుకోని నీతి శతకాలు ఈయుగంలో మరికొన్ని ఉన్నాయి. మన ప్రాచీన నీతి శతకాలలో భర్తృహరి సుభాషితాలు ప్రసిద్ధం. కుంఫిణీ యుగానికి ముందే వీటిని చాలామంది అనువదించారు. ఈ యుగంలోనూ ఇద్దరు అనువదించారు. వెల్లాల నరసింగయ్యా అనే ఘటికుడు కందపద్యాలలోనికీ సుభాషితాలను దింపాడు. అందులోనూ మూడుపాదాల ఒక్క గణంలో ఎంతటి భావాన్నయినా చొప్పించాడు.

ప్రతి పద్యంలోనూ ఆఖర్న ''వెల్లూరి వెంకటాచల రమణా'' అనే సంబోధన ఉంది. ''టా''లోని అకారానికే ప్రతిపద్యంలోనూ విధిగా యతి పాటించాడు. ఇతడు అఖండవడిని అంగీకరించడు. ఇన్ని నియమాలతో ఇంత చిన్న ఛందంలో సుభాషితాలను చెప్పడం మెచ్చుకోదగ్గ విద్యే. ''విద్యా నామ నరస్య రూపమధికం'' అనే శ్లోకాన్ని ఎలా అనువదించాడో చూడండి.[24]

గురునృప పూజ్యము దైవము
సరి భోగము కీర్తి సుఖ మొసగు గుప్తధనం
బురు విద్యఁ జదువ కను బశు
వరయగ వెల్లూరి వెంకటాచల రమణా. (నీతి.17)

ఈ అనువాదాన్ని చూస్తే జపానువాళ్ళు ''కురచచెట్ల'' కళ జ్ఞాపకం వస్తుంది. మఱ్ఱిచెట్టును సైతం వాళ్లు కుండీలలో క్లుప్తీకరిస్తూ పెంచుతారు. వెల్లాల నరసింగయ్యా అటువంటివాడు. ఈయన జటప్రోలు ప్రాంతాలవాడు. ఈ శతకత్రయంకాక మరేం వ్రాశాడో తెలియదు.

మన ప్రాచీన సాహిత్యంలో భర్తృహరి సుభాషితాల తరువాత తెలుగులో చెప్పదగ్గది భాస్కర శతకం. దీనిని అనుసరిస్తూ కుంఫిణీయుగంలో కొన్ని శతకాలు వచ్చాయి. ప్రతిపద్యంలోనూ తార్కాణాలు చెప్పడం భాస్కరశతకంలోని ప్రత్యేకత. వరాహగిరి కొండ్రాజు తన జగన్నాయక శతకంలో తార్కాణం చూపించాడు. మదిన సుభద్రయ్యమ్మగారు కూడా తమ కేశవ శతకంలో తార్కాణాలు చెప్పాడు.

కుంఫిణీయుగంలో పుట్టిన కొత్త నీతి శతకాలు చాలావరకు జనంలో పడలేదు. పాతవాటినే అనుసరించడంవల్ల వీటికి ప్రత్యేకత అంటూ లేకపోయింది. అయితే ఎవ్వరూ చెప్పనివి చెప్పాలనుకునేవాళ్ళు కొందరు కొత్తవి ప్రయత్నించారు. వెండిగంటం గురునాథం అనే ఆయన అందరూ అందరి దేవతలపైనా శతకాలు చెప్పారుగాని సరస్వతిపైన చెప్పలేదని ఇలా మొదలెట్టారు.

తెలుగు కవిత్వమల్లగల ధీరులు సర్వసురాంకితంబులై[25]
చెలగగఁగొన్ని సత్కృతులు చేసి రిలన్ భవదీయ నామ సం
కలితము గాక నొక్క శతకమ్ము రచింపరదేమొతత్కృతుల్
తెలియగ నీవె యొాదనియె? ధీమతి సత్యవతీ సరస్వతీ!

---

24. నరసింగయ్యా సుభాషితాలు అచ్చుపడ్డాయి. శతక సముచ్చయం ప్రథమభాగం, ఆంధ్ర సాహిత్య పరిషత్తు, (1931)
25. కొటికలపూడి కోదండరామయ్యా కూడా ఒక భారతీ శతకం ఈ యుగంలో చెప్పాడు. ఆర్.582.

లక్ష్మీ కటాక్షం కోసమే ప్రయత్నించే విద్వాంసులకు సరస్వతిపైన దృష్టిపడదు. ంవుకొన్నవాళ్ళకు డబ్బులేకపోవడం గురించి గురునాథం ఇలా వ్రాశాడు.[26]

''నీచులకెల్ల భాగ్యమును నిర్మలవంశ్యులకెల్ల లేమియున్
వేచదురొప్ప వ్రాయగల వేధకు నీవొక మారుదెల్పరా
దా? చదివించు తల్లివి గదా, వెసదప్పులు వ్రాయువారలన్
దాచక శిక్ష సేయదగదా?...

కుర్రాళ్లు తప్పులు వ్రాస్తే ఏ ఇల్లాలైనా దిద్దగలదుగాని మొగుణ్ణి ఎలా ౩ించగలదు? బ్రహ్మను శిక్షించమనే ఈ గురునాథం క్రీ.శ. 1854లో ఈ శతకాన్ని ిించాడు. (1863లో అచ్చుపడింది). అప్పటికీ ఆయన ముసలివాడు. ఇతని ఇతర నలేమిటో తెలియవు.

వెండిగంటం గురునాథంలాగ కనీసం కొత్తదనానికి ప్రయత్నించక పోవడం వల్ల ఈ గంలో వచ్చిన ఇతర నీతి శతకాలు పాఠకుల దృష్టిలో పడలేదు. నీతి శతకాలేకాదు ంంత శతకాలు కూడా అంతే.

ాంత శతకాలు

ఈ యుగంలో ఏడెనిమిది వేదాంత శతకాలు పుట్టాయి. అన్నీ పాత శతకాలకు ుకరణలే. రామకృష్ణమూర్తి శతకం అచ్చంగా వేమనగారి అడుగుజాడలలో నడిచింది.

దేవుడనగ వేరె దేశాంతరంబున
వెదక బోవగలడె వెర్రిగాని
వెదకువాడు నెవడొ వివరించి చూడరా
రామకృష్ణమూర్తి రమ్యమూర్తి. (20)

ఎంత వెదికినా ఈ శతకంలో 76 పద్యాలే లభ్యమయ్యాయి.[27] ఈ రామకృష్ణమూర్తి ఠో తెలియదు. పరశురామ పంతులవారి కుటుంబంలో వాడని ఊహించుట ుజసమని పరిశోధకులు ఊహాగానం చేశారు.[28] భావి పరిశోధన వల్ల తేలాలి. ఈ ుంలో వచ్చిన వేదాంత శతకాలు చూడండి.

1. గాదె ఆదిశేషయ్య	:	కొచ్చెర్ల ధామ శతకం
2. ఎరగుడి కన్నయ్య	:	కన్న శతకం
3. బళ్ళపల్లి కొండయ్య	:	దత్తయోగీంద్ర శతకం
4. తోట గజపతి	:	1. గజేంద్ర శతకం (డి. 1826)
		2. పరశురామ శతకం (డి. 1608)

సరస్వతీ శతకంలోని పద్యాలను వేదం వెంకటకృష్ణశర్మగారు ఉదాహరించారు. శతక వాఙ్మయ సర్వస్వం. పుట.96 నుండి.
శతకం అచ్చుపడింది. శతక సముచ్చయం. 2వ భాగం. పుట.771. ఆంధ్రసాహిత్య పరిషత్తు, కాకినాడ
శతక కవుల చరిత్ర, అనుబంధం, నిడుదవోలు వెంకటరావుగారు.

5. మల్లన : మల్లన యోగి శతకం
6. నిముషకవి వెంకటేశం : జగన్నాథయోగి శతకం

ఈ శతకాలు కొన్ని స్వయం సంబోధనలు. కొన్ని సమకాలిక యోగుల పేరిట చెప్పినవి. ''జగన్నాథ యోగి శతకం'' గొడే జగన్నాథ రావుగారిపై చెప్పినది. యోగిగా మారకముందు ఆయన సంపన్నుడు. శ్రీమంతులను ఆశ్రయించి వారిపై శతకాలు చెప్పడం మనసాహిత్యంలో పరిపాటే. ఈ యుగంలో ఒక అయిదుగురు అటువంటి కవులు ఉన్నారు.

నరస్తుతులు

పరిమి వెంకటాచలం సంగమేశ్వర శతకంలో చెప్పినట్టు ఈ యుగంలో కవిత్వం చాల చౌక అయిపోయింది. ఏపద్యానికెంత ధరో చూడండి.

కాసుకుగంద పద్య మరకాసుకు వృత్తము గ్రుడ్డి గవ్వకున్
సీసముగానిటుల్ చౌక జెందె గవిత్వము గావునన్ మదో
ల్లాసితులౌధరాధి పతులన్ మదిరోసినినున్ సదానుతుల్
చేసెద వేగ నన్ను దయసేయవె కూడలి సంగమేశ్వరా. (డి.1787)

వెంకటాచలం లాంటివాళ్ళు కూడలి సంగమేశ్వరుని వంటి దేవుళ్ళను కొలుచుకోవచ్చును. గాని ఇతర కవులు కలిగినవాళ్ళను ఆశ్రయించి పద్యాలు చెప్పక తప్పలేదు. ఈయుగంలో నరస్తుతి శతకాలు చెప్పినవాళ్ళను చూడండి:

పచ్చమెట్ట పాపయ్య : కామయ్య శతకం. మగటపల్లి కామయ్యసెట్టిపై చెప్పినది. ''మగట పల్లికామయ చంద్రా'' అని మకుటం. కంద శతకం. కామయ్య సెట్టిగారికి పెద్ద ఓడ వ్యాపారం ఉండేది. విశాఖ జిల్లా కోనాడ రేవువాడు. పచ్చమెట్ట పాపయ్య ఈ నరస్తుతినేకాక సురస్తుతి కూడా చేశాడు. మహిషాసురమర్ధనీ శతకం, హనుమ దండకం కూడా చెప్పాడు. ఇతని వివరాలు ఈ సంపుటంలోనే విజయనగరంలో అనే ప్రకరణంలో ఉన్నాయి.

పంతుల బ్రహ్మన్న : ధనంజయ మహారాజ శతకం. (డి.563 (బి)). ధనంజయ భాత్రాజుగారు పార్వతీపురం జమీందారు. ''హరి తేజా ధనంజయ మహారాజా!'' అనే మకుటం. కందాలు చెప్పాడు. ఈ శతకమే కాక పాటలు పద్యాలు కూడా వ్రాశాడు. (ఆర్.563 (ఎ)). ఇందుమతీ పరిణయమనే ప్రబంధం కూడా చెప్పాడు. (ఆర్.569)

తాడికొండ మల్లన : గుంద్రాజు శతకం. మద్రాజు గుండయ్యగారిమీద చెప్పినది. మద్రాజువారు నరసారావుపేట జమీందారులు. రేపల్లె

జమీలోనిది కొంత కొన్నారు. కవి సందివెలుగు గ్రామంవాడు. మాన్యం ఇమ్మని ఈ శతకం చెప్పాడు. ''వీరాధిపగుండ భూప విభవ దిలీపా'' అని మకుటం. శతకం విన్నాక గుండారావుగారు మాన్యం ఇచ్చారు.

ఒక అజ్ఞాత కవి : జగ్గన్న శతకం (డి.1564) మాకినీడి జగ్గన్నగారిపై చెప్పినది. గీత శతకం. ''మాకినీడి జగ్గన్న రామ ప్రసన్న'' అని మకుటం. ఈ జగ్గన్నగారి అన్న పేరు తిరుపతిదాసు. శతకంలో 97 పద్యాలు ఉన్నాయి. కర్తపేరు తెలియదు.

కొత్తపల్లి లచ్చన్న : పిఠాపురం సంస్థానాన్ని ఆశ్రయించుకొన్నాడు. రావువారి కుటుంబంలో చెల్లయమ్మరావుగారిపై శతకం చెప్పాడు. కందపద్యాలు, ''చెల్లయ్యమ్మ!'' అని మకుటం. శతకం చెప్పించుకొన్న జమీందారీ స్త్రీలలో చెల్లయ్యమ్మగారు బహుశా మొదటిదేమో.

తమ్ము నమ్ముకొన్న కవులకు ఈ శ్రీమంతులు వసతులు కలిగించారు. ఇస్తే పొగడే కవులు ఇవ్వకపోతే తిట్టగలరు. పచ్చమెట్ల పాపయ్య ఇలా చెప్పాడు.

తన్నాశ్రయించు మనుజుని
మన్నించని ప్రభువుకన్న మహిషము మేలౌ
దున్ని ఫలంబిచ్చును ద్రిజ
గన్నుత శ్రీమగటి పల్లి కామయ చంద్రా!

ఇవ్వని ప్రభువు దున్నపోతుకన్నా హీనుడైతే అలాంటివాడిని పెడత్రోవలో పెట్టే ఉద్యోగుల్నీ మన కవులు సాధారణంగా తిడతారు. చచ్చేలా ఊదరకొడతారు. మన శతకశాఖలో పదదూషణ బాగా చిగురించిన ముళ్ళరెమ్మ.

దూషణ శతకాలు

తిట్లశతకాలు మనకు కొత్తకావు. కిందటి యుగంలోనే అవి తెగరేగాయి. కూచిమంచి తిమ్మయ్య చెప్పిన కుక్కుటేశ్వరశతకం, అడిదం సూరన్న అల్లిన రామలింగేశ్వర శతకం వెంటనే చాలా ప్రచారం పొందాయి. చిదంబరం తిరుమల్లయ్య అనే కవి దక్షిణాత్య శతకంలో కలికాలపు విషయాలను తిట్టాడు. (ఆర్. 139)

సంస్కృతంలో నీలకంఠుడు వ్రాసిన ''కవివిడంబనం'' దీనికి ఆధారం. ఆ బాణీలో అంతకన్నా కొద్దిగా ఎక్కువ శ్రుతిలో పోలిపెద్ది వెంకన్న వేణుగోపాల శతకం చెప్పాడు.[29]

29. వేణుగోపాల శతకాన్ని పోలిపెద్ది వెంకన్నగారే వ్రాసినట్టు చిత్తూరు మండలంలో చెప్పుకొంటారు. వేదం వెంకటకృష్ణశర్మగారు శతక వాఙ్మయ సర్వస్వంలో అసంగతి రూఢం చేశారు. రాయభట్టు వీర రాఘవయ్య దీనికర్త అని నిడుదవోలు వెంకటరావుగారు అంటున్నారు. (అకాడమీ వారి శతక సంపుటి, పీఠిక, పుట XVIII)

కార్వేటి నగరం సంస్థానంలో దుష్ట దివానులపై ఆయన కలం దులిపాడు. సిరా చాలామంది మీద ఒలికింది.

''కవి భటుల కార్యాలకు విఘ్నాలు చేసే రాయసాలు, పిండాలు తినే వాయిసాలు'' (86). చెడి బ్రతికిన శుంఠను చేర్చుకొంటే వాడు చెడతాడూ, చేర్చుకొన్నరాజూ చెడతాడు. (34). అందుకోసం పోలిపెద్ది వెంకన్న తొమ్మిదో అట్టం పారాయణ మొదలెట్టాడు. ''చేరువ పగ దొరపు మైత్రి'' కూడదన్నాడు గాని ''బలము గలవాడు దుర్బలు బారదరుమ నెరనొక ప్రాపు గల్పింపదలపకున్నె'' అని నిశ్చయించాడు. ''హుంకరించిన ఎటువంటి మంకునైన తిట్టవలయును కవులకు దిట్టమదియె'' అని సంకల్పించుకొన్నాడు. ఆరు పద్యాలలో దేవుణ్ణి ప్రార్థించి, ఆ తరువాత ఇలా తన విరోధుల్ని ఏడిపించసాగాడు.

వేదాంత యుక్తులు వినిరెండు నేర్చుక
 వాగునాతఁడు రాజయోగిగాఁడు
కల్లులొట్టెడు త్రాగికైపెక్కి తెలియక
 వదరినంతనె శాస్త్రవిదుడుగాడు
పట్టపురాజు చేపట్టి యుంచంగానె
 గుడిసెవాటికి బారిగుణము రాదు
ముండపై వలపున రెండెఱుంగక మోవి
 యానగానే జొల్లు తేనెగాదు
కోతిపైనున్న సింగంపు కొదమకాదు
యెంత చదివిన గుణహీనుడెచ్చుగాడు
మదరిపు విఫాల మునిజన హృదయలోల
వేణుగోపాల భక్త సంత్రాణశీల'' (వేణు. 7)

గుణహీనుల జాతకాలను బయటపెట్టడం మొదలెట్టాడు. దురదృష్టవంతుల ప్రారబ్దాన్ని తిట్టాడు. మరుగు, వెరపు, సిగ్గు, సున్నితం లేకుండా పద్యాలు చెప్పాడు. మళ్ళా అందులోనే నీతిబోధ చేశాడు.

అవనీశ్వరుడు మందుడయిన నర్థుల
 కియ్యవద్దని యొద్ద దివాను చెప్పు
మునిషి యొకడు చెప్పు మొవసినష్కీ చెప్పు
 తరువాత నా మంజుదారు చెప్పు
తల ద్రిప్పుచును శిరస్తా చెప్పు వెంటనే
 కేలు మొగిడ్చివకీలు చెప్పు
దేశ పాండ్యా తాను దివలెనని చెప్పు
 ముసరద్ది చెవిలోన మొనసి చెప్పు

యశముగోరిన దొరకొడుకైనవాఁడు
ఇన్ని చెప్పులు కడద్రోసి యివ్వవలయు
మదరిపు విఫాలముని జన హృదయలోల
వేణుగోపాల భక్త సంత్రాణ శీల'' (వేణు.16)

ఇటువంటి హితోపదేశం విని ఇవ్వకపోతే ''ఉండియియ్యని లోభి రండకొంపను శ్రాద్ధమాయె నేమి శుభంబులా యెనేమి'' అని దీవించాడు. రాజులు ఎలాంటి వాళ్ళకు ఇస్తారో ఇలా చెప్పాడు.

బడవాకుఁ బ్రతియెన్న బహుమతు లేనూరు
 దళవాయి కొకయూర ధర్మ చేట
పడుపు తొత్తుకు మేలు పౌజుల కమ్మలు
 తాటాకు దుద్దులు తల్లి చెవుల
దండె దాసర్లకుఁ దాజీత వాజము
 కవివరులకుఁ గన్న గానిమన్ను
బైనీని సుద్దికి బారి శాలువ జోడు
 విద్వాంసులకు బేడ వెలితిగుడ్డ
ఘనము నీచంబెఱుంగక కలియుగమున
నవని నడుతురు మూఢులైనట్టి దొరలు
మదరిపు విఫాల మునిజనహృదయలోల
వేణుగోపాల భక్త సంత్రాణ శీల (నెం.55)

ఈ పద్యం చాలా ప్రచారం పొందింది. పచ్చయ్యప్పగారి వర్ధంతిలో ఏటా చేసే పండిత సత్కారంలో ఒకసారి లోపాలు జరిగాయని విద్వాంసులు భావించారు. పేరు మోసిన పెద్దవాళ్ళను కాదని చిన్నయసూరికి పెద్దపీట వేసినందుకు ''బయనీని సుద్దికి బారి శాలువ జోడు'' అనే పాదాన్ని ఉదాహరిస్తూ ఎవరో 1847 నాటి ''వర్తమాన తరంగిణి''లో లేఖ వ్రాశారు.[30] అంతకు ముందే శతకం అచ్చుపడింది. అశేష ప్రచారాన్ని పొందింది.

వేణుగోపాల శతకానికెంత పేరువచ్చిందో చంద్రశేఖర శతకానికి కూడా అంత కీర్తి లభించింది. దీనిని రచించినదెవరో తెలియదు. గ్రామీణుల యాసలో వాళ్ళను ఎద్దేవా చేశాడు. ఎవరెవరిని తిట్టదలుచుకొన్నాడో కవి ఇలా శిష్టభాషలో మొదట చెప్పాడు.

''కలుషమనో వికారులకుఁ గష్టులకున్ కుజనాళికిన్ కుత
ర్కులకును ధర్మ శూన్యులకుఁ గూహక మానవకోటికిన్ మ
దాం ధులకును సిగ్గు పుట్టమది దూలఁగ నేరిచియింతి నిన్ను
నిశ్చలమతిఁ జేర్చి యీ శతక శాసన మిమ్ముగఁ జంద్ర శేఖరా. (నెం.2)

ఈ శతకకారుని ఉద్దేశంలో అడిగినప్పుడల్లా దానం చేయని పేదలే ధర్మశూన్యులు. ''బాపన పిశాచాలు'' ఎప్పుడూ ''నెలమూడు తద్దినాలు'' కోరుకొంటారని మూర్ఖులంటారట. ''వాగకు మొన్న కూతురియివాగము కొస్తివి సోలెడిస్తి - మళ్ళావస్తివి బళా బళ సే

30. బ్రౌను దొరగారి లేఖల సంకలనం, సంపుటి 4, (ఎమ్.420) పుట.322.

తడియారలేదు ఇదే మాగడ మంకుభొొట్లు'' అని తోలేస్తారట.[31] ''కూసుతవేమి కుక్క మసుగొొల్పుదునా'' అని బెదరిస్తారట.

నిజానికి ఈ దూషణ శతకాలన్నీ ఆర్థిక కారణాలవల్ల పుట్టినవే. కరువుమీద కరువు వచ్చి కడుపున పుట్టినవాళ్ళనే పోషించుకొొనలేని రైతులు కవులను ఎలా ఆదుకోగలరు. ఎంతని ఇవ్వగలరు. పాత సామాజిక వ్యవస్థ మారి కొత్త జీవిత విధానాలు అలవర్చుకోలేని నిర్భాగ్య కాలంలో ఇటువంటి శతకాలు పుట్టాయి. గ్రామీణులపై ఒకసారి వచ్చిన కోపం వాళ్ళు మంచిపని చేయమని అడిగినా చంద్రశేఖర శతకకారునికి పోలేదు చూడండి.

''పండిన చేనునాది పడమోసుకు పోనెలనాడు నీవు పు
గ్రాండము శెప్పినావుగద రమ్మెముగా బగుమాన మిస్తమా
ముండ యినాలటుంట పడిమొత్తుక సచ్చెను నీవు మల్లిరా
మాండము శప్పలంచు నను మందుడు మూర్ఖుడు చంద్రశేఖరా'' (నెం.42)

మళ్ళా పురాణం చెప్పించుకొొనడం కూడా శతకకారుని దృష్టిలో తప్పు పనే. చదువురాని పేదరైతు కాబట్టి పరోక్షంలో కవి ఇలా తిట్టాడు. ఇదే ఏ గ్రామాధికారో అయితే ఇంద్రుడవనీ చంద్రుడవనీ పొగిడేస్తాడు. వంకాయల పాటి వెంకన్న తన మదన గోపాల శతకంలో ఏమన్నాడో చూడండి.

కుక్షింభరుని బుధరక్షాపరుండంచు
    నతి నికృష్టుని మహోత్యాగి యనుచు
బహు బీజ సంభవుఁ బరమ పావనుఁడంచు
    జంచలాత్ముని ధైర్యశాలి యంచు
దౌర్జన్య కారిని ధార్మికోత్తముడంచు
    గఠిన చిత్తుని దయాకరుఁడటంచు
జారకర్ముని పరదార వర్జితుఁడంచు
    నుత్తమూఢుని శాస్త్రవేత్తయంచు
గవులు కక్కూర్తి చేతను గడుపు కొఱకు
సన్నుతింతురు మదిలో విచార పడక
భూరిమయవాస! కోలంక పురనివాస!
మదనగోపాలరాధికా హృదయలోల! (శతక కవుల చరిత్రము, పుట. 522)

ఆనాటి కవుల కడుపు కక్కుర్తిని ఇలా గర్హించే ఈ మదనగోపాల శతకం కూడా పోలిపెద్ది వారి నిందా శతకం లాంటిదే. ఇందులో కూడా మోటు మాటలు ఉన్నాయి. సకల దుర్మార్గ వర్తనలూ ''వివిధ పండిత వర్గ విద్వేషాలు'' గల ''మోట కొయ్యల కొకళ్ళు తీర్పులు చెప్పగలరె'' అని వెంకన్న నిట్టూర్చాడు. అయితే తీర్పు చెప్పడానికి ఒక కొత్త ప్రభుత్వం ముందుకు వచ్చింది గాని తెల్లవాళ్ళు ఏలుబడిని ఇంకా ప్రజలు అంగీకరించని రోజుల్లో రాచూరి రామదాసు శ్యామలాంబా దండకంలో ఇలా చెప్పాడు.

31. చంద్రశేఖర శతకం చెప్పిన కవి పేరు అంకుభొట్లు అని 31వ పద్యంలో ఉంది. కనుక అంకన్న అనుకోవచ్చు. కాని ఈశ్వరబొట్లు ని 15వ పద్యంలో ఒకపేరు ఉంది.

ఈ కుంపినీ వార నీ రాజ్యమందున
తగువులు తీర్పించి ధర్మముగాను
సననదులు వ్రాసిచ్చి సత్యంబుగా దొరతా
నడుచు కొమ్మన్నను నరులు యిపుడు
మరుమాటలాడుచు మహిలోన నుండిరి
నీవాజ్ఞ చేయవేనిపుడు వారి
గుంపిణీ వారికి గువలయ చక్రంబు
నేలించవే యిపుడు వేడ్క తోడ
వ్రాసి యిచ్చిన సనదులు వరుసతోడ
నాజ్ఞ చెల్లించుమమ్మ నీవు
పుడమిలో రాజమహేంద్ర పురనివాసి
శాశ్వతంబైన వరమిమ్ము శ్యామలాంబ. (డి.1671)

ఇది పూర్తిగా స్వంత గొడవ. రచన నీరసం. శతకం అసమగ్రం. ఆనాటి స్థానిక చరిత్రను కొంత చెప్తుంది. ఈస్టిండియా కంపెనీవారి పరిపాలన కాళ్ళు నిలదొక్కుకొనని కాలంలో వ్యక్తిగత విషయాలతోపాటు సమకాలిక సమాజాన్ని చిత్రించే దూషణశతకాలలో చేట్రాతి లక్ష్మీనరసింహం[32] చెప్పిన కోదండరామ శతకం గొప్పది. తిడితేనే చెడ్డవాడు బాగుపడతాడని ఇలా చెప్పాడు.

మెఱుఁగు వేయక కాని మృదువుగా దన్నము
రుచియు లేక యుండు పొగచని కూర
సానఁబట్టక మణి ఛాయ మిక్కిలి కాదు
రతిలేక యింతి సంతతిఁబడయదు
గొట్టువెట్టక చెట్టు కుసుమంబు లియ్యదు
నూరకయున్న మందు సపిపడదు
ముక్కు నుల్చక దీపమెక్కువ వెలుగీదు
తరచక వెన్నీదు పెరుగుబొట్టు
వేడి జూపక నెయిగాదు వెన్నముద్ద
ఖలుడు గుణవంతుఁడౌను చకార గుళ్ళ
కలికమునఁ గాని తీరదు కంటి తీట
భండనారాతి భీమ కోదండరామ!' (శతకకవుల చరిత్ర. పుట. 414. (డి.1537)

తిట్టకపోతే ఖలుడేకాదు, దేవుడు కూడా బాగుపడని మన కవుల నమ్మకం. అందుకే కాసుల పురుషోత్తంగారు పనికట్టుకొని ఆంధ్ర మహావిష్ణువును తిట్టారు. దేవరకోట సీమలోని శ్రీకాకుళంలో ఆంధ్రనాయకుని దేవాలయం ఉండేది. అది పురుషోత్తంగారి కాలానికి పూజాపునస్కారాలు లేక బూజు పట్టింది. పురుషోత్తంగారు అది చూశారు. కడుపు తరుక్కొనిపోయింది. నిత్యోపచారాలు లేనందువల్లనే ''భక్తిచేసిన శిలాప్రతిమ

32. ఇతని గురించిన వివరాలు ఇదే సంపుటంలో విజయనగరం అనే ప్రకరణంలో ఉన్నాయి.

మాత్రమేగాని హరియించుగలుగురా'' అని అందరూ నిరసిస్తున్నారట. అందుచేత ''వివిధ పూజోత్సవములు నిర్విఘ్నములుగ జేసికొనకున్న నీకు బ్రసిద్ధి గలదే'' అని దేవుణ్ణి హెచ్చరించారు. లేకపోతే ''నీ సంప్రదాయంబు గుట్టుబెట్టే రట్టు చేయుదు గనుము నా బట్టుతనము'' అని సవాలు చేశారు. ''కీర్తి నిందగ వర్ణించి గేలిపరుతు'' అని కంకణం కట్టుకొని కలం పట్టారు. వరసబెట్టి నిందాస్తుతులు గుప్పించారు.

ఆలు నిర్వాహకురాలు భూదేవి యై
    యఖిల భారకుండను నాఖ్యఁ దెచ్చె
నిష్ట సంపన్నురా లిందిర భార్య యై
    కామితార్థదుఁడన్న ఘనతఁ దెచ్చెం
గమల గర్భుఁడు సృష్టికర్త తనూజుఁడై
    బహు కుటుంబకుండన్న బలిమి దెచ్చె
గలుష విధ్వంసిని గంగ కుమారి యై
    బతిత పావనుఁడనన్న ప్రతిభఁ దెచ్చె
నాండ్రు బిడ్డలు దెచ్చు ప్రఖ్యాతిగాని
మొదటి నుండియు నీవు దామోదరుఁడవె
చిత్ర చిత్ర ప్రభావ దాక్షిణ్యభావ
హత విమత జీవ శ్రీకాకుళాంధ్ర దేవ!' (ఆంధ్రనాయక శతకం-28)

ఈ ఒక్క పద్యంలోనే కాదు ఈ ఆంధ్రనాయక శతకం నిండా ఇటువంటి రసవత్తరమైన కవిత్వం వెల్లివిరుస్తోంది. వ్యంగ్య వైభవం వెయ్యిదీపాల కాంతితో వెలుగుతుంది. సున్నితమైన తిట్లు, సుతారమైన ఎత్తిపొడుపులు, కమ్మనిహాస్యం, కడుపు నింపి కవిత్వం ఈ శతకంలో దొరుకుతాయి. కాసుల పురుషోత్తంగారు ఇదొక్కటేకాక మరిమూడు శతకాలు ముందే వ్రాశాడు. ''మనసా హరి పాదము లాశ్రయింపుమా'' అనే మకుటంతో ఒక శతకం వ్రాశారట. అయితే తాడేపల్లి పానకాల రాయని పేరుమీద ఆ మకుటంతో ప్రచారమైన శతకమే కాని కాసులవారిది నేడు కనబడడంలేదు. ''రామా! భక్త కల్పద్రుమా'' అనే పంచచామరాల శతకాన్ని కూడా చెప్పారు. తరువాత హంసల దీవి శతకాన్ని రచించారు. ఇది తరువాత వ్రాయబోయే ఆంధ్రనాయక శతకానికి ప్రాక్టీసుగా చెప్పినదేమో అని తోస్తుది. చూడండి.

''భువనత్రయైక సంపూర్ణుఁడవగు నీకు
    నందకుటీరమా! మందిరంబు?
పాలమున్నీటిలో నోలలాడెడు నీకు
    మహి యశోదాస్తన్యమా? బలంబు?
పదపద్మమునగంగ యుదయమందిన నీకు
    జలకమా? గోపికాంజలి జలంబు
అహిరాజు భోగ పర్యంకంబుగల నీకు
    తల్పమా? రాధికా తరుణియంక?

మహహా! వారల భాగ్యమెంతనఁ గవచ్చు
భావజ విలాస! హంసలదీవి వాస!
లలిత కృష్ణాబ్ధి సంగమ స్థల విహార
పరమ కరుణా స్వభావ! గోపాలదేవ! (శ.క.చ.పీఠిక.61)

హంసల దీవి శతకంలో కవిత్వం మొగ్గ తొడిగిందేగాని ఆంధ్రనాయక శతకంలో లాగ వికసించి పరిమళించలేదు. నిజానికి ఈ యుగంలో పుట్టిన ఏ శతకంలోనూ ఆంధ్రనాయక శతకం ఇచ్చే ''రసతృప్తి'' కనబడదు.[33] కాసుల పురుషోత్తంగారు సిద్ధహస్తులు. వారిది అమృతహస్తం. ఈయుగంలోని శతకాలలో ఆంధ్రనాయక శతక, నాయకమణి.

ఈ యుగంలో శతక కవుల వివరాలు

1. రెండూరి అనంతదాసు	మత్స్యపురాధినాయక శతకం. ఉత్పల చంపక మాలలు. ఆర్.632. సమగ్రం 100 పద్యాలు. మాడుగుల వాడు. విష్ణుస్తుతి.
2. జూలూరి అప్పయ్య	యదువంశభూషణ శతకం. స్తుతి. ఈయన శ్రీనివాస తారావళి, రామపంచాశత్తుకూడా వ్రాశాడు. బ్రౌను దొరగారి పండితుడు. ఈయన గురించి విపులంగానే చెప్పుకొన్నాం.
3. వద్దిపర్తి అప్పయ్య	రామశతకం, మహాప్రభూ శతకం వ్రాశాడు. ఉత్పల చంపకాలు. శతకం మధ్య మకుటం మారుతూ ఉంటుంది. సురస్తుతి.
4. గొడవర్తి అప్పలాచార్యులు	చాంపేయ శతకం. సీసపద్యాలు. ఆర్.439. ''వరగుణా ధార చాంపేయ వనవిహార బాలగోపాల రాధికా కేళిలోల'' మకుటం. అముద్రితం.
5. మత్తూరి అప్పావు మొదలి	మాతృ శతకం. ప్రసిద్ధం. దీని గురించి ప్రకరణంలో చర్చించాం.
6. మోదుకుర్రు అమరయ్య	ఈయనను ''ముక్తి నూతలపాటి అమరయ్య'' అని కూడా అంటారు. అద్దంకి సీమవాడు. సంఖ్యా నియమ రచనలలో నాలుగు చేశాడు. 1) వేణుగోపాల పంచ రత్నాలు, 2) కోదండరామ భాస్కరమాల, 3) కేశవ తారావళి 4) గోపబాలశతకం. అన్నీ ముద్రితాలు. ఆర్.692. 'ఎ' నుండి 'డి' దాకా.
7. గాదె ఆదిశేషయ్య	కొచ్చెర్ల ధామశతకం. వేదాంతం. రేపల్లె దగ్గర నందివెలుగు గ్రామంవాడు.

33. పుల్లన కవి వ్రాసిన గోపికా శతకంలో కొంత హాస్యోక్తి ఉంది. (డి.1544)

8. కిందుక అల్లాను	''శ్వేత కుభృన్నకేసరీ'' అనే శతకం చెప్పాడు. స్తుతి. డి.1786 ఈ శతకంపై జూలూరి అప్పయ్యా తీర్పు చెప్పారు.
9. బుద్ధిరాజు కనకరాజు	శివ శతకం. కందపద్యాలు.
10. ఎరగుడి కన్నయ్యా	కన్న శతకం. కందపద్యాలు. వేద శతకం. యోగవిషయ వివరణ ఉంది.
11. వెదురువాడ కణ్వాలింగం	కణ్వాలింగ శతకం. డి.1484. అసమగ్రం. నాలుగు పద్యాలే ఉన్నాయి. శివస్తుతి.
12. నిష్టల కామయ్యా	రామ శతకం. ఆర్.597 (సి) కందపద్యాలు. సమగ్రం. 105 పద్యాలు ఉన్నాయి. నిర్దుష్టం కాదు.
13. మండపాక కామయ్యా	ఈయన కొన్ని ప్రబంధాలతోపాటు శతకాలుకూడా రచించాడు. కళింగసీమ, చెప్పిన శతకాలు 1. జానకీ రామ శతకం,2. రామచంద్రప్రభూ శతకం, 3. సూర్య నారాయణ శతకం. ఈయన కాలం 1810-1872.
14. విశ్వనాథ కామయ్యా	ఉమామహేశ్వర శతకం. శృంగారం ఉత్పల చంపకాలు. అమరావతిలో శివునిపై చెప్పినది. వాసిరెడ్డి ప్రతిష్ఠ. ఈ శతకం సమగ్రమే కాని అముద్రితం. డి.1479, 1480.
15. కట్టమూరి కామేశ్వరం	రామప్రభు శతకం వ్రాశాడు. ధూర్జటి కాళహస్తీశ్వర శతకంలోని పద్యాలను విష్ణుపరంగా మార్చేశాడు. అవే భావాలు, అవే ఎత్తుగడలు, పదాలు వాక్యాలు ఇందులో ఉన్నాయని పరిశోధకుల తీర్పు. (వంగూరి వారి శతకకవుల చరిత్ర, పుట 669) ఈ శతకం ప్రయాగకామేశ్వరం పేరిట వావిళ్లవారు వేశారు. ఈ పొరపాటును నిడుదవోలు చూపించారు. (శతకకవుల చరిత్ర అనుబంధం. పుట.799)
16. ప్రయాగ కామేశ్వరం	భద్రాచలధామశతకం. కందపద్యాలు. 102 ఉన్నాయి. అముద్రితం. ఆర్.397. ఇతడు గోపాలలీలా సుధా లహరి అనే శృంగారగ్రంథం కూడా వ్రాశాడు.
17. అక్కిరాజు కృష్ణదాసు	భద్రగిరీశ రాఘువశతకం. (డి.1626) ఉత్పల చంపకాలు. స్తుతి.
18. తిరుక్కుడయూరి కృష్ణదాసు	కృష్ణ శతకం రచించాడు. కందపద్యాలు. రామదాసు చరిత్ర అనే హరికథ కూడా ఇతడే వ్రాసి ఉండవచ్చు. అందులో చాలా శతకాలనుండి ఉదాహరణలు ఇచ్చాడు. (వంగూరివారి శతక కవుల చరిత్ర) పుట.484)
19. మేడూరి కృష్ణదాసు	రాఘువశతకం ఆర్.408. ఉత్పల చంపకాలు 116 పద్యాలు. రామ స్తుతి.

20. లోకారెడ్డి కృష్ణమాచార్యులు — యోగతారావళి వ్రాశాడు. డి. 2171. శంకరాచార్యుల వారి రచనకు తెనిగింపు.

21. శిష్టు కృష్ణమూర్తి — సుప్రసిద్ధుడు. ఈయన గురించి చెప్పుకొన్నాం. ''వాయుపుత్ర శతకం'' ఇతని శతక రచన.

22. మంచెళ్ల కృష్ణయ్యా — నాలుగు భక్తిశతకాలు వ్రాశాడు. 1. పూరుషముఖ్యా శతకం, 2. రంగశతకం, 3. రఘుపుంగవ శతకం, 4. వెంకటనాగాధిప శతకం. కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తు వారి శతక సముచ్చయం ప్రథమభాగంలో మొదటిదీ, ఆఖరుదీ అచ్చుపడ్డాయి. ఈయన కొమ్మాల పాటి ఓబన్న అనే పెద్దమనిషికి వసుచరిత్ర సవ్యాఖ్యా నంగా ఇస్తానని చెప్పి మూలమే పంపించాడట. కోపంవచ్చి ''పెళ్ళిచేసి గర్భాదానం చేయకపోతే ఎలాగ'' అని ఓబన్న ఒకపద్యం వ్రాసి పంపాడు. (చూ. దీపాలవారి చాటుపద్య రత్నాకరం పుట. 105)

23. తటవర్తి కొండయ్యా — రెండు శతకాలు చెప్పాడు. 1. మల్లేశ్వర శతకం. మస్కరపల్లి మల్లేశునిపై చెప్పిన సీసశతకం. సమగ్రం. ఆర్.232, 2. రామశతకం. కందపద్యాలు రామాయణ శతకం. సంక్షేపంగా చెప్పాడు. ఆర్.228 (ఎ)

24. బళ్లపల్లి కొండయ్యా — వేదాంత శతకం చెప్పాడు. ''దత్తయోగీంద్ర వర్య'' అని మకుటం. ఇది సీస శతకం. ఆర్.633

25. వరాహగిరి కొండరాజు — జగన్నాయక శతకం. శార్దూల మత్తేభాలు. భాస్కర శతకచ్ఛాయలు ఉన్నాయి.

26. కొండవీటి కోటయ్యా — శివశతకం చెప్పాడు. కంద పద్యాలు. ఇది నీతిశాస్త్రం.

27. గానుగపాటి కోటయ్యా — కంచివరదరాజ శతకం రచించాడు. సీసపద్యాలు. విష్ణుస్తుతి. ఆర్.1027. డి. 1483

28. కోటీశ్వర దీక్షితులు — విట్ఠలేశ్వర శతకం. ఉత్పల చంపకాలు. భక్తి. ఆత్మఘోష.

29. కొటికలపూడి కోదండరామయ్యా — బహుగ్రంథకర్త. బొబ్బిలి ఆస్థానకవి. తొమ్మిది శతక రచనలు లభించాయి. 1. జానకీరామ శతకం ఆర్.532; 2. దేవచూడామణీ శతకం. ఆర్.606; 3. భారతీశతకం ఆర్.582; 4. మాధవ శతకం ఆర్.572 (బి); 5. మారుతీ శతకం ఆర్.580 (సి) అచ్చుపడింది. 6. రాజవతంస శతకం ఆర్.580 (బి); 7. రామప్రభుశతకం ఆర్.579, 8. వేణుగోపాల శతకం ఆర్.647, 9. శ్రీ సతీశ శతకం ఆర్.572 (ఆ). ఈ శతకాలుకాక ఇతడు చెప్పిన కావ్యాల గురించి ముందే బొబ్బిలివారి గురించి చర్చించినపుడు తెలుసుకొన్నాం.

30. యామునచర్ల కోదండరామయ్య	చెంగల్వరాయ శతకం. శృంగా. దూతికను పంపించేబాణీ. తిరుత్తని చెప్పినది. డి. 1552
31. వద్దిపర్తి కోనమరాజు	కళింగసీమవాడు. జానకీరామ శతకం (ప్రబంధాలేకాక జమాబందీ సీసమాలిక వ్రాశాడు. ఇతని గురించిన వివరాలు ఈ స లోనే విజయనగరం అనే ప్రకరణంలో ఉన్నాయి.
32. తోట గణపతి	రెండు శతకాలు వ్రాశాడు. కొండవీటి దగ్గరన్న పురుషోత్తమ పట్నంవాడు. రెండూ వేదాంతశతకాలు. 1. గజేంద్రశతకం డి.1820; 2. పరమ రామ శతకం డి.1608; రెండోది గురువుగారిపై చెప్పాడు. మొదటిది వేమనపద్యాల అనుకరణ. ఇతని పేరు తోట రాజేంద్రుడు అని వంగూరివారు అన్నారు. (శతకకవుల చరిత్ర. పుట 670). వ్రాతప్రతులలో గజేంద్రుడు అని ఉంది.
33. గంగాధరం	చెన్నమల్లేశ్వర శతకం. సీసపద్యాలు. వీర శైవం. ఇతడు చాలా ప్రాచీనుడని నిడదవోలు వెంకటరావుగారి అభిప్రాయం. ఎప్పటివాడో, ఏవూరివాడో ఇంకా పరిశోధించాలి.
34. మండపేట గంగాధరం	కీరవాణి శతకం వ్రాశాడు. శతకం ప్రసిద్ధమైంది. రచన నిర్దుష్టం కాదు. కవే ఇలా చెప్పుకొన్నాడు. ''తిక్కిరి బిక్కిరి కవనము నిక్కముగా శబ్దతతుల నిజమెరుగనుబల్ మక్కువ హరిపై జిక్కిన నిక్కొలది. రచించినాడనిది నిజమనగా, (ఆర్.856 (ఎ)) ఈ గంగాధరుడే శ్రీ రమణీ మనోహర శతకం కూడా చెప్పాడని నిడుదవోలు వారి అభిప్రాయం.
..రుగులాల్	రసజ్ఞ నృసింహ పంచవింశతి చెప్పాడు. బెజవాడ ప్రాంతంవాడు. ఆర్.88
..టం గురునాథం	క్రీ.శ.1854లో సరస్వతీ శతకం చెప్పాడు. ఉత్పలచంపక మాలలు. నీతి, భర్తృహరి సుభాషితాలు తెనిగించాడు.
..రి	భర్తృహరి సుభాషితాలు తెనిగించాడు. అలభ్యం. ఈయన కొన్ని నాటకాలు కూడా వ్రాశాడు. (చూ. ఆంధ్ర కవుల చరిత్ర 3వ భాగం పుట.347) ఇతని శేష ధర్మాలు మాత్రమే దొరికాయి.
	శనైశ్చరశతకం వ్రాశాడు. అప్రౌఢం. తప్పుల తడక.

ఉత్పల చంపకాలు. ''శనినాయక దివ్య ఫల ప్రదాయికా'' అని మకుటం.

39\. పువ్వు చిన అప్పలస్వామి — జార్జిపేట వేణుగోపాల శతకం. సీస పద్యాలు. శృంగారం. రచన చాలా నీరసం. జార్జిపేట అంటే చెన్నపట్నమా? ఇది అముద్రిత శతకం. ఆర్.597.

40\. పూండ్ల చెంగయ్య — కోదండరామ శతకం వ్రాశాడు. సీసపద్యాలు. ఈ రాముడి ఎడ్రసు శయనపురి.

41\. సన్నిధిరాజు జగన్నాథం — వాక తిప్పరాజలింగశతకం వ్రాశాడు. శృంగార సీసాలు. ఈయన పిఠాపురం దగ్గర ఉన్న ఉప్పాడ వాడు, జ్ఞాన కురవంజి రచించాడు. (ఆర్.926; డి. 1883; డి. 1884) ఇతని పేరనే మరొక కురవంజికూడా ఉంది. డి.1852

42\. క్రోలేటి జోగయ్య — త్రిస్తబక రామశతకం చెప్పాడు. ఆర్.537 (ఎ). ఇందులో 110 కంద పద్యాలు ఉన్నాయి. స్తుతి.

43\. చిదంబరం తిరుమలయ్య — కవి విడంబనం అనే పేరిట దాక్షిణాస్య శతకం చెప్పాడు. ఆర్.139. ఇందులో 108 గీతపద్యాలు ఉన్నాయి. అవినీతి గర్హణ. ఆధునికులలో మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు మళ్ళా నీలకంఠుని కవివిడంబనం తెనిగించాడు. (ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక 1918 (?)

44\. శాంతలూరి తిరుమలయ్య — రామానుజశతకం సమగ్రం. 108 శార్దూలాలు. స్తుతి అముద్రితం. ఆర్.501

45\. బోడి తిరుమలరాయడు — రాఘవ శతకం వ్రాసినట్టు చెప్పుకొన్నాడు. అనంత వ్రతోపాఖ్యానం రచించాడు. డి. 328. చేసేది వ్రతమైనా వ్రాసింది శృంగార ప్రబంధం.

48\. దక్షిణామూర్తి — సదాశివశతకం చెప్పాడు. 108 ఉత్పలమాలలు. కూచిమంచి తిమ్మనగారి ''చిరవిభవ'' శతకానికి దగ్గరలోని మకుటం. ''దేవా! విభవా! భవా! వృషభావ శివానుభవా! సదాశివా'' అని కీర్తించాడు. (డి.1799)

47\. వెత్సా ధర్మపురి — వెంకటరమణ శతకం చెప్పాడు. (డి. 1708) కంద పద్యాలు. స్తుతి.

48\. డబ్బీరు నరసయ్య — కలువాయి శతకం. సుప్రసిద్ధం. ఈ ప్రకరణంలో ఇతని గురించి చెప్పుకొన్నాం.

49\. వంగూరి నరసయ్య — ప్రసన్న రాఘవ శతకం. ఉత్పలమాలలో రామాయణ కథాకథనం చేశాడు. ఇది శతకద్వయం. అచ్చుపడింది. వెస్టువార్డువాళ్లూ, కొండా శంకరయ్యగారుకూడా ప్రచురించారు. చాలా ప్రచారం పొందిందిగాని అంత ప్రౌఢమైన రచన కాదు.

50. కర్లపాలెం నరసింహం — నరసింహాశతకం చెప్పారు. శార్దూలమత్తేభాలు సమగ్రం. 106 పద్యాలు ఉన్నాయి. కవి అల్లూరు గ్రామంవాడు. ఆ ఊరిదేవునిపైనే చెప్పాడు. (డి.1600)

51. గంగమ్మగారి నరసింహం — సుప్రసిద్ధమైన కృష్ణ శతకం ఇతడే చెప్పాడు. కందపద్యాలు. చాలాసార్లు అచ్చుపడింది. ఇప్పటికీ ప్రాథమిక వాచకాలలో ఇతని ''నీవె తల్లివి తండ్రివి నీవె నా తోడు నీడ'' వంటి పద్యాలు ఉంటున్నాయి. వ్యావహారిక రూపాలు శతకం నిండా ఉన్నాయి. భక్తి ప్రతిపాదకం. ఇతరి వివరాలు తెలియవు.

52. వెల్లాల నరసింహం — భర్తృహరి సుభాషితాలను కందపద్యాలలోనికి తెనిగించాడు. ''వెంకటాచల రమణా?' అనే మకుటం ఉంది. అచ్చుపడింది. కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు ప్రచురించారు. ఇతడు జటప్రోలు నివాసి.

53. కానుకొలను నాయనప్ప — చింతగుంట పాలెపు పట్టాభిరామశతకం చెప్పాడు. ఇది అచ్చతెనుగు కందశతకం. దీనిని కవి తన పన్నెండో ఏట చెప్పాడట! ఇదిగాక ఏం వ్రాశాడో తెలియదు.

54. వక్కలంక పంతయ్యా — దశరథరామచంద్ర శతకం. ''రమ్య గుణసాంద్ర దశరథ రామచంద్ర'' అని మకుటం. 128 సీసపద్యాలు ఉన్నాయి. స్తుతితోపాటు లోకనీతి కూడా ఉంది. ఆర్.105 (బి))

55. దెందులూరి పద్మనాభం — అల్లమ ప్రభు శతకం. ఉత్పల చంపకాలు. 99 పద్యాలు. వీరశైవం. డి. 1474

56. తాడేపల్లి పానకాలరాయడు — చాలా శతకాలు వ్రాశాడు. నేత్ర దర్పణం, వైద్య శాస్త్రార్థ సంగ్రహం అనే శాస్త్రీయ గ్రంథాలు కూడా వ్రాశాడు. (ఆర్.553) ఏడు శతకాలపేర్లు తెలుస్తు న్నాయి. 1. చిత్తబోధశతకం 2. తాడమళ్ల రాజగోపాల శతకం (?) 3. దేవకీనందన శతకం 4. నృసింహస్వామి శతకం. 5. పార్థసారధి శతకం, 6. మానసబోధ శతకం, 7. రామ శతకం, 8. రుక్మిణీపతి శతకం. ''మనసా హరిపాదములాశ్రయింపుమా!'' అనే మకుటం కాసుల పురుషోత్తంగారి శతకంలోకూడా ఉంది.

57. పచ్చమెట్ల పాపయ్యా — మగటపల్లి కామయ్యసెట్టిమీద ఒక కంద శతకం చెప్పాడు. ''మహిషాసురమర్దనీ శివా'' అనే మకుటంతో ఉత్పలమాల శతకాన్ని వ్రాశాడు. ఒకటే పద్యం దక్కింది. హనుమద్దండకం కూడా రచించాడు. ఇతని గురించి వివరాలు ఈ సంపుటంలోనే విజయనగరం అనే ప్రకరణంలో ఉన్నాయి.

58. కాసుల పురుషోత్తం	సుప్రసిద్ధుడు. చాలా శతకాలు వ్రాశాడు. ఈ ప్రకరణంలో ఇతని గురించి చెప్పుకొన్నాం.
59. పుల్ల కవి	గోపికావల్లభ శతకం చెప్పాడు. డి. 1544. సీసపద్యాలు. హాస్య శతకం. వేణుగోపాల శతకం కోవలోనిది. చాటుపద్య మణిమంజరిలో వేటూరివారూ, చాటు పద్య రత్నాకరంలో దీపాలవారూ ఇతని పద్యాలు ఉదాహరించారు. శతకం అసమగ్రం. 8 పద్యాలే ఉన్నాయి.
60. పురుషోత్తమ చౌదరి	చాలా క్రైస్తవ కావ్యాలు వ్రాశారు. కీర్తనలు కట్టారు. క్రైస్తవ శతకం వ్రాశారు. వీరి గురించి క్రైస్తవ కావ్యాలు అనే ప్రకరణం చూడండి.
61. రావు పురుషోత్తం	లీలాశుకుని కృష్ణ కర్ణామృతాన్ని కందపద్యాలలోనికి అనువదించాడు. ఇది త్రిశతి. మకుటనియమం లేదు. క్రీ.శ. 1834లోనే దీని ప్రతికలు విలేఖరులు వ్రాసుకొన్నారు. (ఆర్.576)
62. వాసురావుగారి పెరుమాళ్లరావు	భవహర నామ శతకం చెప్పాడు. సీసపద్యాలు. (ఆర్.275). ''వదనజితసోమ భవహర మధుర నామ చండ దానవ భీరు కోదండరామ'' అని మకుటం. లేఖకులు దీనిని కోదండరామ శతకం అని పేర్కొనక భవహరనామ శతకం అని వ్రాసుకొనడం గమనించాలి. కవి వీనిని తన ఇర్వైమూడోయేట చెప్పాడు. స్తుతి. సాధారణం.
63. మండపాక పేరయ్య	నిరోష్ఠ్యంగా దాశరథీశతకం చెప్పాడు. కుముద్వతీ పరిణయం, ఇందుమతీ పరిణయం అనే కావ్యాలు కూడా వ్రాశాడు. రచనలన్నీ నష్టమయ్యాయి. ఈయన మండపాక కామయ్యగారి తండ్రి. పార్వతీశ్వరశాస్త్రిగారి తాత. వంశంలో అందరూ కవులే.
64. పోలవరపురాయడు	క్రైస్తవ కవి. అంధుడు. జేసు శతకం. జేసు వింశతి వ్రాశాడు. ఇతని గురించి ''క్రైస్తవ కావ్యాలు'' అనే ప్రకరణం చూడండి.
65. గురవయ్యాగారి బసవన్న	అంబాశతకం వ్రాశాడు. ఇది కంచి కామాక్షిపై చెప్పినది. (డి.1489). రచన దోష భూయిష్ఠం. స్తుతి.
66. బండి బాపనమ్మ	ఈమె మధుర మీనాక్షి మీద శతకం చెప్పింది. కవనం సొగసుగా ఉందని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈమె వివరాలు తెలియవు. మీనాక్షీ శతకంలో కందపద్యాలు ఉన్నాయి. శబ్దాలంకారాలు తగు మాత్రం.

67. మేకా బాపన్న	ఆచంట రామేశ్వర శతకం. సీస పద్యాలు. 1850లో వ్రాశాడు. ఇతడు మదనగోపాలశతకం కూడా వ్రాశాడు.
68. బాలయ్యగారి బాలకృష్ణయ్య	వరదరాజశతకం వ్రాశాడు. ఇది త్రిశతి. భర్తృహరి సుభాషితాలలాగ మూడు శతకాలు చెప్పి ఆ పద్ధతిలోనే విషయ విభజన చేశాడు. ''మంధర ధర కుంద సుందర రదా! వరదా! మురదాన వాంతకా'' అని మకుటం. అన్నీ చంపకమాలలు.
69. అడిదం బాల భాస్కరం	మాడుగుల సంస్థానంలో వార్షికం గల కవి. ఒక తారావళీ నాలుగు శతకాలూ వ్రాశాడు. 1. జానకీ రామ శతకం, 2. భోగలింగశతకం, 3. శ్రీ వెంకటేశ్వర శతకం, 4. సింహాశైల నృసింహ శతకం అని పేర్లు తెలుస్తున్నాయి. ఈయన అడిదం సూరన్నగారి వంశంలోవాడు. కాలం క్రీ.శ.1808–74.
70. మల్లంపల్లి బుచ్చయ్య	రెండు శతకాలు చెప్పాడు. 1. సుందరేశ్వరశతకం (డి.1809), 2. మహిషాసురమర్దనీ శతకం (డి.1652). ఇతడు అత్తలూరి పాపయ్య శిష్యుడు. హాలాస్య మహాత్మ్యం కూడా వ్రాశాడు. బ్రౌను దొరగారి దగ్గర పండితుడుగా ఉన్నాడని ప్రతీతి.
71. పంతుల బ్రహ్మదేవయ్య	ధనంజయమహారాజ శతకం చెప్పాడు. కందపద్యాలు, పార్వతీపురం నివాసి. ఇతర కావ్యాలు కూడా వ్రాశాడు. శతకం అముద్రితం. ఆర్.563 (బి))
72. భుజమెళ్ల భగవచ్ఛాస్త్రి	వెంకటేశశతకం, గోవిందశతకం అని రెండు వ్రాశాడు. మొదటిది కందపద్యాలు. అన్నిరకాల ప్రాసలు. రెండోదాంట్లో నియమాలు లేవట. కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు మొదటిది ప్రచురించారు. శతక సముచ్చయం. రెండవ భాగం ఉత్తస్తుతి. ఈయన శంకరవిజయం హరికథకూడా వ్రాశాడట. ఇతని జననం 1830 ప్రాంతాలు. జగ్గయ్యపేట.
73. మల్లన	మల్లన యోగి శతకం వ్రాశాడు. కందపద్యాలు వేమన గారి బాణీ. ఛందస్సుకు, వ్యాకరణానికి ఈ పద్యాలు అతీతాలు.
74. తాడికొండ మల్లన	గుండ్రాజు శతకం. కందపద్యాలు మట్రాజువారిపై చెప్పిన శతకం. ఈ పద్యాలు వినిపించి మాన్యం పుచ్చుకొన్నాడు.
75. మల్లంపల్లి మల్లికార్జునయ్య	రెండు శతకాలు చెప్పాడు. 1. పెడన అగస్త్యేశ్వరశతకం. శార్దూల మత్తేభాలు. పాండిత్య వికర్షణ చాలా ఉంది. 2. పెడన శ్యామలాంబాశతకం. సీసపద్యాలు. రెండూ

	కాకినాడ పరిషత్తువారు ప్రకటించారు. శతక సముచ్ఛయం రెండో భాగంలో ఉన్నాయి.
76. మిక్కిలి మల్లికార్జునుడు	కావ్యాలు చాలా వ్రాశాడుగాని శతకం ఒక్కటే చెప్పాడు. శార్దూల వృత్తాలలో ''రాఘవా! ప్రోతా ప్రగ్గడ వామమంత్రి హృదయాబ్జినీ బాంధవా!'' అనే మకుటంతో రాఘవశతకం చెప్పాడు. ఇతని గురించి ముందే చెప్పుకొన్నాం.
77. నతగాని మాధవయ్య	రామముక్తావళీ శతకం చెప్పాడు. శార్దూల వృత్తాలు. మకుటంలో ''రామదైవాగ్రణీ!'' అని ఉన్నా ''ముక్తావళి! అన్నపేరు కవే పెట్టాడు. ఆర్.853 (ఎ)) నవరత్నాలలో ఇదే మకుటం ఉండబట్టి రామ నవరత్నాలు కూడా మాధవయ్యే వ్రాశాడని పరిశోధకులు భావిస్తున్నారు.
78. మీసరగండ మునిస్వామి	తిరుపతి దగ్గరనున్న వడమాలపేట వాడు. శ్రీరఘురామ శతకం వ్రాశాడు. కందపద్యాలు. భక్తి శతకం.
79. ఉన్నవ యోగానందం	రాజగోపాల శతకం వ్రాశాడు. సీసపద్యాలు. గుంటూరుదగ్గరనున్న ఉన్నవ గ్రామంవాడు. పద్మినీ పరిణయం అనే కావ్యం కూడా వ్రాశాడు.
80. పత్రి రమణప్ప	రెండు శతకాలు వ్రాశాడు. 1. విష్ణు సర్వోత్తమ శతకం. శార్దూల మత్తేభాలు 2. వెంకటరమణ శతకం. కందపద్యాలు. భక్తి శతకాలు.
81. రాచవేటి కవి	గణికాగుణ ప్రవర్తన తారావళి వ్రాశాడు. వేశ్యల దూషణ. తిరుత్తనివాడు. ''రసస దరహాస! భువన రంజన విలాసా! బుధజనోల్లాస! తిరుతని పుర నివాస!'' అని మకుటం. ఈ తారావళి ప్రసిద్ధమైంది.
82. సాహెబురాణా రామన్న	సీతాపతి శతకం వ్రాశాడు. శార్దూల మత్తేభాలు. లోకనీతితోపాటు భక్తి. కన్యాశుల్కాన్ని గర్హించాడు. నరులకు అంకితం ఇవ్వడం ఇష్టంలేనివాడు. శతకం అచ్చుపడింది. పద్యాలు మనోహరంగా ఉన్నాయని వంగూరివారు అన్నారు. (శతకకవుల చరిత్ర పుట. 552). కవి అంత ప్రౌఢుడు కాడనీ వ్యర్థపదాలు జాస్తి అని శేషాద్రి రమణకవులు అన్నారు. (వావిళ్ళ.భక్తిరస శతక సంపుటం. 2వ భాగం. పుట 350) కవి క్రీ.శ.1850 వాడు కావచ్చు.
83. శివయోగి రామకృష్ణమూర్తి	వేదాంతశతకం చెప్పాడు. కవిపేరుగాని ఇంటిపేరుగాని తెలియవు. ''రామకృష్ణమూర్తి రమ్యమూర్తి'' అనే మకుటం ఉంది కనుక కవిపేరు రామకృష్ణమూర్తి కావచ్చునని పరిశోధకులు భావించారు. ఇతడు

శివయోగి కనుక అది ఇంటిపేరుగా నేను కలిపాను. వేమన్నగారి బాణీలో ఆటవెలదులు చెప్పాడు. వేమన్న గారంత ఎత్తులకు ఎగురగలడు. శతకం అచ్చుపడింది. కాకినాడ పరిషత్తువారి శతక సముచ్చయం. రెండో భాగంలో ఉంది.

84. భద్రాద్రి రామచంద్రయ్య — భద్రాద్రి జానకీపతి శతకం వ్రాశాడు. నీపేరింటి వాడనని కవి దేవునితో చెప్పాడు. అందుచే ఊరిపేరూ కవి పేరూ ఊహించడమైంది. ఉత్పలమాలలు, డి. 1568 నుండి 1572 దాకా ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాల యంలో ఉన్నాయి. భక్తి.

85. దిట్టకవి రామచంద్రయ్య — ప్రసిద్ధుడు, నరసారావుపేట మల్రాజువారి ఆశ్రితుడు. 1. ఉద్దండరామ శతకం, 2. గొట్టుముక్కల రాజగోపాల శతకం, 3. మహిషాసురమర్దనీ శతకం, 4. రఘుతిలక శతకం, 5. రుక్మిణీపతి శతకం అని అయిదు శతకాలు చెప్పాడు. దండకాలు, చాటువులు కూడా రచించాడు.

86. దేవగుప్తాపు రామభద్రయ్య — మొగలితుర్రు సంస్థానంలోనివాడు. భవానీ ధవశతకం వ్రాశాడు. శార్దూలమత్తేభాలు. ''మహాదేవా భవానీ ధవా'' అని మకుటం. లోకాన్ని చాలా విమర్శించాడు. సూటిగనా తిట్టగలడు. సున్నితం గానూ చెప్పగలడు.

87. చీదెళ్ల రామయ్య — కృష్ణశతకం వ్రాశాడు. కందపద్యాలు. వేదాంతం. కవి వివరాలు తెలియవు.

88. కొమర్రాజు రామలింగం — రెండు శతకాలు వ్రాశాడు. రెండూ వీరశైవమే. 1. మల్లేశ శతకం, సీసపద్యాలు. 2. వీరభద్రశతకం, కందపద్యాలు. తొలిశతకంలో లోకనీతి ఉంది. ఆధునికులలో ప్రఖ్యాతులైన కొమర్రాజు లక్ష్మణరావుగారి తాతగారికి ఈకవి తమ్ముడు.

89. తిరువాయపాటి రామానుజయ్య — చూడికుడుతశతకం వ్రాశాడు. ఉత్పలమాలలు. ''రంగనాయకీ'' అని మకుటం. భక్తి.

90. కొత్తపల్లి లచ్చన్న — దుష్కర ప్రాస సూర్యశతకం కందాలలో వ్రాశాడు. చెల్లయమ్మారావు గారిపై కూడా కందశతకం చెప్పాడు. దాశరథీ విలాసం అనే ఏడాశ్వాసాల ప్రబంధం కూడా రచించాడు. ఇతడు క్రీ.శ. 1825–75 నడుమవాడని వేదం వెంకటకృష్ణశర్మగారు వ్రాశారు. (శతక వాఙ్మయ సర్వస్వం. పుట.355) అయితే నిడుదవోలు వారు క్రీ.శ. 1863–1898 అంటున్నారు. (శతకకవుల చరిత్ర అనుబంధం, పుట 857)

91. శ్రీగిరి లక్ష్మన్న — శ్రీరామ శతకం వ్రాశాడు. కందపద్యాలు 108 ఉన్నాయి. స్తుతి. (ఆర్.690)

92. పాటూరి లక్ష్మీనరసయ్య — లక్ష్మీనరసింహ శతకం చెప్పాడు. శార్దూల మత్తేభాలు. కవి మంచి పండితుడని వంగూరి వారి అభిప్రాయం. (శతకకవుల చరిత్ర, పుట.563). స్తుతి. దైవలీలల వర్ణన.

93. చేటరాతి లక్ష్మీనరసింహం — కోదండరామ శతకం చెప్పాడు. నిందాగర్భిత సీసాలు ''భండనారాతి భీమ కోదండరామ'' అని మకుటం. డి. 1537లో కొన్ని పద్యాలే ఉన్నాయి. శతకం సమగ్రంగా దొరికింది. అముద్రితం. ఇతడు ''పద్మనాభ యుద్ధం'' కూడా రచించాడు. చారిత్రక కావ్యం. ఇతని వివరాలు ఈ సంపుటంలోనే విజయనగరం అనే ప్రకరణంలో ఉన్నాయి.

94. రాచూరి లక్ష్మీరామదాసు — ఇతడు కూడా చరిత్రకు పనికి వచ్చే శతకం చెప్పాడు. రచన చాలా దుష్టభూయిష్టమేగాని కుంఫిణీ యుగం లోని ఎన్నో వివరాలు తెలుస్తాయి. ఇతని శతకం పేరు రాజమహేంద్రవర శ్యామలాంబా శతకం. (డి.1671). వ్యక్తిగత సమస్యలు వ్రాసుకొన్నాడు.

95. కోటగిరి లింగమ్మగారి అబ్బాయి — మాతృశతకం వ్రాశాడు. ఉత్పల చంపకాలు ''తల్లిన బోల రెవ్వరున్'' అని మకుటం (డి.1653) మాత్తూరి అప్పావు మొదలి రచించిన మాతృ శతకానికి ఇది మాతృక కావచ్చును. అయితే రెండూ విభిన్నాలు. కవి తన పేరుచెప్పుకోలేదు. తల్లిదండ్రులపేరు తెలియ చేశాడు. మాతృశతకం వ్రాసినవాడు కనుక తల్లి పేరుతోనే ఇతణ్ణి జమకట్టుకొందాం.

96. వరాహ వెంకటనరసింహం — ఈయన సూర్యనారాయణ శతకం వ్రాశాడు. శార్దూల వృత్తాలు. ఇంటిపేరు తెలియదు. కవి చెప్పుకోలేదు. అయినా నిడుదవోలు వెంకటరావుగారు ఇతడు వరాహగిరి వంశంలోనివాడని వ్రాశారు. (శతకకవుల చరిత్ర అనుబంధం. పుట. 842) శతకం అచ్చుపడింది.

97. తోట విజయ రాఘవయ్య — శృంగార పంచాశత్తులు వ్రాశాడు. బాగా ప్రచారం పొందాయి. ఇతణ్ణి గురించి ఈ ప్రకరణంలోనే చెప్పుకొన్నాం.

98. పోచిరాజు వీరన్న — ఆనందలహరి, సౌందర్యలహరి, భర్తృహరి సుభాషితాలను శతకాలుగా రచించాడు. పద్యకావ్యాలు కూడా రచించాడు. ఇతని ''భల్లాణ చరిత్ర''కు పేరు వచ్చింది.

99. పూసపాటి వీరపరాజు — చిరుత వజీరు శతకం చెప్పాడు. కందపద్యాలు. చాలా నీతులు. విశాఖ మండలం.

100. పోతులూరి వీరబ్రహ్మం

కాలజ్ఞాన తత్త్వాలు రచించిన యోగి. ఈయన ఒక శతకం కూడా వ్రాశారని ప్రతీతి. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఒక కాశికాంబశతకం ఉంది. (డి.9823) ''కాశికాంబ హంస కాశికాంబ'' అనే మకుటం కొన్ని పద్యాలలో ''కాళీ'' అనే మకుటం కొన్ని పద్యాలలో ఉన్నాయి. ఈ శతకం బ్రహ్మంగారే చెప్పారేమో. ఇంకా పరిశోధించాలి.

101. రామభట్టు వీరరాఘవయ్య

కస్తూరి రంగ శతకం చెప్పాడు. అయితే పూర్తి చేయలేదు. 75వ పద్యంతో ఆగిపోయింది. సీస పద్యాలు, యథేచ్ఛమైన భాషా ప్రయోగాలు చేశాడు. ఈ శతకాన్ని వాడ్రేవు కామరాజు పూర్తిచేశాడు. ముద్రితం.

102. బాణాల వీర శరభయ్య

కాళహస్తి సాంబశివ శతకం చెప్పాడు. చిత్తమొచ్చిన పదప్రయోగాలు చేయడంలోఎవరూ ఇతనికి సాటి రారు. వ్యాకరణం వెళ్ళే తోవలో ఈయన నడవడు. పండితులకు అర్థంకాని సమాసాలు, పామరులు నెత్తిమీద పెట్టుకొనే ఉత్పలాలు. సాంబశివ శతకం చాలామంది చాలాసార్లు అచ్చువేశారు. ఇతని గోరంట్ల మాధవ శతకం మాత్రం ఇంత అధ్వాన్నం కాదు. సంస్కృతం జోలికి అట్టే పోలేదు కనుక జాతీయాలతో శృంగార భావాలు బాగున్నాయి. (డి.1545). గోరంట్ల మాధవాష్టకం కూడా ఇతడే వ్రాశాడేమో.

103. పండితారాధ్యుల వీరేశలింగం

ఈయన మూడు రచనలు చేశాడు. ''ఛాయాసుతా'' అనే మకుటంతో శార్దూల మత్తేభాలతో శనైశ్చర నక్షత్రమాల వ్రాశాడు. (ఆర్.334). రాజరాజేశ్వరీ శతకం శార్దూల మత్తేభాలలో చెప్పాడు. (ఆర్.333) భవానీ శతకం కూడా వ్రాశాడు. ఇవి కందపద్యాలు. (ఆర్.332). కవి క్రీ.శ.1890 వాడని నిడుదవోలు వెంకటరావుగారు అన్నారు. (శతకకవుల చరిత్ర పుట. 876). కొంచెం పాతవాడేమో.

104. చిలకమర్రి వెంకట కవి

ఈయన గోపబాలక శతకం వ్రాశాడు. ఆర్. 221 (ఎ). ఉత్పల చంపకాలు. విష్ణు స్తుతి. కాకర్లపూడి వారి ఆశ్రితుడు కాబోలు. రుక్మిణీ గోపాల సంవాదం అనే తలుపులదగ్గర పాటను కూడా వ్రాశాడు. ఆర్.221 (డి). ఇందులో ''ఇఘునైనా'' ''అఘహార'' అనే ప్రాస ఉంది.

105. గోపీనాథం వెంకటకవి

సుప్రసిద్ధుడు. వెంకటగిరి సంస్థానం. ఈయన్ని వెంకయ్యశాస్త్రులు గారని పిలిచేవారు. చాలా రచనలు

	చేశాడు. బ్రహ్మానందశతకం వ్రాశాడు. ఈయన గురించి ముందే చెప్పుకొన్నాం.
106. ముడుంబి వెంకటకృష్ణమాచార్యులు	''కృష్ణా దీన రక్షామణీ'' అనే మకుటంతో శతకం చెప్పాడు. స్తుతితోపాటు నీతులు కూడా ఉన్నాయి. ఉత్తర రామాయణాన్ని పద్యకావ్యంగా రచించాడు. శ్రీరామస్తవ చూర్ణికను, పోలేరమ్మ దండకాన్ని కూడా చెప్పాడు.
107. కొండూరి వెంకటదాసు	''కృష్ణా దీన చింతామణీ'' అనే మకుటంతో ఇతడో శతకం చెప్పాడు. స్తుతి. ఈయన భార్గవ పురాణం కూడా రచించాడు.
108. ఫక్కి వెంకట నరసయ్యా	సుప్రసిద్ధమైన కుమారీ శతకం రచించాడు. ఇతర రచనలు కూడా చేశాడు. అవి ప్రచారంలోకి రావడం అలా ఉంచి వెలుగుకూడా చూడలేదు. ఇతని గురించి ఈ ప్రకరణంలో చెప్పుకొన్నాం.
109. మాటూరి వెంకటప్పయ్యా	భూరిగుణశతకం వ్రాశాడు. మధిర నివాసి. శతకం అముద్రితం. పాటలు, పదాలు చెప్పాడు.
110. తటవర్తి వెంకట మంత్రి	రామమనోహర శతకం చెప్పాడు. విష్ణు స్తుతి. ఉత్పలమాలలు.
111. ఆకొండి వెంకటయ్యా	మూడుశతకాలు వ్రాశాడు. రామప్రభూ శతకం ఒక్కటే దొరుకుతుంది. రామశతకం, శ్రీరమణ శతకం అనేవి రాశాడని మాత్రం తెలుస్తోంది.
112. సారిపాక వెంకటయ్యా	ఈయన కూడా ఒక రామశతకం వ్రాశాడు. (ఆర్.401). కందపద్యాలు. స్తుతి.
113. మరింగంటి వెంకట రాఘవాచార్యులు	నల్లగొండ జిల్లా కవగల్లు, కేశవ స్వామి శతకం. క్షమావింశతి వ్రాశాడు. శతకం అచ్చుపడింది. భక్తి.
114. బాల చక్రపురం వెంకటరామయ్యా	వేదనారాయణ శతకం రచించాడు. శార్దూల మత్తేభాలు. ఈయన్ని ఎవరో కంకంటి పాపరాజుతో సరిపోల్చారు. ఇలా పొగడారు. ''కంకంటి పాపరాజని కొంకక యనవలయు మిమ్ము గొబ్బున గోవిం దాంకిత శతకము వినినన్ వెంకటు రామారవర్య విహితౌదార్యా. (డి.1720) ఈ శతకంలో అంతటి కవిత్వముందో లేదో.
115. పోలిపెద్ది వెంకటరాయలు	సుప్రసిద్ధుడు, వేణుగోపాల, లావణ్యా శతకాలు వ్రాశాడు. తిట్ల దండకం చెప్పాడు. ఇతని గురించి చాలా చెప్పుకొన్నాం.

116. తక్కసీల వెంకన్న — సీతారామ శతకం వ్రాశాడు. ఆలంపూరు ప్రాంతాల వాడు. పార్వతీ దండకం కూడా చెప్పాడు. శతకం అచ్చుపడినట్టు లేదు.

117. వంకాయలపాటి వెంకటరాయశాస్త్రి — కోలంక మదనగోపాల శతకం చెప్పాడు. నిందా గర్భితం. వేణుగోపాల శతకం కోవలోనిది. సీసపద్యాలు. కొన్నిచోట్ల మోటు మాటలు ఉన్నా యని చరిత్రకారుల ఫిర్యాదు. (వంగూరి వారి శతకకవుల చరిత్ర పుట.521) కూచిమంచి వెంకట్రాయల మేనమామ.

118. తిప్పాభట్లు వెంకటు శివయ్య — సంతాన గోపాల శతకం చెప్పాడు. (ఆర్.322). స్తుతి. సీసపద్యాలు. ''సరస దరహాస యేలూరి పురనివాస గోపికాలోల సంతానగోపాలబాల'' అని మకుటం. కవే దానికి స్వయంగా సంస్కృతంలో టిప్పణి వ్రాశాడు. దాని పేరు ''సంజీవని'' తెలుగు శతకానికి సంస్కృతటీక ఎందుకో. వివిధ కోశాలలోని అపురూప శబ్దాల సంగతి గీర్వాణంలోనే చెప్పాలి కాబోలు.

119. వేల్పూరి వెంకన్న — జానకీరామ శతకం చెప్పాడు. సీస పద్యాలు; స్తుతి. ఈ శతకమేకాక యక్షగానాలూ, పద్యకావ్యాలూ కూడా వ్రాశాడు. 1. కంద తారావళి 2. గోవ్యాఘ్ర చరిత్రం, 3. గౌరీశంకర విలాసం, నాట్య ప్రబంధం, 4. విచిత్ర రామాయణం, పద్యకావ్యం, 5. శ్రీరామలీల యక్షగానం. ఇతని విచిత్ర రామాయణం ఓఢ్ర గ్రంథానికి అనువాదం.

120. ఝుంఝూమారుతం వెంకట సుబ్బయ్య — ఈయన ఒక సూర్యనారాయణ శతకం వ్రాశాడు. శార్దూల వృత్తాలు. కొన్ని పంచపాదులు, కొన్ని షట్పదులు. మయూరుని సూర్య శతకానికి అనుసరణ. ఆరోగ్యం కోసం ఈయన దీనిని వ్రాశాడట.

121. పరిమి వెంకటాచలం — సంగమేశ్వరశతకం వ్రాశాడు. ఉత్పల చంపకాలు. ''కూడలి సంగమేశ్వరా!'' అని మకుటం. గుంటూరు జిల్లా జాగర్లమూడి దగ్గర కృష్ణా తుంగభద్రల కూడలి ఉంది. స్తుతి.

122. నిముషకవి వెంకటేశం — జగన్నాథయోగిశతకం వ్రాశాడు. వేదాంతం. గొడే జగన్నాథరావుగారిమీద చెప్పినది. సీసపద్యాలు.

123. నిష్టల వెంకటేశ్వరులు — మల్లికార్జున శతకం చెప్పాడు. ఉత్పలమాలలు. శివకందాష్టకంకూడా రాశాడు.

124. వెలిచేటి వెంకట్రామయ్య — 25 శతకాలు వ్రాసినట్టు కృష్ణార్జున సంవాదం అనే కావ్యంలో చెప్పుకొన్నాడు. ఒక్క శతకం కూడా మిగలలేదు.

125. కూచిమంచి వెంకట్రాయుడు	మదనగోపాల శతకం చెప్పాడు. ఆర్. 267 సీసపద్యాలు. వంకాయలపాటి వెంకటరాయశాస్త్రి మేనల్లుడు. శిష్టు కృష్ణమూర్తిగారి స్నేహితుడు. దేవులపల్లి సీతారామ శాస్త్రిగారి శిష్యుడు. ఛందో వ్యాకరణ విషయం. ఆర్.862. (బహుశా ఇదే సకల లక్షణసార సంగ్రహాభి ప్రాయం కాబోలు) సుకవి జనమనోరంజని కూడా వ్రాశాడు. (ఆర్.912). శతకం విష్ణు స్తుతి.
126. మద్దిరాల వెంకటరాయుడు	హుంకారిణీ శతకం చెప్పాడు. ఆర్. 127. ఉత్పలమాలలు. పిఠాపురం దేవతపై చేసిన స్తుతి.
128. శంకర శంకరయ్య	రాచబిడ్డ శతకం చెప్పాడు. ఇదీ రామునిపై చెప్పినదే. రామాయణ వివరణ, రామనామ ప్రశస్తి గల గీత శతకం.
129. వాకలపురి శంకరుడు	భైరవ శతకం చెప్పాడు. డి. 1647 ఉత్పల చంపకాలు. లోకనీతి, శైవ స్తుతి ఉన్నాయి. ఇతడు బంగారంతో విగ్రహాలు చేసే శిల్పి.
130. వెలివెల శంభుమూర్తి	మరుమళ్ల వీరశంకరశతకం చెప్పాడు. డి. 1662 ఉత్పల చంపకాలు. శృంగారం.
131. శాంతానందయోగి	రామ శతకం చెప్పాడు. కందాలు.
132. శ్రీనివాసయ్య	త్రిపురసుందరీశతకం. ఉత్పలమాలలు. తప్పుల తడక. పంచపాదులు. స్తుతి.
133. శ్రీశైలపతి	భ్రమరా మనోహర శతకం చెప్పాడు. డి.1648. ఉత్పల చంపకాలు. శివస్తుతి. కార్వేటినగరం ఆస్థానంలోని వాడు. వంశానుక్రమ దర్పణ టీక కూడా వ్రాశాడు. డి. 2946.
134. నల్లాని చక్రవర్తి సంపత్కుమార శ్రీనివాస వెంకటాచార్యులు	"తిరుమల వేంకటేశ దేవా ధీశా" అనే కందశతకం చెప్పాడు. గోదావరి జిల్లా ముక్తేశ్వరపురంవాడు. భక్తి.
135. కొమరగిరి సంజీవి	శశాంకశేఖర శతకం చెప్పాడు. ఉత్పలచంపకాలు. ఇది రెండు గడియలలో ఆశువుగా చెప్పినది. కొన్ని పద్యాలు ముకుందమాల శ్లోకాలకు తెనిగింపులు.
136. అడిద సన్యాసి	రెండు శతకాలు చెప్పాడు. కేశవ శతకం. ఉత్పల మాలలు. ఆర్.307 (బి); రుద్ర శతకం. కందపద్యాలు ఆర్.307 (సి) ఈయన చెరువుమీద పద్యాలు చెప్పిన అడిదం రామయ్యగారి మనుమడు.
137. శిష్టు సర్వశాస్త్రి	ఈయన శిష్టు కృష్ణమూర్తిగారి కొడుకు. కాళహస్తి సంస్థానంలో ఉన్నాడు. దామెర వెంకటరావుగారి అనుజ్ఞతో జ్ఞానప్రసూనాంబికాశతకం చెప్పాడు. ఆర్.718 స్తుతి. అచ్చుపడింది. ఇతని చాటుపద్యాలు చాలా ఉన్నాయి.

138. పొరనంది సర్వేశ్వరశాస్త్రి

బాలకులకోసం, భక్తులకోసం బ్రహ్మపురి శతకం చెప్పాడు. కందపద్యాలు. ''వెంకటేశ బ్రహ్మపురీశా'' అని మకుటం, బరంపురం వాడేమో.

139. మరింగంటి సింగరాచార్యులు

సీతాపతి శతకం చెప్పాడు. శార్దూలమత్తేభాలు. రామాయణంలోని కొన్ని ఘట్టాల హేతు నిర్ణయం చేశాడు. (కాకినాడ పరిషత్తు గ్రంథ సంఖ్య. 2568)

140. చేకూరు సిద్ధయ్య

వేణుగోపాల శతకం వ్రాశాడు. సీసపద్యాలు. ''ఎల్లమాంబాపురీవాస! హిత విలాస-వేణుగోపాల పాలిత విబుధజాల!'' అని మకుటం. ఈయన విష్ణుపురాణం వంటి చాలా కృతులు తెనిగించాడట.

141. కర్లపాలెం సింగన్న

నృసింహాశతకం వ్రాశాడు. మత్తేభవృత్తాలు. భక్తి శతకం. కవి. మంత్రశాస్త్రవేత్త. వేదాంతి.

142. ఆణివెళ్ల సీతారాముడు

జానకీపతి శతకం చెప్పాడు. ఉత్పలచంపకాలు. శతకం చాలా ప్రౌఢంగా ఉందని వంగూరివారు అన్నారు. (శతక కవుల చరిత్ర, పుట. 435)

143. కాళహస్తి సుబ్బారాయుడు

భోగినీశతకం చెప్పాడు. సుబ్బసాని అనే వేశ్య అడిగి తనమీద చెప్పించుకొంది. శృంగారం. సీసపద్యాలు.

144. అనంతరాజు సుబ్బారావు

సదాశివశతకం. సీసపద్యాలు. కార్వేటినగరంలోని దేవునిపై చెప్పాడు. ప్రతి సీసంలో గర్భితవృత్తాలు, ఇతర ఛందాలు ఉన్నాయి. గారడీ శతకం.

145. పులిగంటి సుబ్బారావు

కోదండరామశతకం చెప్పాడు. కవి రాజానగరంవాడు. ఇందులో నిర్దుష్ట ప్రయోగాలకోసం వెదకడం కుమ్మరి ఆరంలో బంగారం కోసం వెదకడం అని పరిశోధకుల అభిప్రాయం. (శతక వాఙ్మయ సర్వస్వంలో వేదం వారు. పుట.346)

146. మదిన సుభద్రయమ్మ

ఈమె చాలా శతకాలు వ్రాసింది. శ్రీరామ దండకం కూడా చెప్పింది. గొడేవారి ఆడబడుచు. వాళ్ల గురించి చెప్పుకొన్న ప్రకరణంలో ఈమె గురించి కూడా చాలా ఉంది.

147. విస్సాప్రగడ సూరయ్య

లక్ష్మీనారాయణ శతకం. డి.1641. శార్దూలవృత్తాలు. ఏకాక్షరప్రాస. స్తుతి.

148. ఎర్రమిల్లి సూర్యప్రకాశం

వాయు డింభ శతకం అనే పేర ఆంజనేయునిపై సీస పద్యాలు చెప్పాడు.

149. మంత్రిప్రెగడ సూర్యప్రకాశం

భీమలింగ శతకం వ్రాశాడు. ఇతడు కృష్ణార్జున చరిత్ర అనే రెండర్థాల కావ్యం, సీతారామచరిత్రకూడా రచించాడు. మాడుగుల సంస్థానంలో ఉద్యోగి.

150. ఊటంకోట సోమయ్య

సోమేశ శతకం వ్రాశాడు. డి. 1821. కోశాలపురంలోని దేవునిపై చెప్పాడు. వీరశైవం.

151. కూచిమంచి సోమసుందరం | రెండు శతకాలు చెప్పాడు. 1. కొప్పులింగ శతకం. మత్తేభశార్దూలాలు. పలివెల కొప్పులింగేశ్వరునిపై చెప్పినది. బాగా ప్రచారం పొందింది. 2. భక్త చింతామణీ శతకం. మత్తేభ శార్దూలాలు ''సాంబా భక్త చింతామణీ'' అని మకుటం. శివస్తుతి.

ఈ శతక కవులలో కూడా పద్య కావ్యాలను వ్రాసిన వాళ్ల గురించి ఆయా ప్రకరణాల్లో విపులంగా చెప్పుకొన్నాం. కొందరు అజ్ఞాత కవులు వ్రాసిన శతకాలు ఈ యుగంలోనివే ఉన్నాయి.

దండకాలు

శతకాల తరువాత మన సాహిత్యంలో దండకాలే ఎక్కువగా కనబడతాయి. శతకాలలాగే ఇవి కూడా ఆదిలో దేవతా స్తోత్రాలుగా ఉండేవి. అయితే రాను రాను శతకాలలో వచ్చినట్టే వీటిలోనూ విషయ వైవిధ్యం వచ్చింది. మన మొట్టమొదటి తెలుగు కావ్యంలో ఉన్న తొలిదండకం దేవతాస్తుతే. పాశుపతాస్త్రం కోసం అర్జునుడు చేసిన శివస్తోత్రంగా దండకాన్ని నన్నయ్యగారు అరణ్యపర్వంలో రచించారు. (1-324). ఈ ప్రప్రథమ దండకం లగాయతు కొన్నివందల గ్రంథాలలో ఎందరో కవులు ఏదో ఒక సన్నివేశంలో తమ పాత్రలచేత దండకాలు చదివించారు.

మన సాహిత్యంలోని ప్రసిద్ధకవులలో దండకాలు వ్రాసిన వాళ్ల జాబితా ఎంత పెద్దదో వ్రాయనివాళ్లని పేర్కొనే లిస్టే అంత చిన్నదిగా ఉంటుంది. తిక్కనగారూ, నన్నెచోడుడూ, పిల్లలమర్రి పినవీరయ్యా, పెద్దనగారూ, రాయలవారూ, రామరాజ భూషణుడూ మొదలైన ప్రథమశ్రేణి రచయితలుకొందరు దండకాలను చెప్పలేదుగాని మిగతావాళ్లు నన్నయ్యగారి ఒరవడిని దిద్దిన వాళ్ళే. వారిమీద ఉన్న భక్తికొద్దీ సంస్కృత గ్రంథాలలో ఉన్న ఛందో లక్షణాన్ని సైతం చాలామంది పాటించలేదు.

దండకం మనకు సంస్కృతంనుండే వచ్చిందని చెప్పాలి. సంస్కృతంలో ఎన్నో వృత్తాలున్నాయి. పాదానికి ఇరవై ఆరు కన్నా ఎక్కువ అక్షరాలున్న వృత్తాలను ఉద్ధర మాలా వృత్తాలనీ ఉపరివృత్తాలని అంటారు. దండకం ఈ విభేదంలో చేరుతుంది. అన్ని వృత్తాలకిలాగే దండకానికి కూడా సంస్కృతంలో నాలుగు పాదాలు ఉండాలి. (కన్నడంలో నాలుగు పాదాలేకాక ద్వితీయాక్షర ప్రాస అనే నియమం కూడా ఉంది). ప్రతిపాదం మొదట రెండు నగణాలు ఉండాలి. ఆతరువాత వరుసగా ఏడు నుంచి ఎన్ని రగణాలైనా పేర్చుకొంటూ పోవచ్చును. అందుచేత పాదానికి ఇరవయ్యేడు అక్షరాలు మొదలుకొని 999 అక్షరాల దాకా ఎన్నేనా ఉండవచ్చు. నగణాలమీద 7 రగణాలున్న దండకాన్ని ''చండవృష్టి ప్రయాత దండకం'' అంటారు. ఆ తరువాత విభేదాలన్నింటికీ మూక ఉమ్మడిగా ''ప్రచితకములు'' అనే పేరు ఉన్నా 8 నుంచి 33 రగణాల దాకా

ఒక్కొక్క విభేదానికీ ఒక కొత్త పేరు సంస్కృత లాక్షణికులు పెట్టుకొన్నారు. అయితే 7 నుంచి 14 దాకా ఉన్న పేర్లను మాత్రమే అప్పకవి పేర్కొన్నాడు. (4-445)

అప్పకవిముందున్న తెలుగు లాక్షణికులు చాలామంది దండకలక్షణాన్ని విపులంగానే చెప్పారు. అయితే వాళ్లు ఆదేశించిన పద్ధతిలో ఏ కవీ దండకం వ్రాయలేదు. అందరూ నన్నయగారినే ప్రమాణంగా తీసుకొని ఇష్టమొచ్చినన్ని తగణాలలో వరుసగా వ్రాసి చివర ఒక గురువును చేర్చారు. చాలా దండకాలు శ్రీకారంతో మొదలై ''నమస్తే నమస్తే నమః'' అనే నమస్కారంతో అంతమవుతాయి. ఇవి సంస్కృతలక్షణానికేకాదు తెలుగు ఛందోగ్రంథాలలోని వివిధ నియమాలకు విరుద్ధం. తెలుగు లాక్షణికులు చెప్పిన దండకలక్షణాలు ఏమిటో చూడండి.

1. కవిజనాశ్రయంలో మల్లియ రేచన	మొదట వరుసగా ననహగణాలు నిలిపి తరువాత చిత్తమొచ్చినన్ని తగణాలు చెప్పి, ఆఖర్న ఒక గురువు నిలపాలి. లేదా తగణాలపై గురువు. (ఉత్తర 1-31)
2. కావ్యాలంకార చూడామణిలో విన్నకోట పెద్దన	''సనహాలపై తగణాలు చివర గురువు లేదా తొలి నుంచీ తగణాలూ చివర గురువు. కృతినాది సనహంబు లొండెందకారంబు లొండెం బ్రకల్పించి యా మీద నెల్లం దకార ప్రదానంబు గుర్వంతమై క్రాల-'' (8వ ఉల్లాసం)
3. ఛందో దర్పణంలో అనంతుడు	చూడామణిలో చెప్పినట్టే చెప్పారు. (సిరినేలు రసికుండు శ్రీవత్సవక్షుండు. (...... 2-135)
4. లక్షణసార సంగ్రహంలో చిత్రకవి పెద్దన	ఈయన తన కాలందాకా సంస్కృతాంధ్రాలలో ఎవరెవరు ఏయే లక్షణాలు చెప్పారో, ఏఏ నియామాలతో కవులు దండకాలు రచించారో అన్నీ క్రోడీకరించి లక్షణం చెప్పాడు.

వాటి తేడాలు చూడండి :

1. నగణయుగంపై - 7 రగణాలు - చండవృష్టి
2. నగణయుగంపై - 8 రగణాలు - అర్ణం
3. నగణయుగంపై - 9 రగణాలు - ఆర్ణవం
4. నగణయుగంపై - 10 రగణాలు - వ్యాళం
5. నగణయుగంపై - 11 రగణాలు - జీమూత
6. నగణయుగంపై - 12 రగణాలు - లీలాకరం
7. నగణయుగంపై - 13 రగణాలు - ఉద్దామం
8. నగణయుగంపై - 14 రగణాలు - శంఖం

ఈ ఎనిమిది విభేదాలు సంస్కృతచ్ఛందంలోనివి. ఈపద్ధతిలో కాకపోతే రెండు నగణాలపై ఇష్టమొచ్చినన్ని యగణాలుకూడా పేర్చవచ్చు కాదంటే సనహాలపై తగణాలు పెట్టి చివర గురువు ఉంచవచ్చు. లేదా తగణాలపై చివర గురువు పెట్టవచ్చు.

5.	అప్పకవీయంలో అప్పకవి	చిత్రకవి పెద్దన చెప్పినవన్నీ ఈయనా చెప్పాడు. అయితే ఆదిలో ఒక విరుద్ధ లక్షణం చెప్పాడు. హనస గణాలలో ఏదో ఒక దానితో మొదలెట్టి ఆ తరువాత తగణాల దండ గుచ్ఛమన్నాడు. (హకారంబె కానీ, నకారంబె కానీ సకారంబె కానీ వచింపదగున్) ముందుగా (6-4-443) ఈ పద్ధతిలో చెప్పిన దండకాలు తెలుగులో కనబడవు.
6.	సరసాంధ్ర వృత్త రత్నాకరంలో వెల్లటూరి లింగన్న	అప్పకవికన్నా ఎక్కువ లైసన్సు ఇచ్చారు. హ, న, స, త అనే నాలుగుగణాలలో ఏదో ఒక్కదానిలోనే దండకమంతా వ్రాయవచ్చు నని పెర్మిషను ఇచ్చాడు. అయితే తగణాలు తప్ప తక్కిన మూడు గణాలతో ఎవరూ దండకం చెప్పినట్టు కనబడదు.
7.	సులక్షణ సారంలో లింగమగుంట తిమ్మయ్య	కవిజనాశ్రయంలోని లక్షణాన్నే ఉదాహ రించాడు ''అమరంగసనహంబు లందాదిగా నొండెగాదేని నాదిన్ దకారంబుగా నొండె, దకారమ్ము లిమ్మై గకారావసానంబుగా జెప్పినందండకం బంద్రు దీనం గవుల్. (సులక్షణ.4-105)

ఈ పై లక్షణాలన్నింటిలోనూ ఒక్క ''తగణాలపై చివరి గురువు'' అన్నదానినే మన కవులలో అధిక సంఖ్యాకులు పాటించారు. అయితే కొన్ని విభిన్న లక్షణాలను శాస్త్రజ్ఞులు ఎందుకు చెప్పారంటే మన సాహిత్యంలో తగణ దండకాలతోపాటు కొందరు వేరే గణాలతో కూడా దండకాలు వ్రాశారు. చిత్రకవి పెద్దన కాలందాకా ఎవరెవరు ఏయే రకాల దండకాలు వ్రాశారో చూడండి.

తగణ దండకాలు

చాళుక్య యుగం	నన్నయగారు	భారతం. ఆదిపర్వం 1-324
కాకతీయ యుగం	మారన	మార్కండేయ పురాణం 6-224
పద్మనాయక యుగం	ఎర్రాప్రెగడ	నృసింహపురాణం 5-111
గజపతుల యుగం	అనంతుడు	భోజరాజీయం 7-25
	దగ్గుపల్లి దుగ్గన్న	నాసికేతోపాఖ్యానం 2-180

	బమ్మెరపోతరాజుగారు	వీరభద్ర విజయం 4-179
		భాగవతం (1) 3-203; (2) 10 - పూర్వ - 1283
తొలిరాయల యుగం	నందిఘంటలజంట	వరాహ పురాణం 11-116
	సూతనకవి సూరన్న	ధనాభిరామం 3-100
మలిరాయల యుగం	చరిగొండ ధర్మన్న	చిత్రభారతి 8-124
	ధూర్జటి	కాళహస్తీశ్వరశతకం 1-146
	సంకుసాల నరసయ్య	కవికర్ణరసాయనం 6-98
	మాడయ్య	మైరావణ చరిత్ర 3-132
నవాబుల యుగం	తెనాలి రామకృష్ణుడు	ఉద్భటారాధ్య 3-28
		ఘటికాచల మాహాత్మ్యం 2-చివర
	బైచరాజు వెంకటనాథుడు	పంచతంత్రం
	పింగళి సూరన్న	కళాపూర్ణోదయం 1-80

రెండు నగణాలపై రగణాలు

రెడ్డిరాజుల యుగం	శ్రీనాథుడు	కాశీఖండం (1) (2) 7-204
		నైషధం 4 - (సంస్కృతం)
		హరవిలాసం
గజపతుల యుగం	జక్కన	విక్రమార్క చరిత్ర 2-59 (సంస్కృతం)
తొలిరాయల యుగం	కూచిరాజు ఎర్రన	సకలనీతి కథానిధానం 5-141
	నందిఘంటల జంట	వరాహపురాణం 6-91
మలిరాయల యుగం	నందితిమ్మన	పారిజాతాపహరణం 3-38 రెండు పాదాలు
	మాదయగారి మల్లన	రాజశేఖరచరిత్ర 2-89
నవాబుల యుగం	తెనాలి అన్నయ్య	సుదక్షిణా పరిణయం 2-78 (సంస్కృతం)
	తెనాలి రామకృష్ణుడు	పాండురంగ మాహాత్మ్యం 4-77

''స-న-హ''లపై తగణాలు

మలిరాయల యుగం	కొరవి గోపరాజు	సింహాసన ద్వాత్రింశిక 4-24

రెండు నగణాలు - ఒక హగణం తరువాత తగణాలు

మలిరాయల యుగం	నంది తిమ్మన	త్రిస్థలీ దండకం. ''విజయనగర హేమకూటంబునన్నిల్చి'' అనే వాక్య ఖండాన్ని అప్పకవి ఉదాహరించాడు. (4-73)

ఈ పట్టిక చూస్తే సనహతగణాల దండకానికి ఒక్కటే ఒక్కటి లక్ష్యంగా కనబడుతుంది. అలాగే ''సనహత''లకు కూడా ఒక్కటే మచ్చుతునక మిగిలింది. రెండు నగణాలపై రగణాలతో దండకాలు వ్రాసేవాళ్లు కొందరు తగణ దండకాలు సైతం చెప్పారు. అయితే తెలుగు కావ్యాలలో సొంతంగా సంస్కృతభాషలోనే దండకాలు వ్రాసిన కవులు మాత్రం అచ్చంగా సంస్కృత దండక లక్షణాలను పాటించారు. వీళ్లలో శ్రీనాథుడు మొదటివాడు. అతడు నైషధంలో వ్రాసిన సరస్వతీ దండకంలో రెండు నగణాలపై రగణాలతో చెప్పడమేకాక నాలుగు పాదాలలోనే దండకాన్ని సరిపెట్టాడు. (అయితే ఒక పాదంలో ఉన్నన్ని రగణాలే మరో పాదంలో లేవు). సంస్కృత లక్షణాన్ని పాటిస్తూనే దండకం చివర తెలుగువాళ్ల ''నమస్తే నమస్తే నమః'' అన్నది చేర్చాడు. (నై.4-138) శ్రీనాథునిలాగే జక్కన కూడా సంస్కృత దండకాన్ని సంస్కృత లక్షణంలోనే తన విక్రమార్క చరిత్రలో వ్రాశాడు. అయితే ఈయన ఏకపాదమే చెప్పాడు. (వి. 2-59)

శ్రీనాథుడు తన దండకాలలో మరో వింతపోకడ కూడా పోయాడు. తనదాకా ప్రతి తెలుగు కవీ దండకాన్ని స్తోత్రానికే వాడితే ఇతడు కథాకథనానికి ఈ వృత్తాన్ని ఉపయోగించాడు. కాశీ ఖండంలో వ్రాసిన రెండు దండకాలూ తెలుగులోనే వ్రాసినా అందులో రెండు నగణాలపై రగణాలే వాడాడు. వాటిలో కథనే చెప్పాడు. (7-74; 7-204) శ్రీనాథునిలాగా కథాకథనానికి దండకాన్ని కావ్యాలలో వాడినవాళ్లు అరుదు. అయితే దండకంలో కథ చెప్పి దానిని ప్రత్యేక కావ్యంగా రచించినవాళ్లు లేకపోలేదు.

దండకాలను విడికావ్యాలుగా వ్రాసిన వాళ్లలో మల్లికార్జున పండితారాధ్యులు బహుశా ప్రథముడు. ఈయన ''మౌనిదండకం'' అనే కృతి రచించినట్లు పాల్కురికి సోమనాథుని మాటల వల్ల తెలుస్తోంది.[1] చాళుక్య యుగంలో ఇలాగ ఒక కవి ప్రత్యేక దండకరచన చేసినా మళ్ళ గజపతుల యుగంలో బమ్మెర పోతరాజుగారు రచించేదాకా విడి దండకాలు కనబడవు. పోతరాజుగారు దండకంలో కథ చెప్పడమేకాక శృంగార రసభరితంగా ఒక వేశ్య వలపును వర్ణించారు. ఈ పోకడకు వీరే ప్రథములు. పండితయ్యా మొదలుకొని అడిదం సూరన్నదాకా పదిహేడు విడి దండకాలు తెలుతున్నాయి. ఎవరెవరు ఏ దండకాలు వ్రాశారో చూడండి.

1. చాళుక్య యుగం	1. మౌని దండకం	పండితయ్యా రచన
2. గజపతుల యుగం	2. భోగినీ దండకం	బమ్మెర పోతరాజుగారిది
3. మలిరాయల యుగం	3. అష్టభాషా దండకం	తాళ్లపాక చినతిరుమలయ్యా
	4. త్రిస్థలీ దండకం	నందితిమ్మన (చూ. అప్పకవీయం 4073)
	5. శృంగార దండకం	తాళ్ళపాక పెదతిరుమలయ్యా
4. అరవీటిరాజుల యుగం	6. వెంకటపతి రాయల దండకం	ఎవరో (తంజావూరు డి. 425)

1. ఆదిమ చాళుక్య యుగాలు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. మొదటి సంపుటి, 2002.

5. నాయకరాజుల యుగం (1)	7. కృష్ణ దండకం	టేకుమళ్ళ రంగశాయి
6. నాయకరాజుల యుగం (2)	8. రాజగోపాల దండకం	కావటూరి రాఘవయ్యా (తం.డి. 423)
	9. రామదండకం	కంచర్ల గోపన్న
	10. విద్యావతీ దండకం	గణపవరపు వెంకటకవి
7. కడపటి రాజుల యుగం	11. కృష్ణదండకం	కూచిమంచి తిమ్మయ్యా
	12. త్రిపురారి దండకం	నెల్లూరి వీరరాఘవయ్యా
	13. నృసింహదండకం	ఏనుగు లక్ష్మన్న
	14. భద్రాద్రిరామదండకం	రాయజగపతిరాజు
	15. శాహరాజదండకం	ఎవరో (తం.డి. 426)
	16. శ్రీకృష్ణదండకం	సత్యవోలు భగవంతం
	17. శ్రీరామదండకం	అడిదం సూరన్న

ఈ పదిహేడు పాతదండకాలలో కనిపించే పోకడలు బేరీజువస్తే మొట్టమొదట రెండు ముఖ్య విభాగాలుగా కేటాయించాలి. ఒకటి దేవతలపై చెప్పినవి; రెండు - మనుష్యులపై చెప్పినవి.

మళ్ళా మొదటి విభాగంలో మూడు శాఖలున్నాయి. కేవలం స్తుతులు, శృంగార రసాత్మకాలు, మహిమలు వర్ణిస్తూ కథలు చెప్పినవి. వాటిని విభజించవచ్చు. పూర్వ యుగాలలో ఉన్న విభాగాలేకాక మరికొన్ని అదనంగా కుంఫిణీ యుగంలో వచ్చాయి. శిష్ట దేవతల ప్రార్థనలతో పాటు దుష్ట శక్తులను శాంతింపచేసే దండకాలు జాస్తీ అయినాయి.

కడపటి రాజుల యుగంలోని రాజకీయ పరిస్థితులవల్ల సాంఘిక జీవనంలో కల్లోలాలు ఏర్పడ్డాయి. అంటువ్యాధులు వ్యాపించాయి. ఈరోగాలన్నీ గ్రామదేవతల ఆగ్రహంవల్ల వచ్చినవే అని భావించేవాళ్ళు ఆ దేవతలను శాంతింప చేయడానికి రకరకాల దండకాలు చెప్పారు. ''కొల్లాపురీ అమ్మ, అద్దంకి మహాలక్ష్మి, కొల్లేటి పెద్దింటమ్మ, వానపల్లి పళ్ళాలమ్మ, రేలంగి మెంట్లమ్మ, రాకుదిటి మామిళ్ళమ్మ, మోగంటి సిన్నేరమ్మ'' మొదలైన గ్రామ దేవతలను వేడుకొనడం కనబడుతుంది. (డి.1981). ''మావూరు, మాయిర్లు, మాపొర్లు బాలలన్ వృద్ధులన్ పశువులన్ బాగుగా జూసి రక్షించు''మని కోరుకొన్నారు. (ఆర్.242-కె) ఈ దేవతలకు ''నేతియప్పాలు బొబ్బట్లు నున్నాదిగా పిండివంటల్ మరింబప్పు నేయ్యంబు''లు మాత్రం పెట్టేవాళ్ళు కొందరున్నారు. (డి.1984) జాతర చేస్తూ ''గొర్రెలన్ గోశులన్ బందులన్ దున్నలన్'' బలివేసేవాళ్లు కొందరున్నారు. (డి.991). ఈ కోవ దండకాలలో కర్తల ఆరాటం తప్ప కవిత్వం కనబడదు. దానికోసం వెదకడం కూడా దండగ.

అసలు దండకాలలో శబ్దాలంకారాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కనుక ఆ నగల వెనుక ఉన్న కొద్దిపాటి సహజసౌందర్యం కూడా మరుగుపడుతుంది. ఈ యుగంలో

కేవలం శృంగార దండకాలను వ్రాసిన వాళ్లు కూడా ఓహో అనిపించేటట్లు వ్రాయలేదేమో. దేవతలమీద వ్యక్తులమీదా వ్రాసిన వివిధ శృంగార దండకాలను పరిశీలిద్దాం.

కచ్చిరంగరాజు దండకం

కచ్చివారు ఏప్రదేశాన్ని పాలించారో కచ్చితంగా చెప్పలేం. కర్నాటకంలో కూడా ఉండేవారు. కచ్చి రంగరాజుపై ఎవరో కవి ఈ దండకం చెప్పాడు. రాజుగారు షికారు వెళుతున్నప్పుడు మేడమీంచి ఎవరో పడుచు చూసి మోహిస్తుందట. ఆ సంగతి కవి ప్రస్తుతించాడు. ఈ దండకం ప్రతి ఒకటి కాకినాడ సాహిత్యపరిషత్తు కార్యాలయంలో ఉంది. (గ్రంథ సంఖ్య 67) ఈ కచ్చి రంగరాజుపైన ఎవరిదో చాటువు ఒకటి లభిస్తోంది.

నలుగురు నిను బలుమారున్
గెలిచితి సుగుణోక్తి కాంతి కీర్త్యాకృతులన్
నలుగురు నిను బలుమారున్
భళి భళియన గచ్చిరంగ భాగ్య తరంగా (చాటుపద్య రత్నాకరం-188)

ఇలా యమకంలో పొగిడిన కవే బహుశా దండకం చెప్పాడేమో. భావి పరిశోధనల వల్ల ఇది తేలవచ్చు.

చంద్రాననా దండకం

నుదురుపాటి సాంబయ్య దీనిని చెప్పాడు. పుదుక్కోట పాలించిన తొండమాను రాజుల్లో ఎవరో ఒకరి మీద చెప్పాలనుకొని రచించాడు. అయితే రాజు పేరు, అడిగించుకొన్న తరువాత ఇరికించవచ్చునని భావించి దండకంలో అక్కడక్కడా కథానాయకుని పేరు అతని వంశ ప్రసక్తి వచ్చిన చోట్లలో జాగాలు విడిచిపెట్టాడు. ఎవరిమీద శృంగార దండకం వ్రాసినా ఒకటే కథ కాబట్టి రచన పూర్తయింది. ఇందులోనూ రాజు షికారువెళ్తే చంద్రానన అనే చిన్నది చూడడం, మరులుకొనడం వగైరా కథే ఉంది. (కాకినాడ గ్రంథ సంఖ్య.55)

చంద్రాననా దండకం

దీనినికూడా నుదురుపాటివారి కుటుంబంలోని కవే వ్రాశాడు. పుదుక్కోట రాజులపైననే చెప్పాడు. కవిపేరు చిదానందం. రాజుపేరు రామచంద్రుడు, ఒక్క కథేకాదు, చాలామట్టుకు మాటలు కూడా పై దండకంలోలాగే ఉన్నాయి. దీని ప్రతికూడా కాకినాడ పరిషత్తు కార్యాలయంలో ఉంది. (గ్రంథసంఖ్య.61)

తారావళీ దండకం

ఇది దేవుని శృంగారాన్ని వర్ణించే దండకం. వావిలిపాడులోని వెంకటేశ్వరస్వామి తన దేవేరులతోపాటు విహరించిన విలాసలీలను నైషధం కమలాపతి వర్ణించాడు. దీనికి రెండు ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. (ఆర్.205; డి. 1982)

పద్మావతీ దండకం

దీనిని మైసూరు కృష్ణరా గారి ఆశ్రితుడు చంద్రకవి చెప్పాడు. ఇంతకన్నా వివరాలు తెలియవు.

రంగనాయక దండకం

దీనిని ఉయ్యాలవాడ నారాయణ రచించాడు. ఇతడు కందాళ దొడ్డయ్యగారి శిష్యుడు. భోగినీదండకం బాణీలో రంగనాథస్వామివారి శృంగారక్రీడను వర్ణించాడు. దీని ప్రతిఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.2002)

రాజగోపాల దండకం

ఇది కూడా శృంగారాన్నే వర్ణిస్తుంది. దీని రచయిత కావటూరి రాఘవయ్య. ఇతడు పాకనాటివాడు. సంస్కృతాంధ్రాలలో వేరే ప్రబంధాలుకూడా వ్రాశాడట. అయితే వాటి పేర్లు కూడా తెలియవు. ఈ దండకం ప్రతి మాత్రం తంజావూరులో ఉంది. (తం. డి. 423)

వీరభద్రదండకం

రాజమండ్రి దగ్గరనున్న పట్టిసంలోని వీరభద్రునికి అంకితంగా వెల్వరిశంభులింగం ఈ దండకాన్ని చెప్పాడు. ఇదికూడా భోగినీ దండకం కోవలోనిది. దీని ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.350)

శృంగారిణీ దండకం

దీనికి లీలావతీ దండకమనే మారుపేరు కూడా ఉంది. దీనిని ఉద్దండ శేషయ్య చెప్పాడు. దండకంలో రాజుపేరు ఉండవలసిన చోట్ల తుడుపులు ఉన్నాయి. పుదుక్కోటలో చెప్పిన దండకాన్ని కార్వేటినగరంలో ఇంకో రాజుపేర మార్చినట్టు ఊహించవచ్చును. దీని ప్రతి కాకినాడ పరిషత్తు కార్యాలయంలో ఉంది. (గ్రంథ సంఖ్య.151)

ఈ తొమ్మిది శృంగార దండకాలేకాక కొన్ని తిరునాళ్ల దండకాలుకూడా ఈ యుగంలో వచ్చాయి. ఆ సంబరాలలో జరిగే ముచ్చటలను ఇవి తెలియచేస్తాయి. ఈ దండకాల వివరాలను చూడండి.

కూడేరు సంగమేశ్వర దండకం

దీని రచయిత పేరు తెలియదు. కూడేరు గ్రామంలోని సంగమేశ్వర స్వామి తిరునాళ్ల విశేషాలను హాస్యరస ప్రధానంగా కవి చెప్పాడు. దీని అసమగ్ర ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.786 (బి)

చోళసింహపుర రథోత్సవ దండకం

ఈ ఊరునే ఆధునికులు ''షోలింగరు'' అంటారు. ప్రాచీనులు ''ఘటికాచలం'' అంటారు. ఈ దండకం అచ్చుపడింది. దీనిని కొల్లం సీతారామయ్య రచించాడు.

తిరునాళ్ల దండకం

వెంకటగిరి రాజధానిలో వేంచేసిఉన్న కాశీ విశ్వనాథస్వామివారి ఉత్సవంలో జరిగిన విశేషాలను ఎవరో వర్ణించారు. వెలుగోటివారి వంశంలో బంగారు యాచమనాయకుని కొడుకు కుమార అంక యాచమనాయకుడు ఈ తిరునాళ్ల జరిపించినట్టు దండకంవల్ల తెలుస్తోంది. దీని ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంతాలయంలో ఉంది. (ఆర్.717)

బృహనాయికా దండకం

దీనిని నుదురుపాటి వెంకన్న చెప్పాడు. ఇతడు పుదుక్కోట సంస్థానంలో ప్రముఖకవి. తొండమానురాజులలో ఒకడైన రాయరఘునాథుని ప్రాభవాన్ని ప్రశంసిస్తూ పుదుక్కోటవారి ఇలవేలుపైన బృహదంబిక పై ఈ శతకాన్ని కవి చెప్పాడు. ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి. 1992)

భాషీయ దండకం

తిరునాళ్లను వర్ణించే దండకాలలో దీనంత ప్రచారం పొందినది ఇంకోటి లేదేమో. దీనిని గుడ్లూరి నరసింహశాస్త్రి రచించాడు. అహోబల స్వామి తిరునాళ్లకు వచ్చే వ్యక్తులు ఎలా సంభాషించేదీ వివిధ యాసలలో కవి చిత్రించాడు. చోబుదారు నకీబులు తురకం మాట్లాడతారు. జంగాలు కన్నడంలో, వైష్ణవులు తమిళంలో సంభాషించుకొంటారు. అల్లుడిపై హాస్యాలు చెప్పుకొనే కోమట్ల ఆడవాళ్లూ ''యద్వాంసుడంటొస్తే మావద్ద నుండే కపీ శర్లతోడన్ ప్రసంగించమంటేను పీక్కొని పార్పోయె'' అని చెప్పుకొనే రాజులుకూడా ఆ తిరునాళ్ళకు వచ్చారు. ''వాక్యోప వాక్యంబులున్ బల్కుచున్ రాగహర్షాముప్పొంగ వచ్చేటి యాపర్లలెల్లన్ విలోకింపుచున్ వారి జాతీయ భాషా విశేషంబులన్ వేడ్కలాలింపుచున్'' ఈ దండకాన్ని నరసింహశాస్త్రి రచించాడు. అతడు ''మా అమ్మతో తెప్పి కొత్తిత్త'' అనే అర్భకుల ముద్దుమాటల్ని సైతం ఈ దండకంలో పొందుపరిచాడు. ఈ శతకంలోని మోటు హాస్యాలను చాలామంది విదూషకులు తమ ప్రసంగాలలో చెప్పడం నేను విన్నాను. ఈ దండకం 1880ల్లో ఒకసారి అచ్చుపడింది.

ఈ యుగంలో తిరునాళ్ళ దండకాలేకాక తిట్ల దండకాలు కూడా పుట్టాయి. విజయనగరం సంస్థానంలో కస్తూరి అప్పయ్య అనే ఉద్యోగి తనకేదో అన్యాయం చేశాడని ఎవరోకవి ఒక తిట్టుదండకం చెప్పాడు. ''ఆర్నెల్లకే తప్పినన్ యొక్క యేడాదికిన్ మీదుగాకుండ నీచావు నిక్కంబు'' అని శాపం పెట్టాడు. దీని ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.105 (సి))

రాజులు ఇచ్చిన మాన్యం తీసుకొన్నందుకు ఆ ఉద్యోగిమీద కవి ఇలా విరుచుకుపడితే అర్థం ఉంది. ఆడవాళ్లవల్ల మగాళ్లు మాటామాటా అనుకొని కవిత్వంలో తిట్టుకొనడం కూడా ఈ యుగంలో జరిగింది.

కార్వేటినగరంలోని పోలిపెద్ది వెంకన్న ఒక తిట్ల దండకం చెప్పాడు. ఈయన లావణ్యా శతకం, వేణుగోపాలశతకం రచించిన ప్రముఖుడు. తన పొరుగింట ఉండే కావూరి రామయ్యమీద కోపంలో తిట్టినతిట్టు తిట్టకుండా వెంకన్న ఒక దండకం చెప్పాడు. రామయ్యగారి ఇంట్లోని పాదులను వెంకన్నగారి బర్రె మేసిందట. అందుకు రామయ్యా పెళ్ళాం ఏడాదిపాటు పొరుగువాళ్లను తిట్టింది. ఆమెను అదుపులో పెట్టుకోమని వెంకన్న ఎంత మందలించినా రామయ్యా వినలేదు. చివరకు దివాణంలో చెప్పుకొన్నా లాభం లేకపోయింది. కవిత్వంతో శిక్షించాలని కవి ఈ తిట్ల దండకం చెప్పాడు. ఆరింట తగణం పెట్టి ''ఛీ ఛీ ఒరే పాతకా ఘాతుకా ప్రేత'' అంటూ మొదలెట్టాడు. తిట్టితిట్టి చివరకు ''నాశాపమీడేరు నిక్కంబు నిక్కంబు నీవింటికిం బోయి కాక ప్రోలికిన్నేగుమా సాగి కోవూరి రామయ యో రామరామ సమాప్తం సమాప్తం సమాప్తం'' అని పూర్తి చేశాడు. కోవూరి రామయ్యా తారున చచ్చాడట. ఈ దండకం అచ్చుపడింది. ఇందులోని కొన్నితిట్లను ప్రకాశకులు అధోజ్ఞాపికలతో వివరించారు.[2]

ఈ రెండు తిట్ల దండకాలేకాక ఇంకోటి కూడా ఈ యుగంలో కనబడుతుంది. సంభావన ఇవ్వలేదని ఎవరో ముక్కోపి మండిపడి బాలిసెట్టి అనే అభాగ్యునిపై చెప్పాడు. ''ఇకనైన బుద్ధి తెచ్చుకొని మాకైన సంభావనా యిచ్చి మాచేత దీవనల్ పొందుమా'' అని ఆదేశించాడు. బాలిసెట్టికి బుద్ధివచ్చినా ఈ కవికి ఛందస్సురాదు అని చెప్పవచ్చును. అమాయకులను భయపెట్టడానికి దండకాన్ని చేతపట్టిన ఈ కవి ఎవరో తెలియదుగాని దీని ప్రతి ఒకటి ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.1983)

తోటివాళ్ళను తిట్టడానికి ఉపయోగించినట్టే తన కాలంనాటి విషయాలను అవహేళన చేయడానికి కూడా ఈ యుగంలోని కవులు దండకాన్ని వాడుకొన్నారు. నిజానికి శతకంలో ఎన్ని రకాల విషయాలు చెప్పారో దండకంలో కూడా అన్నీ చెప్పారు. ఎవరోకవి పొగాకుపై దండకం చెప్పాడు. ''కోటలో బైరుగావించి, ఒప్పుగా నిప్పు దెప్పించి మిక్కిలిన్ ప్రేమతో ధూపముల్ త్రాగువారెంత పుణ్యాత్ములో యెంత ధర్మాత్ములో'' అని వాల్మీకి మొదలైనవాళ్లు పూర్వంలో చెప్పారట. ఆమాటలు విని దేవేంద్రుడు భూలోకం నుంచి ఈ బ్రహ్మ పత్రాన్ని దిగుమతి చేసుకొని తమలపాకులలో కలిపి నమిలాడట. ముక్కుపొడుం చేసుకొని పీల్చాడట. నిప్పు అంటించి త్రాగాడట. కర్తపేరు తెలియదుగాని దీని ప్రతి ఒకటి ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.1990)

పరాయిదేశాల వాళ్లవల్ల అబ్బిన అలవాట్లనేకాక వచ్చిన రెవిన్యూ ఇక్కట్లను కూడా మన కవులు దండకాలలో వర్ణించారు. కుంఫిణీ వాళ్ల పరిపాలనలో ఇనాం భూములపై ఫైసలాకు క్రీ.శ. (?)లో ఒక జమాబంది జరిగింది. అందులో మిరాసీదార్లు పడ్డ కష్టాలను కుందూరు కుటుంబంలోని కవి ఎవరో ఒక దండకంగా రచించాడు.[3] సుసర్ల దక్షిణామూర్తి అనే అనంతర కవి కూడా ఇలాగే ఒక జమాబంది దండకం వ్రాశాడు. ''జమాబందీ చరిత్ర'' అని పద్యరూపంలో గ్రంథంలో ఈ దండకం ఉంది. క్రీ.శ.1899లో అచ్చుపడింది. కుందూరివారి జమాబంది దండకం అలభ్యం.

2. తిట్ల దండకం. ప్రకాశకులు కౌశిక - మద్రాసు, ఉదయరంజని పబ్లిషర్స్, మద్రాసు-7
3. విస్మృతాంధ్ర కళింగ కవులు - అడిదం రామారావుగారు పుట.96

కావ్య ప్రక్రియలను లౌకికివిషయాలకు, సమకాలీన సంఘటనలకు వాడాలనే చైతన్యం ఈయుగంలో కలగబట్టే గాలివాన దండకం, పొగబండీ దండకం వంటివి కూడా ఉత్సాహవంతులు చెప్పారు. అయితే వీళ్లసంఖ్య స్వల్పం.

దేవునిపైన స్తుతులు, పాత పురాణ గాథల వర్ణనా, దండకాల్లో రచించాలనుకొన్న వాళ్లే ఎక్కువ. పద్యకావ్యంలో చేయవలసిన కృషిని దండకంలో చేయాలనుకోవడంవల్ల మనకూ కథా కథన దండకాలు కూడా ఈ యుగంలో వచ్చాయి. వాటి వివరాలు చూడండి.

ఈశ్వర దండకం

ఇందులో భల్లాణ చరిత్రను లక్కోజి నీలయ్య అనే ఉబలాటపరుడు చెప్పాడు. తప్పుల తడకని పండితుల అభిప్రాయం. దీని ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్. 560.ఈ)

కృష్ణ దండకం

ఒక శరత్కాలపురాత్రి కృష్ణుడు వేణుగానం చేయడం, గోపికలు రావడం, కృష్ణుని మందలింపు మొదలైన భాగవత ఘట్టాలను ఎవరో వెంకటాచార్యులు దండకరూపంలో చెప్పాడు. దీని ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.1798) ఇది అచ్చుపడింది.

కాళహస్తీశ్వర దండకం

కాళహస్తీశ్వరుని ఒక వేశ్య ప్రేమించే గాథను విశ్వనాథంగారి ధూర్జటి అనే కవి చెప్పాడు. వేశ్యమాత చేసే ప్రబోధంలో వారకాంతనయవంచనలు కవి కథనం చేశాడు. ఈ సమగ్ర దండకానికి ఒక ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.1977)

నాగేంద్ర మోక్ష దండకం

భాగవతం అష్టమస్కంధంలోని గజేంద్ర మోక్షకథను ఎవరో దండకరూపంలో చెప్పారు. దీని తాళపత్ర ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (ఆర్.344 (ఎఫ్)) అయితే గజేంద్రమోక్ష దండకం అనే పేరుతో నండూరి విజయగోపాలరావు వ్రాసిన దండకం ఒకటి అచ్చుపడింది.[4] విభిన్నమైనవో, కావో తెలియదు.

నృసింహ దండకం

ఇది కూడా భాగవత కథే. ప్రహ్లాద చరిత్రను ముంగం అప్పన్న అనే కవి కథనం చేశాడు. దీని ప్రతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.1987)

భల్లాణ దండకం

దీనిని నడిమింటి రామజోగి రచించాడు. విజయనగర సంస్థానంవారి ఆశ్రితుడు. ఇతని గురించి పూర్వం చెప్పుకొన్నాం. ఈ భల్లాణ దండకం అచ్చుపడింది. ఈ కవి గురించి మరికొన్ని వివరాలు విజయనగరం అనే ప్రకరణంలో ఉన్నాయి.

---

4. విశాఖపట్నం విన్నకోట అప్పల నరసయ్యగారి ప్రచురణ - 1908, రెండవ కూర్పు, కాపీ రైటు

రామదండకం

రామాయణ కథను ఆలికొండ రామన్న అనే కవి చెప్పాడు. ఇది ''వినోదక్రియా జాతి వార్తా విశేషాల మించు'' దండకమని కవి ఉద్దేశం. అచ్చుపడలేదు. తంజావూరులో దీని ప్రతి ఒకటి ఉంది. (తం.డి.424)

శ్రీరామదండకం

ఇది కూడా రామాయణాన్నే కథనం చేస్తుంది. మదిన సుభద్రయ్యమ్మ రచన. ఈమె గొడేపూడి వారి ఆడపడుచు. ఈమె గురించి ముందే చెప్పుకున్నాం.

ఈ ఎనిమిది కథాకథన దండాలలోనేకాక చాలా దండకాలలో పురాణగాథలలోని కొన్ని ఘట్టాలను పేర్కొనడం కనబడుతోంది. మాటవరుసకు ఆంజనేయ దండకాలలో కొంత సుందరకాండలోని కథ ఉంటుంది. ఇప్పటికి బయటపడ్డ దండకాలన్నింటినీ సేకరించి పరిశీలించితే తప్ప ఏ దండకం ఏ విభాగానికి చెందినదో తేల్చలేం. లిఖిత గ్రంథాలయాలలో ఉన్న దండకాలన్నీ అచ్చుపడలేదు. అచ్చుపడ్డవన్నీ లభించడంలేదు. ఏయే గ్రంథాలయాలలో ఎన్ని దండకాలు ఉన్నదీ, ఏఏ దండకాలు అచ్చుపడ్డవీ ఇలాగ క్రోడీకరించవచ్చును.

1. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో	40 దండకాలు
2. తంజావూరు సరస్వతీ మహలులో	6 దండకాలు
3. కాకినాడ పరిషత్తు కార్యాలయంలో	10 దండకాలు

మొత్తం ఈ 56 లిఖిత దండకాలలో కొన్ని అచ్చుపడ్డాయి. అయితే దేశంలో అచ్చుపడ్డ దండకాలకు లిఖిత మాతృకలు అన్నీ గ్రంథాలయాలలో లేవు. ఆంధ్రవాఙ్మయ సూచికలో దండకాల పద్దులో 139 ఆరోపాలు కనబడతాయి. వీటిలో దండకాల సంకల నాల పేర్లు 9 ఉన్నాయి. ఈ సంపుటాలలోని దండకాలే కొన్ని మళ్ళా విడిముద్రణలుగా మిగతా 130లో రిపీటు అయి ఉండవచ్చు. అయినా దేశంలో కనీసం నూటఇరవై, నూటపాతిక దండకాలకు తక్కువ కాకుండా అచ్చుపడ్డవి ఉంటాయి. వీటికి అముద్రితాలను ఒక పాతిక కలుపుకోవచ్చును. అయితే వీటిలో ఇప్పటికి దొరికిన ఆకరాలనుబట్టి దండకాలు చెప్పిన కొందరి కాల నిర్ణయం చేయడం కష్టం.

తెలుగు సాహిత్యంలో ఇప్పటిదాకా దండకాలపై జరగవలసినంత పరిశోధన జరగలేదు. దండక లక్షణాలపై వ్రాస్తూ నిడుదవోలు వెంకటరావుగారు పరిశోధనా వ్యాసంగానికి నడుం కట్టారు.[5] సంస్కృత మర్యాదలతోపాటు వివిధ ద్రావిడ భాషలలోని దండక లక్షణాలను నిడుదవోలువారు వివరించారు. ఆ తరువాత చాలా విపులంగా దండకాలపై రావూరి దొరస్వామిశర్మగారు పరిశోధన చేశారు. దండక లక్షణాల సమగ్ర చర్చతోపాటు తెలుగు కావ్యాలలో ఉన్న 43 దండకాలను బేరీజు వేశారు. తరువాత 102 విడి దండకాల పేర్లను వాటి కర్తల గురించి తెలిసికొన్న చిన్న వివరాలను క్రోడీకరించారు.[6]

5. పరిశోధన - నెం.7 ఏప్రిల్ - మే 1955
6. ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక - హేమలంబ 1957-58

ఇప్పటికి తెలుగులో చాలా దండక సంకలనాలను వివిధ ప్రకాశకులు అచ్చువేసినా నాకు తెలిసినంతమట్టుకు వంటెత్తు లత్సయ్యగారు 1926లో వేసిన దండక రత్నావళి మొదటిది. దీనిని కొండ్రెడ్డి సూర్యప్రకాశరావు సంకలనం చేశాడు. ఇందులో 20 దండకాలు ఉన్నాయి. వీటినే చాలామట్టుకు కొండపల్లివారు, సి.వి.కృష్ణా అండ్ కో వారూ అనుసరించి ''దండక రత్నములు'' అనే పేరుతో అచ్చువేశారు. ఇవి చాలా ముద్రణలు పొందాయి.

దొరికినన్ని భోగట్టాలను పరిశీలించితే ఈయుగంలో దండకాలు చెప్పిన వాళ్లు వీళ్లే అని నికరంగా పేర్కొన దగినవాళ్ళ పేర్లను ఇలా పొందుపరచవచ్చును.

కవి పేరు	దండకం
1. ముంగర అప్పన్న	నృసింహా దండకం (ప్రహ్లాద చరిత్ర) డి.1987-8.
2. నైషధం కమలాపతి	తారావళీ దండకం. శృంగారం ఆర్.205 (ఇ)
3. కామేశ్వరకవి	లక్ష్మీ దండకం. ఆర్.795 (ఎఫ్)
4. ముడుంబై కృష్ణమాచార్యులు	పోలేశ్వరమ్మ దండకంతోపాటు చాలా ఇతర రచనలు చేశాడు.
5. శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి	సుప్రసిద్ధుడు. ఎన్నో రచనలు చేశాడు. వాటిలో హనుమద్దండకం ఒకటి. ఆర్.541. (బి)
6. కోదండరామయ్య	దేశమ్మవారి దండకం. అంటువ్యాధుల నివారణకై చెప్పినది. డి. 1983.
7. మేడేపల్లి గోవిందయ్య	సౌదలీదేవి దండకం. ఆర్.795 (బి) పెద్దాపురంలోని దేవతపై చెప్పినది.
8. చంద్రకవి	పద్మావతీ దండకం (మైసూరు)
9. నుదురుపాటి చిదానందం	కృష్ణరాజుగారి ఆశ్రితుడు. చంద్రాననా దండకం. (కాకినాడ పరిషత్తు గ్రంథసంఖ్య (?)
10. శంఖుల చోడయ్య	వీరభద్రవిజయ దండకం. డి.470
11. విశ్వనాథంగారి ధూర్జటి	కాళహస్తీశ్వర దండకం. డి. 1977
12. నరసింహం	కనకదుర్గ దండకం. డి. 1976
13. గుడ్లూరి నరసింహశాస్త్రి	భాషీయ దండకం
14. కామర్సి నాగలింగయ్య	నిమిషాంబ దండకం
15. ఉయ్యాలవాడ నారాయణ	రంగనాయక దండకం. డి.2002-3
16. చేజర్ల నారాయణ	గండ నరసమ్మ దండకం (చాటుపద్య రత్నాకరం. పుట.279)
17. లక్కోజి నీలయ్య	ఈశ్వర దండకం భల్లాణ చరిత్ర

18. పచ్చమెట్ట పాపయ్య	హనుమద్దండకంతోపాటు ఇతర రచనలు కూడా చేశాడు.
19. బొగడ మల్లన్న	పోలమ్మ దండకం. డి. 1991
20. కావటూరు రాఘవయ్య	రాజగోపాల దండకం (తంజావూరు డి. 423)
21. దిట్టకవి రామచంద్రయ్య	హేలావతీ దండకం (ధూర్జటి వెంకటనారయణ కూడా ఒక హేలావతీ దండకం చెప్పినట్టు వాఙ్మయసూచికవల్ల తెలుస్తోంది.)
22. ఆలికొండ రామన్న	రామదండకం (తంజావూరు డి.424)
23. దొంతిరాజు రామయ్య	నాగమాంచాపురం విఘ్నేశ్వర దండకం. (డి.1960, డి.2013) దండక రత్నాలలో అచ్చుపడింది. ''శ్రీ సూర్యనారాయణావేద పారాయణా'' అనే సూర్య దండకం కూడా ఇతడే చెప్పి ఉండవచ్చు. విఘ్నేశ్వర దండకంలోని మాటలు కొన్ని ఇందులో ఉన్నాయి.
24. నడిమింటి రామయోగి	''అక్షిణ పదార్థాగర్భ రస సిద్ధం''గా భల్లాణ దండకం చెప్పాడు. ఇతడు ఇతర రచనలు కూడా చేశాడు.
25. అద్దంకి లక్షన్న	శ్రీ రంగనాయక దండకం. ఆర్.705
26. చిల్మకూరి వాసుదేవయ్య	హనుమద్దండకం. డి.2035 (వావిళ్లవారు ప్రచురించారు.)
27. నండూరి విజయగోపాలం	ఇతడు మూడు దండకాలను వ్రాశాడు. 1. అమ్మ వారి దండకం, 2. అరసవిల్లి సూర్యనారాయణ దండకం, 3. గజేంద్ర మోక్ష దండకం. దీనిలో చివరిది క్రీ.శ. 1897 నాటికి అచ్చుపడింది. ఆ తారీఖు నాటికి అతని వయస్సెంతో తెలియదు. కుంఫిణీ యుగంవాడే కావచ్చును.
28. పోలిపెద్ది వెంకటరాయకవి	సుప్రసిద్ధుడు. తిట్ల దండకం చెప్పాడు.
29. నందాపురం వెంకటాచలం	సిద్ధేశ్వర దండకం (డి.2029) సిద్ధవటం దగ్గర ఉన్న చెయ్యేరువాడు. చంద్రగుప్తుని కుమార్తె కల్లుకుండ పెట్టినచోటు, స్థలపురాణం చెప్పే దండకం.
30. నుదురుపాటి వెంకటన్న	బృహన్నాయక దండకం. డి.1992

31. తక్కసీల వెంకన్న	పార్వతీ దండకం చెప్పాడు.
32. వెల్వాల శంభులింగం	వీరభద్ర దండం. కాకినాడ పరిషత్తు గ్రంథ సంఖ్య (?)
33. ఆలవెల్లి సంజీవరాయడు	అమ్మవారి దండకం. ముద్రితం.
34. మదిన సుభద్రయ్యమ్మ	రామదండకం. ముద్రితం.
35. పంద్రా హేమాద్రి రంగయ్య	వెంకటేశ్వర దండకం. ఇ.2019. ఆర్.205 (డి)

ఈ జాబితాలో చేర్చిన 36 మందే కాక ఇంకా మరికొందరు కూడా ఈ యుగంలోనే ఉన్నారేమో అని అనుమానించదగ్గవాళ్ళు కొందరు ఉన్నారు. అయితే నికరంగా తెల్చుకొన్నాక గాని చేర్చడం మంచిది కాదని వాళ్ళ పేర్లు పొందుపర్చలేదు.

మన సాహిత్యంలోని చాలా దండకాల కర్తలు తమ రచనను పూదండతో పోల్చారు. అయితే ఈ మాలలోని చాలా మొగ్గలు ఇంకా విడలేదు.

భగవద్గీతలూ - బ్రహ్మవిద్యలు

అల్లసాని పెద్దనగారు అరుణాస్పదమనే పురాన్ని వర్ణిస్తూ ''అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ'' అన్నారు. మన భారతదేశంలో ఇంకా పుట్టని పాపలు సైతం వేదాంతం మాట్లాడగలరు. కడుపులో ఉన్నప్పుడే కర్మ సిద్ధాంతాన్ని ఆలపించగలరు. తరతరాలుగా ఈ తాత్త్విక పదజాలం మన అస్తిని పట్టిపోయింది. వేదాంత పరిభాష ప్రతి భారతీయుడికీ పరిచితమైన మాటలలాగే వినిపిస్తుంది. అర్థం అయిందా అంటే అది వేరే ప్రశ్న. జ్ఞాన ప్రస్తానంలో మొదటి అడుగు వేయని వాడి దగ్గర్నుంచి, గమ్యం చేరుకొన్నాననుకొనే వాడిదాకా భారతీయులు సహజంగా కర్మబద్ధులు. వేదాంతోపదేశాన్ని చెవినిపెట్టి తలమీద పెట్టుకొనేవాళ్ళే ఎక్కువ.

మన వేదాంత దర్శనాన్ని ప్రస్థానత్రయం అంటారు. ప్రస్థానమంటే శాస్త్రమనే అర్థముంది. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు అనే మూడు దర్శన శాస్త్రాలకే ప్రస్థానత్రయమనే పేరు వచ్చింది. ఈ పేరు వచ్చిన దగ్గర్నుంచీ వీటికి భాష్యాలు వ్రాసేవాళ్ళ, వ్యాఖ్యానాలు చేసేవాళ్లూ వీటిలో తమ సిద్ధాంతాలను ప్రక్షిప్తాలుగా చేర్చేవాళ్లూ, వీటిని నిరసించేవాళ్లూ, శిరసావహించేవాళ్లూ ఎందరెందరో ఉన్నారు. ఉపనిషత్తులకన్నా బ్రహ్మసూత్రాలకన్నా గీతకే ప్రాచుర్యం లభించింది. ఆదిశంకరుల దగ్గర్నుంచి అరవింద ఘోషు దాకా ఎందరో గీతకు అర్థం చెప్పారు. భారతీయ భాషలలోనేకాక ప్రపంచ భాషల లోనికి గీతను అనువదించారు. క్రీ.శ.1882లో కాశీనాథ త్రయంబకతిలాంగు వారు మొదటిసారిగా అనువాదం చేసిన దగ్గర్నుంచీ ఎందరో భారతీయులు భగవద్గీతను

ఆంగ్లీకరించారు. ప్రామాణిక వ్యాసాలను, గ్రంథాలను వ్రాశారు. బెల్వాల్కరుగారు గీత మీద చేసిన పరిశోధనలు పరమప్రామాణికాలు. సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారు విపులమైన పీఠికతో గీతను ఆంగ్లీకరించారు.

విశ్వసాహిత్యంలోనికి ఇటీవల వెళ్ళిన భగవద్గీత మన తెలుగులోనికి భారతాంధ్రీకరణలో ప్రవేశించలేదు. తిక్కనగారు భీష్మపర్వంలో గీతభాగాన్ని తడిమి దాటేశారు. వేదాంత దర్శనానికి పరమప్రమాణమైన గీత తమ భాషలో లేకపోతే ఎవరికైనా లోటు అనిపిస్తుంది. దీనిని పూరించడానికి ప్రాచీనకాలం నుంచీ ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఎందరు అనువదించినా లోటు లోటుగానే ఉంది. తిక్కనగారంత సిద్ధహస్తుడు చెయ్యివేస్తేనేగాని ప్రామాణికమైన తెలుగుగీత రూపొందదు. అందుకే మనభాషలో మొట్టమొదట భగవద్గీతను తెనిగించడానికి కాక ప్రతిపదార్థంతో భావం చెప్పే ప్రయత్నాలు జరిగాయి.

మలిరాయల యుగంలోని తాళ్ళపాక పెదతిరుమలాచార్యులుగారు భగవద్గీతార్థాన్ని చెప్పినవాళ్ళలో ప్రథములుగా కనబడుతున్నారు. చక్కని వ్యావహారిక వచనంలో తాళ్లపాకవారు వ్రాసిన గీతార్థంలోని తొలిభాగాలు చూడండి.

''ధర్మరాజులవారున్ను దుర్యోధనుని వారున్ను యుద్ధానికి ఆయత్తపడి ఉభయ బలములున్నూ మోహరించివున్న యపుడు ధృతరాష్ట్రుడు తన కొలువు చావడిలో చింతిస్తూ ఉండగాను అక్కడికి వేదవ్యాసులు వచ్చి ధృతరాష్ట్రుడా నీవేల వగచేవు. శ్రీ భగవానులు భూభారమడంప అవతరించినాడు. ఆ పోట్లాటకు వచ్చిన రాజుల కల్లాను కాలము చేరువై వున్నది. ఎవ్వరు మాన్పినను మానదు. నానాటి యుద్ధము నీకు తెలియచెప్పేటట్టుగాను నాయనుగ్రహమువల్లను త్రికాలవేదియైన సంజయుండు నీకు జెప్పుచు వచ్చీని'' అని ఆ సంజయుని ధృతరాష్ట్రుని వద్దనేపెట్టి వేదవ్యాసులు తన ఆశ్రమానికి పోయెను. ఆ తరువాతను ధృతరాష్ట్రుడు సంజయునితో పోట్లాడిన వివరం అడుగుతున్నాడు.

ధృతరాష్ట్ర ఉవాచ -

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేత యుయుత్సవః
మామకాః పాండవా శ్చైవ కిమకుర్వత సంజయ

అర్థం : ధృతరాష్ట్రుని వాక్యం - ఓయి సంజయుండ ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమందు యుద్ధము శాయ నిశ్చయించి కూడినటువంటి కౌరవులున్ను పాండవులున్ను యేమి చేసిరి అని అడిగితేను -''

ఇంత చక్కగా తేటతెలుగులో తాళ్ళపాకవారు వ్రాసిన గీతార్థం ఇప్పటిదాకా అచ్చుపడినట్టు లేదు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో దీనికి మూడు ప్రతులు ఉన్నాయి. (డి.2143-45) ప్రతులను వ్రాసుకొన్నవాళ్ళలో కొందరు ఇది ''తాళ్లపాక అన్నమాచార్యుల పుత్రుడు చిన్నమాచార్యులు'' వ్రాశాడని లిఖించారు. (ఆర్.804). అయితే అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలాచార్యుడే దీని కర్త.

తాళ్ళపాక వారి తరువాత నవాబుల యుగంలో కంభంపాటి నారప్ప. కడపటి రాజుల యుగంలో తుపాకుల అనంతయ్య, కర్పూరం కృష్ణమాచార్యులు భగవద్గీతను అనువదించారు. వీళ్లలో నారప్పది పద్యకావ్యం (15 ఆశ్వాసాలు). అనంతయ్యది వచనం (అచ్చుపడింది). కృష్ణమాచార్యులది ద్విపద. వీళ్ల అనువాదాలు ఏవీ ప్రచారంలోకి రాలేదు. ఎవరూ పారాయణ చేసినట్టు కనబడదు.

కుంఫిణీ యుగంలో చాలామంది భగవద్గీతకు వ్యాఖ్యానాలు, టీకలు, అనువాదాలు చేశారు. ఒక్క భగవద్గీతనేకాక, ఉత్తరగీతలు, పాండవగీతలు, అష్టావక్ర గీతలు వగైరాలు తెనిగించారు.

అనంత కృష్ణతీర్థులు

ఈయన ''భగవద్గీతార్థ దీపిక'' అనే పేరుతో ప్రతిపదార్థాన్ని వ్రాశారు. చక్కని వాడుక భాష. ఉదాహరణకు ప్రథమ శ్లోకంలోని ''సమవేతాయుయుత్సవః'' అనే మాటకు పరస్పరం అభిముఖంగా కూడుకున్న వారౌ కుంచున్నూ ''యుద్ధంచెయ్య నిశ్చయించినటువంటి'' అని అర్థాలు వ్రాశారు. ఈ అనంతకృష్ణయ్యగారు నారాయణ తీర్థులు వారి శిష్యులట. తరంగాలు వ్రాసిన తీర్థులువారూ ఈ గురువుగారూ ఒకటే అయితే అనంత కృష్ణతీర్థులవారు నాయకరాజుల యుగంలోనివారు అనుకోవాలి. వీరి అర్థదీపిక అచ్చుపడలేదు. (ఆర్.264 (ఎ))

వెలుగోటి కుమార యాచేంద్రులు

ఈయన క్రీ.శ. 1848 నుండి వెంకటగిరి పాలించారు. లోకంలో ఎన్ని విద్యలున్నా రెండే రెండు ముఖ్యమైనవని వెంకటగిరి రాజాగారి ఉద్దేశం. ఒకటి రతివిద్య. రెండోది ఆధ్యాత్మికవిద్య. మొదటిదాని రహస్యాలు తెలుసుకోవడం కోసం గోపీనాథం వెంకయ్యశాస్త్రులచేత బ్రహ్మానంద శతకం చెప్పించారు. ''ఆ పద్యమాలలో నుండెడి భావమిప్పటి జనులకు చక్కగ బోధపరచుకొనునట్టి యోగ్యత లేకపోయినందున నధ్యాత్మ విషయమైన యీ గీతార్థసంగ్రహమనెడు గ్రంథమును పద్యరూపముగ జేయించకనందరికి తెలియుటకు నింగిలీషు గ్రంథము రీతిగ తెలుగుమాటలతో రచియించుచున్నాడను'' అని చెప్పి రాజాగారు 68 పుటల తత్త్వోపన్యాసం వ్రాశారు. ఈ గీతార్థసంగ్రహాన్ని లేఖక ప్రమాదదోషాలు లేకుండా గోపీనాథం వెంకయ్యశాస్త్రులుగారు పరిష్కరించారు. రాజాగారే స్వయంగా అచ్చువేయించుకొన్నారు.

కొండూరి జగ్గరాజు

ఈయన గీతను పద్యరూపంలో అనువదించాడు. ఎనిమిది అధ్యాయాలు ఉన్నాయి. భగవద్గీతా శాస్త్రం అని పేరు పెట్టాడు. మంగళగిరి నరసింహస్వామికి అంకితం. రచయిత ఆ ఊరువాడే కావచ్చును. గ్రంథం సమగ్రమే అయినా గ్రంథపాతాలు జాస్తిగా ఉండడంవల్ల కవి విషయాలు ఇంతకన్నా తెలియవని పరిశోధకులు చెప్పారు. (ఆర్.776)

వేముగంటి దత్తోజీ పండితుడు

కొండూరి జగ్గరాజేకాక ఇతరులు కూడా పద్యకావ్యరూపంలో గీతను అనువదించారు. వాళ్ళలో కవుల చరిత్రకెక్కినది వేముగంటి దత్తోజీ. ఇతని తండ్రిపేరు నాగోజీ పండితుడు. ఊరిపేరూ ఇంటిపేరూ ఒకటే. వేముగల్లు. ఎక్కడ ఉందో తెలియదు. ఇతడు ఎప్పటివాడో తెలియదు. అనువాదం సాఫీగానే ఉంది. ''వాసాంసి జీర్ణాని యథావిహాయ'' (2-22) అనే శ్లోకాన్ని ఇలా అనువదించారు.

కోకలు జీర్ణమై చనగ గొచ్చున వాని పరిత్యజించి తా
శ్రీకర నూత్న వస్త్రముల జెల్వుగ దాల్చిన భంగి దేహి, సు
శ్లోకుడు జీర్ణ దేహముల శోభకు రోసిన జీవమూర్తి యీ
లోకపు గోకులాంగముల లోలత దాల్చును భద్రమూర్తి యై (డి.2150)

దత్తోజీ పండితుడు వ్రాసిన ఈ భగవద్గీతా యోగశాస్త్రం ఒకసారి అచ్చుపడింది.

మిక్కిలి మల్లికార్జునుడు

ఈ యుగంలో వివిధ పద్య కావ్యాలు వ్రాసిన మిక్కిలి మల్లికార్జునుడు భగవద్గీతను ఉడతల పాపయ మంత్రి ప్రేరణ వల్ల తెనిగించాడు. పాపయ్య మంత్రిని పొగడుతూ శతకం చెప్పిన అల్లమరాజు సుబ్రహ్మణ్యం ఈ సంగతిని ఇలా గ్రంథస్తం చేశాడు.[1]

తగురామున కొసగితివి నె
న్నగ మిక్కిలి మల్లికార్జున కవీంద్రుని చే
నొగి తెనుగున గూర్పించిన
భగవద్గీతాది కృతులు పాపయ్య మంత్రీ!

ఈ అనువాదం అచ్చుపడినట్టు లేదు.

గిరిమనగారి మాధవయ్య

వెలుగు చూడని గీతానువాదాలలో గిరిమనగారి మాధవయ్యది కూడా ఒకటి. భగవద్గీతా భాష్యం అనే పేర నాలుగాశ్వాసాల గ్రంథంగా దీనిని రచించాడు. ఇతడు కిడాంబి వెంకటాచార్యుల శిష్యుడు. కృత్యాది అవతారిక లేదు. కవి వివరాలు తెలియవు. ఈ గ్రంథం ప్రతిని ఒకదానిని 1845 జూన్ 29వ తేదీనాడు ''కడప క్రిష్ణమ్మ'' లిఖించి కస్తూరి రామదాసుకు ఇచ్చాడు. ఈ తారీఖుల వల్ల కవికాలం ఉజ్జాయింపుగా తెలుస్తోంది. భద్రాద్రి రాముడికి ఇది అంకితం ఇచ్చాడు. (డి.2148)

వల్లూరి లక్ష్మీనారాణ

భగవద్గీతను చాలాసార్లు పారాయణచేస్తేనేగాని అది తలకెక్కలేదు. యుద్ధరంగంలో ఒక్కసారి విన్న గీతోపదేశాన్ని అర్జునుడు జ్ఞాపకం పెట్టుకోలేకపోయాడు. అందుచేత పట్టాభిషేకం అయ్యాక తీరుబాటుగా మయసభలో విహరిస్తూ ''బావా! మళ్లా ఒకసారి

1. శతక కవుల చరిత్ర - వంగూరి సుబ్బారావుగారు, పుట.590

గీతోపదేశం చెయ్యావా?'' అని కృష్ణుణ్ణి అడిగాడు. ''అదే వాక్య క్రమంలో నేను మట్టుకు చెప్పగలనా!'' అని కృష్ణుడు ఇంకోలాగ గీతోపదేశం చేశాడు. దీనిని ''అనుగీత'' అంటారు. ఇది మహాభారతం అశ్వమేధపర్వంలో ఉంది. (అధ్యాయాలు 16-51) వీటిని ''బ్రాహ్మణగీతలు'' అనే పేర తిక్కనగారు తెనిగించారు. (అశ్వమేధ 1-153 నుండి). ఉత్తరగీత అనే పేరుతో ఇతరులు కూడా అనువాదం చేశారు. వాళ్లలో వల్లూరి లక్ష్మీనారాయణ ఒకడు. ఇతడు యోగినని చెప్పుకొన్నాడు. శిష్యులు మెచ్చుకొనేటట్టు ''ఉత్తరగీతామంజరి''ని ద్విపదగా మూడు ఆశ్వాసాలలో రచించాడు. (డి.2072) దీనిని అమృతానందయోగికి అంకితమిచ్చాడు. వల్లూరి నారాయణ గురించి ఇతర వివరాలు తెలియవు. దీని ప్రతిని ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోని ఎన్నో ప్రతులను లిఖించిన మాజేటి సర్వేశలింగం 1830లో వ్రాశాడు.

పోచిరాజు వీరన్న

మాజేటి సర్వేశలింగంలాగ పూర్వకావ్యాల ప్రతులను లిఖించిన పోచిరాజు వీరన్న స్వయంగా చాలా గ్రంథాలు వ్రాశాడు. వాటిలో ''కృష్ణార్జున సంవాదం'' అనే పేరిట చేసిన గీతానువాదం ఒకటి అయితే ఇది ఇప్పుడు ఎక్కడా దొరకడం లేదు.

మంత్రవాది వెంకటపతి కుమారుడు

కొన్ని గ్రంథాలు దొరికినా వాటి కర్తలపేర్లు దొరకవు. మంత్రవాది వెంకటపతిగారి కుమారుడెవరో శ్రీరంగంలోని కస్తూరి రంగడికి అంకితంగా పాండవ గీతలు తెనిగించాడు. ఇవి పటుతర వాగ్విలాసములట. ఈపుస్తకాన్ని మంత్రవాది కస్తూరి రంగకవి కృతిగా ఎవరో అచ్చువేశారు. (ఆంధ్ర వాఙ్మయ సూచిక. పుట.109) ఎవరో సీతారామశాస్త్రిగారు క్రీ.శ. 1889లో పాండవ గీతల శ్లోక తాత్పర్యాన్ని వ్రాసి అచ్చువేశారు.

గోపీనాథం వెంకయ్యశాస్త్రులు

వెంకటగిరి రాజుగారు ''ఇంగ్లీషు గ్రంథము రీతిగ వచనంలో అందరికీ తెలియడానికి వ్రాసిన గీతార్థ సంగ్రహాన్ని పరిష్కరించిన వెంకయ్యశాస్త్రులుగారు భగవద్గీతను పద్యరూపంగా అనువదించారు. ఇది అచ్చుపడింది.

తెలుగు శ్రీధరస్వామి

భాగవత పురాణంపై శ్రీధరుల వ్యాఖ్యానం చాలా ప్రశస్తమైనది. ఆయన భగవద్గీతకు సుబోధిని అనే పేరుతో టీక, వ్యాఖ్యానాలు చెప్పారు. వారి టీకను ఎవరో తెనిగించారు. ఆయనకు నమస్కరించిన శ్లోకానికి అనువాదకుడు ఇలాగా అర్థం చెప్పాడు.

''శేషువు యొక్క సకలముఖాల చేతనున్నూ వ్యాఖ్యానం చేసేటి యే చాతుర్యం కలదో ఆ చాతుర్యమున అంతాను ఒక ముఖం చాతనే ధరింపుచున్న ఆశ్చర్యకరమైన రూపం కలిగిన పరమానంద మాధవులకున్నూ నమస్కారం చేసేను''. ఈ తెలుగుసేత ఎవ్వరిదో తెలిస్తే ఆయనకు మనమూ నమస్కారం చేసేము. ఈ సుఖబోధిని టీక అసమగ్రప్రతి.

ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. (డి.2143). అనువాదకుని పేరు శ్రీధర స్వామి అని గ్రంథాలయ పరిశోధకులు పేర్కొన్నారు. మనం తెలుగు శ్రీధరస్వామి అందాం.

సుదర్శనతీర్థులు

ప్రధాన గీతకు ఎలాగ వ్యాఖ్యానాలను వ్రాశారో అలాగే ఉత్తరగీతలకు శ్లోకార్థాన్ని వివరిస్తూ మనవాళ్లు వ్యాఖ్యానాలు వ్రాశారు. ఎవరో సుదర్శనతీర్థులు ఉత్తర గీత మూడు అధ్యాయాలు చక్కని వాడుక భాషలో వ్యాఖ్యానించారు. దీని ప్రతులు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉన్నాయి. (డి.2070-71)

కుమార రంగయ్యగారి సూరయ్య

మనదేశంలో కడుపులో ఉన్న బిడ్డలు సైతం కర్మ గురించి మాట్లాడుతారని ఈ వ్యాసం మొదట నేను చెప్పిన మాటలు ఎగతాళికి అన్నాననుకొంటే నేరం ఒప్పుకొంటాను గాని వారికి అష్టావక్రుని కథను ఒకసారి విన్నవించుకోవాలి. విష్ణుపురాణం ప్రకారం పూర్వం ఏకపాదుడనే ఋషి ఒకాయన ఉన్నాడు. అతని భార్య గర్భవతి అయింది. ఋషిగారు రోజూ శిష్యులచేత అధ్యయనం చేయించే పాఠాలను కడుపులో ఉన్న శిశువు వింటూ ఉండేవాడు. నిద్రమత్తుచేత ఒకనాడు శిష్యులు తప్పు చదువుతూ ఉంటే గర్భంలోని శిశువు ఆర్భాటం చేశాడు. ఏకపాదుడు ఇది విని ''నువ్వు అధ్యయనానికి వక్రంగా పలికావుగాబట్టి అష్టవక్రాలతో పుట్టు'' అని శాపం ఇచ్చాడు. ఈ అష్టావక్రుడు పెరిగి పెద్దయ్యాక మౌనభార్గవుడనే ఋషి అడిగితే ఒక గీతను చెప్పినట్టుంది. అసలు గీతను తెనిగించినట్టే అష్టావక్ర గీతను కూడా మనవాళ్లు అనువాదం చేశారు. ఎవరో కుమార మహీపతిగారి కొడుకు సూరయ్య అష్టావక్రగీతాన్ని పద్యరూపంలో ఆంధ్రీకరించాడు. ఇది అచ్చుపడింది.

ఒక్క భగవద్గీత చెప్పే దర్శనాన్నేకాక మనవాళ్లు రకరకాల ఉపదేశాలను విన్నారు. కొందరు కొన్ని ఆచరించారు. కొందరు కొన్ని నిరాకరించారు. తమ వాదాలను ఆకాశానికి ఎత్తారు. పరులని పాతాళంలోనికి తోసెయ్యాలని చూశారు. ఈయుగంలో పుట్టిన ''వేదాంత'' వాఙ్మయం చాలా ఉంది. 59 మంది వ్రాసిన గ్రంథాలు దొరుకుతున్నాయి. వీళ్లలో కొందరు వైష్ణవులూ, కొందరు శైవులు, కొందరు యోగులు. వీళ్లపేర్లూ వ్రాసిన పుస్తకాలూ చూడండి.

అచ్చాంబిళ్ల, నంబిళ్లగారులు	సువార్తలు	డి. 2058
అనంతకవి	ముప్పార్థ వైభవం	ఆర్. 368
కంభంపాటి అమరేశ్వరశాస్త్రి	అజ్ఞనధ్వాంత చండ భాస్కరం	ఆర్. 194 (ఎ)
	(విచారదశకం)	డి. 2040
ఇళయాళ్వారు	సారార్థచతుష్టయం	డి. 2266
నాదెండ్ల ఉమాపతి	చిదానందమంజరి	ఆర్. 96 కాకినాడ 1713
కట్టమూరి కామేశ్వరం	కర్మవిపాకం	ఆర్. 803
ధేనువుకొండ కేశవుడు	కర్మవిపాకం	ఆర్. 231 ఆర్. 837 (ఎ)

పోలిసెట్టి కొండలరాయడు	(అద్వైత వేదాంతం)	ఆర్. 446 (బి)
	కొండలరాయభాష్యం	
రామావజ్ఝల కొండుభట్టు	కపిల గోసంవాదం	ఆర్. 309 కవులచరిత్ర
3-276		
కోసూరి గంగాధరుడు	వేదాంత కురవంజి	డి. 1856-57
గణపనారాధ్యుడు	మనోబోధ	డి. 2151-52
చినవెంకటపతి	సర్వార్థసారం	డి. 2525
భీమనగరం చెంగల్వరాయకవి	సోమశైదీయం	ఆర్. 623
చెన్నబసవయ్య	సాంఖ్యవిచారం	డి. 2257
	మిశ్రార్పణం	డి. 2156-60
మంచెళ్ల చెన్నవీరయ్య	విజ్ఞాన ప్రదీపిక	ఆర్. 878, డి. 2182-84
జగద్గురు లింగయోగీంద్రులు	శిఖామణి వచనం	డి. 2229
అనుమంచి జగన్నాథం	తారకబ్రహ్మమంత్ర మాహాత్మ్యం	ఆర్. 545
జగ్గకవి	జీవేశ్వర సంవాదం	డి. 2097
జనార్ధన బ్రహ్మకవి	జీవ ప్రబోధం	డి. 2093-95
కుంటముక్కల తిరుమలనాథుడు	శైవాచార సంగ్రహం	డి. 2243-44
తిరువెంగళాచార్యులు	తిరుప్పావై	డి. 652 (బి)
దాసగోసాయి	పరమానందబోధ ప్రకరణం	డి. 2125
ధేనువుకొండ నరసయ్య	కర్మవిపాకం	ఆర్. 48
నరసింహం	ధర్మజకృష్ణ సంవాదం	తంజావూరు డి. 300
చెన్నాప్రగడ నాగేశ్వరం	శైవ సిద్ధాంత శిఖామణి	ఆర్. 550
కటుకం పెదలచ్చయ్య	శివతత్త్వసార సంగ్రహ	
	కైవల్య హర్మ్యాధిరోహణ	
	నిశ్రేణిక	ఆర్. 682
బుద్ధరాజు పేరయ్య	సాత్త్విక బ్రహ్మవిద్యా నిరసనం	డి. 2262
పాకనాటి బాపిరాజు	భక్తానంద కల్పద్రుమం	ఆర్. 316
పెనుమత్స బుచ్చిరాజు	పరతత్త్వ ప్రకాశిక	ఆర్. 342
బ్రహ్మానంద రాజయోగి	ముముక్షుజనచంద్రహాసం	
	సత్క్రియానుష్ఠానం	ఆర్. 868 (బి)
భద్రారాధ్యులు	అఖండబ్రహ్మానంద	
	వీర శైవ రహస్య పదవి	డి. 2041
డింగరి భాష్యకారాచార్యులు	యోగచంద్రిక	ఆర్. 649
మనోహరుడు	వీరమాహేశ్వరాచార	
	సారోద్ధారం	ఆర్. 649
అత్తోట రఘుపతిరాయలు	శ్రీరామ తత్త్వ బోధిని	
	రఘుపతిరాయ వ్యయం	ఆర్. 734
కోటంరాజు రాజన్న	లక్ష్యసారం	ఆర్. 423
కందికంట రామకృష్ణకవి	మాయా నిరాలంబ మంజరి	డి. 2155
నడిమిపల్లి రామభద్రరాజు	అవిద్యాతిమిర భాస్కరం	ఆర్. 614

కొచ్చెర్లకోట రామయ్య	ప్రభులింగలీల	ఆర్. 17, డి. 2130
చేజర్ల రామయ్య	జ్ఞానాంజనేయం	ఆర్. 312
ఆచ్చిరామానుజయ్య	మోక్షశాస్త్ర వచనం	డి. 2169
లక్ష్మణాచార్యులు	తత్త్వార్థదర్పణం ద్విపద	ఆర్. 609
ఆచ్చి లక్ష్మణాచార్యులు	అచ్చి లక్ష్మణాచార్యులు	గోలకొండకవుల సంచిక
	ముముక్షుజనకల్పం (ముద్రితం)	పుట. 408
లక్ష్మీనరసింహసోమయాజి	శివగీతలు	ఆర్. 713
వరవరముని (మనవాళయ్య)	తెంగళవైష్ణవ సంప్రదాయ	
	స్తోత్రములు	ఆర్. 226 (బి)
వాసుదేవయోగి	జీవప్రబోధం	తం.డి. 752-55
	వివేకసారం	కవుల చరిత్ర 3-283
వాసుదేవయోగి శిష్యుడు	మహాకావ్య ప్రకరణం	డి. 2153
రెంటాల వీరనారాధ్యులు	పంచాక్షరీ మాహాత్మ్యం	ఆర్. 170 (ఎ)
దేవరకొండ వెంకటకవి	వివేక సింధువు (ద్విపద)	కాకినాడ 1705
దాంట్ల వెంకటరామరాజు	సకల వేదాంత సిద్ధాంత	ఆర్. 967 (బి)
	సార సంగ్రహం	
రాచూరి వెంకటలింగయ్య	ప్రబోధ చంద్రోదయం	ఆర్. 715
పెరుమాళ్లగారి వెంకటాచార్యులు	ముక్తి చింతామణి	డి. 347-48
శంకరాచార్యులు	ఆత్మబోధ ప్రకరణం	ఆర్. 868 (సి)
	దక్షిణామూర్తి అష్టక టీక	ఆర్. 868 (డి)
శివరామలింగయ్య	వీరశైవాచార సంగ్రహం	ఆర్. 450
ముడింబిసింగరాచార్యులు	ప్రమాణ, త్తిరట్టు	డి. 2143
సిద్ధేంద్రయోగి	యోగీశ్వర విలాసం	డి. 1178-79
సిద్ధనాథుడు	షట్‌స్థల దర్పణం	ఆర్. 509 (బి)
వంగీపురం సీతారామయ్య	ఆచార్యరత్నహారం	ఆర్. 624, ఆర్. 906
కొమ్మర్తి సుబ్బారాయుడు	సూక్ష్మతనువిలాసం	కాకినాడ (?)
శ్రీగిరిరాజు సుబ్రహ్మణ్యం	మహావాక్యదర్పణం	ఆర్. 598
శివకవి సోమన్న	గురుబోధ	డి. 2081-82
దామోదరం హృషీకేశదాసు	ముప్పదినాల్గు విన్నపములు	ఆర్. 284

ఇంతమంది ఇన్ని వేదాంత గ్రంథాలు వ్రాసినా వీటిలో ఏవీ బహుళ ప్రచారం నోచుకోలేదు. వీటిని విన్నాక అర్జునిడిలాగా ''ఏదీ మళ్ళా చెప్పు'' అని మళ్ళా మళ్ళా అడిగినా అర్థంకావు. నోటికి పట్టి, గుండెలకు హత్తుకొని మనస్సులో ఉండిపోయినప్పుడే ఏదైనా నాలుగు కాలాలపాటు నిలుస్తుంది. అందుకే చాలామంది గురువులు ప్రజలకు జ్ఞాపకం ఉండేటట్టు తమ ఉపదేశాలను పాటల రూపంలో చెప్పారు. వాళ్ళ ధర్మమా అని ఇవాళ తత్త్వాలు మారుమ్రోగని గ్రామం ఎక్కడా లేదు. చిలకను, మనసును, నరుణ్ణీ, గురుణ్ణీ సంబోధిస్తూ ఎన్నో వేదాంత కీర్తనలు పుట్టాయి. ఎంతో క్లిష్టమైన వేదాంతాన్ని తేటమాటల్లో చెప్పాయి. ఎంతో సులభమైన మాటల్లో సైతం ఎంతకీ బోధపడని సాంకేతిక చిత్రాలలో కూడా భావాలను మేకుబందీ చేయగలిగారు. ఇటువంటి సాహిత్యంలో ఆద్యులు యాగంటివారు. వారి తత్త్వాలు మిగతావాళ్ళకు ఒజ్జలబెత్తాలు.

యాగంటివారు

అనంతర యుగాలలోని తత్త్వాలకు వరవళ్లు పెట్టినవి యాగంటివారి రచనలే. నేడు అచ్చుపడ్డ ''కాలజ్ఞాన తత్త్వాల'' పుస్తకాలలో ''ఆగంటి లక్ష్మప్పగారి తత్త్వములు'', ''యాగంటివారి తత్త్వము'' ''ఆగంటి లక్ష్మప్పగారి యాలలు'' అనే శీర్షికలతో 31 గేయాలు కనబడతాయి.[2] ఈ శీర్షికల వల్ల వీటిని యాగంటి లక్ష్మప్పగారు వ్రాసినట్టు స్పష్టమవు తోంది. ఈ తత్త్వాలలో శిష్ట గ్రాంథికం నుండి నిత్యవ్యవహారందాకా విభిన్నరీతులలో సాగిన శైలీభేదాలు కనబడతాయి. వీటిని యాగంటి వివిధ వ్యక్తులు వివిధ కాలాలలో వ్రాసి ఉండవచ్చునని భావించవచ్చును.

యాగంటి పల్లె కర్నూలు జిల్లా బనగానపల్లె తాలూకాలో ఉంది. (ఆంధ్రదేశంలో మరెక్కడా ఇటువంటి పేరుతో ఇంకో గ్రామం ఉన్నట్టు కనబడదు). ఈ తత్త్వాలను వ్రాసిన యాగంటివారు రాయలసీమవారేననీ, మరీ ముఖ్యంగా కర్నూలు-బనగానపల్లెవారని చెప్పడానికి ఆంతరంగిక సాక్ష్యముంది.

గండికోట నుండి చూడదండి యుదయాగిరీ గంటి
దండి యుదయాగిరీ మీదా యేగంటిలింగా
ఉండగంటీ చంద్రగిరీని. (యాగంటి వారి వచనాలు-28)

ఈ యాలలోని ఊళ్ల పేర్లకు వేరే వేదాంతపరంగా సాంకేతికార్థాలు ఉంటే ఉండొచ్చుగానీ రచయిత తెలుగుదేశంలోని ప్రఖ్యాత గ్రామాలనే స్ఫురింప చేస్తున్నాడు. ఇప్పుడు ఈ గ్రామాలు ఈ క్రింది జిల్లాలలో ఉన్నాయి.

గండికోట	:	కడప జిల్లా	జమ్మలమడుగు తాలూకా
ఉదయగిరి	:	నెల్లూరు జిల్లా	ఉదయగిరి తాలూకా
చంద్రగిరి	:	చిత్తూరు జిల్లా	చంద్రగిరి తాలూకా

యాగంటివారి వచనాలలో చెప్పిన ఈ దుర్గాలన్నీ ఒకదానినొకటి నూరుమైళ్ల దూరంలోపునే ఉన్నాయి. యాగంటివారు ఈగ్రామాలకు దగ్గరలోనే ఉన్న యాగంటి పల్లెవారని నికరంగా చెప్పవచ్చును.

ఈ తత్త్వాలూ యాలలూ వ్రాసినవాళ్ల ఊరుతేలాక, పేరుగాని, పేర్లుగాని తేలాలి. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంవారు తమ పత్రికలో ''ఏగంటి వారి వచనాలు'' అని ప్రకటించారు.[3] వీటిని డి.2487 వ్రాతప్రతి నుండి పరిష్కరించారు. యాగంటివారి రచనలు ఇంకా ఉన్నాయి. ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో 14 వ్రాతప్రతులు ఉన్నాయి. (డి.2486 నుండి 2499. వీటిలో 8 తాళపత్ర ప్రతులు. మిగతావి కాగితం ప్రతులు) ఈ సంపుటాలలోని రచనలు అన్నీ విభిన్నాలు. ప్రతులు ఒకదానిని అనుసరించి ఇంకొకటి ఉండవు. ఈ తత్త్వాలూ యాలలూ పరిశీలించితేనే యాగంటివారి రచనలపై ఒక

2. ఎస్.వి. గోపాల్ అండ్ కో ప్రచురణలు, మద్రాసు. (1) 1949, (2) 1965
3. ఈ 66 వచనాలలో ఎస్.వి.గోపాల్ వారు ప్రచురించినవి కూడా ఉన్నాయి.

అభిప్రాయానికి రావడానికి వీలుంటుంది.

ప్రస్తుతం అచ్చుపడ్డ వాటిలో ఏగంటి శివుడు, ఏగంటి గురుడు (16), ఏగంటి నంజేశ్వరుడు (10); ఏగంటీశుడు (19); ఏగంటి ఘనుడు (24); ఏగంటి లింగడు (28); ఏగంటి సిద్ధయ్య (32); ఏగంటి పరమాత్మ గురుడు (36); ఏగంటి హరుడు (39); ఏగంటి నంజయ్య (44); ఏగంటి గురులింగం (50); ఏగంటి గురుసుకవి (57); ఏగంటి గురుస్వామి నంజేశ్వరుడు (63); ఏగంటికర్త (64) అని రకరకాలుగా ముద్రలు ఉన్నా ఇవి రచయితను కాక ఏగంటి పట్టణేశ్వరుడినే (37) సూచిస్తాయని భావించుకోవచ్చు. 57వ వచనంలో ''గురుసుకవి'' అని ఉన్నా రచయిత దేవుణ్ణే ఉద్దేశించాడని అర్థం చేసుకోవాలేమో. తత్త్వాలలోని ఆంతరంగిక సాక్ష్యంవల్ల రచయిత పేరు తెలియదు. నంజప్ప, సిద్ధయ్య అనేవాళ్లు ఈ తత్త్వాలను చెప్పి ఉంటారని భ్రమపడడానికి ముద్రలవల్ల వీలుంటుంది. అయితే అనుశ్రుతంగా వీటి రచయిత పేరు లక్ష్మప్ప కవి అని తెలియవస్తోంది. ప్రాచ్యలిఖిత గ్రంథాలయం కేటలాగులలో ఏగంటి లక్ష్మయ్యగారూ, పిడుపర్తి లక్ష్మయ్యగారూ వీటిని వ్రాశారని తొలి పరిశోధకులు చెప్పారు.

అయితే పత్రికలో వీటిని ప్రచురించిన మల్లంపల్లి శరభయ్యగారు ఈ గుర్తింపు ''సరికాదు'' అన్నారు. నవచోళ చరిత్రలో పోశెట్టి లింగన్న నుతించిన గార్లపాటి లక్ష్మయ్య గారే వీటి కర్త అని చెప్పారు. గార్లపాటివారు ప్రాచీనులే.[4] తెనాలిలో ప్రఖ్యాతులే. గార్లపాటి లక్ష్మయ్యగారు వీరభద్ర విజయాన్ని పాటలలో వ్రాసి పాటికెక్కారు అని పోలశెట్టిలింగన్న చెప్పాడు. అతడు చెప్పిన ఈ పాటలు, ఈ తత్త్వాలూ యాలలే అని శరభయ్య గారి అభిప్రాయం. ఇందులో నిజం ఉండవచ్చు. వాస్తవానికి యాగంటి పల్లెకు దగ్గర్లోనే నందికొట్కూరు తాలూకాలో ''గార్లపాడు'' అనే గ్రామం ఉంది. పోశెట్టి లింగయ్య ప్రస్తుతించిన లక్ష్మయ్యగారు ఈ గ్రామవాసే కావచ్చును. పోసెట్టి లింగయ్యను ఇప్పటిదాకా సాహిత్య చరిత్రకారులు 15వ శతాబ్ది చివరి వాడిగా జమకట్టారు.[5] అయితే ఇది తాత్కాలిక నిర్ణయమే. లింగయ్య తన కాలాన్ని చెప్పుకోలేదు. సూచించలేదు. ఇప్పుడు ఏగంటి వారి వచనాల వల్ల లింగన్న కొంత అర్వాచీనుడేమో అని అనుమానించవలసి వస్తోంది.

ఏగంటివారి తత్త్వాలను చూస్తే తాళ్లపాక అన్నమాచార్యులవారి ఆధ్యాత్మిక సంకీర్తనల పోలికలు కనబడతాయి. అందుచేత శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారివంటి పరిశోధకులు ఏగంటివారిని తాళ్లపాకవారికన్నా పూర్వులను చేస్తే రజనీకాంతరావు లాంటివారు వాళ్ళను సమకాలికులనో, సమీపకాలపు అర్వాచీనులనో భావించారు.[6] తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు ఈ ఏగంటివారిని పోతులూరి వీరబ్రహ్మంగారి శిష్యులను చేశారు.[7] ఏగంటివారి తత్త్వాలనుకాక యాలలను చూస్తే వారు అర్వాచీను

4. నవాబుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి, 2002.
5. ఆంధ్రకవి తరంగిణి - 9వ భాగం పుట.231. (మలిరాయల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, రెండవ సంపుటి, 2003 ఇతర కవులలో లింగన్న గురించి ఉంది.)
6. ఆంధ్రవాగ్గేయకార చరిత్ర - పుట. 452
7. అదే పుస్తకంలో ఉదాహరించారు. పుట.450

లనిపిస్తుంది. నామట్టుకు నాకు కడపటి రాజుల యుగంలోనూ కుంఫిణీ యుగం ఆరంభంలోనూ ఏగంటివారు ఉన్నారేమో అనిపిస్తున్నది. ఇంకా గట్టి పరిశోధనలు చేస్తేనేగాని ఎవరూ ఈ విషయం తేల్చలేరు.

యాగంటివారి వచనాలలో కొన్ని తత్త్వాలు చాలా జటిలంగా ఉంటాయి. పాల్కురికి సోమనాథునిలాగా సంస్కృత శ్లోక భాగాలను, వేదాలనూ, ఉపనిషత్తులనూ సునాయాసంగా తత్త్వాలలోనికి దింపెయ్యగలరు. చూడండి.

పతిలేని యజ్ఞాధిపతి రుద్రుడను వేద
పతి గాధపతి మేధపతి యనుచు బలుకున్
''స్థితిఅహిమాన్ పశూనాం పతయేతే ద్యదబధ్నామ్న
మఱి యస్స సుకృత స్యమధ్యే'' యనన్
శృతి యజ్ఞ పశువు పశుపతి కొరకే యనెడి
పద్ధతులు ''నీశాయత్యం జుష్టమే'' యనగ విధులన్ ।పతిలేని।

(వచనాలు-47)

ఈ వచనంలో ఆరు చరణాలు ఉన్నాయి. ఇలాగే పాల్కురికి సోమనాథుని బాణీలో నడిచాయి. (లేక కుంటాయి). అయితే యాగంటివారి రచనలన్నీ ఇలాగే ఉండవు. ఒక యాలలో కొంతభాగం చూడండి.

శివశివ యనవే తుమ్మెదా
శివుడనగ వినమేలు తుమ్మెదా
శివుని భక్తులాకు తుమ్మెదా
తొమ్మిది వాకిళ్ల తుమ్మెదా
నువ్వు నమ్మి చరించావె తుమ్మెదా
ముమ్మూల కోణాల తుమ్మెదా
నీవు నెమ్మాది నుండావె తుమ్మెదా ।శివశివ।

(వచనాలు-27)

ఇంత నిత్యవ్యవహారికంలో యాల వ్రాసిన మనిషీ ఆ ''పతిలేని'' అనే తత్త్వంవ్రాసిన వ్యక్తీ ఒకరే అని ఎలా అనుకోగలం. అందుకే యాగంటివారి వచనాలలో కొన్ని తరాల రచనలు ఉన్నాయని నా అనుమానం. యాగంటివారు ఎందరున్నా అందరూ శివభక్తులే. వీళ్లలో కొందరు శైవులను ''కారన్న యట్టి పరవాదుల ముక్కులు ఛేదించి'' నవ్వుకొనే వాళ్లలాగ కనబడతారు. (వచనం. 32) కొందరు మాత్రం ''ఏటి శైవమ్ము, మరియేటి వైష్ణవమూ - ఏటి యాచారమ్ము నేటి మార్గములూ'' అని ఆలోచిస్తారు (41). దేవుణ్ణి చూసి ''మతములన్నియు నీవె మర్మకర్మములు నీవె యతులమైన పరమాత్మవు నీవె'' అని చెప్పుకొంటారు. వీరశైవంనుంచి పరమత సహనం దాకా అక్కడ నుంచి సర్వమత సమానత్వందాకా వివిధ భావాలు ఈ తత్త్వాలలో కనబడ్డంవల్ల కూడా ఏగంటి వచనాల రచయితలు వేరు వేరు తరాలవాళ్లు అని భావించవచ్చును.

ఆదిలో వీళ్ల రచనలు జటిలంగా ఉన్నా రానురాను మాటలు తేలిక అవుతూ భావం గోప్యమవుతూ వచ్చింది. ఆంధ్రదేశంలో చాలా ప్రచారం పొందిన ''సూర్యచంద్రావహ్ని నడుమ శౌర్యమానె చిలుకగంటీ సూర్యదీప్తిగాంచు చుండగా'' అనే సాంకేతిక పదంలోని ''ఆకులేని అడవిలోనా, తోకలేనీ మృగము పుట్టె తోకలేని మృగము కడుపూన యేగంటి లింగా! ఈకలేని పక్షి పుట్టేరా!'' అనే గూడార్థ రచనలు వేదాంత రచనలలో కొత్త ఫ్యాషను ప్రవేశపెట్టాయి. ఈ బాణీ మీద పోతులూరి వీరబ్రహ్మంగారూ వారి శిష్యుడూ మెరుగులు దిద్దారు. ప్రజానీకంలో అశేష ప్రచారం పొందిన తత్త్వాలను రచించారు.

పోతులూరి వీరబ్రహ్మం

ఏగంటి లక్ష్మప్పగారి సమీపకాలంలో ఆ సీమలోనే బనగానపల్లెలో గరిమిరెడ్డి అచ్చమ్మగారి ఇంట్లో వీరప్పయ్య అనే కుర్రాడు పశువులకాపరిగా ఉండేవాడు. అసాధారణమైన తాత్త్వికచింతనవల్ల ఆ అబ్బాయి ఏగంటివారి తత్త్వాలనూ వేమన పద్యాలనూ ఈ కోవలోని సాహిత్యాన్ని కరతలామలకం చేసుకొని వేదాంతంతో ''చెడుగుడు'', బ్రహ్మజ్ఞానంలో ''బలిగుడు'' ఆడాడు. పన్నెండేళ్ళపాటు ఇలాగ స్వయంగా బ్రహ్మవిద్యాభ్యాసం చేసి కొన్నాళ్ళకు అల్లాడపల్లెలో నాళ్ళనడుమ ''నడివీథియందు కొలిమి నాటించి'' ఒక వంక కులవృత్తి కమ్మరం, వడ్రంగం చేసుకొంటూ తనకు తెలిసినదంతా తెలియని వాళ్ళకు పాటల రూపంలో చెప్తూ పాటికెక్కాడు. క్రమేణా వీరప్పయ్యను లోకం వీరబ్రహ్మంగా గుర్తించింది. అతని బోధనలు శ్రద్ధగా వినసాగారు.

బ్రహ్మంగారు చేసిన గురుబోధలు ఎంతో గుట్టుగా ఉన్నా పామరజనం గుండెలలోకి సూటిగా దూసుకుపోయే బాణాలవంటివి. అందుకే గురితప్పకుండా జానపదులు ఆయనను గురువుగా అంగీకరించారు. గ్రామీణులకు బోధపడకపోయినా అర్థమయ్యే సంకేతాలతో ఆయన తత్త్వబోధ చేశాడు. ''మూడు కాల్వలు దాటలేరయ్యా, మూఢజనులు, మూడు కాల్వలు దాటలేరయ్యా'' అని వాళ్ళను తరింపచేయడానికి తాను నమ్మినదాన్ని విశదపర్చారు. తత్త్వజ్ఞానాన్ని పండుతో పోల్చి ఇలా వర్ణించాడు.

తియ్యని మామిడి పండు, పండు
తినబోతే దొరకదు తీపులు మెండు
ఒరులకు నీ పండు ఒక దినుసుగా నుండు
నరులకు నీ పండు నమ్మకుండు
ధరలోన నీ పండు దాసులకై యుండు
పరమగురు ధ్యాన పలుకే పండు (తియ్యని)

బ్రహ్మంగారు చెప్పిన ''పండు''ను అందుకొనే పరమగురుధ్యానపరులు కొందరు ఏర్పడ్డారు. కులభేదాలుగానీ, మతభేదాలుగానీ లేని భక్తి సంఘాన్ని ఆయన తయారుచేయ ప్రయత్నించాడు. కందిమల్లయ్య పల్లెలో ఒక మఠాన్ని స్థాపించాడు. దూదేకుల సిద్ధయ్య అనే మహమ్మదీయుని, కక్కయ్య అనే మాలవాడినీ ప్రియశిష్యులుగా భావించారు. ఈ ఇద్దరిలో కక్కయ్య చాలా అమాయకుడు. యోగ పరిభాష ప్రకారం మన దేహంలో మూలాధారం నుంచి సహస్రారం దాకా ఆరు చక్రాలు ఉంటాయి. ఈ సంగతి

నిజమోకాదో తెలుసుకోడానికి పెళ్లాం కడుపుకోసి చూసిన మూఢభక్తుడు కక్కయ్య. శిష్యుల వల్ల బ్రహ్మంగారికి రకరకాల చిక్కులు వచ్చాయి. దూదేకుల సిద్ధయ్యను మతం నుండి వేరుచేసినందుకు మహమ్మదీయులు మండిపడ్డారు. స్థానిక నవాబులకు ఫిర్యాదులు చేశారు. ఈ ఇబ్బందులను ఎలాగో బ్రహ్మంగారు నెట్టుకొచ్చారు. ఆశ్చర్యకరమైన మహిమలు చూపించి నెగ్గుకొచ్చినట్టు అనంతరభక్తులు చెప్పుకొంటారు.

గ్రామీణ జనానికి బోధపడే భాషలో ఆశ్చర్యకరంగా హడలకొట్టే కాలజ్ఞానాన్ని కూడా బ్రహ్మంగారు చెప్పేవారు. అందుకే ఆయన పట్ల భయభక్తులు హెచ్చాయి. బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని గోవింద వాక్యాలు అంటారు. రెండేసి పాదాలకు ఒకసారి ''శివ గోవింద గోవింద! హరి గోవింద గోవిందా!'' అనే వంతపాట రావడంవల్ల వీటికి గోవింద వాక్యాలు అనే పేరు వచ్చింది. ఉదాహరణకు రెండు మూడు వాక్యాలు చూడండి.[8]

భారత భూమిని పాలనచేయ - పరదేశవాసులు వచ్చెదరూ
ఆరు పదివత్సరాలతియేకరీతిగా - అంబమొక్కతె అవనియేలేనుమా
ఉల్లిగడ్డలకు ఉపదేశమిచ్చేటి - కల్ల గురువులు కలిలో ఉండేరుమా
కల్ల గురువులనెల్ల కాలదన్నును యముడు - కల్లలేని వార్నీ గాచేనుమా
ఉత్తరదేశమున వైశ్యకులమున - ఉత్తమ గంధొకడు పుట్టేనుమా
హత్తుగనన్ని దేశంబులవారు - సత్తుగా పూజలు చేసేరుమా!
శ్వేతముఖుల ధూమశకటముల్ గల్పించి- భూతలంబుననినుప కమ్ములపై
సూత్రమెరిగి పశ్చిమోత్తరాదిశలందు ఘాత్రమ్ముగా నడిపించేనుమా.

ఈ గోవింద వాక్యాలను చూస్తే కుంఫిణీ పరిపాలనా, విక్టోరియా రాజ్యం, మహాత్మాగాంధీ జన్మం, ఇనుపదార్ల నిర్మాణం, రైలుబళ్లప్రయాణం మొదలైనవి ఎప్పుడో బ్రహ్మంగారు చెప్పినట్టు కనబడుతుందిగాని ఇదంతా భవిష్యత్పురాణ సంప్రదాయం. జరిగిపోయిన సంగతులను జరగబోయేటట్టు వివిధకాలాలలోని వ్యాసులు భవిష్యత్పు రాణంలో చేర్చుతారు. వివిధ ''బ్రహ్మం''గార్లు ఈ కాలజ్ఞానాన్ని ఇవాళదాకా ఉప బృంహణం చేస్తున్నారు. వీరశైవులలో కాలజ్ఞానాలు చెప్పే ఆచారం ఉంది. బసవ పురాణంలోని మడివాలు మాచయ్య, సిద్ధరామయ్య కాలజ్ఞానాలు చెప్పారు. ఎవరో సంగమేశ్వరుడు వీరప్పయ్యతో చెప్పిన కాలజ్ఞానం చక్కని వచనరూపంలో దొరుకుతోంది. (డి.2090-91). ఇందులో కంపిలిరాజ్యం, కుమారరాముని కథ, విజయనగర రాజుల విషయం వంటివి ఎన్నో ఉన్నాయి. ఈ సంప్రదాయంలోనే బ్రహ్మంగారు తమకాలంలో జరిగిపోయిన విషయాలనే జరగబోయే వాటిగా చెప్పారు కనుక అందులోని చరిత్రాంశాలను బట్టి బ్రహ్మంగారి కాలాన్ని నిర్ణయించవచ్చునని కొత్త భావయ్యాచౌదరి వంటి చరిత్రకారులు భావించారు.[9] ప్రక్షిప్తాలను ఏరివేస్తేనేగాని ఇది అసాధ్యం.

8. గోవింద వాక్యాలను ''బ్రహ్మంగారి నాటకం'' అనే గ్రంథం చివర కడియాల వీపూరయ్యగారు పొందుపరిచారు. రఘుపతి బుక్‌షాపు ప్రచురణ - తెనాలి (1961)
9. భారతి - సెప్టెంబరు - 1959

బ్రహ్మంగారి కాలనిర్ణయం చాలా సులభంగానే తేలుతుంది. ఆయన స్థాపించిన మఠాన్ని ఆతని దౌహిత్రుల సంతతివాళ్లు నడుపుతున్నారు. (సంసారైనా వకటి, సంసారము విడిచుంటే సంసారైనావకటి - అనేది బ్రహ్మంగారి తత్త్వం. ఆయన అయిదుగురు కొడుకులనూ, ఒక కూతుర్నీ కన్నారు). బ్రహ్మంగారి కూతురు వీరనారాయణమ్మగారి మనుమడి మనుమడు వెంకటేశ్వరస్వామి క్రీ.శ.1932లో మరణించాడు. బ్రహ్మంగారికి ఇతను ఆరో తరంవాడు. చారిత్రకులు తరానికి ముప్ఫయి సంవత్సరాలు లెక్కవేస్తారు. ఆ కాలమానం ప్రకారం చూస్తే బ్రహ్మంగారు 1752లో సమాధి అయి ఉండవచ్చు. లేదా మరో తరందాకా జీవించి ఉండవచ్చు. కుంఫిణీ యుగం ప్రారంభ దినాలలో ఆయన బ్రతికే ఉన్నారనీ, తత్త్వాలు వ్రాశారనీ భావించవచ్చు.

బ్రహ్మంగారి తత్త్వాల వరవడిలో లెక్కలేనన్ని ఇమిటేషను తత్త్వాలు బయలుదేరాయి. ఆయన చిల్లర మల్లర విగ్రహారాధనను ఇలా నిరసించారు.

చిల్లరరాళ్ళకు మొక్కుతు వుంటే
చిత్తము చెడునుర ఒరే ఒరే
చిత్తములోని చిన్మయ గురుని
చూచుచు నుండుట సరే సరే

ఈ తత్త్వంలోని ''ఒరే ఒరే'' అనే నీచ సంబుద్ధిని అనుకరిస్తూ ఎవరో కంబగిరి భక్తుడు ఇలా తత్త్వం చెప్పాడు.

రామభజన సేయరా లమిడీకా, నీ
తామస మణచరా ధగిడీకా!

ఈ సంబోధనలు ఇంతతో ఆగలేదు. ఎవరో సున్నపుగుంట రాఘవులు అనే ఆయన మరీ పచ్చి బూతులలోనికి దిగాడట.[10]

భాంచెత్తు నేనెంతో చెప్పిన
    చంచల ముడగవు ఛీ, తూ, మనసా!
మంచిగురుని సేవించి నానిక -
    మందు తెలిసి భుజియించవె భూత్తెరి! । భాంచెత్తు ।

బ్రహ్మంగారు మోటుమాటలు వాడినా ఇలా వాడలేదు. ఆయన రచనలతోపాటు ఆ సంప్రదాయంలోనివాళ్ళు రచనలన్నీ (ప్రాచీనులలో యాగంటివారి తత్త్వాలతోబాటు) ఒకచోటచేర్చి అనంతర భక్తులు భక్తిగా భద్రపరిచారు. బ్రహ్మంగారి తత్త్వాలు కర్ణాకర్ణిగా ఆంధ్రదేశమంతటా అల్లుకుపోయాయి. అందుకే వారి బాణీలో అనేక గేయ రచనలు పుట్టినా బ్రహ్మంగారి రచనలోని సొగసులు ఇతరుల పాటల్లో కనబడవు.

వాస్తవానికి బ్రహ్మంగారి ఇతర రచనలలో కూడా తత్త్వాలలోని జీవం లేదు. ఆయన తన శిష్యుడు సిద్ధయ్యను సంబోధిస్తూ ఒక శతకం చెప్పినట్టుంది. దీని ప్రతులు

10. ఈ తత్త్వాలన్నీ ''కాలజ్ఞాన తత్త్వాలు'' అనే పుస్తకం నుంచి ఉదాహరిస్తున్నాను. మద్రాసులోని ఎస్.వి.గోపాల్ అండ్ కో వారు (సి.వి. కృష్ణా బుక్ డిపోవారు కూడా) వీటిని ప్రచురించారు.

ఎక్కడున్నాయోగానీ బ్రహ్మంగారి జీవిత చరిత్రను వ్రాసిన ఒకరు రెండు పద్యాలను ఉదాహరించారు.[11]

అంతా బ్రహ్మమయంబని
సంతసనమున తిరుగువారు సర్వజ్ఞులు శ్రీ
కాంతుని కృపచే వారికి
చింతలు లేవయ్యా యోగసిద్ధులు సిద్ధా!

సంసారమందు నుండియు
సంసారము మిధ్య జేసి సర్వము తానై
సంసారంబును గెలచిన
సంసారే రాజయోగి సత్యము సిద్ధా!

ఈ సిద్ధశతకమేకాక బ్రహ్మంగారు ''హంసకాళికాంబ'' శతకాన్ని కూడా వ్రాసినట్లు ప్రతీతి. దీని ప్రతి ఒకటి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో ఉంది. దీనిలో వేమనగారి నడకలు. యాగంటివారి పోకడలు కనబడతాయి. చూడండి.

కూరసొర్రకాయ కుండలి నాడించు
పాడు నాగసారము పామువాడు
కోడెనాగు బాము కుండలి నాడురా
కాళికాంబ - హంస కాళికాంబ.

వింత వింత అడిత సంతకాయ చూడు
సంతకాయ వంక సగము చూడు
సగము సంతకాయ అంత వెదకి చూడు
కాళికాంబ హంస కాళికాంబ (డి.1823)

ఈ బాణీ పద్యాలలో ఎన్నింటికి కాళికాంబ కిరీటం తొలగించి ''విశ్వదాభిరామ వినురవేమ'' అనే మకుటం తరువాతవాళ్లు తగిలించి వేమన పద్యాలుగా చెలామణి చేశారో తెలీదు. బ్రహ్మంగారి పేరిట ఉండే శతకాలు పూర్తిగా అచ్చుపడితేనేగాని సంపూర్ణ పరిశోధన సాధ్యం కాదు. అయినా శతక రచయితగా కాక కాలజ్ఞాన తత్త్వము చెప్పిన గురువుగానే బ్రహ్మంగారికి పేరు అప్పుడూ, ఇప్పుడూ ఉంది. ఈయనకొచ్చినంత ప్రతిష్ఠ ఇతని శిష్యుడు సిద్ధప్పకు కూడా వచ్చింది.

ముడుమాల సిద్ధప్ప

బ్రహ్మంగారు మఠం స్థాపించిన కందిమల్లయపల్లికి ఆరేడు మైళ్లదూరంలో ముడుమాల అనే గ్రామం ఉంది. అక్కడ దూదేకుల పీరుసాహెబు, ఆదంబీబీ అనే దంపతులు ఉండేవారు. వాళ్ళకొడుకుపేరే సిద్దప్ప. ఇతడు తత్త్వచింతనతో బ్రహ్మంగారి

11. మన గురుదేవుడు బ్రహ్మంగారి సంక్షిప్త చరిత్ర కర్త - కొండూరి వీరరాఘవాచార్యులు. పుటలు 90-100.

శిష్యుడయ్యాడు. పుట్టిన మతాన్ని వదిలినందుకు పట్టినగురువును వదలనందుకు మహమ్మదీయులూ, హిందువులూ ఇతణ్ణి నానాబాధలు పెట్టారు. ముఖ్యంగా బ్రహ్మంగారి కొడుకులు పెట్టిన బాధలు ఇన్నీ అన్నీ కావు. అయినా అన్నింటినీ ఓర్చుకొని సిద్ధప్ప చరిత్రలోనే కాళ్లు నిలదొక్కుకున్నాడు. గురువుగారిలాగే ఇతడూ తత్త్వాలూ, కాలజ్ఞానాలూ వ్రాశాడు. కులమతవాదుల కుడిచెంప మీద ఎడంచేత్తో కొట్టినట్టు అతడు చెప్పిన ఈ తత్త్వం ఇప్పటికీ తెలుగుదేశంలో వివరమడిగితే

ఏ కులమని నను వివరమడిగితే
　　ఏమని తెల్పుదు లోకులకు
లోకులకు పలుగాకులకు
　　దుష్టులకు దుర్మార్గులకు
ఇంటిలోపల ఇల్లు గట్టుకొని - మంటలోపల రాటం పెట్టుక
కంటిలోపల కదురు బెట్టుకొని ముక్కులోపల యేకుబెట్టుకొని
చెవిలోబార చేతికి తీసుకు నారాయణయని నరము తీసుకొని
అష్టాక్షరియను తడిక వేసుకొని పంచాక్షరియన పంచదీసుకొని
తద్ధిమి తద్ధిమి గుబదెబ గుబదెబ - ఏకిన కులమే నా కులము

ఇలా ఏకుతూపోయి చివరకు ''అండపిండ బ్రహ్మాండంబెల్లను నిండియున్నది నాకులము'' అని సిద్ధయ చెప్పగలిగాడు. ఇతని తత్త్వాలలో ''సిద్ధగురు'' అనే ముద్ర ఉంటుంది. సిద్ధప్ప వచనాలు అనే పేర ఇతని రచనలు ఒక సంపుటంలో ఉన్నాయి. (ఓ.లై.13-13-23). ఇతర గేయ సంకలనాలలో కూడా ఇతని తత్త్వాలు కనబడతాయి. (డి.2523) బ్రహ్మంగారిలాగా ఇతడు వ్రాసిన కాలజ్ఞానాలు బహుశా బ్రహ్మంగారి గ్రంథంలో కలిసిపోయి ఉంటాయి. ఇతడేకాక బ్రహ్మంగారి మనుమరాలు ఈశ్వరమ్మ వ్రాసిన కాలజ్ఞానాలకు కూడా అంతే జరిగి ఉంటుంది.

పోతులూరి ఈశ్వరమ్మ

బ్రహ్మంగారి పెద్దకొడుకు పేరు గోవిందయ్య. ఇతని కూతురే ఈశ్వరమ్మ. ఈమె తాతగారిని ''జేజి నాయన'' అని పిలిచేది. (గాంధీజీని భారతదేశం బాపూజీ అని పిలుస్తున్నట్టు నేటికీ భక్తులు బ్రహ్మంగారిని ''జేజి నాయన'' అని పిలుచుకొంటారు). ఈశ్వరమ్మ చిన్నప్పుడు తాతగారితోనేకాక బ్రహ్మజ్ఞానంతో కూడా ఆడుకొన్నట్టుంది. పెద్దయ్యాక ''అఖండ బ్రహ్మవాదిని''గా కీర్తి ఆర్జించుకొంది. ఈమె వ్రాసిన తత్త్వాలు కొన్నీ, కాలజ్ఞానాలూ బ్రహ్మంగారి భక్తులలో ప్రచారం పొందాయి. ఈమె ఆమరణాంతం బ్రహ్మచారిణిగానే ఉండిపోయింది. దీనివల్ల లోకనిందకు పాలయింది. నిజానికి బ్రహ్మంగారి పద్ధతులు కొన్ని విప్లవకరాలే. ఆయన స్వయంగా రజస్వలానంతర వివాహం చేసుకొన్నారు. తాను సమాధి అయ్యాక తన భార్య పుస్తె పూసలు తీసెయ్యకూడదని హితోపదేశం చేశాడు. ఈ కారణాలవల్ల ఆయన మరణించాక చాలాకాలందాకా వాళ్లకాలంవాళ్లు బ్రహ్మంగారి కుటుంబాన్ని వెలివేశారు. కానీ ఈశ్వరమ్మలాంటి

దృఢచిత్తులు కాలానికి ఎదురీదారు. తనను తిట్టిపోసిన వాళ్ళనే ఈమె శిష్యుల్నిగా చేసుకొందిట.

బ్రహ్మంగారి శిష్యపరంపరలో చాలామంది తత్త్వాలు వ్రాశారు. వీటిలో బహుళ ప్రచారం పొందినవి ఒక సంపుటంగా మిగిలాయి. భాషా సంపద, భావ సంపద ఉంటే బాగుండుననిపించే రచనలే చాలా ఉన్నాయి. బ్రహ్మంగారిలాగా ''కాశీకి పోవలెనా - తీర్థము మోసుకు రావలెనా'' అన్నంత సూటిగాగాని, ''చెప్పలేదంటనక పొయ్యేరు'' అనే తత్త్వంలో ఎంత భయపెట్టినా చివరకు ఆశాభావం కలిగించడంగాని, వీళ్ల రచనలలో కనబడవు. సిద్ధప్పలాగ ''చందమామ చందమామ చందమామ - ఈ సంధి తెలిపి జ్ఞానులెవరె చందమామ'' అని ప్రశ్నలు కురిపించలేదు. ఈశ్వరమ్మలాగ ''అందమైన పూలు గోతామా! ఆత్మారాము పూజ చేతామా!'' అని సరళంగా పాడలేదు. నరసింహదాసు అనే శిష్యుడు పాడిన పద్ధతి చూడండి. ·

మాయను నరికే మర్మమున్నది
న్యాయము వినవే ఓ మనసా
కాయములోను పాయము గనుగొని
మేయవలె పరమే యో మనసా

అండపిండ బ్రహ్మాండము లన్నియు
కుండలివినవే యో మనసా
దండిభావమిది దారిజూపితి - నిక
ముండమోపివలె నుండక మనసా!

ఇలాంటి పడికట్టు మాటలతో దండి భావాలను రచయిత ఎంత చెప్పినా ముండమోపి మనస్సుకు నమ్మకం కుదరదు. బ్రహ్మంగారి బాణీలో తత్త్వాలు వ్రాసిన వాళ్ళకు బ్రహ్మజ్ఞానం ఎంత తెలుసో ఎవరికీ ఎన్నటికీ తెలియని రహస్యం. వేదాంత పరిభాషలోని ముక్కలను యధేచ్ఛగా వాడేస్తూ నాలుగు తత్త్వాలు వ్రాసిన వాళ్ళందరూ యోగులుకారు. మిత్రులు డాక్టరు బి. రామరాజుగారు అన్నట్టు ''అధికారులు బోధనకై, అనధికారులు సంతృప్తికై'' ఇలాంటి పాటలు పాడుకోడం ఆచారమైంది.[12] ఇలాంటి పాటలు పాడుతూ పామరులను బుట్టలో వేసుకొనే దొంగ సన్యాసులూ, గంజాయి యోగులు, బ్రతుకుతెరువు బైరాగులూ ఆంధ్రదేశంలోనే కాదు అన్ని భాషా ప్రదేశాలలో కనబడతారు. జలగల్లాగ జీవిస్తూ ఉంటారు. రచనల్లో ప్రతిభ లేకపోయినా జనసామాన్యంపై వీటి ప్రభావం అతీతంగా ఉంది. ఈ యుగంలోని తత్త్వాల ఇతర రచయితలలోని ప్రతిభావంతులు, అప్రౌఢులు చాలామంది ఉన్నారు. వాళ్ళ జాబితా చూడండి.

1. అప్పబ్రహ్మం
2. అహోబలదాసు
3. ఇందుకూరి ఇందుధరుడు
4. జక్కులేటి కంబగిరి
5. మల్లేపెద్ది కృష్ణబ్రహ్మం
6. తిరునగరి కృష్ణయ్య

12. తెలుగు జానపద గేయ సాహిత్యం. పుట. 366

7. కలువ కోటయ్యా
8. కోటయాచార్యులు
9. ఘంటయ్యా
10. చన్నయ్యా
11. తాడిచర్ల చలమయ్యా
12. గురు చెంచయ్యా
13. బాలదాసు నరసయ్యా
14. చిత్తూరు నరసింహదాసు
15. బొట్టా నరసింహదాసు
16. పరశురాముని నరసింహయోగి
17. తరిగొండ నరహరి
18. నాజరయ్యా
19. నారాయణ గురుడు
20. నారాయణపురం నారాయణదాసు
21. నారాయణ హరిదాసు
22. బాలకృష్ణదాసు
23. తరిగొండ భ్రమరాంబ
24. సున్నపుగుంట రాఘవులు
25. పూదోట రామన్న
26. మళలూరి విజయుడు
27. బరంపురం వీరప్పలదాసు
28. నూజివీటి వీరయ్యా
29. వొమళ్లూరి వీరరాఘవులు
30. కతారు వీరాస్వామి
31. శివరామ దీక్షితులు
32. శివలాలు
33. తాడిచర్ల శేషయ్యా
34. సత్సమప్పయ్యా
35. సుందరాచార్యులు
36. తరిగొండ సుబ్రహ్మణ్యం
37. చర్మపురి సూరయ్యా
38. మహమ్మదు హుసేనదాసు

ఈ తత్త్వాల రచయతల జాబితా ''కాలజ్ఞాన తత్త్వాలు'' ''ఆత్మ బోధామృత తత్త్వాలు'' అనే సంకలన గ్రంథాల నుండి తయారయింది. ఇందులో కొందరు ఇతరులకు గురువులు. కొందరు అందరికీ లఘువులు. వీళ్లలో మళలూరి విజయుడు వ్రాసిన తత్త్వం ఒకటి చాలా ప్రచారంలోనికి వచ్చింది. దీర్ఘమైన ఆ తత్త్వంలోని మొదలు చూడండి:

మొదలు మీదుగ తలలు క్రిందుగ మొలచియున్నది వృక్షము
మోదమలరగ మింటి మీదను మదగజము విహరించెరా
చిదిమి పట్టిన పండుకై ఒక చీమ యేనుగు మ్రింగెరా
సదయుడా మళలూరి రాఘవ సార్వభౌమ దయానిధే.

ఇది అష్టకాలబాణీలో వ్రాసిన తత్త్వం. ఇందులోని మళలూరు బహుశా కడప జిల్లా రాయచోటి తాలూకాలోని మల్లూరు కావచ్చును. ఇంతకన్నా ప్రచారం పొందిన తత్త్వం ''జీవులెనుబది నాల్గులక్షలు చావు పుట్టుకలిక్కడా'' అన్నది. దీనిని నారాయణ హరిదాసు వ్రాశాడు. హుసేనదాసు తత్త్వాలనేకాక ఇతర ప్రక్రియలను కూడా చేపట్టాడు. ఇతడు ''మోక్షవాస బిల్హణీయం'' అనే యక్షగానం వ్రాసినట్టూ, కడపజిల్లా అగువపల్లెలో ఉండేవాడనీ తెలుస్తుంది.[13] మిగతా రచయితలలో ఒకరిద్దరు గురించి తప్ప ఇతరుల వివరాలు తెలియవు. ఏ ఊరివాళ్ళో, ఎప్పటివాళ్ళో పరిశోధిస్తేగాని చెప్పలేం. పరశురామ నరసింహం బహుశా పరశురామ పంతులవారి కుటుంబంవాడు కావచ్చు. శివరామ దీక్షితులు కందార్థాలు వ్రాసిన భాగవతుల కృష్ణయ్యా గారి గురువు. తరువాత మన సాహిత్యంలో కందార్థలకు మంచి ప్రాచుర్యం ఉంది.

13. ఆంధ్రవాగ్గేయకార చరిత్ర - పుట. 458

భాగవతుల కృష్ణయ్య

ఆదిమ సమాజంలోని చిందుల నుంచీ పాటలలోంచీ పుట్టిన కవిత్వం రానురాను తెలుగు మీరిపోయి వృత్తాలలోనికి ఎక్కేసరికి ప్రజకు దూరమైంది. కవిత్వాన్ని రాగవరుసలో పాడడానికి తాళవరుసలో ఆడడానికి ఆస్కారం తక్కువైంది. అయినా ఊరువదలి పారిపోయిన వాళ్ళను వెదకి తీసుకొచ్చినట్టు పద్యాలను మళ్ళాపాటలుగా మార్చి ఆ వరుసలకు చిందులు వేసి ప్రయత్నాలు జరిగాయి. అవే అర్ధ పద్యాలు.

మన యక్షగాన వాఙ్మయంలో కందార్థాలూ, సీసార్థాలూ, గీతార్థాలూ, ద్విపదార్థాలూ అనే విభేదాలలో అర్ధపద్యాలు ఉన్నాయి. జాతి, ఉపజాతి పద్యాలకు మాత్రమేకాక వృత్తాలకు కూడా ఇవి వర్తిస్తాయి. మామూలుగా పద్యాన్ని గణబద్ధంగా వ్రాసి చివరమాత్రం కొన్ని అదనపు గణాలతోపాటుగా దాన్ని మార్చుతారు. మచ్చుకు తరిగొండ వెంకమ్మ గారి యక్షగానాల్లో ఒక కందార్థాన్ని చూడండి.

కృష్ణుడు సత్యభామతో అంటున్నాడు.

మరుడే యీ పుష్ప శరములు
జరుకు చురుక్కున నురమున సూటిగ నాటన్
తరళ్వ మధిక మాయెను
మరిమరి నన్నేచ దగదె

మరువపు మొలకా! కవుగిలీవె మన్మథు చిలకా!
తరిగొండపుర నారహరియైన శ్రీ శేష
గిరివాసుడగునన్ను కరుణించుచును మేలి
మరువంపు మొలకా కౌగిలీవె మన్మథు చిలకా!

ఈ కందార్థంలోని కందంలో నాలుగు పాదాలు గణబద్ధాలే. ఆఖరి పాదంలోని యతిస్థానం దగ్గర్నుంచీ పాట అవుతుంది. ఈ పాటలో మళ్ళా యతులూ, ప్రాసలూ, ప్రాసయతులు అన్నీ ఉన్నాయి. తరిగొండ వెంకమ్మగారు కాక చాలామంది ఈ అర్ధ పద్యాలను (సీసార్థాలు, గీతార్థాలు, ద్విపదార్థాలు కూడా) యక్షగానాలలో వాడారు.[14] గణబద్ధమైన భావాన్ని రాగ వరుసలో పాడి, పాట వచ్చేసరికి నాట్యం ప్రారంభించడం రివాజు.

యక్షగానాలలో వాడే ఈ ప్రక్రియను తీసుకొని తత్త్వాలకు బాగా వాడుకొన్నది భాగవతుల కృష్ణయ్యగారు. ఈయన 302 కందార్థాలలో అచలమతాన్నీ, శుద్ధ నిర్గుణ తత్త్వాన్నీ చెప్పాడు. యోగపద్ధతులనూ కర్మాచరణాన్ని నిరసించే బోధలు చేశారు. అయితే తెలుగులో చెప్పినందుకు తన కవిత్వాన్ని ఎవరూ నిరసించకుండా ఇలా ప్రశ్నించాడు.

14. ఇతర అర్ధ పద్యాల మచ్చులకు యస్వీ జోగారావుగారి యక్షగాన వాఙ్మయ చరిత్ర చూడండి. ప్రథమ భాగం పుట.264 (వెంకటేశ్వరులు అలమేలు మంగా సంవాదం ఉత్పలార్థంలో ఉందని డాక్టరు రామరాజుగారు వ్రాశారు. చూ. తెలుగు జానపద గేయ సాహిత్యం, పుట. 408).

ఇది యాంధ్ర కవిత్వంబని
మది రోయందగదు దీని మర్మమరయుడీ
పదియారువనన్నె పసిడిని
ముదమున తోల్పెట్టెనుంచ
ముట్టకుండుదురా లోకులు పట్టకుండుదురా
ఇదిగాక కులహీనుడిచ్చిన ద్రవ్యము
విదితముగానెంత వేదవేత్తలు గాని
ముట్టకుండుదురా లోకులు చేత పట్టకుండుదురా (కందార్థం నెం.14)

ఈ పదహారు వన్నె బంగారాన్ని తోలు పెట్టెలో పెట్టిన భాగవతుల క్రిష్ణయ్యాగారు తాము అవంతికి ప్రభువులమన్నారు.[15] ఆయన జమీందారులే. విశాఖపట్నం జిల్లా సర్వసిద్ధి తాలూకాలోని దిమిల గ్రామానికి భాగవతులవారు జమీందారులు. 1830లో ఏనుగుల వీరాసామిగారు కాశీయాత్ర చేస్తున్నప్పుడు భాగవతుల కిత్తన్నగారు ఎలమంచిలి దగ్గర ప్రత్యుత్థానం చేసి ఏనుగుల వారిని దిమిలకు తీసుకువెళ్ళారు.[16] ఈ ఊళ్ళో ఉండే బ్రాహ్మణులందరు వేదపారంగతులు. కిత్తయ్య అనేవారు జమీందారుడున్ను మంచి సాంప్రదాయకుడున్ను'' అని వీరాస్వామయ్య గారు వ్రాశారు. కృష్ణయ్యాగారినే లోకులు కిత్తయ్య అంటారు.

దిమిలె జమీందారులైన వెంకన్నగారికి నలుగురు తమ్ముళ్ల ఉన్నారు. వాళ్ళలో ఒకరు వీరాస్వామయ్యాగారికి ఆతిథ్యమిచ్చిన కిత్తయ్యాగారు. కందార్థాలను వ్రాసినవారు బహుశా వెంకన్నగారి పెద్దకొడుకు విశ్వంభరంగారి సంతతిలో వారు కావచ్చును.[17] కందార్థాలలో తమ తండ్రి నారాయణ యోగి అని, తమ తల్లిపేరు జానకమ్మ అని కందార్థాల కృష్ణయ్యాగారు చెప్పారు. ఈయన ఎప్పుడు దిమిలె విడిచిపెట్టి తెలంగాణా ప్రాంతాలకు వెళ్ళారో తెలియదు. వీరి కందార్థాలను అచలవారును, ముఖ్యంగా తెలంగాణాలోని వాళ్లు వల్లెవేస్తూ ఉంటారు. (బహుశా ఈ కృష్ణయ్యాగారితోబాటే వీరి మిత్రులు దివిలె నరసరాజు, పుల్లమరాజు అనే భక్తులు తెలంగాణాకు వచ్చి ఉంటారు. ఈ భక్తుల గేయాలు స్థానికప్రచారం పొందాయని డాక్టరు రామరాజుగారు చెప్తున్నారు.[18]

కృష్ణయ్యాగారు సంస్కృతంలో మాఘందాకా, తెలుగులో అప్పకవీయం మొదలైనవి చదువుకొన్నారు. ''దేశాటనంబుచేసితి వ్రాసితి గ్రంథములు కొన్ని'' అని చెప్పారు. అయితే ఈయన వ్రాసిన ఇతర గ్రంథాలు ఏమిటో తెలియవు. ఈ కందార్థాలను మాత్రం దా.శ.1765 అంటే క్రీ.శ.1843లో పూర్తిచేశారు. ఈ శుద్ధ నిర్గుణ తత్త్వంలో ఈయన ఏమిటి

15. బహుశా ఈ మాట ''అవంతికి ప్రభువైనాను'' అని చెప్పి ఉంటారు. భాగవతులవారి ఆడపడుచులలో చాలామందికి అనంతమ్మ అన్న పేరు సర్వసాధారణం.

16. కాశీయాత్ర చరిత్ర - (దిగవల్లివారి ప్రచురణ). పుట. 334

17. వెంకన్నగారి రెండో కొడుకు రాజశేఖరంగారు మా ముత్తాతగారి తండ్రిగారు. ఈ రాజశేఖరంగారికి కూడా ఒక చిన్ని ''కృష్ణ'' మాధవదాసు అనే హరిదాసు గారు అనే కుమారులు ఉన్నారు. ఈయన యౌవనంలో ఇల్లు విడిచి కడప, కర్నూలు ప్రాంతాలలో సంచరించి సంకీర్తనలు చేసేవారు. ఈయన కందార్థాల కృష్ణయ్యాగారి వరవడినే అనసరించి దేశ సంచారం చేసినట్టుంది.

18. తెలుగు జానపద గేయ వాఙ్మయం - పుట.372

విశదపర్చినదీ మిత్రులు బిరుదురాజు రామరాజుగారు చాలా విపులంగా తమ గ్రంథంలో వివరించారు.[19] ఈ కందార్థాలను చందా నారాయణ శ్రేష్ఠి కంపెనీవారు చాలాసార్లు అచ్చువేశారు. అచలమతాన్ని సరళభాషలో వివరించే కొద్ది పుస్తకాలలో ఇదొకటి కావడం దీని ప్రత్యేకతలలో ఒకటి.

అయితే ఇటువంటి సాహిత్యాన్ని సృష్టించిన ఇతరులు కొందరు లేకపోలేదు. ఆ పాటలలోని కొన్ని పల్లవులు దేశంలో అల్లుకుపోయాయి. ఈ వేదాంత కీర్తనలు వ్రాసినవాళ్ల ప్రదేశ కాలాదులు ఇంకా కచ్చితంగా నిర్ణయించలేదు. వీళ్లందరూ కుంఫిణీ యుగంలోనో, జమీందారీ యుగం తొలిరోజులలోనే ఉండి ఉంటారు. చెల్లాచెదురుగా ఉన్న ఈ రచనలన్నింటినీ ఒకచోట సంకలనం చేశాకగాని ఈ సాహిత్యశాఖలోని పువ్వులెన్నో చెప్పలేం. ప్రస్తుతం ఈ జాబితాతో సరిపెట్టుకోవాలి.

గుజ్జుల నారాయణదాసు	-	తారకామృతసారం
బేతపూడి పరబ్రహ్మదాసు	-	బ్రహ్మానంద కీర్తనలు
యల్లమ్మదాసు	-	గురుజ్ఞానామృతం
అల్లూరి రాజేశ్వరం	-	శ్రీరామగీత
చెంచురామయ్య	-	శ్రీరామనామ మాహాత్మ్యం
గొల్లపూడి రామలింగశాస్త్రులు	-	శివైకాంత సేవ
సాయం వరద దాసు	-	నమశ్శివాయ గేయామృతం
తోట వెంకటదాసు	-	సోహంభావ తత్త్వాలు (ఆర్.260)
వేదపన్నాల సుందరయ్యగారి కొడుకు	-	వేదాంత కుచ్చెల కథ
బీబీపేట హనుమాయమ్మ	-	జ్ఞాన బోధామృతం
?	-	నారాయణ శతకం

ఈ జాబితాలోని శతకాలు పద్య శతకాలు కావు. గేయ శతకాలు. రెండేసి పాదాలకు ఒకసారి మకుటం వస్తుంది.

ఇన్ని వేదాంతకీర్తనలు దేశంలో మారుమ్రోగినా వీటిలో కొన్ని పరస్పర ప్రతిధ్వనులు. మామూలు మాటలలో చెప్పాలంటే కొన్ని ఎంగిలి పాటలు, అయితే ప్రపంచంలో ఎంగిలి కానిది ఏముంది? ఎవరు వ్రాశారో గాని ఈ గేయంలో భక్తుని జాలిబాధ కనబడుతోంది.

గంగజలములు తెచ్చి నీకు
లింగపూజలు చేతమంటే
గంగలోని చేపపిల్లలు
ఎంగిలంటున్నాయి లింగా!
పారిజాతము తెచ్చి నీకు
పాదపూజలు చేతమంటే

---

19. తెలుగు జానపద గేయ వాఙ్మయం, పుటలు 408 నుండి 412.

కొమ్మ కొమ్మకు కోటి తుమ్మెద
లెంగిలంటున్నాయి లింగా!

ఈపాటలో ఉన్న రసం ఇతర తత్త్వ కీర్తనలలో కనిపించదు. నిజానికి రసం కోసం వీటిని చదవకూడదు. కవిత్వం ఎగిరిపోయిన ఈ సాహిత్యం చదివినప్పుడు ''గూట చిలకేదిరన్నా! చిన్నన్న గూడు చినబోయెరా!'' అని పాడుకోక తప్పదు.

అయితే ఈ ఉత్తగూడు కూడా లోపిస్తే ఇల్లు చిన్నబోతుంది!

పురాణాలూ - మాహాత్మ్యాలు

మన పురాణాలు ప్రాచీన విజ్ఞాన సర్వస్వాల సంపుటాలు. ప్రపంచం పుట్టుక దగ్గర్నుంచి, ప్రపంచంలో మానవుడు నడుచుకోవలసిన విధానందాకా ఎన్నెన్నో విషయాలను పురాణాలు వివరిస్తాయి. హిస్టరీ, జాగ్రఫీ, సివిక్సు ఒకటేమిటి ఎన్ని విభాగాల విజ్ఞానముందో అన్నీ పురాణాలలో కనబడతాయి. ఇక కథల సంగతి చెప్పక్కరలేదు. భారతీయసాహిత్యాలలోని ప్రాచీన గ్రంథాలన్నింటికీ పురాణగాథలే ఆధారం. మన తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధ ప్రబంధాలన్నీ పురాణాల లోంచే ముడిసరుకును తీసుకొన్నాయి. మాటవరసకు అల్లసాని పెద్దనగారి మనుచరిత్రకు మార్కండేయ పురాణంలోని కథ ఆధారం. తెనాలి రామకృష్ణుడు తన పాండురంగ మాహాత్మ్యానికి స్కాందపురాణమే ఆధారమని చెప్పాడు. రాయలవారు ఆముక్తమాల్యదలోని కొన్నికథలను విష్ణుపురాణం నుండి తీసుకొన్నారు. చాళుక్యయుగంనుండి ఈ కుంఫిణీ యుగం దాకా వెలుగు చూసిన తెలుగు కావ్యాలను పురాణాల వారీగా వర్గీకరించడం సాధ్యమే.

సంప్రదాయం ప్రకారం మనకు పద్దెనిమిది మహాపురాణాలూ, పద్ధెనిమిది ఉప పురాణాలూ ఉండాలి. అయితే వాస్తవానికి ఇరవై రెండు మహా పురాణాలూ, లెక్కతేలనన్ని ఉపపురాణాలూ కనపడుతున్నాయి. కొందరు మహాపురాణాలే ప్రామాణి కాలనీ, ఉపపురాణాలు అంత నమ్మదగ్గవి కావని భావిస్తారు. అయితే పురాణ సాహిత్య పరిశోధకులు మాత్రం ఉపపురాణాలను కొట్టిపారెయ్యరు. మహాపురాణాలకన్నా ఉపపురాణాలే కొన్ని ప్రాచీనమనీ, ప్రామాణికమనీ చెప్తారు.[1] మన తెలుగు సాహిత్యంలో మొట్టమొదట ఉపపురాణం తెనిగించడంలోనే పురాణ వాఙ్మయశాఖ ప్రారంభమవుతోంది. వేములవాడ భీమకవి నరసింహపురాణం అనువదించినట్టు ప్రతీతి. ఉపపురాణాల జాబితాలను ఇచ్చే అన్ని గ్రంథాలూ నరసింహపురాణాన్ని పేర్కొన్నాయి. మన తెలుగుకవులకు మహాపురాణం, ఉపపురాణం అనే భేద బుద్ధి ఉన్నట్టు కనబడదు. ఏ పురాణానికైనా కొన్ని లక్షణాలు ఉంటాయి. ''పురాణం పంచలక్షణం'' అన్నాడు అమరసింహుడు. నామలింగానుశాసనంలో అతడు ఇలా నిర్వచనం చేశాడు.

1. R.C. Hazra : Studies in the upapuranas. P. iii

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ
వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణం (అమరం: 1-162)

ఈ లక్షణాల ప్రకారం ప్రతిపురాణంలో

1. సర్గ (అంటే ప్రపంచోత్పత్తి)
2. ప్రతిసర్గ (అంటే బ్రహ్మాదులు చేసే ఉత్పత్తి)
3. వంశం (దేవతల, పితృదేవతల వంశ వృక్షాలు)
4. మన్వంతరాలు (అంటే పద్నాలుగు మంది మనువులు భూమిని ఏలారు. వాళ్ళకాలంలోని ముచ్చటలు.)
5. వంశాను చరిత్ర (అంటే సూర్యచంద్ర వంశాల రాజుల జాబితాలు; ఘనకార్యాలు)

అనేవి విధిగా ఉండాలి. అయితే కొన్ని పురాణాలలో ఇవేకాక భార్యభర్తల సంబంధం, అత్తమామలను సేవించడంవల్ల వచ్చే ఫలితాలు మొదలైనవి చెప్తాయి. (విష్ణుపురాణం) మరికొన్నింటిలో ధనుర్వేదం, ఆయుర్వేదం వంటివి ఉంటాయి. (అగ్నిపురాణం). చాలా పురాణాలు వర్ణాశ్రమ ధర్మాలు, సదాచారాలు, వ్రతోపవాసాలు, తిధికల్పాలు, దానధర్మాలు, రాజధర్మాలు, తీర్థమహిమలు, శ్రాద్ధవిధులు దేవార్య పూజనలు మొదలైనవి బోధిస్తాయి. ఈ విషయాలకూ, అమరసింహుడు చెప్పిన పంచ లక్షణాలకూ వేలు విడిచిన చుట్టరికం కూడా లేదు. అందుచేత భాగవత పురాణ రచనాకాలం నాటికి పురాణాలకు దశలక్షణాలు వచ్చాయి.[2] దీని ప్రకారం పురాణాల్లో ఈ పదీ ఉండాలి.

1. సర్గ	6. వంశం
2. విసర్గ	7. వంశానుచరితం
3. వృత్తి	8. సస్థ
4. రక్ష	9. హేతు
5. అంతరం	10. అపాశ్రయం

ప్రపంచంలో ఉండే ఏవిషయాన్నైనా ఈ పదింటిలో ఇమిడిపోవచ్చును. మానవ జీవితానికి కావలసిన శాస్త్రవిషయాలను పురాణాలలో మన ఆదిమ ఋషులు చేర్చేవారు. ఋషిప్రోక్తాలు కాబట్టే పురాణాలను కూడా వేదాలలాగే ప్రమాణదృష్టితో చూసేవారు. నిజానికి మనకు వేదకాలంలో కూడా పురాణసాహిత్యం ఉంది. అధర్వవేదం పురాణాన్ని పేర్కొంది. (11-7-24). ఉపనిషత్తులు పురాణ ప్రాముఖ్యాన్ని శ్లాఘిస్తాయి (ఛాందోగ్యం 7:12) వేదకాలం నాటిపురాణ సంహితలో 4వేల శ్లోకాలు మాత్రమే ఉండేవి. అవి ''ఇంతింతై, వటుడింతై'' అన్నట్టు పెరిగి, పెరిగి; పెరిగి, పెరిగి ఇవాళ కొన్ని లక్షల శ్లోకాలుగా పరిణామం చెందాయి. (18 మహా పురాణాలలోని శ్లోకాలు 4,11,000 అని లెక్క తేలుతున్నాయి. ఉపపురాణాల శ్లోక సంఖ్య అంచనా కట్టడం ప్రస్తుతమేకాదు. ఎప్పుడూ సాధ్యం కాదేమో).

2. గజపతుల యుగం, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటి, 2002

పురాణాలలో ఎన్ని లక్షల శ్లోకాలున్నా అన్నీ వ్యాసులవారే వ్రాసినట్టు చెప్పుకోవడం రివాజు. వ్యాసుడు అన్న పదానికి ఇవాళ ఎడిటరే అనే అర్థం చెప్పుకోవాలి. వేదకాలంనాటి పురాణ సంహిత క్రమేణా మానవ నాగరికతతోపాటు భారతదేశంలో పెరిగింది. రాజుల సభల్లోని సప్తాంగాలలో పౌరాణికుడు ఒకడు. పౌరాణికుల్లో రెండు రకాలు ఉన్నారు. ఒకరు కేవలం వాచకులు. రెండోవాళ్ళు ఉపబృంహకులు. వాచకులు కేవలం సంప్రదాయ సిద్ధమైనవి చదివి చెప్తారు. ఉపబృంహణులు కొత్తవాటిని పాత పురాణాల్లో చేర్చి కొత్త ఎడిషన్లను తయారుచేస్తారు. అసలు ''ఉపబృంహణం'' అన్నమాటకు చక్కగా పెంచడం అనేదే అర్థం. ''ఇతిహాస పురాణాభ్యాం వేదం సముప బృంహయేత్'' అనే ఆదేశాన్ని బట్టి ఇలా పెంచడం ఆదికాలంలో శిష్టజనామోదాన్ని పొందింది.[3]

మిగతా పురాణాలకన్నా భవిష్యత్పురాణం ఎక్కువగా ఉపబృంహణం చేసింది. వాయు, బ్రహ్మాండ, విష్ణు, భాగవత పురాణాలలో వంశాను చరిత్ర గుప్త వంశోదయం దాకా చెప్పారు. అక్కడ నుంచీ భారత దేశాన్ని పాలించే రాజుల చరిత్రను సూతుడు చెప్పాడు. ఈ విషయంలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు ఏం వ్రాశారో చూడండి.[4]

''భవిష్య పురాణము యొక్క వేరువేరు ప్రతులలో వేరువేరువిధముల భవిష్యరాజుల పేళ్ళుండుటయేకాక బొంబాయి ప్రతిలో చంద్రగుప్తుడు సెల్యూకస్ కూతురును వివాహమాడుటయు భర్తృహరి, విక్రమపాణి, జీసస్‌క్రైస్టు, పృధ్వీరాజు, తిమిరలింగ (తైమూరు), శంకరాచార్య, మధ్వాచార్య, రామానంద, కబీరుదాసులును అక్బరు, ఔరంగజేబు, శివాజి, నాదిర్‌శాహ మొదలయినవారును వర్ణింపబడినారు. ఇంతతో నాగలేదు. ఇంగ్లీషువారు వర్తకమునకై యీ దేశమునకు వచ్చుటయు, కలకత్తా నగరము గట్టుటయు మొదలయిన చరితమును, చివరకు వికటాపతియను పేరిట విక్టోరియా ప్రభుత్వమును చేర్చబడి పురాణమిప్పటి కాలము వరకును (అప్టుడేటు) తేబడినది. (వెంకటేశ్వర చాపాఖానా కూర్పు ప్రతి సర్గ పర్వమందలి 1-4 ఖండముల జూడుడు). విక్టోరియా కనబడిన ఋషియొక్క దివ్యదృష్టికి నేలకో ఎడ్వర్డు పంచమ జార్జి కనబడలేదు. ఇప్పుడీ పురాణమచ్చెయ్యెగాన నికనాపేళ్ళిందు జేరుట దుర్లభము! (ఈ భాగము పురాణములో జేర్చినవానికి నింగ్లీషు భాషకూడా గొంత వచ్చినట్లు కానవచ్చుచున్నది. అతడు ఇంగ్లీషు వారిని గరుండులన్ని చెప్పి ఆ భాషా పదములను ఇట్లు దాహరించెను. ''రవి వారేచ సండేచ, ఫాల్గునే చైవ ఫర్వరీ షష్టి స్సిక్‌స్టీతి జ్ఞేయా తదుదాహరణ మీరితమ్.'' ప్రతి సర్గ 7-32).

ఈ భవిష్య పురాణాన్ని చెప్పిన సూతుడే ఇంగ్లండు దేశ చరిత్రను కూడా వ్రాసినట్టు ఉంది. మిత్రులు నేలనూతల శ్రీ కృష్ణమూర్తిగారి దగ్గర ''నర్మబృంద'' అనే సంస్కృత పురాణం అచ్చుప్రతి ఉంది. ఇంగ్లండును నార్మను రాజులు పాలించిన చరిత్ర అందులో

3. వాసుదేవ అగ్రవాలాగారు ఉదాహరించారు. మత్స్యపురాణ-ఎ స్టడీ బై వి.ఎస్.అగ్రవాల, పి.వి. వారణాసి (1963)

4. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం (ఆంధ్రపత్రిక, 3వ సంపుటం, పుట 13) పురాణాలమీద ఇంత విపులమైన ప్రామాణిక వ్యాసం ఇంకొకటి నేను తెలుగులో చూడలేదు.

ఉంది. ఎవరు వ్రాశారోగాని ఇలాగ ఉపబృంహణం చేసుకొంటూ పురాణశాఖను వికసింపచేయడం సంప్రదాయం ప్రకారం చూసినప్పుడు మంచిదే.

అయితే ఈ ఉపబృంహణం రానురాను సమాజ సంక్షేమాన్ని విస్మరించి కొద్ది వర్గాల వారి వ్యక్తిగత ప్రయోజనాలకు దారితీసింది. వేదకర్మలమీద జనానికి నమ్మకం పోతున్న రోజులలో జనసామాన్యాన్ని తమ ప్రభావంతో నిలుపుకొనడానికి స్మార్త బ్రాహ్మణులు వివిధ పురాణాలను సృష్టించారని పరిశోధకుల అభిప్రాయం.[5] ఈ స్మార్తులలో వివిధ వర్గాలవాళ్ళు ఉన్నారు. పంచరాత్రులు, పాశుపతులు, బ్రహ్మ విద్యావేత్తలు వగైరాలవాళ్ళు తమతమ సిద్ధాంతాలకు అనువుగా పురాణాలను రూపొందించారు. కొన్ని పురాణాలు శివుని గొప్పతనం చెప్పాయి. కొన్ని విష్ణువు మహిమ చాటుతాయి. కొన్ని దేవి అసలు కారణమంటాయి. కొన్ని సూర్యుని ప్రస్తుతిస్తాయి. ఆయా సిద్ధాంతాల ఘాటుని బట్టి మన పురాణాలను సాత్త్విక, తామస, రాజస పురాణాలని మూడు గుణాలవారీగా వర్గీకరించారు. పురాణంలోని ప్రతి ఒక్క కథకూ ఫలశ్రుతి చెప్పారు. ఫలానా ఫలం కావాలంటే ఫలానా నోము నోచమన్నారు. ఫలానా గంగలో. మునిగితే ఫలానా పాపం పోతుందన్నారు.

ఈ అన్నవాళ్ళ పేర్లు మనకు తెలియవు. ఏమంటే ప్రతి పురాణాన్నీ వ్యాసుడు వ్రాస్తే దాన్ని సూతుడు నైమిశారణ్యంలో శౌనకాది మహామునులకు చెప్తాడు. (నిన్నగాక మొన్న వానమామలై వరదాచార్యులుగారు వ్రాసిన పోతన చరిత్రను కూడా సదరు సూతుడే! సదరు శౌనకాది మహామునులకు చెప్తాడు.) అయితే ఒక్కొక్క పురాణం ఒక్కొక్క కల్పంలో పుడుతోంది. కల్పమంటే బ్రహ్మదినం. మానుష్యమానంలో నాలుగు యుగాలు ఉన్నాయి. కృత, త్రేత, ద్వాపర, కలియుగాలు నాలుగూ కలిసి 43 లక్షల 20వేల సంవత్సరాలవుతాయి. ఇలాంటి చతుర్యుగాలు వేయిసార్లు తిరిగివస్తే బ్రహ్మకొక దివారాత్రం అవుతోంది. అంటే 432 కోట్ల మానవ సంవత్సరాలు ఒక బ్రహ్మకల్పం అన్నమాట! పగటి పూట మాత్రమే బ్రహ్మ వర్కు చేస్తాడు. రాత్రి రెస్టు. మానుష్య మాసంలోలాగే బ్రహ్మమాసంలో కూడా ముప్ఫయిరోజులే ఉన్నాయి. (సత్యలోకంలో కుంఫిణీవాళ్ళు వర్తకానికి వెళ్ళి ఇంగ్లీషు నెలలను ప్రవేశపెట్టలేదు కాబోలు). బ్రహ్మగారి మాసంలో ఒక్క రోజుకు ఒక్కొక్క పేరు ఉంది. మొదటి దాన్ని శ్వేత వరాహకల్పం అంటారు. రెండోదాన్ని నీల లోహితం అంటారు.[6]

ఒక్కొక్క బ్రహ్మకల్పంలో 14 మన్వంతరాలు ఉంటాయి. ఒక్కొక్క మనువు 71 చతుర్యుగాలపాటు పెత్తనం చెలాయిస్తాడు. ఏయే కల్పాలలో ఏయే పురాణాలు పుట్టాయో కూడా ఆ పురాణాలలోనే ఉన్నాయి.

---

5. R.C. Hazra Studies in upapuranas - p.20

6. బ్రహ్మకల్పాలపేర్లు : 1. శ్వేతవరాహం, 2. నీలలోహిత, 3. వామదేవ, 4. రథంతర, 5. రౌరవ, 6. దేవ, 7. బృహత్, 8. కందర్ప, 9. సత్య, 10. ఈశాన, 11. తమః 12. సారస్వత, 13. ఉదాన, 14. గారుడ 15. కూర్మ, 16. నారసింహ, 17. సమాన, 18. ఆగ్నేయ, 19. సోమ, 20. మానవ, 21. తత్పురుష, 22. వైకుంఠ, 23. లక్ష్మి, 24. సావిత్రీ, 25. అఘోర, 26. వరాహ, 27. వైరాజ, 28. గౌరీ, 29. మహేశ్వ, 30. పితృ (వీటిలో మొదటి 15 శుక్ల పక్ష తిథులు, మిగతావి కృష్ణపక్ష తిథులు; మత్స్య పురాణం 290వ అధ్యాయం)

నిజానికి ఏ పురాణం ఎప్పుడు పుట్టిందో కాలనిర్ణయం చేయాలని ఆధునికులు ప్రయత్నిస్తున్నారు. ఈ కుంఫిణీయుగంలో మొట్టమొదట తెల్లవాళ్ల మన పురాణాలను సేకరించి అంతరంగిక సాక్ష్యాన్ని బట్టి వాటి వయస్సులు కనుక్కుందామని చూశారు. వాళ్ళలో వాన్సు కెన్నడీ, హొరాస్ హేమన్ విల్సన్ పండితులు ముఖ్యులు. కెన్నడీ (క్రీ.శ. 1784-1846) సిమ్లా కొండలలో కుంఫిణీవారి ఏజెంటుగా 1816 నుంచీ ఉండేవాడు. ఇతడు ఎన్నో పురాణాల వ్రాతప్రతులు సంపాదించి ''ఏన్షెంటు హిందూ మైథాలజీ'' అనే గ్రంథాన్ని వ్రాశాడు. (ఇతని ఇంకో గ్రంథం ''వేదాంత ఫిలాసఫీ ఆఫ్ హిందూస్'') కెన్నడీకన్నా ఇవ్వాళ విల్సను పండితుడే ప్రసిద్ధుడు. విల్సను (1786-1860) గొప్ప సంస్కృత నాటకాలపై పరిశోధన వ్యాసాలు వ్రాశాడు. విష్ణుపురాణాన్ని ఆంగ్లీకరించాడు. ఈ తర్జుమా సాధారణమైన ముక్కశ్యముక్క అనువాదం కాదు. ప్రతి శ్లోకాన్నీ ఇతర పురాణాలతో తైపారువేసి తులనాత్మక జ్ఞాపికలతో అనువదించాడు. పెద్ద పీఠికలో భారతీయుల పురాణ వాఙ్మయచరిత్రను వ్రాశాడు. పద్దెనిమిది పురాణాలసారాన్ని వివరించాడు. మన పురాణ వాఙ్మయానికి ఈ తెల్లదొరలు చేసిన అపారమైన సేవకు ధన్యవాదాలు చెప్తూ నేడు ఆధునిక భారతీయ విద్వాంసులు బహుముఖ పరిశోధనలు చేస్తున్నారు. (కొన్నిచోట్ల అంగీకరిస్తున్నారు. కొన్నిచోట్ల నిర్మొహమాటంగా ఖండిస్తున్నారు). ఒకవంక తెల్లవాళ్ళు ఇలాగ మనపురాణాలను అనువదిస్తూ ఉంటే భారతీయులు, ముఖ్యంగా ఆంధ్రులు కూడా ఈ యుగంలో ఎన్నో పురాణాలను తెనిగిస్తూ వచ్చారు. ఈ యుగం పూర్తయ్యేసరికి ఒక్క అగ్నిపురాణం తప్ప తక్కిన పురాణాలన్నీ రమారమీ తెలుగులోకి వచ్చాయి. చాళుక్యయుగం నుంచి కుంఫిణీ యుగందాకా ఏ పురాణాన్ని ఎందరు అనువదించారో వివరంగా చెప్పుకోవచ్చు. పనిలోపని జమిందారీ యుగంలోనూ ఆధునికయుగంలోనో పురాణ ''పండా''లపేర్లు కూడా చెప్పుకొందాం. అన్నట్టు పురాణాలకు ఆంధ్రానువాదాల గురించి తెలుసుకొనే ముందు అసలు పద్దెనిమిది మహాపురాణాలు ఏమిటో, అవి ఏ దేవుళ్ళ ఘనతను ప్రశంసిస్తాయో, అందులో ఎన్ని శ్లోకాలు ఉండాలో, ఉన్నాయో మొదలైన సాధారణ వివరాలు తెలుసుకొనడం అవసరం. ఈ భోగట్టాలను పట్టికలో చూడండి.

వరుస సంఖ్య 1

పేరు	:	బ్రహ్మపురాణం
పారమ్యం	:	సౌర, విష్ణు పారమ్యాలు
గుణం	:	రాజసం
కల్పం	:	బ్రహ్మకల్పం
ఎవరి ప్రోక్తం	:	మత్స్యపురాణంలో చెప్పినట్టు దీనిని బ్రహ్మ మరీచికి చెప్పలేదు. దక్షునికి చెప్పాడు.
విభాగాలు	:	రెండు ఖండాలు
శ్లోక సంఖ్య	:	10,000 శ్లోకాలు. ఉత్తర ఖండంలో మూడువేలు. అచ్చులో 13,783
ఇతర వివరాలు	:	జగన్నాథ క్షేత్రమాహాత్మ్యం. ఎక్కువ. క్రీ.శ. 13వ శతాబ్దిలో ఈ పురాణ రచన జరిగిందని విల్సన్ అభిప్రాయం.

వరుస సంఖ్య 2

పేరు	:	పద్మపురాణం
పారమ్యం	:	విష్ణు
గుణం	:	సాత్త్వికం
కల్పం	:	వరాహకల్పం
ఎవరి ప్రోక్తం	:	ఫలస్త్యునికి బ్రహ్మ చెప్పినది.
విభాగాలు	:	5 ఖండాలు. 1.సృష్టి, 2. భూమి, 3. స్వర్గం, 4. పాతాళ, 5. ఉత్తరఖండాలు. క్రియా యోగసారం ఆరో ఖండం (?)
శ్లోకసంఖ్య	:	55,000 శ్లోకాలు. అచ్చులో 42,452
ఇతర వివరాలు	:	పాతాళ ఖండంలో కాళిదాసు రఘువంశంలోని శ్లోకం ఉంది. పంచ లక్షణాలు లేవు. క్రీ.శ. 12వ శతాబ్దికన్నా ప్రాచీనం కాదు.

వరుస సంఖ్య 3

పేరు	:	విష్ణుపురాణం
పారమ్యం	:	విష్ణు పారమ్యం
గుణం	:	సాత్త్వికం
కల్పం	:	వరాహకల్పం
ఎవరి ప్రోక్తం	:	పరాశరుడు మైత్రేయునికి
విభాగాలు :		
శ్లోకసంఖ్య	:	23,000 శ్లోకాలు ఉండాలి. అచ్చులో 7000.
ఇతర వివరాలు :		

వరుస సంఖ్య 4

పేరు	:	వాయు
పారమ్యం	:	శివ
గుణం	:	తామసం
కల్పం	:	శ్వేతకల్పం
ఎవరి ప్రోక్తం	:	ఋషులకు వాయుదేవుడు చెప్పాడు.
విభాగాలు	:	నాలుగు పాదాలు 1. ప్రక్రియ, 2. ఉపోద్ఘాత, 3. అనుషంగ, 4. ఉపసంహారం
శ్లోక సంఖ్య	:	24,000 శ్లోకాలు. అచ్చులో 10,991
ఇతర వివరాలు	:	ఇదే శివ పురాణమని కొందరు భావిస్తారు. భాగవతం శివ పురాణాన్ని పేర్కొంటుంది. వాయువుని చెప్పదు.

వరుస సంఖ్య 5

పేరు	:	భాగవతం
పారమ్యం	:	విష్ణు
గుణం	:	సాత్త్వికం
కల్పం	:	సారస్వత కల్పం
ఎవరి ప్రోక్తం	:	శుకుడు పరీక్షిత్తుకు చెప్పినది

విభాగాలు : పన్నెండు స్కంధాలు
శ్లోక సంఖ్య : 18,000
ఇతర వివరాలు : దీన్నికాక దేవి భాగవతాన్నే మహాపురాణంగా పరిగణించాలని కొందరి మతం. రెండు భాగవతాలనూ స్కాందం ఉపపురాణాలు గానే జమకట్టింది.

వరుస సంఖ్య 6

పేరు : నారద
పారమ్యం : విష్ణు పారమ్యం
గుణం : సాత్త్వికం
కల్పం : బృహత్ కల్పం
ఎవరి ప్రోక్తం : నారదుడు ఋషులకు చెప్పాడు
విభాగాలు : రెండు భాగాలు
శ్లోక సంఖ్య : 25,000. అచ్చులో 17,700
ఇతర వివరాలు : బృహన్నారదీయం అనేది ఉపపురాణం

వరుస సంఖ్య 7

పేరు : మార్కండేయ
పారమ్యం : దేవి
గుణం : రాజసం
కల్పం : మాధురీ కల్పం
ఎవరి ప్రోక్తం : ధర్మ పక్షులు జైమినికి చెప్పాయి
విభాగాలు :
శ్లోక సంఖ్య : 8,000 అచ్చులో 7,800
ఇతర వివరాలు : మహాభారతానికి తరువాత వచ్చిన సందేహాల నివారణ

వరుస సంఖ్య 8

పేరు : అగ్ని పురాణం
పారమ్యం : విష్ణు
గుణం : తామసం
కల్పం : ఈశాన కల్పం
ఎవరిప్రోక్తం : అగ్ని వసిష్టుల వారికి
విభాగాలు :
శ్లోక సంఖ్య : 15,400 అచ్చులో : 12,400
ఇతర వివరాలు :

వరుస సంఖ్య 9

పేరు : భవిష్యత్ పురాణం
పారమ్యం : సౌర
గుణం : రాజసం

కల్పం : అఘోర
ఎవరిప్రోక్తం : శతానీకునికి సుమంతుడు
విభాగాలు : నాలుగు లేక అయిదు ఖండాలు
శ్లోక సంఖ్య : 14,500 అని కొందరు. 31,000 అని కొందరు. అచ్చులో : 27,000
ఇతర వివరాలు : ఇది పెరుగుతూనే ఉంది. విక్టోరియా మహారాణి కాలందాకా దీనిని అప్డేట్ చేశారు.

వరుస సంఖ్య 10

పేరు : బ్రహ్మ వైవర్త
పారమ్యం : కృష్ణ
గుణం : రాజసం
కల్పం : రధంతర
ఎవరిప్రోక్తం : కృష్ణుడు బ్రహ్మకు చెప్పాడు
విభాగాలు : నాలుగు ఖండాలు
శ్లోక సంఖ్య : 18,000 అచ్చులో: 23,200
ఇతర వివరాలు :

వరుస సంఖ్య 11

పేరు : లింగపురాణం
పారమ్యం : తామసం
కల్పం : ఈశాన కల్పం, అగ్ని కల్పం (?)
ఎవరిప్రోక్తం : ఆదిలో బ్రహ్మ ప్రోక్తం
విభాగాలు : రెండు భాగాలు
శ్లోక సంఖ్య : 11,000 ఉండాలి. అచ్చులో : 10,200
ఇతర వివరాలు : ఇది పురాణం కన్నా వ్రత కల్పమనే చెప్పాలి. పంచ లక్షణాలకోసం ఇతర పురాణ భాగాలను చేర్చారు.

వరుస సంఖ్య 12

పేరు : వరాహ పురాణం
పారమ్యం : విష్ణు
గుణం : సాత్త్వికం
కల్పం : మానవ కల్పం
ఎవరిప్రోక్తం : భూదేవికి విష్ణువు చెప్పాడు
విభాగాలు : రెండు భాగాలు
శ్లోకసంఖ్య : 24,00. అచ్చులో 10,500
ఇతర వివరాలు : లింగపురాణంలాగ ఇది కూడా వ్రతాలనూ పూజా విధానాలనూ చెప్తుంది. వైష్ణవ క్షేత్రాల వివరణ ఉంది.

వరుస సంఖ్య 13

పేరు : స్కంద పురాణం
పారమ్యం : శివ

గుణం : రాజసం
కల్పం : తత్పురుష
ఎవరిప్రోక్తం : కుమారస్వామి చెప్పినది
విభాగాలు : మహాపురాణాలలో ఏడుఖండాలు ఉన్నాయి. (చాలా మాహాత్మ్యాలు)
శ్లోకసంఖ్య : 81,100 శ్లోకాలు. అచ్చులో : 80,000
ఇతర వివరాలు : ఉపపురాణంలో సంహితలు ఉంటాయి. బ్రౌను దొరగారి సేకరణలో 7 సంహితలు, 12 ఖండాలు దొరికాయి. మెకంజీగారి సేకరణలో 36 మాహాత్మ్యాలు ఉన్నాయి.

వరుస సంఖ్య 14

పేరు : వామన పురాణం
పారమ్యం : శివ
గుణం : రాజసం
కల్పం : శివకల్పం
ఎవరిప్రోక్తం : బ్రహ్మ చెప్పినది
విభాగాలు :
శ్లోక సంఖ్య : 10,000. అచ్చులో : 6,000
ఇతర వివరాలు : పేరుకు వైష్ణవ పురాణంలా కనపడ్డా ఎక్కువభాగం లింగపూజ గోదావరీ మాహాత్మ్యం ఇందులో ఉంది.

వరుస సంఖ్య 15

పేరు : కూర్మ పురాణం
పారమ్యం : శివశక్తులు
గుణం : తామసం
కల్పం : లక్ష్మీకల్పం
ఎవరిప్రోక్తం : కూర్మరూపంలలో విష్ణువు ఇంద్రద్యుమ్నునికి చెప్పింది.
విభాగాలు : నాలుగు సంహితలు 1.బ్రహ్మ, 2. భాగవత, 3. సౌర, 4. వైష్ణవ సంహితలు
శ్లోక సంఖ్య : 7,000 అచ్చులో : 8,500
ఇతర వివరాలు : పేరుకు వైష్ణవంలా కనపడుతోంది. గాని శైవపురాణంగా లెక్కించాలని విల్సన్‌గారు అన్నారు. యోగ, తంత్ర విషయాలు ఉన్నాయి.

వరుస సంఖ్య 16

పేరు : మత్స్య
పారమ్యం : శివ
గుణం : తామసం
కల్పం : సత్యకల్పం
ఎవరి ప్రోక్తం : మత్స్యరూపంలో మనువుకి విష్ణువు చెప్పినది
విభాగాలు :

శ్లోక సంఖ్య : 14,000. అచ్చులో : 14,900

ఇతర వివరాలు : ఇతర పురాణాల నుండి చాలా ఇందులో చేర్చారు. సావిత్రీ సత్యవంతులకథ ఉంది.

వరుస సంఖ్య 17

పేరు : గరుడ

పారమ్యం : పైతృమేధం

గుణం : సాత్త్వికం

కల్పం : గారుడ కల్పం

ఎవరి ప్రోక్తం : గరుత్మంతునితో విష్ణువు చెప్పినది

విభాగాలు :

శ్లోక సంఖ్య : 19,000 ఉండాలి. అచ్చులో : 12,400

ఇతర వివరాలు : ఇది ఎక్కువగా ప్రేత కల్ప సంబంధం.

వరుస సంఖ్య 18

పేరు : బ్రహ్మాండ

పారమ్యం : ఆదిలో శైవం

గుణం : రాజసం

కల్పం :

ఎవరి ప్రోక్తం : వాయువు చెప్పాడు

విభాగాలు : 124 అధ్యాయాలు

శ్లోక సంఖ్య : 12,200. అచ్చులో 10,500

ఇతర వివరాలు : కాంచీ మాహాత్మ్యం ఇందులో ఉంది. స్కంద పురాణం లాగే ఈ పురాణం కూడా పూర్తిగా దొరకదు.

వరుస సంఖ్య 19

పేరు : దేవీ భాగవతం

పారమ్యం : దేవీ

గుణం :

కల్పం :

ఎవరి ప్రోక్తం : జనమేజయునకు వ్యాసుడు చెప్పినది

విభాగాలు : 12 స్కంధాలు

శ్లోక సంఖ్య : 18,000

ఇతర వివరాలు : ఈయుగంలోనే ఈ పురాణాన్ని తెనిగించడం ప్రారంభమైంది.

ఈ పద్దెనిమిదిదన్నొక పురాణాలను 120సార్లు మన తెనుగు కవులు గ్రంథరూపంలోనికి తెచ్చారు. వీటిలో కొన్ని నష్టమయ్యాయి. కొన్ని శిథిలమయ్యాయి. కొన్ని అచ్చుపడ్డాయి. కొన్నే ప్రసిద్ధమయ్యాయి. వాటి రచయితల పేర్లో బొటాబొటీ భోగట్టాలూ చూడండి.

పురాణం	యుగం	కవి
1. బ్రహ్మపురాణం	కుంఫిణీ యుగం	చక్కిలేటి రాజగోపాలం. (తం.డి.274)
		మొలుగు లింగన్న. (ఉత్తర ఖండం. తం.డి.197)
	ఆధునిక యుగం	జనమంచి శేషాద్రి శర్మ.
		వెంకట పార్వతీశ కవులతో నడకుదుటి వీర రాజు.
2. పద్మపురాణం	కాకతీయ యుగం	కమలనాభామాత్యుడు (నష్టం)
	రెడ్డిరాజులయుగం	మడికి సింగన్న
	కుంఫిణీయుగం	1. కొటికలపూడి వెంకట కృష్ణయ్య (శ్వేతాచల మాహాత్మ్యం)
		2. మండలేముల వెంకటరామయ్యా (క్రియాయోగసారం ఆర్.561)
	జమీందారీయుగం	త్రిపురాన తమ్మయ్యాదొర
	ఆధునికయుగం	పిశుపాటి చిదంబరశాస్త్రి
		వేలూరి శివరామశాస్త్రి
3. విష్ణుపురాణం	రెడ్డిరాజులయుగం	పశుపతి నాగనాథుడు
	మలిరాయలయుగం	వెన్నెలకంటి సూరన్న
		కలిదిండి భావనారాయణ
	ఆరవీటిరాజులయుగం	వెణుతురుపల్లి వెంకటకం
	కడపటిరాజులయుగం	తుపాకుల అనంతయ్యా
	కుంఫిణీయుగం	అప్పయ్యాదీక్షితాచార్యులు (ఆర్.751)
		కళ్ళేపల్లి నరసింహామూర్తి
		తాడేపల్లి సీతారామస్వామి
	ఆధునికయుగం	నోరిగురులింగశాస్త్రి
		పావనంది జగన్నాథస్వామి
4. వాయుపురాణం	నవాబులయుగం	లింగమగుంట రామయ్యా (లక్ష్మీ సంహితలోని ఆనందకానన మహాత్మ్యం)
	ఆరవీటి రాజులయుగం	ఒడ్డిపూడి పెద్దయ్యా
5. భాగవతం	రెడ్డిరాజులయుగం	మడికిసింగన్న (దశమస్కంధం)
	గజపతుల యుగం	బమ్మెరపోతరాజు (8 స్కందాలు)
	తొలిరాయల యుగం	బొప్పరాజు గంగన (పంచమస్కంధం)

పురాణం	యుగం	కవి
		వెలిగందలనారయ్య
		(ఏకాదశ ద్వాదశ)
		రాచమల్లు కవులు (వీళ్ళు
		నందిఘంటల జంటకవులే)
		షష్టస్కంధం అనువదించారు.
		ఏల్చూరి సింగన (షష్టస్కంధం)
	మలిరాయలయుగం	హరిభట్టు
		(షష్ట, ఏకాదశ, ద్వాదశ)
	తొలినాయకరాజుల	పుష్పగిరి తిమ్మన్న
	యుగం	(భాగవతసారం టేకుమళ్ళ
		రంగశాయి (ద్విపద)
	మలినాయకరాజుల యుగం	పసుపులేటి రంగాజమ్మ
		కుందుర్తి వెంకటాచలం
		(భాగవత సంగ్రహం)
	కడపటి రాజుల యుగం	రావూరి సంజీవరాయడు
		(ఏకాదశ ద్వాదశ)
	కుంఫిణీ యుగం	ఆలూరి కుప్పన
		కుండావజ్ఝల వీరరాఘవయ్య
		(బాలకృష్ణ భాగవతం,
		పాట, ఆర్. 621)
		తరిగొండ వెంకమ్మ
	ఆధునికయుగం	శతఘంటం వెంకటరంగశాస్త్రి
5.(అ)దేవీభాగవతం	కుంఫిణీయుగం	ములుగు పాపయ్య
	జమీందారీ యుగం	దాసు శ్రీరాములు తిరుపతి
		వెంకటకవులు త్రిపురాన
		తమ్మయ్యదొర
	ఆధునికయుగం	నోరి నరసింహశాస్త్రి
		స్థానాపతి రుక్మిణమ్మ
		సరిపల్లె విశ్వనాథశాస్త్రి
6. నారద పురాణం	తొలిరాయల యుగం	పిల్లలమర్రి పినవీరభద్రుడు
	కుంఫిణీ యుగం	అల్లాడ నరసింహం (ఆర్.418)
	ఆధునిక యుగం	కల్లూరి వెంకటసుబ్రహ్మణ్య
		దీక్షితులు
	నవాబుల యుగం	(బృహన్నారదీయాన్ని
		కొందరు తెనిగించారు.
		అది ఉపపురాణం)

పురాణం	యుగం	కవి
7. మార్కండేయ పురాణం	కాకతీయ యుగం	మారన
	ఆరవీటిరాజుల యుగం	పొన్నతోట - ఓబళయ్య ఎల్లకర నరసింహం
–	కుంఫిణీ యుగం	మండచిట్టి కామశాస్త్రి తిమ్మరాజు లక్ష్మణరావు పర్వతమంత్రి లింగన్న (ఆర్.630)
	ఆధునికయుగం	కల్లూరి వెంకటసుబ్రహ్మణ్యా దీక్షితులు
8. అగ్ని పురాణం		దీనిని ఎవరూ డైరక్టుగా తెనిగించినట్టు లేదు. అయితే ఇందులోంచి కూడా ఆంజనేయుని కథలను పుష్పగిరి తిమ్మనగారు వాడుకొన్నా రేమో. ఈ పురాణంలోని నాలుగు అధ్యాయాలలో ధనుర్వేద వివరణం ఉంది. (249-252). తెలుగులో రెండు ధనుర్వేద గ్రంథాలు ఉన్నాయి. వాటికి పరోక్షంగా అగ్ని పురాణమే ఆధారం అనుకోవచ్చు.
	కుంఫిణీయుగం	పాకలనాటి రాజగోపాలం (ధనుశ్శాస్త్రం) అకలంకం కృష్ణమాచార్యులు (ధనుర్విద్యా విలాసం)
9. భవిష్యత్పురాణం	మలి నాయకరాజుల యుగం	కాకునూరి అప్పకవి అనంత వ్రతకథ)
	కుంఫిణీయుగం	బోడిరావుగారి తిరుమలరావు (అనంతవ్రత కథ డి.238) తరిగొండ వెంకమ్మ (వెంకటాచల మహాత్మ్యం)
10. బ్రహ్మవైవర్త పురాణం	కుంఫిణీ యుగం	కుండావజ్ఝల గోపాలకృష్ణయ్య

పురాణం	యుగం	కవి
		(కృష్ణజన్మ ఖండం) గోపీనాథం వెంకయ్యశాస్త్రులు (కృష్ణజన్మఖండం)
	ఆధునికయుగం	చిలకపాటి వెంకటరామానుజ శర్మ, దోమావెంకట స్వామిగుప్త
11. లింగపురాణం	నవాబులయుగం	తెనాలి రామకృష్ణుడు (వదంతి)
	ఆరవీటు రాజుల యుగం	కామినేని ఎల్లారెడ్డి
	జమీందారీయుగం	ములుగు చంద్రమౌళి శాస్త్రి
12. వరాహపురాణం	తొలిరాయలయుగం	నందిఘుంటల జంట
	మలిరాయల యుగం	హరిభట్టు
	కుంఫిణీయుగం	దామెర చినవెంకటయ్య (వెంకటాచలమాహాత్మ్యం ఆర్.548)
	ఆధునికయుగం	కల్లూరి వెంకటసుబ్రహ్మణ్యా దీక్షితులు
13. స్కందపురాణం మహాపురాణంలో ఏడుఖండాలు ఉన్నాయి)	రెడ్డిరాజులయుగం	శ్రీనాథుడు (కాశీఖండం)
	మలిరాయలయుగం	పిడుపర్తి బసవన్న బ్రహ్మోత్తర ఖండం) పెదపాటి సోమయ్య (మహేశ్వర ఖండంలోని కేదార (ఉప) ఖండాన్నీ అరుణాచల మహాత్మ్యాన్నీ అనువదించాడు)
	నవాబులయుగం	లింగమకుంటరామయ్య (వైష్ణవ ఖండంలోని వెంకటాచల మహాత్మ్యం)
	ఆరవీటిరాజులయుగం	కంచర్ల అయ్యన్న (కాశీఖండం. ద్విపద మోచర్లనన్నయ్య (కాశీఖండం) కలిదిండి భావనారాయణ (వైష్ణవ ఖండంలోని పురుషోత్తమ క్షేత్రమాహాత్మ్యం) తురగారాజకవితో అయ్యంకి బాలసరస్వతి. (నాగరఖండం పట్టమట్ట సోమనాథం (బ్రహ్మోత్తర ఖండం)

పురాణం	యుగం	కవి
	కడపటిరాజుల యుగం	కళులెనంతరాజు (కాశీఖండం వచనం) ఈదులపల్లి భవానీశం (ధర్మఖండం) భాస్కర వెంకటాచలం (బ్రహ్మఖండంలోని సేతు మాహాత్మ్యం)
	కుంఫిణీయుగం	మైనంపాటి కేశవయ్య (ముత్తరాజు వారి బ్రహ్మోత్తర ఖండ పూరణ) అనుమంచి జగన్నాథం (ధర్మఖండం) తిరుమలసెట్టి జగన్నాథం (హాలాస్య మహాత్మ్యం) వరదరాజు (నందికేశ్వరుడు (బ్రహ్మ ఖండంలోని సేతు మహాత్మ్యం. అత్తలూరి పాపయ్య (శ్రీశైల ఖండం) శాకనగరం పాపయ్య బ్రహ్మఖండంలోని సేతు మాహాత్మ్యం. ఆర్.41 (బి) పాతకోట పుల్లయ్య బ్రహ్మోత్తర ఖండం. 34) తాడేపల్లి రామస్వామి (వైశాఖ ఖండంలోని పురుషోత్తమ మహిమ) హొత్తరాజు వెంకటకృష్ణయ్య ఆతుకూరి పాపయ్య (లలితాంబోపాఖ్యానం)
	ఆధునికయుగం	జనమంచి శేషాద్రి శర్మ

పై క్రోడీకరణ చూస్తే మహా పురాణాలను మన తెలుగు కవులు ఏయే యుగాలలో ఎవరెవరు అనువాదం చేశారో తెలుస్తుంది. 18 మహాపురాణాలనే కాక కొన్ని ఉపపురాణాలను కూడా విరళంగా తెనిగించారు. సంప్రదాయ సిద్ధంగా చెప్పుకొనే 18 ఉపపురాణాలనూ ఈ కవులు ముట్టుకోకపోవడం గమనించదగ్గ విషయమే. ఒకరకంగా ఉపపురాణాలు స్థానిక ప్రచారంగల సంహితలు. దక్షిణదేశంలో ఏ ఉపపురాణాలు జనంలో వ్యాపించాయో ఇందువల్ల బోధపడుతుంది.

పురాణం	యుగం	కవి
1. నారసింహపురాణం	చాళుక్యయుగం	వేములవాడ భీమకవి
	పద్మనాయకయుగం	ఎఱ్ఱాప్రెగడ
	తొలిరాయల యుగం	ప్రోలుగంటి చెన్నయ్య
	మలిరాయల యుగం	హరిభట్టు
	కుంఫిణీయుగం	కొటికలపూడి కోదండరామయ్య. (ఆర్.555)
2. ఆదిపురాణం	పద్మనాయక యుగం	చిమ్మపూడి అమరేశ్వరుడు
3. ఆదిత్య పురాణం	తొలినాయకరాజులయుగం	ఎలకూచి పిన్నయ ప్రభాకరుడు
4. శివధర్మ పురాణం	ఆరవీటి రాజులయుగం	కామినేని ఎల్లారెడ్డి
5. బృహన్నారదీయం	నవాబులయుగం	వాసిరాజు రామయ్య
	కుంఫిణీయుగం	కొత్తలంక మృత్యుంజయుడు
6. భార్గవ పురాణం	కుంఫిణీయుగం	కాండూరి వెంకటదాసు ఆర్.657
7. స్కాందపురాణం	రెడ్డిరాజుల యుగం	శ్రీనాథుడు. (గోదావరీ ఖండంలోని భీమేశ్వర పురాణం. ఈశాన సంహితలోని శివరాత్రీ మహాత్మ్యం)
	గజపతుల యుగం	దగ్గుపల్లి దుగ్గన్న (కాంచీ మహాత్మ్యం)
	నవాబుల యుగం	తెనాలి రామకృష్ణుడు (పాండురంగ మాహాత్మ్యం)
	ఆరవీటిరాజుల యుగం	పట్టుమట్టు సోమనాథం (సూత సంహిత)
	కడపటి రాజులయుగం	రేవూరి అనంతయ్య (శంకర సంహితలోని శివరహస్యఖండం)
		ముదిగొండ బ్రహ్మయలింగం (శంకర సంహితలోని శివరహస్యఖండం)
		రాపాక వెంకటదాసు (శంకర సంహితలోని శివరహస్యఖండం)
		కోడూరి వెంకటాచలం (శంకర సంహితలోని శివరహస్యఖండం)

పురాణం	యుగం	కవి
	కుంఫిణీయుగం	పుల్లాభట్ల నరసింహశాస్త్రులు (నాగరఖండం, వచనం) అవధానం పాపయ్య (శంకర సంహిత)

గుర్తుపట్టగలిగినంత వరకూ ఈ ఏడు ఉపపురాణాల నుంచే మన కవులు రచనలు చేసినట్టు చెప్పగలం. ప్రతిపురాణంలోనూ ఉపపురాణంలోనూ లెక్కలేనన్ని తీర్థక్షేత్ర ప్రశంసలు ఉన్నాయి. అన్ని సినిమా థియేటర్లలోనూ ఒకే న్యూసురీలు ప్రదర్శించినట్టు చాలా పురాణాలలో ఒకే రకం స్థల పురాణాలు ఉంటాయి. మాట వరుసకు శ్రీరంగ మాహాత్మ్యాన్ని ఒకరు బ్రహ్మపురాణం నుంచి తీసుకొన్నామంటే ఇంకొకరు గరుడ పురాణం నుంచి వ్రాశామంటారు. చాలామంది తమకు ఏ పురాణం ఆధారమో చెప్పలేదు. అలాగ సూచించని మాహాత్మ్యాలు చాలా ఉన్నాయి. ఈ యుగంలో పుట్టిన మాహాత్మ్య గ్రంథాలు చూడండి:

	అంతర్వేది మాహాత్మ్యం	పెనుమత్స గోపరాజు
	ఉత్సవమాహాత్మ్యం	కోవూరు వల్లభరాయలు
	కాంచీపురమాహాత్మ్యం	కావలి వెంకట బొర్రయ్య
	కాంచీ మాహాత్మ్యం	మండపాక పార్వతీశం
	కార్తీక వ్రతమాహాత్మ్యం	మండపాక కామయ్య
	కూర్మ మాహాత్మ్యం	కొటికలపూడి వెంకటకృష్ణయ్య (ఆర్.639) (బ్రహ్మోత్తరఖండం. డి.1) మేరంగి వెంకటయ్య వైష్ణవ ఖండంలోని కార్తీక మాహాత్మ్యం. ఆర్.586) దామెర వెంకటరావు బ్రహ్మ ఖండంలోని సేతు మాహాత్మ్యం. (ఆర్.543) శ్రీధరమల్లె వెంకట స్వామి (బ్రహ్మోత్తర ఖండం) వీపూరి వెంకటాచార్యులు న్నాగ రఖండంలోని పురుషోత్తమ క్షేత్రమహిమ. (ఆర్.577) వంగల సీతారామయ్య (డిటో. ఆర్.970 (బి)) రామయ్యగారి సూరయ్య. (డిటో.కాకినాడ.1950)
	జమీందారీయుగం	మండ చిట్టికామశాస్త్రి (బ్రహ్మోత్తర ఖండం)
	ఆధునికయుగం	నోరి గురులింగశాస్త్రి

పురాణం	యుగం	కవి
14. వామన పురాణం	నవాబుల యుగం	లింగమగుంట రామయ్య
	ఆరవీటి రాజుల యుగం	పొన్నతోట ఓబళయ్య ఎలకూచి
	ఆధునికయుగం	బాలసరస్వతి వెంకట పార్వతీశ కవులతో నడకుదుటి వీరరాజు కల్లూరి వెంకట సుబ్రహ్మణ్యా దీక్షితులు
15. కూర్మ పురాణం	ఆరవీటి రాజుల	రాజలింగం
	కుంఫిణీయుగం	తిమ్మరాజు లక్ష్మణరావు
	జమీందారీయుగం	మండచిట్టి కామశాస్త్రి
	ఆధునికయుగం	పి. వెంకటరావు (వచనం) కల్లూరి సుబ్రహ్మణ్యా దీక్షితులు
16. మత్స్య పురాణం	మలిరాయలయుగం	హరిభట్టు
	నవాబులయుగం	లింగమగుంట రామయ్య
	కుంఫిణీయుగం	కాణాదం పెద్దన
	జమీందారీయుగం	మండాచిట్టి కామశాస్త్రి (ప్రతీతి)
	ఆధునికయుగం	కల్లూరి వెంకట సుబ్రహ్మణ్యా దీక్షితులు
17. గరుడ పురాణం	తొలిరాయలయుగం	భైరవుడు (శ్రీరంగమాహాత్మ్యం)
	నవాబులయుగం	పింగళి సూరపరాజు (నష్టం)
	కుంఫిణీయుగం	వరదరాజు
18. బ్రహ్మాండ పురాణం	ఆరవీటిరాజుల యుగం	కావూరి ఎల్లయ్య. ఆర్.201
	తొలినాయక రాజుల యుగం	భట్లపెనుమర్తి కోదండరామయ్య (ఉత్తరఖండంలోని శ్రీకాకుళ మహాత్మ్యం)
	కడపటిరాజుల యుగం	బడగలనాటి నరసయ్య (ఏకవీర మహాత్మ్యం)
	కుంఫిణీయుగం	తాడూరి కృష్ణమూర్తి (గౌతమీ మాహాత్మ్యం)

కొలిపాక మాహాత్మ్యం	చిత్తూరు గంగాధరుడు
గౌతమీ మహాత్మ్యం	అల్లమరాజు బాపయ్యా
గౌతమీ మాహాత్మ్యం	అల్లమరాజు రామకృష్ణయ్యా
చిత్రకూట మాహాత్మ్యం	తిరుమలకవి (యక్షగానం)
తులసీమాహాత్మ్యం	అక్కిరాజు కృష్ణదాసు (సువ్విపాట. ఆర్.1086)
తోతాద్రి మాహాత్మ్యం	రంగీపురం సింగరాచార్యులు ఆర్.338
నారాయణాచల మాహాత్మ్యం	అల్లమరాజు రంగధామం
పంచాక్షరీ మహాత్మ్యం	కందుకూరి పెద వీరేశలింగం
బలరామక్షేత్రమాహాత్మ్యం	కందుకూరి పెద వీరేశలింగం
బలరామక్షేత్రమాహాత్మ్యం	మండపాక కామయ్యా
భూతపురీ మాహాత్మ్యం	కరాలపాటి రంగయ్యా
ముఖలింగక్షేత్రమాహాత్మ్యం	కాకరపర్తి కృష్ణయ్యా
యాదగిరి మాహాత్మ్యం	అనమనగుర్తి రంగయ్యా (డి. 349)
యాదగిరి మాహాత్మ్యం	ఎక్కిరాల వీరరాఘువాచార్యులు (ఆర్.840)
వీభూతిమాహాత్మ్యం	పోచిరాజు వీరన్న
వెంకటాచలమాహాత్మ్యం	శిష్టు కృష్ణమూర్తి
వెంకటాచలమహాత్మ్యం	చినవెంకటయ్యా. ఆర్.544
వెంకటాచల మహాత్మ్యం	ములుపాక బుచ్చన్న డి. 355
వేదాద్రి మాహాత్మ్యం	వరదాచార్యులు ఆర్.685
శ్రీరంగమాహాత్మ్యం	గుంటుపల్లి జగన్నాథం
శ్రీరంగమాహాత్మ్యం	భాగవతుల రామయ్యా ఆర్.40
సోంవార మాహాత్మ్యం	మల్లికార్జునస్వామి డి. 1018
హాలాస్య మాహాత్మ్యం	మల్లంపల్లి బుచ్చయ్యా
హాలాస్య మాహాత్మ్యం	కామకొల్లి వెంకట నారాయణ ఆర్.595

మహా పురాణాలూ, ఉప పురాణాలూ, వాటిలో ఉండే మహాత్మ్యాలూ మాత్రమేకాక కొన్ని పుక్కిట పురాణాలూ, కులపురాణాలో, కల్పిత స్థలపురాణాలూ కూడా ఈయుగంలో పుట్టాయి. వాటి వివరాలు చూడండి.

1.	కన్యకాపురాణం	1. ఇటుకల తిమ్మయసెట్టి 2. కొొండమడుగు పుల్లయ్య (ఆర్.885)
2.	చెన్నబసవపురాణం	అత్తలూరి పాపయ్య
3.	బసవ పురాణం	మహాదేవయ్య, ఆర్.359
4.	మనువంశపురాణం	పోచిరాజువీరన్న
5.	మఱి బసవపురాణం	నుదురుపాటి వెంకన్న
6.	మల్లుపురాణం	నుదురుపాటి వెంకన్న
7.	స్థల త్రయ పురాణం	ములుపూడి పద్మనాభం (ఆర్.709)

పురాణాలూ ఇతిహాసాలూ చెప్పడం మరచిపోయిన ధర్మాలను శేషధర్మాలుగా పూర్వులు సంకలనం చేశారు. వాటిని ఇంతకుముందు యుగాలలో చాలామంది అనువదించారు. ఈయుగంలో తెనిగించిన వాళ్లు ఇద్దరున్నారు.

1. పమిడిపల్లి వెంకటకవి. ఆర్. 797. ఆర్. 1031
2. శివరాజు సిద్ధిరాజు ఆర్. 704 (ఎ) ఆర్. 725

ఇంత విరివిగా ఈ యుగంలో పురాణ వృక్షం కాచినా అన్నీ మంచి పిందెలు కావు. గోపీనాధం వెంకయ్యశాస్త్రులు, అవధానం పాపయ్య వంటి కొొందరు చాలా నిర్దుష్టంగా చక్కని కవిత్వం వ్రాశారు. బచ్చు సిద్ధయ్య లాంటివాళ్ళు ''అలమిరేఫఱకారములు శివకావ్యముల యంద జెల్లు దప్పులు కావు''. అని నిర్భయంగా చెప్పగలిగారు. (ఆర్.556). ఇటువంటి వ్యాకరణ దోషాలు ఎవరూ పట్టించుకోరు. అయితే శ్రీగిరి మల్లికార్జున స్వామిలాగ ''మహాముని'' ''సోంవారం'' వంటి పదాలను సంప్రదాయ సిద్ధమైన కవిత్వంలో చెలామణీ చేయించడానికి దమ్ములు కావాలి'' (అని సూత మహాముని యాద్యులకెల్ల వినిపించె పసోంవార విత చరిత్ర. డి. 1019) చేవ చచ్చిన ఈ పురాణ రచనలను చూసి ఎవరూ బాధపడనక్కరలేదు. బ్రహ్మపురాణం చెప్పనే చెప్పింది. యుగాంతం దగ్గర పడగానే కవికాని వాడంటూ ఎవరూ ఉండడట! ''నకశ్చిదకవిర్నామ యుగాంతా సముపస్థితా''. పురాణం ఎంత భరవాసా ఇచ్చినా గుంటుపల్లి జగన్నాధంలాగ కొొందరు ఉబలాటానికి తగినంత వ్యుత్పత్తి తమకు లేదని గుర్తించిన వాళ్ళుకూడా వున్నారు. ఈకవి శ్రీరంగ మహాత్మ్యం రచించదలిచాడు. చేతకానందుకు చింతిస్తూ పడుకొొన్న సంగతి ఇలా చెప్పాడు.

శ్రీరంగ చరిత్రము వి .
స్తారంబుగ నాంధ్ర కావ్య సరణిని జెప్పే
నేరుపు చాలక చింతిల
నారాతరి స్వప్నమున మహాద్భుతలీలన్ (ఆర్.247)

దేవుడు కలలో కనబడి ఎంతో ప్రోత్సహించినా గుంటుపల్లి జగన్నాధంలాంటి వాళ్ళకు బితుకు బితుకుమంటూనే వుంటుంది. నిజం చెప్పేస్తారు.

నిక్కము బరికింపగ న
క్కకూడ ఘనదేవలోక మెక్కడ కవనం
బెక్కడ మరినేనెక్కడ?
మక్కువతో చెప్పుటకు రమాహృదయేశా (ఆర్.247)

అయితే చాలామంది ఈ యుగంలో పురాణ కథలను మక్కువతోనే చెప్పారు. ప్రాచీన గ్రంథాలలో ఏముందో ప్రజలకు తెలియచెప్పాలనే ఆశయంతో తిమ్మరాజు లక్ష్మణరావు వచనంతో స్వయంగా కూర్మ, మార్కండేయ పురాణ సార సంగ్రహాలు వ్రాశాడు. పువ్వాడ వెంకటరావుతో కలసి మత్స్య పురాణ సార సంగ్రహం రచించాడు.

వాస్తవానికి పూర్వం నుంచీ మనకు పురాణసారాలు రచించే కవులు లేకపోలేదు. తొలిరాయల యుగంలో కూచిరాజు ఎర్రన్న ఒక పురాణసార గ్రంథాన్ని వ్రాశాడు. మలినాయక రాజుల యుగంలో గణపవరపు వెంకటకవి అఖిల పురాణసారం వ్రాశాడు.

అయితే ఆధునిక పద్ధతులలో అకారాదిగా తెలుగులో పురాణకోశం వ్రాసే ప్రయత్నం ఈ యుగంలోనే మొదలైంది. యనమండ్రి వెంకటరామయ్యగారు ''పురాణ నామ చంద్రిక'' అనే పేర ఒక నిఘంటువు వ్రాశారు. (ఇది తొలిసారి 1879లో అచ్చుపడింది). ఇందులో పురాణపురుషుల వివరణ మాత్రమేకాక ఆంధ్రకవుల జీవిత విషయాలను కూడా వెంకటరామయ్యగారు పొందుపరిచారు. ఈ పురాణ నామచంద్రిక కాచిన సైకత స్థలాలపైనే ఉత్తరోత్తరా ఆధునికయుగంలో పూర్వ గాధాలహరి (వేమూరి శ్రీనివాసరావుగారిది) ప్రవహించింది.

మన పురాణాలు నిజంగా నదులలాంటివే. కొన్ని జీవనదులు; ఎప్పుడూ ఎండిపోవు. జనసామాన్యం ఈ కథలను వినాలనే ఉవ్విళ్ళూరుతూ ఉంటారు.

అయితే యుగం మారినప్పుడు ప్రక్రియ మారుతోంది. కుంఫిణీయుగం దాకా ప్రబంధాలుగా, ద్విపదలుగా, వచన కావ్యాలుగా రచించిన పురాణ కథలను జమీందారీయుగంలో స్టేజినాటకాలుగా రచయితలు రూపొందించారు.

ఆధునిక యుగంలో ఇవే కథలు సినిమా తెరకు ఎక్కాయి. ప్రక్రియవల్ల ఈ పురాణగాధలు ఎప్పుడూ నిత్య నూతనంగానే ఉంటాయి.

తమ పురాణ వారసత్వాన్ని మరచిపోయిన జాతి నిజంగా ఎండిపోయిన నదే.

క్రైస్తవ కావ్యాలు

''ఇది మిసను, అది మిసను
గుంటూరూ పెద మిసను
ఏ మిసనకు పోదంరో
లంబాడోళ్ళ రాందాసు!''

ఇది గ్రామీణులపాట. క్రైస్తవంలో చేరి బతుకు బాగుపర్చుకొనదలచిన బడుగువాళ్ళ పాట. ఇందులో చెప్పిన గుంటూరు పెద మిషను. ఆ జిల్లా ఫ్రెంచివాళ్ళు చేతికి వచ్చిన క్రీ.శ.1750 తరువాత కట్టారు. నిజానికి తెలుగు గడ్డమీద క్రైస్తవమతాన్ని ప్రచారం చేసి తెలుగువాళ్ళకు బాప్తిస్మం ఇచ్చిన ఘనత ఫ్రెంచి జెసూట్లకే చెందుతుంది.

సొసైటీ ఆఫ్ జీసస్ అనే ప్రచారక సంస్థకు సంబంధించిన ప్రబోధకులను జెసూట్లు అంటారు. ఈ సొసైటీని ఆరుగురు సహచరులతో ఆగ్నేషియస్ లయోలా అనే మహా మేధావి, క్రైస్తవ మతతత్త్వవేత్త స్థాపించాడు. 1539లో పోపు ఈ సంస్థను ఆశీర్వదించాడు. విశ్వవిద్యాలయాలలో చదువుకొని మతవిషయాలలో కృషిసల్పిన వాళ్ళనే ఈ సంస్థనే చేర్చుకొనేవారు. దారిద్ర్యం, బ్రహ్మచర్యం, మతవ్యాప్తికి దీక్ష మొదలైన వాటిని అంగీకరించే వాళ్ళకే ఇందులో స్థానముంటుంది. ఇగ్నేషియస్ తన సొసైటీలోని ప్రముఖులను వివిధ యూరోపియన్ రాజ్యాల ముఖ్యపట్టణాలకు పంపి ప్రచారం చేయించాడు. వీళ్ళకు రాజపోషకులు లభించారు. ప్రాచ్యదేశాలలో క్రైస్తవ మత ప్రచారం ముఖ్యమని పోర్చుగల్ దేశపురాజు భావించాడు.

పోర్చుగీసు జెసూట్లు భారతదేశంలో క్రైస్తవ ప్రచారం చేసిన మొదటి ప్రబోధకులు. 1597లోనే ఇద్దరు పోర్చుగీసు జెసూట్లు చంద్రగిరిలోని వెంకటపతిరాయల కొలువులో కనిపెట్టుకొని ఉన్నారు. 1615దాకా పడిగాపులు పడ్డారుగాని ఏమాత్రం ప్రయోజనం లేకపోయింది. వాళ్ళ వేషధారణను చూసి అందరూ వాళ్ళను ''ఫరంగీలను'' చిన్నచూపు చూశారు. గోవాలోని బుడతకీచుల ప్రవర్తన కళ్ళారా చూసిన విజయనగర సామ్రాజ్య ప్రజకు ఫరంగీలపై సద్భావం కలగదు. వాళ్లు ధరించే నల్లబట్టలను మానేసి తెల్లబట్టలు కట్టుకోమని జెసూట్లకు రాయలు హితోపదేశం చేశాడు. అయితే అది ఆచార విరుద్ధమని జెసూట్లు ఆచరించలేదు. కానీ 1606లో భారతదేశానికి వచ్చి 1610లో మధురలో మిషను స్థాపించిన రాబర్టు డి-నోబిలి అనే జెసూటు భారతీయ పద్ధతులను అనుసరిస్తేగానీ క్రైస్తవ ప్రచారలకు గౌరవం లభించదని గ్రహించి వాటిని అమలు పర్చారు. తర్వాత వచ్చిన జెసూట్లు అనుసరించారు.

జెసూట్లు తాము రోమాపురి బ్రాహ్మణలమని చెప్పుకొనేవారు. బ్రాహ్మణ సన్యాసులలాగ పసుపురంగు బట్టలు కట్టుకొని పాంకోళ్ళు తొడుగుకొనేవారు. మద్యమాంసాలు విసర్జించారు. ప్రాతః స్నానం చేసేవారు. భోజనానికి ముందు స్నానం చేసి మడికట్టుకొనేవారు. బ్రాహ్మణులు వండిన వంటకాలను బ్రాహ్మణులు వడ్డిస్తే తినేవారు. అదీ రోజుకు ఒక్కసారి మాత్రమే. జెసూట్లు తమపాశ్చాత్య నామధేయాలకు బదులు

భారతీయుల పేర్లను పెట్టుకొనేవారు. ప్రాంతీయ భాషలను చక్కగా అధ్యయనం చేసి ప్రావీణ్యం సంపాదించేవారు.

రాబర్ట్ ఇ-నోబిలి తత్త్వబోధస్వామి అనే పేరు పెట్టుకొన్నాడు. ఆనాడు మధురలో రాజభాష అయిన తెలుగూ, ప్రజల భాష తమిళం నేర్చుకొన్నాడు. సంస్కృతంలో పాండిత్యం అలవడింది. అభ్యసించిన అన్నిభాషలలో గ్రంథాలు రచించాడు. వాటిని అప్పుడే అచ్చువేశారు. (1602లోనే వైపికోటకు పోపు ఒక ముద్రణ యంత్రాన్ని పంపాడు). రాబర్ట్ డి-నోబిలి నాలుగు వేదాలనూ ఫ్రెంచి భాషలోనికి అనువదించాడు. ఆయన తెలుగులో జ్ఞాన సంక్షేపము, పునర్జన్మ ఆక్షేపము, విశ్వసల్లాపము అనే పుస్తకాలు రచించాడు. ప్రశ్నోత్తర ప్రబోధ సూత్రం అనే అంశంపై కూడా ఒక పుస్తకం అతనిదే తెలుగులో ఉంది. గ్రంథానికి పెట్టిన తెలుగు పేరు తెలియదు.

రాబర్ట్ డి-నోబిలి చేస్తున్న మత ప్రచారం ఎంత విస్తరంగా వ్యాపించిందంటే; తూర్పు ఇండియా కుంఫిణీవారు కంపరమెత్తి ఆయన్ని కారాగారంలో బంధించారు. 1623లో విడుదల చేశారు. నాటినుంచి 1656దాకా రాబర్ట్ డి-నోబిలి ఒక చిన్న గ్రామంలో స్థిరపడి ప్రశాంత జీవనం గడుపుతూ మతప్రచారం కొనసాగించాడు. 1658లో మరణించాడు.

ఒక అర్ధ శతాబ్దం దక్షిణ భారతంలో ప్రశంసనీయమైన ప్రచారం చేసిన రాబర్ట్ డి-నోబిలి ఇతర జెసూట్లకు ఆదర్శప్రాయుడయ్యాడు. ఫ్రాంసు దేశపురాజు 14వ లూయీకు మత ప్రచార వాంఛ ప్రబలింది. ఫ్రెంచి జెసూట్లు ప్రచారం చేయడానికి అనుమతి పత్రాన్ని ప్రసాదించాడు. విద్యావంతులైన ఆరుగురు జెసూట్లను ఎన్నికచేసి విదేశాలకు పంపాడు. వీళ్ళు మొదట సయాం దేశానికి వెళ్ళారు. అక్కడ విప్లవ పరిస్థితులు ముమ్మరంగా ఉండడం వల్ల ఎంత మాత్రం ఆస్కారం లేక ఓడలో తిరుగు ప్రయాణం చేశారు. 1689లో పుదుచ్చేరి చేరుకొని కర్ణాటకం మిషనను స్థాపించారు. మాడ్విట్ ఫాదిరీ; వేనెజ్ పాదిరీ చెంజి మండలంలో ప్రచారం మొదలుపెట్టారు. మాడ్విట్ స్వాములవారు 1701లో కాంచీపురానికి చేరువలో ఉన్న ''కావేరి పూండి'' అనే గ్రామం కేంద్రంగా మిషను స్థాపించారు. జిల్లాలలోనికి చొచ్చుకుపోయి ప్రచారం చేయడానికి ముందు జెసూట్లు అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు. మధుర మిషను వారిలాగ భారతీయ ఆచార్య వ్యవహారాలనే అనుసరించాలి. సన్యాసులలాగ వేషధారణ కావించాలి. శాకాహారమే తినాలి, ప్రాంతీయ భాషల్లో కృషిచేసి ఆ భాషల్లోనే ప్రచారం సాగించాలి. హిందువుల పేర్లే పెట్టుకోవాలి అన్నవి ఆ నిర్ణయంలోని అంశాలు.

ఈ నిర్ణయాన్ని తీసుకొన్న జెసూట్లు ముగ్గురు. వీళ్ళలో మొదటివాడు బూచెట్ ఫాదిరీ. ఈయన మధుర మిషన్‌లో పనిచేసినవాడు. కర్ణాటకం మిషను స్థాపించినవాడు. బహుశా ఇతర జెసూట్లకు తెలుగు నేర్పి ఉంటాడు. రాబర్ట్ డి-నోబిలి రాసిన తెలుగు గ్రంథాల ప్రతులు ఇచ్చే ఉంటాడు. తతిమా ఇద్దరూ మాడ్విట్, డీ-లాపాంటైన్ అనే జెసూట్లు. ఈ ఇద్దరే తెలుగు గడ్డ మీద క్రైస్తవాన్ని పాదుకొల్పినవాళ్ళే. మాడ్విట్ సాములవారి భారతీయ నామధేయం తెలియదు. డీలా-పాంటైన్ జ్ఞాన బోధ స్వాములు వారు అనే పేరు

పెట్టుకొన్నాడు. 1701 నాటికి చిత్తూరు జిల్లాలోని పుంగనూరులో చర్చి కట్టారు. 1718లో అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా కృష్ణాపురంలో చర్చిని స్థాపించారు.

చిన్నబళ్ళాపురంలో జ్ఞానబోధస్వాముల వారి ప్రభావం ఇనుమడించింది. 1704 నుండి 1720 దాకా చిన్నబళ్ళాపురాన్ని హావతి బైచరాజు పాలించాడు. ఆయన కొలువులో నిడుమామిళ్ళ మల్లరసు అనే మంత్రి ఉండేవాడు. ఈయన జ్ఞాన బోధస్వాముల వారివల్ల ఆకర్షితుడయ్యాడు. ఒకసారి ఫలానారోజున చంద్రగ్రహణం ఉంటుందని ఒక జ్యోతిష్కుడు ప్రకటించాడు. ఆనాడు గ్రహణంరాదని మల్లరసు చెప్పాడు. చర్చ జరిగింది. వివాదం పెరిగింది. జ్ఞాన బోధ స్వాముల వారి దగ్గరకు తీర్పుకోసం వెళ్ళారు. ఆయన ఖగోళ శాస్త్రవేత్త కూడా. ఆయన గ్రహణం సంభవించదని చెప్పాడు. అది నిజమైంది. మల్లరసుకు స్వాములవారిమీద గురి కుదిరింది. మతం మార్చుకొన్నాడు. అతని కుటుంబంలోని అందరూ బాప్తిస్మం పుచ్చుకొన్నారు. క్రైస్తవానికి మంత్రి అండదండలూ రాజాశ్రయం లభించాయి.

కృష్ణాపురంలో లీ- గాక్ ఫాదిరి సంజీవనాథస్వామి అనే పేరుపెట్టుకొని మతప్రచారం చేశాడు. ముదిగుబ్బలో తుమ్మావారు మోతుబరులయిన రెడ్లు. గ్రామపాలకులు. ఈ వంశంలో రామప్ప అనే ఆసామికి గాలి సోకి చాలా బాధపడుతూ ఉండేవాడు. సంజీవనాథ స్వామి సంగతి అతను విన్నాడు. అతనివద్దకు బంధువును తీసుకువెళ్ళమన్నాడు. స్వాములవారు ప్రార్థనలు జరిపాక కొంత ఉపశమనం కలిగింది. తుమ్మరాయప్ప 1715లో బాప్తిస్మం పుచ్చుకొన్నాడు. అతని కుటుంబసభ్యులేకాక తుమ్మావారు వియ్యమందే గోపువారుకూడా క్రైస్తవులయ్యారు.

స్థానిక ప్రముఖులు మతాంతరులు కావడంతో బ్రాహ్మణ్యానికీ దాసరులకూ కన్నెర్ర అయింది. రోమా సన్యాసులను చాలా బాధలు పెట్టారు. మాడ్విట్ స్వాములవారిని, అతని సహచరుడు కూర్జువిల్లీ ఫాదిరీని 1711లో బ్రాహ్మణులు విషం పెట్టి చంపేశారు. జ్ఞాన బోధస్వామి 1718లో మరణించాడు. సంజీవనాథస్వామి అరవైఏడు సంవత్సరాల వయస్సులో 1738లో మరణించాడు. ఈయన స్థానంలో కాల్మెట్టీ అనే జెసూటు ఫాదిరి సత్యబోధస్వాములవారు అనే పేరుతో కృష్ణాపురంలో మిషను బాధ్యతను స్వీకరించాడు. 1733 నాటికే తెలుగు జిల్లాలలో 16 చర్చి గుడులు ఉండేవి. ఆరుగురు ఫాదిరీలు ప్రచార కార్యక్రమాలు నిర్వహించేవారు.

ఫ్రెంచి జెసూట్లందరూ తెలుగులో చిన్న చిన్న గ్రంథాలు రచించినవాళ్ళే, వాటి ప్రతులను తెలుగు క్రైస్తవులకు పంచిపెట్టినవాళ్ళే. ప్రాచ్యభాషలలో మతగ్రంథాలను సేకరించినవాళ్ళే. ఫ్రాంసు దేశపురాజు ప్రాచ్యగ్రంథాలయాన్ని స్థాపించాలని భావించితే ఈ జెసూట్లు ఎన్నో గ్రంథాలను సేకరించి ఫ్రాంసుకు పంపారు. మధుర మిషనెరీలు తమిళ-పోర్చుగీసు నిఘంటువు రచించినట్లు కర్నాటకం మిషనెరీలు తెలుగు-ఫ్రెంచి నిఘంటువును తయారుచేశారు. ఈ జెసూట్ల నుండి బాప్తిస్మం పుచ్చుకొన్న తెలుగువాళ్ళు కొందరు ఉన్నత పదవులు అధిష్ఠించారు. ప్రభుత్వం చేశారు. బ్రాహ్మణ కవులను చేరదీసి

వాళ్ళచేత క్రైస్తవ కావ్యాలను చెప్పించారు. అయితే ఈ కావ్య రచనా కార్యక్రమాలు కొంచెం లేటుగా జరిగాయి. ఆ కావ్యాల గురించి, వాటి కర్తల గురించి, భర్తల గురించి చెప్పుకొందాం.

పింగళి ఎల్లన్న

సంజీవనాథ స్వామివల్ల బాప్తిస్మం పొందిన రాయప్పరెడ్డి వంశంలో ఓబళరెడ్డి, అనంతరెడ్డి అనే అన్నదమ్ములున్నారు. వీరు బహుశా రాయపరెడ్డి కుమారులే. తుమ్మలవారు వారి స్వగ్రామం ముద్దిగుబ్బలో చర్చి కట్టుకొని, అక్కడి దాసరులు పెట్టే బాధలు కొన్నాళ్ళు తట్టుకొని చివరకు అవి భరించలేక ఆలమూరుకు వెళ్ళిపోయారు. ఆలమూరులో వాళ్ళు ఇంకో చర్చి కట్టుకొన్నారు. రెండవందలమందిదాకా ఆ కుటుంబ సభ్యులు పెరిగారు. చాలా ధనవంతులయ్యారు. వీళ్ళ ఐశ్వర్యానికి కన్నుకుట్టి మరాఠీదండు ఆలమూరును ముట్టడించింది. మూడునెల్లపాటు ఈ ముట్టడిని తుమ్మాలవారు తట్టుకొన్నారు. అనంతపురం ఏలే రాజును సహాయమర్థించారు. అతగాడు యాభైవేల రూపాయలు అడిగాడు. తుమ్మాలవారు బంధువులందరితో కలిసి రాత్రికి రాత్రి రహస్యంగా ఆలమూరు ఖాళీచేసి తమ పూర్వీకుల నివాసమైన బుక్కాపురానికి మళ్ళా చేరుకొన్నారు. ఇది నెల్లూరు జిల్లా దర్శి డివిజన్‌లో ఉన్న జమీందారీ గ్రామం. తుమ్మాలవారు బుక్కాపురంలో మళ్ళా ఒక చర్చి కట్టుకొన్నారు. ఇది 1735 సెప్టెంబరుకు పూర్వం జరిగింది. 1752లో గుంటూరుజిల్లా ఫ్రెంచివారి ఏలుబడిలోనికి వచ్చాక తుమ్మావారూ ఇతర క్రైస్తవులు ఆ సీమకు వలస వెళ్ళారు. తుమ్మావారు కొండవీటికి దగ్గర్లో ఉన్న భక్తవాడలో స్థిరపడ్డారు.

భక్తవాడలో తుమ్మా అనంతరెడ్డిగారి రాయప్ప జగనొబ్బగండ బిరుదుతో తమ్ముడు పాపన్నా, మంత్రి పొత్తూరి పాపన్నా సేవించుకొంటూ ఉండగా చాలా వైభవంగా ఉండేవాడు. విద్యాప్రసంగాలు జరుపుతూ ఉండేవాడు. ఆయనకు ఒకనాడు ఒక క్రైస్తవ వాక్యాన్ని తెలుగులో చెప్పించి దేవుడికి అంకితం ఇప్పించాలనే కోరిక కలిగింది. దానిని రచించగలిగే కవి గురించి వాకబు చేశాడు. భక్తవాడలోని కరణాలందరూ కొనియాడే ఒక కవి ఉన్నాడని తెలిసింది. అతని పేరు పింగళి ఎల్లన్న.

ఈ కవి వీరశైవుడు. గీర్వాణాంధ్ర భాషలలో ఆశుకవితలు. చిత్ర కవితలు ప్రబంధాలు చెప్పగలడు. యధావాక్కుల అన్నమయ్య, పాల్కురికి సోమనాథుడు, శివదేవుడు గణపతి దేవుడు, వేమన మొదలైన శివకవులంటే చాలా భక్తిగలవాడు. వ్యాస వాల్మీకాదులను, తెలుగులో కవిత్రయం వారినీ, ధూర్జటి, పోతన శ్రీనాథ భీమకవులను చదువుకొన్నవాడు. ఇవ్వటూరి శరభనారాధ్యులవారి శిష్యుడు; భారద్వాజగోత్రుడు. చక్కని ధారాశుద్ధి గలవాడు. ఇతనిని రాయప్ప సగౌరవంగా పిలిపించాడు. తన కోరికను చెప్పాడు. తన తండ్రి ఓబళరెడ్డికి సంజీవనాథస్వామి బోధించిన కథను వివరించి, దానిని కృతిగా చేసి దేవునికి అంకితం ఇవ్వమన్నాడు. ఎల్లన్న సంతోషించి ఇలా భావించాడు.

నశ్వరులైనవారి కడ నాయకులౌటదలంచి చూడ నీ
విశ్వములోన గన్యలకు వేడుక మత్కృతి కావ్యకన్యకున్
శాశ్వతుడప్రమేయుడని చారుడనంతుడనాద్యుడైన స
ర్వేశ్వరుడెల్ల భంగుల నధీశ్వరుడౌటకు నింపుబుట్టదే (తోభ్య 1-19)

ఇంపుతో రచించవలసిన కథాక్రమాన్ని సంపూర్ణంగా విన్నాడు. ముఖవచనాలతో తేటపరచిన ఈ గాథను సంజీవనాథ స్వామిగారు సంక్షేపంగా గ్రంథస్థం చేశారని కూడా తెలుసుకొన్నాడు. దానిని పఠించదలిచాడు.

రాయప్ప ఎల్లన్నకు ఒక ''వాక్యగ్రంథం'' ఇచ్చాడు. అది వాళ్ళ పెద్దతండ్రిగారికి సంజీవనాథ స్వామి ఇచ్చిన పుస్తకం. దానిలో తోభ్య చరిత్ర ఉంది. అతడు నిత్యంబైన సత్యాధ్యయన విధాన ప్రవర్తకుడై కృతార్థుడైన మహాపురుషుడు. ఆ తోభ్యుని చరిత్రను సర్వేశ్వర మాహాత్మ్యం అనే పేరిట కృతి చెప్పమని రాయప్ప ఎల్లన్నను కోరాడు. ఎల్లన ఆ వాక్య గ్రంథాన్ని పరిశీలించి నాలుగాశ్వాసాల ప్రబంధంగా తోభ్యచరిత్రను రచించాడు.

పరిశుద్ధ గ్రంథం - పాతనిబంధన సంహితలో టోబియా గ్రంథం పద్నాలుగు అధ్యాయాలలో ఉంది. ఇదీ మరికొన్ని గ్రంథాలు కాతొలిక్కుల పాఠంలోనే ఉంటాయి. ఈ గ్రంథాలను ప్రొటెస్టాంటులు పుక్కిటి పురాణాలుగా భావిస్తారు. అందుచేత వాళ్ళ పాఠంలో ఇవి ఉండవు. పుక్కిటి పురాణాలుగా మిథ్యా ఉపనిషత్తులుగా ప్రొటెస్టాంటులు భావించే ''అపాక్రిఫియా'' భాగంలో చేరిన టోబియా గ్రంథాలవంటివి క్రైస్తవ చిత్రకళకు కూడా ప్రోద్బలాలయ్యాయి. టోబియా కథనే తెలుగు క్రైస్తవులు తోభ్య చరిత్ర అని పిలుస్తారు.

తెలుగు ప్రబంధ లక్షణాలనుగానీ, క్రైస్తవ మతాచారాల మేరకుగానీ అతిక్రమించకుండా పింగళి ఎల్లన ఈ కావ్యాన్ని చక్కగా చెప్పాడు. దీని వ్రాతప్రతులు ప్రచారంలో ఉండేవి. 1887లో సర్వేశ్వర చరిత్ర తొలిసారిగా నీతి దర్పణం అనే పత్రికలో అచ్చుపడింది. తరువాత పుస్తకరూపంలో వచ్చింది. తెలుగు క్రైస్తవ కావ్యాలలో ఇది మొదటిది.

తెలుగు క్రైస్తవ కావ్యాలలో ప్రప్రథమమైన ''సర్వేశ్వరచరిత్ర'' పేరుతో ఉన్న తోభ్యుని కథను రచించిన కవి క్రైస్తవమతం స్వీకరించాడా అన్న అనుమానం, ఇటీవల కొందరు పరిశోధకులు వెలిబుచ్చుతున్నారు.[1] కృత్యాదిని ఈ క్రింది పద్యముందని ఉటంకిస్తున్నారు.

శ్రీ చైతన్య కళానిరూఢి ఘనతం జెన్నై జగత్పూర్ణమై
ప్రాచీనార్య ప్రవీణులెల్లగావగా భాసిల్లు సర్వేశ్వరుం
డీ చందంబున శిష్య రక్షణకునైయేతెంచదో నామదీ
యాచార్యుడగు జేసునాధు మదినత్యంతంబునే గొల్చెదన్.

---

1. డాక్టర్ గుజ్జర్లమూడి డి.కృపాచారి - ''తెలుగు సాహిత్యానికి క్రైస్తవుల సేవ - పుట.156.

ఇది కవి పాఠం కాదు. ఎవరో అపపాఠాలు చొప్పించిన పద్యం. కవి చెప్పిన అసలు పద్యం పాఠం ఈ క్రింది విధంగా ఉంది.

శ్రీ చైతన్య కళానిరూఢి ఘనతం జెన్నైజగత్పూర్ణమై
ప్రాచీన ద్వయ తత్త్వమేకమనగా భాసిల్లు సర్వేశ్వరుం
డే చందంబున శిష్య రక్షణకునై యేతెంచెనొ నస్మదీ
యాచార్యుండగు నివ్వటూరి శరభాంకారాధ్యునింగొల్చెదన్ (డి. 2256)

మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో పింగళి ఎల్లన్న కృతి ప్రతి ఉంది. అందులోని పాఠాన్ని ఎవరో ఎందుకో దిద్దేశారు. ఇటీవలి పరిశోధకులను తప్పుతోవ పట్టించారు.

మల్లేల తిమ్మరాజు

బాప్తిస్మం పుచ్చుకొని తెలుగు కావ్యాలు చెప్పించిన రెడ్లలో తుమ్మావారు మొదటివారైతే వారితో వియ్యమందే గోపువారు ద్వితీయులు. తుమ్మావారు అనంతపురం జిల్లా విడిచి పెట్టి గుంటూరు జిల్లాకు వలస వెళ్ళే సందర్భంలో కొన్నేళ్ళు నెల్లూరు జిల్లాలో ఉన్నారు. ఈ కుటుంబంలోని కొందరు అక్కడే పామూరులో స్థిరపడ్డారు. మిగతావాళ్ళు గుంటూరు వెళ్ళారు. పామూరులో స్థిరపడిన వాళ్ళలో తుమ్మాకొండారెడ్డి ప్రముఖుడు. ఇతడి గురించి సర్వేశ్వర చరిత్రలో ఇలా ఉంది.

కొండారెడ్డిఘనుండు శౌర్యపటిమంగొట్టిన్ మరాటీలను
ద్దండుండన్న యతండు మాకు సుకవీంద్రశ్రేణి బ్రోచున్ సిరుల్
నిండన్ దామెర వెంకటాధిపుడు మన్నింపంగ బామూరిలో
నుండున్ మిమ్ము బహూకరింపగలడీ యుద్యత్కృతి శ్రేష్ఠతన్ (సర్వేశ్వర 1-16)

తుమ్మారాయప్ప ఈ మాటలు పింగళి ఎల్లన్నతో అన్నాడు. కొండారెడ్డి పింగళి ఎల్లన్నను బహూకరించాడనే అనుకోవాలి. అతడు బ్రోచిన సుకవీంద్రశ్రేణిలో ఉన్నవాళ్ళెవరో తెలియదు. అయితే పామూరిలో స్థిరనివాసం ఏర్పరచుకొన్న ఈ తుమ్మా కొండారెడ్డి వంశంతో ప్రతి తరంలోనూ ఇచ్చిపుచ్చుకోడాలు కావిస్తున్న గోపువాళ్ళు ఇంకో క్రైస్తవ కావ్యం రాయించారు.

గోపురాయప్ప తన ముత్తాత లింగారెడ్డికి సంజీవనాథస్వామి 1738లో ఇచ్చిన ఒక వచన కావ్యాన్ని గద్య పద్యాత్మకంగా చెప్పించాలని మల్లేల తిమ్మరాజు అనే కవిని రావించాడు. ఈ కవి కాశ్యపగోత్రుడు. వెంకట కృష్ణయ్య కొడుకు. ఇతని కవిత్వం శ్రీ పరమేశ్వర కృపాలబ్దం అని చెప్పుకొన్నాడు. ఇతనికి రాయప్ప ఇచ్చిన పుస్తకం పేరు జ్ఞాన ముత్యాలమాలిక. దీనిని జ్ఞానచింతామణి పేర గ్రంథంగా రాయప్ప చెప్పమన్నాడు.

గోపులింగారెడ్డి మరుపల్లెపురాన్ని ఏలుకొంటున్న రోజుల్లో ఒకనాడు సంజీవనాథస్వామిని చూసి ఇలా అడిగాడు.

''గురువర సర్వేశ్వరుడే
సరణిందెలియంగబడును సత్సమనగ ను
ర్వర నెటువంటిది సద్గతి
కలుగు విధంబెటులు గల్గునాలునతి నీవే'' (జ్ఞాన 1-132)

ఈ ప్రశ్నకు సంజీవనాథస్వామి ఇలా జవాబు చెప్పాడు.

ఆరూఢి నీవు నన్నడిగిన వృత్తాంత
 మంతయు దేటగావింతు నిపుడు
వినుము సర్వేశ్వర విభవంబు, సత్సశ
 బ్దార్థంబు, సద్గతి తరుగు విధము
మున్ను మద్గురు స్వామి మొదలైన పెద్దలు
 శాసించి తెనుగు ముచ్చటలు గాగ
వ్రాసిన పుస్తక వ్రాతంబు లోపల
 జ్ఞాన చింతామణి నానుతింప
దగుచు మేలైన దొక ప్రబంధంబు గలదు
దాన నద్వైత శాస్త్ర విధాన విధులు
పఠన మొనరింతు రెపుడు శ్రావ్యంబటంచు
బ్రేమ మీరంగ ప్రజ్ఞాధురీణులగుచు (జ్ఞాన. 1-133)

జ్ఞాన చింతామణి మూలాన్ని సంజీవనాథస్వామి కాక అతని గురువు తెనుగు ముచ్చటలుగాగ రచించాడని పై పద్యంవల్ల తెలుస్తూంది. అంటే జ్ఞానబోధస్వామి అనే పేరున బాప్టిస్టు డీ-లాఫాంటైన్ ప్రచారం చేస్తున్న రోజుల్లోనన్నమాట. నిజానికి ఈ జ్ఞాన చింతామణికి మూలం పోర్చుగీసు భాషలో ఉంది. 'Collar de perolos' అనే పేరుతో ఇమార్టిన్స్ అనే ఫాదిరీ దీన్ని పోర్చుగీసు భాషలో రాశాడు. దీనిని తొలుత తమిళంలోనికి (బహుశా అమలానందస్వామి) అనువదించాడు. తరువాత తెలుగు మిషనరీలు ఈ పుస్తకాన్ని అనువదించారు. సంజీవనాథస్వామి తోభ్యచరిత్రకు మూలమైన వాక్యగ్రంథాన్ని తుమ్మావారికి ఇచ్చాడు. జ్ఞానచింతామణి మూలాన్ని గోపువారికి ఇచ్చాడు. మూడునాలుగు తరాల తర్వాత ఆ వంశంలోని వాళ్లు కావ్యాలను చెప్పించారు. ఈ కావ్యం రచనాకాలానికి గోపువారు కూడా కొండవీటి సర్కారుకు చేరారు. పాలడుగు సముతులో సిరిపురంలో స్థిరపడి కొన్నిగ్రామాలు గుత్త తీసుకొని గొప్పు మరియన్న ప్రాభవం పొందాడు. ఇతని కొడుకు రాయప్పే ఈ కావ్యం చెప్పించాడు.

సామంతపూడి మల్లయ్యా

కొండవీటి సర్కారుకు చేరాక గోపువారికి కొండవీటివారనే ఇంటిపేరు కొత్తగా వచ్చినట్టు కనబడదు. కొండవీటి మరియన్న అనే ప్రముఖుడు సామంతపూడి మల్లయ్యా అనే కవిని పిలిచి ఫ్రెంచి జెసూట్లు తెలుగు వచనంలో రాసిన ఒక గ్రంథాన్ని గద్య పద్యాత్మకం చేయించాడు. ఈ మరియన్న జ్ఞాన చింతామణి చెప్పించిన గోపురాయప్ప

తండ్రి మర్సన్నా వేరువేరు వ్యక్తులు. కొండవీటి మరియన్నకు చిన్నయ్యా అనే కుమారుడున్నాడు. గోపు మరియన్నకు ముగ్గురు కొడుకులున్నారు గానీ ఒక్కరికీ చిన్నయ్యా అనే పేరు లేదు.

సామంతపూడి మల్లయ్యా వైదిక బ్రాహ్మణుడు. కాస్యపసగోత్రుడు. పాపన్నగారి కొడుకు. కొండవీటి మరియన్న ఇచ్చిన క్రైస్తవగ్రంథాన్ని పద్యరూపంగా చెప్పి శ్రీశైల మల్లికార్జునికి కృతి ఇచ్చాడు. ఈ గ్రంథంపేరు ''అనిత్య నిత్య వ్యత్యాసం''. దీనిని స్పెయిన్ దేశంలో 1840లో రెవరెండ్ - జె.నియరన్ బర్గ్ అనే ఫాదిరీ'' 'The difference between the Temporal and the Eternal' అనే పేరిట వ్రాశాడు. ఇది అచ్చుపడిన వెంటనే కొద్దికాలంలో యూరోపుదేశంలోని అన్ని భాషలలోనికీ అనువదింపబడింది. ఈ గ్రంథం వంటిదే తెలుగులో కూడా వచ్చింది. దీనిని పరమానంద గురువు అనే పేరుగల జెసూటు రచించాడు. ఇది నీరెన్‌బర్గుగారి పుస్తకానికి మక్కీకి మక్కీ అనువాదం కాదుగాని దానిని దృష్టిలో పెట్టుకొని రచించినది.

తెలుగుదేశంలో వెలసిన ఇటువంటి పుస్తకాన్నే తమిళంలో రెవరెండ్ జె. మేనార్డ్ అనే జెసూటు రాశాడు. ఈయన 1661 నుండి 1717 దాకా తమిళ దేశంలో మత ప్రచారం చేశాడు. బహుశా మేనార్డు ఫాదిరికే పరమానందగురువు అనే పేరుంది కాబోలు. ''అనిత్య నిత్యవ్యత్యాసం'' తెలుగు నుండి తమిళంలోనికి పరివర్తనం పొందిందని కొందరంటారు. తమిళం నుంచే తెనిగించారని పరిశోధకులు భావిస్తున్నారు. ఇది ఇప్పటికి తెలుగులో మూడు ముద్రణలు పొందింది. ఆ మొదటి ముద్రణలో చాలా తమిళ పదాలు ఉన్నాయి. 1881లో ఈముద్రణ జరిగింది. అప్పుడు కృత్యాది పద్యాలను ఫాదిరీలు తొలగించారు. మల్లికార్జునుడు అనే పేరున్న చోట జేసునాధుని పేరు చేర్చారు. షష్ఠ్యంతాలలో సర్వేశ్వరుని పేరు భర్తీచేశారు. రెండవ ముద్రణలో తమిళ పదాలు మార్చారు. మూడవ ముద్రణ 1926లో నెల్లూరు సుబేదార్ పేటలోని సెయింట్ జాన్స్ ప్రెస్‌లో వేశారు.

ఈ గ్రంథంలో 14 వ్యత్యాసాలు ఉన్నాయి.

1. నరకవేదన యొక్క యెరుక.
2. నరకముయొక్క ఆజ్ఞ
3. నరకము యొక్క విశేష ఆజ్ఞ
4. నరకము యొక్క నిత్యాజ్ఞ
5. ప్రపంచముల చల్వములయొక్క అల్పతనము
6. మనుష్యుని యొక్క యునికి
7. మరణము యొక్క విపరీతము
8. మరణము యొక్క విశేషములు
9. దేవ ఇష్టప్రసాద శ్లాఘ్యము
10. ప్రత్యేక తీర్పు యొక్క భీకరము
11. పొత్తు తీర్పు యొక్క వగ

12. పొత్తు తీర్పు వగదెంచుట
13. మోక్షవరము
14. మనుష్యుని యొక్క అంత్యగతి

పై పధ్నాలుగు వ్యత్యాసాలలో మొదటి పదమూడింటినే మల్లయ్య అనువదించాడు. తమిళం నుండి తెనిగించిన మూలగ్రంథం నుండే పద్యకావ్యం రాశారని చెప్పడానికి 4వ వ్యత్యాసం పేరే చెప్తోంది. తమిళంలో ఐశ్వర్యాన్ని ''సెల్వం'' అంటారు. ఈ వ్యత్యాసాలను వివరించడానికి పరమానంద గురువు సమకాలికమైన భారతీయుల దృష్టాంతం చూపెట్టాడు. వెంకటపతిరాయల చరిత్రను తార్కాణంగా ఇలా చెప్పాడు.

''ఓ భాగ్యాభిలాషుడా! ప్రపంచ అల్పభాగ్యముల మీద నీకుగల పట్టు వదులుటకు ఇది చాలదా! చాలదంటే ఇంకా వినుము. విజయనగర పట్టణములో అనేక రాజ్యములకు నధిపతియై కర్తగానుండిన వెంకటపతియను రాజు సమస్తమునకు నరపతియనిపించుకొని లెక్కమితములేని దళములను గూర్చుకొని మహాశౌర్యముతో ననేకరాజులను జయించి పట్టిన కార్యమును పోరాడి నెరవేర్చువాడును, తన ప్రజలను రక్షించువాడును బ్రహ్మాండమైన తురకల దండును సంహరించి వీరులకు వీరుడైన వాని తల తెగనరికి శూరత్వపు బిరుదులను కొనినవాడును సముద్రనాథుడనిపించుకొని ఏనుగులను సహితము పట్టి మర్దించు బలశాలియై మహావైభవముతో లోకమునకంత అధిపతి రాజు నేనేయని చెప్పుకొనుచున్నవాడును రాజ్యము పోగొట్టుకొని గౌరవము ధారబోసికొని పట్టణము నుండి వెళ్ళదరిపించుకొని మహాదుఃఖమునొంది పరదేశిగా పడి చచ్చెను. కంటిరా, యాలోకములోని మాయమగు చెల్వ సుఖభోగములను నమ్మిన వానికి వచ్చిన గతి తెలిసెనా!''

ఈ వచన భాగాన్ని సామంతపూడి మల్లయ్య ఇలా పద్యాలలో చెప్పాడు.

''ఈ ప్రపంచపు మాయా మహిత విలాస
వైభవంబు లవేమి శాశ్వతము వినర
మోక్షమొసగగ నవతార మూర్తులైన
పరమ కర్తల జేరుట భాగ్యమదియు

మరియు విజయనగర పట్టణము నేలిన వెంకటపతియను రాజుయొక్క మరణము వినుము.

మరి తొలి యొక్క శూరుడు సమస్త మహోన్నత భాగ్యశాలియై
నరపతియౌనటంచును ఘనంబుగ సర్వజనంబు లెన్నగా
నరిగి దళాలు గూర్చుట మహాపటుశౌర్యముతోడ నెల్ల భూ
వరుల నశింపజేయగను వారక ధైర్య భయంకరాంకుడై

అటుమీదట కొన్నాళ్ళకు
బటు శౌర్యంబననివాడు పందై స్వమహా

పుట ఛేదనంబు లోనం
తట దుర్బలుడగుచు వెళ్ళదరుమం బడియెన్

తుదకు బరదేశి చందమ్మై యొదగి యొదగి
తిరరుగుచుం బరదేశాలు తిరిగి తిరిగి
కూడుగానక యేడ్చుచుకుండకోల
ధారియై కొన్ని దినము లీ తీరున మని

కడసారికి సమయగ నె
క్కడి దిక్కెవ్వారు లేని కష్టపు జాలై
పడి పెద్ద నిద్దుర వోయెను
బుడమిని మొనగాండ్లకబ్బు భోగంబులివే!''

(8వ వ్యత్యాసంలో 35 నుండి 39 దాకా)

జ్ఞాన చింతామణి రచన క్రీ.శ.1800కి ముందు జరిగి ఉంటుందని మూడవ ముద్రణ పీఠికలో రాశారు.

మంగళగిరి ఆనందయ్య

జ్ఞాన చింతామణిలాగే మూడు ముద్రణలు పొందిన ఇంకొక క్రైస్తవ కావ్యం ''వేదాంత రసాయనం''. దీనిని మంగళగిరి ఆనందయ్య రాశాడు. ఇతడు క్రైస్తవకవి అని సి.పి.బ్రౌను దొరగారు. వీరేశలింగంగారు వంటివాళ్ళే భ్రమపడ్డారు. 1740 ప్రాంతాలలో దీని రచన జరిగిందని కూడా బ్రౌను పొరపడ్డారు. మంగళగిరి ఆనందయ్య నియోగి బ్రాహ్మణకవి. దీని రచన 1787–1790 నడుమకు ముందు జరిగింది.

మంగళగిరి ఆనందయ్య ''విజయనందన విలాసం'' అనే పేరుతో ''శశిరేఖా భామా పరిణయ కథ''ను మూడాశ్వాసాల ప్రబంధంగా మొదట రాశాడు. దీనిని గోదావరి జిల్లా పిఠాపురం డివిజన్‌లో ఉన్న ధర్మవరం పాలించే దాట్ల కృష్ణమరాజుగారికి అంకితమిచ్చాడు. ఫ్రెంచి సైన్యాలు ఉత్తర సర్కార్లలో విజృంభించిన తర్వాత వాళ్ళను చూసి రాచవారు ''కుముందాన్'' అనే బిరుదును తమ పేర్ల చివర ధరించేవారు. విజయనందన విలాసంలో కృతిపతి వంశాన్ని వర్ణిస్తున్నప్పుడు చాలా తరాలలోని వ్యక్తులను ''కుముందానువిభుడు'' అనే బిరుదుతో కవి వర్ణించాడు. కృతిపతి తాతగారి పేరు కూడా వెంకటకృష్ణమరాజే! ఈయన్నే కవి మొదటిసారి ''కుముందాన్'' అన్నాడు. తాతగారు ఫ్రెంచి సైన్యాలు ఉత్తర సర్కార్లలో ప్రవేశించాక ''కమాండెంట్'' బిరుదు పెట్టుకొన్నాడు. కనుక క్రీ.శ. 1757 ప్రాంతాలవాడై ఉంటాడు. తరానికి ఇరవై సంవత్సరాలు లెక్కపెట్టుకొంటే కృతిపతి 1797 ప్రాంతాలవాడయి ఉంటాడు. అయితే 1757 నాటికే కృతి పతి తండ్రి యువకుడై ఉంటే కృతిప్రతి 1787 ప్రాంతాలలో కావ్యాన్ని అంకితం పుచ్చుకొని ఉండొచ్చు.

విజయనందన విలాసం రొటీను ప్రబంధం. దీనిని 1919లో చెలికాని లచ్చారావుగారు ''అముద్రితాంధ్ర గ్రంథ సర్వస్వము'' ప్రచురణలో నాలుగో గ్రంథంగా

ప్రచురించారు. కవి కాలాన్ని నిర్ణయిస్తూ అప్పటికి 70, 80 సంవత్సరాల కిందటివాడని చెప్పారు. అంటే లచ్చారావుగారి అంచనా ప్రకారం 1839 ప్రాంతాలవాడు కావాలి. ఇది అసంభవం! ఏమంటే, అప్పటికే బ్రౌను దొరగారు ఆంధ్ర సాహిత్యాన్ని మథించినవారు. సజీవులైన తెలుగు కవులతో పరిచయమున్నవారు. 1840లో తెలుగు క్రైస్తవ కావ్యాలపై వ్యాసం రాస్తూ దొరగారు ఆనందయ్య కాలనిర్ణయంలో పొరబడ్డారు. ఈ కవి వేదాంత రసాయనాన్ని 1720 ప్రాంతాలలో రాశాడని తమ దగ్గరున్న ప్రతులపై ప్రకటించారు.

విజయనందన విలాసం రాశాక ఆనందయ్య బందరు చేరుకొన్నాడు. ఆనాడు బందరులో వివిధ సంస్థానాధిపతుల వకీళ్ళు. జమీందార్ల మనుషులూ పరదేశప్రభువులను కనిపెట్టుకొని ఉండేవారు. బందరులో ఫ్రెంచివారి ప్రభ వెలుగుతున్నప్పుడు వాళ్ళ దుబాషీలుగా దివానులుగా నిడిమామిళ్ళవారు ఉండేవారు. వీళ్ళు క్రైస్తవులుగా మారిన బ్రాహ్మణులు. వీళ్ళ పూర్వులు మొదటి ఫ్రెంచి జెసూటు జ్ఞానబోధస్వామి దగ్గర చిన్న బళ్ళపురంలో బాప్తిస్మం పుచ్చుకొన్నారు. ఆయన దగ్గరే బహుశా ఫ్రెంచి నేర్చుకొన్నారు. ఫ్రెంచి ప్రభుత్వం బందరులో వెలిశాక అక్కడికి వలస వెళ్ళారు. నిడిమామిళ్ళవారి వంశవృక్షం ఇది:

1. నిడిమామిళ్ళ మల్లరసు

2. పర్వతమ్మ

3. రాయన్న

4. రాజప్ప 5. దాసన్న

6. ఇన్నయ్య 7. రాయుడు 8. దేవ 9. ఆనంద రాయుడు రాయన్న దేవరాయన్న రాయుడు

ఈ వంశంలో మొదటి తరం వ్యక్తి మల్లరసు హోవతి బైచరాజు (1704-1720) దగ్గర మంత్రిగా ఉండేవాడు. జ్ఞాన బోధస్వామి వద్ద బాప్తిస్మం పుచ్చుకొన్నాడు. ఇతని కుమారుడు పర్వతన్న కూడా మంత్రిత్వం చేశాడు. ఈయనను ధణిమంత్రి అని పిల్చేవారు. ఈయన క్రైస్తవ మతతత్వ చర్చలు చేస్తూ ఉండేవాడు. మూడవతరం వ్యక్తి రాయన్నకాలంలో ఈ వంశం కొండవీటికి వచ్చినట్టుంది. నాలుగవతరంలోని రాజప్ప ఫ్రెంచివాళ్ళ దుబాషీ. గుంటూరు జిల్లాల్లో ఘనంగా జీవించేవాడు. ఇతని తమ్ముడు దాసప్ప (కృతిభర్త) 1787లో మచిలీపట్నంలోని ఫ్రెంచివారి గిడ్డంగికి దివానుగా ఉండేవాడు. రాజప్పకు గుంటూరుజిల్లా ఓలూరులో ఆస్తులున్నాయి. అక్కడే అతనికి 1765లో

ఇన్నయ్యా అనే కుమారుడు జన్మించాడు. తర్వాత మరి ముగ్గురు పుత్రులు పుట్టారు. ఇన్నయ్యా 1790లో ఓలేరులోనే మరణించాడు. ఇతని సమాధిపై తెలుగులోనూ ఫ్రెంచిలోనూ శాసనాలు ఉన్నాయి. తెలుగులో ఇలా ఉంది.

''సర్వేశ్వరునికి దాసులై పుదుచేరి పట్టణం ఫ్రాంసు పాదుషాః కార్యస్తులై వారి ముద్ర బిరుదులు ధరచ్చిన రా. నిడమామిళ్ళ రాజప్ప అక్కమ్మ వీరలకు జ్యేష్ఠపుత్రుడు యింన్నయ్యా 1765 సం. నిజజ్యేష్ట బ. విదియలు గు.ఓలేరులో జన్మించ్చి యిరువైఆరో ప్రాయాన 1790 సాధారణ సం. ఆశ్వీజ ద్వాదశీలు మంగళవారమునాడు జన్మభూమిని క్రమించినందున్ను సకల వారుంన్ను ఈ ఆత్మాంన్నిగూర్చి స్వామివార్ని ప్రార్థించ్చుండా.''

(వేదాంత రసాయనం. పు.14)

కావ్యంలో కృతిపతి వంశాన్ని వర్ణిస్తూ దానప్ప బందరులో దివానుగా ఉన్నాడని కవి చెప్పాడు. (1-45). ఈదివానుగిరీ 1787లో ప్రారంభమైంది. వంశవర్ణనలో ఇన్నయ్యాను కవి సజీవునిగానే పేర్కొన్నాడు. (1-41). ఇన్నయ్యా 1790లో మరణించాడు కాబట్టి కృతి రచనా కాలం 1787-1790 నడుమ అని నికరంగా తేల్చవచ్చు.

మంగళగిరి ఆనందయ్యా రచించిన వేదాంతరసాయనం నాలుగాశ్వాసాల ఉత్తమ కావ్యం. ప్రబంధ లక్షణాలను పాటిస్తూ క్రైస్తవ మతానికి విరుద్ధంకాని రచనను కవి చాలా చాకచక్యంగా చేశాడు. ఒక హిందువు ఇంత చక్కగా ఈ రచన చేయడం శ్లాఘనీయం. కవి క్రైస్తవుడే అయి ఉండాలన్న అభిప్రాయాన్ని మళ్ళించేటంత మనోహరంగా ఈ రచన ఉండడం వల్ల బ్రౌనుదొరగారి దగ్గర్నుంచి ఇటీవలి పరిశోధకుల దాకా ఎందరో ఆ పొరపాటు అభిప్రాయానికి వచ్చారు.[2]

కుంఫిణీ యుగంలో ముగ్గురు ఆనందనామధేయులు ముఖ్యులుగా కనబడు తున్నారు.

1. మెకంజీ గుమాస్తా ఆనందరావు.
2. వేదాంత రసాయనం రచించిన ఆనందయ్యా
3. విశాఖ పట్నంలోని లండన్ మిషన్‌లో బైబిలు అనువాదానికి తోడ్పడ్డ ఆనందరావు.

ఈ ముగ్గురూ ఏకవ్యక్తులే నన్న పొరపాటుకు మనపరిశోధకులు లోనయ్యారు. ఈముగ్గురేకాక వేదాంతరసాయనం కృతిపతి అన్నగారి కుమారులలో కడగొట్టువాడు ఆనందరాయుడు ఉన్నాడు. ఇతడే వేదాంతరసాయనం రచించాడని ఒక పరిశోధకుడు అభిప్రాయపడుతున్నాడు.[3] వేదాంత రసాయనం గద్యలో కవి తాను తిమ్మనామాత్య

2. జె. మంగమ్మ ''బుక్ ప్రింటింగ్ ఇన్ ఇండియా'' అనే పుస్తకంలోనూ (పుట.65), కొత్తపల్లి వీరభద్రరావుగారు ''తెలుగు సాహిత్యం ఇంగ్లీషు ప్రభావం'' (పుట.97)లోనూ, గుజ్జర్ల కృపాచారి ''తెలుగుసాహిత్యం క్రైస్తవుల సేవ'' (పుట 159 నుంచి) వేదాంతరసాయనం కర్త క్రైస్తవుడని భావించారు.

3. కృపాచారి, పుట.184

పుత్రుడనని చెప్పుకొంటే రాజన్నకుమారడయిన ఆనందరాయుడు ఇది రాశాడని ఈ పరిశోధకుడు ఎలా భావించాడో మరి? వేదాంత రసాయనం రచించిన మంగళగిరి ఆనందయ్య ఆత్రేయ గోత్రుడు. నిడమామిళ్ళవారిది హరితసగోత్రం. విశాఖపట్నంలో బైబిల్ రచనకు తోడ్పడ్డ ఆనందరావు పూర్వాశ్రమంలోని పేరు సుబ్బారావు. దేశస్థ బ్రాహ్మణుడు మెకంజీ గుమస్తా ఆనందరావు వివరాలు తెలియవు. వీరందరూ విభిన్న వ్యక్తులు. నామసామ్యాన్నిబట్టి పరిశోధకులు వీరు అభినున్నలని ఊహాగానాలు చేయసాగారు.

మంగళగిరి ఆనందయ్యా రచించిన వేదాంత రసాయనంలో ఆదాముహవ్వల పుట్టుక నుంచీ కథ ఉంది. జేసువృత్తానం, జ్ఞానులరాక, యోహానురాక, జ్ఞానస్నానం, జేసు మహిమలు, సిలువ వేయడం, సమాధి నుండి మూడవరోజు తిరిగి లేవడం, దేవపూజా విధానాలు మొదలైనవన్నీ నాలుగాశ్వాసాలలో 886 గద్యపద్యాలలో సలక్షణమైన ప్రబంధరీతిలో ఉన్నాయి. జేసునాథుని సిలువవేసే ఘట్టాన్ని ఇలా వర్ణించాడు.

కుటిల భ్రూకుటి భీమఫాలతటులై క్రోధాప్తిం దేజః పరి
స్ఫుట గాత్రుల గరుణాక్షమా గుణ గరిష్ఠున్ స్లీవకుందార్చి యు
క్కటు హస్తాంఘ్రుల శాతకంటక దయః ఖండాళి సంధించియు
త్కటు ఘోషంబున సీల్వ నాటిరది గోత్రా నిర్జర గ్రామణీ'' (వేదాంత. 4-5)

తనను సిలువ వేసిన వారిని మన్నించమని భగవంతుని జేసు ప్రార్థించడం ఇలా చెప్పాడు.

''పగతురచేత స్లీవఁబడి భారపునొప్పి సహించి యీ దృశం
బగు దురవస్థ జూదుకులు లజ్జతనన్ బొరయించి నారలో
ర్వగందగు నయ్యతత్త దపరాధము లెన్న కొంకింత భక్తి, గే
ల్మొగిచి భజింతు నీచరితమ్ముల్మది మజ్జనగా పరాత్పరా''. (వేదాంత. 4-7)

తన కృతిపతి మత విశ్వాసాలను పూర్తిగా ఆకళింప చేసుకొని సమయ విరోధం లేకుండా కావ్యరచన చేయడం గొప్ప విశేషమే. వేదాంత రసాయనాన్ని 1882లో బాలనాథ ఫాదిరీ, రాజనాథఫాదిరీ తొలిసారిగా ప్రచురించారు. 1926లో జాన్ ఆలెన్ ఫాదిరీ ప్రకటించారు. 1969లో నెల్లూరులోని సెంట్ జాన్ ప్రెస్‌వారు విపులమైన పీఠికతో ప్రకటించారు. ఇది క్రైస్తవ కావ్యాలలో ఉదాత్తమైనది. అనంతర క్రైస్తవ కావ్యాలలోనూ కవులలోనూ ఈ ప్రౌఢిమ చాలా అరుదుగా కనబడుతుంది.

పోలవరపు రాయడు

గుంటూరు జిల్లా తుమ్మావారి వల్లా, నిడమామిళ్ళవారి వల్లనేకాక మరికొన్ని కుటుంబాలవారి వల్ల కూడా ఆదిలో క్రైస్తవ మత వ్యాప్తి జరిగింది. పద్యరచన సాగింది. కనపర్తి, తురకపాలెం మొదలైన గ్రామాలలోని చాలామంది వృద్ధులకు పూర్వం క్రైస్తవ పద్యాలు కంఠతావచ్చును. శతకాలూ, దండకాలూ, ద్విపదలు మొదలైన ప్రక్రియలన్నీ

క్రైస్తవ కవులు వాడుకున్నారు. పోలవరపురాయడు అనే కవి ''జేసువా'' అనే మకుటంతో ఒక శతకం చెప్పాడు.

''పోలవరపురాయుడను బొల్పుగ నాగతి నీవటంచున్
కాలము వేడుచుండెదను గన్నులు చూడగ లేకయుండెనన్
జాలగ నీయనుగ్రహ ప్రసాదముచే శతకంబు నొక్కటిం
మేలిమితో రచించితిని మీకిటులంకిత మిచ్చి జేసువా'' (100)

ఈకవి అంధుడు. తనకు నేత్రాలు ప్రసాదించమని కోరుతూ ఈ శతకాన్ని చెప్పాడు. క్రిస్మస్ పండుగ గురించి ఇలా చెప్పాడు.

''క్రీస్తువు లెల్లరేకముగ క్రీస్తువుస్వామి జనించుపండుగన్
హస్తములందు యిష్టముల హారములారతి ధూప దీపముల్
మస్తుగ జేర్చి పూజలను మక్కువగాంచినుతించనను నీ
గస్తినిబాపి పండుగను గాంచగ నియ్యవె దివ్య జేసువా'' (18)

పోలవరపురాయుడు రావిపాడు గ్రామనివాసి. ఈ శతకాన్ని వార్ధక్యంలో చెప్పాడు. ఇంతకన్నా ఇతని వివరాలు మరేం తెలియవు. ఇతని పద్యాల వ్రాతప్రతులు గుంటూరుజిల్లా కమ్మక్రైస్తవుల వద్ద లభించాయి.

తెలుగు ప్రాచీన సాహిత్యంతో తగుమాత్రం పరిచయముండి నుడికారం తెలుసుకొన్న తెలుగు క్రైస్తవులు తమకు కావలసిన పద్యాలను తామే రచించుకొనసాగారు. ''పద్యగుచ్ఛము'' అనే గ్రంథం ఎప్పుడు సంకలనమైందోగానీ ఇందులో ఈ కింది శీర్షికలలో పద్య రచనలు ఉన్నాయి.

1. జేసు శ్రీనామము
2. కడతీర్పు వర్తమానము
3. జేసునాథుని మీద భక్తి
4. సుకృత మంత్రములు
5. శ్రీ జేసు శతకము
6. తోబ్యచరిత్రము (ద్విపద)
7. దండకములు
8. ముగ్గురు రాజులు
9. జేసునాథుని జీవిత చరిత్ర
10. కన్య మరియమ్మ మహిమ
11. జపమాల రహస్యములు
12. దేవమాత ప్రార్థన
13. నీతిబోధన
14. సుగుణాలోచన
15. సంసోనురాయని చరిత్రము

ఈ రచనలన్నీ కేతలిక్కులు ఆదిలో రచించుకొన్నవే. ''కన్యసుత జేసుతారక కరుణసాంద్ర'' అనే మకుటంతో ఇరవై సీసపద్యాలు ''జేసు శ్రీనామము''లో ఉన్నాయి. ''జేసునాథుని మీద భక్తి'' అనే శీర్షిక కింద పోతనగారి ''కమలాక్షునర్చించు కరములు కరములు'' అనే సుప్రసిద్ధ భాగవత పద్యాన్ని పోలిన పద్యం ఉంది.

''కన్యజునర్చించు కరములు కరములు
జేసును వర్ణించు జిహ్వా జిహ్వా
సుగుణాకరుని జూచు చూడ్కులు చూడ్కులు
శ్రీకర్తకను మ్రొక్కు శిరము శిరము
విమలాత్ముని వినెడు వీనులు వీనులు
మరియ పుత్రుదలచు మనము మనము
పరమీశువలకొను పదములు పదములు
భూరక్షకుని మీది బుద్ధి బుద్ధి
దేవదేవుని జింతించు దినము దినము
సర్వనాథుని బ్రకటించు చదువు చదువు
గురుడు జేసును జెప్పెడి గురుడు గురుడు
తండ్రి ఏదవు జేరు మనెడు తండ్రి తండ్రి''

ఏ శాఖ క్రైస్తవులకైనా సరే ''జగద్రక్షకుడైన యేసుక్రీస్తు తన శిష్యులకు నేర్పిన ప్రార్థన'' పరమ ప్రామాణికమైన మంత్రం. దీనిని Watt's First Catechismలో ఇలా తెనిగించారు.

''పరమండలంబందుండే మా తండ్రీ!
నీ యొక్క నామము పవిత్రమై యెంచపడని
నీరాజ్యము రానీ
నీ చిత్తము పరలోకము నందు చేయబడినట్టు భూ
లోకమందున్ను చేయబడని
దినదినాకు కావలసిన ఆహారాంని మాకు
దినం ప్రతిదయ చేయి
మాకు అపరాధము చేసినవారిని మేము క్షమించే
లాగున నీవు మా అపరాధములన్నీ క్షమించు
మమ్మును శోధన మందును ప్రవేశించనియ్యక కీడులో
నుంచి మమ్మును రక్షించు
యేమంటె రాజ్యమున్ను పరాక్రమున్ను మహత్తున్ను
సదాకాలము నీవైయున్నవి
ఆమెన్''

(లండన్‌లోని ఐ.ఓ.ఎల్. గ్రంథాలయంలో 14174-37)
(1-23 బాట్స్.నెం.1) సంఖ్యగల గ్రంథంలో పుట.26)

నుడికారం లోపించిన ఈ మంత్రాన్ని ప్రాచీనాంధ్ర కేతలిక్కులు ఇలా గణబద్ధం చేశారు.

దీనిని జ్యోతిశ్చక్ర మంత్రమన్నారు.

''పరమండలంలో బ్రబలియుండెడి తండ్రి
నీదు విమల నామ మెచ్చటైన
గడస్తుతించబడుగాక నీ రాజ్యము
భవ్యముగా మాకు వచ్చుగాక
పరములో నీ చిత్తమమరి యుండెడిరీతి
భూమియందున నమరియుండుగాక
నానాటికిని మాకు నవసరంబై యుండు
నన్నంబు నేటికి మాకు నిడుము
ఒరుల తప్పిదములు మే మోర్చినట్లు
మాదు తప్పుల నీ వోర్చుమయ్య స్వామి
శోధనలయందు మమ్ముల నుండనీక
పొసగ మము కీడులో నుండి బ్రోవుమయ్య''.

ఈ ప్రార్థనలో యతి సూత్రాన్ని పాటించలేదుగాని గణబద్ధమైన నడక ఉంది. కనుక కంఠోపాఠం చేయడానికి వీలు ఉంటుంది. ఇదే ప్రార్థనను తొలి తెలుగు కేతలిక్కులు దండక రూపంలో కూడ రచించుకొన్నారు.

భారతదేశంలో మత ప్రచారం చేయడానికి ప్రొటెస్టాంటులు 1795లోనే లండన్ మిషన్ సొసైటీని స్థాపించారుగాని 1805 నాటికి గాని తెలుగు జిల్లాలలో స్థావరాలు ఏర్పరుచుకొనలేదు. 1805 జూలై నెలలో విశాఖపట్నంలో అలగ్జాండర్ డెకాంగ్రెస్, జార్జ్‌క్రేన్ అనే మిషనరీలు క్రైస్తవ కేంద్రాన్ని స్థాపించారు. బైబిలు అనువాదం ప్రారంభించారు. 1698లోనే లండన్‌లో నెలకొన్న క్రైస్తవ విజ్ఞానాభివృద్ధి సమాజం (ఎస్‌పిసికె) వారు 1826లోగాని మద్రాసుకు జాన్ హెన్రీహైగ్ అనే మిషనరీని పంపలేదు. ఈ సమాజం వారు ఆంధ్రప్రాంతంలో 1852లోగాని ప్రచారం మొదలుపెట్టలేదు. అమెరికన్ బాప్టిస్టు మిషన్‌వారు 1814లో సంఘాన్ని స్థాపించినా 1835లోగాని తెలుగు నేలపై ప్రచారం ప్రారంభించలేదు. ఈ కారణాలవల్ల ఆంధ్రదేశంలో ప్రొటెస్టాంటుశాఖ వేళ్ళూనడానికి మొలకెత్తి విస్తరించడానికి కొన్ని తరాల కాలం పట్టింది.

బాప్తిస్మం పుచ్చుకొన్న ఆంధ్రులు తమ ప్రొటెస్టాంటు దృక్పథంతో పద్యరచన చేసినా వీరిలో కీర్తనలు రచించినవారే ఎక్కువగా కనబడతారు. పాట ప్రజలను సమీకరిస్తుంది. హృదయంలోని భావాలను సూటిగా వ్యక్తం చేస్తుంది. తెలుగు ప్రొటెస్టాంటులలో చౌదరి పురుషోత్తం (1803-1890), విల్యండాసన్ (1816-1881), దావీదుచౌదరి (1838-1875), దాస్ అంతర్వేది (1822-1881), పులిపాక జగన్నాథం (1826-1896) మొదలైనవారు తొలితరం సంకీర్తన రచయితలు.

చౌదరి పురుషోత్తం

చౌదరి పురుషోత్తంగారు గౌడబ్రాహ్మణులు. బెంగాలు నుండి వీరి కుటుంబం కొన్ని తరాల కిందట వచ్చి పర్లాకిమిడి ప్రాంతాలలో స్థిరపడ్డారు. పురుషోత్తంగారికి ఉపనయన

సంస్కారం జరిగింది. సంధ్యావందనం మొదలైన నిష్ఠలున్న పెంపకంతో పెరిగారు. వేద పారాయణ చేసేవారు. పురాణేతిహాసాలు కావ్యాలు చదువుకొన్నారు. తెలుగు ఓఢ్ర భాషలలోనూ సంస్కృతంలోనూ మంచి జ్ఞానముంది. వేదాంత గ్రంథాలు పఠించారు.

1832లో మత జిజ్ఞాస కలిగింది. క్రైస్తవ సాహిత్యం చదివారు. ఆకర్షితులయ్యారు. 1833లో బాప్తిస్మం పుచ్చుకొన్నారు. మతప్రచారానికి పూనుకొన్నారు. తమకు ప్రజ్ఞ ఉన్న సాహిత్య రచనను అందుకు ఉపయోగించారు. 'యేసునాయక' అనే మకుటంతోనూ ''క్రీస్తు ప్రభూ'' అనే మకుటంతోనూ రెండు శతకాలు రచించారు. ''రక్షణ సుచరిత్ర'' ప్రచురించారు. ''నిస్తర రత్నాకరం'' అనే మోక్షగ్రంథాన్ని వివరించి ప్రకటించారు. పంచచామరాలలోనూ, ''పన్నా''లలోనూ పంచరత్నాలు చెప్పారు. చాలా కీర్తనలు రచించి ప్రచారం చేశారు. ''క్రైస్తవ నీతి ప్రకాశము'' అనే చరిత్రను రచించారు.

పురుషోత్తంగారు రచించిన ''నిస్తర రత్నాకరం'' తొలి ముద్రణ ఎప్పుడు జరిగిందో తెలియదు. కర్తపేరు తెలియని ఒక ''నిస్తర రత్నాకరం'' ప్రతిలోని హిందూ మత దూషణ గల భాగాలు వదలివేసి సి.పి.బ్రౌను దొరగారు ప్రచురించదలచారు. దీని పరిష్కరణను ఒక కవికి 1852లో అప్పగించి మూడువేలరూపాయలు పారితోషికంగా ఇచ్చారు. ఎస్.పి.సి.కె. సంస్థ వారికి ఈ ''నిస్తర రత్నాకరం'' బహూకరించారు.[4] భావి పరిశోధనవల్లగాని చౌదరి పురుషోత్తంగారి గ్రంథాన్నే బ్రౌనుదొరగారు ఇలా మార్చినట్టు చెప్పలేము.

ఏమైనా పరమతర దూషణ - స్వీయ మత ప్రచారంలో మిళితమయ్యేది. 1834 సంవత్సరాంతంలో చౌదరిగారు చెన్నపట్నం జార్జిటౌను సంత వీధిలో సువార్తను ప్రకటిస్తున్నప్పుడు అక్కడ గల ''రౌడీమూక'' బలవంతంగా కాళ్ళు కొందరూ, చేతులు కొందరూ పట్టుకొని ఊయల ఊపి విసిరివేయబోతున్నప్పుడు ఎవరో పుణ్యాత్ముల ప్రమేయం వల్ల ఆయన బతికి బయటపడ్డాడు.[5]

చౌదరిగారి కీర్తనలలో విగ్రహారాధనను ఖండించే పాటలున్నయో లేవో ప్రస్తుతం చెప్పలేముగాని ఆనాటి బాప్టిస్టు కీర్తనలలో ఉన్నాయి. బిళ్ళా జాన్‌గారు రచించిన ఈ కీర్తన చూడండి.

ప. ఏలబొమ్మలను గొల్వ నేమి లాభము - మన
మేల బొమ్మలను గొల్వ - నేమి లాభము
చాలు బొమ్మలను గొల్చు - చంద మెఱుగక మునుపు
మేలు మేలంచు కొల్చి - మేల్కొంటిమిప్పుడు ||ఏల||

చ 1 సృష్టికర్తను వీడి - సృష్టినామోదించి
యిష్ట దైవంబులనుచు-నిలను గొల్చుచు గొప్ప
నష్టంబనుచుఁ దెలిసి - నను మానరది చోద్య ||ఏల||

4. Literary Autobiography of C.P.Brown.p.55
5. ఆరార్ సుందరరావుగారు - తెలుగులో క్రైస్తవ సాహిత్యం, మొదటి సంపుటం. భక్తిసాహిత్యం, సికందరాబాదు, 1976. పుట.21.

చ 2. దేవునికన్నఁ బ్రియము-దేనిందలంచ బొమ్మ
సేఁవజేసినయట్లు-చేకూరు పాపంబు
భావ శుద్ధికి మనకు-ప్రభు యేసునాథుఁడుండ ||ఏల||

చ.3. మందు నూరుటకొకటి-మడిపంచెలుదక నొకటి
బొంద గుర్తున కొకటి-బురదఁ దుడుచుట కొకటి
అందొక్క ఱాయి మల్చి-యది దేవుఁడని యందు ||ఏల||

చ 4. కుమ్మరి మన్నుఁ గల్పి-కుండలధికంబుఁ జేయ
నిమ్మైన కుండఁ దెచ్చి-యిడుపునందమరఁ బెట్టి
యమ్మవారంచు గవ్వ-లందులోవేసి కొల్తు ||ఏల||

చ.5. అడవిలోఁ జెట్టుఁగొట్టి-యన్ని పనిముట్లుం జేసి
వడివంకఁ దీర్చి బొమ్మ వఢ్రంగి చేయు పిదప
దృఢమైన రంగుంబూసి-పడిపడి మ్రొక్కుచుందు ||ఏలా||

చ.6. లోహదులన్నింటి-తోఁబాత్రాదులుఁ జేసి
సాహసంబున నొక్క-సారూప్యమేర్పరచి
ఆహోహోయనిదాని-నారాధింతురు మూఢు ||ఏల||

చ.7. చచ్చిన వారిపేర - మెచ్చి మోటైన రాళ్ళు
తెచ్చి గుడిలోనఁ బెట్టి - తెలివిలేనట్టి నరులు
ఎచ్చైన వీరులంచు-నెగిరి యెగిరి యొరసుకొందు ||ఏలా||

చ.8. దున్నుటకై యొకటి-దూది మోయుట కొకటి
కొన్ని తరగతుల వారి-కోత కోసం బొకటి
యన్నింటిలో నొక్క-టాల బోతని కొల్తు ||ఏల||

చ.9. చేతి కార్యంబులందు ప్రీతి నొందెడివారి
చేత నొండైన వానిఁ-జేసితిమంచుఁ గొల్వ
పాకంబంటుగాని - ఫలమించుకైన లేదు ||ఏల||

(ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు.
పాట నెం.432. పుట.300)

ఇటువంటి ప్రచారాన్నే బ్రౌను దొరగారు గ్రహించారు.[6] ''నిస్తర రత్నాకరం''లో విగ్రహారాధనను తీవ్రంగా దూషించారు కాబోలు. చౌదరిగారు ఆనాటి చెన్నరాజధానిలో ఎన్నెన్నో ప్రదేశాలలో కీర్తనలు పాడుతూ ప్రచారం చేశారు. చెన్నపట్నం, బళ్ళారి, కటకం, బరంపురం మొదలైన నగరాలలో విస్తృత సేవలు చేశారు. ఆంధ్ర క్రైస్తవ సంఘ స్థాపకులలో ఈయన ప్రప్రథములు.

6. Literary Autobiography of C.P.Brown.p.55

విల్యండాసన్‌గారు జన్మతః ఆంగ్లేయులుగాని పుట్టిపెరిగినది విశాఖపట్నంలో అలవర్చుకొన్నది తెలుగు సంప్రదాయం. సంగీత సాహిత్యాలలో చక్కని జ్ఞానం ఉంది. సలక్షణమైన సంకీర్తనలు గావించి గానం చేసే ప్రావీణ్యం అలవరుచుకొన్నారు. డోలు వాయిస్తూ పాడేవారు. అమితమైన ప్రచారం చేశారు. శ్రీకాకుళంలో వీరి పేర ''డాసన్‌పేట'' అనే ప్రదేశాన్ని ప్రజలు ప్రేమతో కేటాయించారు.

డార్స్ అంతర్వేదిగారు చిత్తూరు జిల్లాలో జన్మించారు. రంగూన్‌లో పెరిగారు. పటాలంలో పనిచేశారు. చౌదరి పురుషోత్తంగారికి చేదోడు వాదోడుగా ఉండేవారు. అంతర్వేదిగారే పురుషోత్తంగారి ''క్రైస్తవ నీతి ప్రకాశము'' అనే గ్రంథాన్ని 1872లో ప్రచురించారు. సువార్త సేవలో అవిరామంగా కృషి చేశారు.

పులిపాక జగన్నాథంగారు తూర్పు గోదావరి జిల్లాలోని కోనసీమ వాస్తవ్యులు. పరమ నైష్ఠిక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టాడు. 1847లో విశాఖపట్నంలో క్రైస్తవ మత స్వీకారం జరిగింది. ''నీతిబోధన'' అనే పద్యకావ్యాన్ని రచించారు. ఇది కాలగర్భంలో కలిసిపోయిందిగాని జగన్నాథంగారు రచించిన అసంఖ్యాకమైన కీర్తనలలో 29 నేటికీ క్రైస్తవ కీర్తనల గ్రంథంలో కనిపిస్తున్నాయి.

తెలుగు ప్రొటెస్టెంటులు రచించిన కీర్తనలన్నీ తెలుగు నుడికారంతో క్రైస్తవ భావజాలంతో స్పష్టంగా పరిపుష్టంగా ఏ ఇతర సంప్రదాయబద్ధమైన కీర్తనలకూ తీసిపోని విధంగా ఉన్నాయి. వీటి గురించి విపులమైన పరిశోధనలు జరుగుతున్నాయి. కొన్ని గ్రంథాలు ప్రచురితమయ్యాయి.[7] పెళ్ళిపాటలు, ఏలపాటలు, లాలిపాటలునుండి మంగళ హారతులదాకా జీవితంలో ఏ ఘట్టానికి కావసిన కీర్తనైనా భక్తులు రచించుకోగలరని ఈ సాహిత్యం రుజువు చేస్తోంది. మతాలు ఏవైనా మానవుల అభిమతాలు విశ్వజనీనాలు.

క్రైస్తవ మత విస్తరణ - కాలక్రమ సూచిక

1597 - వెంకటపతి రాయలవద్దకు ఇద్దరు జెసూటు ఫాదరులు వచ్చారు.

1615 - జెసూటు ఫాదరులు చంద్రగిరి నుండి గోవాకు వెళ్ళిపోయారు.

1617 - బందరులో విలియం మెక్వాల్డ్ అనే ఆంగ్లేయుడు ఫ్యాక్టరీ కట్టాడు.

1620 - ట్రాంక్విబారులో డేనులు గిడ్డంగి కట్టుకొన్నారు.

1626 - మధురలో రాబర్ట్ డి-నోబిలి హిందూ సన్యాసుల వేషంలో ''తత్వ బోధానందస్వామి'' అనే పేర ప్రచారం సాగించాడు.

1847 - మదరాసుకు మతగురువులు ఇంగ్లాండు నుండి వచ్చారు. (చాప్లిన్సు, పూజారులు)

1653 - బందరుకు మత గురువులు వచ్చారు (ప్రొటెస్టెంటు పూజారి)

1661 - రెవరెండు జె. మేనార్డు తమిళదేశంలో ఉన్నాడు. (ఇతనికి పరమానంద గురువు అనే పేరు ఉంది)

---

7. ఉదాహరణకు ఆరార్ సుందరరావుగారి ''తెలుగులో క్రైస్తవ సాహిత్యం''.

1670 - మచిలీపట్నంలో పోర్చుగీసువారి చర్చి ఒకటి ఉండేది.

1677 - మదరాసు కోటలో ఆంగ్లో ఇండియన్ల కోసం ఒక పాఠశాల కట్టారు.

1680 - సెంటు మేరీ చర్చికి మదరాసులో పునాది వేశారు. ఇదే మొదటి ప్రొటెస్టాంట్ దేవాలయం

1692 - ఇంగ్లండు నుండి కడలూరుకు మత గురువులు వచ్చారు.

1698 - హిందూదేశంలోని ప్రతి మత గురువూ దేశభాషలు నేర్చుకొని మత ప్రబోధం చేయాలనే నియమం వచ్చింది.

1700 - ఫ్రాంసుదేశపు రాజు పధ్నాలుగో లూయీ ఆరుగురు మత బోధకుల్ని పుదుచ్చేరికి పంపాడు.
కర్ణాటక మిషన్ స్థాపన జరిగింది.
ఫెర్రిమాడ్విట్ : తొలిమిషనరీ. మొదటి బాప్తిస్మం ఇచ్చినవాడు.

1701 - చిత్తూరు జిల్లా పుంగనూరులో ఒక వెలమ కుటుంబానికి ఫాదర్ మాడ్విట్ మత దీక్ష ఇచ్చాడు.

1703 - ఫాదర్ లీగాక్ ఇండియాకు వచ్చాడు.

1704 - జీస్ బాప్టిస్ట్ డిలా ఫాంటైన్ : పుంగనూరు. మిషన్ స్తాపకుడు. కృష్ణాపురం పాలెగార్లలో మంచి పలుకుబడి. కృష్ణాపురంలో 1718లో మరణించాడు.

1708 - ట్రాంక్విబారుకు డేనిష్ మతగురువులు వచ్చారు. వీళ్ళే భారతదేశానికి వచ్చిన తొలి ప్రోటెస్టాంటు గురువులు.

1709 - కోలారు జిల్లాలోని చిక్కబళ్ళపురంలో చర్చి కట్టారు.

1711 - మాడ్విట్ స్వాములవారికి బ్రాహ్మణులు విష ప్రయోగం చేశారు.

1712 - యస్.పి.సి.కె. లానె ట్రాంకోబారుకు ఒక అచ్చుయంత్రాన్ని పంపారు. (క్రైస్తవ జ్ఞానాభివృద్ధి సంఘం). అనంతపురంలోని కృష్ణాపురంలో భీమశెట్టి రంగప్ప మొదటిసారిగా మతదీక్ష పుచ్చుకొన్నాడు.

1715 - ఫాదర్ లీగాక్ మాదిగుబ్బ - ఆలమూరు గ్రామాల తుమ్మారాయప్పరెడ్డికి మతదీక్ష ఇచ్చారు. ఫాదర్ లీగాక్ పేరు తెలుగులో సంజీవనాథస్వామి

1717 - రెవరెండ్ - జె మేనార్డు (పరమానంద గురువు) తమిళదేశం నుండి వెళ్ళిపోయాడు.

1719 - షూల్జి భారతదేశానికి వచ్చాడు.

1721 - ఫ్రాంకాయ్ కారన్ కలరాతో చనిపోయాడు.

1725 - మహారాష్ట్ర సర్దారు. మాదిగుబ్బ. ఆలమూరు గ్రామాలు దోచుకున్నారు. రెండు గ్రామాల రెడ్లు దూపాటి సీమలోని బుక్కాపురంలో తలదాచుకున్నారు. ఈ మూలంగా నెల్లూరు జిల్లాలో క్రైస్తవ్యం వ్యాపించింది.
మెమ్మయిస్ రెనీగర్గమ్ : వెంకటగిరిలో చర్చి కట్టాడు. పెద్దారికట్లలో ఇంకొకటి కట్టాడు. 40 సంవత్సరాలు సేవచేసి 1754లో పోయాడు. వయస్సు 72.

1726 : షూల్జి - ట్రాంకోబారు నుండి కడలూరు, మదరాసు ప్రళయ కావేరి పట్నాలకు సంచారం చేశాడు.

జాన్ కాల్‌మిట్ - సత్యబోధస్వాములవారు, తుమ్మారాయప్పకు క్రైస్తవం ఇచ్చాడు. 1740లో చనిపోయాడు. సంస్కృత పండితుడు. (గ్రంథ సంపాదకుడు)

1727 - థామస్ కన్నెట్స్ మద్రాసుకు వచ్చాడు. షూల్జి కొత్త నిబంధన అనువాదాన్ని పూర్తిచేశాడు.

1730 - ఇంగ్లీషులో తెలుగు వ్యాకరణాన్ని వ్రాసిన రెవరెండు కన్సెట్టస్ మదరాసులో చనిపోయాడు.

పెరీడు చాంప్, కృష్ణాపురంలో ఉన్నాడు. తరువాత బెంగాల్‌కు వెళ్ళిపోయాడు.

1733 - ఎటైనీ లీగాక్. 1733దాకా తెలుగుదేశంలో ఉన్నాడు. తరువాత కర్ణాటక మిషన్ అధిపతి అయ్యాడు. ఇతని భారతీయ నామం సంజీవనాథస్వామి.

1738 - సంజీవనాథస్వామి డిసెంబరు 24న పరలోకగతుడయ్యాడు. కృష్ణాపురంలో సమాధి చేశారు.

1739 - ఆన్టోనీ మోజాక్ తరువాత బెంగాలు వెళ్ళిపోయాడు.

1740 - జీన్ బాప్టిస్ట డ్యు ట్రెమ్ బ్లీ (పాండిచేరిలో 1758లో పోయాడు)

1741 - 'ఫ్రాంకాయ్ లూయీ డిలావర్-పుంగనూరు, చిత్తూరు జిల్లా - పుష్పగిరి. లూయీకోస్టాస్-నెల్లూరుకు దక్షిణాన ఉన్న పుష్పగిరి.

1743 - కడప జిల్లాలోని కంబాల దిన్నెలోని ఫాదురుగుడిని నిజాం సైనికులు నేలమట్టం చేశారు.

మాదిగుబ్బ - కృష్ణాపురాలలోని క్రైస్తవగుళ్లు కూడా పడగొట్టించారు. వెంకటగిరి ప్రాంతాల గూడా అదే గతి పట్టింది.

ఫ్రాంకాయ్ లూయి డిలావర్ : 1751 దాకా ఉన్నాడు. ఇతని తరువాత జీన్ బాప్టిస్ట మార్టిన్ వచ్చాడు. కంబాల దిన్నె నుంచి పారిపోయాడు.

నికోలస్ పొసవిన్ - బళ్ళాపురంలో భాష నేర్చుకొన్నాడు. 1780లో పుదుచ్చేరిలో పోయాడు.

1759 - ఫ్రెంచి వాళ్లు ఉత్తర సర్కారులలో ఓడిపోయారు. ఇంగ్లీషు వాళ్ళనే నిజాం ఆదరించాడు. పదిహేనురోజులలోగా కృష్ణదాటి వెళ్ళిపోమని హుకుం జారీచేశాడు.

1770 - గుంటూరు ప్రాంతాలలో తప్ప తక్కినచోట్ల క్రైస్తవం క్షీణించింది.

1777 - హెన్రీ ఆర్నాల్డు : తెలుగు క్రైస్తవుల్ని బెల్లంపల్లికి తీసుకువచ్చాడు. 1806లో పోయాడు.

మచిలీపట్నం - జార్జి మేనెస్టు : తరువాత సంవత్సరం ఓలేరులో ఉన్నాడు. తెలుగు క్రైస్తవులను వేళచేరికి తీసుకువచ్చాడు. మద్రాసులో 1812లో పోయాడు.

1787 - బందరు కోటలో ఒక ఫ్రెంచి యువతి సెంట్ ఆంద్రూస్ చర్చి కట్టించింది.

1822 - మంగళగిరి ఆనందయ్యా రచించిన వేదాంత రసాయనాన్ని ఫాదరు జె. బాలనాథయ్యా, ఫాదర్ టి. రాజనాథయ్యాలు ప్రకటించారు.

ఆంధ్రదేశంలో ప్రొటస్టాంటు సంఘాలన్నింటికీ ఒక కీర్తన పుస్తకముండాలని ఆంధ్రక్రైస్తవ మహాజన సభవారు 1936లో సమావేశమై ఆదినుండి తెలుగు నేలమీద ప్రచారంలో ఉన్న కీర్తనలను సేకరించారు.

1937లో మొత్తం 438 పాటలను సేకరించి ''ఆంధ్రక్రైస్తవ కీర్తనలు'' అనే పేరుతో ప్రచురించారు.

ఇందులో పురుషోత్తమ చౌదరి, పులిపాక జగన్నాధం, దావీదు చౌదరి మొదలైన తొలితరం ప్రొటెస్టాంటుల గీతాలు ఉన్నాయి.

సంకీర్తన ఎప్పుడూ సజీవమే.

ముఖ్యపదానుక్రమణిక

రోమన్ సిద్ధాంతం 59



31 ఆగస్టు 1925 - 4 జూన్ 1998

దీనిలో నన్నయపూర్వపు భాషాస్వరూపం, స్వభావం గురించి పరిశోధనా పూర్వమైన చర్చ ఉంది. ఇది ఒక ప్రశంసనీయమైన విషయం. కవుల జాబితాలతో, గ్రంథాల పట్టీలతో నింపి సాహిత్య చరిత్ర వ్రాయవచ్చు చప్పగా. అటువంటిది కాదిది. కవులను గురించిన కథలూ, కబుర్లు, వాళ్ళ జీవితాల్లోని ప్రధానఘట్టాలు, సాహిత్య విమర్శలు, వీటితో రసవంతంగా, ఆకర్షణీయంగా వ్రాసిన చరిత్ర ఇది. ఆరుద్రకు అద్వితీయమైన ఆంధ్రసాహిత్య జ్ఞానం ఉంది. అంతేగాక ప్రపంచసాహిత్య పరిచయం సహా ఉంది. పరిశోధనకృషి, విమర్శకదృష్టి ఉంది. సరళమైన సజీవభాషలో వ్రాయగల శక్తి ఉంది. వ్యవహారంలోని తెలుగు నుడికారం సొంపు అతనికి వెన్నతోడ పెట్టింది. సౌందర్యపిపాసి, రసికుడు, అన్నివిధాల ఇటువంటి చరిత్రకు తగిన రచయిత. చదువుకొన్న ప్రతి ఆంధ్రుడు ఈ కానుకను రెండు చేతుల్తో పుచ్చుకోవలెనని నా కోరిక.

జస్టిస్ పి.వి. రాజమన్నారు

ఎందరో, ఎందరెందరో సాహిత్య చరిత్రలు రాశారు. కాని అవి అన్నీ మేధావుల కోసం. చదువుకున్న వారికోసం. ఈ సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో భాష వ్యావహారికం దాటి వాడుక భాషలో, కోమలంగా అందరికీ అర్థమయ్యే రీతిలో రమ్యంగా సాగింది. దీనిని - అతి సామాన్య సాహితీపిపాసి కూడా చదివి ఆనందించగల శైలిలో ముచ్చట కల్గిస్తుంది. చదవక వదలలేము.

లోకాయుక్త ఆవుల సాంబశివరావు

తెలుగు జాతికి గర్వకారణం ఆరుద్ర. ఈ వాఙ్మయచరిత్రకారునికి ఇవ్వవలసినంత ఖ్యాతి మనం ఇవ్వలేదేమో అనిపిస్తూంది. ఇదే - తదితర ఏ భాషలో రాసినా అతన్ని అపూర్వ మేధావిగా గ్రహించేవారు. ప్రపంచంలో, వివిధ భాషా సాహిత్యాలలో ఎక్కడా ఒక్కచేతిపై సాహిత్యచరిత్ర రాసిన దాఖలాలు లేవు. ఉత్సాహమే మూలధనంగా ఆరుద్ర ముందుకి సాగిపోవాలని, న్యాయమూర్తిగా శాసిస్తున్నాను.

జస్టిస్ ఓ. చిన్నప రెడ్డి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం - మూడవ సంపుటి
తెలుగు అకాడమి-విశిష్ట ప్రచురణ

తెలుగు అకాడమి
హిమాయత్‌నగర్, హైదరాబాదు-500 029.
Email: teluguakademi@teluguacademy.com
Web: www.teluguacademy.com